


చైతన్య భగవద్గీత

(తృతీయ సంపుటము)



స్వామి సుందర చైతన్యానంద

చైతన్య భగవద్గీత

(తృతీయ సంపుటము)

స్వామి సుందర చైతన్యానంద

చైతన్య భగవద్గీత

స్వామి సుందర చైతన్యానంద

ప్రథమ ముద్రణము : డిసెంబరు 2009........ 15000 కాపీలు.

ప్రతులకు :

1. సుందర చైతన్యాశ్రమం
దుండిగల్ రోడ్,
హైదరాబాద్ - 500 043.
☎ : 08418 - 255777
ఫాక్స్ : 08418 - 255355

2. చైతన్య వానప్రస్థాశ్రమం,
సుందర చైతన్యాశ్రమం
ధవళేశ్వరం - 533 125.
☎ : 0883 - 2417378

3. సుందర చైతన్యాశ్రమం
శాంతిపురం,
విశాఖపట్టణం - 530 016.
☎ : 0891 - 2791079

టైప్ సెట్టింగ్ : ప్రసాద్
ఫోటో డిజైనింగ్ : ప్రవీణ్
సుందర చైతన్యాశ్రమం,
హైదరాబాద్

ముద్రణ : శ్రీ లక్ష్మీ గణపతి బైండింగ్ వర్క్స్, కొవ్వూరు.
☎ : 08813 - 232354, 231575



చైతన్య భగవద్గీత

స్వామి సుందర చైతన్యానంద

విషయ సూచిక


చైతన్య భగవద్గీత




స్వామి సుందర చైతన్యానంద









శ్లో॥ గీ తాధీతా చ యే నాపి
భక్తి భావేన చోత్తమా।
వేద శాస్త్ర పురాణాని
తే నాధీతాని సర్వశః ॥


భగవద్గీతను భక్తి భావంతో అధ్యయనం చేసే వాడు
సమస్త వేదాలను, సర్వ శాస్త్ర పురాణాలను అధ్యయనం చేసిన వాడు అవుతాడు.






శ్లో॥ గీ కారం త్యాగ రూపం స్యాత్
తత్త్వబోధం త కారకమ్ ।
గీతా వాక్యం ఇదం తత్త్వం
జ్ఞేయం సర్వ ముముక్షుభిః ॥

'గీ' అంటే త్యాగము. 'త' అంటే తత్త్వ జ్ఞానము.
'గీత' అనే మాట లోని ఈ సత్యాన్ని మోక్షప్రియు లందరూ గ్రహించాలి.





చైతన్య భగవద్గీత

అథ అష్టమోఽ ధ్యాయః - ఎనిమిదవ అధ్యాయము

అక్షర పరబ్రహ్మ యోగః - అక్షర పరబ్రహ్మ యోగము

యేషాం త్వంత గతం పాపం - ఎవరి పాపము నశించి పోయిందో, ఎవరికి ద్వంద్వ విముక్తి జరిగిందో, వారే భగవంతుని సేవిస్తారు అని ఏడవ అధ్యాయం ఇరవై ఎనిమిదవ శ్లోకం లోను,

ప్రయాణ కాలేఽ పి చ మాం తే విదుర్యుక్త చేతసః - సమాహిత చిత్తము కల వారు మరణ కాలంలో కూడా పరమేశ్వరుణ్ణే తెలుసుకుంటారు అని చివరి శ్లోకం లోను భగవంతుడు ప్రవచించిన తరువాత, సాధ్యా సాధ్యాల మధ్య అర్జునుని హృదయం ఊగిస లాడింది. ఈ విధమైన సంధిగ్దావస్థ ప్రతి సాధకునికి ఏదో ఒక సమయంలో ఏ కారణం గానో మనస్సులో చేరి కలత పెడుతుంది.

నేను భగవంతుణ్ణి తెలుసుకో గలనా? మోక్షాన్ని సాధించ గలనా? ఈ జన్మ లోవే సాధించ గలుగుతానా? నా లోని కల్మష మంతా కరిగి పోతుందా? పాపాలన్నీ ప్రక్షాళన మవుతాయా? రాగద్వేషాలు తటస్థ పడతాయా? ఒకవేళ, ఇవేవీ జరగకుండా మరణిస్తే ఏమవుతాను? ఏమీ సాధించకుండా నిష్క్రమించిన వాణ్ణి అవుతానా? అదే జరిగితే, అసలు నే నెందుకు పుట్టినట్లు? మరణ కాలంలో సమాహిత చిత్తం నాకు ఉంటుందా? బ్రతుకులో గ్రహించలేక జన్మను వృథా చేసుకున్న నేను, మరణ సమయంలో కూడా తెలుసుకోలేక పోతే, చనిపోయిన తరువాత ఏమౌతాను? మరణానంతరము నా ప్రయత్నం ఎలా ఉంటుంది? ఇలాంటి ప్రశ్నలు ఎవరికి ఎప్పుడు జనిస్తాయో చెప్పలేము గాని, ఏడవ అధ్యాయాన్ని సమాప్తం చేస్తూ శ్రీకృష్ణుడు పలికిన మాటలు అర్జునుని హృదయంలో ఈ విధమైన సందేహాలకు శ్రీకారం చుట్టాయి. ఆ ప్రశ్నలకు పరిష్కారం లభించక ముందే, తనను ఆశ్రయించి, జరామరణ మోక్షార్థం ఎవరైతే ప్రయత్నిస్తారో, వారు సమస్తాన్ని తెలుసు కుంటారు అని చెబుతూ బ్రహ్మము, అధ్యాత్మము అని, ఇంతవరకు పరిచయం కాని ఏడు సాంకేతిక పదాలను ప్రస్తావించి ఏడవ అధ్యాయాన్ని పరమేశ్వరుడు సమాప్తం చేయడం జరిగింది. పరమేశ్వరుడు ప్రస్తావించిన ఈ విషయాలే ఎనిమిదవ అధ్యాయారంభంలో పార్థుని ప్రశ్నలకు బీజా లయ్యాయి **(భగవతా అర్జునస్య ప్రశ్న బీజాని ఉపదిష్టాని).** శ్రీకృష్ణుడు ప్రస్తావించిన ఏడు విషయాలలో తనను వేధిస్తున్న అంశము కూడా ఏడవది గానే ఉంది. నూతనంగా ప్రవేశ పెట్టబడిన ఆరు విషయాలను, తన హృదయంలో ప్రముఖంగా ఉన్నది, శ్రీకృష్ణుడు ప్రస్తావించిన విషయాలలో ఏడవది అయిన, ***ప్రయాణ కాలే చ కథం జ్ఞేయోఽ సి నియతాత్మభిః*** - మరణ సమయము నందు నియమిత చిత్తులైన వారు పరమేశ్వరుని ఎలా తెలుసు కుంటారు? అనే విషయాన్ని కలిపి మొత్తం ఏడు ప్రశ్నలను ఏక కాలంలో సంధించాడు సవ్యసాచి. అర్జునుడు ఏడు ప్రశ్నలను విడివిడిగా సంధిస్తే, పరమేశ్వరుడు వాటి నన్నిటినీ ఒకే సూత్రంలో అనుసంధానం చేసి అద్భుతంగా సమాధాన మిస్తూ ప్రవచించాడు. అదే అక్షర పరబ్రహ్మ యోగము.

ఇది ఎనిమిదవ అధ్యాయము. దీనిని అక్షర పరబ్రహ్మ యోగ మని సాధారణంగా అందరూ పిలుస్తుంటారు. ఆచార్యుల వారు దీనిని తారకబ్రహ్మ యోగము అన్నారు. ఇంకా అనేకము లైన పేర్లు అనేక వ్యాఖ్యాన గ్రంథాలలో కనిపిస్తాయి.

అక్షరం - క్షరము కానిది అక్షరము ***(న క్షరతీతి అక్షరం).*** అదే పరబ్రహ్మము. అక్షర పరబ్రహ్మము.

'యోగము' అంటే విచారము అని, విషయము అని, ఉపాయము అని మనం ముందే చెప్పుకొని ఉన్నాము కనుక, అక్షర స్వరూపుడైన, ఓంకార గమ్యమైన బ్రహ్మమును పొందే ఉపాయాన్ని తెలిపే విశిష్ట విషయాన్ని కలిగిన అధ్యాయము ఈ అక్షర పరబ్రహ్మ యోగము. ఇక అధ్యాయం లోకి ప్రవేశిద్దాం.

అర్జున ఉవాచ :

కిం తద్బ్రహ్మ కి మధ్యాత్మం కిం కర్మ పురుషోత్తమ ।
అధిభూతం చ కిం ప్రోక్త మధిదైవం కి ముచ్యతే ॥ 1
అధియజ్ఞః కథం కోఽత్ర దేహేఽస్మి న్మధుసూదన ।
ప్రయాణకాలే చ కథం జ్ఞేయోఽసి నియతాత్మభిః ॥ 2

కిం-తత్-బ్రహ్మ-కిం-అధ్యాత్మం-కిం-కర్మ-పురుషోత్తమ
అధిభూతం-చ-కిం-ప్రోక్తం-అధిదైవం-కిం-ఉచ్యతే
అధియజ్ఞః-కథం-కః-అత్ర-దేహే-అస్మిన్-మధుసూదన
ప్రయాణకాలే-చ-కథం-జ్ఞేయః-అసి-నియతాత్మభిః

పురుషోత్తమ	= కృష్ణా!	ఉచ్యతే	= చెప్పబడుతోంది
తత్	= ఆ	మధుసూదన	= కృష్ణా!
బ్రహ్మ	= బ్రహ్మము	అస్మిన్	= ఈ
కిం	= ఏది?	దేహే	= దేహము నందు
అధ్యాత్మం	= అధ్యాత్మము	అధియజ్ఞః	= అధియజ్ఞుడు
కిం	= ఎట్టిది?	కః	= ఎవ్వడు?
కర్మ	= కర్మ	అత్ర	= ఈ విషయము నందు
కిం	= ఎట్టిది?	కథం	= ఎట్లు
అధిభూతం	= అధిభూతము	ప్రయాణకాలే చ	= మరణ కాలము నందు
కిం	= ఏది?	నియతాత్మభిః	= మనస్సును నిగ్రహించిన వారి చేత
ప్రోక్తం	= చెప్పబడుచున్నది	కథం	= ఎటుల
అధిదైవం చ	= అధిదైవముగ	జ్ఞేయః అసి	= తెలియబడు తున్నావు
కిం	= ఏది?		

అర్జునుడు అడుగుతున్నాడు :

కృష్ణా! పురుషోత్తమా! ఆ బ్రహ్మము ఏమిటి? అధ్యాత్మము ఎట్టిది? కర్మ ఏమిటి? అధిభూతము ఎటు వంటిది? అధిదైవం ఎలాంటిది? అధియజ్ఞ మనగా నేమి? మనో నిగ్రహము కలవారు మరణ కాలమున బ్రహ్మమును ఎలా తెలుసుకుంటారు?

వ్యాఖ్య

ఏడవ అధ్యాయం చివర ఏ విషయాలను పరమేశ్వరుడు సూచించడం జరిగిందో, ఆ ఏడు విషయాలనే ఏడు ప్రశ్నలుగా మలచి, వాటిని వివరించ మని ఈ రెండు శ్లోకాలలో అర్జునుడు అడుగుతున్నాడు. అర్జునుడు అడిగిన ప్రశ్నల లోని అంశాలు క్రొత్తవి కాకపోయినా, అవి బహువిధ శబ్దార్థాలకు కారణం కావడం చేత, ఏ శబ్దానికి ఏది విస్పష్ట మైన అర్థమో గ్రహించాలని ఇలా అడుగుతున్నాడు.

ఆ బ్రహ్మ మేమిటి? అని ఎందుకు అడగ వలసి వచ్చింది అంటే, బ్రహ్మ శబ్దార్థం సోపాధిక బ్రహ్మమునకు, నిరుపాధిక బ్రహ్మమునకు రెండిటికీ వర్తిస్తుంది. ఈ రెండిటిలో పరమేశ్వరుడు ఏ అర్థాన్ని సూచిస్తూ ప్రవచిస్తున్నాడు? అనేది స్పష్టం కావాలి. అలాగే ఏడు విషయాలు విస్పష్టం కావలసి ఉంది.

కిం అధ్యాత్మం? అధ్యాత్మ మంటే ఏమిటి? అని పార్థుడు ప్రశ్నించాడు. ***ఆత్మానమ్ అధితిష్ఠతి -*** ఇక్కడ ఆత్మ అంటే శరీరము. శరీరాన్ని అధిష్ఠించి ఉండేది అధ్యాత్మం అనే అర్థం వస్తుంది. దేహాన్ని అధిష్ఠించి ప్రత్యగాత్మ ఉంది. అలాగే ప్రాణేంద్రియాలు కూడా ఉన్నాయి. ఈ రెండిటిలో అధ్యాత్మ శబ్దార్థము దేనికి సంబంధించింది అనేది మీమాంస.

కర్మ అన్నప్పుడు అది శ్రౌతమా, స్మార్తమా, లేక లౌకికమా? సృష్టి వ్యాపారము కూడా కర్మే కదా! జీవుల వ్యవహారానికి సంబంధించి సంచిత, ఆగామి, ప్రారబ్ధాలు కూడా కర్మలే కదా! అలాగే సాత్త్వికా లైన యజ్ఞ దాన తపస్సులు కూడా కర్మలే కదా! వీటిలో పరమేశ్వరుడు దేనిని సూచిస్తున్నాడు?

అధి యజ్ఞమును గూర్చిన ప్రశ్న వచ్చినపుడు, ***విజ్ఞానం యజ్ఞం తనుతే, యజ్ఞో వై విష్ణుః -*** అనే వేద వాక్యాలలో యజ్ఞమును అధిష్ఠించి ఉండటము అనేది రెండిటికి సంబంధించి ఉండటం చేత, యజ్ఞశబ్దము విజ్ఞానాత్మను సూచిస్తూ ఉందా? లేక, విష్ణువునే చూపుతూ ఉందా? ఈ విధంగా అన్ని ప్రశ్నలు అనేక అర్థాంతో నిండి ఉన్నందున, వస్తు నిర్ధారణ సంశయ రహితంగా ఉండాలని భగవానుని ప్రశ్నిస్తున్నాడు.

అర్జునుడు అడిగిన ఏడు ప్రశ్నలకు భగవంతుడు సమాధానం చెబుతున్నాడు.

శ్రీ భగవానువాచ :

అక్షరం బ్రహ్మ పరమం స్వభా వోఽధ్యాత్మ ముచ్యతే ।
భూతభావోద్భవకరో విసర్గః కర్మసంజ్ఞితః ॥ 3

అక్షరం-బ్రహ్మ-పరమం-స్వభావః-అధ్యాత్మం-ఉచ్యతే
భూతభావోద్భవకరః-విసర్గః-కర్మసంజ్ఞితః

బ్రహ్మ	= బ్రహ్మము	ఉచ్యతే	= చెప్పబడుతోంది
పరమం	= ఉత్కృష్ట మైనది	భూతభావోద్భవకరః	= భూతములకు స్వభావ జననములను చేయునట్టి
అక్షరం	= క్షరము కానిది	విసర్గః	= విడుచుట
స్వభావః	= స్వభావము	కర్మసంజ్ఞితః	= కర్మ అనే పేరు గలది
అధ్యాత్మం	= అధ్యాత్మము		

భగవానుడు చెబుతున్నాడు :

అర్జునా! బ్రహ్మము నశించనిది. అన్నిటి కన్నా గొప్పది. దాని స్వభావమే అధ్యాత్మము. భూతముల ఉత్పత్తికి కారణ మైన యజ్ఞరూప మైన త్యాగమే కర్మ

వ్యాఖ్య

అర్జునుడు అడిగిన ఏడు ప్రశ్నలు ఏ వరుస క్రమంలో ఉన్నవో, అదే క్రమంలో భగవంతుడు సమాధానం చెబుతున్నాడు ***(ఏషాం ప్రశ్నానాం యథా క్రమం నిర్ణయాయ).*** మొదటి మూడు ప్రశ్నలకు మూడవ శ్లోకంలో సమాధానాలు ఉంటాయి. తరువాత మూడు ప్రశ్నలకు నాల్గవ శ్లోకం సమాధానాలు అందిస్తుంది. చివరి దైన ఏడవ ప్రశ్నకు ఐదు, ఆరు శ్లోకాలు సమాధానం చెబుతాయి. ఆ తరువాత, అధ్యాయాంతం వరకు మరణ

'యోగము' అంటే విచారము అని, విషయము అని, ఉపాయము అని మనం ముందే చెప్పుకొని ఉన్నాము కనుక, అక్షర స్వరూపుడైన, ఓంకార గమ్యమైన బ్రహ్మమును పొందే ఉపాయాన్ని తెలిపే విశిష్ట విషయాన్ని కలిగిన అధ్యాయము ఈ అక్షర పరబ్రహ్మ యోగము. ఇక అధ్యాయం లోకి ప్రవేశిద్దాం.

అర్జున ఉవాచ :

కిం తద్బ్రహ్మ కి మధ్యాత్మం కిం కర్మ పురుషోత్తమ ।
అధిభూతం చ కిం ప్రోక్త మధిదైవం కి ముచ్యతే ॥ 1
అధియజ్ఞః కథం కోఽత్ర దేహేఽస్మి న్మధుసూదన ।
ప్రయాణకాలే చ కథం జ్ఞేయోఽసి నియతాత్మభిః ॥ 2

కిం-తత్-బ్రహ్మ-కిం-అధ్యాత్మం-కిం-కర్మ-పురుషోత్తమ
అధిభూతం-చ-కిం-ప్రోక్తం-అధిదైవం-కిం-ఉచ్యతే
అధియజ్ఞః-కథం-కః-అత్ర-దేహే-అస్మిన్-మధుసూదన
ప్రయాణకాలే-చ-కథం-జ్ఞేయః-అసి-నియతాత్మభిః

పురుషోత్తమ	= కృష్ణా!	ఉచ్యతే	= చెప్పబడుతోంది
తత్	= ఆ	మధుసూదన	= కృష్ణా!
బ్రహ్మ	= బ్రహ్మము	అస్మిన్	= ఈ
కిం	= ఏది?	దేహే	= దేహము నందు
అధ్యాత్మం	= అధ్యాత్మము	అధియజ్ఞః	= అధియజ్ఞుడు
కిం	= ఎట్టిది?	కః	= ఎవ్వడు?
కర్మ	= కర్మ	అత్ర	= ఈ విషయము నందు
కిం	= ఎట్టిది?	కథం	= ఎట్లు
అధిభూతం	= అధిభూతము	ప్రయాణకాలే చ	= మరణ కాలము నందు
కిం	= ఏది?	నియతాత్మభిః	= మనస్సును నిగ్రహించిన వారి చేత
ప్రోక్తం	= చెప్పబడుచున్నది	కథం	= ఎటుల
అధిదైవం చ	= అధిదైవముగ	జ్ఞేయః అసి	= తెలియబడు తున్నావు
కిం	= ఏది?		

అర్జునుడు అడుగుతున్నాడు :

కృష్ణా! పురుషోత్తమా! ఆ బ్రహ్మము ఏమిటి? అధ్యాత్మము ఎట్టిది? కర్మ ఏమిటి? అధిభూతము ఎటు వంటిది? అధిదైవం ఎలాంటిది? అధియజ్ఞ మనగా నేమి? మనో నిగ్రహము కలవారు మరణ కాలమున బ్రహ్మమును ఎలా తెలుసుకుంటారు?

వ్యాఖ్య

ఏడవ అధ్యాయం చివర ఏ విషయాలను పరమేశ్వరుడు సూచించడం జరిగిందో, ఆ ఏడు విషయాలనే ఏడు ప్రశ్నలుగా మలచి, వాటిని వివరించ మని ఈ రెండు శ్లోకాలలో అర్జునుడు అడుగుతున్నాడు. అర్జునుడు అడిగిన ప్రశ్నల లోని అంశాలు క్రొత్తవి కాకపోయినా, అవి బహువిధ శబ్దార్థాలకు కారణం కావడం చేత, ఏ శబ్దానికి ఏది విస్పష్ట మైన అర్థమో గ్రహించాలని ఇలా అడుగుతున్నాడు.

ఆ బ్రహ్మ మేమిటి? అని ఎందుకు అడగ వలసి వచ్చింది అంటే, బ్రహ్మ శబ్దార్థం సోపాధిక బ్రహ్మమునకు, నిరుపాధిక బ్రహ్మమునకు రెండిటికీ వర్తిస్తుంది. ఈ రెండిటిలో పరమేశ్వరుడు ఏ అర్థాన్ని సూచిస్తూ ప్రవచిస్తున్నాడు? అనేది స్పష్టం కావాలి. అలాగే ఏడు విషయాలు విస్పష్టం కావలసి ఉంది.

కిం అధ్యాత్మం? అధ్యాత్మ మంటే ఏమిటి? అని పార్థుడు ప్రశ్నించాడు. ***ఆత్మానమ్ అధితిష్ఠతి*** - ఇక్కడ ఆత్మ అంటే శరీరము. శరీరాన్ని అధిష్ఠించి ఉండేది అధ్యాత్మం అనే అర్థం వస్తుంది. దేహాన్ని అధిష్ఠించి ప్రత్యగాత్మ ఉంది. అలాగే ప్రాణేంద్రియాలు కూడా ఉన్నాయి. ఈ రెండిటిలో అధ్యాత్మ శబ్దార్థము దేనికి సంబంధించింది అనేది మీమాంస.

కర్మ అన్నప్పుడు అది శ్రౌతమా, స్మార్తమా, లేక లౌకికమా? సృష్టి వ్యాపారము కూడా కర్మే కదా! జీవుల వ్యవహారానికి సంబంధించి సంచిత, ఆగామి, ప్రారబ్ధాలు కూడా కర్మలే కదా! అలాగే సాత్త్వికా లైన యజ్ఞ దాన తపస్సులు కూడా కర్మలే కదా! వీటిలో పరమేశ్వరుడు దేనిని సూచిస్తున్నాడు?

అధి యజ్ఞమును గూర్చిన ప్రశ్న వచ్చినపుడు, ***విజ్ఞానం యజ్ఞం తనుతే, యజ్ఞో వై విష్ణుః*** - అనే వేద వాక్యాలలో యజ్ఞమును అధిష్ఠించి ఉండటము అనేది రెండిటికి సంబంధించి ఉండటం చేత, యజ్ఞశబ్దము విజ్ఞానాత్మను సూచిస్తూ ఉందా? లేక, విష్ణువునే చూపుతూ ఉందా? ఈ విధంగా అన్ని ప్రశ్నలు అనేక అర్థాలతో నిండి ఉన్నందున, వస్తు నిర్ధారణ సంశయ రహితంగా ఉండాలని భగవాముని ప్రశ్నిస్తున్నాడు.

అర్జునుడు అడిగిన ఏడు ప్రశ్నలకు భగవంతుడు సమాధానం చెబుతున్నాడు.

శ్రీ భగవానువాచ :

అక్షరం బ్రహ్మ పరమం స్వభా వోఽధ్యాత్మ ముచ్యతే ।
భూతభావోద్భవకరో విసర్గః కర్మసంజ్ఞితః ॥ 3

అక్షరం-బ్రహ్మ-పరమం-స్వభావః-అధ్యాత్మం-ఉచ్యతే
భూతభావోద్భవకరః-విసర్గః-కర్మసంజ్ఞితః

బ్రహ్మ	= బ్రహ్మము	ఉచ్యతే	= చెప్పబడుతోంది
పరమం	= ఉత్కృష్ట మైనది	భూతభావోద్భవకరః	= భూతములకు స్వభావ జననములను చేయునట్టి
అక్షరం	= క్షరము కానిది	విసర్గః	= విడుచుట
స్వభావః	= స్వభావము	కర్మసంజ్ఞితః	= కర్మ అనే పేరు గలది
అధ్యాత్మం	= అధ్యాత్మము		

భగవానుడు చెబుతున్నాడు :

అర్జునా! బ్రహ్మము నశించనిది. అన్నిటి కన్నా గొప్పది. దాని స్వభావమే అధ్యాత్మము. భూతముల ఉత్పత్తికి కారణ మైన యజ్ఞరూప మైన త్యాగమే కర్మ

వ్యాఖ్య

అర్జునుడు అడిగిన ఏడు ప్రశ్నలు ఏ వరుస క్రమంలో ఉన్నవో, అదే క్రమంలో భగవంతుడు సమాధానం చెబుతున్నాడు ***(ఏషాం ప్రశ్నానాం యథా క్రమం నిర్ణయాయ).*** మొదటి మూడు ప్రశ్నలకు మూడవ శ్లోకంలో సమాధానాలు ఉంటాయి. తరువాత మూడు ప్రశ్నలకు నాల్గవ శ్లోకం సమాధానాలు అందిస్తుంది. చివరి దైన ఏడవ ప్రశ్నకు ఐదు, ఆరు శ్లోకాలు సమాధానం చెబుతాయి. ఆ తరువాత, అధ్యాయాంతం వరకు మరణ

సంబంధమైన మీమాంసను పరిహరిస్తూ, ఏడవ ప్రశ్న యొక్క సమాధానమే సవివరంగా అసమానంగా ప్రవచింప బడుతుంది.

(1) కిం తద్బ్రహ్మ

బ్రహ్మ మేమిటి? అనేది మొదటి ప్రశ్న. బ్రహ్మము పరమైన అక్షరము. అక్షరము అంటే క్షరము కానిది, నశించనిది అని అర్థము ***(న క్షరతి ఇతి అక్షరమ్).*** బ్రహ్మము అక్షరము అనకుండా 'పరం' అనే విశేషణమును జోడించి పరంబ్రహ్మము అనడం జరిగింది. 'పరం' అంటే నిరతిశయ మైనది, అన్నిటి కంటే గొప్పది అని అర్థము. ఈ 'పరం' అనే విశేషణం లేకపోతే, నశించనిది బ్రహ్మము అనే అర్థం వస్తుంది. ఇలా చెబితే అతివ్యాప్తి దోషం ప్రాప్తిస్తుంది కనుక, 'పరం' అనే విశేషణం అవసర మైంది.

ఒక దాని లక్షణం మరొక దాని యందు వ్యాపించి ఉండటం అతివ్యాప్తి. పాలు అంటే ఏమిటి అని అడిగితే, తెల్లగా ఉండే ద్రవము పాలు అని అన్నా డనుకోండి, మరి సున్నపు నీళ్ళు కూడా పాల లాగే తెల్లగా ఉంటాయి కదా అనే సందేహం వస్తుంది. దీనినే అతివ్యాప్తి దోషము అంటారు. అలా గాక పాలు తెల్లగా, తియ్యగా ఉంటాయి అని గనుక అంటే, తియ్యదనం సున్నపు నీళ్ళలో ఉండదు కనుక, అతివ్యాప్తి సంభవించదు. ఇది దృష్టాంతమే.

బ్రహ్మము అక్షరము అన్నప్పుడు, అక్షరము అనే పదానికి క్షరము కానిది అని అర్థం చెప్పుకుంటే, క్షరము కానివి ఇంకా వేరేవి కూడా ఉన్నాయి. ఆకాశం క్షరము కాదు. మాయ క్షరం కాదు. ఓంకారము క్షరము కాదు. ఎందుకంటే, ఇవి కూడా అక్షర శబ్దము చేతనే చెప్ప బడ్డాయి.

ఆకాశాన్ని అక్షరం అనవచ్చు. కాని, పరమైన అక్షరము అనలేము. అన్నిటిని ఆకాశం తనలో ఇముడ్చు కుంటుంది. కాని బ్రహ్మమును ఇముడ్చుకోలేదు. కనుక, ఆకాశం పరం కాలేదు. ***తతః ఆకాశః సంభూతః*** - బ్రహ్మము నుండే ఆకాశము జనించింది. పుట్టింది. కనుక అది కార్యము. కార్యము కారణం కన్నా అన్యంగా ఉండలేదు. కాని, కార్యం లేకపోయినా, కారణం ఉంటుంది. ఆకాశము, మాయ, బ్రహ్మమును ఆశ్రయించుకొని ఉన్నాయి. కాని, బ్రహ్మము ఆకాశం కన్నా, మాయ కన్నా విలక్షణంగా ఉండటం చేత వాటిని అతిశయించి ఉంది. అదే పరమం.

ఓమిత్యేకాక్షరం బ్రహ్మ - 'ఓం' అనే ఏకాక్షరము బ్రహ్మ ప్రతిపాదక మైన అక్షరము. ఇది శ్రుతి ప్రతిపాదితం. ఇదే విషయాన్ని ప్రస్తుతం మనం అధ్యయనం చేస్తున్న అధ్యాయంలో పదమూడవ శ్లోకంలో గీతాచార్యుడే చెబుతాడు. ఓంకారము అక్షరము, లేదా నశించనిది అన్నంత మాత్రాన ఓంకారము బ్రహ్మము కాదు. ఓంకారము కార్యమే కనుక, అది సాతిశయమే. ఈ కారణం చేత అది పరమం కాదు. ఓంకారము బ్రహ్మము మధ్య ఉన్నది అభిధాన అభిధేయ సంబంధమే గాని ఓంకారము బ్రహ్మ లక్షణం కాదు. కనుక, ఓంకారం అక్షరమే. కాని, పరం అనే విశేషణమును ఓంకారానికి గ్రహించడానికి వీలు లేదు ***(ఓంకారస్య పరేణ విశేషణాత్ అగ్రహణమ్).*** కనుక అక్షరమైన బ్రహ్మము అన్నిటి కన్నా గొప్పదై, నిరతిశయమై, 'పరం' అనే విశేషణము చేత చెప్ప బడింది.

(2) కిం అధ్యాత్మం

అధ్యాత్మ మనగా ఏమి? ఇది రెండవ ప్రశ్న. స్వభావమే అధ్యాత్మము అని చెప్ప బడింది. ఎవరి స్వభావము? పరం అయిన బ్రహ్మ స్వభావము. అక్షరమైన పరబ్రహ్మమే ప్రతి శరీరములో ప్రత్యగాత్మగా, లేదా జీవుడుగా ఉంటూ ఉంది. శరీరాన్ని అధిష్ఠించి జీవుడుగా ఉన్న పరబ్రహ్మమే అధ్యాత్మము.

విశ్వంలో ఉండి విశ్వాన్ని సూర్యుడు ఎలా ప్రకాశింప చేస్తున్నాడో, అలాగే దేహంలో ఉండి, దేహేంద్రియ ప్రాణ మనోబుద్ధులను ప్రకాశింప చేసే ప్రత్యగాత్మ అధ్యాత్మం అని చెప్ప బడింది. ప్రతి దేహము నందు పరబ్రహ్మము ప్రత్యగాత్మగా ఉండటమే స్వభావం ***(పరస్య బ్రహ్మణః ప్రతిదేహం ప్రత్యగాత్మ భావః స్వభావః).*** ఈ స్వభావమే అధ్యాత్మం అని చెప్పబడింది ***(స్వభావః అధ్యాత్మం ఉచ్యతే).*** ప్రతి దేహంలో నేను - నేను అనే భావం స్ఫురించడం కేవలం అధ్యాత్మం వల్లనే.

భగవాన్ రమణ మహర్షుల వారు ఒక అందమైన శ్లోకాన్ని అద్భుతంగా రచించారు. ఆత్మతత్త్వాన్ని ఆ శ్లోకం దివ్యంగా ప్రకాశింప చేస్తుంది.

హృదయ కుహర మధ్యే కేవలం బ్రహ్మ మాత్రం తు
అహం అహం ఇతి సాక్షాదాత్మ రూపేణ భాతి ।

హృదయ పద్మము నందు కేవలము బ్రహ్మమే 'నేను - నేను' అంటూ సాక్షాత్తు ఆత్మ స్వరూపంగా భాసిస్తూ ఉంది అన్నారు శ్లోకం పూర్వార్థంలో. ఇక్కడ కేవలం బ్రహ్మము అంటే పరంబ్రహ్మము అని అర్థము. పరంబ్రహ్మము ఆత్మరూపేణ భాసించడమే అధ్యాత్మం. అదే బ్రహ్మ స్వభావము. అది దేహేంద్రియ ప్రాణ మనోబుద్ధులను ప్రకాశింప చేస్తూ, వాటికి అతీతంగా కూడా ఉంది అని అర్థం.

(3) కిం కర్మ

కర్మ అనగా నేమి? ఇది మూడవ ప్రశ్న. భూతములు ఉండటానికి పుట్టుకను కలిగించేది **భూతభావోద్భవ కరం.** 'భూత' అంటే చరాచరములు అని అర్థం. 'భావః' అంటే మనుగడ, లేక ఉనికి ***(భూతానాం భావః భూతభావః).*** దాని పుట్టుకకు కారణ మైనది ఉద్భవకరం ***(తస్య ఉద్భవః భూత భావోద్భవః తం కరోతి ఇతి భూత భావోద్భవ కరః).*** దీనికి హేతువైన యజ్ఞమే కర్మ అని ఈ సందర్భంలో గ్రహించాలి. అంతేగాని, సాధారణంగా మనం చెప్పుకొనే కర్మ కాదు. విసర్గ రూపమైన యజ్ఞమే కర్మ అని చెప్పబడింది. యజ్ఞాలలో అర్పించే ద్రవ్య త్యాగమే విసర్గము. యజ్ఞకర్మ వల్లనే సృష్టి కార్యం జరిగిందని మూడవ అధ్యాయం లోనే విస్తరించి చెప్పు కున్నాం కదా! సృష్ట్యాది యందు ఏది త్యాగమయ యజ్ఞరూపంలో ఉండిందో అదే కర్మ అని చెప్ప బడింది.

అర్జునుడు అడిగిన ఏడు ప్రశ్నలలో మూడు ప్రశ్నలకు ఈ శ్లోకంలో సమాధానాలు అందాయి. బ్రహ్మము, అధ్యాత్మము రెండూ ఒక్కటే అనేది మనకు అర్థమైంది. యజ్ఞ రూప కర్మ ద్వారా ఏర్పడిన సృష్టికార్యంలో విస్తరించి ఉన్నది కూడా బ్రహ్మమే కదా! ***ఏతస్య అక్షరస్య ప్రశాసనే గార్గి*** - ఓ గార్గీ! అక్షర స్వరూపమైన బ్రహ్మ శాసనం ప్రకారమే సర్వ ప్రపంచము నడుస్తూ ఉందని బృహదారణ్యక శ్రుతి. కనుక బ్రహ్మ, జీవ, జగత్తులకు అఖండత్వము ప్రాప్తించినట్లే అయింది.

తరువాత మూడు ప్రశ్నలకు సమాధానం చెబుతున్నాడు.

అధిభూతం క్షరో భావః పురుష శ్చాధిదైవతమ్ । 4
అధియ జ్ఞోఽహ మేవాత్ర దేహే దేహభృతాం వర ॥

అధిభూతం-క్షరః-భావః-పురుషః-చ-అధిదైవతం
అధియజ్ఞః-అహం-ఏవ-అత్ర-దేహే-దేహభృతాం-వర

దేహభృతాంవర	=	పురుషశ్రేష్ఠా! అర్జునా!	భావః	=	భావము గలది
అధిభూతం	=	అధిభూతము	పురుషః చ	=	పురుషుడు
క్షరః	=	నశించునట్టి	అధిదైవతం	=	అధిదైవతము

అత్ర	=	ఈ	అధియజ్ఞః	=	అధియజ్ఞుడు
దేహే	=	దేహము నందు	అహం ఏవ	=	నేనే

నరశ్రేష్ఠా! అర్జునా! నశించేది అధిభూతము. పురుషుడు అధిదైవతము. దేహంలో నేనే అధియజ్ఞము.

వ్యాఖ్య

(4) కిం అధి భూతం

అధిభూతము ఏమిటి? అనేది నాల్గవ ప్రశ్న. ***అధిభూతం క్షరో భావః*** - నశించే స్వభావం గల వస్తువు అధిభూతం అని సమాధానము. క్షరము అంటే నశించేది. ***భావః*** అంటే పుట్టుక. ***క్షరో భావః*** అంటే నశించే స్వభావము గల వస్తువు యొక్క పుట్టుక అని అర్థం. కనుక పుట్టి నశించే ప్రతి వస్తువు అధిభూతమే. అన్ని దేహాలూ అధిభూతాలే. అంతే కాదు, దేహాల ఉనికికి ఆధారాలుగా ఉన్న శీతోష్ణాదులు కూడా అధిభూతం క్రిందికే వస్తాయి. వాటికి కూడా ఉత్పత్తి వినాశా లున్నాయి. శీతోష్ణాలు పుడుతాయి. అలాగే లేకుండా పోతాయి. అందుచేత అవి కూడా అధిభూతాలే.

అధిభూతాలు క్షరోభావాలు. క్షరోభావ మంటే నశించిన తరువాత తిరిగి పుట్టేవి. పుట్టి నశించేవి అనకుండా, చచ్చి పుట్టేవి అని ఎందుకు అన్నట్లు? పుట్టేవి ఏవో, ఎక్కడ నుండి పుడుతాయో మనకు తెలియదు. అలాగే చచ్చేవి ఎక్కడికి పోతాయో కూడా తెలియదు. ఉన్నవే మనకు తెలుస్తూ ఉన్నాయి. ***భావః*** అంటే ఉండటము, లేదా ఉనికి. ఉన్నవే పోతూ ఉన్నాయి కనుక, తెలిసిన దాని నుండే తెలియని దానిని తెలుసుకోవాలి అనే శాస్త్రీయ అవగాహనకు ఈ క్షరోభావ ప్రయోగము అర్థం పడుతోంది.

'ఏది అక్షరమో అది బ్రహ్మము' అని మొదటి ప్రశ్నకు ఏదైతే సమాధానమో దానికి భిన్నంగా 'ఏది క్షరమో అది ఆధిభూతము' అని నాల్గవ ప్రశ్నకు సమాధానంలో తెలుసుకుంటున్నాం. ఏడవ అధ్యాయంలో పరాపర ప్రకృతులను గూర్చి తెలుసుకున్నాము *(7 - 5 & 6)*. దేనిని పరాప్రకృతిగా అక్కడ గ్రహించామో అదే ఇక్కడ అధ్యాత్మము. దేనిని అపరా ప్రకృతిగా అక్కడ తెలుసు కున్నామో, అదే ప్రస్తుతం అధిభూతంగా తెలుస్తూ ఉంది.

(5) కిం అధిదైవం

పురుషుడే అధిదైవము ***(పురుషః అధిదైవమ్)*** అనేది ఐదవ ప్రశ్నకు సమాధానము. ఈ సమస్త జగత్తు అనే అధిభూతం దేని కారణంగా నిలబడి ఉందో అది అధిదైవము. పురుషుడే అధిదైవము. ***పూర్ణం అనేన సర్వం ఇతి పురుషః*** - ఎవని చేత సర్వము నిండి ఉన్నదో అతడే పురుషుడు అని ఒక అర్థము. ***పురి శయనాత్ వా పురుషః*** - పురము అనబడే శరీరములో ఉన్నవాడు పురుషుడు అని మరొక అర్థము.

బాహ్యంలో భూత ప్రపంచాన్ని స్థావర జంగమాత్మకంగా మనం చూస్తున్నాము. అంటే కొన్ని కదిలేవి. కొన్ని కదలనివి. రెండూ పుట్టినవే కనుక అవి అధిభూతమే

కాని, కదలని వాటిని గూర్చి మనం ఆలోచించడం లేదు. ఆందోళన చెందడం లేదు. ఈ భూమి రేపు ఏమి చేస్తుందో అని మనం ఆలోచించటం లేదు. ఈ మనిషి ఏం చేస్తాడో, ఆ పాము ఎక్కడుందో! అని ఆలోచిస్తున్నాం.

ఒక వ్యక్తి పిస్తోలు పట్టుకొని మనల్ని చంప డానికి ముందుకు వస్తూ ఉంటే, మనం ఎంతగానో చలించి పోతాం. అలా [illegible] గుండెపోటుకు గురై క్రిందపడి అక్కడికక్కడే మరణించా డనుకోండి.

ఇప్పుడు ఆ చచ్చిన వ్యక్తి మనకు భయహేతువు అవుతాడా? చంపాలని వచ్చిన దేహం అక్కడే ఉంది కదా! పైగా పిస్తోలు కూడా చేతి లోనే ఉంది. అయినా, మనకు భయం కలగడం లేదు. అధిభూతం అక్కడే ఉంది. అధిదైవం లేకపోవడం చేత మనం నిర్భయంగా ఉన్నాం.

దేహం అధిభూతం. దేహంలో ఇంద్రియ ప్రాణ మనోబుద్ధుల చలనానికి ఆధారమై దేహంలో పూరింప బడియున్న పురుషుడే అధిదైవతము. అతడే సూక్ష్మ శరీరాభిమాని. మరి, సమిష్టి సూక్ష్మ శరీరాభిమాని ఎవరు? అతడే హిరణ్యగర్భుడు. సూర్యమండ లాంతర్వర్తి. సూక్ష్మ శరీరాలను ప్రకాశింప చేసే లింగాత్మ పురుషుడు ***(పురుషః ఆదిత్యాన్తర్గతః హిరణ్య గర్భః సర్వప్రాణి కరణానాం అనుగ్రాహకః సః అధి దైవతమ్)***. ప్రాణులలో ఇంద్రియ ప్రాణ మనోబుద్ధు లనే సూక్ష్మ శరీరము చరించుటకు కారణమైన పురుషుడే, సమిష్టి దేహం లోని సూక్ష్మ దేహాలు చరించుటకు కారణమై ఆదిత్య మండలములో హిరణ్యగర్భుడుగా ప్రకాశిస్తున్నాడు. అతడే అధి దైవతం.

య ఏతన్మండలం తపతి యశ్చాస్మిన్మణ్డలే పురుషః - ఎవడు సూర్యమండలమును తపింప చేస్తూ, సూర్యుని లోనే ఉన్నాడో, అతడే దేహాన్ని ప్రకాశింప చేస్తూ దేహము నందే ఉన్నాడు అని వేదము. అతడే పురుషుడు. అధిదైవతము.

(6) అధియజ్ఞః కః

అధియజ్ఞు డెవరు? అనేది ఆరవ ప్రశ్న. దేహము నందు అధియజ్ఞము తానే. యజ్ఞాభిమాని అయిన విష్ణువే అధియజ్ఞము. ***యజ్ఞో వై విష్ణుః*** అనే వేద వచనానుసారం సర్వ యజ్ఞాభిమాని అగు విష్ణువను దేవతయే అధియజ్ఞుడు.

ఉదాహరణకి, ఆహారాన్ని మనం స్వీకరిస్తాము కదా! వైశ్వానర రూపంలో చతుర్విధ మైన ఆహారాన్ని స్వీకరించే భోక్త అధియజ్ఞుడు. ఈ విధమైన యజ్ఞకర్మ దేహం లోనే జరుగుతూ ఉంది కనుక అధియజ్ఞ దైవ విష్ణువు దేహము నందే ఉన్నాడు. దేహం దీనికి ఆధారం. అందుచేత, **దేహే** - ఈ దేహములో అని చెప్ప బడింది.

అధిభూతము, అధిదైవము, అధియజ్ఞము - ఈ మూడు కూడా బ్రహ్మము కన్నా అన్యం కాదని అర్థమైంది. బ్రహ్మ, అధ్యాత్మ, కర్మములకు మూడవ శ్లోకంలో అఖండత్వము ప్రాప్తించినట్లే, అధిభూత, అధిదైవ, అధియజ్ఞాలకు ప్రస్తుత శ్లోకంలో అఖండత్వం ప్రాప్తించింది. ఇక అర్జునుడు అడిగిన ఏడవ ప్రశ్నకు సమాధానం అందవలసి ఉంది.

చెబుతున్నాడు.

అన్తకాలే చ మామేవ స్మర న్ముక్త్వా కలేబరమ్ । 5
యః ప్రయాతి స మద్భావం యాతి నా స్త్యత్ర సంశయః ॥

అంతకాలే-చ-మాం-ఏవ-స్మరన్-ముక్త్వా-కలేబరమ్
యః-ప్రయాతి-సః-మద్భావం-యాతి-న-అస్తి-అత్ర-సంశయః

యః	=	ఎవడు	కలేబరం	=	దేహమును
అంతకాలే చ	=	మరణ సమయాన	ముక్త్వా	=	విడిచి
మాం ఏవ	=	నన్నే	ప్రయాతి	=	వెళ్తున్నాడో
స్మరన్	=	స్మరిస్తూ	సః	=	వాడు

మద్భావం	=	నా భావమును	సంశయః	=	సందేహము
యాతి	=	పొందుతున్నాడు	న అస్తి	=	లేదు
అత్ర	=	ఆ విషయములో			

పార్థా! మరణకాలంలో కూడా ఎవడైతే నన్నే స్మరిస్తూ దేహాన్ని విడిచిపెట్టి వెళ్తున్నాడో, వాడు నా స్వరూపాన్నే పొందుతాడు. ఈ విషయంలో సందేహం అవసరం లేదు.

వ్యాఖ్య

మరణ కాలంలో మద్భావం

ప్రయాణ కాలే చ కథం జ్ఞేయో౽సి - మరణకాలం లోను పరమేశ్వరుని ఎలా తెలుసుకుంటారు? అనేది ఏడవ ప్రశ్న. దానికి సమాధానం ఐదు, ఆరు శ్లోకాలలో భగవంతుడు చెబుతున్నాడు.

అర్జునా! మరణ కాలంలో కూడా నన్నే స్మరిస్తూ దేహాన్ని త్యజించి వెళ్ళిన వాడు నా స్వరూపాన్నే పొందుతాడు. ఇందులో సందేహం అవసరం లేదు అంటున్నాడు అచ్యుతుడు.

మనస్సును నియమించిన వాళ్ళు ప్రయాణ కాలం లోను నిన్నెలా తెలుసుకొని ఉపాసిస్తారు? అనేది అర్జునుని ప్రశ్న. ప్రయాణ కాలము అంటే, ఉన్న చోటును విడిచి పయన మయ్యే కాలము. దేహంలో ఉన్న జీవుడు దేహాన్ని త్యజించి వెళ్ళిపోయే కాలము అని అర్థము. అదే మరణ కాలము. దేహభంగ కాలము. ప్రయాణ కాలము.

ప్రయాణ కాలే చ అన్నాడు అర్జునుడు. ***అన్త కాలే చ*** అంటున్నాడు గీతాచార్యుడు. ఇద్దరి వాక్యాలలో **చ** కార ప్రయోగ ముంది. **చ** అంటే కూడా అని అర్థము. మరణ కాలంలో కూడా ఎలా స్మరిస్తారు? అనే అర్జునుడి ప్రశ్నకు, మరణ కాలంలో కూడా నన్నే స్మరిస్తూ దేహ త్యాగం చేస్తేనే నా భావాన్ని పొందడం జరుగుతుంది అనేది పరమాత్మ సమాధానం. అంటే, జీవిత కాలంలో స్మరించడం సంభవం. కాని, కఫ వాత పిత్తాలు పీడిస్తున్న భయంకర మరణ వేళ కూడా స్మరించడం ఎలా సాధ్యం? అనేది అర్జునుని ఆంతర్యం. జీవిత కాల మంతా స్మరించాడు కనుకనే, మరణ సమయంలో కూడా స్మరిస్తాడు అనేది భగవంతుని జ్ఞానము.

ఈ అనంత జీవయాత్రలో, అనేక జన్మలలో అలసి పోతున్న జీవుడు మధ్య మధ్యలో తీసుకొనే విరామమే మృత్యువు. నిద్ర చిన్న మృత్యు వైతే, మృత్యువు దీర్ఘ నిద్ర. సాగేది ఏదైనా ఆగేందుకే. కాలంలో ప్రయాణం సాగుతుంది. సాగే ప్రయాణం ఎక్కడ ఆగుతుందో అదే ప్రయాణంలో అంత్యకాలం.

ఇంతకీ ఏది అంత్యకాలం? వాస్తవం చెప్పాలంటే ప్రతిక్షణమూ అంత్యకాలమే. మన వ్యవహారాలతో సంబంధం లేకుండా కాలం పయనిస్తూనే ఉంటుంది. కాలశకటం ఎవరి కొరకూ ఆగదు.

కాలంలో కళ్ళు తెరచి కాళ్ళు చేతులు కదిలించాం. కాలం లోనే ఆడుకున్నాం. చదువుకున్నాం. ధనార్జన చేశాం. సంసారం తయారు చేసుకున్నాం. వినోదాలు విలాసాలు ఒక వైపు, విలాపాలు విషాదాలు మరో వైపు బ్రతుకును కదుపుతూ, కుదుపుతూ ఉంటే, మన వ్యవహారాలతో సంబంధం లేకుండా కాలం పయనిస్తూనే ఉంది. జీవితం ఎంత కాలం పయనించినా, ఆగేది ఒక్క క్షణం లోనే. అదే అంత్యక్షణం. ఆ తరువాత? ఏముంది? నిద్రించిన వాడు మేల్కొనిన తరువాత వ్యవహారాన్ని కొనసాగించినట్లు, మరణించిన జీవి మృత్యు నిద్ర నుండి మేల్కొని క్రొత్త బ్రతుకును కొనసాగిస్తాడు.

మరణం - స్మరణం

మరణ కాలంలో ఎవరైనా చేసేది దేహత్యాగమే. జ్ఞాని అయినా, అజ్ఞాని అయినా మరణంలో దేహాన్ని త్యజించక తప్పదు. దేహాన్ని త్యజించిన అజ్ఞాని తిరిగి వేరొక దేహాన్ని పొందుతాడు. దేహాన్ని త్యజించిన జ్ఞాని తిరిగి దేహాన్ని పొందడు. పరమాత్మను పొందుతాడు. అజ్ఞానం ఉండటం చేత దేహాన్ని త్యజించిన అజ్ఞాని తిరిగి దేహంతో జన్మిస్తాడు. అజ్ఞాననాశము జరిగింది కనుక జ్ఞాని తిరిగి జన్మించడు.

మరణ కాలంలో స్మరించి నంత మాత్రాన పరమాత్మను పొందడం సాధ్య పడుతుందా? అనేది శంక. ఇక్కడ స్మరించడ మనేది ప్రధానమా? లేక మరణ కాలంలో స్మరించడ మనేది ప్రధానమా? స్మరించడ మనేదే ప్రధానము. అదే వాస్తవ మైతే, జీవిత కాలంలో ఎన్ని సార్లు మనం భగవంతుని స్మరించ లేదు? అప్పుడు ప్రాప్తించని పరమాత్మ స్వరూపం మరణ కాలంలో ప్రాప్తిస్తుందా?

కాబట్టి, ఇక్కడ స్మరించడము అంటే తెలుసుకోవడము లేక జ్ఞానము అని అర్థము. జీవిత కాలంలో స్మరించిన వాడు మరణ కాలంలో పరమాత్మ స్మృతికి రాక స్మరించలేక పోవచ్చు. కాని, పరమాత్మ జ్ఞానం అలాంటిది కాదు. అది వస్తు తంత్రము. కనుక నిత్య జ్ఞానమై ఉంటుంది.

జీవించి ఉన్నప్పుడే తాను బ్రహ్మము అనే ఎరుక కలిగిన జ్ఞాని, మరణ కాలంలో కూడా ***(అంత కాలేచ దేహభంగ కాలే)*** తాను బ్రహ్మమే అనే జ్ఞానంతో ఉంటాడు. అలాంటి వాడు పొందే దేముంటుంది? పొందక పోతే కదా ప్రత్యేకంగా పొందాలి!

జ్ఞానం లేని వాడు మరణిస్తే, స్థూలదేహాన్ని విడిచి పెట్టి, సూక్ష్మ దేహంతో పయనించి మరొక దేహాన్ని ధరిస్తాడు. అజ్ఞానం ఉన్నంత వరకు సూక్ష్మ శరీరం అనేక స్థూల దేహాలతో సంయోగ వియోగాలను సాగిస్తూనే ఉంటుంది గాని నశించదు.

జ్ఞాని విషయం వేరు. అతడు బ్రహ్మమును తెలుసుకున్న వాడు. తానే బ్రహ్మము అనే బ్రహ్మాత్మ జ్ఞానము కలవాడు. మరణ కాలంలో స్థూల దేహంతో పాటు సూక్ష్మ దేహం కూడా నశిస్తుంది కనుక, మరణానంతరం జ్ఞాని ఎక్కడికి పయనించాలి? తాను లేని చోటంటూ ఉంటే కదా పయనించడానికి? ఇక్కడ జ్ఞాని పరమాత్మ స్వరూపాన్నే పొందుతాడు అంటే, పరమాత్మ కన్నా తాను వేరుగా లేడు అనే జ్ఞానంతో ఉంటాడని అర్థము. దేహం ఉన్నా, ఊడినా జ్ఞాని జ్ఞానంలో మార్పు ఉండదు.

న తస్య ప్రాణా ఉత్క్రామన్తి అత్రైవ సమవలీయన్తే - జ్ఞానికి ప్రాణోత్క్రమణమే లేనందున, అతడు పోవడము అనేది ఉండదు అన్నది వేదం.

(అత్ర అస్మిన్ అర్థే, సంశయః యాతి వా న వా ఇతి, నాస్తి న విద్యతే).

మరణ కాలంలో ఏ భావం ఉంటే, దానినే పొందడం జరుగుతుంది అనేది తన విషయం లోనే గాక అన్యుల విషయంలో కూడా వర్తిస్తుంది అంటున్నాడు వాసుదేవుడు.

యం యం వాపి స్మర న్భావం త్యజ త్యన్తే కలేబరమ్ ।
తం త మే వైతి కౌన్తేయ సదా తద్భావ భావితః ॥ 6

యం-యం-వా-అపి-స్మరన్-భావం-త్యజతి-అంతే-కలేబరమ్
తం-తం-ఏవ-ఏతి-కౌంతేయ-సదా-తద్భావభావితః

కౌంతేయ	= అర్జునా!	సః	= వాడు
యః	= ఎవడు	సదా	= ఎల్లప్పుడు
అంతే	= అంతమున	తత్	= ఆ
యం యం భావం వా అపి	= ఏయే భావమును	భావభావితః	= భావమునే తలుస్తూ
స్మరన్	= తలుస్తూ	తం తం ఏవ	= ఆయా భావమునే
కలేబరం	= దేహమును	ఏతి	= పొందుతాడు
త్యజతి	= విడిచి పెడతాడో		

అర్జునా! మరణ కాలంలో ఎవడు ఏ భావాన్ని తలుస్తూ దేహాన్ని విడిచి పెడతాడో, వాడు తిరిగి ఆ భావాన్నే పొందుతాడు. ఎందుకంటే, ఆ భావమునే తలుస్తూ ఉన్నాడు కనుక.

వ్యాఖ్య

యద్భావం తద్భవతి

జీవితంలో ఎవరు ఏది పొందినా, పొందడానికి ముందు దాని కొరకు ప్రయత్నించి ఉంటారు. ప్రయత్నించ డానికి ముందు ప్రయత్నించాలి అనే సంకల్పాన్ని కలిగి ఉంటారు. ప్రయత్నించాలి అనే సంకల్పానికి ముందు దానిని ఎందుకు పొందాలి? దాని వల్ల ప్రయోజనం ఏమిటి? మొదలైన ఆలోచనలను చేసి, చివరికి పొందాలి అనే నిర్ణయానికి వచ్చి ఉంటారు. సాధ్యా సాధ్యాలన్నీ ఇలాగే సాధన క్రమంపై ఆధారపడి ఉంటాయి. మనిషి దేనిని భావిస్తాడో, అది హృదయాన్ని గాఢంగా పెనవేసుకు న్నప్పుడు ఆసక్తితో దాని కొరకు ప్రయత్నిస్తాడు. చివరికి దానినే పొందుతాడు. కారణం, ఎల్లప్పుడూ దానికి సంబంధించిన ఆలోచనే కలిగి ఉంటాడు కనుక *(సదా తద్భావ భావితః)*.

ఏ విత్తనం నాటితే ఆ చెట్టే వస్తుంది. తిండిని బట్టే కదా త్రేపు ఉంటుంది. పులిహోర తింటే పాయసం త్రేపు వస్తుందా? మారేడు నాటితే మామిడిపండు వస్తుందా? చర్యను బట్టే కదా ప్రతిచర్య!

జాగ్రదవస్థలో సాగిన ఆలోచనలే, భావనలే కలలను సృష్టిస్తాయి. మనసుకు తెలియనివి స్వప్నంలో అగుపించవు. ఇదీ అంతే. బ్రతుకులో సాగించిన భావాలే మరణ కాలంలో స్ఫురిస్తాయి. పూర్వాభ్యాస జనిత వాసనే అంత్యకాలంలో స్మరణ హేతువు అవుతుంది. అంతేగాని, అవసరమైన దానిని బ్రతుకులో భావించకుండా, మరణంలో స్మరిద్దా మనుకుంటే కుదరదు. జీవిత మంతా దేనిని దృఢంగా అభ్యసిస్తామో అదే మరణ కాలమున స్ఫురించి భవిష్యత్తును నిర్ణయిస్తుంది.

గతంలో మనం చేసిన భావాలే నేటి బ్రతుకును తయారు చేశాయి. నేడు మనం సాగించే భావాలే రేపటికి రూపు నిస్తాయి. ఇది నమ్మకం కాదు. శాస్త్రీయ మైన అవగాహన.

కేవలం స్మరించినంత మాత్రాన అనుకున్నది సాధించ గలమా? స్మరించడం ఒక్కటే సరిపోదు. తత్సంబంధ మైన కర్మాచరణము కూడా జరగాలి. **పుణ్యేన పుణ్య లోకమ్** - పుణ్యం చేత పుణ్య లోకము ప్రాప్తిస్తుంది అని ప్రమాణము. అంటే, కేవలం పుణ్యానికి సంబంధించిన భావన ఉంటే సరిపోతుందా? పుణ్య

భావన మాత్రమే ఉండి, పుణ్యకర్మ చేయని వానికి పుణ్యలోకం ప్రాప్తిస్తుందా? పుణ్యకర్మ ఫలితం పుణ్య లోకం గాని, పుణ్య భావన ఫలితం పుణ్యలోక ప్రాప్తి అని శాస్త్రం ఎక్కడా చెప్పలేదు. కాకపోతే, పుణ్య కర్మాచరణకు హేతువు పుణ్యభావనే. అలాగని కేవలం భావన చేతనే పొందడం సాధ్యం కాదు.

ఏ భావన మనస్సులో దృఢంగా ఉంటుందో, దానిని పొందడానికి మనిషి అవశ్యం శ్రమిస్తాడు. తత్ఫలితంగా ఫలాన్ని అందుకుంటాడు. మరణ సమయంలో ఏయే భావాన్ని కలిగి దేహాన్ని త్యజిస్తారో ***(యం యం భావం స్మరన్ చిన్తయన్ పరిత్యజతి ప్రాణ వియోగ కాలే కలేబరం)***, ఆయా భావానికి సంబంధించిన దానినే పొందుతారు కాని, వేరే దానిని పొందలేరు ***(తం తం ఏవ స్మృతం భావమ్ ఉపైతి నాన్యం)***.

ఒక వ్యక్తి గొప్ప క్రీడాకారుడు కావాలని ఆశిస్తూ ఉంటాడు. శ్రమించి క్రీడాభ్యాసం చేయని కారణంగా క్రీడాకారుడు కాలేక పోతాడు. కాని, అదే ఆలోచన బుద్ధిలో కొనసాగుతూ ఉంటుంది. సదా అదే భావంలో ఉంటాడు కనుక ***(సదా తద్భావ భావితః)*** మరణ సమయంలో అతనికి అదే భావన స్ఫురించ వచ్చు. ఆ భావం తోనే మరణిస్తాడు కనుక, రాబోయే జన్మలో గొప్ప క్రీడాకారుడు అవుతాడు. ఎలా?

జీవిత మంతా క్రీడాకారుడు కావాలనే దృఢమైన భావన కలిగి ఉన్నందున, మరణ సమయంలో కూడా అదే భావన స్ఫురించింది. ఈ జన్మాంతంలో మరణ సమయాన ఏ భావన అయితే నిలిచిందో, రాబోయే జన్మలో ఆ భావనే ప్రథమంగా, ప్రధానంగా బుద్ధిలో ఉంటుంది. అతడిలో బాల్యం నుండే క్రీడాసక్తి మెండుగా ఉంటుంది. ఆసక్తి మెండుగా ఉంది కనుక అభ్యాసము కూడా నిండుగా జరుగుతుంది. తత్ఫలితంగా అతడు గొప్ప క్రీడాకారు డవుతాడు.

జీవితంలో దేనిని మనం గాఢంగా ఆలోచిస్తామో, భావిస్తామో, ఆచరిస్తామో, దాని ఫలితమే మరణ కాలంలో అంతిమ సంకల్పమై ఉంటుంది. చెట్టు లోని మధుర మైన ఫలము ఎలాగైతే చెట్టు యొక్క సారరూపమో, ఫలం లోని రసం ఎలాగైతే చెట్టు లోని సారం కన్నా వేరు కాదో, అలాగే మరణ కాలంలో స్ఫురించే అంతిమ సంకల్పం బ్రతుకులో సాగిన సంకల్ప కార్యాల సారభూతమే కాని, జీవన సారం కన్నా అన్యం కాదు.

చనిపోయిన తరువాత మనం ఏమౌతామో! ఎక్కడికి పోతామో! ఎలా ఉంటామో! ఇలాంటి ఆలోచనలకు ఈ శ్లోకం ఇంతటితో తెర దించింది అనే భావించ వచ్చు. మనం ఆశించిందే మనకు అందుతుంది. మనం భావించిందే మన భాగ్య మవుతుంది. మనం పోవా లనుకున్న చోటికే మనం చేరుతాము. పెట్టుబడి ఇక్కడ పెడితేనే, ఫలితాలు అక్కడ అందుతాయి. ఇక్కడ మతి - అక్కడ గతి. మరణ కాలంలో గతిని నిర్ణయించేది జీవిత కాలం లోని మతియే. అంత్య కాలంలో మతిలో నిలిచిన భావమే ఉత్తర జన్మలో గతిని నిర్ణయిస్తుంది ***(అంతే మతిః సా గతిః)***. పాల లోని సారభూత మైన పదార్థమే చివరకు వెన్నగా లభిస్తుంది. బ్రతుకు లోని జీవన సారమే ప్రాణ ప్రయాణ కాలంలో చివరి భావంగా స్ఫురిస్తుంది. బ్రతుకులో భాగం కానిది చావులో భాగం పంచుకోదు.

ఆఖ్యాయిక

అంత్యకాలంలో అంగడి

ఒక వ్యాపారి ఈ అంత్యకాల భావనపై ఆశ పెంచుకున్నాడు. మరణించిన తరువాత స్వర్గానికి వెళ్ళి అమృతపానం చేస్తూ అప్సరసల మధ్య అలా అలా అలౌకిక సుఖాలలో తేలి పోవాలని అభిలషించాడు. స్వర్గానికి చేరాలి అంటే యజ్ఞ యాగాది పుణ్య కర్మలు ఆచరించాలి. అలా ఆచరించడానికి చాలా ధనం వ్యయ మవుతుంది. అంత ధనం తన కెక్కడిది అని చింతించ సాగాడు.

ఇంతలో మరణ కాలంలో భగవన్నామాన్ని పలికితే చాలు. నీకు పుణ్య లోకాలు ప్రాప్తిస్తాయి అని ఎవరో అతనికి చెప్పారు. మరొక వివేకి అది విని, బ్రతుకంతా నామస్మరణ చేసిన వారే అంత్యకాలంలో భగవన్నామం పలుక గలరు అని అన్నాడు. వ్యాపారి ఆలోచించాడు. వ్యయం లేకుండా స్వర్గం లభించే ఈ అంత్యకాల భావనా వ్యవహారం బాగుందని విశ్చయించుకున్నాడు. కాని, ఇంతలోనే దిగులు పడ్డాడు.

నామం పలికే సంస్కారం తనకు లేదు. నామసాధన చేయలేడు. అలాగని స్వర్గాభిలాషను త్యజించ లేడు. ఏం చేయాలి? బాగా ఆలోచించి, తనకు వరుసగా పుట్టిన నలుగురు కుమారులకు నారాయణ, జనార్దన, మాధవ, ముకుంద అని పేర్లు పెట్టుకున్నాడు. భగవంతుణ్ణి పిలిచే సంస్కారం తనకు ఎలాగూ లేదు. పోనీ సంసార వ్యామోహంతో బిడ్డల్ని పిలిచినా, ఆ పేర్లు భగవంతుడివే కనుక తనకు పుణ్యలోకాలు తప్పక ప్రాప్తిస్తా యని గొప్ప పథకాన్నే రచించు కున్నాడు.

వృద్ధాప్యం వచ్చింది. మృత్యువు సమీపించింది. ప్రాణ ప్రయాణ సమయం దాపురించింది. వ్యాపారి గట్టి వాడే. అది మరణ కాలం అని గ్రహించాడు. ఇక ప్రాణం నిలవదు అని అర్థమై పోయింది. వెంటనే, నారాయణా! అని అరిచాడు. నాన్నా! అంటూ నారాయణుడు వచ్చాడు. జనార్దనా! అన్నాడు. జనార్దనుడు వచ్చాడు. మాధవా! అని కేక వేశాడు. మాధవుడూ వచ్చాడు. చివరగా ముకుందా! అని పిలవగానే ముకుందుడు కూడా వచ్చాడు. నలుగురిని చూచి, 'నలుగురూ వచ్చేశారా? మరి అంగడిలో ఎవరున్నారు?' అని పలికి కన్ను మూశాడు.

ఆశ బాగానే ఉంది. ఆలోచన బాగానే ఉంది. కాని ఆచరణలో లేనిది, అభ్యాసంలో ఉండనిది అంత్యకాలంలో ఉంటుందని భావించడమే బాగలేదు. అందుకే మిగిలింది అంత్యకాలంలో అంగడి.

ఈ శ్లోకంలో అర్జునుని *కౌన్తేయా!* అని సంబోధించాడు భగవంతుడు. ఇలా సంబోధించడం వెనుక సందర్భోచితంగా ఒక అద్భుతమైన జీవన రహస్యం దాగి ఉంది. **కౌంతేయా!** అంటే **కుంతీకుమారా!** అని అర్థము.

అర్జునా! విచారించకు. అంతిమ క్షణాన్ని తలచుకొని ఆవేదన చెందకు. అంతిమ క్షణం అపాయకరమే. భయంకరమే. దేహంలో నరాలు తెగుతూ ఉంటాయి. గుండె పట్టు తప్పి కొట్టుకుంటూ ఉంటుంది. ప్రాణం అల్లాడుతూ ఉంటుంది. మనస్సు స్పృహను కోల్పోతూ ఉంటుంది. ఇంద్రియాలు నిర్వీర్య మవుతూ ఉంటాయి. దేహం కంపిస్తూ ఉంటుంది. ఇటువంటి దారుణ మైన పరిస్థితులలో మనస్సు భగవంతునిపై నిలుస్తుందా? అని సంశయించకు. నువ్వు కౌంతేయుడివి. కుంతీదేవి కుమారుడివి.

కౌంతేయా! మీ అమ్మ జీవితాంతం భగవత్స్మరణ తోనే కాలం గడిపింది. ఏమి కావాలో కోరుకో అత్తమ్మా! అని నేను అభయ మిస్తే, కృష్ణా! నిన్ను మరపించే సుఖాలు నాకు వద్దు. నిన్ను స్మరించేందుకు అవసరమైన వైరాగ్యాన్ని కలిగించే ఆపదల్నీ ప్రసాదించు అన్నది. బ్రతికినంత కాలం బుద్ధిని భగవంతుని యందే ఉంచి జీవించింది. మరణ సమయంలో దర్భాసనము పరచుకొని, తూర్పు ముఖంగా ఆసీనురాలై, పవిత్ర మంత్రోచ్చారణలు చేస్తూ [illegible] భస్మం చేస్తుంది. నాయనా! ఆమె కడుపు తీపివి నువ్వు. ఆ తల్లి ప్రేగు త్రెంచుకొని పుట్టిన పుణ్యపురుషుడవు. ఆమె సంస్కారమే నీలో ఉంది. సంశయించకు. నడుము బిగించు. చెయ్యవలసింది [illegible] కౌంతేయ సంబోధనం ద్వారా తన హృదయం లోని భావనను బహిర్గతం చేశాడు భగవంతుడు.

చివరి భావన ఏదో అదే దేహాంతర ప్రాప్తికి కారణ మవుతూ ఉంది. బ్రతుకులో సాగిందే చివరి భావనగా కొనసాగుతుంది. కనుక ఏమి చేయాలి?

తస్మా త్సర్వేషు కాలేషు మా మనుస్మర యుధ్య చ ।
మ య్యర్పిత మనోబుద్ధి ర్మామే వైష్య స్యసంశయః ॥ 7

తస్మాత్-సర్వేషు-కాలేషు-మాం-అనుస్మర-యుధ్య-చ
మయి-అర్పిత మనోబుద్ధిః-మాం-ఏవ-ఏష్యసి-అసంశయః

తస్మాత్	=	అందువలన	మయి	=	నా యందు
సర్వేషు	=	సర్వ	అర్పిత	=	ఉంచిన
కాలేషు	=	కాలాలలో	మనోబుద్ధిః	=	మనోబుద్ధులతో
మాం	=	నన్ను	మాం ఏవ	=	నన్నే
అనుస్మర	=	అనుస్మరించు	ఏష్యసి	=	పొందుతావు
యుధ్య చ	=	యుద్ధము కూడా చెయ్యి	అసంశయం	=	సందేహము వద్దు

అర్జునా! అందుచేత, సర్వకాల సర్వావస్థల యందు నన్నే అనుస్మరిస్తూ నీ కర్తవ్య మైన యుద్ధం చెయ్యి. నీ మనస్సును, బుద్ధిని నాకే సమర్పించు. తప్పక నన్నే చేరుతావు. సందేహమే వద్దు.

వ్యాఖ్య

నిరంతర స్మరణాభ్యాసము వలన కలిగిన చివరి భావన, అంటే మరణ సమయాన ఏర్పడిన అంత్య ప్రత్యయము (చివరి భావన) దేహాంతర ప్రాప్తికి కారణ మవుతూ ఉందని గడచిన రెండు శ్లోకాలలో అర్థం చేసుకున్నాం.

బ్రహ్మాత్మజ్ఞానము కలవాడే జ్ఞాని. అతనికి జీవిత కాలం లోనే తాను బ్రహ్మము అనే భావన దృఢపడి ఉంది కనుక, అంత్య భావనాపేక్ష జ్ఞానికి లేదు. మరణం తరువాత ప్రయాణం ఉండదు. స్థూలదేహం స్థూల భూతాల లోను, సూక్ష్మదేహం సూక్ష్మభూతాల లోను విలీనం కాగా, తాను అఖండాత్మ స్వరూపు డవుతాడు.

జ్ఞానులు కాని వారు జీవిత కాలంలో ఏ భావాన్ని గాఢంగా పెనవేసుకొని ఉంటారో, మరణ కాలంలో దానినే అంత్య ప్రత్యయంగా కలిగి దేహాంతర ప్రాప్తిని పొందుతారు. కనుక పూర్వాభ్యాస జనిత వాసన మరణ కాలంలో స్మరణ హేతువు కావడం చేత, జీవితంలో ఎలా నడచుకోవాలో సుస్పష్ట మైంది. అందుచేత **(తస్మాత్)** సాధకుడు జీవితంలో ఏమి చేయాలో ప్రస్తుత శ్లోకంలో చెబుతున్నాడు. **తస్మాత్** అంటూ శ్లోకాన్ని ఆరంభించడానికి కారణం ఇదే.

సంతతాభ్యాసము

అన్ని కాలాలలో పరమేశ్వరునే అనుస్మరించాలి **(సర్వేషు కాలేషు, మా మనుస్మర).** స్మరించాలి అని ఆగకుండా అనుస్మరించాలి అని చెప్పడం చేత 'అను' అనే ఉపసర్గ ఏమిటో, ఎందుకో కూడా తెలుసుకోవాలి. ఈ అనుస్మరణము అన్ని కాలాలలో సాగాలి అంటున్నాడు. ఇక్కడ కాలాలు **(కాలేషు)** అని బహువచనం వాడటం జరిగింది.

వేసవికాలం, శీతాకాలం, వర్షాకాలం, రాహుకాలం అని చూడకుండా అన్ని కాలాలలో స్మరించాలి అని అర్థము. సుఖ కాలము లోను, దుఃఖ కాలములో కూడా అని భావము. పగటి కాలము మాత్రమే గాక రాత్రి

కాలము అని కూడా అర్థము. ఒక్క మాటలో చెప్పాలి అంటే నిద్రించే కాలంలో తప్ప అన్ని కాలాల లోను స్మరించాలి. అప్పుడే అంత్యకాలంలో పరమేశ్వరుని స్మరించడం కుదురుతుంది. ఆహార విహార ఆసన శయనాదు లందు కూడా విస్మరణము జరుగ కూడదు. సంక్లిష్ట మైన కాలంలో కూడా స్మరణము సాఫీగా సాగేటట్లు చూసుకోవాలి. స్మరణము అనుస్మరణంగా మారేటట్లు చూసుకోవాలి.

అనుస్మర అన్నచోట ***యథా శాస్త్రం*** అని వ్యాఖ్యానించారు భాష్యకారు లైన శ్రీ శంకరులు. శాస్త్రవిధిని దృష్టిలో ఉంచుకొని ఆచరించ మని అర్థము. పరమేశ్వరుని స్మరించాలి అంటే, పరమేశ్వరుడు ఏమిటో తెలియాలి కదా! పరమేశ్వర జ్ఞానం ఎలా కలుగుతుంది? ప్రమాణం ద్వారానే కలుగుతుంది. శాస్త్రమే కదా మనకు ప్రమాణము! శాస్త్రము విశద పరచినట్లు, పరమేశ్వర స్వరూపమును విస్పష్టంగా శ్రవణం చేసి, మనన నిదిధ్యాసనల ద్వారా స్థిర పరచుకోవాలి. అధ్యయన మైనా, ఆచరణ మైనా సర్వ కాలాలలో శాస్త్రోక్త విధిని అనుసరించే సాగాలి. అదే అనుస్మరణము.

స్మరణాన్ని బట్టే మరణం ఉంటుంది. మరణ గతిని నిర్ణయించేది స్మరణమే. ఇది మామూలు విద్య కాదు. మరణ విద్య. బ్రతకడానికి ఎన్నో విద్యలు. అందరూ వాటి వెంటబడి పరుగులు తీసే వారే. అతి ప్రధాన మైన ఈ మరణ విద్యను పట్టించుకొనే వారు అరుదు. ఆ ప్రయత్నంలో వేల కొకడో, కోటి కొకడో మాత్రమే ఉంటాడు *(7 - 3)*.

పుట్టడంలో విశేష మేముంది? పశువులు కూడా పుడుతున్నాయి. చావడంలో మాత్రం విశిష్టత ఎక్కడుంది? జంతువులు కూడా చస్తున్నాయి. ***జంతూనాం నర జన్మ దుర్లభం*** - జంతువులలో మానవ జన్మే శ్రేష్ఠ మైనది అనేది ఋజువు కావాలంటే, ఆ సత్యము జనన మరణాలలో కాకుండా జీవితంలో కనిపించాలి. జీవితంలో వైభవం తొంగి చూస్తే, మరణం వైభవోపేతంగా శోభిస్తుంది. ఈ అవకాశం పశు పక్ష్యాదులకు లభించదు. మానవునికే ఉంది. యోగ్యమైన మరణం ఒక్క మానవునికే ఉంది. నిమ్మళంగా ప్రాప్తిస్తుంది. మరణ యోగ్యత అన్ని ప్రాణులకీ ఉంది. యోగ్యమైన మరణం ఒక్క మానవునికే ఉంది. నిమ్మళంగా కూర్చుని సంధ్యావందనం చేయడం ఎవరికైనా సాధ్యమే. జనన మరణాల సంధ్యలో సతమత మౌతూ సర్వేశ్వరునికి వందనం అవడం ఎందరికి సాధ్యం? సర్వ కాలాలలో సర్వేశ్వరుని స్మరించిన వారికే సాధ్యం.

కర్తవ్యతా నిష్ఠ

సర్వ కాలాలలో నన్నే అనుస్మరిస్తూ, నీ కర్తవ్య మైన యుద్ధం కూడా చెయ్యి ***(అనుస్మర యుధ్య చ)*** అంటున్నాడు. సంతతాభ్యాసములో కొనసాగే వాడు కర్మయోగే కాని జ్ఞాని కాడు. మరి కర్మయోగి చేయ వలసిన కర్మ లన్నిటినీ త్యజించి ఈశ్వర స్మరణముతో కాలం గడిపితే సంసారా లేమౌతాయి? అలాగని, లౌకిక మైన కార్యాలను ఆచరిస్తూ, విరామ కాలంలోనే అనుస్మరణం అంటూ జీవిస్తే, ***సర్వేషు కాలేషు మా మనుస్మర*** అనే భగవదాజ్ఞ ఎలా నెరవేరు తుంది? సంతతాభ్యాసం సాగడానికి కర్తవ్యాన్ని విస్మరించ నవసరం లేదు. పనిని పూజగా మార్చుకుంటే సరిపోతుంది. [illegible]తో కర్తవ్యతా నిష్ఠను కలిగి ఉంటే, కర్మలలో కూడా పరమేశ్వరుని అనుస్మరణమే సాగుతుంది.

సాధనలు రెండు [illegible] అంతరంగ సాధన. రెండవది బహిరంగ సాధన. పూజా జప ధ్యానాదులు అంతరంగ సాధనలు. [illegible] బహిరంగ సాధన. కర్మాచరణములో స్మరణము లోపిస్తే సాధన దెబ్బతింటుంది. అందుకనే [illegible] నన్నే అనుస్మరించు అని ఉపదేశించిన పరమేశ్వరుడు, నీ కర్తవ్య మైన యుద్ధం కూడా [illegible] అంటున్నాడు.

ఇది అర్జునునికి ఉపదేశిస్తున్న సందర్భము కనుక, నీ కర్తవ్య మైన యుద్ధాన్ని కూడా ఆచరించు అన్నాడు. **ఎవరి కర్తవ్య మేమిటో దానిని** ఆచరించాలి అనేది సామాన్య బోధ. సర్వులను ఉద్దేశించి చేసిన బోధ. ఇదే కర్మ **యోగము.** కర్మాచరణము సంతత స్మరణాభ్యాసాన్ని అడ్డగించకుండా, కొనసాగించే సాధనోపాయము.

కర్మయోగ సాధనోపాయము తెలిసి, తదనుగుణంగా జీవించే వారు సదా అనుస్మరణం లోనే కొనసాగుతూ **ఉంటారు.** చేయవలసింది ఏమిటో, చేయదగింది ఏమిటో చక్కగా అవలోకించి, ఆచరణమును ఆరాధనగా మార్చుకొని, ఇష్టాయిష్టాలను ప్రక్కకు నెట్టి, ధర్మాధర్మాలను వివేచించుకొని, ధర్మరూపంలో ఉన్నది దైవమే కనుక, ధర్మాచరణము దైవారాధనే అవుతుంది అనేది సదా దృష్టిలో ఉంచుకొని, ఏ పని చేస్తున్నా, నేను చేసే వాణ్ణి - ఈశ్వరుడు చేయించే వాడు, పరమేశ్వరుడు నియమించిన కార్యాన్ని శంకర కింకరునిగా **(ఈశ్వర భృత్యవత్)** శ్రద్ధతో ఆచరిస్తున్నాను అనే దృఢ నిశ్చయంతో కరచరణాదులు కర్మలలో కదులుతూ ఉంటే, అంతఃకరణములో స్మరణ దివ్యంగా సాగుతూ ఉంటుంది. ఇదే ధర్మనిష్ఠ కర్తవ్యతా ధర్మనిష్ఠ. అర్జునుని విషయంలో అది యుద్ధమైతే మరొకరిది వ్యాపారము కావచ్చు. అలాగే ఉద్యోగ మైనా, మరే వ్యవహార మైనా.

నిరంతర స్మరణము

సర్వ కాలాలలో సర్వేశ్వరుని అనుస్మరిస్తూ జీవించ మన్నాడు భగవంతుడు. సంతత తామసంధాన జనిత సంస్కారము చేత మరణ కాలంలో భగవద్భావం **(మద్భావం)** స్థిరంగా నిలుస్తుందని, అది దేహాంతర ప్రాప్తికి హేతువు అవుతుందని ఉపదేశించాడు.

వచ్చిన దెపుడో తెలియదు ఎవరికి
పోయే రోజుందని తెలియని దెవరికి?
దారాసుతులు ధన దాయాదులు
కలిసి రాలేని రోజు అది
మట్టిలో కాయము కలవాలి
తోడొచ్చే దేమిటో తెలియాలి
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్

అని రామజోగి చిట్కా.

ఇంతవరకు మనం ఈ శ్లోకంలో అర్థం చేసుకున్న దానిని బట్టి పనులు లేనపుడూ పూజ సాగుతూనే ఉంది. పనులు ఉన్నప్పుడు కూడా పనులలో పూజే కొనసాగుతూ ఉంది. ఎక్కడా, ఏ కాలం లోను స్మరణానికి భంగం వాటిల్లడం లేదు. ఒక మహాత్ముడు చెప్పినట్లు, రెండు చేతులతో సదా సర్వేశ్వరుని పాదపద్మాలను వాటేసుకొని భక్తుడు జీవిస్తూ ఉండాలి. పని కాలాలలో ఒక చేతితో పరమేశ్వరుని చరణాలను పట్టుకొని, మరో చేతితో కర్మ లాచరించాలి. పని పూర్తి కాగానే మళ్ళీ రెండు చేతులతో భగవంతుని చరణ కమలాలను పట్టుకోవాలి అన్నాడు.

పనిని పూజగా మార్చుకోవడం సాధ్యమేనా? కర్మాచరణంలో దైవారాధనము సాగుతుందా? అనే సందేహము చాలా మందిని వేధిస్తూ ఉంటుంది. బాగా ఆలోచిస్తే, ఏ కార్యమూ సులభసాధ్యం కాదు. కాని, చేసే నేర్పు ఉన్న వారికి ఏ కార్యమూ కష్టం కాదు. శ్రద్ధాసక్తులు అసాధ్యాన్ని సాధ్యం చేస్తాయి. ప్రారంభంలో

మారాం చేసినా, క్రమేణ సాధన దివ్యంగా శోభిస్తుంది. ఒక వైపు కర్మలలో నైపుణ్యము గోచరిస్తూ ఉంటుంది. మరో వైపు స్మరణము నిరాటంకంగా సాగుతూ ఉంటుంది.

శ్లో॥ పుంఖాను పుంఖ విషయేక్షణ తత్పరోపి
బ్రహ్మావలోక ధియం న జహాతి యోగీ
సంగీత తాళ లయ నృత్త వశం గతోపి
మౌళిస్థ కుంభ పరిరక్షణధీ ర్నటీవ ॥

రంగస్థలం పై నర్తకి జలపూర్ణ మైన చిన్న కుండను తలపై ఉంచుకొని హావ భావ విన్యాసాలను అభినయిస్తూ నాట్యం చేస్తూ ఉంటుంది. ఒక వైపు సంగీత, తాళ, లయ లను అనుసరిస్తూ నాట్యం చేస్తూనే, మరో వైపు తన తలపై ఉన్న జలపూర్ణ కుంభము పడి పోకుండా కాపాడుకుంటూనే నృత్యాన్ని కొనసాగిస్తూ ఉంటుంది.

అలాగే కర్మయోగి తన కళ్ళ ముందు కదిలే సమస్తాన్ని వీక్షిస్తూ, కరచరణాదులతో కర్మలను ఆచరిస్తూ ఉండినా, సదా పరమేశ్వరుని బుద్ధిలో స్మరించడము అనే కార్యాన్ని మాత్రం విడిచి పెట్టడు ***(న జహాతి)***. వృత్తులు మారుతున్నా ప్రవృత్తిలో మార్పు లేకుండా ఉంటాడు. ఇదే కర్మయోగ వైభవం.

కర్మయోగిలో నిరంతరం భగవత్స్మరణము, కర్మాచరణంలో స్వధర్మానుష్ఠానము నిండి ఉంటాయి. ధర్మాచరణ రూపంలో దైవారాధనము దివ్యంగా సాగుతూ ఉన్నందున, సర్వ కాలాలలో సర్వేశ్వర స్మరణం సాగిపోతూ ఉంటుంది. జీవితం లక్ష్య సిద్ధి వైపు సాగి ధన్య మౌతుంది. ఎందుకో తెలుసా? నిత్యస్మరణము అనే మహా యజ్ఞంలో అతని మనోబుద్ధులు సమిధలుగా సమర్పితా లయ్యాయి కనుక.

సర్వం ఈశ్వరార్పణం

అర్జునా! సర్వ కాలాలలో నన్నే అనుస్మరిస్తూ, నీ కర్తవ్య మైన యుద్ధాన్ని కూడా దైవారాధనగా చేస్తూ, నీ మనోబుద్ధుల్ని నా యందే అర్పించు అంటున్నాడు గీతాచార్యుడు ***(మయి వాసుదేవే అర్పితే మనో బుద్ధీ యస్య తవ సః త్వం మయి అర్పిత మనోబుద్ధిః సన్ మామేవ యథా స్మృతమ్, ఏష్యసి ఆగమిష్యసి*** - శ్రీ శంకర భాష్యము). అర్జునా! మనోబుద్ధులను నా యందే సమర్పించి, నన్ను ఏ విధంగా అయితే అనుస్మరిస్తున్నావో, ఆ రూపం లోనే నన్ను పొందుతావు అని ఆచార్యుల వ్యాఖ్య. భాగవతం ఏకాదశ స్కంధంలో భగవంతుడు తన లీలా శరీరాన్ని త్యజించే ముందు ఉద్ధవునికి ఈ సత్యాన్నే చెబుతాడు. ఉద్ధవా! విషయాలను చింతించే చిత్తానికి విషయాలే విషయ మౌతాయి. నన్నే అనుస్మరించు చిత్తానికి ***(మామనుస్మరత చిత్తం)*** నేనే విషయ మౌతాను. ఆ చిత్తం నా యందే ఉంటుంది అన్నాడు ***(మయ్యేవ ప్రవిలీయతే)***.

చిత్తాన్ని సమర్పించ మని ఉద్ధవునికి చెప్పినట్లు, ఇక్కడ కూడా మనస్సును సమర్పించ మని చెబితే సరిపోతుంది కదా! మనోబుద్ధుల్ని అర్పించ మనడం ఎందుకు? రెండూ ఒక్కటే కదా! మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము - కలిపే కదా అంతఃకరణము! అనే సంశయం సాధారణంగా కలుగుతుంది.

సంకల్పించేది మనస్సు. నిశ్చయించేది బుద్ధి. సంకల్ప నిశ్చయాలలో రాగద్వేషాలతో కూడిన అహంకారం తొంగి చూడకుండా ఈశ్వర భావనే స్ఫురించాలి. ఇది చాలా ప్రధాన మైన విషయం.

ఒక గొప్ప కార్యాన్ని నిర్వహించడానికి ముందు గొప్ప ఆలోచన ఉంటుంది. ఆలోచన మనస్సులో కలుగుతుంది. ఇంత గొప్ప ఆలోచన నాదే. నేనే చేశాను. నేనే చేయగలిగాను అనేది అహంకారము. అహంకారము నిండిన మనస్సు అచ్యుతుని ఎలా అనుస్మరిస్తుంది?

అలా కాక, ఈ విశిష్ట మైన సంకల్పము పరమేశ్వరుని అనుగ్రహంతో నా మనస్సులో స్ఫురించింది. ఇది ఈశ్వర సంకల్పం. ఈశ్వరాజ్ఞ. ఈ కార్యాన్ని నిర్వహించే భాగ్యం నాకు పరమేశ్వరుని చేత ప్రసాదించ బడింది. ఈ విధమైన భావన మనస్సులో కదిలితే, మనస్సును పరమేశ్వరునికి సమర్పించడం అవుతుంది.

మనస్సులో సంకల్పం జనించిన తరువాత, అది కార్యాచరణకు నోచుకోవాలి అంటే, బుద్ధి దానిని నిశ్చయించాలి. అలా నిశ్చయించే సందర్భంలో కూడా 'నేను' అనేది లేకుండా పరమేశ్వరుడే కర్త, నియంత, ప్రభువు, నేను ఆయన సేవకుణ్ణి, పనిముట్టును అనే భావనను కలిగి ఉంటే, బుద్ధిని పరమేశ్వరునికి సమర్పించినట్లు అవుతుంది. ఇదే **మయ్యర్పిత మనోబుద్ధిః** అంటే. సర్వ సంకల్పాలు సర్వేశ్వరార్పణం గావించడమే మనోబుద్ధులను పరమేశ్వరునికి సమర్పించడము.

సంకల్పాలు లేదా వృత్తులు ఎన్నున్నా, అవి రెండు విధాలు గానే ఉంటాయి. ఒకటి ఇదం వృత్తి, రెండవది అహం వృత్తి. 'ఇది' అని తెలియబడే దంతా ఇదం వృత్తి క్రిందికే వస్తుంది. 'నేను' అనే వృత్తి అహం వృత్తి. ఇదం వృత్తులను తెలుసుకొనేది అహం వృత్తి.

మనస్సుకు సంబంధించింది ఇదం వృత్తి. బుద్ధికి సంబంధించింది అహం వృత్తి. 'ఇదం' అంటే తెలియబడే జగత్తు. జగత్తు మనస్సుకు 'ఇదం'గా తెలుస్తూ ఉంది. జగత్తుగా తెలిసే 'ఇదం' జగదీశ్వరుడుగా తెలియాలి. కుండ 'ఇదం'గా మనస్సుకు తెలుస్తూ ఉండినా, అది మట్టిగా ఎలా విషయ మవుతుందో, అలాగే నామరూపాలతో నిండిన జగత్తు మనస్సుకు 'ఇదం'గా తెలుస్తూ ఉండినా, కుండలో మట్టి విషయ మైనట్లు, జగత్తులో పరమేశ్వరుడే విషయంగా తెలిసి రావాలి. ఈ కుండ లన్నీ మట్టే అని తెలిసినట్లు, ఈ జగత్తంతా ఈశ్వరుడే అనే స్ఫురణ కలగాలి **(బ్రహ్మ ఏవ ఇదం విశ్వం ఇతి)**. ఇలా జరిగితే, ఇంతవరకు మనస్సుకు 'ఇదం'గా తోచిన ప్రపంచం అదృశ్యమై, భగవంతుడే మనస్సుకు 'ఇదం'లో విషయ మౌతాడు. వాస్తవానికి విషయి అయిన పరమేశ్వరుడు, విషయముగా కూడా తానే సాక్షాత్కరింపబడి నపుడు, అట్టి 'ఇదం' రూప ఈశ్వరునికి మనస్సు నైవేద్యంగా సమర్పింప బడుతుంది. మనస్సును మాధవునికి సమర్పించడం అంటే ఇదే.

సంకల్పించే మనస్సుకు 'ఇదం' రూపంలో ఈశ్వరుడు దర్శనీయు డైనట్లు, నిశ్చయించే బుద్ధికి కూడా 'అహం' రూపంలో ఈశ్వర స్వరూపము అనుభూతిగా నిలవడం జరిగి నపుడు, బుద్ధి కూడా పరమేశ్వరునికి సమర్పించ బడుతాయి. మనోబుద్ధులు నీరాజన మవుతుంది. ఈ విధంగా మనోబుద్ధులు పరమేశ్వరునికి సమర్పించ బడుతాయి. మనోబుద్ధులు సంపూర్ణంగా పరమేశ్వరుని యందే సమర్పితమై నందున, అట్టి మనోబుద్ధులను కలిగిన పుణ్యాత్ముడు ఎవరిని చేరుతాడు? ఎవ్వరినీ చేరడు, పరమేశ్వరుని తప్ప. అందుకే అతడు నన్నే పొందుతాడు అంటున్నాడు భగవంతుడు **(మాం ఏవ ఏష్యసి ఆగమిష్యసి)**. అంతే కాదు, ఈ విషయంలో సందేహం అవసరం లేదు అని కూడా భరోసా ఇస్తున్నాడు **(అసంశయః న సంశయః అత్ర విద్యతే)**. ఇంతకన్నా ఏమి కావాలి? ఎంత భాగ్యవంతులో గీతా భక్తులు! మరి వారి తక్షణ కర్తవ్యం ఏమిటి? సాధనలో సాగి పోవడమే. సాధ్యాన్ని సిద్ధింప చేసుకోవడమే. అదెలా? చెబుతున్నాడు. విందాం.

అభ్యాస యోగయుక్తేన చేతసా నాన్యగామినా । 8
పరమం పురుషం దివ్యం యాతి పార్థానుచిన్తయన్ ॥

అభ్యాస యోగయుక్తేన-చేతసా-నాన్యగామినా
పరమం-పురుషం-దివ్యం-యాతి-పార్థ-అనుచింతయన్

పార్థ = అర్జునా!
అభ్యాస యోగయుక్తేన = అభ్యాస మనెడి యోగముతో కూడినది
న అన్యగామినా = ఇతర విషయముల యందు ప్రవర్తింపనిది
చేతసా = మనస్సు చేత
దివ్యం = దివ్యుడు
పరమం = ఉత్తముడు
పురుషం = పురుషుని
అనుచింతయన్ = స్మరిస్తూ
యాతి = (అతనినే) పొందుతాడు

అర్జునా! మనస్సు అభ్యాస యోగం లోనే ఉండాలి. పరమాత్మను విడిచి ఇతరత్ర పోకూడదు. పరమేశ్వరుణ్ణి తదేకంగా చింతించాలి. అలా చేస్తే, దివ్యమైన పురుషోత్తముని పొందుతారు.

వ్యాఖ్య

వెలుగులు ఆరిపోతే తిమిరాలు ముసురు కుంటాయి. స్మరణలు ఆగితే మనస్సును మాయాపొరలు కమ్ముకుంటాయి. దీపము లేని ఇంటి లోనే దొంగలు పడతారు. సాధకుడు నిరంతరం వెలుగులలో విహరించాలే గాని తిమిరాలలో తారాడ కూడదు.

అభ్యాసమే యోగం

నోరు దేని నైనా మ్రింగుతుంది. అలాగని విషం త్రాగిస్తామా? మనస్సు ఎక్కడి కైనా పోతుంది, ఎక్కడైనా ఉంటుంది. అలాగని ఎక్కడ పడితే అక్కడ ఉంచ వచ్చునా? ఉంచ కూడదు. ఉండనివ్వ కూడదు. తిన దగిందే నోటికి అందించినట్లు, ఉండదగిన చోటే మనస్సును ఉంచాలి. మనస్సు ఉండవలసిన చోటు, ఉండదగిన చోటు పరమేశ్వరుని సన్నిధానమే. అదొక్కటే మనస్సుకు వాసయోగ్య మైన చోటు. ***మయి ఈశ్వరే చిత్త సమర్పణ విషయ భూతే ఏకస్మిన్ తుల్య ప్రత్యయా వృత్తి లక్షణః*** - పరమేశ్వరుడు అనే ఒకే విషయానికి సంబంధించిన ఆలోచనలు నిరంతరం సాగుతూ ఉండాలి. అన్య విషయాలు ఈ ఆలోచనలకు అవరోధం కాకుండా ఉండాలి. ఇదే అభ్యాసము. ఈ అభ్యాసమే యోగము ***(స అభ్యాసః యోగః)***. ఇట్టి అభ్యాసముతో కూడిన చిత్తము అభ్యాస యోగయుక్తము.

అభ్యాసయోగము ఒక ప్రత్యేకమైన యోగము కాదు. కాని, ఏ యోగమైనా అభ్యాసం లేకుండా రాణించదు. ఈ విధంగా అన్ని యోగాలలో కలిసి, అన్నిటిని ప్రభావితం చేసే అభ్యాసము, యోగము కాని యోగమైంది. ఉప్పు కూర కాదు. కాని, ఉప్పు లేని కూర ఉండదు. ప్రతి కూరలో ఉప్పు ఉంటుంది. అన్ని పదార్థాలలో ఉప్పు ఉంటూ, పదార్థాలకు రుచిని కలిగిస్తుంది. అలాగని, ఉప్పు ఒక్కటే పదార్థం కాలేదు. అభ్యాసం కూడా అంతే.

మనస్సుకు దేని మీద ఆసక్తి ఉంటుందో, అదే మనస్సులో నిలుస్తుంది. అలా మనస్సులో స్థిరపడిన విషయం చుట్టే సంకల్పాలు తిరుగుతూ ఉంటాయి. అన్యమైన విషయాలు ఎన్నయినా ఉండొచ్చు. వాటి మీద మనస్సుకు ఆసక్తి లేని కారణంగా సంకల్పాలు అటు వైపు పోవు.

సర్వ కాలాలలో పరమేశ్వరుని అనుస్మరిస్తూ, తన కర్తవ్యమును ధర్మనిష్ఠతో ఆచరించే కర్మయోగి తన మనోబుద్ధులను పరమేశ్వరునికే సమర్పించి ఉన్నందున, అతని సంకల్పాలన్నీ ప్రవాహ రూపంలో పరమేశ్వరుని వైపే సాగుతూ ఉంటాయి. ఇదే సజాతీయ ప్రత్యయ ప్రవాహము.

విషయాంతర విహార శూన్యం

అభ్యాసయోగం ప్రవాహ రూపంగా సాగాలి. ఏ విధమైన అవరోధాలు ఆ ప్రవాహాన్ని అడ్డగించ కూడదు. అడ్డగించేది ఏదైనా అది విజాతీయ ప్రత్యయమై ఉంటుంది. పరమేశ్వరుని కన్నా అన్య మైనదై ఉంటుంది.

అది ఏదైనా అనిత్యమే. అనిత్యాల వైపు పరుగులు పెట్టే మనస్సు నిత్యత్వాన్ని పొందలేదు. కనుక ఈశ్వరుని విషయంలో నిరాటంకంగా సాగే సజాతీయ ప్రత్యయ ప్రవాహానికి విజాతీయ ప్రత్యయ రూపాలు అడ్డు తగలకుండా చూసుకోవాలి. వివేక బుద్ధి ద్వారా అనిత్యాలను విశ్లేషించుకొని, లక్ష్యాన్ని పదే పదే మననం చేసుకొంటూ ***(అనుచిన్తయన్)*** అభ్యాస యోగాన్ని కొనసాగించాలి. అంటే, విజాతీయ వృత్తి రహిత సజాతీయ వృత్తి ప్రవాహం నిరంతరం సాగే లాగ సాధకుడు శ్రద్ధ వహించాలి.

అనుధ్యానము

పూర్వ శ్లోకంలో మనం చూచిన అనుస్మరణమే ఇక్కడ అనుచింతనముగా చెప్ప బడింది. అనుచింతనము అంటే పరమేశ్వరునికి సంబంధించిన విషయాన్ని శాస్త్రవిధి ననుసరిస్తూ, ఆచార్యోపదేశమును ఔదల దాల్చి ధ్యానించడము అని అర్థము ***(అనుచిన్తయన్, శాస్త్రాచార్యోపదేశమ్ అనుధ్యాయన్ ఇతి)***. ఇదే అభ్యాస యోగ యుక్త చిత్తము. ఆత్మాకార వృత్తి తప్ప అన్యవృత్తులు లేని అఖండ చిత్తము. అట్టి చిత్తములో సాగే స్మరణము లేదా ధ్యానము కూడా అఖండం గానే ఉంటుంది. ఈ అభ్యాస మంతా ఈశ్వరుని సన్నిధి లోనే సాగుతూ ఉంటుంది. ఈ కారణం గానే ఆలయాలలో అఖండ దీపాన్ని వెలిగిస్తారు. దృశ్యాలు అనిత్యాలని తెలిసి, దృశ్య విషయాలను త్యజించి, ధ్యేయ రూపుడైన పరమేశ్వరుని యందే చిత్తము అఖండంగా నిలిచి ఉండటము అఖండ ధ్యానము.

అఖండ దీపము ఎలాగైతే అన్య విషయాలను ప్రకాశింప చేయకుండా పరమేశ్వరునే ప్రకాశింప చేస్తూ ఉందో, అలాగే అఖండ ధ్యానస్థితిలో చిత్తము అభ్యాసయోగ యుక్తమై పరమేశ్వరుని సన్నిధి లోనే ఉంటుంది గాని, అన్య విషయాల వైపు పయనించదు ***(నాన్య గామినా)***.

నాన్యగామి అంటే అన్య విషయాల వైపు గమించని చిత్తము ***(న అన్యత్ర విషయాన్తరే గన్తుం శీలం అస్య ఇతి నాన్యగామి, న అన్యగామి)***. అట్టి చిత్తము చేత పరమేశ్వరుని అనుస్మరించాలి. అనుసంధానం చేయాలి. అన్యగామి కాని చిత్తము చేత పరమేశ్వరుని ధ్యానిస్తే పరమేశ్వరుని పొందడం జరుగుతుంది. ఆ పరమేశ్వరుడు ఎలాంటి వాడో కూడా చెబుతున్నాడు. ఆయన దివ్యమైన వాడు. పరమ పురుషుడు. 'పరమం' అంటే నిరతిశయుడు, 'దివ్యం' అంటే ప్రకాశైక రూపుడు అని అర్థం. అట్టి దివ్యమైన పరమ పురుషుణ్ణి ఇతరత్ర చరించకుండా అభ్యాస యోగ యుక్తమై ఉన్న చిత్తము చేత అనుస్మరించే పుణ్యాత్ములు తప్పక అతనినే పొందుతారు.

ఎలాంటి లక్షణాలు కలిగిన పరమ పురుషుని పొందుతారో చెబుతున్నాడు.

కవిం పురాణ మనుశాసితార మణోరణీయాంస మనుస్మరేద్యః । 9
సర్వస్య ధాతార మచిన్త్యరూప మాదిత్యవర్ణం తమసః పరస్తాత్ ॥

కవిం-పురాణం-అనుశాసితారం-అణోః-అణీయాంసం-అనుస్మరేత్-యః
సర్వస్య-ధాతారం-అచిన్త్యరూపం-ఆదిత్యవర్ణం-తమసః-పరస్తాత్

కవిం = సర్వజ్ఞుడు
పురాణం = శాశ్వతుడు
అనుశాసితారం = నియంత
అణోః = అణువు కంటె
అణీయాంసం = సూక్ష్మమైన వాడు
సర్వస్య = సమస్తమునకు
ధాతారం = సృష్టికర్త
అచింత్యరూపం = ఊహింప శక్యము గాని రూపము గలవాడు
ఆదిత్యవర్ణం = సూర్య ప్రకాశము గలవాడు
తమసః = చీకటి కంటె
పరస్తాత్ = వేరైన వాడు

అర్జునా! ఆ పరమ పురుషుడు కవి. పురాతనుడు. శాసించే వాడు. అణువు కంటే చిన్నవాడు. సర్వానికి ఆధారమైన వాడు. ఊహకు అందని వాడు. ఆదిత్య రూపుడు. తమస్సుకు ఆవలి వాడు. అట్టి పురుషుణ్ణి స్మరించే వాడు అతణ్ణే పొందుతాడు.

వ్యాఖ్య

సత్యం మనకు అర్థం కావాలే కాని, మనకు అర్థమైనది సత్యంతో విభేదించ కూడదు. భగవంతుడు సత్యరూపుడు. జ్ఞాన స్వరూపుడు. అనంతుడు. ఇది సత్యం. శాస్త్ర ప్రతిపాదితం.

పరమేశ్వరుడు సృష్టికర్త. ఆ లోకంలో ఉంటాడు. ఈ లోకంలో ఉంటాడు. నమ్మితే రక్షిస్తాడు. నమ్మకపోతే శిక్షిస్తాడు. ఇవన్నీ మన అభిప్రాయాలు. ఊహాజనితాలు. వాస్తవాలు కావు. సత్యదూరాలు. ఇవి మన అనుభవంతో, యుక్తితో విభేదిస్తున్నాయి కనుక ఇక్కడ విచారమే కర్తవ్యం కావాలి. అది కూడా బుద్ధితో చేసే విచారం కాకుండా ప్రమాణ విచారంగా ఉండాలి. అప్పుడే సత్య మేమిటో తెలుస్తుంది. కనుక, సత్యరూపు డైన పరమేశ్వరుని ఎలా అర్థం చేసుకోవాలో, ఆయన దివ్యమైన లక్షణాలు ఏమిటో ఈ శ్లోకంలో వర్ణిస్తున్నాడు.

కవి

భగవంతుడు కవి. కవి అనగానే మన మనస్సులో కొన్ని ఆలోచనలు కదుల్తాయి. కవిత్వము చెప్పేవారు, కథలు వ్రాసేవారు, పద్యాలు రచించే వారు, పాటలు అల్లే వారు - వీరందరూ కవులు అనేది మన అభిప్రాయము. వారు కవులు కారని నేను అనడం లేదు. కాని, భగవంతుడు మనకు అర్థమయ్యే ఈ కవుల లాంటి వాడు అని భావిస్తే మాత్రం ప్రమాదం అంటున్నాను. అప్పుడు భగవంతుడు కూడా భావాన్వేషణలో పరుగు లెత్తేవాడు కావలసి వస్తుంది. భావాలు రాలేదని నిరాశతో నిరీక్షించే వాడు కావలసి వస్తుంది. ప్రత్యేకమైన కాలం కోసం, దేశం కోసం ప్రాకులాడే వాడు కావలసి వస్తుంది. కవి సమ్మేళనాలకు హాజరు కావలసి ఉంటుంది. సన్మానాలకై ఎదురు చూడవలసి ఉంటుంది. అలాంటి వాడు కవి కాగలడేమో కాని భగవంతుడు కాలేడు. భావాల వెంట భావాపేక్షతో, భావావేశంతో పరుగులు తీసేవాడు కాక, భావ చలనానికి ఆధారమైన చైతన్యమే భగవంతుడు. కనుక, భగవంతుడు ఎలాంటి కవీశ్వరుడో ప్రమాణం ద్వారానే గ్రహించాలి.

భగవంతుడు కవి. కవి అంటే క్రాంతదర్శి. సర్వజ్ఞుడు ***(కవిం క్రాన్త దర్శినం సర్వజ్ఞం).*** అంటే త్రికాలజ్ఞుడు. మూడు కాలాలకు సంబంధించిన పూర్ణ జ్ఞానం కలవాడు. 'క్రాంతం' అంటే అతీతము. క్రాంతదర్శి అంటే అన్నిటికీ అతీతమైన దృష్టి కలవాడు. నేడున్నవే మనస్సుకు తెలుస్తాయి. గతంలో ఉన్నవి తెలియవు. భవిష్యత్తులో ఉండబోయేవి అర్థం కావు. పరమేశ్వరుడు మనస్సు కాదు. మనస్సుకు ఆధారమైన వాడు. ఊహలకు ఆలంబనమైన వాడు. అందరి ఊహలకు, అన్ని కాలాల లోని వ్యక్తుల సంకల్పాలకు ఆయనే ఆశ్రయము. కనుక నేడున్నవి ఆయనకు తెలుసు. గతంలో ఉండినవి, భవిష్యత్తులో ఉండబోయేవి కూడా తెలుసు. అందుకే, భగవంతుడు సర్వజ్ఞుడు. క్రాంతదర్శి. కవి.

పరమేశ్వరుని వంటి కవిని మరొకరిని చూడలేము. ఊహించలేము కూడా. పరమేశ్వరుని వంటి కవి మరొకడు ఉంటే, ఆ ఇరువురూ మానవుల వంటి మామూలు కవులు అవుతారే గాని, వారిలో ఏ ఒక్కడూ భగవంతుడు కాలేడు. సర్వజ్ఞుడు ఒక్కడే గాని రెండుగా తెలియడు. కనుకనే సర్వదృక్ చైతన్యంగా శోభించే పరమేశ్వరుని వంటి కవి మరొకడు ఉండలేడు అన్నది ఉపనిషత్తు. ***నాన్యతోఽస్తి ద్రష్టా*** - పరమేశ్వరుని వంటి సర్వద్రష్ట మరొకడు లేడు అన్నది బృహదారణ్య కోపనిషత్తు.

పురాణుడు

కవి అయిన భగవంతుడు పురాణుడు. అంటే చిరంతనుడు, పురాతనుడు **(పురాణమ్ చిరంతనమ్, పురాతనమ్).** అంటే సదా ఉండేవాడు. కాలానికి అతీతమైన వాడు. పురాణ శబ్దార్థం భగవంతుడు అంటే ఏమిటో చక్కగా మన హృదయానికి పట్టిస్తుంది.

పురా పూర్వస్మిన్ భూతం ఇతి పురాణమ్ - పూర్వము ఉన్నది కనుక పురాణము అనేది ఒక అర్థం. ఈ అర్థాన్ని అనుసరించి చూస్తే, భగవంతుడు పూర్వం ఉన్నవాడు అవుతాడు. అంటే, ఇప్పుడు లేనివాడు అనే అర్థం వస్తుంది. పూర్వం ఉన్నవారు ప్రస్తుతం లేరు. పూర్వం ఉన్నవి నేడు కనిపించడం లేదు. కారణం, అవన్నీ కాలగతాలు. పరమేశ్వరుడు కూడా కేవలం పూర్వం ఉన్నవాడే అయితే, నేడు లేనివాడు అవుతాడు. అందరి లాగే అనిత్యుడు అవుతాడు. కనుక, భగవంతుని **పురాభవమ్** అనే అర్థంతో చూడ కూడదు.

పురాఽపి నవం ఇతి పురాణం - పురాతనమైనా నిత్య నూతనంగా భాసించేది పురాణము. పూర్వం ఉన్నవి ఏవైనా అవి కాలంలో కళావిహీన మౌతాయే గాని నిత్యనూతనంగా ఉండలేవు. అలా ఉండటం భగవంతుని కొక్కనికే సాధ్యం. ఎందుకో తెలుసా! ఆయన కాలానికి పరిమితుడు కాడు **(కాలేన అపరిచ్ఛిన్నత్వాత్).** అందుచేత కాలాతీతుడైన తాను అన్ని కాలాలలో దివ్యంగా ప్రకాశిస్తాడు. ఇలా మరొకరు ఉండే అవకాశం లేదు కనుక, పురాతనాల కన్నా అతడు పురాణుడు. కనుక సమస్తాన్ని శాసించ గలడు.

అనుశాసితారుడు

అనుశాసితారమ్ అంటే సమస్త విశ్వాన్ని శాసించే వాడు అని అర్థము **(సర్వస్య జగతః ప్రశాసితారమ్).** పరమేశ్వరుడు నియంత. విశ్వం లోని నియతిని ఏర్పరచింది తానే. జగత్తులో శాంతిభద్రతలు తన మీదే ఆధారపడి ఉన్నాయి. ఆయన ప్రభువు. ధర్మరూపుడు. విశ్వం ఏ ధర్మాలపై ఆధారపడి కొనసాగుతూ ఉందో, అట్టి ధర్మరూపంలో తానే ఉన్నాడు. బాహ్యాభ్యంతరాలలో ఉండి, అటు విశ్వాన్ని, ఇటు వ్యక్తిని శాసిస్తున్నాడు.

భీషాఽస్మాద్వాతః పవతే - భగవంతునికి భయపడి గాలి ప్రపంచంలో వీస్తూ ఉంది అని తైత్తిరీయోపనిషత్తు ఆనంద మీమాంసలో ప్రవచించింది. ఏ పరమేశ్వరుడు విశ్వంలో వాయువును శాసిస్తున్నాడో, అతడే వ్యక్తిలో ప్రాణాన్ని శాసిస్తున్నాడు.

భీషోదేతి సూర్యః - పరమేశ్వరునికి భయపడి సూర్యుడు ఉదయిస్తున్నాడు. బాహ్యంలో వేడికి, వెలుగుకు కారణమైన సూర్యదేవుని శాసిస్తున్న భగవంతుడే వ్యక్తిలో వేడికి, వెలుగుకు కారణమై ఉన్నాడు. సర్వ ధర్మాలు అతని అధీనం లోనే ఉన్నాయి. అలాంటి అనంత శక్తిమంతుడు సర్వవ్యాపిగా ఉంటాడు. సూక్ష్మరూపుడై ఉంటాడు.

సూక్ష్మాతి సూక్ష్మం

అన్నిటి కంటే సూక్ష్మ మైనది పరమాణువు. దాని కంటే భగవంతుడు సూక్ష్మమైన వాడు. కనుక ఆయన అణువు కన్నా సూక్ష్మమైన వాడుగా కీర్తింప బడ్డాడు **(అణోః సూక్ష్మాత్ అపి, అణీయాంసం సూక్ష్మతరమ్).** సమస్త అణువణువులో సూక్ష్మరూపంతో అతడే వ్యాపించి ఉన్నాడు కనుక, సమస్తానికి ఆధారమైన వాడు తానే. సమస్త భూతాలకు ఆకాశం ఆధారము. అట్టి ఆకాశానికి కూడా ఆధారమైన వాడు కనుక ఆయన సర్వాధారుడు.

సర్వాధారుడు

సమస్తానికి ఆధారమైన వాడు. సమస్తాన్ని ధరించే వాడు. సర్వాన్ని పోషించే వాడు. సర్వమును సంరక్షించే

వాడు. చలనచిత్రాలకు తెర ఆధార మైనట్లు, సమస్త విశ్వానికి ఆధారభూతుడు. ప్రాణులకు కర్మఫలాన్ని అనుగ్రహించే వాడు.

అచింత్య రూపుడు

ఊహలకు అందని రూపము కలవాడు. ఆలోచించడానికి వీలు లేనివాడు. అతనిని ఎవ్వరూ చింతించ లేరు. మరి, లేని దానిని కూడా చింతించడం సాధ్యపడదు కదా! పరమేశ్వరుడు కూడా చింతింప బడడు అంటే ఆయన కూడా లేనివాడే నేమో! అనే సందేహం కలుగవచ్చు.

ఈ విధమైన సందేహానికి అవకాశం లేకుండా, ఇంద్రియ మనస్సులకు అందని పరమేశ్వరుడు బుద్ధి చేత గ్రహింప బడుతాడు ***(బుద్ధిగ్రాహ్య మతీంద్రియమ్)*** అని ఆరవ అధ్యాయం లోనే చెప్పడం జరిగింది. ప్రస్తుత శ్లోకంలో కూడా ***అనుస్మరేత్*** అంటూ స్మరించ దగినవాడు అని స్ఫురింప చేస్తున్నాడు కనుక, మనస్సు చేత చింతించడానికి వీలుపడని వాసుదేవుడు బుద్ధి వృత్తి చేత, జ్ఞానవృత్తి చేత, అఖండ బ్రహ్మాకార వృత్తి చేత, ఏకభావ అవగాహినీ వృత్తి చేత తెలియ బడుతాడు అని అర్థము.

ఆదిత్య రూపుడు

అచింత్య రూపుడు అంటే రూపం లేని వాడు అనుకుంటారేమో! కాదు, కాదు. తనదైన ప్రత్యేక రూపము కలవాడు అని అర్థం. అదే ఆదిత్య రూపం. అంటే సూర్యుని వంటి రూపము కలవాడు. సూర్యుడు ఏ విధంగా ప్రకాశరూపుడో, పరమేశ్వరుడు కూడా అలాగే ప్రకాశైక స్వరూపుడు ***(ఆదిత్యస్య ఏవ నిత్య చైతన్య ప్రకాశః వర్ణః యస్య తమ్ ఆదిత్యవర్ణమ్).*** అలాగని, ప్రకాశం లేని వాటిని ప్రకాశింప చేసే కర్తవ్యము కలవాడు అని అర్థం చేసుకో కూడదు. సూర్యుడు తనకు తానుగా ప్రకాశిస్తూ ఉంటే, తన వెలుగులో సమస్తము ఎలాగైతే ప్రకాశిస్తూ ఉందో, అలాగే పరమేశ్వరుని ప్రకాశములో విశ్వమంతా ప్రకాశిస్తోంది ***(తస్య భాసా సర్వమిదం విభాతి)*** అని గ్రహించాలి.

మాయాతీతుడు

తమస్సు అంటే చీకటి. ***పరస్తాత్*** అంటే వేరైన వాడు, లేక అవతల ఉన్నవాడు అని అర్థము. చీకటి అనేది అజ్ఞాన లక్షణము. అజ్ఞాన లక్షణమైన మోహ మనే అంధకారానికి అతీతుడు ***(అజ్ఞాన లక్షణాత్ మోహాన్ధకారాత్ పరం)*** అని అర్థము.

చీకటిలో ఏదీ కనిపించదు. కారణం, వెలుగు లేకపోవడమే. వెలుగు ఎక్కడ లేదు? బాహ్యంలో లేదు. బాహ్యంలో అంతేగాని, వెలుగు అసలే లేకుండా పోలేదు. వెలుగు లేకపోతే చీకటి ఉందని తెలిసిం దెవరికి? వెలుగు లేని కారణంగా చీకటి అలుముకున్నా, అలా చీకటి ఉంది అని మనకు తెలియడానికి మనలోని వెలుగే కారణము. అదే ఆత్మ చైతన్యము. ఆత్మయే బ్రహ్మము. కనుక, అజ్ఞానాంధకారానికి అతీతంగా చైతన్య జ్యోతి దివ్యంగా ప్రకాశిస్తోంది. అది తమస్సుకు పరమైనది. స్వప్రకాశ మైనది. సమస్తానికి పరమైన అట్టి పరబ్రహ్మమునకు పరమైనది మరొకటి లేదు ***(యస్మాత్ పరం న అపరం అస్తి కించిత్).***

పురాణ పురుషుడైన కవి నుండి ఆదిత్య రూపుడైన పరబ్రహ్మము వరకు, ఇంతదాకా మనం చూచిన లక్షణా లన్నీ అద్భుత మైనవి. ఈ లక్షణాలపై నిదిధ్యాసనం చేసిన వాడు బ్రహ్మమునే పొందుతాడు. వేదంలో అనేక చోట్ల ఈ లక్షణాలు మంత్రరూపంలో కనిపిస్తాయి.

వేదాహ మేతం పురుషం మహాన్తం ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్
తమేవ విదిత్వా అతిమృత్యుమేతి నాన్యః పంథా విద్యతేఽ యనాయ ॥

అన్నది ఉపనిషత్తు. బ్రహ్మమును తెలుసుకున్న వాడు మృత్యువును దాటి పోతున్నాడు అని మంత్రం స్పష్టం చేస్తూ ఉంది. అంటే, అమృతత్వమును పొందుతున్నాడు అని అర్థం. మోక్షానికి మరో మార్గాన్ని శ్రుతి అంగీకరించడం లేదు. పరమేశ్వరుడు జ్ఞానరూపంలో ఉన్నందున ఆయనను తెలుసుకోవడానికి జ్ఞానమే ఏకైక మార్గము.

తమస్త దాసీత్ గహనం గభీరం యస్తస్య పారేఽ భివారజతే విభుః - మాయా తిమిరానికి ఆవల ప్రకాశించు వానిని స్మరిస్తాను అని వ్యాస భాగవతము. **పెంజీకటి కవ్వల నెవ్వం డేకాకృతి వెలుగు నతని నే సేవింతున్ -** అని పోతనామాత్యుని ఆంధ్ర భాగవతము.

ప్రస్తుత శ్లోకంలో అష్ట లక్షణాలతో స్పష్టంగా భాసిస్తున్న పరమేశ్వరుణ్ణి **అనుస్మరేద్యః** - ఎవరైతే స్మరిస్తున్నాడో అని మాత్రమే ఉంది. మరి, స్మరించిన వాడు ఏమౌతాడు? దానికి సంబంధించిన క్రియాపదము శ్లోకంలో లేదు. ఎవడు బ్రహ్మమును స్మరించు చున్నాడో వాడు బ్రహ్మమునే పొందుతాడు అని పూర్వ శ్లోకంతో అన్వయించుకోవాలి. ***తమ్ అనుచిన్తయన్ యాతి*** - అతనిని అనుస్మరించే వాడు అతనినే పొందుతాడు అని గడచిన శ్లోకంలో ఉన్న దానితో ఈ శ్లోకానికి ఉండే సంబంధాన్ని గుర్తించాలి ***(యాతి ఇతి పూర్వేణైవ సంబంధః).*** ప్రస్తుత శ్లోకంలో **అనుస్మరేద్యః** అన్నదే పూర్వ శ్లోకంలో **అనుచిన్తయన్**, అంటే అనుస్మరణమే అనుచింతనము. ఇది శాస్త్రాన్ని, గురుబోధను అనుసరించి గ్రహించ వలసిన జ్ఞాన విషయము.

పరమాత్మను స్మరించ వలసిన విధానాన్ని వివరించిన తరువాత ప్రయాణ కాలంలో అనుసరించ వలసిన సాధన విషయాన్ని స్పష్టం చేస్తున్నాడు.

ప్రయాణకాలే మన సాఽచలేన భక్త్యా యుక్తో యోగబలేన చైవ । 10
భ్రువోర్మధ్యే ప్రాణ మావేశ్య సమ్యక్ స తం పరం పురుష ముపైతి దివ్యమ్ ॥

ప్రయాణకాలే-మనసా-అచలేన-భక్త్యా-యుక్తః-యోగబలేన-చ-ఏవ
భృవోః-మధ్యే-ప్రాణం-ఆవేశ్య-సమ్యక్-సః-తం-పరం-పురుషం-ఉపైతి-దివ్యం

ప్రయాణకాలే	=	మరణ కాలమున	ఆవేశ్య	=	నిలిపి
అచలేన	=	చలనము లేని	తం	=	ఆ పురుషుని
మనసా	=	మనస్సుతో	యః	=	ఎవడు
భక్త్యా	=	భక్తితో	అనుస్మరేత్	=	స్మరిస్తాడో
యోగబలేన చ ఏవ	=	యోగబలముతో	సః	=	అతడు
యుక్తః	=	కూడినవాడు	దివ్యం	=	దివ్యుడు
భ్రువోః మధ్యే	=	భ్రూమధ్యము నందు	పరం	=	సర్వోత్తముడు
ప్రాణం	=	ప్రాణమును	పురుషం	=	పురుషుని
సమ్యక్	=	నిలకడగా	ఉపైతి	=	పొందుతున్నాడు

అర్జునా! మరణ సమయంలో మనస్సు నిశ్చలంగా ఉండాలి. భక్తి భావంతో ఉండాలి. యోగ బలంతో ఉండాలి. భ్రూమధ్యంలో ప్రాణాలను చక్కగా నిలపాలి. దివ్యమైన పరబ్రహ్మమును పొందాలి.

వ్యాఖ్య

జీవ యానము

మరణం అంటే ఏదో కాదు, మార్పే మరణం. ప్రపంచంలో మనకు గోచరించే దంతా మార్పే. అలాగే, మన దేహంలో కూడా నిరంతరం మార్పులు జరుగుతూనే ఉన్నాయి. వాస్తవం చెప్పాలంటే, నిమిషాలు కాదు కదా, కనీసం కొన్ని క్షణాలైనా మనలో ఏ మార్పు లేకుండా ఉండటం సాధ్యం కాదు. నిరంతరం మార్పు జరుగుతూనే ఉన్నా, ఆ జరిగే మార్పు మనకు తెలియకుండానే జరిగిపోతూ ఉంది. మనలో జరిగే మార్పుని ఇతరులు గుర్తించి చెప్పినపుడు, అవునా, నిజమేనా! అని ఆశ్చర్యపోతూ ఉంటాము. మనలో జరిగే ఈ పరిణామాన్ని మనమే గుర్తించలేక పోవడానికి కారణ మేమిటో తెలుసా? మార్పు చెందనిది కూడా మనకు అర్థం కాకుండా మన లోనే ఉండటం. ఒక విధంగా చెప్పాలంటే ఇటు జీవితాశకు, అటు మరణ భయానికి, రెండిటికి ఇదే కారణము. చావు అనగానే ఎవరైనా భీతి చెందుతారు. అవినాశి యైన జీవస్వరూపము నశించే పాంచభౌతిక దేహంతో తాదాత్మ్యం చెందడమే ఈ మరణభయానికి, మహాభయానికి కారణము. మరణం భయకారణం కాదు. మరణానికి సంబంధించిన జ్ఞానం లేకపోవడమే భయ కారణము. మరణం అనేది శిక్ష కాదు. అదొక శిక్షణ.

మరణంలో ఏ నష్టమూ లేదు. అక్కడ జరిగే దంతా కేవలం మార్పే. ఒక దేశ కాల పరిధి నుండి మరొక దేశ కాల పరిధి లోకి ఇల్లు మారినట్లు మారడమే మరణంలో జరుగుతూ ఉంది. ఒకే ద్వారం గుండా వ్యక్తి విశ్వం లోకి ప్రవేశించి ఉండొచ్చు. అలాగని ఒకే ద్వారం గుండా నిష్క్రమించాలనే నియమ మేమీ లేదు. మనం ఈ ప్రపంచం నుండి నిష్క్రమించడానికి చాలా ద్వారా లున్నాయి. ఏ ద్వారం నుండి ఎవరు నిష్క్రమిస్తారు? అలా దేహం నుండి నిష్క్రమించిన తరువాత ఏయే మార్గాలలో పయనిస్తారు? ఎక్కడెక్కడికి చేరుతారు? మొదలైన ఆసక్తికర మైన విషయాలను ఇక ఈ అధ్యాయంలో చూడబోతాము.

ఇంతవరకు 'మరణ సమయంలో సాధకుడు' అనే విషయాన్ని విస్తారంగా విమర్శించి విశ్లేషించుకున్నాం. మరి, మరణ సమయంలో యోగులు స్వచ్ఛందంగా మరణించడం కూడా ఉంది. అంటే, ప్రాణం పోయే సమయంలో అవసర మని భావిస్తే, ప్రాణ నిష్క్రమణాన్ని ఆపి, తన అభీష్టానికి అనువైన కాలంలో యోగి ప్రాణాన్ని త్యజిస్తాడు. అదే స్వచ్ఛంద మరణము. ఇది సామాన్యులకు సాధ్యమయ్యే విషయం కాదు. యోగబలం కలవారే దానికి అర్హులు. యోగబలం గల యోగి మరణ సమయంలో ***(ప్రయాణ కాలే మరణకాలే)*** నిశ్చలమైన మనస్సు కలవాడై ***(మనసా అచలేన చలన వర్జితేన)*** భక్తితో, యోగబలంతో కూడిన వాడై ***(భక్త్యా యుక్తః యోగస్య బలం యోగబలం, తేన చ యుక్తః)***, భ్రూమధ్యంలో ప్రాణమును నిలిపిన వాడై ***(భ్రువోః మధ్యే ప్రాణమ్ ఆవేశ్య స్థాపయిత్వా)***, ఏమరుపాటు లేని వాడై ***(సమ్యక్ అప్రమత్తః సన్)***, పూర్వ శ్లోకంలో మనం చూచిన *కవిం, పురాణం* మొదలైన లక్షణాలు గల ఆ దివ్యపురుషుని పొందుతాడు.

చిత్త నైశ్చల్యము

మరణ కాలంలో యోగి యొక్క మనస్సు నిశ్చలంగా ఉంటుంది. గాలి లేని చోట దీపం లాగా చలన రహితంగా ఉంటుంది. యోగ సాధనలో దేనిని సాధించాలన్నా మనస్సే ప్రధానమై ఉంటుంది. ***మనసైవాఽను ద్రష్టవ్యమ్*** - నిశ్చలమైన మనస్సు చేతనే పరతత్త్వాన్ని దర్శించ వలసి ఉంటుందని ఉపనిషత్తు కూడా ప్రవచించింది. [illegible] మనస్సు చలిస్తే, ముఖ్యంగా మరణ సమయంలో, యోగం పట్టు తప్పుతుంది.

[illegible] మనస్సు ప్రియంగా ఉండాలి. అసంతృప్తి లేని మనస్సే నిశ్చలంగా ఉంటుంది. ధ్యానం లోనే మనస్సు

నిశ్చలంగా ఉండటం అవసరం. ఇక మరణ సమయంలో చలిస్తే ప్రయోజనం ఉంటుందా? మరణ సమయంలో పరమేశ్వరుని అనుస్మరించడానికి మనస్సు నిశ్చలంగా ఉండాలి అంటే, పరమేశ్వరునిపై అచంచల మైన భక్తి ఉండాలి. ఆసక్తి లేని చోట, ప్రియత్వం లేని చోట మనస్సు నిశ్చలంగా ఉండలేదు. పరమేశ్వరుని యందు పరమ ప్రియత్వమే భక్తి కనుక, యోగికి నిశ్చలమైన మనస్సు, అకుంఠిత మైన భక్తి ఉండి తీరాలి.

పరాభక్తి

పరమేశ్వరుని యందు ప్రగాఢమైన ప్రేమను, ఆసక్తిని కలిగి ఉండటమే భక్తి. **సా పరానురక్తి రీశ్వరే** - పరమేశ్వరుని యందు దృఢమైన ప్రేమానురక్తి కలిగి ఉండటమే భక్తి అని శాండిల్య మహర్షి భక్తిసూత్ర ప్రబోధము.

భగవంతుని కన్నా వేరుగా మరొక దానిపై ఆసక్తి ఉంటే, అది భక్తి విషయంలో విఘ్న కారక మౌతుంది. కనుక, పరమేశ్వరుని కన్నా అన్యమైన వన్నీ ఎలా అనిత్యాలో విశ్లేషించుకొని, పొందదగిన వాడు పరమేశ్వరు డొక్కడే అని నిర్ణయించుకొని, అందుకు ఏకైక సాధన మైన భక్తినే పొందాలి ***(తదేవ సాధ్యతామ్)*** అనే దృఢ నిశ్చయంతో భక్తి చేయాలి. భక్తులు పరమేశ్వరుని యందు స్థిరమైన ప్రియత్వాన్ని కలిగి ఉంటారు కనుక, విఘ్న పాలకుల శిరస్సుల మీద పాదం మోపి చరిస్తూ ఉంటారు అన్నది మహా పురాణము. అలా విఘ్నాలను, మరణాన్ని సైతం శాసించే వాడు యోగి. భక్తుడైన యోగి. చిత్త నైశ్చల్యము, పరాభక్తి కలిగిన పరమయోగి.

తథా న తే మాధవ తావకాః క్వచిద్భ్రశ్యన్తి మార్గాత్త్వయి బద్ధ సౌహృదాః।
త్వయాఽభి గుప్తా విచరన్తి నిర్భయా వినాయకానీ కపమూర్ధసు ప్రభో॥

'ప్రభో! మాధవా! నీ భక్తులకు నీ యందు ప్రియత్వము స్థిర మైనది. కనుక, నీ భక్తులు దారి తప్పి భ్రష్టులు కారు. వాళ్ళకు నీవే రక్షకుడవు కనుక, విఘ్నాలను పాలించే వారి శిరస్సుల మీద నిర్భయంగా తిరుగుతూ ఉంటారు' అని భక్తుల వైభవాన్ని మహాపురాణం దివ్యంగా వర్ణించింది.

యోగబలం - ప్రాణావేశ్యం

నిశ్చలమైన చిత్తము, అచంచల మైన భక్తి కలిగి ఉన్నప్పటికి, దారుణమైన మరణకాలంలో బుద్ధి విచలిత మయ్యే ప్రమాదాన్ని నిరాకరించ లేము. అలాంటి క్లిష్ట సమయంలో కాలు జారిన వాడు, గోడనో లేదా స్తంభమునో పట్టుకొని, దాని సహాయంతో పడకుండా నిలిచినట్లు, మరణ సమయంలో యోగి యోగబలం చేత నిలబడాలి.

యోగబలం చేత స్థిరత్వమును పొందిన యోగి, ప్రాణాన్ని భ్రూమధ్యంలో నిలుపుతాడు. అంటే, విషయాంతర వృత్తి నిరోధము చేత చిత్తమును అంతర్ముఖం చేసి పరమేశ్వరుని యందే స్థిరంగా నిలపడం. దీనినే ధారణగా అభివర్ణించింది యోగ శాస్త్రము.

సూ॥ దేశ బన్ధ చిత్తస్య ధారణా - చిత్తమును ***(చిత్తస్య)*** ప్రదేశము నందు నిలపడం ***(దేశ బన్ధః)*** ధారణ ***(ధారణా)*** అని పతంజలి యోగదర్శనము - విభూతి పాదము.

ధారణకు ఇక్కడ భ్రూమధ్య ప్రదేశము సూచింప బడింది. హృదయ పద్మము నందు, నాసికాగ్రము నందు, జిహ్వాగ్రము నందు - ఇలా అనేక ప్రదేశాలలో నిలపడం వ్యవహారంలో ఉంది. గీతాచార్యుడు ప్రత్యేకించి ధారణ ప్రదేశంగా భ్రూమధ్యాన్ని సూచించాడు. మనకు ఏదైనా స్మృతికి రానపుడు చూపుడు వేలును, బొటన వేలును భ్రూమధ్యం మీద ఉంచి నొక్కుతాము. ధారణకు అది అనువైన ప్రదేశము కావడమే అలా నొక్కడం లోని ఉద్దేశ్యము.

హృదయము నుండి బహిర్గత మయ్యే ఇడ - పింగళ నాడులను నిరోధించి, హృదయము నుండి ఊర్ధ్వంగా పయనించే సుషుమ్న నాడి ద్వారా హృదయం లోని ప్రాణాన్ని కంఠం వద్దకు చేర్చి, అక్కడ వ్రేలాడుతున్న చిరునాలుక గుండా భ్రూమధ్యమునకు చేర్చి అంటే, కనుబొమ్మల మధ్య స్థిరంగా ఉంచి ***(సమ్యక్ స్థాపయిత్వా)***, ఆ తరువాత ఊర్ధ్వంగా పయనింప చేసి బ్రహ్మరంధ్రము ద్వారా నిష్క్రమించి, యోగి దివ్యమైన పరమ పురుషుణ్ణి పొందుతాడు. ఇది యోగి యొక్క పరమ నిర్యాణము.

భీష్ముడు కూడా ప్రాణ సంచారాన్ని నిరోధించి, మరణాన్ని తన అదుపులో ఉంచుకున్నాడు. కృష్ణా! ఈ కళేబరాన్ని త్యజించడానికి నాకు ఆజ్ఞ ఇవ్వు ***(అనుజానీ హి మాం కృష్ణ మోక్ష్యే కళేవరమ్)***. నీ ఆజ్ఞతో ఈ దేహాన్ని త్యజించి పరమగతిని పొందుతాను ***(త్వయాஉహం సమనుజ్ఞాతో గచ్ఛేయం పరమాం గతిమ్)*** అన్నాడు భీష్ముడు. అలాగే స్వచ్ఛందంగా ప్రాణాన్ని విడిచి పెట్టేశాడు. ఇదే స్వచ్ఛంద మరణం. ఉత్తమ యోగి పుంగవులకే సాధ్యం.

శ్వాసను లోనికి తీసుకున్న తరువాత, తిరిగి దానిని బహిర్గతం చేయకుండా లోపలే నిలిపి, హృదయంలో పూరింపబడిన ప్రాణాన్ని సుషుమ్న నాడి ద్వారా ఊర్ధ్వంగా కంఠ ప్రదేశానికి నడిపి, అక్కడ నుండి ఉన్నతంగా పంపి, భ్రూమధ్యంలో స్థిరంగా నిలిపి, ఆ తరువాత సహస్రారం నుండి, అంటే బ్రహ్మరంధ్రం ద్వారా నిష్క్రమింప చేయడం స్వచ్ఛంద మరణం. యోగి ప్రాణాన్ని ఇలా త్యజిస్తాడు. అలా త్యజించిన వాడు పరమగతిని పొందుతాడు. ***యోగేన అంతే తనుత్యజామ్*** - చివరగా యోగబలం చేత దేహాన్ని చాలించాలి అన్నాడు రఘు వంశంలో కాళిదాసు.

ఇక్కడ ప్రాణ శబ్దానికి అర్థం చిత్త మని, దృష్టి అని కొందరు గ్రహిస్తారు. అలా గ్రహించిన వారు భ్రూమధ్యంలో ధారణ చేయడ మంటే, దృష్టి నిలపడ మని, మనస్సును స్థిరపరచడ మని భావిస్తారు.

దివ్యమైన పరమ పదము ఎలాంటిదో చెబుతున్నాడు.

య దక్షరం వేదవిదో వదన్తి విశన్తి య ద్యతయో వీతరాగాః ।
య దిచ్ఛన్తో బ్రహ్మచర్యం చరన్తి తత్తే పదం సంగ్రహేణ ప్రవక్ష్యే ॥ 11

యత్-అక్షరం-వేదవిదః-వదంతి-విశంతి-యత్-యతయః-వీతరాగాః
యత్-ఇచ్ఛంతః-బ్రహ్మచర్యం-చరంతి-తత్-తే-పదం-సంగ్రహేణ-ప్రవక్ష్యే

వేదవిదః	=	వేదవేత్తలు	ఇచ్ఛంతః	=	కోరుతూ
యత్	=	దేనిని	బ్రహ్మచర్యం	=	బ్రహ్మచర్యమును
అక్షరం	=	అక్షరమని	చరంతి	=	అవలంబిస్తున్నారో
వదంతి	=	చెబుతున్నారో	తత్	=	అట్టి
వీత రాగాః	=	రాగమును విడిచిన	పదం	=	స్థానమును
యతయః	=	యతులు	తే	=	నీ కొరకు
యత్	=	దేనిని	సంగ్రహేణ	=	సంగ్రహముగ
విశంతి	=	చేరుతున్నారో	ప్రవక్ష్యే	=	వివరంగా చెబుతున్నాను
యత్	=	దేనిని			

అర్జునా! పరమపదం ఏమిటో నీకు సంగ్రహంగా చెబుతాను. వేదవిదులు దానిని అక్షరం అంటారు. రాగరహితులైన యతి పురుషులు దాని లోనే ప్రవేశిస్తారు. దానిని ఆశించే బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ ఉంటారు.

వ్యాఖ్య

మరణాన్ని ఎలా మంగళకరంగా మార్చుకోవాలో ఇంతవరకు వివరించిన వాసుదేవుడు, ప్రతీక మనే ఉపాయంతో ఇక వివరించ బోతున్నాడు. బ్రహ్మవాచక మైన ఓంకారమునే ఇక్కడ ప్రతీకంగా ఉపదేశిస్తున్నాడు.

అక్షర స్వరూపము

ధ్యాన సమయాన ఏదో ఒక నామము చేత పరమేశ్వరుని అనుస్మరించడం జరగాలి కనుక, అట్టి అభిధానము శ్రుతి ప్రతిపాదిత మైన ఓంకారమే అని ప్రమాణమును ప్రదర్శిస్తున్నాడు.

వేదార్థ జ్ఞానము నెరిగిన వేదవేత్తలు ఓంకారమును అక్షరంగా వర్ణించారు ***(న క్షరతి ఇతి అక్షరం అవినాశి)***. నాశరహిత మైన ఓంకారమును బ్రహ్మముగా అభివర్ణించారు. ఈ విషయాన్ని బృహదారణ్యక శ్రుతి ప్రతిపాదించింది.

తద్వా ఏతదక్షరం గార్గి బ్రాహ్మణా అభివదన్తి - ఓ గార్గీ! అట్టి బ్రహ్మమునే బ్రహ్మవిదులు అక్షరం అంటున్నారు. ***అస్థూలం అనణు*** - అది స్థూలము కాదు, సూక్ష్మమూ కాదంటూ సమస్త విశేషములను నిషేధించి, యాజ్ఞవల్క్యాది మహర్షులు బ్రహ్మమును నిరూపించడం జరిగింది.

కాలంలో నశించేవి ఏవైనా క్షరములే. కాలములో నశించనిది, కాలాతీతము కాలాధారము అయిన చైతన్యమే ఇక్కడ ఓంకారముగా తెలుస్తూ ఉంది. ఇది తెలియదగిందే గాని అనుభవించ దగింది కాదు. ఇదే అక్షర ధ్యానము.

అక్షరాభ్యాసము.

బిడ్డల విద్యాభ్యాసమును అక్షరాభ్యాసముతో ఆరంభించడం ఆర్ష సంప్రదాయము. ముందుగా ఓంకారమును వ్రాయించి, ఆ తరువాత పరమేశ్వరుని అనుగ్రహమును అర్థిస్తూ పంచాక్షరిని వ్రాయిస్తారు. సమస్త విద్యలు ఓంకారము నందే ఉన్నందున, బ్రహ్మవాచక మైన ఓంకారమును అక్షరాభ్యాస కాలంలో ప్రథమంగా వ్రాయిస్తారు. ఈ విధంగా వ్రాసిన ఓంకారము యొక్క పూర్ణత్వాన్ని విద్యా స్వరూపంగా జ్ఞానులై గ్రహిస్తారు.

జ్ఞాన ప్రాప్తము

పరమ వైరాగ్యవంతు లైన యతిపురుషులు అక్షర రూపమైన ఈ పరబ్రహ్మము నందే ప్రవేశిస్తున్నారు ***(విశన్తి)*** అంటున్నాడు.

ఏ విషయము నందు మనకు ఆసక్తి ఉంటుందో, దాని యందు రాగం ఉదయిస్తుంది. రాగ వృత్తుల చేత సంస్కారాలు కలుగుతూ ఉంటాయి. ఈ సంస్కారాలు తిరిగి రాగవృత్తులను కదిలిస్తూ ఉంటాయి. ఈ వృత్తి సంస్కార చక్రము పరిభ్రమిస్తూ ఉన్నంత కాలం సంసార చక్రము తిరుగుతూనే ఉంటుంది.

రాగ రహితమైన చిత్తము శుద్ధిపడి ఉంటుంది. శుద్ధి పడిన చిత్తము గల యతులు ప్రయత్నశీలురై జ్ఞానమును పొందుతారు. ఇలా జ్ఞానమును పొందటమే ప్రవేశించుట ***(విశన్తి)*** అనే పదానికి అర్థము ***(యచ్చ అక్షరం ఇచ్ఛన్తః జ్ఞాతుమ్ ఇతి వాక్య శేషః)***. కనుక ప్రవేశించడము అంటే జ్ఞానమును పొందుటయే గాని, ఎలుక కన్నము లోనికో, సింహము గుహ లోనికో ప్రవేశించినట్లు ప్రవేశించుట కాదు.

బ్రహ్మచర్యము

అక్షర స్వరూపమైన బ్రహ్మమును ఆశించియే సాధకులు బ్రహ్మచర్య వ్రతమును ఆచరిస్తారు. బ్రహ్మము అనే విషయము నందు చరించడమే బ్రహ్మచర్యము. అంటే, బ్రహ్మజ్ఞానము కొరకు గురుసన్నిధిలో శ్రవణ మనన నిదిధ్యాసనలను సాగించడము బ్రహ్మచర్యము అవుతుంది.

వీర్యశక్తిని పరిరక్షించుకోవడము కూడా బ్రహ్మచర్యమే. *బ్రహ్మచర్య ప్రతిష్ఠాయాం వీర్యలాభః* - బ్రహ్మచర్యము స్థిరపడి నపుడు వీర్యలాభం ప్రాప్తిస్తుందని పతంజలి మహర్షి యోగదర్శనం - సాధన పాదంలో సూత్రీకరించారు. వీర్య సామర్థ్యము చేత జ్ఞాన క్రియా శక్తులలో సాధకుడు ప్రతిభావంతు డవుతాడు. అంతే కాదు. బ్రహ్మచర్య ప్రభావము చేత తాను జ్ఞానవంతుడు కావడమే గాక, తనను ఆశ్రయించు సాధకులకు జ్ఞానముమ ఉపదేశించే సామర్థ్యమును కూడా పొందుతాడు అని ఈ సూత్రంపై వ్యాస భాష్యము.

దేనిని వేదవిదులు అక్షరం అన్నారో, వైరాగ్యవంతులైన యతులు దేనిని పొందుతారో, దేని నాశించి సాధకులు బ్రహ్మచర్యమును పాటిస్తూ ఉన్నారో అది ఓంకార మనే పదము అంటున్నాడు. ఏది పొంద బడుతుందో దానిని పదం అంటారు *(పదం పదనీయం).* అంటే జ్ఞానము చేత పొందబడేది అని అర్థం *(పద్యతే ప్రాప్యత ఇతి పదం).* అది ఏదో కాదు, ఓంకారమే. దీనికి ప్రామాణికత్వం సిద్ధించి ఉంది. ముఖ్యంగా, ప్రస్తుత శ్లోకం పూర్వార్థం బృహదారణ్యక శ్రుతిలో యాజ్ఞవల్క్యుడు గార్గికి బోధించినది కాగా, ఉత్తరార్థం కఠోపనిషత్తులో యమాచార్యులు నచికేతునికి చేసిన ఉపదేశము. ఈ శ్లోకమును యథావిధిగా నచికేతునికి వివరించడం కూడా జరిగింది.

సర్వే వేదా యత్పద మామనన్తి తపాంసి సర్వాణి చ యద్వదన్తి ।
యదిచ్ఛంతో బ్రహ్మచర్యం చరన్తి తత్తేపదం సంగ్రహేణ బ్రవీమి ఓమిత్యేతత్ ॥

వేదము లన్నీ దేనిని పొందదగిన పదముగా వర్ణించాయో, దేనిని ఆశించి తపస్సు మొదలైన సాధనలు ఆచరింప బడుతున్నాయో, దేనిని పొందే ప్రయత్నంలో బ్రహ్మచర్యమును అనుష్ఠించడం జరుగుతూ ఉందో, అదే ఓంకారము అనే పదము. దానినే నీకు సంక్షేపంగా చెబుతాను అన్నాడు యమాచార్యుడు. అదే చెబుతున్నాడు గీతాచార్యుడు.

భగవంతుడు సంగ్రహంగా చెబుతాను అనగానే, విషయం పాక్షిక మేమో అనే సంశయాన్ని నివారిస్తూ, చెబుతాను *(వక్ష్యామి)* అనకుండా విశేషంగా చెబుతాను *(ప్రవక్ష్యామి)* అంటున్నాడు.

ప్రణవ ధ్యాన పద్ధతిని వివరించ బోతున్నాడు.

సర్వద్వారాణి సంయమ్య మనో హృది నిరుధ్య చ ।
మూర్ధ్న్యాధాయాత్మనః ప్రాణ మాస్థితో యోగధారణామ్ ॥ 12

సర్వద్వారాణి-సంయమ్య-మనః-హృది-నిరుధ్య-చ
మూర్ధ్ని-ఆధాయ-ఆత్మనః-ప్రాణం-ఆస్థితః-యోగధారణాం

ఆత్మనః	=	తన యొక్క	మూర్ధ్ని	=	శిరస్సు నందు
సర్వద్వారాణి	=	సమస్త ఇంద్రియ ద్వారములను	ప్రాణం	=	ప్రాణమును
సంయమ్య	=	నియమించి	ఆధాయ	=	ఉంచి
మనః	=	మనస్సును	యోగధారణాం	=	యోగాభ్యాసమున
హృది	=	హృదయము నందు	ఆస్థితః	=	ఉన్నవాడై
నిరుధ్య చ	=	నిలిపి			

ఇంద్రియ ద్వారా లన్నీ మూసేస్తాడు. మనస్సును హృదయంలో నిలుపుతాడు. ప్రాణాన్ని శిరస్సులో ఉంచుతాడు. యోగధారణను అవలంబిస్తాడు.

వ్యాఖ్య

నీకు తెలిసింది ఏదో అదే నీ ప్రపంచము. నాకు తెలిసింది ఏదో అదే నా ప్రపంచం. నాకు తెలిసిన దాని కన్నా వేరుగా ప్రపంచం ఉంటే ఉండొచ్చు. కాని, ఆ ప్రపంచం నా మటుకు నాకు లేనిదే. నాకు తెలిసిందే నా ప్రపంచము. నాకు ఏది తెలిసినా నా ఇంద్రియ మనస్సుల ద్వారా తెలియ వలసిందే గాని మరొక విధంగా తెలిసే అవకాశము లేదు. బయట ఏది ఉన్నా అది నా మనస్సులో ఆలోచన గానే తెలుస్తూ ఉంది.

కుండ ఉంది అన్నప్పుడు, ఆ కుండ యొక్క వృత్తికి సంబంధించిన విషయం ఎక్కడుంది? కుండ లోనే ఉంది. కుండ నుండి వృత్తిని వేరు చేస్తే, కుండ అనే భావన మనస్సులో ఉండే అవకాశమే లేదు.

మూతబడిన ద్వారాలు

రూపానికి సంబంధించిన విషయం కన్ను ద్వారా లోనికి ప్రవేశించి నపుడు, అది మనస్సును చేరి కలవర పరుస్తూ ఉంది. శబ్దానికి సంబంధించిన విషయం చెవి ద్వారా, వాసనకు సంబంధించిన విషయం ముక్కు ద్వారా - ఇలా స్వవిషయాలైన శబ్దాది విషయాలను శ్రోత్రాది ఇంద్రియాలు మనస్సుకు చేరవేస్తూ ఉంటాయి. విషయాలు మనస్సు లోకి ప్రవేశించ డానికి జ్ఞానేంద్రియాలే ద్వారాలై ఉన్నాయి.

గృహ ద్వారాలను మూయగానే ఇంటి లోకి ప్రవేశము నిరోధింప బడినట్లు, ఇంద్రియ ద్వారాలను మూయగానే బాహ్య విషయాలు మనస్సు లోనికి ప్రవేశించకుండా అడ్డగింప బడుతాయి. విషయాలు లోనికి ప్రవేశించలేక పోయినా, మనస్సు తన సహజ స్వభావము చేత తనకు తానుగా బహిర్గతం కావచ్చు. కాని, సమస్త ఇంద్రియ ద్వారాలను మూసి వేయడం చేత, ఇంద్రియాలు సంయమనం చేయబడ్డాయి కనుక **(సర్వాణి ఇంద్రియ ద్వారాణి సంయమ్య సంయమనం కృత్వా)** బాహ్య విషయాలు లోనికి ఎలా ప్రవేశించ లేవో, మనస్సు కూడా మూయబడిన ఇంద్రియాల ద్వారా బహిర్గతం కాలేదు.

ధ్యానకాలంలో ఇంద్రియాలు స్వవిషయాల నుండి విడిపడి ఉంటాయి కనుక, అవి విషయాకారమును పొందలేక చిత్తాకారమునే పొందుతాయి. చిత్తము నందే అణగి ఉంటాయి.

శబ్దాది విషయాల యందు ఆసక్తి లేనపుడు ఇంద్రియాలు ఉపశమిస్తాయి. అంతమాత్రాన దానిని ఇంద్రియ సంయమనముగా భావించ లేము. ఎందుచేత నంటే, ఆసక్తికర మైన విషయాలు ప్రాప్తించి నపుడు ఇంద్రియాలు తిరిగి విజృంభిస్తాయి. అలా జరిగి నపుడు, ఇవి శాస్త్ర నిషిద్ధములు కావు అని కొందరు, ఇంద్రియాలను తమ అదుపులో ఉంచుకొని అనుభవించడం చేత నియమింప బడతాయి అని మరి కొందరు, రాగద్వేషాలను తటస్థపరచి విషయాలను అనుభవిస్తే, తద్వారా సుఖదుఃఖాలు కలిగే అవకాశం లేనందున అది కూడా ఇంద్రియ నియమమే అని ఇంక కొందరు - ఇలా ఎన్నో విధాలుగా ఇంద్రియ నిగ్రహాన్ని ఊహిస్తూ ఉంటారు. కాని, ఇవన్నీ ఏదో ఓ క్షణాన బ్రతుకునే తారుమారు చెయ్యవచ్చు. కనుక, ఇంద్రియ విషయాల లోని దోషమును దర్శించే అభ్యాసమే ఇంద్రియ నియమానికి రాజమార్గము. అభ్యాస వైరాగ్యాదులే మనోనియమానికి, లేదా సంయమనానికి సరియైన సాధన లని ఆరవ అధ్యాయం లోనే భగవంతుడు స్పష్టం చేశాడు.

ఆగిన సంకల్ప సంచారము

ఇంద్రియ ద్వారాలు మూత పడటం చేత శబ్దాది విషయాలు లోనికి ప్రవేశించవు. అలాగే మనస్సు బహిర్ముఖమై విషయాలను చేరలేదు. అంతమాత్రాన మనోవ్యాపారం ఆగినట్లేనా? సంకల్ప సంచారము

నిరోధింప బడినట్లేనా? ఇంద్రియ ద్వారాలు మూత బడినా, మనస్సు తన ఊహాలలో ఊరేగే ప్రమాదం లేక పోలేదు. అందుచేత మనస్సు లోని సంకల్పాలను కూడా నిరోధించి, మనస్సును హృదయంలో నిలపాలి ***(మనః హృదయ పుండరీకే నిరుధ్య నిరోధం కృత్వా, నిష్ప్రచారం ఆపాద్య).***

హృదయము అంటే గుండె అని కాదు. వృత్తి మూల స్థానము అని అర్థం. వృత్తులు ఎక్కడ నుండి ఉద్భవిస్తాయో, తిరిగి ఎక్కడ లయించి పోతాయో అట్టి సర్వ వృత్తి మూలస్థానమే హృదయము. అదే అహంవృత్తి స్థానము. అహంవృత్తికి ఆధార మైనదే హృదయము. అది వృత్తి రహిత చైతన్యము.

వృత్తు లన్నీ చైతన్యము కన్నా భిన్నం కావు. సర్వ వృత్తులకు ఆశ్రయ స్థానము చైతన్యమే. వృత్తి కూడా చైతన్యమే. కాని చైతన్యం వృత్తి కాదు. చైతన్య కాంతిపుంజ మైన వృత్తికి తాను చైతన్యమే అయినా, ఆ స్ఫురణ లేని కారణంగా తాను పరిమిత మన్న భావన ఉంది. ఈ కారణం చేత విషయాలు లోనికి ప్రవేశించకుండా, మనస్సు బహిర్గతం కాకుండా ఇంద్రియ ద్వారాలను మూసినా కూడా మనస్సు యొక్క సంకల్ప సంచారము ఆగదు. కనుక మనస్సును దాని పట్టు స్థానం వైపుకు మరలించాలి. అది కూడా సరిపోదు. ఆ చైతన్య స్థానము, లేదా వృత్తి మూల స్థానము తానే అన్న జ్ఞానాన్ని దానికి కలిగించాలి. అదే జ్ఞాన నిష్ఠ. కాని, ఇది జ్ఞాన విషయం కాదు. కనుక, ఇక్కడ యోగనిష్ఠ ప్రతిపాదింప బడుతూ ఉంది. ప్రాణ నిరోధము చెప్పబడుతూ ఉంది. అదే యోగధారణము.

ప్రాణ బంధనము

ఇంద్రియ మనోద్వారాలను మూసి వేసిన తరువాత ప్రాణ ద్వారాన్ని కూడా మూసి వేయాలి. అంటే ప్రాణాన్ని కూడా నిరోధించి, సుషుమ్న నాడీ మార్గము ద్వారా ప్రాణమును కంఠ భ్రూమధ్య లలాట క్రమంలో నడిపించి యోగ ధారణం చేయాలి. ఇక్కడ బ్రహ్మ వాచక మైన ఓంకారమును ***(తస్య వాచకః ప్రణవః)***, ఓంకారము యొక్క అర్థ మగు బ్రహ్మమును స్మరిస్తూ మోక్షాన్ని పొందడం జరుగుతుంది.

ఈ ఓంకార రూపమైన అక్షర ధ్యానమును ఇక చెబుతాడు.

ఓ మి త్యేకాక్షరం బ్రహ్మ వ్యాహర న్మామనుస్మరన్ ।
యః ప్రయాతి త్యజ న్దేహం స యాతి పరమాం గతిమ్ ॥ 13

ఓం-ఇతి-ఏకాక్షరం-బ్రహ్మ-వ్యాహరన్-మాం-అనుస్మరన్
యః-ప్రయాతి-త్యజన్-దేహం-సః-యాతి-పరమాం-గతిం

బ్రహ్మ	=	పరబ్రహ్మ	త్యజన్	=	త్యజించి
ఓం ఇతి	=	ఓం అనెడి	యః	=	ఎవడు
ఏకాక్షరం	=	ఏకాక్షరమును	ప్రయాతి	=	పోతున్నాడో
వ్యాహరన్	=	పలుకుతూ	సః	=	అతడు
మాం	=	నన్ను	పరమాం	=	ఉత్తమమైన
అనుస్మరన్	=	స్మరిస్తూ	గతిం	=	స్థానమును
దేహం	=	దేహమును	యాతి	=	పొందుతాడు

[illegible] బ్రహ్మ వాచకమైన ఓంకారాన్ని ఉచ్చరిస్తూ, నన్నే స్మరిస్తూ దేహాన్ని విడిచి పెట్టిన వాడు ఉత్తమ గతిని [illegible]

వ్యాఖ్య

ఏకాక్షరం

ఓంకారము యొక్క అర్థము బ్రహ్మము. బ్రహ్మము యొక్క పేరు ఓంకారము. బ్రహ్మము ఏకాక్షరం. ఏకాక్షరం అంటే ఏకము, 'అ'కార స్వరూపము అని అర్థము. అలాగే ఓంకారము ఏకాక్షరం. అంటే 'ఓం' అనే ఒకే అక్షరము కలది అని అర్థము.

బ్రహ్మము యొక్క పేరే ఓంకారము ***(బ్రహ్మణః అభిధానభూతమ్ ఓంకారమ్).*** బ్రహ్మము వాచ్యము. ఓంకారము వాచకము. ఏకాక్షర స్వరూపమైన బ్రహ్మమునకు, ఏకాక్షర రూపమైన ఓంకారమునకు వాచ్యవాచక సంబంధము, లేదా అభిధేయ అభిధాన సంబంధము ప్రాప్తము.

తస్య వాచకః ప్రణవః. ఓంకారము ***(ప్రణవః)*** బ్రహ్మమునకు ***(తస్య)*** పేరు ***(వాచకః)*** అని పతంజలి మహర్షి నిర్వచించాడు. అంటే బ్రహ్మమును తెలియ చేసేది ప్రణవము లేదా ఓంకారము. అది వాచకము. వాచకము ద్వారా, అంటే ఓంకారము ద్వారా తెలియ బడేది అయినందున బ్రహ్మము వాచ్యము.

కంటికి కనిపించని వ్యక్తిని పేరు పెట్టి పిలిస్తే, 'ఓ' యని పలికి తన ఉనికిని తెలియ జేస్తాడు. పరమేశ్వరుడు కూడా కంటికి అగోచరుడు కనుక, అతనికి అభిధాన మైన ఓంకారముతో పిలిస్తే తప్పక తెలిసి వస్తాడు. ఈ విషయాన్ని స్మృతి కూడా ధృవపరచింది.

అదృష్ట విగ్రహో దేవో భావగ్రాహ్యో మనోమయః ।
తస్యోంకారః స్మృతో నామ తేనాహూతః ప్రసీదతి ॥

భగవంతుని యొక్క శరీరము ***(విగ్రహః)*** అదృష్టము. అంటే కంటికి కనిపించనిది. కంటికి కనిపించని దేవుడు మనస్సు చేత అనగా భావము ద్వారా గ్రహింప బడతాడు. భగవంతునికి ఓంకారము అని పేరు. అట్టి ఓంకారముతో పిలిస్తే భగవంతుడు ప్రసన్ను డవుతాడు.

మరణ సమయాన బ్రహ్మ అభిధాన మైన ఓంకారమును ఉచ్చరించి ***(వ్యాహరన్ ఉచ్చారయన్),*** ఓంకారము యొక్క అర్థమైన పరమేశ్వరుని అనుస్మరించి ***(ఈశ్వరమ్ అనుస్మరన్ అనుచిన్తయన్)*** దేహమును విడిచి వెళ్ళే జీవుడు ***(యః ప్రయాతి సః త్యజన్ పరిత్యజన్, దేహం శరీరం)*** ఉత్కృష్ట మైన గతిని, అనగా మోక్షమును పొందుతాడు ***(సః పరమాం ప్రకృష్టాం గతిం ప్రయాతి)*** అంటున్నాడు భగవంతుడు.

శబ్దార్థ వైభవము

ఓంకారమును ఉచ్చరించాలి. అలాగే ఓంకారము యొక్క అర్థమైన పరమేశ్వరుని అనుస్మరించాలి. 'ఓం' అనే శబ్దము బ్రహ్మమును గూర్చి చెబుతుంది. అలా చూచి నపుడు బ్రహ్మము, బ్రహ్మజ్ఞానము రెండూ ఒకటే కనుక, ఓంకారము బ్రహ్మ స్వరూపమే అవుతుంది. ప్రణవోపాసనము బ్రహ్మోపాసనమే అవుతుంది.

విగ్రహమును, లేదా ప్రతిమను పరమేశ్వరుడిగా భావించి ఆరాధించి నపుడు, పరమేశ్వరుణ్ణి ప్రతిమ మీద ఆరోపించి పూజిస్తున్నాం కదా! ప్రతిమ అనేది రూపము. ప్రతీకము అనేది శబ్దము. రూపము నందు ఎలాగైతే పరమేశ్వరుని ఆరోపించి అర్చిస్తున్నామో, అలాగే 'ఓం' అనే శబ్దమును బ్రహ్మముగా ఉపాసిస్తున్నాము. ఇదే ప్రతీకోపాసన. ఓంకారము బ్రహ్మమునకు ప్రతీక మైంది. ప్రణవము శబ్దబ్రహ్మ మైంది.

ప్రతిమలో విష్ణుమూర్తిని ఆరోపించి నపుడు ఆ ప్రతిమ విష్ణువునే సూచిస్తూ ఉంది అనే భావన మనకు ఉంది. ఓంకారము కూడా అంతే. 'ఓం' అని ఉచ్చరించి నపుడు అది 'అపరబ్రహ్మ'గా తెలుస్తూ ఉంది.

అదే ఓంకారమును అర్థయుక్తంగా ఉచ్ఛరించి నపుడు అది 'పరబ్రహ్మ' అవుతూ ఉంది. ఓంకారమును ఉచ్ఛరిస్తూ దాని అర్థమైన పరమేశ్వరుని కూడా స్మరించాలి అని భగవంతుడు ప్రస్తుత శ్లోకంలో చెప్పడం వెనుక అంతర్భావం ఇదే. ఈ విధంగా ప్రణవ జపము అర్థ భావ స్మరణతో కలిసి మోక్ష హేతువు అవుతూ ఉంది. ఈ విషయాన్ని పతంజలి మహర్షి తన యోగదర్శనంలో విస్పష్టం చేశాడు.

తజ్జప స్తదర్థ భావనమ్ - ఓంకారమును జపించుట ***(తజ్జపః)***, ఓంకారము యొక్క అర్థమైన బ్రహ్మమును భావన చేయుట ***(తదర్థ భావనమ్)*** అనే జపధ్యానాదుల ద్వారా పరమాత్మ సాక్షాత్కారము సంప్రాప్త మవుతుంది అన్నాడు.

తారక మంత్ర జపము

ఓంకారము సర్వమంత్ర స్వరూపము. వేదసారము. సర్వమంత్రాలలో ప్రణవమే ఉత్తమ మైనది. అట్టి ఓంకార జపమును భావార్థ సహితంగా సాగించి ధ్యానించు వారు సంసార బంధము నుండి విడిపడి ఉత్తమ గతి యైన మోక్షమును పొందుతారు.

ఓంకార స్సర్వమన్త్రాణాం ఉత్తమః పరికీర్తితః।
ఓంకారేణ ప్లవేనైవ సంసారాబ్ధిం తరిష్యతి ॥

సమస్త మంత్రాలలో ఓంకారమే ఉత్తమమైన దని ఋషులు కీర్తించారు. సంసార సాగరాన్ని దాటడానికి ఓంకార మనే నావకు మించినది మరొకటి లేదు. అందుచేత ప్రణవం కూడా తారక మంత్రమే.

మరణ సమయంలో ఓంకారమును జపిస్తూ దాని అర్థమైన ఈశ్వరుని స్మరిస్తూ యోగి దేహాన్ని త్యజించి వెళ్తున్నాడు ***(యః ప్రయాతి త్యజన్ దేహం)***. దేహాన్ని త్యజించి వెళ్తున్నాడు అని ప్రయాణ విశేషాన్ని చెప్పడం చేత, మరణం అనేది దేహానికే గాని, దేహాన్ని విడిచిపెట్టి వెళ్ళే జీవునికి కాదు అనేది స్పష్టమైంది. అలా వెళ్ళే వాడు ఉత్తమ గతిని పొందుతాడు. ముందుగానే మనం చెప్పుకున్నట్లు ఈ విధమైన యాత్ర యోగ సంబంధ మైనదే అగుట చేత, ఈ విధమైన ముక్తి క్రమముక్తియే గాని జీవన్ముక్తి కాదు అనేది గ్రహించాలి.

జీవన్ముక్తుడు దేహాన్ని త్యజించి బ్రహ్మప్రాప్తిని పొందుతాడు. కనుక అతడు జీవుడుగా పయనించడ మనేది ఉండదు. కాని ఇది యోగి ప్రయాణం. దేహాన్ని త్యజించిన యోగి బ్రహ్మ లోకానికి పయన మవుతాడు. అక్కడ బ్రహ్మదేవుని చెంత ఆసీనుడై శాస్త్రాన్ని శ్రవణం చేసి అక్కడ నుండి మోక్షాన్ని పొందుతాడు. ఇదే క్రమముక్తి.

అట్టి స్థితిని పొందాలి అంటే, అన్యచింతలను మాని పరమేశ్వరునే స్మరించాలి. అట్టి వారికి పరమేశ్వరుడు సులభసాధ్యుడు. ఎలాగో, వినండి.

అనన్యచేతాః సతతం యో మాం స్మరతి నిత్యశః।
త స్యాహం సులభః పార్థ నిత్యయుక్తస్య యోగినః ॥ 14

అనన్యచేతాః-సతతం-యః-మాం-స్మరతి-నిత్యశః
తస్య-అహం-సులభః-పార్థ-నిత్యయుక్తస్య-యోగినః

పార్థ	= అర్జునా		సతతం	=	సదా
యః	= ఎవడు		నిత్యశః	=	అనుదినము
అనన్యచేతాః	= అనన్య చిత్తముతో		మాం	=	నన్ను

స్మరతి	=	స్మరిస్తున్నాడో	అహం	=	నేను
నిత్యయుక్తస్య	=	నిత్యయుక్తు డైన	సులభః	=	సులభంగా లభ్య మవుతాను
తస్య యోగినః	=	ఆ యోగికి			

అర్జునా! నన్ను పొందటానికి సులభమైన ఉపాయం చెబుతున్నా, విను. మనస్సులో మరొక ధ్యాస ఉండ కూడదు. నిరంతరం నన్నే స్మరించాలి. నిత్యం యోగనిష్ఠలో ఉండాలి. అట్టి భక్తుడు నన్ను సులభంగా పొందుతాడు.

వ్యాఖ్య

మనస్సుకు దేని యందు ఆసక్తి ఉంటుందో, దాని యందే అది లగ్నమై ఉంటుంది. కొందరికి అనిత్యము లైన విషయాల యందే ఆసక్తి ఉంటుంది. అట్టి వారి మనస్సు ప్రపంచము లోనే పరిభ్రమిస్తూ ఉంటుంది. వీరు అన్య చేతస్సులు. అంటే అనేకము లైన విషయాల యందు మనస్సును ఉంచేవారు.

కొందరు నిత్యానిత్యాలను రెండిటినీ ఆశిస్తారు. అలాంటి వారు రెండిటి యందు ఆసక్తిని కలిగి ఉంటారు. వారికి ప్రాపంచిక విషయాలు కావాలి. అలాగే పరమేశ్వరుడు కూడా కొంత కావాలి. దృశ్యము లైన భోగాలూ కావాలి. అదృశ్యంగా ఉండే భగవంతుడూ కావాలి. వీరిలో కూడా ఎక్కువ మంది అనిత్యాలు ప్రాప్తించడానికే భగవంతుని అప్పుడప్పుడు, లేదా రోజులో ఏదో ఒక సమయాన ఆరాధిస్తూ, తాత్కాలికమైన భగవదాసక్తిని కలిగి ఉంటారు. ఇలాంటి వారు అటు ఇటు కాకుండా పోతారు. దీనినే శాస్త్రంలో 'అర్ధ జరతీయ న్యాయము' అంటారు. అంటే కోడిగ్రుడ్డును రెండు భాగాలు చేసి సగ భాగమును పిల్లను పుట్టించడానికి పొదిగించి, సగ భాగమును వండుకొని తినడము అని అర్థం. ఇలాంటి ప్రయత్నాలు వ్యవహారం లోనే ఫలించవు. ఇక భగవంతుడి విషయం వేరే చెప్పాలా!

మూడవ కోవకు చెందిన వారు అనన్య చేతస్సులు. వీరికి ఒక్క పరమేశ్వరుని యందే ప్రీతి. భగవ ద్విషయము నందే ఆసక్తి. అంతే కాదు. అనిత్య విషయాల పట్ల అనాసక్తి కూడా. పరమేశ్వరుని యందే వారు ఆసక్తిని కలిగి ఉంటారు కనుక నిత్యము పరమేశ్వరునే స్మరిస్తూ ఉంటారు. భగవంతుని విషయము నందే అనన్య చిత్తమును కలిగి ఉంటారు. పరమేశ్వరుని కన్నా అన్యమైన విషయాల యందు ఉదాసీనంగా ఉంటారు. ***తస్మిన్ అనన్యతా తద్విరోధిషు ఉదాసీనతా చ*** అని నారద భక్తిసూత్ర ప్రబోధము.

అనన్య చిత్తులు

ఇతర విషయాల యందు ఎవరి మనస్సు లగ్నం కాదో అట్టి మనస్సు కల వారు అనన్యచిత్తులు. అనన్య చిత్తులైన భక్తులు భగవంతుని యందే పరమాసక్తిని కలిగి ఉంటారు. ఒక పతివ్రత సదా తన భర్తనే ఎలా చింతిస్తూ ఉంటుందో ***(సాధ్వీ నైజ విభుం)***, ఒక జీవనది ఎలా అఖండంగా సముద్రం వైపు ప్రవహిస్తూ ఉంటుందో ***(సింధుః సరిద్వల్లభమ్)***, అలాగే అనన్య చేతస్సు లైన భక్తుల హృదయాలు పరమేశ్వరునే చింతిస్తూ పరమేశ్వరుని వైపే పరుగులు తీస్తూ ఉంటాయి. అట్టి భక్తులు ఎల్లప్పుడు ***(నిత్యశః)*** నిరంతరంగా ***(సతతమ్)*** భగవంతుణ్ణే స్మరిస్తూ ఉంటారు. ***సతతం, నిత్యశః*** అనే విశేషణాలు సమానార్థక పదాలుగా తెలుస్తూ ఉన్నా, పునరుక్తములు కావు. అవి పరస్పరం విలక్షణ మైన విశేషార్థాలతో శోభిస్తున్నాయి.

సమాధి సిద్ధిః ఈశ్వర ప్రణిధానాత్ - ఈశ్వర ప్రణిధానము వల్లనే సమాధి సిద్ధిస్తుంది అని పతంజలి యోగసూత్రము. అంటే, సర్వ భావాలను పరమేశ్వరుని పైకి మళ్ళించి, సమర్పణ భావంతో జీవించే వారికి సమాధి సిద్ధిస్తుంది అని అర్థము. ఇదే ఈశ్వర ప్రణిధానము లేదా ఈశ్వర భక్తి ఫలము. అట్టి ఫలప్రాప్తికి

దృఢమైన అభ్యాసము ఉండాలి. అభ్యాసము ఎలా దృఢ పడుతుందో కూడా పతంజలి ప్రవచించాడు.

సూ॥ స తు దీర్ఘకాల నైరన్తర్య సత్కారా సేవితో దృఢభూమిః (1 - 14)

అభ్యాసము దృఢం కావాలి అంటే (1) దీర్ఘకాలం అభ్యసించాలి. ఎక్కువ కాలం సాధన చేయాలి. (2)నైరంతర్యము అంటే నిరంతరం చేయాలి. (3) సత్కారములతో, అంటే అత్యాదరముతో చేయాలి అన్నాడు పతంజలి. ఈ విషయాన్నే ప్రస్తుత శ్లోకం ప్రతిఫలింప చేస్తూ ఉంది.

నిత్యము పరమేశ్వరుని స్మరించడము ***(నిత్యశః)*** అనే ప్రస్తుత శ్లోకము లోని పదభావన పతంజలి సూత్రం లోని దీర్ఘ కాలత్వాన్ని తెలియజేస్తూ ఉంది ***(నిత్యశః ఇతి దీర్ఘకాలత్వం ఉచ్యతే).*** శ్లోకం లోని ***సతతం*** అనే పదము సూత్రం లోని నైరంతర్యానికి ప్రతిభావనగా ఉంది ***(సతత మితి నైరంతర్య ముచ్యతే).*** ***అనన్య చేతాః*** అనే పదం సూత్రం లోని అత్యాదరమునకు ***(సత్కార ఆసేవితః)*** ప్రతిరూపంగా ఉంది. కనుక సతతము, నిత్యము అనే పదాలు పునరుక్తములు కావు. ఈ విధంగా పరమేశ్వరుని నిత్యము నిరాటంకంగా స్మరించే భక్తులు పరమేశ్వరుని యందే చరిస్తారు. వారే నిత్యయుక్తులు. అంటే, సమాహిత చిత్తులైన యోగులు. అట్టి వారికి పరమేశ్వరుడు కష్టం లేకుండా ప్రాప్తిస్తాడు. అందుకే భగవంతుడు భక్త సులభు డయ్యాడు.

భక్త సులభుడు

ఈశ్వర ప్రణిధానము లేదా ఈశ్వర భక్తి చేతనే భగవంతుడు లభిస్తాడు అని అర్థం చేసుకున్నాం. భగవంతుని పొందడం చాలా కష్ట మని, కఠోరమైన సాధనలు ఆచరిస్తే గాని భగవంతుని పొందడం సాధ్యం కాదు అనేది లోక ప్రచారంలో ఉంది. కాని, ఇక్కడేమో పరమేశ్వరుడు సులభుడు అని చెప్పబడుతూ ఉంది.

భగవంతుడు భక్తి చేతనే కదా ప్రాప్తిస్తాడు! ఇక్కడ భగవంతుడు సులభుడు అంటే, ఆయనను పొందటానికి మనం చేసే భక్తి సాధన కూడా సులభము అని అర్థం. అప్పుడే భగవంతుడు సులభుడు అనిపించు కుంటాడు. భక్తి సాధన కష్టమైతే భగవంతుడు కష్టసాధ్య మౌతాడే గాని సులభ సాధ్య మెలా అవుతాడు? కనుక భగవంతుడు సులభుడు లేదా భక్త సులభుడు అంటే, ఆయనను పొందడానికి ఆచరించే భక్తి సాధన కూడా సులభము అని అర్థము.

భగవంతుని నిరంతరం స్మరించడమే కదా భక్తి సాధన! ప్రేమికులు తాము ప్రేమించే వారిని గూర్చి చింతించడం కష్టంగా భావిస్తారా? ప్రేమ కార్యాలు ప్రయత్నాలు లేకుండా పరుగులు తీస్తాయి. మనకు ఆసక్తి గల దానివి చింతించడంలో, మనం ప్రేమించే దానిని సదా స్మరించడంలో శ్రమ ఎక్కడుంది? కష్ట మేముంది? అందుకే భగవంతుడు సులభు డయ్యాడు. భక్తి సులభ మైంది. కనుకనే, ***అన్యస్మాత్ సౌలభ్యం భక్తౌ*** - అన్నిటి కంటే భక్తే సులభము అన్నాడు నారద మహర్షి.

[illegible]తనను తదేకంగా స్మరించే వారిని భగవంతుడు విస్మరిస్తాడా? భగవంతుడు కోరింది చిత్తాన్నే గాని [illegible]త్తాన్ని కాదు కదా! భగవంతునికి అర్పించ వలసిన చిత్తాన్ని అన్యులకు అర్పిస్తే ఏమొస్తుంది? అగచాట్లు తప్ప. [illegible]శ్వరునికి చిత్తాన్ని సమర్పిస్తే సర్వం సిద్ధిస్తుంది. కారణం, ఆయన భక్త సులభుడు. నిత్య భక్తులైన వారికి నిత్యమూ సులభుడే ***(తస్య భక్తాః ఈశ్వరః సులభః సుఖేన లభ్యః).***

[illegible] చిత్తాన్ని శివునికి సమర్పించ గలిగితే బ్రతుకులో చింతలు దూర మవుతాయి. మరి చిత్తాన్ని [illegible] గ్రహించకపోతే ఎలా? అనే సందేహం కలిగిన భక్తుడు శివుణ్ణి నొప్పించకుండానే ఒప్పించే [illegible]

సతి ఒక్కతె ఉండాలి పతికి పార్వతీశ!
ఇద్దరున్న పతికి అప్పై ఎందరున్న నేమి?
నా చిత్త సుందరిని చేపట్టు చిద్విలాసా!
నీ అడుగుల కడ పడి ఉందు నీలకంఠా!

అని నీలకంఠ శతకంలో ఒక విబూది పండు.

నిజమే. భగవంతుడు సులభుడే అనుకుందాం. ఈ విధమైన సౌలభ్యం వల్ల ఏమి సిద్ధిస్తుంది? చెబుతున్నాడు.

మా ముపేత్య పునర్జన్మ దుఃఖాలయ మశాశ్వతమ్ ।
నాప్నువన్తి మహాత్మానః సంసిద్ధిం పరమాం గతాః ॥ 15

మాం-ఉపేత్య-పునర్జన్మ-దుఃఖాలయం-అశాశ్వతం

న-ఆప్నువంతి-మహాత్మానః-సంసిద్ధిం-పరమాం-గతాః

పరమాం	=	ఉత్తమమైన	ఉపేత్య	=	పొంది
సంసిద్ధిం	=	మోక్షమును	దుఃఖాలయం	=	దుఃఖమునకు స్థానము
గతాః	=	పొందిన	అశాశ్వతం	=	అనిత్యము
మహాత్మానః	=	మహాత్ములు	పునర్జన్మ	=	పునర్జన్మమును
మాం	=	నన్ను	నాప్నువంతి	=	పొందరు

అర్జునా! జన్మలు శోక నిలయాలు. అశాశ్వతాలు. నన్ను పొందిన వారు జన్మ లెత్తరు. వారు మహాత్ములు. మోక్షాన్నే పొందుతారు.

వ్యాఖ్య

తింటే ఆకలి తీరుతుంది. మళ్ళీ కొంత సేపటికి ఆకలి పుడుతుంది. మందు తింటే వ్యాధి నయ మవుతుంది. నయమైన వ్యాధి తిరిగి రాదని చెప్పలేము. దుఃఖం దూరమై మనిషికి సుఖం కలుగుతుంది. అలాగని సుఖం స్థిరంగా ఉండదు. దుఃఖం తిరిగి రాకపోదు. ఆశించి ఆరోగ్యాన్ని పొందినా, అయిష్టమైన అనారోగ్యం ఆశించక పోయినా వచ్చి తీరుతుంది. పుట్టి కనిపించిన మనిషి చచ్చి కనిపించకుండా పోయినా తిరిగి మళ్ళీ ఎక్కడో ఒక చోట పుడుతాడు. బ్రతుకులో రాకపోక లన్నీ ఇలాగే ఉంటాయి. వచ్చే వన్నీ పోయేందుకే వస్తాయి. పోయే వన్నీ తిరిగి వచ్చేందుకే పోతాయి **(పునరావర్తతే).** కాని, ఎవరైతే పరమేశ్వరుని పొందుతారో వారు తిరిగి జన్మించరు. పునర్జన్మ నెత్తరు **(ఈశ్వరం ఉపేత్య పునః జన్మ న ప్రాప్నువన్తి).** జన్మ రాహిత్యాన్ని పొందుతారు.

స్వరూపానుభూతి

మనిషి దేహంలో ఉన్నాడు. దేహం దేశంలో ఉంది. కాలంలో కొనసాగుతూ ఉంది. ఎవరి దేహ మైనా ఒక కాలంలో, ఒక ప్రదేశం లోనే ఉండ గలదు. ఒక ప్రదేశంలో ఉన్నది మరొక ప్రదేశంలో ఉండలేదు. అందుచేత ఏ ప్రదేశంలో దేహం ఉన్నా, దేహంలో ఉన్న వ్యక్తి సుఖంగా ఉండలేక పోతున్నాడు. ఇందుకు ఒక ప్రదేశం మరొక ప్రదేశం కాకపోవడం ఒక కారణ మైతే, ఒకే ప్రదేశంలో ఉండే అవకాశం లేకపోవడము మరొక కారణము. ఏ ప్రదేశంలో ఉంటే, ఏ స్థానంలో నిలిస్తే తాను అన్ని ప్రదేశాలలో ఉన్న అనుభూతిని పొందగలడో, అట్టి స్థానాన్ని

చేరాలని ప్రతి మనిషి తెలిసో తెలియకో ప్రయత్నిస్తూ ఉన్నాడు. అదే పరమపదం. ముక్తిపదం. మోక్షస్థానం. మోక్ష స్థానేశ్వర నిలయం.

మారే దేశ కాలాలలో చేరి పోయిన దేహం మారకూడ దని మనం ఎంతగా ప్రయత్నిస్తున్నా అది మారుతూనే ఉంది. మారే దేహంలో వయస్సు జారి పోతూనే ఉంది. వయస్సు పెరుగుతూనే ఉంది. ఆయుష్షు తరుగుతూనే ఉంది. ఊరు సాగనంపే యత్నంలో ఉండే, ఏరు స్వాగతించే ఉబలాటంలో ఉంది. ఇవన్నీ మృత్యువునే ముందుంచు తున్నాయి. మృత్యుభయాన్ని మనిషిలో పెంచు తున్నాయి.

దేహంలో జరిగే మార్పులు దేహానికి తెలియవు. నాకు తెలుస్తున్నాయి. దేహం జీవించినా జడమే. మరణించినా జడమే. అందుకే దేహానికి జ్ఞానం ఉండదు. దేహ మార్పు లన్నిటినీ తెలుసుకొనే నేను దేహం లాగా జడాన్ని కాను. జ్ఞానస్వరూపుణ్ణి. చైతన్యాన్ని. జడమైన దేహం మరణిస్తుంది. దేహం మరణించినంత మాత్రాన నేను మరణించడం లేదు. జనన మరణాలు లేని జీవుణ్ణి నేను. జీవచైతన్యాన్ని నేను. ఈ సత్యం తెలియని కారణంగా, నేను కాని దేహాన్ని నేను అని భావించి, నాకు లేని చావును కొని తెచ్చుకొని దుఃఖిస్తున్నాను. నాకు లేని పుట్టుకను ఆపాదించుకొని అలమటిస్తున్నాను. ఇది సత్యజ్ఞానము కాదు. మిథ్యా జ్ఞానము.

జీవుడైన నాకు దేహం ఉపాధిగా ఉంది. వాస్తవానికి ఇది అవిద్య వలన ఏర్పడింది. ఇది అవిద్యోపాధి. ఒక ఉపాధికి సంబంధించిన వాడు జీవుడైతే, సకల ఉపాధులను తన అధీనంలో ఉంచుకున్న వాడు ఈశ్వరుడు. జీవేశ్వరు లిరువురు ఒకే చైతన్య స్వరూపమై ఉన్నారు. ఉపాధి భేదం వల్ల జీవేశ్వరుల మధ్య భేదం గోచరిస్తూ ఉంది.

చైతన్యము అద్వయము, అనంతము కనుక జీవేశ్వరు లిరువురు ఒక్కరే అనే అద్వితీయ జ్ఞానం కలిగితే, ఘటాకాశము మహాకాశాన్ని పొందినట్లు, జీవుడు ఈశ్వరుని పొందుతాడు ***(మాం ఉపేత్య, మామ్ ఈశ్వరమ్ ఉపేత్య).*** ఆకాశము ఘటానికి ఎప్పుడూ పరిమితంగా లేదు. జీవుడు ఎప్పుడూ దేహానికి పరిమితుడు కాడు. ఘటం ఉన్నప్పుడు కూడా ఆకాశం అనంతం గానే ఉంది. దేహంలో ఉన్నా జీవుడు సర్వవ్యాపియే. ***పిండస్థోఽపి ఆత్మా సర్వవ్యాపీ భవతి*** అన్నది ఉపనిషత్తు. ఈ జ్ఞానం కలిగితే చాలు. జీవుడు ఈశ్వరుడు అవుతాడు. సర్వవ్యాపిగా శోభిస్తాడు. దేహానికి పరిమితుడు కాడు కనుక, దేహం మరణించినా తాను మరణించడు. మరణించడు కనుక తిరిగి జన్మించడు ***(న చ పునరా వర్తతే).*** జన్మల నుండి విడి పడతాడు ***(మాం ఉపేత్య మద్భావం ఆపద్య పునః జన్మ న ప్రాప్నువన్తి).*** ఈశ్వరభావాన్ని, అంటే ఈశ్వరస్వరూపాన్ని పొందుతాడు. ఇదే స్వరూపానుభూతి లేదా ఈశ్వరానుభూతి.

పునర్జన్మ ప్రాప్తిస్తే ఏమౌతుంది? తిరిగి జన్మిస్తే వచ్చే నష్ట మేమిటి? అని కొందరు ప్రశ్నిస్తూ ఉంటారు. జన్మ నెత్తవచ్చు. కాని, జన్మ లోని దోషాలు అంటకుండా ఉండటం సాధ్యం కాదు. అక్కడే ఉంది కష్ట మైనా, నష్ట మైనా. ఆ విశేషాలనే చెబుతున్నాడు ***(తద్విశేషణ మాహ).*** జన్మ అనేది దుఃఖాలయ మని, అశాశ్వత మని తెలుపుతూ, అట్టిది ఎవరి కైనా అవాంఛనీయమే అంటున్నాడు.

దుఃఖాలయం

ఆలయము అంటే స్థానము లేక చోటు అని అర్థము. దుఃఖాలయము అంటే దుఃఖానికి నిలయము. జన్మ అనేది దుఃఖప్రాప్తి స్థానము. దుఃఖాలకు ఆశ్రయ స్థానము కావడం చేత జన్మ దుఃఖాలయ మైంది. శోక స్థానమైంది. భయహేతు వైంది. మేఘంలో ఏముంటుంది, నీరు తప్ప? జన్మలో మాత్రం ఏముంటుంది,

కష్టాలు తప్ప? ***ఆలీయన్తే యస్మిన్ దుఃఖాని ఇతి దుఃఖాలయం*** - దేని యందు దుఃఖాలు దాగి ఉంటాయో అదే దుఃఖాలయం. అదే జన్మము.

దాగింది కనిపించదు. కనిపించ నంత మాత్రాన ఉన్నది లేకుండా పోదు. ప్రమాదంలో ఎప్పుడు ఏది బయట పడుతుందో తెలియదు. అప్రియ మైనది ఏదైనా దుఃఖాన్ని వెంట బెట్టుకొనే వస్తుంది.

ఎంత దారుణ మైన వ్యాధి? ఒక్కసారిగా బయట పడింది. ఇంతకాలం ఎక్కడ ఉందో! అంటూ ఉంటాం. ఎక్కడ ఉంటుంది? దేహం లోనే ఉంటుంది. ఇంతకాలం దాగి ఉన్నది ఈ క్షణాన బయట పడింది. అంతే.

తేలు ఎప్పుడు కుడుతుందో తెలియదు. పాము ఎప్పుడు కరుస్తుందో అర్థం కాదు. పడగ విప్పి బెదిరిస్తేనా. పిడుగు లెప్పుడు పడతాయో ఎవరికి తెలుసు? తెలిసినా తెలియక పోయినా ప్రాప్తిస్తే మాత్రం ఎవరికైనా తప్పదు.

జన్మలో జీవనం ఉంది. జీవించా లంటే దేహం ఉండాలి. ప్రయాణానికి వాహనం అవసర మైనట్లు జీవనానికి దేహం అవసరం. వాహనం ఎప్పుడు చెడుతుందో తెలియదు. చెడిన క్షణాన ప్రయాణం ఆగినట్లే, అలాగే దేహం ఎప్పుడు పాడవుతుందో అర్థం కాదు. పాడైన క్షణాన ప్రస్థానం సాగదు.

కొన్ని దగ్గరైతే దుఃఖం. కొన్ని దూరమైతే దుఃఖం. దగ్గర ఉండాలి అనుకున్నవి దూర మవుతాయి. దూరం కావాలి అనుకున్నవి చేరు వవుతాయి. ఏవి ఎప్పుడు ఎలా ఉంటాయో, ఎవరు ఎప్పుడు ఎలా ఉంటారో అర్థం కాదు. అన్నీ మారుతున్నా, దుఃఖం మాత్రం మారకుండా స్థిరంగా ఉంది. అందుకే జన్మము దుఃఖాలయం అంటున్నాడు భగవంతుడు. ఏమి జన్మమో, దేని కోసమో?

పల్లవి: ఏమి జన్మమో! దేని కోసమో! ॥ ఏమి ॥

చరణములు : (1) ఉరికే మనసు ఊగే బ్రతుకు
తీరని మమతలు తియ్యని బంధాలు
రెప్పపాటులో కనుమరు గౌను
ఒంటరితనమే జంటగ మిగులును ॥ ఏమి జన్మమో ॥

(2) వెలిగే దీపము ఆరిపోవును
వెలుగుల రేడు వెల వెల పోవును
విధి నడిపే వింత నాటకము
అంతమె గాని సొంతము కాదు ॥ ఏమి జన్మమో ॥

(3) అలికిన ఇల్లు పలికిన దేమిటి?
కులికిన ఒళ్ళు నిలిపిన దేమిటి?
చెడిపిన మనస్సు చూపిన దేమిటి?
త్వరపడి చేరుము చైతన్య ధామము ॥ ఏమి జన్మమో ॥

అంటూ దుఃఖాలయ మైన జన్మబంధం నుండి విడివడి మహాత్ములై ఎదగమని మన చైతన్యగీతం ఎలుగెత్తి చాటింది.

అశాశ్వతం

జన్మ కేవలం దుఃఖాలయమే కాదు. అశాశ్వతం కూడా. అనిత్య మైనది కావడం చేత స్థిరమైన రూపంతో ఉండదు *(అశాశ్వతం అనవస్థిత స్వరూపం)*. ఏదీ స్థిరం కాదు. ధనికులు క్షణంలో దరిద్రు లవుతారు. దరిద్రులు క్షణాల్లో సంపన్ను లవుతారు. పదవులు ఉన్నట్లే ఉంటాయి. పోయే క్షణాన చెప్పకుండా ఊడి పోతాయి. మమతలు మాసి పోతాయి. స్నేహాలు వాడి పోతాయి. ఏం తెలిసి కలిసామో అర్థం కాదు. ఎందుకు విడిపోతామో ఎంతగా ఆలోచించినా అంతు పట్టదు.

చిత్తం నిండా దుఃఖం ఉండే టప్పుడు చేతి నిండా ధనం ఉండి మాత్రం ఏం ప్రయోజనం? బ్రతుకులో ద్రవ్యం - బుద్ధిలో దారిద్ర్యం.

యాజ్ఞవల్క్య మహర్షి సమస్తాన్ని త్యజించి యతి జీవనాన్ని గడపాలని నిశ్చయించు కుంటాడు. తన కున్న ఆస్తిని తన భార్యలైన మైత్రేయి, కాత్యాయనీలకు పంచాలని భావిస్తాడు. ఈ సందర్భంలో మైత్రేయి భర్తను సూటిగా ఒక్క ప్రశ్న అడుగుతుంది.

అయ్యా! ఈ విశ్వం లోని విత్త మంతా నాదైతే, నాకు అమృతత్వము ప్రాప్తిస్తుందా? అని ప్రశ్నించింది. దానికి యాజ్ఞవల్క్య మహర్షి సమాధానం చెబుతూ, మైత్రేయీ! ధనం ప్రాప్తిస్తే, దాని వల్ల నీ జీవితం ధనికుల జీవితంలా ఉంటుంది. అంతే గాని, అర్థం వల్ల అమృతత్వము ప్రాప్తించదు అంటాడు *(అమృత త్వస్య నాశాస్తి విత్తేన)*. బృహదారణ్య కోపనిషత్తులో సతిపతుల మధ్య జరిగిన ఈ సంవాదముపై సురేశ్వరాచార్యులు తన వార్తికములో మైత్రేయి చేత యాజ్ఞవల్క్యుని అందంగా ఒక్క ప్రశ్న అడిగిస్తాడు.

దేవా! అర్థం వల్ల అమృతత్వము ప్రాప్తించ నపుడు, మీ రెందుకు విత్తాన్ని మాకు పంచి ఇస్తున్నారు? మీకు ఉపకరించనిది మాకు మాత్రం ఎందుకు? అనిత్యమైన సంపదలో మేము మాత్రం ఏం సుఖపడ గలము? నశించేవి, అశాశ్వత మైనవి మాకు ఇవ్వకండి. మీరు ప్రసాదించాలి అనుకుంటే ఏది శాశ్వత సంపదో దానిని అనుగ్రహించండి.

నాది ర్నాంతో న మధ్యం వా యస్య విత్తస్య విద్యతే।
భోగే న చ క్షయం యాతి తదేవ వసు దీయతామ్॥

స్వామీ! ఏ సంపదకు ఆది మధ్యాంతాలు లేవో, ఏ సంపద అనుభవించిన పిదప నశించదో, అట్టి శాశ్వత సంపదను అనుగ్రహించండి అని మైత్రేయి ప్రార్థించింది. అదే మోక్షము. మనుష లందరూ దీనినే కాంక్షిస్తారు. కాని, మహాత్ములే దీనిని పొందుతారు.

శాశ్వత పదం

భగవత్ప్రాప్తిని ఎవరు పొందుతారో వారే మహాత్ములు. భగవత్ప్రాప్తియే మోక్షము. దీనినే గొప్పదైన *(పరమాం ప్రకృష్టాం)* సంసిద్ధిగా *(మోక్షాఖ్యాం సంసిద్ధిం)* పేర్కొన్నారు.

సాధన ద్వారా పొంద బడేది సాధ్యము. సాధింప బడించే సిద్ధి. సిద్ధు లనేవి ఎన్నో ఉన్నాయి. సిద్ధులు కల వారు ఎందరో ఉన్నారు. కొందరికి ధనం సిద్ధిస్తుంది. కొందరికి పదవులు సిద్ధిస్తాయి. కొందరికి సంతానం సిద్ధిస్తుంది. కొందరికి అణిమాది సిద్ధులు ప్రాప్తిస్తాయి. అలాంటి యోగులను సిద్ధు లని పిలుస్తారు *(అణిమాది సిద్ధి ర్యేషా మస్తీతి సిద్ధాః)*. ఈ సిద్ధు లన్నీ క్షణికాలు. అనిత్యాలు. అశాశ్వతాలు. కాలంలో జారి పోతాయి. దేశంలో పారి పోతాయి. దేశకాలాదులను అధిగమించి, నిత్యమై, శాశ్వతమై, మోక్ష మనే పేరుతో ఏది అభివర్ణింప బడుతూ ఉందో ఆ పరమపదమే ఇక్కడ సంసిద్ధిగా పిలువ బడింది. దానిని పొందిన వారే మహాత్ములు.

యతి పురుషులు **(మహాత్మానః యతయః)**. ప్రకృష్టమైన సిద్ధిని అనగా మోక్షాన్ని, లేదా భగవత్ప్రాప్తిని పొందిన ఆ మహాత్ములు దుఃఖాలయము, అశాశ్వతము అయిన పునర్జన్మను పొందరు. జన్మరాహిత్యంలో ఉండిపోతారు.

అయితే, భగవత్ప్రాప్తిని పొందని వారు పునర్జన్మను పొందుతూనే ఉంటారని చెబుతున్నాడు.

అబ్రహ్మభువనా ల్లోకాః పునరావర్తి నోఽర్జున ।
మా ముపేత్య తు కౌన్తేయ పునర్జన్మ న విద్యతే ॥ 16

ఆబ్రహ్మ భువనాత్-లోకాః-పునరావర్తినః-అర్జున
మాం-ఉపేత్య-తు-కౌంతేయ-పునర్జన్మ-న-విద్యతే

అర్జున	= అర్జునా!	మాం	= నన్ను
ఆబ్రహ్మభువనాత్	= బ్రహ్మలోకము వరకును గల	ఉపేత్య తు	= పొందిన మాత్రముననే
లోకాః	= లోకములు	పునర్జన్మ	= పునర్జన్మము
పునరావర్తినః	= మరల పుట్టుకను కలిగించునవి	న విద్యతే	= కలుగదు
కౌంతేయ	= అర్జునా!		

కౌంతేయా! అర్జునా! నన్ను పొందిన వారు మాత్రం తిరిగి పుట్టరు. బ్రహ్మలోకంతో సహ ఏ లోకానికి వెళ్ళినా. వాళ్ళు తిరిగి జన్మ నెత్తవలసిందే.

వ్యాఖ్య

పరిమిత మైనది ఏదైనా అంతం కలిగినదే. దృశ్యా లన్నీ పరిమితాలే. పరిచ్ఛిన్నాలే. చూడబడేవి ఏవైనా దృశ్యాలే. లోకాలు కూడా చూడబడు తున్నాయి. కనుక దృశ్యాలే. దృశ్యాలైన లోకాలు పరిమితాలే కనుక ఏదో ఒక కాలంలో, చివరికి ప్రళయంలో నైనా నశించి పోవలసిందే. ఈ విషయంలో బ్రహ్మలోకం విలక్షణంగా లేదు. సృష్టికి పూర్వం బ్రహ్మలోకం లేదు. కనుక ప్రళయంలో బ్రహ్మలోకం కూడా నిలబడదు.

లోక సంచారము

జీవుడు ఒక లోకాన్ని చేరాడు అంటే, ఆ లోకం ఏదైనా కావచ్చు, అది తన కన్నా వేరుగా ఉంది కనుకనే దానిని చేరడం జరిగింది. వేరుగా ఉండటము అంటే, దేశంలో లేదా కాలంలో వేరుగా ఉండాలి. లోకాలన్నీ కాలం చేత కొలవబడుతున్నాయి కనుక అవి పరిచ్ఛిన్నాలు. ఇప్పుడు లేక ఇంకొకప్పుడు కలిసేవి కావడం చేత, వేరొకప్పుడు విడిచిపెట్టి రావలసి ఉంటుంది. అందుకే అవి తిరిగి వచ్చేవిగా చెప్పబడ్డాయి **(పునరావర్తినః కాల పరిచ్ఛిన్నత్వాత్)**. బ్రహ్మలోకము కూడా కర్మ చేత పొంద బడితే అది కూడా విడువ వలసిందే ***(బ్రహ్మలోక సహితాః లోకాః పునరావర్తినః)***.

ఒక లోకము మరొక లోకము కాదు. బ్రహ్మలోకమూ అంతే. కాకపోతే, ఇక్కడ ఒక విషయం మెలిక పడి ఉంది. క్రమముక్తిని గూర్చి మనం ముందే తెలుసుకొని ఉన్నాం కదా! క్రమముక్తిని పొందేవారు బ్రహ్మలోకం చేరి, అక్కడ బ్రహ్మదేవుని నుండి మహావాక్యోపదేశమును పొంది మోక్షమును పొందుతారు. మరి ఇక్కడ **ఆబ్రహ్మ భువనాత్ లోకాః** అనే చోటనే 'బ్రహ్మలోకంతో సహా' అనే అర్థాన్ని గ్రహిస్తే, నశించే బ్రహ్మలోకంలో మోక్షప్రాప్తి ఎలా? అనే ప్రశ్న పుడుతుంది. ఇది చాలా సూక్ష్మమైన విషయం. ఈ కారణం చేతనే **ఆబ్రహ్మ భువనాత్** అంటే, 'బ్రహ్మ లోకంతో సహా' అని కాకుండా, 'బ్రహ్మలోకము వరకు' అని కొందరు అర్థం చెప్పారు. ఇది మాకు ఆమోదం కాదు.

కనుక మరో కోణం నుంచి దీనిని అర్థం చేసుకుందాం. మానవ లోకం నుంచే నేనా, కాదా? నుంచే ఏ మానవలోకంలో ఉండాల్సిన ఉపయుక్తమైన భోగము గ్రహించిన ముముక్షువు ఉపయుక్తమైన పరిపక్వుడవుతాడా, లేదా? అలాగే క్రమముక్తి కూడా. బ్రహ్మలోకంలో జ్ఞానాన్ని పొందిన వారు ముక్తపురుషులు అవుతారు. వారికి వేరుగా ఏ లోకమూ ఉండదు. అలాగని జ్ఞానాన్ని పొందకుండా కేవలం పుణ్యాన్ని చేసి మొదలైన వాటి చేత బ్రహ్మలోకాన్ని పొందేవారు తిరిగి ఎప్పుడో పునర్జన్మను పొందుతారు.

సంచారము లేని స్వరూపము

పరమేశ్వరుని పొందిన వారికి పునర్జన్మ ఉండదు. అది మోక్షస్థితి. మోక్షస్థితిలో దేశకాలాదులు లేనందున సంచారము సాధ్యం కాదు. కనుక తిరిగి రావడం అంటూ ఉండదు *(న చ పునరావర్తతే).*

పరిమిత కర్మ ద్వారా పరిమిత ఫలాన్ని, లేదా పరిమిత లోకాన్ని పొందేవాడు ఎవడైనా పరిమితుడే. పరిమితమైన వాడు మరొక పరిమిత లోకాన్ని చేరగానే పరిమితత్వాన్ని కోల్పోయి పరిపూర్ణుడు అవుతాడా? రాత్రి పూట, ఒక గది గోడలు తొలగించి, గది లోని చీకటిని బాహ్యం లోని చీకటితో కలిపితే వెలుగు వస్తుందా?

లోకాలను చేరిన వాడికి లోకానుభవం కలుగుతుందే గాని దుఃఖం ఎలా దూర మవుతుంది? జన్మ లెత్తే వారెవ్వరూ దుఃఖానికి దూరం కాలేరు. పరమాత్మను పొందిన మహాత్ములు మాత్రమే దుఃఖాలయము, అశాశ్వతము అయిన జన్మను పొందరు. మహాత్ములు అంటే గొప్పదైన ఆత్మను తెలుసుకున్న వారు, జ్ఞానవంతులు అని అర్థం.

ఆత్మకు సంబంధించిన జ్ఞానం లేని వారు అజ్ఞానులు. ఆత్మకు సంబంధించిన జ్ఞానం కల వారు మహాత్ములు. జ్ఞానమే అజ్ఞానమును తొలగిస్తుంది. తొలగిన అజ్ఞానము తిరిగి రాదు. రాలేదు. వెలుగు చీకటిని తొలగించిన తరువాత, పోయిన చీకటి తిరిగి వెలుగు ఉన్న చోటికి తిరిగి వస్తుందా? *(న చ పునరావర్తతే).*

పరమాత్మను తెలుసుకోవడం అనినా, ఆత్మను తెలుసుకోవడం అనినా ఒక్కటే. ఆత్మే పరమాత్మ. జీవుడే ఈశ్వరుడు. ఆత్మజ్ఞానం కలిగితే పరమాత్మ జ్ఞానం ప్రాప్తించినట్లే. పరమాత్మ జ్ఞానము అనంతము. అనంత మైనది పరిమితం కాలేదు. కనుక, పరిమితమైన జనన మరణాల ఊబిలో చిక్కదు.

లోకాలన్నీ ఎలా కాల పరిధిలో ఉన్నవో చెబుతున్నాడు.

సహస్రయుగ పర్యన్త మహ ర్యద్ బ్రహ్మణో విదుః । 17
రాత్రిం యుగ సహస్రాన్తాం తేఽహోరాత్రవిదో జనాః ॥

సహస్రయుగ పర్యంతం-అహః-యత్-బ్రహ్మణః-విదుః
రాత్రిం-యుగ సహస్రాంతాం-తే-అహోరాత్రవిదః-జనాః

అహోరాత్రవిదః	= రాత్రింబవళ్ళ పరిణామమును ఎరిగిన	సహస్రయుగ పర్యంతం	= వేయి యుగముల పరిమితి గల దానినిగను
తే జనాః	= ఆ జనులు		
బ్రహ్మణః	= బ్రహ్మకు	రాత్రిం	= రాత్రిని
యత్	= ఏది	యుగసహస్రాంతాం	= వేయి యుగముల పరిమితి గల దానినిగ
అహః	= పగలో		
(తత్	= దానిని)	విదుః	= తెలుసుకుంటారు

అర్జునా! రాత్రింబవళ్ళు బ్రహ్మకు కూడా ఉన్నాయి. వెయ్యి మహా యుగాలు బ్రహ్మకు పగలు. వెయ్యి మహా యుగాలు ఆయనకు రాత్రి. బ్రహ్మదేవుని రాత్రింబవళ్ళు తెలిసిన వారు ఇలా చెబుతున్నారు.

వ్యాఖ్య

లోకంలో వసించే వారు లోకులు. లోకాలు నిత్యమైనవి కావు. కనుక లోకులు కూడా నిత్యులు కారు. కాబట్టి లోకులు, లోకాలు అన్నీ అశాశ్వతాలై నశించి పోతూ ఉంటాయి.

మానవులు ఉండేది మనుష్య లోకం. దేవతలు ఉండేది దేవలోకం. బ్రహ్మ ఉండేది బ్రహ్మలోకం. దానినే బ్రహ్మ భువనంగా పూర్వ శ్లోకంలో చూశాం (బ్రహ్మణః భువనం బ్రహ్మ భువనం. బ్రహ్మ లోకః ఇత్యర్థః). బ్రహ్మ ఉన్నంత వరకు బ్రహ్మలోకం ఉంటుంది. బ్రహ్మలోకం ఉన్నంత వరకు బ్రహ్మ ఉంటాడు. బ్రహ్మ ఆయుర్దాయమే బ్రహ్మలోక ఆయుష్షు.

శతం దీర్ఘమాయుః - మానవునికి వంద సంవత్సరాలు ఆయుర్దాయము. బ్రహ్మకు కూడా వంద సంవత్సరాలే ఆయుష్షు. అయితే ఈ సంవత్సరాలు మానవుల కాల ప్రమాణంతో కాకుండా దైవ కాల ప్రమాణంతో చూడవలసి ఉంటుంది.

యుగములు – మహాయుగము

యుగములు నాలుగు. వాటిని కృతయుగము, త్రేతాయుగము, ద్వాపర యుగము, కలియుగము అని అంటారు. ఒక్కొక్క యుగానికి ఒక్కొక్క కాల ప్రమాణం ఉంటుంది. ఈ నాలుగు యుగాలు కలిసి ఒక మహాయుగము లేదా దైవయుగము అవుతుంది. అటువంటి మహాయుగాలు వెయ్యి కలిస్తే బ్రహ్మదేవునికి ఒక పగలు *(సహస్ర యుగ పర్యన్తం బ్రహ్మణః అహః).* అలాగే వెయ్యి యుగాలు కలిస్తే బ్రహ్మదేవునికి ఒక రాత్రి *(రాత్రి మపి యుగ సహస్రాన్తం అహః పరిమాణా మేవ)* అని చెబుతారు. అలా చెప్పే వారు దివారాత్రాలు తెలిసిన వారు. కాలసంఖ్యావిదులు *(అహోరాత్ర విదః కాల సంఖ్యా విదః జనాః ఇత్యర్థః).*

యుగముల కాల ప్రమాణము

నాలుగు యుగాలను కలిపి ఒక మహాయుగం అంటారని తెలుసుకున్నాం. ఒక మహాయుగంలో నాలుగు యుగాలు కలిసి ఉంటాయి. మహాయుగం యొక్క కాల ప్రమాణము తెలియాలి అంటే, ముందు నాలుగు యుగాల కాల ప్రమాణాన్ని విడివిడిగా తెలుసుకొని, ఆ తరువాత నాలుగు యుగాల కాల ప్రమాణాన్ని కూడితే మహాయుగం యొక్క కాల ప్రమాణ మెంతో తెలుస్తుంది. విషయం సులభంగా అర్థం కావడానికి మనుష్య కాల ప్రమాణంతో కలియుగ కాల ప్రమాణం తెలుసుకుందాం. అర్థం చేసుకుందాము. మొదట కలియుగం యొక్క కాల ప్రమాణం తెలుసుకుందాం. కలియుగ ప్రమాణానికి ద్వాపర యుగం రెండింతలు ఉంటుంది. త్రేతాయుగం మూడింతలు ఉంటుంది. కృతయుగం నాలుగు రెట్లు ఉంటుంది. ఇక లెక్కిద్దాం పదండి.

కలియుగం :- కలియుగ కాల ప్రమాణం నాలుగు లక్షల ముప్పైరెండు వేల సంవత్సరాలు (4.32,000).

ద్వాపరయుగం :- ద్వాపర యుగ కాల ప్రమాణం కలియుగానికి రెండింతలు కావటం చేత ద్వాపర యుగం ఎనిమిది లక్షల అరవై నాలుగు వేల సంవత్సరాలు (8.64,000).

త్రేతాయుగం :- త్రేతాయుగం కలియుగం కన్నా మూడు రెట్లు కాల ప్రమాణం కలది కావటం చేత, త్రేతాయుగం పన్నెండు లక్షల తొంభై ఆరు వేల సంవత్సరాలు (12.96,000).

కృతయుగం:- కలియుగం కన్నా నాలుగు రెట్లు కాల ప్రమాణం గల కృతయుగము యొక్క కాలము పదిహేడు లక్షల ఇరవై ఎనిమిది వేల సంవత్సరాలు ***(17,28,000).***

ఈ నాలుగు యుగాల కాలమును కూడితే, చతుర్యుగ సంఖ్య నలభై మూడు లక్షల ఇరవై వేలు వస్తుంది. ఇదే మహాయుగం లేదా దైవయుగం. ఇటువంటి మహాయుగాలు వెయ్యి కలిస్తే బ్రహ్మదేవునికి ఒక్క పగలు. అలాగే మరో వెయ్యి చేరితే ఒక్క రాత్రి. ఈ విషయం ఛాందోగ్యము నందు, మహాభారతము నందు కూడా తెలుప బడింది.

దైవికానాం యుగానాం చ సహస్ర పరి సంఖ్యయా ।
బ్రహ్మ మేక మహార్జేయం తావతీ రాత్రి రేవ చ ॥

దైవ యుగాలు, లేదా మహా యుగాలు వెయ్యి అయితే బ్రహ్మదేవునికి ఒక పగలు. రాత్రి కూడా అంతే. బ్రహ్మదేవుని పగటి కాలాన్ని కల్పం అంటారు. రాత్రిని ప్రళయ మని అంటారు. కల్పం ఆరంభం కాగానే, అంటే కల్పాదిలో అవ్యక్తంగా ఉన్న భూతము లన్నీ సృష్టిగా వ్యక్త మౌతాయి. ప్రళయంలో, అంటే బ్రహ్మదేవుని రాత్రి సంభవించ గానే వ్యక్త మైన భూతజాల మంతా అవ్యక్తం లోకి జారి పోతుంది.

ఎలాగైతే రాత్రిపూట మనలో లయించిన ప్రపంచం మనం నిద్ర లేవగానే వ్యక్త మవుతుందో, అలాగే బ్రహ్మ రాత్రి కాలాన ప్రళయంలో లయించిన భూతజాలము బ్రహ్మ పగటి కాలం ఆరంభం కాగానే (కల్పాదిలో) తిరిగి వ్యక్త మవుతుంది. ఇవే వ్యక్తావ్యక్తములు.

బ్రహ్మదేవుని దివారాత్రములలో ఈ వ్యక్తావ్యక్తములు జరిగే దెలాగో చెబుతున్నాడు.

అవ్యక్తా ద్వ్యక్తయః సర్వాః ప్రభవ న్త్యహరాగమే ।
రాత్ర్యాగమే ప్రలీయన్తే తత్రైవావ్యక్త సంజ్ఞకే ॥ 18

అవ్యక్తాత్-వ్యక్తయః-సర్వాః-ప్రభవంతి-అహరాగమే
రాత్ర్యాగమే-ప్రలీయంతే-తత్ర-ఏవ-అవ్యక్తసంజ్ఞకే

అహరాగమే	= పగటి ప్రారంభము నందు	రాత్ర్యాగమే	= రాత్రి కలిగి నపుడు
అవ్యక్తాత్	= అవ్యక్తము నుండి	అవ్యక్త సంజ్ఞకే	= అవ్యక్త మనబడు
సర్వాః వ్యక్తయః	= సమస్త వ్యక్త రూపములు	తత్ర ఏవ	= దాని యందే
ప్రభవంతి	= కలుగుతాయి	ప్రలీయంతే	= లీన మవుతాయి

అర్జునా! బ్రహ్మదేవుని పగలు ప్రారంభం కాగానే అవ్యక్తము నుండి భూతజాల మంతా వ్యక్త మవుతుంది. మళ్ళీ రాత్రి ప్రారంభం కాగానే వ్యక్తమైన దంతా అవ్యక్తంలో లీన మౌతుంది.

వ్యాఖ్య

బ్రహ్మదేవుని యొక్క పగలు చతుర్యుగ సహస్ర పరిమిత మని, అలాగే రాత్రి కూడా అని గ్రహించాము. కాలవిదులు తెలిపిన బ్రహ్మ యొక్క దివారాత్రముల కాల పరిమాణంలో సర్గ లయాది కార్యాలను భగవానుడు ఇప్పుడు విభజించి చూపుతున్నాడు.

బ్రహ్మదేవుని పగటి కాలం రాగానే ***(అహరాగమే, అహ్నః ఆగమః సమయే)*** అవ్యక్తము నుండి ***(అవ్యక్తాత్)*** సమస్తమైన ప్రాణులు ***(సర్వాః వ్యక్తయః స్థావర జంగమ లక్షణాః)*** పుడుతున్నాయి ***(ప్రభవన్తి).***

అవ్యక్తము అంటే ఏదో కాదు బ్రహ్మదేవుని యొక్క నిద్రావస్థ. నిద్రావస్థలో లయించి ఏవైతే ఉన్నట్లు

కనిపించవో, అవి తిరిగి కనిపించడమే వ్యక్తం కావడ మంటే. బ్రహ్మ రాత్రి కాలంలో అవ్యక్త మనే నిద్రావస్థలో లయించి అగోచరము లైన చరాచర భూతము లన్నీ బ్రహ్మ పగటి కాలం ఆరంభం కాగానే వ్యక్తమై కనిపిస్తాయి.

కనుక వ్యక్త మంటే క్రొత్తగా రావడ మని కాదు. అంతవరకు అవ్యక్తంగా ఉన్నవే తిరిగి వ్యక్త మయ్యా యని అర్థము. గత కల్పంలో ఉండి ప్రళయ కాలంలో లయించి అవ్యక్తంగా ఉండిపోయిన భూతకోట్లు, కల్పాది యందు తిరిగి వ్యక్తమై కనిపిస్తున్నాయి. అంటే ఉన్నవి రావడం జరిగిందే గాని లేనివి రాలేదు. లేనిది అంటే శూన్య మని అర్థం. లేని దాని నుండి రావడం అంటే శూన్యం నుండి ఉత్పన్నం కావడ మనే భావము. లేని దాని నుండి ఏదైనా ఎలా వస్తుంది? అలా వస్తుందని వాదించే వారు కూడా ఉన్నారు. దీనినే 'అసదుత్పత్తి ప్రసంగం' అంటారు. ఈ అప్రస్తుత ప్రసంగాన్ని 'వ్యక్తావ్యక్త ప్రసంగం' చేత ఖండిస్తున్నారు.

అవ్యక్తంగా బీజ రూపంగా ఉన్నదే జగత్తుగా వ్యక్త మైంది ***(బీజస్యాన్తరి వాఙ్కురో జగదిదం ప్రాక్ నిర్వికల్పం).*** ఇకపోతే, నాలుగు యుగాలు కలిపిన మహాయుగం యొక్క సంఖ్య నలభై మూడు లక్షల ఇరవై వేల సంవత్సరాలు అని తెలుసుకున్నాం. అలాగే వెయ్యి మహాయుగాలు బ్రహ్మకు ఒక పగలు అని కూడా గ్రహించాము. అలాగే ఆయన రాత్రి కూడా. ఈ విధంగా బ్రహ్మదేవునికి మూడువందల అరవై రోజులు గడిస్తే ఆయనకు ఒక సంవత్సరము. అలాంటి వంద సంవత్సరాలు బ్రహ్మ యొక్క ఆయుర్దాయము. అంటే బ్రహ్మ యొక్క నిద్రా జాగ్రత్తులనే ప్రళయ కల్పాలు ముప్పై ఆరు వేల సార్లు జరిగితే బ్రహ్మదేవుని ఆయుర్దాయం ముగిసినట్లే. బ్రహ్మ ఆయుష్షు ముగిసింది అంటే, బ్రహ్మలోకం యొక్క ఆయుర్దాయం కూడా తీరిపోయిందని భావము. మనకు ఆయుష్షు నిచ్చిన వాడే ఈ స్థితిలో ఆయుష్షును కోల్పోతున్నాడు. ఆయుష్షు ఉన్నవాడు ఎవడైనా ఒకనాడు ఆయుష్షును పోగొట్టుకొనే వాడే. బ్రహ్మ ఉండేదే బ్రహ్మలోకం. బ్రహ్మ ఆయుర్దాయం ముగిసి బ్రహ్మ అంతమైతే, ఇక బ్రహ్మలోకం ఎక్కడిది? బ్రహ్మ ఉంటేనే కదా బ్రహ్మలోకం! అందుకే బ్రహ్మలోకం కూడా నశించేదే. అది దీర్ఘకాలం ఉంటుందనేది ప్రక్కన పెడితే, బ్రహ్మలోకం కూడా అన్ని లోకాలకు మల్లే నశించేదే. లోకాల నాశ్రయించే వారు పునర్జన్మను పొందుతారు. నన్ను పొందిన వారు జన్మకు రారు అని పదహారవ శ్లోకంలో గీతాచార్యుడు చెప్పడం లోని అంతర్భావం ఇదే.

పరమేశ్వరుని పొందనంత వరకు జీవులు ఇలా జనన మరణ చక్రంలో తగులుకొని పరిభ్రమిస్తూనే ఉంటారు. వినండి.

భూతగ్రామః స ఏ వాయం భూత్వా భూత్వా ప్రలీయతే ।
రాత్ర్యాగమేఽవశః పార్థ ప్రభవ త్యహ రాగమే ॥ 19

భూతగ్రామః-సః-ఏవ-అయం-భూత్వా-భూత్వా-ప్రలీయతే
రాత్ర్యాగమే-అవశః-పార్థ-ప్రభవతి-అహరాగమే

పార్థ	= అర్జునా!	భూత్వా భూత్వా	= మరల మరల
భూతగ్రామః	= భూత సమూహమును	ప్రలీయతే	= లీన మవుతూ ఉంది
స ఏవ అయం	= అదియే	అహరాగమే	= పగలు వచ్చి నపుడు
అవశః	= వశము లేక	ప్రభవతి	= పుట్టుచున్నది
రాత్ర్యాగమే	= రాత్రి ప్రారంభ మైనపుడు		

అర్జునా! ఈ భూతకోట్లు పూర్వం ఉన్నవే. పరాధీనమై పుట్టి పుట్టి బ్రహ్మదేవుని రాత్రి రాగానే విలీనమై పోతున్నాయి. బ్రహ్మదేవుని పగటి కాలం రాగానే తిరిగి పుడుతున్నాయి.

వ్యాఖ్య

అవ్యక్తము నుండి వ్యక్త మైన భూతకోట్లు తిరిగి అవ్యక్తము నందే విలీన మౌతున్నాయి. ***అదర్శనాత్ ఆ పతితః పునశ్చ అదర్శనం గతః*** - అగోచరమైన చోటు నుండి వచ్చిన మనం తిరిగి అగోచరమైన చోటికే చేరుతున్నాం అన్నది మహాభారతం. ఇలా రావడం అనేది బ్రహ్మకు పగటి కాలం ప్రారంభం కాగానే జరుగుతుంది. ఈ విధంగా వచ్చిన స్థావర జంగమాత్మక మైన భూత సముదాయం ***(భూతగ్రామః)*** బ్రహ్మ పగటి కాలం జరుగునంత కాలము, అనగా వేయి మహాయుగాలు పూర్తి అయ్యే వరకు పుట్టి పుట్టి ***(భూత్వా భూత్వా).*** అంటే అనేక జన్మ లెత్తి, కర్మ పరాధీనమై, బ్రహ్మకు పగలు అస్తమించి రాత్రి రాగానే, వశం తప్పి, అస్వతంత్రంగా ***(అవశః అస్వతంత్రః)*** విలీన మౌతుంది. తిరిగి బ్రహ్మకు పగటి కాలం రాగానే ***(అహరాగమే)*** పూర్వం లయించిన భూత సముదాయమే తిరిగి పుడుతూ ఉంది ***(ప్రభవతి).***

ఇలా పుట్టిన భూతజాలము బ్రహ్మకు పగటి కాలం పూర్తయ్యే వరకు ఈ లోకంలో పుడుతూ చస్తూ, చస్తూ పుడుతూ జనన మరణ చక్ర వలయంలో చిక్కుకొని, ఎన్నో లెక్క లేనన్ని జన్మలు ఎత్తుతూ ఉంటుంది. ఈ విషయంలో ఏ విధమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యములు లేకుండా కర్మ వశమై పుడుతూ ఉంటుంది. అలా ఎందుకు జరుగుతూ ఉంది? జీవకోటి స్వతః అవిద్యాది పంచక్లేశముల చేత ఆచరించిన పుణ్య పాప కర్మలకు వశమై, ఆయా కర్మఫలాలను అనుభవించటానికి మళ్ళీ మళ్ళీ పుడుతూ ఉంటుంది.

సూ॥ అవిద్యా స్మితా రాగద్వేషాభినివేశాః క్లేశాః

అవిద్య, అస్మిత, రాగము, ద్వేషము, అభినివేశము - ఇవియే పంచక్లేశములు.

(1) అవిద్య అంటే మిథ్యా జ్ఞానము. అనిత్యాలను నిత్యాలుగా, అశుచిని శుచిగా, దుఃఖాన్ని సుఖంగా, అనాత్మను ఆత్మగా భావించడం ఏదైతే ఉందో అది అవిద్య అని పతంజలి ***(అనిత్యా శుచి దుఃఖానాత్మసు నిత్యశుచి సుఖాత్మ ఖ్యాతిః అవిద్యా*** *- 2 - 5).*

(2) అస్మిత అంటే దేహ తాదాత్మ్యము. దేహాన్ని - ఆత్మను, బుద్ధిని - ఆత్మను, ఇంద్రియాలను - ఆత్మను, ప్రాణమును - ఆత్మను కలిపి ఒకటిగా చూడటం అస్మిత.

(3) రాగము అంటే విషయ ప్రియత్వము. విషయ సుఖాభిలాష, అనిత్య విషయాల పట్ల అభిరుచి.

(4) ద్వేషము అంటే అప్రియ విషయాల యందు అసహనము. రాగానికి విరుద్ధ మైన భావము. 'నేను - వాది' అనే అవిద్యా విషయము లందే రాగద్వేషాలు జనిస్తూ ఉంటాయి.

(5) అభినివేశము అంటే ప్రాణము నందు తీపి. నేను మరణించకుండా ఉండాలి అనే ఉత్కంఠ అభినివేశము. పూర్వ జన్మలలో మరణ సమయాన తాను మరణించ కూడదని, ఎలాగైనా బ్రతకాలని పడిన తహతహ వలన కలిగిన సంస్కారము కూడా ఈ అభినివేశానికి ఒక కారణంగా ఉంటుంది.

ఈ విధమైన అవిద్యాది అభినివేశాంత పంచక్లేశ కారణంగా పుణ్యపాప కర్మల సుడిగుండంలో చిక్కుకొనిన జీవుడు కర్మ పరాధీనుడై, అస్వతంత్రుడై జనన మరణాలను పొంది, దుఃఖాన్ని అనుభవిస్తూ ఉంటాడు. ఇలా కర్మసుడిలో పడి పరిభ్రమిస్తున్నాడే గాని భవసాగర తీరాన్ని చేరలేక పోతున్నాడు. ఈ సత్యం అర్థమైతే (1)జీవికి వైరాగ్యం కలుగుతుంది ***(సంసారే వైరాగ్య ప్రదర్శనార్థం).*** (2) బంధమోక్షాలను తెలియచేసే వేదాంత శాస్త్రాన్ని అధ్యయనం చేయాలి అనే జిజ్ఞాస ప్రాప్తిస్తుంది ***(బంధమోక్ష శాస్త్ర ప్రవృత్తి సాఫల్య ప్రదర్శనార్థం).*** ఈ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుత శ్లోకం చెప్పబడింది.

రంగుల రాట్నంలో కూర్చుని పరిభ్రమించే వాడు స్వతః దిగాలనుకున్నా దిగలేడు. సంసార చక్రంలో పడి తిరిగే వాడు సంసారం నుండి బయట పడటం కూడా అలాగే ఉంటుంది. సంసారంలో ఉండి సంసారాన్ని పరిష్కరించ లేము.

త్రిప్పేవాణ్ణి ఆశ్రయిస్తేనే రంగుల రాట్నంలో పరిభ్రమించే వాడు దాని నుండి సురక్షితంగా బయట పడతాడు. పరమేశ్వరుని పొందిన వాడే **(మాముపేత్య)** జన్మకర్మల నుండి విడిపడి తరిస్తాడు ***(పునర్జన్మ న విద్యతే).***

సంసార భ్రాంతిలో పడి జీవులు ఎంతగా శ్రమిస్తారో! ఎన్ని గాలిమేడలు నిర్మించుకుంటారో! అవన్నీ పేకమేడలై కూలి నపుడు, నీటి బుడగలై పగిలి నపుడు, మట్టిగోడలై కూలినపుడు జీవులు ఎంతగా కుమిలి పోతారో! ఎంత కన్నీరు కార్చుతారో! జన్మల జాడలు తెలియక, నీడలే నిజాలని నమ్మి ఎంత మోసపోతారో! ఈ మాయ నుండి విడిపడి మహిమగా శోభిల్లాలి అంటే, బుద్ధిని పరమేశ్వరునికి అర్పించాలి. బుద్ధిలో భగవంతుని ప్రతిష్ఠించుకోవాలి.

పల్లవి: **గాలి మేడలు నీటి ఓడలు - మట్టి గోడలు మనిషి జాడలు**

అనుపల్లవి : **నీడలు తోడు నీడలు - నీడివ్వని నీలి నీడలు ॥ గాలి ॥**

చరణము :
కరిగే కలలో కదిలే కళలు కళ్ళు తెరిచితే కల్లలు - చెల్లు రాతలు
జీవి బ్రతుకులో చదరంగాలు ఛాయ లుడిగితే మాయలు - మటు మాయలు
మంచు కరిగితే మనసు మరిగితే కనిపించేవి మహిమలు - దైవ మహిమలు
బుద్ధి పండితే బ్రతుకు నిండితే భాసించేది బ్రహ్మము - పరబ్రహ్మము ॥ గాలి ॥

అంటూ మాయకు చరమగీతాన్ని, మహిమకు స్వాగత గీతాన్ని ఆలపించింది చైతన్యగీతిక.

నాశ రహితమైన పరమాత్మ స్వరూపమును, పరమాత్మ ప్రాప్తికి ఉపాయమును ఉపదేశిస్తున్నాడు.

పర స్తస్మాత్తు భావోఽన్యోఽవ్యక్తోఽవ్యక్తా త్సనాతనః । 20
యః స సర్వేషు భూతేషు నశ్యత్సు న వినశ్యతి ॥

పరః-తస్మాత్-తు-భావః-అన్యః-అవ్యక్తః-అవ్యక్తాత్-సనాతనః
యః-సః-సర్వేషు-భూతేషు-నశ్యత్సు-న-వినశ్యతి

యః	=	ఏ	సనాతనః	=	శాశ్వత మైనది
భావః తు	=	భావము అయితే	సః	=	ఆ
తస్మాత్	=	ఆ	భావః	=	భావము
అవ్యక్తాత్	=	అవ్యక్తము కంటెను	సర్వేషు భూతేషు	=	సమస్త భూతములు
అన్యః	=	ఇతర మైనదియు	నశ్యత్సు	=	నశిస్తూ ఉండినా
పరః	=	ఉత్తమ మైనదియు	న వినశ్యతి	=	నశించదు
అవ్యక్తః	=	వ్యక్తము కానిదియు			

అర్జునా! అక్షర స్వరూపుడైన పరమాత్మ అవ్యక్తము కంటే అన్యమైన వాడు. శ్రేష్ఠమైన వాడు. ఇంద్రియాలకు వ్యక్తం కానివాడు. పురాతనుడు. సర్వ ప్రాణులు నశిస్తున్నా తాను నశించడు.

వ్యాఖ్య

బ్రహ్మలోకంతో సహా ఏ లోకాన్ని చేరినా అవశులైన జీవులు పునర్జన్మను పొందక తప్పదు. పరమేశ్వరుని పొందిన వారు మాత్రమే జన్మ రాహిత్యమును పొందుతారు. ఈ రెండు విషయాలను పదహారవ శ్లోకంలో ప్రతిపాదించిన భగవంతుడు ఆ తరువాత మూడు శ్లోకాలలో శ్లోక పూర్వార్థాన్ని వ్యాఖ్యానించి, ప్రస్తుత శ్లోకంలో పరమేశ్వరుని పొందిన వారు తిరిగి జన్మించరు అనే శ్లోక ఉత్తరార్థాన్ని వ్యాఖ్యానిస్తున్నాడు.

కల్పాది నుండి కల్పాంతం వరకు బ్రహ్మకు పగటి కాలమైన దానిలో ఏది వ్యక్తంగా తెలుస్తూ ఉందో, ప్రళయాది నుండి కల్పాది వరకు బ్రహ్మకు రాత్రి కాలమైన దానిలో ఏది అవ్యక్తంగా తెలుస్తూ ఉందో, ఈ రెండూ కాల పరిచ్ఛిన్నత్వము చేత అనిత్యాలుగా నిర్ధారింప బడ్డాయి. అన్నీ అనిత్యాలే అయితే ఇక జీవుల పరిస్థితి ఏమిటి? అనే సందేహం కలుగుతుంది. వ్యక్తావ్యక్తాలు అనిత్యాలే గాని, వాటికి విలక్షణంగా ఉన్న పరమేశ్వరుడు నిత్యుడే కదా! ఆ పరమేశ్వర తత్త్వమే ఇక్కడ అవ్యక్తం కన్నా వేరుగా ఉన్న అవ్యక్తంగా చెప్పబడుతూ ఉంది.

వ్యక్తావ్యక్తముల ప్రసంగంలో ఏది అవ్యక్తంగా చెప్పబడిందో, దాని కంటే ప్రస్తుతం చెప్పబడుతున్న అవ్యక్తము విలక్షణ మైంది అని తెలియ చేయడానికే **తు** శబ్దం ప్రయోగించ బడింది. క్రొత్త విషయం ప్రస్తావనకు వచ్చే సందర్భాలలో **తు** శబ్ద ప్రయోగం జరుగుతూ ఉంటుంది.

అవ్యక్తము కంటే వేరైన అవ్యక్తము ***(అవ్యక్తాత్ పరః అవ్యక్తః)*** విలక్షణ మైనది ***(అన్యః)*** అంటున్నాడు. వేరైనది అయినా ***(పరం)*** రెండిటికీ సామాన్య లక్షణాలు ఉన్నట్లు కనిపించే ప్రమాదం ఉన్నందున, దానిని వారించే ప్రయత్నంలో, ***అన్యః*** అనే పద ప్రయోగము ద్వారా అవ్యక్తము యొక్క విలక్షణ స్థితిని తెలుపుతూ, సాలక్షణ్య ప్రసంగాన్ని (రెండిటికి పోలిక ఉందనే వాదమును) నివర్తింప చేశాడు.

వ్యక్తం కన్నా పరమైనది అవ్యక్త మైతే, అవ్యక్తం కన్నా పరమైన అవ్యక్తం పరము కన్నా పరమైనది. పరాత్పరంగా, పరమగతిగా తెలియబడేది అదే. అదే అక్షరం. పరాత్పరం. ఈ సత్యాన్ని కఠోపనిషత్ సుస్పష్టం చేసింది.

మహతః పరం అవ్యక్తం అవ్యక్తాత్ పురుషః పరః।
పురుషాత్ న పరం కించిత్ సా కాష్ఠా సా పరాగతిః॥

మహత్తు కంటే (అవ్యక్త జనిత అఖిల జగత్కారణ భూత తత్త్వము మహత్తు) అవ్యక్తము శ్రేష్ఠ మైనది. అవ్యక్తము కంటే పురుషుడు పరమైన వాడు (పరాత్పరుడు). పురుషుని కంటే శ్రేష్ఠ మైనది ఏదీ లేదు. అదే చివరి గమ్యము. అదే పరమగతి.

ఈ పరాత్పర స్వరూపమునకు రూపము లేనందున ***(న తస్య ప్రతిమా అస్తి)*** చక్షురాది ఇంద్రియాలకు అగోచరంగా ఉంది. అలాగని లేనిది కాదు. గోచరించే వాటిలో అగోచరంగా ఉండి, కనిపించేవి (వ్యక్తం) నశించినా కనిపించనివి (అవ్యక్తం) నశించినా తాను మాత్రం నశించని అక్షరంగా అవ్యక్తంగా శోభిస్తూ ఉంది. అందుచేత అది సనాతనం. బ్రహ్మాది స్తంబ పర్యంతం సర్వము నశించినా పరాత్పరుడైన అవ్యక్త పరబ్రహ్మము నశించడు.

అట్టి పరాత్పరుని పొందిన వారు తిరిగి పుట్టరు ***(న చ పునరావర్తతే)***. ఇది రాక లేని పోక. అలాంటి పరాత్పరుడు, అనంతుడు అయిన పరమాత్మను ఎలా పొందాలి? ఏ ప్రయత్నంతో పొందాలి? ఏ ప్రయత్నం తోనూ పరాత్పరుని పొందలేవు. అంతం కలిగిన ప్రయత్నాలతో అనంతుని ఎలా పొందుతావు? పరాత్పరుడు

అనంతు డైనపుడు అతని కన్నా అన్యంగా నీవు లేవు కనుక నీవూ అనంతం లోనే ఉన్నావు. కాదు, అనంతం గానే ఉన్నావు. అనంతంగా ఉన్నావు కనుకనే అనంతాన్ని పొందగలవు. అనంతంగా ఉండే టప్పుడు మళ్ళీ అనంతాన్ని పొందడ మేమిటి? నీవు అనంతం అనే జ్ఞానము ఇప్పుడు లేనందున, జ్ఞానాన్ని పొందితే నీవే అది అని తెలుసుకుంటావు **(జ్ఞానా దేవ తు కైవల్యం)**. అదే కైవల్య పదం. పరమ పదం.

పరమ పదమే పరాత్పర స్వరూపం. పరమాత్మ స్వరూపం. చదవండి.

అవ్య క్తో౽ క్షర ఇత్యుక్త స్తమాహుః పరమాం గతిమ్ ।
యం ప్రాప్య న నివర్తన్తే తద్ధామ పరమం మమ ॥ 21

అవ్యక్తః-అక్షరః-ఇతి-ఉక్తః-తం-ఆహుః-పరమాం-గతిం
యం-ప్రాప్య-న-నివర్తంతే-తత్-ధామ-పరమం-మమ

అవ్యక్తః	=	అవ్యక్తుడు	యం	=	దేనిని
అక్షరః	=	అవినాశి	ప్రాప్య	=	పొంది
ఇతి	=	అని	న నివర్తంతే	=	తిరిగిరారో
ఉక్తః	=	చెప్పబడిన	తత్	=	అట్టి
తం	=	ఆ పరమాత్మను	మమ	=	నా యొక్క
పరమాం	=	ఉత్తమమైన	ధామ	=	స్థానము
గతిం	=	స్థానముగా	పరమం	=	శ్రేష్ఠ మైనది
ఆహుః	=	చెబుతున్నారు			

అర్జునా! పరమాత్మ అవ్యక్తుడు. అక్షరుడు. అతడే జీవుల పరమగతి. అతనిని పొందిన వారు తిరిగి జన్మకు రారు. ఆ పరంధామము నాదే.

వ్యాఖ్య

వ్యక్తావ్యక్తములకు అన్య మైనది, అతీత మైనది అయిన అవ్యక్తమును పరాత్పరుడు అని తెలుసు కున్నాము. పరాత్పర మైన అవ్యక్తము అక్షరం అని చెప్ప బడింది **(అవ్యక్తః అక్షరః ఇతి ఉక్తః)**. ఈ అక్షరమైన భావమునే పరమగతిగా విజ్ఞులు చెబుతున్నారు **(తమ్ పరమాం గతిం ఆహుః)**. ఉత్తమమైన ఈ గతిని అందరూ పొందలేక పోయినా, అందరూ వాంఛించేది మాత్రము ఇదే. అందరి జీవిత గమ్యము అక్షరమైన అవ్యక్తమే. అక్కడికి చేరాలి అనేదే అందరి ఆశయము.

ఎవరు ఎక్కడికి చేరాలని నిర్ణయించుకున్నా, ఆ చోటు ఉన్న చోటి కన్నా మిన్నగా ఉండాలి. ఉంటుంది. లేకపోతే ఉన్న దానిని ఎవరైనా ఎందుకు వదులు కుంటారు? మచ్చుకు స్వర్గాన్నే తీసుకుందాం. స్వర్గాభిలాషలు ఎందుకని స్వర్గానికి పోదా మనుకుంటారు? మానవ లోకంలో ప్రాప్తించే సుఖాల కన్నా స్వర్గ సుఖాలు మిన్నగా ఉంటాయి కనుకనే స్వర్గాన్ని వాంఛిస్తారు. ఏది ఏమైనా, తానున్న చోటు, తానున్న పరిస్థితి నచ్చక పోవడం చేతనే మరొక చోట, మరొక పరిస్థితిలో ఉండాలని మనిషి అభిలషిస్తాడు. అలా ఉండటం చేత తనలో అసంతృప్తి ఉండదని అభిప్రాయ పడతాడు. కాని వాస్తవం అలా లేదు. ఒక్క స్వర్గమే కాదు, బ్రహ్మలోకంతో సహా ఏ లోకాన్ని పొందినా దానిని విడిచిపెట్టి తిరిగి రావలసిందే. పైగా ఏ లోకమైనా క్షరమే. క్షరమైన లోకాన్ని పొందినా, దానిని విడిచి వచ్చిన తరువాత ***(లోకాః పునరావర్తినః)*** మళ్ళీ తృప్తి లేని జీవితమే. అలా జరగకుండా ఉండాలి అంటే మనం చేరే చోటు ఏదో అది క్షరం కానిదై ఉండాలి. అక్షరమై ఉండాలి. అదే పరమగతిగా ఉండాలి.

విజ్ఞులు అదే దర్శించారు. దానినే ప్రవచించారు ***(తం అక్షరాఖ్యం బ్రహ్మ పరమాం ప్రకృష్టాం గతిమ్).*** ఆ పరమగతియే అక్షర స్వరూపమైన పరబ్రహ్మము.

కావచ్చు. అవ్యక్తమైన బ్రహ్మము అక్షరమే కావచ్చు. దాని వల్ల మనకు కలిగే ప్రయోజన మేమిటి? దానిని పొందితే, దుఃఖాలయము, అశాశ్వతము అయిన జన్మను పొందడం ఉండదు *(8 - 15).* బ్రహ్మము అక్షరము కనుక నశించదు. అందుచేత దాని నుండి తిరిగి రావడం జరగదు ***(యం ప్రాప్య న నివర్తన్తే).*** అంటే అక్షర పరబ్రహ్మమును పొందిన వారు తిరిగి సంసారంలో ప్రవేశించరు ***(యం అక్షరం బ్రహ్మ ప్రాప్య గత్వా, న నివర్తన్తే సంసారాయ).*** ఆ పరమగతియే పరంధామము. ఉత్పత్తి వినాశ శూన్య స్వప్రకాశ పరంధామము. అదే బ్రహ్మప్రాప్తి ప్రయోజనము. ధామము అనగా స్థానము లేదా చోటు అని అర్థము. పరమాత్మ ఉండే స్థానమే పరంధామము. కనుకనే, అది నా పరమమైన ధామము అంటున్నాడు భగవంతుడు ***(తత్ ధామ మమ పరమమ్).***

మమ ధామ అంటే నా యొక్క ధామము అనే షష్ఠి ప్రయోగం వల్ల భేద కల్పన జరిగింది కదా! నా యొక్క ధామము అంటే నేను వేరు - నా ధామము వేరు అనే అర్థం రాదా? 'నా గృహం' అన్నప్పుడు నేను వేరు - నా గృహం వేరు అనే అర్థం వస్తుంది కదా! అలాగే నా ధామము అన్నప్పుడు నేను వేరు - నా ధామము వేరు అనే అర్థం వస్తుంది. అలా అయితే, మనం చేరేది బ్రహ్మమునా, బ్రహ్మధామమునా? అనే శంక తలెత్తుతుంది కదా!

నా ధామము అంటే నేను వేరు - నా ధామము వేరు అని అర్థం కాదు. **మమ ధామ** అనే దానిని **రాహోశ్శిరః** అనే చోట అర్థమును గ్రహించినట్లు గ్రహించాలి. **రాహోశ్శిరః** అంటే రాహువు శిరము అని అర్థము. అంటే రాహువు యొక్క శిరము అని అర్థం కాదు కదా! రాహువుకు వేరుగా దేహం ఉంటే కదా రాహువు యొక్క తల అనడానికి? తలే రాహువు. అలాగే దివ్యమైన ధామమే బ్రహ్మము. బ్రహ్మమే దివ్య ధామము. అందుచేత దానిని పొందిన వారు తిరిగి జన్మకు రారు ***(న చ పునరావర్తతే).***

అట్టి పరమాత్మను పొందే ఉపాయమును తెలుపు తున్నాడు.

పురుషః స పరః పార్థ భక్త్యా లభ్య స్త్వనన్యయా ।
య స్యాన్తఃస్థాని భూతాని యేన సర్వమిదం తతమ్ ॥ 22

పురుషః-సః-పరః-పార్థ-భక్త్యా-లభ్యః-తు-అనన్యయా
యస్య-అంతఃస్థాని-భూతాని-యేన-సర్వం-ఇదం-తతం

పార్థ	=	అర్జునా!	తతం	=	వ్యాప్త మైనదో
భూతాని	=	భూతములు	సః	=	ఆ
యస్య	=	ఎవని యొక్క	పరః	=	ఉత్తముడైన
అంతఃస్థాని	=	లోపల ఉన్నవో	పురుషః	=	పురుషుడు
యేన	=	ఎవని చేత	అనన్యయా	=	ఏకాగ్రమైన
సర్వం	=	సమస్తమైన	భక్త్యా తు	=	భక్తి చేతనే
ఇదం	=	ఈ జగత్తు	లభ్యః	=	లభిస్తాడు

అర్జునా! ప్రాణు లన్నీ అతని యందే ఉన్నాయి. ఈ ప్రపంచ మంతా అతని చేతనే పరివ్యాప్తమై ఉంది. అట్టి పురుషోత్తముడు అనన్య భక్తి చేత లభిస్తాడు.

వ్యాఖ్య

అవ్యక్తము కన్నా అన్యమైన అవ్యక్త రూపుడే అక్షర పరబ్రహ్మము అని ఇరవయ్యవ శ్లోకంలో చూశాం. అది సర్వ శ్రేష్ఠ మని గ్రహించాము. దానిని పొందితే తిరిగి జన్మకు రావడం జరగదు అని కూడా తెలుసు కున్నాం. మరి అలాంటి అక్షర పరబ్రహ్మమును ఎలా పొందాలి? అని ప్రశ్నించే చిత్తశుద్ధి గల ముముక్షువులకు బ్రహ్మప్రాప్తికి ఉపాయమైన ముఖ్య సాధనమును **పురుషః** అనే ప్రస్తుత శ్లోకము ద్వారా ఉపదేశిస్తున్నాడు.

పురుషః - *(1) పురి శయనాత్ పురుషః.* పురి అంటే శరీరము. పురిలో శయనించడం చేత పురుషుడు అని ఒక అర్థము. ***(2) పూర్ణత్వా ద్వా పురుషః.*** పూర్ణుడు కావడం చేత పురుషుడు అని మరియొక అర్థము. దీనిని బట్టి అవ్యక్త స్వరూపుడైన ఏ అక్షర పరబ్రహ్మమును మనం తెలుసుకున్నామో, అతడే మన శరీరంలో పురుషుడై ఉన్నాడు. అంతేకాదు అతడే ఈ జగత్తులో పూర్ణంగా నిండి యున్నాడు అని **పూర్ణత్వాత్** అనే పదం తెలుపుతూ ఉంది. ఒక్క వాక్యంలో, ప్రామాణికంగా శ్రుతి వాక్యంలో చెప్పాలి అంటే, **సర్వమిద మహం చ బ్రహ్మైవ** - ఈ ప్రపంచము, మరియు నేను కలిసి సర్వమూ బ్రహ్మమే.

అలాంటి బ్రహ్మమును పొందడానికి ఎక్కడికి పోవాలి? ఎక్కడికో పోవడానికి అతడు ఎక్కడో ఉంటే కదా! అంతటా ఉండేవాణ్ణి ఎక్కడికి వెళ్ళి పట్టుకోవాలి? అందరిలో పురుషుడుగా తానే ఉన్నాడు. ప్రపంచం అంతటా పూర్ణ రూపుడుగా తానే వ్యాపించి యున్నాడు. అలాంటి వాణ్ణి పొందడము అంటే అతణ్ణి గుర్తించడమే. ఎలా గుర్తించాలి? భక్తి చేతనే గుర్తించాలి. అనన్యమైన భక్తి చేతనే గుర్తించాలి. **వాసుదేవః సర్వమితి** - అంతటా వాసుదేవుడే అని గుర్తించాలి. ఇదే భక్తి. పరమేశ్వరునికి సంబంధించిన జ్ఞానమే భక్తి.

మోక్ష కారణ సామగ్ర్యాం భక్తి రేవ గరీయసీ
స్వ స్వరూపాను సంధానం భక్తి రిత్యభిధీయతే ॥

మోక్షానికి శాస్త్రోక్త మైన సాధనలలో భక్తియే శ్రేష్ఠ మైనది. స్వస్వరూపాను సంధానమే భక్తి అని చెప్పబడింది. ఆత్మయే బ్రహ్మము అనే స్వరూప విచారమే భక్తి అని అర్థము. దీనినే పరాభక్తి లేదా అనన్య భక్తి అంటారు.

కార్య రూపంలో తెలిసే సమస్త భూత ప్రపంచానికి పరమాత్మ కారణం. కార్యంలో ఉన్నదంతా కారణమే. మరి కార్యం ఉండేది కారణం లోనే కదా! ***(కార్యం కారణస్య అన్తర్వర్తి భవతి!).***

కార్య రూపంలో తెలిసే కెరటాలకు కారణమైన కడలి, కెరటాలకు వేరుగా ఉందా? కెరటాలుగా కనిపించేది కడలి జలమే కదా! కార్యాలైన కెరటా లన్నీ కారణమైన కడలి లోనే కదా ఉన్నాయి! అలాగే చరాచర భూతజాల మంతా పరమేశ్వరుని యందే ఉంది ***(యస్య పురుషస్య అన్తః స్థాని మధ్యస్థాని కార్యభూతాని).***

కార్యాలైన కెరటాలలో కడలి జలమే వ్యాపించి ఉన్నట్లు, కార్య రూపమైన ఈ జగత్తంతా కారణ రూపు డైన పురుషుని చేతనే పరివ్యాప్తమై ఉంది ***(యేన పురుషేణ సర్వం ఇదం జగత్ తతం వ్యాప్తం).*** ఈ విధమైన అఖండరూప స్థితిని గుర్తించడమే భక్తి. అట్టి జ్ఞాన సంబంధమైన భక్తి కలవాడు భాగవతోత్తముడు.

సర్వ భూతేషు యః పశ్యేత్ భగవద్భావం ఆత్మనః
భూతాని భగవత్యాత్మ న్యేష భాగవతోత్తమః ॥

సమస్త భూతములను ఎవడైతే భగవద్భావముతో చూస్తాడో, సర్వ భూతాలను భగవత్స్వరూప మైన తన ఆత్మలో దర్శిస్తాడో, వాడే భాగవతోత్తముడు.

అవగాహన ఉంటేనే భక్తి కుదురుతుంది. ఈశ్వర జ్ఞానం లేని వారికి అనన్యభక్తి కుదరదు. జ్ఞానం కలిగి భక్తి చేస్తేనే ముక్తి సిద్ధిస్తుంది. అంతేగాని, నేను కుంతీ కుమారుణ్ణి కదా! మా అమ్మ అచ్యుతునికి మేనత్త కదా! అనుకుంటే ఫలితం సిద్ధించదు. చేసుకున్న వారికి చేసుకున్నంత. ఎవరి భక్తి వారు చేసుకోవాలి. ఎవరి ముక్తిని వారు పొందాలి. ఎవరిని వారు ఉద్ధరించుకోవాలి. మోక్ష మార్గంలో 'తన - మన' పప్పులు ఉడకవు. అందుకనే, ఈ సందర్భంలో అర్జునుని కౌంతేయా! అని సంబోధించకుండా పార్థా! అని సంబోధించాడు జగద్గురువు.

మరణానంతరము జీవ ప్రయాణము, భిన్న మార్గాలు, ఫల విశేష భేదాలు మొదలైన విషయాలను ఇక్కడ నుండి వరుసగా నాలుగు శ్లోకాలలో చెబుతాడు.

యత్ర కాలే త్వనావృత్తి మావృత్తిం చైవ యోగినః ।
ప్రయాతా యాన్తి తం కాలం వక్ష్యామి భరతర్షభ ॥ 23

యత్ర-కాలే-తు-అనావృత్తిం-ఆవృత్తిం-చ-ఏవ-యోగినః
ప్రయాతాః-యాంతి-తం-కాలం-వక్ష్యామి-భరతర్షభ

భరతర్షభ	=	అర్జునా!
యత్ర	=	ఏ
కాలే తు	=	కాలము నందైతే
ప్రయాతాః	=	గతించిన
యోగినః	=	యోగులు
అనావృత్తిం	=	జన్మ రాహిత్యమును
యత్ర	=	ఏ
కాలే	=	కాలము నందు
ప్రయాతాః	=	గతించిన
ఆవృత్తిం చ ఏవ	=	పునర్జన్మమును
యాంతి	=	పొందుచున్నారో
తం	=	ఆ
కాలం	=	కాలమును
వక్ష్యామి	=	చెబుతున్నాను

అర్జునా! ఏ కాలంలో మరణించిన యోగులు తిరిగి జన్మకు రారో, ఏ కాలంలో గతించిన వారు తిరిగి జన్మిస్తారో, ఆ కాల విశేషాలను చెబుతున్నాను.

వ్యాఖ్య

యోగులు రెండు తెగలుగా తెలుస్తారు. ఒక తెగ వారు మోక్షమే పరమావధిగా భావించి, తదనుగుణంగా జీవించే వారు. రెండవ తెగ వారు మోక్షేతర మైన భావనతో భక్తి చేసే వారు.

మరణానంతరము మొదటి తెగ వారు తిరిగి రాని చోటికి పోతారు. రెండవ తెగ వారు తిరిగి జన్మకు వస్తారు. మరణము అందరికీ ఒకే విధంగా కనిపించినా, వారు మరణించే కాలము, మరణానంతరము వారు పయనించే మార్గము ఒకే విధంగా ఉండవు.

క్రియా భేదాత్ ఫలభేదః - అనే న్యాయాన్ని అనుసరించి ఎవరు ఎలా జీవిస్తారో దానిని బట్టి వారి మరణ కాలము, మరణానంతరము వారు పయనించే మార్గము, పొందే గమ్యము నిర్దేశింప బడుతాయి. చేరే గమ్యాన్ని బట్టి వారు తిరిగి జన్మిస్తారా, లేక జన్మ రాహిత్యాన్ని పొందుతారా అనేది నిర్ణయ మౌతుంది.

ఏ కాలంలో మరణించి, ఏ మార్గం గుండా పయనించే యోగులు పునరావృత్తిని పొందరో, ఏ కాలంలో గతించి, ఏ మార్గం ద్వారా ప్రయాణాన్ని సాగించే యోగులు పునరావృత్తిని పొందుతారో భగవంతుడు చెబుతున్నాడు.

ఆత్మబంధువులారా! మరణానంతరము యోగుల పరలోక గమనాన్ని చర్చించే ఈ ప్రకరణము ఈ అధ్యాయంలో చివరి విషయము. ఇది పరలోక విషయం కావడం చేత మీమాంసతో కూడి ఉంటుంది. మనస్సు పెట్టి విచారిస్తూ అర్థం చేసుకోవలసిన అవసరం ఉంటుంది.

మానవ లోకం ఉన్నట్లే మరెన్నో లోకాలు ఉన్నాయని శాస్త్రాలు చెబుతాయి. పరలోకం అనేది ఒకటి ఉంది అని చాలా మతాలు చెబుతాయి. కాకపోతే, పరలోకం ఉందని ఒక వైపు అంగీకరిస్తూనే మరొక వైపు పునర్జన్మ లేదని కొన్ని మతాలు చెబుతాయి. బౌద్ధమతం లాంటి మతాలు కర్మ సిద్ధాంతాన్ని, పునర్జన్మమును అంగీకరిస్తూనే, మరణము - మరణానంతరము - పునర్జన్మము అనే విషయంలో మింగుడు పడని అనేక సిద్ధాంతాలను ప్రవేశ పెడతాయి.

ఈ సందర్భంలో నా దొక్క మనవి. తత్త్వశాస్త్రం జ్ఞాన ప్రధానమైంది. దానిని ప్రామాణికంగా చర్చించి నిర్ణయించ వచ్చు. కర్మ సిద్ధాంతానికి వచ్చే సరికి కొన్ని విషయాలను నమ్మవలసి వస్తుంది. నమ్మకానికి సంబంధించిన విషయాలలో కూడా కొన్నిటిని పరిశోధించి నిర్ణయించ వచ్చు. కొన్ని మాత్రం పరిశీలనకు, పరిశోధనకు అందని విషయాలుగా ఉంటాయి. అలాంటి వాటిని శ్రద్ధతో విశ్వసించాలే గాని, పిడివాదాలతో పిండి కొట్టడం సాధ్యం కాదు. కాకపోతే, అశాస్త్రీయంగా, అంధ విశ్వాసంతో హేతుబద్ధత లేని విషయాలను వివరించే మతాలకు విలక్షణంగా వేదం నమ్మకాలకు సంబంధించిన నిజాలను సహేతుకంగా వివరిస్తుంది. మహర్షులు ప్రవచించే విషయాలు, సాక్షాత్తు భగవంతుడు బోధిస్తున్న విషయం ఒకే విధంగా, సమన్వయ స్వరూపంగా గోచరిస్తున్నందున దీనిని మనం పవిత్ర ప్రసాదంగా స్వీకరించాలి. నా మట్టుకు నేను ఈ లోకాంతర గమనాన్ని వేద, పురాణ, ఇతిహాస, ఉపనిషత్తులలో చర్చింప బడిన విషయాలను స్మృతిలో ఉంచుకొని విస్పష్టంగా విశదీకరించడానికి ప్రయత్నిస్తాను. నమ్మి గాని నమ్మను స్వీకరించడంలో నష్టం లేదు. లాభమే ఉంటుంది.

ముందుగా పునరావృత్తి లేని వారు పయనించే మార్గాలను విశదీకరిస్తున్నాడు.

అగ్ని ర్జ్యోతి రహః శుక్లః షణ్మాసా ఉత్తరాయణమ్ ।
తత్ర ప్రయాతా గచ్ఛన్తి బ్రహ్మ బ్రహ్మవిదో జనాః ॥ 24

అగ్నిః-జ్యోతిః-అహః-శుక్లః-షణ్మాసాః-ఉత్తరాయణం
తత్ర-ప్రయాతాః-గచ్ఛంతి-బ్రహ్మ-బ్రహ్మవిదః-జనాః

అగ్నిః	=	అగ్నియు
జ్యోతిః	=	తేజము
అహః	=	పగలు
శుక్లః	=	శుక్లపక్షము
షణ్మాసాః	=	ఆరు మాసములు గల
ఉత్తరాయణం	=	ఉత్తరాయణమును
తత్ర	=	ఆ కాలము నందు
ప్రయాతాః	=	చనిపోయిన
బ్రహ్మవిదః	=	బ్రహ్మవేత్త లగు
జనాః	=	జనులు
బ్రహ్మ	=	బ్రహ్మమును
గచ్ఛంతి	=	పొందుతున్నారు

అర్జునా! బ్రహ్మవేత్త లైన వారు అగ్ని, జ్యోతి, పగలు, శుక్లపక్షం, ఆరు నెలల ఉత్తరాయణం కల మార్గంలో పయనించి బ్రహ్మమును పొందుతారు.

వ్యాఖ్య

దేవయానము

బ్రహ్మోపాసకులు పయనించే మార్గాన్ని దేవయానము అంటారు. దీనినే అర్చిరాది మార్గము, శుక్లగతి

అని కూడా అంటారు. ***అర్చిః*** అంటే ప్రకాశము లేదా అగ్నిజ్వాల అని అర్థము. బ్రహ్మోపాసకులు మరణానంతరము పయనించే దేవయాన మార్గము అగ్నితో ప్రారంభమై ప్రకాశవంతమైన మార్గంలో సాగుతుంది కనుక దానిని అర్చిరాది మార్గము అన్నారు. కాంతివంత మైన జ్ఞానమార్గంలో పయనించే బ్రహ్మోపాసకులు జ్ఞానానంద స్వరూపుడైన బ్రహ్మను పొందుతారు. ఈ ప్రయాణము చాలా ఆనందప్రదంగా ఉంటుంది.

మరణించిన బ్రహ్మోపాసకులు భూలోకము నుండి బ్రహ్మలోకమును చేరడానికి అంచెలంచెలుగా పయనిస్తారు. మొదట అగ్నిని, తరువాత జ్యోతిని చేరి - అలా అలా పయనించి బ్రహ్మలోకం చేరుతారు. ఇక్కడ అగ్ని అంటే అగ్ని అభిమాన దేవత అని, జ్యోతి అంటే జ్యోతి అభిమాన దేవత అని అర్థము. ఈ అభిమాన దేవతలను ఆతివాహిక దేవతలు అంటారు. ఆతివాహికులు అంటే తీసికొని పోయేవారు. ***ఆతివాహికా స్తల్లింగాత్*** అనే బ్రహ్మసూత్రము అగ్న్యాదులను ఆతివాహికులుగా గ్రహించ మని ప్రబోధిస్తూ ఉంది.

మరణించ గానే బ్రహ్మోపాసకుడు అగ్ని అభిమాన దేవతను చేరుతాడు. అగ్ని దేవత అతనిని తీసికొని వెళ్ళి జ్యోతి అభిమాన దేవతకు అప్పగిస్తుంది. జ్యోతి దేవత పగటి దేవతకు, పగటి దేవత శుక్లపక్ష దేవతకు, శుక్లపక్ష దేవత ఉత్తరాయణాభిమాన దేవతకు అప్పగిస్తుంది. ఈ విధంగా బ్రహ్మోపాసకుడు క్రమమార్గంలో బ్రహ్మను చేరుతాడు.

మరణించిన కాలాన్ని బట్టి, లోకాంతర గమన మార్గం నిర్ణయింప బడుతుంది కనుక ***తం కాలం వక్ష్యామి.*** ఆ కాలాన్ని చెబుతున్నాను అని పూర్వ శ్లోకంలో భగవానుడు చెప్పడం జరిగింది. కాని, ఆతివాహికులు ఎందరో ఉండగా కేవలం కాలాభిమాన దేవతనే దృష్టిలో ఉంచుకొని ఆ కాలాన్ని చెబుతాను అనడం సమంజస మేనా? అనే పూర్వపక్షం కూడా ఉంది.

ఛత్రిణో గచ్ఛన్తి - ఛత్రధారులు పోతున్నారు అన్నప్పుడు, ఆ పోయే వారందరూ ఛత్రధారులే అని అర్థం కాదు కదా! వారి మధ్య గొడుగులు లేని వారు కూడా కొందరు పోతూ ఉంటారు. కాని ఎక్కువ మంది గొడుగులు ధరించి పోతున్నారు కనుక ఛత్రధారులు పోతున్నారు అనడం జరిగింది. అలాగే ఆతివాహికులలో కాలాభిమాన దేవతలే అధికంగా ఉండటం చేత అలా కాల శబ్ద ప్రయోగం చేయడం జరిగింది.

అగ్ని మొదలైన వాటి క్రమంలో అగ్ని తరువాత జ్యోతి, జ్యోతి తరువాత పగలు అని ప్రస్తుత శ్లోకంలో ఉంది. కాని, వేదంలో అగ్ని తరువాత పగలే ఉంది గాని జ్యోతి లేదు ***(తేఽ ర్చిష మభిసంభవ న్త్యర్చిషోఽ హః - శ్రుతి).*** గీత శ్రుతి విరుద్ధంగా బోధించింది అనే పూర్వ పక్షం కూడా ఉంది. అది సరి యైనది కాదు. అర్చి శబ్దమునకు కాంతి అర్థమై ఉన్నందున అగ్ని, జ్యోతిస్సులు రెండూ ప్రకాశవంతములే అగుట చేత, ప్రకాశవంత మైన అగ్ని అని వేదము రెండిటిని ఒక్కటిగా గ్రహిస్తే, గీతాచార్యుడు వాటిని అగ్ని - జ్యోతి అని రెండుగా పేర్కొన్నాడు. అంతే. కనుక, గీత శ్రుతి భిన్నం కాదు.

అగ్న్యాది అభిమాన దేవతల ద్వారా దేవయానంలో, లేదా అర్చిరాది మార్గంలో ప్రయాణం చేసిన బ్రహ్మోపాసకులు బ్రహ్మలోకము చేరే ముందు 'విరజ' నదిని దాటుతారు అని ఉపనిషత్తులో ఉంది. 'విరజ' ***(విగతరజస్)*** అంటే విడిచిన రజోగుణము కలది అని అర్థము. ఉపాసకులు తమలో మిగిలి ఉన్న రజోగుణాన్ని విరజ నదిలో విడిచేస్తారు. తమోగుణము మరణానికి ముందే నశించి ఉంటుంది కనుక, కేవలం సత్త్వగుణ ప్రధానులై బ్రహ్మలోకంలో ప్రవేశిస్తారు. ప్రళయ కాలము ప్రాప్తించు వరకు బ్రహ్మలోకము లోనే ఉండి, చతుర్ముఖ బ్రహ్మ వద్ద బోధను గ్రహించి, పూర్ణజ్ఞానులై, ప్రళయ కాలంలో పరమేశ్వర స్వరూపాన్ని పొందుతారు.

మరణానంతరము అర్చిరాది మార్గము గుండా బ్రహ్మలోకమును చేరిన వారిని బ్రహ్మవిదులు అన్నాడు

గీతాచార్యుడు. ఇక్కడ బ్రహ్మవిదులు అంటే బ్రహ్మజ్ఞానులు అని అర్థం కాదు. బ్రహ్మోపాసకులు అని అర్థం. 'ఓం' అనే ఏకాక్షర బ్రహ్మమును ఉపాసించిన వారు (8 - 13). లేదా సగుణ బ్రహ్మోపాసకులు అని అర్థం.

బ్రహ్మజ్ఞాని జీవన్ముక్తుడు. అతడు జీవించి ఉన్నప్పుడే ముక్తుడు అయినందున అతడు ఇక్కడే బ్రహ్మమై ఉన్నాడు ***(అత్ర బ్రహ్మ సమశ్నుతే).*** జీవన్ముక్తుడు జీవించి ఉండగానే శరీరత్రయాన్ని నశింప చేసుకున్నాడు. ఇక ప్రయాణించడానికి అతనికి సూక్ష్మదేహ మెక్కడుంది? కనుక జ్ఞానులకు ప్రాణోత్క్రమణము లేదు. ***న తస్య ప్రాణా ఉత్క్రామన్తి*** అని శ్రుతి నిర్ణయము.

కనుక ప్రకృష్ట మైన, ప్రకాశవంత మైన పవిత్ర మార్గం దేవయానము, లేదా అర్చిరాది మార్గము. ఇది ఉత్తరాయణ పుణ్య కాలము. మకర సంక్రమణం నుండి ఆరు మాసాలు సూర్యుడు ఉత్తరంగా పయనిస్తాడు కనుక అది ఉత్తరాయణము. జ్యోతిర్మార్గము. దేవయానము. పునరావృత్తి లేని మార్గము.

క॥ ***పునరావర్తన రహితుం డనఘా పరమాత్ముం జెంది నట్టి పురుషుండ***
వ్వినుతావస్థను మోక్షం బని చెప్పుదు రంత కంటె నధికము గలదే॥

అని మహాభారతము - శాంతిపర్వములో తిక్కనార్యుని అందమైన కందము.

ఇక పితృయాణ మార్గాన్ని గూర్చి చెబుతాడు.

ధూమో రాత్రి స్తథా కృష్ణః షణ్మాసా దక్షిణాయనమ్ ।
తత్ర చాన్ద్రమసం జ్యోతి ర్యోగీ ప్రాప్య నివర్తతే ॥ 25

ధూమః-రాత్రిః-తథా-కృష్ణః-షణ్మాసాః-దక్షిణాయనం
తత్ర-చాంద్రమసం-జ్యోతిః-యోగీ-ప్రాప్య-నివర్తతే

ధూమః	=	ధూమము	యోగీ	=	యోగి
రాత్రిః	=	రాత్రి	తత్ర	=	ఆ మార్గము నందు
తథా	=	అలాగే	చాంద్రమసం	=	చంద్ర సంబంధమైన
కృష్ణః	=	కృష్ణపక్షము	జ్యోతిః	=	జ్యోతిని
షణ్మాసాః	=	ఆరు మాసములు గల	ప్రాప్య	=	పొంది
దక్షిణాయనం	=	దక్షిణాయనము	నివర్తతే	=	పునర్జన్మము నెత్తుచున్నాడు

అర్జునా! ఫలాసక్తి గల కర్మయోగి ధూమము, రాత్రి, కృష్ణ పక్షము, ఆరునెలల దక్షిణాయనము కల మార్గంలో పయనించి, చంద్రకాంతి వంటి స్వర్గాన్ని పొంది, తిరిగి జన్మిస్తాడు.

వ్యాఖ్య

పితృయాణము

ఫలాపేక్షతో సకామ కర్మలను ఆచరించిన యోగులు మరణానంతరము పయనించే మార్గాన్ని పితృయాణము అంటారు. ఇది ధూమాది మార్గము. బ్రహ్మోపాసకులది అర్చిరాది మార్గము కనుక కాంతివంతంగా ఉంటుంది. వీరిది ధూమాది మార్గం కనుక పొగసూరి ఉంటుంది. వీరి మార్గ మంతా ధూమము, రాత్రి, కృష్ణ పక్షము - ఇలా అంధకారంతో నిండి ఉంటుంది.

దేవయాన మార్గంలో అగ్న్యాదులను అభిమాన దేవతలుగా ఎలా గ్రహించామో ఇక్కడ కూడా ధూమాదులను అభిమాన దేవతలుగా గ్రహించాలి. **ధూమః** అంటే ధూమాభిమాన దేవత, **రాత్రిః** అంటే రాత్రి

అభిమాన దేవత, **కృష్ణః** అంటే కృష్ణపక్షాభిమాన దేవత, షణ్మాస రూప దక్షిణాయన అభిమాన దేవత. పితృయాణ మార్గంలో వీరే ఆతివాహిక దేవతలు.

అథయే యజ్ఞేన దానేన తపసా లోకాన్ జయన్తి తే ధూమ మభి సంభవన్తి।

యజ్ఞము, దానము, తపస్సు నాచరించిన వారు ధూమ మార్గము ననుసరించి పయనిస్తారు అన్నది బృహదారణ్యకోపనిషత్తు *(8 - 2 - 15).* అగ్నిహోత్రాది కర్మ లాచరించే వారు, ఇష్టాపూర్త దత్తాది కర్మల్ని ఆచరించే వారు పితృయాణములో పయనిస్తారు. యజ్ఞయాగాదులు ఇష్టము లైతే, వాపీ కూప తటాకాది నిర్మాణాలు పరోపకారార్థం చేయడం పూర్తములు. ఇక దత్తాదు లంటే దానకర్మలు అని అర్థము. నేటి కాల పరిస్థితులను అనుసరించి చెప్పాలంటే, ఉచిత విద్యాలయాలు, ఉచిత వైద్యశాలలు, అనాథ శరణాలయాలు, ఉచిత త్రాగునీటి పథకాలు - ఇవన్నీ దత్తాదుల క్రిందికే వస్తాయి. గో సువర్ణ వస్త్ర అన్న దానాదులు కూడా దత్తాది కర్మలే.

ఈ విధమైన సకామ కర్మయోగులు మరణించ గానే సూక్ష్మ శరీరధారులై పయనించి ధూమాభిమాన దేవతను చేరుతారు. ధూమాభిమాన దేవత రాత్రి అభిమాన దేవతను, రాత్రి అభిమాన దేవత కృష్ణ పక్షాభిమాన దేవతను, కృష్ణ పక్షాభిమాన దేవత దక్షిణాయనాభిమాన దేవతను చేరడం జరుగుతుంది. అక్కడ నుండి చంద్రలోకాన్ని చేరుతారు. ఇది పితృయాణ ఆరోహణ క్రమము.

సకామ కర్మయోగులు చంద్ర లోకంలో జలమయ దేహాలను ధరించి దివ్యమైన భోగాలను అనుభవిస్తారు. చంద్ర లోకంలో జ్యోతిని పొందుతారు ***(తత్ర చాన్ద్రమసం జ్యోతిః ప్రాప్య).*** ఇక్కడ జ్యోతిస్సు అంటే కర్మఫలం. యోగి ఆచరించిన పుణ్య కర్మఫలం. దానిని అనుభవించి, కొద్దిగా పుణ్యఫలం మిగిలి ఉండగానే తిరిగి భూ లోకానికి ప్రయాణ మవుతారు. అంటే, పుణ్యఫలం పూర్ణంగా అనుభవించకుండా కొంత మిగుల్చుకొని తిరిగి వస్తాడా? అవును. శాస్త్రం అలాగే చెప్పింది. ఈ విషయాన్ని బ్రహ్మసూత్రాలలో బాదరాయణుడు కూడా ధృవపరచాడు.

కృతాత్యయేఽ నుశయవాన్ - చంద్ర లోకంలో పుణ్యకర్మ క్షయ మైనపుడు ***(కృతాత్యయే)*** మిగిలిన పుణ్యఫలముతో క్రిందికి దిగుతున్నాడు ***(అనుశయవాన్)*** అని బ్రహ్మసూత్రము. అంటే, మిగిలిన పుణ్య ఫలాన్ని అనుశయము అంటారు.

మనం విహార యాత్రగా కాశ్మీరానికో, కొడైకెనాల్‌కో వెళ్తాం. ఆ యాత్రకు అవసరమైన ధనాన్ని తీసికొని పోతాం. ఆ ధనాన్ని మనం ఎంత స్వేచ్ఛగా ఖర్చు పెట్టుకున్నా, తిరుగు ప్రయాణానికి కొంత ప్రక్కన పెడతామా, లేదా? అదే అనుశయము అంటే. మొత్తం ఖర్చు పెట్టేస్తే తిరిగి వచ్చే దెలా? పితృయాణ మార్గంలో పయనించిన సకామ యోగులు చంద్రలోకంలో పుణ్యఫలాన్నంతా అనుభవించేస్తే, తిరిగి జన్మకు ఎలా వస్తారు? మిగిలిన పుణ్యం తోనే రావాలి. మరో దారి లేదు. ఆ మిగిలిన పుణ్యమే అనుశయము.

తిరోగమనము

పితృయాణ మార్గము పునరావృత్తి కలదిగా ముందే తెలుసుకొని ఉన్నాము. చంద్రలోకము నుండి తిరిగి భూ లోకానికి చేరడానికి కూడా ఈ కృష్ణగతి మార్గంలో అవరోహణ క్రమం ఉంది. ఈ ప్రయాణ వివరాలను ఛాందోగ్య బృహదారణ్యకాలు స్వల్ప భేదంతో అభివర్ణించాయి.

ఆకాశా ద్వాయుం వాయోర్వృష్టిం వృష్టిః పృథివీం ప్రాప్య అన్నం భవన్తి। తే పునః పురుషాగ్నౌ హూయన్తే తతో యోషాగ్నౌ జాయన్తే తే లోకాన్ప్రత్యుత్థాయినః

తిరోగమనంలో, అంటే చంద్రలోకం నుండి భూలోకానికి తిరిగి పయనించే అవరోహణ క్రమంలో ప్రథమంగా చంద్రలోకం నుండి ఆకాశానికి చేరి, అక్కడ వాయువుతో కలిసి మేఘంలో ప్రవేశిస్తాడు. మేఘము నుండి వర్ష రూపంలో భూమికి దిగి, భూలోకములో ఓషధులను ఆశ్రయించుకొని కొంత కాలం సూక్ష్మంగా ఉంటాడు ***(అన్నం భవన్తి!).*** ఆ అన్నమును పురుషుడు భుజించ గానే పురుషునిలో ప్రవేశించి వీర్య రూపమున ఉంటాడు. పురుషుని నుండి స్త్రీ గర్భంలో ప్రవేశించి దేహాన్ని ధరిస్తాడు. ఇది అవరోహణ క్రమము.

దేవయానము గుండా ఉత్తరాయణంలో పయనించిన వారు బ్రహ్మలోకాన్ని చేరి, బ్రహ్మ సన్నిధిలో శ్రవణం చేసి క్రమముక్తిని పొందుతారు. వారు పునరావృత్తి నెరుగరు. అంటే తిరిగి భూలోకంలో జన్మించరు.

పితృయాణ మార్గంలో దక్షిణాయనమున పయనించిన వారు చంద్రలోకం చేరి, పుణ్య ఫల భోగాలను అనుభవించి, పుణ్యఫలం క్షీణించ గానే, దారి బత్తెమునకు కొంత మిగుల్చుకొని తిరిగి భూలోకంలో జన్మిస్తారు. వారికి పునరావృత్తి ఉంటుంది. అంటే, తిరిగి వారు భూలోకంలో జన్మిస్తారు.

ఈ శుక్ల కృష్ణ గతులను సంక్షేపంగా చెబుతున్నాడు.

శుక్లకృష్ణే గతీ హ్యేతే జగతః శాశ్వతే మతే।
ఏకయా యా త్యనావృత్తి మన్య యావర్తతే పునః ॥ 26

శుక్లకృష్ణే-గతీ-హి-ఏతే-జగతః-శాశ్వతే-మతే
ఏకయా-యాతి-అనావృత్తిం-అన్యయా-ఆవర్తతే-పునః

శుక్లకృష్ణే	=	శుక్లకృష్ణము లైన	ఏకయా	=	ఒక మార్గముచే
ఏతే	=	ఈ	అనావృత్తిం	=	జన్మరాహిత్యమును
గతీ హి	=	గతులు	యాతి	=	పొందుతాడు
జగతః	=	జగత్తునకు	అన్యయా	=	రెండవ మార్గముచే
శాశ్వతే	=	శాశ్వతములని	పునః	=	తిరిగి
మతే	=	భావింపబడు తున్నాయి	ఆవర్తతే	=	జన్మిస్తాడు

అర్జునా! శుక్ల గతి, కృష్ణ గతి - ఈ రెండూ జగత్తులో శాశ్వతంగా ఉన్నాయి. ఒక దాని వల్ల జన్మ రాహిత్యం జరిగితే, మరొక దాని వల్ల పునర్జన్మ ప్రాప్తిస్తుంది.

వ్యాఖ్య

జగన్నాటక మంతా రాత్రింబవళ్ళతో సాగి పోతోంది. జీవితం వెలుగు నీడల సంగమంగా తెలుస్తోంది. చీకటి వెలుగులు ఈ ప్రపంచంలో అనాదిగా ఉన్నాయి. ప్రవాహ రూపంగా సాగుతున్నాయి.

జగత్తు అనే రంగస్థలి ఉన్నంత వరకు జీవనాటకం లేదా జీవితనాటకం నడుస్తూనే ఉంటుంది. సంసారం ఎప్పటి నుండో ఉంది. అనాదిగా ఉంది. అందుచేతనే సంసారానికి సంబంధించిన శుక్ల కృష్ణ గతులు కూడా అనాదిగా ఉన్నాయి ***(గతీ శాశ్వతే నిత్యే సంసారస్య నిత్యత్వాత్).*** ఉపాసకులు, కర్మపరులు - వీరిరువురు ఉన్నంత వరకు ఈ రెండు మార్గాలూ ఉంటాయి. ఒక మార్గం ఊర్ధ్వంగా నడిపిస్తే, మరొక మార్గం పతనానికి దారి తీస్తుంది.

దేవయాన మనే ఉత్తరాయణం కాంతి మయమైంది. జ్ఞానరూప మైంది. పగలు వెలిగినట్లు ప్రకాశిస్తుంది. జన్మకు రాకుండా నివారిస్తుంది. మోక్షాన్ని పొందేలా చేస్తుంది. కనుకనే అది శుక్లగతి. అర్చిరాది మార్గము.

పితృయాణ మనే దక్షిణాయనం ధూమాయతంగా ఉంటుంది. జ్ఞాన రహితంగా ఉంటుంది. రాత్రి లాగా చీకట్లు ముసురుకొని ఉంటుంది. పునర్జన్మను కలిగిస్తుంది. బంధానికి హేతు వవుతుంది. కనుకనే అది కృష్ణగతి. ధూమాది మార్గము.

కర్మణా పితృలోకో విద్యయా దేవలోకః - కర్మ చేత పితృయాణ మార్గము ప్రాప్తిస్తే, జ్ఞానం చేత దేవయాన మార్గం సిద్ధిస్తుంది. చీకటి దారి ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎవరి కైనా దుఃఖాన్నే కలిగిస్తుంది. వెలుగుల దారిలో వెలుగులే ఉంటాయి. వెతలు అదృశ్య మవుతాయి. ఏ మార్గాన్ని త్యజించాలో, దేనిని అనుసరించాలో విజ్ఞులే నిర్ణయించుకోవాలి. ఎవరికి వారు విచారంలో విజ్ఞులు కావాలి. మోహం నుండి విడిపడాలి. మోక్షాన్ని పొంది తరించాలి.

చివరగా భగవంతుడు దీనినే సందేశంగా అనుగ్రహిస్తున్నాడు.

నైతే సృతీ పార్థ జాన న్యోగీ ముహ్యతి కశ్చన ।
తస్మా త్సర్వేషు కాలేషు యోగయుక్తో భవార్జున ॥ 27

న-ఏతే-సృతీ-పార్థ-జానన్-యోగీ-ముహ్యతి-కశ్చన
తస్మాత్-సర్వేషు-కాలేషు-యోగయుక్తః-భవ-అర్జున

పార్థ	=	అర్జునా!	తస్మాత్	=	అందువలన
ఏతే	=	ఈ రెండు	సర్వేషు	=	సమస్తమైన
సృతీ	=	మార్గములను	కాలేషు	=	కాలముల యందు
జానన్	=	తెలిసిన	అర్జున	=	అర్జునా!
యోగీ	=	యోగి	యోగయుక్తః	=	యోగయుక్తుడవు
కశ్చన	=	ఎవడును	భవ	=	కమ్ము!
న ముహ్యతి	=	మోహము నొందదు			

అర్జునా! ఈ రెండు మార్గాలను తెలిసిన వాడు మోహమును పొందడు. అందుచేత, అన్ని కాలాలలో యోగయుక్తుడవై ఉండు.

వ్యాఖ్య

గమ్యాలు - గమనాలు

అష్టమాధ్యాయ మైన అక్షర పరబ్రహ్మ యోగము ముగింపు దశకు చేరుకున్నాం. ఈ అధ్యాయం లోని ప్రత్యేక సాధన సాధ్యాలను అర్థం చేసుకున్నాం. సింహావలోకనం చేసుకొంటే, ప్రధానంగా నాలుగు రకాలైన వ్యక్తులు మన మనస్సులో మెదుల్తారు. జీవితంలో వ్యక్తులు సాధించే గమ్యాలను, వారికి ప్రాప్తించే గతులను దృష్టిలో ఉంచుకొని, నాలుగు విధాలుగా వారిని విభజించు కుంటున్నాము.

మొదటి వారు లౌకికులు. విషయ వాసనాపరులు. భోగాసక్తులు. స్వార్థమే గాని పరార్థం పట్టని వారు. పరమార్థం గిట్టని వారు. వీరికి కడుపే కైలాసం - కొంపే కైవల్యం. జీవిత మేమిటో, జీవిత గమ్య మేమిటో పొరపాటున కూడా ఆలోచించని వారు. ఇలాంటి అభాగ్యులు చస్తూ పుడుతూ, పుడుతూ చస్తూ జనన మరణ చక్రంలో పరిభ్రమిస్తూ ఉంటారు. వీరికి అంతరించే ఉబలాటమే గాని తరించే ఉపాయము తెలియదు. ఎక్కువ శాతం ప్రపంచంలో వీరే.

రెండవ వారు మహాత్ములు. వీరే జీవన్ముక్తులు. బ్రహ్మాత్మ జ్ఞానం కలిగిన వారు. స్థిరమైన జ్ఞానము కలవారు. నిత్యానంద స్వరూపులు. వీరికి ప్రపంచము విస్మృత ప్రాయము. దేహము ఛాయ లాంటిది. అంతటా వీరికి బ్రహ్మ దర్శనమే. వీరు కృతకృత్యులు. ఆప్తకాములు. సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపులు. జీవించి ఉండగనే సూక్ష్మ కారణ దేహాలను నశింప చేసుకున్న వారు. మృత్యువు నెరుగరు. కనుక లోకాంతర గమనము, పునర్జన్మము వీరి విషయంలో అర్థ రహితము. వీరి దర్శనమే భగవద్దర్శనము. ఇలాంటి వారు ఎక్కడో అరుదుగా ఉంటారు.

మూడవ వారు ముముక్షువులు. మోక్షమే పరమావధిగా కలిగి ఉంటారు. కామ్యకర్మల జోలికి పోరు. బ్రహ్మోపాసనలో జీవిస్తూ ఉంటారు. లేదా, సగుణ బ్రహ్మ ధ్యానంలో రమిస్తూ ఉంటారు. వీరికి అంతఃకరణ శుద్ధి ఉంటుంది. సాధన సాగుతూ ఉంటుంది. కాని జీవితంలో జీవన్ముక్తుల లాగా మోక్షాన్ని పొందలేక పోతారు. ఇలాంటి వారు మరణించిన తరువాత ఉత్తరాయణంలో దేవయాన మార్గం గుండా బ్రహ్మలోకం చేరి, అక్కడ బ్రహ్మ సన్నిధిలో జ్ఞానోపదేశమును అందుకొని, ప్రళయ కాలంలో బ్రహ్మతో సహ పరమేశ్వర ప్రాప్తిని పొంది తరించి పోతారు. వీరికి పునరావృత్తి ఉండదు. పునర్జన్మ ఉండదు.

నాల్గవ వారు సకామ యోగులు. వీరికి కర్మలలో ఫలాపేక్ష ఉంటుంది. యజ్ఞ యాగాదులు నిర్వహిస్తారు. పరోపకారార్థం అనేక ఇష్టాపూర్త కర్మలు ఆచరిస్తారు. దాన ధర్మాలు చేస్తారు. భోగాసక్తి పరులైన వీరు మరణానంతరం దక్షిణాయనంలో పితృయాణ మార్గం గుండా పయనించి చంద్రలోకం చేరుతారు. అక్కడ పుణ్యఫల భోగాలను అనుభవించిన తరువాత తిరిగి మానవ లోకానికి వస్తారు. వీరికి పునరావృత్తి ఉంటుంది. పునర్జన్మ ఉంటుంది. వీరు మొదటి వారి లాగా బ్రతుకును అన్యాయం చేసుకోరు. అలాగని రెండు, మూడవ కోవల లోని వారి లాగా తరించరు.

సంక్షేపంగా చెప్పుకుంటే (1) మహాత్ములు లేక జీవన్ముక్తులు దేహము ఉండగానే తరించి పోతారు. (2) ముముక్షువులు లేక బ్రహ్మోపాసకులు మరణానంతరము బ్రహ్మలోకంలో క్రమముక్తిని పొందుతారు. (3) సకామ యోగులు మోక్ష స్పృహ లేక ఫలాకాంక్షతో స్వర్గాది లోకాలలో భోగాలను అనుభవించి మళ్ళీ జనన మరణాల ఊబిలో పడుతూ ఉంటారు. (4) ఇక లౌకికు లంటారా! పురుషార్థం లేక, పరమార్థం తెలియక, అర్థరహితంగా జీవిస్తూ, జన్మలను వ్యర్థం చేసుకుంటూ, భూమికి భారంగా, గాలికి అడ్డంగా చరిస్తూ ఉంటారు. ఈ నాలుగు విధాలైన వ్యక్తులలో మన మేమిటో, ఎక్కడున్నామో తెలుసుకొని, ఆ తరువాత ఏది శ్రేయస్సో నిశ్చయించుకొని, తదనుగుణంగా జీవించాలి. అలా జీవించే వారెవ్వరూ మోహానికి గురి కారు.

మోహము - మోక్షము

జన్మ రాహిత్యము - జన్మ సాఫల్యము తెలియక కేవలం జన్మల చుట్టే పరిభ్రమించే లౌకికులు గాని, సకామ యోగులు గాని మోహ ఊబిలో కూరుకు పోయిన వారే. వారిని ప్రక్కన పెడితే, జ్ఞానులు, బ్రహ్మోపాసకులు వీరిరువురే మోక్షరూపులు. మోహం చెందని వారు.

మరణించక ముందే తరించే వారు జ్ఞానులు. మరణించిన తరువాత తరించే వారు ముముక్షువు లైన ఉపాసకులు. బ్రతికినా చచ్చినా తరించని వారు లౌకికులు మరియు సకాములు.

దేవయాన పితృయాణ మార్గాలను ముందుగానే తెలుసుకున్న వారు మోహానికి గురి కారు అంటున్నాడు భగవంతుడు. ఇందులో ఒకటి మోక్షానికి, రెండవది మోహానికి దారి తీస్తుందన్న వివేకాన్ని కలిగించి మోహాన్ని నివారిస్తుంది. మోహము మోక్షానికి విరుద్ధం అని తెలిసిన తరువాత మోహంలో ఎవరైనా ఎందుకు పడతారు?

(జానన్ సంసారాయ ఏకా, అన్యా మోక్షాయ చ ఇతి యోగీ న ముహ్యతి). మోహంలో ఎవడు పడడో వాడే సమాహిత చిత్తుడైన యోగి.

యోగము - యోగ్యము

ఇంత చెప్పిన తరువాత, చివరగా అర్జునా! యోగయుక్తుడవు కా! అంటున్నాడు భగవంతుడు ***(యోగ యుక్తో భవ!).*** ఇక్కడ యోగి అంటే జ్ఞానయోగి. జీవన్ముక్తికై యత్నించే పుణ్యాత్ముడు. మోక్షమే పరమావధిగా గలవాడు. మోక్షం జ్ఞాన రూపంలో ఉంది అనే నిశ్చయమైన వివేకం కలవాడు.

క్రమ ముక్తికి సంబంధించిన బ్రహ్మలోక విషయాన్ని ప్రక్కన పెడితే, మోక్ష మనేది లోకాలలో లేదు అని తెలిసిన వాడు ముముక్షు యోగి. మోక్షము ఎక్కడో, ఎప్పుడో దొరికేది కాదు. జ్ఞాన స్ఫూర్తితో అవలోకిస్తే ఇక్కడే, ఇప్పుడే ప్రాప్తించేది అనే వివేకం దృఢంగా కలవాడు.

జీవించి యుండగానే మోక్షాన్ని పొందడము జీవన్ముక్తి. మరణించిన తరువాత బ్రహ్మలోకంలో మోక్షాన్ని పొందడము క్రమముక్తి. నేడు లభించే దానిని రేపటికి వాయిదా వేసుకొని సాధించే ఫాయిదా ఏమిటి? కనుకనే మోహానికి గురి కాకుండా జీవన్ముక్తిని పొందే ప్రయత్నంలో యోగివి కమ్మని గీతాచార్యుడు ఉపదేశిస్తున్నాడు.

అంతఃకరణ శుద్ధిని పొందటానికి ముముక్షువు ముందు కర్మయోగి కావాలి. చిత్తశుద్ధి కలిగిన తరువాత శ్రవణ మనన నిదిధ్యాసల ద్వారా సదా బ్రహ్మ చింతనలో ఉండే జ్ఞానయోగి కావాలి. ఇక్కడ 'యోగి' శబ్దానికి ఇదే తాత్పర్యం. ఈ బ్రహ్మ చింతనము కూడా సర్వకాల సర్వావస్థల యందు సాగాలి అంటున్నాడు ***(సర్వేషు కాలేషు యోగ యుక్తః భవ!).*** అంటే, సాధకుడు సదా అప్రమత్తంగా ఉండాలి అని అర్థం. అశన శయన ఆసనాదుల యందు సైతము బ్రహ్మ చింతనమే సాగేటట్లు చూసుకోవాలి. ఎక్కడ అప్రమత్తత లోపించినా కాలు జారే ప్రమాద ముంది. జారడం అంటూ జరిగితే పడేది మాత్రం మోహం లోనే. అందుకనే సదా యోగయుక్తులై ఉండాలి.

చివరగా అధ్యాయ ఫలశ్రుతిని వినిపిస్తున్నాడు.

వేదేషు యజ్ఞేషు తపఃసు చైవ దానేషు య త్పుణ్యఫలం ప్రదిష్టమ్ ।
అత్యేతి తత్సర్వ మిదం విదిత్వా యోగీ పరం స్థాన ముపైతి చాద్యమ్ ॥ 28

వేదేషు-యజ్ఞేషు-తపఃసు-చ-ఏవ-దానేషు-యత్-పుణ్యఫలం-ప్రదిష్టం
అత్యేతి-తత్-సర్వం-ఇదం-విదిత్వా-యోగీ-పరం-స్థానం-ఉపైతి-చ-ఆద్యం

యోగీ	=	యోగి	ప్రదిష్టం	=	చెప్ప బడినదో
ఇదం	=	దీనిని	తత్	=	ఆ
విదిత్వా	=	గ్రహించి	సర్వం	=	సర్వమును
వేదేషు	=	వేదముల యందు	అత్యేతి	=	అతిక్రమించు చున్నాడు
యజ్ఞేషు	=	యజ్ఞముల యందు	ఆద్యం	=	మొదటి దైనది
తపఃసు	=	తపముల యందు	పరం	=	ఉన్నత మైనది
దానేషు చ ఏవ	=	దానముల యందు గూడ	స్థానం	=	స్థానమును
యత్	=	ఏ	ఉపైతి చ	=	పొందుతాడు
పుణ్యఫలం	=	పుణ్యఫలము			

అర్జునా! ఇది అర్థమైన యోగి వేదాల వల్ల, యజ్ఞాల వల్ల, తపస్సుల వల్ల కలిగే పుణ్య ఫలాన్ని విడిచి పెట్టేస్తాడు. శ్రేష్ఠ మైన స్థానాన్ని పొందుతాడు.

వ్యాఖ్య

ఫలప్రాప్తి

నదిని దాటితేనే తీరం వస్తుంది. పుణ్యపాపాలను అధిగమిస్తేనే మోక్షం ప్రాప్తిస్తుంది. అకృత్యాలు పాపాలైతే, సత్కృత్యాలు పుణ్యాలు. పుణ్యాలు చేసే పుణ్యాత్ములు పుణ్య ఫలాలను పొందుతారు. పుణ్య ఫలాలను ఈ లోకంలో అనుభవించడమే గాక, పుణ్య లోకాల లోను అనుభవిస్తారు. ఏ పుణ్యమైనా అనుభవంలో క్షయించేదే కనుక, పుణ్యఫలాలు, తద్వారా లభించే పుణ్య లోకాలు పరిమిత ఫలాలై నశించి పోతాయి. మనిషి ఆశించే అనంత ఫలం పుణ్యం వల్ల ప్రాప్తించేది కాదు. జ్ఞానం వల్లనే సిద్ధిస్తుంది. ఈ సత్యాన్ని దర్శించిన వాడు పుణ్యాన్ని కూడా అతిక్రమించి జ్ఞానాన్ని పొంది, పరమోత్కృష్ట మైన మోక్షాన్ని పొందుతాడు.

పుణ్య మనేది (1) వేదాధ్యయనం వలన, వైదిక కర్మానుష్ఠానం వలన లభిస్తుంది **(వేదేషు సమ్యక్ అధీతేషు).** (2) యజ్ఞానుష్ఠానం వల్ల, అశ్వమేధాది యజ్ఞాచరణము వల్ల ప్రాప్తిస్తుంది **(యజ్ఞేషు చ సాద్గుణ్యేన అనుష్ఠితేషు).** తపస్సుల వలన, కృచ్ఛ్ర చాంద్రాయణాది వ్రతాల వలన సిద్ధిస్తుంది **(సు తప్తేషు).** అలాగే దానాది క్రియలు - గోదానాది షోడశ మహాదానాల వలన కూడా ప్రాప్తిస్తుంది **(దానేషు చ సమ్యక్ దత్తేషు).** ఈ విధంగా శాస్త్రోక్త మైన పుణ్య కర్మలకు పుణ్యఫలాలు ప్రాప్తిస్తాయి. ఇవన్నీ నైమిత్తిక సుఖ ప్రాప్తాలే గాని నిత్య సుఖప్రాప్త హేతువులు కావు. వీటిని దాటిన వారే మనస్సును మోక్ష మార్గంలో నిలుప గలరు. నదిని దాటితేనే తీరము. పుణ్య ఫల ప్రవాహాన్ని అధిగమిస్తేనే మోక్షము.

ఆఖ్యాయిక

కృష్ణదాసు గొప్ప భక్తుడు. ఏకాంత భక్తుడు. కర్మయోగి. సదా శ్రీకృష్ణ ధ్యానామృత పానచిత్తుడు. సంసార పోషణకు చిన్న ఉద్యోగాన్ని చేస్తూ ధర్మబద్ధంగా, సమాహిత చిత్తుడై ప్రశాంతంగా జీవించే వాడు.

భక్తుడైన కృష్ణదాసులో గొప్ప చిత్రకారుడు కూడా ఉన్నాడు. తీరిక సమయాలలో శ్రీకృష్ణ పరమాత్మ జీవిత విశేషాలను ప్రతిబింబించే ఘట్టాలను చిత్రీకరించే వాడు. అలా బొమ్మలను చిత్రించి, తన చిత్రాలను అభిమానించే తన పొరుగింటి స్నేహితునికి ఫలాపేక్ష లేకుండా ఇచ్చేసేవాడు.

ఈ విధంగా అద్భుతమైన కొన్ని వందల వర్ణ చిత్రాలను కృష్ణదాసు రూపొందించాడు. అలా బొమ్మలను గీస్తూ ఆత్మానందాన్ని అనుభవిస్తూ అజ్ఞాతంగా ఉండిపోయాడు.

కృష్ణదాసు చిత్రాలను గ్రహించిన పుణ్యాత్ముడు వాటిని చక్కని చట్రములలో బిగించి, ఉదారులైన కొందరు భక్తుల సహకారంతో 'కృష్ణదాసు చిత్ర కళా ప్రదర్శన' అనే దానిని ఒకటి ఏర్పాటు చేశాడు.

ఆ చిత్రకళా ప్రదర్శనాన్ని తిలకించి కళారాధకులు పరవశించి పోయారు. ప్రతిరోజు వేలాది సంఖ్యలో వచ్చి దర్శించి సంతసించారు.

ఇంతకీ, ఈ అద్భుత కళాకారుడు ఎవరు? ఏ ప్రాంతం వాడు? ఎక్కడ ఉంటాడు? అని సందర్శకులు ప్రశ్నించే వారు. ఈ ప్రదర్శనమును ఏర్పాటు చేసిన కృష్ణదాసు స్నేహితుడు మాత్రం ఆ వివరాలను రహస్యం గానే ఉంచాడు.

నెలరోజులు పూర్తి అయ్యాయి. చిత్ర కళా ప్రదర్శన వైభవము దేశమంతా వ్యాపించింది.

తండోపతండాలుగా జనం వచ్చి దర్శిస్తున్నారు. అసమాన ప్రతిభావంతు డైన ఆ చిత్రకారుని చూడాలనే ఉత్సాహము, ఉత్కంఠ జనంలో పెరిగి పోయింది. ప్రదర్శనమును ఏర్పాటు చేసిన వ్యక్తే చిత్రకారుడేమో అనే అనుమానాన్ని కూడా కొందరు వ్యక్తం చేయసాగారు. చివరికి కళారాధకు లంతా పెద్ద సంఖ్యలో వచ్చి, 'తాతయ్యా! ఇవన్నీ మీరు గీసిన బొమ్మలే కదూ?' అని అడిగారు. సత్యాన్ని అంగీకరించ మని, అతనిని సన్మానించే భాగ్యాన్ని తమకు ప్రసాదించ మని ప్రార్థించారు. పట్టుబట్టి మరీ కూర్చున్నారు.

ఇక చెప్పక తప్పింది కాదు. 'నాయనా! నిజం చెప్తున్నాను. ఈ బొమ్మలను గీసిన చిత్రకారుణ్ణి నేను కాను. నా భాగ్యం కొద్ది అవి నాకు లభించాయి. వీటిని చిత్రీకరించిన అసమాన కళాకారుడు మన నగరం లోనే అజ్ఞాతంగా ఉన్నాడు. ఆయన హృదయం సదా కృష్ణ చైతన్యంతో నిండి ఉంటుంది.

ఈ చిత్రాలన్నీ ఆయన తృప్తి కొరకు ఈశ్వర ప్రీత్యర్థం గీసుకున్నవే. ఫలాపేక్ష తెలియని ఆ మహాత్ముడు, తన హృదయంలో కదిలే భక్తి భావాలకు రూపం దిద్దుతూ, వేసినవి వేసినట్లు మారు ఆశించకుండా నాకు ఇచ్చేసే వాడు. అలా అయిదు దశాబ్దాలు గడిచాయి. అవి ఏమయ్యాయి? అని ఏనాడూ అతడు నన్ను అడగలేదు. నేను వాటిని ఈ యాభై సంవత్సరాలు భక్తితో, శ్రద్ధతో రక్షించుకుంటూ వచ్చాను. పేదనైన నేను ఈ నాటికి ఉదారుల సహకారంతో వాటిని చట్రాలలో అమర్చి ఈ ప్రదర్శనను ఏర్పాటు చేయ గలిగాను' అన్నాడు ప్రదర్శనమును ఏర్పాటు చేసిన కృష్ణదాసు స్నేహితుడు. అందరూ ఆశ్చర్యపోయారు.

చిత్రకారుణ్ణి చూపించ మని కళాప్రపంచం ఉవ్వెత్తున లేచింది. 'అయ్యా! మీ అందరికీ నమస్కారాలు. ఫలాపేక్ష లేకుండా ఈశ్వరార్చనగా ఈ కళారూపాలను సృష్టించిన ఆ మహానుభావుడికి గుర్తింపులు, గౌరవాలు నచ్చవు. వాటిని ఆశించి చేసిన కార్యం కాదిది. దయచేసి నన్ను అర్థం చేసుకోండి.

ఈ ప్రదర్శనము ఇలా జరుగుతూ ఉందని కూడా ఆ మహాత్మునికి తెలియదు. తన చిత్రాలకు సంబంధించిన స్పృహ కూడా ఆయనకు లేదు. ప్రస్తుతం ఆయనకు కూడా నా లాగే ఎనిమిది పదులు నిండాయి.

కాకపోతే ఒక్క విషయం. రేపే ఈ ప్రదర్శనమును సమాప్తం చేస్తున్నాము కనుక, ఏ ఆడంబరాలు లేకుండా ఆ మహాత్మునికి ఈ చిత్రకళా ప్రదర్శనాన్ని చూపించాలని భావించాను. నాకు మీరందరు ఒక్క సహాయం చెయ్యండి.

రేపు ఆయనను నా వెంట తీసుకొని వస్తాను. ఏ హడావుడి లేకుండా మీరు ఆయనను ప్రశాంతంగా దర్శించండి. విషయం చెప్పకుండా మెల్లగా ఆ మహాత్ముని వేదిక మీదికి తీసుకొని వస్తాను. అందరమూ మనసారా ఆయనను సన్మానించుకొని సంతసిద్దాం' అన్నాడు తాత. అందరూ అంగీకరించారు.

మరునాడు సాయంత్రం ఎలాగో నచ్చ చెప్పి కృష్ణదాసును చిత్ర ప్రదర్శనం వద్దకు తీసుకొని వచ్చారు. కర్ర సహాయంతో మెల్లగా అడుగులు వేసుకుంటూ కృష్ణదాసు తన ఆరాధ్యదైవ మైన శ్రీకృష్ణ భగవానుని వివిధ చిత్ర రూపాలను దర్శించి పులకరించి పరవశించి పోయాడు.

చివరి చిత్రాన్ని చూచిన తరువాత, 'మహాత్మా! మీరు రూపొందించి నాకు ప్రసాదించిన ఈ కళా రూపాలను మీ అనుమతి లేకుండా ఇలా ప్రదర్శించి నందుకు నన్ను క్షమించండి' అని పాదాలపై పడ్డాడు ప్రదర్శనమును ఏర్పాటు చేసిన తాత.

నాయనా! ఎంత శ్రమ పడ్డావు! ఈ చిత్రాలకు చట్రాలు కూడా చేయించావు. నా కన్నయ్యను నాతో పాటు ఇంతమంది దర్శించే అవకాశాన్ని కల్పించావు. కళా హృదయం కన్నా జీవనకళ ఎంత గొప్పదో నిరూపించావు' అని ఐదు పది చేశాడు కృష్ణదాసు.

కళాకారు లందరూ కృష్ణదాసును వైభవంగా సన్మానించే కార్యక్రమానికి ఉద్యుక్తు లయ్యారు. ఇంతలో దివ్యమైన కాంతులను విరజిమ్ముతూ ఒక రథం ఆకాశం నుండి క్రిందికి దిగుతూ ఉంది. రథంలో ఎవ్వరూ కనిపించడం లేదు. ఆశ్చర్యంతో సర్వులూ అవలోకిస్తున్నారు. ఇంతలో దివ్యనాద మొకటి రథం నుండి వినిపించింది.

'దేవతలు కృష్ణదాసు కొరకు ఈ రథాన్ని పంపారు. పరమేశ్వరుని దివ్యసన్నిధిలో కృష్ణదాసుకు ఘన సన్మానం జరుగ బోతోంది. సమయం అట్టే లేదు' అన్న మాటలు వినిపించాయి. కృష్ణదాసుకు సమీపంగా రథం వచ్చి ఆగింది.

కృష్ణదాసు రెండు చేతులు జోడించి అందరికీ నమస్కరిస్తూ రథం ఎక్కాడు. సర్వులూ పలికే విజయ ఘోషలు మిన్ను ముట్టుతూ ఉంటే,

చరణము: **కవితల గుండెలో ప్రాణము నీవే**
మమతల గుడిలో వాణివి నీవే
అంతము లేని కాంతివి నీవే
అనంతమైన శాంతివి నీవే ॥
పల్లవి: **నీవే - నీవే - నీవే - నీవే - నీవే**
నా యెద కదిపిన కళ నీవే ॥ నీవే ॥ - అనే చైతన్యగీతిక నేపథ్య గాన రసాన్ని ఆస్వాదిస్తూ, రథం గగన విహారం చేస్తూ అదృశ్యమైంది. పుణ్యఫలాలను దాటి పోయిన భక్త కృష్ణదాసు జన ప్రియ సన్మానాలకు అతీతంగా పయనించి, సురపూజితు డైన తన కన్నయ్య చరణ కమలాలను చేరి తరించి పోయాడు.

నదిని దాటిన వాడు తీరం చేరినట్లు, పుణ్య ఫలాలను దాటిన యోగి ఆదికారణము, సర్వోత్కృష్టము అయిన మోక్ష తీరాన్ని చేరి తరిస్తాడు. ఏనుగు పాదంలో అన్ని పాదాలు ఉన్నట్లు, మోక్షంలో సమస్త ఫలాలు, పుణ్య ఫలాలతో సహ ఒదిగి ఉంటాయి. అట్టి పరమోత్కృష్ట మైన స్థానాన్ని జ్ఞానయోగి పొందుతాడు **(ఇదం సర్వం విదిత్వా యోగీ పరం ప్రకృష్టం, ఐశ్వర్యం స్థానం ఉపైతి ప్రతిపద్యతే).** ఈ అధ్యాయారంభంలో అర్జునుడు అడిగిన ఏడు ప్రశ్నలకు ఇలా వేడుకగా సమాధానాలు అందించ బడ్డాయి.

ఓం తత్ సత్

ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం
యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే అక్షర పరబ్రహ్మయోగో నామ అష్టమోఽధ్యాయః

ఈ విధంగా ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రము, శ్రీకృష్ణార్జున సంవాదము అయిన భగవద్గీత యందు అక్షరపరబ్రహ్మ యోగ మనే ఎనిమిదవ అధ్యాయము.



చైతన్య భగవద్గీత

అథ నవమోఽధ్యాయః - తొమ్మిదవ అధ్యాయము

రాజవిద్యారాజగుహ్యయోగః - రాజవిద్యారాజగుహ్యయోగము

జ్ఞానము - విజ్ఞానము

జ్ఞానం తేఽహం సవిజ్ఞానం ఇదం వక్ష్యా మ్యశేషతః - అర్జునా! విజ్ఞానముతో కూడిన జ్ఞానాన్ని సంపూర్ణంగా నీకు బోధిస్తాను అంటూ ఏడవ అధ్యాయాన్ని ఆరంభించి జ్ఞాన విజ్ఞానాలను గూర్చి ప్రసంగించాడు గీతాచార్యుడు. ఈ విధమైన జ్ఞానాన్ని తెలుసుకున్న తరువాత తెలియ దగింది మరొకటి ఉండదు అని కూడా భరోసా ఇచ్చాడు.

శాస్త్రజ్ఞానమును జ్ఞానమని, అనుభవ జ్ఞానమును విజ్ఞాన మని అర్థం చేసుకున్నాం. శాస్త్రజ్ఞానం పరోక్షం కాగా, అనుభవ జ్ఞానం అపరోక్షం అని దాని అర్థం. అంటే, పరోక్షం అపరోక్షం కావడమే పరిపూర్ణం. పరిపూర్ణ జ్ఞానంతో తృప్తి చెందిన పూర్ణ పురుషుడు, ఆప్తకాముడే జ్ఞానవిజ్ఞాన తృప్తాత్ముడు అని ఆరవ అధ్యాయం లోనే గ్రహించాము *(6 - 8)*.

ఏడవ అధ్యాయంలో ***జ్ఞానం తేఽహం సవిజ్ఞానం*** అంటూ ప్రవచించిన జ్ఞాన విజ్ఞాన విషయమునే తొమ్మిదవ అధ్యాయం ఆరంభంలో ***జ్ఞానం విజ్ఞాన సహితం*** అని ప్రస్తావిస్తూ, ప్రవచనాన్ని కొనసాగించాడు. అంతేకాదు. ఈ జ్ఞానాన్ని పొందితే అశుభము నుండి విడిపడటం జరుగుతుంది అని కూడా వాగ్దానం చేశాడు.

ఏడవ అధ్యాయం జ్ఞాన విజ్ఞానాలతో ఎలా ఆరంభమైందో, తొమ్మిదవ అధ్యాయం కూడా జ్ఞాన విజ్ఞానాలతో అలాగే ప్రారంభమైంది. ఏడవ అధ్యాయం ఆరు, ఏడు శ్లోకాలలో జ్ఞాన విజ్ఞానాలు ఎలా ప్రస్తావించ బడ్డాయో, తొమ్మిదవ అధ్యాయం నాలుగు, ఐదు శ్లోకాలలో కూడా అలాగే విస్పష్టం చేయబడ్డాయి.

విజ్ఞాన సహితమైన ఈ జ్ఞానమును పొందిన వాడు తిరిగి పొంద దగింది మరొకటి ఉండదు అని ఏడవ అధ్యాయంలో చెప్పడం వల్ల, అది పరిపూర్ణమైన జ్ఞాన మని స్పష్టమైంది ***(యత్ జ్ఞాత్వా నేహ భూయోఽన్యత్ జ్ఞాతవ్య మవశిష్యతే)***. అలాగే, విజ్ఞాన సహితమైన జ్ఞానమును పొందిన వ్యక్తి అశుభము నుండి శాశ్వతంగా విడిపడతాడు అని తొమ్మిదవ అధ్యాయంలో చెప్పడం వల్ల అజ్ఞాననాశము సమూలంగా జరిగి పోతుంది అనేది కూడా సుస్పష్టమైంది ***(జ్ఞానం విజ్ఞాన సహితం యద్ జ్ఞాత్వా మోక్ష్యసేఽశుభాత్)***.

కనుక, విజ్ఞాన సహితమైన జ్ఞానము అజ్ఞానమును సమూలంగా నిర్మూలించి, పరిపూర్ణ జ్ఞానమును ప్రసాదిస్తుంది అనేది నిర్దిష్ట మైంది. ఈ కారణం గానే జ్ఞాన విజ్ఞానములను హరించే కామాన్ని జయించమని మూడవ అధ్యాయంలో హెచ్చరించి (***పాప్మానం ప్రజహి హ్యేనం జ్ఞాన విజ్ఞాన నాశనమ్,*** *3 - 41*), విజ్ఞాన సహిత మైన జ్ఞానమును పొంది జ్ఞాన విజ్ఞాన తృప్తాత్ముడవై శోభించమని ఆరవ అధ్యాయంలో ఆదేశించాడు (***జ్ఞాన విజ్ఞాన తృప్తాత్మా కూటస్థో విజితేంద్రియః,*** *6 - 8*).

ఏడవ అధ్యాయంలో సగుణ నిర్గుణ బ్రహ్మ స్వరూపమును గూర్చి ప్రవచించి, చివరగా అధిభూత, అధిదైవ, అధియజ్ఞ సహితంగా బ్రహ్మ సాక్షాత్కార వైభవాన్ని వివరించి, మరణకాలంలో, ప్రాణ ప్రయాణ సమయంలో మనస్సును పరబ్రహ్మము నందు నిలిపి, సహస్రారమున సుషుమ్నానాడి ద్వారా ప్రాణోత్క్రమణం చేసి, అర్చిరాది మార్గంలో బ్రహ్మలోకము చేరే ధ్యేయ బ్రహ్మోపాసకుల గతిని సూచన ప్రాయంగా భగవంతుడు

ప్రస్తావించి నపుడు అధిదైవ, అధిభూతాదులను తెలుసుకోవాలని కుతూహల పడిన అర్జునుడు ప్రసంగం మధ్యలో దూరి ***కిం తద్బ్రహ్మ కిం అధ్యాత్మం?*** అంటూ వరుసగా ఏడు ప్రశ్నలను సంధించడంతో, వాటికి సమాధానంగా ఎనిమిదవ అధ్యాయాన్ని ప్రవచించిన పరమేశ్వరుడు, ఆ విషయం సమాప్తం కాగానే, ఏడవ అధ్యాయంలో ఆగిన జ్ఞాన విజ్ఞాన ప్రసంగాన్ని తిరిగి చేదుకొని తొమ్మిదవ అధ్యాయాన్ని ప్రారంభిస్తున్నాడు.

సంశయ బీజము

అష్టమే ధారణా యోగః సగుణః ఉక్తః - ఎనిమిదవ అధ్యాయంలో సగుణ రూపమైన ధారణాయోగం చెప్పబడింది. తత్పదము ధ్యేయ విషయంగా నిర్దిష్ట మైంది. ధారణాయోగం చేత సుషుమ్నా నాడీ ద్వారము గుండా స్వేచ్ఛగా ప్రాణాన్ని విడిచిన సగుణ బ్రహ్మోపాసకుడు దేవయాన మార్గంలో పయనించి బ్రహ్మలోకాన్ని చేరుతాడు. అక్కడ బ్రహ్మదేవుని సన్నిధిలో ఉపదేశమును పొంది, కల్పాంతమున పరబ్రహ్మ ప్రాప్తిని పొందుతాడు. దీనినే క్రమముక్తి అని తెలుసుకున్నాం. కల్పాంతమున బ్రహ్మమును పొందడము అనే ఈ మోక్షప్రాప్తి అనావృత్తి రూప ఫలం. అంటే, తిరిగి జన్మకు రాని సుగతి. క్రమముక్తిని పొందిన బ్రహ్మోపాసకుడు తిరిగి జన్మించడు. జనన మరణ వలయం నుండి విముక్తు డవుతాడు. ఇదే అనావృత్తి రూప ఫలం. ఈ విషయం ఎనిమిదవ అధ్యాయంలో స్పష్టంగా అర్థమైంది.

ధారణాయోగంతో కూడిన సగుణ బ్రహ్మోపాసన మోక్షమును ప్రసాదిస్తూ ఉంది. సగుణ బ్రహ్మోపాసన ఫలంగా బ్రహ్మలోకము ప్రాప్తిస్తూ ఉంది. అక్కడ బ్రహ్మోపదేశము జరుగుతూ ఉంది కనుక, పునరావృత్తి ఉండదు. జన్మరాహిత్యం జరుగుతుంది.

ఆత్మయే బ్రహ్మము అనే బ్రహ్మాత్మజ్ఞానము కలుగుతూ ఉంది కనుక, ఆత్మకు జనన మరణాలు లేనందున, ఆత్మయే తాను అనే జ్ఞానము కలిగిన బ్రహ్మోపాసకునికి జనన మరణాలు ఉండే అవకాశం లేదు. ఇదే అనావృత్తి రూప ఫలం. బ్రహ్మాత్మజ్ఞానం వల్ల సిద్ధించిన జనన మరణ రూప సంసార నివృత్తి ఫలం.

ఇంతవరకు బాగుంది. ముక్తి అయితే వస్తుంది. కాకపోతే, అది మరణానంతరము బ్రహ్మ లోకంలో ప్రాప్తిస్తుంది. అంటే, ఈ జన్మలో మోక్షం లేదు, రాదు అనే అర్థం కూడా ధ్వనిస్తూ ఉంది. ముక్తి అనేది మరణానంతరమే సాధ్యము అని భావించే ప్రమాదము కూడా ఉంది. కనుక ముక్తి అనేది బ్రహ్మలోకంలో సిద్ధించే క్రమముక్తి రూపం లోనే సాధ్యమా? మరొక విధంగా ప్రాప్తించే అవకాశం లేదా? అనే సందేహం కలుగుతుంది. ఈ సంశయాన్ని నివృత్తి చేస్తూ అరంభ మవుతూ ఉంది తొమ్మిదవ అధ్యాయము.

భవద్రూపమే గాని భవిష్య ద్రూపం కాదు

మరణించిన తరువాత బ్రహ్మలోకంలో బ్రహ్మప్రాప్తి కలిగే టట్లయితే, ప్రస్తుతం బ్రహ్మము లేకుండా మనం ఉన్నట్లే కదా! ఇది సాధ్యమేనా? భగవంతుడు లేకుండా మనం ఉండగలమా? ఉండలేము అనేదే కదా శివ సందేశం!

పరమేశ్వరుడు భవిష్యత్తుకు సంబంధించిన వాడు అయితే, మనం వర్తమానంలో ఎలా ఉండగలం? మరణానంతరము బ్రహ్మలోకంలో ఉపదేశము అందవచ్చు. అలాగని, బ్రహ్మజ్ఞానము బ్రహ్మలోకం లోనే లభ్యమా? బ్రహ్మము బ్రహ్మలోకానికే పరిమితుడా? అదే వాస్తవ మైతే, బ్రహ్మము మానవలోకంలో లేనట్లే కదా! ఒక్క లోకంలో ఉండి మరొక లోకంలో లేనివాడు బ్రహ్మము ఎలా అవుతాడు?

భగవంతుడు రేపటి వాడు అయితే, మనం నేడు ఎలా ఉన్నాం? భగవంతుడు అక్కడ ఉండేవాడు అయితే, మనం ఇక్కడ ఎలా ఉన్నాం? మనం ఉన్నాము అంటే, ఆయన ఉన్నాడు అని అర్థం. కాకపోతే,

ఈ సత్యం అర్థం కావడం లేదు. బుద్ధికి తెలిసి రావడం లేదు. తెలియక పోవడం సమస్య అయినప్పుడు, పరిష్కారం తెలుసుకోవడమే గదా! అలాంటప్పుడు తెలుసుకోవడమే ప్రధానం గాని, ఎక్కడ తెలుసుకోవాలి? ఎప్పుడు తెలుసుకోవాలి? అనేది ప్రధానం కాదు గదా!

తన స్వరూపం మట్టే అని తెలుసుకోవడానికి కుండ ఎక్కడికి పోవాలి? అలా తెలుసుకోవడానికి ఒక సమయము గాని ప్రదేశము గాని అవసరమా? జ్ఞానము కలగడమే ముఖ్యం. మరి జ్ఞానం ఎలా కలుగుతుంది? జ్ఞానం కలవాడు బోధిస్తేనే కలుగుతుంది. బోధించే వాడు ఉండి, బోధను అందుకొనే అర్హత గలవాడు ఉన్నప్పుడు జ్ఞానం కలగక పోయే అవకాశం ఉందా? బోధించే వాడు చతుర్ముఖ బ్రహ్మయే అయి ఉండాలి అనే నియమ మేదైనా ఉందా? అది కూడా బ్రహ్మలోకం లోనే బోధించాలి అనే నిబంధన మాత్రం ఉందా?

జ్ఞానం అనేది ప్రదేశానికి పరిమితం కాదు. కాలానికి పరిమితం కాదు. బోధించే వాడికి జ్ఞానం విషయంలో స్పష్టత ఉండాలి. బోధను అందుకొనే వాడికి అంతఃకరణ శుద్ధి ఉండాలి. అంతే. అర్హుడైన వానికి జ్ఞానం కలిగిన వాడు బోధిస్తే, జ్ఞానం ప్రాప్తిస్తుంది. జ్ఞానమే ప్రధానం కనుక, జ్ఞానమున్న వాడు ఎవడు బోధించినా జ్ఞానం కలుగుతుంది. బ్రహ్మలోకంలో బ్రహ్మదేవుడే బోధించాలి అనేది లేదు. మానవ లోకంలో బ్రహ్మజ్ఞానం కలిగిన శ్రోత్రియ బ్రహ్మనిష్ఠుడైన గురువు బోధించినా సరిపోతుంది.

కుండ ఎక్కడుందో మట్టి అక్కడే ఉంది. మట్టిపాత్ర లన్నిటిలో మట్టే ఉంది. కారణానికి దూరంగా కార్యం ఉండలేదు. సృష్టిలో పరమేశ్వరుడు సర్వకారణంగా శోభిస్తున్నాడు. సృష్టి కారణము తానే. సృష్టి కార్యమూ తానే. కార్యములు అనేక రూపాలలో కనపడినా, అనేక నామాలతో వినపడినా, ఆ నామ రూపాలలో అస్తి భాతి ప్రియంగా భాసించేది సర్వ కారణమైన పరమేశ్వరుడే. సృష్టి తానే. సృష్టికర్త కూడా తానే.

ఇదే భగవద్విషయం. ఈశ్వర సంబంధమైన జ్ఞానం. ఈ విధమైన జ్ఞానం కలవారు పరమేశ్వరుని ఏకరూపునిగా, వేరు వేరు రూపాలు గల వానినిగా, విశ్వరూపునిగా ***(ఏకత్వేన పృథక్త్వేన, బహుధా విశ్వతో ముఖమ్)*** ఉపాసిస్తారు అంటూ ప్రస్తుత అధ్యాయం - పదహైదవ శ్లోకంలో భగవానుడే చెబుతాడు.

కనుక, భగవంతుడు ఎక్కడో తెలిసేవాడు కాడు. ఎప్పుడో తెలిసేవాడు కాడు. ఇప్పుడు లేకుండా మరొకప్పుడు కలిగేవాడు కాడు. ఇక్కడ లేకుండా మరొక చోట తెలిసేవాడు కాడు. మనం ఉన్నచోటే తానున్నాడు. మనం ఉన్నప్పుడే తాను ఉన్నాడు. ఇక్కడే ఉన్నాడు. ఇప్పుడే ఉన్నాడు. ఉన్నచోట చూడకుండా, మరెక్కడో వెదకడం చేత ఉన్నవాడే అయినా లేనట్లు ఉన్నాడు. గొప్ప రహస్యంగా మిగిలి పోతున్నాడు. గుహ్యమై, రాజగుహ్యమై ఉండి పోతున్నాడు.

> ***కలడు కల డనెడి వారిలో కలవు నీవు***
> ***లేడు లేడనెడి వారిలో నిజము నీవు***
> ***ఉండి లేనట్లు ఉంటివి ఉర్వినాథా!***
> ***నీ అడుగుల కడ పడి ఉందు చిన్నికృష్ణా! -*** అని చిన్నికృష్ణ శతకంలో ఒక చేతి వెన్నముద్ద.

రహస్యము ఏదైనా అది లేనిది కాదు. ఉన్నదే. ఉండి తెలియనిది ఏదైనా రహస్యమే. ప్రపంచంలో ఎన్నో రహస్యాలు ఉన్నాయి. ఏది రహస్యము? ఎవరికి రహస్యము? అని ప్రశ్నించుకుంటే, ఎవరికి ఏది తెలియదో అది వారికి రహస్యము అనే సమాధానం వస్తుంది. తెలిసిన వారికి రహస్యం బట్టబయలు. తెలిసిన వారు చెబితే తెలియని వారికి తెలుస్తుంది. తెలిసిన క్షణాన అంతవరకు ఎవరికి రహస్యంగా ఉండిందో వారికి కూడా రహస్యం బట్టబయలు అవుతుంది.

ప్రస్తావించి నపుడు అధిదైవ, అధిభూతాదులను తెలుసుకోవాలని కుతూహల పడిన అర్జునుడు ప్రసంగం మధ్యలో దూరి ***కిం తద్బ్రహ్మ కిం అధ్యాత్మం?*** అంటూ వరుసగా ఏడు ప్రశ్నలను సంధించడంతో, వాటికి సమాధానంగా ఎనిమిదవ అధ్యాయాన్ని ప్రవచించిన పరమేశ్వరుడు, ఆ విషయం సమాప్తం కాగానే, ఏడవ అధ్యాయంలో ఆగిన జ్ఞాన విజ్ఞాన ప్రసంగాన్ని తిరిగి చేదుకొని తొమ్మిదవ అధ్యాయాన్ని ప్రారంభిస్తున్నాడు.

సంశయ బీజము

అష్టమే ధారణా యోగః సగుణః ఉక్తః - ఎనిమిదవ అధ్యాయంలో సగుణ రూపమైన ధారణాయోగం చెప్పబడింది. తత్ఫలము ధ్యేయ విషయంగా నిర్దిష్ట మైంది. ధారణాయోగం చేత సుషుమ్నా నాడీ ద్వారము గుండా స్వేచ్ఛగా ప్రాణాన్ని విడిచిన సగుణ బ్రహ్మోపాసకుడు దేవయాన మార్గంలో పయనించి బ్రహ్మలోకాన్ని చేరుతాడు. అక్కడ బ్రహ్మదేవుని సన్నిధిలో ఉపదేశమును పొంది, కల్పాంతమున పరబ్రహ్మ ప్రాప్తిని పొందుతాడు. దీనినే క్రమముక్తి అని తెలుసుకున్నాం. కల్పాంతమున బ్రహ్మమును పొందడము అనే ఈ మోక్షప్రాప్తి అనావృత్తి రూప ఫలం. అంటే, తిరిగి జన్మకు రాని సుగతి. క్రమముక్తిని పొందిన బ్రహ్మోపాసకుడు తిరిగి జన్మించడు. జనన మరణ వలయం నుండి విముక్తు డవుతాడు. ఇదే అనావృత్తి రూప ఫలం. ఈ విషయం ఎనిమిదవ అధ్యాయంలో స్పష్టంగా అర్థమైంది.

ధారణాయోగంతో కూడిన సగుణ బ్రహ్మోపాసన మోక్షమును ప్రసాదిస్తూ ఉంది. సగుణ బ్రహ్మోపాసన ఫలంగా బ్రహ్మలోకము ప్రాప్తిస్తూ ఉంది. అక్కడ బ్రహ్మోపదేశము జరుగుతూ ఉంది కనుక, పునరావృత్తి ఉండదు. జన్మరాహిత్యం జరుగుతుంది.

ఆత్మయే బ్రహ్మము అనే బ్రహ్మాత్మజ్ఞానము కలుగుతూ ఉంది కనుక, ఆత్మకు జనన మరణాలు లేనందున, ఆత్మయే తాను అనే జ్ఞానము కలిగిన బ్రహ్మోపాసకునికి జనన మరణాలు ఉండే అవకాశం లేదు. ఇదే అనావృత్తి రూప ఫలం. బ్రహ్మాత్మజ్ఞానం వల్ల సిద్ధించిన జనన మరణ రూప సంసార నివృత్తి ఫలం.

ఇంతవరకు బాగుంది. ముక్తి అయితే వస్తుంది. కాకపోతే, అది మరణానంతరము బ్రహ్మ లోకంలో ప్రాప్తిస్తుంది. అంటే, ఈ జన్మలో మోక్షం లేదు, రాదు అనే అర్థం కూడా ధ్వనిస్తూ ఉంది. ముక్తి అనేది మరణానంతరమే సాధ్యము అని భావించే ప్రమాదము కూడా ఉంది. కనుక ముక్తి అనేది బ్రహ్మలోకంలో సిద్ధించే క్రమముక్తి రూపం లోనే సాధ్యమా? మరొక విధంగా ప్రాప్తించే అవకాశం లేదా? అనే సందేహం కలుగుతుంది. ఈ సంశయాన్ని నివృత్తి చేస్తూ అరంభ మవుతూ ఉంది తొమ్మిదవ అధ్యాయము.

భవద్రూపమే గాని భవిష్య ద్రూపం కాదు

మరణించిన తరువాత బ్రహ్మలోకంలో బ్రహ్మప్రాప్తి కలిగే టట్లయితే, ప్రస్తుతం బ్రహ్మము లేకుండా మనం ఉన్నట్లే కదా! ఇది సాధ్యమేనా? భగవంతుడు లేకుండా మనం ఉండగలమా? ఉండలేము అనేదే కదా శవ సందేశం!

పరమేశ్వరుడు భవిష్యత్తుకు సంబంధించిన వాడు అయితే, మనం వర్తమానంలో ఎలా ఉండగలం? మరణానంతరము బ్రహ్మలోకంలో ఉపదేశము అందవచ్చు. అలాగని, బ్రహ్మజ్ఞానము బ్రహ్మలోకం లోనే లభ్యమా? బ్రహ్మము బ్రహ్మలోకానికే పరిమితుడా? అదే వాస్తవ మైతే, బ్రహ్మము మానవలోకంలో లేనట్లే కదా! ఒక లోకంలో ఉండి మరొక లోకంలో లేనివాడు బ్రహ్మము ఎలా అవుతాడు?

భగవంతుడు రేపటి వాడు అయితే, మనం నేడు ఎలా ఉన్నాం? భగవంతుడు అక్కడ ఉండేవాడు అయితే, మనం ఇక్కడ ఎలా ఉన్నాం? మనం ఉన్నాము అంటే, ఆయన ఉన్నాడు అని అర్థం. కాకపోతే,

రః సత్యం అర్థం కావడం లేదు. బుద్ధికి తెలిసి రావడం లేదు. తెలియక పోవడం సమస్య అయినప్పుడు పరిష్కారం తెలుసుకోవడమే గదా! అలాంటప్పుడు తెలుసుకోవడమే ప్రధానం గాని, ఎప్పుడు తెలుసుకోవాలి? ఎప్పుడు తెలుసుకోవాలి? అనేది ప్రధానం కాదు గదా!

తన స్వరూపం మట్టే అని తెలుసుకోవడానికి కుండ ఎక్కడికి పోవాలి? అలా తెలుసుకోవడానికి ఒక సమయము గాని ప్రదేశము గాని అవసరమా? జ్ఞానము కలగడమే ముఖ్యం. మరి జ్ఞానం ఎలా కలుగుతుంది? జ్ఞానం కలవాడు బోధిస్తేనే కలుగుతుంది. బోధించే వాడు ఉండి, బోధను అందుకొనే అర్హత గలవాడు ఉన్నప్పుడు జ్ఞానం కలగక పోయే అవకాశం ఉందా? బోధించే వాడు చతుర్ముఖ బ్రహ్మయే అయి ఉండాలి అనే నియమ మేదైనా ఉందా? అది కూడా బ్రహ్మలోకం లోనే బోధించాలి అనే నిబంధన మాత్రం ఉందా?

జ్ఞానం అనేది ప్రదేశానికి పరిమితం కాదు. కాలానికి పరిమితం కాదు. బోధించే వాడికి జ్ఞానం విషయంలో స్పష్టత ఉండాలి. బోధను అందుకొనే వాడికి అంతఃకరణ శుద్ధి ఉండాలి. అంతే. అర్హులైన వానికి జ్ఞానం కలిగిన వాడు బోధిస్తే, జ్ఞానం ప్రాప్తిస్తుంది. జ్ఞానమే ప్రధానం కనుక, జ్ఞానమున్న వాడు ఎవరు బోధించినా జ్ఞానం కలుగుతుంది. బ్రహ్మలోకంలో బ్రహ్మదేవుడే బోధించాలి అనేది లేదు. మానవ లోకంలో బ్రహ్మజ్ఞానం కలిగిన శ్రోత్రియ బ్రహ్మనిష్ఠుడైన గురువు బోధించినా సరిపోతుంది.

కుండ ఎక్కడుందో మట్టి అక్కడే ఉంది. మట్టిపాత్ర అన్నిటిలో మట్టే ఉంది. కారణానికి దూరంగా కార్యం ఉండలేదు. సృష్టిలో పరమేశ్వరుడు సర్వకారణంగా శోభిస్తున్నాడు. సృష్టి కారణము తానే. సృష్టి కార్యమూ తానే. కార్యములు అనేక రూపాలలో కనపడినా, అనేక నామాలతో పిలవబడినా, ఆ నామ రూపాలలో అస్తి భాతి ప్రియంగా భాసించేది సర్వ కారణమైన పరమేశ్వరుడే. సృష్టి తానే. సృష్టికర్త కూడా తానే.

ఇదే భగవద్విషయం. ఈశ్వర సంబంధమైన జ్ఞానం. ఈ విధమైన జ్ఞానం కలవారు పరమేశ్వరుని ఏకరూపునిగా, వేరు వేరు రూపాలు గల వానినిగా, విశ్వరూపునిగా (ఏకత్వేన పృథక్త్వేన. బహుధా విశ్వతో ముఖమ్) ఉపాసిస్తారు అంటూ ప్రస్తుత అధ్యాయం - పదహైదవ శ్లోకంలో భగవానుడే చెబుతాడు.

కనుక, భగవంతుడు ఎక్కడో తెలిసేవాడు కాదు. ఎప్పుడో తెలిసేవాడు కాదు. ఇప్పుడు లేకుండా మరొకప్పుడు కలిగేవాడు కాదు. ఇక్కడ లేకుండా మరొక చోట తెలిసేవాడు కాదు. మనం ఉన్నచోటే తానున్నాడు. మనం ఉన్నప్పుడే తాను ఉన్నాడు. ఇక్కడే ఉన్నాడు. ఇప్పుడే ఉన్నాడు. ఉన్నచోట చూడకుండా, మరెక్కడో వెదకడం చేత ఉన్నవాడే అయినా లేనట్లు ఉన్నాడు. గొప్ప రహస్యంగా మిగిలి పోతున్నాడు. గుహ్యమై, రాజగుహ్యమై ఉండి పోతున్నాడు.

కలడు కల డనెడి వారిలో కలవు నీవు
లేడు లేడనెడి వారిలో నిజము నీవు
ఉండి లేనట్లు ఉంటివి ఉర్వినాథా!
నీ అడుగుల కడ పడి ఉందు చిన్నికృష్ణా! - అని చిన్నికృష్ణ శతకంలో ఒక చేతి వెన్నముద్ద.

రహస్యము ఏదైనా అది లేనిది కాదు. ఉన్నదే. ఉండి తెలియనిది ఏదైనా రహస్యమే. ప్రపంచంలో ఎన్నో రహస్యాలు ఉన్నాయి. ఏది రహస్యము? ఎవరికి రహస్యము? అని ప్రశ్నించుకుంటే, ఎవరికి ఏది తెలియదో అది వారికి రహస్యము అనే సమాధానం వస్తుంది. తెలిసిన వారికి రహస్యం బట్టబయలు. తెలిసిన వారు చెబితే తెలియని వారికి తెలుస్తుంది. తెలిసిన క్షణాన అంతవరకు ఎవరికి రహస్యంగా ఉండిందో వారికి కూడా రహస్యం బట్టబయలు అవుతుంది.

ఏదైనా, ఏ విద్య అయినా, ఉండి తెలియ నపుడు రహస్య మవుతుంది. గుహ్య మవుతుంది. కాని, బ్రహ్మవిద్య రహస్యాలలో రహస్యము. ఎందుకని? అది తెలుసుకొనే వానికి అన్యంగా, భిన్నంగా ఉండే రహస్యం కాదు. ఆ రహస్య మేదో అది తెలుసుకొనే వాడి స్వరూపమే. అదే విచిత్రం.

బ్రహ్మము రహస్యము. బ్రహ్మమును తెలిపే బ్రహ్మవిద్య కూడా రహస్యమే. ఆత్మయే బ్రహ్మము. కనుక, ఆత్మే రహస్యము. ఆత్మవిద్య కూడా రహస్యమే. అందుచేతనే ఆత్మవిద్య అనేది విద్యలలో రాజు వంటిది. కనుకనే అది రాజవిద్య ***(విద్యానాం రాజా).*** అంతేకాదు. రహస్యాలలో కెల్ల రహస్యం. రహస్యాలలో కూడా రాజు లాంటిది ***(గుహ్యానాం రాజా).*** ఇటు విద్యలలో వరిష్ఠమై ఉండటం చేత ఆత్మవిద్య రాజవిద్య అయింది. అలాగే రహస్యాలలో రహస్యం కావడం చేత రాజగుహ్య మైంది. ఇదే రాజవిద్యా రాజగుహ్య యోగము. స్వరూపం గానే ఉండి అర్థం గాకుండా ఉన్న దానిని అర్థమయ్యేలా చేసే యోగము. మార్గము. విధానము. ఉపాయము.

ఆఖ్యాయిక

ఒక వజ్రాల వ్యాపారి విలువైన వజ్రాలను ఒక విదేశీయుడికి విక్రయించడానికి చెన్నై నుండి రైలులో ఢిల్లీ వెళ్తున్నట్లు ఒక గజదొంగ తెలుసు కున్నాడు. ఎలాగైనా ఆ వజ్రాలను కాజేయాలని నిశ్చయించుకొని, వర్తకుడు పయనించే బోగీ లోనే తనకు కూడా ఢిల్లీకి రిజర్వేషన్ చేయించు కున్నాడు.

వజ్రాల వ్యాపారి రైలు ఎక్కి తన సీటులో తాను కూర్చున్నాడు. దొంగ కూడా వర్తకుని వేషాన్ని ధరించి, అదే పెట్టెలో ఎక్కాడు. అదృష్టవశాత్తు వజ్రాల వ్యాపారి ప్రక్కనే తనకు సీటు ఏర్పాటైంది. దొంగ ఎంతగానో సంతసించాడు.

ప్రయాణంలో ఉభయులూ సంభాషించు కున్నారు. జాతీయ వ్యాపారాలే గాక, అంతర్జాతీయ వ్యాపార వ్యవహారాలు కూడా చర్చించు కున్నారు. తాను కూడా ప్రముఖ వ్యాపారి అని వజ్రాల వ్యాపారి విశ్వసించేటట్లు భాషిస్తూ ప్రవర్తించాడు గజదొంగ.

సాయంత్రం ఐదు గంటలకు చెన్నై నుండి రైలు బయలు దేరింది. రాత్రి పది గంటల వరకు ఇరువురు ముచ్చటించుకొని పడుకున్నారు. వజ్రాల వ్యాపారి గుర్రు పెట్టి నిద్ర పోయాడు. రాత్రి రెండు గంటల సమయంలో, అందరూ నిద్ర పోతూ ఉండటం చూసి గజదొంగ కార్యోన్ముఖు డయ్యాడు. వజ్రాల వర్తకుని వద్ద ఉన్న చాల్తీ లన్నిటినీ వెదకి చూశాడు. వజ్రాలు ఎక్కడా కనిపించ లేదు. నిరాశతో ఆలోచిస్తూ పడుకున్నాడు.

ఉదయాన్నే ఉభయులూ నిద్ర లేచారు. వజ్రాల వర్తకుడు వెళ్ళి స్నానం చేసి వచ్చాడు. ఆ తరువాత దొంగ వెళ్ళి స్నానం చేసి వచ్చే సరికి, తన వజ్రాలను లెక్క పెట్టుకొని, వాటిని ఒక గులాబీరంగు పట్టు వస్త్ర ఖండంలో మడత పెట్టి, తన సూట్‌కేసులో వ్యాపారి పెట్టుకుంటూ ఉండటం దొంగ చూశాడు.

వజ్రాలు ఉన్నాయి. ఈ రాత్రికి ఎలాగైనా దోచేయాలి అనుకున్నాడు దొంగ. ఆ రోజంతా సాయంత్రం వరకు ఇద్దరూ ఆనందంగా ముచ్చటించుకుంటూ కాలక్షేపం చేశారు. రాత్రి అయింది. నిన్నటి లాగే అందరూ నిద్రించారు. వర్తకుడు గాఢనిద్ర లోకి జారుకో గానే, దొంగ లేచి వెదకడం ఆరంభించాడు. వర్తకునికి సంబంధించిన ప్రతి వస్తువును గాలించి మరీ చూశాడు. ఎక్కడా వజ్రాలు కనిపించ లేదు.

తెల్లవారింది. స్నానాలు చేశారు. దొంగ ఒక స్టేషనులో దిగి ఫలహారశాల నుండి ఉభయులకూ అల్పాహారం పొట్లాలు తీసుకొని వచ్చాడు. ఆ సమయానికి వజ్రాలను లెక్కించి, సూట్‌కేసులో పెట్టుకుంటూ కనిపించాడు వజ్రాల వర్తకుడు.

అది చూచి ఆశ్చర్యపోయాడు గజదొంగ. ఈ విధమైన అపజయాన్ని తన అనుభవంలో ఇంతవరకు తాను చూడలేదు. ఇక ఒక్క రాత్రి మాత్రమే మిగిలి ఉంది. తెల్లవారితే ఢిల్లీ వచ్చేస్తుంది. ఈ రాత్రికి ఎలాగైనా వజ్రాలను సొంతం చేసుకోవాలి అనుకున్నాడు గజదొంగ.

రాత్రి అయింది. అంతా మూమూలే. మళ్ళీ అపజయమే. వజ్రాలు లభించ లేదు. తెల్లవారింది. ఢిల్లీ స్టేషన్ రాబోతూ ఉంది. ఇద్దరూ స్నానాలు ముగించు కున్నారు. ఢిల్లీ స్టేషన్ వచ్చేసింది. వజ్రాల వర్తకుని కొరకు అతడి బంధువులు వచ్చారు.

ఇక ప్లాట్‌ఫారమ్ మీద ప్రయాణీకు లిద్దరూ పరస్పరం కరచాలనం చేసుకుని ఎవరి దారిన వారు నిష్క్రమించ బోతారు. అప్పుడు వజ్రాల వ్యాపారిని ప్రక్కకు పిలిచి దొంగ అడిగాడు.

అయ్యా! మీకు నిజం చెప్పేస్తున్నాను. నేనొక గజదొంగను. మీ వజ్రాలను అపహరించా లని మీతో ప్రయాణం చేశాను. ఉదయం మీ దగ్గర కనిపించే వజ్రాలు రాత్రిపూట కనిపించేవి కావు. వాటిని మీరు ఎక్కడ దాచేవారు? అని అడిగాడు.

చూడు నాయనా! నీ అనుభవం నీ కెలా ఉందో, నలభై సంవత్సరాలుగా వజ్రాల వ్యాపారం చేస్తున్న నాకు కూడా నా అనుభవం అలాగే ఉంది. నువ్వెవరో చెన్నై సెంట్రల్ స్టేషన్ లోనే నేను కనిపెట్టేశాను. ఎక్కడ వజ్రాలను దాచినా, నువ్వు దోచేస్తావని నాకు తెలుసు. అందుకనే రాత్రి అయ్యేసరికి, నీవు స్నానాల గదికి వెళ్ళగానే వజ్రాలను నీ దిండు క్రింద పెట్టేవాణ్ణి. ఉదయాన నువ్వు స్నానానికి వెళ్ళి నపుడు వాటిని తీసి నువ్వు చూసే లాగ లెక్కించుకొనే వాణ్ణి. వజ్రాల కోసం నువ్వు ఎక్కడైనా శ్రమించి వెతుకుతావు కాని, నీ తలగడ క్రింద ఎట్టి పరిస్థితుల లోను వెతకవు అని నాకు బాగా తెలుసు అంటూ, నవ్వుతూ నిష్క్రమించాడు.

మనం కూడా ఆ గజదొంగ లాగే నవ్వుల పాలవు తున్నాము. ఎన్ని రాత్రులు వెదికినా దొంగకు వజ్రాలు లభించ లేదు. ఎన్ని జన్మ లెత్తి అన్వేషించినా మనకూ ఆత్మానందము ప్రాప్తించడము లేదు. తనను విడిచిపెట్టి అన్యమైన ప్రదేశాలలో వెదికిన దొంగకు నిరాశ ఎదురైనట్లే, మనల్ని విడిచి, ఎక్కడ మనం ఎంతగా అన్వేషించినా ఆనందం ప్రాప్తించక పోగా, నిరాశా నిస్పృహలే ఎదురౌ తున్నాయి. దొంగకు వజ్రాల విషయం రహస్యంగా మిగిలి పోయినట్లు, మనకు ఆత్మ విషయం రహస్యమైంది. అది కూడా మామూలు రహస్యం కాదు. రాజ రహస్యమైంది. రాజగుహ్య మైంది.

ధ్యేయ బ్రహ్మ - జ్ఞేయ బ్రహ్మ

పరోక్షం - అపరోక్షం

బ్రహ్మోపాసకులు, వారి ఉపాసనా విధానాలు, తద్వారా వారు పొందే గతులు - ఇవన్నీ ఎనిమిదవ అధ్యాయములో విస్పష్ట మయ్యాయి. అక్కడ సాధన ధ్యానం కావడం చేత సాధ్యము ధ్యేయమైంది. ధ్యేయము బ్రహ్మమే కనుక అది ధ్యేయబ్రహ్మ విషయం.

ప్రస్తుతం మనం అధ్యయనం చేయబోతున్న తొమ్మిదవ అధ్యాయము ధ్యేయబ్రహ్మ విషయం కాదు. జ్ఞేయబ్రహ్మ విషయం. ఇక్కడ సాధన జ్ఞానం కావడం చేత సాధ్యము జ్ఞేయమైంది. జ్ఞేయము బ్రహ్మమే కనుక ఇది జ్ఞేయబ్రహ్మ విషయం.

ధ్యేయబ్రహ్మ విషయంలో బ్రహ్మము ఉంది అని తెలుస్తుంది. బ్రహ్మానుభూతి మరణానంతరము బ్రహ్మలోకంలో కలుగుతుంది అని కూడా అర్థ మవుతుంది. కనుక, ధ్యేయబ్రహ్మ విషయాన్ని ప్రవచించిన

ఎనిమిదవ అధ్యాయము సాధకుడు ఎలా మరణించాలో, మరణించిన తరువాత బ్రహ్మానుభూతిని ఎలా పొందాలో తెలుపుతుంది. ఇదే క్రమముక్తి.

జ్ఞేయబ్రహ్మ విషయంలో బ్రహ్మము ఉంది అని కాకుండా తానే బ్రహ్మముగా తెలియడం జరుగుతుంది. మరణానంతరము కాకుండా, ఇక్కడే, ఇప్పుడే బ్రహ్మానుభూతి కలుగుతుంది. కనుక, జ్ఞేయబ్రహ్మ విషయాన్ని ప్రవచించిన తొమ్మిదవ అధ్యాయం ఎలా మరణించాలి అని కాకుండా, ఎలా జీవించాలో తెలుపుతుంది. జీవించి ఉన్నప్పుడే ముక్తిని ఎలా పొందాలో ఎరుక పరుస్తుంది. ఇదే జీవన్ముక్తి.

అస్తి బ్రహ్మేతి చేద్వేద పరోక్షం జ్ఞాన మేవ తత్,
అస్మి బ్రహ్మేతి చేద్వేద అపరోక్షం తదుచ్యతే॥

ధ్యేయ బ్రహ్మోపాసకులు బ్రహ్మము ఉంది ***(అస్తి)*** అనే జ్ఞానం తోనే ఉంటారు. కాకపోతే, వారి జ్ఞానము పరోక్షంగా ఉంటుంది. బ్రహ్మము వారి కన్నా వేరుగా ఉన్నట్లు భావిస్తారు. ఇదే పరోక్ష జ్ఞానము. ఇక్కడ అజ్ఞానము నివృత్తి కావడం లేదు కనుక, ఇది సాక్షాత్తు మోక్ష సాధనం కాదు. అందుచేతనే పరోక్ష మైంది.

కాని, జ్ఞేయబ్రహ్మ విషయానికి సంబంధించిన జ్ఞానులు మాత్రం బ్రహ్మమును తమ స్వరూపం గానే తెలుసు కుంటారు. బ్రహ్మము ఉంది ***(అస్తి)*** అని కాకుండా, బ్రహ్మమై ఉన్నాను ***(అస్మి)*** అనే జ్ఞానంతో ఉంటారు. వీరి జ్ఞానము అపరోక్షంగా ఉంటుంది. వీరు బ్రహ్మము తమ కన్నా అన్యం కాదనే నిశ్చయజ్ఞానంతో ఉంటారు. ఇదే అపరోక్ష జ్ఞానము. ఇదే విజ్ఞానము ***(విశేషేణ జ్ఞాయతే ఇతి విజ్ఞానః).*** విజ్ఞాన సహితమైన జ్ఞానము. ధ్యేయబ్రహ్మ విలక్షణమైన జ్ఞేయబ్రహ్మ స్వరూపము. విజ్ఞాన సహితమైన ఈ జ్ఞానము ***(జ్ఞానం విజ్ఞాన సహితం)*** విద్య లన్నిటిలో శ్రేష్ఠ మైనది. కనుకనే ఇది రాజవిద్య. అలాగే రాజగుహ్యం.

విద్యారహస్యం – రహస్యమైన విద్య

బ్రహ్మమునకు సంబంధించిన విద్య బ్రహ్మవిద్య. అందుచేత ఇది విద్యలలో శ్రేష్ఠమై రాజవిద్య అయింది. ఉపనిషత్తులలో నిక్షిప్తమై ఉన్న బ్రహ్మవిద్య సర్వులూ అధ్యయనం చేసి అర్థం చేసుకొనేది కాదు. అది చాలా రహస్య మైంది. గుహ్యమైంది. బ్రహ్మవిద్య ఎప్పుడైతే గుహ్యమైందో, అది బ్రహ్మకు సంబంధించిన విద్య కావడం చేత బ్రహ్మము కూడా గుహ్య డయ్యాడు. రహస్యంగా మిగిలి పోయాడు.

రహస్యోపనిషత్ వేద్యత్వాత్ గుహాయాం హృదయాకాశే నిహిత ఇతి వా గుహ్యః - హృదయాకాశంలో దాగి ఉండి, రహస్యమైన ఉపనిషత్తుల ద్వారా తెలియబడే వాడు కావడం చేత బ్రహ్మము కూడా గుహ్యము. రహస్యము. అతడే నీవు అనేదే అసలు రహస్యము. అదే గుహ్యము. ఇది మామూలు రహస్యం కాదు. రహస్యాలలో రహస్యము.

అంతేకాదు. ఉపనిష ద్విద్యను గ్రహించిన వారికి కూడా ఇది రహస్యం గానే మిగిలిపోతూ ఉంది. గుప్తం గానే ఉండి పోతూ ఉంది. ***వాఙ్మనసయోః అగోచరత్వాత్ గుప్తః -*** మనోవాక్కులకు అందక గుప్త మవుతూ ఉంది. ప్రమాణ గోచరమే గాని ఇంద్రియ గోచరం కాకుండా ఉంది. స్పష్టంగా అర్థం కాకపోతే మాత్రం అది రహస్యం గానే మిగిలి పోతుంది. అందుచేతనే గుహ్యమైన బ్రహ్మవిద్య రాజగుహ్య మైంది.

రాజగుహ్య మైన బ్రహ్మవిద్య రాజవిద్య కావడం చేత దానిని పొందే మార్గము కూడా రాజమార్గమే అయి ఉంది. అదే జ్ఞానమార్గము. విజ్ఞాన సహితమైన జ్ఞానమార్గము. అన్య మార్గాల వలె సందులు గొందులలో ప్రయాణం కాకుండా, సాక్షాత్ మోక్షైక సాధనమైన జ్ఞానమార్గము రాజమార్గమై ఉంది. చక్కని రాజమార్గమై ఉంది. ఈ చక్కని రాజమార్గాన్ని రసరమ్యంగా కీర్తించారు త్యాగరాజస్వామి.

రాజమార్గము

చక్కని రాజమార్గమే యుండగ - సందుల దూర నేల? ఓ మనసా!
చిక్కని పాలు మీగడ యుండగ - ఛీ యను గంగా సాగర మేలే?

అని ఖరహర ప్రియ రాగంలో హరిహర ప్రియంగా, సురసర ప్రమోదంగా గానం చేశారు త్యాగరాజస్వామి.

అందమైన, అద్భుతమైన, అసమానమైన రాజమార్గమును (రాజవిద్యను) విడిచి, ఇరుకైన, మురికైన మార్గాలలో ఎందుకు పయనిస్తావు? అని మనస్సును హెచ్చరించారు.

శుచికి, రుచికి, ఆరోగ్యానికి, ఆనందానికి అనువుగా చిక్కని మీగడ పాలు ఉండగా, దానిని విడిచిపెట్టి, ఛీ! ఛీ! గంగా సాగర పాన మెందుకు? అని వ్యంగ్య బాణాన్ని సంధించారు.

గంగా సాగర మంటే, గంగ సాగరములో కలిసే చోటు అని కాదు. గంగాసాగర మందే మత్తెక్కించే కల్లు, మత్తులో ముంచే నాటు సారా అని అర్థము.

పూర్వపు రోజుల్లో సదాచార కుటుంబాలలో పుట్టి, అనాచారానికి అలవాటు పడ్డ కొందరు దురాచారులు నికృష్ట వస్తువులకు ఉత్కృష్ట నామాలను తగిలించి, పిల్లి పాలు త్రాగినట్లు అపమార్గంలో చరిస్తూ దురలవాట్లను కొనసాగించే వారు. అలాంటి వారు ఇతరులకు అర్థం కాకుండా, కేవలం వారిలో వారికే అర్థమయ్యే లాగా, కల్లు సారాను గంగాసాగర మని, కోడిగ్రుడ్లను విబూదిపండ్లు అని, చేపలను జలపుష్పాలు అని చెప్పుకుంటూ వ్యవహారాన్ని కొనసాగించే వారు. త్యాగరాజస్వామి వారి భాషనే కృతిలో ఉపయోగించి, చేతులతో పని లేకుండానే చెంపలు వాయించారు.

పయనించడానికి సూటియైన చక్కని రాజమార్గం లాగా, పానం చేయడానికి చిక్కని మీగడ పాల లాగా, పరమేశ్వరుని పొంది తరించడానికి రాజగుహ్య మైన జ్ఞానమార్గము రాజమార్గమై రాజిల్లుతోంది. ఇదే రాజవిద్యా రాజగుహ్య యోగము లోని కేంద్ర విషయము. ఇది గీతలో తొమ్మిదవ అధ్యాయము.

తొమ్మిది - అక్షయ నిధి

రాజవిద్యా రాజగుహ్య యోగము గీతలో తొమ్మిదవ అధ్యాయము. తొమ్మిది ఒక విచిత్రమైన అంకె. జ్ఞానం విషయంలో సాంఖ్యము ఎలాంటిదో గణితంలో సంఖ్యా పరంగా తొమ్మిది అంకె అలాంటిది. జ్ఞానములో బ్రహ్మవిద్య ఎలా రహస్యమో, గణితంలో తొమ్మిది అంకె కూడా ఒక రహస్యమే. ఆత్మవిద్య ఎలా పరిపూర్ణమో, ఈ తొమ్మిది అనే అంకె కూడా సదా పూర్ణమై భాసిస్తూ, పరిపూర్ణతకు ప్రతిరూపంలా ప్రతిఫలిస్తూ ఉంటుంది.

(1) అద్వయం

బ్రహ్మము అద్వయము. అఖండము. బ్రహ్మము సృష్టిలో సర్వ వ్యాపకమై ఉన్నా, తన అఖండత్వానికి భంగం వాటిల్లదు. అనేక రూపాలుగా రూపాంతరం చెందినా పరమేశ్వరుడు ఏకమై, అద్వయమై ఉన్నాడు.

తొమ్మిది అంకె కూడా అలాగే అద్వయంగా ఉంటుంది. తొమ్మిదిని ఎన్ని అంకెలలో పెంచుకున్నా, మార్పు లేని బ్రహ్మపదార్థం లాగా తొమ్మిది చలించకుండా ఉంటుంది. తొమ్మిది ఆర్లు యాభై నాలుగు. ఐదు నాలుగు కలిసి తిరిగి తొమ్మిది అవుతుంది. తొమ్మిది ఎనిమిదుల డెబ్బై రెండు. ఏడు రెండు కలిపితే తొమ్మిది అవుతుంది. ఇలా ఎంతైనా పెంచుకుంటూ పొండి, తొమ్మిది మాత్రం అచలంగా ఉంటుంది.

స్వామీజీ! నాలుగు వందల డెబ్బై రెండును తొమ్మిదితో పెంచితే? ఏమైంది? పెంచండి. నాలుగు వేల

రెండు వందల నలభై ఎనిమిది అవుతుంది. మళ్ళీ ఆ నాలుగు అంకెలను కూడండి. తొమ్మిది ఒక్కటే అక్షయంగా మిగులుతుంది.

పరమేశ్వరుడు సృష్టి లోని నామరూపా లన్నిటిలో ఉన్నా, వాటికి విలక్షణంగా అద్వయమై భాసించినట్లు, ఎన్ని అంకెలలో వ్యాపించినా తొమ్మిది ఏకమై, అద్వయమై ఉంటుంది. ఇదే భిన్నత్వంలో ఏకత్వం. సృష్టి దేని చేత వ్యాప్తమై ప్రకాశిస్తూ ఉందో, తిరిగి దాని యందే లయిస్తూ ఉంది అనే ఏ అద్వయ స్థితిని ఉపనిషత్తు ప్రవచిస్తూ ఉందో అదే తొమ్మిదిని సంఖ్యాపరంగా పెంచడములో మనకు ఋజువైంది.

యేన ప్రకాశతే విశ్వం యత్రైవ ప్రవిలీయతే

విశ్వము దేని చేత ప్రకాశిస్తూ ఉందో, తిరిగి దాని యందే లయిస్తూ ఉంది. అదే బ్రహ్మము అని పంచబ్రహ్మోపనిషత్.

(2) ఆధారం

విశ్వమైనా - వ్యక్తి అయినా, ఏది ఉన్నా - ఎవరు ఉన్నా, ఆధారము బ్రహ్మమే. పరమేశ్వరుడే. పరమేశ్వరుడు అనుకూలంగా ఉన్నంత వరకే మన మనుగడ ఉంటుంది. ఆధారంతో విభేదించి నపుడు దేనికీ అస్తిత్వం ఉండదు. కేవలం ఆధారమే అస్తిత్వముతో భాసిస్తుంది.

మనం ఉన్నాం. అలా ఉండటానికి పరమేశ్వరుడే ఆధారము. విశ్వము ఉంది. విశ్వాధారంగా భగవానుడు ఉన్నాడు. రేపు వ్యక్తులు, విశ్వము లేకపోయినా భగవానుడు దివ్యంగా శోభిస్తూ ఉంటాడు. సంఖ్యాపరంగా చూస్తే ఈ విధమైన అస్తిత్వము తొమ్మిది అంకెలో కూడా కనిపిస్తుంది.

ఐదు అంకెతో తొమ్మిది కలిస్తే, ఐదు శోభిస్తుందే గాని క్షోభించదు. జీవిస్తుందే గాని నశించదు. ఎలా గంటారా? ఐదు తొమ్మిదితో కలిస్తే పద్నాలుగు అవుతుంది. నాలుగు ఒకటి కలిసి ఐదుగా ఉంటుంది. ఇలా తొమ్మిదితో ఏ అంకె కలిసినా, పరమేశ్వరుని వల్ల విశ్వం శోభించినట్లు, ఆ అంకె మనుగడను సాగిస్తుంది. మీరు ఏ అంకెను కలిపినా ఇలాగే ఉంటుంది. ఏడు తొమ్మిదితో కలిస్తే పదహారు అవుతుంది. ఆరు ఒకటి కలిసి మళ్ళీ ఏడు గానే ఉంటుంది.

అలా కాకుండా విభేదిస్తే, లేదా ప్రతికూలిస్తే, పరమేశ్వరునికి దూరమైనది ఏదైనా మనుగడను కోల్పోయినట్లు, ఆ తరువాత పరమేశ్వరుడే మిగిలినట్లు, తొమ్మిది కూడా తనతో విభేదించిన అంకెను తనలో కలుపుకొని అంకెకు అస్తిత్వాన్ని పోగొట్టి, అస్తి రూపంలో తానే భాసిస్తుంది.

తొమ్మిదితో కలిసి నపుడు కలిసిన అంకె శోభించింది. తొమ్మిదితో ఐదు కలిస్తే, ఐదే మిగిలి ఉండటం మనం చూశాము. ఇప్పుడు విభేదించి చూడండి. అంటే తొమ్మిదిని ఐదుతో పెంచండి. నలభై ఐదు వస్తుంది. నాలుగు ఐదు కలిస్తే తొమ్మిది అవుతుంది. ఐదు అదృశ్య మవుతుంది. తొమ్మిదితో ఏ అంకె విభేదించినా ఇదే గతి. తొమ్మిదిని ఏడుతో పెంచితే అరవై మూడు అవుతుంది. ఆరు మూడు కలిస్తే తొమ్మిది అవుతుందే గాని ఏడు కాదు. ఈ విధంగా తొమ్మిది అనే అంకె బ్రహ్మపదార్థం లాగా అస్తిత్వ ఆధారాలతో రహస్యంగా శోభిస్తూ ఉంటుంది.

ఆధార మానన్ద మఖండ బోధం
యస్మిన్ లయం యాతి పురత్రయం చ ॥

సమస్తమునకు ఆధారము, ఆనంద స్వరూపము, అఖండ జ్ఞానరూపము అయిన పరబ్రహ్మము నందు

పురత్రయము లయిస్తూ ఉంది అని కైవల్యోపనిషత్. ఇదే త్రిపురా రహస్యము. రాజగుహ్య మైన రాజవిద్యా వైభవము. భగవద్గీత తొమ్మిదవ అధ్యాయంలో తొంగి చూచే ప్రాభవము.

(3) అనంతం

బ్రహ్మము అద్వయం కనుక అనంతము. చైతన్య స్వరూపము. అనంతమైన చైతన్యానికి ఏదీ దూరం కాలేదు. అన్నీ చైతన్య స్వరూపాలే. అన్నిటిలో శ్రేష్ఠ మైనది చైతన్యమే. అన్నీ భిన్నంగా తెలుస్తూ ఉండినా, అన్నీ ఏకమైనా, అవన్నీ ఒక్క చైతన్యం లోనే ఉంటాయి. తొమ్మిది అంకెలో కూడా అన్ని అంకెలూ విలీనమై తొమ్మిది ఒక్కటే బ్రహ్మములా భాసిస్తూ ఉంటుంది.

ఒకటి నుండి తొమ్మిది వరకు అంకెలను వేసుకొని కూడండి. మొత్తం నలభై ఐదు అవుతుంది. నాలుగు అయిదు కలిసి మళ్ళీ తొమ్మిది అంకే ఉంటుంది. ఇదే తొమ్మిది అంకె లోని అనంత వైభవము. అద్వైతము లోని అఖండ ప్రాభవము.

పంచరూప పరిత్యాగాత్ అస్వరూప ప్రహాణతః ।
అధిష్ఠానం పరం తత్త్వం ఏకం స చ్ఛిష్యతే మహత్ ॥

పాంచభౌతిక మైన జగత్తు దూరమై నపుడు, జడమైన వస్తు రూపము లన్నీ అదృశ్యమై, అధిష్ఠానము, అద్వయము, సద్రూపము, మహత్తరము అయిన పరంబ్రహ్మ మొక్కడే భాసిస్తూ ఉంటుంది అని బహ్వృచోపనిషత్తు. అలాగే ఒకటి నుండి తొమ్మిది వరకు గల అంకెల నన్నిటినీ కలిపితే, అంకెలన్నీ అదృశ్యమై, తొమ్మిది ఒక్కటే బ్రహ్మము లాగా శేషించి ఉంటుంది.

మధ్య లోనే మహిమ

రాజగుహ్య మైన రాజవిద్యను దివ్యంగా ప్రవచించిన తొమ్మిదవ అధ్యాయము భగవద్గీత మధ్యలో నిలిచి మరొక విధంగా తన మహిమను చాటుకున్నది.

సమస్త వేదార్థ సార సంగ్రహ భూతమైన భగవద్గీత మహాభారతం మధ్యలో ఉంది **(మధ్యే మహాభారతమ్)**. ఉపనిషత్సార మైన గీతామృతాన్ని వితరణ చేసిన శ్రీకృష్ణ భగవానుడు కురుక్షేత్రంలో ఉభయసేనల మధ్య నిలబడి ఉన్నాడు. గీతను శ్రవణం చేసిన అర్జునుడు పాండవ మధ్యముడు. సర్వభూతాల మనుగడకు కారణ మైన పరమేశ్వరుడు హృదయ పుండరీకం మధ్య శోభిస్తున్నాడు **(హృత్పుండరీకం విరజం విశుద్ధం)**. మహిమాన్విత మైన రాజవిద్యా రాజగుహ్య యోగమైన తొమ్మిదవ అధ్యాయం కూడా భగవద్గీత మధ్యలో ఒదిగి తన మహిమను చాటుకుంది. గీత మధ్యలో ఉండటమే గాక, తత్పద రూపమైన ద్వితీయ షట్కంలో కూడా మధ్య లోనే చేరి పోయింది. కనుక మనం కూడా బంధాల నుండి విడిపడి, ఆనంద విహారం చేయడానికి సంధ్యలో నిలబడి వందనం అంటూ ముందుకు సాగుదాము.

విశిష్టము, వరిష్ఠము అయిన రాజవిద్యా రాజగుహ్య యోగానికి ఉపోద్ఘాతాన్ని విస్తారంగా చెప్పుకున్నాం. ఇక అధ్యాయం లోకి ప్రవేశించి అధ్యయనం చేద్దాం!

శ్రీ భగవానువాచ :

ఇదం తు తే గుహ్యతమం ప్రవక్ష్యా మ్యనసూయవే । 1
జ్ఞానం విజ్ఞాన సహితం యజ్జ్ఞాత్వా మోక్ష్యసే౽శుభాత్ ॥

ఇదం-తు-తే-గుహ్యతమం-ప్రవక్ష్యామి-అనసూయవే

జ్ఞానం-విజ్ఞానసహితం-యత్-జ్ఞాత్వా-మోక్ష్యసే-అశుభాత్

యత్	=	దేనిని	ఇదం	=	ఈ
జ్ఞాత్వా	=	తెలిసికొని	జ్ఞానం తు	=	జ్ఞానమును
అశుభాత్	=	అశుభము నుండి	అనసూయవే	=	అసూయ లేని
మోక్ష్యసే	=	విడి పడతావో	తే	=	నీ కొరకు
గుహ్యతమం	=	అతి రహస్యమైన	ప్రవక్ష్యామి	=	చెబుతున్నాను
విజ్ఞానసహితం	=	అనుభవ జ్ఞానముతో కూడుకున్న			

శ్రీ భగవానుడు చెబుతున్నాడు :

అర్జునా! నువ్వు అసూయ లేని వాడివి. అందుకనే, అతి రహస్యము, అనుభవ సహితము అయిన జ్ఞానాన్ని నీకు చెబుతున్నా! ఇది అర్థమైతే, సంసార బంధము నుండి బయట పడతావు.

వ్యాఖ్య

విషయ ప్రస్తావన

ఇదం అంటూ భగవంతుడు తొమ్మిదవ అధ్యాయాన్ని ప్రారంభించాడు. ***ఇదం*** అంటే 'ఇది' అని అర్థము. 'ఇది' అనే పదాన్ని ఎప్పుడు ఉపయోగించినా, ఎక్కడ ఉపయోగించినా, ఎవరు ఉపయోగించినా, అది సామీప్యాన్ని సూచిస్తుంది. ఏది దగ్గరగా ఉందో, కళ్ళ ముందు ప్రత్యక్షంగా ఉందో దానిని 'ఇది' అని ప్రస్తావిస్తాము.

ప్రస్తుతం ఏ విషయాన్నైతే భగవంతుడు ప్రవచిస్తున్నాడో దానిని ***ఇదం*** అని ఆరంభించాడు. ఇది విషయ ప్రస్తావన. ప్రవచించబోయే విషయం బ్రహ్మజ్ఞానం కనుక, ఇక్కడ ***ఇదం*** అంటే బ్రహ్మజ్ఞానము అని అర్థము ***(ఇదం బ్రహ్మజ్ఞానం).***

మరి, ఎదురుగా ఉండే దానిని ***ఇదం*** అనేటప్పుడు, బ్రహ్మ విషయం ఎదురుగా, ప్రత్యక్షంగా తెలిసేది కాదు కదా! అలాంటప్పుడు ***ఇదం*** అనేది విషయ ప్రస్తావనకు సముచిత మేనా? అనే సందేహము కలుగుతుంది.

నిజమే. బ్రహ్మజ్ఞానం కళ్ళ ముందు లేదు. ఇంద్రియ ప్రత్యక్షం కాదు. కాని, ముందుగానే అధ్యాయ పీఠికలో మనం చూచినట్లు, సప్తమాధ్యాయంలో ఆగిన విషయాన్ని గీతాచార్యుడు ఇక్కడ తిరిగి అందుకొని ప్రవచిస్తున్నాడు. కనుక ఏ బ్రహ్మజ్ఞానమును ***ఇదం*** అంటూ ప్రారంభించాడో, అది కళ్ళ ముందు లేకపోయినా, వక్త మనస్సులో ప్రత్యక్షంగా ఉంది. కంటికి కనిపించే దాని కన్నా మనస్సుకు తెలిసేది వ్యక్తికి మరీ సమీపంలో ఉన్నది అవుతుంది కాబట్టి, బ్రహ్మజ్ఞానమును ***ఇదం*** అంటూ ప్రస్తావించడం జరిగింది.

ప్రస్తుత అధ్యాయము మనం అర్థం చేసుకున్నట్లు ఏడవ అధ్యాయానికి కొనసాగింపు కావచ్చు. కాని, భగవంతుడు బ్రహ్మజ్ఞానమునకు సంబంధించిన విషయాన్ని అంతకు పూర్వం అధ్యాయాలలో కూడా ఎంతగానో విస్తరించి వివరించి ఉన్నాడు. అదంతా వక్త మనస్సులో ఉంది. అంతేకాదు, ముమ్ముందు ఏది ప్రవచించ బోతున్నాడో అది కూడా మనస్సులో ప్రత్యక్షంగా ఉంది. ఇంతవరకు చెప్పినది, ఇక మీదట చెప్పబోయేది అంతా గీతాచార్యుని మనస్సులో ప్రత్యక్షంగా ఉన్నందున, దానిని, అంటే బ్రహ్మజ్ఞానమును ***ఇదం*** అని ప్రస్తావించడం జరిగింది ***(ఇదం, బ్రహ్మజ్ఞానం, వక్ష్యమాణమ్ ఉక్తం చ పూర్వేషు అధ్యాయేషు తత్ బుద్ధౌ సంనిధీకృత్య 'ఇదమ్' ఇతి ఆహ).*** కనుక, బ్రహ్మజ్ఞానము అనేది ఎక్కడో పరోక్షంగా లేదు, ***ఇదం*** - ప్రత్యక్షం గానే ఉంది అని అర్థము. బ్రహ్మకు సంబంధించిన జ్ఞానమే బ్రహ్మజ్ఞానము కనుక, బ్రహ్మజ్ఞానము పరోక్షం కాదు అంటే

బ్రహ్మము కూడా పరోక్షం కాదు అని అర్థము. బ్రహ్మము అపరోక్షము అని భావము. బ్రహ్మము ఎప్పుడైతే అపరోక్షము అని తేలిందో, బ్రహ్మజ్ఞానము కాలాంతర ఫలం కాదని స్పష్టమవుతూ ఉంది. ఇప్పుడు కాకుండా, కాలంలో ప్రాప్తించేది కాలాంతర ఫలం. అంటే, ఎనిమిదవ అధ్యాయంలో మనం చర్చించుకున్న క్రమముక్తి విషయం. బ్రహ్మలోకంలో ప్రాప్తించే బ్రహ్మజ్ఞాన విషయం. సగుణ బ్రహ్మోపాసకులకు బ్రహ్మలోకంలో బ్రహ్మజ్ఞానోపదేశం వల్ల క్రమముక్తి కలుగవచ్చు. దాని అర్థం ముక్తి ఎక్కడో గాని ఇక్కడ ప్రాప్తించదు అని మాత్రం కానే కాదు. కనుక, బ్రహ్మజ్ఞానం **ఇదం** పద ప్రయోగం చేత అపరోక్షం అని ఎప్పుడైతే నిర్ధారించ బడిందో, అది సద్యః ఫలమే గాని కాలాంతర ఫలం కాదు అని సుస్పష్ట మవుతూ ఉంది. ఈ విషయాన్ని, విశేషాన్ని నిర్ధారించడం కొరకు **తు** శబ్దం వాడ బడింది. **ఇదం తు** - అపరోక్షమైన ఈ బ్రహ్మజ్ఞానము అని స్పష్టం చేయడం జరిగింది.

విశేష నిర్ధారణ

తు శబ్దము విశేష వాచకము. వైశిష్ట్యార్థకం ప్రయోగింప బడింది. ధ్యానము కంటే జ్ఞానము ఎలా విలక్షణమో స్పష్టం చేయడం కోసం వాడ బడింది. ధ్యాన విషయమైన ధ్యేయ బ్రహ్మకు, జ్ఞాన విషయమైన జ్ఞేయబ్రహ్మకు మధ్య అంతరాన్ని అర్థమయ్యే లాగా చేయడం కోసం చెప్ప బడింది. క్రమముక్తికి, జీవన్ముక్తికి అంతరాళమును నిర్ధారించడం కోసం **తు** శబ్ద ప్రయోగం జరిగింది **('తు' శబ్దః విశేష నిర్ధారణార్థః).** అంటే, శ్రుతి స్మృతి పురాణాలను ఆధారం చేసుకొని చూచినా, మోక్షానికి సాక్షాత్తు ఏకైక సాధనం సమ్యక్ జ్ఞానమే గాని మరొకటి కాదు అనే విశేషాన్ని వ్యక్తం చేస్తున్న విషయాన్ని నిర్ధారణ చేయడం కోసమే **తు** శబ్ద ప్రయోగము.

వాసుదేవః సర్వమితి - ఈ సమస్తమూ వాసుదేవుడే *(7 - 19)* అని సప్తమాధ్యాయంలో చెప్పబడింది. ***సర్వం ఖలు ఇదం బ్రహ్మ*** - ఈ సమస్తమూ బ్రహ్మమే, దానికి అన్యంగా రెండవ వస్తువు లేదు అన్నది ఉపనిషత్తు. కనుక, ***ఇదం*** అని చెప్పబడుతున్న బ్రహ్మజ్ఞానము ఏదో కాదు, సర్వము తానైన వాసుదేవ పరబ్రహ్మమే. బాగుంది. మరి ఆత్మ ఎవరు? ***అయమాత్మా బ్రహ్మ*** - ఈ ఆత్మయే బ్రహ్మము. మరి ఈ సమస్తము వాసుదేవ పరబ్రహ్మమైనపుడు ఆత్మ ఏమిటి? ఆత్మ కూడా వాసుదేవ పరబ్రహ్మమే. మరి **ఇదం** - ఈ సమస్తము ఏమిటి? ఆత్మయే. ***ఆత్మైవేదం సర్వమితి*** (ఆత్మ ఏవ 'ఇదం' సర్వం ఇతి). ఈ సమస్తము ఆత్మయే. ఇక పరోక్షమెక్కడుంది? అంతా అపరోక్షమే. **ఇదం** - ఈ బ్రహ్మజ్ఞానము, ***అయం*** - ఈ ఆత్మ, రెండూ ఒక్కటే. అదే **ఇదం** పద ప్రస్తావన. **తు** శబ్ద నిర్ధారణ.

ఉంది - తెలియవలసి ఉంది

బ్రహ్మము పరోక్షం కాదు, అపరోక్షం అని అర్థమైంది. ఈ ఆత్మయే బ్రహ్మము అని కూడా తెలిసింది కనుక ఆత్మ కూడా అపరోక్షమే. నువ్వు ఉన్నావు. ఆత్మ ఉంది. నువ్వే ఆత్మ. ఇది ఇంద్రియాలకు ప్రత్యక్షం కాదు. అలాగని, పరోక్షమూ కాదు. ప్రత్యక్షము, పరోక్షము రెండూ కానిది అపరోక్షము. కనుక అది ఉన్నదే. కాకపోతే తెలియకుండా ఉంది. తెలియవలసి ఉంది. తెలియని వాడు తెలుసుకోవాలి. అంతే. జ్ఞానం ఏదైనా తెలిసిన వాడు ఇస్తేనే తెలియని వానికి అందుతుంది. చెబితేనే తెలుస్తుంది. అందుచేత శాస్త్రం శబ్ద ప్రమాణమైంది.

మోక్షం జ్ఞానరూపంలో ఉంది. జ్ఞానం శాస్త్రంలో ఉంది. శాస్త్రం జ్ఞాని చెబితేనే అర్థమవుతుంది. అంటే, శాస్త్రం మోక్షాన్ని ఇస్తుందా? అలాగని శాస్త్రం ఎప్పుడూ చెప్పలేదు. ఎందుకని? శాస్త్రం దృష్టిలో నువ్వు ముక్తుడవే గాని బద్ధుడివి కావు. నీవు ఆత్మవు. ఆత్మ నిత్యముక్తం. అలాంటి ఆత్మవైన నీవు బద్ధుడివి ఎలా అవుతావు?

బద్ధుడు కాని వాడు ముక్తుడు ఎలా అవుతాడు? ముక్తి అనేది ముక్తుడు కాని వానికి క్రొత్తగా ప్రాప్తించేది అయితే, అట్టి ముక్తి లేకుండా వచ్చింది అని అర్థము. ఇప్పుడు లేకుండా వచ్చింది రేపు లేకుండా పోదా? కాలంలో కలిగింది కాలంలో నశించదా? నశించేది మోక్ష మెలా అవుతుంది?

మోక్షము కూడా క్షరమైతే
దానిని పొంది ఫల మేమి?
అక్షరమై అది స్థిరమైతే
పొందే యత్నం ఎందుకని?
పోయేది లేదు - వచ్చేది కాదు
ఉన్నది ఉన్నట్లు తెలియాలి
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్

అని రామజోగి చిట్కా.

శాస్త్రం ఉన్నది ఆత్మ యొక్క అస్తిత్వాన్ని నిరూపించడానికి కాదు. నీవే ఆత్మ అనే జ్ఞానాన్ని ఇవ్వడానికి. నువ్వు ఉన్నావా, లేదా? ఉన్నావు. నువ్వు ఉన్నావు అంటే, నీవే ఆత్మ కనుక ఆత్మ ఉంది. మరి లేనిది ఏమిటి? లేనిది ఆత్మ కాదు. నేనే ఆత్మ అనే జ్ఞానం. జ్ఞానం లేదు కనుక జ్ఞానాన్ని పొందాలి. శాస్త్రం జ్ఞానాన్ని ఇస్తుంది. ఆత్మజ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. అంతేగాని, ఆత్మను కాదు. ఆత్మ సిద్ధంగా ఉంది. స్వతఃసిద్ధంగా ఉంది. అది నీవే.

ఆత్మ నేనే అయినపుడు, నేను ఆత్మ అని నాకు ఎందుకు తెలియడం లేదు? నీవు కాని దానిని నీవు అని భావించడం చేత, నీవు ఏమిటో నీకు అర్థం కావడం లేదు. ఉన్న త్రాడులో లేని పామును చూచిన వానికి లేని సర్పమే ఉన్నట్లు గోచరిస్తుంది గాని, ఉన్న రజ్జువు తెలిసి రాదు. ఉన్నది సర్పమే అని నిర్ణయించింది తానే కనుక, అది సర్పము కాదు - త్రాడే అనే జ్ఞానాన్ని తనకు తానుగా పొందే అవకాశం లేదు. సహజంగా తనకు తానుగా తెలుసుకోలేని దానిని మరొకరు చెప్పినపుడే తెలుసుకోగలడు. అలా చెప్పేవాడు జ్ఞాని. చెప్పబడేది జ్ఞానం. చెప్పేవాడు గురువు. చెప్పబడేది శాస్త్రం. ఇక్కడే శాస్త్రం ప్రమాణమై శోభిస్తోంది. ప్రమాణాపేక్ష లేని వారికి జ్ఞానం ప్రాప్తించదు.

యత్తు స్వతః అప్రాప్తం తత్ శాస్త్రేణ బోధితవ్యం

నీకు నీవుగా అర్థం చేసుకోలేని దానిని శాస్త్రం ద్వారానే అర్థం చేసుకోవాలి అని ఆచార్యులు ఐతరేయోపనిషత్ భాష్యంలో చెబుతారు.

ఏదైతే ఉండి కూడా అర్థం కాకుండా ఉందో, దానిని గూర్చే భగవంతుడు ఇక్కడ బోధిస్తున్నాడు. ఉన్నదే అర్థం కాకుండా ఉండటం చేత అది గుహ్యమైంది. రహస్యమైంది. మామూలు రహస్యం కాదు. రహస్యాలలో రహస్య మైంది. గుహ్యతమ మైంది.

గుహ్యతమం

గుహ్యం అంటే రహస్యము. తెలియనిది ఏదైనా రహస్యమే. గుహ్యమే. తరతమ భేదాన్ని బట్టి అతి రహస్యము గుహ్యతరము. కాని, రహస్యాలలో రహస్యమైన ఆత్మజ్ఞానము గుహ్యతమము ***(గుహ్యతమం గోప్యతమం).***

బ్రహ్మజ్ఞానమును గుహ్యతమం అని ఎందుకు చెప్పవలసి వచ్చింది అంటే, ప్రత్యక్షాది ప్రమాణాలకు అందనిది కావడం చేత. అంతేకాదు, ప్రశస్త మైనది, పరిరక్షించ వలసింది కావడం చేత గుహ్యతమం అని వ్యాఖ్యానించారు శ్రీ మధుసూదన సరస్వతి.

విలువైన రత్నమాణిక్యాలను, వజ్ర ఖచిత సువర్ణాభరణాలను ఎవరైనా రహస్యం గానే దాచుకుంటారు కదా! అవి అమూల్య మైనవి కనుకనే వాటిని రహస్యంగా దాచుకుంటారు. అలాంటప్పుడు మోక్ష ప్రదాయక మైన బ్రహ్మజ్ఞానము ఎంత అమూల్య మైనదో అంచనా వేసి చెప్పగలమా? అందుకే బ్రహ్మజ్ఞానము గుహ్యతమం.

రహస్యంగా దాచుకో వలసిన రత్న మాణిక్యాలను పిల్లలకు ఆట వస్తువులుగా ఎవరైనా ఇస్తారా? విలువైన వస్తువుల్ని ఎవరైనా, విలువ తెలిసిన వారికే ఇస్తారు. బ్రహ్మజ్ఞానము కూడా ప్రశస్తమై, పవిత్రమై, గుహ్యతమం కావడం చేత, దానిని విలువ తెలిసిన అర్జునునికే అచ్యుతుడు అనుగ్రహిస్తున్నాడు **(ఇదం తు తే గుహ్యతమం ప్రవక్ష్యామి).**

అతి రహస్యమైన ఈ బ్రహ్మజ్ఞానమును **(ఇదం తు)** చెబుతున్నాను **(ప్రవక్ష్యామి)** అంటున్నాడు భగవంతుడు. **వక్ష్యామి** అంటే సరిపోతుంది. దానికి **ప్ర** అనే ఉపసర్గను చేర్చి **ప్రవక్ష్యామి** అనడం వల్ల ప్రబోధములో ఉండే ప్రభావము ద్యోతక మవుతూ ఉంది. నిస్సందేహంగా, నిర్ధారణ పూర్వకంగా చెప్పబడుతూ ఉంది అని అర్థము. ఎవరికి చెప్పబడుతూ ఉంది? ***(తే ప్రవక్ష్యామి).*** అర్జునా! నీ కోసం చెబుతున్నాను అంటున్నాడు భగవంతుడు. ఈ ఒక్క మాట అర్జునుని అర్హతకు అద్దం పడుతూ ఉంది. శిక్షణ యోగ్యుడైన శిష్యునికే ఏ గురువైనా బోధిస్తాడు. అర్జునుడు అర్హుడు కనుకనే పరమేశ్వరుడు బోధిస్తున్నాడు. బ్రహ్మజ్ఞానమును అందుకోవడానికి అర్జునుడు అధికారి కావడం చేతనే గుహ్యతమ మైన గీతాజ్ఞానాన్ని అనంతుడు అనుగ్రహిస్తున్నాడు.

ఏమిటి అర్జునుని అర్హత? ప్రత్యేకంగా పార్థునిలో కనిపిస్తున్న అధికారి లక్షణం ఏమిటి? అసూయ లేకపోవడమే. అర్జునుడు అనసూయువు కావడమే. ఈ విషయాన్ని భగవంతుడే స్వయంగా చెబుతున్నాడు. అర్జునా! నీవు అనసూయువు, అనగా అసూయ లేని వాడవు కనుక నీకు విస్పష్టంగా చెబుతున్నాను అంటున్నాడు ***(తే ప్రవక్ష్యామి కథయిష్యామి! అనసూయ వే అసూయా రహితాయ).***

అసూయా రహితుడు

ఎంతగా వింటూ వున్నా అర్థం గాకుండా మిగిలి పోతున్న గుహ్యతమ మైన విషయాన్ని అర్థం చేసుకోవాలి అంటే, శ్రవణం చేసే ముముక్షువు అధికారియై ఉండాలి. చిత్తశుద్ధి కలవాడై ఉండాలి. శిక్షణ యోగ్యుడై ఉండాలి. అసూయ లేనివాడే అధికారి అంటున్నాడు భగవంతుడు.

గుణేష్వపి పరేషు దోషారోపః అసూయా - మంచి గుణములు కలిగియున్న వారిలో చెడు గుణములను ఆరోపించుటయే అసూయ. అట్టి అసూయ ఎవరిలో అగుపించదో వాడు అనసూయువు. అసూయా రహితుడైన గుణవంతుడు. బ్రహ్మజ్ఞానమును పొందుటకు అర్హుడు.

పరుల గుణముల యందు దోష దర్శనము చేయుట అసూయ అని స్థూలంగా చెప్పుకున్నా, వాస్తవానికి అసూయ అనేది అరిషడ్వర్గాలకు ఉపలక్షణము. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలకు అసూయను ఉపలక్షణంగా చెప్పడం జరిగింది. ఈ అరిషడ్వర్గాల దుర్గుణాల నుండి విడిపడిన వాడు అనసూయువు. బ్రహ్మజ్ఞాన సముపార్జనకు యోగ్యత కలవాడు.

గుణేషు అర్థదానాది ష్వపి డాంబికత్వాది దోషారోపః అసూయే త్యుచ్యతే - పేదలకు, సాధువులకు, స్వచ్ఛంద సంస్థలకు, లేదా ఆశ్రమాలకు ధన సహాయం చేసే ఉదారు లైన పుణ్యాత్ములను చూచి ఓర్వలేక, వారేదో పేరు ప్రఖ్యాతుల కోసం ఫోటోలను ముద్రించుకొని, దంభమును ప్రదర్శించుట కోసం దానధర్మాలను బహిరంగంగా చేస్తూ ఉంటారని దాతలకు దోషాలను అంటగట్టడం కూడా అసూయ క్రిందికే వస్తుంది. ఇలాంటి అసూయాపరులకు జడిసి ఉదారులు సైతం భీతి చెంది గుప్త దానాలు చేస్తూ ఉంటారు.

మరి, ఈ విధమైన అసూయ జ్ఞాన సముపార్జనకు ఎలా ప్రతిబంధకము? అనే సందేహము రావచ్చు. ఇంతకు మించిన ప్రతిబంధకము మరొకటి ఉంటుందా? ఉన్న గుణాలలో లేని దోషాలను వీక్షించే మనస్సే కదా రజ్జువులో సర్ప దర్శనం చేసినట్లు, ఆత్మను అనాత్మగా, అనాత్మను ఆత్మగా దర్శించేది! అనాత్మ యందు ఆత్మదర్శనం చేయడమే బంధము. అదే అజ్ఞానము ***(అనాత్మని అహ మితి మతిః బంధః, అజ్ఞానాత్ ప్రాప్తః).*** అజ్ఞాన జనితమై, బంధానికి కారణమైన అధ్యాసకు ప్రతిరూపమైన అసూయ జ్ఞానానికి ప్రతిబంధకం కాదా? కనుక గురువు జ్ఞానమును అనుగ్రహించినా అసూయాపరుడు అందుకోలేడు. అందుకున్నా నిలుపుకోలేడు. అసూయ లేనివాడు కనుక అర్జునుడు జ్ఞాన సముపార్జనకు అర్హు డయ్యాడు. కనుకనే అసూయా రహితుడైన అర్జుననకు విజ్ఞాన సహితమైన జ్ఞానాన్ని పరమేశ్వరుడు బోధిస్తున్నాడు. పార్థుడు ఎంతటి పుణ్యాత్ముడో! సాక్షాత్తు భగవంతుని నుండే అసూయా రహితుడు అనే యోగ్యతా పత్రాన్ని అందుకున్నాడు. అంతేకాదు, అర్జునుని నిర్మల హృదయాన్ని చూచి తృప్తి చెందిన భగవంతుడు అర్జునుని ప్రశ్నకు కూడా ఎదురు చూడకుండా తనకు తానుగా అధ్యాయాన్ని ప్రారంభించి ప్రవచిస్తున్నాడు.

కేవలం అర్జునుని సంస్కార వైభవాన్ని చూచి సంతసించడం కాకుండా, ముముక్షువుల మైన మనం స్వయంగా అసూయా రహితులమై ఉన్నామో, లేదో ఎవరికి వారుగా పరీక్షించి చూసుకోవాలి. అసూయ అనేది మనస్సును చెద లాగా తొలిచేస్తుంది. మనస్సులో అసూయ ప్రవేశించకుండా అనుక్షణం జాగ్రత్త పడుతూ ఉండాలి. అసూయా రహితుడు కావడం చేత అర్జునునికి విజ్ఞాన సహితమైన జ్ఞానాన్ని ఉపదేశిస్తున్నాడు అచ్యుతుడు.

జ్ఞానము - విజ్ఞానము

అసూయా రహితుడు, అధికారి అయిన అర్జునునికి విజ్ఞాన సహితమైన జ్ఞానాన్ని బోధిస్తున్నాడు. విజ్ఞానముతో అంటే, అనుభవముతో కూడిన జ్ఞానం అని అర్థం ***(విజ్ఞాన సహితం అనుభవ యుక్తం).***

అనుభవ సహిత జ్ఞానాన్ని భగవంతుడు ఉపదేశిస్తున్నాడు. పరమేశ్వరుడు బ్రహ్మజ్ఞానమును ***(ఇదం బ్రహ్మజ్ఞానం)*** ఉపదేశిస్తున్నాడు అంటే, బ్రహ్మమును గూర్చి చెబుతున్నాడు అని కాదు. నీవే బ్రహ్మము అనే జ్ఞానాన్ని ఉపదేశిస్తున్నాడు అని అర్థం. ఇదే బ్రహ్మాత్మజ్ఞానము. అనుభవ యుక్తమైన జ్ఞానము. విజ్ఞాన సహితమైన జ్ఞానము ***(జ్ఞానం విజ్ఞాన సహితం).*** మరి, ఈ జ్ఞానాన్ని తెలుసుకోవడం వల్ల ప్రయోజన మేమిటి?

బ్రహ్మజ్ఞాన ఫలం

ప్రత్యగాత్మయే పరమాత్మ అనే జ్ఞానాన్ని పొందినవాడు అశుభము నుండి విడిపడు తున్నాడు. విముక్తు డవుతున్నాడు. అశుభము అంటే బంధము. సంసార బంధము. అజ్ఞానము వలన ప్రాప్తించిన భవబంధము. వెలుగు చీకటిని పోగొట్టినట్లు జ్ఞానము అజ్ఞానమును నిర్మూలిస్తుంది. అజ్ఞానము ఎప్పుడైతే నశించిందో, అజ్ఞాన కార్యమైన సంసార బంధము కూడా తొలగి పోతుంది ***(యత్ జ్ఞానం, జ్ఞాత్వాప్రాప్య, మోక్ష్యసే అశుభాత్ సంసార బంధనాత్).*** ఇదే జ్ఞానఫలం. విజ్ఞాన సహిత బ్రహ్మజ్ఞాన ఫలం.

గుహ్యతమమై, అనుభవ సహితమైన ఏ బ్రహ్మజ్ఞానాన్ని భగవంతుడు బోధిస్తున్నాడో, దాని యందు అర్జునునికి ఆసక్తిని కలిగించి, అవధానంతో ఆలకించేటట్లు చేయడానికి, ఆ జ్ఞాన వైభవాన్ని ఎనిమిది విశేషణాలతో వర్ణిస్తున్నాడు.

రాజవిద్యా రాజగుహ్యం పవిత్ర మిద ముత్తమమ్ ।
ప్రత్యక్షావగమం ధర్మ్యం సుసుఖం కర్తు మవ్యయమ్ ॥ 2

రాజవిద్యా-రాజగుహ్యం-పవిత్రం-ఇదం-ఉత్తమం
ప్రత్యక్షావగమం-ధర్మ్యం-సుసుఖం-కర్తుం-అవ్యయం

ఇదం	= ఈ జ్ఞానము	ప్రత్యక్షావగమం	= ప్రత్యక్షానుభవముచే గ్రహించ దగినది
రాజవిద్యా	= విద్యలలో రాజైనది	ధర్మ్యం	= ధర్మము తప్పనిది
రాజగుహ్యం	= రహస్యములలో అతి రహస్య మైనది	కర్తుం	= చేయుటకు
ఉత్తమం	= ఉత్తమ మైనది	సుసుఖం	= మిక్కిలి సులభ మైనది
పవిత్రం	= పవిత్ర మైనది	అవ్యయం	= నాశరహిత మైనది

అర్జునా! ఇది రాజవిద్య. రాజగుహ్యం. ఇది పవిత్రము. ఉత్తమము. ప్రత్యక్షంగా అనుభవించ దగింది. ధర్మరూప మైంది. సులభసాధ్య మైంది. నశించనిది.

వ్యాఖ్య

'ఇదం' అనే సర్వనామమును బ్రహ్మజ్ఞానం అని, అది గుహ్యతమ మని మొదటి శ్లోకంలో చెప్పు కున్నాం. రెండవ శ్లోకంలో గుహ్యతమ మైన ఆ బ్రహ్మజ్ఞానమునే 'రాజవిద్య' అని, 'రాజగుహ్య' మని, 'పవిత్ర' మని, 'ఉత్తమ' మని, 'ప్రత్యక్షావగమ' మని, 'ధర్మ్య' మని, 'సుసుఖం కర్తుం' అని, 'అవ్యయ' మని వర్ణిస్తున్నాడు. మొదటి శ్లోకంలో జ్ఞానం అని చెప్పబడిందే, రెండవ శ్లోకంలో విద్య అని చెప్పబడుతోంది. అక్కడ 'ఇదం' అంటే బ్రహ్మజ్ఞానము అని తెలుసుకున్నాము. దానినే ఇక్కడ బ్రహ్మవిద్యగా తెలుసుకోబోతాము. అదే రాజవిద్య. ప్రథమ శ్లోకంలో గుహ్యతమ మని చెప్పబడిందే, ఇక్కడ రాజగుహ్యంగా చెప్పబడుతూ ఉంది. కనుక ప్రస్తుతం ఎనిమిది విశేషణాలతో చెప్పబడుతున్న రాజవిద్య బ్రహ్మజ్ఞానమే.

రాజవిద్య

విద్యలలో రాజు లాంటిది కావడం చేత బ్రహ్మవిద్య రాజవిద్య అయింది **(విద్యానాం రాజా).** విద్య లన్నిటిలో బ్రహ్మవిద్య మిక్కిలి ప్రకాశవంత మైనది కావడం చేత అది రాజవిద్య. మరొక దాని అవసరం లేకుండా స్వయంగా ప్రకాశిస్తూ ఉంది ***(స్వయం రాజతే).*** అసమానమై రాజిల్లుతోంది. అంతేకాదు, సమస్తాన్ని ప్రకాశింప చేస్తూ ఉంది ***(రాజయతి).*** అందువల్ల రాజవిద్య అతి శ్రేష్ఠమైంది.

రాజు ఎలాగైతే అసమానంగా శోభిస్తాడో, అలాగే బ్రహ్మవిద్య కూడా అసమానంగా శోభించడము చేత రాజవిద్య అయింది. విద్యలలో ఏ విద్యను ఎంతగా తెలుసుకున్నా ఇంకా తెలుసుకో వలసింది ఎంతో ఉంటుంది. కాని బ్రహ్మవిద్య అలాంటిది కాదు. ఇతర విద్యల లాగా పరిమితంగా ఉండి, అపరిపూర్ణంగా అర్థమయ్యేది కాదు. బ్రహ్మవిద్య పూర్ణవిద్య. అంతేకాదు. ఆ ఒక్కదానికి సంబంధించిన జ్ఞానము కలిగితే, మరొక జ్ఞానమును ప్రత్యేకంగా పొందవలసిన అవసరం ఉండదు. అన్ని జ్ఞానములు దాని లోనే ఇమిడి ఉన్నాయి ***(యత్ జ్ఞాత్వా సర్వమిదం విజ్ఞాతం భవతి).*** అందుచేత అది రాజవిద్య అయింది.

బ్రహ్మవిద్యను విడిచి పెడితే, మిగిలిన విద్య లన్నీ, కళ లన్నీ బంధహేతువులే. సంసారాన్ని పెంచే విద్యలే. అహంకారాన్ని పోషించే విద్యలే. బ్రహ్మజ్ఞాన మొక్కటే సంసారాన్ని నశింప చేస్తుంది. అహంకారాన్ని అంతం చేస్తుంది. అందుకే బ్రహ్మవిద్య రాజవిద్య అయింది.

బాలవ్యాకరణము అంటే కేవలం బాలురకు సంబంధించినది అని కాదు కదా! వ్యాకరణం అభ్యసించాలని భావించే వారందరికీ ఉపయోగ పడుతుంది. కాకపోతే బాలలుగా ఉన్నప్పుడు నేర్చుకుంటే తొందరగా అబ్బుతుంది. అంతేగాని, పెద్దలైన తరువాత మరచి పొమ్మని కాదు.

బ్రహ్మవిద్య అంటే బ్రాహ్మణులది కాదు. రాజవిద్య అంటే రాజులదీ కాదు. అజ్ఞానం పోగొట్టుకోవాలి అని ఆశించేవా రందరికీ ఉపయోగ పడేదే రాజవిద్య. కాకపోతే బోధించే శ్రీకృష్ణుడు రాజు. ఆలకించే అర్జునుడూ రాజే. అంతే కాదు. బోధింప బడుతున్న విద్య కూడా రాజవిద్య అయింది. కొన్ని అలాగే కలిసి వస్తాయి. కలిసి ఉంటాయి.

రాజగుహ్యం

అతిశయ ప్రకాశం చేత రాజవిద్యగా శోభిస్తున్న బ్రహ్మవిద్య అతి రహస్యమై, రహస్యాలలో రహస్యమై రాజగుహ్య మైంది ***(గుహ్యానాం రాజా).*** రహస్యము లైనవి విలువైనవి కావచ్చు. కాని, సులువైనవి కావు కనుక అవి రక్షితాలు కావు. సురక్షితాలు కావు.

అమూల్యమైన మణి ఉంటే, ఆ మణి గలవాడు దానిని రహస్యంగా దాచుకుంటాడు. అంతేకాదు. అది ఎక్కడ పోతుందో అని నిరంతరం భీతి చెందుతూ ఉంటాడు. విలువైన వన్నీ ఈ ప్రపంచంలో రహస్యాలుగా ఉంటూ ఇలా భయ హేతువులుగా ఉంటాయి. కాని, రహస్యాలలో రహస్యమై, గుహ్యతమ మైన బ్రహ్మజ్ఞానము భయ కారణాన్ని తొలగించి అభయ రూపంగా శోభిస్తూ ఉంది. అందుచేత ఇది రహస్యాలలో రాజై రాజ గుహ్యమైంది.

మంత్ర, తంత్ర, యంత్ర, మణిమయ, ఓషధులకు సంబంధించిన విద్య లన్నీ రహస్యాలే. కాని, అవేవీ మృత్యువును నిర్మూలించ లేవు. మృత్యువును నిర్మూలించడమే గాక అమృతత్వమును ప్రసాదించేది కావడం చేత రాజవిద్య అయిన బ్రహ్మవిద్య రాజగుహ్య మైంది.

పవిత్రం

శుద్ధి చేసేది ఏదైనా పవిత్ర మైనదే. పావన మైనదే ***(పునాతీతి పవిత్రం).*** పావనం చేసేవి ప్రపంచంలో చాలా ఉన్నాయి. జలం శుద్ధి చేస్తుంది. మృత్తిక, అగ్ని, గాలి, సూర్యుడు, నదులు - ఇలా పవిత్రం చేసేవి ఎన్నో ఉన్నాయి. అపవిత్రాలను ఇవన్నీ పవిత్రం చెయ్యొచ్చు. కాని, అలా పవిత్రమైన వాటిని తిరిగి అపవిత్రం కాకుండా నివారించ లేవు. గంగలో స్నానం చేస్తే పాపం పోవచ్చు. కాని, తిరిగి ఆ వ్యక్తి పాపం చెయ్యడు అని చెప్పలేము. పవిత్రమైన గంగ పాపం పోగొట్ట గలదే గాని, బుద్ధి లోని పాప భావనను పోగొట్ట లేదు. మనస్సు లోని పాప సంస్కారాన్ని తుడిచి పెట్టలేదు.

అలాగే కొన్ని యజ్ఞ యాగాది క్రతువులు కూడా పాపాన్ని క్షాళనం చేస్తాయి. కాని, పాప కార్యము నుండి మనిషిని నివారించ లేవు. ఈ కారణం గానే పుణ్య క్రతువులను మనిషి పదే పదే చేస్తూ ఉంటాడు.

పుణ్యకర్మలు అనేకం ఉంటాయి. ఒక్కొక్క పుణ్య కార్యము ఒక్కొక్క విధమైన పాపమునే పోగొడు తుంది. ఇలా పవిత్రం చేసే వాటన్నిటిలో పవిత్ర మైనది బ్రహ్మజ్ఞానము ***(పవిత్రం పావనం ఇదం ఉత్తమం సర్వేషాం పావనానామ్ శుద్ధి కారణం).***

మరొక ముఖ్య విషయాన్ని ఇక్కడ మనం అర్థం చేసుకోవాలి. ప్రపంచంలో పాపాలను పోగొట్టేవి, శుద్ధి చేసేవి ఉన్నాయే గాని, పుణ్యాన్ని పోగొట్టేవి ఉన్నాయా? మోక్షానికి పుణ్యం కూడా ప్రతిబంధకమే అని తెలుసుకున్నాం కదా! కనుక పుణ్యపాపాలను రెండిటిని కరిగించి, అజ్ఞానాన్ని అంతమొందించే శక్తి ఒక్క బ్రహ్మజ్ఞానానికే ఉంది కనుక, రాజగుహ్య మైన ఈ రాజవిద్య పవిత్రాలలో పవిత్రమై **(పవిత్రాణాం పవిత్రం),** పరమ పవిత్రమై రాజిల్లుతోంది. ఈ విధంగా ఆత్మవిద్యను పొందిన విద్వాంసుడు పుణ్యపాపాలను రెండిటిని వదిలించుకొని **(తదా విద్వాన్ పుణ్యపాపే విధూయ)** ముక్తు డవుతున్నాడు అన్నది ఉపనిషత్తు.

ఉత్తమమ్

బ్రహ్మవిద్య ఉత్తమ మైనది **(ఉత్కృష్టతమమ్).** పరమేశ్వరుడు మహోత్కృష్టమైన వాడు. కనుక, పరమేశ్వరుని తెలిపే పరావిద్య లేదా బ్రహ్మవిద్య ఉత్కృష్టతమము. ప్రపంచంలో ఎన్నో జ్ఞానా లున్నాయి. ప్రపంచమే మిథ్య కనుక అవన్నీ మిథ్యా జ్ఞానాలు. బ్రహ్మజ్ఞాన మొక్కటే ఉత్తమ ఫలమైన మోక్షాన్ని ప్రసాదించే సత్య జ్ఞానమై ఉన్నందున అది అన్ని జ్ఞానాల లోకి ఉత్తమమైన జ్ఞానము **(సర్వేషాం జ్ఞానానామ్ ఉత్తమమ్, ఉత్తమ ఫలత్వాత్).**

ప్రత్యక్షావ గమం

ఆత్మ స్వతః సిద్ధము, స్వప్రకాశము అయినందున ప్రత్యక్షానుభవమై ఉంది. **అనుభవ రూఢం తు జ్ఞాన ఫలమ్, ప్రత్యక్ష ఫలత్వాత్ -** ప్రత్యక్ష ఫలమై ఉన్నందున జ్ఞానఫలము అనుభవరూపమై ఉంది అన్నారు బ్రహ్మసూత్ర భాష్యంలో ఆచార్యులు.

కర్మఫల రూపంలో ప్రాప్తించే స్వర్గసుఖాలు కాలాంతరంలో, దేశాంతరంలో ప్రాప్తించేవి కనుక వాటి విషయంలో మనిషికి సందేహము ఉండవచ్చు. కాని, బ్రహ్మజ్ఞానము ప్రత్యక్షానుభవంగా అందుతూ ఉన్నందున జ్ఞానఫలం విషయంలో సంశయాలకు అవకాశం లేదు. సుఖదుఃఖాలు ఎలాగైతే ప్రత్యక్షంగా అనుభవింప బడుతున్నాయో, అలాగే బ్రహ్మజ్ఞాన ఫలం కూడా ప్రత్యక్షంగా అనుభవింప బడుతూ ఉన్నందున, అది ప్రత్యక్షావగమ మైంది **(ప్రత్యక్షేణ సుఖదుఃఖాదేః ఇవ అవగమః యస్య తత్ ప్రత్యక్షావ గమమ్).**

'అవగమము' అనే పదానికి రెండు అర్థాలను గ్రహించ వచ్చు. దేని చేత తెలియబడుతూ ఉందో అది అవగమము అని ఒక అర్థము **(అవగమ్యతే అనేన ఇతి అవగమః).** దీనిని బట్టి 'అవగమము' అంటే ప్రమాణము అని అర్థము. 'ప్రత్యక్షము' అంటే, ప్రత్యక్షమైన ఆత్మ వస్తువు అని అర్థము. ఆత్మ విషయము నందు జ్ఞానము ప్రమాణమై ఉన్నందున ఆత్మవిద్య ప్రత్యక్షావగమము.

రెండవ అర్థమును బట్టి చూస్తే 'అవగమము' అంటే అనుభవింప బడుతోంది **(అవగమ్యతే)** అని అర్థము. అంటే ఫలరూపము. దృష్ట ఫలరూపము. అంటే కాలాంతరములో ప్రాప్తించేది కాకుండా, సద్యః ఫలదాయకము అని అర్థము. ప్రమాణ ఫలానుభవము ప్రత్యక్షం కావడం చేత కూడా ఆత్మవిద్య ప్రత్యక్షావ గమము.

ధర్మ్యం

ఏది ధర్మానికి విరుద్ధం కాదో, ఏది ధర్మం నుండి దూరంగా తొలగదో అది 'ధర్మ్యం' **(ధర్మాత్ అనపేతం ధర్మ్యం).** భగవంతుడు ధర్మరూపుడు **(ధర్మః).** ధర్మరూపంలో ఉండి సమస్తమును ధరించు వాడు కనుక భగవంతుడు 'ధర్మ' నామధేయుడు **(ధారయతి సర్వభూతాని ఇతి ధర్మః).** సమస్త భూతములకు ఆధారమైన వాడు, స్థితి కారకుడు కావడం చేత ఆయన ధర్మస్వరూపుడు.

ధర్మరూపంలో ఉన్నవాడు తానే. ధర్మమూ తానే. అన్ని ధర్మాలు ఆయనకు సంబంధించినవే కనుక ఆయన 'ధర్మీ'. అంటే, ధర్మమును ధరించు వాడు ***(ధర్మాన్ ధారయతీతి ధర్మీ).*** నియతియే ధర్మము. నియంతయే ధర్మి. నియతి, నియంత వేరు కాదు. జ్ఞానము జ్ఞాని వేరు కాదు. ధర్మము ధర్మి వేరు కాదు. కనుక, ధర్మి నుండి దూరం కాని దేదో అదే 'ధర్మ్యం'. అదే బ్రహ్మజ్ఞానం.

పరమేశ్వరుడు ధర్మాధర్మాలకు అతీతు డైనప్పటికీ ధర్మమర్యాదను స్థిరీకరింప చేయడానికి ధర్మమును తాను ఆచరిస్తాడు. శ్రీరాముడుగా అవతరించి ధర్మమును ఆచరించి చూపాడు. అంతేకాదు. శ్రీకృష్ణుడుగా అవతరించి ఇతరులు కూడా ధర్మాన్ని అనుసరించే విధంగా ధర్మమార్గ నిర్దేశం చేశాడు.

అర్జునా! ముల్లోకాలలో నేను చేయవలసిన కార్యము ఏదీ లేదు. నేను పొందనిది లేదు. పొందవలసిందీ లేదు. అయినా కర్మలను ఆచరిస్తూనే ఉన్నాను. నేను ఇతరులకు ఆదర్శం కావాలి. నేను దారి తప్పితే ప్రజలు కూడా దారి తప్పి పోతారు అని భగవంతుడు చెప్పే ఉన్నాడు కదా! *(3 - 22, 23).* కనుక 'ధర్మ్యం', లేక బ్రహ్మజ్ఞానమును పొందడం కష్టమని భావిస్తారేమో నని ఆ శంకను కూడా నివారిస్తున్నాడు.

సుసుఖం కర్తుమ్

బ్రహ్మజ్ఞానము అనేది స్వరూప జ్ఞానమే కనుక అది కష్టం కాదు. పొందడం చాలా సులభం, సుఖం అంటున్నాడు ***(సుసుఖం కర్తుమ్).*** ఎక్కడికో వెళ్ళి సాధించ నవసరం లేదు. కాలం కోసం నిరీక్షించ నవసరం లేదు. శ్రమించ నవసరం లేదు. ఏమీ చేయ నవసరం లేదు. కేవలం గ్రహించడమే. వీక్షించడమే.

ఇక్కడ చిన్న సంశయం ఒకటి కలిగే అవకాశ ముంది. అల్ప శ్రమతో ఆచరించే కర్మలకు అల్పఫలాలు, అధిక శ్రమతో చేసే కర్మలకు గొప్ప ఫలాలు ప్రపంచంలో లభించడం మనం చూస్తూ ఉన్నాము కదా!

కుడ్య నిర్మాణానికి, కటి కండూయనానికి ఫలభేదం లేదా? గోడ కట్టడానికి, ముల గోకడానికి ***(కటి కండూయనము)*** ఫలభేదం లేదా? శ్రమించి నిర్మిస్తేనే గోడ తయారవుతుంది. గోకుడు క్రియకు శ్రమ అవసరమా? గోకుడు క్రియకు గోడ కట్టిన ఫలం వస్తుందా? స్వల్ప ప్రయాస కర్మలు అల్ప ఫలాలనే ఇస్తాయి. అల్పఫలాలు స్వల్ప కాలంలో నశించి పోతాయి. అలాగే బ్రహ్మజ్ఞానము గనుక సుఖ సంపాద్య మైతే, స్వల్ప కాలంలో ఫలం క్షయ మౌతుంది కదా! అనేది సంశయము.

బ్రహ్మజ్ఞానము అలా కాదు. ముల గోకడం లాంటి కర్మ కాదు. ముల గోకడానికి కూడా కొంత శ్రమించాలి. పైగా గోకడానికి గోళ్ళు ఉండాలి. ఇది అంతకన్నా సులభ సాధ్యము. చంద్రదర్శన క్రియ లాంటిది అని వాక్యతాత్పర్య బోధినీ వ్యాఖ్యానము. చంద్రుని దర్శించడ మనే కార్యంలో శ్రమ ఉందా? ఎంత ఆహ్లాదకర మైన మహాఫలమో అది! ఇదీ అంతే. అల్ప ప్రయాసం వల్ల కలిగింది కనుక నశిస్తుంది అనే సందేహము అవసరము లేదు అని చెప్పడానికే చివరగా, బ్రహ్మజ్ఞానమును 'అవ్యయం' అంటున్నాడు.

అవ్యయమ్

కర్మఫలాలు నశించినట్లు ఆత్మజ్ఞానం నశించదు. బ్రహ్మజ్ఞానము అవ్యయము. కనుక ముముక్షువులు దీని యందు శ్రద్ధావంతులై ఉండాలి అనేది తాత్పర్యము ***(అతః శ్రద్ధేయమ్ ఆత్మజ్ఞానమ్).***

మరి, ఈ విషయంలో శ్రద్ధ లేని వాళ్ల గతి ఏమిటి? వినండి.

అశ్రద్దధానాః పురుషా ధర్మస్యాస్య పరంతప । 3
అప్రాప్య మాం నివర్తన్తే మృత్యుసంసారవర్త్మని ॥

అశ్రద్దధానాః-పురుషాః-ధర్మస్య-అస్య-పరంతప
అప్రాప్య-మాం-నివర్తంతే-మృత్యుసంసారవర్త్మని

పరంతప	=	అర్జునా!	మాం	=	నన్ను
అస్య	=	ఈ	అప్రాప్య	=	పొందక
ధర్మస్య	=	ధర్మము యొక్క	మృత్యుసంసారవర్త్మని	=	మృత్యురూప మైన సంసార మార్గములో
అశ్రద్ధధానాః	=	శ్రద్ధ లేని	నివర్తంతే	=	ఉంటారు
పురుషాః	=	పురుషులు			

పరంతపా! అర్జునా! ఈ ధర్మం విషయంలో శ్రద్ధ లేని వాళ్ళు నన్ను పొందలేరు. జననమరణాలలో పడి తిరుగుతూ ఉంటారు.

వ్యాఖ్య

సందర్భ ఔచిత్యము

'ఇదం' పద ప్రయోగముతో బ్రహ్మజ్ఞానమును ప్రస్తావిస్తూ తొమ్మిదవ అధ్యాయాన్ని ప్రారంభించిన వాసుదేవుడు, మొదటి రెండు శ్లోకాలలో బ్రహ్మవిద్య యొక్క మాహాత్మ్యాన్ని దివ్యంగా స్తుతించాడు. ఇక విజ్ఞాన సహితమైన బ్రహ్మజ్ఞానమును నాల్గవ శ్లోకము నుండి అద్భుతంగా ప్రవచించ బోతాడు. మధ్యలో ఈ మూడవ శ్లోకం విలక్షణమైన రీతిలో ఒక అందమైన లంకె అయింది.

ఈ సందర్భములో అర్జునుడు వింటూ ఉన్నాడే గాని తిరిగి ఆచార్యుని ఎక్కడా ప్రశ్నించడం లేదు. అయినా, శ్రీకృష్ణుడే తనకు తానుగా 'అశ్రద్ధ' అనే అసుర లక్షణాన్ని ప్రవేశపెట్టి ప్రవచిస్తున్నాడు. దీనికి ప్రధానంగా రెండు కారణాలు కనబడు తున్నాయి. (1) అర్జునుని మనస్సు లోని సందేహాన్ని పరమేశ్వరుడు దర్శించి ఉండాలి. లేదా, (2) దాని అవసరాన్ని గుర్తించి అనివార్యంగా ప్రవేశపెట్టి ఉండాలి. లేకపోతే, అసందర్భంగా 'అశ్రద్ధ' ప్రస్తావన తెచ్చే అవకాశమే లేదు.

బ్రహ్మవిద్యను గూర్చి రెండవ శ్లోకంలో సలక్షణంగా వివరిస్తూ, రాజగుహ్య మైన రాజవిద్య పవిత్ర మని, మహోత్కృష్ట మని చెప్పడంతో పాటు, అది అనాయాసంగా ప్రాప్తిస్తుందని కూడా ప్రవచించడం జరిగింది ***(సుసుఖం కర్తుమ్).*** సుకరము, సర్వోత్తమ మైన మోక్షము సులభంగా ప్రాప్తించే టప్పుడు, ఎవరైనా దానిని వదులు కుంటారా? అందరూ దానినే సాధించు కుంటారు కదా! అదే జరిగితే, జరిగి ఉంటే, లేక జరిగే అవకాశమే ఉంటే, సంసారిగా ఎవడు మిగుల్తాడు? మరి, ప్రపంచంలో సంసారాలు గణనీయంగా పెరుగుతున్నాయే గాని తరగడం లేదు కదా! అనే సందేహానికి ఈ సందర్భంలో అవకాశం లేక పోలేదు. సాధకులలో ఈ విధమైన సందేహము సందర్భ ఔచితి గానే ఉందని భావించి భగవంతుడు 'అశ్రద్ధ'ను ప్రవేశపెట్టి ప్రవచించి ఉండవచ్చు.

ద్వితీయ పక్షం కోణం నుండి దృష్టి సారిస్తే, ఈ విధమైన ప్రస్తావన ఈ సందర్భములో రాకపోతే, ముముక్షువులు దారి తప్పే ప్రమాదం ఉందని ఆశంకించి పరమేశ్వరుడు ప్రసంగించి ఉండవచ్చు. ఎలాగైనా, దీనికి సందర్భ ఔచితి ఉంది. అంతే కాదు. ఒకవేళ ఈ విషయ ప్రస్తావన ఇక్కడ జరగక పోయి ఉన్నట్లైతే, ప్రమాదం జరిగితే మాత్రం అది మహాదారుణంగా ఉంటుందని ప్రత్యేకించి చెప్ప నవసరం లేదు.

అందలము - అర్హత

ఆశలు అందరికీ ఉంటాయి. ఎవరి ఊహలు వారికి ఉంటాయి. ఎవరి ఊహలలో వారు ఊరేగుతుంటారు.

ధర్మరూపంలో ఉన్నవాడు తానే. ధర్మమూ తానే. అన్ని ధర్మాలు ఆయనకు సంబంధించినవే కనుక ఆయన 'ధర్మీ'. అంటే, ధర్మమును ధరించు వాడు ***(ధర్మాన్ధారయతీతి ధర్మీ).*** నియతియే ధర్మము. నియంతయే ధర్మి. నియతి, నియంత వేరు కాదు. జ్ఞానము జ్ఞాని వేరు కాదు. ధర్మము ధర్మి వేరు కాదు. కనుక, ధర్మి నుండి దూరం కాని దేదో అదే 'ధర్మ్యం'. అదే బ్రహ్మజ్ఞానం.

పరమేశ్వరుడు ధర్మాధర్మాలకు అతీతు డైనప్పటికీ ధర్మమర్యాదను స్థిరీకరింప చేయడానికి ధర్మమును తాను ఆచరిస్తాడు. శ్రీరాముడుగా అవతరించి ధర్మమును ఆచరించి చూపాడు. అంతేకాదు. శ్రీకృష్ణుడుగా అవతరించి ఇతరులు కూడా ధర్మాన్ని అనుసరించే విధంగా ధర్మమార్గ నిర్దేశం చేశాడు.

అర్జునా! ముల్లోకాలలో నేను చేయవలసిన కార్యము ఏదీ లేదు. నేను పొందనిది లేదు. పొందవలసిందీ లేదు. అయినా కర్మలను ఆచరిస్తూనే ఉన్నాను. నేను ఇతరులకు ఆదర్శం కావాలి. నేను దారి తప్పితే ప్రజలు కూడా దారి తప్పి పోతారు అని భగవంతుడు చెప్పే ఉన్నాడు కదా! *(3 - 22, 23)*. కనుక 'ధర్మ్యం', లేక బ్రహ్మజ్ఞానమును పొందడం కష్టమని భావిస్తారేమో నని ఆ శంకను కూడా నివారిస్తున్నాడు.

సుసుఖం కర్తుమ్

బ్రహ్మజ్ఞానము అనేది స్వరూప జ్ఞానమే కనుక అది కష్టం కాదు. పొందడం చాలా సులభం, సుఖం అంటున్నాడు ***(సుసుఖం కర్తుమ్).*** ఎక్కడికో వెళ్ళి సాధించ నవసరం లేదు. కాలం కోసం నిరీక్షించ నవసరం లేదు. శ్రమించ నవసరం లేదు. ఏమీ చేయ నవసరం లేదు. కేవలం గ్రహించడమే. వీక్షించడమే.

ఇక్కడ చిన్న సంశయం ఒకటి కలిగే అవకాశ ముంది. అల్ప శ్రమతో ఆచరించే కర్మలకు అల్పఫలాలు, అధిక శ్రమతో చేసే కర్మలకు గొప్ప ఫలాలు ప్రపంచంలో లభించడం మనం చూస్తూ ఉన్నాము కదా!

కుడ్య నిర్మాణానికి, కటి కండూయనానికి ఫలభేదం లేదా? గోడ కట్టడానికి, ముల గోకడానికి ***(కటి కండూయనము)*** ఫలభేదం లేదా? శ్రమించి నిర్మిస్తేనే గోడ తయారవుతుంది. గోకుడు క్రియకు శ్రమ అవసరమా? గోకుడు క్రియకు గోడ కట్టిన ఫలం వస్తుందా? స్వల్ప ప్రయాస కర్మలు అల్ప ఫలాలనే ఇస్తాయి. అల్పఫలాలు స్వల్ప కాలంలో నశించి పోతాయి. అలాగే బ్రహ్మజ్ఞానము గనుక సుఖ సంపాద్య మైతే, స్వల్ప కాలంలో ఫలం క్షయ మౌతుంది కదా! అనేది సంశయము.

బ్రహ్మజ్ఞానము అలా కాదు. ముల గోకడం లాంటి కర్మ కాదు. ముల గోకడానికి కూడా కొంత శ్రమించాలి. పైగా గోకడానికి గోళ్ళు ఉండాలి. ఇది అంతకన్నా సులభ సాధ్యము. చంద్రదర్శన క్రియ లాంటిది అని వాక్యతాత్పర్య బోధినీ వ్యాఖ్యానము. చంద్రుని దర్శించడ మనే కార్యంలో శ్రమ ఉందా? ఎంత ఆహ్లాదకర మైన మహాఫలమో అది! ఇదీ అంతే. అల్ప ప్రయాసం వల్ల కలిగింది కనుక నశిస్తుంది అనే సందేహము అవసరము లేదు అని చెప్పడానికే చివరగా, బ్రహ్మజ్ఞానమును 'అవ్యయం' అంటున్నాడు.

అవ్యయమ్

కర్మఫలాలు నశించినట్లు ఆత్మజ్ఞానం నశించదు. బ్రహ్మజ్ఞానము అవ్యయము. కనుక ముముక్షువులు దీని యందు శ్రద్ధావంతులై ఉండాలి అనేది తాత్పర్యము ***(అతః శ్రద్ధేయమ్ ఆత్మజ్ఞానమ్).***

మరి, ఈ విషయంలో శ్రద్ధ లేని వాళ్ల గతి ఏమిటి? వినండి.

అశ్రద్దధానాః పురుషా ధర్మస్యాస్య పరంతప ।
అప్రాప్య మాం నివర్తన్తే మృత్యుసంసారవర్త్మని ॥ 3

అశ్రద్దధానాః-పురుషాః-ధర్మస్య-అస్య-పరంతప
అప్రాప్య-మాం-నివర్తంతే-మృత్యుసంసారవర్త్మని

పరంతప	=	అర్జునా!	మాం	=	నన్ను
అస్య	=	ఈ	అప్రాప్య	=	పొందక
ధర్మస్య	=	ధర్మము యొక్క	మృత్యుసంసారవర్త్మని	=	మృత్యురూప మైన సంసార మార్గములో
అశ్రద్దధానాః	=	శ్రద్ధ లేని			
పురుషాః	=	పురుషులు	నివర్తంతే	=	ఉంటారు

పరంతపా! అర్జునా! ఈ ధర్మం విషయంలో శ్రద్ధ లేని వాళ్ళు నన్ను పొందలేరు. జననమరణాలలో పడి తిరుగుతూ ఉంటారు.

వ్యాఖ్య

సందర్భ ఔచిత్యము

'ఇధం' పద ప్రయోగముతో బ్రహ్మజ్ఞానమును ప్రస్తావిస్తూ తొమ్మిదవ అధ్యాయాన్ని ప్రారంభించిన వాసుదేవుడు, మొదటి రెండు శ్లోకాలలో బ్రహ్మవిద్య యొక్క మాహాత్మ్యాన్ని దివ్యంగా స్తుతించాడు. ఇక విజ్ఞాన సహితమైన బ్రహ్మజ్ఞానమును నాల్గవ శ్లోకము నుండి అద్భుతంగా ప్రవచించ బోతాడు. మధ్యలో ఈ మూడవ శ్లోకం విలక్షణమైన రీతిలో ఒక అందమైన లంకె అయింది.

ఈ సందర్భములో అర్జునుడు వింటూ ఉన్నాడే గాని తిరిగి ఆచార్యుని ఎక్కడా ప్రశ్నించడం లేదు. అయినా, శ్రీకృష్ణుడే తనకు తానుగా 'అశ్రద్ధ' అనే అసుర లక్షణాన్ని ప్రవేశపెట్టి ప్రవచిస్తున్నాడు. దీనికి ప్రధానంగా రెండు కారణాలు కనబడు తున్నాయి. (1) అర్జునుని మనస్సు లోని సందేహాన్ని పరమేశ్వరుడు దర్శించి ఉండాలి. లేదా, (2) దాని అవసరాన్ని గుర్తించి అనివార్యంగా ప్రవేశపెట్టి ఉండాలి. లేకపోతే, అసందర్భంగా 'అశ్రద్ధ' ప్రస్తావన తెచ్చే అవకాశమే లేదు.

బ్రహ్మవిద్యను గూర్చి రెండవ శ్లోకంలో సలక్షణంగా వివరిస్తూ, రాజగుహ్య మైన రాజవిద్య పవిత్ర మని, మహోత్కృష్ట మని చెప్పడంతో పాటు, అది అనాయాసంగా ప్రాప్తిస్తుందని కూడా ప్రవచించడం జరిగింది ***(సుసుఖం కర్తుమ్).*** సుకరము, సర్వోత్తమ మైన మోక్షము సులభంగా ప్రాప్తించే టప్పుడు, ఎవరైనా దానిని వదులు కుంటారా? అందరూ దానినే సాధించు కుంటారు కదా! అదే జరిగితే, జరిగి ఉంటే, లేక జరిగే అవకాశమే ఉంటే, సంసారిగా ఎవడు మిగుల్తాడు? మరి, ప్రపంచంలో సంసారాలు గణనీయంగా పెరుగుతున్నాయే గాని తరగడం లేదు కదా! అనే సందేహానికి ఈ సందర్భంలో అవకాశం లేక పోలేదు. సాధకులలో ఈ విధమైన సందేహము సందర్భ ఔచితి గానే ఉందని భావించి భగవంతుడు 'అశ్రద్ధ'ను ప్రవేశపెట్టి ప్రవచించి ఉండవచ్చు.

ద్వితీయ పక్షం కోణం నుండి దృష్టి సారిస్తే, ఈ విధమైన ప్రస్తావన ఈ సందర్భములో రాకపోతే, ముముక్షువులు దారి తప్పే ప్రమాదం ఉందని ఆశంకించి పరమేశ్వరుడు ప్రసంగించి ఉండవచ్చు. ఎలాగైనా, దీనికి సందర్భ ఔచితి ఉంది. అంతే కాదు. ఒకవేళ ఈ విషయ ప్రస్తావన ఇక్కడ జరగక పోయి ఉన్నట్లైతే, ప్రమాదం జరిగితే మాత్రం అది మహాదారుణంగా ఉంటుందని ప్రత్యేకించి చెప్ప నవసరం లేదు.

అందలము - అర్హత

ఆశలు అందరికీ ఉంటాయి. ఎవరి ఊహలు వారికి ఉంటాయి. ఎవరి ఊహలలో వారు ఊరేగుతుంటారు.

అందరివీ ఊరేగింపులే. కొన్ని ఊరేగింపులు ఉత్సాహంతో, ఉత్సవ స్ఫూర్తితో ఉంటాయి. కొన్ని ఊరేగింపులు విషాదంతో, ఉద్విగ్న భరితంగా సాగుతూ ఉంటాయి.

శివుని తిరువాళ్ళలో రథయాత్ర ఆనందయాత్రగా సాగుతూ ఉంటుంది. అంతిమ సంస్కారానికి జీవుని కానిపోయే శవయాత్ర ఆవేదనా పూరితంగా కొనసాగుతూ ఉంటుంది. శివయాత్రను అనుసరించే వారు తిరిగి తిరిగి శివాలయానికి చేరుతారు. శవయాత్రలో నడిచే వారు శంకరాలయం (శ్మశానం) చేరుతారు. మార్గాలే గమ్యాలను నిర్ణయిస్తాయి.

ఆకాశంలో సూర్యుడు దివ్యంగా ప్రకాశిస్తున్నాడు. విశ్వం వెలుగులతో విరాజిల్లుతూ ఉంది. అన్నీ సుస్పష్టంగా కనిపిస్తున్నాయి. అలాంటి చోట మార్గంలో పయనించడం కష్టమా? ఎవరి మార్గాన వారు హాయిగా ప్రయాణం చెయ్యవచ్చు. ఇదేమీ కష్టం కాదు. చాలా సుఖకరము. సుకరము.

బాహ్య ప్రపంచంలో వెలుగులు ఉండొచ్చు. ప్రయాణం చేసే వ్యక్తి గ్రుడ్డి వాడైతే? ప్రయాణం సాగినా, అతడు గమ్యం చేరక పోవచ్చు. దారి తప్పే అవకాశం ఉండటమే ఇందుకు ప్రధాన కారణము. ఏమో! కళ్ళు లేనివాడైనా గమ్యం చేరవచ్చు నేమో గాని శ్రద్ధ లేని వాడు మాత్రం బ్రహ్మమును చేరలేడు. భగవంతుడు అదే చెబు తున్నాడు. అర్జునా! శ్రద్ధ లేని వాళ్ళు నన్ను ఎన్నడూ పొందలేరు అంటున్నాడు.

శ్రద్ధ - అశ్రద్ధ

శ్రద్ధ కలవాడు జ్ఞానాన్ని పొందుతాడు (*శ్రద్ధావాన్ లభతే జ్ఞానం; 4 - 39*) అని నాల్గవ అధ్యాయం లోనే భగవంతుడు ఉపదేశించాడు. జ్ఞానమును పొందిన వాడు శాంతిని పొందుతాడు (*జ్ఞానం లబ్ధ్వా శాంతిం అధిగచ్ఛతి*). ఇక్కడ జ్ఞానము అంటే బ్రహ్మజ్ఞానము లేదా ఆత్మజ్ఞానము.

'ఇదం' అంటూ బ్రహ్మజ్ఞానాన్ని ప్రస్తుతం మొదటి శ్లోకంలో ప్రస్తావించిన భగవంతుడు, ఆ జ్ఞానమునే విద్య అంటూ రెండవ శ్లోకంలో బ్రహ్మవిద్యగా ప్రవచించాడు. దానినే ధర్మ్యం అని కూడా పేర్కొన్నాడు. ధర్మం అనే పదము జ్ఞానానికి పర్యాయంగా వాడ బడింది.

అర్జునా! బ్రహ్మజ్ఞానము అనే ఈ ధర్మం విషయంలో (*అస్య ధర్మస్య*) శ్రద్ధ లేని వాళ్ళు (*అశ్రద్ధ ధానాః*) నన్ను పొందలేక (*మాం అప్రాప్య*), మృత్యువుతో కూడిన సంసారంలో (*మృత్యు సంసార వర్త్మని*), అంటే సంసార మార్గంలో తిరుగుతూ ఉంటారు (*నివర్తన్తే*).

శ్రద్ధకు ఫలం జ్ఞానం. జ్ఞానఫలం మోక్షం. అశ్రద్ధకు ఫలం అజ్ఞానం. అజ్ఞాన ఫలం సంసారం. చావు పుట్టుకల సంసార చక్రంలో పరిభ్రమణం.

ఈత తెలిసిన వాడు నదీ ప్రవాహంలో పడితే, ఎలాగో ఈదుకుంటూ గట్టున పడతాడు. ఈత రాని వాడు గట్టున పడే అవకాశమే లేదు కనుక, ప్రవాహంలో కొట్టుకొని పోయి సముద్రంలో పడతాడు.

జీవన నదీ ప్రవాహంలో శ్రద్ధ కలిగిన వాడు విశ్వాసంతో శాస్త్రాన్ని అధ్యయనం చేసి, జ్ఞానాన్ని పొంది తరిస్తాడు. శ్రద్ధ లేనివాడు, అవిశ్వాసంతో శాస్త్రాన్ని సందేహించి, నిరసించి, జ్ఞానాన్ని పొందలేక, అజ్ఞాన దారుల్లో పయనించి మృత్యురూప సంసారాన్ని చేరుతాడు. అంటే మృత్యు సంసార సాగరంలో పడతాడు. అర్జునా! జ్ఞానం లేనివాడు, శ్రద్ధ లేనివాడు, సంశయించే స్వభావం కలవాడు నశించి పోతాడు (*అజ్ఞశ్చాశ్రద్ధ ధానశ్చ సంశయాత్మా వినశ్యతి; 4 - 40*) అని నాల్గవ అధ్యాయం లోనే భగవంతుడు హెచ్చరించాడు. శ్రద్ధ గలవారు వికాసాన్ని పొందుతూ ఉంటే, శ్రద్ధ లేని వాళ్ళు వినాశాన్ని పొందుతున్నారు.

అశ్రద్ధావంతులు

శ్రద్ధ లేని వారు బ్రహ్మజ్ఞానానికి అనర్హులు కనుక వారు భగవంతుని పొందలేరు. ఆత్మ ఒకటి ఉందని, ఆత్మజ్ఞానము ఒకటి ఉందని, ఆత్మజ్ఞానానికి ఫలం మోక్షమని, ఈ విషయాల యందు ఎవరికి నమ్మకం ఉందో వారు శ్రద్ధావంతులు. నమ్మకం లేని వాళ్ళు అశ్రద్ధావంతులు (**శ్రద్ధా విరహితాః ఆత్మజ్ఞానస్య ధర్మస్య అస్య స్వరూపే తత్ఫలే చ**). వీరిని నాస్తికులుగా అభివర్ణించింది శంకర భాష్యము (**నాస్తికాః**).

శ్రద్ధ లేని వారు నాస్తికులు. ఇలాంటి వారు పాపాచరణమునకు వెనుకాడరు. శాస్త్రం మీద విశ్వాసం లేని వారు శాస్త్ర ప్రతిపాదిత మైన కర్మ సిద్ధాంతాన్ని విశ్వసిస్తారా? కర్మ సిద్ధాంతము మీద నమ్మకం లేని వారు కర్మఫలాలకు భయపడతారా? కర్మఫలాలకు భీతి చెందరు కనుక, ఎట్టి పాపాని కైనా సిద్ధ పడతారు.

ఒక వాస్తవాన్ని ఈ సందర్భములో అర్థం చేసుకోవాలి. నాస్తికుడికి, పాపకారికి శాస్త్ర విషయంలో, గురువు విషయంలో, భగవంతుని విషయంలో శ్రద్ధ లేక పోవచ్చు. అలాగని అసలే శ్రద్ధ లేదు అనడానికి లేదు. పాపికి కూడా శ్రద్ధ ఉంటుంది. శాస్త్ర విహిత కర్మల యందు శ్రద్ధ లేక పోవచ్చు నేమో గాని, తాను ఆచరించే పాపకార్యాల యందు శ్రద్ధ ఉంటుంది. లేకపోతే పాపాచరణమునకు ఉత్సాహం, ఆసక్తి ఎక్కడ నుండి వస్తాయి? పాపికి కూడా ఒక సిద్ధాంతము ఉంటుంది. నాస్తికుడికి కూడా ఒక తత్త్వం ఉంటుంది. రాక్షసులకు కూడా గ్రంథాలు ఉంటాయి. వాటిని విశ్వసిస్తూ, అవి చెప్పినట్లు వారు ఆచరిస్తారు. శ్రీ శంకరాచార్య స్వామి అసురులకు కూడా ఉపనిషత్తు ఉందని చమత్కరించారు.

ఆసురోపనిషత్

అసురులకు సంబంధించిన ఉపనిషత్ ఆసురోపనిషత్ (**అసురాణాం ఉపనిషత్ ఆసురోపనిషత్**). ఇది వేదం నుండి వచ్చింది కాదు. అసురుల వేదనల నుండి పుట్టింది. వీరిది దేహాత్మ దర్శనము. అంటే దేహమే ఆత్మ అనే సిద్ధాంతము. వీరు అసుతృపులు. అంటే ప్రాణాలను తృప్తి పరచడమే ఏకైక లక్ష్యంగా జీవించే వారు. ఇంద్రియ విషయాల యందే సదా రమించే భోగాసక్తులు (**దేహ మాత్ర ఆత్మ దర్శన మేవ ప్రతిపన్నాః అసుతృపః పురుషాః**). కర్మ విషయము నందు, జన్మ విషయము నందు నమ్మకం లేని వీరికి, మరణమే మహాసమాధి. ఎలాగూ మళ్ళీ జన్మించేది లేదు కనుక, ప్రాణాలను తృప్తి పరచుకొంటూ బ్రతికేయడమే వీరి జీవన విధానము. న్యాయాలు, ధర్మాలు వీరి దృష్టిలో అర్థరహితాలు.

యావ జ్జీవేత్ సుఖం జీవేత్ ఋణం కృత్వా ఘృతం పిబేత్

బ్రతికి నంత కాలం భోగిస్తూ బ్రతికేయ్! అప్పు చేసైనా సరే, నెయ్యి కలుపుకొని పప్పుకూడు తినేయ్! తీర్చ గలిగితే అప్పు తీర్చు. తీర్చలేక పోతే మానేయ్! మనం త్రాగిన నెయ్యి మన దేహం లోనే క్రొవ్వుగా ఉంటుంది. చచ్చిన తరువాత దేహము ఇక్కడే కాలి పోతుంది. కాలి పోయిన దేహం తిరిగి లేచి వస్తుందా అప్పు తీర్చడానికి? (**భస్మీ భూతస్య దేహస్య పునరాగమం కుతః ?**). బూడిదై పోయిన దేహం తిరిగి ఎలా వస్తుంది? అది వస్తే కదా అప్పుల వాళ్ళు అడిగేది? అడిగేది లేదు - చెప్పేది లేదు. దొరికినంత వరకు హాయిగా చప్పరించేయ్! ఇది ఆసురోపనిషత్. దేహమే ఆత్మ. భోగమే జ్ఞానము. మరణమే మోక్షము.

తే॥ గీ॥ అప్పు గొని యైన దొంగలి యైన లెస్స
జిహ్వ కింపైన దాని భుజింప వలయు
కంటి కింపైన కాంతను గవయ వలయు
బ్రతుక దినముల మోక్షంబు వెతుక నేల ॥

అని ఆబోతులా బ్రతక మని తేట తెలుగులో అసురోపనిషత్సారాన్ని తేటగీతిలో అందించారు. ఇది అసురోపనిషత్ సారంగా వాళ్ళు ప్రతి నిత్యం పారాయణం చేసే, క్రమం తప్పక ఆచరించే బండగీత.

లోకాయత దర్శనం

ఏ జ్ఞానము లేని లౌకికులు సాధారణంగా మాట్లాడుకొనే వ్యవహారము, జీవించే విధానమునకు **లోకాయతము** అని పేరు ***(లోకేషు ఆయతః లోకాయతః).*** ఇది సామాన్యులలో విస్తృత ప్రచారము గల విషయము. **లోకము** లోని విషయాలను మాత్రమే ఆయతనంగా చేసికొనిన సిద్ధాంతము కనుక, వీరి సిద్ధాంతానికి లోకాయత దర్శనం అని పేరు. నాస్తికులు, చార్వాకులు, లోకాయతులు ఒక గూటి లోని పక్షులే. అన్నీ ఒకే విధంగా పలుకుతాయి. వీరందరూ అశ్రద్ధావంతులే. మరి, వీరందరూ ఏమౌతారు? ఎక్కడ చేరుతారు?

ఏదైనా అవుతారు, ఎక్కడి కైనా చేరుతారు, పరమేశ్వరుని సన్నిధికి తప్ప. దారి తప్పిన వారు కనుక దరి చేరలేరు. తిరిగి మృత్యు యుక్త సంసార మార్గంలో ***(వర్త్మని)*** పడి పోతారు. ఆ మార్గం ముక్తి మార్గము కాదు. జనన మరణ రూప సంసార మార్గము.

నివర్తన్తే అనే పదానికి రెండు అర్థాలను గ్రహించ వచ్చు. ***నిశ్చయేన ఆవర్తన్తే*** - అశ్రద్ధావంతులు తిరుగుతూ ఉంటారు అని ఒక అర్థము. ***క్వ?*** ఎక్కడ తిరుగుతూ ఉంటారు? ***మృత్యు సంసార వర్త్మని*** - మృత్యువుతో కూడిన సంసార మనే మార్గంలో పడి తిరుగుతూ ఉంటారు. అంటే, పుడుతూ చస్తూ, చస్తూ పుడుతూ ఉంటారని అర్థము.

నితరాం వర్తన్తే (నివర్తన్తే) - అని గ్రహిస్తే వీరు శాశ్వతంగా మృత్యురూప సంసారము లోనే ఉంటారు అని మరొక అర్థం. అశ్రద్ధావంతులుగా ఉన్నంత కాలం ఈ సుడిలో, ఆవర్తములో పడి పరిభ్రమించడం తప్పదు.

జ్ఞానమును పొందితే సంసార బంధము తొలగి పోతుంది అని మొదటి శ్లోకం లోనే బోధించాడు ***(యత్ జ్ఞాత్వా మోక్ష్యసేఽ శుభాత్).*** జ్ఞానం కలగాలి అంటే శాస్త్రాధ్యయనం అనివార్యం. శాస్త్రాధ్యయనం జరగాలి అంటే శ్రద్ధ అవశ్యం. కనుక శ్రద్ధ కల వారు జనన మరణ రూప సంసారం నుండి విముక్తు లవుతున్నారు.

శ్రద్ధ లేని వారు పరమేశ్వరుని పొందలేక తిరిగి మృత్యురూప సంసారంలో పడి పోతున్నారు. శ్రద్ధ గల వారు జ్ఞానాన్ని పొంది తరిస్తారు. అశ్రద్ధావంతులు పరమాత్మను పొంద లేక అంతరిస్తూ ఉంటారు.

ఇక రాజవిద్య అయిన శాస్త్రాన్ని బోధిస్తాడు కనుక అర్జునునిలో పూర్ణ శ్రద్ధను నింపే ప్రయత్నం చేశాడు. బోధ ప్రారంభిస్తున్నాడు.

మయా తత మిదం సర్వం జగ దవ్యక్తమూర్తినా ।
మత్స్థాని సర్వభూతాని న చాహం తే ష్వవస్థితః ॥ 4

మయా-తతం-ఇదం-సర్వం-జగత్-అవ్యక్తమూర్తినా
మత్‌స్థాని-సర్వభూతాని-న-చ-అహం-తేషు-అవస్థితః

అవ్యక్తమూర్తినా	= ఇంద్రియ గోచరము గాని	సర్వభూతాని	= సర్వభూతములు
మయా	= నా చేతను	మత్స్థాని	= నా యందున్నవి
ఇదం	= ఈ	తేషు	= వాని యందు
సర్వం	= సమస్తమైన	అహం	= నేను
జగత్	= ప్రపంచము	న చ అవస్థితః	= లేను
తతం	= వ్యాప్తము		

అర్జునా! నేను అవ్యక్తంగా ఉన్నాను. ఈ ప్రపంచ మంతా నేనే వ్యాపించి ఉన్నాను. సమస్త భూతాలు నా లోనే ఉన్నాయి. నేను వాటిలో లేను.

వ్యాఖ్య

మొదటి రెండు శ్లోకాలలో బ్రహ్మజ్ఞానము దివ్యంగా స్తుతించిన భగవానుడు, అర్జునునికి అందులో ఆసక్తిని కలిగించాడు **(అర్జునమ్ అభిముఖీ కృత్య).** శ్రద్ధ లేని వారికి బ్రహ్మజ్ఞానము, దాని ఫలము ఎలా ప్రాప్తించవో మూడవ శ్లోకంలో వివరించాడు. శ్రద్ధతో, ఆసక్తితో శ్రవణం చేసే విధంగా అర్జునుని సిద్ధపరచి, ప్రస్తుత శ్లోకం నుండి తాను ప్రతిజ్ఞ చేసిన విజ్ఞాన సహిత జ్ఞానము విశేషంగా ప్రవచించడానికి ప్రారంభిస్తున్నాడు. ఈ సమస్తమైన జగత్తు అవ్యక్తమూర్తి అయిన తన చేత వ్యాపించబడి ఉంది అంటూ శ్రీకారం చుడుతున్నాడు.

వ్యాప్యము - వ్యాపకము

తన అవ్యక్త స్వరూపము చేత ఈ ప్రపంచ మంతా వ్యాప్తమై ఉంది అంటున్నాడు. ఏ కార్యరూప జగత్తు మనకు కనిపిస్తూ ఉందో అది వ్యాప్యము. కారణ రూపుడైన పరమేశ్వరుడు వ్యాపకము. అంటే జగత్తుకు జగదీశ్వరునకు వ్యాప్య వ్యాపక సంబంధం ఉన్నట్లు అనిపిస్తూ ఉంది. ఇది వ్యావహారిక దృష్టితో చెప్పబడిందే గాని పారమార్థికంగా చూచి నపుడు ఈశ్వర జగత్తులకు ఆధార ఆధేయ సంబంధం గాని, వ్యాప్య వ్యాపక సంబంధం గాని ఉండేందుకు అవకాశం లేదు. సంబంధం లేకపోయినా ఉన్నట్లు అనిపించే ఈ సంక్లిష్ట సంశ్లేషాన్ని (సంబంధాన్ని) జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. ముఖ్యంగా నాలుగు, అయిదు శ్లోకాలను అవధానంతో అధ్యయనం చేయాలి.

ఈ సమస్త ప్రపంచము **(ఇదం సర్వం జగత్)** నా చేత **(మయా)** వ్యాపించబడి ఉంది **(తతం).** అంటే అర్జునుని ముందు నిలబడి బోధిస్తున్న శ్రీకృష్ణుని పరిచ్ఛిన్నమైన శరీరము ఈ విశ్వమంతా వ్యాపించి ఉందా? అలా ఉండేందుకు అవకాశం లేదు. అది సాధ్యం కాదు. కనుక, వ్యక్తమైన రూపం కాకుండా, వ్యక్తం కాని తన అవ్యక్త స్వరూపం చేత జగత్తు వ్యాప్తమై ఉంది అంటున్నాడు **(అవ్యక్త మూర్తినా - న వ్యక్తా మూర్తిః స్వరూపం యస్య మమ సః అహమ్ అవ్యక్తా మూర్తిః).**

కనిపిస్తున్న శ్రీ వాసుదేవుని రూపము వ్యక్త మూర్తి. కనిపించని రూపము అవ్యక్త మూర్తి. ఇక్కడ జగత్తు వ్యక్త మూర్తి చేత కాకుండా అవ్యక్త మూర్తి చేత వ్యాప్తమై ఉంది అని అంటే, కనిపించనిది కనుక అది లేనిదే నేమో అనే సందేహం కలిగే అవకాశం లేక పోలేదు.

వ్యక్తము అంటే ఇంద్రియ గోచరము అని అర్థము. అవ్యక్త మూర్తి అంటే ఇంద్రియాలకు వ్యక్తం కాని వాడు అని అర్థము **(కరణ అగోచర స్వరూపేణ ఇత్యర్థః).** కనుక అవ్యక్త మూర్తి నైన నా చేత వ్యాప్తమైంది అంటే, నా పరమైన స్వరూపం చేత వ్యాప్తమైంది అని అర్థము. పరమైన అంటే అలౌకిక మైన, నిరతిశయ మైన స్వరూపము అని భావం **(మయా, మమ పరోభావః తేన, తతం వ్యాప్తం సర్వం ఇదం జగత్).**

సత్తా మాత్రం

'భావః' అంటే సత్పదార్థము. సద్వస్తువు. **భూ సత్తాయామ్** అనే ధాత్వర్థము ననుసరించి, 'భావః' అంటే సత్తా స్వరూపుడు అని అర్థము. పరమేశ్వరుడు కేవలం తన స్వరూపంలో అవ్యక్తంగా ఉండేవాడు **(కేవలం భావః).** అంటే సత్తాత్మకుడైన పరమేశ్వరుడే ప్రపంచములో వ్యాపించి ఉన్నాడు అని అర్థం. అలాగే ప్రపంచ రూపంలో శోభించే వాడు అని కూడా అర్థము **(ప్రపంచ రూపేణ భవతీతి భవతీతి ఏవ భావః).**

కార్య రూపంలో ఏది కనిపించినా, దానికి ఆధార మైనది ఏదో ఉండాలి. ఉంటుంది. అదే సత్తాత్మకం. ఉపాదాన కారణం. కారణం ఏదో అది కార్యానికి ముందే ఉండాలి. కుండ ఉంది అంటే, అంతకు ముందే మట్టి ఉండాలి. కనుక, కుండ యొక్క అర్థం కుండలో లేదు. మట్టిలో ఉంది. కుండ ఉంది. దాని నెవ్వరూ నిరాకరించడం లేదు. కాని, ఉన్న కుండ మట్టి కన్నా అన్యంగా మాత్రం లేదు. ఇదే సత్తా. కుండకు ఆధారము. ఆధారమైన మట్టియే కుండలో ఉంది. కార్య రూపంలో గోచరిస్తున్న కుండ కారణమైన మట్టి చేత పరివ్యాప్తమై ఉంది. అలాగే, ఈ విశ్వమంతా సద్రూప చైతన్య మైన పరమాత్మ చేత వ్యాప్తమై ఉంది.

ప్రపంచం కార్య రూపంలో తెలుస్తూ ఉంది. ప్రపంచం పంచభూతాల సమ్మేళనంగా అర్థమౌతూ ఉంది. అందుకే ఇది ప్రపంచము. ఏ పంచమహా భూతాల కారణంగా ప్రపంచం తెలుస్తూ ఉందో, అట్టి ఆకాశాది పంచభూతాలు పరమేశ్వరుని నుండే జనించాయి ***(ప్రకర్షేణ మహాభూతాని అస్మాత్ ప్రభవన్తి).*** అందుచేత పరమేశ్వరుడు భూతాలకు ఉత్పత్తి స్థాన మయ్యాడు ***(ప్రభవః).*** అంటే, భూత ఆవిర్భావానికి ముందు తానొక్కడే ఉన్నాడు. భూతాదిగా శోభిస్తున్నాడు. సద్రూపంగా స్వరూప వైభవంతో ఉన్నాడు ***(సదేవ సౌమ్య ఇదమగ్ర ఆసీత్ ఏక మేవ అద్వితీయం బ్రహ్మ).*** ఇదే పరోభావము. సదాత్మకం.

ప్రపంచం అంటే పాంచభౌతిక మైన స్థూల ప్రపంచమే గాక, సూక్ష్మభూతాలు, జీవులు అని కూడా అర్థము. భూతజన్య మైన ఈ విశ్వమంతా పరమేశ్వరుని అవ్యక్త చైతన్యం చేత వ్యాప్తమై ఉంది. కార్య రూపంలో భూతాలు గోచర మవుతూ ఉన్నాయి కనుక వాటికి ఆధారమైన సత్తా ఉండాలి. ఆచార్యుల వారు భాష్యంలో ఒక అందమైన వాక్యాన్ని అందించారు.

న హి నిరాత్మకం కించిత్ భూతం వ్యవహారాయ అవకల్పతే।

'ఆత్మ లేనిదే ఏ భూతము కూడా వ్యవహార యోగ్యం కాదు' అని శ్రీ శంకర భాష్యము. అంటే భూతాలకు సత్తా స్ఫురణలు ఆత్మ వల్లనే కలుగు తున్నాయి. ఆత్మయే భూతాలకు ఆత్మ కావడం చేత వాటికి మనుగడ (సత్తా) సిద్ధిస్తూ ఉంది అని అర్థము. అందుచేతనే భూతాలు నా యందే ఉన్నాయి అంటున్నాడు గీతాచార్యుడు ***(మత్స్థాని సర్వభూతాని, మయి స్థితాని మత్స్థాని).***

సర్వ భూతాలు నా యందే ఉన్నాయి

ప్రపంచం ఉంది. ప్రపంచంలో భూతాలు ఉన్నాయి. వీటన్నిటికీ చైతన్యమే సత్తా మాత్రంగా ఉంది. సదాత్మకం గాను, స్ఫురణాత్మకం గానూ ఉంది. ప్రపంచం సత్తా మాత్రమైన చైతన్యానికి దూరంగా ఉండలేదు. కనుక, ప్రపంచము, ప్రపంచం లోని భూతాలు చైతన్యం లోనే ఉన్నాయి. ఈశ్వర చైతన్యం లోనే ఉన్నాయి. అందుచేత, ***మత్ స్థాని సర్వభూతాని*** - సర్వభూతములు నా యందే ఉన్నాయి అంటున్నాడు.

నామరూపాలతో ఏది కనిపించినా, అలా కనిపించే దానికి ఉపాదాన కారణంగా ఏదైతే ఆధారమై ఉందో అది, ఆ కనిపించే దానికి సత్తాను కలిగిస్తూ ఉంది కనుక దానికి ఆత్మవంతంగా ఉంది. అదే సత్యము. సత్యముపై ఆధారపడి కనిపించే నామరూపాలు సత్యం కావు కనుక, అవి మిథ్య.

ప్రపంచం నామరూపాత్మకంగా ఉంది. పరిణామశీలంగా ఉంది. ఆద్యంతాలతో తెలుస్తూ ఉంది. సదాత్మక మైన చైతన్యముపై ఆధారపడి ఉంది. అందుచేత ప్రపంచం మిథ్య. ప్రపంచానికి సత్తాను సిద్ధింప చేసిన పరమేశ్వరుడు సత్యము.

బంగారు నగకు బంగారు వల్లనే మనుగడ ఏర్పడుతూ ఉంది. నగ నామరూపాలతో ఉంది. బంగారుపై ఆధారపడి ఉంది. బంగారు లేకుండా నగ ఉండ లేదు. కనుక నగ మిథ్య. బంగారు సత్యము.

మట్టి కుండలకు మట్టే ఆధారము. మట్టి లేకుండా కుండ ఉండలేదు. కుండ మట్టిపై ఆధారపడి ఉంది. నామరూపాలతో ఉంది. అందుచేత కుండ మిథ్య. మట్టి సత్యము **(మృత్తి కేత్యేవ సత్యమ్).**

స్వప్న సృష్టి

సృష్టి కార్య రూపంలో ఉంది. సృష్టికి పరమేశ్వరుడు కారణంగా ఉన్నాడు. కార్యానికి ముందు కారణమే ఉంటుంది. కుండకు ముందు మట్టే ఉంది. చెట్టుకు ముందు బీజమే ఉంది. బీజంలో అవ్యక్తంగా ఉన్న అంకురమే కార్య రూపాన్ని పొంది నపుడు శాఖోపశాఖలు గల వృక్షంగా వ్యక్త మైంది.

సృష్టికి ముందు అవ్యక్తంగా ఉన్న పరమేశ్వరుడే సృష్టిగా వ్యక్త మయ్యాడు. కుండలో మట్టి లాగా, నగలో బంగారు లాగా వ్యక్తమయ్యే నామరూపాలలో కారణమే వ్యాపించి ఉంటుంది కనుక, పాంచభౌతిక మైన దృశ్యమాన జగత్తులో పరమేశ్వరుని అవ్యక్త చైతన్యమే వ్యాపించి ఉంది. ఈ విధంగా విశ్వమంతా అవ్యక్త మూర్తి యైన పరమేశ్వర చైతన్యము చేత వ్యాప్తమై ఉంది **(ఇదం జగత్ సర్వం మయా తతం... ఈశావాస్యం ఇదం సర్వం).**

స్వప్న దృష్టాంతముతో విషయాన్ని సులభతరం చేసుకుందాం. నిద్రించి నపుడు మనం కలలు కంటున్నాం. ఎవరి కల వారిదే. ఎవరి కలకు వారే కర్త. నీ స్వప్నాన్ని తయారు చేసేం దెవరు? మరొకరు తయారు చేసే అవకాశం లేదు కనుక నువ్వే సృష్టించావు. స్వప్నం దేనితో తయారైంది? కుండకు మట్టి ఉపాదానం. మరి నీ స్వప్నానికి ఉపాదానం ఎవరు? నువ్వే.

స్వప్నంలో నువ్వు చూచే వన్నీ నీకు తెలిసిన వేనా? లేక తెలియనివా? తెలియని వాటిని ఎలా సృష్టించ గలవు? ఏవేవి స్వప్నంలో నీకు కనిపిస్తున్నాయో వాటన్నిటిని గతంలో నువ్వు చూచే ఉన్నావు. అవన్నీ నీకు తెలిసినవే. నీలో ఉన్నవే. నీలో అవ్యక్తంగా ఉన్నవే కలలో వ్యక్త మవుతున్నాయి.

కలలో కనిపించిన వన్నీ నీకు తెలిసినవే కనుక, వాటన్నిటికి సంబంధించిన జ్ఞానం నీకు ఉంది. ఆ విధంగా స్వప్న విషయంలో నీవు సర్వజ్ఞుడివి. అంతే కాదు. కలలో ప్రతి వస్తువు నీవే. నీ కన్నా అన్యంగా ఏదీ లేదు. కనుక, కలలో నువ్వు సర్వవ్యాపివి. స్వప్నంలో నువ్వు లేని చోటు లేదు. స్వప్నంలో ఉన్నదంతా నీవే. నీవు మాత్రమే.

నీ స్వప్నంలో చెట్లు ఉన్నాయి. నదులు ఉన్నాయి. సముద్రం ఉంది. ఆకాశం ఉంది. మృగా లున్నాయి. మనుషు లున్నారు. ఇవన్నీ సృష్టింప బడ్డవే. సృష్టించింది నువ్వే. ఈ విషయంలో సందేహం లేదు. కాని, ఎందుకనో, ఇక్కడ నాకొక సందేహం కలుగుతూ ఉంది.

కలను నువ్వు సృష్టించావా? కల లన్నీ మనం సృష్టించు కుంటున్న వేనా? ఇదే వాస్తవ మైతే, మన స్వప్నాలను మనమే తయారు చేసుకునే టట్లయితే, కల లన్నీ మనకు అనుకూలంగా ఉంటాయే గాని ప్రతికూలంగా ఎందు కుంటాయి? భయ పెట్టేవి ఎందు కుంటాయి? పులులు ఉండవు. పాములు ఉండవు. అప్పుల వాళ్ళు ఉండరు. అత్తమ్మలు అసలే ఉండరు. కాని, వీళ్ళందరూ కలలలో కనిపిస్తున్నారా, లేదా? అలాంటి స్వప్నాలను మన మెందుకు సృష్టించు కుంటాము? ఇంకా లోతుగా ఆలోచిస్తే, కలకు కర్తవు నువ్వయితే, మరి కారయిత్వ మెవరిది? కనుక, వాస్తవానికి నువ్వు కలను సృష్టించవు. కల నీ నుండి వ్యక్త మవుతుంది. అంతే.

అవ్యక్తంగా ఉన్న నీ కల నీ నుండే ఎలా వ్యక్త మవుతూ ఉందో, అలాగే ఈ ప్రపంచం పరమేశ్వరుని నుండే వ్యక్తమైంది. నీలో వ్యక్తమైన కలలో నీవే ఎలా వ్యాపకమై ఉన్నావో, అలాగే పరమేశ్వరుని నుండి వ్యక్త మైన సృష్టిలో పరమేశ్వరుని అవ్యక్త చైతన్యమే వ్యాపించి ఉంది **(మయా తత మిదం సర్వం జగ దవ్యక్త మూర్తినా).**

కల నీలో ఉంది కనుక, కలలో ఉన్న వన్నీ నీ లోనే ఉన్నాయి. ప్రపంచం కూడా పరమేశ్వరుని కన్నా భిన్నంగా ఉండే అవకాశం లేనందున, పరమేశ్వరుని లోనే ఉంది. ప్రపంచం పరమేశ్వరునిలో ఉంది కనుక ప్రపంచంలో ఉన్న వన్నీ పరమేశ్వరుని లోనే ఉన్నాయి ***(మత్ స్థాని సర్వభూతాని).***

ఇంతవరకు మనం అర్థం చేసుకున్న దానిని సారభూతంగా చెప్పుకుంటే : అవ్యక్తమూర్తి యైన పరమేశ్వరుని చేత సమస్త జగత్తు వ్యాప్తమై ఉంది కనుక, పరమేశ్వరుని చైతన్యము వల్లనే జగత్తు మనుగడను కలిగి యున్నది (సత్తా). అందుచేత భూతము లన్నీ పరమేశ్వరుని యందే ఉన్నాయి అని శ్లోకం లోని మూడు పాదాలను అర్థం చేసుకున్నాం.

నీటి యందు తరంగములు, బుడగలు మొదలైనవి జలము యొక్క సత్తా చేతనే సత్తావంతమై, ఎలా జలము నందే ఉన్నవో, అలాగే పరమేశ్వరుని చైతన్యము చేత సత్తావంత మైన జగత్తు, జగత్తు లోని భూతములు పరమేశ్వరుని యందే ఉన్నాయి.

సదాయతనాః సత్ప్రతిష్ఠాః - దేని సత్తా చేత ఏవి సత్తావంత మైనవో అవి దాని యందే ఉంటాయి అని వేదం కూడా ధృవపరచింది. దీనిని బట్టి సర్వభూతములకు, సమస్త జగత్తునకు బ్రహ్మము ఆధారమని ధృవ పడింది. బ్రహ్మము ఆధారమైంది కనుక, జగత్తు ఆధేయ మవుతుంది. దీనిని నిర్ధారణ చేసుకుంటే, జగద్బ్రహ్మలకు ఆధేయ ఆధార సంబంధం ఖాయ మవుతుంది. ఈ విధమైన సంబంధము ఉందా? ఉండే అవకాశ ముందా? అనేది మీమాంస.

ఆధార ఆధేయ సంబంధము

ఒక వేదిక మీద వ్యాసపీఠంపై ఒక గ్రంథము ఉంది. గ్రంథము అలా ఉండటానికి ఆధారంగా వ్యాసపీఠం ఉంది. వ్యాసపీఠము ఆధారము. గ్రంథము ఆధేయము. అంటే, గ్రంథము వ్యాసపీఠంపై ఆధారపడి ఉంది అని అర్థం.

అలాగే వ్యాసపీఠమునకు వేదిక ఆధారము. వేదికను ఆధారముగా కలిగి యున్న వ్యాసపీఠము ఆధేయము. వేదికకు భూమి ఆధారము. అప్పుడు వేదిక ఆధేయ మైంది. ఇదీ ఆధార ఆధేయ సంబంధ మంటే.

మరి, మన ప్రస్తుత చర్చనీయాంశ మైన జగద్బ్రహ్మలకు ఆధేయ ఆధార సంబంధం ఉందా? ఉంటే, అది ఎలాంటి సంబంధము?

సంబంధము అన్నప్పుడు అది సజాతీయంగా ఉండాలి. జలక్షీర సంబంధమును సజాతీయంగా అర్థం చేసుకోవచ్చు. రెండూ ద్రవ పదార్థములే కనుక. స్థాణుక్షీర సంబంధము సాధ్యమా? పాలలో నీళ్ళు కలుస్తాయి గాని రాళ్ళు కరగవు, కలవవు. అది విజాతీయం కనుక, వాటి మధ్య సంబంధం కుదరదు. మరి, చైతన్య రూపుడైన అవ్యక్త పరమాత్మకు జడ రూపమైన వ్యక్త ప్రపంచానికి సంబంధం ఎలా కుదురుతుంది? సంబంధమే లేనపుడు ఇక ఆధార ఆధేయము లెక్కడ ఉంటాయి?

ఒక వస్త్ర ముంది. వస్త్రానికి సత్తా నూలు మాత్రమే. నూలుతో వస్త్రాన్ని నేశారు. ఇప్పుడు వస్త్ర మంతా నూలు వ్యాపించి ఉంది. వస్త్రము ఏదో కాదు; నూలే. వస్త్రానికి నూలు ఆధార మైతే, వస్త్రం ఆధేయ మవుతుంది. దీనినే సమవాయ సంబంధం అంటారు. వస్త్రం తగలబడి పోతే, నూలు మిగిలి ఉంటుందా? సమవాయ సంబంధంలో ఒకటి నశిస్తే రెండవది కూడా నశించాలి. గుడ్డ నశిస్తే దారము నశించినట్లే. దారము నశిస్తే గుడ్డ నశించినట్లే.

మరి, జగత్తు బ్రహ్మలకు సమవాయ సంబంధం ఉండే అవకాశం ఉందా? జగత్తు నశిస్తే బ్రహ్మము

నశిస్తుందా? ప్రళయంలో జగత్తు లేకుండా పోతుంది కదా! అప్పుడు బ్రహ్మము కూడా లేనట్లేనా? అలాగే, జగత్తు పరిణామం చెందుతూ ఉంది కదా! అలాగని బ్రహ్మము కూడా పరిణామశీల మేనా? ఇలా ఎంతైనా చెప్పుకుంటూ పోవచ్చు. ఇంతకీ సారాంశ మేమిటంటే, బ్రహ్మము అద్వితీయం కనుక, బ్రహ్మమువకు దేని తోను సంబంధము ఉండే అవకాశమే లేదు. బ్రహ్మము కన్నా అన్యంగా రెండవ వస్తువు ఉంటే కదా బ్రహ్మమువకు సంబంధము ప్రాప్తం? సంబంధము ఉంటే బ్రహ్మము సంగి అవుతాడు. ఈ విషయం శృతి స్మృతి అనుభవ విరుద్ధము.

నిష్కలం నిష్క్రియం అసంగో న హి సజ్జతే, ఆకాశవ త్సర్వగతశ్చ నిత్యః

బ్రహ్మము అవయవ రహితము. క్రియా రహితము. సంగరహితము. ఆకాశము లాగా నిర్మలము. నిత్యము. సర్వగతము.

కనుక పరమేశ్వర చైతన్యము భూతములలో ప్రవేశించటము గాని, వ్యాపించి ఉండటము గాని, మరో విధమైన ఆధార ఆధేయాది సంబంధాలు కలిగి ఉండటము గాని సాధ్యం కాదు. ఆధార ఆధేయ సంబంధం వ్యావహారికమే గాని పారమార్థికం కాదు. అద్వయము, అసంగము అయిన అవ్యక్త చైతన్యానికి సంబంధము అనేది అనూహ్యము.

ఆరోపమే గాని స్వరూపము కాదు

మసక చీకటిలో త్రాడును పాముగా భ్రమించాము. రజ్జు సర్ప భ్రాంతి ఏర్పడింది. వాస్తవానికి అక్కడ ఉన్నది త్రాడే గాని సర్పం కాదు. ఇక ఆలోచించండి.

సర్పము కనిపిస్తూ ఉంది కదా! సర్పముగా తెలిసే దెవరు? త్రాడే. త్రాడు ఎక్కడుంది? సర్పములో వ్యాపించి ఉంది. సర్పముగా కనిపించేదంతా త్రాడే. సర్పము పొడవు త్రాడు పొడవే. ఈ విధంగా త్రాడు సర్పమంతా వ్యాపించి ఉంది ***(మయా తతం ఇదం సర్వం).***

సరే. అదలా ఉంచండి. ఇంతకీ సర్ప మెక్కడుంది? త్రాడు లోనే ఉంది **(మత్‌స్థాని మయి స్థితాని).** మరి, త్రాడు సర్పంలో ఉందా? లేనే లేదు. అదే శ్లోకంలో ఇక మనం చెప్పుకోవలసిన నాల్గవ పాదము ***(అహం తేషు న అవస్థితః).*** ఇదీ గమ్మత్తు.

స్వప్నంలో అంతటా నీవే వ్యాపించి ఉన్నావు. స్వప్నం నీ లోనే ఉంది. కానీ నువ్వు స్వప్నంలో లేవు. స్వప్నంలో నీవు లేనపుడు స్వప్నంతో నీకు సంగత్య మెలా ఉంటుంది? సంగత్యము లేనపుడు సంబంధ మెలా ఉంటుంది? ఏది ఆధారము? ఎక్కడ ఆధేయము? అంతా ఆరోపమే. కల్పితమే. అధ్యస్త సంబంధమే. మిథ్యా సంబంధమే.

కుండలో మట్టి వ్యాపించి ఉంది అని మనం చెప్పుకోవచ్చు. మట్టి కన్నా వేరుగా కుండ ఉంటే కదా మట్టి కుండలో వ్యాపించేది! కుండ స్థాయి నుండి చూస్తే మట్టి ఆధారం గాను, కారణం గాను తెలుస్తూ ఉంది. మట్టి స్థాయి నుండి చూస్తే కుండ ఎక్కడుంది? ఉన్నదంతా మట్టే. వ్యాప్య వ్యాపకా లెక్కడున్నాయి? ఆధార ఆధేయా లెప్పుడొచ్చాయి?

పారమార్థిక దృష్టిలో పరమాత్మ అసంగుడై, అద్వయుడై శోభిస్తూ ఉన్నందున సర్పములో రజ్జువు లేనట్లు, స్వప్నంలో పురుషుడు లేనట్లు, జగత్తులో, భూతాలలో తాను లేడు. అదే శ్లోకం లోని నాల్గవ పాదం **(న చాహం తేషు అవస్థితః).** బ్రహ్మము భూతములలో ఉంటే, బ్రహ్మము ఆధేయమై భూతాలు ఆధార మవుతాయి.

సంబంధమే లేని వస్తువు ఆధేయ మెలా అవుతుంది? *(న హి అసంసర్గి వస్తు క్వచిత్ ఆధేయ భావేన అవస్థితం భవతి).*

మరి, ఏ సంబంధము లేక, ఏ సంసర్గమూ లేక జగత్తు యొక్క సృష్ట్యాది కార్యాలు ఎలా సాగుతున్నాయి? అదే ఆశ్చర్యకర మైన ఈశ్వర వైభవము. చదవండి.

న చ మత్స్థాని భూతాని పశ్య మే యోగ మైశ్వరమ్ ।
భూతభృ న్నచ భూతస్థో మమాత్మా భూతభావనః ॥ 5

న-చ-మత్స్థాని-భూతాని-పశ్య-మే-యోగం-ఐశ్వరం
భూతభృత్-న-చ-భూతస్థః-మమ-ఆత్మా-భూతభావనః

భూతాని	=	ప్రాణులు	మమ	=	నా యొక్క
న మత్స్థాని	=	నా యందు లేవు	ఆత్మా	=	ఆత్మ
మే	=	నా యొక్క	భూతభృత్	=	భూతములను భరించునట్టిది
ఐశ్వరం	=	ఈశ్వరసంబంధ మైన	భూతభావనః	=	భూతములను రక్షించునది
యోగం చ	=	యోగమును	భూతస్థః న చ	=	భూతములలో ఉండేది కాదు
పశ్య	=	చూడు			

అర్జునా! భూతములు కూడా నాలో లేవు. నా యోగ మహిమను దర్శించు. భూతాలను పుట్టించి, భూతాలను పోషించే నా ఆత్మ భూతాలలో లేదు.

వ్యాఖ్య

సర్వ భూతములు నా యందు ఉన్నవి *(మత్స్థాని సర్వ భూతాని).* నేను భూతముల యందు లేను *(న చాహం తేష్వవస్థితః)* అని నాల్గవ శ్లోకంలో భగవంతుడు ప్రసంగించాడు. అంటే, తాను భూతాలలో లేకున్నా, భూతాలు తన యందు ఉన్నాయని అంగీకరించడం జరిగింది. అలాంటప్పుడు భగవంతుడు అసంగుడు ఎలా అవుతాడు? అనేది ఒక శంక.

భూతములు పరమేశ్వరుని యందు ఉంటే, భూతాలకు పరమేశ్వరునికి ఆధేయ ఆధార భావము ఏర్పడినట్లే కదా! ఈ ఆధార ఆధేయాలు ద్వైతాన్ని ప్రవేశ పెడుతున్నాయి కదా! బ్రహ్మము ఏకము, అద్వయము అనే ప్రతిజ్ఞకు భంగం వాటిల్లుతూ ఉంది కదా!

నిద్రలో స్వప్నానికి పురుషుని వల్లనే వస్తు సత్తా కలుగుతూ ఉంది కనుక, స్వప్నము తనలో ఉంది అంటున్నామే గాని వాస్తవానికి స్వప్నముతో తనకు ఏ విధమైన సంబంధము లేదు కదా! అలాగే ఆత్మ చేత సత్తావంతములై ఉండటం చేత భూతములు ఆత్మ యందు ఉన్నవని చెప్పడం జరిగిందే గాని, బ్రహ్మకు భూతములతో సంగత్వము ఉందని కాదు.

శుక్తి యందు రజతము ఉన్నట్లు చూస్తున్నాము కదా! మరి ముత్తెపు చిప్ప యందు వెండి ఉన్నట్లేనా? ముత్తెపు చిప్ప లోని వెండికి, ముత్తెపు చిప్పకు సంబంధం ఉందా? లేదు కదా! అలాగే సర్పము రజ్జువులో కనిపిస్తూ ఉంది. అలాగని సర్పానికి రజ్జువుకు సంబంధం లేదు కదా! అలాగే భూతాలకు, బ్రహ్మమునకు కూడా సంబంధం లేదు.

భూతాలకు సత్తా బ్రహ్మము వల్లనే కలుగుతూ ఉన్నందున, భూతాలు పరమేశ్వరునిలో ఉన్నవి *(మత్స్థాని

సర్వభూతాని) అని చెప్పడం జరిగింది. బ్రహ్మము అద్వయమైన అవ్యక్త చైతన్యము కావడం చేత, జగత్తులో ఏ విధమైన సంబంధము ఉండేందుకు అవకాశము లేనందున, పరమేశ్వరుడు భూతాలలో లేడు *(న చాహం తేషు అవస్థితః)* అని చెప్పడం జరిగింది. ఇంతకీ, బ్రహ్మము నందు జగత్తు ఉన్నదా? ఉన్నది అంటే ఉన్నది, లేదంటే లేదు అని చెప్పినట్లైంది. ఇదేమిటి? అని ప్రశ్నిస్తే, అదే నా యోగ వైభవము, తిలకించు అంటున్నాడు *(పశ్యమే యోగ మైశ్వరమ్).*

సౌమ్యాఽ ప్సుసి యథా వీచి ర్నచాస్తి న చ నాస్తి చ,
తథా జగద్బ్రహ్మణీదం శూన్యాశూన్య పదం గతమ్ ॥

'నాయనా! సౌమ్యుడా! జలము నందు ఎలా తరంగములు ఉన్నవీ కావో, లేనివీ కావో, అలాగే, బ్రహ్మము నందు ఈ ప్రపంచము ఉన్నదీ కాదు, అలాగని లేకుండా పోయిందీ కాదు' అని ఉపనిషత్తు.

భూతాలకు ఆత్మ వలననే సత్తా కలుగుతూ ఉంది కనుక, అవి ఆత్మవంతము లయ్యా యని చెప్పడం చేత, బ్రహ్మము భూతాలలో ఉంది అని అజ్ఞానులు భావించే అవకాశం ఉంది. దానిని నిరాకరిస్తూ, నేను వాటి యందు లేను అని చెప్పడం జరిగింది **(అహం తేషు స్థితః ఇతి మూఢ బుద్ధీనామ్ అవభాసతే).**

భూతములు బ్రహ్మము నందు లేవు

భూతముల యందు బ్రహ్మము ఉంటే, భూతములు ఆధారమై బ్రహ్మము ఆధేయ మవుతాడు. అందుచేత నేను భూతముల యందు లేను అని చెప్పడం జరిగింది. భూతములు బ్రహ్మము నందు ఉంటే, బ్రహ్మము ఆధారమై భూతములు ఆధేయ మవుతాయి. బ్రహ్మము అద్వయము, అసంగము కావడం చేత బ్రహ్మము దేనికిని ఆధారము కాడు. అలాగే ఆధేయమూ కాడు. కనుక నేను భూతముల యందు లేను అని గడచిన శ్లోకంలో చెప్పిన పరమేశ్వరుడు ప్రస్తుత శ్లోకములో భూతములు నా యందు లేవు అంటున్నాడు *(న చ మత్స్థాని భూతాని).*

భూతములు తన యందు లేవు అంటే జగత్తు తనలో లేదు అని అర్థము. కుండలో మట్టి ఉంది. కాని, మట్టిలో కుండ ఉందా? లేదు. జడమైన జగత్తుకు, చైతన్య స్వరూపమైన బ్రహ్మమునకు ఏ విధమైన సంబంధమూ పొసగదు. ఒకవేళ ఏదైనా సంబంధమును ఊహిస్తే, అది కారణ కార్య సంబంధం కాదు. కుండకు మట్టి కారణ మని చెప్పినా, ఉన్నది కారణమైన మట్టే గాని, కార్యం ప్రత్యేకంగా ఎక్కడుంది? కుండ కార్యము. అంటే, కుండ ఏమిటి? నామరూపాలే కదా! నామరూపాలు సత్య మెలా అవుతాయి? సత్యమైన మట్టిపై ఆధారపడి ఉన్నందున కుండ అనే నామరూపాలు మిథ్య. సత్యమిథ్యలకు సంబంధము కార్యకారణం కాదు. మిథ్యా సంబంధము. అదే అధ్యస్త సంబంధము.

రజతము శుక్తి యందు అధ్యస్తము. రజతము నామ మాత్రమే గాని సత్యము కాదు. శుక్తి యందు రజతము అనేది లేనే లేదు. అలాగే బ్రహ్మము నందు జగత్తు అధ్యస్తమే కనుక, జగత్తు అనేది కేవలం నామ మాత్రమే గాని, జగత్తు అనేది వాస్తవంగా బ్రహ్మము నందు లేదు. కనుకనే భూతములు నాలో లేవు అంటున్నాడు. భూతములు బ్రహ్మములో లేనందున, భూతములతో బ్రహ్మమునకు ఏ విధమైన సంసర్గము లేదు **(అసంసర్గిత్వాత్, న చ మత్స్థాని భూతాని).** బ్రహ్మమునకు ఏ విధమైన సంబంధము లేనందున, జగత్తు యొక్క గుణదోషాలు బ్రహ్మమునకు అంటవు. అధ్యస్త సంబంధము కావడమే అసంగ స్థితికి కారణము.

యత్ర యదధ్యస్తం తత్కృతేన గుణేన దోషేణ వా అణుమాత్రేణాపి స న సంబధ్యతే - దేని యందు ఏది అధ్యసింప బడిందో, అట్టి అధ్యస్తమైన దాని గుణముతో గాని, దోషముతో గాని అధిష్ఠానమైన దానికి సంబంధము

ఉండదు అని ఆచార్యుల వారు బ్రహ్మసూత్ర భాష్యంలో స్పష్టం చేశారు.

పరమేశ్వరుడు జగత్తుకు ఆధారము కాడు. కాని, భూతములు నా యందు ఉన్నవి అంటాడు. పరమేశ్వరుడు ఆధేయము అసలే కాడు. కాని, నేను భూతములలో ఉన్నాను అంటాడు. అదేమిటి? అంటే, అదే ఈశ్వర సంబంధమైన మాయ. 'నా ఈశ్వర సంబంధమును తిలకించు' *(పశ్య మే యోగ మైశ్వరమ్)* అంటాడు.

భూతముల ఉత్పత్తికి, పెరుగుదలకు, మనుగడకు సత్తా మాత్రమై *(భూత భావనః, భూతాని భావయతి వర్ధయతి ఇతి)*. భూతములకు ఉపాదానం కావడం చేత వాటిని పోషించునది అయినప్పటికి *(భూతభృత్, భూతాని బిభర్తి)*. నా ఈశ్వర చైతన్యము *(మమ ఆత్మా)* భూతముల యందు లేదు *(న చ భూతస్థః)*. ఇదే ఈశ్వర వైభవము, తిలకించు అంటున్నాడు. ఇదే శ్లోకము యొక్క ఉత్తర పాదము.

ఈశ్వర వైభవము

ఇక్కడ ***యోగం*** అంటే సంబంధము. ***ఐశ్వరమ్*** అనేది విశేషణంగా వాడ బడింది. ఈశ్వరునితో కూడిన ఈ సంబంధాన్ని, ఈశ్వర యోగాన్ని *(యోగ మైశ్వరమ్)* దర్శించ మంటున్నాడు *(పశ్య)*. ఇదే ఈశ్వర మాయ. ఈశ్వర వైభవము.

తాను తానుగా ఉంటూ, తనలో ఏ మార్పు లేకుండానే జగత్తుగా భాసించడం ఈశ్వర వైభవము కాదా? సర్వ కారణమై కనిపిస్తూ, కారణ కార్యాలకు అతీతంగా శోభించడం ఈశ్వరీయ మాయ కాదా? అవ్యక్తమూర్తియై ఉండి వ్యక్తాలలో ప్రాకి ఉండటం ఈశ్వర యోగం కాదా? స్వరూపంలో ఏకమై భాసిస్తూ, వ్యవహారంలో అనేకంగా గోచరించడం ***యోగ మైశ్వరమ్*** కాదా? అన్నీ తానే నంటూ, ఏదీ తాను కాదంటూ, అంటీ అంటని ఈ విలక్షణ స్థితిని ఏమనాలి?

మట్టిలో తానే. మనిషిలో తానే. మాటలో తానే. మనస్సులో తానే. మాయలో తానే. మహిమలో తానే. అన్నీ తానే. తానే అన్నీ. అన్నీ ఎన్నని? ఎన్నో కావని. అన్నీ ఒక్కటే నని. ఆ ఒక్కటే తానని. అదే వైభవము! ఈశ్వర వైభవము. సర్వేశ్వర వైభవము. నిరుపాధిక ఐశ్వర్యము. ఏది ఉన్నా తన వల్లనే ఉంటుంది. తన పైనే ఆధారపడి ఉంటుంది. కాని, తాను దేని పైన ఆధార పడదు. తనలో దేనిని ఉంచుకోదు. తాను దేని లోను ఉండదు. అదే ఈశ్వర వైభవము.

భూతములకు ఈశ్వర చైతన్యము చేతనే ఆవిర్భావము సంభవిస్తూ ఉంది. అలా చూచి నపుడు, పరమేశ్వరుడు భూతభావనుడు *(భూత భావనః)*. భూతభావనుడు అంటే భూతముల ఉత్పత్తికి, వృద్ధికి కారణ మైన వాడు అని అర్థము *(భూతాని భావయతి, వర్ధయతీతి వా భూతభావనః)*. అంటే, సృష్టి కార్యము అతనిదే. మరొకరిది కాదు. నిర్మాణకర్త తానే. కర్త తాను అయితే, 'కారయితా', అంటే కర్త చేత కర్మ చేయించే వాడు మరొకడు ఉన్నాడా? అలా పరమేశ్వరుని చేత సృష్టి చేయించే వాడు మరొకడు ఉంటే, అతడే సృష్టికర్త అవుతాడు. కనుక కర్త తానే. కారయితా కూడా తానే. ఈ విధంగా భూతభావనుడైన వాడు భూతముల వృద్ధికి కారణమై ***భూతభృత్*** అయ్యాడు. భూతాలను ధరించే వాడు, భరించే వాడు, పోషించే వాడు భూతభృత్ *(భూతాని బిభర్తి ధారయతి పోషయతి ఇతి వా భూతభృత్)*. యావత్ప్రపంచానికి తానే ఉపాదాన కారణం కావడం చేత, జగద్రూపంలో తానే ఉండి, జగత్తును తానే పోషిస్తూ ఉన్నాడు అని అర్థము.

కుండ యొక్క ఉత్పత్తికి కారణమైన మట్టి కుండకు సత్తాత్మకం గాను ఉంటూ కుండను భరిస్తూ, ధరిస్తూ ఉంది *(బిభర్తి ధారయతి)*. అలాగని ఉపాదాన మైన మట్టిలో ఏ పరిణామము లేదు. ఇదే వివర్త అధిష్ఠానము. కాని, ఈ విధమైన వివర్త అధిష్ఠానత్వము కూడా అవ్యక్త చైతన్యమైన తన పరోభావమునకు లేదు

అనేదే ఈశ్వర వైభవము. కనుక, పరమేశ్వర వైభవములో ద్వైత భావన అంగీకారమే కాదు. కనుక, ఈశ్వర చైతన్యము జగత్కారణము కాబోదు.

అస్య ద్వైత ఇంద్రజాలస్య యదుపాదాన కారణమ్, అజ్ఞానం తదుపాశ్రిత్య బ్రహ్మకారణ ముచ్యతే॥

ఈ ద్వైతరూప ప్రపంచ ఇంద్రజాలానికి ఏ అజ్ఞానము లేదా మాయ ఉపాదాన కారణముగా చెప్పబడుతూ ఉందో, దాని నాశ్రయించుకొనే బ్రహ్మమును కారణంగా చెప్పడం జరుగుతూ ఉంది అని భారత భావ దీప వ్యాఖ్యలో నీలకంఠాచార్యులు ఉదహరించిన వార్తిక వాక్యము.

కనుక మాయా కార్యమైన భూత ప్రపంచముతో అసంగ చైతన్య రూపుడైన పరమేశ్వరునకు ఆధార ఆధేయ సంబంధము ఉండేందుకు అవకాశము లేనందున, భూత భావనుడుగా, భూతభృత్‌గా తెలుస్తూ ఉండినా, వాస్తవానికి ఈశ్వర చైతన్యము **(మమ ఆత్మా)** భూతముల యందు లేదు **(న చ భూతస్థః)** అంటున్నాడు.

ఆకాశములో గంధర్వ నగరము, గగన కుసుమము ఇత్యాదులు గోచరిస్తాయి. వాటిని ధరించేది ఆకాశమే అయినా, ఆయా రూపాలుగా ఆకాశము పరిణమించదు కనుక, ఆకాశము వాటి యందు ఉండదు. అలాగే 'భూత భావనః', 'భూతభృత్' అని ఈశ్వర చైతన్యము స్తుతింప బడుతూ ఉండినా, అన్నిటిలో ఉన్నట్లు తెలుస్తూ ఉండినా **(సర్వభూత నివాసోఽపి)**, వాటితో ఏ సంబంధము లేకపోవుట చేత, అసంగమైన ఈశ్వర చైతన్యము భూతముల యందు ఉండునది కాదు **(న చ భూతస్థః)**. అలా ఉండేట ట్లయితే, **విశేషణ నాశాత్ విశిష్టస్యాపి నాశః** అనే న్యాయానుసారము విశేషణము లైన భూతములు నశిస్తే, వాటికి విశిష్టంగా తెలుస్తున్న ఆత్మకు కూడా వినాశము కలుగుతుంది. ఆత్మ అవినాశి కనుక ఆత్మ భూతములలో ఉండ లేదు.

అలా అయితే, ఆత్మకు భూతస్థత్వము లేదు అనుకుంటే, భూతముల చేత ఆత్మ పరిచ్ఛిన్నం కావడం లేదా? అనే సందేహం కలగవచ్చు. అలాంటి సందేహానికి అవకాశం లేదు. ఇది అధ్యస్త సంబంధము కావడం చేత, ఆకాశము నందు నీలి వర్ణము లాగా, పరమేశ్వరుని చైతన్యము నందు సర్వమూ కల్పితమే అని భావము. పైగా, అధిష్ఠానానికి భిన్నమైన ఆరోపితాలకు అస్తిత్వము ఉండదు కనుక, అట్టి సందేహానికి అవకాశం లేదు.

చివరగా **మమ ఆత్మా** అనడం కూడా అర్థం కావాలి. **మమ గృహం** అంటే నా ఇల్లు అని అర్థము. అంటే, నేను వేరు, నా ఇల్లు వేరు అని తెలుస్తూనే ఉంది. అలాగే **మమ ఆత్మా** అంటే, ఈశ్వరుడు వేరు, ఈశ్వరాత్మ వేరు అని అర్థమా? కానే కాదు.

ఇక్కడ అధ్యాస కోణం నుండి **మమ ఆత్మా** అని ప్రవచిస్తున్నాడు. ఉపాధి స్థాయి నుండి **మమ ఆత్మా** అంటున్నాడే గాని, ఆత్మ నుండి ఆత్మను వేరు చేసి కాదు. సోపాధిక ఐశ్వర్యాన్ని దృష్టిలో ఉంచుకొని, సర్వులకు అవగతం కావడానికి **మమ ఆత్మా** అంటున్నాడు. వాస్తవానికి నా ఆత్మ అనేది లేనే లేదు. ఆత్మే ఉంది. అద్వయంగా ఉంది. అదే నిరుపాధిక ఐశ్వర్యము. సత్య జ్ఞానానంద స్వరూపము. కనుకనే **ఏష సర్వేశ్వరః**- ఇతడే సర్వేశ్వరుడు అన్నది బృహదారణ్యకోపనిషత్.

మనం అధ్యయనం చేసిన ఈ నాలుగు - ఐదు శ్లోకాలు చక్కగా బుద్ధికి పడితే, నిద్ర నుండి మేల్కొనిన వానికి స్వప్నం అదృశ్య మైనట్లు, ద్వైత ప్రపంచం అదృశ్య మవుతుంది.

ఇంతవరకు రెండు శ్లోకాలలో (4, 5) మనం తెలుసుకున్న విషయాన్నే సోదాహరణంగా వివరిస్తున్నాడు.

యథాకాశ స్థితో నిత్యం వాయుః సర్వత్రగో మహాన్ । 6
తథా సర్వాణి భూతాని మత్స్థానీ త్యుపధారయ ॥

యథా-ఆకాశస్థితః-నిత్యం-వాయుః-సర్వత్రగః-మహాన్
తథా-సర్వాణి-భూతాని-మత్‌స్థాని-ఇతి-ఉపధారయ

సర్వత్రగః	=	సర్వవ్యాపి	తథా	=	ఆ విధంగా
మహాన్	=	గొప్పది	సర్వాణి	=	సమస్తములైన
వాయుః	=	వాయువు	భూతాని	=	భూతములు
నిత్యం	=	నిత్యము	మత్థ్సాని ఇతి	=	నాలో ఉన్నవని
యథా	=	ఏ విధంగా	ఉపధారయ	=	గ్రహించు
ఆకాశస్థితః	=	ఆకాశము నందున్నదో			

అర్జునా! శ్రేష్ఠ మైనది, సర్వ సంచారి అయిన గాలి ఎలా ఆకాశంలో ఉంటుందో, అలాగే సమస్త భూతాలు నా లోనే ఉంటాయి అని తెలుసుకో!

వ్యాఖ్య

రెండిటి మధ్య సంశ్లేషము, అంటే సంబంధము ఉన్నప్పుడే ఆధార ఆధేయ భావము సంభవము అని ఇంతవరకు అర్థం చేసుకున్నాం. జగద్బ్రహ్మలకు సంశ్లేషము కుదర నందున ఆధేయ ఆధార సంబంధము లేదని భావించాము. కాని, అసంశ్లిష్ట మైన వాటి మధ్య కూడా ఆధార ఆధేయ భావమును చూపే దృష్టాంత మును తీసికొని, ***మయాతత మిదం సర్వం*** శ్లోకము నుండి మనం చెప్పుకొనిన పై రెండు *(4, 5)* శ్లోకాల లోని అర్థాన్ని ***(యథోక్తేన శ్లోక ద్వయేన ఉక్తం అర్థం)*** దృష్టాంతం చేత సమర్థిస్తూ ప్రవచిస్తున్నాడు ***(దృష్టాన్తేన ఉపపాదయన్ ఆహ)***.

అవకాశము - అవస్థానము

అవకాశము ఉన్నప్పుడే దేని కైనా అవస్థానము ఉంటుంది. 'అవస్థానము' అంటే ఉనికి అని అర్థము. ***అవకాశ ప్రదాతృ ఆకాశః*** - అవకాశాన్ని ఇస్తుంది కనుక ఆకాశము అని పేరు వచ్చింది. ఏ చలనాని కైనా చోటు ఉన్నప్పుడే అవకాశం. ఆ చోటే ఆకాశము. పంచభూతాలలో ఆకాశం ఒకటి. అన్ని భూతాల లోకి సూక్ష్మ మైనది ఆకాశము. కనుక అన్నిటి కన్నా విశాల మైనది. అందుచేత ఆకాశము మిగిలిన నాలుగు భూతాలకు, అనగా పృథివప్తేజో వాయువులకు తనలో అవస్థానమును కల్పిస్తుంది.

వాయువు ఉంది. వాయువు యొక్క ఉనికి ఆకాశంలో ఉంది. అంటే వాయువు తనలో ఉంటూ చలించడానికి ఆకాశము అవకాశమును కల్పిస్తూ ఉంది. ఆకాశము అవకాశము నిచ్చింది కనుక వాయువుకు అవస్థానము ఏర్పడింది.

వాయువు సదా ఆకాశం లోనే ఉంటుంది ***(నిత్యం ఆకాశే స్థితః)***. ఆకాశ వాయువులకు ఆధార ఆధేయ సంబంధం తెలుస్తూ ఉంది. ఆకాశము ఆధారము కాగా, వాయువు ఆధేయంగా ఉంది. ఆధారం లేకుండా ఆధేయం ఉండ లేదు. ఆకాశం లేకుండా వాయువు ఉండ లేదు. చలించనూ లేదు.

వాయువు గొప్పది ***(మహాన్ పరిమాణతః)***. ఆకాశం వాయువు కన్నా గొప్పది. కనుకనే వాయువు యొక్క ఉత్పత్తి స్థితి లయాలు ఆకాశం లోనే జరుగు తున్నాయి. వాయువు చలిస్తూ ఉంది. ఆకాశం అచలంగా ఉంది. ఆకాశంలో చలించే వాయువు గొప్పది అన్నాడు గీతాచార్యుడు ***(మహాన్)***. గొప్పది అంటే గొప్ప పరిమాణము కలది అని వ్యాఖ్యానించారు శ్రీ శంకరాచార్య స్వామి ***(పరిమాణతః)***.

పరిమాణము అంటే వాయువు యొక్క సంచార పరిధి అని అర్థము. నాలుగు భూతాలలో ఎక్కువ

దూరం పయనించేది వాయువే. వేగంలో కూడా తనదే ముందంజ. పృథివి ఎలాగూ చలించదు. చలించే మూడు భూతాలలో జలం అధోముఖంగా పయనిస్తుంది. ఊర్ధ్వంగా పయనించే అగ్ని వాయువులలో వాయువు ఎగిరి నంత ఎత్తుకు అగ్ని ఎగబ్రాక లేదు. అందుచేత, ఏ విధంగా చూచినా నాలుగు భూతాలలో గొప్పతనము వాయువు నందే గోచరించడం చేత వాయువును గొప్పది అన్నారు.

గొప్పది యైన వాయువును ***సర్వత్రగ*** మంటున్నారు. అంతటా పయనించేది కనుక సర్వత్రగం అయింది ***(సర్వత్ర గచ్ఛతి ఇతి సర్వత్రగః)***. అన్ని వైపుల ప్రసరిస్తుంది. అన్ని చోట్ల తిరుగుతుంది. ఒక చోట నుండి మరొక చోటికి వాయువు పయనించ గలదేమో గాని, ఒక ఆకాశం నుండి మరొక ఆకాశం లోకి పయనించ లేదు. కారణం, ఆకాశం ఒక్కటే కనుక. అందుచేత వాయువు ఎంత దూరం వెళ్ళినా ఆకాశాన్ని విడిచి వెళ్ళలేదు. ఆకాశం లోనే ఉండాలి. ఆకాశం లోనే తిరగాలి.

వాయువు ఆకాశం లోనే ఉండినా, వాయు గుణ దోషాలు ఆకాశంలో ఉండవు. వాయువు ఎంత గొప్ప దైనా, దానికీ ఒక పరిధి ఉంది. అంతరిక్షంలో వాయువు లేదు. వాయువు యొక్క ఈ పరిచ్ఛిన్నత్వము వలన ఆకాశము యొక్క అనంతత్వానికి భంగం వాటిల్లదు. అనంతమైన ఆకాశము పూర్ణ రూపంతో భాసిస్తూ ఉంది. తనలో ఎన్ని ఉన్నా, ఆకాశము దేనిని అంటకుండా నిర్లేపత్వమును ప్రదర్శిస్తూ ఉంది. ఈ విధంగా వాయు రాకాశాలకు సంశ్లేషము లేకపోయినా అసంశ్లిష్ట మైన ఈ రెండిటికి ఆధేయ ఆధార సంబంధం ప్రాప్తించినట్లు, జగద్బ్రహ్మ లకు సంశ్లేషము లేకపోయినా, ఆధార ఆధేయ భావం గోచరించడం సమర్థనీయమే.

ఈ వాయు రాకాశముల దృష్టాంతమును ఆధారం చేసుకొని జగద్బ్రహ్మల ఆధేయ ఆధార భావమును చెప్పుకుందాం.

పరమాత్మ - ప్రపంచము

గొప్పది అయిన వాయువు మహా గొప్పది అయిన ఆకాశంలో ఉన్నట్లు, గొప్పది అయిన ప్రపంచము ఆకాశము కంటే సూక్ష్మమైన ***(ఆకాశాదే రపి సూక్ష్మ తరమ్)*** పరమాత్మ యందు అవస్థానమును కలిగి ఉంది. వాయువుకు ఆకాశము ఎలా ఆధారమో, జగత్తుకు పరమాత్మ అలా ఆధారము.

వాయువు ఆకాశానికి ఎలా దూరంగా పోలేదో, భూతములు ఏవి ఎక్కడ తిరిగినా, ఏ లోకాల కేగినా, అనంతుడైన పరమాత్మకు మాత్రం దూరంగా పోలేవు. గొప్పదైన వాయువు విశాలాకాశంలో ఒక మూల ఒదిగి ఉన్నట్లు, సమస్త మైన ఈ జగత్తు పరమాత్మలో అంశమాత్రంగా ఉంది. ఈ విశ్వమంతా పరమేశ్వరుని ఒక్క పాదం కాగా, మిగిలిన మూడు పాదాలు విశ్వాతీతంగా ఉన్నాయి అన్నది వేదం ***(పాదోஉస్య విశ్వాభూతాని త్రిపాదస్య అమృతం దివి)***. ఈ విషయాన్ని గీత - విభూతి యోగంలో భగవంతుడే స్వయంగా చెబుతాడు. అర్జునా! ఈ విశ్వము నంతా ఒక్క అంశము చేతనే నేను వ్యాపించి యున్నాను ***(విష్టభ్యాహ మిదం కృత్స్నం ఏకాంశేన స్థితో జగత్)***. ఆకాశము లాగా పరమాత్మ యొక్క ఏకత్వాన్ని, అనంతత్వాన్ని అర్థం చేసుకున్నాం. పూర్ణత్వంలో పోలిక ఎలా కుదిరిందో, నిర్లేపత్వము లేదా అసంగత్వములో కూడా అలాగే పోలిక ఉంది. అది కూడా చెప్పుకుందాం.

వాయువు గంధవహుడు ***(గంధస్య వహః గంధవహః)***. గంధమును వహించే వాడు ***(గంధం వహతీతి గంధవాహః)***. వాయువు గంధమును మోసుకొని ఆకాశంలో సంచరిస్తున్నా, ఆకాశం మాత్రం నిర్లేపం గానే ఉంటుంది. అంటకనే ఉంటుంది. అలాగే, జగత్తు పరమేశ్వరుని యందే ఉన్నా, జగత్తు లోని గుణ దోషాలు పరమేశ్వరుని అంటవు. వాయువు ఎలాగైతే ఆవిర్భావ తిరోభావాలను పొందుతూ ఆకాశంలో సంచరిస్తూ

ఉంటుందో, వస్తూ పోతూ ఉండే లక్షణము గల ఈ జగత్తు *(జాయతే గచ్ఛతి ఇతి జగత్)* కూడా అచలమైన పరమాత్మ యందే సృష్టి స్థితి లయాదులను పొందుతూ ఉంటుంది.

ఆకాశం ఒక్కటే అయినా, చలించే వాటి కన్నిటికీ తనలో అవకాశం ఇస్తూ ఉంది. పరమాత్మ అద్వయమే అయినా, సమస్త భూతాలను తన లోనే ఉంచుకుంటాడు. ఆకాశంలో గాలి పుడుతూ ఉంది. పోతూ ఉంది. పరమాత్మలో కూడా లోకాలు పుడుతూ ఉన్నాయి. అలాగే పోతూ ఉన్నాయి.

యథా విశుద్ధ ఆకాశే స్తివాఽభ్రమండలమ్ ।
భూత్వా విలీయతే తద్వ దాత్మ నీహాఽఖిలం జగత్ ॥

ఏ విధంగా నైతే విశుద్ధమైన ఆకాశము నందు మేఘ మండలము జనించి, తిరిగి లయమును పొందు తున్నదో, అలాగే ఆత్మ యందు ఈ సమస్త జగత్తు ఆవిర్భవించి అంతరిస్తూ ఉంది.

ఆకాశ దృష్టాంతము చేత ఆత్మను వర్ణించడములో పరమేశ్వరుని ముఖ్యోద్దేశము మనకు స్పష్ట మవుతూ ఉంది. సమస్తము తన లోనే నడుస్తూ ఉన్నా, ఆకాశము ఎలా అంటకుండా, అసంగముగా ఉందో, అలాగే సృష్టి స్థితి లయాదులు పరమాత్మ లోనే జరుగుతూ ఉన్నా, తాను మాత్రం అసంగుడు గానే ఉన్నాడు. ఇదే తాత్పర్యము.

గాలి ఉన్నప్పుడు, ఆ ఉన్న గాలి ఆకాశం లోనే ఉంది. ఇది స్థితి. గాలి రావడము, గాలి ఉండటము, గాలి పోవడము అనేవి మూడు విధాలుగా ఆకాశములో ఎలా జరుగు తున్నవో, అలాగే భూతాలు ఆవిర్భవించడము, ఉంటూ వృద్ధి చెందడము, తిరిగి లయించి పోవడము అనేవి బ్రహ్మము నందే జరుగు తున్నాయి. **మత్స్థాని సర్వ భూతాని** అని నాల్గవ శ్లోకంలో భగవంతుడు చెప్పి నపుడు అది భూతముల యొక్క స్థితి కాలాన్ని సూచిస్తూ ఉంది. మరి, లయ కాలము ఏమిటి?

స్థితి కాలంలో అసంగుడైన బ్రహ్మమునకు లయ కాలంలో కూడా అసంగత్వం ఉంటుందా? అదే చెబుతున్నాడు.

సర్వభూతాని కౌన్తేయ ప్రకృతిం యాన్తి మామికామ్ ।
కల్పక్షయే పునస్తాని కల్పాదౌ విసృజా మ్యహమ్ ॥ 7

సర్వభూతాని-కౌంతేయ-ప్రకృతిం-యాంతి-మామికాం
కల్పక్షయే-పునః-తాని-కల్పాదౌ-విసృజామి-అహం

కౌంతేయ	=	అర్జునా!	కల్పాదౌ	=	కల్పారంభము నందు
కల్పక్షయే	=	కల్పాంతములో	తాని	=	ఆ సర్వభూతములను
సర్వభూతాని	=	సకల భూతములు	పునః	=	మరల
మామికాం	=	నా సంబంధమైన	అహం	=	నేను
ప్రకృతిం	=	మాయను	విసృజామి	=	సృష్టిస్తున్నాను
యాంతి	=	పొందుతాయి			

కౌన్తేయా! ఈ సమస్త భూతాలు కల్పాంతము నందు నా ప్రకృతిలో కలిసి పోతాయి. అలా విలీన మైన వాటిని కల్పము మొదలు కాగానే తిరిగి నేనే సృష్టిస్తూ ఉంటాను.

వ్యాఖ్య

జగత్తు ఉంది అంటే, సత్తావంతముగా ఉంది. జగత్తు లోని సత్తా స్ఫురణలు జగత్తుకు సంబంధించినవి

కావు. పరమేశ్వరుని సత్తా చేత సత్తావంతము లైన భూతములు పరమేశ్వరుని యందే ఉన్నాయి. **సదాయతనాః సత్ప్రతిష్ఠాః** - ఏ సత్తా ఆధారమో ఆ సత్తా యందే ఉన్నాయి. కనుకనే, **మత్స్థాని సర్వభూతాని** - భూతము లన్నీ నా యందే ఉన్నాయి అన్నాడు భగవానుడు. ఇది భూతముల స్థితి కాలము.

స్థితి కాలములో పరమేశ్వరుని యందు ఉన్న భూతజాలము ప్రళయంలో లయించి పోతున్నాయి. ఎక్కడ లయిస్తున్నాయి? నాలో లయించడం లేదు, నా ప్రకృతిలో లయిస్తున్నాయి అంటున్నాడు. ఇక్కడే మీమాంస.

మట్టి నుండి కుండ తయారై నపుడు, మట్టి వల్లనే కుండ సత్తావంత మైంది. పగిలి నపుడు తిరిగి మట్టిలో కలిసి పోతుంది. అంతేగాని, మరొక దానిలో కలిసి పోవడం లేదు. కాని, ఇక్కడ భూతములు మాత్రం స్థితిని పరమేశ్వరుని యందే పొంది, లయంలో పరమేశ్వరుని ప్రకృతిలో కలిసి పోతున్నాయి.

ప్రళయము అంటే బ్రహ్మ ప్రళయము. ప్రళయములో బ్రహ్మోపదేశము ద్వారా క్రమముక్తిని పొందిన ముక్త పురుషులు తరించి పోతున్నారు కనుక వారు తిరిగి జన్మించరు. అలా తరించని జీవులు కల్పారంభంలో తిరిగి పుడుతారు. కాకపోతే, స్థితి హేతుత్వము ఈశ్వరు డైనపుడు, లయ హేతుత్వము ప్రకృతి అని ఎందుకు చెప్పవలసి వచ్చింది? ఇదే అర్థం కావాలి.

లయ హేతుత్వము

జగత్తు బ్రహ్మము వల్లనే సత్తావంత మైనా, సృష్టి స్థితి లయాలలో అసంగుడైన బ్రహ్మమునకు, కల్పిత ప్రపంచముతో సంశ్లేషము లేదు అని ఇప్పటికే గ్రహించి ఉన్నాము. ప్రపంచము నామరూపాత్మకంగా ఉంది కనుక, అది మిథ్య అని తెలుసుకున్నాము. ప్రపంచము మిథ్యా రూపంగా ఉన్నప్పుడు అది ప్రళయంలో దేనితో కలవాలి? మిథ్యా కార్యమైన ప్రపంచానికి మిథ్యా కారణమే హేతువు కనుక, ప్రళయంలో మిథ్యా ప్రపంచం మిథ్య లోనే కలవాలి. అదే ప్రకృతి లేదా మాయ.

మాయ అనేది త్రిగుణాత్మిక శక్తి. అదే పరమేశ్వరుని శక్తి. కనుక, మాయకు స్వతంత్ర మనుగడ లేదు. అది బ్రహ్మమును ఆశ్రయించుకొని ఉంది. బ్రహ్మముపై ఆధారపడి ఉంది. సత్యం, జ్ఞానం, అనంతమైన బ్రహ్మము మాయతో కూడినపుడు ఆయన ఈశ్వరుడు అవుతాడు. ఆయనే సృష్టి కారణము. అంతేగాని, సచ్చిదానంద పరబ్రహ్మము సృష్టి కారణము కాదు.

మాయను ఉపాధిగా కలిగిన ఈశ్వరుడు సృష్టికి కారణ మవుతున్నాడు. స్థితి హేతుత్వము కూడా తానే. జీవులము మాయాధీనులమై ఉన్నాము. కాని, ఈశ్వరుడు మాయను తన అధీనంలో ఉంచుకొని యున్నాడు. ఆ మాయే ప్రస్తుత శ్లోకంలో ప్రకృతి.

మాయాం తు ప్రకృతిం విద్ధి మాయినం తు మహేశ్వరమ్ (శ్వేతాశ్వతర ఉపనిషత్తు).

మాయయే ప్రకృతి. ఆ మాయను తన అధీనంలో ఉంచుకున్న మాయావి మహేశ్వరుడు. ముఖ్యంగా ఒక్క విషయాన్ని ఇక్కడ మనం స్పష్టంగా అర్థం చేసుకోవాలి. మాయకు ఒక ప్రత్యేక మనుగడ లేదు అనేది మరచి పోకూడదు. బ్రహ్మము కన్నా వేరుగా మాయ లేదు.

జగత్తుకు, భూతాలకు మాయే ఉపాదాన కారణము. బ్రహ్మము ఉపాదానం అన్నప్పుడు, ఉపాదాన కారణ మైన బ్రహ్మము జగత్తుగా పరిణామం చెందితే, ఆ తరువాత బ్రహ్మము యొక్క అస్తిత్వమే ప్రశ్నార్థక మవుతుంది.

కనుక ఉపాదానం అన్నప్పుడు, ఎటువంటి ఉపాదానము? అనే ప్రశ్న పుడుతుంది. సృష్టికి బ్రహ్మము 'వివర్త ఉపాదాన'మే గాని 'పరిణామీ ఉపాదానం' కాదు. తన స్వరూపాన్ని విడిచి పెట్టకుండా సర్పమునకు రజ్జువు

ఉపాదానం కావడం వివర్త ఉపాదానము. తన స్వరూపాన్ని పరిత్యజించి, పాలు పెరుగు అయినట్లు ఉపాదానం కావడం పరిణామీ ఉపాదానము.

సర్వజ్ఞుడైన ఈశ్వరుడు నిమిత్త కారణంగా శోభిస్తూ మాయోపాధి ద్వారా సృష్టికి కారణ మవుతున్నాడు. మాయ నుండి ఉత్పన్నం కావడం చేత భూతములు కల్పక్షయంలో మాయనే పొందు తున్నాయి. అదే ప్రకృతిలో విలీనం కావడ మంటే ***(సర్వ భూతాని ప్రకృతిం త్రిగుణాత్మికామ్ యాన్తి మామికాం మదీయాం కల్పక్షయే ప్రళయ కాలే).***

సృష్టి హేతుత్వము

కల్పక్షయంలో లయించిన భూతములు తిరిగి కల్పాదిలో మాయ నుండే పుడితే, సృష్టి స్థితి లయాదులు ఈశ్వరాధీనం తప్పినట్లే కదా? సృష్టి కార్యానికి మాయ ఎలా నిమిత్త కారణ మవుతుంది? అంటే, జడమైన మాయకు సర్వజ్ఞత్వ, సర్వశక్తిమత్వ, సర్వవ్యాపకత్వాలు ఉన్నాయా?

పోనీ సర్వజ్ఞుడైన ఈశ్వరుడే నిమిత్త కారణంగా ఉండి, మాయను ఉపాధిగా గ్రహించి, తన అధీనంలో ఉన్న మాయాశక్తి చేత సృష్టి కార్యాన్ని కల్పాదిలో నిర్వహిస్తాడు అని అంటే, పరమేశ్వరునికి కర్తృత్వము ఉన్నట్లే కదా? అనే సందేహము కలుగుతుంది.

సృష్టి మాయా కార్యమే. మాయ త్రిగుణాత్మికము, జడమే అయినా, ఈశ్వర సన్నిధాన బలం చేత, అయస్కాంత సన్నిధిలో ఇనుపముక్క కదిలినట్లు, మాయ కార్యోన్ముఖ మవుతుంది. మాయ అనినా మిథ్య అనినా ఒక్కటే. మాయకు ఎలా స్వతంత్ర మనుగడ లేదో, మిథ్యా జగత్తుకు కూడా స్వతంత్ర మనుగడ లేదు.

మాయ చాలా విచిత్ర మైంది. అదొక గారడి. అందుచేతనే, మాయను తన అధీనంలో ఉంచుకున్న ఈశ్వరుణ్ణి మాయావి అన్నారు. మాయావి అనే పేరు గల మహేశ్వరుడు, మాయా కార్యాన్ని (సృష్టి కార్యాన్ని) నిర్వహిస్తూ ఉంటాడు ***(మాయావి నామపి మాయా కారిత్వాత్ మాయావీ).*** కనుకనే, నా మాయ దాటశక్యం కానిది అని చెప్పే ఉన్నాడు *(7 - 14).*

మాయను సంస్కృతంలో ***యా మా సా మాయా*** అని నిర్వచిస్తూ ఉంటారు. అంటే, ఏదైతే లేదో అదే మాయ అని అర్థము. జగత్తు సృష్టి. సృష్టి మాయా కార్యము. సృష్టిలో దేనిని విచారించి చూచినా, అది లేనిదే అవుతుంది. అదే మాయ. అదే గారడి. దేశకాలాదులు సృష్టిలో ఉన్నాయి. అవి ఏమిటి అని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తే, అవి కనిపించవు. అదే మాయ.

ఏ వస్తువైనా అంతే. కుండ ఏమిటి? మట్టే కదా! కుండలో మట్టి కన్నా అన్యంగా ఏమీ లేదు కదా! ఇప్పుడు కుండ ఎక్కడుంది? మట్టి పైన ఉందా? మట్టి క్రింద ఉందా? మట్టి లోపల ఉందా? మట్టి బయట ఉందా? మట్టి ప్రక్కన ఉందా? అక్కడ కుండ ఏది? మట్టే ఉంది. మట్టి ఎలాగూ కుండ కాదు. మరి మట్టి ఏమిటి? అని ఆలోచిస్తే, అణువులు అని తేలుతుంది. ఇలాగే శోధిస్తూ పోతే ఏదీ మిగలదు. ఏదీ ఉండదు. ఏదీ లేకపోయినా, అన్నీ ఉన్నట్లు చూపేదే మాయ. ఈ మాయనే ఉపాధిగా గ్రహించి, కల్పారంభమున పరమేశ్వరుడు సృష్టిని చేస్తున్నాడు.

సృష్టి హేతుత్వము మాయోపాధికము. కనుక, బ్రహ్మ యొక్క అసంగత్వానికి భంగం రాదు. చదవండి.

ప్రకృతిం స్వా మవష్టభ్య విసృజామి పునః పునః । 8
భూతగ్రామ మిమం కృత్స్న మవశం ప్రకృతే ర్వశాత్ ॥

ప్రకృతిం-స్వాం-అవష్టభ్య-విసృజామి-పునః-పునః
భూతగ్రామం-ఇమం-కృత్స్నం-అవశం-ప్రకృతేః-వశాత్

స్వాం	=	స్వకీయమైన	భూతగ్రామం	=	భూత సమూహమును
ప్రకృతిం	=	ప్రకృతిని	పునః పునః	=	మరల మరల
అవష్టభ్య	=	వశపరచుకొని	ప్రకృతేః	=	ప్రకృతి యొక్క
అవశం	=	పరతంత్ర మైన	వశాత్	=	వశముచే
ఇమం	=	ఈ	విసృజామి	=	పుట్టిస్తున్నాను
కృత్స్నం	=	సమస్తమైన			

అర్జునా! ఈ సమస్త భూతజాలము ప్రకృతి అధీనము కనుక అస్వతంత్రము. నేను నా ప్రకృతిని వశ పరచుకొని ఈ భూతజాలాన్ని మళ్ళీ మళ్ళీ పుట్టిస్తూ ఉంటాను.

వ్యాఖ్య

ఆకాశములో చరించు వాయువు లాగా స్థితి కాలంలో భూతము లన్నీ పరమేశ్వరుని యందే ఉండినా ***(మత్స్థాని సర్వభూతాని).*** ప్రళయ కాలములో అవి ఈశ్వరుని యందు కాకుండా ఈశ్వర మాయలో లయిస్తున్నా యని గ్రహించాము. అలా మాయలో లయించి బీజ రూపమున ఉన్న ఆ సూక్ష్మ భూతములను మళ్ళీ సృష్ట్యాదిలో పరమేశ్వరుడు సృష్టిస్తూ ఉన్నాడు. ఈ విధమైన సృష్టి కార్యము మళ్ళీ మళ్ళీ జరుగుతూనే ఉంటుంది ***(పునః పునః).***

మరి, అసంగుడైన పరమేశ్వరునకు సృష్టి కార్యము ఎలా పొసగుతుంది? నిష్క్రియుడైన వాడు సృష్టి కార్యాన్ని ఎలా నిర్వర్తిస్తాడు? తన ప్రకృతిని ***(స్వాం ప్రకృతిం)*** వశ పరచుకొని ***(అవష్టభ్య)*** మళ్ళీ మళ్ళీ సృష్టిస్తూ ఉంటాడు ***(పునః పునః విసృజామి).*** తన ప్రకృతిని వశపరచు కోవడము అంటే తన మాయను అధీనంలో ఉంచుకోవడము అని అర్థము. అదే మాయోపాధి.

దేనిని సృష్టిస్తాడు?

మాయోపాధి గల ఈశ్వరుడు దేనిని సృష్టిస్తాడు? ఈ కనిపిస్తున్న **(ఇమం)** చరాచర భూత ప్రపంచము ***(భూతగ్రామం)*** సమస్తమును ***(కృత్స్నం)*** సృష్టిస్తాడు. అవ్యక్త మైన పరమేశ్వర చైతన్యము అవ్యక్త మైన మాయను ఉద్దీపింప చేసినపుడు ఈ దృశ్యమాన జగత్తు వ్యక్తమవుతూ ఉంది. భూతములు పుడుతున్నాయి.

పుట్టుక భూతముల కేనా? భగవంతునికి లేదా? జీవులు ఆవిర్భవించినట్లే ఈశ్వరుడు కూడా అవతరిస్తున్నాడు కదా! మరి ఇద్దరి పుట్టుకకు మాయే కారణమా?

పరమేశ్వరుడు పుట్టుక లేనివాడు. నాశము తెలియని వాడు. ప్రాణులకు ప్రభువు. అయినా, తన ప్రకృతిని ***(స్వాం ప్రకృతిం)*** ఆశ్రయించుకొని ***(అధిష్ఠాయ)*** పుడుతూ ఉంటాడు ***(సంభవామి)*** అని నాల్గవ అధ్యాయం ఆరవ శ్లోకంలో చూశాము. తన మాయను అదుపులో ఉంచుకొని మనల్ని సృష్టిస్తూ ఉన్న పరమేశ్వరుడు, తన మాయ చేతనే తాను కూడా పుడుతూ ఉన్నాడు ***(ఆత్మ మాయయా).***

తన యోగమాయను లేదా ఆత్మమాయను తన వశంలో ఉంచుకొని పరమేశ్వరుడు అవతరిస్తున్నాడు. జీవులు అలా కాదు. పరవశులై, అస్వతంత్రులై పుడుతున్నారు. కనుక జీవులది అవిద్యా మాయ. భగవంతునిది ఆత్మ మాయ. అసంగ పరబ్రహ్మ కర్మ సంబంధం లేకుండా స్వేచ్ఛగా అవతరిస్తే, జీవులు కర్మానుభవానికి, అస్వతంత్రులై, ప్రారబ్ధానికి తల వంచి పుడతారు. జీవేశ్వరుల ఆవిర్భావంలో ఇదే ప్రధానమైన తేడా.

దేని కొరకు సృష్టి ?

పరమేశ్వరుడు సృష్టి ఎందుకు చేసినట్లు? అసలు సృష్టే లేకుండా ఉంటే, జీవులకు ఈ తాపత్రయాలు ఉండేవి కావు కదా! అని ఈ సందర్భములో శ్రీ మధుసూదన సరస్వతి తమ గూఢార్థ దీపిక వ్యాఖ్యలో ఒక ప్రశ్న లేవనెత్తారు. తన భోగార్థం ప్రపంచాన్ని సృష్టించు కున్నాడు అనుకుందా మంటే, పూర్ణ రూపుడైన తనకు ఏమి లోపించిందని భోగార్థం సృష్టించు కుంటాడు? అదే వాస్తవ మైతే, పరమేశ్వరుడికి సంసారిత్వము ప్రాప్తించినట్లే కదా! పరమేశ్వరునిలో సంసారిత్వాన్ని ఊహించ గలమా? ఈశ్వరునిలో సంసారిత్వమును దర్శిస్తే, ఈశ్వరత్వ మునకు భంగము వాటిల్లినట్లే కదా! ఇంతకీ ఈ సృష్టి ఎవరి కొరకు?

బంధము ఉన్న వారికి మోక్షార్థము సృష్టి కార్యము జరిగింది అంటారు కొందరు. ఇది వాస్తవమా? బంధము సత్యమా? బంధము సత్యమైతే, దానికి విరోధి యైన మోక్షము అసత్య మవుతుంది కదా? అలాంటి మోక్షాన్ని పొంది ఏమి సాధించాలి? ఒకవేళ బంధము అసత్యము అనుకుందాం. అసత్యము అంటే లేనిదే కదా! మరి లేని బంధానికి మోక్ష మెందుకు?

కనుక, సృష్టి కార్యము భోగార్థము అని గాని, మోక్షార్థము అని గాని చెప్పేందుకు వీలు లేనందున, సృష్టికి మాయామయత్వము సిద్ధించింది. కనుక విషయం అవగత మైతే, మాయ ప్రతికూలము కాదు, కనుక పరిహరింప దగినది కాదు. అది కేవలం మిథ్య అని తెలియ జేయడానికే, నా ప్రకృతి *(ప్రకృతిం స్వాం)* అని చెప్పడం జరిగింది.

అవ్యక్తం వ్యక్తం కావడమే సృష్టి

ప్రళయ కాలంలో ప్రకృతిలో లయించిన జీవులు తమలో బీజరూపంగా ఉన్న వాసనలకు అనుగుణంగా తిరిగి జన్మిస్తూ ఉంటారు. ఇక్కడ గత జన్మలలో ఆచరించిన కర్మల లోని పుణ్యపాపాల ప్రభావం కూడా ఉంటుంది. వాటిని అనుసరించి తదనుగుణ మైన ప్రదేశాలలో జీవులు కర్మానుభవం కోసం పుడుతూ ఉంటారు.

మరి, ఈ విధమైన పుట్టుకలో కర్తృత్వం ఎవరిది? అనే ప్రశ్న పుడుతుంది. పరమేశ్వరుడు అకర్త కనుక ఆయనకు కర్తృత్వమును ఆపాదించడం కుదరదు. అలాంటప్పుడు కర్తృత్వం ఎవరిది? ప్రకృతిదే. ప్రకృతి జడం కదా? జడమైన ప్రకృతి సృష్టి కార్యాన్ని ఎలా నిర్వహించ గలుగుతుంది?

ప్రకృతి జడమే అయినా, పరమేశ్వరుని సన్నిధాన బలం చేత సృష్టిని చేయ గలుగుతుంది. అలాగే ప్రళయాన్ని కూడా సృష్టిస్తుంది. కార్యం ప్రకృతిదే అయినా శక్తి పరమేశ్వరునిది. అదే మాయాశక్తి.

అలాంటప్పుడు ఈ విధమైన కర్మలు ఈశ్వరుని బంధించవా? చెబుతున్నాడు.

న చ మాం తాని కర్మాణి నిబధ్నన్తి ధనఞ్జయ ।
ఉదాసీనవ దాసీన మసక్తం తేషు కర్మసు ॥ 9

న-చ-మాం-తాని-కర్మాణి-నిబధ్నంతి-ధనంజయ
ఉదాసీనవత్-ఆసీనం-అసక్తం-తేషు-కర్మసు

ధనంజయ	=	అర్జునా!	ఆసీనం చ	=	ఉన్న వాడనైన
తేషు	=	ఆ	మాం	=	నన్ను
కర్మసు	=	కర్మల యందు	తాని	=	ఆ
అసక్తం	=	సంగము లేని వాడను	కర్మాణి	=	కర్మలు
ఉదాసీనవత్	=	ఉదాసీనుడను	న నిబధ్నంతి	=	బంధించవు

ధనంజయా! నేను ఆ కర్మల యందు ఆసక్తి లేనివాణ్ణి. తటస్థంగా ఉండే వాణ్ణి. అందుచేత, కర్మలు నన్ను బంధించవు.

వ్యాఖ్య

ఏ కర్మ జరిగినా, దాని వెనుక కర్త ఉంటాడు. కర్మ చేసే కర్తకు ఆ కర్మకు సంబంధించిన జ్ఞానం ఉంటుంది. ఆ జ్ఞానమే కర్త చేత కర్మ చేయిస్తుంది.

'కర్మ చేయాలి' అని అనుకొనే కర్మ చేస్తాడు కనుక కర్మ యందు కర్తకు ఆసక్తి ఉంటుంది. ఆసక్తి లేనివాడు కర్మను చేయడు కదా! కర్మను ఆసక్తితో చేయడమే కర్తృత్వము. 'నేను చేయాలి అనుకున్న కర్మను చేశాను' అన్న భావన మనస్సును దృఢంగా పెనవేసుకో గానే అది అభిమానంగా మారుతుంది. అదే కర్తృత్వ అభిమానము.

కర్మను ఆసక్తితో ఎందుకు చేస్తాడు? తాను ఆ విధమైన కర్మను నిర్వహిస్తే, తద్వారా తాను ఆశించే ఫలం లభిస్తుంది అనే ఆశ ఉండటం చేత. అదే ఫలాశ. ఫలాసక్తి. కర్మ ఫలాసక్తి.

ఫలాసక్తి తోనే ఎవ్వరైనా కర్మ ఆచరిస్తారు. కర్మ చేస్తే ఫలం రాక తప్పదు. ఆ వచ్చిన ఫలం కర్త ఆసక్తిని తృప్తిపరచే దైతే ఫరవాలేదు. ఆశించింది కానపుడు నైరాశ్యం ఏర్పడుతుంది. ఫలాసక్తితో కర్మ నాచరించే కర్త పూర్ణజ్ఞానం కలవాడు కాకపోవడం చేత, ఆశించినవి ప్రాప్తించక పోవడమే ఎక్కువగా జరుగుతూ ఉంటుంది.

కర్మ ఏదైనా దేశ కాల ప్రయత్నాల చట్రము లోనే బిగించబడి ఉంటుంది కనుక పరిమితంగా ఉంటుంది. పరిమిత మైన కర్మ పరిమిత ఫలాన్ని ఇస్తుందే గాని జీవులు ఆశించే పూర్ణ ఫలాన్ని అందించ లేదు. ఇలా ఫలించిన కర్మలు ఒక విధంగా, ఫలించని కర్మలు మరో విధంగా జీవుల్ని దుఃఖానికి గురి చేస్తూ ఉంటాయి.

ఈ విధంగా సామాన్య కర్మలే జీవుల్ని బంధిస్తూ ఉంటాయి. మరి, పరమేశ్వరుడు సృష్టి స్థితి లయాది కర్మలకు కారణమై నపుడు అవి అతనిని బంధించవా? సర్వ భూతాలను వారి వారి కర్మలను దృష్టిలో ఉంచుకొని, పుణ్యకర్మలు చేసిన వారిని పుణ్య లోకాలకు, పాపకర్మలు చేసిన వారిని నరక లోకాలకు చేర్చుట అనే ఈ పుణ్యపాప కర్మ సంబంధాలు బంధహేతువులు కావా? అనే సందేహాన్ని నివారిస్తూ సమాధానం చెబుతున్నాడు.

ఈ సృష్టి స్థితి లయాదులు, సుఖదుఃఖాది ఫల ప్రదానములు ప్రకృతి వలన సంభవిస్తున్నాయే గాని, తన వలన కాదు అంటున్నాడు. తాను పనులలో ఆసక్తి లేని వాడుగా, ఫలాల యందు అభిరుచి లేని వాడుగా తనను తాను అభివర్ణించు కుంటున్నాడు. అందుచేత సర్గ స్థితి లయాది అద్భుత కర్మలు కూడా తనను బంధించవు అంటున్నాడు **(న చ మాం ఈశ్వరం తాని కర్మాణి నిబధ్నన్తి)**. కారణం కూడా చెబుతున్నాడు. సృష్ట్యాది కర్మలలో సంబంధము లేక పోవడమే కారణము అంటున్నాడు **(తత్ర కర్మాణామ్ అసంబద్ధత్వే కారణమ్)**. సంబంధము లేకపోవడానికి, ఉదాసీనుడుగా ఉండటము **(ఉదాసీనవత్ ఆసీనమ్)**. నిరాసక్తుడుగా మిగలడం - ఈ రెండే కారణాలు.

ఉదాసీనుడు

ఒక దానిని చూచి నపుడు అది మనకు ఇష్టమైన దైతే, మన మనస్సులో రాగ వృత్తి ఏర్పడి దానిని కాంక్షించడం జరుగుతుంది. ఒకవేళ అది మనకు అయిష్టమైన దైతే, మనస్సులో ద్వేష వృత్తి ఏర్పడి దానిని గర్హించడం జరుగుతుంది. కాని, అటు రాగము లేక, ఇటు ద్వేషము రాక, వస్తువును చూడగానే కేవలం వస్తు సంబంధమైన వృత్తి మాత్రమే మనస్సులో ఏర్పడింది అనుకోండి, ఆ పరిస్థితిలో మనస్సు లోని వృత్తిని తటస్థంగా చూడటం జరుగుతుందే గాని, రాగద్వేషాలు ఏర్పడవు. అలా తటస్థంగా చూస్తూ ఉండటమే ఉదాసీనత్వం. ఏ సంబంధం లేకుండా చూచే ఉపేక్షకుడే ఉదాసీనుడు **(ఉదాసీనః ఉపేక్షకః కశ్చిత్ తద్వత్ ఆసీనమ్)**. కర్మఫలము

వందు ఈ విధమైన ఉదాసీన నైఖరి ఉన్నట్లైతే, కర్మఫలము బంధించదు. పరమేశ్వరుడు సాక్షీ చైతన్యరూపుడు కనుక సదా ఉదాసీనుడై ఉంటాడు.

నిరాసక్తుడు

కర్మఫలము వందు ఉదాసీనంగా ఎలా ఉండగలడు అంటే, కర్మల యందు నిరాసక్తుడై ఉన్నాడు కనుక. తానే ఆత్మ అనే జ్ఞానం ఉన్నప్పుడు, సచ్చిదానంద స్వరూపమైన ఆత్మ అకర్తయే గాని కర్త కాలేదు. ఈ విధమైన ఆత్మజ్ఞానము కర్తృత్వాభిమానాన్ని నిర్మూలిస్తుంది. ఆత్మ పూర్ణం కనుక, తాను ఆత్మ యనే జ్ఞానం కల ఆత్మవిదునికి, ఆప్తకామునికి ఫలాసక్తి ఉండదు. కర్మల యందు కూడా ఆసక్తి ఉండదు ***(ఆత్మనః అవిక్రియత్వాత్, అసక్తం ఫలాసంగ రహితమ్, అభిమాన వర్జితమ్).*** కనుక, సృష్టి స్థితి లయాది కర్మల యందు ***(తేషు కర్మసు)*** పరమేశ్వరుడు అనాసక్తుడై, ఉదాసీనంగా ఉండటం చేత ఆ కర్మలు ఆయనను బంధించవు ***(న నిబధ్నన్తి).***

ఈ శ్లోకంలో అర్జునుణ్ణి, ధనంజయా! అని పిలిచాడు పరమేశ్వరుడు. ధర్మరాజు నిర్వహించిన రాజసూయ యాగానికి ధన సేకరణకు వెళ్ళి అక్షయ ధనాన్ని సేకరించినా, దాని మీద దృష్టి లేని నిరాసక్తుడు అర్జునుడు. అమూల్య ధనరాశులను ఉదాసీనంగా వీక్షించిన త్యాగమూర్తి. ***ధనం జయతీతి ధనంజయః*** - ధనమును జయించు వాడు ధనంజయుడు. ధనమును ఆర్జిస్తారు గాని జయించరు. కనుక, ఇక్కడ ధనమును జయించడము అంటే, ధనాశను జయించడము అని అర్థము. ధనాసక్తి లేనివాడు అని భావము. కనుక, ధనంజయా! అని సంబోధించి తద్వారా, కర్మలు బంధించని స్థాయికి నువ్వు కూడా చేరగలవు అని అర్జునుని ఉత్సాహ పరచాడు. అదే కదా జ్ఞాని వైభవము!

సంబోధన ద్వారా అచ్యుతుడు అర్జునునిలో ఉత్సాహాన్ని దించితే, ఈ శ్లోకంపై తమ వ్యాఖ్యానంతో ఆచార్యుల వారు మనందరిలో దివ్యంగా ప్రగతి పుష్పాలను పూయిస్తారు.

అతః అన్యస్యాపి కర్తృత్వ అభిమాన అభావః ఫల అసంగ అభావశ్చ అబన్ధ కారణమ్ - సృష్టి స్థితి లయాది కార్యాలలో పరమేశ్వరుడు ఎలా బంధానికి గురి కాలేదో, అలాగే ఏ వ్యక్తి అయినా కర్తృత్వాభిమానం లేకుండా, ఫలాసక్తి లేకుండా ఉండ గలిగితే, అతడు కూడా బంధానికి గురి కాడు అని శ్రీ శంకర భాష్యము.

మరి ఈ భూతజాలాన్ని నేనే సృష్టిస్తున్నాను అని ఒక వైపు చెబుతూ, మరో వైపు నేను ఉదాసీనంగా ఉన్నాను అని చెప్పడంలో వైరుధ్యము లేదా? లేనే లేదు. ఎలాగో చదవండి.

మయాఽ ధ్యక్షేణ ప్రకృతిః సూయతే స చరాచరమ్ । 10
హేతునాఽ నేన కౌన్తేయ జగ ద్విపరివర్తతే ॥

మయా-అధ్యక్షేణ-ప్రకృతిః-సూయతే-సచరాచరం
హేతునా-అనేన-కౌంతేయ-జగత్-విపరివర్తతే

కౌంతేయ	=	అర్జునా!
అధ్యక్షేణ	=	అధ్యక్షుడ నైన
మయా	=	నా చేత
ప్రకృతిః	=	ప్రకృతి
స చరాచరం	=	చరాచరములును
సూయతే	=	ప్రసవిస్తూ ఉంది
అనేన	=	ఈ
హేతునా	=	కారణము చేత
జగత్	=	జగత్తు
విపరివర్తతే	=	ప్రవర్తిస్తూ ఉంది

కౌన్తేయా! నన్ను అధ్యక్షునిగా పెట్టుకొని ఈ చరాచర జగత్తును ప్రకృతి సృష్టిస్తూ ఉంది. ప్రపంచం నడవడానికి ఇదే కారణం.

వ్యాఖ్య

ఆశంక

భూత సముదాయముతో నిండిన ఈ సమస్త ప్రపంచాన్ని నేనే మళ్ళీ మళ్ళీ సృష్టిస్తున్నాను ***(భూత గ్రామం ఇమం కృత్స్నం విసృజామి పునః పునః)*** అని ఎనిమిదవ శ్లోకంలో చెప్పి, సృష్టి విషయంలో నేను ఉదాసీనంగా ఉన్నాను ***(ఉదాసీనవ దాసీనం)*** అని వెంటనే తొమ్మిదవ శ్లోకంలో చెప్పడంలో విషయ వైరుధ్యం లేదా? నేను సృష్టి చేస్తున్నాను అని ఒక వైపు, నేను సృష్టిని చేయడం లేదు, తటస్థంగా ఉన్నాను అని మరొక వైపు ప్రకటించడం పరస్పర విరుద్ధం కాదా? అనేది సందేహము. ఈ సంశయాన్ని పరిహరించడం కోసమే ప్రస్తుతం, ***మయాఽ ధ్యక్షేణ*** శ్లోకం.

చూచేది - చేసేది

అర్జునా! అధ్యక్షుణ్ణి అయిన నా జ్ఞాన వెలుగును ఆశ్రయించుకొని **(మయా అధ్యక్షేణ)**, ప్రకృతి లేదా మాయ **(మమ మాయా త్రిగుణాత్మికా)** చరాచరమైన ఈ జగత్తును **(స చరాచరం జగత్)** పుట్టిస్తూ ఉంది **(సూయతే ఉత్పాదయతి)**. కౌంతేయా! నిమిత్తమాత్ర మైన ఈ అధ్యక్షత్వం అనే కారణం చేత **(హేతునా నిమిత్తేన అనేన అధ్యక్షత్వేన)** ఈ ప్రపంచ సృష్టి **(జగత్)** నడుస్తూ ఉంటుంది **(విపరివర్తతే)**. ఇదీ స్థూలంగా శ్లోకార్థం.

పరమాత్మ చేత ఉపహిత మైన ప్రకృతి, లేదా మాయ స్థావర జంగమాత్మక మైన ఈ సృష్టిని పుట్టిస్తూ ఉంది. పుట్టిన దానిని నిలుపుతూ ఉంది. అలాగే సంహరిస్తూ ఉంది అని శ్లోకం లోని పూర్వపాదం.

ఈ సృష్టి చరాచరాత్మకము. చరము అంటే జంగమము. అచరము అంటే స్థావరము. కదిలే ప్రాణులు చరములు. కదలని పర్వత, వృక్ష, లతా గుల్మాదులు అచరములు. సృష్టిలో ఇవన్నీ పుడుతున్నాయి. ఈ విధంగా ఆవిర్భవించిన ప్రపంచము పుట్టింది మొదలు లయించు వరకు నిరంతరము మార్పు చెందుతూ నడుస్తూ ఉంది. విపరిణామం చెందుతూ ఉంది **(జగత్ విపరివర్తతే)**.

సృష్టికి పరమాత్మ అధ్యక్షుడు. ప్రకృతి కర్త్రి. చేసేది ప్రకృతి. చూచేది పరమాత్మ.

మాయ త్రిగుణాత్మకము, అజ్ఞాన యుతము **(మాయా త్రిగుణాత్మికా అవిద్యా లక్షణా ప్రకృతిః)**. ఈ మాయే ప్రకృతి. పరమాత్మ సన్నిధానంలో ప్రకృతి ఈ సృష్టి కార్యాన్ని సాగిస్తూ ఉంది.

పరమేశ్వరుడు అంతటా వ్యాపించిన చైతన్య స్వరూపము **(సర్వతః దృశిమాత్ర స్వరూపః)**. వికార రహితమైన ఆత్మ స్వరూపము **(అవిక్రియాత్మ స్వరూపః)**. అట్టి పరమేశ్వరుని అధ్యక్షతన **(అధ్యక్షేణ)** సృష్టి సాగుతూ ఉంది.

ప్రకృతి సృష్టిస్తుంది. పరమాత్మ అధ్యక్షత వహిస్తాడు. అంతేగాని చేయడు. కేవలం ప్రకాశిస్తూ ఉంటాడు. ఏ కార్య భారం లేకుండా, కర్తృత్వము తెలియకుండా, దీపం లాగా పవిత్రంగా చూస్తూ ఉంటాడు. పరమాత్మ కేవలం భాసకత్వ వ్యాపారాన్ని విలక్షణంగా సాగించే వాడు. కార్య సహిత ప్రకృతిని, లేదా మాయను ప్రకాశింప చేయడం తప్ప అన్య వ్యాపారాలు లేనివాడు. సాక్షీమాత్రుడు.

సృష్టిని పరమాత్మ చేయడు. ఆయన క్రియాశూన్యుడు. పూర్ణ పురుషుడు. ప్రకృతి సృష్టిని చేస్తూ ఉంది. ఇలా సృష్టి కార్యాన్ని నిర్వహించే ప్రకృతి జడమా? చైతన్యమా?

ప్రకృతి జడము. ప్రకాశము లేనిది. పరమాత్మ ప్రకాశంతో ప్రవర్తించేది. మరి, జ్ఞాన రహితమైన జడ ప్రకృతి వివిధ ప్రత్యయ గమ్యమైన విశ్వాన్ని ఎలా సృష్టిస్తుంది?

పోనీ ప్రకృతి జడం కాదు చైతన్యమే, అందుచేత సృష్టి కార్యాన్ని సాగిస్తూ ఉంది అంటారా? అలా అనుకున్నా, ప్రకృతి చైతన్య మైతే మరి పరమాత్మ ఎవరు? జడమా? పరమాత్మ స్వప్రకాశ స్వరూపుడు అయినందువ, తాను చైతన్యమే గాని జడం కాదు.

మరి ప్రకృతి పరమాత్మలు ఇరువరూ చైతన్య స్వరూపులే అయితే, చైతన్యము అనేది ఏకమా? అనేకమా? రెండు చైతన్యాలు ఉన్నాయా? లేవు. మరి చైతన్యము ఒక్కటే అయితే, ప్రకృతి పరమాత్మలలో ఎవరు చైతన్యము? ఒకవేళ ఇరువురూ చైతన్యాలే అని చెబితే, ఎవరూ చైతన్యం కానట్లే కదా? నశించేది చైతన్యము ఎలా అవుతుంది? చైతన్యము అనంతం కదా! రెండు అనంతాలు ఉంటాయా? రెండు అనంతాలు ఉండే అవకాశం లేదు కనుక, రెండూ పరిమితాలై ఉండాలి. పరిమితాలు ఎప్పుడైనా, ఎక్కడైనా నశించేవే గాని, అనంతాలు కాలేవు.

కనుక, జ్ఞాన శూన్యమైన జడ ప్రకృతి సృష్టి కార్యాన్ని నిర్వర్తించ లేదు. అంతే కాదు. సృష్టిలో **ఇదం ఉత్పన్నం - ఇదం నష్టం** అనే ఉత్పత్తి నాశాలు, ప్రవృత్తి నివృత్తులు, ఇష్టానిష్ట సుఖదుఃఖాదులకు సంబంధించిన జ్ఞానము తెలుస్తూ ఉండేటప్పుడు, అలాంటి జ్ఞానపూరితమైన సృష్టిని జడ ప్రకృతి చేయగలదా? చేయలేదు. కనుక, నియమించ లేదు. అయితే, జ్ఞానరూపుడైన పరమాత్మే ఈ సృష్టిని చేసి ఉండాలి. ఇందులో ఇక సంశయ మెందుకు? ఆయనే స్వయంగా ఒప్పుకున్నాడు కదా! నేనే సృష్టిస్తున్నాను అని తెగేసి మరీ చెప్పు కున్నాడు కదా! *(9 - 8).*

ఆ మాట మీదే ఆయన నిలబడి ఉంటే, చేసిన ప్రతిజ్ఞకు తాను కట్టుబడి ఉంటే, మనలో ఈ మీమాంస తలెత్తేదే కాదు. నేను సృష్టిస్తున్నాను అని చెప్పిన నోటి తోనే నేను సృష్టి చేయడం లేదు, సృష్టి విషయంలో నాకు ఆసక్తి లేదు, నేను కేవలం తటస్థంగా ఉన్నాను అని ఔదాసీన్యాన్ని ప్రదర్శించడం వల్లనే విషయం తారుమారైంది. గొంతులో పచ్చి వెలగకాయ పడింది.

పరమేశ్వరుడు చైతన్యరూపుడు కనుక ఏదీ చేయడు. చైతన్యం లేకుండా ప్రకృతి ఏదీ చేయలేదు. పరమాత్మ చలించడు. ప్రకృతి చలించ లేదు. కాని, తనకు తానుగా చలించ లేని ప్రకృతి, సూదంటు రాయి సన్నిధిలో, కదల లేని ఇనుప సూది కదిలినట్లు కదుల్తూ ఉంది. ఆ కదలికే సృష్టి కార్యాన్ని నిర్వహించి, సృష్టికి కారణ మవుతూ ఉంది. ఈ విధంగా పరమేశ్వరుని అధ్యక్షతన ప్రకృతి స్థావర జంగమాత్మక మైన ఈ జగత్తును సృష్టించి, స్థితి స్థాపనం చేసి, లయింప చేస్తూ ఉంది.

మరి, ఈ విధంగా ప్రకృతి, లేదా మాయ సృష్టి కార్యాన్ని నిర్వహించే టప్పుడు, నేను సృష్టిస్తూ ఉన్నాను ***(విసృజామి)*** అని పరమేశ్వరుడు ఎలా చెబుతాడు? ఇదే ఇక్కడ వైరుధ్యం ***(విరుద్ధం ఉచ్యతే).***

సృష్టి ప్రకృతి కార్యం అని అర్థం చేసుకున్నాం కదా! ప్రకృతి అంటే మాయ. మాయా కార్యమైన సృష్టి మాయ కన్నా అన్యం కాదు. మరి, జడరూపమై, త్రిగుణాత్మక మైన మాయకు స్వతంత్ర మనుగడ ఉందా? లేదు. మాయ యొక్క ఉనికే బ్రహ్మమును ఆశ్రయించుకొని ఉంది ***బ్రహ్మాశ్రయా సత్త్వరజస్తమో గుణాత్మికా మాయా అస్తి.*** సృష్టి మాయా కార్యము. మాయ బ్రహ్మమును ఆశ్రయించుకొని ఉంది. మాయే కాదు, బ్రహ్మము అద్వయ సత్తా స్వరూపము కనుక, ఏదీ బ్రహ్మమునకు దూరం కాదు. ఇక మాయ ఎలా దూర మవుతుంది? మాయ బ్రహ్మమునకు దూరం కానపుడు, మాయను కారణంగా కలిగిన సృష్టి కార్యము తాను కూడా మాయకు దూరం కాలేదు కనుక, కారణమైన మాయ ఎప్పుడైతే పరమేశ్వరుని అధీనంలో ఉందో,

కార్యరూపమైన జగత్తు కూడా పరమేశ్వరునికి దూరం కాలేదు. ఈ కారణంగా, నేనే సృష్టి చేశాను అంటున్నాడు పరమేశ్వరుడు.

మాయ పరమేశ్వరునికి ఉపాధి కావడం చేత, మాయోపాధి స్థాయి నుండి 'నేను సృష్టికి కర్తను' అని పరమేశ్వరుడు చెబుతున్నాడు. అదే సమయంలో బ్రహ్మము స్థాయి నుండి, అంటే కేవలం శుద్ధ చైతన్య స్థాయి నుండి తన ఉదాసీనతను ప్రకటిస్తూ ***అహం అకర్తా*** - 'నేను సృష్టికి కర్తను కాను' అంటూ కర్మ యందు అకర్మను దర్శింప చేస్తున్నాడు *(5 - 18).*

భాస్య భాసక సంబంధము

మాయ అవిద్యా రూపము. తిమిర స్వరూపము. ప్రకాశము లేనిది. అంటే, జ్ఞాన రహిత మైనది అని అర్థము. చీకటిలో ఉన్న వస్తువు దీప సన్నిధిలో ప్రకాశించినట్లు, పరమాత్మ సన్నిధిలో సృష్టి, సృష్టి కారణమైన మాయ ప్రకాశిస్తున్నాయి. పరమాత్మలో ప్రకాశకత్వమే గాని ప్రవర్తకత్వము లేదు. కనుక, సృష్టిలో జరిగే కార్యాలకు పరమేశ్వరుడు విలక్షణుడు. నిర్లేపంగా ఉండేవాడు.

సూర్యుడు ప్రకాశిస్తూ ఉండటం వల్ల సర్వ ప్రాణులకు ప్రవృత్తి నివృత్తులు సిద్ధిస్తున్నాయి. అలాగే పరమేశ్వరుడు అధ్యక్షుడుగా ఉండటం చేత, ఆయన సన్నిధి బలం చేత భూతాలకు సృష్టి లయాదులు జరుగుతూ ఉన్నాయి.

సూర్యుని ప్రకాశంలో సమస్త కార్యాలు సాగుతూ ఉండినా, తన ప్రకాశంలో జరిగే ఉచితానుచిత కార్యాలతో సూర్యునికి ఎలా సంబంధం లేదో, అలాగే పరమేశ్వరుని సన్నిధిలో, ఆయన అధ్యక్షతలో సాగి పోయే ప్రకృతి కార్యాలలో కేవలం దృశిమాత్ర స్వరూపుడు (చైతన్య రూపుడు) అయిన భగవంతుడు సూర్యుని లాగా భాసకత్వ వ్యాపారమును మాత్రమే సాగిస్తూ, తటస్థంగా శోభిస్తూ ఉన్నాడు కనుక, ఆయన ఉదాసీనుడు. ఇక, **విసృజామి** (సృష్టిస్తున్నాను), **ఉదాసీనవ దాసీనం** (ఉదాసీనంగా ఉన్నాను) అనే ఈ రెండు విషయాలలో వైరుధ్యం ఎక్కడుంది? అందుచేతనే **మయా, అధ్యక్షేణ** అనే రెండు పదాలకు తృతీయాలు వాడటం జరిగింది.

మయా - నా చేత, **అధ్యక్షేణ** - అధ్యక్షుడ నైన నా చేత **(మయాఽ ధ్యక్షేణ: మయా, అధ్యక్షేణ)** అని రెండు తృతీయాలను ప్రయోగించాడు. మాయను అధీనంలో ఉంచుకొని, మాయోపాధిని కలిగి ఉన్నందున పరమాత్మ తన చేతనే సృష్టి జరిగిందని బోధించాడు **(విసృజామి).** మరొక వైపు, అవిక్రియాత్మ, దృశిమాత్ర స్వరూపమైన తన అధ్యక్షతన మాయ సృష్టిస్తూ ఉంది అనే భావంతో, క్రియాశూన్యమై, కేవలం ప్రకాశ స్వరూపంగా ఉన్న తనను ఉదాసీనునిగా ***(ఉదాసీన వత్ ఆసీనం)*** అభివర్ణించుకుంటూ జ్ఞానమయంగా శోభిస్తున్నాడు. ప్రకృతిలో ప్రవృత్తి అంతా జ్ఞాన ప్రధానమే! జ్ఞాన మూలకమే! జ్ఞాన పర్యవసానమే కదా!

జ్ఞాన పర్యవసాయి

సృష్టిలో ఏ కార్యము సాగినా, అది అలా సాగడానికి ముందు దానికి సంబంధించిన జ్ఞానం ఉంది. జ్ఞానము ననుసరించే కదా కర్మ సాగుతుంది! కనుక కర్మకు ముందే కర్మకు సంబంధించిన జ్ఞానం ఉంటుంది. జ్ఞానమునకు విషయం కావడం చేతనే సర్వ ప్రవృత్తులు సాధ్య మవుతున్నాయి. ఈ విషయాన్ని శ్రీశంకరభాష్యం, ***సర్వావస్థాసు దృశి కర్మత్వా పత్తి నిమిత్తా హి జగతః సర్వాప్రవృత్తిః*** అని అందంగా, అద్భుతంగా తన దైన శైలిలో వ్యాఖ్యానించింది.

అంటే, అన్ని అవస్థల లోను, అన్ని స్థాయిల లోను, అన్ని విషయాల లోను, సమస్త ప్రవృత్తులకు, దృక్కు కర్మగా అవడమే నిమిత్తంగా కలది, ***దృశి కర్మత్వాపత్తి నిమిత్తా.*** 'దృక్కు కర్మగా అవడమే నిమిత్తంగా కలది'

అంటే, జ్ఞానానికి విషయ మగుట అనే దానిని పొందుటను నిమిత్తంగా కలది అని భావము.

దీనినే కాస్త సులభంగా చెప్పుకుందాం. జ్ఞానరూపు డైన పరమాత్మ సన్నిధి బలం చేతనే జడమైన ప్రకృతి సృష్టి కార్యాన్ని నిర్వర్తిస్తూ ఉంది. మరి, మాయా కార్యమైన సృష్టిలో జరిగే కార్యాలన్నీ జ్ఞానమూలకాలే కదా! అదే అసలు విషయం.

నేను దీనిని తింటాను *(అహ మిదం భోక్ష్యే).* దీనిని చూస్తున్నాను *(పశ్యామి ఇదమ్).* ఇది వింటున్నాను *(శృణోమి ఇదమ్).* ఈ సుఖాన్ని అనుభవిస్తున్నాను *(సుఖమ్ అనుభవామి).* ఈ దుఃఖాన్ని అనుభవిస్తున్నాను *(దుఃఖమ్ అనుభవామి).* దాని కోసం ఇది చేస్తాను *(తదర్థం ఇదం కరిష్యామి).* దీని కోసం ఇది చేస్తాను *(ఏత దర్థం ఇదం కరిష్యే).* ఇది తెలుసుకుంటాను *(ఇదం జ్ఞాస్యామి).* ఈ వాక్యాలన్నీ ఏమిటి? జ్ఞానరూపాలు కావా? జ్ఞాననిష్ఠలు కావా? జ్ఞానము నందే ఉనికి గలవి కావా? జ్ఞానము నందే లయించేవి కావా? అంతా అవగతియే. 'అవగతి' అంటే జ్ఞానము. పైన చూచిన వాక్యాలన్నీ జగత్తులో ప్రవృత్తికి సంబంధించినవి. అన్నీ జ్ఞాన మూలకం గానే ఉన్నాయి. జ్ఞాన పర్యవసానం గానే ఉన్నాయి *(ఇత్యాద్యా అవగతి నిష్ఠా, అవగత్యవసానైవ).*

జ్ఞానమునకు విషయం అగుటను పొందడమే నిమిత్తముగా గలది 'దృశికర్మత్వాపత్తి నిమిత్తము' అని గ్రహించాము. 'దృక్' అంటే వీక్షించుట, తెలియుట అని అర్థము. ప్రపంచం లోని విషయాలు దృక్‌కు కర్మలు అయినప్పుడే ప్రపంచ వ్యవహారం నడుస్తుంది. దృక్‌కు కర్మలు కావడము అంటే తెలియడం అనే క్రియకు విషయం కావడము. కాబట్టి దృక్ శక్తి, లేదా దృక్చైతన్యమే జగద్వ్యాపారా లన్నిటినీ నడిపిస్తూ ఉంది. ఈ దృక్చైతన్యమే బుద్ధిని ప్రభావితం చేసి, జ్ఞాన మూలకమై, కర్మాచరణకు కారణ మౌతూ ఉంది. అదే లేకపోతే ద్రష్ట ఉండడు. దృశ్యం మిగలదు.

చిచ్ఛాయావేశతః బుద్ధౌ భానం - ఈ చిచ్ఛక్తి, లేదా దృక్ శక్తి బుద్ధిని ఆవేశించడం చేతనే బుద్ధి చేతనమై ఆలోచించ గలుగుతూ ఉంది అని దృగ్దృశ్య వివేకము. బుద్ధి లోని భావాలే కర్మబీజా లవుతాయి. అంటే, సర్వ జగద్వ్యాపారాలకు బుద్ధి లోని జ్ఞానము కారణ మైతే, అట్టి బుద్ధికి చేతనత్వం దృక్చైతన్యం వల్ల కలుగుతూ ఉంది. బుద్ధిపై ఆధారపడి సమస్త కర్మలు నడుస్తున్నాయి. బుద్ధికి దృక్చైతన్యము వల్ల చేతనత్వము కలుగుతూ ఉంది. కనుక, సమస్తము లైన ప్రవృత్తులకు జ్ఞానమే మూలమై ఉంది. అదే పరమాత్మ చైతన్యం కనుక, ప్రకృతి సృష్టి కార్యాన్ని నిర్వహించినా, దానికి సత్తా స్ఫురణలు జ్ఞాన స్వరూపుడైన పరమాత్మ నుండే అందుతున్నాయి. ఆయన వెలుగు లోనే సర్వమూ వెలుగుతూ ఉంది.

తమేవ భాన్తం అనుభాతి సర్వం ।
తస్య భాసా సర్వ మిదం విభాతి ॥

'అది వెలుగుతూ ఉంది. సమస్తము దాని కారణంగా భాసిస్తూ ఉంది. ఈ సమస్తమూ దాని వెలుగు లోనే వెలుగుతూ ఉంది' అని కఠోపనిషత్తు. కనుక ప్రకృతి విషయంలో సూర్యుని లాగా, సత్తాస్ఫూర్తుల ప్రదానం వల్ల పరమేశ్వరునికి కర్తృత్వమును ఆపాదించినా, వాస్తవానికి ఆయన ఉదాసీనత్వానికి ఏ మాత్రము భంగం వాటిల్లడం లేదు. ఈ విషయాన్ని ప్రామాణికంగా ధృవ పరచేందుకు శ్రీ శంకరాచార్య స్వామి తమ భాష్యంలో శ్వేతాశ్వతర ఉపనిషత్తు లోని మంత్రాన్ని ఉటంకించారు. పరమాత్మ అధ్యక్షత్వాన్ని ఈ మంత్రం అద్భుతంగా ఆవిష్కరిస్తుంది.

ఏకో దేవః సర్వభూతేషు గూఢః సర్వవ్యాపీ సర్వభూతాంతరాత్మా ।
కర్మాధ్యక్షః సర్వభూతాధివాసః సాక్షీ చేతా కేవలో నిర్గుణశ్చ ॥

పరమేశ్వరుడు ఏకము. ప్రకాశైక రూపము **(ఏకో దేవః).** అవంతుడైన తనలో భేదానికి, ద్వైతానికి అవకాశం లేనందున ఆయన ఏకము. మాయ లేదా ప్రకృతి ఉండినా, పరమాత్మను ఆశ్రయించుకొని ఉన్నదే గాని స్వతంత్రంగా లేదు కనుక, జడమైన మాయకు ఆశ్రయమైన తనలో జడత్వానికి అవకాశం లేదని చెప్పడానికి **దేవః** అనడం జరిగింది. **దీవ్యతీతి దేవః - దివు క్రీడాయామ్.** ప్రకాశించే వాడే గాని ప్రవర్తించే వాడు కావందున ఆయన దేవుడు. అన్యంగా రెండవది లేనందున అద్వితీయుడు **(ఏకో దేవః).**

అద్వితీయుడైన పరమాత్మ ఎక్కడున్నాడు? అద్వితీయుడు ఎక్కడ ఉంటాడు? ఎక్కడా ఉండలేడు. అద్వయుడు కనుక అంతటా ఉంటాడు. అందరిలో ఉంటాడు **(సర్వభూతేషు).** మరి, అందరిలో ఉంటే ఎందుకని కనిపించడు? ఎందుకని తెలిసి రాడు? అందరిలో ఉన్నాడు. కాని నిగూఢంగా ఉన్నాడు. గుహ్యంగా ఉన్నాడు. రాజగుహ్యంగా ఉన్నాడు. కేవలం జ్ఞానరూపంలో ఉన్నాడు కనుక, జ్ఞానం కల వారికి ప్రత్యక్షంగా ఉన్నాడు. అలాగని జ్ఞానం లోపించిన వారికి లేనివాడు కాడు. ఉన్నవాడే. కాని నిగూఢంగా ఉన్నవాడు **(సర్వ భూతేషు గూఢః).**

సమస్త భూతముల యందు ఉన్నా, బుద్ధి లోనే ఉన్నట్లు తెలుస్తాడు. అద్వయుడైన పరమాత్మ ఎక్కడ లేకుండా ఉంటాడు? ప్రకృతి కార్యమైన జగత్తులో సర్వత్ర వ్యాపించి ఉన్నా, సర్వత్ర దర్శనీయం కాడు. బుద్ధి యందే తెలుస్తాడు.

సదా సర్వగతోఽ ప్యాత్మా న సర్వత్ర అవభాసతే,
బుద్ధౌ ఏవావ భాసతే స్వచ్ఛేషు ప్రతిబింబవత్ ॥

పరమాత్మ సర్వత్ర వ్యాపించి ఉన్నా, అన్ని చోట్ల వ్యక్తం కావడం లేదు. స్వచ్ఛమైన అద్దం లాంటి వస్తువు నందే ప్రతిబింబము గోచరించునట్లు, శుద్ధ బుద్ధి యందు మాత్రమే వ్యక్త మౌతున్నాడు అని ఆదిశంకరుల ఆత్మబోధ.

కనుక, బుద్ధ్యాదుల యందే పరమాత్మ ప్రతిఫలిస్తూ ఉండటం వల్ల, బుద్ధ్యాదులు పరిచ్ఛిన్నం కావడం చేత, ఆ పరిచ్ఛిన్నత్వ దోషం పరమాత్మకు లేదని చెప్పడానికే **సర్వవ్యాపీ** అనడం జరిగింది.

పరమేశ్వరుడు సర్వవ్యాపి. సర్వ కారణమైన సర్వేశ్వరుడు సర్వత్ర ఉండక తప్పదు కనుక ఆయన సర్వవ్యాపి **(కారణత్వేన వ్యాప్తత్వాత్ సర్వత్ర).** సృష్టికి అభిన్న నిమిత్త ఉపాదాన కారణం కావడం చేత ఆయన సర్వవ్యాపి.

మరి ఆకాశము కూడా సర్వత్ర ఉంది కదా అనే అతివ్యాప్తి దోషాన్ని నివారించడం కోసం **సర్వ భూతాంతరాత్మా** అనడం జరిగింది. ఆకాశం లాగా జడం కాకుండా సర్వ భూతాంతరాత్మగా పరమాత్మ చైతన్య రూపుడు. అలాగే కర్మల విషయంలో జీవుల లాగా కర్మ పరాధీనత్వము లేదు అనడానికి **కర్మాధ్యక్షః** - కర్మాధ్యక్షునిగా, సృష్టి కార్యాధ్యక్షునిగా పేర్కొనడం జరిగింది.

కర్మాధ్యక్షు డైన తానే కర్మసాక్షిగా ఉన్నాడు. భావ సాక్షిగా ఉన్నాడు. సత్తాస్ఫూర్తి ప్రదాత కనుక భూతము లన్నీ తన లోనే ఉన్నాయి **(మత్‌స్థాని సర్వభూతాని).** ఎవరిలో సర్వభూతాలు ఉన్నవో, సర్వభూతాలలో ఎవరు స్థిరంగా భాసిస్తున్నారో ఆయనే సర్వభూతాధి వాసుడు **(సర్వభూతాధి వాసః).**

చైతన్య స్వరూపుడు **(దృశిమాత్ర స్వరూపః)** కావడం చేత పరమాత్మ దర్శన కర్త **(సాక్షీ).** జ్ఞానరూపుడై నందున చేతనము **(చేతా).**

అలాంటి వాని కన్నా అన్యు లెలా ఉంటారు? తానే విజాతీయ భేద రహితంగా ఉంటాడు **(కేవలః).**

సజాతీయ, స్వగత భేదాలు కూడా లేనివాడు కావడం చేత పరమాత్మ నిర్గుణుడు ***(నిర్గుణః)***. చివరగా సర్వ విశేష శూన్యుడుగా అభివర్ణించ వచ్చు. అదే చ కారార్థము.

వ్యష్టి చైతన్యమే సమిష్టి చైతన్యము

స్థావర జంగమాత్మక మగు ఈ సృష్టి సర్వాధ్యక్షుడు, చైతన్య రూపుడు అయిన అద్వయ పరబ్రహ్మము యొక్క అధ్యక్షతన విపరిణామం చెందుతూ ఉంది ***(తతః ఏకస్య దేవస్య సర్వాధ్యక్ష భూత చైతన్య మాత్రస్య)***.

సాక్షీభూత చైతన్య రూపుడైన పరమాత్మ అధ్యక్షతన సమిష్టి సృష్టి కార్యము జరిగినట్లు, జగద్వ్యాపారములు జరుగుతున్నట్లు, వ్యష్టిలో ఆత్మ చైతన్యము యొక్క అధ్యక్షత లోనే దేహేంద్రియ మనోబుద్ధుల లోని సమస్త కార్యాలు జరిగి పోతున్నాయి. ***అస్య అధ్యక్షః పరమే వ్యోమన్*** - సృష్టికి అధ్యక్షతను వహించిన పరబ్రహ్మ చైతన్యమే వ్యష్టి హృదయంలో ఆత్మ చైతన్యంగా అధ్యక్ష స్థానంలో ఉంది.

ఆత్మ చేసేది కాదు. చేయించేది కాదు. ఆత్మ సన్నిధిలో దేహేంద్రియ మనోబుద్ధుల లోని సమస్త కార్యాలు సాగి పోతున్నాయి. ఇష్టానిష్ట సుఖదుఃఖాది జ్ఞానము సిద్ధిస్తూ ఉంది. చేసేది మనస్సు. చూచేది ఆత్మ. ఆత్మకు కర్తృత్వము లేదు; కారయితృత్వము లేదు. భోక్తృత్వము లేదు; భోజయితృత్వము లేదు. దాతృత్వము లేదు; దాపయితృత్వము లేదు.

సర్వ కారణమై ఉండి కూడా కార్యానికి అంటకుండా ఉదాసీనంగా ఉండటము పరమాత్మ వైభవ మైతే, సర్వ కార్యాలకు ఆధారమై ఉండి కూడా, దేనికీ అంటకుండా అకర్తగా శోభించడము ఆత్మ వైభవము.

మనిషి తింటూ ఉంటాడు. తిరుగుతూ ఉంటాడు. తినడం, తిరగడం దేహ ధర్మాలు. మనిషి చూస్తూ ఉంటాడు. వింటూ ఉంటాడు. చూడటము, వినడము ఇంద్రియ ధర్మాలు. మనిషి శ్వాసిస్తూ ఉంటాడు. శ్వాసించడం ప్రాణధర్మము. మనిషి ఆలోచిస్తూ ఉంటాడు. ఆలోచించడము మనోధర్మము.

దేహ ధర్మమైన గమనాన్ని ఆత్మ యందు ఆరోపించి నేను నడుస్తున్నాను అంటాడు. ఇంద్రియ ధర్మమైన వీక్షణాన్ని ఆత్మ యందు ఆరోపించి నేను చూస్తున్నాను అంటాడు. శ్వాసించడము అనే ప్రాణ ధర్మాన్ని ఆత్మ యందు ఆరోపించి నేను శ్వాసిస్తున్నాను అంటాడు. చింతించడ మనే మనోధర్మాన్ని ఆత్మ యందు ఆరోపించి నేను ఆలోచిస్తున్నాను అంటాడు.

ఆత్మ దేహం కాదు. కాని, ఆత్మ సన్నిధి బలం చేత దేహం నడుస్తుంది. ఆత్మ సన్నిధి ప్రాప్తించ నపుడు దేహం శవ మవుతుంది. ప్రాణేంద్రియ మనస్సులు కూడా అంతే. ఈ సత్యం అర్థమైన జ్ఞాని, ఉపాధి ద్వారా చూడటం, వినడం, తాకడం, వాసన చూడటం, తినడం, తిరగడం, నిద్రించడం, శ్వాసించడం, భాషించడం, విసర్జించడం, గ్రహించడం, కళ్ళు మూయడం - తెరవడం, ఇలా సర్వ కార్యాలు జరిగి పోతున్నా, ఇంద్రియాలు ఇంద్రియ విషయాల యందు వర్తిస్తున్నాయే గాని నేను ఏమీ చేయడం లేదు అని భావిస్తాడు ***(ఇంద్రియాణి ఇంద్రియార్థేషు వర్తన్తే ఇతి ధారయన్, కించిత్ న ఏవ కరోమి ఇతి మన్యేత***; *5 - 8)*. అలాగే సమిష్టిలో జరిగే సృష్టి కార్యాన్ని, నా అధ్యక్షతలో ప్రకృతి, లేదా మాయ నడిపిస్తుందే గాని నేను కర్తను కాను అని పరమాత్మ ఉదాసీనంగా ఉంటాడు.

వ్యష్టిలో దేహేంద్రియ మనస్సులలో జరిగే సమస్త కార్యాలను ఆత్మ యందు ఆరోపించినట్లు, సమిష్టిలో ప్రకృతి సాగించే సృష్టి కార్యాన్ని పరమాత్మ యందు ఆరోపించడం జరుగుతూ ఉంది. క్రియా రూప వికారములు మాయకు సంబంధించినవే గాని మహిమకు సంబంధించినవి కావు. ఆత్మ ఎలా అకర్తయో, పరమాత్మ అలా ఉదాసీనుడు. ఆత్మ ఏదో కాదు. ఆత్మే పరమాత్మ. ఈ ఆత్మే బ్రహ్మము ***(అయమాత్మా బ్రహ్మ)***.

అవిద్యోపాధితో ఆత్మ కర్తగా తెలుస్తూ ఉండినా, చైతన్య స్థాయిలో అకర్తయే. మాయోపాధితో పరమేశ్వరుడు సృష్టికర్తగా తెలుస్తూ ఉండినా, చైతన్య స్థాయిలో అకర్తయే.

ఆరోపం అంతరిస్తే అంతా స్వరూపమే. ఆత్మ స్వరూపమే. భ్రమలు తొలగితే బ్రహ్మము బట్టబయలు. ఇదంతా ప్రమాణం ద్వారానే ప్రాప్తిస్తుంది. ప్రమాణ వైభవంతో శోభిస్తుంది. అదే శాస్త్ర ప్రమాణ వైభవము.

చరణము : **భ్రమలు లేవని నిరూపిస్తా - బ్రహ్మమే ఉందని వినిపిస్తా!**
ఉన్నది చైతన్యం అనిపిస్తా - ప్రమాణమై నీకు కనిపిస్తా!
పల్లవి : **హైలెస్సా . . . హైలెస్సా - వేదము నేనని తెలుసా!**
ఎన్నో ఎన్నో చెప్పి ఊరిస్తా - మరుక్షణమే బ్రతుకంతా మారుస్తా !

అని ప్రమాణ వైభవాన్ని కీర్తించింది చైతన్య గీతిక.

సృష్టి దేనికి?

అద్వయుడు అసంగుడు అయిన బ్రహ్మమునకు కర్తృత్వము లేనపుడు, భోక్తృత్వము, భోగ సంపర్కము లేనపుడు, అతని కన్నా వేరొకడు భోక్తగా ప్రత్యేకించి కనిపించ నపుడు ఈ సృష్టి ఎందుకు జరిగినట్లు? ఎవరి కోసం జరిగినట్లు? మాయామయ మైన ప్రపంచంలో **ఇదం ఉత్పన్నం - ఇదం నష్టం** అనేది లేదు కదా! ఇది పుట్టింది - ఇది పోయింది అనే దాని వల్ల ఒరిగిం దేమిటి? తరిగిం దేమిటి? ఎండమావులు ఎవరి దాహాన్ని తీర్చాయి? శుక్తి లోని రజతం ఎవరి దారిద్ర్యాన్ని హరించింది? ఇవన్నీ ప్రశ్నలు. సృష్టి స్వరూపము తెలిస్తే వీటన్నిటికీ ప్రతివచనాలు లభిస్తాయి. ఇంతకీ, ప్రశ్నే కాస్త తికమకగా ఉంది. అది కూడా చెప్పుకుందాం. పరిష్కారాన్ని, ప్రతివచనాన్ని అందుకుందాం.

సృష్టి ఎవరు చేశారు? ఎలా చేశారు? ఎవరు చేయకనే చేశారు? ఎవరు చేసినా చేయని వారయ్యారు? ఎవరు చేయలేక పోయినా చేశారు? చేసి చూడని వారెవరు? చూసి చేయని వారెవరు? - ఈ ప్రశ్నలన్నీ మిమ్మల్ని సమాధానాలతో కొంతవరకు తృప్తిపరచే ఉంటాయని భావిస్తున్నాను. కాకపోతే, ఈ సృష్టి ఎవరు చేసినట్లు? ఎలా చేసినట్లు? ఇత్యాది. విషయాలను ప్రక్కన పెడితే, ఈ సృష్టికి నిమిత్తం ఏమిటి? ***(కిం నిమిత్తా ఇయం సృష్టిః ఇతి)*** అనేదే ప్రధానమైన విషయం.

స్వభోగార్థమా?

పరమేశ్వరుని అధ్యక్షతన జరిగిన ఈ సృష్టి దేని కోసం జరిగింది? ఎవరి కోసం జరిగింది? ఉన్నది అద్వయుడైన పరమేశ్వరుడే అంటున్నారు కనుక ***(ఏకం ఏవ అద్వితీయం బ్రహ్మ)***. బహుశ సృష్టి అంటూ జరిగి ఉంటే ఆయన కొరకే జరిగి ఉండాలి. ఆయన భోగార్థమే జరిగి ఉండాలి.

కర్తృత్వమే లేని వాడికి భోక్తృత్వము ఎలా ప్రాప్తిస్తుంది? ఉద్యోగమే లేని వాడికి సంపాదనా ఫలాలు ఎలా అందుతాయి? పైగా, పరమార్థ రూపుడు, ప్రకాశైక స్వరూపుడు, పూర్ణ పురుషుడు, ఆప్తకాముడు అయిన పరమేశ్వరుడికి భోగార్థమే ముంటుంది? సర్వ భోగ స్పర్శ శూన్యుడే కదా ఆప్తకాముడు! కాబట్టి, ఈ సృష్టి పరమేశ్వరుని స్వభోగార్థము ఆవిర్భవించింది అని చెప్పడము నిర్హేతుకము. అనర్థ దాయకము. కనుక, 'స్వభోగార్థమే సృష్టి' అనే వాదము నిరస్తము.

చేతనాంతర భోగార్థమా?

చేతనమే భోక్త కాగలదు గాని అచేతనం భోక్త కాలేదు. సృష్టి స్వభోగార్థము కానపుడు, అది పర భోగార్థమై

ఉండాలి. ఆ పరుడెవ్వడో అతడు చేతనుడై ఉండాలి. పరమేశ్వరుని చైతన్యము కన్నా అన్యంగా మరొక చైతన్యము అశాస్త్రీయం కనుక, 'చేతనాంతర భోగార్థం' అనేది అసంభవము.

అచేతన భోగార్థమా?

చేతనానికి భోగము సాధ్యం కావడం లేదు కనుక, ఇక మిగిలింది అచేతనమే కాబట్టి, అచేతన భోగార్థమే సృష్టి జరిగిందా? అచేతనానికి భోగ మేముంది? బంధ మెక్కడుంది? ఇంతకీ అచేతనం ఎక్కడుంది? అచేతన మును నిరూపించడం సాధ్య పడుతుందా? ***నేహ నానాఽస్తి కించన*** ప్రమాణంతో అచేతనము అదృశ్య మవుతుంది కనుక 'అచేతన భోగార్థము' అనే ప్రతిపాదన పామరత్వానికి నిదర్శనం.

లీలార్థమా?

ఎక్కడ విషయం జటిల మైతే అక్కడ లీలను ప్రవేశ పెట్టడం పరిపాటి అయింది. అంతా లీల! పరమేశ్వరుని లీల! అంటూ ఆకాశాన్ని చూడటం అలవాటుగా మారింది. వాస్తవానికి ఇది లీల కాదు, పెద్దగోల.

లీలనం లీలా - లీల అంటే సంశ్లేషము ***(లీజ్ శ్లేషణే)***. ఇది సంబంధ సూచిత పదము. ***లయనం లీలా*** - కలయికను సూచించేది లీల. సంశ్లేషము అనగానే అద్వైతము ఆవిరై పోయింది కదా! ఎవరికి ఎవరితో సంశ్లేషము? రెండు ఉంటే కదా సంశ్లేషము!

లీలార్థము, క్రీడార్థము అనే పదాలు పలకడానికి లలితం గానే ఉంటాయి. వినడానికి సొంపు గానే ఉంటాయి. ఇంతకీ ఎవరి లీలార్థం? ఇంకెవరు? ఉన్న దొక్కడే కదా! భగవంతునికి లీలలు, విలాసాలు, విహారాలు, వినోదాలు అవసరమా? సృష్టిలో ఆయన లీలా విలాసాలు సాగించేది ఎవరితో? జీవుల తోనా! అంటే మన తోనా! మరి, ప్రపంచంలో జీవులు దుర్భర దుఃఖాలను అనుభవిస్తున్నారు కదా? అవన్నీ ఆయన లీలా ప్రసాదా లేనా? ఆయన వినోదంలో మనకు ప్రాప్తించేవి విషాదాలేనా? ఏమిటో! పిలకను ఎంతగా లాక్కున్నా, పీక్కున్నా, దోమ ఏనుగును అమాంతం మ్రింగినట్లే ఉంది. కనుక ఈ నాల్గవ పక్షము కూడా నిరర్థకమే. ఇక మిగిలింది ఒక్కటే. అదే మోక్షార్థం.

మోక్షార్థమా?

'అపవర్గము' అంటే మోక్షము. అపవర్గార్థము సృష్టి అనుకుందా మంటే, సృష్టి అపవర్గ విరోధి కనుక మోక్షార్థము అని చెప్పడానికి కూడా వీలు లేదు. పైగా మోక్షము నిమిత్తము అనగానే ఎవరి మోక్షము? అనే ప్రశ్న పడుతుంది. మోక్షము బ్రహ్మమునకా? బ్రహ్మము నిత్యముక్తుడు కావడం చేత మోక్షము బ్రహ్మమునకు కాదు. బ్రహ్మము కన్నా అన్యమైన వాడు లేనందున అన్యుని మోక్షార్థము అనేందుకు అసలే వీలు లేదు.

ఇంతవరకు మనం చూచిన దానిని బట్టి రెండు విషయాలు అర్థ మవుతూ ఉన్నాయి. (1) సర్వాధ్యక్షుడు, చైతన్య స్వరూపు డైన పరమాత్మ అద్వయుడు కావడం చేత ఏ భోగాల తోను సంబంధం లేనివాడై ఉన్నాడు. (2) తన కన్నా అన్యంగా మరొక చేతన పదార్థం లేనందున, వేరొక భోక్త ఉండే అవకాశమే లేదు కాబట్టి, ఈ సృష్టికి నిమిత్తం ఏమిటి? అనే ప్రశ్నే అర్థ రహితంగా ఉంది. కనుక, ప్రతివచనం కూడా నిరర్థకమే ***(ఏకస్య దేవస్య పరమార్థతః సర్వభోగా నభి సంబంధినః అన్యస్య చేతనాంతరస్య అభావే భోక్తుః అన్యస్య అభావాత్ కిం నిమిత్తా ఇయం సృష్టిః ఇతి అత్ర ప్రశ్న ప్రతివచనే అనుపపన్నే).***

మాయా కార్యమైన ఈ సృష్టి యొక్క స్వరూపాన్ని గాని, దాని ప్రయోజనాన్ని గాని, నిశ్చయించి చెప్పడానికి వీలు లేదు. మాయ అనిర్వచనీయం కావడమే దీనికి కారణం. ఇదే ఉపనిషత్ హృదయం.

శ్రుతి ప్రమాణము

సృష్టి మాయా కార్యము అని నిర్ధారణ చేయడం వల్లను, పరమాత్మ యందు నానాత్వము సంభవించదు అనే కారణం చేతను సృష్టి ఎందుకు? అనే ప్రశ్న గాని, అట్టి ప్రశ్నకు ప్రతివచనం గాని ఉపపన్నం కావు అనే విషయాన్ని నిర్ధారించే ప్రమాణవాక్యాలు ఋగ్వేద సంహిత లోను, తైత్తిరీయ బ్రాహ్మణము నందును విస్పష్టంగా ఉన్నాయి.

కో అద్ధా వేద క ఇహ ప్రవోచత్ కుత ఆజాతా కుత ఇయం విసృష్టిః

పరమాత్మ స్వరూపమును ఖచ్చితంగా తెలుసుకున్న వాడెవడు **(కో అద్ధా వేద)**? పరమాత్మ స్వరూపమును గూర్చి స్పష్టంగా చెప్పే వాడెవడు **(క ఇహ ప్రవోచత్)**? ఈ సృష్టి ఎక్కడ నుండి వచ్చింది **(కుత ఆజాతా)**? ఈ సృష్టి ఎందుకు వచ్చింది **(కుత అయం విసృష్టిః)**? అంటూ పరమాత్మ దుర్విజ్ఞేయత్వమును, అనిర్వచనీయ మైన మాయా స్వరూపమును వేదము లోని మంత్ర వర్ణాలు వివరిస్తున్నాయి. 'సృష్టి మాయా కల్పితము కనుక అనిర్వచనీయము, మిగిలిన ఏకైక సత్యం శుద్ధ చైతన్య స్వరూపమే' అనేది శ్రుతి నిర్ణయము.

అప్రామాణ్యము ప్రాప్తించదా?

అయితే, 'ఎవరి నుండి ఈ భూతములు ఆవిర్భవించాయో' **(యతో వా ఇమాని భూతాని జాయన్తే)** అనే తైత్తిరీయోపనిషత్తు ప్రవచనము, 'ఎవని నుండి సృష్ట్యాదులు కలిగినవో' **(జన్మాద్యస్య యతః)** అనే బ్రహ్మసూత్ర ప్రబోధము, 'నేనే సమస్త జగత్తునకు పుట్టుక స్థానమును' **(అహం సర్వస్య ప్రభవః)** అనే గీతా ప్రసంగము, ఇవన్నీ ఏమై పోవాలి? పై సిద్ధాంతం వల్ల శ్రుతి సూత్ర స్మృతులకు, అంటే ప్రస్థానత్రయానికి అప్రామాణ్యం ప్రాప్తించి నట్లే కదా? అనేది ఆక్షేపము. వాస్తవానికి ఈ ఆక్షేపము నిరాధారము.

ఇటువంటి సందర్భాల లోనే శాస్త్ర హృదయాన్ని, ముఖ్యంగా ప్రమాణ ప్రాశస్త్యాన్ని స్పష్టంగా అర్థం చేసుకోవాలి. బ్రహ్మ జగత్తుకు సృష్టికర్త అని నిర్ధారణ చేయడం శాస్త్ర తాత్పర్యం కాదు. ఉన్నది బ్రహ్మమే కనుక, బ్రహ్మము అద్వయము కనుక, అది నిష్ప్రపంచము అనే విషయాన్ని నిరూపించడమే శాస్త్రం యొక్క పరమార్థము.

అధ్యారోప అపవాద న్యాయ రీత్యా, ముందు బ్రహ్మము నందు జగత్తును అధ్యారోపం చేసి, ఆ తరువాత అపవాద యుక్తి చేత బ్రహ్మము నిష్ప్రపంచము అని నిర్ధారించడమే జగత్సృష్టి ప్రసంగానికి ప్రయోజనము. 'బ్రహ్మనాస్తి' అనే దోష ప్రస్తావనను నిరాకరించడానికే ***యతో వా ఇమాని భూతాని జాయన్తే*** ఇత్యాది వాక్య ప్రయోగము.

కనుక, ***అజ్ఞానే నావృతం జ్ఞానం తేన ముహ్యన్తి జంతవః*** - జ్ఞానం అజ్ఞానం చేత ఆవరించబడి ఉంది. ఈ కారణం చేత జీవులు మోహంలో కూరుకు పోతున్నారు అని ఐదవ అధ్యాయంలో ప్రవచించడం లోనే ఈ జగత్సృష్టి కేవలం మాయా కల్పిత మని సూచించడం జరిగింది. ఈ విషయాన్ని భాష్యంలో ఆచార్యుల వారు కూడా అంగీకరించారు.

ప్రమాణ ఫలం

అజ్ఞాన నివారణార్థం వృత్తి వ్యాప్తిని స్వీకరిస్తూనే, ఫలవ్యాప్తిని నిషేధించడం ద్వారా ప్రమాణము ఫలించి, బ్రహ్మాత్మజ్ఞానము సిద్ధిస్తుంది. శబ్దము సాక్షాత్తు బ్రహ్మమును బోధించదు. అజ్ఞానమును నివారించుట యందే

శబ్ద శక్తి ప్రబలంగా ఉంది. నిద్రించే వ్యక్తిని ఓ దేవదత్తా! అని పిలవగానే వాడు మేల్కొనినట్లు, 'తత్త్వమసి' వాక్యము జీవుణ్ణి అజ్ఞాన నిద్ర నుండి మేల్కొలుపుతుంది. అవిద్యను అంతం చేసే శబ్దం వల్ల 'నేనే బ్రహ్మమును' అనే జ్ఞానం కలుగుతుంది ***(అవిద్యా ఘాతి న శబ్దాత్ అహం బ్రహ్మేతి ధీ ర్భవేత్*** - సురేశ్వరాచార్యుల వార్తికము). కనుక మాయా కార్యమైన జగత్తు లోని అధ్యాసను తొలగించడం శాస్త్ర తాత్పర్యం కాదు. ఏది సత్యమో, అట్టి బ్రహ్మమును నిర్ధారణ చేయడమే శాస్త్ర ప్రయోజనము ***(అధ్యాస నివారణార్థం న శాస్త్ర పరనం, వస్తు నిర్ధారణార్థం శాస్త్ర పరనమ్*** - బ్రహ్మసూత్ర భాష్యము). ఈ విధంగా జిజ్ఞాసు వైన ముముక్షువునకు ప్రమాణ ఫలం అందుతుంది.

మాయ మాయమైంది

బృందావన సీమలో ఒక నాటి వెన్నెల రాత్రి గోపికలు శ్రీకృష్ణుని వెతుకు తున్నారు. ఎంతకీ శ్రీకృష్ణుడు కనిపించ లేదు. అంతలోనే గాలికి వృక్ష శాఖలు సవ్వడి చేశాయి. ఆ వైపు చూస్తే నల్లని నీడల జాడలు కనిపించాయి. కన్నయ్య అక్కడే దాగి ఉన్నాడని భావించి, పట్టుకొనేందుకు పరుగు లెత్తే సమయంలో, ఆకాశంలో మబ్బులు ఉరిమాయి. మెరుపులు మెరిశాయి. ఆ దివ్యమైన కాంతిలో చెట్ల మాటున కన్నయ్య లేడు అనేది స్పష్టమైంది. అంతే కాదు. కన్నయ్య తమ ప్రక్కనే ఉన్నాడని కూడా తెలిసి పోయింది.

ఉన్నచోట చూడాలి గాని, లేనిచోట అన్వేషిస్తే ప్రయోజనం ఏముంటుంది? చీకటిలో, అంటే విషయం అర్థం గాని సమయంలో, కృష్ణుడు లేని చోట ఉన్నట్లు భావించారు గోపికలు. ఉరుముల శబ్దంలో, మెరుపుల వెలుగులో లేనిచోట లేడని తెలియడమే గాక, అతడు ఉన్నచోటేదో స్పష్టంగా తెలిసింది.

మాయా కార్యమైన ప్రపంచంలో పరమాత్మను అన్వేషిస్తున్నా రందరు. ప్రయత్నాలు పెరుగు తున్నాయే గాని ఫలితం సిద్ధించడం లేదు. వేద ప్రమాణం, అంటే ఉపనిషత్ శబ్దంలో జ్ఞాన ప్రకాశం విరజిమ్మ బడగానే, బ్రహ్మము మాయా జగత్తులో ఎలా అలభ్యమో, తమ హృదయం లోనే ఎలా ప్రసిద్ధమో తెలిసి వస్తుంది. ఉన్నచోట చూస్తే సత్యం గోచరిస్తుంది గాని, లేనిచోట దేవులాడితే దేవుడు దొరుకుతాడా? కాంతి లోనే గోపకాంతలు రమాకాంతుని దర్శించారు. జ్ఞానం లోనే మనం సత్యదర్శనం చేయాలి.

చరణము: **మాకుల మాటున మాపటి వేళ - నల్లని నీడలు ప్రాకుతూ ఉంటే**
నల్లనయ్య యని పరుగిడు వేళ - ఆకసమున మెరుపులు ఏల?

పల్లవి: **వెన్నెల నవ్వుల గోపాల - వెన్నలు తినను రావేల!**
పువ్వుల సొగసు గాలికి తెలుసు - విరిసిన నా మనసు నీకే తెలుసు ॥ వెన్నెల ॥

అని కన్నయ్యను కాంతల కళ్ళ ముందు ప్రత్యక్షంగా నిలిపింది చైతన్య గీతం.

సంబోధనా రహస్యము

ఈ శ్లోకంలో అర్జునుని ***కౌన్తేయా!*** అని సంబోధించి ప్రసంగించాడు పరమేశ్వరుడు. 'కౌంతేయా! కుంతీకుమారా! విషయం కాస్త జటిలం. జాగ్రత్తగా అర్థం చేసుకో! నీకే అర్థం కాకపోతే, మరెవరికి అర్థ మవుతుంది? నాయనా! పాండు మామ అధ్యక్షతన మా అత్తమ్మ కుంతి నిన్ను ప్రసవించ లేదా? అలాగే నా అధ్యక్షతన ప్రకృతి ఈ చరాచర ప్రపంచాన్ని ప్రసవిస్తూ ఉంది' అనేదే ఇందులోని సూక్ష్మార్థం.

'ఇక నా విషయం అంటావా! చెప్పే దేముంది? నేను నిత్య శుద్ధ బుద్ధ ముక్త స్వరూపుణ్ణి. అదంతా నా వైభవము ***(యోగమ్ ఐశ్వరమ్).*** ఇది అర్థం గాని మూఢులు నన్ను మరోలా ఊహించు కుంటారు. అదీ చెబుతాను. విను!' అంటూ ప్రవహిస్తూ పోతోంది భగవానుని ప్రవచనామృతం.

అవజానన్తి మాం మూఢా మానుషీం తనుమాశ్రితమ్ ।
పరం భావ మజానన్తో మమ భూతమహేశ్వరమ్ ॥ 11

అవజానంతి-మాం-మూఢాః-మానుషీం-తనుం-ఆశ్రితం
పరం-భావం-అజానంతః-మమ-భూతమహేశ్వరం

మమ	=	నా యొక్క	మానుషీం	=	మానవ సంబంధమైన
పరం	=	ఉత్తమమైన	తనుం	=	దేహమును
భావం	=	భావమును	ఆశ్రితం	=	ఆశ్రయించిన
భూతమహేశ్వరం	=	భూతముల నియంతను	మాం	=	నన్ను
అజానంతః	=	తెలియని	అవజానంతి	=	అవమానిస్తున్నారు
మూఢాః	=	మూఢులు			

అర్జునా! నేను మానవ దేహంలో కనిపిస్తున్నా, వాస్తవానికి సర్వలోక మహేశ్వరుణ్ణి. నా ఉత్కృష్ట స్వరూపాన్ని తెలియని మూఢులు, నన్ను అలక్ష్యం చేస్తూ ఉంటారు.

వ్యాఖ్య

తినడానికి నోరుంటే చాలు. తిరగడానికి కాళ్ళుంటే చాలు. కానీ మనిషి దేనిని అర్థం చేసుకోవాలన్నా వివేకం ఉండాలి. అవివేకులు దేనినీ సరిగా అర్థం చేసుకోలేరు. ఎవరినీ సరిగా అర్థం చేసుకోలేరు. అటువంటి వారినే మూఢులు అంటారు. మూఢులు అంటే అవివేకులు అని అర్థం **(మూఢాః అవివేకినః).**

మూఢులు లేదా అవివేకులు సామాన్య మానవుల్నే సరిగా అర్థం చేసుకోలేరు. ఇక అవాఙ్మానస గోచరు డైన పరమేశ్వరుణ్ణి ఎలా అర్థం చేసుకోగలరు? అర్థం కాని చోట మిగిలేవి అనర్థాలే. ఫలితాలు అపార్థాలే.

భగవంతుడు శుద్ధ చైతన్యం అని అర్థం చేసుకున్నాం. మాయాతీత మైన మహిమ గల పరమాత్మ, సర్వభూతాలలో చైతన్య రూపమై శోభిస్తున్నా **(సర్వ జంతూనాం ఆత్మాన మపి).** సర్వ భూతాలకు మహాప్రభువై అలరారుతున్నా **(భూత మహేశ్వరమ్).** పరమోత్కృష్ట మైన ఆయన తత్త్వమును **(పరం భావమ్)** తెలుసుకోలేక ***(అజానన్తః)*** అవివేకులు **(మూఢాః)** ఆ మహాత్ముని అలక్ష్యం చేస్తూ ఉంటారు **(ఈశ్వరం అవజానన్తి).**

దురవగాహనలు - దుష్ఫలితాలు

మనస్సులో ఉన్న దానినే ఎవరైనా బయట చూస్తారు. మనస్సులో లేని దానిని బాహ్యంలో దర్శించడం అసాధ్య మని మనస్తత్త్వ శాస్త్రం. అందుచేతనే, ఒకొక్క సన్నివేశం ఒకొక్కరికి ఒకొక్క విధంగా అర్థమవుతూ ఉంటుంది. సన్నివేశం ఒక్కటే అయినా, దానిని పలువురు పలు విధాలుగా అర్థం చేసుకోవడానికి కూడా కారణం ఇదే.

సర్వాత్మ స్వరూపంగా సర్వేశ్వరుడు శోభిస్తున్నాడు. అది ఆయన సత్య స్వరూపం. సత్య స్వరూపాన్ని అర్థం చేసుకోవాలి అంటే, సత్యానికి సంబంధించిన అవగాహన అవసరం. అదే వివేకము. **ఇదం నిత్యం - ఇదం అనిత్యం -** ఇది నిత్యము, ఇది అనిత్యము అనే విచక్షణే వివేకము. సత్య స్వరూపుడైన పరమాత్మను అర్థం చేసుకోవాలి అంటే సత్యజ్ఞానం కలిగి ఉండాలి. మిథ్యా జ్ఞానంలో మునిగిన వాళ్ళు సత్యరూపుణ్ణి అర్థం చేసుకో లేరు.

ఆత్మ సత్యము. దేహాదులు మిథ్య. దేహమే సత్యమని భావించే వారు ఆత్మను ఎలా అర్థం చేసుకోగలరు?

ఆత్మ అకర్త, అభోక్త, కర్తృత్వ భోక్తృత్వాదులు అంతఃకరణ ధర్మాలే గాని, ఆత్మధర్మాలు కావు. ఆత్మజ్ఞానము కలవాడు తనను తాను అకర్తగా, అభోక్తగా దర్శించు కోవడమే గాక, కర్మల యందు అకర్మను దర్శిస్తూ ఉంటాడు. ఆత్మజ్ఞానము లేనివాడు దేహేంద్రియ మనోబుద్ధుల సంఘాతమే తాను అని భ్రమిస్తూ ఉంటాడు. అంతే కాదు. కర్తృత్వ భోక్తృత్వాలను ఆత్మ యందు ఆరోపిస్తాడు కూడా. దీనికి కారణము తానెవరో, ఏమిటో స్పష్టంగా తెలియక పోవడమే. తాను కర్త అనుకుంటున్నాడు కనుక ఆత్మను కర్తగా భావిస్తాడు.

తనకు దేహముంది అనుకుంటున్నాడు కనుక భగవంతునికి కూడా దేహముంది అనుకుంటాడు. పరమాత్మ దేహము కూడా తన దేహము లాంటిదే అనుకుంటాడు. దేహం సత్యం అని భావించే వాడు దేహంలో దైవాన్ని దర్శించ గలడా? శరీరమే నిత్యమని సంభావించే వాడు శరీరంలో శివుణ్ణి భావించ గలడా?

మనం దేహాలను చూస్తామే గాని దేహాలలో ఉండే దైవాన్ని చూడలేము ***(సర్వభూత మహేశ్వరమ్).*** **మతాబుల కాంతి లాగా క్షణం వెలిగి ఆరిపోయే దేహాల బాహ్య రూపాలను చూస్తామే గాని, నిత్యమై, అఖండమై, దేహాలలో ప్రకాశించే ఆంతరంగిక పరంజ్యోతి యొక్క దివ్య స్వరూపాన్ని చూడలేము. అందుచేత ఆత్మ వైభవాన్ని అర్థం చేసుకోలేక ఆత్మను అనాదరం చేస్తూ ఉంటాము. రూపదృష్టిలో ఉంటామే గాని స్వరూప దృష్టిని సారించ లేము.**

అహం సర్వేషు భూతేషు భూతాత్మా అవస్థితః సదా ।
తం అవజ్ఞాయ మాం మర్త్యః కురుతే అర్చావిడంబనమ్ ॥

'నేను సర్వభూతాలలో భూతాత్మగా ఉన్నాను. అది తెలియని మానవుడు నన్ను ఒక రూపంగా ఆరాధిస్తూ అలక్ష్యం చేస్తున్నాడు' అని భాగవతము -తృతీయ స్కంధము.

ఏదో కొంత భక్తి పూర్వకమైన అవగాహనతో ఆరాధించే వారినే అలక్ష్యం చేస్తున్నారు అంటూ ఉంటే, అవివేకంలో కూరుకు పోయి దురవగాహనలో చరించే వారు అనాదరం చేస్తున్నారని చెప్పడంలో అతిశయోక్తి ఏముంది? దుర్యోధన, శిశుపాలాదులు ఆ కోవకు చెందిన వారే కదా!

రూపము - స్వరూపము

రూప ఔన్నత్యము ఉత్కృష్ట మైనది. అదేమీ చిన్న విషయం కాదు. పరమేశ్వ రారాధనలో రూపానికి ఒక ప్రత్యేక స్థానముంది. ప్రారంభంలో రూపం ఎంతగానో సహకరిస్తుంది.

విదేశాలలో ఉన్న ప్రాణ స్నేహితుడు ఉత్తరం వ్రాస్తే, అది చదివి ఎంతగానో సంతసిస్తాము. అదే వ్యక్తి ఫోన్‌లో సంభాషించి నపుడు ఆనందంతో ఊగి పోతాము. కాని, అతడే బయలుదేరి వచ్చి మన ముందు ప్రత్యక్ష మైతే మాటలు మూగబోయి, మనస్సు పరవశించి తన్మయత్వం చెందుతాము. రూపార్చనకు, స్వరూపానుభూతికి మధ్య అంత తేడా ఉంటుంది. కాని, రూపం లేకుండా స్వరూపాన్ని చేరడం కష్టతర మవుతుంది.

స్వరూపానుభూతిని పొందేందుకు రూపాశ్రయం ఉచితమే గాని, రూపానికే పరిమితమై, స్వరూపాన్ని అలక్ష్యం చేయడం సముచితం కాదు. స్వరూపాన్ని అలక్ష్యం చేయడము అంటే, దేనిని ఆశించి మనం రూపాన్ని ఆశ్రయించామో, దానినే నిర్లక్ష్యం చేస్తున్నామని భావము.

స్వరూపాన్ని అర్థం చేసుకున్న వారు ధన్యు లౌతారు. రూపం ద్వారా స్వరూపాన్ని చేరుతాము అనే భక్తి శ్రద్ధలతో ఆరాధించే వారు క్రమంగా ప్రగతిని సాధిస్తారు.

స్వరూపానికి సంబంధించిన అవగాహనే లేక దేహాత్మ భావంతో, భేద జ్ఞానంతో పరమేశ్వరుని అవలోకించే వారు పరమేశ్వరుని అర్థం చేసుకోక పోగా, అట్టి మూఢులు భగవంతుని అలక్ష్యం చేస్తారు. అనంతరూపు డైన, భూత మహేశ్వరుడైన వానిని పరిమితుడని భావించి అనాదరంతో చూస్తారు **(మానుషీమ్ తనుమ్ ఆశ్రితమ్ మామ్ అవజానన్తి).** ఇలాంటి మూఢులు చాలా నష్టపోతారు అంటూ, ఈ అవివేకుల్ని వరాకులు **(వరాకాః)** అన్నారు భాష్యంలో ఆచార్యులు. వరాకులు అంటే, జాలి పడటానికి అర్హులు అని అర్థము. పరమేశ్వరుడు అందరిలో ఆత్మరూపంగా ఉన్నవాడే కనుక, నేడు అర్థం గాక పోయినా, భక్తిశ్రద్ధలతో ప్రయత్నిస్తే తప్పక అర్థ మవుతాడు. అట్టి ప్రయత్నాన్ని విస్మరించి, వివేకం లేకుండా జీవించే వరాకులు హంతు లౌతారు, సుగతికి దూర మవుతారు.

అదెలాగో చెబుతున్నాడు.

మోఘాశా మోఘకర్మాణో మోఘజ్ఞానా విచేతసః ।
రాక్షసీ మాసురీం చైవ ప్రకృతిం మోహినీం శ్రితాః ॥ 12

మోఘాశాః-మోఘకర్మాణః-మోఘజ్ఞానాః-విచేతసః
రాక్షసీం-ఆసురీం-చ-ఏవ-ప్రకృతిం-మోహినీం-శ్రితాః

మోఘాశాః	= వ్యర్థములైన ఆశలు కల వారు	రాక్షసీం	= రాక్షస సంబంధమైన
మోఘకర్మాణః	= వ్యర్థములైన కర్మలు గల వారు	ఆసురీం చ	= అసుర సంబంధమైన
మోఘజ్ఞానాః	= వ్యర్థములైన జ్ఞానము గల వారు	ప్రకృతిం ఏవ	= స్వభావమునే
విచేతసః	= అజ్ఞానులు	శ్రితాః	= ఆశ్రయించిన వారు అవుతున్నారు
మోహినీం	= మోహ జనితమైన		

అర్జునా! ఈ అవివేకులు వ్యర్థమైన ఆశలతో, వ్యర్థమైన కర్మలతో, వ్యర్థమైన జ్ఞానంతో బుద్ధిహీను లవుతారు. రాక్షస స్వభావంతో, అసుర ప్రకృతితో మోహంలో కూరుకు పోతారు.

వ్యాఖ్య

భగవంతుని మహిమను గాంచలేక, భగవంతుని తిరస్కరించే అవివేకులు శోచనీయులు. నష్టజాతకులు. వారు అలా కావడానికి కారణ మేమిటో, వారి స్వభావ లక్షణా లేమిటో ప్రస్తుత శ్లోకంలో చెబుతున్నాడు.

వ్యర్థమైన ఆశలు

ప్రతి మనిషికి ఆశలు ఉంటాయి. ఆశలు అభివృద్ధికి అవరోధాలు కావు. ప్రగతికి ప్రతిబంధకాలు కావు. ఆశించే శక్తిని పరమేశ్వరుడు మనిషికే ఇచ్చాడు. ఎత్తైన పర్వతానికి ఇవ్వలేదు. లోతైన సముద్రానికి ఇవ్వలేదు. మనిషికే ఇచ్చాడు. అదే ఇచ్ఛాశక్తి.

ఆశలు దారి తప్పి నపుడు మనిషి దగా పడతాడు. ఆశలు సన్మార్గంలో సాగితే ఫలితాలు మహోన్నతంగా ఉంటాయి. ఆశలు విచిత్ర మైనవి. ఆశల్ని తయారు చేసుకోవడం సులభం. వాటిని తీర్చుకోవడం అనుకున్నంత సులభం కాదు. తీరని ఆశలు బ్రతుకును ఉరి తీస్తాయి. బాగా ఆలోచిస్తే, మన జీవితాలలో కూడా తీరిన ఆశల కన్నా తీరనివే ఎక్కువగా అగుపిస్తాయి. కొన్ని ఆశల్ని తీర్చుకోలేక వదిలేస్తాము. కొన్ని తీరవు అని భావించి మనమే వాటిని విడిచి పెట్టేస్తాము.

ఆశల వెనుక రాగద్వేషాలే ప్రధాన పాత్రను పోషిస్తూ ఉంటాయి. ధర్మాధర్మాలను అర్థం చేసుకొని,

సత్యావగాహనతో చరించే వ్యక్తులు పరమార్థాన్ని పొందుతూ ఉంటే, క్షణికమైన ప్రాపంచిక విషయ వాసనల వెంబడి ఆశాజీవులై పరుగు లెత్తే వారు బ్రతుకులను వృథా చేసుకుంటారు. వారి ఆశలు వృథా అవుతాయి. వారి బ్రతుకే అనర్థ మవుతుంది. వారినే వ్యర్థమైన ఆశాజీవులుగా పరమేశ్వరుడు పేర్కొంటున్నాడు *(మోఘాశాః మోఘాః వృథా ఆశాః ఆశిషః యేషాంతే మోఘాశాః).*

మనస్సులో ఏది ఉంటుందో, ఆచరణలో అదే తొంగి చూస్తుంది. అనిత్యమైన ఫలాలను ఆశించే వారు వాటిని పొందటానికి వ్యర్థమైన కర్మలనే ఆచరిస్తారు *(మోఘ కర్మాణః).*

వ్యర్థమైన కర్మలు

పరమేశ్వర జ్ఞానము లేని వారి జీవితాలలో సత్యజ్ఞానము ఉండదు. సత్యజ్ఞానము లేని వారు సత్య మార్గంలో పయనించ లేరు. ఆశల పల్లకీలో ఊరేగుతూ ఇహపరాలలో భోగాలు ప్రాప్తించాలని యజ్ఞయాగాది కర్మలలో మునిగి పోతారు. కామ్యకర్మలే ఆశయంగా పెట్టుకొని జీవిస్తారు. పరమేశ్వరుని అలక్ష్యం చేయడమే దీని కంతటికి కారణము. వీరే మోఘ కర్ములు. వ్యర్థమైన కర్మలు గల వారు అని అర్థము *(స్వాత్మభూతస్య అజ్ఞానాత్, మోఘాని ఏవ నిష్ఫలాని కర్మాణి భవన్తి ఇతి మోఘ కర్మాణః).*

ఇతిహాస పురాణాలలో చాలా మంది రాక్షసులు తారస పడతారు. గొప్ప శక్తిమంతులుగా ఉంటారు. యజ్ఞయాగాదులను కఠోర నియమంతో ఆచరిస్తారు. కాని వారి శ్రమలన్నీ వృథా కావడం మనం చూస్తాము.

రావణాసురుడు ఎంత ఘోర తపస్సు చేశాడు! హిరణ్యకశిపుని తపస్సును వర్ణించ నెవరి తరము? కాని, పరమేశ్వరుని తిరస్కరించిన కారణంగా వారి ఆశలు తీరలేదు. వారి కోరికలు ఫలించ లేదు. రావణాసురుని లంకా పట్టణంలో ప్రతి ఇంటిలో వేదఘోషలు వినిపించేవి. కాని, వారి కర్మలు పతన హేతువులే అయ్యాయి.

అగ్ని హోత్రం చ వేదాశ్చ రాక్షసానాం గృహే గృహే ।
నయా సత్యం చ శౌచం చ రాక్షసానాం న విద్యతే ॥

రాక్షసుల ఇండ్లలో ప్రతిచోట అగ్నిహోత్రాలు కనిపించేవి. వేదనాదాలు వినిపించేవి. కాని, వారిలో దయ, సత్యము, శౌచము మొదలైన దైవగుణాలు నిలిచేవి కావు. పాదరసంలా జారి పోయేవి. అందుకే వారి కర్మలన్నీ వృథా అయ్యాయి. బ్రతుకులే నాశన మయ్యాయి. వ్యర్థమయ్యే కర్మలే గాని ఏనాడు అవి జ్ఞానప్రదంగా ఉండేవి కావు. అందుచేత వారు మోఘజ్ఞానులు.

వ్యర్థమైన జ్ఞానం

ఆశల వెనుక, కర్మల వెనుక అవగాహనే ప్రధానంగా ఉంటుంది కనుక, వ్యర్థమైన జ్ఞానం కలవారు వ్యర్థమైన ఆశల మధ్య, వ్యర్థమైన కోరికల మధ్య బ్రతుకును అన్యాయం చేసుకుంటారు. అందుచేత వారి జ్ఞానం వ్యర్థం. అనర్థం. వారే మోఘజ్ఞానులు. వారిది వ్యర్థమైన జ్ఞానం కనుక, వారి జ్ఞానఫలం కూడా నిష్ఫలమే *(జ్ఞానమపి తేషాం నిష్ఫల మేవస్యాత్).* సత్యజ్ఞానం లేని వారు కనుక విచేతసులు. 'విచేతసులు' అంటే బుద్ధి లేని వారు, వివేకం లేని వారు అని అర్థము *(విచేతసః విగత వివేకాః చ తే భవన్తి ఇత్యభిప్రాయః).*

బ్రహ్మమునకు సంబంధించిన జ్ఞానము లేకుండా మోక్షము ప్రాప్తించదు. మోఘజ్ఞానులు బ్రహ్మ జ్ఞానమును పొందలేరు. అందుచేత ఉత్తమ మైన మానవ జన్మ నెత్తి కూడా వీరు పరమార్థాన్ని పొందలేక నశించి పోతారు. ఇంతకు మించిన వినాశము ఏముంది? దీనినే గొప్ప నష్టంగా కేనోపనిషత్ అభివర్ణించింది *(న చే దిహా అవేదీత్ మహతీ వినష్టిః).*

దారుణ ఫలితం

ఇలా బ్రతుకును వ్యర్థం చేసుకున్న వాళ్ళు కామ, క్రోధ దర్ప ప్రధానమైన రాక్షస స్వభావమును పొందుతారు. అసురుల వలె ప్రవర్తిస్తారు. దేహమే ఆత్మ అనే మోహానికి గురై, దుష్ట ప్రవర్తనకు పూనుకుంటారు. ఆ తరువాత వారి ప్రగల్భాలు, ప్రవర్తనలు సమాజాన్ని ఛిద్రం చేసి, రుద్రభూమిగా మార్చేస్తాయి. అవే నేటి సమాజంలో హింసలు. అవే పడగ విప్పి నాట్యం చేస్తూ కాటేస్తున్న ఉగ్రవాద పర్వాలు. ఈ విషయాన్ని ఆనాడే దర్శించి, ప్రస్తుత శ్లోకంపై అందించిన భాష్యంలో శ్రీ శంకరాచార్యస్వామి ముందుచూపుగా మనలను హెచ్చరించారు కూడా.

నరికేయ్! పగలగొట్టేయ్! త్రాగేయ్! అందినంత వరకు తినేయ్! ముందు వెనుక చూడకుండా పరుల ధనాన్ని దోచేయ్! **(ఛిన్ధి, భిన్ధి, పిబ, ఖాద, పరస్వమ్ అపహర ఇత్యేవం వదనశీలాః క్రూర కర్మాణః భవన్తి ఇత్యర్థః)** - ఇలా అర్థరహిత మైన ప్రలాపాలు పలుకుతూ ఘోరమైన కర్మలు చేస్తారు. అసుర జన్మలలో ప్రవేశిస్తారు.

అసుర స్వభావులై బ్రతుకును అన్యాయం చేసుకునే వ్యర్థ జీవుల్ని గూర్చి చెప్పిన భగవంతుడు, పరమాత్మనే అంటిపెట్టుకొని జీవించే దైవ స్వభావం గల వారిని గూర్చి చెబుతున్నాడు.

మహాత్మానస్తు మాం పార్థ దైవీం ప్రకృతి మాశ్రితాః ।
భజ న్త్యనన్య మనసో జ్ఞాత్వా భూతాది మవ్యయమ్ ॥ 13

మహాత్మానః-తు-మాం-పార్థ-దైవీం-ప్రకృతిం-ఆశ్రితాః
భజంతి-అనన్యమనసః-జ్ఞాత్వా-భూతాదిం-అవ్యయం

పార్థ	=	అర్జునా!	మాం	=	నన్ను
మహాత్మానః తు	=	మహాత్ములైతే	అవ్యయం	=	నాశము లేని వానినిగ
దైవీం	=	సాత్త్వికమైన	జ్ఞాత్వా	=	తెలిసికొని
ప్రకృతిం	=	స్వభావమును	అనన్యమనసః	=	ఏకాగ్రచిత్తులై
ఆశ్రితాః	=	ఆశ్రయించిన వారై	భజంతి	=	భజిస్తున్నారు
భూతాదిం	=	జగత్తునకు కారణమైన			

అర్జునా! దైవ స్వభావము గల వారు మహాత్ములు. సర్వ భూతాలకు నేనే ఆదికారణ మని, నశించనని వారికి తెలుసు. కనుకనే, మరో భావం లేకుండా వాళ్ళు నన్నే భక్తి చేస్తారు.

వ్యాఖ్య

ఇతరులను గాయ పరచడం, మనం గాయ పడటం అనేది అందరికీ తెలిసిన సులువైన విద్య. సులభ సాధ్యమైన విద్య. అలాగే అన్యులను దుఃఖ పెట్టడం, మనం దుఃఖ పడటము కూడా.

ఇతరుల్ని సుఖ పెట్టడం, మనం సుఖంగా ఉండటం అనేది కొందరికే తెలిసిన విలువైన విద్య. దుర్లభ మైన విద్య. అలాగే అన్యులను తృప్తి పరచడము, మనం తృప్తిపడి ఉండటము కూడాను.

ఇతరుల సంతోషాన్ని పాడు చేస్తూ, తమ సంతోషాన్ని కూడా పోగొట్టుకొనే వారు అవివేకులు. విచేతస్కులు. భగవ ద్విముఖులు. అసుర స్వభావం గల వారు. మోహంలో కూరుకు పోయిన వారు. రాక్షస ప్రవృత్తి కలవారు. రజోగుణ తమోగుణ ప్రేరితులు. తిమిరంలో తారాడేవారు. ఇహపరాలను పోగొట్టుకున్న వారు. ఇరుసును ఆధారం చేసుకొని బండి చక్రము తిరిగినట్లు, స్వార్థాన్ని కేంద్ర బిందువుగా చేసుకొని సర్వ వ్యాపారాలను

సాగిస్తూ ఉంటారు. ఇలాంటి వారు జీవితాన్నే నష్ట పోతారు. ఈ విషయాన్ని గడచిన రెండు శ్లోకాలలో చూశాం. వీరికి భిన్నమైన మరొక మార్గం వారివి ఈ శ్లోకం నుండి చూడ బోతున్నాం. వారే మహాత్ములు.

మహాత్ అంటే ఉన్నతమైన, ఉత్కృష్టమైన, పవిత్రమైన అని అర్థము. **ఆత్మా** అంటే హృదయము, అంతఃకరణము అని అర్థము. గొప్ప హృదయం కలవారు, పవిత్రమైన బుద్ధి గల వారు మహాత్ములు. అక్షుద్ర చేతస్కులు. దైవ స్వభావం గల వారు. సత్త్వగుణ ప్రధానులు. మోక్షమే ప్రధాన ఆశయంగా, లక్ష్యంగా కలిగిన వారు. వివేకవంతులు. తేజంలో చరించే వారు. ఇరుసును ఆధారం చేసుకొని బండి చక్రము తిరిగినట్లు, పరమార్థ తత్త్వాన్ని కేంద్ర బిందువుగా చేసుకొని సమస్త కార్యాలను పవిత్రంగా నిర్వహించే వారు. దైవీ సంపద గల అట్టి మహాత్ములను గూర్చి ప్రస్తుత శ్లోకం నుండి చెబుతున్నాడు. **మహాత్మానస్తు** అంటూ శ్లోకాన్ని ప్రారంభించాడు.

తు శబ్దం అవధారణార్థకం. వైలక్షణ్య ద్యోతకము. మూఢులకు భిన్నంగా, అన్యంగా మహాత్ములు విలక్షణమైన వారు అని నిర్ధారించడానికే **తు** శబ్ద ప్రయోగము.

మహాత్ములు

ఎవరి మనస్సు నికృష్ట మైన ఆలోచనలు చేయదో, ఎవరి బుద్ధి మలిన పడదో, ఎవరి చిత్తము ప్రపంచంలో చిందులు వేయదో, ఎవరిలో అహంకారము కాగడా పెట్టి వెతికినా కనిపించదో, వారే మహాత్ములు. బుద్ధి పాడు గాని వారు ***(అక్షుద్ర చిత్తాః)***.

బుద్ధిని పాడు చేసే అసుర గుణాలు లేకుండా ఉండటమే గాక, సుందర సుమాలతో పుష్పవనం శోభించినట్లు, దివ్యమైన గుణాలతో వారి అంతఃకరణము గుబాళిస్తూ ఉంటుంది. శమము, దమము, దయ, శ్రద్ధ మొదలైన దైవ లక్షణ సౌరభాలను విరజిమ్ముతూ ఉంటుంది ***(శమ దమ దయా శ్రద్ధాది లక్షణానామ్, దేవానాం ప్రకృతిం ఆశ్రితాః)***. ఇలాంటి దైవ లక్షణాలతో శోభిస్తూ ఉంటారు కనుక, మహాత్ములు భువిపై తిరిగే దేవతలు.

మహాత్ములు నిరంతరము పరమాత్మ సేవ లోనే ఉంటారు. వారు ముముక్షువులు కావడమే దీనికి కారణము. ధర్మార్థ కామాల యందు వారికి ఆసక్తి ఉండదు. పురుషార్థ నిశ్చయం వల్ల వారికి గమ్యము సుస్పష్టంగా ఉంటుంది.

ఇల్లు చిమ్మే వారిని చూచి నపుడు లక్ష్యము విషయంలో స్పష్టత ఎలా ఉండాలో అర్థ మవుతుంది. చీపురు చేత పట్టుకొని ఒక వైపు నుండి చిమ్మడం ప్రారంభిస్తారు. మనం చూస్తూ ఉండగానే కసువును తోసుకుంటూ పశ్చిమంగా పోతూ ఉంటారు. అంతలోనే తూర్పు తిరుగుతారు. ఇదేమిటి? ఏ వైపుకు పోతున్నారు? అని మనం ఆలోచించే లోగా, తూర్పు నుండి మరలి దక్షిణము వైపు సాగుతూ కసువు నంతా తీసుకెళ్ళి ఒక మూలకు చేరుస్తారు.

కసువును ఆ వైపుకు తీసుకెళ్ళాలి అనే ఆలోచన చిమ్మడం ప్రారంభించి నపుడే వారి మనస్సులో ఉంటుంది. తత్ఫలితంగా వారు ఎటు తిరుగుతూ ఉండినా, ఏ వైపుకు చిమ్ముకుంటూ పోయినా, లక్ష్యం బుద్ధిలో నిశ్చయమై ఉంది కనుక, కార్యమంతా దానిని అనుసరించే సాగుతూ ఉంటుంది.

మహాత్ముల హృదయాలలో పురుషార్థ నిశ్చయం దృఢంగా ఉంటుంది కనుక, వారు ఏది ఆలోచించినా, ఏ కర్మను ఆచరించినా అది పరమార్థం వైపే అనన్యంగా సాగుతూ ఉంటుంది. వాళ్ళు పొంద వలసింది, పొంద దగినది పరమేశ్వరునే గాని అన్యం కాదు అనే జ్ఞానం వారి మనస్సులో స్పష్టంగా ఉంటుంది. పరమాత్మకు సంబంధించిన అవగాహన వారిలో స్థిరంగా, పూర్ణంగా ఉండటమే దానికి కారణము.

ఆది దేవుడు - అనంతుడు

భగవంతునికి సంబంధించిన జ్ఞానము మహాత్ములలో పూర్ణంగా ఉంటుంది. సర్వ భూతములు ఆవిర్భవించడానికి కారణమైన వాడు పరమేశ్వరుడు అని వారికి తెలుసు. అంతేకాదు. సమస్తానికి ఆది యైన ఆదినారాయణుడు సర్వమూ నశించినా, తాను నశించడు అనే జ్ఞానం కూడా వారికి ఉంది ***(జ్ఞాత్వా భూతాదిమ్ - భూతానాం వియ దాదీనం ప్రాణినాం చ ఆదిం కారణమ్, అవ్యయమ్)***.

కార్యము ఉంది అంటే కారణం ఉంటుంది. ప్రపంచంలో ఏది కారణమో, ఏది కార్యమో నిశ్చయించి చెప్పడం చాలా కష్టం. ఒక కార్యానికి కారణ మైనది, మరొక కారణానికి కార్యమై ఉంటుంది. కార్యాలన్నీ క్షయమై నశించేవే కనుక, మనం కారణాలు అని భావించే వన్నీ కూడా కార్యాల లాగే నశించి పోతూ ఉంటాయి. అరటి చెట్టు ఒక్క అరటి గెల మాత్రమే వేస్తుంది. ఆ తరువాత, అరటి గెలకు కారణమైన అరటి చెట్టు కూడా నశించి పోతుంది. భగవంతుడు అలా నశించే కారణం కాడు. ఆది ఉన్న వన్నీ అంతాన్ని పొందుతాయి. పరమేశ్వరుడు ఆది లేనివాడు కనుక అంతం తెలియని వాడు. అందుచేతనే ఆయన అవ్యయ కారణంగా శోభిస్తున్నాడు.

తదనన్యత్వం ఆరంభణ శబ్దాదిభ్యః - కార్యమైన భూతజాలము కారణమైన బ్రహ్మమే కావడం చేత భూతములకు ప్రత్యేకమైన అస్తిత్వం లేదు. అందుచేత బ్రహ్మము అద్వితీయమై అవ్యయ మవుతూ ఉంది.

అరటి గెలకు కారణమైన అరటి చెట్టు, గెల వేసిన తరువాత నశించినట్లు, అనేక ఫలాలను, బీజాలను అందించిన వృక్షములు తదుపరి నశించినట్లు, కుండకు కారణమైన మట్టి, కుండ నశించ గానే నశిస్తుందా? మట్టిపాత్ర లన్నిటికీ మట్టే కారణము. మట్టిపాత్రలు నశిస్తాయి. కార్యము లైన మట్టిపాత్రలు నశించాయని కారణమైన మట్టి నశిస్తుందా? కుండలో ఉన్నదంతా మట్టే. కుండ ఆవిర్భావానికి ముందు మట్టి ఉంది. కుండ పుట్టిన తరువాత కుండలో మట్టే ఉంది. కుండ పగిలిన తరువాత కూడా మట్టి అలాగే ఉంది. కనుక, కారణంగా ఉన్న మట్టే కార్య రూపమైన కుండలో ఉన్నందున, కుండకు ప్రత్యేకమైన అస్తిత్వము లేదు. మట్టిపాత్రలు నశించడం వల్ల మిథ్యా రూపాలైన నామరూపాలు నశించాయే గాని, మట్టి అనే వాస్తవ స్వరూపానికి హాని లేనందున, కార్య నాశము వల్ల కారణం నశించడం లేదు. అలాగే మిథ్యా రూపాలైన భూతముల వినాశము యొక్క ప్రభావము బ్రహ్మము మీద ఉండదు, ఉండలేదు. కనుకనే, బ్రహ్మము అద్వయము. అద్వయము కనుకనే అవ్యయము ***(నవ్యేతి)***.

భూతములకు ఆదిగా ఉన్నా అంత మెరుగని లక్షణము **(భూతాదిం)** పరమేశ్వరుని స్వరూపము. ఈ విధమైన స్వరూప లక్షణమును బ్రహ్మము కన్నా అన్యంగా మరొక చోట, మరొక వస్తువు నందు చూడలేము. ఈ సత్యమును గ్రహించిన పవిత్ర హృదయులు **(జ్ఞాత్వా భూతాదిం అవ్యయమ్)** అనన్య చిత్తముతో పరమాత్మనే సేవిస్తూ ఉంటారు.

ఏకాంత సేవ

ఆదిదేవుడు, అనంత నారాయణుడు అయిన పరమేశ్వరుని స్వరూపమును అర్థం చేసుకున్న పుణ్యాత్ములు, **అనన్య** మనస్సుతో భగవంతుణ్ణి సేవిస్తారు. **అనన్య** మనస్సు అంటే, ఈశ్వరుని కన్నా అన్యమైన విషయాల యందు ఆసక్తి లేని మనస్సు అని అర్థము. అనన్య మనస్సు కల వారు ఈశ్వరుని విడిచి అన్యమైన ఆశ్రయాలను వెంబడించరు. ఇదే అనన్య చిత్తముతో భక్తులు ఆచరించే ఏకాంత సేవనము.

అన్యాశ్రయాణాం త్యాగః అనన్యతా - పరమేశ్వరుని విడిచి అన్యములను ఆశ్రయించడము అనే ప్రవృత్తిని త్యాగం చేయడము అనన్య భక్తి అని నారద మహర్షి తమ భక్తి సూత్రాలలో ప్రబోధించారు.

'అనన్య' శబ్దానికి మరొక అర్థమును కూడా గ్రహించ వచ్చు. చిత్తమును ఈశ్వరుని యందే అనన్యంగా ఉంచుకోవడమే గాక, ఈశ్వరుని కన్నా అన్యంగా రెండవ వస్తువు లేదు అనే జ్ఞానము కలిగిన చిత్తము అనన్య చిత్తము. అట్టి చిత్తముతో అద్వయ స్వరూపుడైన పరమేశ్వరుని సేవించడం అనన్య భక్తి అనే ఏకాంత సేవనము. ఈ విధమైన అవగాహనలో ఈశ్వరుడు తప్ప అన్య విషయాలు మనస్సుకు రుచించవు. కనుక అనన్య భక్తి కలిగిన మహాత్ముడు అన్య విషయాల యందు తటస్థంగా ఉంటాడు.

తస్మిన్ అనన్యతా తద్విరోధిషు ఉదాసీనతా - పరమేశ్వరుని యందు ఏకాంత భక్తి, పరమేశ్వరుని కన్నా అన్యమైన విషయాల యందు ఉదాసీనతను కలిగి ఉండటమే అన్యాశ్రయ త్యాగము అని కూడా నిర్వచించాడు నారదమహర్షి. అట్టి వారే మహాత్ములు.

మహాత్ముల మనస్సు భగవంతుని యందే పరవశించి ఉంటుంది. అన్ని ప్రదేశాలలో, అన్ని కాలాలలో వారి మనస్సు పరమేశ్వర భావనలో తన్మయమై ఉంటుంది. వారిలో అనన్య భక్తి అప్రయత్నంగా సాగుతూ ఉంటుంది. నదీ ప్రవాహం లాగా వారిలో ప్రేమ ప్రవాహం నిరాటంకంగా సాగుతూ ఉంటుంది.

మహాత్ముల నేత్రాలలో నందగోపాలుడు కాపుర ముంటాడు. ఆ కళ్ళ లోకి మరొకరు ప్రవేశించ లేరు. నిద్ర కూడా చేరలేని చోటుగా ఉంటుంది. ఏకాంత భక్తిలో మరొకరికి స్థానం ఉండదు. భక్తుడు భగవంతుని అనుభూతిని పొందే విలక్షణ మైన స్థితి అది. అదే మహాత్ముల ఏకాంత సేవ.

ఈ విధమైన అనన్య భక్తి అందమైన వస్తువుల లోని అందాన్ని పరమేశ్వరుని సౌందర్యంగా దర్శిస్తుంది. రుచికరమైన వాటి లోని రుచిని భగవంతుని ప్రసాదంగా అనుభవిస్తుంది. జగత్తు అంతా భక్తికి జగదీశ్వర స్వరూపంగా గోచరిస్తుంది.

ఏకాంత భక్తి నిర్మల మైంది. అదే నిష్కామ భక్తి. వ్రత, దాన, తపో యజ్ఞాల కన్నా ఏకాంత భక్తి చేతనే పరమేశ్వరుడు సంతసిస్తాడు అని శ్రీమద్భాగవతము - సప్తమ స్కంధము, సప్తమాధ్యాయం యాభై నాల్గవ శ్లోకంలో ప్రహ్లాద కుమారుడు గురుకులంలో తోటి బాలకులకు బోధిస్తాడు.

న దానం న తపో నేజ్యా న శౌచం న వ్రతాని చ ।
ప్రీయతేఽమలయా భక్త్యా హరి రన్య ద్విడంబనమ్ ॥

'నాయనా! దానము, తపస్సు, యాగము, ఆచారము, వ్రతములను ఆచరించలేక పోతున్నా మనే బాధ అవసరం లేదు. నిర్మలమైన ఏకాంత భక్తితో పరమేశ్వరుడు సంతసిస్తాడు. ఏకాంత భక్తి లేని అన్య సాధన లన్నీ నటనలే ***(విడంబనమ్)*** అన్నాడు ప్రహ్లాదుడు.

మహాత్ములు ఎలాంటి లక్షణాలు కలిగి సేవిస్తూ ఉంటారో, తరువాత శ్లోకంలో కూడా వివరిస్తున్నాడు.

సతతం కీర్తయన్తో మాం యతన్త శ్చ దృఢవ్రతాః ।
నమస్యన్త శ్చ మాం భక్త్యా నిత్యయుక్తా ఉపాసతే ॥ 14

సతతం-కీర్తయంతః-మాం-యతంతః-చ-దృఢవ్రతాః
నమస్యంతః-చ-మాం-భక్త్యా-నిత్యయుక్తాః-ఉపాసతే

సతతం	= ఎల్లప్పుడును	భక్త్యా	= భక్తి చేత
మాం	= నన్ను	నమస్యంతః చ	= నమస్క రించెడి వారు
కీర్తయంతః చ	= సంకీర్తనము చేయువారు	నిత్యయుక్తాః	= నిత్యయోగులు
యతంతః	= ప్రయత్నించువారు	మాం	= నన్ను
దృఢవ్రతాః	= దృఢవ్రతులు	ఉపాసతే	= సేవిస్తున్నారు

అర్జునా! ఏకాంత భక్తులు సదా నన్నే కీర్తిస్తూ ఉంటారు. నియమాలను పాటిస్తూ, నా కోసం ప్రయత్నిస్తూ ఉంటారు. భక్తితో నాకు నమస్కరిస్తూ ఉంటారు. నా యందే మనస్సు నిలిపి నన్నే సేవిస్తూ ఉంటారు.

వ్యాఖ్య

నిత్య కీర్తనము

పరమేశ్వరుని ఆశ్రయించుకొని దైవీ సంపదతో సేవించే వారు భగవంతుని ఎలా ఆరాధిస్తారో రెండు శ్లోకాలలో చెబుతున్నాడు.

పరబ్రహ్మ స్వరూపమైన భగవంతుని నిరంతరము కీర్తిస్తూ మహాత్ములు జీవిస్తారు **(సతతం సర్వదా భగవన్తం బ్రహ్మ స్వరూపం మాం కీర్తయన్తః)**. ఉపక్రమ, ప్రకరణ విషయాలను దృష్టిలో ఉంచుకొని అర్థం చేసుకుంటే, ప్రస్తుతం కీర్తనము అంటే వేదాంత శ్రవణము అని అర్థము. భక్తుడైన వాడే భగవంతుని కీర్తిస్తాడు. భగవంతునికి సంబంధించిన వాడు కావడం చేత భక్తుడు సర్వదా భక్తుడు గానే ఉంటాడు. ప్రత్యేక వ్యక్తిత్వంతో జీవిస్తూ, అప్పుడప్పుడు పరమేశ్వరుని ఆరాధించడం కాకుండా, సదా పరమేశ్వరునితో జీవిస్తూ, భక్తుడుగా నిరంతరము కొనసాగుతూ, అవసరాలను గుర్తించి భక్తుడుగా తన ధర్మమును నిర్వర్తిస్తూ ఉంటాడు. అతడే ఇక్కడ కీర్తనా భక్తుడు.

ఆసుప్తేః ఆమృతేః కాలం నయేత్ వేదాన్త చిన్తయాః ।

నిద్ర లేచింది మొదలు మరల నిద్ర వచ్చే వరకు **(ఆసుప్తేః)**, అలాగే తన జీవిత కాలము ముగిసే వరకు **(ఆమృతేః)** కేవలం వేదాంత చింతన యందే కాలక్షేపం చెయ్యాలి అనే స్మృతి వాక్యాన్ని మనస్సులో ఉంచుకొని, తదనుగుణంగా జీవించే వాడు కీర్తనా భక్తుడు.

భగవంతుడు ఏమిటో తెలియకుండా భగవంతుణ్ణి ఎలా కీర్తించగలం? ఎలా స్తుతించగలం? భగవంతుడు అర్థమై నపుడే కీర్తించగలం. అర్థం కానపుడు ఎంత కీర్తించినా అది కీర్తన అనిపించుకోదు. అర్థమైతే కీర్తించడ మనేది జ్ఞానమే అవుతుంది. జ్ఞానం ఉంటేనే భక్తి నిలుస్తుంది.

తస్యాః జ్ఞాన మేవ సాధన మిత్యేకే ।

ఈశ్వర జ్ఞానమే భక్తికి సాధన మని కొందరు ఆచార్యులు అభిప్రాయ పడ్డారు అంటాడు భక్తి సూత్రాలలో నారద మహర్షి.

భక్తి అనేది ప్రేమే గనుక **(సా త్వస్మిన్ పరమ ప్రేమ రూపా)** అవగాహన లేకుండా ప్రేమించడం సాధ్య పడదు. అవగాహన, లేదా జ్ఞానము ఉన్నచోటే ప్రేమ చిగురిస్తుంది. పుష్పిస్తుంది. ఫలిస్తుంది.

పరమేశ్వరుడు సర్వజ్ఞుడు. సర్వశక్తిమంతుడు. సర్వవ్యాపి. సృష్టి కార్యానికి తానే అధిష్ఠానము. ఆయన అధ్యక్షతన సమస్తమూ నడుస్తూ ఉండినా, తాను సర్వమునకు విలక్షణంగా, సాక్షీమాత్రంగా ఉంటాడు. ఇదంతా ఆయన వైభవము. కర్మలన్నీ ఆయన ప్రభావం తోనే జరుగుతూ ఉండినా తాను మాత్రం అకర్త. అభోక్త.

ఇదంతా ఈశ్వర జ్ఞానము. ఈ జ్ఞానము లేనిదే విశ్వాసము ఏర్పడదు. శ్రద్ధ నిలవదు. శ్రద్ధ లేకుండా ఈశ్వర సంబంధము కుదరదు. ఈశ్వర సంబంధము లేకుండా భక్తి ఉండలేదు. అందుచేత కీర్తనము అంటే వేదాంత శ్రవణము అని అర్థము. శ్రవణ సాధనే కీర్తనము. సాధనలను కీర్తించడము అనే ప్రయోగము శాస్త్ర సమ్మతమే. అనన్య భక్తికి సాధనలు ఏమిటో ఆచార్యులు గానం చేశారు అన్నాడు నారదమహర్షి ***(తస్యాః సాధనాని గాయన్తి ఆచార్యాః).*** భగవంతుని కీర్తించడము అంటే భగవంతుని అర్థం చేసుకోవడం. సత్యమునకు సంబంధించిన జ్ఞానమును పొందడము. అదే కీర్తనా వైభవము. పరమేశ్వరునికి సంబంధించిన జ్ఞానము కలిగిన వారు, పరమేశ్వరుని పొందే ప్రయత్నము చేయకుండా ఉండలేరు.

దృఢ ప్రయత్నము

వేదాంత శ్రవణ సాధన నాచరిస్తూ, ఇంద్రియాలను నియమించి, శమ, దమ, దయ, అహింసాది ధర్మాలను ఆచరిస్తూ ***(యతన్తః ఇంద్రియ ఉపసంహార శమ దమ దయ అహింసాది లక్షణాదిభిః ధర్మైః ప్రయతన్తః).*** దృఢమైన బ్రహ్మచర్యాది వ్రత పరాయణులై ఉంటారు. చలించని వ్రత నియమంతో ఉంటారని భావము.

కీర్తనా భక్తి వలన ఏర్పడిన జ్ఞానము నిత్య విషయానికి సంబంధించింది కనుక మనస్సును అనిత్యాల వైపు పోనివ్వదు. ప్రారంభంలో అందరూ దృఢతర మైన భక్తి వైరాగ్యాలను కలిగే ఉంటారు. కానీ కాలంలో క్రమేపి ఆ దృఢత్వము ద్రవీభవిస్తూ ఉంటుంది. అలా జరగకుండా ఉంచేదే శ్రవణ సాధన. జ్ఞానం దృఢంగా ఉన్నప్పుడే సాధనలు దృఢంగా సాగుతాయి. ఈశ్వర జ్ఞానము స్థిరంగా ఉండి, సాధనలు దృఢతర మైనపుడు నేను పరమేశ్వరుని కన్నా అన్యంగా ఉన్నాను అనే భావన క్షీణిస్తుంది. అదే నమస్కారము.

వందన వైశిష్ట్యము

ఈశ్వరుడు సర్వుడు. సర్వజ్ఞుడు. ఆయన జ్ఞానానికి ఏదీ దూరంగా లేదు, పోలేదు. సమస్తము సర్వదా ఆయన చూపుల్లో సాగుతోంది ***(సర్వస్య సర్వదా జ్ఞానాత్).*** ఆయన పూర్ణుడు. ఆయన శక్తి పూర్ణము. ఆయన జ్ఞానము పూర్ణము. ఆయనిది పూర్ణ వైభవము.

ఆయన కేవలం పూర్ణుడే కాదు. తన నాశ్రయించిన భక్తులను పూర్ణ స్వరూపులుగా మార్చేవాడు. ఆయన ఐశ్వర్యంతో భక్తులను నింపేవాడు. ఆయన పూర్ణుడు కనుకనే భక్తుల్ని పూర్ణులుగా మార్చగలడు ***(న కేవలం పూర్ణ ఏవ, పూరయితా చ సర్వేషాం సంపద్భిః).***

పరమేశ్వరుడు పూర్ణుడు అనేది అర్థమైతే, ఇక నే నెక్కడున్నాను? నాదెక్కడుంది? అంతా పూర్ణం లోనే ఉంది. పూర్ణ పురుషుడైన పరమేశ్వరుని లోనే ఉంది. నాది ఏదీ లేదు ***(నమః).*** ఈ సత్యావగాహనతో హృదయంలో ఆత్మ స్వరూపంగా భాసిస్తున్న పరమేశ్వరునికి వందన మంటూ నిత్యభక్తితో మహాత్ములు సేవిస్తూ ఉంటారు ***(నమస్యన్తః చ మాం హృదయేశమ్ ఆత్మానం, భక్త్యా నిత్య యుక్తాః సన్తః ఉపాసతే సేవన్తే).***

ఇది మహాత్ములు ఆచరించే జ్ఞానసాధన. ఈ వ్యాఖ్యానము సందర్భోచితమే. కాని, కర్మయోగులు కూడా సాధకులే కనుక, ఇది వారికి కూడా అన్వయిస్తుంది అనే కొందరి ఆలోచనలో నాకు వైరుధ్యము కనిపించడం లేదు. కనుక ఈ శ్లోకాన్ని భక్తిపరంగా, ఆ కోణం నుండి కూడా వ్యాఖ్యానిస్తున్నాను.

సదా గోవింద కీర్తనమ్

కళ్ళు చూడ లేనివి దేహంలో ఎన్నో ఉన్నాయి. మనస్సు అర్థం చేసుకో లేనివి జీవితంలో ఎన్నో జరిగి పోతున్నాయి. నియతి రూపంలో విశ్వమంతా వ్యాపించిన పరమేశ్వరుడే నా బుద్ధిని ప్రకాశింప చేస్తున్నాడు. నా బ్రతుకును నడిపిస్తున్నాడు.

తగ్ం హ దేవం ఆత్మ బుద్ధి ప్రకాశం ముముక్షుర్వై శరణ మహం ప్రపద్యే,

నా బుద్ధిని ప్రకాశింప చేసే ఆ భగవంతుని మోక్షార్థినై నేను ఆశ్రయిస్తున్నాను అని శృతి వాక్యము. అలా పరమేశ్వరునికి శరణాగతు డైన వాడు భక్తుడు.

సాధన లన్నిటిలో భక్తి సాధన విలువైనది. సులువైనది కూడా. **అన్యస్మాత్ సౌలభ్యం భక్తౌ** అన్నాడు నారద మహర్షి. భక్తి చేయడానికి నామసాధన అద్భుతమైంది. భగవంతునికి భగవన్నామానికి తేడా లేదు. నాలుకపై నామం కదుల్తూ ఉంటే హృదయంలో నారాయణుడు దర్శన మిస్తాడు. నామం మన వద్ద ఉంటే నామి మనతో ఉన్నట్లే.

సా రసనా తే నయనే తావేవ కరౌ స ఏవ కృతకృత్యః

భగవన్నామాన్ని పలికే నాలుకే నాలుక. భగవద్రూపాన్ని దర్శించు కన్నులే కన్నులు. పరమాత్మను అర్చించు చేతులే చేతులు. భగవంతుని సదా స్మరించే నిత్య భక్తుడే కృతకృత్యుడు అన్నారు శ్రీ శంకరాచార్య స్వామి.

మనం జపించే మంత్రం, కీర్తించే నామం ఎవరిదో కాదు. పరమాత్మది. భగవన్నామాన్ని భక్తితో పలుకుతూ ఉంటే, గాలి నిచ్చే చెట్టునే గాలి ఊపినట్లు, మన చలనానికి ఆధారమైన పరమాత్మ హృదయాన్నే మనం కదిలించిన ట్లౌతుంది. అదే నామ వైభవము. కీర్తనా వైభవము. సంకీర్తనా వైభవము. అందుచేత, భక్తులు సదా భగవంతుని కీర్తనంలో తన్మయులై ఉంటారు **(తన్మయాః).**

స కీర్త్యమానః శీఘ్రమేవ ఆవిర్భవతి అనుభావయతి భక్తాన్ - భక్తుల చేత ఆ విధంగా కీర్తించ బడిన పరమేశ్వరుడు భక్తులకు దర్శన మిచ్చి, వారికి దివ్యానుభూతిని ప్రసాదిస్తాడు అని నారద భక్తిసూత్ర ప్రబోధము.

ప్రహ్లాదుడు కీర్తిస్తే స్తంభం నుండి నరసింహమూర్తి వ్యక్త మయ్యాడు. మీరా కీర్తిస్తే విషయుక్త క్షీరంలో శయనించాడు. ద్రౌపది ప్రార్థిస్తే ఆదుకొని ఆపద నుండి రక్షించాడు. గజేంద్రుని మొర విని ముక్తిని ప్రసాదించాడు. భక్తవత్సలు డైన భగవంతుని అపార కృపా విశేషాన్ని ఎరిగిన భక్తులు సదా పరమేశ్వరుని కీర్తిస్తూ బ్రతుకును భగవన్మయం చేసుకుంటారు.

భగవన్నామము భవభయ భేషజము. సంసార మనే వ్యాధికి భగవన్నామమే ఔషధము ***(సంసార రోగ భేషజత్వాత్ ఔషధమ్).*** భవ రోగానికి భగవంతుడే వైద్యుడు. ఆయన నామామృత పానమే వైద్యము. నామ రసాయనమే దివ్యౌషధము. సంసార భయాన్ని నశింప చేసే ఏకైక ఔషధము నామము అన్నారు ముకుందమాల గ్రంథంలో శ్రీ కులశేఖర ఆళ్వారులు ***(భవభయ ప్రధ్వంసన ఏకౌషధమ్).***

కర్మయోగులు ఒక వైపు ధర్మ నిర్వహణలో ఉంటూనే, లోక వ్యవహారాలను నిర్వహించుకుంటూనే భగవద్గుణ శ్రవణ కీర్తనాదుల ద్వారా భక్తిని వృద్ధి చేసుకోవచ్చు ***(లోకేపి భగవద్గుణ శ్రవణ కీర్తనాత్).*** భక్తిని బ్రతుకు నుండి వేరు చేయకుండా భగవత్స్మరణ కీర్తనాదుల ద్వారా పనుల నన్నిటినీ పూజలుగా మార్చుకో వచ్చు.

సూర్య తేజము తిమిరాన్ని పోగొట్టినట్లు, వాయువు శక్తివంతంగా వీచి మేఘాలను దూరంగా తరలించి నట్లు, భగవన్నామ సంకీర్తనము సమస్త దుఃఖాలను నశింప చేస్తుంది. **కలౌ కేశవ కీర్తనాత్** - కలియుగంలో నామ సంకీర్తనము ఉత్తమమైన సాధనగా చెప్పబడింది. అంతఃకరణ శుద్ధిని కలిగించి, జ్ఞాన సముపార్జనకు ముముక్షువును సిద్ధం చేయడంలో నామసాధన ఉత్కృష్ట మైనది. ఉత్తమ ఫలితాలను అందిస్తుంది.

భక్తి కూడా తపస్సు లాంటిదే. భక్తిని ఉత్తమోత్తమ మైన తపస్సుగా భాగవతం అభివర్ణించింది. జ్ఞాన మార్గాన్ని అందరూ అనుసరించ లేరు. కర్మయోగాన్ని అనుష్ఠించిన వారే జ్ఞానమార్గంలో దివ్యంగా పయనిస్తారు.

సతతం పరమేశ్వరుని కీర్తించే భక్తులు, జ్ఞాన సాధనను ఆచరించే మహాత్ముల లాగా నియమ నిష్ఠలను పాటిస్తారు. శమదమాది నిగ్రహ సాధనలను కూడా ఆచరిస్తారు. ఉత్తమ మైన శ్రద్ధను కలిగి పరమేశ్వరుని సేవిస్తూ ఉంటారు ***(యతన్తః).***

సదా భగవంతుని కీర్తించడము అనేది వాచిక తపస్సు. భగవంతుని ప్రార్థించడము, స్తుతించడము, కీర్తించడము - ఇవన్నీ వాచిక తపస్సు క్రిందికే వస్తాయి. ఈ విధమైన భక్తి సాధనలకు అదృష్ట ఫలంతో పాటు దృష్ట ఫలం కూడా ఉంటుంది.

దృఢవ్రత మనేది మానసిక తపస్సు. మనస్సులో దృఢమైన భక్తి నిర్ణయాలను కలిగి, స్తుతి కీర్తనాదులను భక్తులు నిరాటంకంగా సాగిస్తూ ఉంటారు ***(దృఢవ్రతాః).***

భగవంతునికి నమస్కరించడ మనేది శారీరక తపస్సు. భక్తుని వందనము భగవంతునికి బంధనము అని భక్తుల మాట. అహంకార మమకారాలను త్యజించి, వినమ్రుడై భగవంతుని సదా నమస్కరించే వందన భక్తుడు, నిత్యయుక్తుడై హృదయంలో పరమేశ్వరునే దర్శిస్తూ ఉంటాడు ***(నమస్యన్తః చ మాం హృదయేశమ్ ఆత్మానం భక్త్యా నిత్యయుక్తాః సన్తః ఉపాసతే సేవన్తే).***

నదులన్నీ సముద్రము వైపే పయనించినట్లు, ముముక్షువు లందరూ భగవంతుని వైపే ప్రయాణం సాగిస్తూ ఉంటారు. కాకపోతే, వివిధము లైన రీతులలో సాధనలు ఆచరిస్తూ ఉంటారు. వాటిని కూడా చెబుతున్నాడు.

జ్ఞానయజ్ఞేన చాప్యన్యే యజన్తో మా ముపాసతే । 15
ఏకత్వేన పృథక్త్వేన బహుధా విశ్వతోముఖమ్ ॥

జ్ఞానయజ్ఞేన-చ-అపి-అన్యే-యజంతః-మాం-ఉపాసతే

ఏకత్వేన-పృథక్త్వేన-బహుధా-విశ్వతోముఖం

అన్యే చ అపి	=	మరి కొందరు	పృథక్త్వేన	=	భిన్నముగా
విశ్వతోముఖం	=	విశ్వరూపుడ నైన	బహుధా	=	అనేక విధములుగా
మాం	=	నన్ను	యజంతః	=	పూజిస్తూ
జ్ఞానయజ్ఞేన	=	జ్ఞానయజ్ఞము చేత	ఉపాసతే	=	ఉపాసిస్తున్నారు
ఏకత్వేన	=	ఏకముగా			

అర్జునా! కొందరు జ్ఞానయజ్ఞము చేత సేవిస్తారు. కొందరు ఏకరూపంగా, కొందరు భిన్న రూపంగా, మరి కొందరు అనేక రూపునిగా, సర్వ రూపుడ నైన నన్ను ఉపాసిస్తూ ఉంటారు.

వ్యాఖ్య

పదకొండు, పన్నెండు శ్లోకాలలో ఆసురీ ప్రకృతి గల విచేతస్కులు, భగవ ద్విముఖులను గూర్చి తెలుసుకున్నాం. వారికి భిన్నంగా దైవీ ప్రకృతితో శోభించే మహాత్ములను గూర్చి పదమూడు, పద్నాలుగు శ్లోకాలలో చెప్పుకున్నాం.

మూఢులది దేహ దృష్టే గాని దైవ దృష్టి కాదు. భౌతిక విషయ చింతనమే గాని పారమార్థిక తత్త్వ విచారము వారికి పట్టదు. గిట్టదు. లౌకిక భోగాల యందే ఈ మూఢులకు ఆసక్తి. లోకమే అనిత్యము. అనిత్యమైన లోకము అందించే ఫలాలు నిత్యము లవుతాయా? పంచభూతముల చేత నిర్మితమైన ప్రపంచములో లభించే ఫలాలన్నీ నిరర్థకమే కనుక, అవి బ్రతుకును నికృష్టంగా మార్చేస్తాయి. వీరి విచిత్ర చరిత్ర చాలా అందంగా సంస్కృతములో వర్ణింపబడింది.

కాచి ద్వ్యామోహ మూర్తిః పరపురుష రతా రాక్షసీ ప్రాదురాసీ త్సా గర్భిణ్యర్థ కౌఘం విషమ మజనయ త్పంచ భూతాభిధానమ్ । యాత్యేకం నీచమార్గైః అతిజడ మపరం ధావతీ త స్తతో౽న్య ద్వ్యాప్యాత్ర శ్శూన్య మన్య ద్దహతి త దపరం కిం పున స్తత్సమాజే,

ఒకచోట పర పురుషుని యందు ఆసక్తి కలిగిన ఒక మోహ రాక్షసి ఉంది. దాని మన స్సంతా వ్యామోహమే. అది గర్భవతి అయింది. ఐదుగురు బిడ్డల్ని ప్రసవించింది. ఆ ఐదుగురు బిడ్డలే పంచభూతాలు.

ఆ ఐదుగురు బిడ్డలలో ఒక దాని పేరు జలం. అదెప్పుడూ నీచం గానే పడక సాగిస్తూ ఉంటుంది. పల్లానికి ప్రవహిస్తూ ఉంటుంది. దాని గమ్యము అధోగతే.

మరొక దాని పేరు భూమి. అది మహా జడము. చలన మెరుగదు. వెలుగు తెలియదు. అంతా చీకటి బ్రతుకు.

మూడవది వాయువు. ఇది ఒక చోట స్థిరంగా ఉండదు. అటు, ఇటు పరుగులు పెడుతూ ఉంటుంది. అంతా అస్థిరతే.

నాల్గవది ఆకాశము. ఇది పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్లు ఉంటుంది. ఇటు స్థిరమూ కాదు, అటు అస్థిరమూ కాదు. అంతా ఉన్నట్లే ఉంటుంది. అయినా ఎప్పుడూ ఖాళీయే. లోపల శూన్యమే. బయట శూన్యమే.

ఇక ఐదవది అగ్ని. దీనికి కాల్చడ మొక్కటే తెలుసు. తగలబెట్టే కార్యము లోనే సదా నిమగ్నమై ఉంటుంది. మంట పెట్టడమే గాని పంట పండించడము ఉండదు.

ఈ ఐదు భూతాలు ఒక్కొక్కటి ఒక్కో విధంగా వినాశ హేతువులుగా ఉంటాయి. ఇక ఈ ఐదు ఒకేసారి పుట్టింటికి వస్తే ఎలా ఉంటుంది? వీటి సమాగమమే సమవర్తి నిలయము. అదే యమ సదనము.

అనిత్యమైన ఈ మార్గానికి విలక్షణంగా శోభించే పరమాత్మ మార్గంలో చరించే వారు మహాత్ములు. వారిది నిత్యారాధనము. ఆరాధనా విధానాలు వేరుగా ఉన్నా, అందరూ **అధ్యాత్మ జ్ఞాన నిత్యత్వం - తత్త్వ జ్ఞానార్థ దర్శనం** అని పదమూడవ అధ్యాయంలో భగవంతుడు ఉపదేశించిన జ్ఞానమార్గం లోనే చరిస్తూ ఉంటారు. జ్ఞానయజ్ఞంతో పరమేశ్వరుని ఉపాసిస్తూ ఉంటారు. జ్ఞానయజ్ఞంతో ఎలా ఉపాసిస్తారు? అదే చెబుతున్నాడు.

జ్ఞాన యజ్ఞము

ఈశ్వర విషయమైన జ్ఞానమే ఇక్కడ యజ్ఞము. అదే జ్ఞానయజ్ఞము. అంటే, జ్ఞానమే యజ్ఞము అని అర్థం. జ్ఞాన యజ్ఞమును ఆచరించే మహాత్ములకు జ్ఞాన విషయం భగవంతుడే గాని మరొకటి కాదు ***(జ్ఞాన మేవ భగవ ద్విషయం యజ్ఞః తేన జ్ఞాన యజ్ఞేన యజన్తః పూజయన్తః).*** తాము ఆరాధించే పరమేశ్వరునికి సంబంధించిన తాత్త్విక అవగాహనతో పరమేశ్వరుని ఉపాసిస్తూ ఉన్నందున, వారిది జ్ఞానయజ్ఞ మైంది.

వీరిలో మొదటి వారు అభేద జ్ఞానంతో ఆరాధించే వారు. వీరిని అహంగ్ర హోపాసకులు అని కూడా అంటారు. ***సయశ్చాయమ్, అయమాత్మా బ్రహ్మ, అహం బ్రహ్మాస్మి*** - ఈ ఆత్మయే బ్రహ్మము, నేనే బ్రహ్మము

అనే అభేద జ్ఞానంతో వీరు భగవంతుని ఆరాధిస్తారు. ***త్వం వా అహమస్మి భగవో దేవతే, అహం వై త్వమసి*** - 'హే భగవాన్! పరమేశ్వరా! నీవే నేను - నేనే నీవు' అనే అభేద జ్ఞానంతో ఆరాధిస్తారు ***(ఏకత్వేన ఏకమేవ పరంబ్రహ్మ ఇతి పరమార్థ దర్శనేన యజన్తః ఉపాసతే).***

మరి కొందరు పృథక్ భావంతో ఉపాసిస్తూ ఉంటారు. అంటే, సూర్యచంద్రుల రూపంలో ఆ భగవంతుడే ఉన్నాడు అనే జ్ఞానం చేత ఆదిత్య చంద్రాది భేదంతో ఉపాసిస్తారు. అంటే, ఉపాసక, ఉపాస్య భేదంతో భగవంతుని ఆరాధిస్తారు ***(కేచిత్ పృథక్త్వేన ఆదిత్య చంద్రాది భేదేన, స ఏవ భగవాన్ విష్ణుః ఆదిత్యాది రూపేణ అవస్థితః).***

మరి కొందరు ఆ భగవంతుడు అనేక ముఖాలతో, అన్ని వైపుల, అనేక విధాలుగా ఉన్నాడు అనే జ్ఞానంతో భగవంతుని విశ్వరూపునిగా ఉపాసిస్తారు. ఏ వస్తువైనా, ఏ రూపమైనా వారి కది విశ్వరూపుని యొక్క ముఖమే ***(కేచిత్ బహుధా అవస్థితః స ఏవ భగవాన్ సర్వతోముఖః విశ్వతోముఖః విశ్వరూపః ఇతి).***

మొదటి వారిది అభేద దృష్టి. ఆ తరువాత మనం చెప్పుకున్న వారందరిది భేద దృష్టే. అందరిలో జ్ఞానమే ఉన్నా, మొదటి వారిలో ఉన్నది ఏకత్వానికి సంబంధించిన జ్ఞానము కావడం చేత వారిది అభేద జ్ఞానము. భేద జ్ఞానంతో ఉపాసించే వారిలో భక్తి ప్రధానంగా ఉంటుంది. కానీ ఉపాసనా వైభవాన్ని తెలిసిన వారు భక్తి జ్ఞానాల మధ్య భేదాన్ని చూడరు. జ్ఞానయోగ, కర్మయోగాలను వేరు వేరుగా చూడరు అని అయిదవ అధ్యాయం నాల్గవ శ్లోకంలో చూచాము. భక్తిలో భేదం ఉండవచ్చు. కాని, భేదాన్ని భక్తి అభేదం వైపుకు నడిపిస్తుంది. ఇక జ్ఞానం అంటారా? జ్ఞానం భేదాన్ని నిరసిస్తుంది, నిరాకరిస్తుంది. అదే తేడా.

అందరి గమ్యము ఒకటే అయినా
మార్గము లన్నీ ఒకటౌనా?
చూపు లందరివి ఒకటైనా
చూచే తీరు వేరు కదా!
జ్ఞానము కలిగి చరించే వారికి
సర్వము ఈశ్వరమయము కదా!
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్

అని రామజోగి చిట్కా.

భగవాన్! నీవు ఒక్కడివే. నీవు అద్వయుడవు. అలాంటి నిన్ను అనేక విధాలుగా ఉపాసిస్తున్నారు అన్నప్పుడు, వారు నిన్నే ఉపాసిస్తున్నారు అని ఎలా చెప్పగలం? అనే శంకను పరిహరిస్తున్నాడు.

అహం క్రతు రహం యజ్ఞః స్వధాహ మహ మౌషధమ్ ।
మన్త్రోఽహ మహమే వాజ్య మహమగ్ని రహం హుతమ్ ॥ 16

అహం-క్రతుః-అహం-యజ్ఞః-స్వధా-అహం-అహం-ఔషధం
మంత్రః-అహం-అహం-ఏవ-ఆజ్యం-అహం-అగ్నిః-అహం-హుతం

అహం	=	నేను	యజ్ఞః	=	యజ్ఞమును
క్రతుః	=	క్రతువును	అహం	=	నేను
అహం	=	నేను	స్వధా	=	పిండమును

అహం	=	నేను	ఆజ్యం	=	హవిస్సును
ఔషధం	=	ఔషధమును	అహం	=	నేను
అహం	=	నేను	అగ్నిః	=	అగ్నిహోత్రమును
మంత్రః	=	మంత్రమును	అహం ఏవ	=	నేనే
అహం	=	నేను	హుతం	=	హోమకర్మను

అర్జునా! నేనే క్రతువును. యజ్ఞము నేనే. నేనే స్వధ. నేనే ఔషధము. మంత్రము నేనే. ఆజ్యం నేనే. నేనే అగ్ని. నేనే హోమము.

వ్యాఖ్య

పరమేశ్వరుడు సమస్తములో నిండి నిబిడీకృతమై ఉన్నాడు. ఈ ప్రపంచం పరమాత్మచే వ్యాప్తమై ఉంది ***(మయా తత మిదం సర్వం).*** వ్యాప్యమైన ప్రపంచము నందు భగవంతుడు వ్యాపక చైతన్యంగా ఉన్నాడు. అందుచేత తాను విశ్వతోముఖుడు. వ్యాప్య వ్యాపకాలలో ఉన్నది తానే. కార్యమైన వ్యాప్యము, కారణమైన వ్యాపకము రెండూ తానే.

సర్వము నందు వ్యాపించి ఉన్నవాడు కనుక ఆయన సర్వవ్యాపి. జగత్తులో ఆకాశము ఎలా వ్యాపించి ఉందో, అలా ఆకాశముతో సహ సమస్తము నందు వ్యాపించి ఉన్నవాడు కనుక ఆయన 'వ్యాపీ' ***(ఆకాశవత్ సర్వగతత్వాత్ వ్యాపీ).*** కారణరూపు డైన తాను సర్వ కార్యముల యందు, మట్టి పాత్రలలో మట్టి వలె వ్యాపించి ఉన్నాడు కనుక తాను 'వ్యాపీ'. ఆయన వ్యాపకత్వము లేని ప్రదేశము లేదు. ఆయన వ్యాపించని కార్యమూ లేదు ***(కారణత్వేన సర్వకార్యాణాం వ్యాపనాద్వా వ్యాపీ).*** అన్ని కార్యాలలో తానే. అన్ని కర్మలలో తానే. ఈ సత్యాన్ని నిర్ధారణ చేసే క్రమంలో ప్రథమంగా యజ్ఞకర్మను తీసుకొని, దాని యందు పరమేశ్వరుడు ఎలా సమస్తమై ఉన్నాడో గ్రహిస్తే, జ్ఞానయజ్ఞము చేత పరమేశ్వరుని ఎలా ఉపాసించాలో బోధ పడుతుంది. ఈ విషయాన్ని ఇది వరకే నాల్గవ అధ్యాయం - ఇరవై నాల్గవ శ్లోకం **బ్రహ్మార్పణం బ్రహ్మహవిః** అనే చోట చెప్పుకొని ఉన్నాం. ప్రస్తుతం యజ్ఞక్రియలో సర్వమూ ఎలా భగవత్స్వరూపమో తెలుసుకుందాం. ప్రథమంగా 'క్రతువును నేనే' ***(అహం క్రతుః)*** అంటూ ప్రారంభిస్తున్నాడు. ప్రస్తుత శ్లోకంలో **ఏవ** కార ముంది. అంటే, నేను అనకుండా నేనే అనే ధ్వనితో ప్రవచిస్తున్నాడు. ఈ 'ఏవ' కారము అద్వితీయార్థము ప్రయోగింప బడింది. అన్నిటిలో నేనే అద్వితీయంగా ఉన్నాను అని నొక్కి చెప్పడమే 'ఏవ' కారము యొక్క ఉద్దేశము. నాకు అన్యంగా మరొకటి లేదు అని నిర్ధారణ చేయడమే ప్రధాన విషయము.

క్రతువు

నేనే క్రతువును ***(అహం క్రతుః).*** 'క్రతువు' అంటే శ్రౌత క్రియ. అంటే, శ్రౌతకర్మ విశేష స్వరూపము. శ్రుతుల యందు, అనగా వేదముల యందు ప్రతిపాదించ బడిన కర్మలను శ్రౌత కర్మలు అంటారు. అవే అగ్నిష్టోమాది క్రతువులు. అవన్నీ తానే అంటున్నాడు. ఆయన వేద స్వరూపుడు. వేద జ్ఞానము, వేద నారాయణుడు వేరు కాదు. వేదంలో చెప్పబడిన విధి ననుసరించి శ్రౌతకర్మలు సాగుతాయి కనుక, ఆ వేద క్రతువులలో విధి రూపంలో శోభించే వాడు తానే **(క్రతుః శ్రౌతకర్మ భేదః అహమేవ).**

యజ్ఞము

శ్రుతి ప్రతిపాదితము లైన శ్రౌతకర్మలు ఎలా తానై ఉన్నాడో, స్మృతి ప్రతిపాదితము లైన యజ్ఞములు,

అంటే స్మార్త కర్మలు కూడా తానే ***(అహం యజ్ఞస్మార్తః).*** శ్రౌతకర్మలు సమయాలను, సందర్భాలను అనుసరించి చేసేవి. కాని స్మార్త కర్మలు, అనగా యజ్ఞాలు నిత్యానుష్ఠానములు. కనుక, భావన తోడైతే భోజనము కూడా యజ్ఞమే. పఠనము కూడా యజ్ఞమే. పూజాదికాలన్నీ యజ్ఞాలే. పరోపకారార్థం చేసే శ్రమలు కూడా యజ్ఞాలే. ఇవన్నీ శ్రుతి ప్రతిపాదితాలు కాకపోయినా, శ్రుతులను అనుసరిస్తూనే స్మృతులు సాగుతాయి కనుక, స్మార్తము లైన యజ్ఞాలు కూడా పరమేశ్వరుని స్వరూపమే.

పరమేశ్వరుడు శుద్ధ చైతన్య స్వరూపుడు. యజ్ఞాల లోని శుద్ధి కార్యాలన్నీ ఈశ్వర స్వరూపాలే. మనకు తెలియకుండానే, నిత్యకృత్యాలలో అగ్ని, జల, వాయు, పృథివీలను ఉపయోగిస్తూ కొన్ని దోషాలను చేస్తూ ఉంటాము. ఆ పాపాలనే 'పంచసూనాలు' అంటారు. అట్టి పాప పరిహారార్థం స్మృతి ప్రతిపాదితాలైన పంచయజ్ఞాలను నిర్వహిస్తాము. అవియే దేవపూజ, ఋషిపూజ, పితృపూజ, అతిథిపూజ, భూతపూజ అనునవి. ఇవన్నీ స్మార్త కర్మలే. యజ్ఞాలే. వాటి రూపంలో ఉన్నది కూడా పరమేశ్వరుడే.

స్వధ

పితృ పూజాత్మక మైన యజ్ఞము 'స్వధ'. అంటే, మంత్ర పూతంగా పితృదేవతలకు అర్పణం చేసే అన్నము ***(యత్ పితృభ్యః దీయతే, స్వధా అన్నం అహమేవ)*** అని అర్థము. పక్షులకు, బ్రాహ్మణులకు పితృ దేవతలను తృప్తి పరచేందుకు సమర్పించే అన్నము కూడా తానే. దేవతల నుద్దేశించి ద్రవ్యమును సమర్పించుట కూడా యజ్ఞ రూపమే ***(ఉద్దిశ్య దేవాన్ ద్రవ్యాణాం త్యాగో యజ్ఞ ఇతీరితః).***

ఔషధమ్

ఇక్కడ 'ఔషధమ్' అంటే ప్రాణులు తినే అన్నము ***(అహమ్ ఔషధమ్ సర్వ ప్రాణిభిః యత్ అద్యతే తత్ ఔషధ శబ్దవాచ్యమ్).*** ఓషధుల నుండి ఉత్పన్న మయ్యేది ఔషధము. మొక్కలు, తీగలు, మూలికలు, దుంపలు, ఇంకా చెట్ల నుండి ఉద్భవించే వన్నీ ఓషధులు. వ్యాధిని పోగొట్టే మందును ఔషధము అంటాము. ఆకలి అనేది కూడా వ్యాధే కనుక ***(క్షుద్వ్యాధిః).*** ఆకలిని పోగొట్టే అన్నము కూడా ఔషధమే.

మంత్రము

మంత్రము కూడా మహేశ్వరుడే. రక్షించే స్వభావమే ఉభయులకూ ఉన్నందున మంత్రము, మంత్రమూర్తి ఒక్కటే. వేదాల లోని మంత్రముల రూపములో ఉన్నది భగవంతుడే. ఆయన మంత్ర బోధ్యుడు కూడా. అంటే మంత్రాల ద్వారా బోధ పడేవాడు, లేక అర్థమయ్యే వాడు అని అర్థము ***(మన్త్ర బోధ్యత్వా ద్వా మన్త్రః).***

ఆజ్యం

దేవతలకు సమర్పించే హవిస్సు కూడా తానే ***(అహమేవ ఆజ్యం హవిశ్చ అహమ్).*** ఆజ్యం అంటే హోమాదులలో సమర్పించే నెయ్యి మాత్రమే కాదు. ఆజ్యం అనేది సర్వ హవిస్సులకు ఉపలక్షణము.

అగ్ని

దేని యందు హోమం చేయ బడుతుందో అట్టి అగ్ని కూడా తానే ***(అగ్నిః యస్మిన్ హూయతే సః అగ్నిః అహమేవ).*** హోమగుండంలో అగ్ని ఉంటేనే హోమం చేస్తాము. అలాగే మానవ దేహంలో వైశ్వానరాగ్ని ఉంటేనే అన్నాదులను ఆహుతులుగా సమర్పిస్తాము. శివం పోయి శవం మిగిలితే, దానికి అన్నం పెట్టలేము కదా! అందుచేత భోజనము చేయడం కూడా యజ్ఞమే అని చెప్పుకున్నాము.

హోమ కర్మ

హోమం చేయడం అనే కర్మ కూడా భగవంతుడే **(అహం హుతం హవన కర్మ చ).** యజ్ఞంలో అనేక కర్మలు, వస్తువులు కనిపిస్తూ ఉండినా, ఈ శ్లోకంలో మనం చూచిన ఎనిమిది లక్షణాలలో పరమేశ్వరుడే ఏకరూపుడై శోభిస్తూ ఉన్నాడు. కనుకనే ప్రతి కర్మను భక్తి భావంతో చేస్తాము. మనం భక్తి పూర్వకంగా యజ్ఞాది కర్మలను అనుష్ఠించినా, విషయము జ్ఞానమే అయినందున ఇదంతా జ్ఞానయజ్ఞ మైంది. కర్త, కర్మ, క్రియ, కరణ, ఫలాదులన్నీ తానే కావడం చేత యజ్ఞము పరమేశ్వర స్వరూప మైంది. జ్ఞాన ప్రధానమై నందున జ్ఞాన యజ్ఞమైంది. పరమేశ్వరుడు యజ్ఞరూపంలో శోభిస్తున్నాడు కనుక ఆయన కూడా 'యజ్ఞ' శబ్దవాచ్య డయ్యాడు ***(యజ్ఞాత్మనా యజ్ఞః).*** అందుచేతనే, యజ్ఞము సాక్షాత్తు నారాయణ స్వరూపము అన్నది వేదము ***(యజ్ఞో వై విష్ణుః).***

యజ్ఞ కర్మలలో సమస్తమూ తానే ఎలా ఉన్నాడో వివరించిన పరమేశ్వరుడు, ఈ దృశ్యమాన జగత్తులో కూడా తానే ఏయే రూపాలలో శోభిస్తున్నాడో వివరిస్తున్నాడు.

పితాహ మస్య జగతో మాతా ధాతా పితామహః ।
వేద్యం పవిత్ర మోంకారః ఋక్సామ యజురేవ చ ॥ 17

పితా-అహం-అస్య-జగతః-మాతా-ధాతా-పితామహః
వేద్యం-పవిత్రం-ఓంకారః-ఋక్-సామ-యజుః-ఏవ-చ

అస్య	= ఈ		పితామహః	= తాతను
జగతః	= జగత్తునకు		వేద్యం	= తెలిసికో దగిన
అహం	= నేను		పవిత్రం	= పవిత్రమైన
పితా	= తండ్రిని		ఓంకారః	= ప్రణవమును
మాతా	= తల్లిని		ఋక్సామ యజురేవ చ	= ఋగ్వేద సామవేద, యజుర్వేదములు కూడా
ధాతా	= సృష్టికర్తను			

ఈ జగత్తుకు తండ్రిని, తల్లిని, ధాతను, తాతను నేనే. వేద్యమును నేనే. పుణ్యమును నేనే. ఓంకారము నేనే. వేద త్రయమూ నేనే.

వ్యాఖ్య

జగత్పిత - జగన్మాత

ఈ ప్రపంచ మంతా పరమేశ్వరుని యొక్క వ్యక్త స్వరూపమే. వైభవమే. అందుచేత **అస్య జగతః** అంటూ శ్లోకంలో విశ్వాన్ని సూచిస్తున్నాడు. ఈ జగత్తుకు తండ్రి, తల్లి, తాత, ధాత - అన్నీ తానే అంటున్నాడు.

కార్యం ఏది కనిపించినా, అది కర్తను జ్ఞాపకం చేస్తుంది. ఒక పిల్లవాడు కనిపిస్తే, అతనితో భాషించ వలసి వస్తే, నువ్వు ఎవరి కుమారుడివి? నీ తల్లిదండ్రు లెవరు అని ప్రశ్నిస్తాము. ఈ ఆలయం ఎవరు నిర్మించా రండీ? ఆ తోట పెంచిం దెవరండీ? ఆ బావి ఎవరు త్రవ్వించారు? ఈ సత్రం ఎవరు కట్టించారు? ఇలా ప్రశ్నిస్తూ ఉంటాము. కుండ కంట పడగానే, కుమ్మరి మనస్సులో కదుల్తాడు. కుండ చేసే జ్ఞానం ఉండటం వల్లనే కుమ్మరి కుండను చేశాడు. కాని, కుమ్మరి కుండ చేయాలి అంటే వస్తువు కూడా ఉండాలి. అదే ఉపాదానం. కుండ విషయంలో మట్టి ఉపాదానం. కుమ్మరి నిమిత్తం. ఈ రెండు కారణాలతో కుండ తయా రవుతుంది.

ఈ ప్రపంచానికి *(అస్య జగతః)* భగవంతుడు నిమిత్త కారణము. ప్రకృతి ఉపాదాన కారణము అని మనం ఇప్పటికే తెలుసుకొని ఉన్నాం *(9 వ అ - 10 వ శ్లో).* సర్వజ్ఞుడైన పరమేశ్వరుడు నిమిత్త కారణం కావడం చేత ఈ సృష్టి తయారైంది. కనుక ఆయన ఈ ప్రపంచానికి తండ్రి. మరి, కుండకు మట్టి లాగా సృష్టికి ఉపాదాన కారణం అయిన ప్రకృతి పరమేశ్వరుని కన్నా వేరుగా లేక, పరమేశ్వరునే ఆశ్రయించుకొని ఉన్నందున, ఉపాదాన కారణం కూడా సృష్టికి పరమేశ్వరుడే. అందుచేత, ఈ ప్రపంచానికి *(అస్య జగతః)* తానే తండ్రి. తానే తల్లి **(పితామాతా అహమేవ).** రెండు కారణాలుగా తెలుస్తూ ఉన్నా, వాస్తవానికి ఈ సృష్టికి పరమేశ్వరుడే అభిన్న నిమిత్త ఉపాదాన కారణము. అదే అర్ధనారీశ్వర స్వరూపము. ఒక వైపు నుండి చూస్తే భగవతిగా ఆయన ఉపాదాన కారణము. మరొక వైపు నుండి చూస్తే భగవంతుడుగా ఆయన నిమిత్త కారణము. జగన్మాత తానే. జగత్పిత తానే.

పితామహుడు

ఈ జగత్తుకు పితామహుణ్ణి నేనే అంటున్నాడు **(అస్య జగతః పితామహః అహమేవ).** సృష్టికర్త బ్రహ్మదేవుడు కనుక, బ్రహ్మదేవుడు విష్ణుదేవుని నాభికమలం నుండి పుట్టడం చేత ఆయన పితామహుడు. తండ్రి తానే అయినపుడు, తాత కూడా తానే ఎలా అవుతాడు? అనేది శంక. జన్మ నిచ్చిన వాడు తండ్రి అయితే, తండ్రికి జన్మ నిచ్చిన వాడు పితామహుడు అవుతాడు. కానీ, ఇక్కడ భగవంతుడు తండ్రి. అంటే జగత్తుకు కారణమైన వాడు. మరి, ఆ భగవంతుడికి కారణ మెవరు? అని ప్రశ్నిస్తూ ఉంటారు. ఎవరు కారణమైనా, జగత్పితకు కారణమైన ఆ తండ్రి పితామహు డవుతాడు. ఇక్కడ నేనే పితామహుణ్ణి అని చెప్పడం వల్ల, తనకు మరొక కారణం లేదు అని చెప్పిన ట్లైంది. కారణాలకు కారణమైన తనకు మరొక కారణం లేనివాడై భగవంతుడు పితామహు డయ్యాడు.

ధాత

ప్రాణులకు కర్మఫలాలను అనుగ్రహించే వాడు కావడం చేత ఆయన ధాత **(కర్మఫలస్య ప్రాణిభ్యః విధాతా).** అంటే పోషకుడు, స్థితి కారకుడు కూడా తానే అని అర్థం. మనం ఆచరించే కర్మలకు ఫలితాలు అందుతాయి. అందుకే మనం కర్మలు ఆచరిస్తాము. కర్మలకు ఫలితాలు రాకపోతే కర్మలు ఎందుకు ఆచరిస్తాము? ఫలితాలు వస్తాయి కనుకనే కర్మాచరణంలో ఉంటాము. కాకపోతే, మనం ఆశించినట్లు ఫలితాలు అందవు. కొన్ని పర్యాయాలు అందవచ్చు. కాని, ఎక్కువ శాతం నిరాశే ఫలితంగా ఉంటుంది.

కర్మఫలాలు అందడం వెనుక ధర్మం ఉంది. నియతి ఉంది. దానిని అనుసరించే మనకు ఫలాలు అందుతాయి. ఆ ధర్మం మనం చేసింది కాదు. మనం ఈ ప్రపంచానికి రాక ముందే ఈ విశ్వం ఉంది. అది ధర్మాలతో, నియతితో నడుస్తూ ఉంది. కనుక, సృష్టిలో ఈ ధర్మాలను ఎవరు రచించారో అతడే కర్మలకు ఫలితాలు అందిస్తున్నాడు. అతడెవరు? అతడు ఎవరైనా సరే, కర్మఫలాలను ఇచ్చేవాడు కనుక, సర్వజ్ఞుడయ్యే ఉండాలి. సర్వజ్ఞుడికే అది సాధ్యం. అట్టి సర్వజ్ఞుడు పరమేశ్వరుడే కాని మరొకరు కారు. కాలేరు. అందుచేత, ఎవరెవరి కర్మలకు ఏయే ఫలితాలు ఇవ్వాలో, ఎప్పుడివ్వాలో, ఎలా ఇవ్వాలో, ఎందు కివ్వాలో, అన్నీ సమగ్రంగా తెలిసిన వాడు భగవంతుడు ఒక్కడే కనుక ఆయనే కర్మఫల ప్రదాత **(ధాతా).** అందుచేతనే ఆయన తెలియ దగిన వాడు. వేద్యుడు.

వేద్యం

తెలియదగిన వాడు ఆయన ఒక్కడే కావడం చేత, ఆయన **వేద్యం** అని కీర్తింప బడ్డాడు **(వేద్యం వేదితవ్యం).** తెలియదగిన వాడు అంటే జ్ఞేయరూపుడు.

ప్రపంచంలో ఏది తెలుసుకున్నా, తెలియనిది మరొకటి ఉండనే ఉంటుంది. ఏ జ్ఞానమైనా పరిమితమే. మిథ్యా జ్ఞానమే. ఏది తెలుసుకుంటే మరొకటి తెలుసుకో నవసరం లేదో, ఏ ఒక్క దాని జ్ఞానం చేత సర్వమూ తెలియబడుతూ ఉందో, అదే జ్ఞేయము. అదే వేద్యము. ఏ లాభాన్ని పొందిన తరువాత దాని కంటే అధికమైన లాభం మరొకటి కావాలని, రావాలని అనిపించదో, అదే ఇక్కడ వేద్యము (6 వ అ - 22 వ శ్లో). అదియే బ్రహ్మము. అది తెలియ నపుడు ఎన్ని తెలిసినా ప్రయోజనం ఉండదు. బ్రహ్మ మొక్కటే అమృతము. దాని కన్నా అన్యమైన దంతయూ మృతమే. కనుకనే, అర్జునా! దేనిని తెలుసుకొనిన తరువాత నీవు అమృతత్వాన్ని పొందుతావో అట్టి జ్ఞేయమును నీకు బోధిస్తున్నాను అన్నాడు క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగంలో భగవంతుడు **(జ్ఞేయం యత్తత్ ప్రవక్ష్యామి యత్ జ్ఞాత్వా అమృత మశ్నుతే).** ఇదే జ్ఞానము. బ్రహ్మజ్ఞానము. పవిత్రమైన జ్ఞానము. జ్ఞానము కన్నా పవిత్రమైన వస్తువు మరొకటి లేదని గీత - నాల్గవ అధ్యాయం లోనే చూశాము (4 వ అ - 38వ శ్లో) కనుక, అట్టి జ్ఞాన రూపుడైన పరమేశ్వరుడు పవిత్రంగా దర్శన మిస్తున్నాడు.

పవిత్రం

పావన మైనది, పుణ్యప్రద మైనది తానే కనుక భగవంతుడు పవిత్రమైన వస్తువు **(పవిత్రమ్ పావనమ్).** పావన మొనర్చేది ఏదో అది పవిత్రము **(యేన పునాతి తత్ పవిత్రం).**

పవిత్రాణాం పవిత్రం యో మంగళానాం చ మంగళం ।
దైవతం దేవతానాం చ భూతానాం యోఽ వ్యయః పితా ॥

పవిత్రాలలో పవిత్రమైన వాడు, మంగళకరమైన వాటిలో మంగళ స్వరూపుడు, దేవతలకు దేవుడు, భూతములకు నశించని తండ్రి పరమేశ్వరుడే అని శ్లాఘించింది విష్ణుసహస్ర నామ స్తోత్ర పూర్వపీఠిక.

ఓంకారము

పరమేశ్వరుడు ఓంకార రూపుడు. ప్రణవ స్వరూపుడు. ప్రణవము అనేది భగవంతుని నామము **(తస్య వాచకః ప్రణవః).** ఈ విశ్వ మంతయు పరమేశ్వరుడిచే వ్యాప్త మని అర్థం చేసుకుంటూ ఉన్నాము. ఈ విషయాన్ని మాండూక్యోపనిషత్ ధృవ పరుస్తూ, **ఓం ఇతి ఏతదక్షర మిదం సర్వం -** ఈ సమస్త ప్రపంచము ఓంకార మనే ఏకాక్షర స్వరూపమే అన్నది. ఓంకారము పరమేశ్వరుని స్వరూపము. ఓంకారము అభిధానము. కనుక, ఓంకారము కూడా సచ్చిదానంద స్వరూపమే. పరమేశ్వరునికి, పరమేశ్వరుని నామానికి తేడా లేదు. ఓంకారము ఏదో కాదు. పరమేశ్వరుని జ్ఞానమే ఓంకారంలో నిండి ఉంది.

వేదములు కూడా తానే

ఋక్సామ యజుర్వేదాలు కూడా భగవంతుని స్వరూపమే. 'చ'కారము అథర్వణ వేదమును సూచిస్తూ ఉంది. వేదము అనేది జ్ఞాన భాండాగారము. వేద రూపములో ఉన్నది కూడా తానే కనుక ఆయన వేద స్వరూపుడు **(వేద రూపత్వాత్).** వేదాలు పరమేశ్వరుని స్వరూపాన్నే వర్ణిస్తున్నాయి. కనుక వేదాల ద్వారా తెలియబడే వాడు తానే **(వేదైశ్చ సర్వైః అహమేవ వేద్యః** ... *15 వ అ - 15 వ శ్లో).*

మరి కొన్ని భగవ ద్విశేషాలను చెబుతున్నాడు.

గతి ర్భర్తా ప్రభుః సాక్షీ నివాసః శరణం సుహృత్ । 18
ప్రభవః ప్రలయః స్థానం నిధానం బీజ మవ్యయమ్ ॥

గతిః-భర్తా-ప్రభుః-సాక్షీ-నివాసః-శరణం-సుహృత్

ప్రభవః-ప్రలయః-స్థానం-నిధానం-బీజం-అవ్యయం

గతిః	=	గమ్యము	ప్రభవః	=	సృష్టికర్త
భర్తా	=	భరించు వాడు	ప్రలయః	=	వినాశకరుడు
ప్రభుః	=	ప్రభువు	స్థానం	=	స్థితికర్త
సాక్షీ	=	సాక్షి	నిధానం	=	నిక్షేపము
నివాసః	=	నివాసము	అవ్యయం	=	నాశము లేని
శరణం	=	ఆశ్రయము	బీజం	=	మూలకారణము
సుహృత్	=	మిత్రుడు			

అర్జునా! సమస్తానికి నేను గతిని. భర్తను, ప్రభువును నేనే. నేనే సాక్షిని. నిలయం, శరణ్యం నేనే. నేనే మిత్రుణ్ణి. ఉత్పత్తి లయ స్థానాలు నేనే. నేనే నిధానము. నేనే అవ్యయ బీజము.

వ్యాఖ్య

ఇదొక అందమైన, అద్భుతమైన శ్లోకము. వేదికల మీద తరచుగా ప్రబోధకులు ఉటంకించే శ్లోకం. గీతలో గొప్ప ప్రాచుర్యాన్ని పొందిన అనేక శ్లోకాలలో ఇదొకటి. విశ్వతోముఖు డైన పరమేశ్వరుని విశేష వైభవాలను పదహారవ శ్లోకం నుండి చూస్తూ వస్తున్నాం. ఇప్పటికి, గడచిన రెండు శ్లోకాలలో ఒక్కొక్క శ్లోకంలో ఎనిమిదేసి లక్షణాల చొప్పున పదహారు విశేషణాలను అర్థం చేసుకున్నాం. ప్రస్తుత శ్లోకంలో మరో పది విషయాలను చెప్పుకోబోతున్నాం.

గడచిన రెండు శ్లోకాల కన్నా ఈ శ్లోకానికి వైలక్షణ్యం ఉంది. పూర్వ శ్లోక ద్వయంలో 'అహం' పద ప్రయోగం ఉంది. అంటే, నేను, నేను, - నేనే, అంటూ భగవంతుడు తన వైభవాన్ని వర్ణించుకుంటూ వచ్చాడు. ఈ శ్లోకంలో ఆ విధంగా 'అహం' పద ప్రయోగం జరగలేదు.

వేదాంతములో ప్రశస్తమైన, ప్రముఖమైన పదాలు రెండున్నాయి. ఒకటి 'అహం', రెండవది 'ఇదం'. 'అహం' అంటే నేను అని అర్థము. 'ఇదం' అంటే ఇది అని అర్థం. 'అహం' అనేది సత్యానికి సంకేతము. 'ఇదం' అనేది మిథ్యారూపము. సత్యము అద్వయము కనుక, మిథ్య కూడా సత్యమే. కాని, సత్యం మిథ్య కాదు. పరమేశ్వరునిపై ఆధారపడి ఉండే మిథ్య పరమేశ్వరుని కన్నా వేరుగా ప్రత్యేక మనుగడను కలిగినది కాదు కనుక, 'ఇదం' కూడా 'అహం' లోనే ఇమిడి ఉంది. స్థూలంగా, వ్యావహారికంగా ఈ వైజాత్యమును ఎరుక పరుస్తూ, పూర్వ శ్లోకాలలో 'అహం' - నేను అని చెప్పడం జరిగింది. కాని, ప్రస్తుత శ్లోకంలో మనం అధ్యయనం చేయబోయే పది విశేషణాలు కేవలం పరమాత్మకు సంబంధించినవే. అందుచేత 'అహం' పద ప్రయోగం జరగలేదు. ఒకవేళ, ఈ వ్యాఖ్యానము నచ్చకపోతే పూర్వ శ్లోకాల లోని 'అహం' పదాన్ని అధ్యాహారం చేసుకోవాలి అనే భావంతో సరిపెట్టుకోవచ్చు. ఇక విషయం లోకి వెళ్దాం.

గతి

భగవంతుడు అందరికీ గతియై ఉన్నాడు. సాధారణంగా గమ్య స్థానమును గతి అంటారు. సర్వులు పొందాలి అనుకొనే గమ్యము పరమేశ్వరుడే కనుక ఆయన గతి అని చెప్పబడతాడు. అందరిచే పొందబడే వాడు కనుక ఆయన గమ్యము ***(గమ్యతే ఇతి గతిః).*** అంతే కాదు, అట్టి గమ్యాన్ని పొందడానికి ఉపకరించే మార్గము కూడా తానే. కనుక గతి అంటే గమ్యము అని, మార్గము అని కూడా అర్థము.

భగవంతుడు జ్ఞానమయుడు కనుక **ప్రజ్ఞానం బ్రహ్మ** అంటాము. కాని, అట్టి పరమేశ్వరుని తెలుసు కొనేందుకు మనం సిద్ధ పరచుకొనే సాధనలను కూడా జ్ఞానం అనే అంటాము. పదమూడవ అధ్యాయంలో అమానిత్వాది సాధనలను తెలిపిన తరువాత, చివరగా పదకొండవ శ్లోకంలో భగవానుడు 'ఇదే జ్ఞానం అని చెప్పబడింది' ***(ఏతత్ జ్ఞానం ఇతి ప్రోక్తం)*** అన్నాడు. జ్ఞానం ఎంత పవిత్రమో, జ్ఞాన సాధనలు కూడా అంతే పవిత్రము. కనుక గతి అంటే గమ్యము, అలాగే మార్గము అని కూడా గ్రహించ వచ్చు. గ్రహించాలి కూడా ***(గమ్యతే అనయా ఇతి గతిః).*** అవగతి అంటే జ్ఞానము. ఆత్మజ్ఞానము. ఆత్మ, ఆత్మజ్ఞానము వేరు కావు. కనుక, అవగతి స్వరూపమైన ఆత్మ గమ్యమే. అలాగే జ్ఞానస్వరూపమైన ఆత్మను పొందే మార్గము కూడా జ్ఞానమే కావడం చేత, మార్గం ప్రాప్తిస్తే గమ్యం సిద్ధించినట్లే కనుక ఇటు జ్ఞానమార్గము, అటు జ్ఞానగమ్యము రెండూ 'గతి' శబ్దంతో చెప్పబడ్డాయి.

జీవనదులకు సముద్రము ఎలా గమ్యమో, జీవులకు పరమేశ్వరుడు అలా గమ్యము. ఆయనే గతి. సామ వేదంలో వాసిష్ఠ శాఖ యందు ప్రశ్నోత్తర సహితంగా ఒక అందమైన వాక్యం ఉంది. ***అథ కస్మాదుచ్యతే గతిః ఇతి. బ్రహ్మైవ గతి రితి తద్ధి గమ్యతే పాప విముక్తైః*** - 'గతి అని ఎందుకు చెప్పవలసి వచ్చింది? బ్రహ్మమును గతి అని చెప్పుట ఎందులకు?' అనేది ప్రశ్న. 'పాపము నుండి, లేదా అజ్ఞానము నుండి విముక్తు లైన వారి చేత పొంద బడుతూ ఉన్నందున బ్రహ్మమును గతి అని చెప్పడం జరిగింది' అనేది సమాధానము.

ప్రస్తుతం మనం అధ్యయనం చేస్తున్న ఈ శ్లోకంలో ***గతిః*** అంటే కర్మఫలము అని అర్థము ***(గతిః కర్మఫలమ్).*** ఇక్కడ కర్మఫలము అన్నప్పుడు ఎవరి కర్మకు ఏది ఫలమో అదే వారి కర్మఫలము. పుణ్యాత్ములకు స్వర్గం ఫలం. పాపాత్ములకు నరకం ఫలం. మోక్ష సాధకులకు మోక్షమే ఫలం. సర్వ కర్మల ఫలితాలు పరమేశ్వరుని అధీనంలో ఉన్నందున ఆయన సర్వులకు గతి. ఈ సత్యం అర్థమైతే, అక్రమ మార్గాలలో చరించి బ్రతుకును అన్యాయం చేసుకోవడం కన్నా, బ్రతుకుకు భగవంతుడే గతి అని నిర్ధారణ చేసికొని, మోక్ష మార్గంలో పయనించి తరించడమే శ్రేయస్కరము అని నిశ్చయ మవుతుంది.

చరణము: **నను కరుణించిన భక్తివి నీవే**
నేను వరించిన ముక్తివి నీవే
నీ వెంట పడితే మిగలదు మోహము
నీవు వెంట రాగా వెలుగును మోక్షము

పల్లవి: **రాధా రమణ - రాదేల కరుణ?**
దేవకి నందన - నాకేల వేదన?

అనుపల్లవి: **జీవుల గమ్యము నీవే కావా!**
బ్రతుకు సంద్రమున నీవే నావ ॥ రాధా ॥

అని గమ్యాన్ని ఎరుక పరుస్తూ, గతి రూపుడైన గోవిందుని కీర్తించింది చైతన్య గీతిక.

భావం లేకుండా కర్మ చేయలేము. భావన మనస్సులో కదలాలి అంటే మనస్సుకు సత్తా స్ఫురణలు ఉండాలి. అట్టి చైతన్యము పరమేశ్వరుడే గాని మరొకరు కాలేరు. అలా చూచి నపుడు ఆయన మన కర్మలకు మూలమై ఉన్నాడు ***(కర్మాణాం కర్తా).***

మనం ఆచరించే కర్మలకు ఫలాలను ప్రసాదించే వాడు కూడా తానే ***(తత్ఫలానాం చ కర్తా).*** ఒక ప్రదేశంలో, ఒక కాలంలో మనం కర్మ చేస్తే, దాని ఫలితం మరొక ప్రదేశంలో, మరొక కాలంలో అందుతుంది.

గ్వాలియర్‌లో కర్మ చేస్తాం. గోవాలో ఫలాన్ని అనుభవిస్తాం. కర్మ చేయడం లోనే మనకు అధికారం ఉంది. ఏ కర్మకు ఏ ఫలం ఇవ్వాలో, ఎప్పుడివ్వాలో, ఎంత ఇవ్వాలో, ఎక్కడ ఇవ్వాలో, ఎందుకు ఇవ్వాలో, ఎలా ఇవ్వాలో ఇవన్నీ మనకు తెలియవు. అవన్నీ పరమేశ్వరుని అధీనంలో ఉన్నాయి. అందుకే ఆయన గతి. అందరికీ ఏకైక గతి.

భర్త

పోషించే వాడు కనుక భగవంతుడు భర్త ***(భర్తా పోష్టా).*** సమస్తాన్ని భరించే వాడు తానే. విశ్వానికి ఆయనే భర్త. వ్యక్తికి కూడా భర్త భగవంతుడే.

కుటుంబాన్ని పోషించే వాడు భర్త అని చెప్పుకుంటూ ఉంటాము. ప్రపంచా న్నంతటినీ పోషించే వాడు పరమాత్మ. విశ్వ మంతటికి తానే ఆధారమై, అధిష్ఠానమై పోషించే వాడు పరమాత్మ ***(ప్రపంచస్య అధిష్ఠానత్వేన భరణాత్ భర్తా).*** ప్రపంచానికి అధిష్ఠానంగా ఉంటూ సత్తాస్ఫూర్తులను కలిగించే వాడు కనుక ఆయన భర్త. స్థితి కారకుడు.

అంతేకాదు. జగత్తు నడవడానికి ఏ ధర్మాలు అవసరమో, ఆ ధర్మాలను ఏర్పరచిన వాడు, అట్టి ధర్మాల రూపములో ఉండువాడు తానే ***(ధర్మస్య భర్తా).*** సూర్య చంద్ర నక్షత్రాదులను నియమించే వాడు తానే. నదీ సాగర పర్వతాలను కదిలించే వాడు, ఆపేవాడు తానే. అన్ని రూపాలలో ధర్మ వైభవంతో శోభిస్తూ విశ్వాన్ని పోషిస్తూ ఉన్నందున పరమేశ్వరుడు భర్త.

భారాన్ని మోస్తూ తిరిగే శక్తి దేహానికి ఉంది. చూచే శక్తి, వినే శక్తి ఇంద్రియాలకు ఉన్నాయి. ఆలోచించే శక్తి మనస్సుకు ఉంది. ఆ శక్తి అంతా ఒక్కటే. అదే భగవంతుని శక్తి. ఆ శక్తి ఉండటం చేతనే సంసారాలు నిలుస్తున్నాయి. అలా పోషించే శక్తి మరొకరికి లేదు. అందుకే ఆయన భర్త.

ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తి అన్నీ భగవంతుడు ప్రసాదించిన శక్తులే. రాత్రి పూట ఆదమరచి నిద్ర పోతాము. నిద్రలో అన్నీ మరచి పోతాము. నిద్ర లేవగానే తిరిగి మన స్మృతిని మనకు అనుగ్రహించి మనల్ని పోషిస్తాడు. నిద్రలో లేని స్మృతి, నిద్ర లేవగానే తిరిగి రాకపోతే, జీవనము ఎలా ఉంటుందో ఊహించుకో లేము. ఆయన ఇస్తేనే ఏదైనా. ఆయన అనుగ్రహం తోనే ఏ పోషణ అయినా. సమస్తానికి ఆయనే మూలం.

ఓట్లు పడితేనే గెలిచాను అని గెలిచిన నాయకుడు అనుకోవచ్చు. అలా అయితే, ఓడిపోయే వారికి కూడా ఓట్లు పడుతున్నాయి కదా! ఓట్లు వేయించుకొని మరీ ఓడి పోతున్నారు. అందుకే గెలుపు ఓటములు దైవాధీనాలు అన్నారు. ఒకవేళ ప్రజలు ఓటు వేసి అతణ్ణి నాయకుణ్ణి చేసినా, పరమాత్మ కృప లేకపోతే సభ్యులు అవిశ్వాసం ప్రకటించి దించేస్తారు.

దేహాన్ని పోషించేది కూడా దైవమే. దైవము తప్పుకుంటే దేహం రాలి పోతుంది. చనిపోయిన వ్యక్తి ప్రక్కన కూర్చుని ఏడుస్తూ ఉంటారు. 'నన్ను విడిచి పోయావా, నా దేవుడా!' అని అర్ధాంగి రోదిస్తూ ఉంటుంది. పోయిన వాడు భర్త. అంటే పోషించే వాడు పోయాడు. కాని పోయింది దేవుడు అని ఎందుకు రోదిస్తూ ఉంది? భర్త పోషించ వచ్చు. వాస్తవానికి పోషకుడు పరమేశ్వరుడే. ఆయనే భర్త. స్త్రీల కైనా, పురుషుల కైనా, బాలల కైనా, వృద్ధుల కైనా ఆయనే భర్త.

పెళ్ళి అయిన తరువాత భార్యకు భర్త రావచ్చు. ఆమెను పోషించ వచ్చు. పెళ్ళి కాక ముందు ఆమెను పోషించింది ఎవరు? భర్త మరణించిన తరువాత పోషించే దెవరు? గత జన్మలలో పోషించిం దెవరు? అతడే పోషకుడు, పోష్టా. భర్త. అందుకనే భర్త దేహం అక్కడే పడి ఉన్నా, 'పోయావా! నా దేవుడా!' అని భార్య ఏడుస్తూ

ఉంది. దేవుడు పోలేదు. దేవు డిచ్చిన వాడు పోయాడు. దేహం అనే ఇల్లు ఉంది. ప్రాణం అనే దీపం ఆరి పోయింది. కాని, ప్రాణ దీపాన్ని వెలిగించిన దేవుడు ఎక్కడికీ పోలేదు.

నిలవదు ప్రాణము దేహములో
తరగదు ప్రేమ దైవములో
ప్రాణము పోసేది దైవము
పార బోసేది దేహము
దేహము లోనే చిత్తము
చిత్తము లోనే దైవము
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్

అని రామజోగి చిట్కా.

ప్రభువు

ప్రభువు అంటే శాసించే వాడు. అధిపతి. పాలించే వాడు. స్వామి **(ప్రభుః స్వామీ).** ప్రపంచ మంతా ఆయన పాలన లోనే ఉంది. విశ్వాన్ని నియమించే వానికి విశ్వానికి సంబంధించిన పూర్ణజ్ఞానం ఉండాలి. అట్టి విశ్వజ్ఞుడు, సర్వజ్ఞుడు పరమేశ్వరుడే గాని మరొకడు కాడు. అందుచేత ఆయన విశ్వానికి ప్రభువు. రాజ్యాన్ని పాలించే వాడు కదా ప్రభువు? అని మీరు ప్రశ్నించ వచ్చు. భగవంతుడు అలాంటి ప్రభువు కాడు. ఆయన ప్రభువులకు ప్రభువు.

మనం ప్రభువుకు నమస్కరిస్తాము, ఆయన మనలను పాలిస్తున్నాడు కనుక. ఆ ప్రభువే పూజాగదిలో కూర్చుని పరమేశ్వరునికి నమస్కరిస్తూ ఉంటాడు. ఎందుకని? ఆయన ప్రభువులకు ప్రభువు కనుక.

ఒక కాలంలో ఒక రాజ్యాన్ని, ఒక ప్రభువు తన పరిమిత జ్ఞానంతో, పరిమిత శక్తితో పోషించ వచ్చు. కాని, ఆ ప్రభువు పుట్టక ముందు దేశంలో ప్రభుత్వమే లేదా? ఆ ప్రభువు మరణిస్తే, ప్రభుత్వం లేకుండా పోతుందా? ప్రభువులు రాక ముందు సృష్ట్యాది నుండి ఏ ప్రభువైతే పరిపాలిస్తున్నాడో, రేపు ప్రభువులు నిష్క్రమించినా, ప్రళయం వరకు ఆ ప్రభువే పరిపాలిస్తూ ఉంటాడు. ఆయనే భగవంతుడు. ఆయనే స్వామి. ఆయనే ప్రభువు. కాలానికి, దేశానికి పరిమితం కాని ప్రభువు. అందుకే ఆయనను భూత భవ్య భవత్ప్రభువుగా కీర్తించింది విష్ణుసహస్రనామము.

భూత భవ్య భవత్ప్రభుః - కాలాలు మారినా, దేశాలు మారినా, మారని ప్రభువు ఒక్కడే కనుక, ఒకే సమాసంలో ప్రభువును కీర్తించింది విష్ణుసహస్రనామము. **భూతం భవ్యం భవచ్చ ఇతి భూత భవ్య భవన్తి తేషాం ప్రభుః** - భూతకాలంలో, వర్తమానంలో, భవిష్యత్తులో ఉండే వారందరికీ ఆయనే ప్రభువు కనుక ఆయన భూత భవ్య భవత్ప్రభువు.

సాధారణంగా ప్రభువు బాహ్యంలో శాసించ గలడే గాని, ఆంతర్యాన్ని శాసించ లేడు. కాని, భగవంతుడు బాహ్యాభ్యంతరాలను శాసించే సర్వ శక్తిమంతుడు. ఒక వ్యక్తి నేరం చేస్తే, ఆ వ్యక్తిని కారాగృహంలో బంధించి రాజు శిక్షించ గలడు. భౌతికంగా అతణ్ణి కారాగృహంలో బంధించ గలడే గాని, అతని మనస్సును శిక్షించ గలడా? ప్రపంచం లోకి వెళ్ళి పచార్లు చేయకుండా మనస్సును ఆప గలడా? అలా చేసే శక్తి సామర్థ్యాలు ప్రభువైన పరమేశ్వరునికే ఉన్నాయి. అందుచేతనే నేరస్థులు చట్టాన్ని తప్పించుకో గలుగుతారు కాని, దైవాన్ని

తప్పించుకో లేరు. నేను ఈ తప్పు చేయకుండా ఉంటే బాగుండేది అని నేరస్థుడు ఆంతర్యంలో కుమిలి పోతూ ఉంటాడు. ఆ బాధ భౌతిక శిక్ష కన్నా భయంకరంగా ఉంటుంది. ఆ శిక్షను విధించిన ప్రభువు ఎవరు? అతడు లోకానికి సంబంధించిన ప్రభువు కాడు. సర్వలోకాధీశుడు. సర్వేశ్వరుడు.

సాక్షి

ప్రాణులు చేసిన కర్మలను, చేస్తున్న కర్మలను, చేయని కర్మలను తటస్థంగా ఉండి వీక్షించే వాడు కనుక భగవంతుడు సాక్షి ***(సాక్షీ ప్రాణినాం కృతాకృతస్య).*** సమస్తాన్ని మరొక దాని సహాయం లేకుండా దర్శించే వాడు. మనం దేనిని చూడాలన్నా కళ్ళ ద్వారానే చూడాలి. చూచినా కళ్ళు అర్థం చేసుకోలేవు కనుక, కళ్ళు చూచిన దానిని మనస్సుతో అర్థం చేసుకుంటాము. చూచే కళ్ళు అర్థం చేసుకోలేవు. అర్థం చేసుకొనే మనస్సు చూడలేదు. అందుచేతనే, న్యాయ స్థానాలలో సాక్షులు ఉన్నా, సాక్ష్యాలు ఉన్నా, అన్ని వేళల అవి సత్య సాక్ష్యాలు కాలేక పోతున్నాయి.

శబ్దాలను చెవులు వింటాయి. కాని అర్థం చేసుకోలేవు. చెవులు వినిన శబ్దాలను మనస్సు అర్థం చేసుకుంటుంది. కాని, మనస్సు స్వయంగా వినలేదు. కనుక, చెవులకు వినిపించింది మనస్సుకు మరో విధంగా అనిపించ వచ్చు. అలా అనిపించడానికి అనువుగా మనస్సులో ఎన్నో పూర్వానుభవాలు ఉంటాయి. ఈ కారణం చేత చాలా సమయాలలో తీర్పులలో ఊహించని మార్పులు చోటు చేసుకుంటూ ఉంటాయి. మనం మానవులం. పరిమితులం. అంతకు మించి ఏమీ చెయ్యలేము.

కాని, భగవంతుడు సర్వసాక్షి. సాక్షాత్తు సాక్షి. సర్వధీ సాక్షి. కనుక ఏదీ ఆయన చూపును తప్పించుకొని పోలేదు ***(సాక్షాత్ ఈక్షతే).*** ఆయన చూడటానికి ఉపాధులు, ఉపకరణాలు అవసరం లేదు. ఆయనది జ్ఞానదృష్టి. కనుక ఎవరు ఏది చేసినా, ఎవరు ఏది చేయక పోయినా, అంతా ఆయనకు తెలుసు ***(సర్వేషాం ప్రాణినాం కృతాకృతం సర్వం పశ్యతి).***

జగత్తు యొక్క సృష్టి స్థితి లయాలకు సాక్షి తానే. అలాగే వ్యక్తిలో నిరంతరము సాగే అవస్థాత్రయానికి కూడా సాక్షి తానే ***(అవస్థాత్రయ సాక్షీ).*** మనం చేసే కొన్ని కర్మలకు ఇతరులు సాక్షులు కావచ్చు. కాని భగవంతుడు సర్వకర్మ సాక్షి. అంతే కాదు. బాహ్యంలో జరిగే కర్మలను కదిలించే ఆలోచనలకు, వాటి వెనుక ఉన్న ఉద్దేశ్యాలకు కూడా సాక్షి తానే ***(సర్వధీ సాక్షిభూతం).*** అందుచేతనే, ఎంతటి వారైనా, ఎవరికీ భయపడని వారైనా, సాక్షీ గోపాలు డంటే కంపించి పోతారు.

ఒకడు న్యాయస్థానంలో సాక్ష్యం చెప్పడానికి వెళ్ళి సాక్షిగా నిలబడతాడు. ఒకటి చూచి మరొకటి చెబుతాడు. కళ్ళకు కనిపించింది చెప్పకుండా మనస్సుకు అనిపించింది చెబుతాడు. కాని, అలా చెప్పేవాడి మనస్సు లోని మర్మాన్ని కూడా పరమేశ్వరుడు సాక్షిగా వీక్షిస్తాడు.

మన కృత్యాకృత్యాలను సాక్షిగా వీక్షిస్తాడు కనుకనే, మొదటి విశేషణ మైన 'గతి' రూపంలో నిలిచి కర్మఫలాలను ప్రసాదిస్తాడు. బాధలు చుట్టుముట్టి నపుడు, 'భగవంతుడు నన్నిలా ఎందుకు పుట్టించాడో!' అంటూ ఉంటారు. అలా పుట్టించింది భగవంతుడు కాదు. కర్మఫలం. ఎవరికి వారు చేసుకున్నదే. చేసుకుని తెచ్చుకున్నదే. కొని తెచ్చుకున్నదే. భగవంతుడు సదా సాక్షీమాత్రుడే.

పరిస్థితులు జీవితంలో వక్రించి నపుడు, తలపెట్టింది ఏదీ తోడు రానపుడు, 'ఏం చేద్దాం! నా తలరాత అలా తగలడింది' అంటూ ఉంటారు. తలరాత వ్రాసిం దెవరు? ఏమో! భగవంతుడు మాత్రం కానే కాదు. అంతవరకు నాకు బాగా తెలుసు.

భగవంతుడు తల మాత్రమే ఇచ్చాడు. ఆ వ్రాసుకునే దేదో మనమే వ్రాసుకున్నాం. పలక మీద చిన్న పిల్లవాడు అక్షరాలు వ్రాసుకున్నట్లు, మన తలల మీద మనమే మన కర్మల వివరాలను వ్రాసుకున్నాం. కాకపోతే, దేవుడు సాక్షి కనుక మౌనంగా చూస్తూ ఉంటాడు. ఈ కారణం గానే కొందరు నిర్దోషులు దోషులుగా నిర్ణయింపబడి నపుడు, బాధతో వారు కుంచుకు పోతూ, 'ఎవరే మనుకున్నా ఆ దేవుడి కన్నీ తెలుసు. ఆయన అన్నీ చూస్తూనే ఉన్నాడు' అంటూ ఉంటారు. ఇది అక్షర సత్యం. అక్షరాలు తెలియని నిరక్షరాస్యులు కూడా ఈ పుణ్య సంస్కృతిలో పలికే సత్యవచనం.

నివాసము

ప్రాణు లన్నిటికి నివాస స్థానము కావడం చేత భగవంతుడు నివాసము ***(యస్మిన్ ప్రాణి నః నివసన్తి, నివాసః).*** పరమేశ్వరుడు సర్వభూత నివాస స్థానము. అన్నిటికి, అందరికి ఉనికి ఆయనే. అందరి మనుగడకు ఆధారమైన వాడు తానే.

ఏది ఉన్నా, అది అలా ఉంది అంటే, దేని వల్ల అది అలా ఉందో, అందులోనే అది ఉంది. అదే దానికి నివాస స్థానము. ఆకాశము ఉంది. కాలము ఉంది. అన్నీ ఆకాశం లోనే ఉండవచ్చు. కాలం లోనే కనిపించ వచ్చు. కాని, 'ఆకాశము ఉంది' అన్న వాక్యములో 'ఉంది' అనేది ఏదో, అందులోనే ఆకాశం ఉంది. అదే సత్యము. ఆ సత్యరూపుడే పరమేశ్వరుడు. ఆకాశము ఎప్పుడైతే పరమేశ్వరుని యందే ఉందో, ఆకాశములో ఉన్న వన్నీ భగవంతుని యందే ఉన్నాయి అని అర్థము. కనుకనే భూతము లన్నీ నా యందే ఉన్నాయి ***(మత్‌స్థాని సర్వ భూతాని*** *9 వ అ - 4 వ శ్లో*) అన్నాడు భగవంతుడు. అంటే, సర్వభూతాలకు నివాస స్థానము తానే అని భావము.

శరణం

శరణమ్ అంటే రక్షకుడు అని అర్థము. బాధల నుండి రక్షించ మని తనను ఆశ్రయించిన భక్తులకు ఆశ్రయ మైన వాడు కనుక భగవంతుడు శరణము ***(శరణమ్ ఆర్తానాం మత్ప్రపన్నానామ్ ఆర్తిహరః).*** భక్తుల ఆర్తిని పోగొట్టే వాడు కనుక ఆయన శరణము.

ఆర్తి అంటే బాధ, లేక దుఃఖము అని అర్థము. బాధల్ని భరించడం, దుఃఖాన్ని సహించడం ఎవరి కైనా కష్టమే. ఈ దుఃఖము మళ్ళీ రెండు విధాలు. ఒకటి సంసారములో దుఃఖము. రెండవది సంసార దుఃఖము. అంటే దుఃఖరూప సంసారము. జనన మరణ రూప సంసార దుఃఖము. ఈ రెండు దుఃఖాలను పోగొట్టే సామర్థ్యము భగవంతుడి కొక్కడికే ఉన్నందున ఆయన సర్వులకు శరణమై ఉన్నాడు ***(ఆర్తానాం ఆర్తి హరణాత్ శరణమ్).***

మొసలి గజేంద్రుని మడుగు లోకి ఈడుస్తూ ఉంటే, తనకిక పరమేశ్వరుడు తప్ప మరో దిక్కు లేదు అని గ్రహించిన గజేంద్రుడు, **ఈశ్వరునే శరణంబు వేడెదన్** అని తన ఆర్తనాదాన్ని వినిపించ గానే, **గజప్రాణావనోత్సాహి** యైన శ్రీహరి గగన మార్గాన వచ్చి, తన సుదర్శన చక్రముతో మొసలి శిరస్సును ఖండించి, గజేంద్రుని ఆర్తిని పోగొట్టి, **శరణమ్** అని సార్థక నామధేయు డయ్యాడు.

సంసారము లోని దుఃఖాలను పోగొట్ట మని పరమేశ్వరుని ఆశ్రయించే భక్తులకు ఆయనే శరణము. అలాగే జనన మరణ సంసార దుఃఖమును పోగొట్టి మోక్షమును ప్రసాదించ మని భగవంతుని ఆశ్రయించే ముముక్షువులకు కూడా ఆయనే శరణము. 'నాకు శ్రేయస్సును బోధించు' అని విషాద వదనుడై ప్రార్థించిన అర్జునునికి గీతను బోధించి మోక్షాన్ని ప్రసాదించి భగవానుడు **శరణమ్** అయ్యాడు.

సుహృత్

ప్రత్యుపకారాన్ని ఆశించకుండా ఉపకారం చేసేవాడు ***సుహృత్.*** అట్టివాడు పరమేశ్వరు డొక్కడే ***(సుహృత్ ప్రత్యుపకార అనపేక్షీ సన్ ఉపకారీ).*** ఎవరి నుండైనా మనం ఉపకారం పొందాలి అంటే, ఒకటి, మనం అతనికి తెలిసి ఉండాలి. లేదా, అతనికి సన్నిహితుడైన వాడు మనకు యోగ్యతా పత్రాన్ని ఇవ్వాలి. అప్పుడే మనకు ఉపకారం అందుతుంది. ముక్కు మొగం తెలియని వారికి ఎవ్వరూ ఉపకారం చెయ్యరు. కాని, పరమేశ్వరుడు అలా కాదు. అవసరం ఉండి, ఆర్తితో ఆయన నుండి ఉపకారాన్ని కోరిన వారందరికీ, తిరిగి ప్రత్యుపకారాన్ని ఆశించకుండా ఉపకారం చేస్తాడు. అందుకే ఆయన సుహృత్తు ***(ప్రత్యుపకార నిరపేక్షతయా ఉపకారిత్వాత్ సుహృత్).***

ఎటువంటి ప్రత్యుపకారాన్ని ఆశించకుండా, ఏ విధమైన ఉపకారాన్ని చేయడాని కైనా పరమేశ్వరుడు సిద్ధంగా ఉన్నా, జనులు బాధల్లో పడి మ్రగ్గుతుంటారే గాని పరమాత్మను ఆశ్రయించి ఫలితాన్ని పొందలేక పోతారు. ప్రారబ్ధాన్ని అనుసరించి బ్రతుకులో ప్రతికూలాలు ఏర్పడతాయి. భగవంతుని ప్రార్థించడం అనేది పురుషార్థానికి సంబంధించిన విషయం. బాధలు వచ్చినంత మాత్రాన మనుషులు భగవంతుని ప్రార్థించ లేరు? బాధలలో ఏడవ గలరే గాని పరమేశ్వరుని వేడుకో లేరు. అలా వేడుకోవాలి అంటే, సంస్కారం ఉండాలి. భక్తి సంస్కారం అలవడి ఉండాలి. అప్పుడే ప్రార్థించ గలరు.

ప్రార్థించడం అనేది కర్మ. ప్రార్థన అనే కర్మకు ఫలితం దయ. సంస్కారి భగవంతునికి నమస్కరించి ప్రార్థిస్తాడు. భగవానుడు **సుహృత్** పాత్రను పోషించి, ప్రత్యుపకారాన్ని ఆశించకుండా ఫలితాన్ని ఇచ్చి ఉపకారం చేస్తాడు.

నదిలో నీళ్ళు ప్రవహిస్తూ ఉంటాయి. ఎవరైనా వెళ్ళి కడుపు నింపుకో వచ్చు. అలాగే పరమేశ్వరుని దయామృతం సదా ప్రవహిస్తూనే ఉంటుంది. అది ఏ ఒక్కరికో పరిమితం కాదు. ఎవ్వరైనా ప్రార్థించి దానిని పొందవచ్చు. అందుకనే, సర్వభూతాలకు పరమాత్మ **సుహృత్** అని ఐదవ అధ్యాయం లోనే గీతాచార్యుడు ప్రకటించాడు ***(సుహృదం సర్వభూతానాం,*** *5 - 29*). కేవలం ఈ జన్మ లోనే కాదు. భక్తులకు ఆయన శాశ్వత మిత్రుడు.

ప్రభవ ప్రళయ స్థానాలు

జగత్తు దేని నుండి పుడుతుందో అది జగత్తు యొక్క ప్రభవ స్థానము. అట్టి ఉత్పత్తి స్థానము భగవంతుడే ***(ప్రభవః ఉత్పత్తిః జగతః).*** జగత్తు తిరిగి ఎక్కడ లయ మవుతూ ఉందో, అది జగత్తు యొక్క విలయ స్థానము. అది కూడా భగవంతుడే ***(ప్రలయః ప్రలీయతే యస్మిన్ ఇతి).*** అలాగే జగత్తు ఎక్కడ స్థిరంగా ఉందో అది స్థితి స్థానము. అది కూడా భగవంతుడే ***(తథా స్థానం తిష్ఠ త్యస్మిన్ ఇతి).***

అలలు సముద్రం నుండి పుడతాయి. పుట్టిన అలలు, అవి ఉన్నంత వరకు సముద్రం లోనే ఉంటాయి. ఆ తరువాత సముద్రం లోనే విలీన మవుతాయి. కనుక అలలకు ప్రభవ స్థానము, ప్రళయ స్థానము సముద్రమే. సముద్రము ఏకము. పూర్ణము.

అలాగే జగత్తు పరమాత్మ నుండే పుడుతుంది ***(ఎవ్వనిచే జనించు జగము).*** అలా పుట్టిన జగత్తు ఉన్నంత వరకు పరమాత్మ యందే మనుగడను సాగిస్తుంది ***(ఎవ్వని లోపల నుండు లీనమై).*** ఆ తరువాత పరమాత్మ యందే విలీన మవుతుంది ***(ఎవ్వని యందు డిందు).*** జగత్తుకు ప్రభవ స్థానము, ప్రళయ స్థానము, స్థితి స్థానము పరమేశ్వరుడే. ఆయనే మూల కారణము. ఆయనే అనాది మధ్య లయుడు. సర్వమూ తానైన వాడు అతడే. అతడే ఆత్మభవుడు. అలలకు అబ్ధి ఎలా శరణమో, జగత్తుకు పరమాత్మ అలా శరణమై ఉన్నాడు.

నిధానం

నిధి, లేదా నిక్షేపాన్ని ***నిధానం*** అంటారు. కాలాంతరంలో ప్రాణులు అనుభవించే నిధిని, లేదా నిక్షేపాన్ని నిధానం అంటారు ***(నిధానం నిక్షేపః కాలాన్తరో పభోగ్యం ప్రాణినామ్).*** వస్తువులను దాచి ఉంచే, లేదా నిల్వ చేసే స్థానమును నిధి, లేదా నిధానము అంటారు. అది ఒక ట్రెజరీ లాంటిది. లేదా బ్యాంక్ లాంటిది. బ్యాంకులో ఆభరణాలు, ధనం మనం దాచుకుంటాము. అవసర మైనపుడు తీసుకుంటాము.

అలాగే మనం ఆచరించిన కర్మల యొక్క ఫలాలు భవిష్యత్తులో భోగార్థం మనకు అందుతాయి. మరి, ప్రస్తుతం అవి ఎక్కడున్నట్లు? పరమేశ్వరుని యందే గుప్తంగా ఉన్నాయి. భవిష్యత్తులో సానుకూల సమయంలో, ప్రదేశంలో అనుభవింప బడటానికి నిరీక్షిస్తున్న కర్మఫలాలు, ప్రస్తుతం పరమేశ్వరుని యందే భద్రంగా ఉన్నాయి. అందుచేత, ఆయన నిధానము. మనకు అన్నీ ఆయన నుండే అందుతున్నాయి.

నిద్రలో ఏవీ మన వద్ద ఉండవు. గొప్ప సంగీత విద్వాంసుడైనా నిద్రలో సంగీతాన్ని తన వద్ద ఉంచుకో లేడు. ఉంచుకో గలిగితే, నిద్రిస్తూ ఆయన గారు పెట్టే గురక ఎంత మోహనంగా ఉండేదో కదా! అంతేగాని, గేదె కుడితి త్రాగినట్లు, అంత దారుణంగా అపశ్రుతి ఎందు కుంటుంది?

నిద్రలో మన సంగీతం, మన వ్యాకరణం, మన జమాఖర్చులు ఏవీ మన వద్ద ఉండవు. మరి, అవన్నీ ఏమైనట్లు? ఏమీ కావు. అన్నీ భగవంతుని వద్దే ఉంటాయి. ఆయన నిధానం కదా! అన్నీ దాచి పెడతాడు. మళ్ళీ నిద్ర లేవగానే అడగకుండానే అన్నీ తగిలిస్తాడు.

అలాగే ప్రళయ కాలంలో జగత్తు లయించి పోతూ ఉంది కదా! మళ్ళీ సృష్ట్యాదిలో ఆ లయించిన వన్నీ తిరిగి పుడుతున్నాయి. అంటే, ప్రళయంలో అవన్నీ నిధానమైన భగవంతునిలో నిక్షేపంలా ఉంటాయి అని అర్థం ***(ప్రళయ కాలే అస్మిన్ సర్వం నిధీయతే ఇతి నిధిః).*** అందుకే ఆయన నిధానము.

మనకు మోక్షాన్ని ప్రసాదించే వాడు జనార్దనుడు. మోక్షము ఉన్నదే అయినా, నిత్య సిద్ధమే అయినా, అది అలా ఉన్నట్లు తెలిసి నపుడే మోక్షము కలుగుతుంది. ఆ దివ్య క్షణం భవిష్యత్తులో రానుంది. కాలాంతరంలో అంద బోతోంది. మరి, అది ఇప్పు డెక్కడుంది? నిధానంలో నిక్షేపంలా ఉంది. ఈ భావన ఎంత పారవశ్యాన్ని కలిగిస్తుంది? నిధానానికి సంబంధించిన ఆలోచనే మనకు అంతటి ఆనందాన్ని కలిగిస్తే, ఆ నిధానాన్ని కళ్ళారా చూచిన ప్రహ్లాదుడు ఎలా తన్మయు డయ్యాడో! ఎలా పొంగి పోయాడో! ఒళ్ళు మరచి ఎలా గంతు లేశాడో పోతనామాత్యుడే చెప్పాలి.

నలినాక్షుడను నిధానము గంటి నేనని యుబ్బి గంతులు వైచు నొక్కచోట

కమలాక్షు డనే నిధానాన్ని (మోక్షరూపుణ్ణి) కళ్ళారా చూశాను - కళ్ళారా చూశాను - కళ్ళారా చూశాను అని ఒళ్ళు మరచి గంతు లేశాడట. ఆ నిధానమే మన నిధాన మగు గాక!

అవ్యయ బీజము

నశించని బీజము కావడం చేత పరమేశ్వరుడు అవ్యయ బీజము. సంసార మనే వృక్షానికి పరమేశ్వరుడు అవ్యయ బీజము. ఈ బీజము అంకురించే ధర్మం గలది. అంకురించే శక్తి గలది. అంకురించే ధర్మం గల ఈ బీజము అంకురించడానికి కారణమైన బీజము ***(బీజం ప్రరోహ కారణం ప్రరోహ ధర్మిణామ్).***

ఏ బీజమైనా అంకురించ గానే, అంటే మొలకెత్త గానే నశిస్తుంది. కాని, ఈ బీజము నశించదు.

అవ్యయంగా ఉంటుంది. అందుచేత నశించని స్వభావం గల ఈ బీజమును అవ్యయ బీజము అనడం జరిగింది. సంసారం ఉన్నంత వరకు ఇది ఉంటుంది. అందుచేత ఇది నశించనిది ***(యావత్ సంసార భావిత్వాత్ అవ్యయం).***

బీజం లేకుండా ఏదీ అంకురించదు ***(న హి అబీజం కించిత్ ప్రరోహతి).*** మరి సంసారము, అనగా ఈ ప్రపంచము నిత్యము అంకురిస్తూనే ఉంది కదా! అందుచేత అది నశించని బీజము ***(నిత్యం చ ప్రరోహ దర్శనాత్ బీజ సంతతిః నిత్యా ఇతి గమ్యతే).*** అనాదిగా ఉంటూ, సదా పరివర్తనం చెందుతూ ప్రవర్తమాన మైన ఈ సంసార వృక్షానికి నశించని బీజము పరమేశ్వరుడే ***(బీజ మవ్యయమ్).***

ప్రపంచంలో ఏది కార్యంగా గోచరించినా దానికి కారణం ఉంటుంది. ఆ కారణమే బీజము. ఇలా నిరంతరం సాగే ఈ కార్యకారణాలలో ఆలోచించి చూస్తే ప్రతి కారణము కార్యం గాను, ప్రతి కార్యం కారణం గాను కనిపిస్తూ ఉంటాయి.

ఒక ఆవు దూడకు జన్మ నిస్తుంది. ఆవు కారణము, దూడ కార్యము. ఆ దూడ పెరిగి పెద్దదై ఆవు అవుతుంది. తిరిగి అది మరొక దూడకు జన్మ నిస్తుంది. అంటే పూర్వం దూడగా కార్య మైనది, ఇప్పుడు ఆవుగా కారణమైంది. కాని, కాలంలో ఆవులు, దూడలు నశించి పోతూ ఉంటాయి. అంటే, ప్రపంచంలో కనిపించే కారణకార్యాలు ఒక వైపు నశించి పోతున్నా, మరో వైపు అంకురిస్తూ ఈ లోకం కొనసాగుతూనే ఉంది. బీజం లేకుండా అంకురించడం జరగదు కదా! ఈ విధంగా నిత్యము అంకురించడ మనే కార్యానికి ప్రరోహ కారణము ఉంటూనే ఉంది కనుక అది అవ్యయ బీజము. అదే భగవంతుడు.

పదహారవ శ్లోకంలో ప్రారంభించిన ఈ విశ్వరూప ఉపాసనా ప్రకరణాన్ని ఇక్కడ సమాప్తం చేస్తున్నాడు.

తపా మ్యహ మహం వర్షం నిగృహ్ణా మ్యుత్సృజామి చ ।
అమృతం చైవ మృత్యుశ్చ సదస చ్చాహ మర్జున ॥ 19

తపామి-అహం-అహం-వర్షం-నిగృహ్ణామి-ఉత్సృజామి-చ
అమృతం-చ-ఏవ-మృత్యుః-చ-సత్-అసత్-చ-అహం-అర్జున

అర్జున	=	అర్జునా!	ఉత్సృజామి చ	=	కురిపిస్తున్నాను
అహం	=	నేను	అమృతం చ	=	అమృతమును
తపామి	=	తపింప చేస్తున్నాను	మృత్యుః చ	=	మృత్యువును
అహం	=	నేను	సత్	=	సత్తును
వర్షం	=	వర్షమును	అసత్ చ	=	అసత్తును
నిగృహ్ణామి	=	నిలుపుతున్నాను	అహం ఏవ	=	నేనే

అర్జునా! నేను సూర్యుణ్ణై ఉడికిస్తున్నాను. వర్షాన్ని ఆకాశంలో నిలుపుతున్నాను. మళ్ళీ కురిపిస్తున్నాను. అమృతము నేనే. మృత్యువూ నేనే. నేనే సత్తు. నేనే అసత్తు కూడా.

వ్యాఖ్య

ఆదిత్య రూపం

యావ ద్విశ్వానికి సత్తా స్ఫూర్తి ప్రదాత అయిన పరమేశ్వరుడు సూర్యునిలో నిలిచి వెలుగును, వేడిని అనుగ్రహిస్తున్నాడు. ***ఆదిత్యాత్ జాయతే వృష్టిః*** - సూర్యుని వల్లనే వర్షము కురుస్తూ ఉంది అని స్మృతి వాక్యము.

సూర్యునిలో అలా వర్షాన్ని కురిపించే శక్తి తనదే అని చెబుతూ, ***బహుధా మాం ఉపాసతే*** అంటూ పదహైదవ శ్లోకంలో ప్రారంభించిన విశ్వరూపోపాసనను కొనసాగిస్తున్నాడు.

సూర్యుడు వెలుగును చిందించి విశ్వాన్ని వెలిగిస్తాడు. అలాగే వేడివి అందించి జగత్తును ఉడికిస్తాడు. వెలుగుల ద్వారా చీకట్లను తొలగించి జగత్తుకు జీవనాన్ని ప్రసాదిస్తాడు. వేడి ద్వారా మురికివి, మంచును నిర్మూలించి జీవులకు ఆరోగ్యాన్ని అనుగ్రహిస్తాడు.

సూర్యుని నుండి విరజిమ్మబడే కిరణాలు కొన్ని తీక్షణంగా ఉంటాయి. కొన్ని వెచ్చగా, మరి కొన్ని నులివెచ్చగా ఉంటాయి. నీరెండలో కిరణాలు మృదువుగా ఉండి హాయి నిస్తాయి. సూర్య ప్రకాశం ఇన్ని విధాలుగా ఉండటానికి వెనుక నియతి ఉంది. ఆ నియతి రూపంలో ఉన్నది ఎవరో కాదు, నియంత. సూర్య కిరణాలలో ఈ విధమైన వ్యత్యాసం వెనుక ధర్మం ఉంది. ఆ ధర్మరూపంలో ఉన్నది దైవమే.

అర్జునా! నేను ఆదిత్య రూపంలో ఉంటూ తీక్షణము లైన కొన్ని కిరణాల చేత భూమిని ఉడికిస్తాను ***(తపామి అహమ్ ఆదిత్యః భూత్వా కైశ్చిత్ రశ్మిభిః ఉల్బణైః).*** కొన్ని కిరణాల చేత వానలు కురిపిస్తాను ***(అహం వర్షం, కైశ్చిత్ రశ్మిభిః ఉత్సృజామి).*** అలా కురిపించి, తిరిగి కొన్ని కిరణాల చేత ఎనిమిది మాసాల పాటు వర్షాన్ని నిలిపి ఉంచుతాను ***(ఉత్సృజ్య పునః నిగృహ్ణామి కైశ్చిత్ రశ్మిభిః అష్టభిః మాసైః).*** మళ్ళీ వర్షా కాలంలో కురిపిస్తాను ***(పునః ఉత్సృజామి ప్రావృషి).***

సూర్యుడుగా ఉంటూ పరమేశ్వరుడు గ్రీష్మం నుండి ఎండ కాసి భూమండలాన్ని ఉడికిస్తాడు. ప్రపంచం బాగా కాగిన తరువాత ఆ వేడికి జలాలు ఉడికి ఆవిరి అవుతాయి. ఆ ఆవిరిని మేఘ రూపంలో కార్తీకము నుండి ఎనిమిది మాసాల వరకు ఆకాశంలో నిలుపుతాడు **(నిగృహ్ణామి).** వర్షాకాలంలో మళ్ళీ ఆ జలాలను వర్ష రూపంలో భూమిపై పోస్తాడు.

సూర్యుని వల్ల జరిగే ఈ కార్యాలన్నీ సూర్యునిలో పరమేశ్వరుడు అంతర్వర్తిగా ఉండటం చేతనే సాధ్య మవుతున్నాయి. ఈ కార్యాలలో నియతి గోచరిస్తూ ఉండటమే అందుకు నిదర్శనం. నియతి ఉన్న చోట నియంత ఉంటాడు. నియంత సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు. కనుక నియంత ఒక్కడే గాని ఇద్దరు నియంతలు ఉండే అవకాశం లేదు. సూర్యుడు, సూర్యమండ లాంతర్వర్తి యైన నారాయణుడు, ఇద్దరూ నియంతలు కాలేరు. అందుచేత భగవంతుడే సూర్యునిలో ఉంటూ ఈ కార్యాలన్నీ నిర్వహిస్తూ ఉన్నాడు.

నియతి ఉంది కనుకనే, వాతావరణ కేంద్రం పని చేస్తోంది. నియతి లేకపోతే అంతా నిరర్థకమే. నియతిలో నియంతే ఉన్నాడు. వేడి, వెలుగు, నీరు, వర్షము - ఇవన్నీ కాలం మీద, ఋతువుల మీద ఆధారపడి ఉన్నాయి. కనుక ఋతువులు, కాలము అన్నీ పరమేశ్వరుడే.

సూర్యుని నుండి తీవ్రము లైన కిరణాలను కదిలించి భూమిని ఉడికించడం, ఆవిరిని పైకి తరలించడం, మేఘంగా ఆకాశంలో నిలపడం, తిరిగి మళ్ళీ భూమిపై వర్షంగా కుమ్మరించడం - ఇదంతా నియతి. ఈ నియతిలో దివ్యంగా నియంత శోభిస్తున్నాడు.

ఇక్కడ కేవలం నియతి ఒక్కటే కాదు. దయ కూడా దోబూచు లాడుతూ ఉంది. వేడి, వెలుగు, నీళ్ళు వర్షం - ఇవన్నీ ఎవరి కొరకు? జీవుల మనుగడకే. అదంతా భగవంతుని ప్రేమ. ఆవిరయ్యే సాగర జలాలు ఉప్పు నీరు. వాటిని సూర్య కిరణాల ద్వారా చేదుకొని, ఆకాశం లోనే ప్రయోగశాలను నిర్మించి, ఉప్పు నీటిని మంచినీరుగా, త్రాగునీరుగా, చల్లని తియ్యని పానీయంగా మార్చి క్రిందికి పోస్తున్న పరమేశ్వరుని దయను వర్ణించడం ఎవరి తరము? ఇది అర్థమైతే, విశ్వరూపోపాసన సహజంగా, సరళంగా, నిరాటంకంగా సాగుతుంది.

అమృతము - మృతము

అమృతము, మృత్యువు రెండూ పరమేశ్వరుడే. అమరులైన దేవతలు పానం చేసే అమృతము తానే. మానవులు అనుభవించే మరణమూ తానే *(అమృతం చైవ దైవానామ్ మృత్యుశ్చ మర్త్యానామ్).*

అమృత పానం చేస్తారు కనుక దేవతలు మరణించరు. అందుచేత వారు అమరులు *(న మ్రియన్తే)*. మర్త్య లోకంలో, అంటే మానవ లోకంలో ఆచరించిన పుణ్యకర్మల ఫలంగా దేవతలై స్వర్గంలో అమృతపానం చేస్తారు. అమృత పానం చేయాలి అంటే పుణ్యం ఉండాలి. పుణ్యం ఉండాలి అంటే పుణ్య కార్యాలు ఆచరించి ఉండాలి. కనుక పుణ్యకార్యాలు, పుణ్యము, పుణ్యఫలమైన స్వర్గము, స్వర్గములో లభించే అమృతము, అన్నీ పరమేశ్వరుడే. దేవతల అమృతము పరమేశ్వరుడై నపుడు, మానవుల మరణ మెవరు? మర్త్యుల మృత్యువు ఎవరు? అదీ భగవంతుడే.

మృత్యువు కూడా పరమేశ్వరుడేనా? అదెలా? ఎలాగో చూద్దాం. పుణ్యాత్ములు స్వర్గంలో అమృతపానం చేసి అమరు లవుతారు. దేవతా శరీరాలను ధరిస్తారు. సరే, బాగుంది. అమృతపానం అనేది పుణ్యకర్మల ఫలం కదా! పుణ్యకార్యాలు ఆచరించేది మానవ లోకంలో అయినపుడు, పుణ్యఫలంగా ప్రాప్తించే అమృతాన్ని ఇక్కడే పానం చెయ్యొచ్చు కదా! చెయ్యొచ్చు. కాని, అది ఇక్కడ లభిస్తే కదా! ఏది ఎక్కడ ఉండాలో అది అక్కడ మాత్రమే ఉండటము కూడా నియతే. మొక్కలో పువ్వు లుంటాయి. నదిలో నీళ్ళుంటాయి. చెట్టులో పళ్ళుంటాయి. స్వర్గంలో అమృతం ఉంటుంది. అక్కడి కెళ్తేనే అది లభిస్తుంది. అక్కడి కెళ్ళాలంటే ముందు ఇక్కడ నుండి కదలాలి. ఇక్కడ మృత మైతేనే అక్కడ అమృతం లభిస్తుంది. ఇక్కడ మానవ శరీరాన్ని త్యజిస్తేనే అక్కడ అమృత పానానికి యోగ్యమైన దేవతా శరీరం ప్రాప్తిస్తుంది. అంటే ఇక్కడ మరణించాలి కదా! అవును. అమృతం పరమేశ్వరుని స్వరూప మైనపుడు అమృత పానానికి ఉపకరించే మృత్యువు పరమేశ్వరుని స్వరూపం కాకుండా ఎలా ఉంటుంది? కనుక మృత్యువు కూడా మంగళమే. మృత్యు రూపంలో ఉండేది కూడా పరమేశ్వరుడే. పుట్టిన ప్రాణులన్నీ గిట్టకుండా ఉండిపోతే, ఆ తరువాత బ్రతికి ఉన్న వాళ్ళకు ప్రత్యేకమైన చావు అవసరమా? బ్రతుకే చావుగా మారిపోదా? కనుక మృత్యువు కూడా మంగళ స్వరూపమే. శివ స్వరూపమే.

మరణం మహేశ్వర స్వరూపము. మరి, మహేశ్వరుడు పిలవకుండానే వస్తే, ముఖం ప్రక్కకు త్రిప్పుకుంటామా? దుఃఖిస్తామా? భగవంతుని రాకను అమంగళంగా భావిస్తామా? అందుకే, మన భారతీయ సంస్కృతిలో తిరునాళ్ళలో పరమేశ్వరుడు ఊరేగుతూ వచ్చి నపుడు, మన ఇంటి ముందుకు రాగానే, కొబ్బరికాయ కొట్టి, పూలమాలను సమర్పించి, కర్పూర హారతి ఇస్తాము.

మృత్యు రూపంలో అరుదెంచేది ఈశ్వరుడే కాబట్టి, ఎక్కడ మృత్యువు సంభవించినా, వెంటనే ఆ మృత కళేబరానికి పూలమాల వేసి, కొబ్బరికాయ కొట్టి, తల వద్ద దీపం వెలిగిస్తాతాము. మృత్యువును ఈశ్వర స్వరూపంగా భావించడమే ఈ కార్యాల వెనుక ఉన్న కారణము.

సద సత్తులు

ఇదమస్తి - ఇది ఉంది అని రూపం చేత గాని, శబ్దం చేత గాని ఏదైతే నిర్దేశింప బడుతూ ఉందో అది వ్యక్తము, కార్యము, నామరూపాత్మకము. అదే సత్తు. దీనికి ఏది కారణమో అది అవ్యక్తము. అదే నామరూపాత్మక మైన సత్తుకు కారణము. కనుక అది అసత్.

వ్యక్తమైంది స్థూలము. అవ్యక్త మైంది సూక్ష్మము. స్థూలమైన సత్ కార్యము. సూక్ష్మమైన అసత్ కారణము.

సత్ అభివ్యక్త రూపత్వాత్ కార్య మిత్యుచ్యతే బుధైః ।
అసత్ అవ్యక్త రూపత్వాత్ కారణం చాపి శబ్దితమ్ ॥

కార్య రూపంలో అభివ్యక్త మవుతూ ఉంది కనుక అది సత్తు. కారణ రూపంలో అవ్యక్తంగా ఉండేది అసత్తు అని పండిత నిర్ణయము.

సత్తుగా కార్య రూపంలో ఉండే ప్రపంచము, అసత్‌గా కారణ రూపంలో ఉండే ప్రకృతి, లేదా మాయ రెండూ మిథ్యా రూపాలే. పరమేశ్వరుడు సత్యమే గాని మిథ్య కాడు కదా! కనుక, ప్రపంచ రూపంలో కార్యంగా గోచరిస్తున్న సత్, ప్రకృతి రూపంలో కారణంగా తెలుస్తున్న అసత్, ఈ వ్యక్తావ్యక్తములు రెండూ పరమేశ్వరుడు కాడు. వీటికి అన్యమైన సత్యరూపుడే భగవంతుడు.

అసచ్చ సచ్చైవ చ య ద్విశ్వం సదసతః పరమ్ !

'అసత్తుగా, సత్తుగా ఏది ఉందో అదే ప్రపంచము. అట్టి సదసత్తుల కంటే అతీతమైన వాడు పరమేశ్వరుడు' అని మహాభారతము.

ఇక్కడే జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. శుద్ధ చైతన్య స్వరూపుడైన భగవంతుడు కార్యకారణాలకు అతీతుడు. మరి సత్ అయిన కార్యరూప ప్రపంచము, అసత్ అయిన కారణరూప ప్రకృతి, ఈ రెండిటికి ఆశ్రయ మేమిటి? ***బ్రహ్మాశ్రయా*** - బ్రహ్మమే కదా ఆశ్రయము! కనుక, సదసత్తులు కూడా తానే. కాని తాను సదసత్తులు కాడు. కుండ మట్టే. కాని, మట్టి కుండ కాదు. ఇదీ అవగాహన. అందుచేత, విశ్వరూపోపాసనలో అమృత మృత్యువులు, సదసత్తులు కూడా తానే అని ప్రవచించి, బహుధా ఉపాసన విధానాన్ని పదహారవ శ్లోకం నుండి విస్తారంగా బోధించి ఇక్కడ సమాప్తి చేశాడు.

ఏకత్వోపాసన, పృథక్త్వోపాసన, బహుధా విశ్వరూప ఉపాసనను వివరించిన వాసుదేవుడు, కోరికలతో ఉపాసించే అవివేకులను గూర్చి చెబుతున్నాడు.

త్రైవిద్యా మాం సోమపాః పూతపాపా యజ్ఞై రిష్ట్వా స్వర్గతిం ప్రార్థయన్తే । 20
తే పుణ్య మాసాద్య సురేన్ద్ర లోక మశ్నన్తి దివ్యా న్దివి దేవభోగాన్ ॥

త్రైవిద్యాః-మాం-సోమపాః-పూతపాపాః-యజ్ఞైః-ఇష్ట్వా-స్వర్గతిం-ప్రార్థయంతే

తే-పుణ్యం-ఆసాద్య-సురేంద్రలోకం-అశ్నన్తి-దివ్యాన్-దివి-దేవభోగాన్

త్రైవిద్యాః	= వేదాధ్యయనపరులు	తే	= వారు
యజ్ఞైః	= యజ్ఞముల చేత	పుణ్యం	= పుణ్యప్రదమైన
మాం	= నన్ను	సురేంద్రలోకం	= దేవేంద్రలోకమును
ఇష్ట్వా	= పూజించి	ఆసాద్య	= పొంది
సోమపాః	= సోమపానము చేసినవారు	దివి	= స్వర్గములో
పూతపాపాః	= శుద్ధి చేయబడిన పాపములు గలవారు	దివ్యాన్	= దివ్యములైన
స్వర్గతిం	= స్వర్గలోక స్థితిని	దేవభోగాన్	= దేవతా భోగాలను
ప్రార్థయంతే	= ప్రార్థిస్తున్నారు	అశ్నంతి	= అనుభవిస్తున్నారు

అర్జునా! వేదం తెలిసిన వాళ్ళు సోమపానం చేస్తారు. యజ్ఞాల చేత నన్ను పూజించి, పాపాలు పోగొట్టుకుంటారు.

స్వర్గం కోసం ప్రార్థిస్తారు. పుణ్యప్రద మైన సురేంద్ర లోకాన్ని పొంది, స్వర్గంలో దివ్యమైన సుర భోగాలను అనుభవిస్తారు.

వ్యాఖ్య

రాళ్ళు, రత్నాలు ఒక చోట ఉన్నప్పుడు, రత్నాలను విస్మరించి, ఒక వ్యక్తి రాళ్ళను సేకరించుకొని పోయాడు అంటే, అతడు వివేకము లేనివాడై ఉండాలి. అజ్ఞుడై ఉండాలి. రాళ్ళకు రత్నాలకు తేడా తెలియక పోవడమే అవివేకము. రత్నానికి సంబంధించిన జ్ఞానము లేకపోవడమే అజ్ఞానము.

చతుర్విధ పురుషార్థాలలో ధర్మార్థ కామములనే త్రివర్గమును సాధించు కోవడానికి అనువైన విషయ పరిజ్ఞాన మంతా వేదాలలో లభ్య మవుతుంది. పరమ పురుషార్థ మైన మోక్షానికి సంబంధించిన పరమార్థ తత్త్వము కూడా అక్కడే ఉంది. అయినా వేద త్రయాన్ని అధ్యయనం చేసిన వాళ్ళు సైతము ***(త్రై విద్యాః)***, సకాములై, అగ్నిష్టోమ, అతిరాత్రాది యజ్ఞాలు, క్రతువులు మాత్రమే ఆచరించి, వాటి చేత దేవతలను ఆరాధించి స్వర్గాది పుణ్యలోకాలను పొందాలని ప్రయత్నిస్తారు.

వారు ఆచరించే యజ్ఞాలలో దైవానికి అర్పించిన తరువాత ఆ సోమరసాన్ని పానం చేసి పాపాలను పోగొట్టు కుంటారు. శుద్ధి పడతారు ***(తే నైవ సోమపానేన పూతపాపాః శుద్ధ కిల్బిషాః)***. తద్వారా పుణ్యలోక ప్రాప్తిని వాంఛించి పొందుతారు ***(స్వర్గతిం స్వర్గ గమనం ప్రార్థయన్తే)***.

సోమవల్లి అనే తీగ యొక్క రసాన్ని సోమరసం అంటారు. యజ్ఞాలలో దానిని దేవతార్పణం చేసి, శేషించిన రసాన్ని ప్రసాదంగా స్వీకరిస్తారు. అదే సోమరస పానం. సోమరసాన్ని పానం చేసిన వాళ్ళు ***(సోమం పిబన్తి ఇతి సోమపాః)*** పూతపాపు లవుతారు. నిష్పాపు లవుతారు. పాపాలు తొలగిన వారు అవుతారు ***(పూత పాపాః)***.

పాపక్షయం జరిగి, పుణ్యం ప్రాప్తించడం చేత, ఆ పుణ్యము యొక్క ఫలంగా దేవేంద్ర లోకాన్ని చేరి, దేవతలు అనుభవించే భోగాలను అక్కడ, అనగా స్వర్గ లోకంలో అనుభవిస్తారు. వీరు కూడా భక్తులే. సకామ భక్తులు. వేద త్రయాన్ని అధ్యయనం చేసినా, వివేకం లేని కారణంగా మోక్షాన్ని విస్మరించి, స్వర్గ మోహంలో పడి కొట్టుకుపోయే వాళ్ళు.

స్వర్గే లోకే న భయం కించ నాస్తి - స్వర్గ లోకంలో ఏ విధమైన భయము ఉండదు. ***స్వర్గే లోకా అమృతత్వం భజన్తే*** - స్వర్గాది లోకాలలో అమృతము లభిస్తుంది. ఈ విషయాలను వేదాల లోని కర్మకాండ ద్వారా తెలుసుకున్న సకాములు స్వర్గాభిలాషులై యజ్ఞయాగాదులలో నిమగ్న మౌతారు.

సాధారణంగా జీవితంలో భయము - మరణము, ఈ రెండే ఎక్కువగా మనుషుల్ని బాధ పెడతాయి. ఏ క్షణాన ఏం జరుగుతుందో, ఉన్నది పోతుందేమో, లేనిది, వాంఛించింది రాదేమో - ఇలాంటి ఉపద్రవాలు, ఈతి బాధలు మనుషుల్ని కలత పెడుతూ ఉంటాయి. ఇవన్నీ స్వర్గంలో ఉండవు అని తెలియగానే మనిషి స్వర్గాన్ని వాంఛించడం ప్రారంభిస్తాడు.

పైగా, స్వర్గ లోకంలో అమృతము ప్రాప్తిస్తూ ఉంది కనుక, మరణం ఉండదు. శోకం లేదు - మరణం రాదు. ఇంకేమి కావాలి? అంతే. యజ్ఞాలు ప్రారంభిస్తారు. సోమరస పానం చేస్తారు. పాపాలను కడిగేసుకొని, పుణ్యాన్ని మూట కట్టుకొని, స్వర్గాభిలాషతో దివిని చేరి, దేవతా భోగాలను అనుభవిస్తూ ఉంటారు.

వేదాధ్యయన తత్పరులైన ఈ సకామ భక్తులకు అర్థం కావలసిన విషయం ఒకటి ఉంది. స్వర్గాన్ని చేరినంత మాత్రాన భయాలు పూర్తిగా నశించినట్లు కాదు. మరణం దూరమైనట్లు కాదు. దివిలో ఉన్నంత

కాలమే ఇవి దూర మవుతాయి. పుణ్యం క్షీణించ గానే పుణ్యలోకాలు కూడా దూర మవుతాయి. అక్కడ నుండి మళ్ళీ భయాలు, మరణాలు దగ్గ రవుతాయి. బ్రహ్మలోకము వరకు ఏ లోకాలను పొందినా, పుణ్య ఫలంగా లభించిన ఆ లోకాలను పుణ్యం క్షీణించ గానే విడిచిపెట్టి జన్మకు రావలసి ఉంటుంది ***(ఆబ్రహ్మ భువనా ల్లోకాః పునరావర్తి నోఽ ర్జున.... 8 వ అ - 16 వ శ్లో)***.

పైగా, సోమపానం వల్ల పాపాలు నశించ వచ్చు. పుణ్యం ప్రాప్తించ వచ్చు. కాని, దాని అర్థం పాపాలు సమూలంగా నశిస్తాయని కాదు. స్వర్గ గమనానికి ప్రతిబంధకంగా ఉండే పాపాలు మాత్రమే నశిస్తాయి. పుణ్యం క్షీణించి, తిరిగి మానవ జన్మకు వచ్చిన తరువాత, శేషించిన పాపాలను అనుభవించక తప్పదు. వివేకం లేని కారణంగా సకాము లైన వారు కర్మ చక్రంలో తగులుకొని పరిభ్రమిస్తూ ఉంటారు. వీరి మనస్సులలో కోరికలే ప్రధానంగా ఉంటాయి **(కామాత్మానః)**. స్వర్గ సుఖాలే ఆంతర్యంలో తిష్ఠ వేసి ఉంటాయి **(స్వర్గపరాః)** అని వీరిని గూర్చి రెండవ అధ్యాయం లోనే భగవంతుడు బోధించాడు *(2 - 43, 44)*.

పుణ్యం అనేది కర్మఫలం. అనుభవించ గానే నశిస్తుంది. పుణ్యం వల్ల ప్రాప్తించే స్వర్గం అనిత్యం. స్వర్గంలో ప్రాప్తించే భోగాలు అశాశ్వతం. అందుకనే, ఈ సందర్భంలో స్వర్గలోకం అనకుండా సురేంద్ర లోకం అన్నాడు. రెండూ ఒకటే అయినా, ఇంద్ర శబ్దం ప్రయోగించడం చేత, అక్కడ లభించే భోగాలు ఇంద్రియ సుఖాలే గాని మరొకటి కాదు అని భావం.

స్వర్గలోకం లోని నాట్యాలు నేత్రాలను, సంగీతాలు శ్రోత్రాలను తృప్తి పరుస్తాయి. ఇంకే ముంది? తెలియక పోవడమే ఉంది. అవివేకమే ఉంది.

వేదాల లోని యజ్ఞాలను ఇక్కడ నిరసిస్తున్నట్లు భావిస్తే, అది పొరపాటు. ఇక్కడ ఉద్దేశ్యం వేరు. వేదం ప్రతిపాదించే యజ్ఞ యాగాదులు కూడా మోక్షార్థమే ఉన్నాయి. ఆత్మజ్ఞానం వైపు నడిపేందుకే ఉన్నాయి. యజ్ఞాల వల్ల పాపక్షయం జరుగుతూ ఉంది. ఇలా శుద్ధి పడిన బుద్ధిని స్వర్గప్రాప్తికి కాకుండా మోక్షార్థము జ్ఞాన లబ్ధికి ఉపయోగించు కోవాలి. వేదాల లోని కర్మోపాసనలు అందుకే ఉన్నాయి. అమృతపానం చేసి అనిత్య లోకాలలో విహరించ మని వేదం బోధించలేదు. ఆత్మజ్ఞానాన్ని పొంది అమృత స్వరూపుడవు కా! అనే ప్రవచిస్తుంది. ఈ సత్యం అర్థం గాక, కామాత్ములు స్వర్గాభిలాషులు అవుతున్నారు.

మరి, స్వర్గ ప్రాప్తిని పొందిన పూతపాపులు తరువాత ఏమౌతారు? చెబుతున్నాడు.

తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి । 21
ఏవం త్రయీధర్మ మనుప్రపన్నా గతాగతం కామకామా లభన్తే ॥

తే-తం-భుక్త్వా-స్వర్గలోకం-విశాలం-క్షీణే-పుణ్యే-మర్త్యలోకం-విశంతి
ఏవం-త్రయీధర్మం-అనుప్రపన్నాః-గతాగతం-కామకామాః-లభంతే

తే = వారు
తం = ఆ
విశాలం = విస్తారమైన
స్వర్గలోకం = స్వర్గలోక సౌఖ్యములను
భుక్త్వా = అనుభవించి
పుణ్యే = పుణ్యము
క్షీణే = క్షీణించగా

మర్త్యలోకం = మానవ లోకమును
విశంతి = ప్రవేశిస్తున్నారు
ఏవం = ఈ రీతిగా
త్రయీధర్మం = సకామ కర్మమును
అనుప్రపన్నాః = అనుష్ఠించే వారు
కామకామాః = కోరికలు గలవారై
గతాగతం = జనన మరణములను
లభంతే = పొందుతున్నారు

అర్జునా! వాళ్ళు విశాలమైన స్వర్గ భోగాలను అనుభవించి, పుణ్యం క్షీణించ గానే తిరిగి మానవ లోకంలో పుడుతారు. ఈ విధంగా వేదోక్త మైన కామ్య కర్మలను కాంక్షించే వారు జనన మరణాలలో పడి తిరుగుతూ ఉంటారు.

వ్యాఖ్య

స్వర్గాభిలాషులై అగ్నిష్టోమాది క్రతువులను ఆచరించి, సోమపానం చేసి, పాప విముక్తిని పొంది, పుణ్యమును ఆర్జించి పుణ్య లోకాలను పొందిన వారు, ***యావత్ సంపాత ముషిత్వా*** అనే న్యాయానుసారము, ఎంతవరకు పుణ్య ఫలానుభవము నిర్ణయమై ఉందో అంతవరకు విశాలమైన స్వర్గ లోకంలో ఉండి, స్వర్గ భోగాలను అనుభవించి ***(తం భుక్త్వా స్వర్గ లోకం),*** ఆ పుణ్యం క్షీణించ గానే ***(క్షీణే పుణ్యే)*** తిరిగి మానవ లోకంలో ప్రవేశిస్తారు ***(మర్త్య లోకం విశన్తి).*** ఈ విధంగా వేదం లోని కర్మకాండను కామాభిలాషతో అనుసరించే వారు ఎక్కడికీ చేరరు. జనన మరణాల మధ్య తిరుగుతూ ఉంటారు. రాకపోకల తోనే సరిపెట్టుకుంటూ ఉంటారు. అవే గమనాగమనాలు. గతాగతాలు ***(గతాగతం, గతం చ ఆగతం చ గతాగతం గమనాగమనం).***

ప్రధానంగా వేదోక్త కర్మకాండకు సంబంధించిన పై రెండు శ్లోకాలలో సారభూతంగా గ్రహించ వలసిన విషయం ఏమిటో విశ్లేషించుకుందాం. (1) ఇది వేదత్రయము ప్రతిపాదించే కర్మకాండకు సంబంధించిన విషయం (2) జీవితంలో పొంద దగిన ఉత్కృష్ట మైన గమ్యము కాదు (3) కర్మబద్ధులై జన్మ పరంపరలో పరిభ్రమిస్తూ ఉండటమే దీనికి ఫలము. సూక్ష్మంగా చెప్పుకుంటే ఇదే కేంద్ర విషయం.

స్వర్గలోకాన్ని 'విశాలం' అంటున్నాడు. అంటే చాలా విస్తారమైంది అని అర్థము. ప్రస్తుతము మనం చర్చించే విషయం స్వర్గ భోగానికి సంబంధించింది కావడం చేత, ఇక్కడ విశాలము అనేది భోగానికి సంబంధించిన విషయము. అంటే, మానవ లోకంలో మనం అనుభవించే భోగాల కన్నా చాలా గొప్పవి అని అర్థము. ఇక్కడ లభించనివి అని భావము. సౌందర్యములో, సౌకుమార్యంలో, సౌష్ఠవంలో అసమానంగా, అద్భుతంగా ఉండటమే విశాలం. అంతేగాని భౌగోళికంగా విశాలం అని కాదు. ఏదైతే నేమి? విడిచిపెట్టి రావడానికి విశాల మైతే ఏమి, విఘాత మైతే ఏమి?

సోమరస పానం చేసి, పుణ్యఫలంగా స్వర్గమును చేరిన సోమయాజులు, అక్కడ సాధించే దేమిటి? స్వర్గ వాసుల మని విర్రవీగడమే గాని, అక్కడ తొడిగించుకొనిన కిరీటా లేమున్నాయి? అందరూ కల్లు పిపాసులే, కాంతాదాసులే. ఈ మాత్రానికి అక్కడికి పోయి, తిరిగి చూసే లోగా ఇక్కడికి చేరాలా! ముఖ్యంగా ఈ సోమరసం ప్రసక్తియే చాలా విడ్డూర మైంది. అనిత్య జీవనానికి అద్దం పట్టే వింత రసమది.

సోమవల్లి అనే తీగ శుక్ల పక్షంలో ఆకులు తొడిగి కృష్ణపక్షంలో ఆకులు రాల్చేస్తుందని చెబుతారు. అంటే, అటు చూస్తే ఉన్నట్లే ఉంటాయి. తిరిగి చూసే లోగా పోయినట్లు తెలుస్తాయి. స్వర్గం కూడా అంతే.

కొందరు వేసవిలో ఊటీకి విహారార్థం వెళ్తారు. తీసుకెళ్ళిన డబ్బు జేబులో ఉన్నంత వరకు అక్కడ అన్నీ హాయిగా అనుభవిస్తారు. ఇంకా ఉంటే చార్జీలకు కొరతే అనుకు న్నప్పుడు, తిరిగి వచ్చేస్తారు.

అగ్నిష్టోమాది క్రతువుల నాచరించి పుణ్య ఫలాన్ని ఆర్జించిన వారు స్వర్గాన్ని చేరుతారు. పుణ్యం ఉన్నంత వరకు నందన వనంలో ఆనంద విహారం చేస్తారు. పుణ్యం క్షీణించ గానే తిరుగు ప్రయాణానికి ఆ పుణ్యాన్నే కొంత ప్రక్కన పెట్టుకొని మళ్ళీ మానవ లోకానికే వస్తారు.

పుణ్యం క్షీణిస్తే, స్వర్గంలో క్షణం ఉండనివ్వరు. ఊటీ యాత్ర అయితే, ఒకవేళ మన వద్ద డబ్బు లేకపోతే, తెలిసిన వాళ్ళు ఎవ్వరైనా అక్కడ తటస్థ పడితే, అరువు తీసుకొని అయినా మరికొన్ని రోజులు ఉండి రావచ్చు.

స్వర్గంలో మన లాగే ఎందరో పుణ్యాన్ని ఆర్జించిన వారు ఉన్నా, అరువు ఇచ్చే వారు ఎవరూ ఉండరు. కరువు తీర్చే వారే ఉండరు. ఒక విధంగా చూస్తే మానవ లోకమే నయం. అద్దె వచ్చే నెలలో ఇస్తాము అంటే కనీసం కొంపలో నైనా ఉండ నిస్తారు. స్వర్గంలో అలా కాదు. పుణ్యం క్షీణిస్తే చాలు, క్షణం ఉండనివ్వరు.

మరి దేవతలు అంత దయ లేనివారా? మానవుల కున్న సానుభూతి కూడా వారికి ఉండదా? అని మీరు అనుకోవచ్చు. మన ఆలోచనలు మనవి. వారి జాగ్రత్తలు వారివి. ఇక్కడ ఏదో విధంగా సంపాదించే అవకాశం ఉంది కనుక ఈ నెల అద్దె ఇవ్వలేక పోయినా, వచ్చే నెలలో ఇవ్వొచ్చు. మరి స్వర్గంలో సంపాదించే అవకాశమే లేదు కదా! అది భోగ భూమే గాని కర్మ క్షేత్రం కాదు కదా! ఆ మాత్రం దేవతలకు తెలియదా? మానవ లోకంలో యజ్ఞ యాగాదుల నాచరించి ఆర్జించిన పుణ్యంతో స్వర్గలోకం చేరుతారు. మరి దేవలోకంలో అరువు పుచ్చుకొన్న పుణ్యాన్ని ఎలా తీరుస్తారు? యజ్ఞం చేస్తేనే కదా పుణ్యం వచ్చేది? మరి స్వర్గంలో కూడా పాగ పెడతావంటే దేవతలు ఒప్పుకుంటారా? పుణ్యాన్ని అరు విచ్చినా, తిరిగి తీర్చే అవకాశం లేదనేది ఒక వైపు స్పష్టంగా తెలుస్తూ ఉంటే, కల్లబొల్లి మాటలు చెప్పి నామం పెట్టే వాణ్ణి అక్కడ ఎందుకు ఉంచుకుంటారు? ఆ మాట కొస్తే అక్కడే కాదు, ఎక్కడా ఉంచుకోరు. ఎవ్వరూ ఉంచుకోరు.

కారణం ఉన్నంత వరకే కార్యం ఉంటుంది. పుణ్యం ఉన్నంత వరకే పుణ్య లోకంలో మనుగడ ఉంటుంది. పుణ్యం క్షీణించ గానే తిరిగి మర్త్య లోకంలో ప్రవేశించడం జరుగుతుంది. అలా ప్రవేశించకుండా తరించాలి అంటే, పుణ్యపాపాలు నశిస్తే సరిపోదు. అజ్ఞానం నశించాలి. అప్పుడే పునర్జన్మ ఉండదు. **మాముపేత్య తు కౌన్తేయ! పునర్జన్మ న విద్యతే** - నన్ను పొందితే, అర్జునా! తిరిగి పుట్టడం ఉండదు (8 వ అ - 16 వ శ్లో) అని భగవానుడు చెప్పే ఉన్నాడు కదా! ఇక, ఆ ప్రయత్నమే శ్రేయస్కరము.

ఎలా చేయాలి? చేసి ఏమి పొందాలి? చెబుతున్నాడు.

అనన్యా శ్చిన్తయన్తో మాం యే జనాః పర్యుపాసతే । 22
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహా మ్యహమ్ ॥

అనన్యాః-చింతయంతః-మాం-యే-జనాః-పర్యుపాసతే
తేషాం-నిత్యాభియుక్తానాం-యోగక్షేమం-వహామి-అహం

అనన్యాః	=	అన్య చింతలు లేక	నిత్యాభియుక్తానాం	=	నిత్యము నా యందు ఏకీభావము కలిగిన
మాం	=	నన్ను	తేషాం	=	వారల యొక్క
యే	=	ఎట్టి	యోగక్షేమం	=	యోగక్షేమములను
జనాః	=	జనులు	అహం	=	నేను
చింతయంతః	=	స్మరిస్తూ	వహామి	=	వహిస్తున్నాను
పర్యుపాసతే	=	సేవిస్తున్నారో			

అర్జునా! నిత్యము నా కొరకు ప్రయత్నించే భక్తులు మరో ఆలోచన లేకుండా నన్నే చింతిస్తూ ఉంటారు. కనుకనే, వారి యోగక్షేమాలను నేనే చూసుకుంటాను.

వ్యాఖ్య

కర్మ ప్రవృత్తి - భక్తి ప్రపత్తి

ఇహ పరాలలో కర్మ యొక్క స్వభావ స్వరూపాలను, కర్మ అందించే ఫలభోగాలను కొంత వరకు

మనము అర్థం చేసుకున్నాం. కర్మ అనేది - అది లౌకిక మైనా, వైదిక మైనా, అది అందించే ఫలం - అది ఇహ లోక సంబంధ మైనా, పరలోక సంబంధ మైనా అనిత్యమే నని, విషయానుభవమే నని మనకు అర్థమై పోయింది. కర్మ నికృష్టమే గాక, జనన మరణాల మధ్య జీవుణ్ణి త్రిప్పుతూ ఉన్నందున అనర్థ మని కూడా స్పష్టమైంది.

అలాగని కర్మలను గర్హించ నవసరం లేదు. కర్మలన్నీ దుఃఖభూయిష్ఠాలే నని, అనర్థ దాయకాలే నని భావించ నవసరం లేదు. మన చేతిలో ఉన్నవి కర్మలే. మనస్సులో ఉన్నవి సంకల్పాలే. అవన్నీ గనుక శోక మయమే అయితే ఇక మనం సుఖ పడలేము.

అవగాహన తోడైతే, అనిత్యాలను అధిగమించి అనంతంలో విహరించడానికి, పరిమితాలను దాటి పరిపూర్ణం వైపు పయనించడానికి కర్మలు వాహనా లైతే, సంకల్పాలు ఇంధన మవుతాయి. అనుభవాలు రహదారు లైతే, ఈశ్వరానుగ్రహం దారిదీప మవుతుంది.

ఇది మామూలు ప్రయాణం కాదు. విషయానుభవాన్ని విస్మరిస్తూ, నిర్విషయానందం వైపు అలవోకగా తేలిపోతూ సాగిపోయే అద్భుత అనంత యాత్ర. అనంతం నుండి అనంతం వైపుకు అనంతం లోనే ఆనందంగా పయనించే అలౌకిక ఆనంద యాత్ర.

ఇంద్రియాలు, ఇంద్రియ విషయాలు నిగూఢమైన తమ ఆంతరంగిక సంబంధాన్ని విడిచి పెట్టలేక, కలుస్తూ ఉండటాన్ని మనం కర్మలు అంటున్నాము. భౌతికంగా సాగుతున్న ఈ కర్మల వెనుక నిలిచి, వాటి సంబంధాన్ని గుర్తు చేసే మానస వ్యాపార తరంగాలను సంకల్పాలు అంటున్నాము. విషయాలు బాహ్యంలో ఉన్నట్లు, మనస్సు ఆంతర్యంలో ఉన్నట్లు, ఈ రెండిటి మధ్య ఇంద్రియాలు ఉన్నట్లు మనకు అనిపించినా, వాస్తవానికి ఈ మూడు బాహ్యం లోనే ఉన్నాయి. నీకు బాహ్యం లోనే ఉన్నాయి. నీకు అన్యం గానే ఉన్నాయి. నిన్ను ఆశ్రయించుకొనే ఉన్నాయి. నువ్వు లేకుండా అవేవీ లేవు. అవేవీ లేకపోయినా నువ్వు ఉన్నావు. నువ్వు ఉంటావు.

ఇది అర్థం కాకపోవడం చేత, మన మేదో చేస్తున్నాము అని ఊహించు కుంటున్నాం. మనం చెయ్య వలసింది ఏదో ఉందని, అదేదో మనం చేస్తున్నా మని నిరంతరం ఆలోచిస్తున్నాం. కర్మలు ఎందుకు ఊరేగు తున్నాయో అర్థం గాక వాటిలో పడి మనమూ ఊగిస లాడుతున్నాం. ఇప్పుడే మనం చెప్పుకున్నట్లు, విషయాలకు, ఇంద్రియాలకు ఉండే ఆంతరంగిక సంబంధంతో కర్మలు సాగుతున్నాయి.

ఇంద్రియాలు అనివార్యంగా వెళ్ళి విషయాలలో పడుతున్నాయి *(ఇంద్రియాః ఇంద్రియ విషయేషు వర్తన్తే).* అంతేగాని, ఇంద్రియాలకు విషయాలు అవసరమై మాత్రం కాదు. ఇది కాస్త అవధానంతో, శ్రద్ధతో అర్థం చేసుకోవలసిన విషయం.

బాహ్యంలో మనం ఏదో ఆశించడం వల్లే కర్మలు సాగుతున్నట్లు స్థూలంగా అనిపిస్తూ ఉంది. కాని, వాస్తవానికి ఆంతర్యంలో ఉన్నది దీనికి పూర్తిగా భిన్నమైన విషయం. ఆశించడం అయితే జరుగుతూ ఉంది. కాని అది బాహ్య విషయాలకు సంబంధించిన ఆశ కాదు. ఆంతర్యంలో స్వరూపానికి సంబంధించిన పిపాస. ఈ స్పృహ లేనపుడు మన నుండి కదిలే కర్మలు లౌకిక మైనా, పారలౌకిక మైనా అనిత్యాలనే చేతికి అందించి, ఆవేదనలను మనస్సులో దించుతాయి.

ఇప్పుడు అర్థమైందా? ఏవి మన కర్మలు? ఎవరు మన దేవుళ్ళు? మన కంటూ కార్యా లేమున్నాయి? మనవి కాని కార్యాలు మనవిగా, మనవి కాని లోకాలు మనవిగా, మనకు లేని సంబంధాలు మనవిగా భావించడం చేత నింగి కెగిరినా నికృష్టాలే నీడల్లా వెంటాడు తున్నాయి. అవే మన కర్మలైతే, స్వరూపం వైపు నడిపేవి అయితే, పాతాళంలో కూడా పరమార్థమే తోడై ఉంటుంది.

కర్మలు గర్హనీయమా? కర్మలు దుఃఖరూపమా? ఆలోచించండి. అర్థం కాకపోతే బంధము. అర్థమైతే, అందము, ఆనందము.

శ్రుత్యుక్త మైన కర్మకాండయే సిద్ధి సాధన మని భావించి, కేవలం కర్మైక నిష్ఠులై, విషయభోగ లంపటు లైన మీమాంసకులు వేదత్రయంలో పండితు లైనా, కామకాములై ఎలా గమనాగమనాలు (జననమరణాలు) పొందుతున్నారో పూర్వ శ్లోకంలో చూశాము.

దానికి భిన్నంగా, నిష్కాములై, అనన్యులై, నిత్యాభియుక్తులై, పరమార్థ జ్ఞాన సంపన్నులైన వారు కర్మయోగు లైనా, జ్ఞానయోగు లైనా సత్యరూపులై శోభిస్తారు. పరమేశ్వరుని పూర్ణ అనుగ్రహానికి పాత్రులై తరిస్తారు.

అన్య మనస్కులై, అనిత్యాల వైపు పరుగులు పెట్టే మీమాంసకులు ఆచరించేవి కర్మలే. అనన్యచిత్తులై, నిత్యాభియుక్తులై సత్య మార్గంలో చరించే భక్తులు, జ్ఞానులు ఆచరించేవి కూడా కర్మలే. అన్నీ కర్మలే. కర్మాయాసం ఎవరికీ తప్పదు. కాకపోతే, మీమాంసకుల కర్మలు బంధహేతువులు కాగా, భక్తుల పవిత్ర కార్యాలు ముక్తికి మార్గాలు.

యత్సత్యం తదుపాసితవ్యం అధునా సత్యం యతో లభ్యతేఽ సత్యోపాసనయా తథైవ చ ఫలం స్వప్నోత్థ రాజ్యాదివత్! ఆయాసే సదృశేఽ పి తుచ్ఛ ఫలదే మార్గే ప్రవృత్తిః కథం మాయా వైభవ మేత దేవ త దిదం భక్త్యా హరే ర్వాప్యతే !

సత్యాన్ని ఉపాసించే వారు సత్యాన్నే పొందుతారు. అసత్యాన్ని ఉపాసించే వారు, స్వప్నంలో రాజ్యాధికారాన్ని పొందినట్లు అసత్యాన్నే పొందుతారు. ఆయాసము ఇరువురికీ సమానంగా ఉండే టప్పుడు, తుచ్ఛ ఫలాన్నిచ్చే అనిత్య మార్గంలో ప్రవృత్తి ఎందుకు? ఈ ప్రపంచము మాయామయం. హరిభక్తి కుదిరితే సత్యమే ప్రాప్తిస్తుంది. కనుక, హరిభక్తి ప్రాప్తించే విధానము, హరికృప సిద్ధించే మార్గము ప్రస్తుత శ్లోకంలో చెప్పబడుతూ ఉంది.

శ్లోక వైభవము

ఇదొక అందమైన శ్లోకము. అద్భుతమైన శ్లోకము. ఉన్నతంగా చరించే వారు దేవతలు. నీచంగా చరించేవి జంతువులు, క్రిమి కీటకాదులు. మనోబుద్ధులు కలిగి, కర్మాచరణంలో ఉంటూ, వివేక వైరాగ్యాలతో పరమ పురుషార్థమైన మోక్షాన్ని సాధించుకొనే శక్తి గల మానవులు మధ్యములు. కేవలం పుణ్యమే గల వారు దేవతలు. పుణ్యపాపాలు లేకుండా కేవలం సహజాతాలతో చరించేవి జంతువులు. పుణ్యపాపాలను రెండిటిని మిశ్రమంగా ఆచరించే వారు మానవులు. ఇలా మధ్యములైన మానవులను ఉద్ధరించేందుకు అవతరించిన ఈ శ్లోకం భగవద్గీత మధ్యలో ఉంది. ఇది గీతా శ్లోక మణిహారంలో మేరువు లాంటిది. తరచుగా వేదికల మీద వినిపించే శ్లోకం. భక్తులను భగవంతుడు కరుణించే వైభవాన్ని వివరించే సందర్భాలలో భక్తులు పరవశించి ఉటంకించే శ్లోక మిది.

భారత మధ్యమున శోభించే భగవద్గీతలో కూడా తొమ్మిదవ అధ్యాయం మధ్యలో ఉంది. అంతే కాదు. తొమ్మిదవ అధ్యాయం మధ్యలో ఈ శ్లోకం ఉంది. ఇంకా చెప్పాలంటే, భగవద్గీత లోని ఏడు వందల శ్లోకాలలో కూడా ఈ శ్లోకం దాదాపు మధ్యలోనే ఉంది. అన్నిటినీ మించి, ఈ శ్లోకం తన స్వరూపమే నని నిర్ధారణ చేస్తూ శ్లోకము యొక్క ఆద్యంతాలలో భగవంతుడే అక్షర రూపంలో శోభిస్తున్నాడు. శ్లోకం లోని మొదటి అక్షరము **అ** కాగా, శ్లోకాంతంలో **హం** ఉంది. ఈ శ్లోకం నా స్వరూపం అంటూ అచ్యుతుడు **అహం** పదంతో భాసిస్తున్నాడు.

మహిమ గల వారే అయినా మహత్తు తెలియని వారు, ముక్తిని పొందని వారు, పొందలేని వారు దేవతలు.

మనోబుద్ధులు లేనందున వివేక శూన్యమైన జంతుజాలము మోక్షానికి అర్హము కాదు. మానవులే మోక్షానికి అర్హులు. కనుక, ప్రశస్తమైన మానవ జన్మ నెత్తి నందుకు మహోన్నతంగా చరించి మానవులు మోక్షరూపులై వెలగాలి. జీవన్ముక్తులై శోభించాలి. నీచాన్ని విస్మరించి, మహత్తునే ఆశ్రయించి కృతకృత్యులు కావాలి ***(నీచాశ్రయం న కర్తవ్యం కర్తవ్యం మహదాశ్రయం).***

సంసారము బాధించదు. సంసారానికి సంబంధించిన చింతే దుఃఖానికి కారణ మవుతుంది. తనను మరచి, తనువును మరచి, జగత్తును విస్మరించి, పరమేశ్వరుని స్మరణలో జీవించ గలిగితే, జీవితంలో బాధలు ఉండవు. జీవికి బంధము ఉండదు. అలా జీవించే దెలాగో ఈ శ్లోకం వివరిస్తూ ఉంది. అదే శ్లోక వైభవము. గీత లోని ప్రధానమైన, ప్రశస్తమైన శ్లోకాలలో ఒకటిగా శోభించడానికి కారణము. అంతే కాదు. గీత ప్రబోధించిన నిష్ఠాద్వయానికి ఈ శ్లోకం ఊతగా నిలుస్తుంది. సాంఖ్యులకు జ్ఞానపరం గాను, యోగులకు కర్మయోగ పరం గాను దర్శన మిస్తుంది. కనుక, ఈ శ్లోకాన్ని రెండు దృక్కోణాల నుండి వ్యాఖ్యానించాలి. మార్గాలు వేరుగా కనిపిస్తున్నా అద్వయమైన మోక్ష మార్గంలో ఈ రెండు మార్గాలు ఎలా ఏకమై ఉన్నాయో నిరూపిస్తూ ***దేహలీ దీప న్యాయంగా*** ఈ శ్లోకం ప్రకాశిస్తుంది. శ్లోకం లోని యచ్ఛబ్ద ప్రయోగం ***(యే జనాః)*** - 'ఎవరైతే' అని చెప్పడంలో కూడా ఇదే అంతర్భావం. మొదట భక్తి పరంగా చెప్పుకొని, ఆ తరువాత జ్ఞానపరంగా వంట పట్టించుకుందాం.

అనన్య భక్తి

అన్యము అంటే వేరైనది. అనన్యము అంటే వేరు కానిది. చింత అంటే చింతనము, లేదా స్మరణము. అనన్య చింత అంటే, భగవంతుని కన్నా అన్యంగా మరొక ఆలోచన లేకుండా ఉండటము అని అర్థము. అట్టి అనన్య చింతనము కల వారే అనన్య భక్తులు. అనన్య భక్తితో ఏ భక్తులైతే పరమేశ్వరుని స్మరిస్తూ ఉంటారో ***(యే జనాః భక్తాః అనన్యాః శ్చింతయన్తః మాం ఈశ్వరం పరమేశ్వరం ఉపాసతే).*** నిరంతరము అలా పరమేశ్వరుని కొరకు యత్నించే అట్టి అనన్య భక్తుల ***(నిత్యాభియుక్తానాం తేషాం)*** యోగక్షేమాలను పరమేశ్వరుడే వహిస్తాడు. ఇది భక్తిపరంగా శ్లోక భావం.

భక్తుని దేహం దేశంలో చరిస్తున్నా, కర్మలలో కదులుతున్నా, భక్తుని మనస్సులో మాత్రం భగవంతుడే ఉంటాడు. భగవంతుడు ఉండటము అంటే, భగవద్భావన ఉండటము అని అర్థం.

భక్తి అనేది పరమ ప్రేమ రూపము ***(సా త్వస్మిన్ పరమ ప్రేమ రూపా).*** ప్రేమ అనన్యము. ప్రేమ అన్య మెరుగదు. రెండిటిలో ప్రేమ ఇమడదు. రెండిటిని ప్రేమ తనలో ఇముడ్చుకో లేదు. వేరొక దానిని ప్రేమిస్తూ భగవంతుని ప్రేమించడం సాధ్యపడే పని కాదు. ఒక వ్యక్తి రెండు పడవలలో ఒకే కాలంలో ప్రయాణం చేయలేడు.

భోజనం ఒక్కడే చెయ్యాలి. అంటే, ఎవరికి వారే చేయాలి. నిద్ర కూడా ఎవరిది వారిదే. ఒకే మంచంపై ఇద్దరు స్నేహితులు పడుకోవచ్చు. అయినా ఎవరి నిద్ర వారిదే. ఒకే నిద్రలో ఇద్దరూ ఒదిగి ఉండలేరు.

దృశ్యము ఒక్కటే అయినా, ఎవరి కళ్ళతో వారు చూడాలి. ఒకరి కళ్ళతో మరొకరు చూడలేరు. చివరికి మృత్యువైనా అంతే. ఎవరి చావు వాళ్ళు చావాలి. చంపడము ఎందరైనా చెయ్యెచ్చు. చావు మాత్రం ఎవరిది వారిదే.

అన్యులు లేకుండా అన్ని కార్యాలు జరిగి పోయేటప్పుడు, భక్తి కార్యంలో మాత్రం అన్యులెందుకు? భక్తి చేసే మనస్సులో భగవంతుడు ఉండేటప్పుడు మరొకడు ఎలా ప్రవేశిస్తాడు? అందుచేత, అన్యుల యందు మనస్సు లేనివారు అనన్య భక్తులు. అనన్య భక్తి కలిగితే, అన్య చింతలు వాటంతట అవే జారి పోతాయి. పారి పోతాయి.

చిన్న పిల్లవాడు భోజనం చేయకుండా మారాం చేస్తూ ఉంటాడు. తల్లి ఎంత బుజ్జగించినా ససేమిరా అంటూ ఉంటాడు. నువ్వు భోంచేస్తే నీకు రూపాయి ఇస్తాను అంటుంది తల్లి. ఇస్తే గాని తినను అంటాడు బిడ్డ. తండ్రిని అడిగి ఒక రూపాయి బిళ్ళ తెచ్చి బిడ్డ కిస్తుంది తల్లి. పిల్లవాడు చేతిలో ఆ రూపాయి బిళ్ళ పట్టుకొని అన్నం తింటాడు.

బిడ్డ అన్నం తినగానే, రూపాయి బిళ్ళ తిరిగి ఇవ్వమని తండ్రి మారాం చేయడం ప్రారంభిస్తాడు. పిల్లవాడు ఇవ్వ నంటాడు. తండ్రి గద్దిస్తూ ఉంటాడు. బిడ్డ ఏడుస్తూ ఉంటాడు. ఎందుకండీ! బిడ్డను అలా ఏడిపిస్తారు? అని నివారించే ప్రయత్నం చేస్తుంది తల్లి. వాడు పారేసుకుంటాడు అంటాడు తండ్రి.

మీరు కాస్త ఊరుకోండి. నాయనా! నువ్వు ఇవ్వొద్దులే. నీ చేతి లోనే ఉంచుకో. నేను జోల పాడతాను, నువ్వు నిద్రపో! అని పిల్లవాణ్ణి నిద్రబుచ్చుతుంది తల్లి. కొంత సేపటికి పిల్లవాడు నిద్ర పోతాడు. అంతే. చేతి లోని రూపాయి బిళ్ళ చేజారి క్రింద పడుతుంది.

భార్య భర్తను పిలిచి, రండి! ఇదిగో మీ రూపాయి బిళ్ళ. తీసుకోండి! పడేసుకుంటాడు అంటూ పిల్లవాడి కన్నా ఎక్కువగా గోల చేశారు. ఇష్టమైన దానిని ఎవరు పడేసుకుంటారు? పడేసే సమయం వచ్చి నప్పుడు ఎవరు ఉంచు కుంటారు? అంటుంది తల్లి. అడిగినా ఇవ్వని పిల్లవాడు నిద్ర లోకి జారుకోగానే రూపాయి బిళ్ళ దానంతటదే చేజారి పోయింది. భక్తులూ అంతే. అనన్య భక్తిలో మనస్సు తన్మయం చెందగానే, ప్రపంచం అప్రయత్నంగా మనస్సు నుండి జారి పోతుంది. అన్య చింతలు పారి పోతాయి. అదే అనన్య భక్తి. ***అన్యాశ్రయాణాం త్యాగః అనన్యతా*** - అన్య ఆశ్రయాలను విడిచి పెట్టి, పరమేశ్వరునే హృదయంలో ఉంచుకోవడం అనన్యత అని వ్యాఖ్యానించాడు నారదమహర్షి.

అనన్య భక్తి వల్ల భక్తుని హృదయంలో సదా భగవంతుడే ఉంటాడు. అంటే, భక్తులు కాని వారి హృదయాలలో భగవంతుడు లేడా? భగవంతుడు అందరి హృదయాలలో ఉన్నాడు. ఉంటాడు *(18 వ అ - 61వ శ్లో).* కాని, భగవంతుడు హృదయంలో ఉన్నాడని అభక్తునికి తెలియదు. భక్తునికి తెలుసు. అదే తేడా.

భక్తుని హృదయంలో భగవంతుడు ఉన్నాడు కనుక, భక్తుడు నిర్భయుడు. ఏ అవసరాలూ లేనివాడు. ప్రతికూలాలు అర్థం కాని వాడు. భక్తుని అవసరాలు భగవంతుని అవసరాలుగా మారాయి. భక్తుని అనన్య చింతనము బ్రతుకులో సర్వ చింతలను దూరం చేసింది. భక్తి భగవంతుణ్ణి భక్తుని అధీనంలో ఉంచుతుంది. భక్తుడు సదా అనన్య భక్తిలో తృప్తి చెందుతూ ఉంటే, భక్తుని అవసరాలను భగవంతుడే చూసుకుంటూ ఉంటాడు. భక్తుని అవసరాలను చూడటం తన బాధ్యతగా భగవంతుడే స్వయంగా ప్రకటించు కున్నాడు కదా! ***(యోగక్షేమం వహామ్యహం).***

యోగ క్షేమాలు

ప్రాప్తించని దానిని పొందడం యోగము ***(అప్రాప్తస్య ప్రాపణం యోగః).*** ప్రాప్తించిన దానిని పరిరక్షించు కోవడం క్షేమము ***(క్షేమః తద్రక్షణమ్).*** బిడ్డ అవసరాలు తల్లికి తెలిసినట్లు, భక్తుని అవసరాలు భగవంతునికి తెలుసు. బిడ్డ అవసరాలను బిడ్డ అడగక పోయినా తల్లి ఎలా తీరుస్తుందో, భక్తుని అవసరాలను కూడా భక్తుడు అడగక పోయినా భగవంతుడే తీరుస్తాడు. బిడ్డ బిడ్డగా ఉండటమే తల్లి ప్రవర్తనకు కారణము. భక్తుడు భక్తుడుగా ఉండటమే భగవంతుని ప్రవర్తనకు కారణము. బిడ్డ తల్లిని బంధించినట్లు భక్తి భగవంతుణ్ణి కట్టి పడేస్తుంది.

ప్రతి ఒక్కరి జీవితంలో యోగక్షేమాలే ప్రధానంగా ఉంటాయి. ఎవరు ఏది ఆలోచించినా, ఏ పని చేసినా యోగక్షేమాల చుట్టే తిరుగుతూ ఉండటం స్పష్టంగా తెలుస్తుంది. నాకు లేనిది - నాకు ఉన్నది, ఇవే ప్రధానమైన

విషయాలుగా ఉంటాయి. కొందరు లేమితో కలవర పడుతూ ఉంటే, కొందరు కలిమితో కుములుతూ ఉంటారు. లేనివి ఒక విధంగా వేధిస్తే, ఉన్నవి మరొక విధంగా బాధిస్తూ ఉంటాయి.

నాకు ఆదాయం లేదు, ఆరోగ్యం లేదు. ఉద్యోగం లేదు, సంతానం లేదు, శాంతి లేదు, ఇల్లు లేదు, పెళ్ళి లేదు, జ్ఞానం లేదు - ఇలా లేని వాటిని తలచుకుంటూ కొందరు బాధ పడుతూ ఉంటారు. అలా లేని వాటిని పొందేందుకు ప్రయత్నిస్తూ ఉంటారు. ఏవేవి ఎవరికి లేవో వాటిని వారు పొందడం యోగం అవుతుంది **(అప్రాప్తస్య ప్రాపణం).**

కొందరికి ఉన్నవి కొన్ని పోతూ ఉంటాయి. మరి కొన్ని పోతాయేమో అని మనస్సు హెచ్చరిస్తూ ఉంటుంది. ఒత్తుగా ఉన్న జుట్టు క్రమేపి రాలిపోతూ ఉందని కొందరు బాధపడుతూ ఉంటే, బ్యాంకులో నిల్వ చేసిన ధనం మెల్లగా తరిగిపోతూ ఉందని మరి కొందరు ఆవేదన చెందుతూ ఉంటారు. ఆరోగ్యం క్షీణిస్తూ ఉందని కొందరు అలమటిస్తూ ఉంటే, ఇక ముందు క్షీణిస్తుందేమో అని ఊహించుకొని కొందరు కలత చెందుతూ ఉంటారు. ఉన్న ఉద్యోగం ఊడుతుందేమో, అకాల వర్షాలు పడి చేతి కొచ్చిన పంట చేజారి పోతుందేమో! ఇలా ఉన్నవి లేకుండా పోతాయేమో అని కొందరు వ్యథ చెందుతూ ఉంటారు. ఉన్న వాటిని పోకుండా కాపాడుకొనే ప్రయత్నం చేస్తూ ఉంటారు. అదే రక్షణము **(ప్రాప్తస్య రక్షణం క్షేమః).** అదే క్షేమము.

అందరూ ఈ విధమైన యోగక్షేమాల వ్యవహారంలో పడి తల మునకలై ఉంటే, భక్తుడు యోగక్షేమాల విషయంలో స్పృహ లేనివాడై ఉంటాడు. ఈ విధమైన నిస్పృహకు ప్రధానంగా రెండు కారణాలు కనబడతాయి. (1) ఏవేవో పొందాలి అనే ఆశ లేకపోవడము (2) మరేవో దూరమౌతా యనే నిరాశ ఉండక పోవడము. భగవంతుడు లేనపుడు ఏది ఉండి ఏమి ప్రయోజనం? అని తనను తాను భక్తుడు ప్రశ్నించు కుంటాడు. అంతే కాదు. భగవంతుడు ప్రాప్తించి నపుడు, అంతకన్నా పొంద వలసింది ఏముంటుంది? అని తనను తాను ప్రశ్నించుకొని సమాధానం పొందుతాడు. తృప్తి చెందుతాడు. సదా తన హృదయంలో భగవంతుని దర్శించుకుంటూ భక్తిలో పరవశించే భక్తునికి ఏవో లేవు అనే యోగానికి సంబంధించిన ఆరాటము ఉండదు. ఉన్నవి పోతాయేమో అనే క్షేమానికి సంబంధించిన ఆవేగమూ లేదు. ఈ విధంగా యోగక్షేమాలను భక్తుడు త్యజించడం చేత, సదా అనన్య భక్తితో తనను ఆరాధించే భక్తుని యోగక్షేమాలను వహించ వలసిన బాధ్యత పరమేశ్వరునిది అయింది.

యతస్తదీయాః - ఈ కారణం చేత భక్తులు భగవంతునికి సంబంధించిన వారయ్యారు. భగవంతునితో నిత్య సంబంధాన్ని కలిగిన వారయ్యారు. తమ అనన్య భక్తి చేత భక్తులు భగవంతునికి ముఖ్యు లయ్యారు **(భక్తాః ఏకాంతినో ముఖ్యాః).** అనన్య భక్తి కలిగిన ఏకాంత భక్తులను గూర్చి నారద మహర్షి విశేషంగా వ్యాఖ్యానించాడు.

భక్తులు సదా పరమేశ్వరుని యందే మనస్సును లగ్నం చేసి ఉంటారు కనుక, వారికి అనిత్య మైన ప్రాపంచిక విషయాలతో సంగత్వం ఉండదు **(సంగం త్యజతి).** మనస్సును ఖాళీ చేసుకొని, మాధవుని చేతిలో మురళి లాగా భక్తులు పనిముట్లుగా మారుతారు కనుక కర్తృత్వము లేనివారై ఉంటారు. కర్తృత్వము లేనందున కర్మఫలాల యందు దృష్టి లేనివారై ఉంటారు **(కర్మఫలం త్యజతి).** మురళి ద్వారా అద్భుతమైన రాగాలను పలికించినట్లు, తన చేతిలో పరికరాలుగా మారిన భక్తుల ద్వారా పరమేశ్వరుడు అసమానమైన, అనితర సాధ్యమైన కార్యాలను ఆవిష్కరిస్తాడు. తన ద్వారా ఏ రాగం పలికినా, అందులో పరమేశ్వరుని వైభవాన్నే మురళి వీక్షించినట్లు, తమ ద్వారా ఎంతటి మహత్తరమైన కార్యాలు జరిగినా, అవన్నీ భగవ దనుగ్రహ ప్రసాదాలుగా భక్తులు భావిస్తారు. ద్వంద్వాలను దాటి పోతారు **(నిర్ద్వన్ద్వో భవతి).** ఈ విధమైన ఏకాంత భక్తి ప్రాప్తించ గానే

భక్తుడు యోగ క్షేమాలను మరచి పోతున్నాడు. వాటిని దాటి పోతున్నాడు **(యోగ క్షేమం త్యజతి).** మరి, యోగక్షేమాలను కూడా పట్టించుకోకుండా భక్తుడు భగవత్సేవలో పరవశించి ఉంటే, అట్టి భక్తుని యోగక్షేమాలను ఎవరు చూస్తారు? ఎవరో ఎందుకు చూస్తారు? భక్తుడు భగవంతుని కార్యంలో నిమగ్నమై ఉన్నాడు కనుక, భక్తుని యోగక్షేమాలను భగవంతుడే చూడాలి. చూస్తాడు. అదే చెబుతున్నాడు. నిత్యాభియుక్తు లైన భక్తుల యోగక్షేమాలను నేనే చూసుకుంటాను **(తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్).**

బాలకృష్ణుడు ఊయలలో ఆదమరచి నిద్రిస్తున్నాడు. అందంగా, అమాయకంగా నిద్రిస్తున్న చిన్ని కన్నయ్య మోమును అదే పనిగా వీక్షిస్తూ యశోదమ్మ పరవశిస్తూ ఉంది. ఈ లోగా ఏదో కలవరిస్తూ బాలకృష్ణుడు ఉలికిపడి కళ్ళు తెరిచాడు. తన బిడ్డకు ఏదో పీడ కల వచ్చి ఉంటుందని భావించి యశోద దిష్టి తీస్తుంది. పుత్ర వాత్సల్యంతో బిడ్డకు తల్లి దిష్టి తీసిందే గాని, తన బిడ్డ మామూలు బిడ్డ కాడని, ప్రపంచానికే తండ్రి యని, ఆయనిది ఉలికిపాటు కాదని, భక్తులను తలచుకొని ఆనందించే అలవాటు అని యశోద గ్రహించలేక పోయింది. కన్నయ్య కలవరం లోని కారుణ్యాన్ని దర్శించిన చైతన్య హృదయం భక్తి ప్రేమలతో ఒక వెన్నముద్దను సమర్పించుకుంది.

> **కలల మత్తులో ఉలికి పడితి వేల?**
> **ఎవరు పిలిచారు కల లోన తొంగి చూచి**
> **కలకాలము కూడ భక్తుల మెలకువేనా!**
> **నీ అడుగుల కడ పడి ఉందు చిన్నికృష్ణా!**

అని చిన్నికృష్ణ శతకంలో ఒక వెన్నముద్ద. కలకాలము భక్తులను కనిపెట్టుకొని, యోగక్షేమాలను నిర్వర్తించే పరమేశ్వరుడు, కల గనే కాలంలో కూడా భక్తుల వ్యవహారాలనే చక్కబరుస్తూ ఉంటాడు. ఈ ధైర్యం తోనే భక్తులు సదా భగవంతుని సేవలో తృప్తి చెందుతూ ఉంటారు.

ఆఖ్యాయిక

కొన్ని శతాబ్దాల క్రితం పండరీపురంలో ఒక భక్తుని జీవితంలో జరిగిన వాస్తవ సన్నివేశము. అనన్య భక్తితో పరమేశ్వరుని సేవిస్తే, యోగక్షేమా లన్నీ పరమేశ్వరుడే చూసుకుంటాడు అనే ఈ శ్లోకం విషయంలో ఆ భక్తునికి ప్రగాఢమైన విశ్వాసము. ఆయన విశ్వాసానికి అనుగుణం గానే జీవితం కూడా సజావుగా సాగుతూ ఉండింది.

నిరంతరము భగవద్గుణ శ్రవణ కీర్తనాదులతో భక్తుడు కాలక్షేపం చేస్తూ ఉండేవాడు. ఏదో ఓ విధంగా అవసరాలు తీరుతూ ఉండేవి. ఆశలు లేని ఆ భక్తుని కుటుంబం అదుపు పొదుపు తెలియకుండా, కుదుపు లేకుండా సాగుతూ ఉండింది.

ఒక కాలంలో ఆ ప్రాంతం తీవ్ర క్షామానికి గురైంది. కరువు కాటకాలతో జన జీవనం కుంచుకు పోయింది. భక్తుని ఇంట్లో పూట గడవటం కష్టసాధ్య మైంది. ఆకలితో భార్యా పిల్లలు అలమటించి పోతున్నారు. పరిస్థితి విషమించింది. అయినా భక్తుడు అనన్య భక్తి లోనే కాలాన్ని సద్వినియోగం చేసుకుంటున్నాడు. భగవంతుని మాట వమ్ము కాదని అతని ప్రగాఢ విశ్వాసము.

రెండు రోజులు వరుసగా ఆహారం లేకపోయే సరికి బిడ్డలు శోషించి పోయారు. ఏమి చెయ్యాలో తోచక భార్య భర్తను సమీపించింది. బిడ్డల దయనీయ పరిస్థితిని వివరిస్తూ భోరున విలపించింది. పిల్లల్ని రక్షించ మని ప్రాధేయ పడింది.

భార్య ఆక్రందనము చూచి భక్తుడు చలించి పోయాడు. ఆమె సలహా ప్రకారము ఎవరినైనా యాచించి, సరుకులు తీసుకొని వద్దామని బయలుదేరాడు. పోతూ పోతూ, క్షణం ఆగి వెను దిరిగి పూజా మందిరం లోకి వెళ్ళాడు.

పాండురంగని ప్రతిమను తదేకంగా చూశాడు. దుఃఖం కట్టలు త్రెంచుకుంది. ఏదో వ్రత భంగం జరిగి పోతున్నట్లు మనస్సు విలవిల లాడింది. ఎవరో గుండెను పిండినట్లైంది. 'పండరినాథా! పాండురంగా! నీ మాట మీద అకుంఠితమైన విశ్వాసంతో ఇంతవరకు జీవితాన్ని కొనసాగించాను. అనన్య భక్తితో జీవించాను. యోగక్షేమాలు నీవే చూసుకుంటా నన్నావు. క్షామంలో పడేసి వినోదం చూస్తున్నావు' అని అభియోగిస్తూ, పూజా పీఠం వద్ద తెరచి ఉంచిన భగవద్గీత తాళపత్ర గ్రంథాన్ని చూశాడు. తెరచి ఉన్న ఆ పత్రంపై దృష్టి సారించాడు. అది తొమ్మిదవ అధ్యాయం - ఇరవై రెండవ శ్లోకం. ***అనన్యాశ్చింత యన్తో మాం*** అనే ఆ శ్లోకాన్ని చూడగానే బాధ రెండింత లైంది. గుండె ముక్కలైంది. 'ఈ శ్లోకం తప్పు. ఇది విశ్వసించ దగింది కాదు' అనుకుంటూ, ఒక ముల్లు తీసుకొని ఆ శ్లోకంపై అటు ఇటు గీకి పడేశాడు. తాళపత్రమే కనుక అది చిరిగి పోయింది. అంతే. ఇక అరువు తోనే కరువు తీరాలనుకుంటూ బరువైన హృదయంతో గ్రామం లోకి వెళ్ళాడు.

భక్తుడు వెళ్ళిన కొంత సేపటికి ఒక పిల్లవాడు రెండు భుజాలకు రెండు బరువైన సంచులను తగిలించుకొని, తలపై ఒక మూట నుంచుకొని, దానిని తన చిన్ని చేతులతో భద్రంగా పట్టుకొని తడబడు అడుగులతో ఇంటికి వచ్చాడు. ఆ సరుకుల మూటలను దించి భక్తుని భార్యకు అప్ప చెప్పి, అయ్యగారు ఇవి మీకు ఇవ్వ మన్నారు అన్నాడు.

భార్య ఆశ్చర్య పోయింది. ఈ లోగా సరుకులు తెచ్చిన పిల్లవాడు వెళ్ళొస్తానంటూ వెను దిరిగాడు. ఆ పిల్లవాడి వీపుపై రక్తం కనిపించింది. ఎవరో బలంగా గీకినట్లు ఉంది. కలత చెందిన ఆ ఇల్లాలు, 'నాయనా! అదేమిటి? ఆ రక్త మేమిటి? ఎవరు అలా చేసింది? ఇంతకీ నువ్వెవరు?' అంటూ ప్రశ్నలు సారించింది.

'అమ్మా! నా పేరు రంగడు. నేను పనులు చేసుకుంటూ బ్రతుకుతుంటాను. మీ వారు మా శేఠ్ వద్ద ఈ సరుకులు తీసుకొని, తొందరగా మీకు ఇచ్చి రమ్మని నన్ను ఆజ్ఞాపించారు. నేను బయలుదేరడంలో కొంత ఆలస్య మైందని ఆగ్రహించి, అక్కడే ఉన్న ముల్లుకర్రతో నన్ను కొట్టారు. ఆ ముల్లు గీసుకుని రక్తం వచ్చింది. అంతే' అన్నాడు ఆ బాలుడు.

'అయ్యో! ఎంత తొందర అయితే మాత్రం పసిబిడ్డను ఇలా కొట్టడమా? ఉండు నాయనా! కాస్త తుడిచి మందు వేస్తాను' అని ఆమె లోపలి కెళ్ళింది. ఆమె తిరిగి వచ్చే లోగా బాలుడు తిరోహితు డయ్యాడు.

ఇల్లాలు మూటను విప్పి చూచింది. అందులో కుటుంబము లోని వారందరికీ బట్ట లున్నాయి. కొన్ని నగ లున్నాయి. కొంత నగదు కూడా ఉంది.

సంచులలో చూస్తే వంట సరుకులు పుష్కలంగా ఉన్నాయి. ఆశ్చర్య పోయిన ఆ తల్లి వెంటనే షడ్రసోపేత మైన పాకం చేయడానికి సిద్ధమై చకచకా చేస్తూ ఉంది.

ఈ లోగా దీన వదనుడై ఇంటి వైపు వస్తున్న భర్తను చూచి, పరుగు పరుగున ఆయనను సమీపించింది. ఆమెను చూడగానే భర్త కన్నీళ్ళను ఆపుకోలేక పోయాడు.

'నా ప్రయత్న మంతా నేను చేశాను. ఎవరిని అడిగినా, ఎంతగా ప్రాధేయ పడినా, ఎవ్వరూ కనికరించ లేదు. ఆకలితో అలమటిస్తున్న బిడ్డలకు కనీసం గంజైనా త్రాగించ లేని నా దారిద్ర్యానికి సిగ్గు పడుతున్నాను' అని ఆ భక్తుడు పసిబిడ్డలా రోదించాడు.

భార్య విస్మయం చెందింది. 'అదేమిటి! మీరు పంపిన సరుకులతో నేను వంట కూడా చేస్తూ ఉంటే, మీరేమిటి అలా మాట్లాడుతారు?' అని ప్రశ్నించింది. 'నేను సరుకులు పంపడ మేమిటి?' అని తిరిగి ప్రశ్నించాడు భర్త.

జరిగిన విషయ మంతా ఆమె పూస గుచ్చినట్లు చెప్పింది. బాలుడి వీపుపై ముల్లుగీత వల్ల ఏర్పడిన గాయాన్ని గూర్చి కూడా చెప్పింది. భక్తుడు నిర్ఘాంత పోయాడు. తీరా వెళ్ళి పూజా మందిరంలో చూస్తే, తాళపత్రంపై ముల్లుగీత లేదు. చిరుగు అసలే లేదు. గ్రంథము మామూలుగా ఉంది.

తన తప్పిదానికి భక్తుడు పరితపించాడు. తీవ్రమైన ఉద్విగ్నతకు లోనయ్యాడు. పాండురంగని దివ్య దర్శనానికి నోచుకున్న అర్ధాంగి అదృష్టానికి పరవశించి పోయాడు.

'భగవాన్! పాండురంగా! నా అజ్ఞానాన్ని క్షమించు. నీ మాట ఎన్నడూ వృథా కాదు. నీ భక్తుడు ఎప్పుడూ వృథా పోడు. గీతపై ముల్లుతో గీస్తే అది నీ దేహంపై గీసినట్లు అయిందా? నాకు కనువిప్పు కలగడానికి నా చేత నువ్వే అలా చేయించావా? నీ గీతా వాక్యం సత్యం కాదని అనుమానించాను. కాని, గీత నీ దేహమే నని, నీ స్వరూపమే నని గ్రహించలేక పోయాను' అని పశ్చాత్తాపం చెంది, పరమేశ్వరుడు అనుగ్రహించిన నగలను, నగదును పేదలకు పంచిపెట్టి, రెట్టించిన భక్తి శ్రద్ధలతో ఆ భక్తుడు అనన్య భక్త్యారాధనకు పునరంకిత మయ్యాడు.

గీతాశ్రయోఽహం తిష్ఠామి గీతామే చోత్తమం గృహమ్ ।
గీతా జ్ఞాన ముపాశ్రిత్య త్రీన్లోకా న్పాలయా మ్యహమ్ ॥

నేను గీతను ఆశ్రయించుకొని ఉన్నాను. గీతయే నాకు వాస మందిరము. గీతా జ్ఞానమును ఆధారం చేసుకొని నేను ముల్లోకాలను పాలిస్తున్నాను అని వరాహ పురాణంలో భగవానుడు భూదేవికి బోధించాడు.

అనన్య భక్తి అనేది అనేక జన్మల పుణ్యఫల విశేషం. నిరంతరాభ్యాసం వల్ల ప్రాప్తించే భగవదనుగ్రహం. అనన్య భక్తి తత్పరులైన ఏకాంత భక్తుల హృదయాలలో పరమేశ్వరుడు తప్ప మరొకటి ఉండే అవకాశం లేదు. వాళ్ళు కేవలం భగవచ్చరణులు. కనుక వారి యోగక్షేమాలను పరమేశ్వరుడే చూసుకుంటాడు ***(కేవల మేవ భవచ్ఛరణాః తే అతః భగవా నేవ తేషాం యోగక్షేమం వహతి ఇతి).***

అనన్య భక్తిలో రమించే ఏకాంత భక్తులు భగవంతుని కన్నా అన్యమైన సమస్త విషయాలలో ఉపేక్షా భావాన్ని కలిగి ఉంటారు. చివరికి బ్రతుకులో గాని, చావులో గాని చెక్కు చెదరని, మొక్కవోని భక్తి తోనే శోభిస్తూ ఉంటారు ***(న హి తే జీవితే మరణే వా ఆత్మనః గర్ధిం కుర్వన్తి!).*** పరమేశ్వరుని క్షణం విడిచి జీవించ లేరు. బ్రతుకులో ఏదైనా జరగనీ. బుద్ధిలో భక్తిని మాత్రమే ప్రధానంగా ఉంచుకుంటారు. క్షణక్షణానికి పెంచు కుంటారు.

పల్లవి: **నీవు లేక నేను లేను - లేను**
నిన్ను విడిచి నేను ఉండలేను ॥ నీవు ॥

చరణము: **బ్రతుకు బండలైనా బుద్ధి పండి ఉంది**
మాధవ మాధవ యనుచు మథన పడుతూ ఉంది
కొన ఊపిరైనా
తూలుతూ నీ పాదము చేరు ॥ నీవు ॥

అని చైతన్య గీతిక అనన్య భక్తి రాగాన్ని ఆలపించింది.

ఇంతవరకు మనం భక్తి ప్రధానమైన కర్మయోగానుసారము ఈ శ్లోకానికి వ్యాఖ్యానం చెప్పుకున్నాం. ఇప్పుడు జ్ఞానపరంగా చూద్దాం.

అనన్య చింతనము

అనన్యులు అంటే అన్యంగా ఉండని వారు. పరమాత్మ కన్నా తాము వేరు అని భావించని వారు అనన్య చేతస్కులు *(అనన్యాః అపృథగ్భావాః).* పరమాత్మను ఆత్మ స్వరూపంగా దర్శించి ఉపాసించే వారు అని అర్థము. అట్టి వారి యొక్క యోగక్షేమాలను పరమాత్మే వహిస్తాడు. జ్ఞాని పరమాత్మ కన్నా అన్యంగా లేడు కనుక, జ్ఞాని యోగక్షేమాలను స్వయంగా పరమాత్మే చూసుకుంటాడు.

జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్ - 'జ్ఞాని నా ఆత్మయే' అని ఏడవ అధ్యాయం - పద్దెనిమిదవ శ్లోకంలో భగవంతుడే చెప్పి ఉన్నాడు కదా! అందుచేత జ్ఞాని యొక్క అవసరాలు పరమాత్మ అవసరాలుగా మారుతాయి. కనుక జ్ఞాని యోగక్షేమాలను పరమాత్మే వహిస్తాడు.

అయితే, ఈ సందర్భములో శ్రీ శంకరాచార్య స్వామి భాష్యంలో ఒక ఆసక్తికర మైన విషయాన్ని వినిపిస్తారు. ***నను అన్యేషా మపి భక్తానాం యోగక్షేమం వహత్యేవ భగవాన్?*** మరి, జ్ఞానులు కాని భక్తుల యొక్క, అనగా కర్మయోగుల యొక్క యోగక్షేమాలను కూడా భగవంతుడు వహిస్తాడు కదా! నిజమే. అది సత్యం. తప్పక వహిస్తాడు *(సత్యం ఏవమ్: వహతి).* మరి భక్తుల యోగక్షేమాలను కూడా తానే వహించే టప్పుడు, తన స్వరూపమైన జ్ఞానుల యోగక్షేమాలను చూసుకుంటాడు అని ప్రత్యేకించి చెప్పడంలో విశేష మేమిటి? అనేది శంక. విశేష ముంది. అదేమిటంటే,

అన్య యే భక్తాః తే స్వాత్మార్థం స్వయమపి యోగక్షేమం ఈహన్తే; అనన్య దర్శినః తు న ఆత్మార్థం యోగక్షేమం ఈహన్తే - భక్తులు తమ యోగక్షేమాలకై తాము ప్రయత్నం చేసుకుంటూనే, పరమేశ్వరుణ్ణి కూడా ప్రార్థిస్తూ ఉంటారు. అనన్య దర్శులైన జ్ఞానులు తమ యోగక్షేమాలను తాము పట్టించుకోరు. అంతటా ఉపేక్షా భావంతో ఉంటారు. ఇదే ఇద్దరి మధ్య భేదము.

ఈ శ్లోక వ్యాఖ్యానంలో మనం చెప్పుకున్న పండరీ భక్తుడు కూడా భార్య సలహా మేరకు ఊళ్ళో కెళ్ళి తన ప్రయత్న మేదో తాను చేశాడు కదా! అదే జ్ఞాని అయితే చేయడు. పూర్ణ విశ్వాసంతో పరమేశ్వరుని యందే బుద్ధిని నిలిపి ఉంచుతాడు. అదే విశేషము.

శివో భూత్వా శివం భజేత్ - శివుడవై శివుణ్ణి ఆరాధించు అన్నట్లుగా, జ్ఞానులు తమ ఆత్మే పరమాత్మ అనే బ్రహ్మాత్మ జ్ఞానంతో పరమాత్మను ఉపాసిస్తూ ఉంటారు కనుక, వారి యోగక్షేమాలను పరమాత్మే వహిస్తూ ఉంటాడు.

అన్యమైన విషయాల నుండి దూరంగా పోవాలని ప్రయత్నించే వారు కర్మయోగులు, లేదా భక్తులు. తమలో అన్యమైన విషయాలే లేకుండా చేసుకొనే వారు జ్ఞానులు.

మరి, దేవతలు కూడా తన కన్నా అన్యంగా లేరని తానే చెబుతున్నాడు కదా! అలాంటప్పుడు అన్య దేవతోపాసకులు అర్చించేది కూడా పరమాత్మనే కదా! మరి అనన్య భక్తులు మాత్రమే పరమేశ్వరుణ్ణి పొందడమేమిటి? అన్య దేవతారాధకులు పరమేశ్వరుణ్ణి పొందలేక, స్వర్గాది లోకాలు చుట్టి, తిరిగి జన్మకు రావడమేమిటి? చెబుతున్నాడు.

యేఽ ప్యన్యదేవతా భక్తా యజన్తే శ్రద్ధయాన్వితాః । 23
తేఽ పి మామేవ కౌన్తేయ యజ న్త్యవిధిపూర్వకమ్ ॥

యే-అపి-అన్యదేవతాః-భక్తాః-యజంతే-శ్రద్ధయా-అన్వితాః
తే-అపి-మాం-ఏవ-కౌంతేయ-యజంతి-అవిధిపూర్వకం

కౌంతేయ	=	అర్జునా!	యజంతే	=	ఉపాసిస్తున్నారో
యే అపి	=	ఎవరయితే	తే అపి	=	వారును
అన్యదేవతాః	=	ఇతర దేవతల	మాం ఏవ	=	నన్నే
భక్తాః	=	భక్తులై	అవిధిపూర్వకం	=	క్రమము తప్పి
శ్రద్ధయా	=	శ్రద్ధతో	యజంతి	=	పూజిస్తున్నారు
అన్వితాః	=	కూడిన వారై			

కౌన్తేయా! శ్రద్ధతో ఇతర దేవతలను ఆరాధించే భక్తులు కూడా వాస్తవానికి నన్నే ఆరాధిస్తున్నారు. కాకపోతే, దారి తప్పి ఆరాధిస్తున్నారు.

వ్యాఖ్య

సందర్భము - సందేహము

సర్వేశ్వరుడైన పరమేశ్వరుని అర్చించి ఆరాధించే భక్తులు, జ్ఞానులు పరమేశ్వరునే పొందుతున్నారు అనేది స్పష్టమైంది. అంటే మోక్షాన్ని పొందుతున్నారు అని అర్థం. అలా కాక, యజ్ఞ యాగాదుల ద్వారా ఇంద్రాది దేవతలను పూజించు భక్తులు పరమేశ్వర స్వరూపమైన మోక్షాన్ని పొందలేక, జనన మరణాల మధ్య ***(గతాగతం)*** పరిభ్రమిస్తున్నారు.

అహం క్రతుః అహం యజ్ఞః అనే పదహారవ శ్లోకంలో యజ్ఞ క్రతువులు, మంత్ర దేవతాదులు తన స్వరూపమే నని, ఏ దేవతను ఆరాధించినా అది తనకే చెందుతుందని కూడా చెప్పడం జరిగింది. అలాంటప్పుడు అనన్యులై పరమేశ్వరుని ఉపాసించే వారికి ముఖ్య ఫలమైన మోక్షం ప్రాప్తించడము, అన్య దేవతలను ఉపాసించే వారికి అవాంతర ఫలాలే అంది, మోక్షము సిద్ధించకుండా జనన మరణాలు ప్రాప్తించడ మేమిటి? అనేది శంక.

ఒక వైపు యజ్ఞాలు, దేవతలు తానే నని చెబుతూ, తన సర్వాత్మత్వమును ప్రతిపాదిస్తూ, మరో వైపు అనన్య భక్తు లైన వారికి మోక్షసిద్ధి, దేవతాంతర భక్తులకు జనన మరణాది అనర్థపాతమును చెప్పడం ఎలా పొసగుతుంది? తన ప్రబోధం లోనే వైరుధ్యము గోచరించడం లేదా? ప్రబోధంలో పరస్పర భావ వైరుధ్యము గోచరించడమే గాక, ప్రమాణ విభేదము కూడా గోచరిస్తూ ఉంది కదా!

సర్వం హ్యేత ద్బ్రహ్మ, ఇంద్రం మిత్రం, ఏకం సత్ విప్రా బహుధా వదన్తి - ఇది అంతయూ బ్రహ్మమే. ఇంద్ర సూర్యాదులు కూడా బ్రహ్మమే. అనేక విధాలుగా బుధులు ప్రవచించినా సత్యం మాత్రం ఒక్కటే అనేది శ్రుతి వాక్యము. అలాంటప్పుడు అనన్యులై భగవంతుని ఉపాసించే వారు మాత్రమే కృతకృత్యులు కావడ మేమిటి? ఇంద్రాది దేవతలను ఉపాసించిన వారికి యాతాయాతములు ప్రాప్తించడ మేమిటి? అనేది సందర్భోచిత సందేహము. పార్థుని మనస్సు లోని ఈ సందేహాన్ని ఊహించిన పరమేశ్వరుడు, సింహావలోకన న్యాయము ననుసరిస్తూ, పూర్వ బోధను సమన్వయ పరుస్తూ ప్రస్తుత శ్లోకం నుండి వరుసగా మూడు శ్లోకాలలో సందేహమును పరిహరిస్తున్నాడు.

భావ శూన్యతే బంధహేతువు

ఇతర దేవతలను శ్రద్ధతో పూజించే భక్తులు కూడా అవిధి పూర్వకంగా తననే ఆరాధిస్తున్నారు అంటున్నాడు భగవంతుడు. 'అవిధి పూర్వకం' అంటే, దారి తప్పి అని భావం. దేని యందు విధి, అర్థ జ్ఞానము ఉండవో అట్టిది అవిధి పూర్వక మవుతుంది.

సర్వానికి అధిష్ఠానము సర్వేశ్వరుడే కనుక, ఏ దేవతను ఆరాధించినా అది సర్వేశ్వరునికే చెందుతుంది. అలా వారి ఆరాధన సర్వేశ్వరునికే చెందుతూ ఉంది అనే జ్ఞానం దేవతోపాసకులకు ఉందా? లేదు. సర్వేశ్వరునికి చెందుతూ ఉంది అనే జ్ఞానం లేదు, సరే. మరి ఏముంది? తత్సంబంధ మైన అజ్ఞానం ఉంది. మరి వారు చేసే ఉపాసన జ్ఞానయుతమా? లేక అజ్ఞాన పూర్వకమా? అజ్ఞాన పూర్వకమే. అవిధి పూర్వకమే. మరి ముఖ్య ఫలమైన మోక్షం జ్ఞాన స్వరూపం కదా? అవును. మరి అవిద్యోపాసనకు విద్యాఫలం ఎలా ప్రాప్తిస్తుంది? కనుక దేవతాంతర భక్తులు శ్రద్ధతో దేవతలను ఆరాధించినా, సర్వేశ్వరుని విషయంలో జ్ఞానం లేకుండా పూజిస్తున్నారు కనుక అది అవిధి పూర్వకం ***(అవిధిః అజ్ఞానం, తత్పూర్వకం యజన్తే ఇత్యర్థః).*** భగవంతునికి సంబంధించిన అజ్ఞానమును పెట్టుకొని భగవంతుణ్ణి ఎలా పొందుతారు? అందుచేత, దేవతలకు సంబంధించిన లోకాలను పొంది, తిరిగి మళ్ళీ మానవ లోకంలో పుడుతున్నారు.

భావ శుద్ధి మోక్షహేతువు

అన్య దేవతారాధనలో భేదదృష్టి ఉంది. ఒక దేవత మరొక దేవత కన్నా భిన్నము అన్న భేదదృష్టి ఉన్నట్లే, అందరు దేవతలు పరమేశ్వరుని కన్నా అన్యులు అనే భిన్న దృష్టి ఉంది. భిన్న దృష్టితో ఆచరించే కర్మలకు ఫలం భిన్నం గానే ఉంటుంది. అభేద దర్శనంతో ఆచరించ గలిగి నప్పుడే అద్వైత ఫలమైన మోక్షం సిద్ధిస్తుంది.

అన్య దేవతా భక్తిని ఎలాగూ శ్రద్ధతో ఆచరిస్తున్నారు కనుక, వారు ఉపాసించే దేవత పరమాత్మయే అనే భావనతో చేయగలిగితే, భావాన్ని గ్రహించే వాడు భగవంతుడు కనుక ***(భావగ్రాహి జనార్దనః),*** ముఖ్య ఫలమైన మోక్షాన్ని అనుగ్రహిస్తాడు. కాని, దేవతాంతర భక్తులకు అట్టి అద్వైత భావం లేదు కనుక వారు గమనా గమనాలను పొందుతున్నారు.

దేవతను మార్చాల్సిన అవసరం లేదు. భావనను సరి చేసుకుంటే చాలు, భవార్ణవం నుండి బయట పడవచ్చు. కనుక, అవిధి పూర్వకంగా అన్య దేవతలను పూజించి, అల్ప ఫలానుభవాన్ని పొంది, జనన మరణాల మధ్య పరిభ్రమించడం కన్నా, పరమార్థ తత్త్వమును గ్రహించి, సర్వేశ్వరుడైన పరమేశ్వరుని ఆరాధించి, అనంత ఫలాన్ని పొంది తరించ వచ్చు.

మరి, అన్య దేవతారాధకులు అజ్ఞాన పూర్వకంగా (అవిధి పూర్వకంగా) ఎందుకు పూజిస్తున్నారు? అదే తరువాత శ్లోకం.

అహం హి సర్వయజ్ఞానాం భోక్తా చ ప్రభు రేవ చ ।
న తు మా మభిజానన్తి తత్త్వే నాత శ్చ్యవన్తి తే ॥ 24

అహం-హి-సర్వయజ్ఞానాం-భోక్తా-చ-ప్రభుః-ఏవ-చ
న-తు-మాం-అభిజానంతి-తత్త్వేన-అతః-చ్యవంతి-తే

అహం హి	= నేను	మాం	= నన్ను
సర్వయజ్ఞానాం	= సమస్త యజ్ఞములకు	తత్త్వేన	= తాత్త్వికంగా
భోక్తా చ	= భోక్తను	న అభిజానంతి	= ఎరుగరు
ప్రభుః ఏవ చ	= ప్రభువును కూడా	అతః	= అందుచేత
తు	= అయినను	చ్యవంతి	= పతన మవుతారు
తే	= వారు		

అర్జునా! సమస్త యజ్ఞాలకు నేనే భోక్తను. ప్రభువును కూడా. నా తత్త్వాన్ని వాళ్ళు గుర్తించడం లేదు. అందుకే దారి తప్పుతున్నారు.

వ్యాఖ్య

పరమేశ్వరుడు సర్వ దేవతారూపుడు కావడం చేత, సర్వ యజ్ఞాలకు తానే భోక్త. తానే ప్రభువు. ఇక్కడ సర్వ యజ్ఞములు అంటే శ్రౌత స్మార్తములు కూడా అని అర్థం ***(సర్వ యజ్ఞానాం శ్రౌతానాం స్మార్తానాం చ సర్వేషాం యజ్ఞానాం).*** శ్రౌతములు అంటే వేద ప్రతిపాదిత మైన క్రతువులు, యజ్ఞాలు. స్మార్తములు అంటే పూజ, జప, ధ్యాన, ప్రార్థనాదులు. ఈ రెండిటికి భోక్త పరమేశ్వరుడే.

ఇక్కడ భోక్త అంటే యజ్ఞ భోక్త. దేవతల రూపంలో ఉంటూ యజ్ఞాలలో సమర్పించే వాటిని అందుకొనే వాడు, అనుభవించే వాడు భోక్త ***(దేవతాత్వేన భోక్తా).*** అంతే కాదు. ప్రభువు కూడా తానే. యజ్ఞానికి స్వామి పరమేశ్వరుడే కనుక ఆయనే ప్రభువు. అంటే, యజ్ఞ ఫలాన్ని అనుగ్రహించే వాడు. అందుకొని అనుభవించే వాడు భోక్త. అందుకొని అనుగ్రహించే వాడు ప్రభువు. ఈ రెండూ వాస్తవానికి సర్వేశ్వరుడే. అంటే, దేవతా రూపమున ఉండి యజ్ఞాలలో సమర్పించిన వాటిని గ్రహించే వాడు, గ్రహించిన దానికి ఫలాన్ని అనుగ్రహించే వాడు ఒక్కడే. పరమేశ్వరుడే. అందుచేతనే యజ్ఞస్వామి యైన పరమేశ్వరుని అధియజ్ఞ స్వరూపునిగా ఇదివరకే మనం అర్థం చేసుకొని ఉన్నాం *(8 వ అ - 4 వ శ్లో).*

ఏ దేవతను ఉపాసిస్తూ యజ్ఞ యాగాదులు నిర్వహిస్తారో ఆ దేవతలకే ఆహుతులను సమర్పిస్తారు. కాకపోతే, దేవతలకు సమర్పించినా, అవి దేవతా రూపంలో ఉన్న పరమేశ్వరునికే చెందుతాయి. అలాగే, యజ్ఞ ఫలంగా పరమేశ్వరుడు అనుగ్రహించేది కూడా దేవతల ద్వారానే ఉపాసకునికి అందుతుంది. కాకపోతే, ఈ విషయానికి సంబంధించిన జ్ఞానం దేవతోపాసకునికి లేదు. అందుచేత, యజ్ఞము యొక్క అవాంతర ఫలాలకే పరిమితమై, పూర్ణఫలం నుండి జారి పోతాడు.

ఇక్కడ ఒక సంశయం ఉంది. మీమాంస తలెత్తుతూ ఉంది. యజ్ఞము విష్ణు స్వరూప మని అన్య దేవతారాధకునికి కూడా తెలుసు కదా! తెలియక పోతే, **అగ్నేర్ఘృతం విష్ణో స్తండులాః యజ్ఞోవై విష్ణుః** - అగ్ని, ఆజ్యము, ధాన్యాదులు అన్నీ విష్ణు స్వరూపాలే. యజ్ఞమే విష్ణు స్వరూపము అని ఉపాసకుడు యజ్ఞంలో చెబుతూ ఉండటం మనం వింటూ ఉంటాం. అలాంటప్పుడు అన్య దేవతోపాసకుడు సర్వేశ్వరుని గుర్తించడం లేదు అని చెప్పడం ఎలా పొసగుతుంది? అనేది శంక.

నిజమే. విష్ణువు యజ్ఞ స్వరూపుడు అని అన్యదేవతోపాసకుడికి తెలుసు. లేకపోతే, ఎలా చెబుతాడు? భగవంతుడు యజ్ఞరూపుడు అని తెలుసు. కాని, భగవంతుని యొక్క వాస్తవ స్వరూపం తాత్త్వికంగా తెలియదు ***(న తు మాం అభిజానన్తి, తత్త్వేన యథావత్).*** విష్ణువు తెలుసు. విష్ణు తత్త్వం అనేదే ఇక్కడ ప్రధానాంశము. దేవత పరిమితం కనుక, ఆ దేవత నుండి పరిమిత ఫలాన్నే అందుకుంటాడు. అలా అనంత ఫలమైన మోక్షము నుండి జారి పోతాడు ***(అతశ్చ అవిధి పూర్వకమ్ ఇష్ట్వా యాగ ఫలాత్, చ్యవన్తి, ప్రచ్యవన్తే తే).***

కనుక, ఉపాసనలో ఏ లోపం లేదు. ఉపాసకుని భావం లోనే లోప ముంది. దేవతా రూపాన్ని ఆరాధించడం జరుగుతూ ఉందే గాని, అంతర్యామి స్వరూపంగా ఉన్న పరమేశ్వరునికి సంబంధించిన జ్ఞానం లేదు. **బ్రహ్మార్పణం బ్రహ్మహవిః** *(4 - 24)* అని నాల్గవ అధ్యాయంలో మనం అర్థం చేసుకున్న జ్ఞానం లేదు. యజ్ఞములో భోక్త, దాత రెండూ దేవత అన్న భావమే గాని, ఆ రెండూ సర్వేశ్వరుడే సర్వము అనే తాత్త్విక జ్ఞానం లేదు.

సర్వేశ్వరుడే అనే జ్ఞానం లేదు. పరిమిత జ్ఞానానికి పరిపూర్ణ ఫలం ప్రాప్తించదు కనుక, అనంత ఫలాన్ని అందుకోలేక జారి పోతాడు.

కాలము దేశమున్ గ్రతువు కర్మము కర్తయు భోక్తయుం జగ
జ్జాలము దైవము న్గురువు సాంఖ్యము మంత్రము యజ్ఞమాహుతు
ల్వేళలు విప్రులుం జనన వృద్ధి లయంబుల హేతు భూతము
ల్లీలలు దానయై తగ వెలింగెడు నెక్కటి తేజ మీశుడున్ ॥

కాలము, దేశము, క్రతువు, కర్మ, కర్త, భోక్త, ప్రపంచము, దైవము, గురువు, జ్ఞానము, మంత్రము, యజ్ఞ ఆహుతులు, సమర్పించు వేళలు, వేదజ్ఞులు, సృష్టి స్థితి లయాలు - సమస్తము అతని స్వరూపమే అని తెలియుటయే తాత్త్విక జ్ఞానము; పువ్వులు దారములో గ్రుచ్చబడినట్లు, సర్వము సూత్రాత్మ యైన పరమేశ్వరుని యందే నిలిచి ఉంది అని శ్రీమద్భాగవతం - దశమ స్కంధములో పోతనామాత్యుడు మణులను దారములో గ్రుచ్చి మణిమాలను రూపొందించినట్లు, సమస్తాన్ని ఉత్పలమాలలో నింపేశాడు.

పరమేశ్వరుని కన్నా అన్యము లేదని గ్రహించడమే తత్త్వజ్ఞానము. అట్టి తాత్త్విక జ్ఞానాన్ని కలిగి, పరమేశ్వరుని ఉపాసించే వారు పరమేశ్వరునే పొందుతారు. తాత్త్విక జ్ఞానం లేకుండా అన్య దేవతల నారాధించే వారు ఆయా దేవతా లోకాలను చేరి తత్ఫలాలనే అనుభవిస్తారు.

అదే వివరిస్తూ ఉంది తరువాత శ్లోకం.

యాన్తి దేవవ్రతా దేవాన్ పితౄన్యాన్తి పితృవ్రతాః ।
భూతాని యాన్తి భూతేజ్యా యాన్తి మద్యాజినోఽపి మామ్ ॥ 25

యాంతి-దేవవ్రతాః-దేవాన్-పితౄన్-యాంతి-పితృవ్రతాః
భూతాని-యాంతి-భూతేజ్యాః-యాంతి-మద్యాజినః-అపి-మాం

దేవవ్రతాః	=	దేవతల నారాధించు వారు	భూతేజ్యాః	=	భూతములను ఆరాధించు వారు
దేవాన్	=	దేవతలను	భూతాని	=	భూతములను
యాంతి	=	పొందుతున్నారు	యాంతి	=	పొందుతున్నారు
పితృవ్రతాః	=	పితృపూజ చేయువారు	మద్యాజినః అపి	=	నన్ను పూజించే వారు
పితౄన్	=	పితరులను	మాం	=	నన్ను
యాంతి	=	పొందుతున్నారు	యాంతి	=	పొందుతున్నారు

అర్జునా! దేవతల్ని ఉపాసించే వారు దేవతలనే పొందుతారు. పితృ పూజ చేసే వారు పితృ దేవతల్ని చేరుతారు. భూతాలను సేవించే వారు భూతాలను పొందుతారు. నన్ను ఆరాధించే వారు నన్నే చేరుతారు.

వ్యాఖ్య

మతిని బట్టి గతి అంటారు పెద్దలు. మతి మార్గాన పడుతుంది. మార్గము గమ్యాన్ని చేరుస్తుంది. మతిని బట్టి మార్గము. మార్గమును బట్టి గమ్యము. ఇదీ పద్ధతి. ఏ విషయములో నైనా సాధన సాధ్యాలు ఇలాగే ఉంటాయి. ఉపాసనా మార్గాలు ఇందుకు విలక్షణ మేమీ కావు.

తం యథా యథా ఉపాసతే తదేవ భవతి - ఉపాసన ఎలా ఉంటే, దాని ఫలం కూడా అలాగే ఉంటుంది.

ప్రస్తుత శ్లోకంలో ఉపాసకులు నాలుగు రకాలుగా చెప్పబడ్డారు. వీరిలో ముగ్గురు అవిధి పూర్వకంగా పరమేశ్వరుని అర్చించే వారు. అంటే పూర్వం మనం చూచినట్లు అన్య దేవతారాధకులు. అజ్ఞానంతో పూజించే వారు. నాల్గవ వారు అనన్యులు. సాక్షాత్తు భగవ దారాధకులు.

అవిధి పూర్వకంగా ఉపాసించే దేవతారాధకులు అంతఃకరణ రూప ఉపాధిగత గుణత్రయ భేదమును బట్టి మూడు విధాలుగా తెలుస్తూ ఉంటారు. సాత్త్వికులు, రాజసులు, తామసులు అని మూడు రకాలుగా ఉంటారు. సత్త్వగుణ ప్రధానులైన సాత్త్వికులు దేవవ్రతులు ***(దేవవ్రతాః).*** రజోగుణ ప్రధానులైన రాజసులు పితృవ్రతులు ***(పితృవ్రతాః).*** తమోగుణ ప్రధానులైన తామసులు భూతేజ్యులు ***(భూతేజ్యాః).*** గుణభేదాన్ని బట్టి ***(గుణభేదాత్)***, కర్మభేదాన్ని బట్టి ***(కార్యభేదాత్)*** ఈ ముప్వురు ఉపాసకులు ఆయా ఫలితాలను పొందుతారు.

దేవతోపాసకు లైన ఈ గౌణ భక్తులు (గుణ ప్రాధాన్యం కలవారు) వారు ఉపాసించే మూర్తులను, కర్మ విధులను బట్టి ఆయా లోకాలను పొందుతారు. లోకాలు ఏవైనా కాలం లోనే పొంద బడతాయి. దేశం లోనే తెలిసి వస్తాయి. కాలగతము, దేశగతము అయినందున ఇవి అనిత్యాలు. కనుక లోకాంతర ఫలాలు ఏవైనా నశించేవే. తిరిగి జన్మను అందించేవే.

అల్ప బుద్ధులు, స్వల్ప బుద్ధులు గల వారు అయిన ఈ గౌణ భక్తులకు లభించే ఫలాలు కూడా అల్పం గానే ఉండి అంతము లవుతాయి *(7 వ అ - 23 వ శ్లో).* అందుచేత, అన్య దేవతోపాసకులు వారి ఆరాధనా ఫలంగా పుణ్యం ఆర్జించి, తత్ఫలితంగా పుణ్య లోకాలలో జీవించి, పుణ్యము క్షీణించ గానే మానవ లోకంలో తిరిగి జన్మిస్తారు *(9 వ అ - 21 వ శ్లో).*

గుణ ప్రధానులై, గుణ భేదాలతో ఉపాసించే ముగ్గురు దేవతారాధకుల్ని గూర్చి ముందుగా తెలుసుకొని, ఆ తరువాత అనన్యులైన భక్తుల విషయం చెప్పుకుందాము.

దేవవ్రతులు

దేవతలను ఆరాధించే వారు దేవవ్రతులు. అంటే దేవతల విషయంలో వ్రతము, అనగా నియమము కలవారు ***(దేవేషు వ్రతం నియమః భక్తిశ్చ యేషాం తే దేవవ్రతాః).*** అంటే యజ్ఞ దానాది నియమ రూపులు. సత్త్వగుణ ప్రధానులై ఇంద్ర, అగ్న్యాది దేవతల్ని ఆరాధిస్తూ యజ్ఞాలను నిర్వహిస్తారు. వీరు శ్రౌత కర్మలను, అనగా శ్రుత్యుక్త మైన సాధనలను ఆచరిస్తారు. ఇంద్రాది దేవతల్ని తృప్తి పరుస్తారు. తత్ఫలితంగా ఆయా లోకాలను పొందుతారు ***(దేవవ్రతాః దేవాన్ యాన్తి గచ్ఛన్తి).*** వీరు దేవయాజులు. పుణ్యఫలంగా స్వర్గాది లోకాలను పొందుతారు కనుక, పుణ్యం క్షీణించ గానే ఆయా లోకాలను త్యజించి తిరిగి మానవులుగా పుడుతారు.

పితృవ్రతులు

పితృవ్రతం కలవారు పితృవ్రతులు. అంటే, పితృ దేవతల యందు భక్తి కలిగి శ్రాద్ధాది కర్మలను, తర్పణ తిలోదకాలను సమర్పించే నియమంతో ఉపాసించే వారు ***(పితృ భక్తాః).*** వీరు రజో గుణ ప్రధానులు. మానవ లోకంలో పితృ కర్మలతో పాటు వీరు ఆచరించే స్మార్త కర్మలైన పూజాదికాలు వీరిని మరణానంతరము పితృలోకం చేర్చుతాయి. కనుక, పితృవ్రతులు పితృలోకాలను చేరుతారు ***(పితృభక్తాః పితౄన్ యాన్తి గచ్ఛన్తి).*** ఇది కూడా కర్మఫలమే కనుక, ఫలం క్షయం కాగానే వీరు కూడా తిరిగి జనన మరణాల చక్రంలో పడిపోతారు.

భూతేజ్యాలు

భూత ప్రేతాలను, యక్ష రాక్షస గణాలను ఉపాసించే వారు భూతేజ్యాలు. వీరు తమోగుణ ప్రధానులు.

ఇలా భూతగణాన్ని పూజించే వారు మరణానంతరము భూతాలు వసించే లోకాలను పొందుతారు (*భూతేజ్యాః* ***భూతానాం పూజకాః భూతాని యాన్తి గచ్ఛన్తి***).

ఈ ముగ్గురు, మిక్కిలి ప్రయాసతో కూడినవి, బహు ధన వ్యయంతో పాటు అధిక దేహ శ్రమ కలవి అయిన వ్రతములను ఆచరించి, స్వల్ప ఫలాన్ని అల్పకాలం అనుభవించి తిరిగి మానవ లోకంలో పుడుతారు.

పైగా, వీరు ఆచరించే నియమ రూప కార్యాలలో కర్మ లోపం జరిగినా, వస్తు లోపం ఏర్పడినా, విధి లోపం కలిగినా, మంత్ర తంత్రాది లోపము సంభవించినా, ఫలితము రాక పోగా, విపరీతమైన ప్రతికూల ఫలాలు వచ్చే ప్రమాదము కూడా లేకపోలేదు.

ప్రయాసం అధికం. ఫలం అల్పం. దీనికి కారణం వీరి ఆరాధనలు అవిధి పూర్వకంగా ఉండటమే. అజ్ఞానంతో కూడి ఉండటమే. ఈ విధంగా గుణ భేదాలతో అన్య దేవతారాధనములో నిమగ్నమై పరమేశ్వరుని అవిధి పూర్వకంగా అర్చించి, అనిత్య ఫలాలను ఈ దేవవ్రత, పితృవ్రత భూతేజ్యాలు అనుభవించి యాతాయాతాలలో పడుతూ ఉంటే, నాల్గవ వారైన అనన్యులు, భగవద్భక్తులు (***మద్యాజినః***) తననే పొందుతున్నారు అంటున్నాడు భగవంతుడు (***మద్యజన శీలాః మామేవ యాన్తి గచ్ఛన్తి***). గుణ ప్రధానులైన ముగ్గురు దేవతోపాసకుల కంటే అనన్యులైన భక్తులు విలక్షణమైన వారు. వారిని గూర్చి మరి కొంత చెప్పుకుందాం.

మద్యాజులు

మద్యాజులు అంటే పరమేశ్వరునే ఆరాధించే అనన్యులు. వీరు పరమేశ్వరుని ఆరాధిస్తారు. పరమేశ్వరుని ఎలా ఆరాధిస్తారు? జ్ఞానపూరితంగా ఉపాసిస్తారు. పరమేశ్వరుడు జ్ఞానస్వరూపుడు. అనంతుడు. అనంతుడైన వానిని పొందాలి అంటే, ఏం చెయ్యాలి? ఏది చేసినా అది కర్మే కనుక, కర్మ పరిమితమే కనుక, పరిమితమైన కర్మ ద్వారా అనంతుని పొందలేము.

భగవంతుడు ఒక ప్రదేశంలో ఉండేవాడు అయితే ప్రయత్నించి పొందవచ్చు. అంతటా ఉండేవాణ్ణి చేరుకునే మార్గ మేది? అనంతము అనే దానిలో నీవు వేరుగా ఎక్కడున్నావు? కనుక అనంతుణ్ణి నీవు పొందే ఉన్నావు. పొందే ఉన్న దానిని పొందడానికి నీవు ఏమి ప్రయత్నము చేస్తావు? తెలుసుకుంటావు. అంతే. పొందే ఉన్నాను అనే జ్ఞానాన్ని పొందుతావు.

తాను తియ్యగా ఉండటానికి బెల్లం ఏమి చెయ్యాలి? ఏమీ చెయ్య నవసరం లేదు. తెలుసుకోవాలి. నేను తియ్యగానే ఉన్నాను అని అర్థం చేసుకోవాలి. అదే జ్ఞానం. ఇలా ఉన్న దానిని తెలుసుకోవడం కష్టమా? లేక లేని దానిని పొందడము కష్టమా? ఆలోచించండి. అదే జ్ఞాన వైభవం. కనుక, జ్ఞానంతో పరమేశ్వరుని ఆరాధించే వారు పరమేశ్వరునే పొందుతున్నారు. జనన మరణాల నుండి విడి పడుతున్నారు.

అధిక శ్రమతో అల్ప ఫలాన్ని పొంది జనన మరణ చక్రంలో తగులుకొని దేవతారాధకులు అలమటిస్తూ ఉంటే, అల్ప శ్రమతో అనంత ఫలాన్ని పొంది, జనన మరణ వలయం నుండి విడిపడి అనన్య భక్తులు భగవత్స్వరూపులై శోభిస్తున్నారు. ఇక్కడ భక్తి ప్రాధాన్యమే గాని, కర్మకాండలో లాగా వస్తు ప్రాధాన్యం, కర్మ ప్రాధాన్యం లేవు. అనంతుడైన వానికి మన మేమివ్వగలం? ఆయన ప్రసాదించినవే తిరిగి ఆయనకు నైవేద్యంగా సమర్పించడం కన్నా భక్తులు చేయగలిగింది ఏమీ లేదు.

ఆ సమర్పణ ఎలా ఉంటుందో చూద్దాం.

పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి ।
తదహం భక్త్యుపహృత మశ్నామి ప్రయతాత్మనః ॥ 26

పత్రం-పుష్పం-ఫలం-తోయం-యః-మే-భక్త్యా-ప్రయచ్ఛతి
తత్-అహం-భక్త్యుపహృతం-అశ్నామి-ప్రయతాత్మనః

యః	= ఎవడు	ప్రయచ్ఛతి	= సమర్పించునో
భక్త్యా	= భక్తితో	ప్రయతాత్మనః	= నిష్కాముడైన అట్టి భక్తుని యొక్క
పత్రం	= ఆకునో	భక్త్యుపహృతం	= భక్తిపూర్వకముగా సమర్పింపబడిన
పుష్పం	= పువ్వునో	తత్	= దానిని
ఫలం	= ఫలమునో	అహం	= నేను
తోయం	= ఉదకమునో	అశ్నామి	= భుజిస్తున్నాను
మే	= నాకు		

అర్జునా! ఆకు అయినా, పువ్వు అయినా, పండైనా, నీళ్ళైనా నాకు భక్తితో సమర్పిస్తే చాలు. భక్తి కలవాడు బుద్ధిగా సమర్పిస్తే, దానిని నేను తృప్తిగా ఆరగిస్తాను.

వ్యాఖ్య

ప్రేమ చలనాలు

ప్రేమ పవిత్ర మైంది. భక్తియే ప్రేమకు పరాకాష్ఠ. భక్తిగా మారిన ప్రేమ అమృత స్వరూపమై అలరారు తుంది. భక్తుని హృదయం నుండి నిరంతరం స్రవించే ప్రేమ ప్రవాహము పరమేశ్వరుని చరణాలను చల్లగా తడుపుతూ ఉంటుంది.

భక్తి అనేది ఉత్కృష్టమైన ఉపాసన. విశిష్టమైన ఆరాధన. ప్రేమ స్వరూపమైన భక్తి, బుద్ధిలో భావనా రూపంగా ఉంటుంది. బాహ్యంలో క్రియా రూపంగా వ్యక్త మవుతుంది. ఈ రెండూ కలిసి నపుడే భక్తి ప్రతిక్షణ వర్ధమానమై అనుభవ రూపంగా విలసిల్లుతుంది.

ప్రేమ దాగేది కాదు. భక్తి దాచబడేది కాదు. ప్రేమ రూపమైన భక్తిని హృదయంలో ఉంచి మూత పెట్టలేము. అది కళ్ళ ద్వారా తొంగి చూస్తుంది. మాట ద్వారా బయట పడుతుంది. చేతులను చలింప చేస్తుంది. చేతలలో చిందు లేస్తుంది.

విరబూసిన మల్లెలు వెదజల్లే పరిమళాలను చేతులు అడ్డుపెట్టి ఆపగలమా? భక్తి కూడా అంతే. ప్రేమ ఉంటే ప్రేమ కార్యాలు అనివార్యంగా సాగుతాయి. నీరు పోయక పోతే మొక్క పెరగనట్లు ప్రేమ కార్యాలు లేకుండా ప్రేమ వృద్ధి చెందదు.

మొక్క ఆర్భాటము లేకుండా పెరుగుతుంది. ప్రేమ ఆడంబరము తెలియకుండా తిరుగుతుంది. సూర్యుని నుండి కదిలే నులివెచ్చని లేత కిరణాలు, పువ్వుల లోని రంగుల పొంగులు, చల్లగా, మెల్లగా చలించే కడలి తరంగాలు, గుర్తులు విడవకుండా గగనంలో విహరించే విహంగాలు - ఇవన్నీ మనస్సుపై ప్రకృతి లిఖించే ప్రేమ సంతకాలు. అన్నీ ప్రేమ కార్యాలే. శబ్దం లేకుండా బుద్ధిలో అలజడిని సృష్టించే ప్రేమ చలనాలే. మౌన భాషలో మర్మంగా, రమ్యంగా అచ్యుతుని అడుగు జాడలను తెలిపే ముచ్చట్లే.

ప్రకాశము లేకుండా సూర్యుడు ఉండలేడు. సూర్యుడు, సూర్య ప్రకాశము రెండు కావు. ప్రేమ కార్యాలు లేకుండా ప్రేమ ఉండలేదు. భక్తి కార్యాలు లేకుండా భక్తి నిలవదు. భక్తి, భక్తి కార్యాలు రెండు కావు.

ప్రేమకు ఇవ్వడమే తెలుసు. ప్రకాశాన్ని విరజిమ్మడమే భానుని ప్రభావము. వర్షించడమే మేఘం లోని ఔదార్యం. అన్నం పెట్టడమే అవనికి తెలుసు. ప్రాణం పోయడమే గాలికి తెలుసు. ఇవన్నీ ప్రేమ కార్యాలు

ఇచ్చుకొనే కార్యాలు. మాధవుడు మెచ్చుకొనే కార్యాలు. భక్తులు కూడా పరమేశ్వరుడు మెచ్చుకొనే లాగా ఇచ్చుకొనే కార్యాలలో ముచ్చట పడతారు. ఆ ఇచ్చుకోవడాలే సమర్పణలు.

సమర్పణల సందడులు

సమర్పణము ప్రేమ కార్యము. సమర్పించే వాడు భక్తుడై ఉండాలి. సమర్పించేది భక్తితో అర్పించ బడాలి. సమర్పణము ప్రేమ కార్యము. సమర్పించే వాడు భక్తుడై ఉండాలి. భక్తితో మనం ఏది సమర్పించినా, భగవంతుడు దానిని అక్కడే సమర్పణము సముజ్జ్వలమై శోభిస్తుంది. భక్తితో మనం ఏది సమర్పించినా, భగవంతుడు దానిని ప్రేమతో గ్రహిస్తాడు. గ్రహించి అనుగ్రహిస్తాడు.

చేసేది భక్తి. చూపేది దయ. పరమేశ్వరుని దయతో సర్వమూ సిద్ధిస్తుంది. అదంతా భక్తితో ముడిపడి ఉంటుంది. భక్తి కార్యాలలో మడత పెట్టి ఉంటుంది. మడతలు విప్పుతూ ఉంటే కొరతలు తప్పుకుంటూ పోతాయి.

ఈ ప్రపంచంలో ఎవరికి ఏది ఇచ్చినా, ఎంత ఇచ్చినా, మనం తృప్తి పరచిన దాఖలాలు లేవు. వారు తృప్తి చెందిన ఆనవాళ్ళు అగుపించవు. ఏది ఇచ్చినా తృప్తి చెందని వాడు మానవుడు. ఏది సమర్పించినా సంతృప్తి పడేవాడు మాధవుడు.

ఇంతకీ భగవంతునికి సమర్పించడానికి మన వద్ద ఏముంది? మనం ఈ ప్రపంచంలో కాలు మోపిన నాడు మన చేతులు ఏమి పట్టుకొచ్చాయి? మన భుజాలు ఏమి మోసుకొచ్చాయి? రిక్త హస్తాలతో వచ్చాం. మరి మన వద్ద ఏముందని భగవంతునికి సమర్పిస్తాం?

ఏదైనా పరమాత్మ సృష్టించిందే. ఆయన సృష్టి లోని వస్తువే. ఆయన వస్తువునే ఆయనకు సమర్పిస్తున్నాం. వస్తువు పరమేశ్వరునిదే. ఆయన వస్తువునకు మన భక్తిని జోడించి అర్పించడమే మనం చేయదగిన కార్యము. విలువలు ఆయనివే. వలపులే మనవి. పదార్థం పరమేశ్వరునిదే. ప్రేమే మనది. పరమేశ్వరుడు ప్రసాదించిన పదార్థాన్ని ప్రేమ పళ్ళెంలో ఉంచి సమర్పించడమే మన ఆరాధన. ఆయన అనుగ్రహించిన కర్పూరాన్ని మన భక్తితో వెలిగించి త్రిప్పడమే నీరాజనం.

పరమేశ్వరునికి తృప్తి నిచ్చేది ఆయన సృష్టి లోని వస్తువు కాదు; మన హృదయం లోని భక్తి. కనుక, ***భక్త్యుపహృతం*** - భక్తితో సమర్పించడ మొక్కటే మనం చేయవలసిన పూజా కార్యం. కనుక, భగవంతునికి ఏమి సమర్పించాము? అనేది ముఖ్యం కాదు. ఎలా సమర్పించాము? అనేదే ప్రధానం.

మనం సమర్పించేవి భగవంతుడు ఆరగిస్తాడా? ఆరగించడానికి భగవంతునికి ఆకలి ఉందా? ఆకృతే లేని వాడికి ఆకలి ఎలా పుడుతుంది? జనుల ఆకలి తీర్చే జనార్దనునికి మనం ఆహారం పెట్టడమా! మనం పెడితే, ఆయన తింటాడా? తప్పక తింటాడు. తినకపోతే ఎందుకు పెడతాము? ***అహం అశ్నామి*** - నేను తింటున్నాను అని ఆయనే ప్రకటించు కున్నాడు కదా! మరి, మనం సమర్పించే దానిని పరమేశ్వరుడు ఆరగించే టప్పుడు, సమర్పించడం అనే కార్యాన్ని మించిన పవిత్రమైన కార్యం మరొకటి ఉంటుందా?

అందుచేత, సమర్పణ అనేది ఆరాధనలో ప్రధానమైంది. ఎలా సమర్పిస్తున్నాము అనేది అందులోనూ అతి ప్రధాన మైంది. ఏమి సమర్పిస్తున్నాము అనేది ఒక్కటే అప్రధాన మైంది. నువ్వు ఏది సమర్పించావు అనేది భగవంతుడు చూడడు. ఏదైనా అర్పించు. అది ఆకైనా, పువ్వైనా, పండైనా, నీళ్ళైనా, ఏదైనా ఫరవాలేదు. అన్నీ పూజార్హాలే. అన్నీ ఆరగింపులే. అనంతుడైన పరమేశ్వరుడు ఆకలేసి తినడం లేదు. నీ ఆర్తిని చూసి తింటున్నాడు. నీ భక్తికి మెచ్చి ఆరగిస్తున్నాడు.

ఏది ఇచ్చినా భగవంతుడు పుచ్చుకుంటాడు. కాకపోతే, ఇచ్చేవాడు అర్హత కలవాడై ఉండాలి. యోగ్యత కలవాడై ఉండాలి. ఆ అర్హత ఏమిటి? ఆ యోగ్యత ఎలాంటిది? భక్తియే అర్హత. అదే సమర్పించడానికి యోగ్యత. ***భక్త్యాప్రయచ్ఛతి*** - భక్తితో ఇవ్వాలి. ***భక్త్యుపహృతం*** - భక్తితో సమర్పించ బడాలి ***(భక్త్యా ఉపహృతం భక్తి పూర్వకం ప్రాపితం).*** భక్తి అనే పదాన్ని ఈ విధంగా ప్రస్తుత శ్లోకంలో రెండు సార్లు ప్రయోగించడం జరిగింది. నిష్కల్మషంగా ఆంతర్యంలో భావనా రూపంలో ఉండ వలసింది భక్తి. అలాగే నిష్కామ్యంగా బాహ్యంలో కార్య రూపంలో నిండ వలసింది కూడా భక్తే. బాహ్యాభ్యంతరాలలో కొరత లేని భక్తి, వెలితి తెలియని భక్తి ఉండాలి అని సూచించడమే రెండు సార్లు భక్తి పద ప్రయోగము.

పత్రం - పుష్పం - ఫలం - తోయం

పత్ర పుష్ప ఫలోదకాలు ఏవైనా సరే, భక్తితో సమర్పిస్తే, పరమేశ్వరుడు ఆరగిస్తాడు. ***అశ్నామి*** - తింటాను అన్నాడు. పండ్లు సరే తినొచ్చు. మరి ఆకులు, పూలు కూడా తింటాడా? అదలా ఉంచినా, నీళ్ళు ఎలా తింటాడు? త్రాగే వాటిని తినడ మంటే, తినే వాటిని త్రాగడము అని అర్థం చేసుకోవాలా?

అదలా ఉంచి, వేదం వైపు తిరిగితే, ***న హ వై దేవా అశ్నన్తి న పిబన్త్యే తదేవామృతం దృష్ట్వాతృప్యన్తి*** - భక్తులు సమర్పించిన వాటిని దేవతలు తినరు. పానం చేయరు. అమృతమును కూడా కళ్ళతో చూచి తృప్తి చెందుతారే గాని త్రాగరు అని వేదం చెబుతోంది. అమృతాన్ని కూడా దేవతలు త్రాగరు అనేటప్పుడు, దేవ దేవుడైన భగవంతుడు ఈ పత్ర పుష్పాలు ఆరగించడ మేమిటి? నదీ జలాలు పానం చేయడ మేమిటి? ఇదంతా ఎందుకు చేస్తున్నట్లు? ***భక్త్యుపహృతం*** - భక్తితో సమర్పించడమే దానికి కారణము. భక్తితో ఇస్తే చాలు, ఏవైనా భగవంతుడు అందుకుంటాడు. భక్తి ఉంటే చాలు, ఏదిచ్చినా గ్రహిస్తాడు. ఎవరి నైనా అనుగ్రహిస్తాడు.

ఇరువుగ నిసుక లోన బొరలిన యుడుత భక్తికి
కరుణించి బ్రోచితి వని నెర నమ్మితి నిన్నే తండ్రి
పలుకే బంగార మాయెనా? కోదండ పాణి ***॥ పలుకే ॥***

అంటూ భక్తులను అనుగ్రహించే భక్తవత్సలుడు, కరుణామయు డైన పరమేశ్వరుని పరవశించి కీర్తించాడు భద్రాచల రామదాసు.

ఆకలి తెలియని భగవంతుడు ఆకులు ఆరగించే వాడు కాడు, ఫల పుష్పాదులు తినేవాడూ కాడు. నీళ్ళు త్రాగడానికి ప్రాణ ధర్మమైన దాహం ఆయనకు లేదు. ఆయన ప్రాణనాథుడు. ప్రాణ నిలయుడు. ప్రాణ జీవనుడు.

పువ్వు పువ్వుగా ఉండి పరిమళించడానికి కారణమైన వాడు తాను. ఆకు ఆకుగా ఉండి పచ్చగా కళకళ లాడటానికి హేతువు తానే. పండు పండుగా ఉండి, రసపూర్ణం కావడానికి కారణము తానే. నీరు నీరుగా ఉండటానికి ఉదజని, ప్రాణవాయువుల సమ్మేళనాన్ని రూపొందించింది తానే. అన్నిటికీ ఆధారమైన ఆయనకు ఇవేవీ అవసరం లేదు. ఆయన గ్రహించేది మన భక్తిని మాత్రమే. సాధారణంగా **అశ్నామి** అంటే ఆరగించడము అని భావిస్తాము. అక్కడ నుండే పుట్టుకొస్తుంది ఈ మీమాంస. **అశ్నామి** అంటే **గృహ్ణామి** అని భాష్యంలో అర్థం చెప్పారు శ్రీ శంకరాచార్య స్వామి. **గృహ్ణామి** అంటే గ్రహిస్తాను అని అర్థము. ఆయన గ్రహించేది కూడా వస్తువును కాదు. వస్తువును సమర్పించే వ్యక్తి లోని భక్తిని.

అవే ఎందుకని?

పత్రం పుష్పం ఫలం తోయం - ఎందుకని ఈ నాలుగే సమర్పణ వస్తువు లయ్యాయి? ఇవి కాకుండా మరేవీ ఇవ్వకూడదా? ఇంకేవీ పనికి రావా? ఈ నాలుగే ప్రశస్తములా? పవిత్రములా? ఉత్కృష్టములా? లేక

భగవంతునికి ఇష్టములా? అవేవీ కాదు. ఈ నాలుగైతే సులభంగా దొరుకుతాయి, అందరికీ లభిస్తాయని. అవి సులభంగా ప్రాప్తించడమే కాకుండా, సమర్పణమే ప్రధానంగా గల భక్తి కూడా అన్నిటి కన్నా సులభము, సురక్షితము, క్షేమకరము అని సూచిస్తున్నాయి *(అన్యస్మాత్ సౌలభ్యం భక్తౌ).*

మరి, వీటితో ఈ ప్రపంచంలో ఎవరి నైనా తృప్తి పరచగలమా? ఆకులే అల్లెము అని వడ్డిస్తే అల్లుడు ఒప్పుకుంటాడా? సారెకు బదులు పువ్వులు బిందెలలో నింపి అత్తవారింటికి పోయిరమ్మంటే బింబోష్ఠి గడప దాటుతుందా? కట్న కానుకలు లేవని పొట్లకాయలు చేతిలో పెడితే పెళ్ళిళ్ళు జరుగుతాయా? నీళ్ళను నిధులుగా ఎవరైనా అంగీకరిస్తారా? వీటితో ప్రపంచంలో ఎవరైనా తృప్తి చెందుతారా? కానీ పరమేశ్వరుడు తృప్తి చెందుతాడు. ఎందుకో తెలుసా? ఆయన గ్రహించేది మనం సమర్పించే వస్తువును కాదు, మన భక్తిని.

పత్రం - పత్రం అంటే ఆకు. అన్నయ్యకు అరణ్యంలో ఆడపడుచు అర్పించింది ఆకు గాక మరేమిటి? అర్పించింది ఆకు. అందుకున్నది అక్షయం. చెల్లెమ్మా! నాకు ఆకలిగా ఉంది అన్నం వడ్డించు అన్నాడు ఆక లెరుగని అచ్యుతుడు అరణ్యంలో. అన్నయ్యా! పాత్ర నిండుకున్నది అన్నది ద్రౌపది చిన్నబోయి, సూర్యదత్త మైన అక్షయపాత్రను చూపిస్తూ.

ఆ పాత్ర అంచుకు శాక లేశం అంటుకొని అగుపించింది. అంతే. ఆ శాక లేశాన్ని నోటిలో వేసుకొని, ***విశ్వాత్మా ప్రీయతాం దేవస్తుష్ట శ్చాస్త్వితి యజ్ఞభుక్*** - ఈ శాకంతో విశ్వాత్ముడు, యజ్ఞ భోక్త అయిన భగవంతుడు ప్రీతి చెందు గాక! అని పలికాడు శ్రీకృష్ణుడు.

ఆ పలుకులో పరమార్థం ఏమిటో! పది వేల మంది శిష్యగణంతో వచ్చి, ఆతిథ్యం ఇవ్వమని ఆజ్ఞాపించిన దుర్వాస మహర్షి అభీష్టం నెరవేరడానికి ఆ పలుకే హేతువైంది. సమర్పించింది ఒక ఆకును మాత్రమే. ఆకలి తీరింది పదివేల మందికి. పరమేశ్వరుని పరమ ప్రేమను వర్ణించడం ఎవరి తరము! ***ఓం నమో భగవతే వాసుదేవాయ.... పత్రం సమర్పయామి!***

పుష్పం - పత్రం లాగా పువ్వును కూడా పరమేశ్వరునికి అర్పణ చేయవచ్చు. సరోవరము నందు మొసలి గజేంద్రుని పాదమును పట్టుకొని లోనికి ఈడుస్తున్న సమయంలో, బహుకాలం పోరాడి అలసిపోయి, అసువులు బాసే వేళ గజేంద్రుడు శ్రీహరిని ప్రార్థిస్తాడు. గజేంద్రుని మొర ఆలకించి, వైకుంఠపురం నుండి శ్రీహరి బయలుదేరి త్రికూట పర్వతము నందు ఋతుమంత మనే ఉద్యానవనంలో గజేంద్రుని సమీపించ గానే, గజేంద్రుడు శ్రీహరిని దర్శించి, సరోవరము నందలి పద్మమును తొండముతో గ్రహించి, కమలముతో కూడిన తొండమును పైకెత్తి ***(ఉత్క్షిప్య సాంబుజకరం),*** జగన్నాథా! భగవంతా! నీకు నమస్కారము ***(నారాయణాఖిల గురో భగవన్ నమస్తే)*** అని అతి కష్టంగా పలికాడు ***(కృచ్ఛాత్ గిరమ్ ఆహ).*** గజేంద్రుడు సరోవరంలో నిలబడి సమర్పించిన తామర పుష్పాన్ని చూపు తోనే గ్రహించిన శ్రీ మహావిష్ణువు చక్రాయుధమును ప్రయోగించి మకరి శిరస్సును ఖండించి, కరిని ఉద్ధరించాడు. కేవలం పుష్పమును సమర్పించిన గజేంద్రునికి శ్రీహరి ప్రాణదానం చేసి ఉద్ధరించాడు. ***ఓం నమో భగవతే వాసుదేవాయ ... పుష్పం సమర్పయామి!***

ఫలం - పత్ర పుష్పాలను సమర్పించి ద్రౌపది, గజేంద్రుడు పరమేశ్వరుని అనుగ్రహానికి పాత్రు లైనట్లు, రుచికరమైన ఫలాలను భగవంతునికి భక్తితో సమర్పించి శబరి తరించి పోయింది. శబరీ! నీకు రామ దర్శనం కాగానే నువ్వు తరిస్తావు. అంతవరకు పంపాతీరము నందే నిరీక్షిస్తూ జీవించ మని చెప్పిన గురుదేవుని వచనాలను హృదయంలో నిలుపుకొని శ్రీరాముని కొరకు నిరాశ లేని నిరీక్షణను కొనసాగించింది శబరి.

రాముడు రానే వచ్చాడు. శబరీ! గురుసేవకు ఫలితం లభించిందా? అని ప్రశ్నించాడు. శబరి పరవశించి పోయింది.

అద్య ప్రాప్తా తపః సిద్ధిః తవ సందర్శనా న్మయా ।
అద్య మే సఫలం తప్తం గురవశ్చ సు పూజితాః ॥

రామా! నేడు నీ దర్శన భాగ్యం లభించింది. నాకు తపస్సిద్ధి ప్రాప్తించిందని భావిస్తున్నాను. నేను చేసిన తపస్సు, నే నాచరించిన గురుసేవ సఫలము లయ్యాయని విశ్వసిస్తున్నాను అంది శబరి.

రాముని సేవించింది. రుచికరమైన ఫలాదులను సమర్పించింది. రామసేవలో సంతృప్తి చెందింది. ***అర్చితో౽హం త్వయా భక్త్యా గచ్ఛ కామం యథా సుఖమ్*** - శబరీ! నన్ను భక్తితో పూజించావు. ఇక పరలోకాలకు సుఖంగా వెళ్ళు అని రాముడు ఆశీర్వదించి పంపించాడు. పక్వమైన ఫలాలను, మధురమైన ఫల మూలాదులను భక్తితో రామునికి అర్పించి ***(ఫలానిచ సుపక్వాని మూలాని మధురాణిచ)*** అర్చించింది శబరి. ఆమె సమర్పించిన ఫలాలను ఆరగించి శ్రీరాముడు ఆమెకు ముక్తిని ప్రసాదించాడు ***(ఫలాన్యాస్వాద్య కాకుత్స్థః తస్యై ముక్తిం పరాం దదౌ)*** అన్నది పద్మ పురాణము. శ్రీరాముడికి ఫలాలను సమర్పించి మోక్ష ఫలాన్ని అందుకున్న శబరి భాగ్యాన్ని ఎంతగానో కీర్తించాడు త్యాగరాజస్వామి.

ఎంతని నే వర్ణింతును? శబరీ భాగ్య ॥ మెంతని ॥
దాంతుల వరకాంతలు జగమంత నిండి యుండగ ॥ ఎంతని ॥
కనులార సేవించి కమ్మని ఫలముల నొసగి
తనువు పులకరించ పాద యుగములకు మ్రొక్కి
ఇనకులపతి సముఖంబున పునరావృత్తి రహిత పద
ము పొందిన త్యాగరాజ నుతురాలి పుణ్యంబును ॥ ఎంతని ॥

శబరి భాగ్యమే భాగ్యము. ఆ అదృష్టాన్ని ఎవరు వర్ణించ గలరు? ఎందరు యోగులు! మరెందరు పవిత్రమూర్తులు! ప్రపంచంలో ఎందరు సాధ్వీమతల్లులు! అయినా, శబరి అదృష్టమే అదృష్టము!

రాముడికై యెద సౌందర్యంతో ఎదురు చూచింది. తనివి తీరా దర్శించింది. పక్వమైన ఫలాలను సమర్పించింది. పులకరించిన మేనుతో రాముని చరణ పంకజాలకు ప్రణమిల్లింది. రాముని సన్నిధిలో పరంధామం చేరి పోయింది. ఫలం సమర్పించింది. మోక్షఫలం అందుకున్నది. ***ఓం నమో భగవతే వాసుదేవాయ . . . ఫలం సమర్పయామి!***

తోయం - తోయం అంటే ఉదకము. జలము. పత్ర పుష్ప ఫలాదులు సమర్పించలేక పోతే, కేవలం నీళ్ళు అర్పించినా నారాయణుడు తృప్తి చెందుతాడు. అలా ఉదకాన్ని అర్పించి ఉద్ధరింప బడిన మహనీయుడు రంతిదేవుడు.

రంతిదేవుడు ఒక మహారాజు. సర్వులలో సర్వేశ్వరుని దర్శిస్తూ, తన సంపద నంతా జనులకు వితరణ చేసిన ఉదార దానశీలి.

ఒకప్పుడు దేశంలో క్షామం సంభవించింది. రంతిదేవుడు నలభై ఎనిమిది రోజులు ఆహారానికి నోచుకో లేదు. అయినా అతనికి భగవంతునిపై భక్తి శ్రద్ధలు తగ్గలేదు.

ఎట్టకేలకు ఒకనాడు అతనికి ఆహారం లభించింది. తినబోయే సమయానికి అతిథి సమీపించాడు. **అభ్యాగతః స్వయం విష్ణుః** - అతిథి సాక్షాత్తు నారాయణుడే అని భావించిన రంతిదేవుడు తన ఆహారంలో సగ భాగమును అతిథికి సమర్పించాడు.

మిగిలిన సగ భాగమును భుజించుటకు భార్యాబిడ్డలతో ఆసీను డయ్యాడు రంతిదేవుడు. ఈ లోగా

మరొక అతిథి అరుదెంచాడు. అందులో సగ భాగమును అతనికి సమర్పించాడు. మిగిలిన నాల్గవ వంతు ఆహారాన్ని ఆరగించబోయే సరికి కొన్ని కుక్కలను వెంట బెట్టుకొని మరొక వ్యక్తి అరుదెంచి, అన్నం పెట్టమని అర్థించాడు. చివరికి మిగిలిన ఆ ఆహారాన్ని ఆ వ్యక్తికి సమర్పించాడు రంతిదేవుడు.

ఆహార మంతా సమర్పించేశాడు. ఇక కేవలం నీళ్ళే మిగిలి ఉన్నాయి. అవే త్రాగి వారి ప్రాణాలను నిలుపుకుందా మనుకున్నాడు. ఈ లోగా ఒక చండాలుడు అక్కడికి వచ్చి, కాస్తంత నీళ్ళిచ్చి ప్రాణాన్ని కాపాడ మని ప్రార్థించాడు. అంతే. ఉన్న ఉదకాన్ని కూడా ఆ పుల్కసునికి అర్పించి, అతనిలో భగవంతుని దర్శిస్తాడు రంతిదేవుడు.

రంతిదేవుని సమర్పణ వైభవానికి సంతృప్తి చెందిన బ్రహ్మాదులు అక్కడ ప్రత్యక్షమై, రంతిదేవుని ఆశీర్వదించి పరమ పదమును అనుగ్రహిస్తారు. *ఓం నమో భగవతే వాసుదేవాయ . . . శుద్ధోదకం సమర్పయామి!*

నాలుగు కావు - ఒక్కటే

పత్రం పుష్పం ఫలం తోయం అనేవి నాలుగు కనిపిస్తూ ఉండినా, తాత్త్వికంగా విశ్లేషించుకుంటే ఆ నాలుగు ఒక్క దాని వివిధ రూపాలే. ఆ ఒక్కటే మన అంతఃకరణము. అదే అంతఃకరణ చతుష్టయము అనబడే మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము.

పత్రము ఏదో కాదు, మనస్సే. **చలనాత్మకం మనః** - ఆకు చలించినట్లు నిరంతరం చలిస్తూ ఉండేది మనస్సు. చలన శీలమైన మనస్సు అనే పత్రాన్ని పరమేశ్వరుని పాదాల చెంత సమర్పించడమే పత్ర సమర్పణము.

పుష్పము బుద్ధికి ప్రతిరూపము. సుందర సురభిళమై, విజ్ఞాన సుగంధ పరిమళాలను వెదజల్లే వికాసయుత మైన బుద్ధియే పుష్పము. బుద్ధి లోని భావ సౌరభాలను భవ్యమైన భగవంతుని చరణ కమలాల చెంత సమర్పించడమే పుష్ప కైంకర్యము.

ఫలం అహంకారము. అహం భావనయే ఇక్కడ ఫలం. **నాహం కర్తా - హరిః కర్తా** - నేను కర్తను కాను. భగవంతుని చేతిలో పనిముట్టును. ఏదీ లేక, ఏమీ లేక, ఎవరూ లేక ఖాళీ యైన నేను మురళి లాగా పరమాత్మ చేతిలో పరికర మయ్యాను అనే భావనతో అహంకార ఫలాన్ని పరమేశ్వరుని పవిత్ర పద సరోజముల చెంత సమర్పించడమే ఫల నివేదనము.

తోయం అంటే జలము. అదే చిత్తము. **చింతన కర్తృ చిత్తమ్** - నదీ ప్రవాహంలో పాత నీరు పోతూ, క్రొత్త నీరు వస్తూ ఉండినా, నిత్య ప్రవాహం కొనసాగినట్లు, గత స్మృతులను, నేటి భావాలను, రేపటి ఊహలను పెనవేసుకుంటూ సాగే నిరంతర చింతనమే చిత్త మనే తోయం. చిత్తవృత్తు లన్నిటినీ నిరోధించి, చిత్తాన్ని చిద్విలాసుని చరణ పంకజముల చెంత ఉంచడమే ఉదక సమర్పణము. కనుక పత్రం పుష్పం ఫలం తోయం అనే మనోబుద్ధ్యహంకార చిత్తములనే అంతఃకరణ చతుష్టయమును పరమేశ్వరునికి సమర్పించి సంతసించడమే భక్తులు సాధించ దగిన భక్తి కార్యము **(తదేవ సాధ్యతామ్).**

అన్య దేవతోపాసకులు ఇంద్రాది దేవతలను తృప్తి పరచడానికి ఆచరించే యజ్ఞ క్రతువులలో క్రియా కలాపాలతో పాటు ద్రవ్య సామగ్రులను, ధన జనాదులను వెచ్చించినా, లభ్య మయ్యేది మాత్రం అనిత్య ఫలమే నని పూర్వ శ్లోకంలో చూశాం. కాని, మహిమాన్వితుడు, మోక్ష ప్రదాత అయిన పరమేశ్వరుని అర్చించడానికి ద్రవ్యోపకరణాలు ఏవీ అవసరం లేదు. పత్ర పుష్ప ఫలోదకా లైనా సరిపోతాయి. ఇది భావ ప్రధానమైన ఆరాధన. ఇక్కడ వస్తు సామగ్రి, కర్మ కలాపాలు ప్రధానం కావు. కేవలం భక్తియే ముక్తిని అనుగ్రహిస్తుంది. శ్రమ అల్పం. ఫలం అనంతం.

క ॥ *దళ మైనను, పుష్ప మైనను ఫలమైనను సలిలమైన బాయని భక్తి*
న్గొలిచిన జను లర్పించిన నెలమిన్ రుచిరాన్నము గను యే ను భుజింతున్ ॥

అని కుచేలుడు తాను తెచ్చిన అటుకు లనే స్వల్ప పదార్థమును సమర్పించలేక సిగ్గు పడుతూ ఉంటే, తనంతట తాను వాటిని అంది పుచ్చుకున్న శ్రీకృష్ణుడు, పై పద్యమును ఆంధ్ర భాగవతంలో వినిపించాడు. నా యందు భక్తి కలిగిన నా భక్తులు ఆకు అయినా, పువ్వు అయినా, పండు అయినా, నీళ్ళు అయినా , ఏది సమర్పించినా, ప్రేమతో వాళ్ళు సమర్పించే దానిని మధురాన్నంగా భావించి ఆరగిస్తాను అన్నాడు పోతనామాత్యుని భాగవతం - దశమ స్కంధములో శ్రీకృష్ణ పరమాత్మ. అక్కడ కుచేలుడికి చెప్పిందే ఇక్కడ కౌంతేయునికి చెబుతున్నాడు.

ఇచ్చేవాడు భక్తుడు. పుచ్చుకొనే వాడు భగవంతుడు. అందించే వాడు భక్తుడు. అనుగ్రహించే వాడు అచ్యుతుడు. ఆశ్రయించిన వాళ్ళందరూ ఆనందరూపు లయ్యారు. యమునా జలాలు చల్లగా మేనును తడిపాయి. పొన్నచెట్టు తన పుణ్యానికి పొంగిపోతూ పూలు రాల్చింది. గంగిగోవు పులకరిస్తూ గోపాలునికి పాలు ఇచ్చింది. నెమలి నర్తించి నందనందనునికి వినోదాన్ని పంచింది. ఏదీ సమర్పించ లేని చైతన్యుని పేద హృదయం కాపడము పెట్టే సేవకు సిద్ధమైంది.

ఎంత కందినదో కరము కొండ మోసి
ఎంత నలిగినదో కరపద్మము బండి లాగి
కాపడము పెట్టెద కరము నందించు తండ్రీ!
నీ అడుగుల కడ పడి ఉందు చిన్నికృష్ణా!

అని చైతన్యుని మనస్సు చలించింది.

పూజ నిత్యపూజగా మారాలి. ఆరాధన నిత్యారాధన కావాలి. నిత్యార్చనై శోభించాలి. చదవండి.

యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్ ।
యత్తపస్యసి కౌన్తేయ తత్కురుష్వ మదర్పణమ్ ॥ 27

యత్-కరోషి-యత్-అశ్నాసి-యత్-జుహోషి-దదాసి-యత్
యత్-తపస్యసి-కౌంతేయ-తత్-కురుష్వ-మదర్పణం

కౌంతేయ	=	అర్జునా!	యత్	=	దేనిని
యత్	=	దేనిని	దదాసి	=	దానము చేస్తున్నావో
కరోషి	=	చేస్తున్నావో	యత్	=	దేనిని
యత్	=	దేనిని	తపస్యసి	=	తపస్సు చేస్తున్నావో
అశ్నాసి	=	తింటున్నావో	తత్	=	దానిని
యత్	=	దేనిని	మదర్పణం	=	నా కర్పింపబడిన దానినిగా
జుహోషి	=	హోమము చేస్తున్నావో	కురుష్వ	=	చెయ్యి

కౌన్తేయా! ఏదైనా చేసుకో! మరేదైనా తిను. ఏ హోమమైనా చేసుకో! ఏదైనా ఇచ్చుకో! ఏ తపస్సైనా ఆచరించు! కాని, అన్నిటినీ నాకే అర్పించడం అలవరచుకో!

వ్యాఖ్య

పత్రం, పుష్పం, ఫలం, తోయం - ఏదైనా సరే, దానిని అర్పించే వాడు భక్తుడు. ఎవరికి అర్పిస్తున్నాడు?

పరమేశ్వరునికి అర్పిస్తున్నాడు. ఎక్కడ అర్పిస్తున్నాడు? ఎక్కడ భగవంతుడు ఉంటే అక్కడ అర్పిస్తున్నాడు. భగవంతుడు లేని దెక్కడ? సర్వత్ర ఉండేవాడే సర్వేశ్వరుడు (***ఈశావాస్య మిదం సర్వం***). మరి, సర్వత్ర ఉండే వాడికి నైవేద్యం ఒక చోట ఎలా పెట్టగలం? సర్వానికి ఆధారమైన సర్వేశ్వరుడు గగన సదృశుడు (***విశ్వాధారం గగన సదృశం***). మరి గగన మంతటి వాడికి నైవేద్యం పెట్టడానికి అనువైన, ఘనమైన పళ్ళెం మన ఇంట్లో ఉందా? ఇల్లే ఆకాశంలో ఉంటే, ఆకాశాన్ని తెచ్చి ఇంట్లో ఎలా పెట్టుకోగలం? మరైతే భగవంతుడికి అర్పించే దెలా? ఈ మీమాంస మన కవసరం లేదు. భక్తితో ఇస్తే (***భక్త్యాప్రయచ్ఛతి***) గ్రహిస్తాను అని ఆయనే అంటున్నాడు కదా! (***అహం అశ్నామి గృహ్ణామి***). పుచ్చుకొనే వాడు సిద్ధంగా ఉన్నప్పుడు, ఇవ్వడానికి ఏం కష్టం? ఏ కష్టమూ లేదు. ఇంతకీ ఆయన ఎక్కడ పుచ్చుకుంటాడు? అంతటా ఉండేవాడు ఎక్కడైనా పుచ్చుకోగలడు. మరి ఆయన ఎక్కడైనా పుచ్చుకోగలిగితే, ఆయన ఎక్కడ పుచ్చుకుంటే అక్కడ ఇవ్వడానికి ఇచ్చేవాడు ఎలా ఉంటాడు? అందుకని, అంతటా ఉండి అర్పించడం పరిమితుడైన ఇచ్చే వాడికి, అనగా భక్తుడికి సాధ్య పడదు కనుక, అంతటా ఉండి పుచ్చుకొనే సర్వేశ్వరుడు ఎక్కడిచ్చినా పుచ్చుకోగలడు కాబట్టి (***సర్వతః పాణి పాదం తత్ సర్వతోక్షి శిరోముఖమ్ ... 13 వ అ - 14 వ శ్లో***) భక్తుడు ఎక్కడ ఉండి భక్తితో అర్పించినా, దానిని సర్వేశ్వరుడు అందుకొని అనుగ్రహిస్తాడు. భక్తుడు అర్పించేది పూజ గది లోనే కదా? పూజా సమయం లోనే కదా? అవును. కనుకనే, భగవంతుడు పూజలు జరిగే చోట వ్యక్త మవుతూ ఉంటాడు. పూజా గదులలో ఉంటాడు. పూజా మందిరాలలో కొలువుంటాడు. పూజా మందిరాలు పరమాత్మ నిలయాలు కనుక, కేవలం పూజా సమయాల లోనే కాకుండా, సాధారణ సమయాలలో కూడా కాళ్ళు కడుగుకోకుండా పూజాగది లోకి గృహస్థులు వెళ్ళరు. సంప్రదాయము గల కుటుంబాలలో ఈ ఆచారం ఇప్పటికీ ఉంది.

సరే, బాగుంది. అర్చన సమయాలలో అర్పణం ఎలా జరుగుతూ ఉందో అర్థమైంది. మరి, అర్చన ఎంత కాలం జరుగుతుంది? ఒక గంట, లేదా రెండు గంటలు. అలా కాలానికి పరిమిత మయ్యే అర్చన నిత్యార్చన అవుతుందా? నిత్యార్చన కానపుడు, కాలానికి పరిమిత మయ్యే అర్చన ద్వారా భక్తునికి భగవంతునితో ఏర్పడే సంబంధము నిత్య సంబంధము ఎలా అవుతుంది? నిత్య సంబంధము కానిది అనిత్య సంబంధమే కదా! అంటే వ్యక్తులతో మన కెలా అనిత్య సంబంధా లున్నాయో, భగవంతునితో ఉండే సంబంధం కూడా అలా అనిత్యమేనా? అనిత్య సంబంధం ద్వారా నిత్యఫలం ఎలా అందుతుంది? నిత్యమైన మోక్షానికి మార్గం ఎలా సుగమ మవుతుంది?

కనుక భగవంతునితో భక్తునికి ఉండే సంబంధం నిత్యమై శోభించాలి అంటే, అది నిత్యార్చన ద్వారానే సాధ్య మవుతుంది. పూజా సమయానికే పరిమితం కాకుండా ఎల్ల వేళల కొనసాగి నపుడే సిద్ధిస్తుంది. పూజాగదిలో ఎలాగూ సాగుతుంది. అది అంతరంగ సాధన. అలా కాకుండా, వ్యవహార ప్రపంచంలో కూడా నిత్యార్చన సాగాలి. కర్మలలో కూడా కొనసాగుతూ ఉండాలి. ప్రపంచమే పూజా మందిరం కావాలి. ఏ కార్యాన్ని ఆచరించినా అది అర్చనే కావాలి. ఆరాధనే కావాలి. పరమేశ్వరా! నేను ఏయే కర్మలు చేసినా, అవన్నీ నీ ఆరాధనలే కావాలి (***యద్యత్కర్మ కరోమి తత్త దఖిలం శంభో తవారాధనమ్!***). ఇది బహిరంగ సాధన.

పూజాగదిలో పుష్పాలను చేతులతో అర్పించడం, వాక్కు ద్వారా స్తోత్రాలను వినిపించడం, మనస్సు ద్వారా చింతనము సాగించడం ఎలా జరుగుతుందో, అలాగే విశ్వమందిరంలో ఏది చేసినా, ఏది తినినా, ఏ హోమాదులు నిర్వహించినా, ఎవరికి ఏది పెట్టినా, నిన్ను నీవు ఎలా నిగ్రహించుకున్నా - ఈ సమస్తము పరమేశ్వరునికి ఆరాధనగా మారాలి. అప్పుడే అర్చన సదా కొనసాగి నిత్యార్చనగా మారుతుంది. నిత్యఫలాన్ని ప్రసాదిస్తుంది.

చేసే కార్యాలు వేరు వేరుగా ఉన్నా, ఆ కార్యాలను కదిలించే మనస్సు ఒక్కటే. మనస్సులో నడిచే భావనే కర్మను పూజగా మార్చుతూ ఉందని పూర్వ శ్లోకం లోనే అర్థం చేసుకున్నాం. నువ్వు ఏమి చేశావు? ఏమి చేస్తున్నావు? అని కాకుండా, ఎలా చేశావు? ఎలా చేస్తున్నావు? అనేదే భగవంతుడు ప్రధానంగా చూస్తాడు అని కూడా గ్రహించాము. కనుక, భావశుద్ధిని కలిగి భావగ్రాహి అయిన జనార్దనునికి ప్రీతి కలిగించే విధంగా జీవించ గలిగితే, అట్టి జీవితమే నిత్యార్చనగా మారి నిత్య సంబంధాన్ని స్థిరపరచి, నిత్యఫలాన్ని అనుగ్రహిస్తుంది.

కౌంతేయా! నువ్వు ఏది చేస్తున్నావో (***యత్ కరోషి***), ఏది తింటున్నావో (***యత్ అశ్నాసి***), ఏది హోమం చేస్తున్నావో (***యత్ జుహోషి***), ఏది దానం చేస్తున్నావో (***యత్ దదాసి***), ఏ తపస్సు నాచరిస్తున్నావో (***యత్ తపస్యసి***) దాని నంతటిని (***తత్***) నాకు సమర్పణము గావించు (***కురుష్వ మదర్పణమ్***). ఇది పరమేశ్వరుని ఆజ్ఞ.

ఈ విధంగా జీవించ గలిగితే ఒక్క క్షణం కూడా మనం పరమేశ్వరునికి అన్యంగా ఉండలేము. అనన్యులు గానే ఉంటాము. అనన్యులుగా జీవించ గలిగితే, మన యోగక్షేమాలను తానే వహిస్తానని భగవంతుడు ప్రతిజ్ఞ చేసి మరీ చెప్పాడు కదా! *(9 వ అ - 22 వ శ్లో)*.

మన యోగక్షేమాలను ఆయనే చూసుకొనే టట్లైతే మనం కర్మలు ఎవరి కోసం చెయ్యాలి? ఆయన కొరకే చెయ్యాలి. మన కొరకు మనం కర్మ లాచరించుకుంటూ ఉంటే, మన యోగక్షేమాలను ఆయనెందుకు చూస్తాడు? రెండవ ఆలోచన లేకుండా, మరొక వ్యాపకం మనస్సులో పెట్టుకోకుండా సదా పరమేశ్వరునే చింతిస్తున్నాము కనుక, అలా నిత్యాభియుక్తులమై భగవంతుణ్ణే సేవిస్తున్నాము కనుక, మన స్వకార్యాలను ఆయన కొరకు త్యజించి ఉన్నాము కనుక మన యోగక్షేమాలను ఆయనే వహిస్తాడు.

అయితే, మనం ఆచరించే కర్మల యొక్క ఫలితాలు మనకు అందవా? ఇక్కడే విషయాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. లేకపోతే చిక్కుముడి పడుతుంది. మనస్సు చిందరవందరై, సాధన వక్రిస్తుంది.

ఇంతకీ మనకు ఏం కావాలి? కర్మఫలమా? లేక మోక్షమా? మోక్షమే. మోక్ష మేమిటి? భగవంతుని పొందడమే మోక్షము. మరి మోక్ష మెక్కడుంది? మోక్షం అనేది జ్ఞానరూపంలో ఉంది. జ్ఞానం లభిస్తేనే మోక్షం సిద్ధిస్తుంది. జ్ఞానం ప్రాప్తించాలి అంటే బుద్ధి శుద్ధి పడాలి కదా! శుద్ధి లేని బుద్ధిలో జ్ఞానం నిలుస్తుందా? నిలవదు. మరి, బుద్ధి ఎలా శుద్ధి పడుతుంది?

అదలా ఉంచండి. బుద్ధిని శుద్ధి చేసుకోవాలి అంటే, అది ఇప్పటికి అశుద్ధమై ఉందని కదా అర్థం? మరి, బుద్ధి ఎలా అశుద్ధ మైంది? మల దోషము చేత. మల దోష మంటే ఏమిటి? రాగద్వేషాలే. మల దోషము తొలగితేనే, అంటే రాగద్వేషాలు మనస్సు నుండి రాలి పోతేనే బుద్ధి శుద్ధి పడుతుంది.

ఇంతకీ రాగద్వేషా లంటే ఏమిటి? నాకు ఇది కావాలి. నాకు అది కావాలి. ఇవి నాకు దూరం కాకూడదు. అవి నా తోనే ఉండాలి. ఇదే రాగము.

నాకు ఇది వద్దు. నాకు అది రాకూడదు. ఇవి నాకు దూరంగా పోవాలి. అవి నాతో ఉండకూడదు. ఇదే ద్వేషము.

మరి, ఉన్నవి, లేనివి అన్నీ కర్మఫలాలే కదా! కర్మఫలాలు ఏవైనా అనిత్యాలే కదా! బంధహేతువులే కదా! బంధము నుండి విడిపడి మోక్షాన్ని పొందాలని కాంక్షించే ముముక్షువు ఆశించ వలసింది కర్మఫలాలనా, లేక మోక్ష సాధనమైన జ్ఞానమునా? జ్ఞానమునే మన మందరమూ కాంక్షిస్తున్నాము. కానీ చిత్తశుద్ధి ఉంటేనే జ్ఞానం

సిద్దిస్తుంది కనుక, రాగద్వేషాలను, అవి సృష్టించే కర్మఫలాలను విస్మరించాలి. అందుకు ఏమిటి మార్గం? పరమేశ్వరునికి సమర్పించడమే తరుణోపాయం.

అప్పుడు కర్తృత్వ భోక్తృత్వాల నుండి విడిపడి ఈశ్వరార్పణ బుద్ధితో మనం కర్మాచరణంలో ఉంటాము కనుక, కర్మలలో కర్త లేనందున కర్మఫలాలు కర్తను బాధించవు. అదేమిటి? కర్తకు సంబంధించిన కర్మఫలాలు కర్తకు ఎలా దూర మవుతాయి?

నాహం కర్తా - హరిః కర్తా. కర్త శ్రీహరే గాని నేను కాదు. నేను ఆయన చేతిలో పరికరాన్ని. నా నుండి ఏ కర్మ జరిగినా అది పనిముట్టు నైన నా ద్వారా పరమేశ్వరుడు చేసిందే కనుక, ఫలం ఆయనకే చెందుతుంది. అంతా రామార్పణం. కృష్ణార్పణం. ఈశ్వరార్పణం. ఇదే సమర్పణ వైభవం.

కర్మలలో కర్తృత్వ భావన లేనందున నువ్వు కర్తవు కావు. ఫలితాలు ఏవొచ్చినా, నీకు కర్మ ఫలాల మీద ఆశ లేనందున, వాటిని ప్రసాదంగా స్వీకరిస్తావు కనుక నువ్వు భోక్తవు కావు. కర్త, భోక్త లేరు అంటే, రాగద్వేషాలు అదృశ్య మయ్యాయని అర్థము. ఏది వచ్చినా, ఏది పోయినా, మనస్సులో ఏ మార్పూ ఉండదు. బుద్ధి సదా ప్రశాంతంగా ఉంటుంది. జ్ఞానార్హతను పొందుతుంది. ఇదే అంతఃకరణ శుద్ధి. ఇదే కర్మయోగ ఫలం. మోక్షానికి మార్గం.

అవశ్యం భావినామ్ కర్మణామ్ మయి పరమగురౌ సమర్పణం ఏవ మద్భజనమ్: న తు తదర్థం పృథక్ వ్యాపారః కశ్చిత్ కర్తవ్య ఇతి అభిప్రాయః !

అవశ్యము చేయవలసిన కర్మములను పరమ గురువైన నా యందు సమర్పించడమే నా ఆరాధనము. అంటే, దాని కొరకు ఇతర వ్యాపారాలు, అనగా సాధనలు ఏవీ చేయ నవసరం లేదు అని అభిప్రాయము అని తమ గూఢార్థ దీపిక వ్యాఖ్యానంలో శ్రీ మధుసూదన సరస్వతీ స్వాముల వారు వ్యాఖ్యానించారు.

'నేను' అనే అహంకారం అదృశ్య మైంది. 'నాది' అనే మమకారం నిర్వీర్యమైంది. పనులన్నీ పూజ లయ్యాయి. పూజాఫలము **పరమేశ్వరప్రీత్యర్థం** సమర్పించ బడింది. ఇటువంటి పవిత్రమైన ఆరాధనలో జ్ఞానానికి ఉపయుక్త మైన అంతఃకరణ శుద్ధి సాధకునికి ప్రాప్తించింది.

పల్లవి: **పూజా ఫలము నీకే ఉండనీ**
పూజే ఫలముగా నాకు మిగలనీ ॥ పూజా ॥
అనుపల్లవి: **సలిలము నిండిన నా నయనాలలో**
కదలక నీ రూపు నిలిచి పోనీ ॥ పూజా ॥
చరణము: **నేనని నాదని బిగిసిన మనసు**
నారికేళమై పగిలిపోనీ
కలతల గుండెను కుదిపిన మాయలు
నీటి ధారలై కారిపోనీ ॥ పూజా ॥

అని నిత్యార్చనలో సత్య రాగాన్ని ఆలపించింది చైతన్య గీతిక.

ఏదీ లేకుండా రిక్త హస్తాలతో ప్రపంచం లోకి వచ్చి, నాది - నాది అని ఎన్నిటినో పట్టుకున్నా. భగవాన్! నాది - నాది అని నేను చేసిన తప్పును, నీదే - నీదే అని పలికి నా బుద్ధి లోని కల్మషాన్ని కడిగేసు కుంటున్నా. సమర్పణలో సంతృప్తి చెందుతున్నా.

యత్కరోషి
తత్కురుష్వ మదర్పణమ్ - చేయదగిన దానిని, చేయవలసిన దానిని చేయాలి. కాని, కర్తృత్వమును, భోక్తృత్వమును త్యజించి, సమర్పణ భావంతో చేయాలి.

యదశ్నాసి
తత్కురుష్వ మదర్పణం - ప్రాప్తించిన దానిని ఆరగించు ***(స్వతః ప్రాప్తం యత్ అశ్నాసి).*** ప్రాప్తించింది అంటే భగవ త్ప్రసాదంగా లభించింది అని అర్థము. ప్రసాదము అనేది వస్తువు కాదు, భావన. ప్రసాద భావన ప్రసన్నతను ప్రసాదిస్తుంది. ప్రశాంతతను కలిగిస్తుంది. భోజన సమయాలలో ***బ్రహ్మార్పణం బ్రహ్మ హవిః*** అనే భగవద్గీతా శ్లోకాన్ని పఠించడం వెనుక ఈ సమర్పణ భావమే ఉంది.

యజ్జుహోషి
తత్కురుష్వ మదర్పణమ్ - యజ్ఞ యాగాదులు ఆచరించినా ఈశ్వర ప్రీత్యర్థమే చెయ్యాలి. ఫలాసక్తి లేకుండా ఆచరించాలి. చిత్తశుద్ధి నిమిత్తమే అనుష్ఠించాలి. ధర్మార్థ కామాల ప్రసక్తి ముముక్షువుకు లేనందున, చిత్తశుద్ధి ద్వారా పొందబడే మోక్షార్థమే ఆచరించాలి.

యత్ దదాసి
తత్కురుష్వ మదర్పణమ్ - ఎవరికి ఏది ఇచ్చినా, ఏది దానం చేసినా, పుచ్చుకొనే వానిలో భగవంతుని దర్శిస్తూ, 'కృష్ణార్పణం' అనే భావనతో సమర్పించాలి. మనం ఇచ్చేది లేని వాడికి, పేదవాడికి కాదు. సాక్షాత్తు లక్ష్మీపతికి.

యత్ తపస్యసి
తత్కురుష్వ మదర్పణమ్ - సంధ్యావందన, వేదాధ్యయన, జప, వ్రతాదులు, ఉపవాస దీక్షలు, ఇవన్నీ తపస్సులే. ఈ విధమైన తపోనిష్ఠను అంతఃకరణ శుద్ధ్యర్థం, దంభ దర్పాదులు లేకుండా ఈశ్వరార్పణంగా ఆచరించాలి.

అహంకార మమకారాల నుండి విడిపడి, రాగద్వేష రహితులై, భగవత్ప్రీత్యర్థం సమర్పణ భావంతో జీవించే వారిని కర్మలు బంధించవు. కర్మఫలాలు బాధించవు. ఐదుగురు దేవతల ద్వారా ఐదు మంది బిడ్డలకు జన్మ నిచ్చినా, కుంతీ మాత పవిత్రతకు భంగం వాటిల్ల లేదు. నాయనా, అర్జునా! కౌంతేయా! కుంతీపుత్రా! మాతృమూర్తి హృదయ సౌందర్యాన్ని అందుకో! అలా చేశావా, నీకు ఏం జరుగుతుందో, అది కూడా చెబుతాను. విను.

శుభాశుభఫలై రేవం మోక్ష్యసే కర్మబన్ధనైః ।
సంన్యాసయోగయుక్తాత్మా విముక్తో మా ముపైష్యసి ॥ **28**

శుభాశుభఫలైః-ఏవం-మోక్ష్యసే-కర్మబంధనైః
సంన్యాసయోగయుక్తాత్మా-విముక్తః-మాం-ఉపైష్యసి

ఏవం	= ఈ విధముగ	సంన్యాసయోగయుక్తాత్మా	= సన్యాస యోగయుక్తుడవై
శుభాశుభఫలైః	= శుభాశుభ ఫలాలను కలిగించే	విముక్తః	= విముక్తుడవై
కర్మబంధనైః	= కర్మబంధముల చేత	మాం	= నన్ను
మోక్ష్యసే	= ముక్తు డవుతావు	ఉపైష్యసి	= పొందుతావు

అర్జునా! సమర్పణ భావంతో జీవిస్తే శుభాశుభ ఫలాలకు కారణమైన కర్మ బంధం నుండి విముక్తిని పొందుతావు. సన్యాస యోగ యుక్తుడ వవుతావు. చివరికి నన్నే పొందుతావు.

వ్యాఖ్య

పూర్వ శ్లోకంలో ***యత్ యత్*** - ఏది చేసినా, ఏది తినినా, ఏది హోమం చేసినా, ఏది దానం చేసినా, ఏ తప మాచరించినా అని 'ఏది ఏది' (యత్ యత్) అంటూ ఐదు విషయాలను ఉదహరించి, ***తత్*** అనే ఒక్క పదం చేత, 'దానిని అంతయు' ***(తత్)*** నాకు అర్పణము చెయ్యి అన్నాడు. అలా అర్పణం చేయడం వల్ల ***(ఏవం కుర్వతః)*** నీకు ఏం జరుగుతుందో, అంటే నువ్వు ఏమవుతావో ***(తవ యద్భవతి)*** దానిని ఆలకించ మంటున్నాడు. ***బ్రహ్మార్పణం*** అనే సమర్పణ భక్తికి ఫలం ఏమిటో విన మంటున్నాడు ***(తత్ శ్రుణు).*** సర్వ కర్మ సమర్పణ ఫలాన్ని చెబుతున్నాడు.

మోక్ష ఫలం

పూర్వ శ్లోక ద్వయంలో చెప్పినట్లు ***(ఏవం)*** సమర్పణ బుద్ధితో కర్మలు ఆచరించడం వల్ల ***(మత్సమర్పణం కుర్వన్)*** మోక్షాన్ని పొందుతావు ***(మోక్ష్యసే)*** అంటున్నాడు. మోక్ష మేమిటి? విముక్తియే మోక్షం. మరి, ఇక్కడ దేని నుండి విముక్తి? బంధము నుండి విముక్తి. ఇంతకీ బంధ మేమిటి? ఏ బంధము నుండి విముక్తి? కర్మబంధము నుండి విముక్తి ***(కర్మ బంధనైః).***

కర్మలు ఎలా బంధనము లయ్యాయి? ఫలితాలను ప్రసాదిస్తాయి కనుక కర్మములు బంధనములు. ఫలం బంధ మెలా అవుతుంది? ఫల బంధమైతే, మోక్షం కూడా ఫలమే కదా! అది కూడా బంధమేనా? బంధమోక్షాలు రెండూ ఒక్కటే ఎలా అవుతాయి?

మోక్షము ద్వంద్వాతీత మైన అద్వయ స్థితి. వాస్తవానికి మోక్షం అనేది కర్మఫలం కాదు. అది స్వరూప స్థితి. జ్ఞానము యొక్క ఫలమే గాని ***(మోక్షాయ జ్ఞాన ప్రవృత్తిః)*** కర్మఫలం కాదు.

కర్మఫలం ఏదైనా అది శుభాశుభ ఫలాలలో ఏదో ఒక దానిని అందిస్తూ ఉంటుంది. శుభాశుభాలు అంటే ఇష్టానిష్టాలు. అవే రాగద్వేషాలు ***(శుభాశుభే ఇష్టానిష్టే ఫలే యేషాం తాని శుభా శుభ ఫలాని కర్మాణి).*** ఈ విధమైన ఇష్టానిష్టా లనే రాగద్వేషాలతో కూడిన ఫలాలే శుభాశుభ ఫలాలు. ఇవే కర్మ బంధములు. వీటి నుండి ***(తైః శుభాశుభ ఫలైః కర్మబంధనైః)*** విడిపడటమే మోక్షము, లేదా విముక్తి ***(మోక్షః).***

కర్మ బంధము

కర్మ బంధించదు. రాగద్వేషాలతో నిండి నపుడే కర్మలు బంధిస్తాయి. రాగద్వేషాలు ఉండే టప్పుడు, రాగద్వేష ప్రేరితుడై వ్యక్తి కర్మలు ఆచరిస్తాడు. నా ఇష్టానికి అనుగుణం గానే ఏవైనా జరగాలి. నాకు అయిష్ట మైనవి ఏవీ జరగడానికి వీలు లేదు అనే ఒత్తిడికి లోనై కర్మ లాచరించే కర్త ఉన్నంత వరకు కర్మలు బంధ హేతువులు గానే ఉంటాయి.

కర్మ లాచరించే కర్త ఏదో ఆశించే కర్మ లాచరిస్తాడు. దేనినో పొందాలనే ఆశ తోనే కర్మాచరణంలో ఉంటాడు. ఆశించిన దానిని సాధించడమే కర్మఫలం. కర్మను బట్టే కర్మఫలం ఉంటుంది. ఏ కర్మకు ఆ ఫలితమే వస్తుంది. ఆహారం తీసుకుంటే ఆకలి తీరుతుందే గాని వ్యాధి నయం కాదు. వ్యాధి నయం కావాలి అంటే ఔషధ సేవనం అనే మరొక కర్మను ఆచరించాలి. ఈ విధంగా కర్మలు, కర్మ ఫలితాలు పరిమితంగా ఉంటాయి.

పరిమితాలతో మనిషి తృప్తి చెందలేడు. అదే అసంతృప్తి. అదే బంధము. ఈ విధమైన కర్మబంధం నుండి విముక్తిని పొందాలనే కర్త కర్మలను ఆచరిస్తున్నాడు. బంధ హేతువు లైన కర్మల ద్వారా బంధ విముక్తిని ఆశిస్తున్నాడు. బాగా అర్థం చేసుకోండి. సమస్య అంతా ఇక్కడే కేంద్రీకృతమై ఉంది. బంధానికి కారణమైన కర్మ బంధ విముక్తిని ఎలా కలిగిస్తుంది?

యదేవ ప్రవృత్తి కారణం తదేవ నివృత్తి కారణం న భవతి!

బంధాన్ని సృష్టించడానికి ఆరంభమైన కర్మ బంధ విముక్తిని కలిగించ లేదు. ఒకే కర్మ బంధమోక్షాలకు ఎలా కారణ మౌతుంది? అని ప్రశ్నించారు బృహదారణ్యక ఉపనిషద్భాష్యంలో శ్రీ శంకరాచార్యస్వామి. కనుక, కర్మ అనేది అజ్ఞానుల చేష్టగా గీతాభాష్యంలో అభివర్ణించారు ఆచార్యులు ***(అవిద్య ద్విషయం కర్మ : 18 - 66).*** కర్మ అజ్ఞాన జనితం. కనుక కర్మఫలాలు బంధహేతువులై సంసార సుడిగుండంలో పడేస్తున్నాయి.

రాగద్వేషాలను తృప్తి పరచుకొనేందుకు కర్మలు చేస్తారు. కర్మలు పరిమితం కనుక, అవి ఇచ్చే ఫలితాలు కూడా పరిమితం గానే ఉంటాయి. పరిమిత ఫలితాలతో తృప్తి చెందని మానవుడు మరో విధమైన కర్మకు శ్రీకారం చుడతాడు. ఫలితం రావచ్చు, రాకపోవచ్చు. వస్తే మాత్రం పరిమితం గానే ఉంటుంది. కాలంలో వస్తుంది కనుక, కాలంలో పోతుంది. కాని, అసంతృప్తి మాత్రం ఎక్కడికి పోదు. అది హృదయంలో స్థిరంగా తిష్ఠ వేసి ఉంటుంది. ఇదే బంధము.

కామము వల్ల కోరిక, కోరిక వల్ల కర్మ, కర్మ ద్వారా ఫలితం, తిరిగి ఆ ఫలితమే నూతన కర్మకు నాంది. ఇలా కర్మచక్రం తిరుగుతూ ఉంటుంది. కర్మఫలము అనుభవించనిదే క్షయించదు. కర్మ ఫలానుభవానికి నూతన జన్మలు ఎత్తవలసి వస్తుంది. జన్మించి నందుకు మరణించక తప్పదు. కర్మ ఫలానుభవము నిరీక్షిస్తూనే ఉంటుంది కనుక, మరణించిన వాడు తిరిగి జన్మించక తప్పదు. ఇవే జనన మరణాలు. శోక వలయాలు. దుఃఖ రూపాలు. ఇదే సంసార చక్రము. కర్మబంధము. ఈ సంసార బంధము నుండి విడిపడటమే మోక్షము.

ముక్తి మార్గము

ఇప్పుడు అర్థమైంది కదూ? కర్మ బంధం కాదు. కర్మ ఫలాసక్తియే బంధము. కర్మఫలాల యందు ఆసక్తి లేనపుడు కర్మలు ఆచరించినా, అవి బంధించవు. కర్మఫలము నందు ఆసక్తిని విడిచి, కర్మల యందు ప్రవర్తించే వాడు కర్మ చేసినా చేయని వాడే అని నాల్గవ అధ్యాయం లోనే భగవంతుడు ప్రబోధించాడు ***(కర్మణ్యభి ప్రవృత్తోఽపి నైవ కించి త్కరోతి సః : 4 వ అ 20 వ శ్లో).*** కనుకనే తాను ఎన్ని కర్మలు చేసినా, ప్రస్తుతం అర్జునునికి గీతను బోధించే కార్యం లోనే ఉన్నా, కర్మలు శ్రీకృష్ణుని అంటలేదు. కారణం, ఆయనకు కర్మఫల స్పృహ లేదు ***(న మాం కర్మాణి లిమ్పన్తి న మే కర్మఫలే స్పృహా :4 వ అ - 14 వ శ్లో).***

కర్మ ఫల స్పృహ లేదు అంటే, కర్మల వెనుక ఇష్టాయిష్టాలు లేవు. రాగద్వేషాలు లేవు. రాగద్వేషాలు లేనందున తన కర్మలంటూ లేనే లేవు. తన కర్మలు లేనందున తనకు ఫలితాలు అందవు. ఫలితాలు బంధహేతువులు అని ఇప్పటికే గ్రహించాము కనుక, ఫలితాలు లేనందున, వచ్చినా అంటనందున బంధము లేదు. బంధము లేకపోవడమే కదా మోక్షము! కనుక సమర్పణ భావంతో కర్మాచరణంలో ఉండే వ్యక్తి నుండి కర్మలు సాగుతాయి. కాని, బంధహేతువులు కాకుండా ఉంటాయి. ప్రస్తుతము ఇక్కడ ప్రధాన విషయం కర్మలు కావు. బంధ హేతువు లైన కర్మలే చర్చనీయాంశము. బంధహేతువులైన కర్మలన్నీ అర్పణ భావంతో ఆవిరై పోతాయి. దీనినే సన్యాస యోగం అంటున్నాడు గీతాచార్యుడు. ఈ విధంగా ***(ఏవం)*** ఈశ్వరార్పణ

బుద్ధితో కర్మల నాచరించడం చేత, అర్పణ బుద్ధి గల ముముక్షువు సన్యాస యోగ యుక్తాత్మ డవుతున్నాడు. అంటే, సన్యాస యోగముతో కూడిన వాడు అవుతున్నాడు.

సన్యాస యోగము

సన్యాస యోగము అంటే సన్యాసము మరియు యోగము అని అర్థము. అదే నిష్ఠాద్వయము. యోగము మరియు సాంఖ్యము అని అర్థము. పరమేశ్వరునికి సమర్పించడము చేత అక్కడ సన్యాసం ఉంది. సన్యాసము అంటే త్యాగమే కనుక, కర్మఫల త్యాగము జరుగుతూ ఉన్నందున అది సన్యాసము. అలా సమర్పణంలో కర్మఫల త్యాగము (సన్యాసము) చేసే భక్తుడు కర్మను కూడా ఆచరిస్తూ ఉన్నాడు కనుక అది కర్మయోగము ***(సన్న్యాస యోగః నామ సంన్యాసశ్చ అసౌ మత్సమర్పణ తయా, కర్మత్వాత్ యోగశ్చ అసౌ ఇతి).*** ఈ విధంగా సన్యాసము, యోగము ఈ రెండిటితో కూడిన అంతఃకరణము కలవాడై నందున అతడు సన్యాస యోగ యుక్తాత్మ డయ్యాడు. పరమేశ్వరుని యందు కర్మఫల త్యాగము సన్యాసము. ఈశ్వరార్పిత కర్మ ద్వారా అంతఃకరణ శుద్ధి చేసుకోవడం కర్మయోగము. ఇలాంటి సన్యాస యోగయుక్తుడు 'బ్రహ్మార్పణం' అనే భావన చేత కర్మలు ఆచరిస్తూ ఉన్నందున అవి ఫలాలను సృష్టించవు. పైగా, అగ్నిలో వేపబడిన బీజాలు ఎలాగైతే మొలకెత్తవో, 'బ్రహ్మార్పణం' అనే సమర్పణ బుద్ధితో సన్యాస యోగమనే అగ్నిలో దగ్ధమైన కర్మలు ఫలాలను ఉత్పన్నం చేయక పోవడమే గాక, నూతన కర్మలను కూడా ఆవిష్కరించవు. ఈ విధంగా సన్యాస యోగ యుక్తాత్ముడు జీవించి ఉండగానే కర్మబంధము నుండి విముక్తు డవుతున్నాడు ***(సంన్యాస యోగ యుక్తాత్మా సన్ విముక్తః కర్మబంధనైః జీవన్నేవ).***

బ్రహ్మైక్యము

సన్యాస యోగ యుక్తాత్ముడు జీవించి ఉండగానే ముక్తుడు. నేను కర్తను, నేను భోక్తను, నేను సుఖిని, నేను దుఃఖిని అనే భావనల నుండి సంపూర్ణంగా విముక్తు డయ్యాడు. ఈ విధంగా విముక్తుడైన వాడు దేహము నందే ఉన్నందున జీవన్ముక్తుడు. జీవించి ఉన్నంత కాలము జీవన్ముక్తుడుగా దర్శనీయు డవుతాడు. మరణించ గానే ఘట భంగము జరిగి నపుడు ఘటాకాశము మహాకాశముగా శోభించినట్లు, దేహ పతనానంతరము జీవన్ముక్తుడు బ్రహ్మ స్వరూపమై భాసిస్తాడు. దీనినే బ్రహ్మైక్యము అంటున్నాము. అవగాహన కొరకు బ్రహ్మైక్యము అన్నా, జీవన్ముక్తుడు వెళ్ళి బ్రహ్మములో కలిసి పోతున్నాడు అనేది దాని అర్థం కాదు. జీవుడే బ్రహ్మము అయినపుడు, మళ్ళీ వెళ్ళి కలిసే దేముంటుంది? ఘటాకాశమే మహాకాశము. అంతేగాని, కుండ పగిలి పోగానే కుండలో ఉండే ఆకాశము విశాలాకాశములో వెళ్ళి కలిసేది ఉండదు. అలా కలవడము, విడిపోవడము, జన్మ లెత్తడము లాంటివి జరగాలి అంటే సూక్ష్మ శరీరం ఉండాలి. సూక్ష్మ శరీరము యొక్క ప్రభావం జీవన్ముక్తుని మీద లేకపోయినా, స్థూలదేహం ఉన్నంత వరకు సూక్ష్మ శరీరము, లేదా లింగ దేహము కూడా అతనికి ఉంటుంది. మరణ సమయంలో అతడి స్థూల దేహంతో పాటు లింగ దేహము కూడా నశించి పోతుంది. అంతవరకు దేహంలో జీవన్ముక్తుడుగా శోభించిన వాడు, ఇప్పుడు సచ్చిదానంద బ్రహ్మరూపుడై భాసిస్తాడు. దానినే 'నన్ను పొందుతున్నాడు' అని ప్రస్తుత శ్లోకంలో భగవంతుడు అభిభాషించాడు ***(మామ్ ఉపైష్యసి ఆగమిష్యసి).*** ఇదే మోక్షప్రాప్తి. పరమ పురుషార్థ స్థితి.

చివరగా సారభూతమైన విషయాన్ని రెండు మాటల్లో చెప్పుకుందాం. సన్యాస యోగము అనే నిష్ఠా ద్వయము పరమ పురుషార్థమునకు ఉపాయము, లేక సాధనము కాగా, బ్రహ్మాత్మజ్ఞానము అనే సర్వాత్మ దర్శనము పరమ పురుషార్థ సిద్ధియై ఉంది. ఈ లోకంలో సర్వులకు సాధన సాధ్యాలు ఇవే. ఈ సందర్భములో

సాధకుడు సాధించ వలసింది ఏమిటో, ముముక్షువు పొంద దగింది ఏదో సుస్పష్ట మైంది. ఈ విషయాన్ని ఒకే ఒక శ్లోకంలో శాస్త్రం ఎంత అందంగా, అద్భుతంగా ప్రవచించిందో చూడండి!

ఏతావా నేవ లోకేఽ స్మిన్ పుంస స్స్వార్థః పరస్మృతః।
ఏకాంత భక్తి ర్గోవిందే యత్సర్వత్రాత్మ దర్శనమ్ ॥

గోవిందుని యందు ఏకాంత భక్తి ***(కర్మయోగము)***, సర్వత్ర ఆత్మదర్శనము ***(జ్ఞాన యోగము)*** - ఇది మాత్రమే ముముక్షువునకు పరమ పురుషార్థ సాధనము అనేది శ్లోకార్థము. ఇది చాలా అద్భుతమైన శ్లోకము. నాకు ఎంతో ప్రీతి పాత్రమైన శ్లోకం. ఎప్పుడు చదివానో, ఎక్కడ చదివానో జ్ఞాపకం రావడం లేదు. అందుకే దీని చిరునామాను మీకు అందివ్వలేక పోతున్నాను. ఎంతో కాలంగా నా 'బుద్ధి' బ్యాంకులో 'స్మృతి' లాకర్‌లో భద్రంగా దాచిన దానిని సముచిత సందర్భ మని భావించి వితరణ చేస్తున్నాను.

మరి, సమర్పణ బుద్ధితో జీవించే భక్తులను భగవంతుడు ఉద్ధరించి, భక్తులు కాని వారిని ఉద్ధరించకుండా ఉదాసీనంగా ఉంటే, భగవంతునికి కూడా రాగద్వేషాలు ఉన్నట్లే కదా! అనే సందేహం కలగవచ్చు. దానిని కూడా పరిహరిస్తున్నాడు.

సమోఽ హం సర్వభూతేషు న మే ద్వేష్యోఽ స్తి న ప్రియః। 29
యే భజన్తి తు మాం భక్త్యా మయి తే తేషు చాప్యహమ్ ॥

సమః-అహం-సర్వభూతేషు-న-మే-ద్వేష్యః-అస్తి-న-ప్రియః
యే-భజంతి-తు-మాం-భక్త్యా-మయి-తే-తేషు-చ-అపి-అహం

అహం	= నేను		యే తు	=	ఎవరైతే
సర్వభూతేషు	= సమస్తభూతముల యందు		మాం	=	నన్ను
సమః	= సముడను		భక్త్యా	=	భక్తితో
మే	= నాకు		భజంతి	=	భజిస్తున్నారో
ద్వేష్యః	= శత్రువు		తే	=	వారు
న అస్తి	= లేడు		మయి	=	నా యందు
ప్రియః	= ఇష్టుడును		తేషు చ	=	వారి యందు
న	= లేడు		అహం అపి	=	నేనును

అర్జునా! సర్వ ప్రాణుల యందు నేను సమదృష్టి గల వాణ్ణి. నాకు అప్రియుడు లేడు; అలాగని ప్రియుడూ లేడు. ఎవరు నా యందు భక్తి కలిగి ఉంటారో వాళ్ళు నాలో ఉంటారు. నేను వాళ్ళలో ఉంటాను.

వ్యాఖ్య

సమం

ప్రపంచం నిరంతరం మార్పు చెందుతూ ఉంది. దృశ్యము లన్నీ మారుతూ ఉన్నాయి. రూపాలు మారు తున్నాయి. మనుషులు మారుతున్నారు. మనసులు మారుతున్నాయి. మార్పు లన్నీ వికారాలు. దోషయుతాలు.

ఈ విధమైన మార్పులకు ఆధార మైనది, మార్పులను గుర్తించడానికి ఆలంబన మైనది మారనిదై ఉండాలి. అలా మార్పు లేనిది నిర్దోషంగా ఉండాలి. సమంగా ఉండాలి. సర్వ వికారాల నుండి విడిపడినదై ఉండాలి. అది కూడా కాలానికి పరిమితం కాకుండా సర్వ కాలాలలో వికార రహితంగా, సమంగా ఉండాలి. అదే బ్రహ్మము.

సర్వవికార రహితము. నిర్దోషము (5 వ అ - 19 వ శ్లో). నిర్వికారము. నిర్వికార మైనది స్వరూపము. వికారయుత మైనది ఆరోపము. మార్పులన్నీ ఆరోపానివే. స్వరూపము సత్యము కనుక వికార రహితము. అందుచేత అది సదా సమము **(సమః సర్వ కాలేషు సర్వ వికార రహితత్వాత్).**

విషమం

సమము కానిది విషమము. సమము నిర్వికారము. విషమము వికారయుతము. బ్రహ్మమును విడిచి పెడితే, మిగిలినది ఏదైనా విషమమే. సమము సర్వమునకు విలక్షణ మైనది. విషమము వివాదంతో కూడినది.

ఎవరైనా మన కంట పడితే, ఆ వ్యక్తికి సంబంధించిన వృత్తి మన మనస్సులో ఏర్పడుతుంది. అతడు స్నేహితుడైతే మన మనస్సులో స్నేహవృత్తి కదులుతుంది. ఒకవేళ శత్రువైతే, వైరవృత్తి ఏర్పడుతుంది. మొదటిది రాగవృత్తి. రెండవది ద్వేషవృత్తి. వృత్తులు మారుతూ ఉంటాయి. మనస్సు మారుతూ వికార యుతంగా ఉంటుంది కనుక విషమంగా వర్తిస్తుంది.

మనస్సు ఉన్న ఒక్క కారణంగా మనకు స్నేహితు లున్నారు. శత్రువులూ ఉన్నారు. ప్రియు లున్నారు. అప్రియులూ ఉన్నారు. ప్రియులైతే, క్రింద ఉన్న వారిని ఎత్తి భుజాలపై పెట్టుకుంటాము. అప్రియు లైతే, పై నున్న వారిని పట్టి క్రిందికి లాగుతాము. వీటి వెనుక ఏదో లేదు. రాగద్వేషాలను కలిగిన మనసే ఉంది.

సమమైన బ్రహ్మమునకు మనస్సు లేదు. ప్రాణమూ లేదు. మనస్సు లేనందున రాగద్వేషాలు లేవు. ప్రియాప్రియాలు లేవు. ప్రాణము లేనందున శ్వాసలూ లేవు. ద్వేషము ఉండే అవకాశము లేదు కనుక ద్వేష వృత్తి ప్రభావంతో శ్వాసలు పెరిగే ప్రసక్తే లేదు. రక్తమే లేదు కనుక వీటి ప్రభావం వల్ల రక్తపోటు పెరగదు. లేని గుండె ఆగేది ఉండదు. అట్టి సమమైన బ్రహ్మమునకు మన రాగద్వేషాలను అంటగట్టి, మన రక్తపోటును మనం పెంచుకో నవసరం లేదు.

అప్రాణో హ్యమనా శ్శుభ్రః - బ్రహ్మమునకు మనస్సు, ప్రాణము లేవు. అందుచేత ఏ వికారము, దోషము లేనివాడై పరిశుద్ధంగా ఉన్నాడు అన్నది ఉపనిషత్తు. మనస్సు లేని వానిలో ప్రియత్వ అప్రియత్వ భావనలు ఉండే అవకాశం ఉందా? కనుకనే సమ రూపుడైన తనకు ఎవరి విషయం లోను ద్వేషము లేదు; అలాగే రాగమూ లేదు అంటున్నాడు భగవంతుడు. ఈ కారణం చేత ఆయనకు భక్తులపై ప్రియత్వ ముంది కనుక భక్తులను అనుగ్రహిస్తాడు, అభక్తులను అనుగ్రహించడు ***(భక్తాన్ అనుగృహ్ణాతి న ఇతరాన్ ఇతి)*** అనే అపవాదుకు, అభియోగానికి అవకాశము లేదు.

సమంలో విషమం లేదు

భగవంతుడు సమరూపుడు. విషమం తెలియని వాడు. కనుక, ఇచ్ఛాపూర్వకంగా ఎవరినీ ఎత్తుకోడు. ఎవరినీ దించి పెట్టడు. తాను ఎవరికీ దూరంగా లేడు. కనుక, ఏ కొందరికీ దగ్గర కాడు. ఆకాశం ఎవరికి దూరంగా ఉంది? అలాగని, ఏ కొందరికి సమీపంగా ఉంది? ఆలోచించండి. ఆకాశం అందరికీ సమానమే ***(సమః తుల్యః).***

సర్వేశ్వరుడు సమ స్వరూపుడు కనుక పూర్ణ పురుషుడు. పూర్ణంలో పక్షాలు లేవు. విపక్షాలు ఉండవు. ఆయన ఎవరిని ద్వేషిస్తాడు? ఎందుకు ద్వేషిస్తాడు? అలాగే ఎవరిని ప్రేమిస్తాడు? ఎందుకు ప్రేమిస్తాడు? భక్తులపై ప్రేమ ఉంది, అభక్తుల మీద ప్రేమ లేదు అంటారా? సరే. అలాగే అనుకుందాం. ఈ విషయం మీకు ఎలా తెలుసు? మీ అభియోగం పరమేశ్వరుని మీద, అవునా? మరి, పరమేశ్వరుణ్ణి మీరు చూశారా? ఆయన మీకు

తెలుసా? ఆయన ఎవరి నైనా ప్రేమించడం మీరు చూశారా? ఉదాసీనంగా ఉండటం ఎప్పుడైనా దర్శించారా? లేదు కదా! మరి, అపరిచితుని మీద అభియోగా లేమిటి?

అవేమి ప్రశ్నలండీ? గాలిని మనం కళ్ళతో చూశామా? చెట్టు చలిస్తూ ఉంటే గాలిని గుర్తు పడుతున్నామా లేదా? దేవుణ్ణి మేము చూడక పోవచ్చు. కాని, ప్రపంచంలో కొందరు సుఖసంతోషాలతో ఉండగా, మరి కొందరు బాధలతో బ్రతుకుల్ని భారంగా ఈడుస్తూ ఉండటం మనం చూస్తున్నామా లేదా? కొందరికి సుఖా లేమిటి? కొందరికి దుఃఖా లేమిటి? కొందరి కేమో పాయసాలు, మరి కొందరికి గంజినీళ్ళా? ఇదేనా సమత్వ మంటే? ఇక్కడ విషమత్వం లేనే లేదా? ఇవన్నీ మా అభియోగాలకి ఆధారాలు కావా, అని అంటారా?

అయితే వినండి! మీ రిచ్చిన ఉపమానం ప్రకారం చెట్టు చలిస్తూ ఉంది కనుక గాలి ఉందన్నారు. బావుంది. మీరు, నేను గుర్తించాలని చెట్టు చలించిందా? తనను మనం గుర్తు పట్టాలని గాలి వీచిందా? వీచడం గాలి స్వభావము. చలించడం చెట్టు లక్షణం. అదలా ఉంచండి.

ఊగే చెట్టుకు మనం దూరంగా ఉన్నా మనుకోండి. మనకు ఆ చెట్టు గాలి తగులుతుందా? గాలి కావాలి అనుకుంటే చెట్టు దగ్గరకు మనం వెళతామా? లేక చెట్టు మన దగ్గరకు వస్తుందా? చెట్టును సమీపించిన వారికే హాయిగా గాలి తగులుతుంది. అంటే, సమీపించిన వారు చెట్టుకు ప్రియులా? అలాగే తరువుకు దూరంగా ఉన్న వారికి చెమటలు పోస్తే అందుకు చెట్టు కారణమా? దూరంగా ఉన్న వాళ్ళ మీద చెట్టుకు ద్వేషం ఉందా?

పరమేశ్వరుడు కూడా అంతే. ఆయనకు రాగద్వేషాలు ఉండవు. సమీపించిన వాళ్ళు సంతోసిస్తారు. దూరమైన వాళ్ళు దుఃఖ పడతారు.

అందించే వాళ్ళ స్థాయి నుండి కాదు చూచి నిర్ణయించ వలసింది. అందుకునే వాళ్ళ స్థాయి నుండి చూడాలి. చెట్టు స్థాయి నుండి చూచి దానికి రాగద్వేషా లున్నాయని చెప్పడం సరి కాదు. బాటసారుల స్థాయి నుండి చూచి నిర్ణయించాలి.

చెట్టు విలక్షణంగా ఉంటుంది. వినియోగం లోనే మనుషులకు ఫలాలు అందుతాయి. చెట్టులో సమత్వమే ఉంది. బ్రహ్మమూ అంతే.

చెట్టును ఆశ్రయించే వారందరూ గాలి కోసమే ఆశ్రయించరు. కొందరు ఛాయార్థం, కొందరు పత్రార్థం, కొందరు పుష్పార్థం, కొందరు ఫలార్థం ఆశ్రయిస్తారు. ఎవరు దేని కొరకు ఆశ్రయిస్తే దానినే పొందుతారు.

భగవంతుణ్ణి ఆర్తులు ఆశ్రయిస్తారు. అర్థార్థులు ఆశ్రయిస్తారు. జిజ్ఞాసువులు ఆశ్రయిస్తారు. జ్ఞానులూ ఆశ్రయిస్తారు. ఎవరు దేని నిమిత్తం ఆశ్రయిస్తారో, వారు దానినే పొందుతారు. ఆశ్రయానికి నోచుకోని వారు అలమటిస్తూ ఉంటారు. ఎవరెలా ఉన్నా భగవంతుడు మాత్రం సమం గానే ఉంటాడు. నిర్దోషం గానే ఉంటాడు ***(నిర్దోషం హి సమం బ్రహ్మ).***

ఎవరు తనలో దిగుతారో వారినే నది చల్లబరుస్తుంది. వారి దప్పిక మాత్రమే తీర్చుతుంది. దూరంగా ఉండి, నదిని సమీపించ లేక ఎవరైనా మరణిస్తే దానికి నది కారణ మవుతుందా? నదికి రాగద్వేషా లున్నాయా?

దగ్గరై వాసన చూచిన వారికే పువ్వు తన సౌరభాన్ని పంచుతుంది. దూరంగా ఉండే వాళ్ళకు పువ్వు పరిమళాలను పంచలేదు. మరి పువ్వుకు ప్రియాప్రియాలు ఉన్నట్లేనా? ఒకవేళ భగవంతుడే సమాధానం చెబితే, ఏమంటాడు?

అగ్నివత్ అహం. దూరస్థానాం యథా అగ్నిః శీతం న అపనయతి సమీపమ్ ఉపసర్పతామ్ అపనయతి తథా అహం భక్తాన్ అనుగృహ్ణామి న ఇతరాన్ - 'నాయనా! నేను అగ్ని లాంటి వాణ్ణి. అగ్ని ఎలాగైతే తనకు దూరంగా

ఉన్న వాళ్ళ చలిని పోగొట్టలేదో, తనకు దగ్గరైన వాళ్ళ చలిని మాత్రమే పోగొడుతుందో, అలాగే నేను కూడా నన్ను సమీపించిన భక్తుల్నే అనుగ్రహిస్తాను. ఇతరుల్ని అనుగ్రహించను' అని చెబుతాడు. ఇప్పుడు అర్థమైందా? బ్రహ్మము నిర్దోషము, సమము.

ఆయన సమం గానే ఉన్నాడు

అందరూ సమంగా లేరు

తరువు అందరి విషయంలో ఎలా సమంగా ఉందో, నది అందరినీ ఎలా సమంగా తృప్తి పరుస్తూ ఉందో, అగ్ని అందరినీ ఎలా సమంగా ఆదరిస్తూ ఉందో, సూర్యుడు అందరి విషయంలో ఎలా సమంగా ప్రవర్తిస్తున్నాడో, పరమేశ్వరుడు కూడా అలా సమం గానే ఉన్నాడు.

నదిలో దిగిన వారు నదిలో ఉన్నట్లు, అర్జునా! ఈశ్వరుడ నైన నన్ను ఎవరు భక్తితో ఆరాధిస్తారో, వాళ్ళు సహజం గానే నాలో ఉంటారు. అంతేగాని, నాకు వాళ్ళ మీద ప్రియత్వం ఉండటం వల్ల మాత్రం కానే కాదు ***(యే భజన్తి తు మామ్ ఈశ్వరం భక్త్యా మయితే స్వభావతః ఏవ న మమ రాగ నిమిత్తం మయి వర్తన్తే).*** అలాగే నేను కూడా స్వభావం చేతనే వాళ్ళలో ఉంటాను. ఇతరులలో ఉండను. అంతమాత్రం చేత నాకు వాళ్ళు అప్రియు లని కాదు ***(తేషు చాపి అహం స్వభావతః ఏవ వర్తే న ఇతరేషు నైతావతా తేషు ద్వేషః మమ).***

పిల్చిన వారి లోనికే గాలి ప్రవేశించినట్లు, పిలిచిన వారి లోనికే భగవంతుడు ప్రవేశించి ఉంటున్నాడు. ఆయన ఉంటే, ఆ దేహము దేవాలయం అవుతుంది. అందుచేతనే దేవాలయానికి వెళ్ళి భగవంతుణ్ణి దర్శించినట్లు, భక్తితో, నిష్ఠతో వెళ్ళి మహాత్ముల్ని దర్శిస్తూ ఉంటాము.

అనర్థ దాయకమైన ఆలోచనలను ప్రక్కన పెట్టి, మనం కూడా సుదాముని లాగా, శబరి లాగా, విదురుని లాగా పరమేశ్వరుని మనసారా పిలిస్తే, ఆయన తప్పక మనలో ప్రవేశించి మనల్ని కూడా ఉద్ధరిస్తాడు.

పెద్దల మార్గాన నడతునయ్యా
చిన్న బుద్ధులు పూర్తిగా విడుతునయ్యా
నోరార నిన్ను నేను పిలుతునయ్యా
నీ అడుగుల కడ పడి ఉందు చిన్నికృష్ణా!

అని చిన్నికృష్ణ శతకములో ఒక వెన్నముద్ద.

ఇక భక్తి వైభవాన్ని వివరిస్తున్నాడు.

అపి చే త్సుదురాచారో భజతే మా మనన్యభాక్ ।
సాధురేవ స మన్తవ్యః సమ్య గ్వ్యవసితో హి సః ॥ 30

అపి-చేత్-సుదురాచారః-భజతే-మాం-అనన్యభాక్
సాధుః-ఏవ-సః-మంతవ్యః-సమ్యక్-వ్యవసితః-హి-సః

సుదురాచారః అపి	= మిక్కిలి దురాచారవంతుడైనా	సమ్యక్	= చక్కగ
అనన్యభాక్	= అన్యాశ్రయము నభిలషించక	వ్యవసితః హి	= స్థిర చిత్తుడు కనుక
మాం	= నన్ను	సః	= అతడు
భజతే చేత్	= సేవిస్తే	సాధుః ఏవ	= సాధువే యని
సః	= వాడు	మంతవ్యః	= భావించదగ వాడు

అర్జునా! ఎంత దురాచారవంతు డైనా సరే, అనన్య భక్తితో నన్ను సేవించాడా, ఆ క్షణం నుండి వాడు సాధువే ననుకో! మంచి నిర్ణయం తీసుకున్నాడు కదా!

వ్యాఖ్య

అసాధ్యాలను సాధ్యాలుగా మార్చే శక్తి, భక్తికి ఉంది. భక్తి ప్రభావం చేత ఎన్నో బ్రతుకులు అందమైన మలుపులు తిరిగాయి. భక్తి నీడలో దుష్టులు శిష్టు లయ్యారు. లోభులు త్యాగు లయ్యారు. అపవిత్రులు పవిత్రు లయ్యారు. పతనమైన వాళ్ళు ప్రగతి పథంలో చరించారు. దురాచారులు సదాచారు లయ్యారు. రత్నాకరులు వాల్మీకు లయ్యారు.

సుదురాచారులు

ఆచారః అంటే వ్యవహారము, నడవడి, ప్రవర్తనము అని అర్థము. ప్రవర్తనము ఉండవలసిన విధంగా ఉంటే దానిని సత్ప్రవర్తనము అంటాము. అందుకు భిన్నంగా వ్యవహరించే వారిది దుష్ప్రవర్తనము అంటాము. చేయవలసిన దానిని చేయడము, చేయకూడని దానిని త్యజించడము ఆచారము. అదే సదాచారము.

చేయ వలసింది చేయక పోగా, చేయ కూడనిది చేయడము దురాచారము. మర్యాదను పాటించడము మనిషి ధర్మము. మర్యాదను పాటించక పోగా అమర్యాదను ప్రదర్శించడం దురాచారము. ధర్మమును ఆచరించక పోగా అధర్మంగా చరించడము దురాచారము. అహింసను అవలంబించక పోగా హింసాయుతంగా జీవించడము దురాచారము.

సు దురాచారః అంటే మిక్కిలి దురాచారము ***(సుష్ఠు దురాచారః).*** అంటే, నికృష్టమైన దురాచారము ***(అతీవ కుత్సితాచారః)*** అని అర్థం. అట్టి కుత్సితమైన ఆచారము గల వారిలో అగ్రగణ్యుడు సుదురాచారవంతుడు. బండ బ్రతుకును సాగించే వ్యర్థ జీవి.

అపిచేత్ - అయినప్పటికి ***(యద్యపి),*** అట్టి దురాచారవంతుడు పరమేశ్వరుని యందు అనన్య భక్తిని అలవరచుకొని ***(ఈశ్వరం అనన్యభాక్ అనన్య భక్తిః సన్)*** నిరంతరము భగవంతుని భక్తి చేయ గలిగితే, అతడు సాధువే ***(సాధుః ఏవ)*** అని భావించ వచ్చు ***(మన్తవ్యః జ్ఞాతవ్యః)*** అంటున్నాడు భగవంతుడు.

సదాచారులు

మిక్కిలి కుత్సితమైన ఆచారము గల దురాచార వంతులు అనాచారం నుండి బయటపడి సదాచార వంతులు కాగలరా? అయ్యే అవకాశం ఉందా? భక్తి ప్రభావం చేత కాగలరు అనేదే ఇక్కడ ప్రధానమైన విషయము.

సరే. భక్తి వల్ల దురాచారులు సదాచారులు అవుతారనే అనుకుందాం. ఇంతకీ భక్తి చేయవలసింది ఎవరు? దురాచారులే కదూ? దురాచారులు భక్తిని ఎలా చేయగలరు? భక్తి చేయ గలిగితే వారు దురాచారంలో ఎందుకు చరిస్తారు? దురాచారంలో చరించే వారు సదాచారం వైపు తిరిగితే గాని భక్తి చేయలేరు. ఎందుకంటే, భక్తి అనేది సదాచార జీవనము. మరి దురాచారులు సదాచారులుగా పరివర్తన చెందడానికి హేతు వేమిటి? అనేదే ఇక్కడ స్పష్టం కావాలి.

దురాచారవంతులు భక్తి చెయ్యలేరు. ఇందులో రెండవ అభిప్రాయానికి అవకాశం లేదు. అది అసాధ్య మైన విషయం. అసాధ్య మైనది సాధ్యం కావడం అనేది దురాచార జీవనంలో జరిగేది కాదు. కాని జన్మాంతరాలలో ఎక్కడో, ఎప్పుడో, ఏదో విధంగా సంపాదించుకున్న పుణ్య ఫల విశేషము చేతనే సిద్ధించింది అనే సత్యాన్ని

గుర్తించాలి. కేవలం పూర్వ జన్మ సుకృతం వల్లనే దురాచార జీవనంలో సదాచారమైన భక్తి కొద్దిగా అలవడుతుంది. సుకృతం లేనిదే కలగదు *(న లభ్యతే పుణ్యైర్వినా)*.

సద్విచారము

పూర్వ పుణ్య విశేషం చేత భక్తి అంకురించ వచ్చు. కాని, అది చిన్న నిప్పురవ్వ లాంటిది. వంటకు ఉపయోగపడే మంట మాత్రం కాదు. చిన్న నిప్పురవ్వను మెల్ల మెల్లగా ఊదుతూ, కొద్ది కొద్దిగా చిదుగులు వేస్తూ పెద్ద మంటగా చేసి వంట ఎలాగైతే చేసుకుంటామో, అలాగే పూర్వజన్మ సుకృత ఫలంగా ప్రాప్తించిన భక్తి అనే నిప్పు రవ్వకు, వివేక మనే చిదుగులు వేసి విచారము అనే వాయువును ఊదితే, భక్తి క్షణ క్షణ వర్ధమానమై సాధు జీవనాన్ని ప్రసాదిస్తుంది.

అవసర మందరికి ఆచారము
లోపల సాగాలి విచారము
విచారము లేని ఆచారము
విప్పి చూడ అనాచారము
చేనుకు కంచే సదాచారము
పైరు పెట్టుటే సమాచారము
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్

అని రామజోగి చిట్కా.

సద్వివేకము

జన్మ సంస్కారము మెల్లగా భక్తిని కలిగిస్తుంది. నిరంతరాభ్యాసంలో భక్తిని పెంపొందించుకుంటే దుష్టుడు సాధువుగా మారుతాడు. ఇక్కడే, అదృష్టాలు, దురదృష్టాలూను. జన్మ సంస్కార ఫలంగా ఎక్కడో, ఏదో ప్రవచనం ఆలకించి, లేదా ఒక ప్రత్యేకమైన సన్నివేశాన్ని వీక్షించి తమలో నిగూఢంగా ఉన్న సంస్కారాన్ని వ్యక్తం చేసు కుంటారు. ఆ తరువాత, కొందరు వివేక విచారాదుల ద్వారా సంస్కారాన్ని వృద్ధి చేసుకొని సాధు జీవను లవుతారు. వీరు అదృష్టవంతులు. చాలినంత అదృష్టఫలం ఉన్నవారు. పుణ్యం కలవారు.

మరి కొందరు సంస్కారాన్ని వృద్ధి చేసుకోకుండా, దయ్యం పట్టిన వాళ్ళు ఊగినట్లు ఊగిపోతూ భక్తి ప్రచారం చేయాలని, సేవా కార్యక్రమాలు నిర్వహించాలని క్రొత్త అంగడి తెరుస్తారు. అంతే. చిన్న నిప్పురవ్వ మీద నీళ్ళు కాచుకొనే ప్రయత్నం చేస్తే, నీళ్ళు కాగక పోగా, నిప్పురవ్వ ఆరి పోయినట్లు, ఈ వ్యర్థ కలాపాల వల్ల జన్మాంతర సంస్కారం అందించిన పన్నీరు బూడిదలో పడగా, భక్తి దూరమై బ్రతుకు బుగ్గి పాలవుతుంది.

నిత్యాన్నదానము శ్రేష్ఠ మైనదే కావచ్చు. కాని, దానిని అందరూ చెయ్యలేరు. ఆలోచన ఒక్కటే కాకుండా ఆర్థిక స్తోమత కూడా ఉన్నవారే చెయ్యగలరు. అంతేగాని ఆ పనికి బిచ్చగాడు బయలుదేర కూడదు. ఒకవేళ చెయ్యాలి అనేదే గనుక బిచ్చగాడి నిశ్చయ మైతే, వాడు ముందు ధనికుడు కావడానికి ప్రయత్నించాలి. శ్రమించాలి.

వైద్యం చెయ్యడానికి వైద్య సేవ గొప్పది అని తెలుసుకోవడం సరిపోదు. వైద్య విద్య కూడా తెలిసి ఉండాలి. వైద్య విద్య అలవడిన వైద్యుడే వైద్యం చేయగలడు. అర్థరహితమైన ఆవేశాలు బ్రతుకును వ్యర్థంగా మారుస్తాయి.

సద్భక్తి యుతము

భక్తి వృద్ధి చెందాలి అంటే, కేవలం దురాచారం నుండి విడిపడితే సరిపోదు. ప్రయత్నించి సదాచారంతో ముడిపడి జీవించడం అలవరచుకోవాలి. పశ్చాత్తాపం పాప పరిహారం అంటూ ఉంటారు. అది విభేదించ దగిన విషయ మేమీ కాదు. కాకపోతే, పొలానికి నీరు పెడితే నేల మెత్త పడినట్లు, పశ్చాత్తాపం వల్ల స్రవించే కన్నీళ్ళతో హృదయం మెత్తబడుతుంది. కొంతవరకు పాపం ప్రక్షాళనం అవుతుంది. కాని, అలాంటి పాపాన్ని తిరిగి చేయను అని నిశ్చయించుకొని, తదనుగుణంగా జీవించి నపుడే దురాచారుడు పవిత్రు డవుతాడు. సాధువు అవుతాడు. సద్భక్తు డవుతాడు.

కృత్వా పాపం హి సంతప్య తస్మాత్ పాపాత్ ప్రముచ్యతే।
నైవం కుర్యాం పునః ఇతి నివృత్యా పూయతే తు సః॥

పాపం చేసిన వాడు పశ్చాత్తాపంతో పరితపిస్తే, అతడు పాప విముక్తు డవుతాడు (పరివర్తన కారణంగా). మళ్ళీ అలాంటి పాపం చెయ్యను అని అతడు పాపం నుండి విరమిస్తే పవిత్రు డవుతాడు. పునీతు డవుతాడు (ప్రవర్తన కారణంగా).

పరమేశ్వరుని అనన్య భక్తితో సేవించిన వాడు ఎందుకని సాధువుగా గుర్తింప బడుతున్నాడు అంటే, దానికి కారణాన్ని కూడా పరమేశ్వరుడు వివరించి ప్రవచించాడు. ***సమ్యక్ వ్యవసితః హి యస్మాత్ సాధు నిశ్చయః సః*** - సాధు నిశ్చయము జరిగింది కనుక అతడు సాధువే. మనస్సులో మంచి నడవడికి సంబంధించిన నిశ్చయం జరిగి పోయింది కనుక, బాహ్యంలో అతడి నడవడిక మంచిగానే ఉంటుంది. ***యద్భావం తద్భవతి*** - భావం ఎలా ఉంటే బ్రతుకు అలాగే ఉంటుంది. సాధుభావం సాధు జీవనానికి హేతువు. అట్టి జీవనము సద్భక్తి యుతము. ముక్తికి సోపానము.

ఈ విధమైన పరివర్తనము యొక్క ప్రభావాన్ని ప్రతిజ్ఞా పూర్వకంగా చెబుతున్నాడు.

క్షిప్రం భవతి ధర్మాత్మా శశ్వ చ్ఛాన్తిం నిగచ్ఛతి ।
కౌన్తేయ ప్రతి జానీహి న మే భక్తః ప్రణశ్యతి ॥ 31

క్షిప్రం-భవతి-ధర్మాత్మా-శశ్వత్-శాంతిం-నిగచ్ఛతి

కౌంతేయ-ప్రతి-జానీహి-న-మే-భక్తః-ప్రణశ్యతి

క్షిప్రం	=	శీఘ్రముగా	కౌంతేయ	=	అర్జునా!
ధర్మాత్మా	=	ధర్మాత్ముడు	మే	=	నా యొక్క
భవతి	=	అవుతున్నాడు	భక్తః	=	భక్తుడు
శశ్వత్	=	స్థిరమైన	న ప్రణశ్యతి ఇతి	=	నాశము పొందడని
శాంతిం	=	శాంతిని	ప్రతి జానీహి	=	ప్రతిజ్ఞ చేయి
నిగచ్ఛతి	=	పొందుతున్నాడు			

అర్జునా! ఈ సాధువే తొందరగా ధర్మాత్ముడు అవుతాడు. నిత్య శాంతిని పొందుతాడు. కౌన్తేయా! నా భక్తుడు నశించడని ప్రతిజ్ఞ చేసి చెప్పు.

వ్యాఖ్య

మనస్సులో సాధు నిశ్చయం చేసుకొని ఉన్న సామర్థ్యం వల్ల ***(అన్తః సమ్యక్ వ్యవసాయ సామర్థ్యాత్)***,

బాహ్యము నందు దురాచారమును త్యజించి **(ఉత్సృజ్య బాహ్యం దురాచారతామ్)** శీఘ్రంగా ధర్మాత్ము
డవుతున్నాడు. అంటే, ధర్మము నందు బుద్ధి కలవాడు అవుతున్నాడు **(క్షిప్రం భవతి ధర్మాత్మా)**. పూర్వ శ్లోకంలో
సుదురాచారుడుగా మనకు పరిచయమైన వ్యక్తి ఇక్కడ ధర్మాత్ముడుగా గోచరిస్తున్నాడు. ఈ మధ్యలో ఏమి
జరిగింది? అని ప్రశ్నించుకుంటే, ఆ వ్యక్తి మనస్సులో మంచి నడవడికి సంబంధించిన నిశ్చయం దృఢంగా
ఏర్పడింది **(సమ్యక్ వ్యవసితః)**. దాని ప్రభావం చేత బాహ్యంలో మంచి నడవడి కనిపించింది **(సమ్యక్ వృత్తః)**.
ఈ కారణంగా దురాచారపరుడు ధర్మాత్ము డయ్యాడు.

శుద్ధి కార్యము

ఇదొక సంధి కాలము. ఉదయ సంధ్య లాంటిది. చీకట్లు చెదరి పోతూ ఉంటాయి. వెలుగులు పుట్టుకొస్తూ
ఉంటాయి. చీకటి తెరలు తొలగిపోతూ, వెలుగు కిరణాలు విస్తరిస్తూ ఉన్న దశలో బ్రతుకు ప్రకాశవంత మవుతుంది.

చేసిన పాపాల కారణంగా పాప ఫలితాలు పుట్టుకొస్తూ ఉంటాయి. కారణము కార్యంగా రూపాంతరం
చెందడాన్ని ఎవ్వరూ నివారించ లేరు. పాప కారణంగా ఉత్పన్న మయ్యే పాప ఫలితాలు అనే కార్యాలు ధర్మ
జీవనానికి ప్రతిబంధకా లవుతాయి. ఇది అనివార్య పరిస్థితి.

ఇటువంటి ప్రతికూల పరిస్థితుల మధ్య పశ్చాత్తాప హృదయం పవిత్రత కోసం పరితపిస్తుంది. ప్రాకు
లాడుతుంది. చేసిన పాపాలను తలచుకొని నిత్యం మనస్సు పశ్చాత్తాపం చెందుతుంది **(శోచేత మనసా నిత్యం)**.
గతంలో ఆచరించిన దుశ్చర్యలను చింతిస్తూ కుములుతుంది **(దుష్కృతాని అనుచిన్తయన్)**. అప్రమత్తమైన
చిత్తము తపస్సులో మగ్న మవుతుంది **(తపస్వీ చాప్రమాదీ)**. పాపం నుండి మెల్లగా విడి పడుతుంది **(తతః
పాపాత్ ప్రముచ్యతే)** అని బౌద్ధాయన ధర్మశాస్త్రము. ఈ విధమైన హృదయ పరివర్తనములో పరమేశ్వరుని
కృప సాధకునికి అందుతుంది. అట్టి కృపా విశేషం చేత పాప కారణంగా సాధనలో అవరోధాలుగా నిలిచిన
ప్రతిబంధకాలను సాధకుడు అధిగమిస్తాడు. పాప తిమిరాలు తొలగి పోతూ ఉంటాయి. ధర్మజీవన వెలుగులు
విరబూస్తూ ఉంటాయి. ఈ సంధి కాలం లోనే దురాచారపరుడు ధర్మాత్ముడు అవుతాడు **(భవతి ధర్మాత్మా
ధర్మచిత్తః ఏవ)**. ధర్మము నందే మనస్సు కలవాడు అవుతాడు. ఇలా శుద్ధి పడతాడు.

ఎంత కాలం?

మరి, దురాచార వంతుడైన పాపి పునీతుడై భక్తుడు కావడానికి ఎంత సమయం పడుతుంది? పాపాలు
చేయడానికి సమయం పడుతుందేమో గాని, మనస్సు పెట్టి నిశ్చయంతో సాధన చేసే వారు పాప విముక్తిని
పొందడానికి ఎంతో కాలం అవసరం లేదు.

రాత్రి కొన్ని గంటలు ప్రపంచం చీకట్లో మునిగి పోతుంది. అదే ప్రపంచం వెలుగులలో తేరుకోవడానికి
ఎంత సమయం పడుతుంది? ఒక గది కొన్ని సంవత్సరాలుగా మూతబడి ఉంది. గది నిండా తిమిరమే
తారాడుతోంది. దీపం చేత పట్టుకొని, తలుపు తెరచి గది లోకి ప్రవేశిస్తే, సంవత్సరాలుగా గదిలో ఉన్న చీకటి
అదృశ్యం కావడానికి ఎంత కాలం పడుతుంది? ఇదీ అంతే. మనిషి స్వప్న ప్రపంచం నుండి మెలకువ లోకి
వచ్చినట్లు, తక్షణమే జరిగి పోతుంది. అందుకనే **క్షిప్రం** అన్నాడు. అంటే శీఘ్రంగా, లేదా తొందరగా అని
అర్థము. భౌతిక రోగం నయం కావడానికి సమయం పడుతుందేమో గాని సాధకుని అంతఃకరణము శుద్ధిపడి
సిద్ధ పడితే భవ రోగము క్షణాల్లో అదృశ్య మవుతుంది.

నిత్య శాంతి

ధర్మము నందు చిత్తము కలవాడు ధర్మాత్ముడు. ధర్మరూపంలో ఉన్నది దైవమే కనుక, ధర్మము

నందు ప్రీతి కలిగి ఉండటము అంటే, భగవత్ప్రీతితో జీవించడము అని అర్థము. దైవభక్తిలో నిమగ్నమైన
చిత్తానికి, ఇంకా మిగిలి యున్న కొన్ని ప్రతిబంధకాలు అడ్డంకులుగా మారితే, ధర్మజీవన ఫలంగా ప్రాప్తించే
పరమాత్మ అనుగ్రహంతో వాటంతటవే నిస్సారమై, నిర్వీర్యమై, నీరసపడి నిష్క్రమిస్తాయి.

వికర్మ యచ్చోత్పతితం కథంచి ద్ధునోతి సర్వం హృది సన్నివిష్టః।

ఏదో ఒక విధంగా సంభవించే నిషిద్ధ కర్మమును సమస్తమును హృదయాంతర్యామి అయిన పరమేశ్వరుడు
తొలగిస్తున్నాడు. అంటే భగవత్కృప వల్ల నూతన పాపాచరణము నివారింప బడుతూ ఉంది అని అర్థము.

ఇలా శుద్ధి పడిన బుద్ధి శాంతి నిలయంగా మారుతుంది. శాంతి రెండు విధాలు. అశాంతి కారణాలు
తొలగి నపుడు తాత్కాలికంగా ఏర్పడే శాంతి మొదటిది. దీనికి రాకపోకలు ఉంటాయి. అలా కాకుండా నిత్యము
భాసించే స్వరూప శాంతి రెండవది. దీనినే ***శశ్వత్ శాంతి*** అన్నాడు. అంటే నిత్యశాంతి అని అర్థము. అదే తన
స్వరూపముగా కలవాడు అవుతున్నాడు. ఈ విధంగా దురాత్ముడు పుణ్యాత్ముడై, ధర్మాత్ముడై, శాంతిరూపుడై
శోభిస్తున్నాడు. ఇదంతా భక్తి వైభవము. భగవద్భక్తి వైభవము. ఈ వైభవాన్ని లోకానికి చాటింపు వేసి చెప్పమని
అచ్యుతుడు అర్జునుని ఆదేశించాడు.

దైవ శాసనం

'అర్జునా! నిశ్చితమైన ప్రతిజ్ఞ చేసి చెప్పు! **(ప్రతిజానీహి)**. నా భక్తుడు నశించడు అని చెప్పు' అన్నాడు
గీతాచార్యుడు. ***న మే భక్తః ప్రణశ్యతి*** - 'నా భక్తుడు నశించడు' అనే వాక్యం అష్టాక్షరీ మహామంత్రము లాంటిది.
అర్జునుని ద్వారా ప్రపంచానికి పరమేశ్వరుడు అభయ ప్రదానం చేశాడు.

న వాసుదేవ భక్తానాం అశుభం విద్యతే క్వచిత్

'వాసుదేవుని భక్తులకు అశుభము తెలియదు' అనేది సత్యమైన మాట. కృష్ణ భక్తులు నాశ మెరుగరు. ఈ
విశ్వాసము తోనే నేను నా బాల్యము లోనే ***ఓం నమో భగవతే వాసుదేవాయ*** అనే ద్వాదశాక్షరీ మహా మంత్రాన్ని
హృదయంలో స్థిర పరచుకొని వాడవాడల కీర్తిస్తూ ప్రచారం చేశాను. నా జీవితంలో నా ద్వారా ఏదైనా లోకానికి
జరిగి ఉంటే అదంతా కృష్ణ నామ వైభవమే. కృష్ణ భక్తి అనుగ్రహించిన ప్రసాదమే. తన భక్తుల బ్రతుకులు బాధల
పాలు కాకూడదని భావించిన పరమేశ్వరుడు, అర్జునుని లోకానికి ప్రతిజ్ఞ చేసి చెప్పమంటున్నాడు. ఆ మాట
భగవంతుడు చెప్పాలా! భగవంతుని కీర్తిని చాటింపు వేయడం కన్నా తృప్తికరమైన కార్యము భక్తునికి మరొకటి
ఉంటుందా? కాకపోతే, ఇక్కడ సాక్షాత్తు భగవంతుడే ప్రతిజ్ఞా వచనాన్ని వినిపించడం భక్తుల భాగ్యము. రామభక్తు
డైన భద్రాచల రామదాసు కూడా అలాగే చాటింపు వేశాడు. ***భేరికా డాండ డడాండ డాండ నినదంబు లజాండము
నిండ మత్త వేదండము నెక్కి చాటెదను దాశరథీ! కరుణా పయోనిధీ!*** - రాముని మించిన దైవము లేదని, మదపు
టేనుగు నెక్కి, భేరీ నినాదాలు, నగారాల చప్పుళ్ళు బ్రహ్మాండమును నిండే లాగా చాటి చెబుతాను అన్నాడు
రామదాస్. భేష్! భక్తుడంటే అలా ఉండాలి.

*దురాచారు లైనా, పాపులైనా తనను ఆశ్రయిస్తే తరిస్తారు అనే విషయాన్నే కొనసాగిస్తున్నాడు తరువాత
శ్లోకంలో కూడా.*

మాం హి పార్థ వ్యపాశ్రిత్య యేఽపి స్యుః పాపయోనయః।
స్త్రియో వైశ్యా స్తథా శూద్రా స్తేఽపి యాన్తి పరాం గతిమ్ ॥ 32

మాం-హి-పార్థ-వ్యపాశ్రిత్య-యే-అపి-స్యుః-పాపయోనయః
స్త్రియః-వైశ్యాః-తథా-శూద్రాః-తే-అపి-యాంతి-పరాం-గతిం

పార్థ	=	అర్జునా!	తథా	=	అలాగే
యే	=	ఎవరు	శూద్రాః	=	శూద్రులును
మాం	=	నన్ను	స్యుః అపి	=	అయి యున్నారో
వ్యపాశ్రిత్య	=	శరణుబొంది	తే అపి	=	అట్టివారును
పాపయోనయః	=	పాపాత్ములు	పరాం	=	ఉత్తమమైన
స్త్రియః	=	స్త్రీలును	గతిం	=	గతిని
వైశ్యాః	=	వైశ్యులును	యాంతి హి	=	పొందుతారు

అర్జునా! పాప సంజాతు లైనా, స్త్రీ లైనా, వైశ్యులైనా, శూద్రులైనా, ఎవ్వరైనా సరే నన్ను ఆశ్రయిస్తే చాలు. ఉత్తమ గతిని పొందుతారు.

వ్యాఖ్య

దురాచారులై, పాప జీవనాన్ని గడిపే వారు కూడా భక్తిని ఆశ్రయించి ఎలా పునీతు లయ్యారో, శాశ్వత మైన శాంతిని ఎలా పొందారో ఇంతవరకు చూశాం. ప్రస్తుత శ్లోకంలో పుట్టుకే పాప భూయిష్టంగా ఉన్నవారు, వారితో పాటు, పరమార్థ తత్త్వాన్ని సాధించుకోలేని వాళ్ళు కూడా భక్తిని కలిగి, పరమేశ్వరుని ఆరాధించి ఎలా తరించి పోతున్నారో తెలుపు తున్నాడు. భగవంతుణ్ణి ఎవ్వరైనా ఆశ్రయించ వచ్చు. ఆశ్రయించిన ప్రతి వారు తరించి పోతారు అనేదే ఈ శ్లోకంలో ప్రధానమైన విషయము.

పాప యోనులు

పాప యోనులు అంటే నీచ జన్మ కలవారు. పాప కార్యాలు ఆచరించే తల్లిదండ్రులకు పుట్టిన వారు. పుట్టుకే పాప కార్యాలు ఆచరించే తల్లిదండ్రులతో ముడిపడి ఉన్నందున వారు పాప యోనులు ***(పాపా యోనిః యేషాం తే పాప యోనయః పాప జన్మానః).*** తల్లిదండ్రులు ఇరువురు పాప కార్యాలు చేసేవారు, నేర చరితులుగా ఉంటారు. అట్టి వారికి జన్మించిన వారు పాప జన్ములు. అలాగే జంతు యోనులు కూడా పాప యోనులే కనుక, నీచ జన్మలైన జంతు జన్మములు కూడా పాప జన్మముల క్రిందికే వస్తాయి. ఇంతకీ దీని అర్థం ఏమిటంటే, మోక్షాన్ని పొందడానికి సాధనమైన జ్ఞానమును సాధించుకొనే అర్హతను జన్మ లోనే పోగొట్టుకున్న వారు అని అర్థము. అట్టి వారు కూడా తనను ఆశ్రయిస్తే ***(మాం వ్యపాశ్రిత్య)*** ఉత్తమ గతిని పొందుతారు ***(పరాంగతిమ్ యాన్తి)*** అంటున్నాడు భగవంతుడు.

ఈ విధమైన పాప జన్ములు, మరియు ***(తథా)*** స్త్రీలు, వైశ్యులు, శూద్రులు - వాళ్ళు కూడా ***(తే అపి)*** నన్ను ఆశ్రయించి ఉత్తమ గతిని పొందుతారు అంటున్నాడు గీతాచార్యుడు. ఈ శ్లోకం అనేక అపార్థాలకు అవకాశ మిచ్చి, ఎన్నో అనర్థాలకు ఊత మిచ్చింది. ఈ లోపం మూలానికి సంబంధించింది కాదు. వ్యాఖ్యానాలు ప్రబోధాన్ని మరొక కోణంలో చూపించడం వల్ల అపార్థాలు ఊపందు కున్నాయి. స్త్రీలు, వైశ్యులు, శూద్రులు అనే పదాలకు **పాప యోనయః** అనే పదాన్ని విశేషణంగా గ్రహించడం చేత పాప జన్మలైన స్త్రీలు, వైశ్యులు, శూద్రులు అనే అభిప్రాయం ఏర్పడింది.

నీచ జన్మలైన వారు నన్ను ఆశ్రయించి ఉత్తమ గతిని పొందుతారు. అలాగే స్త్రీ వైశ్య శూద్రులు కూడా

(తే అపి) నన్ను ఆశ్రయించి ఉత్తమ గతిని పొందుతారు అనేదే చక్కని అన్వయము. అంతేగాని, పాపయోను లైన స్త్రీ వైశ్య శూద్రులు నన్ను పొందుతారు అనేది కాదు.

అందరూ అర్హులే

జన్మ ఏదైనా, ఎవరి దైనా దుఃఖమయమే. దుఃఖాన్ని ఎవరూ భరించలేరు. జన్మ నెత్తిన వారందరు ఏదో ఒకనాడు జన్మ రాహిత్యాన్ని పొంద వలసిందే. అదే జన్మకు పరమార్థము. రోగమున్న ప్రతివాడు ఔషధ సేవనానికి అర్హుడే. దుఃఖమున్న ప్రతి జీవి జ్ఞానబోధకు సిద్ధ పడాలి. కాకపోతే, జ్ఞానార్హతను పొందేందుకు తీవ్రంగా ప్రయత్నించాలి. అంతేగాని, ఈ విషయంలో ఎవరూ అనర్హులు కారు. శాస్త్రమాతకు అందరూ బిడ్డలే. అందుకే వేదమును శ్రుతిమాత అన్నారు. తల్లికి బిడ్డ లందరూ సమానమే. ధర్మమార్గంలో లేదా మోక్ష మార్గంలో కర్మే ప్రధానం గాని, జన్మ ప్రధానం కాదు. అందుచేత, ఎవరిని నీచ జన్ములుగా మనం పరిగణించామో, ఏ జంతు జాలాన్ని పాప యోనులుగా ముద్ర వేశామో, అట్టి జంతు జాతిలో కూడా తరించిన వారున్నారు. అదే మన చరిత్ర. భారతీయ పవిత్ర చరిత్ర. శాస్త్రాలలో, పురాణాలలో ప్రజ్వలించే మహాత్ముల దివ్య చరిత్ర.

గజేంద్రు డెవరు? జంతువు కాదా? గజేంద్రునికి ముక్తి కలుగ లేదా? గజేంద్ర మోక్షము అదే కదా! జటాయువు కైవల్యం ఏమిటి? జటాయువు పక్షి కాదా! మరి హనుమంతు డెవరు? వానర జాతికి చెందిన వాడు కాడా? వీరందరికి మోక్షం ప్రాప్తించి నపుడు, స్త్రీ శూద్ర వైశ్యాదులకు మోక్షము నిషిద్ధ మవుతుందా? భక్తిలో భేదాలు లేవు. భక్తులకు భేదాలు అర్థం కావు.

సూ॥ నాస్తి తేషు జాతి విద్యా రూప కుల ధన క్రియాది భేదః।

భక్తుల యందు ***(తేషు)*** జాతి, విద్య, రూప, కుల, ధన, క్రియాది భేదాలు లేనే లేవు ***(నాస్తి).*** వారందరిది భగవంతుని జాతి. వారందరికి తెలిసింది ఒకే విద్య. అదే భక్తి విద్య. వారందరిది ఋషికులం. వారి సంపదంతా దైవీ సంపదే.

వ్యాస శుకాదులు, కన్నప్ప కనకదాసులు, విదుర విభీషణాదులు, సంజయ గుహాదులు, శబరీ స్వయంప్రభలు - ఎవరు వీరందరు? వీరందరూ ప్రాతఃస్మరణీయులే కదా! ఎందుకో తెలుసా! వీరు దేహాల నుండి పుట్టి ఉండవచ్చు. కాని, వీరిది దేహ సంబంధం కాదు, దైవ సంబంధము. వీరు దేహములతో ముడిపడిన వారు కారు. దేవుడితో ముడిపడి ఉన్నవారు. దేవుడికి సంబంధించిన వారు ***(యత స్తదీయాః).***

(చండాలోఽ పి ద్విజశ్రేష్ఠః హరిభక్తి పరాయణాత్ - హరిభక్తి కలిగిన పుణ్యాత్ముడు చండాలుని గృహంలో పుట్టినా అతడు బ్రాహ్మణ శ్రేష్ఠుడే అన్నది శాస్త్రం.

స్త్రీ వైశ్య శూద్రులు అని ప్రత్యేకించి చెప్పడంలో భక్తిలో భేదం అవాంఛనీయము అని తెలియ జేయడమే ఉద్దేశ్యము. వైశ్య శూద్రులు అని చెప్పడం జాతి భేదాన్ని సూచిస్తూ ఉంది. లింగ భేదానికి సూచకంగా స్త్రీలు చెప్పబడ్డారు. గుణ భేదానికి పాప జన్ములు ఉదహరింప బడ్డారు. జాతి భేదంతో లింగ భేదంతో, గుణ భేదంతో సంబంధం లేకుండా కేవలం భక్తియే ముక్తికి ప్రధాన అర్హత అని చెప్పడమే భగవంతుని ఉద్దేశ్యము. ఎవరైనా సరే, భక్తి ద్వారా తనను ఆశ్రయించి తరించి పోవచ్చు అనేదే భగవంతుని హృదయం.

పురుషులతో సమానంగా శాస్త్ర చర్చలలో, సంధ్యావందనాది క్రియలలో స్త్రీలకు అవకాశ మిచ్చి, 'మాతృదేవో భవ!' అని స్త్రీ మూర్తిని దైవ సమానంగా చూచిన భారతీయ సంస్కృతిలో స్త్రీది పాపజన్మ అని ఎవ్వరైనా అనగలరా? స్త్రీయే గనుక పాపజన్మ ఎత్తి ఉంటే, ఇక పాపులు కాని వారెవరు? ఎవరు జన్మించినా, స్త్రీ

నుండే కదా జన్మించాలి! స్త్రీ పాపి అయితే, స్త్రీ నుండి పుట్టిన వారు ఎలా పాపులు కాకుండా పోతారు? అందరూ పాపులే. అది కూడా జన్మత: పాపులే. ఇది హిందూ ధర్మమేనా? ఆర్ష సంస్కృతేనా? ఆలోచించండి. పునాదులే కదిలి పోతాయి. పరమతాలు పీఠ మెక్కుతాయి.

ప్రాచీన కాలంలో మాతృమూర్తులు యజ్ఞోపవీతమును ధరించి, సంధ్యావందన, గాయత్రీ జపాదులు ఆచరించే వారని శాస్త్ర ప్రమాణాలు అనేకం ఉన్నాయి. ఈ విషయాన్ని రామాయణంలో కూడా మనం చూడవచ్చు.

సీతమ్మ తల్లిని అన్వేషిస్తూ హనుమంతుడు అశోకవనం లోకి ప్రవేశిస్తాడు. అశోకవనంలో తిరుగుతూ అక్కడ ఒకచోట నదీ ప్రాంతాన్ని చూస్తాడు. అందమైన ఆ ప్రదేశంలో కొంత సేపు ఆగి, సీతమ్మ గనుక బ్రతికే ఉంటే ***(యది జీవతి సా దేవీ)*** పవిత్ర జలాలు గల ఈ నది వద్దకు తప్పకుండా వస్తుంది ***(ఆగమిష్యతి సావశ్యం ఇమాం శివ జలాం నదీమ్)*** అనుకుంటాడు. ఇంకా ఏమనుకుంటాడో చూడండి!

సంధ్యా కాలమనాః శ్యామా ధ్రువ మేష్యతి జానకీ ।
నదీం చేమాం శుభ జలాం సంధ్యార్థే వరవర్ణినీ ॥

'సంధ్యా సమయాన పవిత్ర జలాలు కలిగిన ఈ నది చెంతకు సంధ్యా వందనమును ఆచరించడానికి జానకీదేవి రావచ్చు' అనుకుంటాడు. దీనిని బట్టి రామాయణ కాలంలో కూడా స్త్రీలకు సంధ్యా వందనాది ఉపాసనలు, గాయత్రీ మంత్రాది జపాలు, యజ్ఞోపవీత ధారణలు ఉన్నాయని స్పష్ట మవుతూ ఉంది. మైత్రేయికి యాజ్ఞవల్క్య మహర్షి బ్రహ్మవిద్యను ఉపదేశించినట్లు బృహదారణ్యక ఉపనిషత్తు కూడా చెబుతూ ఉంది.

సత్యకామ జాబాలి

సత్యకాముని తల్లి జాబాలి. ఒకనాడు సత్యకాముడు తల్లిని సమీపించి, 'అమ్మా! నేను బ్రహ్మచారిని కావా లనుకుంటున్నాను. అమ్మా! నా కుల మేమిటి? గోత్ర మేమిటి?' అని అడిగాడు.

'నాయనా! సత్యకామా! ఆ విషయం నాకే తెలియదు. నేను యౌవనములో దాసీవృత్తిలో జీవించాను. అనేక చోట్ల తిరిగాను. ఆ సమయం లోనే నిన్ను ప్రసవించాను. నీ కుల మేదో నా కెలా తెలుస్తుంది నాయనా! నీ పేరు సత్యకాముడు కదా! నా పేరు జాబాలి. కనుక, నీవు సత్యకామ జాబాలి వని చెప్పుకో!' అన్నది తల్లి.

తల్లి చెప్పినట్లే, గురుదేవు డైన గౌతమ మహర్షికి సత్యకాముడు విన్నవించి, తనకు బ్రహ్మవిద్యను ఉపదేశించ మని అర్థించాడు. ప్రార్థించాడు.

ఉపనయనము లేనివాడు బ్రహ్మవిద్యకు అధికారి ఎలా అవుతాడు? అందుచేత, ముందుగా గౌతముడు సత్యకామునకు ఉపనయన సంస్కారము చేసి, ఆ తరువాత బ్రహ్మవిద్యోపదేశం చేశాడు.

సత్యకాముడు శూద్రుడే కదా! మరి, గౌతమ మహర్షి అతనికి ఉపనయన సంస్కారము ఎలా చేశాడు? పైగా బ్రహ్మవిద్యను ఉపదేశించాడు కూడా. ఇదేమి కాకమ్మ కథ కాదు. ఉపనిషత్తు. మహత్తర మైన ఛాందోగ్య శ్రుతి.

శూద్రుడు, జాబాలి కుమారుడైన సత్యకామునిలో అనర్హత లేదని నిర్ణయించిన తరువాతే కదా గౌతమ మహర్షి ఉపనయన సంస్కారాన్ని చేయుటకు సిద్ధ పడ్డాడు! ఉపనిష ఛ్రుతిపాదిత మైన ఈ సత్యాన్ని బ్రహ్మసూత్రము ధృవ పరచింది.

సూ॥ తదభావ నిర్ధారణే చ ప్రవృత్తేః *(బ్రం. సూ. 1 - 3 - 37)*

దోషము లేదని నిర్ణయించిన తరువాతే గౌతముడు సత్యకామునికి ఉపనయనం చేయించాడు అన్నది బ్రహ్మసూత్రము.

తల్లి యొక్క చరిత్రను దాచుకోకుండా ఉన్నదున్నట్లు సత్యకాముడు గౌతమునికి చెప్పాడు. సత్యం పలికిన కారణంగా సత్యకాముని అధికారిగా గుర్తించాడు గౌతమ మహర్షి. అంతేగాని, జన్మను చూచి నిరాకరించ లేదు. ప్రస్థానత్రయంలో ఉపనిషత్తు, బ్రహ్మసూత్రాలు శూద్రులకు అనర్హతను సూచించ నపుడు భగవద్గీత సూచిస్తుందా? విజ్ఞులు అర్థం చేసుకోగలరు.

శ్రీ శంకరాచార్య స్వామి కూడా తమ మాండూక్యకారికా భాష్యంలో *(4 - 95)* పుట్టుక లేనిది, వినాశము ఎరుగనిది, సమమైనది అయిన బ్రహ్మ విషయము నందు సునిశ్చిత మైన శ్రద్ధ కలవారు స్త్రీలు కనుక బ్రహ్మ విద్యార్జన చేసి పరమార్థమును పొందుతారు అని వ్యాఖ్యానించారు.

ఇలా ఎన్నో చెప్పుకు పోవచ్చు. కాని ఇంతవరకు చాలని భావిస్తున్నాను. దారి తప్పే అవకాశం ఉందని అభిప్రాయ పడటం వల్లనే సందేహ నివారణార్థం ఈ విషయాలను మీ ముందు ఉంచాను. అంతే.

పరమాత్మను ఆశ్రయించి దురాత్ములు, పాపాత్ములే తరించి పోతూ ఉంటే, ఇక పుణ్యాత్ముల విషయం ప్రత్యేకంగా చెప్పేది ఏముంటుంది? అది కూడా చెబుతున్నాడు. అంతే కాదు. జగత్తు అనిత్యం కనుక జగన్నాథుని ఆశ్రయించి తరించ మంటున్నాడు.

కిం పున ర్బ్రాహ్మణాః పుణ్యా భక్తా రాజర్షయ స్తథా ।
అనిత్య మసుఖం లోక మిమం ప్రాప్య భజస్వ మామ్ ॥ 33

కిం-పునః-బ్రాహ్మణాః-పుణ్యాః-భక్తాః-రాజర్షయః-తథా
అనిత్యం-అసుఖం-లోకం-ఇమం-ప్రాప్య-భజస్వ-మాం

పుణ్యాః	=	పుణ్యాత్ము లైనట్టి	అసుఖం	=	సుఖము లేనిది
భక్తాః	=	భక్తు లైనట్టి	ఇమం	=	ఈ
బ్రాహ్మణాః	=	బ్రాహ్మణులు	లోకం	=	లోకమును
తథా	=	అటులే	ప్రాప్య	=	పొంది
రాజర్షయః	=	రాజర్షులు	మాం	=	నన్ను
కిం పునః	=	వేరుగా చెప్పాలా?	భజస్వ	=	భజింపుము
అనిత్యం	=	నిత్యము కానిది			

పార్థా! పుణ్యాత్ములు, భక్తులు అయిన బ్రాహ్మణులు, రాజర్షుల విషయం ఇక ప్రత్యేకంగా చెప్పే దేముంటుంది? ఈ ప్రపంచం నిత్యం కాదు. ఇందులో సుఖం లేదు. నన్ను సేవించి తరించిపో!

వ్యాఖ్య

అర్హులకే అందలము

అధికు లైనా, అధము లైనా, పుణ్యాత్ము లైనా, పాపాత్ము లైనా అందరి మార్గము ఒక్కటే. అందరి గమ్యమూ ఒక్కటే. పుణ్యులైనా, అపుణ్యు లైనా భక్తి చేయ వలసిందే. ముక్తిని పొందవలసిందే. ఎవరు ఎలా జన్మించినా అందరూ భక్తి చేయవలసిందే.

పాప యోనుల యందు జన్మించిన వారైనా, పరమార్థ తత్త్వాన్ని అర్థం చేసుకొని పురుషార్థాన్ని సాధించుకొనే

శక్తి లేని వారైనా - అందరూ భక్తి మార్గంలో పయనించి, పరమేశ్వరుని కృపను పొంది ఎలా కృతార్థు లవుతున్నారో పూర్వ శ్లోకంలో చూశాం. ఇక దుర్లభమైన ఆ అవకాశాన్ని అంది పుచ్చుకొని జన్మించిన వారి విషయం ప్రస్తుత శ్లోకంలో చెబుతున్నాడు. వారే పుణ్యాత్ము లైన జననీ జనకులకు పుట్టిన వారు ***(పుణ్య యోనయః)***, పుణ్యఫలం కల వారు ***(పుణ్యాః)***, భక్తులైన వారు ***(భక్తాః)***. బ్రాహ్మణులు, రాజర్షులు ఆ కోవకు చెందిన వారే.

పుణ్య యోనులు అని ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే, సంప్రదాయమును పాటించే కుటుంబాలలో జన్మించిన వారికి బాల్యము నుండే భక్తి శిక్షణ, ఆచార వ్యవహారాల యందు భగవద్భావన ఏర్పడుతూ ఉంటాయి. గత జన్మలలో తయారు చేసుకున్న కొద్దిపాటి పుణ్యంతో పుణ్యాత్ములైన తల్లిదండ్రులకు జన్మించడమే గాక, తెచ్చుకున్న పుణ్యాన్ని హెచ్చుగా పెంచుకొనే అవకాశాన్ని ఇచ్చే ప్రదేశాలలో ఆవిర్భవించడం చేత, చిత్త శోధన, ముక్తి సాధన వారికి సులభ మవుతాయి. అందుకనే, భక్తవత్సలు డైన పరమేశ్వరుని అనుగ్రహంతో దురాచారవంతులే తరించి పోతూ ఉంటే, ఇక ఇలాంటి పుణ్యాత్ములను గురించి చెప్పే దేముంది ***(కిం పునః)***? అంటూ ప్రస్తుత శ్లోకాన్ని ప్రారంభిస్తున్నాడు గీతాచార్యుడు.

పుణ్యము గల వారు, భక్తులు అయిన బ్రాహ్మణులు ***(బ్రాహ్మణాః పుణ్యాః భక్తాః)***, అలాగే పుణ్యము, భక్తి గల రాజర్షులు - ఋషులైన రాజులే రాజర్షులు ***(రాజర్షయః రాజానః చ తే ఋషయశ్చ ఇతి రాజర్షయః)*** - వీరి విషయం ప్రత్యేకంగా చెప్పే దేముంది ***(కిం పునః)***? అంటున్నాడు. బ్రాహ్మణు లైనా, రాజులైనా, భక్తులై ఉండాలి అనేదే ఇక్కడ ప్రధానమైన విషయం. అంతేగాని, జాతి ప్రధానం కాదు. పరమార్థ జ్ఞానము పూర్వము రాజర్షులు గ్రహించే వారు అని నాల్గవ అధ్యాయంలో చెప్పాడు కూడా *(4 వ అ - 2 వ శ్లో)*.

పూర్వ శ్లోకంతో ఈ శ్లోకాన్ని సమన్వయం చేసుకొని అర్థం చేసుకుంటే, సర్వులూ సర్వేశ్వరుని దృష్టిలో సమానులే. జాతి భేదం, లింగ భేదం, గుణ భేదం, పుణ్యాపాప ఫల భేదం - ఇవన్నీ ప్రక్కన పెట్టి కేవలం భక్తి చేతనే ఆనంద మార్గంలో సాగి పోవచ్చు. భక్తి చేసే వారిలో భేదాలు లేవు అని పూర్వ శ్లోకం లోనే తెలుసుకున్నాం. కనుక, భక్తు లందరిపై పరమేశ్వరుని అనుగ్రహం సమానంగా ఉంటుంది. నువ్వు ఎక్కడ జన్మించావు? నువ్వెవరు? అని భగవంతుడు చూడడు. నువ్వు ఎలా ఉన్నావు? అనేదే చూస్తాడు. భక్తిలో ఉన్నావా, లేదా? అనేదే పరిగణిస్తాడు. భక్తులైన వారిపై సమానంగా కృప జూపి రక్షించే భగవంతుడు, భక్తి భావాన్నే చూస్తాడు. భౌతిక స్థితి గతులను కాదు.

అన్తస్థ భావ భోక్తా యతోఽ న్తరాత్మా యథా మహా మేఘః ।
ఖదిర శ్చమ్పక ఇతి వా ప్రవర్షణే కిం విచారయతి ॥

ఒక పెద్ద మేఘము వర్షించు నపుడు, అంతటా కుండపోతగా కురుస్తుందే గాని, ఇది చంద్ర చెట్టు, అది సంపెంగ చెట్టు అని చూస్తుందా? అంతరాత్మ అంతరంగము నందలి భావమును చూచి కరుణించే వాడు కనుక, భక్తు లందరిపై సమంగా ఆయన కృపను వర్షిస్తాడు.

విశ్వ వంతెన

పరమేశ్వరుని పొందడానికి భక్తి ఒక్కటే అర్హత గాని జాతి కాదని తేలి పోయింది ***(భక్త్యధికారే జాతి నియమః నాస్తి*** - ఆనందగిరి). ఇక ఆలస్య మెందుకు? భక్తియే మన కర్తవ్యం. కాళ్ళ మీద మనిషి నిలబడ వచ్చు. కాని, మనిషికి కాళ్ళు ఉండేది నడవడానికే గాని, ఒకచోట నిలబడటానికి కాదు. నడిచే సమయంలో, నడవ వలసిన కాలంలో నడక మాని నిద్రిస్తే, రేపు కళ్ళు తెరచి నడవాలి అనుకున్నప్పుడు నడవ లేని పరిస్థితి రావచ్చు. ప్రపంచము అనిత్యము. దానిలో సుఖం అల్పం. స్వల్పం. అందుకే దానిని లోకం అన్నారు. ***లోక్యతే***

ఇతి లోకః - చూడబడుతూ ఉంది కనుక ఈ ప్రపంచాన్ని లోకం అన్నారు. చూడబడేది దృశ్యం. దృశ్యం ఏదైనా అనిత్యమే. వికారమే. వినాశమే. ఈ లోకం క్షణభంగురం. మృత్యుగ్రస్తం.

నదిపై నిర్మించిన వంతెన నదిని దాటేందుకే గాని, ఇల్లు కట్టుకొని నివసించేందుకు కాదు. విశ్వము అనే వంతెన జీవన నదీ ప్రవాహాన్ని దాటేందుకే గాని స్థిరంగా పీట వేసుకొని కూర్చునేందుకు కాదు. అందరూ దాట వలసిన వారే. ఉండి పోవాలి అనుకునే వారు మోసపోతారు.

శోకమయము లోకము
అనుభవించుటే మానవ జన్మము
ఆశించడము నిరాశ చెందటము
గుండెలు పిండుతు బ్రతకటము
లోకము కాదు స్థిరవాసము
సొంతము తెలియుట శాంతము
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్

అని రామజోగి చిట్కా.

లోకము అనిత్యమే కాదు, అసుఖం కూడా ***(అనిత్యం అసుఖం లోకం)***. అసుఖ మంటే సుఖం అసలే లేదని కాదు. అల్పంగా ఉంది అని అర్థము. అందుకే 'నసుఖం' అనకుండా 'అసుఖం' అన్నాడు. అల్ప మనేది కూడా ఒక సుఖమేనా? అందుకనే ఉపనిషత్తు, ***నాల్పే సుఖమస్తి, భూమావై తత్సుఖం*** - అల్ప మైనది ఒక సుఖం కాదు. అనంత మైనదే సుఖం అన్నది. అదే పూర్ణ సుఖం. పరమాత్మ వద్ద లభించే సుఖం. విశ్వ వంతెన దాటి చేరవలసిన శాంతి తీరము.

లోకము అంటే రెండర్థాలు. చూడబడే దృశ్యమాన జగత్తు అనేది ఒక అర్థం ***(లోక్యతే ఇతి వా)***. చూపిస్తూ ఉంది కనుక లోకము అని మరొక అర్థం ***(లోకయతి ఇతి లోకః)***.

ఈ కోణం నుండి 'లోకము' అనే దానిని అర్థం చేసుకొంటే, లోకానికి ప్రపంచము అని ఒక అర్థము. దేహము అని మరొక అర్థం.

లోకము చూడబడుతూ ఉంది కనుక దృశ్యమై నశించి పోతుంది ***(లోక్యతే)*** కనుక అది అనిత్యము. కాని, అనిత్యమైన లోకము నిత్యమైన దానిని చూపిస్తూ ఉంది ***(లోకయతి)***. 'అనిత్యమైన నన్ను విడిచిపెట్టి నిత్యుడైన పరమేశ్వరుణ్ణి పొంది తరించు' అని మార్గాన్ని నిర్దేశిస్తూ ఉంది.

అలాగే 'లోక' శబ్దము దేహమునకు కూడా వర్తిస్తుంది. దేహము కూడా కనిపిస్తూ ఉంది ***(లోక్యతే)***. అలాగే అనిత్యమైన దేహము నిత్యమైన దానికి మార్గాన్ని తెలుపుతూ ఉంది ***(లోకయతి)***. 'నేను ఎలాగూ శాశ్వతం కాను. జన్మ మృత్యు జరావ్యాధులతో నిండి ఉన్నాను *(13 వ అ - 8 వ శ్లో)*. కనుక, నిన్ను ఈ జరామరణాల నుండి విడిపించే *(7 వ అ - 29 వ శ్లో)* పరమేశ్వరుని భక్తితో ఆశ్రయించి తరించు' అని చెబుతూ ఉంది. ఆ కార్యాన్నే మనం ప్రారంభిస్తే, తాను సహకరిస్తూ ఉంది కూడా.

నావ చెడక ముందే తీరాన్ని చేరే వారు ధన్యాత్ములు. దేహ మనే నావ ఎక్కడో ఒక చోట, ఏదో ఒక సమయంలో మునిగి పోయేదే. కనుక మునగకుండా క్షేమంగా జీవన నదిని దాటించే నాక భక్తి నౌక. దానిని ఆశ్రయించి తరించి పోవాలి. అందుచేతనే, అర్జునా! అనిత్యము, సుఖవర్జితము అయిన లోకాన్ని పొంది ఉన్నావు

(దేశము, దేహము కూడా). ఆలస్యానికి ఇది సమయం కాదు. లే! రేపు చేద్దాము అనుకోకు. రేపు చేసేది నేడే చేసేయ్! (**శ్వః కార్యం అద్య కుర్వీత** *(కర్తవ్యం)*).

జ్ఞానమె నీ నావ - ధన్యము నీ త్రోవ
సంసార జలధిలో మేలైన నావ ॥ జ్ఞానమె ॥
నమ్మినవారికి - చల్లని యానము
నడిచే వారికి - విలువైన నెలవైన తీరము ॥ జ్ఞానమె ॥

రేపుకు రూపు ఉంటుందో లేదో! ప్రారంభించు. భక్తిని ఆరంభించు ***(మాం భజస్వ సేవస్వ)*** అంటున్నాడు భగవంతుడు.

మరి భగవంతుని ఎలా సేవించాలి? చదవండి.

మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు ।
మా మే వైష్యసి యుక్త్వైవ మాత్మానం మత్పరాయణః ॥ 34

మన్మనా-భవ-మద్భక్తః-మద్యాజీ-మాం-నమస్కురు
మాం-ఏవ-ఏష్యసి-యుక్త్వా-ఏవం-ఆత్మానం-మత్పరాయణః

మన్మనా	=	నా యందే మనస్సు గల వాడివి	ఏవం	=	ఇట్లు
భవ	=	కా!	ఆత్మానం	=	ఆత్మను
మద్భక్తః	=	నాకు భక్తుడవు	యుక్త్వా	=	నియోగించి
మద్యాజీ	=	నన్నే పూజించు వాడవు	మత్పరాయణః	=	నా యందు మనస్సు గల వాడవై
భవ=కా!			మాం ఏవ	=	నన్నే
మాం	=	నన్నే	ఏష్యసి	=	పొందుతావు
నమస్కురు	=	నమస్కరించు			

అర్జునా! నీ మనస్సును నా యందే ఉంచు. నా భక్తుడివి గా! నన్నే పూజించు. నాకే నమస్కరించు. నేనే పరమ గతి అని భావించు. నా లోనే చిత్తాన్ని నిలుపు. చివరగా నన్నే తప్పక పొందుతావు.

వ్యాఖ్య

రాజవిద్యా - రాజగుహ్యాము అయిన తొమ్మిదవ అధ్యాయములో ఇది చివరి శ్లోకం. ఈ అధ్యాయం పీఠిక లోనే మనం సుదీర్ఘంగా చర్చించు కున్నట్లు, ఏడవ అధ్యాయమైన విజ్ఞాన యోగము ఆరంభంలో ప్రారంభమైన 'జ్ఞాన విజ్ఞాన సహిత'మైన భగవద్విషయం ఈ తొమ్మిదవ అధ్యాయము నందు ప్రస్తుత శ్లోకం వద్ద సమాప్త మవుతూ ఉంది. అర్జునుని ప్రశ్నల కారణంగా ఎనిమిదవ అధ్యాయము ఒక ప్రత్యేక విషయాన్ని ప్రస్తావించినా, ఏడవ అధ్యాయములో ప్రవాహ రూపమున సాగుతూ ఉండిన జ్ఞాన విజ్ఞాన ప్రసంగమును తొమ్మిదవ అధ్యాయారంభం లోనే తిరిగి అంది పుచ్చుకొని అధ్యాయాంతంలో సమాప్తం చేస్తున్నాడు.

ఇది మహాశ్చర్యకర మైన అధ్యాయము. **పశ్యమే 'యోగమైశ్వరమ్'** అంటూ మహేశ్వరుని ఐశ్వర్యాన్ని మహాద్భుతంగా ప్రవచించిన అధ్యాయము. మహిలో మహిమను చూపెడుతూ, మహి లోనే మాణిక్యముల వంటి మహాత్ముల్ని వెలికి తీసి కీర్తించిన అధ్యాయము. **'మయా తత మిదం' సర్వం** అంటూ మహిమాన్విత మైన స్వరూపాన్ని బుద్ధికి పట్టించిన అధ్యాయము. మర్మాన్ని బట్టబయలు చేసి మాయను తుద ముట్టించిన

అధ్యాయము. 'భంభం' అంటూ మహా ప్రతిజ్ఞా వాక్యాన్ని మిన్ను ముట్టేలా వినిపించిన అధ్యాయము. చివరగా, మహిమను, మంగళమును జోడించి మత్ శబ్దము చేత ఈశ్వరత్వ ప్రకటనంతో దివ్యంగా ముగిసిన అధ్యాయము. ***ధిగనీశార్చనం జన్మ*** - భగవంతుని అర్చించని జన్మ వ్యర్థము అన్నది శాస్త్రం.

మన్మనా భవ

అర్జునా! నా యందే మనస్సు నుంచిన వాడివి కా! ***(మయి మనః యస్య త్వం మన్మనాః భవ).*** ఏది మనకు ప్రియమో దాని వైపుకే మనస్సు ఆకర్షింప బడుతూ ఉంటుంది. ఒకరికి ప్రియ మైనది మరొకరికి ప్రియం కాక పోవచ్చు. ఎవరికి ఏది ప్రియ వస్తువో దాని వైపే మనస్సును సారిస్తూ ఉంటారు. కాని, ఏదో ఒక సమయంలో, లేదా తరచుగానో అందరూ వారి వారి మనస్సుల్ని భగవంతుని వైపుకు కూడా త్రిప్పుతూ ఉంటారు.

భగవంతుని ఆశ్రయించే వాళ్ళందరూ భక్తులే. కాకపోతే, వాళ్ళు ఎందుకు ఆశ్రయిస్తున్నారు? అనేదే ప్రశ్న. భగవంతుని ఆశ్రయించుకొనే భక్తులు రెండు రకాలుగా ఉంటారు. మొదటి వారు అర్థకామాలను సాధించు కొనేందుకు ఆశ్రయించే వారు. ప్రాపంచికంగా వారు ఆశించేది పొందడానికి వారి శక్తి సరిపోనపుడు, నిస్సహాయులుగా మిగిలి నపుడు, మరొకరు సహకరించే అవకాశం లేనపుడు, ఆ కోర్కెలను ఫలప్రదం చేసుకోవడానికి పరమేశ్వరుని ఆశ్రయిస్తారు. ఇలాంటి వారు నిత్య భక్తులు కారు. కాని, పరమేశ్వరుని ఆశ్రయిస్తూ ఉన్నారు కనుక వారూ భక్తులే. వారి భక్తి అవసరాలు తీరే వరకే ఉంటుంది. వాళ్ళు మళ్ళీ భక్తి చేయాలి అంటే వాళ్ళకు మళ్ళీ అవసరాలు రావాలి.

రెండవ వారు నిత్య భక్తులు. వారికి అర్థకామాల స్పృహే ఉండదు. వాళ్ళు భగవంతుణ్ణి మరొక దాని కొరకు కాకుండా భగవంతుని కొరకే ఆశ్రయిస్తారు. మోక్షార్థమే భక్తి చేస్తారు. ***మనో మోక్షే నివేశయేత్*** - వారి మనస్సు మోక్షమునే లక్ష్యంగా కలిగి ఉంటుంది అని స్మృతి వాక్యము. నిత్య భక్తులు ఎవరిని ఆరాధించినా ఈశ్వర భావనే కలిగి ఉంటారు. ***తదేవాగ్నిః తద్వాయుః తత్సూర్యః తదు చంద్రమాః*** - సర్వ దేవాత్మకు డైన పరమేశ్వరునే సర్వ దేవతల లోను దర్శిస్తారు. ప్రస్తుతం ***మన్మనా భవ!*** అని భగవంతుడు ఆదేశించడంలో నిత్యభక్తితో పరమేశ్వరునే ఆశించి భక్తి చేయాలని అర్థము.

మద్భక్తో భవ

మనస్సును పరమేశ్వరుని యందు ఉంచినట్లే, మనస్సు లోని ప్రేమను కూడా పరమేశ్వరుని వైపే సాగించాలి. **సా త్వస్మిన్ పరమ ప్రేమరూపా** - భగవంతుని యందు ఉత్కృష్ట మైన ప్రేమను కలిగి ఉండటమే భక్తి. అనిత్యాలను ప్రేమించడం కాకుండా, నిత్యుడైన పరమేశ్వరునే ప్రేమించాలి. అదే భగవద్భక్తి. భక్తి ఉంటే చాలు. పూర్వ శ్లోకాలలో మనం చెప్పుకున్నట్లు జాతి భేదాలు, గుణ భేదాలు, లింగ భేదాలు లేకుండా కేవలం భక్తి తోనే భగవంతుని చేరి పోవచ్చు. కనుకనే భక్తి ఉత్కృష్ట మైంది.

రైలులో ప్రయాణం చేసి గమ్యం చేరాలంటే టిక్కెట్టు ఉండాలి. మరో అర్హత అవసరం లేదు. ధనికు డైనా, దరిద్రుడైనా, స్త్రీ అయినా, పురుషుడైనా, ఆరోగ్యం ఉన్నా, లేకపోయినా, దొంగ అయినా, దొర అయినా - ప్రయాణం చేయడానికి టిక్కెట్టు ఒక్కటే ప్రధానం. మరేవీ కావు. అలాగే, ముక్తిని పొందడానికి భక్తియే అర్హత గాని మరొకటి కాదు. అందుచేత ***మద్భక్తో భవ*** - అర్జునా, నా భక్తుడివి కా! అంటున్నాడు.

మద్యాజీ భవ

భగవంతుని పూజించడమే యజనము. భగవత్పూజ యందు అనురాగమును కలిగి ఉండటమే

యజనము. అది కూడా భక్తి కార్యమే ***(పూజాదిషు అనురాగః).*** పూజాగదిలో పరమేశ్వరుని ఆరాధించడం బహిరంగ సాధన. అంతరంగ సాధన అయితే, నిత్యము వ్యవహారాది కార్యాలలో ధర్మబద్ధంగా జీవించడము బహిరంగ సాధన. ఈ విధమైన సాధనల ద్వారా కనుకనే, సదా నన్ను పూజిస్తూ జీవించు అంటున్నాడు ***(మద్యజన శీలః భవ).*** ఈ విధమైన సాధనల ద్వారా భగవంతునితో ఏర్పడే నిత్య సంబంధం ఫలితంగా ***అహం***ను తొలగించుకొని ***త్వం*** ఒక్కటే ఉందని గ్రహించి, ***త్వమేవ ప్రత్యక్షం మమ దేవ దేవ*** - అంటూ సమస్తములో సర్వేశ్వరుని దర్శించి తన్మయం కావడమే నమస్కారము.

మాం నమస్కురు భవ

నాకే నమస్కరిస్తూ సాగిపో! అంటున్నాడు చివరగా ***(మాం మా మేవ నమస్కురు).*** ఇది వందన భక్తి. ***అహం*** ***త్వం*** తో ఏకం కావడమే నమస్కారము. ***త్వం తత్***‌తో ఏకం కావడమే నమస్కారము. ద్వైతము అద్వైతంగా శోభించడమే నమస్కారము. రెండిటిని ఏకం చేయడమే నమస్కార వైశిష్ట్యము. అదే రెండు చేతులను ఒకటి చేయడం లోని అంతర్భావం. నది సాగరంలో విలీన మైనట్లు, సాధకుడు సాధ్యములో విలీనమై సిద్ధ స్వరూపంగా భాసించడమే నమస్కారము.

పరమేశ్వరా! నీకు నమస్కరిస్తూ సాగిపోయే నా బ్రతుకు ఎప్పుడూ దారి తప్పదు. ఎక్కడా ఆగిపోదు. నిరంతరం సాగుతూనే ఉంటుంది. నిన్నే దర్శిస్తూ సాగిపోతూ ఉంటుంది. నడిచే శక్తి నీదే. నడిపే శక్తి నీదే. కదిలింది నీ లోనే. కడకు చేరేది నిన్నే. మధ్యలో నా దేముంది? ***నమః*** - నమస్కారము. ***మ*** నాది ***న*** లేదు. ఇదే నమస్కారము.

నేను లేను. అతడు లేడు. ఆమె లేదు. అలా చూస్తే ఎవ్వరూ లేరు. అందరిలో నీవే ఉన్నావు. అందరిలో దివ్యంగా శోభించే ఆత్మవు నీవే ***(సర్వేషాం భూతానామ్ ఆత్మా, పరా చ గతిః).*** నీవే పరమగతివి. పరాయణుడవు.

పరాయణుడు

జీవులకు ఉత్తమ మైన గమ్యము పరమేశ్వరుడే కావడం చేత ఆయన పరాయణుడు ***(పరమ్ అయనమ్ పరాయణమ్). పరం*** అంటే ఉత్కృష్ట మైన స్థానము. సర్వులు చివరగా పొంద వలసిన పరమ గమ్యము. ప్రపంచంలో ఎన్నో గమ్యా లున్నాయి. వాటికి సంబంధించిన గమనాలూ ఉన్నాయి. ఇది అలాంటి గమ్యము కాదు. దేనిని చేరిన తరువాత తిరిగి రావడ మంటూ ఉండదో అట్టి పరంధామ మిది ***(యద్గత్వా న నివర్తన్తే*** - *15వ అ - 6 వ శ్లో*). అది పరంధామము. పరమేశ్వరుని ధామము. జీవు లందరికి గమ్య స్థానము తానై నందున పరమేశ్వరుడు పరాయణుడు.

పవిత్రమైన భక్తి సాధనను అద్భుతంగా వర్ణించిన ఈ చివరి శ్లోకమును చక్కగా అర్థం చేసుకుంటే, అసమానమైన ఈ అపూర్వ సేవనము సాధకుని బ్రతుకును భక్తిమయంగా మార్చేస్తుంది. భగవన్మయంగా తీర్చి దిద్దుతుంది. ఈ దివ్యారాధనలో మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము - అన్నీ పూజోపకరణాలుగా మారి పోతాయి. అదే ఈ శ్లోకం లోని వైశిష్ట్యము.

విలిఖిత మివ రూపం చిత్త భిత్తౌ మురారేః సుమన ఇవ మనో యై రర్పితం తత్పదబ్జే।
ప్రతిపద ముదయద్భిః సాత్త్వికై రఙ్కితా ఙ్గాస్త ఇహ భవ పయోధేః పారముల్లఙ్ఘయన్తి॥

పవిత్రులైన భక్తులు ధన్యజీవులు. వారి చిత్తము అనే గోడ మీద (భిత్తిక) మనోహరమైన మురళీకృష్ణుని రూపము చిత్రము వలె లిఖింపబడి ఉంటుంది. ఆ దివ్య రూపము యొక్క పాదారవిందముల చెంత మృదు

మధుర భావ పరిమళాలను వెదజల్లే మనస్సనే పుష్పము సమర్పింపబడి ఉంటుంది. ప్రతిక్షణము అట్టి ఆత్మానంద పారవశ్యంలో మునిగి తన్మయులై ఉన్న ఆ భక్తులలో కలిగే భక్తి భావ స్ఫోరకము లైన గద్గద స్వరం, రోమాంచ, ఆనంద బాష్ప విశేషముల చేత వారి దేహము అలంకరింపబడి ఉంటుంది. అట్టి మహాత్ములైన భక్తులు సంసార సాగరాన్ని దాటి ముక్తు లవుతారు. సర్వ జీవుల ఏకైక గమ్యమైన ఆ పరంధాముని పొంది తరిస్తారు అని అర్థము.

ఏడవ అధ్యాయం - విజ్ఞాన యోగంలో విజ్ఞాన సహితమైన జ్ఞాన ప్రసంగమును ప్రారంభిస్తూ, మొదటి శ్లోకం లోనే, ***యోగం యుంజన్ మదాశ్రయః*** - నన్నే ఆశ్రయించుకొని యోగ సాధనను ఆచరించ మని చెప్పాడు ***(యోగం యుంజన్ మనః సమాధానం కుర్వన్, మదాశ్రయః అహమేవ పరమేశ్వరః ఆశ్రయః).*** అక్కడ ప్రారంభించిన జ్ఞాన విజ్ఞాన ప్రబోధాన్ని తొమ్మిదవ అధ్యాయాంతంలో, ప్రస్తుతం మనం అధ్యయనం చేస్తున్న శ్లోకం వద్ద సమాప్తం చేస్తూ, ***యుక్త్వైవం*** - ఈ విధంగా నా యందే మనస్సును నిలిపి ***(ఏవం యుక్త్వా)*** ఆత్మ నైన నన్నే పొందుతావు ***(ఆత్మానమ్ మామేవ ఏష్యసి)*** అని సమాప్తం చేశాడు. ఏడవ అధ్యాయం మొదటి శ్లోకంలో మనల్ని సాధనలో కదిలించాడు. తొమ్మిదవ అధ్యాయం చివరి శ్లోకంలో, ఇంతదూరం ప్రయాణించి వచ్చిన మనల్ని సాధ్యరూపుడైన తనలో కలుపు కున్నాడు. అక్కడ అధ్యాయారంభంలో మన సాధన ప్రారంభం. ఇక్కడ అధ్యాయ సమాప్తంలో మన యాత్ర పరిసమాప్తం. ఇది కూడా రాజవిద్యలో రాజగుహ్యమే. ఎన్నిసార్లు చదివినా, ఎన్నిసార్లు ప్రవచించినా, నిత్య నూతనంగా భావసుమాలను విరబూయించి నవత్వంతో శోభించే నవమాధ్యాయము.

శ్లో॥ ***నిజమాశ్చర్య మైశ్వర్యం భక్తే శ్చాద్భుత వైభవమ్।***
నవమే రాజ గుహ్యాఖ్యే కృపయాఽవో చ దచ్యుతః॥


అద్భుతమైన ఈశ్వర స్వరూప వైభవమును, ఆశ్చర్యకర మైన భక్తి ప్రాభవమును రాజగుహ్యా మనే పేరుతో శోభించే ఈ తొమ్మిదవ అధ్యాయంలో భక్తులకు అనుగ్రహ ప్రసాదంగా అచ్యుతుడు పంచి పెట్టాడు.

అధ్యాయము ఎంత అద్భుతమో, అధ్యాయం లోని విషయము అంత అసమానము. ఇక చివరి శ్లోకం అంటారా! అది ముకుందునికే ముద్దొచ్చే శ్లోకం. లేకపోతే ఒకే శ్లోకాన్ని గీతలో రెండుసార్లు చెబుతాడా? ఏ శ్లోకాన్ని గీత పూర్వార్థం, అంటే తొమ్మిది అధ్యాయాలు సమాప్త మయ్యే సమయంలో బోధించాడో, అదే శ్లోకాన్ని ఉత్తరార్థము చివర, అంటే గీతను సమాప్తం చేస్తూ మళ్ళీ పఠించాడు *(18 వ అ - 65 వ శ్లో).* రెండుసార్లు గీతలో వినపడిన శ్లోకం ఇదొక్కటే. గోవిందుని అనుగ్రహంతో గుహ్యమైన ఈ రాజవిద్య భక్తజనముల హృదయాలలో స్థిరంగా నిలిచి పోవు గాక!

ఓం నమో భగవతే వాసుదేవాయ

ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం
యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే రాజవిద్యా రాజగుహ్య యోగో నామ నవమోఽధ్యాయః

ఈ విధంగా ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రము, శ్రీకృష్ణార్జున సంవాదము అయిన భగవద్గీత యందు రాజవిద్యా రాజగుహ్య యోగ మనే తొమ్మిదవ అధ్యాయము.



చైతన్య భగవద్గీత

అథ దశమో౽ ధ్యాయః - పదవ అధ్యాయము

విభూతి యోగః - విభూతి యోగము

యోగ విభూతియే

విభూతి యోగము

భూతిః అంటే అగుట ***(భవనం)***, లేదా ఉనికి ***(సత్తా)*** అని ఒక అర్థము. ఈ అర్థమును అనుసరిస్తే ***విభూతిః*** అంటే, విశిష్టమైన ఉనికి గలది అని అర్థము ***(విశేషేణ భవతీతి విభూతిః)***.

భూతిః అంటే ఐశ్వర్యము అని మరొక అర్థము. ఈ అర్థాన్ని అనుసరించి చూస్తే సర్వ ఐశ్వర్యములకు కారణమైన ఐశ్వర్యము, అంటే విశేషమైన ఐశ్వర్యము ***విభూతిః (సమస్త విభూతీనాం కారణత్వా ద్వా భూతిః విభూతిః)***. సత్తాత్మక మైనది ***భూతి*** కాగా, అది వివిధ రూపాలలో దివ్యంగా భాసించడము ***విభూతి***. ఇదే విశేషమైన ఉనికి.

ఏడవ అధ్యాయం ఏడవ శ్లోకంలో, 'అర్జునా! నా కంటే శ్రేష్ఠమైన వస్తువు మరొకటి లేనే లేదు' అని తన సత్తా స్వరూపాన్ని వర్ణించి చెప్పాడు భగవంతుడు ***(మత్తః పరతరం నాన్యత్ కించి దస్తి ధనంజయ - 7 - 7)***. ఆ వెంటనే ఎనిమిదవ శ్లోకము నుండి 'అర్జునా! నీళ్ళ యందు రసాన్ని నేనే' ***(రసో౽ హమప్సు కౌన్తేయ)*** అంటూ వరుసగా నాలుగు శ్లోకాలలో పద్నాలుగు విభూతులను వివరించాడు. సత్తా మాత్రంగా శోభించే అద్వయ స్వరూపము భూతి. ఆ భూతి వివిధ రూపాలుగా శోభించడము విభూతి. ఒకటి అవ్యక్తం. రెండవది వ్యక్తం. భూతి అవ్యక్తం. విభూతి వ్యక్తం.

తొమ్మిదవ అధ్యాయంలో 'అర్జునా! అవ్యక్త రూపుడ నైన నా చేత ఈ జగత్తు సర్వము వ్యాప్తమై ఉంది' అని తన సత్తా స్వరూపాన్ని నాల్గవ శ్లోకంలో వర్ణించిన భగవంతుడు ***(మయాతత మిదం సర్వం జగదవ్యక్త మూర్తినా)***, ఆ తరువాత పదహారవ శ్లోకము నుండి, 'అర్జునా! నేనే క్రతువును, నేనే యజ్ఞమును' ***(అహం క్రతుః అహం యజ్ఞః)*** అంటూ అక్కడ కూడా వరుసగా నాలుగు శ్లోకాలలో ఇరవై ఎనిమిది విభూతులను వివరించాడు. సర్వ వ్యాపకమైన చైతన్యము భూతి. ఆ చైతన్యమే వివిధ రూపాలలో గోచరించడం విభూతి. ఒకటి అవ్యక్తం. మరొకటి వ్యక్తం. భూతి అవ్యక్తం ***(జగదవ్యక్త మూర్తినా)***. విభూతి వ్యక్తం.

అటు ఏడవ అధ్యాయం లోను, ఇటు తొమ్మిదవ అధ్యాయం లోను జ్ఞాన విజ్ఞాన ప్రసంగమే ప్రధాన మైన విషయంగా ఉండినా, అవాంతర ప్రసంగంగా రెండు అధ్యాయాల లోను విభూతి ప్రస్తావన తెచ్చి ప్రవచించడం జరిగింది. కనుక భగవంతుని తత్త్వము ***(భగవతః తత్త్వం భూతిః సత్తా)***. అలాగే ఈశ్వర విభూతులు ***(విభూతయః)*** ఏడు, తొమ్మిది - ఈ రెండు అధ్యాయాల లోనూ ప్రకాశించాయి ***(ప్రకాశితాః)***. ఈ విధంగా అటు భగవంతుని ఉనికిని ***(సత్తా)***. ఇటు భగవంతుని వైభవమును ***(ఐశ్వర్యం)*** రెండు అధ్యాయాల లోనూ ప్రవచించినా, దానిని గ్రహించడం కష్టంగా ఉన్నందున ***(దుర్విజ్ఞేయత్వాత్)*** మళ్ళీ ఇప్పుడు, ఒక అధ్యాయాన్నే ప్రత్యేకంగా అందుకొరకు కేటాయించి బోధించవలసి వచ్చింది. అదే విభూతి యోగము.

విభూతి యోగము అనేది ఒక పదంగా కనిపిస్తున్నా, అందులో 'విభూతి', 'యోగము' అనే రెండు పదాలు విడివిడిగా ఉన్నాయి.

'యోగః' అంటే భగవంతుడు అని కూడా ఒక అర్థము. ***యోగేన సాధ్యః అవాప్యః యోగః*** - యోగము చేత పొందబడే వాడు కనుక భగవంతుడు 'యోగః' నామధేయుడు. 'విభూతిః' అంటే ఐశ్వర్యము. కనుక ఇది 'యోగ విభూతి'. అంటే, భగవంతుని యొక్క ఐశ్వర్యము. అర్జునా! ***పశ్యమే యోగ మైశ్వరమ్*** - నా భగవదైశ్వర్యమును చూడు అని తొమ్మిదవ అధ్యాయం ఐదవ శ్లోకంలో అర్జునుణ్ణి చూడమన్నాడు. ప్రస్తుతం ఈ అధ్యాయంలో తానే చూపిస్తున్నాడు. కనుక యోగ విభూతియే విభూతి యోగం.

వ్యక్తా వ్యక్తములు

అవ్యక్త మూర్తి నైన నా చేత ఈ ప్రపంచం వ్యాప్తమై ఉంది *(9 వ అ - 4 వ శ్లో)* అన్నాడు భగవంతుడు. భగవంతుడు అవ్యక్త స్వరూపుడు. విశ్వము ఆయన వ్యక్త రూపము. ***పాదోఽ స్య విశ్వాభూతాని త్రిపాద స్యామృతం దివి*** - ఈ విశ్వమంతా భగవంతుని ఒక్క పాదమే. మూడు పాదాలు విశ్వాతీతంగా ఉన్నాయి అన్నది వేదం. అర్జునా! ఈ విశ్వాన్నంతటిని నేను ఒక్క అంశము చేతనే వ్యాపించి ఉన్నాను అని ప్రస్తుతం మనం అధ్యయనం చేస్తున్న ఈ విభూతి యోగం లోని చివరి శ్లోకంలో చెబుతాడు. కనుక అవ్యక్తమైన సత్తా స్వరూపము తానే. వ్యక్తమైన జగదైశ్వర్యమూ తానే.

అవ్యక్తమూ తానే. వ్యక్తమూ తానే. వ్యక్తమునకు అవ్యక్తమే ఆధారము. అవ్యక్తము నుండే వ్యక్తం ఆవిర్భవించింది. వ్యక్తానికి పుట్టుక స్థానము పరమేశ్వరుడే. అవ్యక్తమే. అదే ఉత్పత్తి స్థానము. ***అహం సర్వస్య ప్రభవః*** - ఈ సమస్త విశ్వానికి పుట్టుక స్థానము నేనే అని చెప్పిన భగవానుడు, ***మత్తః సర్వం ప్రవర్తతే*** - నా వల్లనే ఈ సమస్త జగత్తు నడుస్తూ ఉంది అంటూ, సృష్టి స్థితులు తన వల్లనే జరుగు తున్నాయని విభూతి యోగం, ఎనిమిదవ శ్లోకంలో చెబుతాడు.

సమస్తానికి పరమేశ్వరుడే కారణం అని తెలిసినా, కార్య రూపంలో వ్యక్తమైన ప్రపంచము పరమేశ్వరుని వల్లనే నడుస్తూ ఉంది అనే భావన స్థిరపడాలి. వ్యక్తమయ్యే ప్రతి రూపము పరమేశ్వరుని స్వరూపంగా బుద్ధికి అందాలి. ఇదే భగవద్భావన. బుద్ధిలో ఇట్టి ఈశ్వర భావన స్థిరపడిన వారు బుధులు. అంటే, పరమార్థ తత్త్వమును క్షుణ్ణంగా అర్థం చేసుకున్న వారు ***(అవగత పరమార్థ తత్త్వాః).*** అట్టి వారే పరమేశ్వరుని భావన యొక్క అభినివేశంతో విభూతి సుందరుని సేవించ గలుగుతారు ***(పరమార్థ తత్త్వాభినివేశః, తేన సమన్వితాః బుధాః మాం సేవన్తే).*** సమస్త జగత్తును భగవ ద్విభూతిగా దర్శించి సేవిస్తారు.

విభూతి దర్శనం

విశ్వమంతా విశ్వనాథుని విభూతే అయినా, పరిపక్వత చెందని సాధకుని మనస్సు సమస్తాన్ని భగవ ద్విభూతిగా దర్శించ లేదు. నీళ్ళు భగవ త్స్వరూపము. లేకపోతే, అవి ప్రాణాధార మెలా అవుతాయి? అన్ని నదులలో నీళ్ళు ఉంటాయి. కాని గంగానది మనస్సులో మెదలగానే భావస్పందన కలుగుతుంది. యమున యెదలో కదలగానే ప్రేమ స్ఫురిస్తుంది. అన్ని నదులలో నీళ్ళే ఉంటాయి. అలాగని, ప్రత్యేకతలను, విశేషాలను నిరాకరించ లేము. ప్రారంభ దశలో నికృష్టాల కన్నా ఉత్కృష్టాలే ధ్యానావేశాన్ని కలిగిస్తాయి.

బుద్ధిలో భావాలు కదుల్తాయి. ఏ భావాని కైనా చైతన్యమే ఆధారము. భావంలో ఉన్నది కూడా చైతన్యమే. కొన్ని భావాలు సాత్త్వికంగా ఉంటాయి. కొన్ని రాజసంతో, కొన్ని తామసంతో ఉంటాయి. భావాలన్నీ చైతన్యం నుండే కలుగుతాయి. కాని, ధ్యానయోగికి సాత్త్విక భావాలు ఉపయుక్త మవుతాయే గాని, రాజసిక తామసిక భావాలు కాదు కదా! ప్రారంభ సాధకుని ఉత్కృష్టాలు ఉత్తేజ పరచినట్లు, నికృష్టాలు ఉత్తేజ పరచ లేవు.

సర్వము సర్వేశ్వరుడే అయినా
కృష్ణుడు దైవము - కంసుడు అగునా!
ఉన్నతాలలో ప్రథమోపాసన
ప్రగతికి సుగతికి ఆధారము
విశిష్ట మైనది ఈశ్వర మహిమ
విభూతి సుందరుని వైభవము
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్

అని రామజోగి చిట్కా.

ఉత్కృష్ట మైన విభూతులనే భగవానుడు దివ్యమైన విభూతులు అంటున్నాడు. ఏడు, తొమ్మిది అధ్యాయాలలో కొన్ని విభూతులను చెప్పినా, ఎనిమిదవ అధ్యాయంలో మృత్యు విభూతిని ప్రత్యేకంగా ప్రవచించినా, కేవలం ధ్యాన నిమిత్తం దివ్యమైన తన విభూతులను ఈ పదవ అధ్యాయం లోనే అద్భుతంగా ప్రవచిస్తున్నాడు. ***హంత తే కథయిష్యామి దివ్యాహ్యాత్మ విభూతయః*** అర్జునా! దివ్యము లైన నా విభూతులను నీ కొరకు చెబుతున్నాను అంటూ ప్రారంభిస్తాడు. అది కూడా ప్రాధాన్యమును దృష్టిలో ఉంచుకొని **(ప్రాధాన్యతః)** చెబుతాడు. ప్రాధాన్యత లెందుకు అంటారా? తన విభూతి విస్తారానికి అంతము లేదు కనుక, అని కూడా తానే చెబుతాడు ***(నాస్త్యంతో విస్తరస్య మే).***

విభూతి దర్శనం - భావనా ప్రాధాన్యం

మార్గంలో నడిచే టప్పుడు మన పాదం క్రింద ఒక దినపత్రిక కాగితం పడింది అని తెలిసినా, అలాగే నడచి ముందుకు వెళ్ళిపోతాం. కాని, అదే ఒక రూపాయి కాగితం పడితే? ఆగి, దానిని తీసికొని కళ్ళ కద్దుకుంటాం. రెండూ కాగితాలే కదా! అంతర మంతా భావం లోనే ఉంది.

పొరపాటున ఏదైనా పుస్తకం మీద పాదం పడితే, వెంటనే చలించి పోతూ, వంగి పుస్తకాన్ని అందుకొని కళ్ళ కద్దుకుంటాం. పుస్తకంలో ఉన్న వన్నీ కూడా కాగితాలే. భావన లోనే ఉంది భాగ్యమంతా! రూపాయి కాగితంలో లక్ష్మిని చూస్తాం. పుస్తకంలో సరస్వతిని దర్శిస్తాం. అన్నీ కాగితాలే. వాటిలో కొన్ని మాత్రం దివ్యములు. ధ్యాన యోగ్యములు. అవే భగవ ద్విభూతులు.

తండ్రి కుమార్తెకు వివాహం చేస్తూ, ఈ ధనం అమ్మాయి పేరిట బ్యాంకులో వేస్తున్నాను. ఈ పొలం అమ్మాయి పేరున వ్రాస్తున్నాను. ఇది అమ్మాయి పసుపు కుంకుమ నిమిత్తం అంటాడు.

తండ్రి ఇచ్చిన లక్షల ఆస్తిని వెచ్చించి పసుపు కుంకుమ కొనుక్కోమని తండ్రి ఉద్దేశ్యం కాదు. కాని, ఆ మాటలలో ఎంత పవిత్రమైన భావముందో మనందరికీ విదితమే. దివ్య మైనది ఏదైనా వస్తు ప్రధానంగా ఉండదు. భావ ప్రధానం గానే ఉంటుంది.

ఆకులు ఎన్నైనా ఉండవచ్చు. తులసి పవిత్రత తులసిదే. అందుకని తులసి దళాన్ని నేరుగా ముక్కు దగ్గరకు ఎవ్వరూ చేర్చుకోరు. ముందుగా కళ్ళ కద్దుకొని, తరువాతే వాసన అయినా, రుచి అయినా. అందుకే తులసి భగవ ద్విభూతి.

కాయ లెన్నైనా ఉండొచ్చు. కాని పూజకు పనికి వచ్చేది కొబ్బరికాయ మాత్రమే. పైన కఠినంగా ఉండి, లోపల మృదువుగా ఉంటుంది. బాహ్య వ్యవహారాలలో ధర్మ నిర్వహణలో కఠినంగా ఉండాలి. ఆంతర్యంలో

భక్తి ప్రేమలు మృదువుగా, మధురంగా, స్నిగ్ధంగా ఉండాలి అని యోగ జ్ఞానాలను సమరసం చేస్తూ బోధిస్తుంది నారికేళం. ఇదంతా భావనే. అందుకే అవన్నీ విభూతులు. ధ్యానయుతాలు. కనుకనే, కర్తవ్య ప్రేమలను ఒడి కట్టుకొని వధువు కొబ్బరికాయ దోసిలిలో పెట్టుకొని అత్తగారింటిలో అడుగు పెడుతుంది.

తొమ్మిది, పది, పదకొండు అధ్యాయాలు పరమేశ్వరుని మన కళ్ళ ముందే కదులు తున్నట్లు చూపిస్తాయి. పూర్వ అధ్యాయాల కన్నా పరమేశ్వరునితో మన సాన్నిహిత్యం ఇక్కడ ప్రత్యక్షంగా ఉంటుంది. భగవద్దర్శనం భవిష్యత్తులో జరిగేది కాదని, నిత్యం జరుగుతూనే ఉంది అనే భావన మనలో దృఢంగా ఏర్పడుతుంది. భావశుద్ధి ఉంటే, ఈశ్వరుడు, ఈశ్వర విభూతి రెండు కావు అనే సత్యం హృదయంలో ఆవిష్కృత మౌతుంది. వ్యక్తావ్యక్తాలు దోబూచు లాడుతూ నేత్రాలకు సర్వమంగళ దర్శనాన్ని ప్రసాదిస్తూ, హృదయాన్ని సర్వేశ్వరానుభూతిలో పరవశింప చేస్తాయి. విభూతి దర్శన మనేది అలౌకిక మైన, అద్భుతమైన అమృతానుభూతి.

పయసా కమలం కమలేన పయః పయసా కమలేన విభాతి సరః ॥

జలం కమలానికి ఉనికి నిచ్చి శోభ నిస్తుంది. కమలాల శోభతో జలం రమ్యంగా అలరారుతుంది. జల కమలాల సౌందర్యంతో సరోవరం కళకళ లాడుతుంది.

అవ్యక్తం విభూతుల్ని ఆరబోస్తుంది. వ్యక్తమైన విభూతులు అవ్యక్త వైభవాన్ని దర్శింప చేస్తూ ఉంటాయి. ఈ వ్యక్తావ్యక్తాల సౌందర్యంతో యావద్విశ్వము పరమేశ్వర చైతన్యంతో కళకళ లాడుతుంది.

ఆదిదేవుని ఉనికి వల్ల ఆలయం అద్భుతంగా రూపు దిద్దుకుంటుంది. కళాత్మకమైన ఆలయం తనలో పరమేశ్వరుని దర్శింప చేస్తూ ఉంటుంది. పరమ పవిత్రమైన దేవ దేవాలయాల సన్నిధిలో మన దేవతార్చన దివ్యంగా సాగుతుంది.

ఆత్మ యొక్క సత్తా స్ఫూర్తుల చేత మన దేహేంద్రియ మనోబుద్ధులు చేతన మవుతాయి. చేతన మైన ఈ కార్యకారణ సంఘాతము *ఆత్మవా అరె ద్రష్టవ్యః* - 'ఆత్మయే దర్శింప దగినది' అని సూచిస్తూ ఉంటుంది. ఇది అర్థమైన సాధకునికి దేహమే దేవాలయంగా, జీవుడే దేవుడుగా అనుభవానికి అందుతుంది. సోహం భావం ఏర్పడుతుంది. ఇదంతా యోగ విభూతి. విభూతి యోగము. ఇక ఇప్పుడు, *(అథ ఇదానీం)* ఏయే ఉత్కృష్ట మైన విషయాలలో, వస్తువులలో, విభూతులలో భగవానుని మనం ధ్యానించాలో *(యేషు యేషు భావేషు చిన్త్యః భగవాన్)* ఆయా భావాలను, విభూతులను చెప్పవలసి ఉంది *(తే తే భావాః వక్తవ్యాః).* అదే చెబుతున్నాడు. అడగకుండానే బిడ్డకు అమ్మ బువ్వ పెట్టినట్లు, భక్తునికి అమ్మానాన్నలు తానే అయిన భగవానుడు, అడగకుండానే భావ వితరణ చేసేందుకు బోధను ప్రారంభిస్తున్నాడు.

శ్రీ భగవానువాచ :

భూయ ఏవ మహాబాహో శృణు మే పరమం వచః ।
యత్తేఽహం ప్రీయమాణాయ వక్ష్యామి హితకామ్యయా ॥ 1

భూయః-ఏవ-మహాబాహో-శృణు-మే-పరమం-వచః
యత్-తే-అహం-ప్రీయమాణాయ-వక్ష్యామి-హితకామ్యయా

మహాబాహో	= అర్జునా!	హితకామ్యయా	= శ్రేయస్సు కోరి
ప్రీయమాణాయ	= ప్రీతి చెందుతున్న	అహం	= నేను
తే	= నీ కొరకు	యత్	= ఏ

వచః	= వాక్యమును	పరమం	= ఉత్తమమైన
భూయః ఏవ	= మరల	మే	= నా యొక్క
వక్ష్యామి	= చెబుతున్నానో	వచః	= మాటను
తత్	= ఆ	శృణు	= విను

శ్రీ భగవానుడు చెబుతున్నాడు :

అర్జునా! మహాబాహో! శ్రేష్ఠమైన నా మాటను తృప్తి చెందుతూ వింటున్నావు. నీ శ్రేయస్సు కోరి మళ్ళీ చెబుతున్నా! విను.

వ్యాఖ్య

పునరుక్తి

ప్రథమ అధ్యాయ షట్కము 'త్వం' పద స్వరూపమును వర్ణించింది. ఏడవ అధ్యాయం నుండి 'తత్' పదము, అంటే పరమేశ్వరునికి సంబంధించిన 'తత్త్వం' విస్పష్టం చేయబడుతూ ఉంది. ఏడు, ఎనిమిది, తొమ్మిది అధ్యాయాలలో భగవంతుని నిరుపాధిక తత్త్వమును, సోపాధిక స్వరూపమును వివరించడం జరిగింది. నిరుపాధికము జ్ఞానమును విశదం చేస్తూ ఉంటే, సోపాధికము ధ్యానమును వివరిస్తూ సాగింది. ఈ రెండిటికి, అంటే జ్ఞానధ్యానాలకు సాధనోపాయాలుగా విభూతులు కూడా చెప్పబడ్డాయి. ఇవన్నీ జ్ఞాన ప్రసాదాలే కనుక బంధ విముక్తిని కలిగించి హితమును చేకూరుస్తాయి.

తెలియ దగిన విషయం పరమ సూక్ష్మము. అందువల్ల తెలుసుకోవడం చాలా కష్టతరం **(దుర్విజ్ఞేయం).** కనుక అది పదే పదే చెప్పవలసిన విషయంగా ఉంది. అదే పనిగా విన దగిన విషయంగా కూడా ఉంది. విషయ మేమో పారమార్థికం. ఇక ప్రయోజన మంటారా! పరమార్థ సిద్ధిప్రదం. కనుకనే, మళ్ళీ మళ్ళీ చెబుతున్నాను అంటూ, **భూయః** అనే పదంతో విభూతి యోగాన్ని ప్రవచించడం ప్రారంభించాడు గీతాచార్యుడు. **భూయః** అంటే మళ్ళీ అని అర్థం ***(భూయః ఏవ పునః).***

మళ్ళీ చెబుతున్నాను అంటే పూర్వం చెప్పిన విషయాన్నే చెబుతున్నాడు అని అర్థం. అంటే, ఏడు, ఎనిమిది, తొమ్మిది అధ్యాయాలలో ప్రసంగించిన విషయాన్నే మళ్ళీ చెబుతున్నాడు అని భావం. పూర్వాధ్యాయ త్రయంలో భగవత్తత్త్వము, భగవద్విభూతులు - రెండూ చెప్పబడ్డాయి. వాటినే ఈ అధ్యాయంలో విస్తరించి చెప్పడం జరుగుతూ ఉంది *(భూయః).* ఆనందించ దగిన విషయ మయితే అనేక సార్లు విన నవసరం లేదు. అర్థం చేసుకోవలసిన విషయం అయినప్పుడే ఎన్నిసార్లు అయినా వినాలి. అర్థమయ్యే వరకు చెప్పేవాడు మళ్ళీ మళ్ళీ చెబుతూ ఉండాలి. వినే వాళ్ళు మళ్ళీ మళ్ళీ వింటూ ఉండాలి. కథను రెండు సార్లు చెప్ప నవసరం లేదు. తత్త్వము ఒక్కసారి చెబితే సరిపోదు. కనుక, వేదాంత విషయము నందు పునరుక్తి దోషం లేదు.

శ్రేష్ఠ వాక్యం

'అర్జునా! శ్రేష్ఠమైన నా మాటను విను' ***(శృణు మే పరమం వచః)*** అంటున్నాడు భగవంతుడు. అవే పరమ వాక్కులు. పరమాత్మకు సంబంధించిన వాక్కులు. దీపం వస్తువును చూపించినట్లు, పరమాత్మ స్వరూపాన్ని ప్రకాశింప చేసే వచనాలు కావడం చేత ఇవి పరమ వాక్కులు. ప్రకృష్టమైన వాక్యాలు. దేనిని ఆలకించిన తరువాత మరొక దానిని వినాలని మనస్సుకు అనిపించదో, వినవలసిన అవసరం కూడా ఉండదో, అదే ప్రకృష్ట వచనము. శ్రేష్ఠ వచనాన్ని శ్రేష్ఠులే విన గలరు. ఉత్కృష్ట వచనాన్ని నికృష్టులు విన లేరు. వినినా అర్థం చేసుకోలేరు.

అందుచేత, అర్జునుని యోగ్యతను దృష్టిలో ఉంచుకొని, 'నేను చెప్పే శ్రేష్ఠ వచనాన్ని విను' ***(శ్రుణు మే పరమం వచః)*** అంటున్నాడు భగవంతుడు. అంతేకాదు. 'మహాబాహో!' అని సంబోధించి అర్జునుని అర్హతను ప్రశంసిస్తున్నాడు కూడా.

బాహువులు జయానికి సంకేతాలు. విజయ సూచకాలు. నేను చెప్పే విశిష్ట విషయాన్ని అర్థం చేసుకోవడంలో నువ్వు విఫలం కావు. విజయం సాధిస్తావు. నువ్వు గొప్ప బాహువులు కలవాడివి. అవి మహా బాహువులు. కేవలం విజయాన్ని సాధించడమే గాక మహాత్ములను భక్తితో సేవించిన మహా బాహువులు. ప్రత్యక్షంగా మహేశ్వరునితో తలపడి విజయ దరహాసంతో పాశుపతాస్త్రమును పరమేశ్వరుని అనుగ్రహంగా పొందిన బాహువులు. పార్థా! కనుకనే, నీకు వినిపిస్తున్నా! విను! ***(శృణు).*** అర్జునా! అర్హుడవు కనుకనే నేను బోధిస్తున్న విషయాన్ని ఎంతో ప్రీతితో, ఉత్సాహంతో వింటున్నావు అని కూడా శ్రీకృష్ణుడు అర్జునునికి కితాబు ఇస్తున్నాడు.

శ్రవణ మాధుర్యం

తినేవాడు ప్రీతితో ఆరగిస్తూ ఉంటే పెట్టే వాడికి ఇంకా, ఇంకా పెట్టాలి అనే బుద్ధి పుడుతుంది. వినేవాడు తృప్తి చెంది నపుడే వినిపించే వాడికి సంతృప్తి కలుగుతుంది. అర్జునా! నా మాటల్ని ప్రీతితో వింటున్నావు అంటున్నాడు భగవంతుడు ***(ప్రీయ మాణాయ).*** అర్జునుని ముఖంలో తొణకిస లాడే ఆనందము, పార్థుని కళ్ళ నుండి తొంగి చూచే ఉత్సాహము, జ్ఞాన కిరణ స్పర్శచే విరబూసిన హృదయారవిందము వెదజల్లే ఆనంద సుగంధమును వ్యక్తం చేసే స్మిత వదనము - ఇవన్నీ పార్థుని ప్రీతిని మౌనంగా చెబుతున్నాయి.

ఆదిలో విషాద వదనంతో కుమిలి పోయి కన్నీరు కార్చిన అర్జునునికి, గీత పూర్వార్థము సమాప్త మయ్యే సమయానికి ఆనందం ఉప్పొంగగా కళాత్మకంగా గోచరిస్తున్న విజయునికి ఎంత తేడా! దీనిని కృష్ణుని కన్నా స్పష్టంగా చూడ గలవా రెవరుంటారు? అందుకే ప్రీతితో వింటున్నావు అంటున్నాడు. ప్రీతితో ఆలకించడము అమృతపానం చేయడం లాంటిది అన్నారు భాష్యంలో ఆచార్యులు ***(ప్రీయమాణాయ, మద్వచనాత్ ప్రీయసే త్వం అతీవ అమృత మివ పిబన్).*** అమృతపానం చేసినట్లు అర్జునుడు బోధను ఆస్వాదిస్తున్నాడు కనుకనే, శ్రీకృష్ణుడు మళ్ళీ మళ్ళీ ఆనందంతో చెబుతున్నాడు. అదే మన సంప్రదాయంలో ఆచార్య హృదయ మంటే. ఉపనిషత్ప్రబోధ మంటే అదే. సందేహం కలిగి, విన్న విషయాన్ని మళ్ళీ చెప్పమని అడిగితే, నీకు ఎన్నిసార్లు చెప్పాలి? అని విసుక్కుంటాడు ఉపాధ్యాయుడు. కాని, ఉపనిషత్తు అలా కాదు. ఎన్ని సార్లైనా చెబుతుంది. నీకు అర్థమయ్యే వరకు చెబుతుంది. అదే ఉపనిష ద్వైభవము. ఉపనిషత్తుల లోని ఆత్మవిద్యను అందించే ఆచార్యుని హృదయ సౌందర్యము.

వ్యాధి నయ మవుతూ ఉంటే రోగికి వైద్యుడిపై, అతని వైద్యంపై విశ్వాసము, ప్రేమ వృద్ధి చెందుతూ ఉంటాయి. అలాగే రోగి ఆరోగ్యాన్ని పొందుతూ ఉంటే, శ్రమించి వైద్యం చేసిన వైద్యునికి తృప్తి, ఆనందము కలుగుతూ ఉంటాయి.

అర్హత కలిగి శ్రవణం చేయడం చేత, బోధ సాగే కొద్ది అర్జునునిలో ఆనందం పెరుగుతూ ఉంది. అర్జునునిలో వ్యక్తమయ్యే తృప్తిని ప్రత్యక్షంగా దర్శిస్తున్న గీతాచార్యునిలో హితేచ్ఛ అధిక మవుతూ ఉంది. అందుచేతనే, అర్జునా! నీకు హితం చేయాలనే కోరికతో చెబుతున్నాను అంటున్నాడు భగవంతుడు ***(తతః వక్ష్యామి హిత కామ్యయా హితేచ్ఛయా).*** శ్రవణ సాధకులకు అర్జునుడే పరమాదర్శము. శ్రవణం అనేది అమృత పానం చేసినట్లు ఉండాలే గాని, ఆముదం త్రాగినట్లు ఉండకూడదు. శిష్యుడికి బోధ యందు ప్రీతి ఉండాలి. బోధకుని యందు భక్తి ఉండాలి.

హితబోధ

ఆత్మీయులు మన సుఖం కోరుతారు. కాని ఆచార్యుడు మన హితం కోరుతాడు. సుఖాలు అనిత్యాలు. అవి రాకపోకలతో ఉంటాయి. హితం అనేది నిత్యసుఖం. అది వచ్చి ఉండేదే గాని వచ్చి పోయేది కాదు. అదే ఆత్మసుఖం. ఆత్మానందం. మోక్షానందం. నిత్యమోక్షం. సర్వులకు, సర్వ కాలాలకు, సమస్త లోకాలకు మేలు చేసేది హితం. అదే మోక్షం. మోక్షార్థం చేసే బోధ హితబోధ.

సదాత్మక మైన భగవంతుని తత్త్వమును ***(భూతిః)*** గ్రహించడమే హితము. హితమును బోధించే వాక్యమే హిత వచనము. అదే మహావాక్యము. బ్రహ్మాత్మ జ్ఞానమును ప్రసాదించే 'తత్త్వమసి' మహావాక్యము.

భగవ త్తత్త్వమును గ్రహించడానికి ఉపకరించే ఐశ్వర్య దర్శనమే విభూతి ***(విభూతిః).*** తత్త్వమును గ్రహించడానికి సహకరించే విభూతిని దర్శింప చేసి, విభూతి దర్శనము ద్వారా విభూతి సుందరుడైన పరమేశ్వరుని సద్రూప చైతన్యము యొక్క అనుభూతిని కలిగించడమే తత్త్వావగాహన ఫలం. తత్త్వ జ్ఞానం ప్రసాదించే మోక్షఫలం.

హితకారిణి

హితము అనేది మోక్షము అని తెలుసుకున్నాం. మోక్షము జీవుల గమ్యము. గమ్యమును చేర్చే హితబోధ మార్గమును కూడా మంగళకరంగా, మహనీయంగా తీర్చి దిద్దుతుంది. కనుక సాధ్యమును అలా ఉంచితే, సాధనలో సాధకునికి ఎంతగానో ఉపకరించే ఈ యోగవిభూతి సోపానక్రమంగా ముముక్షువును మోక్ష సౌధం వైపుకు నడిపిస్తుంది.

తేజములో గాని, బలంలో గాని, జ్ఞానంలో గాని, కళలో గాని, - ఎక్కడ ఏ విధమైన ఔన్నత్యము గోచరించినా, దానిని ఈశ్వర వైభవముగా వీక్షించే అలౌకిక దృష్టిని విభూతి ప్రసాదిస్తుంది. ఈ విధమైన ఈశ్వర వైభవ భావన సాధకుని లోని అహం భావనను, అహంకారమును అదృశ్యం చేస్తుంది. అంతా ఈశ్వర వైభవ మైనపుడు, నా దంటూ ప్రత్యేకంగా ఏముంది? నా నుండి వ్యక్తమయ్యే వైభవము పరమేశ్వరుని దైనపుడు, నాలో అహంకారానికి చోటెక్కడుంది? నా నుండి ఏ ఈశ్వర వైభవము వ్యక్త మవుతూ ఉందో, ఇతరులలో వ్యక్తమయ్యే వైభవము కూడా ఆ ఈశ్వర వైభవమే అయినప్పుడు, నాకు ఎవరిపై ఈర్ష్య? ఎవరిపై అసూయ? ఈ విధమైన భావాలతో బుద్ధి వికసిస్తూ విశాలమౌతూ, వినూత్న భగవ ద్భావనలో ఓల లాడుతుంది.

ఆఖ్యాయిక

ఒకనాడు ఒక నదీ తీరంలో సాధ్వి రబియాను యోగి హసన్ చూశాడు. అంతే. అతనిలో అహంకారము, గర్వము విజృంభించాయి. వెంటనే తాను ప్రార్థనకై నేలపై పరచుకున్న వస్త్రాన్ని నదీ జలంపై వేసి, దాని మీద కూర్చుని తేలుతూ ఉన్నాడు. రబియా సమీపానికి రాగానే, వెటకారంగా నవ్వుతూ, 'రబియా! రా! ఇక్కడ చల్లగా ఉంది. నువ్వూ కూర్చుని ప్రార్థన చేసుకుందువు గాని!' అన్నాడు హసన్.

రబియా మందహాసాన్ని చిందిస్తూ, 'హసన్! అది నీ బలమని విర్రవీగకు. అది నీ బలం కాదు. బలహీనత. అది వైభవం కాదు, వికారము. చివరికి ప్రపంచ సంతలో వ్యాపారి లాగా ప్రదర్శన లివ్వడానికి సిద్ధ మయ్యావా?' అంటూ ఆమె చేతిలో ఉన్న వస్త్ర ఖండాన్ని గాలి లోకి విసిరింది.

ఆకాశంలో నిలబడి యున్న వస్త్ర ఖండం వద్దకు రబియా ఎగిరి వెళ్ళి, దానిపై ఆసీనురా లైంది. 'హసన్! అక్కడెందుకు? నీళ్ళల్లో తడుస్తాము. ఆ ప్రార్థనేదో ఇక్కడ చేద్దాము, రా! పైగా పై నుంటే, అందరూ చూస్తారు కూడా!' అంది రబియా.

హసన్ సిగ్గుతో తల దించుకున్నాడు. అది ఇష్టపడని రబియా, తన సహజ ప్రేమను చిందిస్తూ, 'చూడు హసన్! నువ్వు చేసిన ఆ వైభవాన్ని చేప కూడా చేసి చూపుతుంది. ఇక నేను చేసింది అంటావా, పక్షి అవసరం లేదు, పురుగు కూడా ఈ మాత్రం ఎత్తుకు ఎగురుతుంది. అసలైన వైభవము ఈ రెండిటి లోను లేదు. అదేమిటో తెలిసి సాధించుకోవాలి' అంది రబియా. ఆమె హిత వచనాలతో హసన్‌లో గొప్ప పరివర్తన చోటు చేసుకుంటుంది.

ఈశ్వర విభూతి అర్థమైతే, ఆ తరువాత మన బుద్ధిలో కలిగే, మన బుద్ధి నుండి కదిలే ప్రతి భావన ఈశ్వర వైభవ కిరణంగా ప్రకాశిస్తుంది. కారణం, ఈశ్వర వైభవాన్ని సాక్షాత్తు ఈశ్వరుడే వర్ణిస్తూ ఉన్నాడు కనుక.

ప్రబోధించబడే విషయం భగవత్తత్త్వం. వ్యక్తమయ్యే ఐశ్వర్యం భగవద్విభూతి. ఈ రెండిటిని చెప్పే మాటలు ఈశ్వరునివి ***(మే పరమం వచః).*** అంతా విభూతియే.

ఇది అన్యులకు సాధ్యం కానిది. అచ్యుతునికే సాధ్య మయ్యేది. చదవండి.

న మే విదుః సురగణాః ప్రభవం న మహర్షయః ।
అహ మాదిర్హి దేవానాం మహర్షీణాం చ సర్వశః ॥ 2

న-మే-విదుః-సురగణాః-ప్రభవం-న-మహర్షయః

అహం-ఆదిః-హి-దేవానాం-మహర్షీణాం-చ-సర్వశః

మే	=	నా యొక్క	అహం	=	నేను
ప్రభవం	=	పుట్టుకను	దేవానాం	=	దేవతలకు
సురగణాః	=	దేవతా సమూహములు	మహర్షీణాం చ	=	మహర్షులకును
న విదుః	=	ఎరుగరు	సర్వశః	=	సర్వ విధముల
మహర్షయః	=	మహర్షులు	ఆదిః హి	=	మూల కారణమును గదా!
న	=	ఎరుగరు			

అర్జునా! నా పుట్టుక దేవతలకు తెలియదు. మహర్షులు ఎరుగరు. ఎలా చూచినా, దేవతలకు, మహర్షులకు ఆది కారణం నేనే కదా!

వ్యాఖ్య

భగవదైశ్వర్యము లేదా భగవద్విభూతి అనేది జ్ఞాన సంపన్న మైనది. సర్వ జ్ఞాన సంశోభితమైన విభూతి జ్ఞానమును జ్ఞానశక్తి కలవారే గుర్తించ గలరు. గ్రహించ గలరు. సృష్టిలో అధమ జన్మలు జ్ఞానార్హులు కారు. క్రిమికీటకాదులు, రాక్షసులు జ్ఞానమును పొందలేరు. జ్ఞానమును పొందే అవకాశము మధ్యమ, ఉత్తమ జన్మలైన మానవ, దేవతా గణాలకే ఉంది.

మానవులలో కూడా జ్ఞాన ప్రధానులైన మహర్షులు శ్రేష్ఠులు. అలాగే ఉత్తమ జన్మలైన వారిలో దేవతలు శ్రేష్ఠులు. మానవ లోక ప్రతినిధులుగా మహర్షులను, సురలోక ప్రతినిధులుగా దేవతలను ఎన్నుకొని, పరమేశ్వరునికి సంబంధించిన విభూతి జ్ఞానము పూర్ణంగా భగవంతునికే తెలుసు అనే విషయాన్ని నిర్ధారణ చేస్తున్నాడు.

ఎరుగరు సురులు

అర్జునా! నా ప్రభవమును దేవతలు ఎరుగరు *(న మే విదుః సురగణాః ప్రభవం).* ఇక్కడ ప్రభవం అంటే,

పుట్టుక, లేదా ఉత్పత్తి అని ఒక అర్థము. ప్రభావము, లేదా వైభవము అని మరొక అర్థము **(మమ ప్రభావం ప్రభావం ప్రభశక్తి అతిశయమ్, అథవా ప్రభవం ఉత్పత్తిం).** ఈ రెండు కూడా దేవతలు ఎరుగరు. దేవతలు అంటే బ్రహ్మాది దేవతలు అని అర్థము **(బ్రహ్మాదయః).**

బ్రహ్మ ఇంద్రాదులు దివ్యశక్తి సంపన్నులు. దివ్య జ్ఞానయుతులు. సృష్టికి బ్రహ్మదేవుడు కారణము. కాని బ్రహ్మదేవునికి కారణమైన వాడు భగవంతుడు. భగవంతుని నుండే చతుర్ముఖ బ్రహ్మ ఆవిర్భవించాడు. తనకు కారణమైన భగవంతుని బ్రహ్మదేవుడు పూర్ణంగా ఎలా తెలుసుకుంటాడు? అలాగే దేవత లందరూను.

తస్మాచ్చ దేవా బహుధా సంప్రసూతాః

దేవత లందరు పరమేశ్వరుని నుండే ఆవిర్భవించారు. దివ్య శక్తి యుక్తులను దేవతలకు ప్రసాదించింది తానే. భగవంతుని కారణం గానే వారికి వైభవం ప్రాప్తించింది. తమకు వైభవాన్ని అనుగ్రహించిన వాని ప్రభవాన్ని దేవతలు ఎలా తెలుసుకుంటారు? తండ్రి కారణంగా ఉద్భవించిన బిడ్డ తండ్రి ప్రభవమును ఎలా తెలియడో, అలాగే దేవతలు తమకు కారణమైన భగవంతుని పూర్ణంగా తెలుసుకో లేరు. కనుకనే, నా ప్రభవమును బ్రహ్మాది సురులు తెలుసుకో లేరు అంటున్నాడు ***(న మే విదుః, మమ ప్రభవం న జానన్తి సురగణాః బ్రహ్మాదయః).*** బ్రహ్మాది దేవతలు వైభవ సంపన్నులే అయినా, తమ ప్రభవానికి కారణమైన ఆదిదేవుని ప్రభవమును తెలుసుకొనే టంతటి శక్తి సంపన్నులు మాత్రం కారు.

తండ్రీ తనయులు

భాగవతంలో ఒక రమణీయ మైన ఘట్టము ఉంది. ఒకనాడు నారద మహర్షి తన సందేహాన్ని నివృత్తి చేసుకోవాలని బ్రహ్మదేవుని వద్దకు వెళతాడు.

'తండ్రీ! వాణీశ్వరా! జగత్సర్గాను సంధాయివి! వేదాలన్నీ నీ ముఖాంబుజము నందే శోభిస్తున్నాయి. ఈ సృష్టికి హేతు వేమిటి? ఈ సృష్టి జ్ఞాన మంతా నీదేనా? లేక, మరెవ్వరైనా నీకు అనుగ్రహించారా? ***(ప్రారంభాది వివేక మెవ్వ డొసంగు? బ్రారంభ సంపత్తి కాధారం బెయ్యది? యేమి హేతువు?).*** ఈ సృష్టి కార్యానికి ఏమి ప్రయోజనం? దీని స్వరూప మేమిటి? నా వరకు నేను ఈ సృష్టికి నువ్వే కారణ మని అనుకుంటున్నా! లేక నిన్ను మించిన దేవుడు మరొక డున్నాడా? ఏది నిజమో చెప్పు తండ్రీ! నా సందేహాన్ని పోగొట్టు ***(యథార్థం బే స్వరూపంబు?... నాకుం జూడగ నీవు రాజువను చున్నాడన్ యదార్థ స్థితిన్ నీ కంటెన్ ఘను డొక్క రాజు గలడో?.. నిక్కంబు భాషింపుమా!... ఓ జనక! నా సందేహముం బాపవే!...*** పోతన భాగవతము) అని బ్రహ్మ మానస పుత్రుడైన నారద మహర్షి సరస్వతీ పతిని ప్రశ్నించాడు. నారద మహర్షి అడిగిన ప్రశ్నకు బ్రహ్మదేవుడు ఎంతగానో సంతోషించి, సమాధానం చెబుతాడు.

క॥ ***రారా బుధులు! విరక్తులు గారా! యీరీతి నడుగ నేరరు వి***
స్మే రావహము భవన్మత మౌరా ! నా విభుని మర్మ మడిగితి వత్సా!

'నాయనా! కుమారా! ఎందరో జ్ఞానులు నా వద్దకు వస్తూ ఉంటారు. వాళ్ళు కూడా నీ లాగా వైరాగ్య సంపన్నులే అయినా, నీ లాగా ఎవ్వరూ ప్రశ్నించ లేదు. నాకు చాలా సంతోషంగా ఉంది. ఆశ్చర్య మేమిటంటే, నా తండ్రి రహస్యాన్ని నువ్వు మీ తండ్రిని అడగటమే' అంటూ సమాధానం చెబుతాడు బ్రహ్మదేవుడు.

'వత్సా! నారదా! ఈ చరాచర ప్రపంచాన్ని నా అంతట నేను సృష్టించలేక , జ్ఞానము చాలక తపన పడుతూ ఉన్నప్పుడు, సృష్టి నిర్మాణానికి కావలసిన జ్ఞానాన్ని నా ప్రభువు ఎంతో ఔదార్యంతో నాకు

అనుగ్రహించాడు. ఆ పరమేశ్వరుని ఆజ్ఞ లేకపోతే, ఈ లోకాలను నిర్మించే శక్తి నా కెక్కడిది? అంతా భగవదనుగ్రహమే'.

శా॥ *నానాస్థావర జంగమ ప్రకరముల్ నాయంత నిర్మింప వి*
జ్ఞానం బేమియు లేక తొట్రు పడ నిచ్చన్ నాకు సర్వాను సం
ధానారంభ విచక్షణత్వము మహోదారంబుగా నిచ్చె ము
న్నే నా యీశ్వరు నాజ్ఞ గాక జగముల్ నిర్మింప శక్తుండనే? - అని పోతనామాత్యుని ఆంధ్ర భాగవతము. తనకు అర్థం గాక కుమారుడైన నారదుడు తండ్రి యైన బ్రహ్మదేవుని ప్రశ్నిస్తే, విషయం తన తండ్రికి సంబంధించింది కావడం చేత, తనకూ తెలియదని చతుర్ముఖ బ్రహ్మ చేతు లెత్తేశాడు.

మహర్షులూ ఎరుగరు

బ్రహ్మాది దేవతలు ప్రభువు ప్రాభవాన్ని ఎలా ఎరుగ లేరో, అలాగే భృగ్వాది మహర్షులు కూడా తెలుసుకో లేరు ***(నాపి మహర్షయః భృగ్వాదయః విదుః జానన్తి).*** ఋషులు తపశ్శక్తి సంపన్నులు. జ్ఞానసిద్ధులు. ఇక్కడ ఋషులు అనకుండా మహర్షులు అనడం చేత, గొప్ప ప్రాభవము గల ఋషులు అని అర్థము ***(మహాన్ చ అసౌ ఋషిః).*** మంత్రద్రష్ట లైన మహర్షులకు కూడా అర్థం గాని విషయము భగవ ద్విభూతి.

ఇక్కడ ఒక్క సంశయం తలెత్తుతుంది. బ్రహ్మాది దేవతలకు, భృగ్వాది మహర్షులకు కూడా తెలియదు అన్నప్పుడు, ఇక బ్రహ్మజ్ఞాన ఫల మేమిటి? బ్రహ్మజ్ఞానులకు సర్వజ్ఞత్వము లేనట్లేనా? అనే సందేహం కలుగుతుంది. ఇది చాలా సూక్ష్మమైన, ఆసక్తికర మైన, జాగ్రత్తగా అర్థం చేసుకోవలసిన విషయం.

బ్రహ్మ జ్ఞానము అంటే, బ్రహ్మాత్మ జ్ఞానము. ఈ ఆత్మయే బ్రహ్మము అనే జ్ఞానము. ఇది అద్వైత జ్ఞానము. రెండవది తెలియని పూర్ణ జ్ఞానము.

అలాంటి జ్ఞానులను మన దేశ సరిహద్దులలో ఎంత మంది సైనికు లున్నారో చెప్పండి అంటే చెబుతారా? చెప్పలేరు. అది వారికి సాధ్యం కాదు. నిద్ర నుండి మేల్కొన్న వానిని వాడు కలలో చూచిన చెట్టులో ఎన్ని ఆకు లున్నాయో చెప్పమంటే చెబుతాడా? ఇదీ అంతే.

స్వప్న జగత్తు సత్యం కాదు కనుక, సత్య దర్శనం అయిన వాడు సత్యం గాని దానికి సంబంధించిన వివరాలను చెప్పలేడు. అంతమాత్రాన అతనికి సర్వ జ్ఞానము లేదు అనడానికి వీల్లేదు. సర్వము అంటే సత్యమే కనుక, జ్ఞానిలో అద్వయమైన సత్య జ్ఞానము ఉంటుందే గాని భిన్నమైన అనిత్య జ్ఞానాలకు సంబంధించిన ఎరుక ఉండదు.

కాని, ఆశ్చర్య మేమిటంటే, సర్వ జ్ఞానము కలిగిన జ్ఞాని చెప్పలేని సమాధానమును సర్వేశ్వరుడు చెప్పగలడు. ఎందుకో తెలుసా? సత్యం గాని మిథ్య కూడా పరమేశ్వరునికి దూరంగా లేదు. మాయ కూడా బ్రహ్మమునే ఆశ్రయించుకొని ఉంది. అందుచేత, తాను మాయ కాకపోయినా, తన నాశ్రయించుకొని ఉన్న మాయను మహేశ్వరు డొక్కడే చెప్పగలడు. అలాంటి వాణ్ణి దివ్య శక్తి గల దేవతలు ఎలా తెలుసుకుంటారు? తపశ్శక్తి గల సిద్ధులు ఎలా గ్రహిస్తారు? ఆదిదేవుని ఆది ఎవరికి దొరుకుతుంది? కనుకనే, తన విభూతి వైభవాన్ని తానే వివరిస్తున్నాడు. రాబోయే అధ్యాయాలలో ఈ విషయాలన్నీ ఇంకా ఎంత గానో విస్తరిస్తాయి.

సరే, బాగుంది. ఇంతగా శ్రమించి ఈ విభూతులను తెలుసుకొని సాధించే దేమిటి? చెబుతున్నాడు.

యో మా మజ మనాదిం చ వేత్తి లోకమహేశ్వరమ్ ।
అసమ్మూఢః స మర్త్యేషు సర్వపాపైః ప్రముచ్యతే ॥ 3

యః-మాం-అజం-అనాదిం-చ-వేత్తి-లోకమహేశ్వరం
అసమ్మూఢః-సః-మర్త్యేషు-సర్వపాపైః-ప్రముచ్యతే

యః	=	ఎవడు	సః	=	వాడు
అజం	=	పుట్టుక లేని వానిని	మర్త్యేషు	=	మానవుల యందు
అనాదిం	=	ఆది లేని వానిని	అసమ్మూఢః	=	అజ్ఞానము లేనివాడై
లోకమహేశ్వరం చ	=	లోకనియంతను అగు	సర్వపాపైః	=	సమస్త పాపముల నుండి
మాం	=	నన్ను	ప్రముచ్యతే	=	విముక్తు డవుతున్నాడు
వేత్తి	=	తెలుసుకుంటున్నాడో			

నేను పుట్టుక లేని వాణ్ణి. ఆది లేని వాణ్ణి. సర్వ లోకాలకు నేనే ప్రభువును. ఇలా నన్ను ఎవడు తెలుసుకుంటాడో, వాడు సమ్మోహం లేని వాడు. సర్వ పాపాల నుండి విడి పడతాడు.

వ్యాఖ్య

అజమ్ - అనాదిమ్

బ్రహ్మాది దేవతలకు, భృగ్వాది మహర్షులకు కూడా భగవంతుడే ఆది అని పూర్వ శ్లోకంలో తెలుసుకున్నాం. 'ఆది' అంటే కారణ మని అర్థము ***(అహం ఆదిః కారణం హి యస్మాత్).*** సర్వ కారణమైన పరమేశ్వరునికి మరొక కారణం ఉండేందుకు అవకాశం లేనందున భగవంతుడు అజుడు. అంటే, పుట్టుక లేనివాడు.

న తస్య కశ్చి జ్జనితా న చాధిపః - భగవంతునికి తండ్రి లేడు; అధిపతి కూడా లేడు. అందుచేత ఆయన పుట్టుక లేని వాడు. కనుక అజుడు. ఆది లేని వాడు. అంటే తనకు మరొక కారణం లేని వాడు ***(న మమ అన్యః ఆదిః విద్యతే).*** ఆది లేని వాడు అంటే అనాది అని అర్థం.

పుట్టుక లేని వాడు అనినా ***(అజమ్),*** ఆది లేని వాడు, అనగా అనాది అనినా ***(అనాదిం),*** రెండూ ఒక్కటే కదా! అలాంటప్పుడు 'అజ', 'అనాది' అని రెండు పదాలు ఎందుకు ప్రయోగించినట్లు?

సర్వులకు తానే కారణం కావడం చేత పరమేశ్వరుడు 'సర్వాది'గా పూర్వ శ్లోకంలో అర్థ మయ్యాడు. సర్వుల పుట్టుకకు కారణమైన తాను, పుట్టుక లేని వాడు కనుక అజుడు.

అనాది అంటే ఆది లేని వాడు. అంటే తన పుట్టుకకు మరొక కారణం లేని వాడు. ఎందుకని? తాను అజుడు కనుక. ఎందుకని అజుడు? అనాది కనుక అజుడు. అంటే అజత్వానికి కారణం అనాదిత్వం. అనాదిత్వం అజత్వానికి హేతువు ***(అనాదిత్వమ్ అజత్వే హేతుః)*** అని చెప్పడం కోసం, రెండు పదాలు సమానార్థకాలే అయినా, రెండుగా చెప్పవలసి వచ్చింది.

అతివ్యాప్తి దోషం

పరమేశ్వరుడు పుట్టుక లేని వాడు. అజుడు. అలాగే ఆది లేని వాడు. అనాది. బాగుంది. అలాంటప్పుడు భగవంతునికి చెప్పబడిన ఈ రెండు లక్షణాలు మరెవరిలో నైనా ఉన్నాయా? ఉండేందుకు అవకాశం లేదు. ఎందుకని? అలా ఉంటే, మరొక భగవంతుడు కూడా ఉన్నాడు అని అర్థము. ఇద్దరు భగవాన్లు ఉంటే, ఆ ఇరువురిలో ఎవడూ భగవంతుడు కాకుండా పోతాడు. భగవంతుడు అనంతుడు. రెండు అనంతాలు ఉండలేవు. కనుక, ఇద్దరు భగవాన్లు ఉండలేరు.

కాదు, ఉండొచ్చు. ఎలా? ఈ రెండు లక్షణాలు మరొక చోట ఉన్నాయి కనుక. ఎక్కడ? ఏమిటది?

అదే ***శశ విషాణము.*** శశవిషాణము అంటే, కుందేటి కొమ్ము. ఈ మాట మన అనుభవంలో ఉందా, లేదా? ఉంది. కుందేటి కొమ్ముకు కారణం ఎవరు? అది ఎప్పటి నుండి ఉంది? కుందేటి కొమ్మును ఎవ్వరూ ప్రసవించ లేదు, కనుక అది అజము. ఎప్పటి నుండి ఉంది? 'కుందేటి కొమ్ము' అనే పదము తెలిసిన దెప్పుడో అంతకు పూర్వము ఎప్పటి నుండో ఉంది.

ఏమిటి ఈ గందరగోళం అనుకుంటున్నారా? కుందేలు ఉంది. కొమ్ము ఉంది. కాని కుందేటికి కొమ్ము లేదు. కనుక కుందేటి కొమ్ము అనేది విన పడేదే గాని కనపడేది కాదు. కాబట్టి అది లేనిదే. లేనిది ఎలా పుడుతుంది? కనుక అజము.

పుట్టని కుందేటి కొమ్ము ***(అజం)*** ఎప్పటి నుండి ఉంది? ఎప్పటి నుండో ఉంది. కుందేటి కొమ్ము లేదు అని ఎప్పుడు తెలిసిందో, అంతకు ముందు ఎప్పటి నుండో 'కుందేటి కొమ్ము లేదు' అనేది ఉంది ***(శశ విషాణ అభావః అస్తి).*** కనుక ఆ 'లేదు' అనేది అనాదిగా ఉంది. ఈ విధంగా ***అజం, అనాదిం*** అనే రెండు లక్షణాలు శశ విషాణానికి కూడా ఉన్నందున, శశవిషాణం కూడా భగవంతుడు కావాలి. లేదా ఆ రెండు లక్షణాలున్న వాడు భగవంతుడు అయ్యేందుకు అవకాశము లేదు. ఈ అనర్థమే అతివ్యాప్తి దోషం. ఒక దాని లక్షణాలు మరొక దానిలో ఉండటమే అతివ్యాప్తి దోషం. ఈ దోషమును నిరాకరించడానికి పరమేశ్వరుని లోక మహేశ్వరునిగా చెప్పడం జరుగుతూ ఉంది.

లోకేశ్వరుడు

అజం, అనాదిం - ఈ రెండు లక్షణాలే కాక ఆయన లోకమహేశ్వరుడు. లోకాలను సృజించిన గొప్ప ప్రభువు ***(లోకానాం మహాన్తం ఈశ్వరం).*** ఈ లక్షణము, అనగా సర్వ లోకాలకు అధిపతిగా ఉండే లక్షణం, అసలు అస్తిత్వమే లేని కుందేటి కొమ్ముకు ఉండే అవకాశం లేనందున అతివ్యాప్తి దోషం నిరవారింప బడింది.

య ఈశః అస్య జగతో నిత్య మేవ - ఈ ప్రపంచానికి ఈశ్వరుడు కావడం చేత ***(అజం, అనాదిం*** అని కీర్తింపబడిన) లోకేశ్వరుడు నిత్యుడు. అట్టి నిత్యుడైన పరమేశ్వరుని ఎవడు తెలుసుకుంటాడో అట్టి వాడు అసంమూఢుడు ***(సంమోహ వర్జితః).*** అంటే సమ్మోహము లేని వాడు. ఇక్కడ 'మోహం' అనకుండా 'సమ్మోహం' అంటూ ఉపసర్గను ప్రయోగించి చెప్పడం వల్ల దీనిని కాస్త విశ్లేషించి అర్థం చేసుకోవాలి.

సమ్మోహ వర్జితుడు

మోహము అంటే అవివేకము. బుద్ధి లోని అవివేకమే మోహము ***(మోహః అవివేక బుద్ధిః).*** ఉన్నది తెలియక పోవడం వల్ల ఉన్న దానిని లేనట్లుగా, లేని దానిని ఉన్నట్లుగా చూచే బుద్ధియే అవివేక బుద్ధి. అదే మోహము. అజ్ఞాన రూపము. అగ్రహణ స్థితి.

ఉన్నది తెలియక పోవడ మనే అగ్రహణ స్థితి మోహ మైతే, విపరీతంగా తెలియడ మనే అన్యథా గ్రహణ స్థితియే సమ్మోహము. కనుక, ఇక్కడ మోహము అజ్ఞాన మైతే, సమ్మోహము భ్రాంతి. మోహానికి అజ్ఞానము కారణ మైతే, సమ్మోహానికి మోహమే కారణము. గీతను సమాప్తం చేసిన తరువాత, బోధ ఫలించిందా లేదా అనే విషయాన్ని నిర్ధారణ చేసుకోవడానికి శ్రీకృష్ణుడు అర్జునుని ఈ అజ్ఞాన సమ్మోహాలను గూర్చిన ప్రశ్ననే సంధించాడు. అర్జునా! అజ్ఞానము వలన కలిగిన సమ్మోహము నశించిందా? ***(కచ్చి దజ్ఞాన సమ్మోహః ప్రణష్టస్తే ధనంజయ)*** అని ప్రశ్నించాడు.

అజుడు, అనాది రూపుడు, లోక మహేశ్వరుడు అయిన పరమేశ్వరునికి సంబంధించిన జ్ఞానము ఎవడికి స్పష్టంగా కలుగుతూ ఉందో, వాడు సర్వ పాపాల నుండి విముక్తు డవుతున్నాడు.

సర్వ పాప విముక్తుడు

పరమాత్మ జ్ఞానము కలిగి సమ్మోహమును పోగొట్టుకున్న వాడు సర్వ పాపముల నుండి విడిపడు తున్నాడు. విముక్తు డవుతున్నాడు **(సర్వ పాపైః ప్రముచ్యతే). ముచ్యతే** అంటే విడిపడటము. **మోక్ష్యసే** అని అర్థము. మోహ క్షయము లేదా మోహము నుండి విడిపడటమే మోక్షము. ఇక్కడ **ముచ్యతే** అనకుండా **ప్రముచ్యతే** అనడం జరిగింది. సమ్మోహము నుండి విడిపడటము చేత 'ప్ర' అనే ఉపసర్గను చేర్చి 'ప్రముచ్యతే' అనడం జరిగింది. సర్వ పాపముల నుండి విడిపడటము అంటే, తెలిసి చేసినవి, తెలియక చేసినవి అయిన సర్వ పాపముల నుండి విముక్తి **(సర్వ పాపైః సర్వైః పాపైః మతి పూర్వ అమతి పూర్వ కృతైః ప్రముచ్యతే).** తెలిసి చేసినా, తెలియక చేసినా పాపం పాపమే. పరమేశ్వర జ్ఞానం చేత సమ్మోహమును పోగొట్టుకున్న వాడు సర్వ పాప విముక్తు డవుతాడు. ఇదే పరమేశ్వరుని తెలుసుకోవడం వల్ల కలిగే ప్రయోజనము. ఈ సందర్భములో పాపమును పుణ్యానికి ఉపలక్షణంగా గ్రహించాలి. పుణ్య పాపాలను అధిగమిస్తేనే బ్రహ్మ జ్ఞానం కలుగుతుంది.

తాను సర్వలోక మహేశ్వరుడు అనడానికి హేతువును చెబుతున్నాడు.

బుద్ధిర్జ్ఞాన మసమ్మోహః క్షమా సత్యం దమ శ్శమః ।
సుఖం దుఃఖం భవోఽభావో భయం చాభయమేవ చ ॥ 4

బుద్ధిః-జ్ఞానం-అసమ్మోహః-క్షమా-సత్యం-దమః-శమః
సుఖం-దుఃఖం-భవః-అభావః-భయం-చ-అభయం-ఏవ-చ

బుద్ధిః	=	నిశ్చయ జ్ఞానము	సుఖం	=	సుఖము
జ్ఞానం	=	తత్త్వ జ్ఞానము	దుఃఖం	=	దుఃఖము
అసమ్మోహః	=	అప్రమత్తత	భవః	=	ఉండుట
క్షమా	=	సహనము	అభావః	=	లేకపోవుట
సత్యం	=	సత్యము	భయం చ	=	భయమును
దమః	=	బాహ్యేంద్రియ నిగ్రహము	అభయం ఏవ చ	=	అభయమును
శమః	=	అంతరింద్రియ నిగ్రహము			

బుద్ధి, జ్ఞానము, అసమ్మోహము, క్షమ, సత్యము, దమము, శమము, సుఖము, దుఃఖము, పుట్టుక, వినాశము, భయము, అభయము,

అహింసా సమతా తుష్టి స్తపో దానం యశోఽయశః ।
భవన్తి భావా భూతానాం మత్త ఏవ పృథగ్విధాః ॥ 5

అహింసా-సమతా-తుష్టిః-తపః-దానం-యశః-అయశః
భవంతి-భావాః-భూతానాం-మత్తః-ఏవ-పృథగ్విధాః

అహింసా	=	అహింసయు	అయశః	=	అపకీర్తి
సమతా	=	సమతయు	భూతానాం	=	భూతముల యొక్క
తుష్టిః	=	తృప్తి	పృథగ్విధాః	=	వివిధములైన
తపః	=	తపస్సు	భావాః	=	భావములు
దానం	=	దానము	మత్తః ఏవ	=	నా వలననే
యశః	=	కీర్తి	భవంతి	=	కలుగుతున్నాయి

అహింస, సమత, తృప్తి, తపస్సు, దానము, కీర్తి, అపకీర్తి, ఈ విధమైన వేరు వేరు భావాలు నా వల్లనే ప్రాణులకు కలుగు తున్నాయి.

వ్యాఖ్య

ప్రాణులలో అనేక విధాలైన భావాలు ఉంటాయి. వేరు వేరు గుణాలు ఉంటాయి. వీటికి సత్తా స్ఫురణలు పరమాత్మ నుండే కలుగు తుంటాయి. అలా చూచి నపుడు అవన్నీ కూడా విభూతులు గానే గోచరిస్తాయి. చిత్ర విచిత్రమైన భావాలను కదిలించే మనస్సు ఏమిటి? విభూతి కాదా!

శశిసూర్యుల లోని ప్రకాశము తానే *(7 వ అ - 8 వ శ్లో)* అని సూర్యచంద్రులను తన విభూతులుగా భగవంతుడే ప్రకటించుకున్నాడు కదా! మరి మహి లోని ప్రకాశము తన విభూతి అయినప్పుడు, మనస్సు లోని ప్రభావము తన విభూతి కాదా? నేడు దివ్యంగా కనిపిస్తున్న కంప్యూటరులో ఉన్నది జ్ఞానమే అయినందున, కంప్యూటర్ కూడా పరమేశ్వరుని విభూతియే. కంప్యూటర్ లోని వైభవము మనస్సు లోని వైభవము కాదా? కంప్యూటర్‌ని కనిపెట్టింది మనస్సే కదా? కనుక మనస్సు కూడా భగవ ద్విభూతియే. మనస్సు భగవద్విభూతి అయినప్పుడు, మనస్సును కలిగిన మనిషి మాత్రం విభూతి కాకుండా పోతాడా? మనస్సుకు, మనిషికి సత్తా స్ఫురణలు పరమాత్మ నుండే కలుగు తున్నాయి. మనస్సు లోని భావాలు, గుణాలు మనస్సు కన్నా వేరు కావు.

కామ సంకల్పో విచికిత్సా శ్రద్ధా అశ్రద్ధా ధృతిః అధృతిః హ్రీః ధీః భీః ఇత్యేతత్సర్వం మన ఏవ - 'కోరిక, సంకల్పము, సందేహము, శ్రద్ధ, అశ్రద్ధ, ధైర్యము, అధైర్యము, సిగ్గు, బుద్ధి, భయము - ఇలాంటి గుణాలు, భావాలు, అన్నీ మనస్సే అన్నది వేదం. అంటే వీటన్నిటికి మనస్సే ఆధారము. ఇవన్నీ మనస్సు వల్లనే కలుగు తున్నాయి. మనస్సు చైతన్య స్ఫూర్తి చేతనే కదులుతూ ఉంది కనుక, మనస్సు లోని భావాలు, గుణాలు అన్నీ పరమేశ్వరుని వల్లనే సంభవిస్తున్నాయి. కనుక, అవన్నీ పరమేశ్వరుని విభూతులు. ఆత్మ విభూతులు. ఆంతర్యంలో స్ఫురించేవి. వృత్తి రూపంలో తెలిసేవి. కనుక వృత్తి కూడా విభూతియే.

పరమేశ్వరుని నుండి ప్రాణులకు కలిగే బుద్ధ్యాది భావాలను ఈ నాలుగు, ఐదు శ్లోకాలలో కలిపి ఇరవై చెప్పడం జరిగింది. ఈ ఇరవై భావాలలో పన్నెండు భావాలు విడివిడిగా ఉన్నాయి. మిగిలిన ఎనిమిది నాలుగు జంటలుగా ఉన్నాయి.

విడిగా గోచరిస్తున్న పన్నెండు భావాలు ప్రగతి సూచకాలుగా ఉన్నాయి. జంటలుగా తెలిసే ఎనిమిదింటిలో నాలుగు ప్రగతికి, నాలుగు పతనానికి ప్రతిరూపాలుగా తెలుస్తున్నాయి. మొత్తానికి పదహారు ప్రగతి రూపాలు కాగా, నాలుగు పతన రూపాలుగా ఉన్నాయి.

సుఖదుఃఖాలు, భవ అభావాలు, భయాభయాలు, యశోయశాలు - ఈ నాలుగు జంటలలో దుఃఖము, అభావము, భయము, అయశస్సు అనేవి పతనానికి ప్రతిరూపాలు కాగా, మిగిలిన నాలుగు ప్రగతి రూపాలు. ప్రగతి రూపాలు ఉపాసించ దగినవి. పతన రూపాలు ఉపేక్షించ దగినవి. ఇవే సాధకులకు అనుకూల ప్రతికూలాలు. కర్మఫలాలుగా పరమాత్మ నుండి సంభవించే భావాలు. ముందుగా ఆ ఇరవై భావాలను ముక్త సరిగా చెప్పుకొని, ఆ తరువాత అవి ఎలా సంభవిస్తున్నాయో అర్థం చేసుకుందాం.

బుద్ధి

అంతఃకరణములో సూక్ష్మమైన విషయాలను గ్రహించే సామర్థ్యమే బుద్ధి ***(బుద్ధిః అన్తఃకరణస్య సూక్ష్మాత్ అర్థావబోధన సామర్థ్యమ్).*** బుద్ధికి నిశ్చయించే సామర్థ్యం కూడా ఉంది. సూక్ష్మావగాహనే నిశ్చయానికి ఉపకరిస్తుంది. సూక్ష్మము నెరిగే సామర్థ్యము గల బుద్ధి ఎవరి కుంటుందో వారే సరియైన నిర్ణయాలు

తీసుకుంటారు. నిర్ణయాలే ఎక్కడైనా నిర్దేశిస్తాయి. మనిషిలో ఈ విధమైన సామర్థ్యమే భగవద్విభూతి.

విషయాలు అందరికీ అర్థ మవుతాయి. విషయ లోతులు బుద్ధిమంతులకే తెలుస్తాయి. ఈ లోతుల నుండే కవులు పుట్టుకొస్తారు. విమర్శకులు, విశ్లేషకులు విస్తరిస్తారు. ఇదంతా వైభవము. ఈశ్వర వైభవము. యోగవిభూతి.

జ్ఞానం

ఆత్మానాత్మ వివేకం కలిగి ఉండటమే జ్ఞానం. ఆత్మాది పదార్థాలను క్షుణ్ణంగా తెలుసుకోవడమే జ్ఞానము ***(ఆత్మాది పదార్థానాం అవబోధః).*** ఏది సత్యము, ఏది అసత్యము, ఏది ఆత్మ, ఏది అనాత్మ అనే విచక్షణే ఇక్కడ జ్ఞానము. సారాసార వివేక నిపుణత్వము. ఈ విచక్షణా జ్ఞానశక్తి ఈశ్వర వైభవము.

అసమ్మోహం

తెలుసుకోవలసిన విషయాలు సన్నిహిత మైనపుడు, వాటి విషయంలో తత్తరపాటు లేకుండా వివేకంతో వ్యవహరించడం అసమ్మోహం. ఇది కూడా ఈశ్వర వైభవమే. ఇది అందరికీ సాధ్య మయ్యేది కాదు ***(ప్రత్యుత్పన్నేషు బోద్ధవ్యేషు వివేక పూర్వికా ప్రవృత్తిః).*** ప్రతి విషయంలో స్పష్టతను కలిగి ఉండటము అసమ్మోహం. స్పష్టత లేనపుడే మనస్సును మోహం ఆవరిస్తుంది. త్రాడును పాముగా చూడటం సంభవిస్తుంది. అలా చూడటం భయానికి కారణ మవుతుంది. త్రాడును త్రాడుగా చూడ గలిగితే మోహం ఉండదు. సర్పం గోచరించదు. భయం కలగదు.

ఈ అసమ్మోహ శక్తి బుద్ధిలో లేనపుడు ఇంద్రియాలు మోసం చేస్తూ ఉంటాయి. కనిపించేవే కాదు, వినిపించేవి కూడా భ్రాంతిని కలిగిస్తూ ఉంటాయి. రుచులు, వాసనలు, స్పర్శలు కూడా మోహంలో విపరీతం గానే అర్థ మవుతూ ఉంటాయి.

ఒకడు భావ కవి. ఎప్పుడూ ఏదో లోతుగా ఆలోచిస్తూ, గేయ రచన చేస్తూ ఉంటాడు. అలాంటి ఒక సమయంలో అతని ఇంటికి వచ్చిన అతని స్నేహితుడు, కవి గారిని ఆట పట్టించాలని, బిగ్గరగా ఏడుస్తూ, 'మిత్రమా! దారుణం జరిగి పోయిందిరా! నీ భార్య విధవ అయిపోయిందిరా!' అని భోరు మన్నాడు.

అంతే. చేతి లోని కలం, కాగితం ప్రక్కన పడేసి, 'ఆ(ఏమన్నావు? నా భార్య విధవై పోయిందా? అంటూ మిత్రుని ఏడుపుతో శ్రుతి కలిపాడు కవి. ఇద్దరూ ఏడుస్తున్నారు. అప్పుడే వాళ్ళ మధ్య కొచ్చి విషయాన్ని గ్రహించిన పిల్ల నిచ్చిన మామ గారు, 'ఛీ! వెధవా! నోర్ముయ్! ఏడ్చింది చాలు! వెధవవు నువ్వుండగా మా అమ్మాయి విధవ ఎలా అవుతుంది?' అన్నాడు. కవి అవాక్కయ్యాడు. సమ్మోహాలు ఇలాగే ఉంటాయి. అందుచేత అసమ్మోహం ఈశ్వర విభూతి.

క్షమ

ఎవరైనా నిందించినా, గాయ పరచినా, మనస్సులో వికారం చెందకుండా ఉండటము క్షమ. తిట్టినా, కొట్టినా చిత్తములో ఏ విధమైన మార్పు లేకుండా ఉండటము క్షమాగుణము ***(ఆక్రుష్టస్య తాడితస్య వా అవికృత చిత్తతా).*** ఆహార పానీయాలను అనుగ్రహించే అవని మాత అనర్థాలను విసర్జించినా భరిస్తుంది. ప్రాణాన్ని నిలిపే గాలిని దుర్గంధ పూరితం చేసినా, మారు మాట్లాడకుండా మోసుకు పోతుంది. ఎన్ని అపశబ్దాలను విసిరినా, ఆకాశం సాక్షిలా వీక్షిస్తూనే ఉంటుంది. అశుద్ధం చేసే వారిని కూడా శుద్ధి చేసే సుగుణాన్ని జలం కలిగి ఉంటుంది. ఇవన్నీ క్షమా రూపాలు. ఈశ్వర విభూతులు. ఇవన్నీ బల ప్రదర్శనలే గాని బలహీనతలు కావు.

సత్యము

మనం చూచింది, లేదా విన్నది, మన అనుభవానికి అందినది, అదే భావాన్ని స్ఫురించే లాగా ఇతరుల బుద్ధికి సంక్రమింప చేయడానికి ఉపయోగించే వాక్కు సత్యము ***(యథా దృష్టస్య యథా శ్రుతస్య చ, ఆత్మానుభవస్య పరబుద్ధి స విక్రాన్తయే తథైవ ఉచ్చార్యమాణా వాక్ 'సత్యమ్' ఉచ్యతే!).*** మనకు ఏది ఎలా అర్థమైందో, మనం చెప్పడంలో అది అలాగే ఇతరులకు అర్థం కావాలి. అదే సత్య వచనము. ఇదొక గొప్ప ధర్మము. అందుచేతనే సత్య వాక్కుకు మించిన ధర్మం లేదు అన్నది శాస్త్రం ***(సత్యాన్నాస్తి పరోధర్మః).*** సత్య స్వరూపుడైన భగవంతుడు ధర్మరూపంలో ఉన్నందున ధర్మరూపమైన సత్యవాక్కు ఈశ్వర విభూతి.

దమము

బాహ్యేంద్రియాలను నిగ్రహించే సామర్థ్యము దమము ***(బాహ్యేంద్రియ ఉపశమః).*** ఇంద్రియాలను నిగ్రహించలేని అశక్తతే బ్రతుకులో ఎన్నో అనర్థాలను సృష్టిస్తుంది. నోరు జారిన వాక్కు నరకాన్ని చూపిస్తుంది. ఇంద్రియ నియమము లేకపోవడమే కష్టాలకు కారణ మవుతూ ఉంది. మనో నిగ్రహం లేని వారు ముందు ఇంద్రియాలను నియమించ గలిగితే, ఆ తరువాత మనస్సును నిగ్రహించ గలుగుతారు. కనుక శుభ లక్షణమైన దమము ఈశ్వర విభూతియే.

శమము

అంతఃకరణమును నియమించడమే శమము ***(అంతఃకరణస్య ఉపశమః).*** ఆలోచనా విధానాన్ని సక్రమంగా నడుపు కోవడమే శమము. ఆలోచనా విధానం దారి తప్పితే, ఆ తరువాత ఏది జరిగినా దుఃఖమే అనుభవానికి అందుతూ ఉంటుంది. దుఃఖాన్ని దరి చేర నివ్వని శమము శివ స్వరూపము.

సుఖము

సుఖము అంటే ప్రియమైనది, ఆనందము ***(ఆహ్లాదః).***

దుఃఖము

దుఃఖము అప్రియము. బాధా పూరితము ***(సంతాపః).***

సుఖదుఃఖాలు రెండూ భగవంతుని ప్రసాదాలే. సుఖాలను ప్రసాదంగా స్వీకరించ వచ్చు. దుఃఖాలను ప్రసాదాలుగా ఎలా స్వీకరిస్తాము? అవి ఎలా మంగళకరం? అని మీరు సందేహించ వచ్చు.

బాధలు భగవంతుని జ్ఞాపకం చేస్తాయి. బ్రతుకులో పరివర్తనను కలిగిస్తాయి. బాధే లేకపోతే బ్రతుకే దుర్భర మేమో, ఆలోచించండి! బాధ ఉంది కనుకనే చీమ కుట్టినా, కాలు ప్రక్కకు తీసుకుంటున్నాను. బాధే లేకపోతే, ఎవడైనా సంతలో వెనుక నుండి చేతిని ఖండించినా, మనం దానిని గుర్తించకుండానే నడిచి ఇంటికి చేరుతా మేమో, ఆలోచించండి! అలా చూచి నపుడు దుఃఖం కూడా విభూతియే.

భవము

భవము అంటే పుట్టుక ***(ఉద్భవః).*** ఉత్పన్న శక్తి ఏదయినా, అది ఈశ్వర విభూతియే. సృష్టించే స్వభావము, నిర్మించే క్రియా శీలత్వము పరమేశ్వరుని వైభవాలు. ఒక కథను కవి సృష్టిస్తాడు. ఒక గీతానికి బాణీ సమకూర్చి గాయకుడు సరిగమలను జోడించి గానాన్ని సృష్టిస్తాడు. ఇవన్నీ ఈశ్వర వైభవాలే. ఇంతెందుకు? ప్రవంతిని కొనసాగించడానికి సంతానాన్ని ఉత్పత్తి చేయడం కూడా విభూతియే.

అభావము

భవమునకు వ్యతిరిక్త మైనది అభావము **(తద్విపర్యయః).** భవము అంటే పుట్టుక, లేదా నిర్మాణము కనుక అభావము అంటే వినాశము. ఏది సృష్టింప బడుతుందో, అదే నశింప చేయబడుతుంది. సృష్టించే నైపుణ్యము ఈశ్వర విభూతి అయినపుడు, నశింప చేసే శక్తి కూడా భగవ ద్విభూతియే. వైద్యుడు రోగాన్ని నశింప చేస్తాడు. రైతు ధాన్యం పండించి ఆకలిని పోగొడతాడు. కొందరు వినోదాన్ని సృష్టించి విషాదాన్ని మరపిస్తారు. ఇవన్నీ కళలే. కమనీయ మైన ఈశ్వర వైభవాలే.

భయము

భయం అంటే వెరపు పుట్టించేది **(త్రాసః).** చెడు మార్గాలలో వర్తించే వారు భగవంతుని చూచి భయ పడతారు. కర్మఫలాలను ప్రసాదించే వాడు కావడం చేత, భగవంతుడు భయ హేతువుగా తెలుస్తాడు.

భయా ద స్యాగ్ని స్తపతి భయా త్తపతి సూర్యః ।
భయా దిన్ద్రశ్చ వాయుశ్చ మృత్యు ర్ధావతి పంచమః ॥

పరమాత్మ భయం చేత అగ్ని జ్వలిస్తూ ఉంది. ఆ భయం తోనే సూర్యుడు ప్రకాశిస్తున్నాడు. ఇంద్రుడు, వాయువు, మృత్యువు కూడా పరమాత్మకు భయపడే తమ కార్యాలను నిర్వహిస్తున్నారు.

కార్యాలను చక్కదిద్దే భయాలన్నీ ఈశ్వర విభూతులే. పూర్వపు రోజుల్లో ఈ నియమమే సమాజానికి శ్రీరామరక్షగా ఉండేది. ఉపాధ్యాయుని చూచి విద్యార్థులు భయపడే వారు. వైద్యుని చూచి రోగులు భీతి చెందేవారు. పెద్దలను, తల్లిదండ్రులను చూచి పిల్లలు భీతి చెందేవారు. అధికారిని చూచి ఉద్యోగి భీతి చెందేవాడు. ఆ భయాలన్నీ బ్రతుకులను మంగళకరం గానే తీర్చి దిద్దాయి. అందుచేత భయం కూడా ఈశ్వర విభూతియే.

అభయము

భయమునకు వ్యతిరిక్త మైనది అభయము **(తద్విపర్యయః).** అభయ కారణము అద్వైతము కనుక, అది శివ స్వరూపము. భగవద్విభూతి. అధర్మపరులకు భయ హేతువైన భగవంతుడు, ధర్మపరులకు, భక్తులకు అభయ రూపుడు. సంసార భయమును పోగొట్టే వాడు భగవంతుడు. ఈశ్వర భావన అభయ రూపము. ఈశ్వర భావ స్పృహ ఉండటం చేత ఈశ్వరుని ఆశ్రయించి అభయమును పొందుతున్నాము. ఈశ్వరుని గుర్తు తెచ్చే ఈశ్వర భావన కూడా అభయ రూపమే. కనుక అది కూడా ఈశ్వర విభూతియే.

అహింస

ప్రాణులను పీడించకుండా ఉండటము, బాధించకుండా ఉండటము అహింస **(అపీడా ప్రాణినామ్).** **హింసాం న కుర్యాత్** - హింసను చేయకూడదు అన్నది వేదం. హింస లేకుండా జీవించడమే అహింస. అది దైవగుణము. ధర్మాలలో కెల్ల ఉత్తమమైన ధర్మము ***(అహింసా పరమో ధర్మః).*** ధర్మరూపంలో ఉన్నది దైవమే కనుక అహింసా భావన ఈశ్వర భావనయే. ఈశ్వర భావన ఈశ్వర విభూతియే.

సమత్వము

సమమైన చిత్తమును కలిగి ఉండటమే సమత్వము **(సమతా సమ చిత్తతా).** రాగద్వేషాలను తటస్థ పరచి జీవించడమే సమత్వము. 'నాకు ప్రియులు లేరు. ద్వేషులు లేరు. రాగద్వేషాలు లేని నేను సర్వులలో సముడను' *(9 వ అ - 29 వ శ్లో)* అన్నాడు భగవంతుడు. రాగద్వేషాలను నిర్వీర్యం చేసి సమజీవనం కొనసాగించే సాధకుల జీవితం ఈశ్వరమయంగా ఉంటుంది. అందుచేత, సమత ఈశ్వర విభూతి. సమత యోగ విభూతి. మమత రోగ ఆకృతి.

సంతృప్తి

లభించిన దానితో తృప్తి చెందే బుద్ధి సంతోషంగా ఉంటుంది. అదే సంతృప్తి ***(తుష్టిః)***. తుష్టి అంటే సంతోషము. సంతృప్తి. ప్రాప్తించిన దానితో తృప్తి చెందే మనస్తత్వము ***(తుష్టిః సంతోషః పర్యాప్త బుద్ధిః లాభేషు)***. ఇక చాలు అనే తృప్తియే తుష్టి ***(అలం బుద్ధిః తథా తుష్టిః)***.

ఎప్పుడూ తృప్తిగా ఉండటము భగవంతుని లక్షణము. అలా తృప్తిగా మనమూ జీవించ గలిగితే ఈశ్వర వైభవము మనలో కూడా ప్రకాశిస్తూ ఉందని అర్థము. అదే ఈశ్వర విభూతి.

తపస్సు

అంతర్ముఖత్వమే తపస్సు. విషయ సుఖాల నుండి విరమించడమే తపస్సు. అందుకే శివుడు సదా తపస్సులో ఉంటాడు. ధ్యానమగ్నుడై ఉంటాడు. అంతర్ముఖుడై ఉంటాడు. అది ఈశ్వర విభూతి. ఇంద్రియాలను నియమించి, దేహాన్ని నిగ్రహించి ఈశ్వర ధ్యానంలో జీవించడము తపస్సు. అది ఈశ్వర వైభవము ***(తపః ఇంద్రియ సంయమ పూర్వకం శరీర పీడనమ్)***.

దానం

మన శక్తిని అనుసరించి మనకు ఉన్న దానిని ఇతరులతో పంచుకోవడం దాన గుణము ***(యథా శక్తి సం విభాగః)***. ఇతరుల సుఖాలను వృద్ధి చేయడమే దాన గుణము లోని వైభవము. సర్వులకు సర్వమును సమకూర్చి సంతసమును కలిగించడం ఈశ్వర స్వభావము. అందుకే ఆయన దాత.

దానం అంటే పెట్టడమే కాదు. కొట్టకుండా ఉండటము కూడా దానమే. పొట్టకు పెట్టడం దానం. పొట్ట కొట్టకుండా ఉండటము కూడా దానమే. ***దండ న్యాసః పరం దానమ్*** - మనో వాక్కాయ కర్మల చేత ప్రాణులను బాధించకుండా ఉండటం కూడా దానమే. ఇది అభయ దానం. ఇది కూడా ఈశ్వర వైభవమే. ఈశ్వర విభూతియే.

యశస్సు

యశస్సు అంటే కీర్తి. ధర్మాచరణం వల్ల కలిగేది కీర్తి ***(ధర్మ నిమిత్తా కీర్తిః)***. ఎవరు ఈ ప్రపంచంలో కీర్తిని ఆర్జించినా అది భగవంతుని కీర్తియే అయి ఉంటుంది. సత్యము భగవత్స్వరూపము. సత్య జీవనాన్ని సాగించి హరిశ్చంద్రుడు కీర్తిమంతు డయ్యాడు. ధర్మము భగవత్స్వరూపము. ధర్మ జీవనాన్ని గడిపి ధర్మరాజు యశస్సు నార్జించాడు. ఈశ్వరుడు త్యాగమయుడు. త్యాగానికి ప్రతిరూపంగా శోభించి శిబి చక్రవర్తి కీర్తిమంతు డయ్యాడు. పరమేశ్వరుడు జ్ఞానమయుడు. జ్ఞానరూపులై శోభించి శ్రీ ఆదిశంకరాచార్య స్వామి అసమాన యశోవంతులై విరాజిల్లారు. కనుక, యశస్సు భగవద్విభూతి.

అయశస్సు

అయశస్సు అంటే అపకీర్తి. అధర్మాచరణం వల్ల ప్రాప్తించేది అపకీర్తి ***(అధర్మ నిమిత్తా అకీర్తిః)***. ధర్మమును తప్పి చరించడం కీర్తిని పోగొడుతుంది. పేరు మోసిన ఉగ్రవాదులకు ఎంతైనా అపకీర్తి ఉంది. కీర్తిని పొందిన రాముడు ఎందరికి తెలుసో, అపకీర్తిని మూట కట్టుకున్న రావణుడు అంత మందికి తెలుసు. పరమేశ్వరుని వైభవమును విస్మరిస్తే, ధర్మానికి విరుద్ధంగా జీవిస్తే, మోయలేని అపకీర్తి భారాన్ని మోయ వలసి వస్తుంది అనే స్పృహ కలగడం మళ్ళీ ఈశ్వర విభూతియే. ధర్మాచరణలో ప్రవృత్తి ఎలా ఈశ్వర వైభవమో, అధర్మ విషయంలో నివృత్తి కూడా అలా ఈశ్వర వైభవమే.

ఇంతవరకు నాలుగు, ఐదు శ్లోకాలలో మనం సంక్షిప్తంగా, సారభూతంగా అధ్యయనం చేసిన అనేక విధాలైన భావాలన్నీ పరమేశ్వరుని వల్లనే సంభవిస్తున్నాయి అని మనం స్పష్టంగా అర్థం చేసుకున్నాం ***(పృథగ్విధాః భావాః భూతానామ్ మత్తః ఏవ భవన్తిః)***.

అనేక విధాలైన భావాలు ***(పృథగ్విధాః భావాః)*** అనడంలో చెప్పినవి, చెప్పనివి కూడా అని అర్థము. ప్రస్తుతం మనం చూచిన ఇరవై భావాలే గాక, మిగిలినవి ఎన్నైతే ఉన్నాయో అవన్నీ కూడా అని అర్థము. ఇకపోతే, నా వల్లనే సంభవిస్తున్నాయి ***(మత్తః ఏవ)*** అని చెప్పడంలో **ఏవ** కారము అవధారణార్థక మని గ్రహించాలి.

ఇవన్నీ పరమేశ్వరుని వల్లనే సంభవిస్తున్నాయి అంటే దాని అర్థం, అనుకూల ప్రతికూల ఫలాలను (భావాలను) పరమేశ్వరుడు ప్రసాదించడం వెనుక ఆయనకు రాగద్వేషాలు ఉన్నాయని కాదు. వారి వారి కర్మలను అనుసరించి పరమేశ్వరుడు ఆయా భావాలను కర్మఫలాలుగా వారికి ప్రసాదిస్తూ ఉంటాడు ***(స్వకర్మాను రూపేణ)*** అని భావం. ఏ విత్తనం నాటుతామో ఆ ఫలమే అందుతుంది. ఏ కర్మ నాచరిస్తామో ఆ భావాలే ఫలాలుగా అందుతాయి.

సృష్టి లోని భావాలే కావు, సృష్ట్యాది యందున్న మనువులు, మహర్షులు కూడా తన నుండి సంభవించిన వారే నని చెబుతున్నాడు.

మహర్షయః సప్త పూర్వే చత్వారో మనవ స్తథా ।
మద్భావా మానసా జాతా యేషాం లోక ఇమాః ప్రజాః ॥ 6

మహర్షయః-సప్త-పూర్వే-చత్వారః-మనవః-తథా
మద్భావాః-మానసాః-జాతాః-యేషాం-లోకే-ఇమాః-ప్రజాః

లోకే	=	లోకములో	తథా	=	అటులే
ఇమాః	=	ఈ	పూర్వే	=	పూర్వులైన
ప్రజాః	=	ప్రజలు	చత్వారః	=	నలుగురు
యేషాం	=	ఎవరికి	మనవః	=	మనువులు
జాతాః	=	పుట్టారో	మద్భావాః	=	నా భావము గలవారై
తే	=	ఆ	మానసాః	=	మనస్సు నందు
సప్త	=	ఏడుగురు	జాతాః	=	పుట్టిరి
మహర్షయః	=	మహర్షులు			

అర్జునా! సప్త ఋషులు, అలాగే నలుగురు మనువులు, వీరందరూ పూర్వీకులు. నా భావమునే అనుసరించే వారు. నా మానస పుత్రులు. ఈ ప్రపంచ మంతా వీరి సంతానం గానే విస్తరించింది.

వ్యాఖ్య

సంతతి - సన్నుతి

భగవంతుని లోక మహేశ్వరత్వమునకు హేత్వంతరముగా ఈ శ్లోకం కూడా శోభిస్తూ ఉంది. సృష్ట్యాదిలో ఉన్న వారిని చెబుతూ, వారి ద్వారా ఈ విశ్వము విస్తరించిన విధానమును విస్పష్టం చేస్తున్నాడు.

సప్త ఋషులు, నలుగురు మహర్షులు, అలాగే స్వాయంభువాది పద్నాలుగు మంది మనువులు ప్రాచీనులు.

పూర్వే అనడం వల్ల వారు పూర్వీకులు అని అర్థం. అంటే గడచిన కాలానికి సంబంధించిన వారు ***(అతీత కాల సంబంధినః).*** ఈ ప్రాచీనత్వము సృష్ట్యాది కావచ్చు. లేదా ఒక ప్రత్యేకమైన కల్పాది కూడా కావచ్చు. ఏదైనా సృష్ట్యాదినే సూచిస్తుంది. వీరి వల్లనే ఈ చరాచర ప్రపంచము విస్తరించింది.

భృగుం మరీచి మత్రించ పులస్త్యం పులహం క్రతుమ్,
వసిష్ఠం చ మహాతేజా స్సోఽ సృజ న్మనసా సుతాన్ ॥
సప్త బ్రహ్మాణ ఇత్యేతే పురాణే నిశ్చయం గతాః ।

భృగువు, మరీచి, అత్రి, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, వసిష్ఠుడు - సప్త ఋషులుగా పేరొందిన ఈ ఏడు మందిని భగవంతుడు సంకల్పము చేత సృష్టించాడు. ఈ సప్త ఋషులను సప్త బ్రహ్మలు అని అంటారు. ఇది పురాణ ప్రసిద్ధము.

వీరి లాగే మరో నలుగురు ఉన్నారు ***(చత్వారః)*** అన్నాడు. వారే సనక సనందనాది మహర్షులు. బ్రహ్మ మానస పుత్రులు.

వీరు గాక, మనువులు కూడా పురాతనులుగా చెప్పబడ్డారు. వారే స్వాయంభువాది మనువులు. వీరు పద్నాలుగు మంది. వీరు కూడా సృష్ట్యాదిలో ఉన్న వారే. వీరందరు గొప్ప తేజోవంతులు ***(మహాతేజాః).*** భగవద్భావన కలవారు ***(మద్భావాః).*** భగవచ్ఛక్తి కలవారు. కనుకనే వీరు సర్వశ్రేష్ఠులు. విశ్వస్రష్టలు. మూల పురుషులు.

బ్రహ్మదేవుని పగటి కాలంలో సృష్టి ఆరంభమై, బ్రహ్మదేవుని రాత్రి సమయాన, సృష్టి లయిస్తూ ఉందని ముందే గ్రహించాము *(8 వ అ - 17 & 18 వ శ్లో).* ఒక కల్పంలో, అంటే బ్రహ్మదేవుని పగటి కాలంలో పద్నాలుగు మంది మనువులు లోకాన్ని సమంగా పాలిస్తారు. అంటే బ్రహ్మదేవుని పగటి కాలంలో ఒక్కొక్క మనువు పద్నాల్గవ వంతు కాలం విశ్వాన్ని పరిపాలిస్తాడు. మనకు అర్థమయ్యే మానవ సంవత్సరాలలో చెప్పుకుంటే, ఒక్కొక్క మనువు నాలుగు కోట్ల, మూడు లక్షల, ఇరవై వేల సంవత్సరాలు పరిపాలిస్తాడు. ఈ సంఖ్యను పద్నాలుగుతో పెంచుకుంటే బ్రహ్మదేవుని ఒక్క పగటి కాలము అవుతుంది. ఇలా పద్నాలుగు మంది మనువులు పాలిస్తారు. ప్రస్తుతం మనం వైవస్వత మనువు పాలనలో ఉన్నాం. కనుకనే పూజాది కాలాలలో <u>వైవస్వత</u> ***మన్వంతరే*** అంటూ సంకల్పం చెబుతాము. ***<u>మన్వన్తరమ్</u> - అన్యోమనుః అస్మిన్నితి <u>మన్వంతరమ్</u> -*** మరొక మనువు ప్రవేశించేది మన్వంతరము.

ఈ విధంగా పూర్వీకులైన మహర్షులు, మరియు స్వాయంభువాది మన్వాదుల చేత ఈ చరాచర ప్రపంచము విస్తరించింది. మనువు నుండి పుట్టిన వారము కావడం చేత మనం మానవులము ***(మానవాః).*** మనుజులము. అంతేగాని యోనిజులము కాము. చరాచర మంతా మనువు నుండే ఆవిర్భవించినా, గుర్తించే సామర్థ్యం మానవులకే ఉంది. కనుక మనకు మూల పురుషులు మహర్షులు, మనువులు అనేది అర్థమైంది. కనుకనే మనకు ఋషి గోత్రాలు ప్రాప్తించాయి. మనది ఋషికులం. మన మందరము ఋషుల సంతానము. కనుక ఋషిత్వ మనేది మన జన్మ హక్కు. అదే మన పిత్రార్జితము. ఋషుల ప్రతిరూపంగా మనం నేడు ఉన్నాము. వారు ప్రవర్తించిన మార్గమే మన మార్గము. వారు నిర్దేశించిన బాట లోనే మనం పయనించాలి.

నిష్ఠాద్వయము

సృష్ట్యాదిలో జ్ఞానయోగ, కర్మయోగా లనే నిష్ఠా ద్వయాన్ని సూర్యునికి తానే బోధించినట్లు, సూర్యుడు మనువుకు చెప్పినట్లు నాల్గవ అధ్యాయం ఆరంభము లోనే భగవంతుడు ప్రబోధించాడు.

పరమేశ్వరుని అనుగ్రహ ప్రసాదాలుగా లోకానికి ప్రాప్తించిన జ్ఞానయోగ, కర్మయోగాలు కూడా చరాచరాత్మక మైన లోకం విస్తరించినట్లే విస్తరించాయి. స్వాయంభువాది మనువులు ప్రవృత్తి మార్గమును నిర్దేశిస్తూ కర్మయోగమును విస్తరింప చేస్తే, సనక సనందనాది మహర్షులు నివృత్తి మార్గమును నిర్ణయిస్తూ జ్ఞానయోగమును విస్తరింప చేశారు. వీరందరూ సంప్రదాయ రక్షకు లయ్యారు. స్వాయంభువాది చతుర్దశ మనువులు వంశ పరంపరను వృద్ధి చేస్తూ ప్రవృత్తిని ప్రవచిస్తే, మహర్షులు గురు పరంపరను రక్షిస్తూ నివృత్తిని ప్రబోధించారు. కనుకనే బ్రహ్మ విద్యాభ్యాసంలో ముందుగా సంప్రదాయ కర్తలకు నమస్కరించి, ఋషి వంశాన్ని స్తుతించి, మహనీయులకు, మహర్షులకు వందన మాచరించి, ఆ తరువాత అధ్యయనమును ప్రారంభిస్తాము. ఇదే సంప్రదాయ రక్షణ.

ఓం నమో బ్రహ్మాదిభ్యో
బ్రహ్మవిద్యా సంప్రదాయ కర్తృభ్యో
వంశ ఋషిభ్యో మహద్భ్యో నమో గురుభ్యః

బ్రహ్మదేవుని మొదలుకొని, బ్రహ్మవిద్యా సంప్రదాయమును ఏర్పరచిన ఋషి వర్యులకు, ఋషి వంశములో ప్రకాశించిన మహాత్ములకు, మహనీయులైన సర్వులకు, గురువులకు నమస్కారము. నమస్కారము.

ఈ విధంగా భగవద్విభూతిని తెలుసుకున్న వారికి కలిగే ఫలిత మేమిటో చెబుతున్నాడు.

ఏతాం విభూతిం యోగం చ మమ యో వేత్తి తత్త్వతః ।
సోఽవికమ్పేన యోగేన యుజ్యతే నాత్ర సంశయః ॥ 7

ఏతాం-విభూతిం-యోగం-చ-మమ-యః-వేత్తి-తత్త్వతః
సః-అవికంపేన-యోగేన-యుజ్యతే-న-అత్ర-సంశయః

మమ	=	నా యొక్క	సః	=	వాడు
ఏతాం	=	ఈ	అవికంపేన	=	చలించని
విభూతిం	=	మహిమను	యోగేన	=	యోగము చేత
యోగం చ	=	యోగమును	యుజ్యతే	=	కూడిన వాడవుతాడు
తత్త్వతః	=	యథార్థముగా	అత్ర	=	ఈ విషయము నందు
యః	=	ఎవడు	సంశయః	=	సంశయము
వేత్తి	=	తెలిసికొనునో	న	=	లేదు

అర్జునా! విస్తార మైన నా విభూతిని ఎవడైతే యదార్థంగా తెలుసుకుంటాడో, అతడు యోగంలో చలించడు. స్థిరంగా ఉంటాడు. ఈ విషయంలో సందేహం లేదు.

వ్యాఖ్య

నిర్విశేషము, నిరుపాధికము అయిన పరబ్రహ్మము యొక్క అద్భుతమైన వైభవమును, అది జగద్రూపంలో విస్తరించడం అనే విభూతి వైభవమును ఇంతవరకు చెప్పి ***(ఏతాం యథోక్తాం),*** దానిని తెలుసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాన్ని, ఫలాన్ని ఇప్పుడు చెబుతున్నాడు. అంటే, సోపాధిక మైన విభూతి ప్రదర్శనమును, దానిని గ్రహించుట చేత ప్రాప్తించే ఫలమును ఈ శ్లోకంలో చెబుతున్నాడు.

ఉపాధులకు కారణమైన మాయ పరమాత్మ అధ్యక్షతన వివిధ రూపాలుగా విస్తరించుట, లేదా పరిణమించుటయే విభూతి. ***భూతిః*** అంటే సత్తాత్మక మని గత శ్లోకంలో తెలుసుకొని ఉన్నాము.

భూతిః భవనం - సత్తాత్మకము లేక ఉనికి 'భూతి' అయితే, విశేష మైన ఉనికి 'విభూతి'. విభూతి అంటే వ్యక్త వైభవము ***(వివిధా భూతిః భవనం వైభవం సర్వాత్మకత్వం).*** 'వి' అంటే వివిధ రూపాలతో. 'భూతి' అంటే ఉండటము. అనేక రూపాలతో దివ్యంగా శోభించడమే విభూతి. ఇది సోపాధికము. దీనిని తెలుసుకోవడం వల్ల కలిగే జ్ఞానము సోపాధిక జ్ఞానము. విభూతి వైభవము. సోపాధిక జ్ఞానము నిరుపాధిక జ్ఞానానికి మార్గమును సుగమం చేస్తుంది ***(సోపాధిక జ్ఞానం నిరుపాధిక జ్ఞానే ద్వారం*** - ఆనందగిరి***).***

మాయా ప్రభావము చేత వివిధ ఆకారములుగా విస్తరించుట అన్నప్పుడు, మాయకు అధిష్ఠానమైన నిరుపాధిక సత్తాత్మకం ఉంది అని అర్థం. సోపాధిక మైన విభూతి స్వరూపము నిరుపాధిక మైన సద్రూప చైతన్యము నుండి సంభవించింది అన్నప్పుడు, ఈ రెండిటి మధ్య ఉండే సంబంధం ఎలాంటిదో ముందుగా మనకు అర్థం కావాలి. అది కూడా యథార్థంగా తెలియాలి ***(తత్త్వతః). తత్త్వతః*** లేక ***తత్త్వేన*** అంటే తత్త్వం చేత, ఉన్నది ఉన్నట్లుగా తెలియాలి.

తెలియడము అంటే జ్ఞానము. తత్త్వం చేత అంటే తాత్త్విక జ్ఞానం చేత అని అర్థము. తత్త్వ జ్ఞానము అంటే ఏమిటి? ఆత్మ ఏకము, అద్వయము. ఆత్మ ఒక్కటే సత్యము. దానికి అన్యమైన దంతయు మాయ లేక మిథ్య. ఇదే తత్త్వ జ్ఞానము.

ఒకటి సత్యము. అదే అధిష్ఠానము. మరొకటి అధిష్ఠాన వస్తువుతో సంబంధమును కలిగిన ఆరోపిత వస్తువు. అది మిథ్య. అదే వివిధాకారంగా శోభించే విశ్వము. మరి, ఈ రెండిటి మధ్య ఉండే సంబంధము ఎలాంటిది? సత్య మిథ్యా సంబంధము.

మిథ్యకు ప్రత్యేక అస్తిత్వము లేనందున, సత్యముపై ఆధార పడిన మిథ్యా జగత్తు సత్యము కన్నా వేరుగా ఉండ లేదు. కనుక, మిథ్య కూడా సత్యమే. కాని సత్యము మిథ్య కాదు. సత్యము మిథ్య అయితే, మిథ్య లాగే సత్యము కూడా మరొక సత్యముపై ఆధార పడవలసి వస్తుంది. అలా ఆధార పడేది ఏదైనా మిథ్య అవుతుందే గాని సత్యం కాలేదు.

కనుక, ఆరోపిత వస్తువు నిషేధింపబడి, అధిష్ఠాన వస్తువుతో ఏకమై ఉండటమే, అనగా ఏకత్వం తెలియడమే తత్త్వ జ్ఞానము. ***తత్త్వతః*** జ్ఞానము.

అధిష్ఠానం ఉంది. దానిని ఆధారం చేసుకొని ఆరోపితము ఉంది. కనుక, ఆరోపితము ఉంది, అధిష్ఠానము ఉంది. ఆరోపితము లేదు, అయినా అధిష్ఠానం ఉంటుంది. ఇదే తత్త్వ జ్ఞానము. ***తత్త్వతః*** తెలియడ మంటే ఇదే.

మట్టి అధిష్ఠానము. మట్టికుండ ఆరోపితము. మట్టికుండ మట్టికి దూరంగా ఉండలేదు. కనుక, ఆరోపితమైన మట్టికుండ మట్టియే. కాని, మట్టి మాత్రం కుండ కాదు. ఇదే ***తత్త్వతః*** తెలియడ మంటే.

జగత్తు జగదీశ్వరుడే. కాని, జగదీశ్వరుని జగత్తుగా చూడ కూడదు. జగద్వైభవమును జగదీశ్వర వైభవముగా దర్శించడమే విభూతి దర్శనము. కాని సత్తాత్మక మైన జగదీశ్వరుని జగత్తుగా చూడ కూడదు.

విభూతి వైభవము ఉజ్జ్వల మైనది. ఉత్కృష్ట మైనది. ఉత్కర్షమును బ్రహ్మముగా దర్శించడములో దోషం లేదు ***(బ్రహ్మ దృష్టిః ఉత్కర్షాత్).*** కాని బ్రహ్మమును మరొక దానిలో దర్శించ కూడదు. ఉపాసనలో కూడా ఇది చాలా ప్రధానమైన విషయము. విగ్రహమును భగవంతుడుగా దర్శించ వచ్చు. కాని, భగవంతుని విగ్రహంగా దర్శించ కూడదు. ఇదే తత్త్వజ్ఞానము. ఇలా ***తత్త్వతః*** ఎవడు విభూతిని, యోగమును తెలుసు కుంటాడో, అట్టివాడు యోగంలో చలించడు. అప్రచలితంగా ఉంటాడు. అదే అవికంప యోగము.

'వికంపము' అంటే వికల్పము. వికల్పము లేని స్థితి 'అవికంపము'. అదే చలించని యోగము. అవికంప యోగము ***(అవికంపే న యుజ్యతే).*** సర్వమూ ఈశ్వరుడే అనే జ్ఞానము చలింపకుండా ఉండటమే అవికంప యోగము. అట్టి జ్ఞానముతో ఈశ్వరుని తెలుసుకొనే వాడు యోగములో చలించకుండా ఉంటాడు. ఈ విషయంలో సందేహానికి అవకాశము లేదు అంటున్నాడు ***(న అత్ర సంశయః, న అస్మిన్ అర్థే సంశయః అస్తి).*** కారణం, ***తత్త్వతః*** లభించిన జ్ఞానము ప్రమాణ ఫలం కావడమే. శాస్త్ర, ఆచార్యోపదేశ జన్యమైన వివేకము చేత కలిగింది కనుక ఈ తత్త్వ జ్ఞానము అబాధితంగా శోభిస్తుంది. అలా ఎవడు తెలుసుకుంటాడో అట్టి వాడు యోగంలో చలించడు. స్థిరంగా ఉంటాడు.

యోగంలో చలించడు అంటే, యోగాన్ని చలింప చేసే రాగద్వేషాల నుండి విడిపడి ఉంటాడని అర్థము. అంతేకాదు, విభూతి ఉపాసనా జనిత శక్తి చేత అతని అంతఃకరణము నిశ్చలంగా ఉంటుంది. అటు కర్మయోగము ద్వారా అంతఃకరణ శుద్ధిని, ఇటు ఉపాసన ద్వారా అంతఃకరణ నైశ్చల్యమును పొంది ఉండటం చేత, విభూతిని, యోగమును ***తత్త్వతః*** తెలుసుకున్న వాడు ధ్యానంలో చలించడు.

*సత్తాత్మక మగు పరమాత్మ తత్త్వమును, ఐశ్వర్య ప్రధానమైన ఈశ్వర విభూతిని, రెండిటిని **తత్త్వతః** తెలియడం చేత, అలా తెలుసుకొనిన భక్తులు భగవంతుణ్ణి పరమార్థ తత్త్వ అభినివేశంతో ఆరాధిస్తారు. చదవండి.*

అహం సర్వస్య ప్రభవో మత్తః సర్వం ప్రవర్తతే ।
ఇతి మత్వా భజన్తే మాం బుధా భావ సమన్వితాః ॥ 8

అహం-సర్వస్య-ప్రభవః-మత్తః-సర్వం-ప్రవర్తతే

ఇతి-మత్వా-భజంతే-మాం-బుధాః-భావ సమన్వితాః

అహం	=	నేను	ఇతి	=	అని
సర్వస్య	=	సమస్తమునకు	మత్వా	=	తలచి
ప్రభవః	=	ఉత్పత్తి కారకుణ్ణి	భావ సమన్వితాః	=	పరమార్థ భావము గలవారై
మత్తః	=	నా వలన	బుధాః	=	జ్ఞానులు
సర్వం	=	సమస్తము	మాం	=	నన్ను
ప్రవర్తతే	=	ప్రవర్తిస్తూ ఉంది	భజంతే	=	సేవిస్తున్నారు

అర్జునా! ఈ సమస్త ప్రపంచము నా వల్లనే కలిగింది. నా వల్లనే నడుస్తూ ఉంది. ఈ విధంగా తెలుసుకున్న పండితులు, నన్నే పూర్ణ భక్తితో సేవిస్తారు.

వ్యాఖ్య

దీపం వెలుగుతూ ఉండాలి. మనిషి ఆనందంగా జీవనయాత్ర సాగించాలి. దీపం వెలుగుతూ ఉండాలి అంటే, దీపంలో చమురు నిండుగా ఉండాలి. మనిషి ఆనందంగా ఉండాలి అంటే, మనిషిలో జ్ఞానం పుష్కలంగా ఉండాలి. చమురు లేకుండా దీపం వెలగ లేదు. జ్ఞానం లేకుండా మనిషి ఆనందంగా జీవించ లేడు.

జ్ఞానం అంటే ఏదో కాదు. పరమేశ్వరునికి సంబంధించిన జ్ఞానమే నిజమైన జ్ఞానం. సత్యజ్ఞానం. ఈశ్వర జ్ఞానం. ఈ దృశ్యమాన ప్రపంచానికి పరమేశ్వరుడే కారణం అనే జ్ఞానం. ఈ ప్రపంచం లోని వైభవాలన్నీ ఈశ్వర వైభవాలే అనే జ్ఞానం.

రూపాలు కళ్ళకు అందుతాయి. శబ్దాలు చెవులకు అందుతాయి. భగవంతుడు జ్ఞానానికి అందుతాడు. జ్ఞానం బుద్ధికి అందుతుంది. కనుక, ***బుద్ధి గ్రాహ్యం అతీంద్రియం*** - ఇంద్రియాలకు అందని భగవంతుడు బుద్ధికి అందుతాడు.

అర్జునా! ఈ సమస్తము నా నుండే ఆవిర్భవించింది ***(అహం సర్వస్య ప్రభవః)***. అలా ఉత్పన్నమైన సమస్తము నా వల్లనే నడుస్తూ ఉంది ***(మత్తః సర్వం ప్రవర్తతే)***.

'అహం' శబ్దార్థము

అహం - 'నేను' అంటూ భగవానుడు ఈ శ్లోకాన్ని ప్రారంభించాడు. ***అహం సర్వస్య ప్రభవః*** అంటూ ఈ జగత్తు యొక్క ప్రారంభం తన నుండే జరిగింది అని చెప్పడానికి శ్లోకాన్ని కూడా ***అహం*** - నేను అంటూ తన నుండే ప్రారంభించాడు భగవంతుడు.

ఇక్కడ ***అహం*** అంటే పరమాత్మ అని అర్థము. ***అహం పరంబ్రహ్మ వాసుదేవాఖ్యం*** - వాసుదేవుడు అనే పేరు గల పరమాత్మ నైన నేను అని ***అహం*** శబ్దార్థము. వాసుదేవుడైన తన నుండే జగత్తు ఆవిర్భవించింది. వాసుదేవుడైన తన వల్లనే ఈ జగత్తు నడుస్తూ ఉంది. అంటే, ఈ జగత్తుకు ఉపాదాన కారణముగా, సృష్టికి కారణమైన వాసుదేవుడే, నిమిత్త కారణము కూడా తానే అయి స్థితి కారకుడుగా కూడా శోభిస్తున్నాడు. అదే వాసుదేవ నామ వైభవము.

వాసుశ్చ అసౌ దేవశ్చ ఇతి వాసుదేవః - 'వాసుదేవ' అనే పేరులో రెండు పదాలు ఉన్నాయి. ఒకటి 'వాసు', రెండవది 'దేవ'. ఇవి నిగూఢమైన, భావగర్భిత మైన పదాలు. ప్రస్తుత శ్లోకానికి దివ్యమైన వ్యాఖ్యానాలు. కనుకనే, ఈ సందర్భములో ***అహం*** పదానికి వాసుదేవ నామాన్ని ఉటంకించింది శంకర భాష్యము. 'వాసు' శబ్దము ఉపాదాన కారణమును, 'దేవ' శబ్దము నిమిత్త కారణమును సూచిస్తున్నాయి.

వసతి వాసయతి, ఆచ్ఛాదయతి వా సర్వమితి వాసుః - అంతటా వసించుట, అంతట సదాత్మకంగా తానే ఉండుట ***(వసతి)***, కారణముగా సమస్తమును ఆచ్ఛాదించుట ***(ఆచ్ఛాదయతి)*** 'వాసు' శబ్దార్థము. అంటే ఉపాదాన కారణమై అంతటా వ్యాపించి ఉండటము అని అర్థము.

కుండకు మట్టి ఉపాదాన కారణము. ఉపాదాన కారణం కావడం చేత మట్టి కుండ నంతా వ్యాపించి ఉంది. వస్తు ఉపాదానము వస్తువుకు దూరంగా ఉండలేదు. కుండలో మట్టి లేని చోటంటూ ఉండదు. అదే ఉపాదాన విశేషము.

కుండకు ఉపాదానమైన మట్టి, కుండగా ఉంటూ, కుండలో అంతా ఎలా వ్యాపించి ఉందో, జగత్తుకు ఉపాదాన కారణమైన పరమేశ్వరుడు జగత్తుగా ఉంటూ, జగత్తులో అంతటా వ్యాపించి ఉన్నాడు. జగత్తంతా అతని లోనే ఉంది. అదే 'వాసు' శబ్దార్థము. అంతేకాదు, తాను అంతటా నిండి ఉన్నా, అర్థం కాకుండా ఆచ్ఛాదించి ఉన్నాడు. కప్పి ఉన్నాడు. అందుచేత, ఉండినా లేనట్లే మాయ చేత కప్పబడి ఉన్నాడు కనుక ***(ఆచ్ఛాదయతి)***, అర్థం కాకుండా ఉన్నాడు ***(అగ్రాహ్యం)***.

దేవ శబ్దము ***దివ్*** అనే ధాతువు నుండి వచ్చింది. ***దివ్*** అంటే ***దీవ్యతి, క్రీడతి, వ్యవహరతి, ద్యోతతే*** అని అనేక అర్థా లున్నాయి. ప్రకాశించడము, క్రీడించడము, వ్యవహరించడము, భాసించడము అనే అర్థా లున్నాయి. పరమేశ్వరుడు జ్ఞాన స్వరూపుడు కనుక ఆయన ప్రకాశరూపుడు. సర్వమును తెలిసిన వాడు. అంటే, 'వాసు' శబ్దార్థము తెలిపినట్లు, ఆయన కేవలం ఉపాదాన కారణమే గాక, నిమిత్త కారణంగా కూడా ఉన్నాడు అని 'దేవ' శబ్దము సూచిస్తూ ఉంది. నిర్దేశిస్తూ ఉంది. సృష్టి అనేది ఆయనకు క్రీడా మాత్రమే, లీలా విలాసమే అని కూడా చెబుతూ ఉంది.

వాసుదేవ నామధేయుడైన పరమేశ్వరుడు, 'వాసు' - 'దేవ' శబ్దార్థముల చేత, ఈ సమస్త విశ్వానికి అభిన్న నిమిత్త ఉపాదాన కారణంగా విలసిల్లు తున్నాడని అర్థమైంది. **కార్యం సర్వం కారణ మాత్ర మేవ** - కార్యము సమస్తము కారణము మాత్రమే అనే న్యాయమును అనుసరించి, కార్య రూపమైన ఈ సమస్త ప్రపంచము పరమాత్మ వైభవమే అని స్పష్ట మవుతూ ఉంది. ఇదే యోగ విభూతి. విభూతి యోగము.

ఉపాదాన కారణంగా పరమాత్మ మనకు తల్లి. భగవతి. నిమిత్త కారణంగా పరమాత్మ మనకు తండ్రి. భగవంతుడు. కన్నవాడు తానే. కనికరించి కాపాడే వాడూ తానే. అందరిలో ఉన్న తాను విభూతి సుందరుడు. వాస్తవానికి అందరినీ తన లోనే నింపుకున్న శ్యామసుందరుడు, వాసుదేవుడుగా సత్తాత్మకమై శోభిస్తున్నాడు. అందుచేతనే, 'కన్నా! మన్ను తిన్నావా? ఏది, నీ నోరు తెరువు!' అని యశోదమ్మ అడిగి నపుడు, నందనందనుడు మందహాసమును చిందించాడు. మన్నేమిటి? మన్నైనా, మిన్నైనా, మహియైనా, మహిమైనా, చివరికి ప్రశ్నించే మా అమ్మయినా - అందరూ నా లోనే ఉన్నారు, అన్నీ నా లోనే ఉన్నాయంటూ నోరు తెరిచాడు. అంతే, విశ్వమంతా తల్లికి నోటి లోనే కనిపించింది. చివరికి ఆ అద్భుత దృశ్యాన్ని తిలకించే తనను కూడా యశోద ఆ దృశ్యం లోనే దర్శించింది.

మన్ను తింటి వని నోరు చూపమనగా
తెరిచి చూపితి వట నోట త్రిభువనములు
మా కళ్ళకు ఆ భాగ్య మెపుడు కలుగు
నీ అడుగుల కడ పడి ఉందు చిన్నికృష్ణా!

అని చిన్నికృష్ణ శతకములో ఒక వెన్నముద్ద.

ఉద్గమ స్థానము

అర్జునా! సమస్త ప్రపంచానికి పుట్టుక స్థానము నేనే **(అహం సర్వస్య జగతః ప్రభవః ఉత్పత్తిః)** అని భగవానుడు. ప్రపంచానికి ఉత్పత్తి స్థానము పరమేశ్వరుడే. ఉపాదాన కారణం తానే కావడం చేత, జగత్తుకు పుట్టుక స్థానము పరమేశ్వరుడే. అతని నుండే సమస్త విశ్వము ఆవిర్భవించింది **(ప్రపంచోత్పత్తి ఉపాదాన కారణత్వాత్ ప్రభవః)**.

అల లన్నిటికీ సముద్రమే ఎలా ప్రభవ స్థానమో, అలాగే జగత్తుకు పరమాత్మ ఉద్గమ స్థానము. అలలన్నీ సముద్రము లోనే ఉన్నట్లు, యావత్ప్రపంచము పరమాత్మ యందే ఉంది. అందరికీ పుడమి పుట్టినిల్లు. కాని, పుడమి తల్లికి పరమేశ్వరుడు పుట్టిల్లు.

ఇంపు మల్లె కుంది కంపు ఉల్లి కుంది
ఇరువురిని కనిన పుడమి తల్లి ఉంది
తల్లి పుట్టిల్లు నీది మల్లయ్య తండ్రీ!
నీ అడుగుల కడ పడి ఉందు నీలకంఠా!

అని నీలకంఠ శతకంలో ఒక విబూది పండు.

జీవన సారము

అర్జునా! నా నుండి పుట్టిన ప్రపంచము నా వల్లనే బ్రతుకుతూ ఉంది **(మత్తః సర్వం ప్రవర్తతే)**. నా శక్తి తోనే నడుస్తూ ఉంది అంటున్నాడు. ఇది స్థితి వైభవము. పుట్టించిన వాడే పోషిస్తున్న వైనము.

ప్రపంచంలో ఎందరో ఎన్నో సృష్టిస్తూ ఉంటారు. కాని, సృష్టించే వాళ్ళే రక్షించాలి లేదా పోషించాలి అనే

నియమము మాత్రము లేదు. సృష్టించిన వాళ్ళు కొన్ని విషయాలలో రక్షించ లేని వాళ్ళుగా ఉంటే, రక్షించే వాళ్ళు సృష్టించే విషయంలో సామర్థ్యం లేని వాళ్ళై ఉంటారు.

జన్మ నిచ్చిన తల్లి ప్రసవించి మరణిస్తే, అది చూచి తట్టుకోలేక తండ్రి మరణించిన ఘటన లున్నాయి. జన్మించిన బిడ్డ అనాథగా మారితే, అపరిచితు లెవరో పెంచి పెద్ద చేసి పెళ్ళి చేసిన సంఘటనలూ ఉన్నాయి. సృష్టించిన వాళ్ళే పోషించాలని లేదు. కాని, భగవంతుడు అలా కాదు. అందరినీ తానే సృష్టిస్తాడు **(జనయతి)**. అలా సృష్టింప బడిన వారి నందరిని తానే వృద్ధి చేస్తాడు **(వర్ధయతి)**.

వృద్ధి చెందడానికి కావలసిన దంతా తానే అందిస్తాడు. ఎవరెవరికి ఏవేవి అందించాలో, ఎప్పుడు అందించాలో, ఎక్కడ అందించాలో, ఎలా అందించాలో, ఎంత అందించాలో, ఎందుకు అందించాలో సర్వజ్ఞుడైన అతనికి తెలుసు. వారి వారి కర్మలను అనుసరించి **(స్వకర్మాను రూపేణ)** ఆయా ఫలాలను వారికి అందిస్తాడు. ఆ దివ్యాత్ముని కృప తోనే ఈ ప్రపంచం నడుస్తూ ఉంది **(మత్తః ఏవ సర్వం జగత్ ప్రవర్తతే)**.

భగవంతుడే మన జీవన జ్యోతి. ఆయనే మన జీవనసారము. అనుక్షణము ఆయన కృప తోనే బ్రతుకు సాగుతూ ఉంది. శ్వాసలు కదిపేది తానే. గుండె గంటను మ్రోగించేది తానే. రుధిర ప్రవాహానికి తానే ఆధారం. అధర చలనానికి తానే ఆలంబనము. ఆయన తోడుంటే జీవనము. వీడి దూరమైతే మరణము. ఇది అర్థమైతే **(మత్వా)** ఆ తరువాత అంతా యోగమే. అర్థం కాకపోతే, మిగిలేది అభియోగమే.

జాలి లేక ఈశ్వరుడు
పిలిచినా రాడని అభియోగము
గాలి రూపమున దేవుడు
ఉన్నాడని తెలియుట భాగ్యము
గాలి ఏమిటి జాలి కాదా!
గాలి పోగా బ్రతుకు ఖాళీ కాదా!
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్

అని రామజోగి చిట్కా.

భక్తి నివేదనము

ఈ సమస్త ప్రపంచము పరమేశ్వరుని వల్లనే ఆవిర్భవించిందని, ఆయన వల్లనే నడుస్తూ ఉందని ఎవరు గ్రహిస్తారో **(ఇతి మత్వా, ఏవం జ్ఞాత్వా)** వాళ్ళు పరమేశ్వరునే సేవిస్తారు **(మాం ఈశ్వరం భజన్తే సేవన్తే)**. అట్టివారు బుధులు **(బుధాః)**, అంటే బుధజనులు, భక్తజనులు.

పరమేశ్వరుని ఎందరో సేవిస్తారు. పూజిస్తారు. కీర్తిస్తారు. ఆరాధిస్తారు. కాని, భావ ప్రధానంగా చేయరు. చేయలేక పోతారు కూడా. అలా చేయాలి అంటే, అది బుధులకే సాధ్యం. పరమార్థ తత్త్వాన్ని అర్థం చేసుకున్న వారే బుధులు **(అవగత పరమార్థ తత్త్వాః)**. ఉద్భవ స్థానము, జీవన సారము పరమేశ్వరుడే అనే జ్ఞానం కలవారు బుధులు. వారే భక్తి నివేదనం చేయగలరు.

వారిది భావనా భక్తి. వారి భక్తి భావ సమన్వితంగా ఉంటుంది. పరమేశ్వరుని విషయంలో అభినివేశమే భావన. పరమేశ్వరుని పొంది తీరాలి అనే పట్టుదల, శ్రద్ధతో కూడిన అకుంఠిత దీక్ష, భగవంతునికి సంబంధించిన జ్ఞానము కలిగి ఉండటమే ఈ అభినివేశానికి కారణము.

బుధులైన భక్తులు సేవించే విధానాన్ని వివరిస్తున్నాడు.

మచ్చిత్తా మద్గతప్రాణాః బోధయన్తః పరస్పరమ్ ।
కథయన్తశ్చ మాం నిత్యం తుష్యన్తి చ రమన్తి చ ॥ 9

మచ్చిత్తాః-మద్గతప్రాణాః-బోధయంతః-పరస్పరం
కథయంతః-చ-మాం-నిత్యం-తుష్యంతి-చ-రమంతి-చ

మచ్చిత్తా	= నా యందే చిత్తము గలవారు	కథయంతః చ	=	చెప్పుకొనువారు
మద్గత ప్రాణాః	= నా యందే ప్రాణము గలవారు	నిత్యం	=	ఎల్లప్పుడు
పరస్పరం	= ఒకరి కొకరు	తుష్యంతి చ	=	సంతసిస్తున్నారు
మాం	= నన్ను గూర్చి	రమంతి చ	=	రమిస్తున్నారు
బోధయంతః	= బోధించుకొను వారు			

అర్జునా! భక్తుల చిత్తము నా మీదే ఉంటుంది. వాళ్ళ ప్రాణాలు నా యందే ఉంటాయి. వాళ్ళు పరస్పరము నా బోధల లోనే ఉంటారు. నన్ను గూర్చే చెప్పుకుంటూ ఉంటారు. నా తత్త్వం లోనే రమిస్తూ ఉంటారు. నిత్యము సంతోషంగా ఉంటారు.

వ్యాఖ్య

ఉన్నవి అందరికీ ఉన్నాయి. లేనిది అందరికీ లేనిదే. ఇదీ ప్రపంచం. ఉన్నవి ఏవో అవి ఉన్నట్లు అందరికీ తెలుసు. లేనిది ఏదో అది కూడా స్పష్టం గానో, అస్పష్టం గానో అందరికీ తెలుసు. ఉన్న వన్నీ లేని దానిని పొందేందుకే ఉన్నాయని కూడా అందరికీ తెలుసు. ఆ లేనిది అవశ్యం పొంద దగింది అనేది కూడా అందరికీ తెలుసు. కనుక, ప్రపంచంలో అందరూ అదే పనిలో ఉన్నారు. లేని దానిని అన్వేషించి పొందే ప్రయత్నంలో ఉన్నారు. కాకపోతే, ఆ లేనిది ఎక్కడ ఉందో తెలిసి రావడం లేదు. అందుకే అన్వేషణ. సత్యాన్వేషణ.

ఇలా అన్వేషించే వారు మూడు విధాలుగా ఉంటారు. లేనిది ఎక్కడుందో తెలియకుండా అన్వేషించే వారు మొదటి వారు. ఉన్నచోటు తెలిసి పొందే ప్రయత్నంలో ఉండేవారు రెండవ వారు. వీరిరువురికి విలక్షణ మైన వారు మూడవ వారు. వాస్తవానికి వారు అన్వేషకులు కారు. లేని దానిని పొంది తృప్తి చెందిన వారు.

ప్రతి మనిషికి దేహము, ఇంద్రియాలు, మనస్సు, ప్రాణము, ఇవన్నీ ఉన్నాయి. లేనిది ఆనందము. అందరూ వాంఛించేది కూడా ఆనందమే. అందుచేత, లేని ఆనందాన్ని పొందడానికి తమ కున్న దేహేంద్రియ ప్రాణ మనస్సుల ద్వారా ప్రయత్నం చేస్తూ ఉంటారు. ఆ ప్రయత్నంలో ఈ ఉపకరణా లన్నిటినీ వినియోగిస్తూ ఉంటారు.

విషయానందం

ఆనందం ఎక్కడుందో తెలియకుండా అన్వేషించే వారు విషయ ప్రపంచంలో అన్వేషణ సాగిస్తూ ఉంటారు. వారి చిత్తేంద్రియ ప్రాణాలను విషయ సుఖాలను పొందే ప్రయత్నం లోనే పూర్తిగా వినియోగిస్తారు. వీరికి ఆనందం ఛాయా మాత్రంగా గోచరిస్తుంది. రేఖా మాత్రంగా ప్రాప్తిస్తుంది. అదే విషయానందం. అల్పానందం. స్వల్పానందం. అనిత్యానందం. వాటిని పెంచుకుంటూ, అల్పానందాలే అనంతానందాన్ని అందిస్తా యనే భ్రాంతిలో పడి పోతారు. వీరు వ్యర్థ జీవులు. బ్రతుకును వృథా చేసుకొనే వారు. అలా వృథా అవుతూ ఉంది అనే స్పృహ కూడా లేని వారు. వీరు పొందే సుఖం లౌకిక సుఖం. అది ఈ లోకంలో ప్రాప్తించినా, పర లోకంలో ప్రాప్తించినా, లోక సుఖం లౌకిక సుఖమే.

భజనానందం

ఆనందం ఎక్కడుందో తెలిసి అన్వేషించే వారు బుధులు. పూర్వ శ్లోకంలో మనం చూచిన వారు. పరమార్థ తత్త్వం అవగతమైన వారు. భక్తులు. తాము ఆశించే ఆనందం విషయాలకు సంబంధించింది కాదని, భగవద్విషయానికి సంబంధించిందని క్షుణ్ణంగా తెలిసిన వారు. అందుచేత వారి ప్రాణేంద్రియ చిత్తాలను పరమేశ్వరుని సేవలో వినియోగిస్తారు. తద్వారా భజనానందాన్ని పొందుతారు. భజనానందము బ్రహ్మానందానికి దారి తీస్తుందని వారికి తెలుసు కనుక, విషయానందము వైపు మరలకుండా భజనానందము లోనే తృప్తి చెందుతూ, బ్రహ్మానందం వైపు అడుగులు వేస్తూ ఉంటారు. వీరి సుఖం లౌకికం కాదు. అలౌకికం. ఇది భజనానందం.

బ్రహ్మానందం

వీరు అన్వేషకులు కారు. అనుభూతి పరులు. నిత్యమైన బ్రహ్మానందమును పొందిన వారు. అన్ని కోరికలు తీరిన వారు. నిత్యతృప్తులు. నిరాశ్రయులు. ఆత్మవిదులు. సదా ఆత్మానందంలో ఉండేవారు. వీరిది అనంతానందం. బ్రహ్మానందం. దేహేంద్రియ ప్రాణ మనస్సులు వీరికి కూడా ఉంటాయి. కాని, వాటికి సాక్షిగా, అకర్తగా వీరు శోభిస్తూ ఉంటే, అవన్నీ వీరి సేవలో పునీత మవుతూ ఉంటాయి.

మొదటి తెగ వారు ప్రపంచం వైపు ఆనందం కోసం పరుగులు తీస్తూ ఉంటారు. వీరికి శ్రమే గాని ఫలితం చిక్కదు, దక్కదు.

రెండవ తెగ వారు భక్తులు. వీరు లోకం వైపు పరుగులు తీయరు. వీరి లోకం వీరిది. అదొక ప్రత్యేక లోకం. లోకం గాని లోకం. కాలాన్నంతా లోకేశ్వరునితో గడిపే ప్రత్యేకమైన లోకం. ప్రేమలోకం.

మూడవ తెగ వారు నిత్యతృప్తులు. వారికి నియమాలు లేవు. నిష్ఠలూ లేవు. వారు ఆప్తకాములు. అన్నీ తమ లోనే ఉన్నవారు. వీరు లోకం లోకి వెళ్ళి ఏదీ సాధించేది లేదు. పోగొట్టు కొనేదీ లేదు. వీరిది పూర్ణానుభూతి. పరిపూర్ణానుభూతి. ఒకవేళ వీరు లోకంలో చరించినా, మొదటి వారి లాగా ఆనందం కోసం వెళ్ళరు. ఆనందంతో వెళ్తారు. వారు నడచి పోతూ ఉంటే లోకం పవిత్ర మవుతూ ఉంటుంది *(వసుధాం పావయన్ విచచార)*. వారు సదానంద సాగరంలో నిమగ్నులై ఉండటమే కారణము *(సదానంద సింధౌ నిర్మగ్న మానసః)*.

మన ప్రస్తుత శ్లోకం మొదటి తెగవారైన విషయ సుఖాభిలాషులకు సంబంధించింది కాదు. రెండవ తెగ వారైన భజనానంద పరులకు, ముముక్షువు లైన భక్తులకు సంబంధించింది. దీనిని మూడవ తెగ వారైన బ్రహ్మానంద స్వరూపులకు కూడా అన్వయించుకో వచ్చు. ప్రధానంగా మనం సాధకుల దృక్కోణం నుండే విశ్లేషించు కుందాం. చివరగా, సాధ్యరూపులు, సిద్ధస్వరూపు లైన బ్రహ్మజ్ఞానులకు వందనం సమర్పించు కుందాం.

అర్జునా! నా భక్తులు వారి చిత్తాన్ని నా యందే ఉంచుతారు *(మచ్చిత్తాః మయి చిత్తం యేషాం తే మచ్చిత్తాః)*. వారి ప్రాణాలను నా యందే నిలుపు కుంటారు. ప్రాణాలు అంటే ఇంద్రియాలు అని చెప్పుకోవచ్చు. లేదా, జీవితాలు అని భావించ వచ్చు *(మద్గత ప్రాణాః మాం గతాః చక్షురాదయః ప్రాణాః యేషాం తే మద్గత ప్రాణాః, అథవా మద్గత జీవనాః)*. వారు పరస్పరం నా బోధల తోనే ఉంటారు. విద్వద్గోష్ఠి సాగిస్తూ ఉంటారు *(పరస్పరం బోధయన్తః అవగమయన్తః)*. నా వైభవాన్ని చెప్పుకుంటూ ఉంటారు *(అన్యోన్యం కథయన్తః)*. సదా సంతుష్టులై ఉంటారు *(తుష్యన్తి పరితోషం ఉపయాన్తి)*. రమిస్తూ ఉంటారు *(రమన్తి)* అని భగవానుడు భక్తుల వైఖరిని, జీవన విధానాన్ని వివరిస్తున్నాడు.

ఈ విధమైన ప్రవర్తన బ్రహ్మానందములో ఓలలాడే జ్ఞానులలో కూడా కనిపించ వచ్చు. కాకపోతే,

సాధకులలో, లేదా భక్తులలో అది అభ్యాస ప్రవృత్తిగా ఉంటుంది. జ్ఞానులలో అనుభూతి ప్రకాశంగా దర్శన మిస్తుంది.

ఈ మాత్రం ఉపోద్ఘాతంతో ఇక శ్లోకం లోకి ప్రవేశిద్దాం. ఉపోద్ఘాతం సుదీర్ఘంగా ఉన్నట్లు భావిస్తున్నారా? ఈ శ్లోకం నుండి పదమూడవ అధ్యాయంలో ప్రవేశించే వరకు ఆ మధ్యలో గోచరించే భక్తి సాధనమ దృష్టిలో ఉంచుకొనే ఇక్కడ కాస్త విస్తారంగా విశ్లేషించాను. ముమ్ముందు ఈ అవగాహన ఎంతగానో ఉపకరిస్తుంది.

మచ్చిత్తులు

చిత్తము భగవంతుని యందే గల వారు మచ్చిత్తులు. అంతర్నిష్ఠ గల వారు. భక్తులు భజనానందంలో తృప్తి చెందుతూ ఉంటారు. భగవంతుడే వారికి గమ్యము కనుక, వారి చిత్తము భగవంతుని యందే లగ్నమై ఉంటుంది. ఆసక్తి దేని మీద ఉంటుందో చిత్తము దాని వైపుకే పరుగులు తీస్తూ ఉంటుంది. భక్తులకు భగవంతుని యందే ఆసక్తి కనుక, వారు వివిధ కర్మలు చేస్తూ ఉండినా, వారి చిత్తము భగవంతుని యందే ఉంటుంది.

విషయానందమును అభిలషించే వారు విషయాలు బాహ్యంలో ఉన్న కారణంగా, బాహ్యము నందే చరిస్తూ ఉంటారు. భక్తులకు అంతర్యామి యైన భగవంతుని యందే ఆసక్తి కనుక, వారు అంతర్నిష్ఠ కలిగి ఉంటారు. ఒకవేళ అవసర నిమిత్తం ప్రపంచంలో వ్యవహారాల మధ్య చరించినా, వారి మనోవృత్తులలో భగవద్భావనే మారకుండా ఉంటుంది. వారే మచ్చిత్తులు. అన్య విషయముల మీదికి మరలని చిత్తము గల వారు.

ప్రహ్లాదుని మనస్సును మార్చాలని తండ్రి హిరణ్యకశిపుడు ఎంతగానో ప్రయత్నించాడు. దానవ వంశానికి విష్ణువు శత్రువు. గొప్ప విరోధి. నిందార్హుడే గాని పూజార్హుడు కాడు. అట్టి విష్ణువును కీర్తించడం మాన్పించాలని ఎంతగానో ప్రయత్నించాడు హిరణ్యకశిపుడు **(దానవ శ్రేణికిన్ వైకుంఠుండు కృతాపరాధు డతనిన్ వర్ణింప నీ కేటికిన్?)**. కాని సఫలం కాలేక పోయాడు. ప్రహ్లాదుని మనస్సును శ్రీహరికి దూరం చేయలేక పోయాడు. భక్తుల చిత్తాన్ని భగవంతునికి దూరం చేయడం సాధ్య మయ్యే పని కాదు. కారణం, వారు 'మచ్చిత్తులు'. భగవంతుని యందు లగ్నమైన చిత్తాన్ని భగవంతునికి దూరంగా తీసికెళ్ళడం వాళ్ళకే సాధ్యం కాదు. ఇక ఆ పనిని ఇతరులు ఎలా చేయగలరు? ప్రహ్లాదుడు తండ్రి హిరణ్యకశిపునికి చెప్పిన సమాధానము మచ్చిత్తుల హృదయానికి అద్దం పడుతుంది.

తే॥ ఇను మయస్కాంత సన్నిధి నెట్లు భ్రాంత మగు హృషీకేశు సన్నిధి నా విధమున
గరగు చున్నది దైవయోగమున జేసి బ్రాహ్మణోత్తమ చిత్తంబు భ్రాంత మగుచు ॥

మూర్ఖుడైన హిరణ్యకశిపునికి చెప్పి లాభం లేదని గ్రహించిన ప్రహ్లాదుడు, పరమేశ్వరునికి దూరమై వసించ లేని తన చిత్తము యొక్క స్థితిని తండ్రి ముందే గురువులకు వివరిస్తాడు.

'ఆచార్యా! ఇనుమును అయస్కాంతము ఆకర్షించినట్లు, దైవ కృప చేత, నా చిత్తాన్ని భగవంతుడు ఆకర్షించాడు. తద్వశమైన నా చిత్తము ఆయన వైపుకే వెళ్తూ ఉంది. మరొక చోట నా చిత్తము ఉండలేదు' అన్నాడు. 'మచ్చిత్తు' లైన భక్తుల పరాభక్తికి ఇదే నిదర్శనము.

మద్గత ప్రాణులు

భగవంతుని యందే ప్రాణాలు ఉంచిన వారు మద్గత ప్రాణులు. 'ప్రాణ' శబ్దానికి ఇంద్రియాలు అని ఒక

అర్థం. జీవితాన్ని నిలిపే పంచ ప్రాణాలు అని మరొక అర్థం. చక్షురాది ఇంద్రియాలు ఎప్పుడూ బహిర్ముఖ మయ్యే ఉంటాయి. కాని, భక్తుల చిత్తము ఈశ్వరుని యందే లగ్నమై ఉండటం చేత, తమ ద్వారా బాహ్య ప్రపంచంలో చరించే చిత్తం ఎప్పుడైతే అందుబాటులో లేదో, ఇంద్రియాలు తమంతట తాము వెళ్ళ లేక వెను దిరుగుతాయి. ఆంతర్యంలో చిత్తము శివార్చనలో ఉన్నందున, అంతర్ముఖమైన ఇంద్రియాలు ఈశ్వరారాధనలో పూజా సుమా లవుతాయి.

హృషీకేణ హృషీకేశ పూజనం భక్తి రిత్యుచ్యతే।

హృషీకములు అంటే ఇంద్రియాలు. ఇంద్రియాలకు ప్రభువు కావడం చేత భగవంతుడు హృషీకేశుడు ***(హృషీకాణి ఇంద్రియాణి తేషాం ఈశః).*** కనుక హృషీకముల చేత హృషీకేశుని పూజించడమే భక్తి అన్నది శాస్త్రం. వీరే మద్గత ప్రాణులు.

ప్రాణాలన్నీ పరమేశ్వరునిపై పెట్టుకొని జీవించే వారు కనుక వారు మద్గత ప్రాణులు. ప్రాణేశ్వరుడైన పరమేశ్వరుని సేవలో ప్రాణాలను అర్పించడాని కైనా వెనుకాడని పూర్ణ భక్తులు.

చరణము: **ప్రాణాలు పోయినా బ్రతుకు లుంటాయి**
బ్రతుకులకు బ్రతుకులే అతుకు లవుతాయి
ఎన్ని జన్మ లైనా
వెతకెదను నిన్నే మది లోన
పల్లవి: **నీవు లేక నేను లేను లేను**
నిన్ను విడిచి నేను ఉండలేను ॥ నీవు లేక ॥

అని మద్గత ప్రాణులైన భక్తుల హృదయాన్ని తెర పైకి తెచ్చింది చైతన్య గీతిక.

పరస్పర బోధకులు

బుధజను లైన భక్తుల ఆంతరంగిక సౌందర్యాన్ని చూశాం. మరి, వారి వ్యవహార మెలా ఉంటుంది? ఏముంది, భోజనాన్ని బట్టే త్రేపు! చిత్తాన్ని బట్టే చేష్టలు! చిత్తంలో ఉన్నదంతా భగవచ్చింతనమే కనుక, వ్యవహారంలో కూడా అదే ఉంటుంది.

నిరంతరము విద్వద్గోష్ఠి జరుపుకుంటూ ఉంటారు. భక్తులతో కలిసి భగవత్తత్త్వమును ప్రతిపాదించే విషయాలను, వాక్యాలను విచారించుకుంటూ, వాటి నిశ్చితార్థ దర్శనం చేస్తూ ఉంటారు.

రాజకీయ పక్షులు ఒక చోట కూడితే ఏం చేస్తారు? సినిమా గువ్వలు ఒక చోట చేరితే ఏం చేస్తారు? పరమేశ్వరుని ఆరాధించే భక్త హంసలు కూడా ఒక చోట కలుసుకుంటే అలాగే ప్రవర్తిస్తారు. పరస్పరం పరమాత్మ వైభవాన్ని ముచ్చటించుకుంటూ ఉంటారు. దీనినే ఐశ్వర్య ప్రధాన భక్తి అంటారు.

కథా శ్రవణము

భగవ దైశ్వర్యమును, పరమాత్మ జ్ఞానమును పరస్పరం బోధించుకోవడం ఐశ్వర్య ప్రధానమైన భక్తి అయితే, భగవంతుని అనంత కళ్యాణ వైభవాలను, అవతార వైభవ విశేషాలను ఒకరు వివరిస్తూ ఉంటే శ్రవణ మంగళంగా ఆలకించడము కథా శ్రవణము అనే మాధుర్య ప్రధానమైన భక్తి. ***కథా దిషు ఇతి గర్గః*** - పవిత్రుడైన పరమేశ్వరుని కథా విశేషాలను శ్రవణం చేయడమే భక్తి అని గర్గ మహర్షి నిర్వచనము.

నిత్య సంతోషులు - ఆత్మరతులు

ఎల్లప్పుడు పరమేశ్వరుని నిత్యార్చనలో జీవిస్తూ ఉన్నందున, వీరు నిత్య సంతోషులు. ఇది అలం ప్రత్యయ రూప సంతోషము. ***అలం*** అంటే 'చాలు' అనే తృప్తి. ఆనందము. పరమేశ్వరుని భజనానందంలో నిత్య సంతోషులైన ఈ భక్తులు నిత్యతృప్తులై, మరొకటి అవసరం లేదు అనే ఆనందానుభూతిలో ఉంటారు. ఉత్తమోత్తమ మైన సుఖం లభించిందనే సంతృప్తితో ఉంటారు. ***సూ॥ సంతోషా దనుత్తమః సుఖలాభః*** - మరొకటి అవసరం లేని సంతోషము అన్నిటి కంటే ఉత్తమమైన సుఖప్రాప్తి అని పతంజలి యోగదర్శనం.

అనన్యులు, బుధులు అయిన ఈ భక్తులు ఏది చూచినా, ఏది వినినా, ఏది భావించినా - సర్వమూ ఈశ్వరమయంగా సంభావిస్తూ ఉన్నందున, వీరు సదా పరాభక్తి యందే రమిస్తూ ఉంటారు. 'మచ్చిత్తుల' నుండి నిత్య సంతృప్తు లైన ఆత్మరతుల వరకు మనం అధ్యయనం చేసిన వీరందరూ బ్రహ్మాభ్యాసంలో ఉన్న వారుగా శాస్త్రం అభివర్ణించింది. ఈ వర్ణనము కూడా ప్రస్తుత శ్లోక విషయం తోనే అన్వయింప బడింది. అదీ చూడండి.

తచ్చింతనం తత్కథనం అన్యోన్యం తత్ప్రబోధనమ్,
ఏత దేక పరత్వం చ బ్రహ్మాభ్యాసం విదుర్బుధాః ॥

ఇదే బ్రహ్మాభ్యాసం. సాధకులకు బ్రహ్మాభ్యాసంగా ఏది ఉందో, అదే బ్రహ్మజ్ఞానులలో సహజ లక్షణంగా శోభిస్తూ ఉంది. కనుక ప్రాతఃస్మరణీయు లైన బ్రహ్మజ్ఞానుల పరంగా కూడా ఈ శ్లోక భావాన్ని సమన్వయించుకో వచ్చు.

ఇలా కేవలం భగవద్భక్తి లోనే జీవించే వారికి ఏమి ప్రాప్తిస్తుంది? చదవండి.

తేషాం సతతయుక్తానాం భజతాం ప్రీతిపూర్వకమ్ ।
దదామి బుద్ధియోగం తం యేన మా ముపయాన్తి తే ॥ 10

తేషాం-సతతయుక్తానాం-భజతాం-ప్రీతిపూర్వకం
దదామి-బుద్ధియోగం-తం-యేన-మాం-ఉపయాంతి-తే

సతతయుక్తానాం	=	సదా నా యందు మనస్సు గలవారు	మాం	=	నన్ను
ప్రీతిపూర్వకం	=	ప్రీతితో	ఉపయాంతి	=	పొందగలరో
భజతాం	=	సేవించే వారు	తం	=	ఆ
తేషాం	=	వారికి	బుద్ధియోగం	=	బుద్ధి యోగమును
యేన	=	ఏ యోగము చేత	దదామి	=	ప్రసాదిస్తున్నాను
తే	=	వారు			

భక్తులు వారి చిత్తాన్ని సదా నా యందే ఉంచుతారు. ప్రీతితో నన్నే సేవిస్తూ ఉంటారు. వారికి నేను బుద్ధి యోగాన్ని ప్రసాదిస్తాను. దాని చేత వాళ్ళు నన్ను పొందుతారు.

వ్యాఖ్య

సతత యుక్తులై, ప్రీతి పూర్వకంగా భగవంతుని సేవించడము అనే కార్యాన్ని భక్తులు చేస్తే, భగవంతుడు వారిని అనుగ్రహిస్తూ బుద్ధియోగాన్ని ప్రసాదిస్తాడు. అదే వారిని భగవంతుని వద్దకు చేర్చుతుంది. ఇది శ్లోక హృదయం.

సతత యుక్తులు

యుక్తుడు అంటే యోగి. సతత యుక్తుడు అంటే సదా యోగంలో ఉండేవాడు. ఇతడే అనన్య భక్తుడు. ఇలాంటి భక్తులే తొమ్మిదవ అధ్యాయం - ఇరవై రెండవ శ్లోకంలో మనం చర్చించుకున్న నిత్యాభియుక్తులు ***(సతత యుక్తానాం నిత్యాభియుక్తానాం).*** అప్పుడప్పుడు కాకుండా, ఎప్పుడూ భక్తిలో కొనసాగే వారు సతత యుక్తులు. సర్వకాల సర్వావస్థల యందు భగవంతుని యందే ఏకాగ్ర బుద్ధి కలిగి, వేదాంత శ్రవణాదుల యందే దృష్టిని, నిష్ఠను కలిగి యున్న వారు సతత యుక్తులు. బాహ్య విషయాల యందు ఏ విధమైన కోరిక లేని వాళ్ళు. బాహ్యాసక్తుల నుండి సంపూర్ణముగా విడిపడిన వాళ్ళు ***(నివృత్త సర్వ బాహ్యైషణానాం).*** అందుచేతనే ఏ ప్రతిబంధకములు లేకుండా భగవంతుని నిరంతరము సేవిస్తూ ఉంటారు ***(భజతాం సేవ మానానాం).***

బాహ్య విషయాసక్తి లేకుండా సదా భగవంతుని సేవిస్తున్నారు అంటే, పేరు ప్రఖ్యాతులు, సన్మాన సంపదలను ఆశించి భక్తి చేస్తున్నా రేమో! అనే సంశయం తలెత్త వచ్చు ***(కిం అర్థిత్వాదినా కారణేన? న ఇత్యాహ).*** అలాంటివి ఏవీ లేవని, కేవలం ప్రీతి పూర్వకం గానే, ప్రేమ పూర్వకం గానే, భక్తి పూర్వకం గానే భజిస్తున్నారు అంటున్నాడు. భక్తియుతులై సతతయుక్తు లవుతున్నారు.

పరమ ప్రేమారాధన

వీరిది పరమ ప్రేమ రూపమైన భక్తి ***(సా త్వస్మిన్ పరమ ప్రేమ రూపా).*** ఇది జ్ఞానాఖ్య భక్తి. అంటే, జ్ఞాన మనే పేరు గల భక్తి. జ్ఞాన భక్తి. జ్ఞానముతో కూడిన భక్తి. జ్ఞానము వలన ఏర్పడిన భక్తి. పరమేశ్వరునికి సంబంధించిన జ్ఞానమే భక్తి. అందుచేత అది నిత్యభక్తి.

పొంద దగిన వాడు పరమేశ్వరుడు ఒక్కడే అనే జ్ఞానము నిత్యాభి యుక్తులకు స్పష్టంగా ఉంటుంది. సాధ్య రూపుడైన భగవంతుడు జ్ఞానరూపుడు అనే అవగాహన కూడా పుష్కలంగా ఉంటుంది. అందువల్ల వారిలో జ్ఞానాభిలాష మెండుగా ఉంటుంది. ఇదొక పక్వమైన దశ. అందుచేతనే నిత్యభక్తి వారిలో కొనసాగుతూ ఉంటుంది. వికసించిన పుష్పము పరిమళాలను వెదజల్లడానికి ఎలా శ్రమించదో, అలాగే జ్ఞానాసక్తితో వారిలో విరబూసిన భక్తి పుష్పము దివ్యమైన భక్తి కార్యాలనే సౌరభాలను సహజంగా, విరివిగా విరజిమ్ముతూ ఉంటుంది ***(భజతాం ప్రీతి పూర్వకం).***

ఈ ప్రేమ రూపమైన భక్తి కార్యాల వల్ల వారికి అంతఃకరణ శుద్ధి ఏర్పడుతుంది. వివేకము విశాల మవుతుంది. ఇదొక శుభ సమయము. నిత్యాభియుక్తులు, సతత యుక్తులు అయిన భక్తుల జీవితాలలో, భక్తి జ్ఞానముగా రూపాంతరం చెందే కళ్యాణ ముహూర్తము. భక్తి పుష్పము ఫలాగమ కాలానికి చేరువైన దశ ఇది. భక్తి సాధన ఫలవంతమై, జ్ఞాన ఫలాన్ని అందించే అనుగ్రహ కాలమిది. జీవుడే శివుడనే జ్ఞానాంకురము మొలకెత్తే దశ ఇది. ఈ దశలో భగవత్కృప బుద్ధియోగ రూపంలో వర్షిస్తుంది.

బుద్ధి యోగము

సతత యుక్తులై, సదా ప్రేమారాధనలో పునీతు లైన భక్తులకు భగవంతుడు బుద్ధియోగాన్ని అనుగ్రహిస్తాడు ***(దదామి బుద్ధి యోగం).*** బుద్ధి రూపమైన ఉపాయమే బుద్ధియోగము. భగవంతుని స్వరూప జ్ఞానానికి సంబంధించిన వివేకమే ఇక్కడ బుద్ధి. అట్టి బుద్ధితో కూడిన యోగమే బుద్ధియోగము. ఏ జ్ఞానము చేత ఆత్మయే పరమాత్మ అనే ఎరుక కలుగుతుందో, అదే బుద్ధియోగము. ప్రకాశవంత మైన బుద్ధి వివేకముతో కూడిన యోగము. అదే జ్ఞానయోగము. పుష్పము ఫలంగా రూపాంతరం చెందినట్లు, కర్మయోగము జ్ఞాన యోగముగా రూపాంతరం చెందే అద్భుతమైన మలుపు ఇక్కడే. నరుడు భక్తిలో పరిపక్వం చెంది నరుడే నారాయణుడు అనే

ఆత్మస్పృహ కలిగేది ఇక్కడే. అదంతా పరమేశ్వరుని అనుగ్రహం తోనే జరిగి పోతుంది. నేను కాయ కావాలి, పండు కావాలి అని పువ్వు ఆశించదు. పువ్వు పువ్వుగా ఉండ గలిగితే, తరువాత కాయ, ఆ తరువాత పండు వాటంతట అవే ధర్మానుగుణంగా ప్రాప్తిస్తాయి. ధర్మరూపంలో ఉన్నది దైవమే కనుక, దైవానుగ్రహంతో అనన్య ప్రేమపుష్పము బుద్ధియోగ ఫలంగా రూపు దాలుస్తుంది. పుష్పమే ఫల మవుతుంది. **దాసోఽహం** అంటూ భక్తుడు భగవంతుని సమీపిస్తే, బుద్ధియోగాన్ని అనుగ్రహించి అతడిని **సోఽహం** రూపునిగా భగవంతుడే మలుస్తాడు. భక్తి జ్ఞానంగా మారుతుంది. నరుడు నారాయణుడై కూర్చుంటాడు. ఈ పరిణామాన్నంతా శ్రీ మధుసూదన సరస్వతి అందంగా ఒక్క శ్లోకంలో అందించారు.

దాసోఽహ మితి యా బుద్ధిః పూర్వమాసీ జ్జనార్దనే ।
దాకా రాపహృత స్తేన గోపీ వస్త్రాపహారిణా ॥

'నేను నీ దాసుణ్ణి' అని శ్రీకృష్ణ పరమాత్మను ఆశ్రయిస్తే, చోరత్వానికి అలవాటు పడిన నవనీతచోరుడు, గోపికల వస్త్రాలను అపహరించిన మురళీ లోలుడు స్వభావరీత్యా, **దాసోఽహం** లోని **దా** అనే అక్షరాన్ని దొంగిలించాడట. **దా** పోగా **సోఽహం** మిగిలింది అంటాడు. అంటే, భక్తితో భగవంతుని సమీపిస్తే, ఆయన భక్తుణ్ణి బుద్ధియోగం ద్వారా జ్ఞానిగా మార్చుతాడు అని అర్థం. ఇక్కడ **గోపీ వస్త్రాపహారిణా** అనే పద ప్రయోగం అద్భుతము. దేహమే వస్త్రము కనుక దేహస్మృతిని, అనగా దేహాభిమానాన్ని తొలగించి, దైవస్ఫూర్తిని నింపి, దైవ స్పృహను కలిగించాడు అని అర్థము.

ఈశ్వరానుగ్రహా దేవ పుంసా మద్వైత వాసనా - భగవంతుని అనుగ్రహం చేతనే మానవులకు అద్వైత భావన చిగురిస్తుందని దత్తాత్రేయుడు చెప్పడంలో కూడా ఇదే నిగూఢార్థము. అంతవరకు 'నేను వేరు - భగవంతుడు వేరు' అని భావిస్తూ ఉండిన సాధకునిలో ఆత్మయే పరమాత్మ **(అయమాత్మా బ్రహ్మ)** అనే భావన ఏర్పడటానికి ఈశ్వరానుగ్రహమే ప్రధాన కారణము. అదియే బుద్ధియోగ ప్రదానము. భక్తునికి లభించిన భగవ త్ప్రసాదము. ***ధియో యో నః ప్రచోదయాత్ -*** 'వరేణ్యుడు, వరణీయుడు అయిన ఆ దేవుడు మా బుద్ధిని ప్రకాశంలో ప్రవర్తింప చేయు గాక!' అనే గాయత్రీ మంత్ర వాక్యం లోని అంతర్భావం కూడా ఇదే.

సిరులు వలదు నీ చూపే సిరులు మాకు
వలదు వరము నీ నగవే పరము మాకు
బుద్ధి దీపము వెలిగించు భవ్య చరిత
నీ అడుగుల కడ పడి ఉందు నీలకంఠా!

అని నీలకంఠ శతకంలో ఒక విబూది పండు.

భగవంతుడు ప్రసాదించే బుద్ధి యోగము చేత **(యేన బుద్ధి యోగేన)** ఆత్మయే పరమాత్మ అనే జ్ఞానాన్ని పొంది, ఆ జ్ఞానం చేత పరమాత్మను తమ స్వరూపంగా పొందుతారు **(మాం పరమేశ్వరం ఆత్మభూతం, ఆత్మత్వేన, ఉపయాన్తి ప్రతిపద్యన్తే).**

భగవంతుడు బుద్ధి యోగాన్ని సతతయుక్తు లైన భక్తులకే ఎందుకిస్తాడు? చదవండి.

తేషా మే వానుకంపార్థ మహ మజ్ఞానజం తమః ।
నాశయా మ్యాత్మభావస్థో జ్ఞానదీపేన భాస్వతా ॥ 11

తేషాం-ఏవ-అనుకంపార్థం-అహం-అజ్ఞానజం-తమః
నాశయామి-ఆత్మభావస్థః-జ్ఞానదీపేన-భాస్వతా

అహం	=	నేను
తేషాం	=	వారి యొక్క
అనుకంపార్థం ఏవ	=	అనుగ్రహము కొరకే
ఆత్మ భావస్థః	=	ఆత్మభావము నందున్న
భాస్వతా	=	స్వయంప్రకాశము గల
జ్ఞానదీపేన	=	జ్ఞాన ప్రకాశము చేత
అజ్ఞానజం	=	అవివేక జనిత
తమః	=	చీకటిని
నాశయామి	=	నశింప చేస్తున్నాను

అర్జునా! భక్తులను అనుగ్రహించాలని నేను వాళ్ళ బుద్ధిలో నిలుస్తాను. ప్రకాశించే జ్ఞాన దీపం చేత, వారిలో అజ్ఞానం సృష్టించిన అంధకారాన్ని అదృశ్యం చేస్తాను.

వ్యాఖ్య

దివ్యానుగ్రహం

భగవంతుని కొరకు మనం అడుగు ముందు కేస్తే, భగవంతుడు పది అడుగులు మన వైపుకు చకచకా వేసుకుంటూ వస్తాడని మహాత్ముల అనుభవం. అనన్యులై, సతతయుక్తులై, ప్రీతి పూర్వకంగా భక్తులు నన్ను ఆరాధిస్తూ ఉంటే, నన్నే తదేకంగా దర్శిస్తూ, నన్నే సేవిస్తూ ఉంటే, నేను వాళ్ళను చూడక పోతే, కనికరించక పోతే, కాపాడక పోతే, మరెవరు కనికరిస్తారు? అని భగవంతుడు ఆలోచిస్తాడట. ఇది ఆచార్యుల అభిప్రాయం.

తనను ఎవరు చూస్తారో దీపం వాళ్ళను చూస్తుంది. తనను ఆశ్రయించిన భక్తులను భగవంతుడు అనుగ్రహిస్తాడు. ఆరాధనా హృదయంతో మనం ఆయన వైపు చూస్తూ ఉంటే, అనుగ్రహ బుద్ధితో భగవంతుడు మనల్ని అవలోకిస్తూ ఆశీర్వదించడానికి సిద్ధ పడతాడు. దయ చూపే కార్యంలో నిమగ్న మవుతాడు.

తేషా మేవ కథం నామ శ్రేయః స్యాత్ - 'నన్నే ఆశ్రయించుకొని, నిరంతరం నా సేవ లోనే చరిస్తున్న వీళ్ళు శ్రేయస్సును పొందే దెలా? మరో ఆలోచన లేకుండా ఉన్నారు. సతత యుక్తులై ప్రేమతో సేవిస్తున్నారు. ఇదంతా అలౌకిక మైన కర్మే కదా! మరి, కర్మ జరిగితే ఫలితం అందాలి కదా! అదే కదా నా దయ అంటే ***(అనుకంపనం).*** కనుక వాళ్ళను దయ చూచేందుకు నేను ఏదైనా చెయ్యాలి ***(అనుకంపార్థం దయ హేతోః).***

ఏదో ఒకటి చెయ్యాలి. ఆ చేసే దేదో వారికి శ్రేయోదాయకంగా ఉండాలి. మోక్షార్థమై ఉండాలి. అలాంటి మేలు చేయడానికి నేను వాళ్ళ బుద్ధిలో ప్రవేశిస్తాను. వాళ్ళ అంతఃకరణంలో ఆత్మభావంలో ఉంటాను ***(ఆత్మ భావస్థః ఆత్మనః భావః అంతఃకరణా శయః తస్మిన్ ఏవ స్థితః).*** అంతఃకరణములో జ్ఞానవృత్తిగా ప్రకాశిస్తాను.

'నా భక్తుల బుద్ధిలో చీకటి ఉంది. అదే మోహ మనే చీకటి ***(మోహాంధకారం).*** ఒకటి మరొకటిగా తెలిసే ఈ మోహమనే తిమిరం అజ్ఞానం వల్ల కలిగింది ***(అజ్ఞానజం).*** ఇది నేడు ఏర్పడింది కాదు. అనేక జన్మలలో ఆర్జించుకున్న మోహ తిమిరం. ఈ చీకటిని సమూలంగా నశింప చేసి, వారి జీవితాలలో నిత్య కాంతిని నింపడమే నేను వారిపై చూపే దయ.

కనుక వారిని అనుగ్రహించి ఆశీర్వదించేందుకు నేను వారి బుద్ధి యందు నిలిచి ***(ఆత్మ భావస్థః),*** వెలిగే జ్ఞానదీపం చేత ***(భాస్వతా జ్ఞానదీపేన)*** వారి బుద్ధి లోని అజ్ఞాన జనితమైన మోహ తిమిరాన్ని నశింప చేస్తాను ***(అజ్ఞానజం తమః నాశయామి)'*** అంటున్నాడు భగవంతుడు.

ఇక్కడ మోహ మనే కార్యం, అజ్ఞాన మనే కారణం, ఈ రెండిటిని కలిపి చీకటిగా చెబుతున్నాడు. కార్యంలో కారణమే ఉంటుంది కనుక, మోహంలో ఉండేదంతా అజ్ఞానమే. కనుక, ప్రకాశించే జ్ఞానదీపం చేత అజ్ఞానమును, అజ్ఞాన జనితమైన మోహము అనే చీకటిని భగవంతుడు నశింప చేస్తూ ఉన్నాడు అని అర్థం.

ఒక్కసారి వెను దిరిగి చూస్తే, సతత యుక్తులై సదా మచ్చిత్తత్వాది సాధనల చేత **(మచ్చిత్తత్వాది ప్రకారైః** *-9 వ శ్లో)* భగవంతుని ప్రీతి పూర్వకంగా భక్తులు ఆరాధించడం వల్ల భగవదనుగ్రహాన్ని పొందుతారు. అట్టి భక్తులను అనుగ్రహించేందుకు భగవంతుడు వారి బుద్ధిలో జ్ఞానదీపాన్ని వెలిగిస్తాడు. జ్ఞానదీప ప్రకాశం చేత అజ్ఞానము, అజ్ఞాన జనిత మోహాంధకారము నశిస్తుంది. ఈ విధంగా తనను ఆశ్రయించిన భక్తులను భగవంతుడు అనుగ్రహిస్తాడు.

భక్తుల బుద్ధిలో జ్ఞానదీపాన్ని వెలిగించడము అంటే, ఆత్మయే పరమాత్మ అనే జ్ఞానవృత్తిని కలిగించడ మని భావము. కనుక, బుద్ధిలో వెలిగే జ్ఞానదీపము ఏదో కాదు, తన్నిష్ఠమైన వృత్తి విశేషము. జ్ఞానవృత్తి విశేషము. ఆత్మయే బ్రహ్మము అనే జ్ఞానమే జ్ఞానవృత్తి. నేను జీవుణ్ణి. పరిమితుణ్ణి. పుట్టే వాణ్ణి. చచ్చే వాణ్ణి అనే దంతా అజ్ఞాన వృత్తి. అదే అజ్ఞాన తిమిరము. జీవుడే శివుడు అనే జ్ఞానవృత్తి అజ్ఞానవృత్తిని నశింప చేస్తుంది. ఇక్కడే జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. జ్ఞానవృత్తి అజ్ఞాన వృత్తిని నశింప చేస్తుందే గాని ఆత్మను అందించదు. సృష్టించదు.

ఘటాదులను ఆవరించి యున్న తమస్సును సూర్యోదయ ప్రకాశము ఎలా నశింప చేస్తూ ఉందో, అలాగే ఆత్మను ఆవరించి యున్న అజ్ఞాన అంధకార మనే ఆవరణమును జ్ఞానవృత్తి నశింప చేస్తూ ఉంది. ఆవరణ భంగము జరగ గానే, చీకటి తొలగిన తరువాత ఘటాదులు ప్రకాశించినట్లు, అజ్ఞానము నశించ గానే ఆత్మ స్వయంగా ప్రకాశిస్తుంది.

పూర్వ శ్లోకంలో భగవానుడు బుద్ధియోగాన్ని ప్రసాదించాడు **(దదామి).** కాని, ఇక్కడ అజ్ఞాన తిమిరాన్ని తానే స్వయంగా నశింప చేస్తున్నాడు **(నాశయామి).** ఈ తేడాను గీతా భక్తులు స్పష్టంగా గ్రహించాలి. లేకపోతే, అనేక అపార్థాలు, అనర్థాలు తలెత్తుతాయి.

దదామి అంటే ఇవ్వడము. ఇచ్చేవాడు ఉన్నాడు అంటే, పుచ్చుకొనే వాడు కూడా ఉన్నాడు. ఇక్కడ జీవేశ్వరుల భేదం స్పష్టంగా కనిపిస్తూ ఉంది. భక్తిలో ఇది అనివార్యం.

నాశయామి అన్నప్పుడు పరమేశ్వరుడే స్వయంగా నశింప చేస్తున్నాడు. ఆయనే వెలుగు. ఆయనే దీపం. నశింప చేసే వాడూ తానే. పూర్వ శ్లోకంలో **దదామి** లాగా ఇక్కడ పుచ్చుకొనే వాడు లేడు. వాస్తవానికి ఇక్కడ కర్త లేడు. కర్త లేకుండానే జరిగే కార్యమిది. చీకటిని పోగొట్టే కార్యము వెలుగుకు లేదు. దీపం వెలుగుతుంది. అంతేగాని, చీకటిని పోగొట్టాలని వెలగదు. కాకపోతే, దీపకాంతిలో చీకట్లు నిలవ లేవు. అంతే. చీకటి అదృశ్యమై జ్యోతి ఒక్కటే ఉంటుంది. జ్ఞానం విషయంలో కూడా అంతే. జ్ఞాన జ్యోతి ఒక్కటే ఉంటుంది.

పూర్వ శ్లోకంలో *(దదామి)* ద్వైత ముంది. ప్రస్తుత శ్లోకంలో ద్వైతం లేదు. అద్వైతమే జ్ఞానరూపంలో భాసిస్తూ ఉంది.

జ్ఞానదీపం

ప్రకాశిస్తున్న జ్ఞానదీపం చేత అజ్ఞాన జనితమైన మోహాంధకారాన్ని నేను నశింప చేస్తాను అన్నాడు భగవంతుడు. చీకటి సమస్య అయితే దానికి వెలుగొక్కటే పరిష్కారము. జ్ఞానదీపము చేత అజ్ఞానాంధకార మును తొలగించడమే కర్తవ్య మైనపుడు, దీపమును ప్రజ్వలింప చేసే కార్యాన్ని విడిచిపెట్టి, మరొక కార్యము, అది ఏదైనా కావచ్చు, దానిని ఆచరించి పొందే ప్రయోజనము ఉండదు. అందుచేత, **భాస్వతా** అనే విశేషణమును ప్రయోగించి 'ప్రకాశిస్తున్న జ్ఞానదీపము చేత' అని చెప్పడం జరిగింది. ఈ జ్ఞానదీపాన్ని శ్రీ శంకర భాష్యం రూపకాలంకారంలో దివ్యంగా అభివర్ణించింది.

ఇది **భాస్వతా జ్ఞానదీపం,** అంటే ప్రకాశించే జ్ఞానదీపము. దీపము ప్రకాశించాలి అంటే ప్రధానంగా

(1)వత్తి (2) నూనె (3) ప్రమిద (4) గాలి ఉండి తీరాలి. ఈ నాల్గింటిలో ఏ ఒక్కటి లేకపోయినా ప్రకాశము ప్రమాద యుతమే. మరి, ఇక్కడ మనం చూస్తున్న జ్ఞానదీపానికి ఇవి ఏమిటో అర్థం చేసుకుందాం. ఈ జ్ఞానదీపం వివేక ప్రత్యయ రూపము.

'బ్రహ్మచర్యము, సత్యము, అహింస మొదలైన సాధనల సంస్కారంతో ఏర్పడిన ప్రజ్ఞయే' ఈ జ్ఞాన దీపానికి వత్తి *(బ్రహ్మచర్యాది సాధన సంస్కారవత్ ప్రజ్ఞా వర్తినా).* 'వైరాగ్యమే' ఈ దీపానికి ఆధారమైన ప్రమిద *(విరక్తాన్తః కరణాధారేణ).* 'భక్తి వలన ప్రాప్తించిన అనుగ్రహమే' తైలము. ఈ తైలము చేత వత్తి తడుపబడి ఉంది *(భక్తి ప్రసాద స్నేహాభిషిక్తేన).* 'ఈశ్వర భావన యందు నిరంతరాసక్తి' అనే గాలి చేత ఈ దీపం చలిస్తూ ఉంటుంది *(మద్భావ నాభినివేశ వాతారితేన).* ఈ దీపము 'విషయాల నుండి విడిపడి, రాగద్వేషాల చేత కలుషితం కాని బుద్ధి' అనే గాలి లేని గదిలో ఉంది *(విషయ వ్యావృత్త చిత్త రాగద్వేషా కలుషిత నివాతాప వరకస్థేన).* ఈ విధమైన ఉపకరణాది సహకార విషయాలతో ప్రజ్వలించే జ్ఞానదీపము సమ్యగ్దర్శన ప్రకాశంతో విరాజిల్లుతూ ఉంది. ఈ విధంగా నిత్యాభియుక్తులై భగవంతుని నిరంతరాసక్తి చేత సేవించు భక్తులు మోక్షరూపుడైన భగవంతుని కన్నా అన్యమైన దానిని ఆశించరు కనుక, అది తెలిసిన భగవంతుడు వారిని అనుగ్రహించి తన స్వస్వరూపమును వారి ఆంతర్యంలో అభివ్యక్తం చేస్తాడు. ఈ విషయాన్నే కఠోపనిషత్తు కూడా ధృవ పరచింది.

నాయమాత్మా ప్రవచనేన లభ్యో న మేధయా న బహునా శ్రుతేన
యమే వైష వృణుతే తేన లభ్య స్తస్యైష ఆత్మా వివృణుతే తనూం స్వామ్ ॥

ఆత్మ ప్రవచనములచే లభించదు. మేధాశక్తి చేత ప్రాప్తించేది కాదు. విశేష శ్రవణము చేత సాధ్యము కాదు. (అర్హతను గుర్తించి) అతడు ఎవరిని ఎన్నుకుంటాడో అతనికే తన స్వస్వరూపమును అభివ్యక్తం చేస్తాడు. ఎవరికి అభివ్యక్త మవుతుందో వారే దర్శిస్తారు.

జ్ఞానప్రాప్తికి భగవదనుగ్రహము అవశ్యమని, భగవత్కృప అనేది భక్తికే సాధ్యమని అర్జునుడు అర్థం చేసుకున్నాడు. భక్తి కార్యాన్ని దివ్యంగా సాగించడానికి, ఈశ్వర విభూతి వైభవము ఎంతగానో ఉపయుక్త మని భావించి, పూర్వం సంక్షిప్తంగా చెప్పిన విభూతులను విశేషించి విస్తారంగా చెప్పమని అర్జునుడు భగవంతుని ప్రార్థిస్తున్నాడు.

అర్జున ఉవాచ :

పరంబ్రహ్మ పరంధామ పవిత్రం పరమం భవాన్ ।
పురుషం శాశ్వతం దివ్య మాదిదేవ మజం విభుమ్ ॥ 12
ఆహుస్త్వా మృషయః సర్వే దేవర్షి ర్నారద స్తథా ।
అసితో దేవలో వ్యాసః స్వయం చైవ బ్రవీషి మే ॥ 13

పరం-బ్రహ్మ-పరం-ధామ-పవిత్రం-పరమం-భవాన్
పురుషం-శాశ్వతం-దివ్యం-ఆదిదేవం-అజం-విభుం
ఆహుః-త్వాం-ఋషయః-సర్వే-దేవర్షిః-నారదః-తథా
అసితః-దేవలః-వ్యాసః-స్వయం-చ-ఏవ-బ్రవీషి-మే

భవాన్ = నీవు		ఋషయః	= మహర్షులు
పరంబ్రహ్మ = పరబ్రహ్మవు		దేవర్షిః	= దేవర్షి యైన
పరంధామ = పరమ తేజస్వరూపుడవు		నారదః	= నారదుడు
పరమం పవిత్రం = పరమ పవిత్రుడవు		తథా	= అలాగే
త్వాం = నిన్ను		అసితః	= అసితుడు
శాశ్వతం = నిత్యునిగా		దేవలః	= దేవలుడు
దివ్యం = దివ్యమైన		వ్యాసః	= వ్యాసుడు
పురుషం = పురుషునిగా		ఆహుః	= తెలిపినారు
ఆదిదేవం = ఆదిదేవునిగా		స్వయం చ ఏవ	= స్వయము గనే
అజం = పుట్టుక లేని వానినిగా		మే	= నా కొరకు
విభుం = ప్రభువుగా		బ్రవీషి	= చెబుతున్నావు
సర్వే = సమస్తమైన			

అర్జునుడు పలికెను :

భగవాన్! నీవు పరబ్రహ్మవు. పరంధాముడవు. పరమ పావనుడవు. పరమ పురుషుడవు. నిత్యుడవు. ప్రకాశ స్వరూపుడవు. ఆది దేవుడవు. పుట్టుక లేని వాడివి. సర్వవ్యాపివి.
ఋషు లందరు - దేవర్షి నారదుడు, అసితుడు, దేవలుడు, వేదవ్యాసుడు - అందరూ అలాగే చెబుతున్నారు. నువ్వు కూడా నాకు ఆ విధం గానే చెబుతున్నావు.

వ్యాఖ్య

అర్జునుని అవగాహన

ఈ రెండు శ్లోకాలలో శ్రీకృష్ణుడు సాక్షాత్తు భగవంతుడే అని అర్జునుడు తన విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నాడు. కేవలం పరమాత్మకు మాత్రమే సంబంధించిన కొన్ని లక్షణాలను పేర్కొంటూ స్తుతిస్తున్నాడు. ఈ విధమైన స్థిర విశ్వాసానికి పరమేశ్వరుడు స్వయంగా బోధిస్తున్న దానిని ప్రమాణంగా స్వీకరిస్తూ, గతంలో తాను మహర్షుల నుండి ఆలకించిన విషయాన్ని ఆప్త వాక్యంగా గ్రహిస్తూ, తన స్వానుభవాన్ని కూడా జోడిస్తూ తన అవగాహనను అభివ్యక్తం చేస్తున్నాడు.

బాగుంది. శ్రీకృష్ణుడు భగవంతుడే అనే సత్యాన్ని మహర్షుల ద్వారా పూర్వమే విని ఉన్నప్పుడు, నాల్గవ అధ్యాయారంభంలో, కృష్ణా! నువ్వు ఇప్పుడు పుట్టావు. సూర్యుడు సృష్ట్యాది లోనే ఉన్నాడు. మరి నువ్వు ఆదిలో సూర్యునికి బోధించినట్లు చెబుతున్న విషయాన్ని ఎలా స్వీకరించేది? **(కథం విజానీయామ్?)** అని అర్జునుడు ఎందుకు ప్రశ్నించాడు? తెలిసే ప్రశ్నించాడా? తెలియక ప్రశ్నించాడా? అనే ప్రశ్నను ఆ సందర్భంలో లేవనెత్తి నేను సుదీర్ఘంగా వ్యాఖ్యానించాను. చివరికి, అర్జునుడు తెలిసే ప్రశ్నించాడు అనే విషయాన్ని నేను సహేతుకంగా వివరించాను. అక్కడ నా వ్యక్తిగత మైన అభిప్రాయాన్ని చెబుతూ అర్జునుడికి తెలిసినా తనకు ఆరాధ్యుడైన అచ్యుతుడు స్వయంగా చెబితే వినాలని కుతూహల పడి ప్రశ్నించాడు అన్నాను. ఆ అభిప్రాయం సశాస్త్రీయమే నని ఇక్కడ ధృవ పడింది. 'కృష్ణా! నువ్వే నాకు స్వయంగా చెబుతున్నావు' అని అర్జునుడు స్పష్టంగా పలికాడు **(స్వయమేవ మే బ్రవీషి).**

నారదుడు, అసితుడు, దేవలుడు, వ్యాసుడు మొదలగు ఋషులు చెబుతూ ఉంటే గతంలో విన్నాడు. ప్రస్తుతం శ్రీకృష్ణుడు స్వయంగా చెబుతూ ఉంటే వింటున్నాడు.

అసితుడు వ్యాసుని శిష్యుడు, దేవలమహర్షి తండ్రి. దేవలఋషి ధౌమ్యాచార్యుని జ్యేష్ఠ భ్రాత. ధౌమ్యాచార్యుడు మనకు మహాభారతం, అరణ్య పర్వంలో గణనీయ మైన పాత్రను పోషిస్తూ కనిపిస్తాడు. అరణ్యంలో తన నాశ్రయించిన బ్రాహ్మణులను, సాధువులను ఎలా పోషించాలి? అని ధర్మరాజు ప్రార్థించి నపుడు, సూర్య మంత్రాన్ని ఉపదేశించి, సూర్యదేవుని అనుగ్రహంతో అక్షయ పాత్రను ధర్మరాజు సాధించడానికి కారకుడు ధౌమ్యాచార్యుడే. ఈ ధౌమ్యాచార్యుని అన్నగారే దేవలఋషి.

దేవల ఋషి శ్రీమద్భాగవతం అష్టమ స్కంధములో అగుపిస్తాడు. 'హూహూ' అనే పేరు గల గంధర్వ శ్రేష్ఠుడు దేవల ఋషి శాప కారణం గానే మొసలిగా జన్మించి, సరోవరంలో గజేంద్రుని కాలు పట్టుకుంటాడు. గజేంద్ర మోక్షంలో దేవలఋషి ప్రస్తావన ఉంది ***(ముక్తో దేవల శాపేన హూహూ గన్ధర్వ సత్తమః).***

ఋషుల ద్వారా గతంలో అర్జునుడు ఆలకించినా, గురు ముఖతః శ్రవణం చేయడం వల్ల ఈ జ్ఞానము దృఢమైంది. కనుకనే బ్రహ్మ లక్షణాలను దివ్యంగా వర్ణిస్తున్నాడు.

బ్రహ్మ నిర్దేశము

జగద్గురు వైన గీతాచార్యుని స్తుతించడములో తనకు అవగతమైన పరమార్థ తత్త్వ వైభవాన్ని దివ్యంగా అభివర్ణిస్తున్నాడు అర్జునుడు.

భగవంతుడు ఒక కాలానికి పరిమితుడు కాడు, అంటే కాలపరిచ్ఛేదం లేనివాడు అని చెప్పడానికి 'పరంబ్రహ్మ' మనే పదప్రయోగమును, కాల పరిచ్ఛేదము లేని భగవంతుడు ఒక ప్రదేశానికి పరిమితుడు కాడని చెప్పడానికి 'పరంధామ' శబ్ద ప్రయోగమును, ఆయన వస్తువు కాదు జ్ఞానము మాత్రమే అని తెలియ చేయడానికి 'పవిత్ర' పదమును ప్రయోగించి, ***పరంబ్రహ్మ, పరంధామ, పవిత్ర*** మనే పదాల ద్వారా పరమాత్మను అపరిచ్ఛిన్నునిగా, అనంతునిగా అభివర్ణించాడు ***(అనంతః దేశకాల వస్తు అపరిచ్ఛిన్నః).***

ప్రస్తుతం 'పవిత్ర' మనే పదాన్ని మాత్రం ప్రత్యేకమైన స్పృహతో అసమానంగా పేర్కొన్నాడు. 'జ్ఞానానికి మించిన పవిత్రమైన వస్తువు మరొకటి లేద'ని నాల్గవ అధ్యాయం లోనే భగవంతుడు స్పష్టం చేశాడు *(4 - 38)*. పరమేశ్వరుడు జ్ఞాన స్వరూపుడు కనుకనే పవిత్రాలలో పవిత్రుడుగా, మంగళకరమైన వాటిలో మంగళ స్వరూపుడుగా కీర్తింప బడ్డాడు ***(పవిత్రాణాం పవిత్రం యో మంగళానాంచ మంగళం*** - విష్ణుసహస్రనామం).

సాధన సాధ్య సంబంధము

అర్జునుడు మోక్షకామి. మోక్షం జ్ఞానరూపంలో ఉందని అర్థం చేసుకున్నాడు. జ్ఞానము పవిత్ర మైనది అని కూడా తెలుసుకున్నాడు. అట్టి జ్ఞానము బుద్ధిలో స్థిరంగా నిలవాలి అంటే భగవంతుడు జ్ఞానదీపాన్ని వెలిగించాలి. జ్ఞానదీపాన్ని అందరి బుద్ధులలో భగవంతుడు ఎందుకు వెలిగిస్తాడు? ఎవరిపై తన అనుగ్రహాన్ని వర్షింప చేయాలి అనుకుంటాడో, వారి బుద్ధుల లోనే వెలిగిస్తాడు.

మరి, భగవదనుగ్రహం ఎవరికి కలుగుతుంది? ఎవరు మచ్చిత్తత్వాది సాధనల ద్వారా, నిత్యాభియుక్తులై పరమేశ్వరునే భక్తితో సేవిస్తుంటారో, అట్టి వారి పైనే భగవదనుగ్రహం పడుతుంది. ఇదీ క్రమము.

సర్వదా, సర్వ కార్యాల ద్వారా భగవంతుని ఉపాసించే వారికి అమంగళం ఉండదు. పైగా ఈశ్వరానుగ్రహం ప్రాప్తిస్తుంది. బుద్ధిలో జ్ఞానదీపం ప్రకాశిస్తుంది. కారణం, వారి హృదయాలలో కేవలం భగవంతుడు ఉండటమే ***(ఆత్మ భావస్థః).***

సర్వదా సర్వ కార్యేషు నాస్తి తేషాం అమంగళమ్ ।
యేషాం హృదిస్థో భగవాన్ మంగళాయతనో హరిః ॥

ఏ భక్తుల హృదయాలలో మంగళ స్వరూపుడైన భగవానుడు ఉంటాడో, వారికి ఎక్కడ, ఎప్పుడు, ఏ కార్యాల యందు కూడా అమంగళము అనేది ఉండదు అని బృహన్నారాయణము.

కనుక, భక్తి సాధన చెయ్యాలని, భగవదనుగ్రహం పొందాలని, తద్వారా పవిత్రుడై, పవిత్రమైన జ్ఞానమును పొంది తరించాలి అనే సాధన సాధ్య సంబంధ విషయమైన అవగాహన పూర్ణంగా అర్జునునికి ఏర్పడటం చేత, విభూతి ఆరాధన ద్వారా పవిత్రు డయ్యేందుకు మరి కొన్ని విశిష్ట మైన విభూతులను అనుగ్రహించ మని అచ్యుతుని అర్థిస్తున్నాడు. భగవంతుని స్తుతిస్తున్నాడు.

భగవ ద్వైభవాన్ని అర్జునుడు వర్ణిస్తున్నాడు.

సర్వమేత దృతం మన్యే యన్మాం వదసి కేశవ ।
న హి తే భగవ న్వ్యక్తిం విదు ర్దేవా న దానవాః ॥ **14**

సర్వం-ఏతత్-ఋతం-మన్యే-యత్-మాం-వదసి-కేశవ
న-హి-తే-భగవన్-వ్యక్తిం-విదుః-దేవాః-న-దానవాః

కేశవ	=	కృష్ణా	భగవన్	=	భగవంతుడా!
యత్	=	ఏ విషయమును	తే	=	నీ యొక్క
మాం	=	నన్ను గూర్చి	వ్యక్తిం	=	స్వరూపమును
వదసి	=	చెబుతున్నావో	దేవాః	=	దేవతలు
ఏతత్	=	ఈ	నవిదుః	=	ఎరుగరు
సర్వం	=	సమస్తమును	దానవాః	=	దానవులు
ఋతం	=	సత్యమని	న హి విదుః	=	ఎరుగరు కదా!
మన్యే	=	తలుస్తున్నాను			

కేశవా! కృష్ణా! నువ్వు ఏదేది చెప్పావో అదంతా సత్యమే అని భావిస్తున్నాను. భగవాన్! నీ పుట్టుకను దేవదానవులు కూడా ఎరుగ లేరు.

వ్యాఖ్య

ప్రామాణ్య నిశ్చయం

ప్రమాకరణం ప్రమాణం - 'ప్రమ' అంటే జ్ఞానము. జ్ఞానమును, అనగా ప్రమను కలిగించేది ప్రమాణము. అదే శాస్త్రము. శాస్త్ర మంటే వేదము. అందుచేత ప్రామాణ్యం కాని విషయాల్ని ఆర్ష ధర్మానుయాయులు అంగీకరించరు. అలాగే ప్రమాణ విషయము నందు శ్రద్ధ లేని వారు కూడా ప్రమాణ ఫలాన్ని అందుకోలేరు. శాస్త్రము, అనగా ప్రమాణము సంప్రదాయ గాడిలో నిలిచి బోధించే వ్యక్తి నుండి అంది నపుడే అది బుద్ధికి పడుతుంది. కనుక, శ్రోతకు ప్రమాణ ఫలం అందాలి అంటే శాస్త్రం మీద ఎంత విశ్వాసం ఉందో, శాస్త్రాన్ని అందించే వక్త, లేదా గురువు మీద కూడా అంతే విశ్వాసం ఉండాలి. అప్పుడే ప్రమాణం ఫలిస్తుంది ***(శాస్త్రస్య గురువాక్యస్య సత్య బుద్ధిః).*** ఇదే శ్రద్ధ. అర్జునుడు ఆ విధమైన శ్రద్ధా ప్రకటనం చేస్తున్నాడు.

గతంలో మహర్షుల ద్వారా వినడానికి, ప్రస్తుతం సాక్షాత్తు జగద్గురువైన శ్రీకృష్ణుని ముఖతః వినడానికి అదే తేడా. ప్రామాణ్య నిశ్చయం జరిగి నపుడే గురుబోధ వంట పడుతుంది. అందుకనే శ్రీకృష్ణుడు చెప్పిన దంతా సత్యమే అని తన విశ్వాసాన్ని పార్థుడు ప్రకటిస్తున్నాడు. ఇక్కడ సత్యం అనే దానికి పర్యాయ పదంగా 'ఋతం'ను వాడాడు. ఋతం అంటే సత్యమే అయినా, ఋతం అనే పదము మరేదో కూడా చెబుతుంది.

సద్భిః అర్యతే ఋతమ్ - సత్పురుషుల చేత, లేదా ఋషుల చేత పొందబడేది ఋతము. ప్రస్తుతం కృష్ణుడు చెబుతున్నదే గాక, గతంలో తనకు ఋషులు చెప్పిన దంతా ***(ఏతత్ సర్వం)*** కూడా సత్యమే అని తాను భావిస్తున్నాడనే అర్థం ధ్వనిస్తూ ఉంది. భగవదామోదం ఉన్నప్పుడే ఋషుల మాటలైనా ప్రమాణా లవుతాయి.

ఈశ్వరుడు, ఈశ్వర జ్ఞానం వేరు కాదని ఇప్పటికే అనేక చోట్ల చెప్పుకున్నాం. వేదము జ్ఞానమయము. వేద నారాయణుడు జ్ఞాన స్వరూపుడు. కనుక, శ్రుతి ఆమోద ముంటే భగవంతుని ఆమోదం ఉన్నట్లే.

దేవతలకు తెలిసిందా?

దానవులకు తెలుస్తుందా?

భగవంతుని పుట్టుక, లేదా ప్రభావము ***(వ్యక్తిం ప్రభవం)*** దేవతలకు తెలియదు. ఇక దానవుల కేమి తెలుస్తుంది? భగవంతుని యందు రాగం గల వారు దేవతలు. ద్వేషం గల వారు దానవులు. భగవంతుణ్ణి రాగంతో తెలుసుకో లేము. ద్వేషం తోనూ పొంద లేము. ఆయన జ్ఞానానికే లభ్యుడు.

దేవతల్ని రక్షించడానికి, దానవుల్ని శిక్షించడానికి ఆదిదేవుడు అనేక అవతారాలను ధరించాడు. అలాంటి దేవదేవుని సురాసురులు ఎలా తెలుసుకుంటారు?

దేవదానవులు ఎవరో కారు. కశ్యప మహాముని కుమారులు. కశ్యపుడు నవబ్రహ్మలలో ఒకడు. ఆయనకు దితి, అదితి అని ఇద్దరు భార్యలు. అదితి సంతానము దేవతలు. దితి సంతానము దానవులు. దేవతల్ని రక్షించడానికి, దానవుల్ని శిక్షించడానికి అవతరించిన దేవదేవుని అదితి కశ్యపుల సుతులైన సురులు ఎలా తెలుసుకుంటారు? దితి కశ్యపుల కుమారులైన అసురు లెలా తెలుసుకుంటారు? వారుభయులకూ తండ్రి, నవబ్రహ్మలలో ఒకరైన కశ్యపుడే తెలుసుకోలేక పోయాడు కదా! ఈ అర్థం అర్జునుడు సంబోధించిన 'కేశవ' నామం నుండి వ్యక్త మవుతుంది.

క ఇతి బ్రహ్మణో నామ ఈశోఽహం సర్వదేహినామ్
ఆవాం తవాంగే సంభూతౌ తస్మాత్ కేశవ నామవాన్

బ్రహ్మ రుద్రాదులు ఆయన నుండి జన్మించడం చేత భగవంతునికి 'కేశవ' అనే పేరు కలిగింది అని హరివంశము.

దేవ దానవు లందరికీ ఆదికారణ మైన ఆదిదేవుని తెలుసుకోవడం ఎవరి తరమూ కాదు. తనను తెలుసుకోవడం తనకే సాధ్యం.

స్వయ మే వాత్మనాత్మానం వేత్థ త్వం పురుషోత్తమ ।
భూతభావన భూతేశ దేవదేవ జగత్పతే ॥ 15

స్వయం-ఏవ-ఆత్మనా-ఆత్మానం-వేత్థ-త్వం-పురుషోత్తమ
భూతభావన-భూతేశ-దేవదేవ-జగత్పతే

పురుషోత్తమ	=	పురుషశ్రేష్ఠుడా!	త్వం	=	నీవు
భూతభావన	=	భూతములను సృష్టించిన	ఆత్మానం	=	నిన్ను
భూతేశ	=	భూతప్రభువా!	స్వయం ఏవ	=	స్వయముగనే
దేవదేవ	=	దేవతలకు దేవుడా!	ఆత్మనా	=	నీ చేతనే
జగత్పతే	=	జగత్ప్రభువా	వేత్థ	=	తెలుసుకుంటున్నావు

పురుషోత్తమా! భూతభావనా! భూతేశా! దేవదేవా! జగన్నాథా! నువ్వేమిటో నీ కొక్కడికే తెలుసు.

వక్తు మర్హ స్యశేషేణ దివ్యా హ్యాత్మవిభూతయః ।
యాభి ర్విభూతిభి ర్లోకా నిమాం స్త్వం వ్యాప్య తిష్ఠసి ॥ 16

వక్తుం-అర్హసి-అశేషేణ-దివ్యాః-హి-ఆత్మవిభూతయః
యాభిః-విభూతిభిః-లోకాన్-ఇమాన్-త్వం-వ్యాప్య-తిష్ఠసి

త్వం	=	నీవు	తిష్ఠసి	=	ఉన్నావో
యాభిః	=	ఏ	దివ్యాః హి	=	దివ్యములైన
విభూతిభిః	=	విభూతుల చేత	ఆత్మవిభూతయః	=	ఆ ఆత్మవిభూతులను
ఇమాన్	=	ఈ	అశేషేణ	=	నిశ్శేషముగా
లోకాన్	=	లోకములను	వక్తుం	=	చెప్పుటకు
వ్యాప్య	=	వ్యాపించి	అర్హసి	=	తగుదువు

కృష్ణా! నువ్వు నీ విభూతుల చేత లోకాలన్నీ వ్యాపించావు. నీ విభూతులు దివ్యమైనవి . వాటిని చెప్పడం నీ కొక్కడికే సాధ్యం.

వ్యాఖ్య

కృష్ణా! అన్నిటినీ, అందరినీ సృష్టించిన వాడవు నీవే. నీవే ఆదికారణానివి. భూతభావనుడవు. అలాగే అందరినీ పోషించే భూతేశుడవు నీవు. నీవే జగత్పతివి. అలాంటి నీ నుండి ఆవిర్భవించిన లోకాలు, ఆ లోకాలలో జీవించే వారు నిన్నెలా తెలుసుకుంటారు? నిన్ను నీవే తెలుసుకో గలవు. మరొకరు తెలుసుకో లేరు.

మా లోకంలో తెలిసిన వారు ఒకరు చెబితేనే మరొకరు తెలుసుకుంటూ ఉంటారు, ఏదైనా. నువ్వు అలా కాదు. ఒకరు చెప్పే అవసరం లేకుండా నిన్ను నీవే తెలుసుకుంటావు ***(త్వం స్వయం వేత్తా).*** అయినా, నిన్ను గూర్చి మరొకడు చెప్పాలి అంటే, అతడు నీతో సముడై ఉండాలి. అలా ఎవరున్నారు కనుక?

అయినా నా పిచ్చి గాని, మా లోకం లోనే ఒకరి మనస్సులో ఏముందో మరొకరికి అర్థం కాక చస్తుంటారు. కనీసం, ఎవరి మనస్సు వారి కర్థం అవుతుంది అని పూర్వం సర్ది చెప్పుకునే వారు. ఇప్పుడు ఆ ఆశలు కూడా లేవు. ఎవరి మనస్సు వాళ్ళకు అర్థం గాకనే, మరొకరికి డబ్బిచ్చి సలహాలు అడుగుతుంటారు. అలాంటి వారు నిన్ను తెలుసుకోగలరా?

పైగా, నీ విభూతులు అంతటా, అన్ని లోకాలలో వ్యాపించి ఉన్నప్పుడు, వాటిని అర్థం చేసుకొనే శక్తి ఎవరి కుంటుంది? నీకు తప్ప!

ఆకాశాన్ని ఆకాశమే తెలుసుకోవాలి. ఇక్కడ ఉండే నక్క, అక్కడ ఉండే నక్షత్రము ఆకాశాన్ని ఏమి తెలుసుకుంటాయి?

ఆకాశాన్నే తెలుసుకొనే అవకాశం లేనపుడు, ఆకాశానికి ఆధారమైన, సూక్ష్మాతి సూక్ష్మమైన నిన్ను గూర్చి తెలుసుకోవడం గాని, చెప్పడం గాని ఎవరికి సాధ్యం? ఎవరి కైనా సాధ్యమైతే, అది ఒక్కరికే. ఆ ఒక్కరు ఎవరో కాదు. నువ్వే.

తనకు తానుగా తెలుసుకొనే అవకాశం లేదని గ్రహించిన అర్జునుడు, భగవ ద్విభూతులను వివరించ మని పరమేశ్వరునే అడుగుతున్నాడు.

కథం విద్యా మహం యోగింస్త్వాం సదా పరిచిన్తయన్ ।
కేషు కేషు చ భావేషు చిన్త్యోఽసి భగవన్మయా ॥ 17

కథం-విద్యాం-అహం-యోగిన్-త్వాం-సదా-పరిచింతయన్
కేషు-కేషు-చ-భావేషు-చింత్యః-అసి-భగవన్-మయా

యోగిన్	=	యోగీశ్వరా	భగవన్	=	భగవంతా
అహం	=	నేను	కేషు కేషు చ	=	ఏయే
త్వాం	=	నిన్ను	భావేషు	=	భావముల యందు
సదా	=	ఎల్లప్పుడు	మయా	=	నా చేత
పరిచింతయన్	=	ధ్యానము చేయుచు	చింత్యః	=	చింతించదగిన వాడవు
కథం	=	ఎటుల	అసి	=	అగుదువు
విద్యాం	=	తెలిసికొందును			

యోగీశ్వరా! సదా ధ్యానిస్తూ నిన్ను నేను తెలుసుకొనేదెలా? భగవంతా! ఏయే వస్తువులలో నిన్ను ధ్యానించాలి?

వ్యాఖ్య

పరమేశ్వరుడు సృష్టికి ఉపాదాన కారణ మైనపుడు, ఈ విశ్వమంతా పరమేశ్వరుడే. విశ్వం లోని ప్రతి వస్తువు పరమేశ్వరుడే. కుండ కుండగా ఉండటానికి మట్టి ఎలా కారణమో, విశ్వంలో ఏ వస్తువైనా, ఆ వస్తువుగా ఉండటానికి పరమాత్మే కారణము. కుండలో మట్టి ఎక్కడ ఉంది అంటే ఏమి చెప్పగలం? విశ్వంలో భగవంతుడు ఎక్కడున్నాడు, ఏ వస్తువులో ఉన్నాడు అని ప్రశ్నిస్తే ఏం చెప్పగలం? ఎక్కడ లేడు కనుక ఒక్కచోట ఉన్నాడు అని చెప్పాలి?

అంతటా భగవంతుడే ఉన్నా, అన్ని వస్తువులలో వాసుదేవుడే ఉన్నా, పరిమిత మైన మన మనస్సు సర్వత్ర నిండి యున్న పరమేశ్వర విభూతి చైతన్యాన్ని ధ్యానించ గలదా? అందుచేతనే మనస్సును నిలబెట్టుకోవడానికి ఏదో ఒక ఆలంబనం కావాలి. సాకార విభూతులలో దేనినో ఒక దానిని ఎన్నుకొని, దానిని ధ్యానానుకూలంగా మార్చుకోవాలి. అందుకే, ఏయే వస్తువులలో నిన్ను ధ్యానించ గలను? అని అర్జునుడు అడుగుతున్నాడు.

ఈ సందర్భంలో పరమేశ్వరుని ***యోగి*** అని, ***భగవాన్*** అని సంబోధించడం అర్జునుని లోని గీతా జ్ఞానానికి, అవగాహనకు అద్దం పడుతూ ఉంది.

భగః అస్య అస్తీతి భగవాన్ - 'భగము' కలవాడు భగవంతుడు. భగము అంటే సమగ్రమైన ఐశ్వర్యము, ధర్మము, యశస్సు, సంపద, జ్ఞానము, వైరాగ్యము - ఈ ఆరు కళ్యాణ గుణములు కలవాడు భగవంతుడు. ఇవన్నీ భగవంతుని ఐశ్వర్యములే. విభూతులే. ఏయే విభూతులను ధ్యానం చెయ్యాలో చెప్పమని అడిగే సందర్భంలో అర్జునుడు శ్రీకృష్ణుని ***భగవన్*** అని సంబోధించడం ఎంతగానో సందర్భోచితంగా ఉంది.

అంతే గాక, ఏయే వస్తువులలో ధ్యానించాలి అని అడుగుతున్న ఈ సందర్భం లోనే, ***యోగిన్*** అని పరమాత్మను సంబోధించడం మరొక విశేషం. ఎందుకంటే, తాను ధ్యానం చెయ్యడానికి ఉద్యుక్తు డౌతున్నాడు. అది యోగ సాధన. యోగసాధన ద్వారా పొందబడే వాడు కనుక పరమేశ్వరుడు ***యోగిన్*** అయ్యాడు ***(యోగః జ్ఞానం తేనైవ గమ్యత్వాత్ యోగీ).***

ఈశ్వర విభూతులను మళ్లీ వినాలని అర్జునుడు ఆసక్తు డవుతున్నాడు.

విస్తరేణాత్మనో యోగం విభూతిం చ జనార్దన ।
భూయః కథయ తృప్తిర్హి శృణ్వతో నాస్తి మేఽమృతమ్ ॥ 18

విస్తరేణ-ఆత్మనః-యోగం-విభూతిం-చ-జనార్దన
భూయః-కథయ-తృప్తిః-హి-శృణ్వతః-న-అస్తి-మే-అమృతం

జనార్దన	=	కృష్ణా!	కథయ	=	చెప్పు
ఆత్మనః	=	నీ యొక్క	అమృతం	=	జ్ఞానామృతమును
యోగం	=	యోగమును	శృణ్వతః	=	వింటున్న
విభూతిం చ	=	విభూతిని	మే	=	నాకు
విస్తరేణ	=	విస్తారముగా	తృప్తిః	=	సంతృప్తి
భూయః	=	మరల	న అస్తి హి	=	కలగడం లేదు

జనార్దనా! కృష్ణా! నీ యోగమును, విభూతిని సవిస్తరంగా మళ్ళీ చెప్పు. నువ్వు చెప్పే అమృతం లాంటి విషయాలు ఎంత విన్నా తృప్తి కలగడం లేదు.

వ్యాఖ్య

భగవదైశ్వర్యాన్ని, ఈశ్వర విభూతులను మళ్ళీ **(భూయః)** చెప్పమని **(కథయ)** అర్జునుడు అచ్యుతుని అర్థిస్తున్నాడు. ఏడవ అధ్యాయంలో **రసోఽ హ మప్సు కౌన్తేయ** అంటూ ప్రారంభించి కొన్ని భగవ ద్విభూతులను వివరించిన గీతాచార్యుడు, తొమ్మిదవ అధ్యాయంలో మళ్ళీ **అహం క్రతు రహం యజ్ఞః** అంటూ మొదలెట్టి మరి కొన్ని విభూతులను ప్రవచించాడు. అందుచేతనే ఇప్పుడు మళ్ళీ చెప్పమని అర్జునుడు అడుగుతున్నాడు. ఇప్పటికే ఒకటికి రెండు చోట్ల చెప్పి నపుడు మళ్ళీ చెప్పడ మెందుకు? చెప్పమని అడగడ మెందుకు? దానికి సమాధానం కూడా అర్జునుడే చెబుతున్నాడు. ఎంత విన్నా, వింటూ ఉన్నా **(శృణ్వతః)** తనకు తృప్తి కలగడం లేదట **(మే నాస్తి తృప్తిః).** ఎందుకని తృప్తి కలగడం లేదు? బోధనా విషయం అమృతం లాంటిది కావడమే. అదే కారణం అంటున్నాడు. ఎంతటి అపూర్వమైన గురుశిష్య సంబంధమో ఇది!

అమృత బోధను అందించే గురువు ఒక వైపు, బోధామృతాన్ని పరవశించి పానం చేసే శిష్యుడు మరొక వైపు. చూడటానికి రెండు కళ్ళు సరిపోవడం లేదు. అలా ఉండాలి గురుశిష్య లంటే. శిష్యుని శ్రద్ధకు వశపడి గురువు బోధిస్తూ ఉంటే, గురు బోధను శ్రద్ధాభక్తులతో పరవశించి శిష్యుడు వింటున్నాడు. గురుబోధ యందు పార్థునికి ఉన్న ప్రీతి, శిష్యుడిని అని చెప్పుకొనే ప్రతి వ్యక్తికి, అతడు ఏ కాలం వాడైనా, ఏ దేశంలో ఉన్నవాడైనా, తప్పక ఉండి తీరాలి. అప్పుడే గురుబోధ ఫలిస్తుంది.

అమృతాన్ని దేవతలు కూడా త్రాగుతారు. అమృతాన్ని త్రాగిన వారు అమరు లవుతారు. అంతమాత్రాన, వారు జనన మరణాలను దాటి పోలేరు. అమృత స్వరూపులు కాలేరు. కాని, భగవంతుని జ్ఞానామృతాన్ని పానం చేసిన వారు అమృత స్వరూపు లవుతారు. కనుకనే, అమృతము లభించే సురలోక భోగాలను త్యజించి వచ్చిన కుంతీతనయుడు, బోధామృతాన్ని పానం చేయడానికి పరమేశ్వరుని పాదాలను ఆశ్రయించాడు. సురులు పానం చేసేది బ్రతికించే అమృతము. భక్తులు, జ్ఞానులు పానం చేసేది బ్రతుకు నిచ్చే, బ్రతికి ఉండగానే మోక్షము నిచ్చే తత్త్వామృతము. అందుకే తృప్తి కలగడం లేదు, తనివి తీరడం లేదు అంటున్నాడు అర్జునుడు. నిజమే, మోక్షము ప్రాప్తించే వరకు భక్తుని చిత్తము ఇలాగే ఉంటుంది. ఉండాలి.

తీరని ఆర్తిని, వెలితిని తీర్చుకొనే ప్రయత్నంలో, భగవ దైశ్వర్యాన్ని ధారణ చేసి, ధ్యానించి, తరించాలని భావించడం చేతనే, ఈశ్వర విభూతులను విస్తారంగా చెప్పమని ప్రార్థిస్తున్నాడు పార్థుడు. తన దివ్య విభూతులను వర్ణించడం భగవంతుడు ఇక ప్రారంభిస్తాడు. అర్జునుడు గీతలో శ్రీకృష్ణుని ప్రార్థించినట్లే, అర్జునుని పౌత్రుడు, పుణ్యాత్ముడు అయిన పరీక్షిత్తు శ్రీ శుకమహర్షిని భాగవతంలో అలాగే ప్రశ్నించాడు.

క॥ ధారణ యే క్రియ నిలుచును? ధారణ కే రూప మెద్ది ధారణ యనగా?
ధారణ పురుషు మనోమల మే రీతి హరించు? నాకు నెరిగింప గదే॥

అని గంగాతీరంలో పరీక్షిన్మహారాజు ప్రశ్నించి నపుడు, ***హరి విశాల రూప మందు జిత్తము చేర్చి నిలుప వలయు బుద్ధి నెరపి బుధుడు*** అని బదులిచ్చాడు శుకమహర్షి. ఆ ప్రయత్నం లోనే విభూతి ధ్యానం ఇక్కడ ప్రాప్తిస్తూ ఉంది.

ఈ సందర్భంలో అర్జునుడు గీతాచార్యుని ***జనార్దన*** అని సంబోధించాడు. ***జనైః అర్ధ్యతే యాచ్యతే యస్మాత్ సః జనార్దనః -*** జనుల చేత అర్థింప బడేవాడు, యాచింప బడేవాడు, ప్రార్థింప బడేవాడు కనుక ఆయన జనార్దనుడు. అంతేకాదు. ***జనాన్ అర్దయతి సుఖయతీతి జనార్దనః -*** జనులను సుఖపెట్టే వాడు, ఆనందింప చేసేవాడు కనుక ఆయన జనార్దనుడు.

'జనార్దనా! మోక్షాన్ని కాంక్షించి నిన్ను అర్థిస్తున్నా. జనార్దనా! సాధన సాధ్యాలలో నువ్వే ప్రత్యక్షమై తృప్తి చెందని నన్ను తృప్తి పరచు. సంతృప్తి పరచు. స్వాత్మానుభూతిని ప్రసాదించు' అనే అభ్యర్థన ***జనార్దన*** సంబోధనములో ఇమిడి ఉంది.

అర్జునుని భాగ్యంగా ప్రాప్తించిన జగద్గురువు విభూతుల మూటను విప్పే కార్యంలో నోరు విప్పుతున్నాడు.

శ్రీ భగవానువాచ :

హన్త తే కథయిష్యామి దివ్యా హ్యాత్మవిభూతయః ।
ప్రాధాన్యతః కురుశ్రేష్ఠ నా స్త్యన్తో విస్తరస్య మే ॥ **19**

హంత-తే-కథయిష్యామి-దివ్యాః-హి-ఆత్మవిభూతయః
ప్రాధాన్యతః-కురుశ్రేష్ఠ-న-అస్తి-అంతః-విస్తరస్య-మే

హంత	=	అహో!	కురుశ్రేష్ఠ	=	అర్జునా!
తే	=	నీ కొరకు	మే	=	నా యొక్క
దివ్యాః హి	=	దివ్యములైన	విస్తరస్య	=	విభూతి విస్తారమునకు
ఆత్మవిభూతయః	=	నా విభూతులను	అంతః	=	అంతము
ప్రాధాన్యతః	=	ముఖ్యంగా	న అస్తి హి	=	లేదు గదా!
కథయిష్యామి	=	చెబుతున్నాను			

శ్రీ భగవానుడు చెబుతున్నాడు :

కురుశ్రేష్ఠా! అర్జునా! నా విభూతులు దివ్యములు కదా! వాటిలో ప్రధాన మైనవి చెబుతాను. విస్తరించి చెప్పడానికి వాటికి అంతం ఉంటే కదా!

వ్యాఖ్య

ఈశ్వర ధ్యానాన్ని అనుష్ఠించడానికి ఉపకరించే పరమాత్మ విభూతులను విస్తరించి చెప్పమని అర్జునుడు

అడిగాడు. పిసికిన పిండినే మళ్ళీ పిసికినట్లు ***(పిష్ట పేషణ న్యాయము).*** చెప్పిన విభూతుల విషయాన్నే మళ్ళీ చెప్పడ మెందుకు? అని పరమేశ్వరుడు సంశయిస్తాడేమో నని, ఎంత విన్నా తృప్తి కలగడం లేదు కనుక, మళ్ళీ ***(భూయః)*** సవిస్తరంగా వివరించ మని అర్జునుడు ప్రార్థించాడు.

సవిస్తరంగా బోధించ మని అర్జునుడు అడిగితే, దివ్యమైన తన విభూతులకు అంతము లేదు కనుక, వాటిని సాకల్యంగా వివరించడానికి సాధ్య పడదు కనుక, ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని చెబుతాను అంటున్నాడు భగవంతుడు.

ఇక్కడ ప్రాధాన్యత అంటే, పరమేశ్వరుని అశేష కళ్యాణ గుణ విశేషాలలో ఎక్కడెక్కడ ఏదేది ప్రాధాన్యతను సంతరించుకొని ఉందో, అద్దానిని వివరిస్తాను అని అర్థము ***(ఏతత్ ప్రాధాన్యతః యత్ర యత్ర ప్రధానా యాయా విభూతిః తాం తాం ప్రధానాం ప్రాధాన్యతః కథయిష్యామి అహం).*** భగవంతునికి తేజోవంతము లైన విభూతులు ఉన్నాయి. తేజము లాగే శక్తికి సంబంధించినవి, బలానికి సంబంధించినవి కూడా ఉన్నాయి. ఇవే గాక విద్య, పౌరుష, మహత్త్వ విశేషాలలో ఎక్కడెక్కడ ఏదేది శ్రేష్ఠమో దానిని వివరిస్తాను అని అంటున్నాడు.

అనంత విభూతులు

భగవంతుడు అనంతుడు. కనుక, ఆయన విభూతులు కూడా అనంతము. ఇల లోని ఇసుక రేణువుల్ని, ఆకాశం లోని నక్షత్రాలను లెక్కించడం ఎలా సాధ్యపడదో, పరమేశ్వరుని అంతం లేని విభూతులను వివరించడం కూడా అలాగే సాధ్య పడదు.

ఈశ్వర విభూతులను విస్తరించి చెప్పడం సాధ్యం కాదు అని గీతాచార్యుడు అన్న మాటకి భాష్యకారు లైన శ్రీ శంకరులు 'సాకల్యంగా వివరించడానికి వంద సంవత్సరాలైనా సరిపోవు' అని వ్యాఖ్యానించారు ***(అశేషతస్తు వర్ష శతేనాపి న శక్యాః వక్తుం).*** ఇలా అనడంలో ఒక శ్లేష కూడా ఉంది. చెప్పడానికి వంద సంవత్సరాలు సరిపోవు అంటే, వినడానికి వంద సంవత్సరాలు సరిపోవు అనే కదా అర్థం! ఒకవేళ, చెప్పేవాడు సర్వ శక్తిమంతుడు కనుక, వంద సంవత్సరాలలో చెప్పేయగలడు అని అశాస్త్రీయంగా ఆలోచించినా, వినే వాడు వంద సంవత్సరాలు వినగలడా అనేది ప్రశ్న. ఎందుకని వినలేడు? మానవుని ఆయుర్దాయమే వంద సంవత్సరాలు కనుక! ***(శతం దీర్ఘమాయుః!).***

అర్జునా! అంతం లేని విభూతులను ప్రాధాన్యతను బట్టి వివరిస్తాను అంటే, కేవలం విభూతుల్ని వర్ణించడమే కాకుండా, విశ్వంలో దేని నైనా విభూతిగా దర్శించడం ఎలాగో అర్థమయ్యేలా చేస్తాను అని భావము. త్రాడును అందిస్తాను, ఆ పైన నువ్వే ప్రాకి పైకి వద్దువు గాని అని అర్థము.

ముముక్షువు లైన సాధకులకు ఈ విభూతి వైభవము అర్థమైతే, సాధన అందమైన మలుపు తిరుగుతుంది. అందరిలో ఉన్నది ఈశ్వర చైతన్యమే నని, ఎవరు ఎలా ఉన్నా, ఏది ఎలా ఉన్నా, అదంతా ఈశ్వర విభూతియే నని అర్థ మవుతుంది. ఈ అవగాహనలో తనను తాను అతీతంగా ఊహించుకొని అహంకారంతో విర్ర వీగడం గాని, లేక తనను తాను నీచంగా ఊహించుకొని కృంగి పోవడం గాని, లేక అన్యులను హీనంగా చూడటం గాని జరగదు. ఈ విధమైన పరివర్తన జీవితాన్ని అమాంతం ప్రగతి పథంలో నడుపుతుంది.

ఈ సందర్భంలో అర్జునుని **కురుశ్రేష్ఠా!** అని సంబోధించాడు వాసుదేవుడు. కురువంశంలో శ్రేష్ఠుడు అనేది బాహ్యార్థము. **కురు** అంటే చెయ్యి అని అర్థము. ఆచరించు అని భావము. శ్రేష్ఠుడు అంటే ఉత్తముడు లేదా ఉన్నతుడు అని అర్థం. అర్జునా! ధ్యానాన్ని సాగించడానికి నా విభూతి విశేషాలను వివరించ మని కోరావు. ఆచరించే వారిలో నువ్వు శ్రేష్ఠుడివి కనుక, విని విడిచి పెట్టడం కాకుండా, విడవకుండా ప్రారంభిస్తున్నాను.

పట్టుకొని, హృదయంలో పెట్టుకొని సాగిపో! అని సూచిస్తున్నాడు.

'అర్జునా! అందులో ఏది ప్రథమ విభూతియో దాని తోనే మొదలు పెడుతున్నా. ఆలకించు!' అంటూ విభూతులను ఆరబోస్తున్నాడు.

అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయస్థితః ।
అహ మాదిశ్చ మధ్యం చ భూతానా మన్త ఏవ చ ॥ 20

అహం-ఆత్మా-గుడాకేశ-సర్వభూతాశయస్థితః
అహం-ఆదిః-చ-మధ్యం-చ-భూతానాం-అంతః-ఏవ-చ

గుడాకేశ	=	అర్జునా!	భూతానాం	=	భూతములకు
సర్వభూతాశయస్థితః	=	సర్వప్రాణుల యొక్క	ఆదిః చ	=	ఆదియును
		అంతర్హృదయము నందున్న	మధ్యం చ	=	స్థితియును
ఆత్మా	=	ఆత్మను	అంతః చ	=	లయమును
అహం	=	నేను	అహం ఏవ	=	నేనే

గుడాకేశా! అర్జునా! అందరి హృదయాలలో ఉండే ఆత్మను నేను. ప్రాణులకు నేనే ఆదిని. నేనే స్థితిని. అంతము కూడా నేనే.

వ్యాఖ్య

ఆత్మ విభూతి

విభూతి వర్ణనములో ఇదొక అద్భుతమైన ఆరంభము. ఇక్కడ నుండి ఇరవై శ్లోకాలలో, అంటే ముప్పై తొమ్మిదవ శ్లోకము వరకు విభూతులే వివరింప బడతాయి. మొదటి విభూతి పరమేశ్వరుడే. అందుచేత ***అహం*** అంటూ కదిలాడు.

ప్రాధాన్యత అంటే ఏదో అనుకున్నాను. ముందు తనను గూర్చే చెప్పు కుంటున్నాడు. ఆత్మస్తుతి కృష్ణుడికి కూడా తప్పలేదా! అని అర్జునుడు ఎక్కడ భావిస్తాడో నని, 'అర్జునా! మొదట నన్ను గూర్చి చెప్పుకున్నా నని నీకు అనిపిస్తే, పోనీ నువ్వే మొదట అనుకో!' అంటున్నాడు ఆనంద మోహనుడు.

'అదెలా? ***అహం*** అంటూ ముందు నిన్ను చెప్పేసుకున్నావు కదా! మళ్ళీ నే నేమిటి? అని ఆలోచిస్తున్నావా? బాగా చూడవయ్యా! ***అహం ఆత్మా*** - నేను ఆత్మను అన్నాను. అంతే కాదు. ***సర్వభూతాశయస్థితః*** - అందరి హృదయాలలో ఉన్న ఆత్మను అన్నాను. అర్జునా! మరి నువ్వెవరు? నువ్వూ సచ్చిదానంద స్వరూపమైన ఆత్మవే. అది నేనే. నువ్వు ఆత్మ అని నీకు అర్థమైతే, నువ్వు నేనే కదా! నేను నువ్వే కదా! మనిద్దరి మధ్య ఇక భేద మెక్కడుంది? అంతా అభేదమే కదా! ***(త్వమేవాऽహం ... తత్త్వమేవ త్వమేవ తత్).*** ఇది అఖండ మహావాక్య బోధ నాయనా! ***తత్త్వమసి*** వాక్యార్థము. స్వరూప లక్షణము. ఇదే నా మొదటి విభూతి' అంటున్నాడు భగవానుడు.

ఇక్కడ గోవిందుని బోధలో ఉన్న గమ్మత్తు చూశారా! విభూతుల్ని విస్తరించి చెప్పడం సాధ్యం కాదు అన్నాడు. ప్రారంభిస్తూనే శ్లోకం మొదటి పాదం లోనే, మొదటి విభూతి లోనే సమస్తాన్ని, అనంతాన్ని సవిస్తరంగా చెప్పేశాడు. అఖండాత్మను తన ప్రథమ విభూతిగా ఎప్పుడైతే వర్ణించాడో, సమస్తము అఖండాత్మ లోనే ఇమిడి ఉన్నందున, ఈశ్వర విభూతులను సాకల్యంగా చెప్పిన వాడయ్యాడు. అదే గీతా వైభవము. గీతాచార్యుని ప్రాభవము.

స్వరూప విభూతి

ఏది ఉన్నా, ఎవరు ఉన్నా, అవి అలా ఉండట మనేది ఆత్మపై ఆధారపడి ఉంది అని ముందే తెలుసు కున్నాం కదా! యావత్ ప్రపంచానికి సత్తా స్ఫురణలను ప్రసాదించేది పరమాత్మయే కదా! కనుక ఉన్న దేదైనా, దాని వైభవము పరమేశ్వరునిదే.

క్షీరం మధురంగా ఉంటుంది. కాని ఆ మాధుర్యం ఎవరిది అనే ప్రశ్న పడితే, ఆ మాధుర్యము క్షీరానిది కాదు, క్షీరసాగరునిది అని అర్థ మవుతుంది. ఎందుకని? క్షీరం అలా ఉండటానికి కారణమైన వాడు తానే కనుక.

కాబట్టి, ప్రారంభము లోనే ఆత్మ విభూతిని వివరించి, **కొండ అద్ద మందు కొంచెమై ఉండదా!** అన్నట్లు, సమస్త విస్తార విభూతులు ఒక్క విభూతి లోనే ఒదిగి ఉండేలా పొదిగాడు. ఇదే పారమార్థిక రూప విభూతి.

అర్జునా! నువ్వు ఒక విభూతివి. మొదట నిన్ను నీవు విభూతిగా అర్థం చేసుకుంటే, ఆ తరువాత అన్నీ విభూతులు గానే అర్థ మవుతాయి. నీవు నీకు విభూతిగా అర్థం కానపుడు, అన్య విభూతులు అర్థమయ్యే ప్రశ్నే లేదు. ***శివో భూత్వా శివం పూజయేత్*** - శివుడవై, ఆ తరువాత శివుని పూజించు అనే నిగూఢమైన శాస్త్ర వాక్యానికి ఇదే అర్థం.

నిన్ను నువ్వు ఆత్మగా ఎప్పుడు అర్థం చేసుకుంటావో, అప్పుడు అందరి హృదయాలలో ప్రకాశించేది ఒకే ఆత్మ కనుక, అందరినీ, అన్నిటినీ పరమేశ్వర విభూతులు గానే దర్శిస్తావు. ఇది అర్థమైతే, విభూతి యోగం సమాప్త మైనట్లే. కానీ, ఇది అంత సులభంగా అర్థమయ్యే విషయం కాదు కనుక, దీనినే ఇరవై శ్లోకాలలో చెప్ప వలసి వస్తూ ఉంది.

రూప విభూతి

అర్జునా! సర్వ ప్రాణులకు ఆది మధ్యాంతాలు నేనే ***(అహమేవ ఆదిః భూతానాం కారణం, తథా మధ్యం స్థితిః, అన్తః ప్రలయః)*** అంటున్నాడు. అంటే, 'ఎవరి నుండి ఈ సమస్తమూ ఆవిర్భవించిందో, ఎవరిలో ఉంటూ ఉందో, ఎవరిలో లయిస్తూ ఉందో, అది నేనే' అనే తైత్తిరీయ శ్రుతి ప్రతిపాదించిన తటస్థ లక్షణాన్ని వివరిస్తూ ఈ రూప వైభవము నాదే అంటున్నాడు. శ్లోకం లోని మొదటి పాదంలో స్వరూప విభూతిని ప్రథమ విభూతిగా వర్ణించి, శ్లోకము లోని రెండవ పాదంలో విశ్వరూపు డైన పరమేశ్వరుని రూప విభూతిని తటస్థ లక్షణం ద్వారా చెబుతున్నాడు. ఇది రెండవ విభూతి.

ఉత్తమాధికారులకు ప్రథమ విభూతి, మధ్యమాధికారులకు ద్వితీయ విభూతి సరిపోతాయి. ఈ రెండిటితో విభూతులను వివరించే ప్రథమ శ్లోకమైన ప్రస్తుత శ్లోకం ముగిసింది. ఇక ఇక్కడ నుండి ప్రవాహ రూపంలో వివరింపబడే విభూతు లన్నీ మందాధికారులకే నని సంప్రదాయంలో కనిపించే ఆచార్యుల అభిమతం.

ఆకాశానికి దూరంగా ఎవ్వరూ పోలేరు. ఇక ఆత్మకు దూరంగా ఎవ్వరైనా పోగలరా? ఆకాశానికి ఆధారమైంది ఆత్మే. ఆకాశం ఆత్మ నుండే వచ్చింది ***(తతః ఆకాశః సంభూతః).*** ఆత్మ లేకుండా ఎవ్వరూ లేరు. వాస్తవానికి ఉన్నది ఆత్మ ఒక్కటే. దీనిని స్వరూప విభూతిగా పేర్కొని జీవేశ్వరుల మధ్య భేదం లేదని నిరూపించాడు ***(జీవేశ్వర భేదం నాస్తి).*** ఇక రెండవ విభూతి యైన రూప విభూతిని వివరిస్తూ, ఈశ్వర జగత్తుల మధ్య భేదము లేదని నిర్ణయించాడు ***(ఈశ్వర జగద్భేదం నాస్తి).*** కనుక, ఆత్మయే సదా ధ్యేయ వస్తువు అనేదే మొదటి శ్లోకంలో చెప్పబడిన రెండు విభూతుల యొక్క సారాంశము.

ఈ శ్లోకంలో అర్జునుని ***గుడాకేశా!*** అని పిలిచాడు పరమేశ్వరుడు. 'గుడాకా' అంటే నిద్ర. 'ఈశ' అంటే ప్రభువు. గుడాకేశుడు అంటే నిద్రను జయించిన వాడు అని అర్థము ***(గుడాకా నిద్రా తస్యాః ఈశః గుడాకేశః జిత నిద్రః ఇత్యర్థః).*** స్వరూప స్థితిని అనుభూతిగా పొందాలి అంటే, అజ్ఞాన రూపమైన నిద్రను జయించాలి అని ***గుడాకేశ*** సంబోధనతో తెలియ చేశాడు.

ఇక ఏయే రూపాలలో పరమేశ్వరుడు ధ్యేయరూపుడో చెబుతున్నాడు.

ఆదిత్యానా మహం విష్ణు ర్జ్యోతిషాం రవి రంశుమాన్ ।
మరీచి ర్మరుతా మస్మి నక్షత్రాణా మహం శశీ ॥ 21

ఆదిత్యానాం-అహం-విష్ణుః-జ్యోతిషాం-రవిః-అంశుమాన్
మరీచిః-మరుతాం-అస్మి-నక్షత్రాణాం-అహం-శశీ

అహం	=	నేను	మరుతాం	=	మరుత్తులలో
ఆదిత్యానాం	=	ద్వాదశాదిత్యులలో	మరీచిః	=	మరీచిని
విష్ణుః	=	విష్ణువును	నక్షత్రాణాం	=	నక్షత్రములలో
జ్యోతిషాం	=	జ్యోతులలో	శశీ	=	చంద్రుడను
అంశుమాన్	=	కిరణములు గల	అహం	=	నేను
రవిః	=	సూర్యుడను	అస్మి	=	అయి యున్నాను

అర్జునా! ఆదిత్యులలో నేను విష్ణువు. జ్యోతులలో కిరణాలు గల సూర్యుణ్ణి. మరుత్తులలో మరీచిని. నక్షత్రాలలో చంద్రుణ్ణి నేనే.

వ్యాఖ్య

ఆదిత్యులలో విష్ణువు

ద్వాదశ ఆదిత్యులలో తాను విష్ణువు అనే పేరు గల ఆదిత్యుడు ***(ద్వాదశ ఆదిత్యేషు విష్ణుః నామ ఆదిత్యః).*** అదితికి పుట్టిన వారు ఆదిత్యులు. వారు పన్నెండు మంది. వారే ధాతా, మిత్ర, అర్యమా, శక్ర, వరణ, అంశు, భగ, వివస్వాన్, పూషా, సవితా, త్వష్టా మరియు విష్ణువు. వీరిలో పన్నెండవ వాడైన విష్ణువు తాను అంటున్నాడు. ఈ విషయాన్ని మహాభారతం - శాంతిపర్వంలో శ్రీకృష్ణుడే స్వయంగా అర్జునునికి చెప్పినాడు.

వ్యాప్తే మే రోదసీ పార్థ కాంతి రభ్యధికా స్థితాః - అత్యధిక మైన కాంతితో నేను భూమ్యాకాశాలలో ప్రకాశిస్తున్నాను. కనుక, అర్జునా! నన్ను విష్ణువు అని పిలుస్తారు ***(విష్ణుః ఇతి అభిసంజ్ఞితః).***

ఇక్కడ 'విష్ణు' శబ్దమును ఆదిత్యులలో చూచి నపుడు, వామనమూర్తి అనే అర్థం కూడా వస్తుంది. అదితి కశ్యపులకు బిడ్డగా జన్మించుట చేత విష్ణువు ఆదిత్యు డయ్యాడు ***(ఆదిత్యాం కశ్యపాత్ వామన రూపేణ జాత ఇతి ఆదిత్యః).*** వామనమూర్తిని విభూతిగా ఉపాసించ మని కఠోపనిషత్ కూడా చెప్పింది ***(మధ్యే వామన మాసీనం).***

జ్యోతిస్సులలో రశ్మిమంతుడైన రవి

జ్యోతి ర్మండలములో ప్రకాశించే జ్యోతిస్సులలో పరమేశ్వరుడు కిరణాలు గల రవి రూపుడు. అంటే, సూర్యుడు ***(ఆదిత్యాత్మా).*** రసమును స్వీకరించే కార్యమును నిర్వర్తించడము చేత సూర్యుడు 'రవి' శబ్ద వ్యపదేశ్యు డయ్యాడు. రసము అంటే జలము అని అర్థము. సముద్ర జలాలను ఉడికించి, ఆవిరిగా మార్చి, వాటిని మేఘ మండలములో నిలిపి, తిరిగి భూమండలానికి జీవనంగా వర్ష రూపంలో అందించడం చేత, సూర్యుడు రవి

నామధేయుడు ***(రసాన్ ఆదత్తే రవిః).*** ఈ విభూతిని తొమ్మిదవ అధ్యాయంలో కూడా చూశాము *(9 - 19).*

మరుత్తులలో మరీచి

ప్రకాశించే దేవతామూర్తులు మరుత్తులు. వారిలో అతిశయించిన ప్రకాశము కల మరీచి పరమేశ్వరుడే ***(తేజస్వినా మపి తేజస్త్వాత్ మరీచిః).*** ఎవరిలో ఏ తేజస్సు దివ్యంగా శోభించినా దానిని భగవ ద్విభూతిగా భావించాలి. అలా చేయడం చేత అహంకారం తలెత్తదు. తేజమును ఈశ్వర విభూతిగా గుర్తించ గానే ఈశ్వర సన్నిధిలో ఉన్నాము అనే అనుభూతి కలుగుతుంది. సన్నిధి సేవ ప్రాప్తిస్తుంది.

నక్షత్రాలలో చంద్రుడు

నక్షత్రాలలో తాను చంద్రుడట ***(నక్షత్రాణాం అహం, శశీ చంద్రమాః).*** ఇక్కడ కూడా ప్రకాశాతిశయమే ప్రధానము. ప్రస్తుతం శ్లోకం లోని నాలుగు విభూతులు కూడా తేజోమయ విభూతులే.

ఇక్కడ మరొక వ్యాఖ్యానము కూడా ఉంది. భగవద్గీతకు హనుమంతుడు పైశాచిక భాషలో వ్యాఖ్యానము వ్రాసినాడట. అక్కడ 'నక్షత్ర' అంటే గచ్ఛతి, పోవుట అనే అర్థాన్ని గ్రహించి, ***యోవా ఇహ యజమానోఽ ముం లోకం నక్షత్రే తత్ నక్షత్రాణాం నక్షత్రత్వమ్ -*** ఈ లోకంలో పుణ్యకర్మ లాచరించిన యజమానులు వాటి ఫలాన్ని అనుభవించడానికి ఆ లోకానికి ***(నక్షన్తే)*** పోతున్నారు ***(గచ్ఛన్తి).*** అంటే, ఆ లోకాన్ని పొందుతున్నారు అని అర్థం. అందుచేత అది నక్షత్ర లోకము. ఆ నక్షత్ర మేదో అది చంద్రుడే. మరణానంతరము దక్షిణాయనంలో ప్రయాణించే వారిని గూర్చి చర్చించి నపుడు ఈ విషయాన్ని మనం చర్చించు కున్నాము కూడా ***(తత్ర చాంద్రమసం జ్యోతిః యోగీ ప్రాప్య నివర్తతే ...*** *8 వ అ - 25 వ శ్లో).*

మరి కొన్ని విభూతులను విందాము.

వేదానాం సామవేదోఽస్మి దేవానా మస్మి వాసవః ।
ఇన్ద్రియాణాం మనశ్చాస్మి భూతానామస్మి చేతనా ॥ 22

వేదానాం-సామవేదః-అస్మి-దేవానాం-అస్మి-వాసవః
ఇంద్రియాణాం-మనః-చ-అస్మి-భూతానాం-అస్మి-చేతనా

వేదానాం	=	వేదములలో	ఇంద్రియాణాం	=	ఇంద్రియాలలో
సామవేదః	=	సామవేదము	మనః	=	మనస్సును
అస్మి	=	అయి ఉన్నాను	అస్మి	=	అయి ఉన్నాను
దేవానాం	=	దేవతలలో	భూతానాం	=	భూతములలో
వాసవః	=	ఇంద్రుడను	చేతనా చ	=	చైతన్యమును
అస్మి	=	అయి ఉన్నాను	అస్మి	=	అయి ఉన్నాను

అర్జునా! వేదాలలో నేను సామ వేదాన్ని, దేవతలలో ఇంద్రుణ్ణి. ఇంద్రియాలలో నేను మనస్సు. ప్రాణుల లోని చేతనమును నేనే.

వ్యాఖ్య

వేదాలలో సామవేదం

వేదాలలో సామవేదం తాను అంటున్నాడు **(వేదానాం మధ్యే సామవేదః అస్మి).** సామాత్మకం కావడం చేత వేదాలలో సామవేదం ఈశ్వర విభూతిగా కీర్తించ బడింది. **సా చ అమశ్చ సామ -** **సాః** మరియు **అమః** కలిసి

సామః అవుతుంది. 'సా:' అంటే ఋక్కు, 'అమ:' అంటే గీత రూపమైన స్వరము. ఈ రెండిటి ఐక్యమే 'సామము'.

సామవేదో గానేన రమణీయత్వాత్ - గాన మాధుర్యము చేత రమణీయ మైనది కనుక, సామవేదము ఈశ్వర విభూతిగా చెప్పబడిందని నీలకంఠాచార్యుల వ్యాఖ్యానము. పఠించిన వారిని పావనము చేస్తుంది కనుక, పారాయణ ప్రధానం కావడం చేత కూడా ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది.

వేదాంత హృదయమైన ***తత్త్వమసి*** మహావాక్యము కూడా సామవేదం లోని ఛాందోగ్యోపనిషత్తు లోనే ఉంది.

మూడు సామములతో సామగుల చేత స్తుతింపబడే వాడు కనుక భగవంతుడు ***త్రిసామా*** నామధేయుడు ***(త్రిభిః సామభిః సామగైః స్తుత ఇతి త్రిసామా).*** పరమేశ్వరుడు సామగానము చేయువాడు కనుక ***సామగః*** నామధేయుడు ***(సామగాయతీతి సామగః).*** తానే సామవేద స్వరూపుడు కావడం చేత ***సామ*** శబ్దవాచ్యుడు ***(సామవేదోఽ స్మి).*** ఈ మూడు నామాలు విష్ణుసహస్రనామం అరవై రెండవ శ్లోకంలో ***త్రిసామా సామగ స్సామః*** అని వరుసగా పఠింప బడ్డాయి. అంతే కాదు. నూట ఆరవ శ్లోకంలో ***సామ గాయనః*** అని కూడా భగవానుడు స్తుతింప బడ్డాడు. సామగాయనుడు అంటే సామములను గానం చేసే వాడు అని అర్థము ***(సామాని గాయతీతి సామ గాయనః).*** ఈ విధంగా సామవేదము ఈశ్వర విభూతి యని విష్ణుసహస్రనామం నాలుగు నామాలతో కీర్తించింది. ఇంతెందుకు? భారతీయ సంగీత శాస్త్రానికి సామవేదమే ఆధార మనే ఖ్యాతి కూడా ఉంది. బహుశ ఇదే కారణ మేమో, శాస్త్రీయ సంగీత కళా స్వరూపమైన శ్రీ త్యాగరాజస్వామి సామవేద వైభవాన్ని తన కృతులలో ఎంతగానో కీర్తించారు. అమృత తుల్యమైన సంగీత విద్య సామవేదము నుండే పుట్టింది అన్నారు ***సామజ వర గమన*** అనే కీర్తనలో. ***సామజవరగమన*** అంటే, సామవేదం నుండి పుట్టిన సంగీతములో గమించే వాడు అని అర్థము. ఇక చరణానికి వస్తే,

సామ నిగమజ సుధామయ గాన విచక్షణ
గుణశీల ! దయాల వాల! మాం పాలయ!
సామజ వరగమన , సాధహృత్సార , సాబ్జపాల , కాలాతీత , విఖ్యాత ,

సామవేదము నుండి పుట్టిన అమృత తుల్యమైన సంగీత శాస్త్రములో ప్రవీణుడు, కళ్యాణ గుణశీలుడు, దయకు పాదు వంటి వాడైన భగవానుడు తనను పాలించు గాక! అని ప్రార్థించాడు త్యాగరాజ స్వామి.

వేదాలలో సామవేదానికి ప్రముఖమైన స్థానాన్ని ఇవ్వడం చేతనే, 'వేదాలలో నేను సామవేదాన్ని' ***(వేదానాం సామవేదోఽ స్మి)*** అంటూ, సామవేదాన్ని తన విభూతిగా ప్రస్తుత శ్లోకంలో భగవంతుడు ప్రవచిస్తే, ఈ భావాన్నే చిత్తంలో ధరించి, తంబుర చేత పట్టుకొని ***నాద తను మని శం*** అనే సంస్కృత కీర్తనను శివుని స్తుతిస్తూ, హృదయాలను రంజింప చేస్తూ తంజావూరు పుర వీధులలో చిత్తరంజని రాగంలో ఆలపించారు త్యాగరాజ స్వామి.

నాదతను మనిశం శంకరం - నమామి మే మనసా, శిరసా *॥ నాద ॥*
మోదకర నిగమోత్తమ సామ - వేద సారం వారం వారం *॥ నాద ॥*

నాదమే శరీరముగా కలిగిన పరమశివుని సదా మనసా, శిరసా నమస్కరిస్తున్నాను. సంతోషదాయక మైనది ***(మోదకర),*** వేదాలలో శ్రేష్ఠ మైనది అయిన ***(నిగమోత్తమ)*** సామవేదము యొక్క సార రూపుడైన ***(సామవేద సారం)*** శ్రీ శంకర భగవానుని పదే పదే ***(వారం వారం)*** నమస్కరిస్తున్నాను అని గానం చేశారు త్యాగరాజ స్వామి.

దేవతలలో దేవేంద్రుడు

దేవతలలో తాను వాసవుడట. వాసవుడు అంటే ఇంద్రుడు **(రుద్రాదిత్యానాం వాసవః ఇన్ద్రః అస్మి).** ఇంద్రుడు సురరాజు కనుక శ్రేష్ఠుడు. వామనావతారంలో భగవంతుడు అదితి కశ్యపులకు బిడ్డగా జన్మించాడు. అంతకు ముందే వారికి కుమారుడుగా ఇంద్రుడు జన్మించాడు. ఆ విధంగా పరమేశ్వరుడు వాసవునికి అనుజుడై వాసవానుజుడయ్యాడు. అటు శ్రేష్ఠత్వము, ఇటు జ్యేష్ఠత్వము, రెండూ ఉండటం చేత ఇంద్రుడు ఈశ్వర విభూతి అయ్యాడు.

ఇంద్రియాలలో మనస్సు

పదకొండు ఇంద్రియాలలో పరమేశ్వరుడు మనస్సు **(ఇంద్రియాణాం ఏకాదశానాం చక్షురాదీనాం మనః చ అస్మి).** కన్ను మొదలైన ఐదు జ్ఞానేంద్రియాలు, వాక్కు మొదలైన ఐదు కర్మేంద్రియాలు కలిపి దశేంద్రియాలు. మనస్సుతో కలిపి పదకొండు ఇంద్రియాలు. జ్ఞానేంద్రియ కర్మేంద్రియాలు మనస్సు పైనే ఆధారపడి ప్రవర్తిస్తాయి. జ్ఞానేంద్రియాల ద్వారా విషయ జ్ఞానమును స్వీకరించేది, కర్మేంద్రియాలు విషయాలలో చరించడానికి ఆజ్ఞలిచ్చేది మనస్సే కనుక, బాహ్య కరణాలైన దశేంద్రియాల కన్నా, అంతఃకరణమైన సంకల్ప వికల్పాత్మక మగు మనస్సే ప్రముఖ మైంది కావడం చేత, ఇంద్రియాలలో మనస్సు భగవంతుని విభూతి. పైగా, ఇంద్రియాలు వాటి వాటి కార్యాలను మాత్రమే ప్రత్యేకంగా నిర్వహిస్తూ ఉంటే, మనస్సు ఇంద్రియా లన్నిటి లోను ప్రవేశించి సామాన్యంగా వ్యవహరిస్తూ ఉంటుంది.

ప్రాణులలో చేతనము

మానవుల లోని దేహేంద్రియ మనోబుద్ధుల సంఘాతములో నిత్యము అభివ్యక్త మయ్యే చేతనము, అంటే బుద్ధివృత్తి ఈశ్వర విభూతి **(కార్యకరణ సంఘాతే నిత్యాభివ్యక్తా బుద్ధివృత్తిః చేతనా).** వివేకము కలిగి, వివేచనతో, విచక్షణా పూరితంగా వ్యవహరించే అభాస సహితమైన **(చిదాభాస)** బుద్ధివృత్తియే చేతనము. బుద్ధిలో చైతన్యము ప్రతిఫలించుట చేత ఉత్పన్న మయ్యే బుద్ధి వివేకమే చేతనము **(చిచ్ఛాయావేశతో బుద్ధౌ భానం - దృగ్దృశ్య వివేకః).** చైతన్యము అంతటా వ్యాపించి యున్నా అంతటా స్ఫురించదు. స్వచ్ఛమైన జలములో ప్రతిబింబము గోచరించినట్లు, బుద్ధి యందే ప్రతిఫలిస్తుంది **(సదా సర్వగతో ప్యాత్మా న సర్వత్ర భాసతే, బుద్ధావేవావ భాసేత స్వచ్ఛేషు ప్రతిబింబవత్ - ఆత్మబోధః).** చైతన్య ప్రతిబింబము కావడం చేత చేతనము లేక బుద్ధివృత్తి ఈశ్వర విభూతి.

మరి కొన్ని విభూతులను వరుసగా చెప్పుకుందాం.

రుద్రాణాం శంకర శ్చాస్మి విత్తేశో యక్ష రక్షసామ్ । 23
వసూనాం పావకశ్చాస్మి మేరుః శిఖరిణా మహమ్ ॥

రుద్రాణాం-శంకరః-చ-అస్మి-విత్తేశః-యక్షరక్షసాం
వసూనాం-పావకః-చ-అస్మి-మేరుః-శిఖరిణాం-అహం

రుద్రాణాం	=	రుద్రులలో	వసూనాం	=	వసువులలో
శంకరః చ	=	శంకరుడను	పావకః చ	=	అగ్నిహోత్రుడను
అస్మి	=	అయి ఉన్నాను	శిఖరిణాం	=	శిఖరములు గల కొండలలో
యక్షరక్షసాం	=	యక్షులలోను రాక్షసుల లోను	మేరుః	=	మేరు పర్వతమును
విత్తేశః	=	కుబేరుడను	అహం	=	నేను
			అస్మి	=	అయి ఉన్నాను

అర్జునా! రుద్రులలో నేను శంకరుణ్ణి. యక్ష రాక్షసులలో కుబేరుణ్ణి. వసువులలో అగ్నిని. పర్వతాలలో నేను మేరు పర్వతాన్ని.

వ్యాఖ్య

రుద్రులలో శంకరుడు

పదకొండు మంది రుద్రులలో శంకరుడు భగవద్విభూతి *(రుద్రాణాం ఏకాదశానాం శంకరః చ అస్మి)*. ద్వాదశాదిత్యులలో తాను విష్ణువని ప్రారంభంలో చెప్పిన గీతాచార్యుడు, ఏకాదశ రుద్రులలో తాను శంకరుణ్ణి అని ప్రస్తుత శ్లోకంలో అంటున్నాడు.

హరశ్చ బహురూపశ్చ త్ర్యంబక శ్చాపరాజితః ।
వృషో కపిశ్చ శంభుశ్చ కపర్దీ రైవత స్తథా ॥
మృగవ్యాధశ్చ శర్వశ్చ కపాలీ చ విశామ్పతే,
ఏకాదశైతే కథితా రుద్రా స్త్రిభువనేశ్వరాః ॥

హరుడు, బహురూపుడు, త్ర్యంబకుడు, అపరాజితుడు, వృషాకపి, శంభువు, కపర్ది, రైవతుడు, మృగవ్యాధుడు, శర్వుడు, కపాలి - వీరే ఏకాదశ రుద్రులు. ఇవి హరివంశము లోని శ్లోకాలు.

ఈ ఏకాదశ రుద్రులలో శంకరుడు భగవద్విభూతి, నిజమే. మరి ఈ ఏకాదశ రుద్రుల నామాలలో శంకర నామం లేనే లేదు కదా అనే సందేహము తప్పక వస్తుంది. ఇక్కడ 'శంభువు' అని చెప్పబడిన నామమే 'శంకర' నామము. రెండిటికి ఒకే వ్యుత్పత్త్యర్థము.

శం అంటే సుఖము, శుభము, మంగళము, మోక్షము అని అర్థాలు. *శం సుఖం కరోతి ఇతి శంకరః* - భక్తులకు సుఖమును కలిగించు వాడు శంకరుడు. *శం సుఖం భక్తానాం (మంగళం మోక్షం) భావయతీతి శంభుః* - భక్తులకు శుభాన్ని, సుఖాన్ని, మోక్షాన్ని ప్రసాదించే వాడు శంభువు. కనుక శంభువు అన్నా శంకరు డన్నా ఒక్కటే.

యక్ష రాక్షసులలో కుబేరుడు

యక్షరాక్షసులలో తాను విత్తేశుడు. విత్తమునకు ప్రభువు. అంటే కుబేరుడు అని అర్థము *(విత్తేశః)*. విత్తము అంటే లక్ష్మి. విత్తేశుడు వాస్తవానికి లక్ష్మీపతియే. కాకపోతే, విత్తము కుబేరుని అధీనంలో ఉంది. ఆ కారణం చేతనే కుబేరుడు విత్తేశుడు. *కుంబతి ధనమ్. కుబి ఆచ్ఛాదనే* - ధనమును దాచేవాడు కుబేరుడు. అంతే కాదు. ధనాన్ని వితరణ చేసే శక్తి గల వాడే విత్తేశుడు. విత్తాన్ని దాచి పెట్టుకొనే వాడు ధన దాసుడౌతాడే గాని ధనేశుడు కాలేడు. విత్తానికి ప్రభువు విష్ణుదేవుడు. విత్తానికి అధిష్ఠాన దేవత కుబేరుడు. కనుక ధనాన్ని తన అధీనంలో ఉంచుకొని పరమేశ్వరునికి విధేయుడుగా ఉన్న కుబేరుడు ఈశ్వర విభూతి.

వసువులలో పావకుడు

ఎనిమిది మంది వసువులలో పావకుడు ఈశ్వర విభూతి. పావకుడు అంటే అగ్ని *(వసూనాం అష్టానాం పావకః చ అస్మి అగ్నిః)*. ఈ అష్ట వసువు లెవరో మహాభారతం - ఆదిపర్వంలో ఒక్క శ్లోకం చెబుతూ ఉంది.

ధరోధ్రువశ్చ సోమశ్చ అహశ్చై వానిలోఽ నలః ।
ప్రత్యూషశ్చ ప్రభాసశ్చ వసవోఽ ష్టౌ ప్రకీర్తితాః ॥

ధరుడు, ధ్రువుడు, సోముడు, అహుడు, అనిలుడు, అనలుడు, ప్రత్యూషుడు, ప్రభాసుడు - ఈ ఎనిమిది మంది అష్ట వసువులు. వీరిలో పావకుడు ఈశ్వర విభూతి. మళ్ళీ, శంకరుని విషయంలో తలెత్తిన మీమాంసే

ఇక్కడ కూడా తలెత్తుతుంది. ఈ శ్లోకంలో చెప్పిన అష్ట వసువుల పేర్లలో పావక నామమే లేదు కదా!

నిజమే. అక్కడ శంభు నామము శంకర నామ మైనట్లు, ఇక్కడ అనల నామము పావక నామము. అలా ఎందుకు అనుకోవాలి? 'అనల' నామం గ్రహిస్తే అగ్ని అనే అర్థం వస్తుంది. మరి 'అనిల' నామం గ్రహిస్తే వాయువు కదా! అలాంటప్పుడు అష్ట వసువులలో వాయువును ఈశ్వర విభూతిగా ఎందుకు చెప్పకూడదు? కుదరదు.

పూఙ్ పవనే. పునాతీతి - పవిత్రము చేయువాడు కనుక పావకుడు. శుద్ధి చేసే వాటిలో అగ్నిదేవుడు శ్రేష్ఠుడు. పైగా మన, తన భేదం లేకుండా దేని నైనా భస్మం చేస్తాడు. వివాహమైనా, గృహప్రవేశ మైనా, యజ్ఞయాగాదు లైనా, జ్యోతి ప్రజ్వలనము చేయకుండా ఏ శుభ కార్యాన్ని ఆవిష్కరించము. కారణం, శుద్ధి జరిగితేనే సిద్ధి. శ్రీరాముడు లంకలో అడుగు పెట్టాలంటే, ముందుగా లంక శుద్ధి పడాలి. హనుమంతుడు లంకా దహనం చేయడంలో అంతర్భావం అదే. కనుక అష్ట వసువులలో అగ్ని ఈశ్వర విభూతి.

పర్వతాలలో మేరు పర్వతము

శిఖరములు గల పర్వతాలలో మేరు పర్వతము ఈశ్వర విభూతి *(మేరుః శిఖరిణామ్ శిఖరవతామ్, అహమ్)*. కొన్ని పర్వతాలు శృంగములతో ఉంటాయి. కొన్ని శృంగములు లేకుండా ఉంటాయి. ఎత్తైన గిరులు శిఖరాలతో శోభిస్తూ ఉంటాయి. వాటిలో మేరు పర్వతము తన విభూతి అంటున్నాడు భగవంతుడు. ఎక్కడ ఏది అసమానమైన వైభవమును ప్రదర్శిస్తూ ఉంటుందో అది ఈశ్వర వైభవమే నని భావించాలి. అదే విభూతియోగ సారము.

పురోధసాం చ ముఖ్యం మాం విద్ధి పార్థ బృహస్పతిమ్ ।
సేనానీనా మహం స్కన్దః సరసామస్మి సాగరః ॥ 24

పురోధసాం-చ-ముఖ్యం-మాం-విద్ధి-పార్థ-బృహస్పతిం
సేనానీనాం-అహం-స్కందః-సరసాం-అస్మి-సాగరః

పార్థ	=	అర్జునా!	స్కందః	=	కుమార స్వామిని
పురోధసాం	=	రాజ పురోహితులలో	చ	=	మరియు
ముఖ్యం	=	ముఖ్యుడైన	సరసాం	=	సరస్సులలో
బృహస్పతిం	=	బృహస్పతిగ	సాగరః	=	సముద్రుడను
మాం	=	నన్ను	అహం	=	నేను
విద్ధి	=	తెలుసుకో!	అస్మి	=	అయి ఉన్నాను
సేనానీనాం	=	సైన్యాధిపతులలో			

పురోహితులలో ముఖ్యుడైన బృహస్పతి నేనే. సేనాధిపతులలో నేను కుమారస్వామిని. సరస్సులలో నేను సాగరాన్ని.

వ్యాఖ్య

పురోహితులలో బృహస్పతి

పురోహితులలో రాజ పురోహితుడు శ్రేష్ఠుడు. రాజ పురోహితులలో దేవరాజ పురోహితుడు శ్రేష్ఠుడు. అతడే బృహస్పతి. పురోహిత శ్రేష్ఠుడు. శ్రేష్ఠత్వ మున్నందున బృహస్పతి ఈశ్వర విభూతి.

ప్రజ లందరు రాజుకు నమస్కరిస్తారు. రాజు పురోహితునికి నమస్కరిస్తాడు. కనుక, రాజు కన్నా రాజ పురోహితుడు శ్రేష్ఠుడు.

రాజు లందరిలో దేవరాజైన దేవేంద్రుడు శ్రేష్ఠుడు. దేవరాజైన ఇంద్రుడు బృహస్పతికి నమస్కరిస్తాడు కనుక, దేవరాజ పురోహితుడైన బృహస్పతి పురోహితులలో శ్రేష్ఠుడు.

బృహతాం దేవనాం వేద మంత్రాణాం వా పతిః బృహస్పతిః - దేవతలను, వేద మంత్రాలను 'బృహత్తులు' అంటారు. బృహత్తులకు పతి కనుక ఆయన బృహస్పతి. సురగురువు ***(సురాణాం ఆచార్యః).*** శ్రేష్ఠమైన వాక్కులు పలికే వాడు. బుద్ధిశాలి. విజ్ఞాన వాచస్పతి.

సేనాధిపతులలో స్కందుడు

సేనలను నడిపే వాడు సేనాపతి, లేదా సేనాధిపతి. శివకుమారుడైన స్కందుడు, అంటే సుబ్రహ్మణ్య స్వామి దేవతల సేనను నడిపే వాడు ***(దేవ సేనాం నయతి ప్రాపయతి).*** అందుచేత సేనాపతులలో దేవసేనా పతి అయిన స్కందుడు ముఖ్యుడు.

శత్రూన్ స్కందతి శోషయతి స్కందః - శత్రువులను శోషింప చేసేవాడు అయినందున కార్తికేయుడు స్కందుడు. శత్రు బాధను భరించలేక మనం దేవతలను ఆరాధిస్తూ ఉంటాం. అట్టి దేవతలకే శత్రు బాధను నివారించే వాడు అయి నందున సేనాపతులలో స్కందుడు శ్రేష్ఠుడు. కనుక ఆయన ఈశ్వర విభూతి.

సరస్సులలో సాగరము

సరస్సులు అంటే జలాశయాలు. జలాశయాలు రెండు రకాలు. నిలకడగా ఒకే చోట ఉండేవి. నిలకడ లేకుండా ప్రవహించేవి. ప్రస్తుతం మనం నిలకడగా ఉండే జలాశయాలను చూస్తున్నాం. ప్రవహించే వాటిని మున్ముందు చూడబోతాము.

ప్రవాహం లేకుండా ఉండే జలాశయాలను సరస్సులు అంటారు. ఇవి మళ్ళీ రెండు రకాలు. ఖాతము, అఖాతము. త్రవ్వబడింది ఖాతము ***(ఖన్యత ఇతి ఖాతమ్).*** మనుషుల చేత త్రవ్వ బడింది. మరి, బంగాళా ఖాతాన్ని మనుషులు త్రవ్వారా? అందుచేత అది అఖాతము. అంటే మనుషుల చేత త్రవ్వ బడనిది ***(న ఖన్యత ఇతి అఖాతమ్).*** మరెవరు త్రవ్వారు? దేవతలు త్రవ్వారు. దేవతలు త్రవ్వినది కనుక అది దేవఖాతము ***(దేవైః ఖన్యత ఇతి దేవ ఖాతమ్).*** దేవఖాతాలైన సరస్సులలో ప్రధాన మైనది సముద్రము ***(సరసాం యాని దేవ ఖాతాని సరాంసి తేషాం సరసాం సాగరః అస్మి భవామి).***

మహర్షీణాం భృగు రహం గిరా మ స్మ్యేక మక్షరమ్ ।
యజ్ఞానాం జపయజ్ఞోఽస్మి స్థావరాణాం హిమాలయః ॥ 25

మహర్షీణాం-భృగుః-అహం-గిరాం-అస్మి-ఏకం-అక్షరం
యజ్ఞానాం-జపయజ్ఞః-అస్మి-స్థావరాణాం-హిమాలయః

అహం	=	నేను	అస్మి	=	అయి ఉన్నాను
మహర్షీణాం	=	మహర్షులలో	యజ్ఞానాం	=	యజ్ఞములలో
భృగుః	=	భృగుమహర్షిని	జపయజ్ఞః	=	జపయజ్ఞమును
గిరాం	=	మాటలలో	స్థావరాణాం	=	స్థావరములలో
ఏకం	=	ఒకటే అయిన	హిమాలయః	=	హిమాలయమును
అక్షరం	=	అక్షరమును	అస్మి	=	అయి ఉన్నాను

మహర్షులలో నేను భృగు మహర్షిని. వాక్కులలో ఏకాక్షర మైన ఓంకారాన్ని, యజ్ఞాలలో జప యజ్ఞము నేనే. స్థావరాలలో నేను హిమాలయాన్ని

వ్యాఖ్య

మహర్షులలో భృగు మహర్షి

సప్త ఋషులలో భృగు మహర్షి శ్రేష్ఠుడు. సప్త ఋషులను ఉటంకించే శ్లోకాలలో ప్రథమంగా భృగువే ఉంటాడు ***(భృగు ర్మరీచి రత్రిశ్చ).*** ప్రాధాన్యతను బట్టి ప్రథమ స్థానము. కనుక భృగువు ఈశ్వర విభూతి.

భృగువును వరుణుని కుమారుడిగా తైత్తిరీయ శ్రుతిలో చూస్తాం. అద్భుతమైన తాత్త్విక విషయాలను చర్చించిన శ్రేష్ఠుడు భృగువు. త్రిమూర్తులనే పరీక్షించిన ఘనుడు అని పురాణాలు చెబుతాయి. ఈ కారణాల చేత సప్త ఋషులలో భృగుమహర్షి ఈశ్వర వైభవంగా శోభించాడు.

వాక్కులలో ఓంకారము

గిరాం అంటే వాక్కులు. ***ఏకం అక్షరమ్*** అంటే ఒకే ఒక్క అక్షరము. అదే ఓంకారము. భగవంతుడు ఓంకార స్వరూపుడు. ప్రణవ రూపుడు. ఓంకారానికి ఓంకారేశ్వరునికి అభిధాన అభిధేయ సంబంధము ఉంది. భగవంతుడు అభిధేయము. ఓంకారము అభిధానము. అంటే, భగవంతుని పేరు ఓంకారము, లేదా ప్రణవము ***(తస్య వాచకః ప్రణవః).*** నామము, నామి వేరు కానందున, భగవంతునికి భగవ న్నామానికి తేడా లేదు ***(వాచ్య వాచకయోః అభేదః).*** అందుచేత, ఒకే అక్షరమైన ఓంకారము భగవ త్స్వరూపము. ***ఓమిత్యేకాక్షరం బ్రహ్మ*** అనే విషయాన్ని ఎనిమిదవ అధ్యాయంలో కూడా మనం చూశాం *(8 - 13).*

పరమాత్మ వాచకమైన ఓంకారము ప్రణవము ***(ప్రణవో నామ పరమాత్మనో వాచక ఓంకారః).*** ఓంకారము లేకుండా పరమేశ్వరుణ్ణి స్తుతించ లేము. ఓంకారముతో కీర్తింప బడేవాడు కనుక ఆయన ప్రణవ స్వరూపుడు ***(ఓమితి ప్రణౌతి ఇతి ప్రణవః - వేదం).***

భగవంతుణ్ణి ఏ రూపంతో కొలిచినా, ఏ పేరుతో పిలిచినా, ముందు 'ఓంకారం' ఉండి తీరాలి. ***ఓం నమో నారాయణాయ, ఓం నమశ్శివాయ, ఓం నమో భగవతే వాసుదేవాయ*** - చూశారా! అదే ఓంకార వైభవము. అందుకే అది ఈశ్వర విభూతి.

యజ్ఞాలలో జపయజ్ఞము

యజ్ఞాలలో జపయజ్ఞము ఈశ్వర విభూతి. ఓంకారాన్ని ఒకే అక్షర రూపమని తెలుసుకున్నాం. **జప** శబ్దం రెండు అక్షరాలతో ఉంది.

జకారో జన్మ విచ్ఛేదః పకారః పాపనాశనః ।
జన్మ కర్మ కరో యస్మాత్ తస్మా జ్జప ఇతి స్మృతః ॥

జన్మ రాహిత్యమును సూచిస్తూ జ కారము, పాప నాశాన్ని ప్రస్తావిస్తూ ప కారము జప శబ్దంలో శోభిస్తున్నాయి. జన్మకర్మలను నశింప చేసేది కనుక అది జప మన బడింది. అందుచేత యజ్ఞాలలో జప యజ్ఞము ఈశ్వర విభూతి.

యజ్ఞ యాగాదులను నిర్వహించడము అనేది వ్యయ ప్రయాసలతో కూడిన కార్యము. ధనం కావాలి. యజ్ఞ సామగ్రులు, యజ్ఞ ద్రవ్యాలు, యాజ్ఞికులు - జనం ఉండాలి. అప్పుడే యజ్ఞాలు నిర్వహింప బడతాయి. ఇవన్నీ ఉంటేనే యజ్ఞము.

కానీ జప యజ్ఞానికి ఇవేవీ అవసరం లేదు. వ్యయము లేదు. ప్రయాస ఉండదు. సాధకుడు స్వతంత్రంగా ఒక్కడే కూర్చుని చేసుకోవచ్చు. హింసాయుత మైంది కాదు. విరాళా లివ్వమని ఎవ్వరినీ బాధించ నవసరం లేదు. ఏ కాలంలో నైనా చేసుకోవచ్చు. ఏ ప్రదేశంలో నైనా ఆచరించ వచ్చు. ఎందుకని? జపంలో ఎవరో లేరు - జపించే సాధకుడు, జపింపబడే నామము, నామి మాత్రమే ఉన్నారు. అందుచేత జపయజ్ఞము ఈశ్వర విభూతి.

స్థావరాలలో హిమాలయము

చలించకుండా ఉండే వాటిలో హిమాలయము ఈశ్వర విభూతి. శిఖర ప్రధానంగా మనం మేరు పర్వతాన్ని చూశాం. ఇక్కడ శిఖర ప్రాధాన్యంతో పాటు వైశాల్యము కూడా ప్రముఖము. కనుక, స్థావరాలలో భగవంతుడు హిమాలయము ***(స్థావరాణాం స్థితి మతాం హిమాలయః).***

హిమము అంటే మంచు. మంచు తాపమును పోగొట్టే స్వభావం గలది ***(హన్తి తాప మితి హిమమ్).*** తాపమును పోగొట్టడమే కాకుండా జలాలను వృద్ధి చేస్తుంది కూడా ***(వర్ధతే జలమ్ అనేనేతి హిమమ్).*** గంగాది పుణ్య నదులు హిమాలయాల వల్లనే వృద్ధి చెందుతున్నాయి. కనుక హిమాలయము ఈశ్వర విభూతి.

అశ్వత్థః సర్వవృక్షాణాం దేవర్షీణాం చ నారదః ।
గన్ధర్వాణాం చిత్రరథః సిద్ధానాం కపిలో మునిః ॥ 26

అశ్వత్థః-సర్వవృక్షాణాం-దేవర్షీణాం-చ-నారదః
గంధర్వాణాం-చిత్రరథః-సిద్ధానాం-కపిలః-మునిః

సర్వవృక్షాణాం	=	సర్వ వృక్షములలో	గంధర్వాణాం	=	గంధర్వులలో
అశ్వత్థః	=	రావిచెట్టును	చిత్రరథః	=	చిత్రరథుడను
దేవర్షీణాం చ	=	దేవర్షులలో	సిద్ధానాం	=	సిద్ధులలో
నారదః	=	నారదుడను	కపిలః మునిః	=	కపిల మునిని

వృక్షాలలో నేను అశ్వత్థ వృక్షాన్ని. దేవర్షులలో నారదుణ్ణి. గంధర్వులలో నేను చిత్రరథుణ్ణి. సిద్ధులలో కపిల మహర్షి నేనే.

వ్యాఖ్య

వృక్షాలలో అశ్వత్థ వృక్షము

వృక్షాలలో అశ్వత్థ వృక్షము భగవద్విభూతి. అశ్వత్థము అంటే రావి చెట్టు. దీనిని సంసార వృక్షము అని కూడా అంటారు. దీనిని మున్ముందు పురుషోత్తమప్రాప్తి యోగంలో విస్తారంగా చెప్పుకుందాం. ఈ సందర్భములో విభూతి ప్రాధాన్యమే కనుక, మంగళకర మైన అశ్వత్థానికి నమస్కారం చెబుదాము. అశ్వత్థము త్రిమూర్తుల స్వరూపము అంటుంది శాస్త్రం. వృక్షాలలో రాజు వంటిది అని దీనిని పెద్దలు శ్లాఘించారు.

మూలతః బ్రహ్మారూపాయ మధ్యతః విష్ణు రూపిణే
అగ్రతః శివ రూపాయ తస్మై వృక్ష రాజాయ తే నమః ॥

అశ్వత్థానికి మూలంలో బ్రహ్మదేవుడు, మధ్య భాగమైన కాండము మరియు శాఖాదులలో శ్రీ మహావిష్ణువు, అగ్ర భాగాన పరమశివుడు ఉంటారని ప్రతీతి. అందుచేత వృక్షరాజైన అశ్వత్థానికి నమస్కారం అన్నారు.

దేవర్షులలో నారదుడు

ఋషులు అందరిలో ఉంటారు. అన్ని చోట్ల ఉంటారు. రాజులలో ఋషు లున్నారు. వారు రాజర్షులు.

బ్రాహ్మణులలో ఋషు లున్నారు. వారు బ్రహ్మర్షులు. నరులలో ఋషు లున్నారు. వారు నరర్షులు. దేవతలలో ఋషు లున్నారు. వారు దేవర్షులు. అలా దేవర్షులైన వారిలో నారదమహర్షి భగవద్విభూతి.

నరస్య ధర్మ్యం నారమ్ - నరులు ఆచరించ వలసిన ధర్మమును 'నారం' అంటారు. అట్టి ధర్మాన్ని అనుగ్రహించే మహాత్ముడు నారదమహర్షి. ***నారం (నరాణాం ధర్మం) దదాతి ఉపదిశతి ఇతి నారదః -*** నరులు ఆచరించ వలసిన ధర్మాన్ని ఉపదేశించే వాడు నారదుడు.

దేవాశ్చ తే ఋషయశ్చ దేవర్షయః దేవానాం ఋషయః ఇతి వా - దేవతలుగా జన్మించారు. ఋషులుగా వాసి కెక్కారు. కనుక వారు దేవర్షులు. అట్టి దేవర్షులలో నారదమహర్షి ఈశ్వర విభూతి. ఆయన వ్యాస వాల్మీకాదులకు స్ఫూర్తి దాత. ధృవ ప్రహ్లాదాది భక్తులకు భక్తి ప్రదాత.

వ్యాస విరచితమైన అష్టాదశ పురాణాలలో నారద మహర్షి లేని పురాణం లేదు. అయినా వ్యాస మహర్షికి తృప్తి కలగలే దేమో, నారద పురాణం అని ప్రత్యేకంగా మరొక పురాణాన్ని రచించాడు.

గంధర్వులలో చిత్రరథుడు

గంధర్వులలో చిత్రరథుడు అనే గంధర్వుడు ఈశ్వర విభూతి. గంధర్వులు గొప్ప కళాకారులు. ***గానం ధారయన్తి -*** గానకళలో గొప్ప ప్రావీణ్యము కలవారు. అంతే కాదు. వారు గొప్ప సువాసన కలిగి ఉంటారట ***(సౌరభం గంధం అర్వన్తి ఇతి).*** ఎన్ని ప్రావీణ్యతలు ఉన్నా, గాన విద్యే వారిలో ప్రధానమైంది. ***గానం ధర్మః యేషాం తే గంధర్వాః -*** గానమే ధర్మముగా గల వారు గంధర్వులు. వారిలో చిత్రరథుడనే గంధర్వుడు గానశ్రేష్ఠుడు. కనుక అతడు ఈశ్వర విభూతి.

కుబేరుని ఉద్యాన వనం పేరు చైత్ర రథం. దీనిని చిత్రరథుడే అద్భుతంగా నిర్మించినట్లు ఉంది. ***చిత్ర రథో నామ గంధర్వ రాజః తేన నిర్మితమ్ చైత్ర రథమ్ -*** చిత్రరథుడు అనే గంధర్వరాజు నిర్మించినది కనుక కుబేరుని ఉద్యాన వనమును చైత్ర రథమ్ అంటారు. ఇతడు బహు చిత్రంగా రథాన్ని నడిపే వాడట. అందుచేత కూడా ఇతనికి చిత్రరథుడని నామధేయం వచ్చింది అంటారు. ఏది ఏమైనా, ఇవన్నీ అసమాన వైభవాలే కనుక చిత్రరథుడు ఈశ్వర విభూతి.

సిద్ధులలో కపిలుడు

సిద్ధ పురుషులలో కపిల మహర్షి ఈశ్వర విభూతి. కపిలుడు దేవహూతి కర్దముల పుత్రుడు. కపిలుడు భగవంతుని అంశావతారము. భాగవతము - తృతీయ స్కంధములో కపిలుని చరిత్ర సమగ్రంగా ఉంది. కర్దముడు సన్యసించి వెళ్ళిన తరువాత కపిలుడు తల్లి యైన దేవహూతికి జ్ఞానోపదేశం చేస్తాడు. అదే కపిలగీత.

కపిలుని బోధామృతమును పానం చేసి దేవహూతి తరించింది. కపిలుని జ్ఞానబోధను ఆలకించిన మాతృదేవి దేవహూతి, 'సర్వగతుడైన ఈ దివ్యాత్ముని నా గర్భము ఎలా భరించింది?' అని నిశ్చేష్టు రాలైంది.

తే॥ ***లీల నాత్మీయ పాదాంగుళీ వినిర్గతామృతము గ్రోలినట్టి మహాత్మ! నీవు***
గడగి నా పూర్వ భాగ్యంబు కతన నిపుడు పూని నా గర్భమున నేడు పుట్టితయ్య!

మహానుభావా! ప్రళయ కాలంలో వటపత్రశాయివై, కాలి బొటన వ్రేలును నోటిలో ఉంచుకొని, లీలావతార మూర్తివై అమృతాస్వాదనము చేస్తూ ఉంటావు. నా భాగ్యంగా ఇప్పుడు నా కడుపున పుట్టావు అన్నది దేవహూతి.

కపిలదేవుని అనుగ్రహంతో దేవహూతి సిద్ధిని పొందినది. తల్లిని ఉద్ధరించిన ప్రదేశ మైనందున దానిని 'మాతృగయ' అంటారు. ఆమె దేహము తీర్థరూపాన్ని ధరించింది.

ఉచ్చైః శ్రవస మశ్వానాం విద్ధి మా మమృతోద్భవమ్ ।
ఐరావతం గజేన్ద్రాణాం నరాణాం చ నరాధిపమ్ ॥ 27

ఉచ్చైఃశ్రవసం-అశ్వానాం-విద్ధి-మాం-అమృతోద్భవం
ఐరావతం-గజేంద్రాణాం-నరాణాం-చ-నరాధిపం

అశ్వానాం	=	గుఱ్ఱములలో	నరాణాం చ	=	నరులలో
అమృతోద్భవం	=	అమృతముతో పుట్టిన	నరాధిపం	=	రాజు
ఉచ్చైఃశ్రవసం	=	ఉచ్చైః శ్రవము	మాం	=	నన్ను
గజేంద్రాణాం	=	ఏనుగులలో	విద్ధి	=	తెలుసుకో
ఐరావతం	=	ఐరావతము			

అశ్వములలో, అమృతము కొరకు క్షీర సాగరమును మథించి నపుడు పుట్టిన ఉచ్చైఃశ్రవము అనే గుఱ్ఱము నేనే. ఏనుగులలో నేను ఐరావతాన్ని. నరులలో రాజును నేను.

వ్యాఖ్య

అశ్వములలో ఉచ్చైఃశ్రవము

అమృతము కొరకు దేవ దానవులు క్షీర సాగరాన్ని మథించి నపుడు పుట్టిన అనేక దివ్యమైన వస్తువులలో ఉచ్చైఃశ్రవము అనే గుఱ్ఱము ఒకటి. అది ఇంద్రుని గుఱ్ఱ మైంది. దానిని మించిన అశ్వ శక్తిని, వేగాన్ని మరొక చోట చూడలేము. అందుచేత అది ఈశ్వర విభూతి.

గజములలో ఐరావతము

ఐరావత మనేది మహేంద్రుని పట్టపు టేనుగు. అది శ్వేతహస్తి. నాలుగు దంతాలతో ప్రకాశిస్తూ ఉంటుంది. ***ఇరాః ఆపః సంతి యత్ర సః ఇరావాన్ సముద్రః తత్ర జాతః ఐరావతః*** - 'ఇరములు' అంటే జలములు. ఇరములు కలవాడు కనుక సముద్రుడు ఇరావంతుడు. ఇరావంతుని నుండి పుట్టింది కనుక అది ఐరావతము. మంగళకర మైనది. జంతువులలో ఏనుగు ఎత్తైనది. ఏనుగులలో ఐరావతము శ్రేష్ఠ మైనది. అందుచేత అది ఈశ్వర విభూతి.

నరులలో నరాధిపుడు

నరులకు అధిపుడు నరాధిపుడు. అంటే పాలించే రాజు. పరిపాలనా దక్షుడు కావడం చేత రాజు ఈశ్వర విభూతి. ***నా విష్ణుః పృథివీ పతిః*** - విష్ణుదేవుని అంశ కాని వాడు రాజు కాలేడు అని నానుడి. రాజు శక్తిమంతుడు. ప్రజలను ధర్మ మార్గమున నడిపే వాడు. ధర్మ రూపంలో ఉన్నది దైవమే కనుక, ధర్మ ప్రభువు ఈశ్వర విభూతిగా గుర్తింప బడ్డాడు. ఇది ధర్మ ప్రభువులకు వర్తిస్తుందే గాని అధర్మపరులైన రాజులకు వర్తించదు.

ఆయుధానా మహం వజ్రం ధేనూనా మస్మి కామధుక్ ।
ప్రజన శ్చాస్మి కందర్పః సర్పాణా మస్మి వాసుకిః ॥ 28

ఆయుధానాం-అహం-వజ్రం-ధేనూనాం-అస్మి-కామధుక్
ప్రజనః-చ-అస్మి-కందర్పః-సర్పాణాం-అస్మి-వాసుకిః

అహం	=	నేను	ధేనూనాం	=	ఆవులలో
ఆయుధానాం	=	ఆయుధములలో	కామధుక్	=	కామధేనువు
వజ్రం	=	వజ్రాయుధము	అస్మి	=	అయి ఉన్నాను

ప్రజనః చ	=	పుట్టించునట్టి	సర్పాణాం	=	సర్పములలో
కందర్పః	=	మన్మథుడను	వాసుకిః	=	వాసుకిని
అస్మి	=	అయి ఉన్నాను	అస్మి	=	అయి ఉన్నాను

ఆయుధాలలో నేను వజ్రాయుధము. ధేనువులలో కామధేనువు. పుట్టించే వారిలో మన్మథుణ్ణి. సర్పాలలో నేను వాసుకిని.

వ్యాఖ్య

ఆయుధాలలో వజ్రాయుధము

ఆయుధాలలో ఇంద్రుని ఆయుధమైన వజ్రాయుధము ఈశ్వర విభూతి. మహాత్ముడైన దధీచి మహాముని అస్థి వలన జనించింది కనుక పవిత్ర మైనది, పరమ శక్తివంత మైనది అయిన వజ్రాయుధము ఈశ్వర విభూతి. పర్వతాలను సైతం ఖండించే సామర్థ్యము గల ఆయుధము.

ధేనువులలో కామధేనువు

క్షీర సాగరాన్ని మథించి నపుడు ఐరావతము, ఉచ్చైఃశ్రవము లాగా కామధేనువు కూడా ఆవిర్భవించింది. ఇది మామూలు ఆవు కాదు. దేవధేనువు. దీనిని దేవ దానవు లిరువురూ కలిసి వసిష్ఠునికి సమర్పించారు.

సాధారణంగా ఆవులు పాలిస్తాయి. కాని, కామధేనువు అలా కాదు. నువ్వు ఏది ఆశిస్తే అది నీ పాలవుతుంది. ఏదైనా ఇస్తుంది. ఎంతైనా ఇస్తుంది. అలా మరొక రివ్వలేరు. అందుచేత కామధేనువు ఈశ్వర విభూతి.

ప్రజన కారణాలలో మన్మథుణ్ణి

జనోత్పత్తి హేతువులలో ఆకర్షణను కలిగించే అద్భుత శక్తి మదనునిది. కామోద్రేకాలను రెచ్చగొట్టి ఇరువురిని ఒకటి చేసి సంతతి కొనసాగుటకు కారణమైన మన్మథుడు ఈశ్వర విభూతి. కందర్ప సుందరుని గూర్చిన ఒక శ్లోకం బహు ప్రాచుర్యాన్ని పొందింది.

ఏక ఏవ ద్విధా కర్తుం బహవ స్సంతి ధన్వినః ।
మార ఏకో మహాధన్వీ ద్వయ మేకం కరోత్యసౌ ॥

బాణ ప్రయోగం చేసే వారు ప్రపంచంలో చాలా మంది ఉన్నారు. వారు బాణాన్ని దేనిపై విడిస్తేఅది ఖండింప బడుతుంది. ఒకటి రెండు కావచ్చు. మరెన్నైనా కావచ్చు. అలాగే మారుడు, అనగా మన్మథుడు కూడా పుష్ప బాణ హస్తుడై ఉంటాడు. కాకపోతే మనుషులు బాణ ప్రయోగం చేస్తే ఒకటి రెండవుతాయి. మారుడు బాణం వేశాడా, రెండు ఒకటౌతాయి. రెంటిని ఒకటి చేసే బాణాన్ని మన్మథుడే వేయగలడు. అందుచేత కందర్పుడు ఈశ్వర విభూతి.

సర్పాలలో వాసుకి

విష సర్పాలలో భయంకరమైన విషమును విరజిమ్మే వాసుకి ఈశ్వరుని విభూతి. పాల సముద్రాన్ని చిలకడానికి ఈ వాసుకినే త్రాడుగా ఉపయోగించారు. వాసుకిని మందర పర్వతానికి చుట్టి క్షీర సాగరాన్ని దేవదానవులు మథించారు. దారుణ మైన విషం కలిగిన వాసుకి ఈశ్వర విభూతి.

అనన్త శ్చాస్మి నాగానాం వరుణో యాదసా మహమ్ ।
పిత్రూణా మర్యమా చాస్మి యమః సంయమతా మహమ్ ॥ 29

అనంతః-చ-అస్మి-నాగానాం-వరుణః-యాదసాం-అహం

పితౄణాం-అర్యమా-చ-అస్మి-యమః-సంయమతాం-అహం

అహం	=	నేను	అహం	=	నేను
నాగానాం	=	నాగులలో	పితౄణాం	=	పితృదేవతలలో
అనంతః చ	=	అనంతుడను	అర్యమా చ	=	అర్యముడను
యాదసాం	=	జలచరములలో	సంయమతాం	=	సంయమనము చేయు వారిలో
వరుణః	=	వరుణుడను	యమః	=	యముడను
అస్మి	=	అయి ఉన్నాను	అస్మి	=	అయి ఉన్నాను

నాగులలో నేను అనంతుణ్ణి. జల దేవతలలో వరుణుణ్ణి. పితృ దేవతలలో అర్యముణ్ణి. నిగ్రహవంతులలో యముణ్ణి నేనే.

వ్యాఖ్య

నాగులలో అనంతుడు

నాగులలో అనంతనాగుడు ఈశ్వర విభూతి ***(నాగానాం అనంతః అస్మి).*** అనంత విభూతికి ముందు వాసుకి విభూతిని చూశాం. ఈ రెండిటికి ఉన్న తేడాను అర్థం చేసుకోవాలి.

సర్పాలలో వాసుకి, నాగులలో అనంతుడు భగవ ద్విభూతులు. వాసుకి సర్పరాజు. అనంతుడు నాగరాజు.

ఒక్క తల మాత్రమే ఉండి, విషం కలిగినవి సర్పాలు. అనేక తలలు కలిగి విషం లేకుండా ఉండేవి నాగులు. ఇదే ముఖ్యమైన తేడా. సర్పాలకు రాజైన ***(సర్పాణాం రాజా)*** వాసుకి పాతాళంలో ఉంటుంది ***(వసతి పాతాలే ఇతి వాసుకిః).*** నాగులకు రాజైన ***(నాగానాం రాజా)*** అనన్తుడు వైకుంఠంలో ఉంటాడు ***(వసతి వైకుంఠే ఇతి అనన్తః).*** అనంతుడే ఆదిశేషుడు. ఎవరి మీద నారాయణుడు శయనించి ఉంటాడో అతడే ఆదిశేషుడు ***(శేతే హరి రస్మిన్నితి శేషః).*** విషపూరిత మైన సర్పాలలో విషము అతిశయించి ఉండుట చేత వాసుకి ఈశ్వర విభూతి. విష శూన్యమైన నాగులలో వేయి పడగలతో శోభిస్తూ, వైకుంఠునికి పడకగా, దిండుగా, గొడుగుగా సర్వమూ తానై ఉన్నందున అనంతుడు ఈశ్వర విభూతి.

జల దేవతలలో వరుణుడు

జలాలకు, జలచరాలకు అధిపతి వరుణుడు. నీరు భగవ త్స్వరూపము కనుక వరుణుడు ఈశ్వర విభూతి. వర్షాభావ పరిస్థితులలో జనులు వరుణుని ప్రార్థిస్తూ యాగాలు నిర్వహిస్తారు. వరా లివ్వమని ప్రార్థిస్తారు ***(వృణోతి వరా నముం లోకః ఇతి).*** వారి ప్రార్థనలను అందుకొని వర్షరూపంలో జనావళిని వరుణుడు అనుగ్రహిస్తాడు.

వరుణుడు పశ్చిమ దిక్కును పాలిస్తూ ఉంటాడు. అందుచేత, సాయం సంధ్యా సమయంలో అస్తమిస్తున్న సూర్యునిలో నారాయణుని స్మరిస్తూ, వరుణ ప్రార్థన చేస్తారు. ***ఇమం మే వరుణ శ్రుధీహవమ్*** - 'ఓ వరుణుడా! నా ప్రార్థన నాలకించు' (తైత్తిరీయ సంహిత).

పితృ దేవతలలో అర్యముడు

పితృ దేవతలలో అర్యముడు శ్రేష్ఠుడు కనుక అతడు ఈశ్వర విభూతి. గమనము నందు వేగము అతిశయించిన వాడు అర్యముడు ***(ఇయర్తి గచ్ఛతీతి అర్యమా).*** ఈ కారణం చేత అర్యముడు భగవద్వైభవము.

నిగ్రహవంతులలో యముడు

నిగ్రహించుట యందు, దండించుట యందు, సమయ పాలనము నందు తనకు సాటి లేరనే ఖ్యాతి వహించిన సమవర్తి యమధర్మరాజు. ఈ కారణాల చేత ఆయన భగవ ద్విభూతి అయ్యాడు. న్యాయ నిర్ణయంలో మొక్కవోని ప్రతాప ప్రభావాలు కలవాడు యముడు.

ప్రజలను నియమించే వారందరూ యములే **(యమనాత్ యమాః ప్రజా సంయమోద్యమాః).** అలా నియమ నిష్ఠ గల వారిలో యముడు రాజు వంటి వాడు **(తేషు రాజత ఇతి).** అందుచేత, ఆయన యమరాజు. అలాగే ధర్మ నిర్వహణము నందు, యమరూపు లైన వారిలో యమరాజు శ్రేష్ఠు డైనందున యమధర్మరాజుగా విరాజిల్లుతూ ఈశ్వర విభూతిగా శోభిస్తున్నాడు.

ప్రహ్లాద శ్చాస్మి దైత్యానాం కాల: కలయతా మహమ్ । 30
మృగాణాం చ మృగేన్ద్రోఽహం వైనతేయశ్చ పక్షిణామ్ ॥

ప్రహ్లాదః-చ-అస్మి-దైత్యానాం-కాలః-కలయతాం-అహం

మృగాణాం-చ-మృగేంద్రః-అహం-వైనతేయః-చ-పక్షిణాం

అహం	=	నేను	మృగాణాం చ	=	మృగములలో
దైత్యానాం	=	దైత్యులలో	మృగేంద్రః	=	సింహమును
ప్రహ్లాదః చ	=	ప్రహ్లాదుడను	పక్షిణాం	=	పక్షులలో
కలయతాం	=	గణిత శాస్త్రజ్ఞులలో	వైనతేయః చ	=	గరుత్మంతుడను
కాలః	=	కాలమును	అస్మి	=	అయి ఉన్నాను

దైత్యులలో నేను ప్రహ్లాదుణ్ణి. లెక్కెట్టే వారిలో కాలము నేనే. మృగాలలో నేను సింహము. పక్షులలో గరుత్మంతుడు నేనే.

వ్యాఖ్య

దైత్యులలో ప్రహ్లాదుడు

దితికశ్యపుల పుత్రులు దైత్యులు, అంటే రాక్షసులు. రాక్షస వంశంలో పుట్టిన వారిలో శ్రేష్ఠుడు ప్రహ్లాదుడు. దుష్టుడైన హిరణ్యకశిపుని కుమారుడు. సర్వులకు హ్లాదమును కలిగించి ప్రహ్లాదు డయ్యాడు. సర్వగుణ సంపన్నుడు. వర్ణింప శక్యము గాని దివ్యగుణ యుతుడు.

కి॥ ***గుణనిధి యగు ప్రహ్లాదుని గుణము లనేకములు గలవు గురుకాలమునన్***
గణుతింప నశక్యంబులు ఫణిపతికి బృహస్పతికిని భాషాపతికిన్ ॥

సుగుణ నిధి అయిన ప్రహ్లాద కుమారుని గుణాలు అన్ని ఇన్ని అని చెప్పలేక పోయారు. లెక్కించడానికి సమయం సరిపోయేది కాదట. ఆయన సుగుణాలను వర్ణించడం ఆదిశేషునికి **(ఫణిపతి)**, దేవగురువునకు **(బృహస్పతి)**, శారదాపతి అయిన బ్రహ్మదేవునకు **(భాషాపతి)** కూడా సాధ్యం కాదు అన్నది పోతన భాగవతము.

'రాక్షసుడై పుట్టినా ఫరవాలేదు. రాక్షసుడిలా జీవించకు' అనే సందేశాన్ని ప్రపంచానికి అందించిన భక్తాగ్రగణ్యు డైన ప్రహ్లాదుడు భగవంతుని దివ్యవిభూతి.

గుణించే వారిలో కాలము

లెక్కించే వారిలో **(కలయతాం)** తాను కాలమట **(అహః కాలః).** అందుచేత, కాలము ఈశ్వర విభూతి.

లెక్కించే వారిలో, లెక్కలలో ఎందరో మేధావులు ఉన్నారు. వారు ఎంత మేధావులైనా, లెక్కించడంలో ఎక్కడో ఒక చోట తప్పుగా లెక్కించక పోరు. ఎంత లెక్కించినా దోషం లేకుండా లెక్కించే సామర్థ్యం ఒక్క కాలానికే ఉంది. అందుచేత కాలం భగవ ద్విభూతి.

చక్కగా లెక్కించడములో కాలానికి మించిన వారు లేరు. క్షణాలు, నిముషాలు, గంటలు, రోజులు, వారాలు, పక్షాలు, మాసాలు, త్రైమాసాలు, షణ్మాసాలు, వత్సరాలు, దశాబ్దాలు, శతాబ్దాలు అంటూ సర్వాన్ని, సమస్తాన్ని కాలం లెక్కించుకుంటూ పోతుంది ***(కాలయతి గణయతి సర్వమితి కాలః).*** ఇలా లెక్కించుకుంటూ విశ్వాన్నంతా మ్రింగుతూ పోతుంది. కాలం మ్రింగని వస్తువు ఉండదు. ఒక దశలో ప్రపంచాన్నే కాలం మ్రింగేస్తుంది ***(కాలః జగద్భక్షకః).*** అది కూడా కాల గణితము పైనే, గుణితము పైనే ఆధారపడి ఉంటుంది. అందుచేత, నేను కాలాన్ని ***(కాలోఽ స్మి)*** అంటూ భగవంతుడు కాలాన్ని తన విభూతిగా అభివర్ణించాడు. ఇది అర్థమైన వారు కాలాన్ని క్షణం కూడా వ్యర్థం చెయ్యరు. కాలాన్ని చక్కగా వినియోగించుకున్న వారే కాలాతీతులై శోభిస్తారు.

మృగాలలో సింహము

క్రూర మైనవి, భయంకర మైనవి మృగాలు. అట్టి మృగాలకు రాజైన మృగరాజు భగవ ద్విభూతి. మృగరాజే మృగేంద్రుడు. అదే సింహము.

పరాక్రమము నందు అసమాన శక్తి గలది సింహము. ఏనుగు అంత పెద్ద జంతువైనా, దాని కుంభ స్థలమును ఛేదించే శక్తి సింహానికి ఉంది. ఈ విధమైన అసమాన పరాక్రమము భగవ ద్విభూతి.

పరాక్రమముతో పాటు అభయస్థితి దాని సహజ గుణము. అందుచేతనే గజవ్యాఘ్రాదులు అరణ్యాలలో ఉన్నా సింహమే మృగరాజు అయింది. అరణ్యానికి రాజుగా సింహాన్ని ఎన్నుకున్న దెవరు? 'మృగేంద్ర' బిరుదును ఇచ్చిం దెవరు? సిఫారసులతో 'పద్మశ్రీ'లు విరబూస్తాయి. స్వశక్తితో 'మృగశ్రీ'లు పుట్టుకొస్తాయి. అందుచేత సింహము ఈశ్వర విభూతి.

భగవంతుడికి సింహ ***(సింహః)*** మనే పేరు కూడా ఉంది. ***విక్రమ శాలిత్వాత్ సింహవత్ సింహః*** - పరాక్రమము నందు సింహము లాంటి సింహము భగవంతుడు. 'నృ' శబ్ద లోపం చేత నృసింహుడే సింహుడు అని అర్థము ***(నృ శబ్ద లోపేన నృసింహః ఏవ సింహః).***

పక్షులలో వైనతేయుడు

పక్షులలో వైనతేయుడు ఈశ్వర విభూతి. వైనతేయుడే గరుత్మంతుడు. వినతాపుత్రుడు కావడం చేత గరుత్మంతుని వైనతేయుడు అంటారు.

పరమేశ్వరుని వాహనం కావడం చేత గరుత్మంతుడు పవిత్రాత్ముడు. శుభరూపుడు. ఆయన దర్శనమే శుభప్రదం. అందుచేతనే, లోక వ్యవహారంలో కూడా గరుడ పక్షిని చూడగానే, శుభం జరుగుతుందని భావించి నమస్కరిస్తూ ఉంటారు. గరుత్మంతుడు ఎగిరి నంత ఎత్తుకు ఏ పక్షీ ఎగర లేదు. అదే గరుత్మంతునిలో అతిశయించిన వైభవము. ఈశ్వర విభూతి.

పవనః పవతా మస్మి రామః శస్త్రభృతా మహమ్ ।
ఝషాణాం మకర శ్చాస్మి స్రోతసా మస్మి జాహ్నవీ ॥ 31

పవనః-పవతాం-అస్మి-రామః-శస్త్రభృతాం-అహం
ఝషాణాం-మకరః-చ-అస్మి-స్రోతసాం-అస్మి-జాహ్నవీ

అహం	=	నేను	మకరః	=	మొసలిని
పవతాం	=	పవిత్రము చేసెడి వాటిలో	అస్మి	=	అయి ఉన్నాను
పవనః	=	వాయువును	చ	=	మరియు
శస్త్రభృతాం	=	ఆయుధ ధారులలో	స్రోతసాం	=	నదులలో
రామః	=	శ్రీరాముడను	జాహ్నవీ	=	గంగానదిని
అస్మి	=	అయి ఉన్నాను	అస్మి	=	అయి ఉన్నాను
ఝషాణాం	=	చేపలలో			

పార్థా! పవిత్రం చేసే వాటిలో నేను వాయువును. శస్త్రధారులలో శ్రీరాముణ్ణి నేనే. మత్స్య జాతిలో నేను మకరాన్ని, నదులలో గంగానది నేనే.

వ్యాఖ్య

పావనం చేసే వాటిలో పవనము

పవిత్రం చేసే వాటిలో **(పవతాం పావయితౄణాం)** వాయువు **(పవనః వాయుః)** పరమేశ్వరుని విభూతి. **పవతే ఇతి పవనః** - పవిత్రం చేసేది పవనము లేదా గాలి. అలా పవిత్రం చేసే శక్తి జడమైన వాయువుకు ఎక్కడిది? అది పరమేశ్వరుని వైభవము. పవిత్రం చేసే కళ్యాణ గుణము జ్ఞాన స్వరూపుడైన పరమేశ్వరునికే ఉంది. పరమేశ్వరుని శక్తే వాయువులో ఉంది. అందుకే వాయువు పవిత్రం చేయ గలుగుతూ ఉంది. పవనాన్ని పయనింప చేసే శక్తి భగవంతునిది. అందుచేత వాయువు పరమేశ్వరుని విభూతియై ఎన్నిటినో పవిత్రం చేస్తూ ఉంది.

వాయువులో అద్భుతమైన శక్తి ఉంది. అద్భుతమైన వేగంతో చలించే గుణమూ ఉంది. అందుచేత కేవలం పవిత్రం చేయడమే కాకుండా, పరుగు లెత్తుతూ పయనించి మరీ పవిత్రం చేస్తుంది.

మట్టి కూడా పవిత్రం చేస్తుంది. జలం కూడా పవిత్రం చేస్తుంది. మృత్తికా స్నానం, జల స్నానం శుద్ధి పడేందుకే చేస్తాము. జల మృత్తికాదులు శుద్ధి చేస్తాయి. కాని, తాము అశుద్ధం కాకుండా ఉండలేవు. మృత్తికోదకాలు అశుద్ధ మైనపుడు గాలి పరుగు లెత్తుతూ వెళ్ళి వాటిని శుద్ధి చేస్తుంది. ఇదంతా ఈశ్వర వైభవము.

శుద్ధి చేసే గుణం గల జలమృత్తికాదులు తాము ఉన్న చోటే ఉండి శుద్ధి చేస్తాయి. కాని, వాయువు అలా కాదు. పని కట్టుకొని పరుగు లెత్తుకుంటూ పోయి శుద్ధి చేస్తుంది.

అగ్ని కూడా శుద్ధి చేస్తుంది కదా! అవును. అందుకే అగ్నిని **పావకః** అన్నారు. ఆ విషయాన్ని మనం విభూతిగా చెప్పుకున్నాం. కాని, ఈ సందర్భంలో మరి కొంత స్పష్టత అవసరం.

అగ్ని పవిత్రం చేస్తుంది. జల మృత్తికాదుల లాగా తాను అశుద్ధం కాదు. కాని, వాయువు లాగా పరుగు లెత్తి పవిత్రం చేయలేదు. అదేమిటి? అగ్ని ప్రమాదాలు జరిగి నపుడు ఒక చోట నుండి మరొక చోటికి అగ్ని వ్యాపిస్తూ ఉండటం మనం చూస్తున్నాము కదా! అగ్ని వాయు వేగాన్ని పుంజుకోలేక పోవచ్చు. కాని, జల మృత్తికాదుల వలె కాకుండా, పయనించి పునీతం చేస్తూ ఉంది కదా! అనే సందేహం తలెత్త వచ్చు. ఇక్కడ ప్రధానంగా అర్థం చేసుకోవలసిన విషయం ఒకటి ఉంది. అగ్ని తనంతట తాను విస్తరించ లేదు. వాయు తాకిడికే అగ్ని చలిస్తుంది. అగ్ని ప్రమాదాలు విస్తార మయ్యేది వాయువు తోడైనపుడే.

పవిత్ర సాధనంగా వాయువు చరించడమే గాక, సర్వ ప్రాణుల, వృక్ష లతాదుల జీవనానికి కూడా తానే

కారణమై ఉంది. ఇదంతా భగవద్విభూతి. భగవంతుని స్ఫూర్తి చేత, భగవదాజ్ఞలకు తల వంచి వాయువు ఈశ్వర విభూతిగా చరిస్తూ ఉంది.

భీషాస్మా ద్వాతః పవతే - భయంతో గాలి వీస్తూ ఉంది అన్నది ఉపనిషత్తు. భగవద్భీతితో గాలి వీస్తూ ఉంది. భగవంతుని స్ఫూర్తిని నింపుకొని పవిత్రమైన కార్యాలను వేగవంతముగా నిర్వహిస్తున్న వాయువును భగవ ద్విభూతిగా దర్శించడమే కాకుండా, ప్రత్యక్ష దైవంగా కూడా భక్తులు ఆరాధిస్తూ ఉంటారు.

నమస్తే వాయో! త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి ! త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మ వదిష్యామి!

ఓ వాయుదేవుడా! నీకు నమస్కారము. నువ్వే ప్రత్యక్ష దైవానివి. నిన్ను కనిపించే దైవంగా నేను అర్థం చేసుకుంటున్నాను.

శస్త్రధారులలో శ్రీరాముడు

శస్త్రములు ధరించిన వారిలో శ్రీరాముడు తానే అంటున్నాడు భగవంతుడు ***(శస్త్రాణాం ధారయిత్యాణాం దాశరథిః రామః అహమ్).*** ఇక్కడ రాముడు అంటే బలరాముడో లేక పరశురాముడో అనే సందేహం రావచ్చు. అలాంటి సంశయానికి అవకాశం లేకుండా, ***దాశరథిః రామః*** అన్నారు భాష్యంలో శ్రీ శంకరాచార్యస్వామి. దశరథ రాముడు అనే అర్థం స్పష్టమైంది.

శస్త్రాస్త్రాలు లేకుండా రాముణ్ణి చూడలేము. సదా కోదండపాణి గానే శ్రీరాముడు దర్శన మిస్తాడు. ఎవరైనా శస్త్రాస్త్రాలు ఎందుకు ధరిస్తారు? శత్రు సంహారానికే. మరి, అలాంటప్పుడు శత్రువును ఎదుర్కొనే సమయాలలో మాత్రం ధరిస్తే సరిపోతుంది కదా! సదా శస్త్రధారియై, అస్త్రధారియై, కోదండధారియై శ్రీరాముడు ఉండటానికి కారణ మేమిటి?

బాహ్య శత్రువులు ఎప్పుడో గాని రారు. అంతః శత్రువులు ఎప్పుడైనా రావచ్చు. కామక్రోధాది శత్రువులను ఎదుర్కొనేందుకు సాధకులు సదా సంసిద్ధులై ఉండాలి అని తెలిపేందుకే శ్రీరాముడు సదా కోదండపాణిగా దర్శన మిస్తాడు. రామబాణముతో సాటి యైనది లేదు. సాగరాన్ని ఎండింప చేసే శక్తి ఒక్క రామ బాణానికి ఉంది. అట్టి అసమాన వైభవము రామ బాణానికి ఉండటం చేతనే, 'శస్త్రధారులలో నేను శ్రీరాముణ్ణి' అంటున్నాడు.

మత్స్యాలలో మకరము

మకరము జలచరము. మత్స్యజాతికి చెందింది. నీళ్ళల్లో దాని శక్తి అసమానము. అద్భుతము. ఏనుగును సైతం నీళ్ళల్లో నిలువరించే సామర్థ్యం మకరానికి ఉంది. గజేంద్ర మోక్షంలో కరిమకరుల సంగ్రామం మనకు తెలిసిందే కదా! కనుక అట్టి నిరుపమాన పరాక్రమమును మకరంతో సమానంగా మరొకటి ప్రదర్శించ లేదు కనుక మకరము ఈశ్వర విభూతి.

నదులలో గంగానది

ప్రవహించే నదులలో గంగానది ఈశ్వర విభూతి. గంగాస్నానం పాపనాశము, పుణ్యప్రదము అని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. మహాత్ములు దివ్యంగా ప్రవచిస్తున్నారు. కనుకనే, 'ప్రవహించే నదులలో జాహ్నవి నా విభూతి' అంటున్నాడు ***(స్రోతసామ్ అస్మి జాహ్నవీ గంగా).***

గంగానదికి ***జాహ్నవీ*** అనే పేరు కూడా ఉంది. ***జాహ్నవీ*** అంటే ***జహ్ను తనయా*** అని అర్థము ***(జహ్నోః***

తనయా జాహ్నవీ) - జహ్ను మహాముని చెవి నుండి పుట్టింది కనుక గంగ ***జాహ్నవీ*** అని పిలువ బడింది.

గంగ వైభవాన్ని వర్ణించడం వేయి నాల్కల ఆదిశేషునికి కూడా సాధ్యం కాదు. హరిహరుల వైభవాన్ని తనలో నింపుకున్న గంగమ్మ భూతలంపై ప్రవహించడం మానవులు, మహర్షులు చేసుకున్న పుణ్యము.

హరి చరణాత్ గాం భూమిం గతా గంగా - హరి చరణాల నుండి కదలి భూమిని చేరింది కనుక ఆమె గంగ.

హరోత్త మాంగాత్ భూమిం గతా గంగా - హరుని శిరస్సు నుండి భూమికి చేరింది కనుక ఆమె గంగ.

గంగానదిని మనం కేవలం నదిగా చూడటం లేదు. భగవత్స్వరూపంగా భావిస్తున్నాం. భగవతిగా ఆరాధిస్తున్నాం. ఈ విధమైన అవగాహనను పాశ్చాత్య దేశాలలో మనం ఊహించ లేము. ఒక నది విషయంలో ఇంతటి పవిత్ర భావన అనాదిగా జనుల హృదయాలలో సుప్రతిష్ఠం కావడానికి గంగ వైభవమే కారణము.

పవిత్రమైన గంగాతీరం లోనే మహర్షులు తపస్సు నాచరించి తరించారు. ఆ తీరం లోనే పవిత్రమైన శాస్త్ర చర్చ విస్తారంగా సాగింది. అక్కడే ఆర్ష సంప్రదాయం వెల్లి విరిసింది. గంగా జలాలలో హిందువులు భగవద్దర్శనం చేస్తారు. ఈ భావన మనకు ఈశ్వర భావన వల్లనే ఏర్పడింది. అందుకే, 'నదులలో నేను గంగానదిని' అంటున్నాడు పరమేశ్వరుడు. గంగమ్మ తల్లి వైభవాన్ని ఒక పుస్తకంగా వ్రాయ గలిగినంత విషయము మనస్సు నుండి దొర్లుతున్నా, సందర్భాన్ని దృష్టిలో ఉంచుకొని, చేతులు కట్టేసుకొని, శిరమొడ్చి నమస్కరిస్తూ గంగాస్తుతితో తృప్తి చెందుతున్నా!

> ***భాగీరథి సుఖదాయిని మాతః***
> ***తవ జల మహిమా నిగమే ఖ్యాతః।***
> ***నాహం జానే తవ మహిమానం***
> ***పాహి కృపామయి మామజ్ఞానమ్ ॥***

అమ్మా! భాగీరథీ! సుఖదాయినీ! తల్లీ! నీ పవిత్ర జలాల వైభవమును వేదాలు కీర్తించాయి. నీ మహిమ నాకేం తెలుసు? తల్లీ! దయామాతా! నేను అజ్ఞానిని. నన్ను కాపాడు తల్లీ!

> **సర్గాణా మాది రన్తశ్చ మధ్యం చైవాహ మర్జున ।** 32
> **అధ్యాత్మవిద్యా విద్యానాం వాదః ప్రవదతా మహమ్ ॥**

సర్గాణాం-ఆదిః-అంతః-చ-మధ్యం-చ-ఏవ-అహం-అర్జున

అధ్యాత్మవిద్యా-విద్యానాం-వాదః-ప్రవదతాం-అహం

అర్జున	=	అర్జునా!	విద్యానాం	=	విద్యలలో
సర్గాణాం	=	సృష్టులలో	అధ్యాత్మవిద్యా	=	ఆత్మవిద్యయు
ఆదిః	=	ఆది సృష్టియు	ప్రవదతాం	=	వాదించు వారిలో
అంతఃచ	=	అంతమును	వాదః	=	వాదమును
మధ్యం చ	=	స్థితియును	అహం	=	నేనే
అహం ఏవ	=	నేనే			

అర్జునా! సృష్టుల యొక్క ఆది మధ్యాంతములు నేనే. విద్యలలో నేను అధ్యాత్మ విద్యను. వాదించే వారిలో నేను వాదాన్ని.

వ్యాఖ్య

స్పష్టులలో ఆది మధ్యాంతాలు

భూతాలకు ఆది మధ్యాంతాలు నేనే అని ఈ అధ్యాయం లోనే ఇరవయ్యవ శ్లోకంలో చెప్పడం జరిగింది. అదే ఇక్కడ మళ్ళీ చెబుతూ ఉన్నా, పునరుక్తి దోషాన్ని ఆపాదించ కూడదు. కారణం, అక్కడ చెప్పింది ప్రధానమైన సృష్టికి సంబంధించిన ఆదిమధ్యాంతాల విషయం. ఇక్కడ చెబుతున్నది సృష్టిలో జరుగుతున్న కార్యా లన్నిటికీ కూడా ఆదిమధ్యాంతాలు తానే అనే విషయం. ఒక విత్తనం నాటుతాము. అది చెట్టు అవుతుంది. కొంత కాలానికి నశించి పోతుంది. ఈ చెట్టు సృష్ట్యాదిలో లేదు. సృష్టి అంతం వరకు ఉండబోదు. కాని, ఈ చెట్టుకు ఆదిమధ్యాంతా లున్నాయి. అలా సృష్టి లోని సృష్టులను చెప్పడమే భగవానుని ఉద్దేశ్యం కనుక ఇక్కడ పునరుక్తి లేదు.

విద్యలలో అధ్యాత్మ విద్య

ఒక్క అధ్యాత్మ విద్యను ప్రక్కన పెడితే, మిగిలిన విద్యలన్నీ నామ మాత్రమే. అన్నీ అనిత్యాలే. త్రివర్గములకు సంబంధించినవే గాని, జీవులకు శాశ్వతానందాన్ని ప్రసాదించే మోక్షానికి సంబంధించినవి కావు. అధ్యాత్మ విద్య, లేదా బ్రహ్మాత్మ జ్ఞానము ఒక్కటే మోక్ష ప్రదాయిని కనుక, అన్ని విద్యలలో అధ్యాత్మ విద్య శ్రేష్ఠ మైనది. అందువల్ల అది పరమేశ్వరుని విభూతి అయింది. ఛాందోగ్యోపనిషత్తు లోని నారద సనత్కుమార సంవాదములో ఈ విషయం విస్తారంగా చర్చింప బడింది.

వాదించే వారిలో వాదము

వాదము తర్క సంబంధ మైనది. కాని, ఈ వాదవిద్యను వినియోగించుకొనే వారి విచారములో భేదాలు ఉన్నందున, వాదించే వారిలో ***(ప్రవదతామ్)*** వదన భేదం వల్ల వాద, జల్ప వితండములు అనేవి వినిపిస్తాయి. అదే 'ప్రవదతామ్' అని చెప్పడం లోని విశేషము ***(ప్రవక్తృ ద్వారేణ వదన భేదనా మేవ వాద జల్ప వితండానామ్ ఇహ గ్రహణం).***

వాదము మూడు విధాలు. మొదటిది వాదము. రాగద్వేషాలు లేకుండా కేవలం తత్త్వ నిర్ణయం కొరకు చేసే తర్కము వాదము. రెండవది జల్పము. తనది మాత్రమే సత్యమని నిరూపించుకోవడానికి, ప్రతిపక్షమును ఖండిస్తూ, తన పక్షమును బలపరచుకోవడం జల్పము. మూడవది వితండము. కేవలము పరపక్షమును ఖండించడమే ప్రధానంగా పెట్టుకొని సాగే వాదము వితండము. ఈ మూడిటిలో సత్య నిర్ధారణకు ఉపకరించేది వాద మొక్కటే కనుక, వాదించే వారిలో వాదము భగవ ద్విభూతి.

అక్షరాణా మకారోఽస్మి ద్వన్ద్వః సామాసికస్య చ । 33
అహ మే వాక్షయః కాలో ధాతాహం విశ్వతోముఖః ॥

అక్షరాణాం-అకారః-అస్మి-ద్వంద్వః-సామాసికస్య-చ
అహం-ఏవ-అక్షయః-కాలః-ధాతా-అహం-విశ్వతోముఖః

అక్షరాణాం	=	అక్షరములలో	ద్వంద్వః చ	=	ద్వంద్వ సమాసమును
అకారః	=	అకారమును	అస్మి	=	అయి ఉన్నాను
అస్మి	=	అయి ఉన్నాను	అక్షయః	=	నశించని
సామాసికస్య	=	సమాసములలో	కాలః	=	కాలము

అహం ఏవ	=	నేనే	ధాతా	=	ధాతను
విశ్వతోముఖః	=	సర్వత్ర ముఖములు గల	అహం	=	నేనే

పార్థా! అక్షరాలలో నేను అకారము. సమాసాలలో నేను ద్వంద్వ సమాసాన్ని, నేను క్షయ మెరుగని కాలాన్ని, నేను సర్వత్ర ముఖాలు గల విధాతను.

వ్యాఖ్య

అక్షరాలలో అకారము

వాక్యం లోనే భావం ఇముడుతుంది. కాని పదాలు లేనిదే వాక్య నిర్మాణం జరగదు. అక్షరాలు లేనిదే పదాలు ఏర్పడవు. అక్షరాలకు 'అ' కారము ఆది. భాషలు ఏవైనా 'అ' అనే అక్షరము తోనే ప్రారంభ మవుతాయి.

ఆ తరువాత ఎన్ని అక్షరాలు ఉన్నా అవన్నీ 'అ' శబ్దం తోనే ముడిపడి ఉంటాయి. అంటే ఏ అక్షరంలో అయినా 'అ' వ్యాపించి ఉంటుంది ***(అశ్నుతే).*** 'అ' ని మినహాయించి ఏ అక్షరాన్ని కూడా పలకలేము. నోరు తెరవకుండా ఏదీ పలకలేము. కాని, నోరు తెరిస్తే మాత్రం ముందుగా ధ్వనించేది 'అ' శబ్దమే. 'అ' శబ్దంలో ఇదొక గొప్ప విశేషము. ఇందులో భగవదైశ్వర్యం నిండి ఉంది.

భగవంతుడు ఆదిలో ఉంటాడు. అద్వితీయంగా ఉంటాడు. ఆ తరువాత వచ్చే వాటన్నిటిలో వ్యాపించి ఉంటాడు. తాను స్వరూపంగా శోభిస్తాడు. కారణంగా సృష్టిలో రాణిస్తాడు. 'అ' కారమూ అంతే.

పరమేశ్వరుని లాగా ఆరంభంలో ఉంటుంది. అది లేక మరొక అక్షరం ఉండలేదు. ఉన్న అక్షరా లన్నిటిలో తానే ఉంటుంది ***(అకారోవై సర్వ వాక్ - వేదం).*** తాను స్వరూపంగా శోభిస్తూ, కారణంగా అన్నిటిలో వ్యాపించి ఉండే లక్షణం ఆదిదేవునిలో కనిపించినట్లే 'అ' కారంలో కూడా అగుపిస్తూ ఉంది. అన్ని రూపాలలో భగవంతుడే. అలాగే అన్ని అక్షరాలలో 'అ' కారమే ***(అకారోవై సర్వా వాక్ స ఏషా స్పర్శోష్మభిః వ్యజ్యమానా బహ్వీ నానారూపా భవతి!).*** అన్ని అక్షరాలను స్పృశిస్తూ, అన్ని అక్షరాలకు స్ఫురణ నిస్తూ 'అ'కారము అన్నిటిలో వ్యాపించి ఉంటుంది కనుక 'అ'కారము ఈశ్వర విభూతి.

సమాసాలలో ద్వంద్వ సమాసము

రెండు పదాలను కలిపి ఒక పదంగా ఉచ్చరించడము ద్వంద్వ సమాసము. ఆ రెండు పదాలు కూడా సమాన ప్రాధాన్యం కలిగి ఉంటాయి. సమానార్థం, సమ ప్రాధాన్యంతో భిన్నత్వంలో ఏకత్వంగా శోభించడం చేత, ద్వంద్వ సమాసము ఈశ్వర విభూతి.

అక్షయ కాలం

గుణించే వారిలో నేను కాలాన్ని అని ముప్పైయవ శ్లోకంలో చెప్పడం జరిగింది. కాని, మళ్ళీ ఇక్కడ అక్షయ కాలం నేను అంటున్నాడు. సమయ వాచకంగా తెలిసే కాలము ఒకటైతే, కాలాతీత మైన కాలము మరొకటి. జగత్తులో కాలం నడుస్తూ ఉంది. ప్రవాహ నిత్యత్వం ఉన్నందున, అది కూడా అక్షయం గానే కనిపిస్తుంది. కాని, దేశకాలాదులు పరిచ్ఛిన్నాలు అని ప్రత్యేకంగా చెప్ప నవసరం లేదు. కనుక, వాస్తవానికి ఇది క్షయ కాలము. పరమాత్మ అక్షయ కాల రూపుడు. క్షయంగా తెలిసే కాలం కూడా అక్షయ బ్రహ్మమే. కాని, అక్షయ పరబ్రహ్మము కాలం కాదు. ఇదే ప్రధానంగా అర్థం కావలసిన కాల భేదము.

సర్వతోముఖ విధాత

సర్వ కర్మ ఫల ప్రదాత, లేదా విధాత భగవంతుడే. ఆయన సర్వతోముఖుడు. విశ్వతోముఖుడు. ఏదీ

ఆయన దృష్టిని తప్పించుకో లేదు. ధర్మరూపంలో ఉండి సర్వ కర్మలకు ఫలితాలను ప్రసాదిస్తాడు కనుక, ధర్మరూప విధాత కూడా తన విభూతియే *(ధాతా అహం కర్మఫలస్య విధాతా జగతః, విశ్వతో ముఖః సర్వతో ముఖః).*

మృత్యుః సర్వహర శ్చాహ ముద్భవశ్చ భవిష్యతామ్ ।
కీర్తిః శ్రీ ర్వా క్చ నారీణాం స్మృతి ర్మేధా ధృతిః క్షమా ॥ 34

మృత్యుః-సర్వహరః-చ-అహం-ఉద్భవః-చ-భవిష్యతాం
కీర్తిః-శ్రీః-వాక్-చ-నారీణాం-స్మృతిః-మేధా-ధృతిః-క్షమా

అహం	=	నేను	శ్రీః	=	లక్ష్మియు
సర్వహరః	=	సర్వ సంహారకరు డైన	వాక్ చ	=	వాక్కు
మృత్యుః చ	=	మృత్యువును	స్మృతిః	=	జ్ఞాపక శక్తి
భవిష్యతాం	=	పుట్ట గల వారి	మేధా	=	బుద్ధియు
ఉద్భవః చ	=	పుట్టుకయు	ధృతిః	=	ధైర్యము
నారీణాం	=	స్త్రీలలో	క్షమా	=	ఓర్పు
కీర్తిః	=	కీర్తి			

అర్జునా! సమస్తాన్ని హరించే మృత్యువును నేనే. అభ్యుదయాన్ని సాధించే వారిలో అభ్యుదయ కారణము నేనే. స్త్రీలలో కీర్తి, సంపద, వాక్కు, స్మృతి, మేధ, ధైర్యము, క్షమ - అన్నీ నా విభూతులే.

వ్యాఖ్య

సర్వహర మృత్యువు

మృత్యువు సమస్తమును హరిస్తుంది. అట్టి మృత్యువు కూడా ఈశ్వర విభూతియే అంటున్నాడు. మృత్యువుకు ***సర్వహర*** అనే విశేషణమును ఎందుకు వాడవలసి వచ్చింది? మృత్యువు సర్వమును హరించక, పంచ ప్రాణాలలో రెండిటిని విడిచిపెట్టి, మూడిటిని పట్టుకు పోతుందా? ఈ సందేహాన్ని పరిహరిస్తూ మృత్యువు రెండు విధాలు అన్నారు భాష్యంలో ఆచార్యులు.

మృత్యుః ద్వివిధః ధనాదిహరః ప్రాణహరశ్చ, తత్ర యః ప్రాణహరః సః సర్వహరః ఇత్యుచ్యతే - హరించే స్వభావం గల మృత్యువు రెండు రకాలు. ఒకటి ధనాదులను హరించేది. రెండవది ప్రాణాన్ని హరించేది. ప్రాణమును హరించే ఈ మృత్యువే సర్వహరము.

ధనము, కీర్తి- ఇలా హరింప బడేవి చాలా ఉన్నాయి. ఆరోగ్యము, ఉద్యోగము, యశస్సు - ఇవన్నీ ఏదో ఒకనాడు హరింప బడేవే. కాకపోతే, వాటిని తిరిగి పొందవచ్చు. కాని ప్రాణహర మృత్యువు సర్వమును హరిస్తుంది ***(సర్వం హరతీతి సర్వహర మృత్యుః).*** అందుచేత అది ఈశ్వర విభూతి.

అభ్యుదయ ప్రాప్తి

జీవులు ప్రవృత్తి నివృత్తుల ద్వారా పొందేవి అభ్యుదయ నిశ్శ్రేయసలు. నిశ్శ్రేయసము అంటే మోక్షము. మోక్షము కానిది అభ్యుదయము. అంటే, సుఖ హేతువులైన ధర్మ, అర్థ, కామాలు. ఈ త్రివర్గములు సుఖ హేతువులు కావడానికి పుణ్య ఫలమే కారణం. కనుక పుణ్య భావన, పుణ్య కార్యము, పుణ్య ఫలము - ఈ మూడు పరమేశ్వరుని రూపాలే కావడం చేత వీటి వల్ల లభించే అభ్యుదయము కూడా పరమేశ్వర విభూతియే.

సప్త సంపదలు

అర్ధాంగిని ధర్మపత్ని అంటారు. ధర్మపత్ని అంటే, భర్తతో ధర్మాచరణములో పాలు పంచుకొనే స్త్రీ మూర్తి అని ఒక అర్థము. పురుషుడు పూర్వం ఆచరించిన ధర్మఫలంగా ప్రాప్తించినది అని మరొక అర్థము. ప్రతి వ్యక్తి సప్త సంపదలను ఆశిస్తాడు. అవే సప్త ధర్మపత్నులు. వారు (1) కీర్తి దేవి (2) శ్రీదేవి (3) వాగ్దేవి (4) స్మృతీ దేవి (5)మేధా దేవి (6) ధృతీ దేవి (7) క్షమా దేవి. ధర్మాచరణంలో ఉండే మోక్షప్రియులకు ఈ సప్త సంపదలు అనాయాచితంగా, ఈశ్వర కృపచే లభిస్తాయి. ఇవన్నీ ఈశ్వర విభూతులు. ఇది తాత్త్విక అవగాహన.

ఇదే గాక, ఈ ఏడు శుభ లక్షణాలు స్త్రీలలో ఉంటాయని, వారి కారణంగా పురుషులకు లభిస్తాయి అనేది మరొక అర్థము. ఈ లక్షణాలు పురుషులలో కూడా ఉన్నప్పటికీ, స్త్రీలకు ప్రాధాన్యాన్ని, ప్రథమ స్థానాన్ని ఇవ్వాలని పరమేశ్వరుడు సంకల్పించి ఉండొచ్చు. ఇది సామాజిక స్పృహతో చెప్పిన భావము.

ఇక పౌరాణికంగా చూస్తే స్వాయంభువ మనువు కుమార్తె ప్రసూతి దక్ష ప్రజాపతి భార్య. వారికి ఇరవై నాల్గు మంది కుమార్తెలు. ఇప్పుడు మనం చూచిన దేవీ సప్తకము వారిలో ఉన్నారు.

ప్రసూతీదక్షుల కుమార్తె లైన కీర్తి దేవి, మేధా దేవి, ధృతీ దేవి - ఈ దేవీ త్రయము యముని భార్యలు. స్మృతీదేవి అంగీరసుని అర్ధాంగి. క్షమాదేవి పులహుని భార్య. శ్రీదేవి విష్ణుపత్ని. వాగ్దేవి బ్రహ్మసతి. వీరిలో ఒక్క శ్రీదేవి మాత్రం ప్రసూతీదక్షుల పుత్రిక కాదు, పౌత్రిక. దక్ష ప్రజాపతి మరొక కుమార్తె యైన ఖ్యాతీ దేవికి భృగువు వలన కలిగిన పుత్రికే శ్రీదేవి. అందరూ ఐశ్వర్య రూపాలే. భగవ ద్విభూతులే.

బృహత్సామ తథా సామ్నాం గాయత్రీ ఛన్దసా మహమ్ ।
మాసానాం మార్గశీర్షో౽హ మృతూనాం కుసుమాకరః ॥ 35

బృహత్సామ-తథా-సామ్నాం-గాయత్రీ-ఛందసాం-అహం
మాసానాం-మార్గశీర్షః-అహం-ఋతూనాం-కుసుమాకరః

తథా	=	అలాగే	మాసానాం	=	మాసములలో
అహం	=	నేను	మార్గశీర్షః	=	మార్గశిర మాసమును
సామ్నాం	=	సామ్రుక్కులలో	ఋతూనాం	=	ఋతువులలో
బృహత్సామ	=	బృహత్సామమును	కుసుమాకరః	=	వసంతమును
ఛందసాం	=	ఛందస్సులలో	అహం	=	నేను
గాయత్రీ	=	గాయత్రీ ఛందస్సును			

అర్జునా! సామగానములలో నేను బృహత్సామము. ఛందస్సులలో నేను గాయత్రిని. మాసాలలో మార్గ శీర్షాన్ని ఋతువులలో వసంతాన్ని

వ్యాఖ్య

సామములలో బృహత్సామము

సామ వేదము గాన ప్రధాన మైనది అని చెప్పుకున్నాం. సామగానాలలో వివిధ రాగ స్వరాలతో సాగే గానములకు కొన్ని ప్రత్యేక నామా లున్నాయి. వాటిలో ప్రసిద్ధ మైనది, ప్రముఖ మైనది బృహత్సామము. శ్రావ్యమైన, రాగయుత మైన బృహత్సామము ప్రాముఖ్యాన్ని, ప్రాధాన్యాన్ని బట్టి ఈశ్వర విభూతి అయింది.

ఛందస్సులలో గాయత్రి

గాయత్రీ మంత్రము వేదరూప మని, వేద సారమని ప్రసిద్ధి. ఈ మంత్రము నాలుగు వేదాలలో ఉంది. ఉపనయన సంస్కార సందర్భమున గాయత్రీ మంత్రోపదేశము చేస్తారు.

జీవితంలో సరియైన నిర్ణయాలు తీసుకోవడానికి స్పష్టమైన ఆలోచనా విధానం సాగే లాగున బుద్ధిని ప్రభావితం చేయమని ప్రార్థించడమే గాయత్రీ మంత్రములో ప్రధాన విషయము. విశ్వామిత్ర మహర్షి మంత్ర ద్రష్ట.

గాయత్రీ మంత్రములో ఇరవై నాలుగు అక్షరా లున్నాయి. రామాయణంలో ఇరవై నాలుగు వేల శ్లోకా లున్నాయి. ఆ ఇరవై నాలుగు వేల లోని ప్రతి వెయ్యిలో, మొదటి శ్లోకం లోని ప్రారంభ అక్షరాన్ని గ్రహిస్తే, మొత్తం ఇరవై నాలుగు అక్షరాలు అవుతాయి. ఆ ఇరవై నాలుగు అక్షరాలతో కూడినదే గాయత్రీ మంత్రము. అంతే కాదు. ఆ ఇరవై నాలుగు శ్లోకాలలో సంపూర్ణ రామాయణము సంక్షిప్తంగా అర్థ మవుతుంది. దానినే గాయత్రీ రామాయణము అంటారు.

గాయత్రిని ఇటు మంత్రము గాను గ్రహించ వచ్చు, అటు ఛందస్సు గాను గ్రహించ వచ్చు. గీతలో శ్లోకాలు మనకు అనుష్టుప్, త్రిష్టుప్ ఛందస్సులలో ఉంటాయి. గాయత్రీ ఛందస్సు వేదం లోనే ప్రశస్తము. మహిమాన్విత మైనది, మహాద్భుత మైనది కావడం చేత గాయత్రి ఈశ్వర విభూతిగా అలరారుతోంది.

మాసాలలో మార్గశీర్షము

మాసాలలో మార్గశీర్షము ఈశ్వర విభూతి. మృగశిర నక్షత్రముతో కూడిన పున్నమి మార్గశిరము ***(మృగశీర్ష నక్షత్ర యుక్తా పూర్ణిమా మార్గశీర్షీ).*** ఇది పాడిపంటలు పుష్కలంగా ఉండే మాసము. ఈ మాసంలో ప్రాణులు శక్తివంతంగా ఉంటాయి ***(సహ శక్త్యా).*** వాతావరణము ఆహ్లాదకరంగా ఉంటుంది. చలి, ఉష్ణము, గాలి అధికంగా లేకుండా, శీతోష్ణ స్థితి సమంగా ఉంటుంది. శీత వాత ఆతప శూన్యంగా ఉండటం చేత ఈ మాసము సుఖ హేతువు. తపో వ్రత దానాలకు అనువైన మాసం. మార్గశీర్ష మాసము యొక్క విశిష్టత ఎంతైనా ఉంది.

ప్రస్తుతం నూతన సంవత్సరం చైత్ర మాసంతో ప్రారంభ మైనట్లు, మహాభారత కాలంలో మార్గశీర్షంతో క్రొత్త సంవత్సరం ఆరంభమయ్యే దని మహాభారతము - అనుశాసనిక పర్వం చెబుతూ ఉంది.

భగవద్గీత కూడా మార్గశీర్షంలో శుద్ధ ఏకాదశి నాడు ఆవిర్భవించింది. ఆ రోజే మనం గీతా జయంతి జరుపుకుంటాము.* ఇవన్నీ ఈశ్వర విభూతులే. అందుచేత, మార్గశీర్షము ఈశ్వర విభూతి.

ఋతువులలో వసంతము

ఋతువులలో వసంతము ఈశ్వర విభూతి. సర్వ సుగంధ పుష్పములకు ఆకరమైన, అతి రమణీయ మైన ఋతువు వసంత ఋతువు. ***వసన్తి సుఖం యథా తథా అస్మిన్నితి వసంతః*** - దేని యందు జను లందరు సుఖంగా ఉంటారో, అదే వసంతము అని అమరసింహుడు నిర్వచించాడు. ఇదొక అందమైన, అద్భుతమైన అసమానమైన ఋతువు.

వర్ష ఋతువులో వర్ష బాధ. గ్రీష్మ ఋతువులో ఉష్ణ బాధ. శరదృతువు ప్రారంభము నందు కొంత హాయిగా ఉంటుంది. శరదృతువు సమాప్త మయ్యే సరికి రోగాలు ప్రారంభ మవుతాయి. కార్తీక మార్గశిర మాసాలలో యముడు స్వైరవిహారం చేస్తూ ఉంటాడు. ఈ రెండు మాసాలు యముని కోరలు అన్నది శాస్త్రం ***(కార్తీక మార్గశిరౌ యమదంష్ట్రౌ).*** ఏ చిన్న రోగ మొచ్చినా, వచ్చింది చచ్చేందుకే అంటూ యముడు ప్రాణాల్ని

* పూజ్య స్వామీజీ గీతా జయంతి రోజు పుట్టారు. ఆ రోజే వైకుంఠ ఏకాదశి కూడా కలిసి వచ్చింది.

అమాంతం సంచిలో వేసుకొని పోతూ ఉంటాడు. ఇక హేమంత శిశిరాలలో శీతబాధ ఎలాగూ తప్పదు.

వసంత ఋతువు ఒక్కటే సుమ సౌరభాలను, ఫల సుగంధాలను వెదజల్లుతూ లోకాన్ని ఆనందింప చేస్తుంది. ***వసన్తః పుష్ప సమయః పుష్పాణాం సమయః కాలః.*** పూలు పూచే కాలము వసంతము. అందుకే అది కుసుమాకరము. ***వర్ష తాప శైత్య రోగాదీనాం అభావాత్, స ఋతుః సుఖ మేవ జనయతి*** - వర్షము, తాపము, శీతము, రోగాదులు ఉండవు కనుక వసంత ఋతువు సుఖాన్ని కలిగిస్తుంది. చెట్లన్నీ పచ్చని కాంతులతో, తరువు లన్నీ ఫలపుష్పాదులతో శోభాయమానంగా గోచరించే ఈ పవిత్ర వసంత ఋతువు లోనే ధర్మరూపుడైన శ్రీరామచంద్రుడు అవతరించాడు. ఈ విధంగా ఎన్నో అద్భుతాలకు ఆలవాలమైన వసంత ఋతువు ఈశ్వర విభూతిగా విరాజిల్లుతూ ఉంది.

ద్యూతం ఛలయతా మస్మి తేజ స్తేజస్వినా మహమ్ ।
జయోఽస్మి వ్యవసాయోఽస్మి సత్త్వం సత్త్వవతా మహమ్ ॥ 36

ద్యూతం-ఛలయతాం-అస్మి-తేజః-తేజస్వినాం-అహం

జయః-అస్మి-వ్యవసాయః-అస్మి-సత్త్వం-సత్త్వవతాం-అహం

అహం	=	నేను	వ్యవసాయః	=	వ్యవసాయము
ఛలయతాం	=	మోసము చేసే వాటిలో	అస్మి	=	అయి ఉన్నాను
ద్యూతం	=	జూదమును	అహం	=	నేను
తేజస్వినాం	=	తేజోవంతుల	సత్త్వవతాం	=	సాత్త్వికుల యొక్క
తేజః	=	తేజస్సును	సత్త్వం	=	సత్త్వగుణమును
జయః	=	జయమును	అస్మి	=	అయి ఉన్నాను
అస్మి	=	అయి ఉన్నాను			

మోసగాళ్ళలో జూదము నేను. తేజోవంతులలో నేను తేజస్సును. నేను జయాన్ని ఉద్యమాన్ని సాత్త్వికులలో సత్త్వము నేనే.

వ్యాఖ్య

మోసాలలో జూదము

ఛలః అంటే మోసము, లేదా వంచన. 'మోసాలలో ***(ఛలయతాం)*** నేను జూదమును ***(ద్యూతం అహం)***' అంటూ జూదాన్ని ఈశ్వర విభూతిగా వర్ణించాడు భగవంతుడు. జూదమును 'అక్షక్రీడ' అన్నది శాస్త్రం. అక్ష క్రీడను ఆడకూడ దని వేదం నిషేధం విధించింది. అలాంటి దానిని తన విభూతిగా భగవంతుడు అభివర్ణిస్తున్నాడు.

సూర్యోదయం కాగానే మంచివే గాక చెడు విషయాలు కూడా కనిపిస్తాయి. మంచిని స్వీకరించాలి. చెడును విస్మరించాలి. అన్నిటికీ ఆది కారణం ఒక్కటే అయినపుడు, దేనిని దేని నుండి వేరు చేయగలం? వేరు చేయ వలసింది ఏదైనా ఉంటే, దానిని మనస్సు నుండి వేరు చేయాలి. అదే ద్యూత ప్రస్తావనలో కేంద్ర విషయం.

జూదము ఆట కాదు. కుట్ర. ఆటైతే వినోదాన్ని పంచాలే గాని గుండెల్లో విషాదాన్ని దించ కూడదు. సుఖా న్నివ్వాలే గాని బ్రతుకుల్ని నాశనం చేయకూడదు. జూదం ఎందరి బ్రతుకుల్ని కాల రాచింది! ఎందరి జీవితాలలో దీపాలు ఆర్పేసింది! ఎన్ని రాజ్యాలను కూల్చేసింది! ఎందరు ప్రభువులను అడవుల పాలు చేసింది!

జూదము ధనాన్ని, ధర్మాన్ని రెండిటిని నశింప చేస్తుంది. జూదములో జయాపజయాలు లేవు. గెలుపు ఓటములు లేవు. అపజయమే ఉంది. అనర్థమే ఉంది. అపకీర్తి మాత్రమే ఉంది.

ఓడిన వాడు గెలిచిన వాడు కాడు, నిజమే. మరి గెలిచిన వాడు గెలిచిన వాడేనా? ఒకరిని దుఃఖానికి గురి చేసి మరొకడు సుఖాన్ని పొందడం వాస్తవానికి సుఖం క్రిందికి వస్తుందా? దుర్యోధనుడు గెలిచి ఏమి సాధించాడు? జూదంలో పాల్గొన్న వాడు ఎవడైనా, బ్రతుకులో ఓడిపోయిన వాడే కాని గెలిచిన వాడు కాడు.

పాకానికి ఉపయోగ పడిన అగ్ని మంచిది. మరి గృహ దహనం చేసిన అగ్ని చెడ్డదా? రెండూ ఒక్కటే కదా! భగవ ద్విభూతియే కదా! దేనిని వినియోగించు కోవాలో, ఎలా వినియోగించు కోవాలో తెలిసి ఉండాలి. అంతే.

జూదము ఈశ్వర విభూతి. దానిని మంచికి వినియోగించు కోవచ్చు. లేదా దారి తప్పి చెడుకు, మోసానికి, వంచనకు వినియోగించు కోవచ్చు. అలా దారి తప్పిన బుద్ధి చేసే వంచనే జూదము. అదే బుద్ధిని భగవంతుని విషయంలో ఉపయోగిస్తే, ఉత్తమ ఫలితాలను అందుకోవచ్చు, పరమాత్మనే గెలుచుకోవచ్చు అని తెలియ చెప్పడమే ద్యూతక్రీడా ప్రసంగము.

తేజోవంతులలో తేజము

తేజము అంటే ప్రభావము. ఎక్కడ ఏ విధమైన ప్రభావము గోచరించినా, అది భగవ ద్విభూతియే. ఆ ప్రభావము విద్యకు సంబంధించింది కావచ్చు, సాహిత్యం కావచ్చు, సంగీతం కావచ్చు, కళ కావచ్చు, నాట్యం కావచ్చు, వక్తృత్వము కావచ్చు, బలం కావచ్చు - ఏ ప్రభావమైనా, దాని యొక్క సమగ్ర స్వరూపమును కలిగి ఉన్న ఈశ్వరుని నుండే అందాలి కనుక తేజోవంతుల లోని తేజము ఈశ్వర విభూతి.

జయ విభూతి

జయము తెలియని వారు లేరు. అపజయ మెరుగని వారూ లేరు. వరద ప్రవాహంలో చిక్కుకొని కొందరు గట్టున పడతారు. కొందరు గుట్టుగా మునిగి పోతారు. గట్టున పడితే జయము. మునిగి పోతే అపజయము. జయాపజయాలలో మునిగి తేలే మానవాళి గొప్ప జయాన్ని పొందితే, ఆ వైభవము పరమేశ్వరునిదై ఉంటుంది. అందుకే అది జయ విభూతి.

ఉద్యమ విభూతి

ప్రయత్నం లేని వారు ఫలితాలను సాధించ లేరు. ప్రయత్నాన్ని 'ఉద్యమం' అంటారు. దానిని ప్రస్తుత శ్లోకంలో **వ్యవసాయః** అంటున్నాడు. సరియైన మార్గంలో చరించడమే ఉద్యమించడము. ఉద్యమము, సాహసము, ధైర్యము, బుద్ధి, శక్తి, పరాక్రమము - ఈ ఆరు లక్షణాలు ఎవరిలో ఉంటాయో, వారికి జయమే గాని అపజయము ఉండదు. ఈ జయ లక్షణాలు కల వారికి దైవ సహాయం ఉంటుంది ***(షడేతే యత్ర వర్తన్తే తత్ర దేవః సహాయకృత్).*** జయ లక్షణాలలో ప్రయత్నము మొదటిది. అది ఈశ్వర విభూతి.

సాత్త్వికులలో సత్త్వము

మాయ త్రిగుణాత్మికము. మాయను ఉపాధిగా కల వాడు ఈశ్వరుడు, లేదా మాయావి. మాయ తన ఉపాధే అయినా, అది తన అధీనంలో ఉంది. మాయలో రజోగుణ ముంది. తమోగుణ ముంది. కాని, అవి పరమేశ్వరునిలో లేవు. భగవంతుడు సర్వజ్ఞుడు కనుక ఆయన సత్త్వ స్వరూపము. శుద్ధ సత్త్వము. ఈ సత్త్వ ప్రభావం చేతనే ఆయన ముల్లోకాలను పాలిస్తున్నాడు.

అలాగే ఎవరైతే రజోగుణ, తమోగుణాల వలలో చిక్కకుండా సత్త్వ ప్రధానులై చరిస్తారో, వారి లోని సత్త్వము ఈశ్వర సంబంధ మైనది కనుక ఆ సత్త్వము ఈశ్వర విభూతి.

వృష్ణీనాం వాసుదేవోఽస్మి పాణ్డవానాం ధనంజయః ।
మునీనా మ ప్యహం వ్యాసః కవీనా ముశనా కవిః ॥ 37

వృష్ణీనాం-వాసుదేవః-అస్మి-పాండవానాం-ధనంజయః
మునీనాం-అపి-అహం-వ్యాసః-కవీనాం-ఉశనా-కవిః

అహం	=	నేను	మునీనాం	=	మునులలో
వృష్ణీనాం	=	యాదవులలో	వ్యాసః	=	వ్యాసుణ్ణి
వాసుదేవః	=	వాసుదేవుణ్ణి	కవీనాం	=	కవులలో
పాండవానాం	=	పాండవులలో	ఉశనాకవిః అపి	=	శుక్రాచార్యుణ్ణి
ధనంజయః	=	ధనంజయుణ్ణి	అస్మి	=	అయి ఉన్నాను

అర్జునా! యాదవులలో నేను వాసుదేవుణ్ణి. పాండవులలో అర్జునుణ్ణి. మహర్షులలో వ్యాసుణ్ణి. కవులలో శుక్రాచార్యుణ్ణి.

వ్యాఖ్య

యాదవులలో వాసుదేవుడు

యాదవులలో వాసుదేవుడు తానే నట. వసుదేవుని కుమారుడు వాసుదేవుడు. ఆయనే శ్రీకృష్ణుడు ***(వసుదేవస్య అపత్యం).*** 'వాసుదేవ' నామంలో రెండు పదా లున్నాయి. రెండు పదాలు ఒకే వ్యక్తిని అభివర్ణిస్తున్నాయి.

వాసుశ్చ అసౌ దేవశ్చ - వాసుదేవః - 'వాసువు', 'దేవుడు' అనే రెండు పదాలు కలిస్తే వాసుదేవుడు. జగత్తులో అందరి హృదయాలలో ఉండేవాడు కనుక ఆయన వాసువు **(వాసుః జగత్యాం సర్వ హృదయే వసతీతి వాసుః).** ప్రళయకాలంలో జగత్తు విలీన మైనపుడు, తానొక్కడే ప్రకాశిస్తాడు కనుక దేవుడు **(దేవః కల్పాంతే దీవ్యతీతి దేవః).** ఈ విధంగా సద్రూపుడై వాసువైన దేవుడు వాసుదేవుడు. గీతను బోధిస్తున్న వాడు.

పాండవులలో ధనంజయుడు

చెప్పే వాడే కాదు, వినే వాడు కూడా తానే నట. అతడే పాండవులలో ధనంజయుడు. అంటే, అర్జునుడు. ***ధనం జయతీతి ధనంజయః -*** రాజసూయ యాగ సమయంలో ధనమును విశేషంగా సాధించుకొని వచ్చాడు కనుక అర్జునుడు ధనంజయుడు. కానీ, ధనమును సాధించిన వాడు ధనమును పొందిన వాడు అవుతాడు. అంతేగాని, ధనమును జయించిన వాడు కాలేదు. కాని, అర్జునుడికి ధన స్పృహ లేదు. కామినీ కాంచనాలు అర్జునుని వశ పరచుకో లేక ఓడి పోయాయి. అందుచేత అర్జునుడు ధనంజయుడు. కనుకనే, గీతను శ్రవణం చేస్తున్నాడు. ప్రాపంచిక వ్యామోహాలు ఉండేవాడు మోక్ష ప్రధానమైన గీతా పీయూషమును పానం చేయలేడు. ఇదంతా ఈశ్వర వైభవము. చెబుతున్న గురువే శిష్యుడై వింటున్న వైనము.

మునులలో వ్యాసముని

చెప్పేవాడు, వినేవాడే కాకుండా వ్రాసేవాడు కూడా తానే నట. అతడే మునులలో వ్యాసముని. ***వ్యాసో నారాయణో హరిః -*** వ్యాసుడు సాక్షాత్తు నారాయణ స్వరూపుడు. సర్వ పదార్థ జ్ఞానం కల వారిలో వ్యాసుడు సాక్షాత్తు భగవంతుడే **(సర్వ పదార్థ జ్ఞానినా మపి అహం వ్యాసః).**

వ్యాసుడు అమోఘమైన జ్ఞాన సంపన్నుడు. వేదములను విభజించి వేదవ్యాసు డయ్యాడు **(వ్యాసః విభజతే).** మహాభారతం, భాగవతం, అష్టాదశ పురాణాలతో సర్వ జ్ఞానము ఆయనకు ఉంది. కనుక ఆయన సర్వజ్ఞుడు.

పాటు బ్రహ్మసూత్రాలు రచించి సూత్రకారు డయ్యాడు. ఇంతటి జ్ఞానం ఉండబట్టే, సాక్షాత్తు భగవంతుడే బోధించిన భగవద్గీతను గ్రంథస్థం చేయ గలిగాడు. భగవద్గీతను బోధిస్తున్న గురువే శిష్యుడుగా ధనంజయుడై శ్రవణం చేస్తూ, తానే వ్యాసుడై గీతను రచించాడు. చెప్పిన వాడు తానే. వినినవాడు తానే. వ్రాసిన వాడూ తానే.

ఉత్తమ పురుషుడుగా వక్త యైన వాసుదేవుడు ***(అహం).*** మధ్యమ పురుషుడుగా శ్రోత యైన ధనంజయుడు ***(త్వం).*** ప్రథమ పురుషుడుగా రచయిత అయిన వ్యాసుడు ***(తత్)*** - అంతా ఏక వచనమే. ఏక రూపమే. ఏక స్వరూపమే. ఏకత్వమే. అద్వైతమే. అందుకే గీత అసమానమై, అద్భుతమై అలరారుతోంది. **భవద్వేషిణీమ్** అంటూ కీర్తింప బడుతోంది.

కవులలో ఉశనుడు

కవి అంటే క్రాంతదర్శి. త్రికాలవేత్త అని అర్థము. అలాంటి కవులు విపశ్చితులు. ఇంద్రియాలకు గోచరించని వాటిని దర్శించే వారు, అంటే అర్థం చేసుకొనే వారు. సూక్ష్మార్థ వివేకులు. అట్టి వారిలో ఉశనా కవి భగవ ద్విభూతి ***(కవీనాం క్రాంత దర్శినాం ఉశనా కవిః అహమస్మి).***

ఉశనాకవి అంటే భృగునందనుడైన శుక్రాచార్యుడు. దైత్యులకు గురువు ***(దైత్యానాం గురుః).*** సదా అసురుల శ్రేయస్సునే వాంఛించే వాడు. అందుచేత అతనికి **ఉశనా కవిః** అనే పేరొచ్చింది ***(ఉశనాః వష్టి ఇచ్ఛతి దైత్య శ్రేయః ఇతి ఉశనాః).*** త్రికాలజ్ఞుడైన శుక్రాచార్యుడు దైత్యుల శ్రేయస్సు కోరుతూ ఉండినా, ఆయన మాట వినని కారణంగా దైత్యులు పరాజితు లయ్యారు. మహాజ్ఞాని అయిన శుక్రాచార్యుడు **శుక్రనీతి** అనే ధర్మశాస్త్రాన్ని కూడా రచించాడు.

దణ్డో దమయతా మస్మి నీతి రస్మి జిగీషతామ్ ।
మౌనం చైవాస్మి గుహ్యానాం జ్ఞానం జ్ఞానవతా మహమ్ ॥ 38

దండః-దమయతాం-అస్మి-నీతిః-అస్మి-జిగీషతాం
మౌనం-చ-ఏవ-అస్మి-గుహ్యానాం-జ్ఞానం-జ్ఞానవతాం-అహం

అహం	= నేను		అస్మి	=	అయి ఉన్నాను
దమయతాం	= దండించే వారిలో		గుహ్యానాం	=	రహస్యములలో
దండః	= దండము		మౌనం చ ఏవ	=	మౌనమును
అస్మి	= అయి ఉన్నాను		జ్ఞానవతాం	=	జ్ఞానము గల వారిలో
•జిగీషతాం	= జయము కోరే వారిలో		జ్ఞానం	=	జ్ఞానమును
నీతిః	= నీతిని		అస్మి	=	అయి ఉన్నాను

అర్జునా! దండించే వారిలో దండాన్ని నేను. జయము కోరే వారిలో నీతిని. రహస్యాలలో నేను మౌనం. జ్ఞానవంతులలో జ్ఞానము నేనే.

వ్యాఖ్య

దండించే వారిలో దండము

సమాజ అభ్యుదయానికి శిక్షణ ఎలా ప్రధానమో, శిక్ష కూడా అలాగే ప్రధానము. క్రమశిక్షణ ఉన్నప్పుడే సమాజం ప్రగతి వైపు నడుస్తుంది. ధర్మాన్ని అతిక్రమించే వారిని శిక్షణలో ఉంచడానికి ఉపయోగపడే శిక్షా కార్యము లేదా దండన క్రియ భగవ దైశ్వర్యమే. నియతిని కాపాడుతూ ఉంది కనుక అది విభూతి.

శిక్షణ నివ్వడానికి లేదా శిక్షించడానికి ధర్మశాస్త్రా లున్నాయి. ధర్మం దైవ స్వరూపము కనుక ధర్మ

శాస్త్రాల రూపంలో ఉన్నది కూడా దైవమే. దైవ విభూతియే. కనుక, దండనీతి భగవ త్స్వరూపము.

దండము అనే పదానికి రెండు అర్థా లున్నాయి. ***దండయతీతి దణ్డః*** - అంటే దండించువాడు. ***దండోఽస్యాస్తీతి దండః*** - అంటే దండము చేతిలో కలవాడు అని అర్థము. దండించేవాడు, దండనక్రియ, దండనీతి - అన్నీ సమాజ కళ్యాణానికి దోహద పడుతున్నాయి కనుక అవన్నీ ఈశ్వర వైభవాలే.

జయించే వారిలో నీతి

జయించాలి అనే కోరిక గల వారిలో ***(జిగీషతాం జేతుమ్ ఇచ్ఛతామ్)*** భగవంతుడు నీతి ***(నీతిః).*** నీతి అంటే న్యాయము. ఆచార వ్యవహారాలలో పాటించ వలసిన ధర్మము. జయము కోరే వారికి జయోపాయం తెలియాలి. న్యాయం తప్పకుండా, ధర్మం తప్పకుండా ప్రవర్తించడమే జయానికి ఉపాయము. **ధర్మ మేవ జయతే** - ధర్మానికి జయమే కాని అపజయం తెలియదు. రాజదండము ఎంత ప్రధానమో, రాజనీతి కూడా అంత ప్రధానము. దండనీతి - రాజనీతి పరస్పరాధీనంగా ఉంటాయి. కనుక అవి ఈశ్వర విభూతులు.

రహస్యాలలో మౌనం

రహస్యాలను రక్షించుకోవడానికి మౌనమే ఉపాయము. అందుచేత గోపన హేతువైన మౌనం ఈశ్వర విభూతి. కొందరు విలువైన సంపదలను దాచుకుంటారు. అది రక్షణ అని భావిస్తారు. కాని, మౌనం అలవడని కారణంగా వారికి తెలియకుండానే రహస్యాన్ని బహిర్గతం చేసి, దొంగతనానికి అవకాశ మిచ్చి, ఆ తరువాత దాచుకున్నది పరులు దోచుకు పోయారని దుఃఖిస్తూ కూర్చుంటారు. దాచుకున్నది ఎంత విలువైన దైనా కావచ్చు. దానిని రక్షించుకోవడానికి ఉపయోగపడే మౌనము అంతకన్నా విలువైనది. అట్టి మౌనము ఈశ్వర విభూతి ***(గుహ్యానాం మౌనం అహమస్మి).***

దైవ విభూతి కావడం చేత మౌనం దివ్యమైన ఫలితాలను ప్రసాదిస్తుంది. మౌనంగా ఉండ గలిగితే కలహాలు తలెత్తవు. అపార్థాలు అగుపించవు. అసత్య భాషణం ఉండదు. కాలహరణం జరగదు. నిన్ను నీవు చూసుకొనే అవకాశం కలుగుతుంది. ఘర్షణలు బాహ్యంలో ఉండవు కనుక ఆంతర్యం కూడా ప్రశాంతంగా ఉంటుంది.

జ్ఞానవంతులలో జ్ఞానము

జ్ఞానులలో జ్ఞానము పరమేశ్వరుడే. ఇక్కడ జ్ఞానము అంటే మోక్షసాధన మైన జ్ఞానము. ఆత్మయే బ్రహ్మము అనే బ్రహ్మాత్మైక్య విషయ జ్ఞానము. సర్వ అజ్ఞాన విరోధి అయిన జ్ఞానము. సాక్షాత్కార రూప జ్ఞానము. ఈశ్వరుడు, ఈశ్వర జ్ఞానము వేరు కానందున, జ్ఞానవంతుల హృదయాలలో నిక్షిప్తమై ఉన్న ఆత్మజ్ఞానము ఈశ్వర విభూతియే.

యచ్చాపి సర్వభూతానాం బీజం తదహ మర్జున ।
న తదస్తి వినా యత్స్యా న్మయా భూతం చరాచరమ్ ॥ 39

యత్-చ-అపి-సర్వభూతానం-బీజం-తత్-అహం-అర్జున
న-తత్-అస్తి-వినా-యత్-స్యాత్-మయా-భూతం-చరాచరం

అర్జున	=	అర్జునా!	బీజం	=	ఉత్పత్తి కారణము
సర్వభూతానాం	=	సకల భూతములకు	తత్ అపి చ	=	అది కూడా
యత్	=	ఏది	అహం	=	నేనే

యత్	= ఏ	స్యాత్	= అగునో
చరాచరం	= చరాచర రూపమైన	తత్	= అట్టిది
భూతం	= భూతసమూహము	న అస్తి	= లేదు
మయా వినా	= నేను లేకుండా		

అర్జునా! సర్వ ప్రాణుల పుట్టుకకు కారణమైన బీజము నేనే. ఈ చరాచర ప్రపంచంలో నేను లేని వస్తువే లేదు.

వ్యాఖ్య

పరమేశ్వరుని విభూతులు దివ్యములని భగవంతుడే స్వయంగా చెప్పాడు **(దివ్యాహ్యాత్మ విభూతయః).** దివ్యమైన ఈశ్వర విభూతులను పరమేశ్వరుని నుండే ఆలకించ గలగడం గీతా భక్తుల అదృష్టము. ఇరవయ్యవ శ్లోకంలో విభూతుల వర్ణనమును ప్రారంభించి ఏకధాటిన ఇరవై శ్లోకాలలో వాటిని వివరించిన గీతాచార్యుడు, సర్వ విభూతుల సారంగా బీజ విభూతిని గూర్చి ప్రవచించి ఈ శ్లోకం వద్ద విభూతులను సమాప్తం చేస్తున్నాడు.

బీజ విభూతి

బీజము అంటే విత్తనము. కారణాన్ని బీజము అంటారు. మొలకెత్తే శక్తి బీజంలో ఉంటుంది. అలాగే సర్వ భూతాలకు ప్రరోహ కారణమైన భగవానుడు సృష్టికి ఆదిబీజము. ఆయన నుండే సృష్టి ఆవిర్భవించింది. ఈ సృష్టిలో ఉన్నదంతా ఈశ్వర జ్ఞానమే. అందుచేత, ఆది బీజమైన భగవంతుడు ఈ సృష్టికి నిమిత్త కారణ మయ్యాడు.

నిద్రించి నపుడు మనం స్వప్న ప్రపంచాన్ని సృష్టించు కుంటాము. మనం సృష్టించుకొనే కలను ఏ వస్తువుతో తయారు చేసుకుంటాము? మన జ్ఞానం తోనే సృష్టించు కుంటాము. మనది కాని విషయం కలలో లేదు. కల లోని జ్ఞానము మనదే కనుక, మన కల మనకే అర్థ మవుతుంది. ఒకరి కల మరొకరికి అర్థం కాదు.

కల లోని విషయాలన్నీ మార్పు చెందు తున్నాయి. మేలుకున్న తరువాత లేకుండా పోతున్నాయి. అయినా, కలకు సంబంధించిన జ్ఞానము మన కుంది. కల మార్పు చెందినా, మేలుకున్న తరువాత మాయమైనా, కలగన్న నాలో, నీలో ఏ మార్పు లేదు. కలను తయారు చేసుకోవడానికి మనం మారలేదు. కలలో ఏవేవి జరుగుతున్నా, మనలో ఏ మార్పు లేదు. మేలుకున్న తరువాత కల లోని నామరూపాలు మాయమై పోయినా మనం మారలేదు.

కల గనే టప్పుడు కలలో ఉన్నది మన చైతన్యమే. మన జ్ఞానమే. మన జ్ఞానమే ఏ విధమైన మార్పుకు లోను కాకుండా కల కనడానికి కారణమైంది. బీజమైంది. అంటే, సంభవ కారణమైంది.

అలాగే, ఈశ్వర జ్ఞానమే తనలో ఏ విధమైన మార్పు లేకుండా ప్రపంచ సృష్టి, స్థితి, లయాలకు కారణమైంది. అందుచేత, చెట్టుకు కారణం విత్తన మైనట్లు, సర్వ భూతాల ఉత్పత్తికి పరమేశ్వరుడు బీజ మయ్యాడు. కారణ మయ్యాడు. కాకపోతే, చెట్టుకు కారణమైన బీజము అంకురించిన తరువాత నశిస్తుంది. కాని, పరమేశ్వరుడు అవ్యయుడు కనుక నశించడు. కలకు బీజమైన మన చైతన్యము, కల కారణంగా ఎలా నశించడం లేదో, సృష్టికి బీజమైన పరమేశ్వరుడు సృష్టి కార్యం వల్ల నశించడం లేదు. అందుచేత, ఆయన అవ్యయ బీజము అని తొమ్మిదవ అధ్యాయంలో అర్థం చేసుకున్నాం *(9 - 18).*

అనన్య విభూతి

స్వప్నానికి కారణమైన మన జ్ఞానము స్వప్నంలో లేని దెక్కడ? ఎక్కడైనా లేదు అని చెబితే, స్వప్నం లేదు అని చెప్పినట్లే అవుతుంది. స్వప్నంలో అంతటా స్వప్న ద్రష్ట జ్ఞానమే ఉంది. ఒకవేళ మన జ్ఞానం లేకుండానే స్వప్నం నడుస్తూ ఉంది అంటే, మేలుకున్న వాడు కల గంటున్నాడు అని చెప్పినట్లే అవుతుంది. అది సాధ్య

మేనా? పగటి కలలు, ఊహాలోకాలు మేలుకున్న వాని ఊహలే గాని, కల లోని విషయాలు కావు. కనుక ?ల గనే వాని జ్ఞానం లేకుండా, కలలో ఏ దృశ్యమూ ఉండలేదు.

అర్జునా! ఏది నేను లేకుండా ఉంటుందో **(యన్మయా వినాస్యాత్),** అట్టిది **(తత్)** లేనే లేదు **(న అస్తి).** నేను ఉంటేనే ఏదైనా ఉంటుంది. నేను లేకుండా ఏదైనా ఉన్నది అంటే, అది వాస్తవానికి లేనిదే **(మయా వినా యత్ భూతం చరాచరం స్యాత్, తన్నాస్తి).** దాని అర్థం ఏమిటి? అంతా సదాత్మకమే, మదాత్మకమే నని **(అతః మదాత్మకం సర్వం స్యాత్).** ఇదే విభూతి వైభవము. విభూతి యోగము. యోగవిభూతి.

ఇంత వైభవంగా ప్రవచించినా, తాను చెప్పిన దంతా ఏకదేశమే నట. వినండి.

నాన్తోఽస్తి మమ దివ్యానాం విభూతీనాం పరంతప ।
ఏష తూద్దేశతః ప్రోక్తో విభూతే ర్విస్తరో మయా ॥ 40

న-అంతః-అస్తి-మమ-దివ్యానాం-విభూతీనాం-పరంతప
ఏషః-తు-ఉద్దేశతః-ప్రోక్తః-విభూతేః-విస్తరః-మయా

పరంతప	= అర్జునా!	ఏష తు	= ఇది
మమ	= నా యొక్క	మయా	= నా చేత
దివ్యానాం	= దివ్యములైన	విభూతేః	= విభూతి యొక్క
విభూతీనాం	= విభూతులకు	విస్తరః	= వివరణము
అంతః	= అంతము	ఉద్దేశతః	= సంక్షేపముగ
న అస్తి	= లేదు	ప్రోక్తః	= చెప్పబడినది

పరంతపా! అర్జునా! నా విభూతులు దివ్యములు. వాటికి అంతము లేదు. ఏదో నామ మాత్రంగా కొన్ని విభూతుల్ని వివరించాను.

వ్యాఖ్య

ముగింపు లేదు - ఇక ముగిస్తాను

దివ్యములైన **(దివ్యానామ్)** నా విభూతులకు **(మమ విభూతీనామ్)** అంతము లేదు **(అన్తః నాస్తి)** అంటున్నాడు భగవానుడు.

'అర్జునా! నువ్వు అడిగావు కనుక నా విభూతులను వివరించడానికి ప్రారంభించాను. చెప్పాను. ఎంత చెప్పినా విభూతులు సమాప్తం కావడం లేదు. సంక్షేపంగా చెప్ప గలిగానే గాని సంపూర్ణంగా చెప్పలేక పోయాను. విభూతులు సమాప్త మయ్యేలా లేవు. అందుకని, నేనే విభూతి యోగాన్ని సమాప్తం చేస్తున్నా' అంటున్నాడు.

నిజమే కదూ? ఆయన బోధించేవి ఎవరి విభూతులు? ఆయన విభూతులే. ఆయనకు అంత ముందా? ఎలా ఉంటుంది? ఆయన అనంతుడు కదా! ఆయనకు ఎలా అంతం లేదో, ఆయన విభూతులకు కూడా అంతం లేదు.

అంతా చెప్పడానికి విభూతులకు అంతం లేదు కాబట్టి, 'అ' తరువాత వచ్చేది 'ఇ' కనుక, 'ఇంత' అని చెప్పి అంతా చెప్పేసినట్లు చెయ్యి దులుపు కుంటున్నాడు. ఇదేమి చోద్యము? 'అంతా' చెబుతానని 'ఇంతే' అనడము!

ఇంతే అంటే అంతా చెప్పినట్లే. 'ఇంతే' (విభూతి) సంగతులు అనడం లేదు. ఇంతవరకు మాత్రమే చెప్ప

గలిగాను అంటున్నాడు. **ఇయత్తా** అంటే ఇంత. 'ఉన్నది ఇంతే' అనడం లేదు. 'చెప్ప గలిగింది ఇంతే' అంటున్నాడు.

ఇంతే అని సరిపెట్టలేను

ఇంత మాత్రమే అని సరిపెట్టుకో!

'అర్జునా! విస్తారంగా విభూతులను చెప్పి వాటిని సరిపెట్టలేను. నిన్ను సంతృప్తి పరచనూ లేను. కొంతవరకు చెప్పాను ***(ఉద్దేశతః ఏకదేశేన ప్రోక్తః).*** అంతటితో నీవే సరిపెట్టుకో' అంటున్నాడు అచ్యుతుడు.

వినే వాడు మాత్రం తక్కువ తిన్నాడా! చెప్పలేను అని ఇప్పుడు అంటున్నావు. చెప్పలేని దానిని మొద లెట్టడం దేనికి? నేను అడిగాను కనుక చెప్పాను అంటున్నావు. అడగటం నా వంతు. నేను అడిగాను. చెప్పలేను అని ఇప్పుడు చెప్పినట్లు, అప్పుడే నాతో చెప్పి ఉండొచ్చుగా! తగుదునమ్మా! అంటూ తంబుర శ్రుతి చేయడ మెందుకు? కథ మొదలెట్టి అడివికి చేర్చి, ఆ తరువాత తెలియదంటే ఇంటికి చేరే దెలా? ఏం చేద్దాం! చెప్పే వాడికి వినేవాడు లోకువ అనే సామెత ఊరకే ఊడి పడిందా?

ఓరీ, పిచ్చి పార్థా! నీకు సవిస్తరంగా చెబుతాను అని నే నెప్పుడన్నాను? నేను ఏం మాట్లాడానో ఒకసారి టేపు రీవైండ్ చేసుకొని మళ్ళీ విను! నా విభూతులకు అంతము లేదు, ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని చెబుతాను అని ముందుగా చెప్పే కదా విభూతి ప్రసంగం ప్రారంభించాను *(10 వ అ - 19 వ శ్లో).* అన్నీ చెబుతాను అని నేను అనలేదు. కొన్ని విభూతులను మాత్రమే చెప్పి, అసలు ఈశ్వర విభూతిని ఈ విశ్వంలో ఎలా గుర్తించాలో, గ్రహించాలో, దర్శించాలో తెలియ చేద్దామనే ఉద్దేశం తోనే ప్రసంగం ప్రారంభించాను. అనుకున్నది అయిపోయింది, ముగింపు పలికాను. అర్థమైందా!

మరి, భగవద్విభూతిని గుర్తించేది ఎలా? చెబుతాను, విను!

యద్య ద్విభూతిమ త్సత్త్వం శ్రీమ దూర్జిత మేవ వా ।
తత్త దే వావగచ్ఛ త్వం మమ తేజోऽంశ సమ్భవమ్ ॥ 41

యత్-యత్-విభూతిమత్-సత్త్వం-శ్రీమత్-ఊర్జితం-ఏవ-వా

తత్-తత్-ఏవ-అవగచ్ఛ-త్వం-మమ-తేజోऽంశసంభవం

విభూతిమత్ = విభూతియుక్త మైనది		మమ =	నా యొక్క
శ్రీమత్ = కాంతియుతము		తేజోऽంశసంభవం ఏవ =	తేజస్సు యొక్క అంశము వలన కలిగినదే
ఊర్జితం ఏవ వా = ఉత్సాహముతో గూడినది		త్వం =	నీవు
యత్ యత్ = ఏయే		అవగచ్ఛ =	తెలుసుకో!
సత్త్వం = సత్త్వము			
తత్ తత్ = అది అంతయు			

పార్థా! దేనిలో వైభవ ముందో, దేనిలో ఐశ్వర్య ముందో, దేని యందు ఉత్సాహం అతిశయించి ఉందో - అవన్నీ నా తేజస్సు లోని అంశాలే నని తెలుసుకో!

వ్యాఖ్య

కొండంత దేవుణ్ణి కళ్ళతో చూచే దెలా? కొండ అద్ద మందు కొంచెమై ఉండదా! అనే సూక్తిని ఆధారం చేసుకొని కొండకు అభిముఖంగా అద్దం పెట్టి చూడటమే. స్థాలీపులాక న్యాయం ఉండనే ఉంది కదా! అన్నం

ఉడికిందో, లేదో తెలి యడానికి మెతుకు మెతుకు చేతికి అతుక్కోవాలా? ఒక్కటి పట్టుకుంటే సరిపోదా! ***ఈశావాస్య మిదం సర్వం . . . బ్రహ్మైవేదం సర్వం -*** ఈశ్వరుడు కాని దేముంది? ముందు వైభవాల్లో ఈశ్వరుణ్ణి చూడ గలిగితే, ఆ తరువాత అంతటా చూడవచ్చు.

అదిగో సౌందర్య విభూతి! అదిగదిగో పరాక్రమ విభూతి! ఇదిగో జ్ఞాన విభూతి! ఇదిగిదిగో ప్రేమ విభూతి! అల్లదిగో త్యాగ విభూతి! అది - ఇది అననేల? అన్నీ ఈశ్వర విభూతులే. పరమేశ్వరు డనే సాగరంలో ఎగిసిపడే అలలే. మరి, వైభవాలు విభూతు లైతే, వైభవం లేని జడాల విషయ మేమిటి? అవి కూడా విభూతులే. జడ విభూతులే. ఎక్కడైనా కూర్చుని పడుకోవాలి. ముందుగా ప్రభావము గల వాటిలో చూడ గలిగితే, ఆ తరువాత అంతటా దర్శించ వచ్చు.

పల్లవి: నీవే - నీవే - నీవే - నీవే - నీవే
నా యెద కదిపిన కళ నీవే ॥ నీవే ॥
చరణము: ప్రేమలు ప్రాకిన పందిరి నీవే
కలలు కరిగితే ముందర నీవే
బ్రతుకు లోని అందము నీవే
అందీ అందని చందము నీవే ॥ నీవే ॥

అని ఈశ్వర వైభవాన్ని నోరార పలికింది చైతన్య గీతిక.

పరమేశ్వర వైభవము వాస్తవానికి జగత్తుకు అతీతంగా ఉంది అంటూ సమాప్తం చేస్తున్నాడు.

అథవా బహు నైతేన కిం జ్ఞాతేన తవార్జున ।
విష్ట భ్యాహ మిదం కృత్స్న మేకాంశేన స్థితో జగత్ ॥ 42

అథవా-బహునా-ఏతేన-కిం-జ్ఞాతేన-తవ-అర్జున

విష్టభ్య-అహం-ఇదం-కృత్స్నం-ఏకాంశేన-స్థితః-జగత్

అర్జున = అర్జునా!		అహం =	నేను
అథవా = ఇంతేగాక		ఇదం =	ఈ
బహునా = విశేషమైన		కృత్స్నం =	సమస్తమైన
ఏతేన = ఈ		జగత్ =	జగత్తును
జ్ఞాతేన = తెలియడం చేత		ఏకాంశేన =	ఒక అంశము చేతనే
తవ = నీకు		విష్టభ్య =	వ్యాపించి
కిం = ఏమి లాభము		స్థితః =	ఉన్నాను

అర్జునా! ఇలా విశేషంగా తెలుసుకోవడం వల్ల నీకు ఒరిగే దేముంటుంది? నా ఒక్క అంశం చేత ఈ ప్రపంచ మంతా నేను వ్యాపించి ఉన్నాను.

వ్యాఖ్య

ఈశ్వరుని విభూతులను అద్భుతంగా వివరించి, చివరగా, ఇవన్నీ తెలియడం వల్ల నీకు ఏమి ప్రయోజనం? అని **కిం** పద ప్రయోగం చేశాడు. ఇక్కడ **కిం** శబ్దము ఎంతో చెబుతుంది.

ఎంత విన్నా, ఎంత కాలం విన్నా, ఎంత తెలిసినా, ఎన్ని తెలిసినా, విన వలసిందే మిగిలి ఉండే టప్పుడు,

తెలిసిన దాని కన్నా తెలుసుకోవలసిందే అధికంగా ఉండే టప్పుడు, వినడం లేదా తెలుసుకోవడం వల్ల ప్రయోజన మేమిటి? అనేది ***కిం*** పదం సంధించే ప్రశ్న.

విభూతు లన్నీ జగత్తు లోనే ఉన్నాయి. జగత్తు తనలో ఒక అంశమే నట. ***పాదోఽస్య విశ్వా భూతాని త్రిపాదస్యామృతం దివి*** అని కదా వేదం లోని పురుష సూక్తము! ఎంత తెలిసినా సశేషమే మిగిలే టప్పుడు తెలుసుకొని ప్రయోజన మేమిటి? ***(కిమ్?).*** సశేషం కనుక తెలుసుకో నవసరం లేదు అనేదే గనుక భగవంతుని అభిమత మైతే, విభూతి యోగాన్ని ఎందుకు చెబుతాడు? ***(కిమ్?).*** ఎంత తెలిసినా సశేషమే కనుక, నిశ్శేషంగా తెలుసుకొనే మార్గం చెబుతాను అంటున్నాడు. ఏమిటది? ఈ జగత్తు నా ఒక్క అంశమే. కనుక ఇవన్నీ దేని విభూతులో, దేనిలో జగత్తు కేవలం ఒక భాగమో, దాని నొక్క దానిని తెలుసుకోవడమే నిశ్శేషంగా తెలుసు కోవడము అవుతుంది అంటున్నాడు.

అనంతమైన ఆ పరమాత్మ స్వరూపము తెలిసి నపుడు, ఏకాంశమైన ఈ విభూతులను తెలుసుకొని ప్రయోజన మేముంది? ***(కిమ్?).*** అనంత పరబ్రహ్మము తెలియ నపుడు ఇవన్నీ తెలుసుకొని మాత్రం ప్రయోజన మేమిటి? ***(కిమ్?).*** కనుక, తెలియ వలసింది, తెలియదగింది ఒక్క నిర్విశేష పరబ్రహ్మమే అనేది విభూతియోగ సారము.

బ్రహ్మాత్మ జ్ఞానము బుద్ధి యందు స్థిరపడాలి. మనస్సు బాహ్యంలో చరించ వలసి వచ్చినా, చలించకుండా ఉండేందుకు, కేవలం పరమాత్మ జ్ఞానమే, పరమాత్మ దృష్టియే ముముక్షువులో నిలిచి ఉండేందుకు, ప్రత్యేకించి ఈ విభూతి యోగము చెప్పబడింది.

శ్లో॥ ***ఇంద్రియ ద్వారత శ్చిత్తే బహిర్ధావతి సత్యపి।***
ఈశ దృష్టి విధానాయ విభూతీ ర్దశమేఽబ్రవీత్ ॥

చంచలమైన చిత్తము ఇంద్రియాల ద్వారా బహిర్ముఖమైనా, ఆయా బాహ్య విషయాల యందు కూడా ఈశ్వర భావననే స్థిరపరచు కొనేందుకు ఈ విభూతి యోగము అనే పదవ అధ్యాయము చెప్పడం జరిగింది అని శ్రీధరీయం.

ఓం నమో భగవతే వాసుదేవాయ

ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం
యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే విభూతి యోగో నామ దశమోఽధ్యాయః

ఈ విధంగా ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రము, శ్రీకృష్ణార్జున సంవాదము అయిన భగవద్గీత యందు విభూతి యోగ మనే పదవ అధ్యాయము.

చైతన్య భగవద్గీత

అథ ఏకాదశోఽధ్యాయః - పదకొండవ అధ్యాయము

విశ్వరూప సందర్శన యోగః - విశ్వరూప సందర్శన యోగము

విశ్వ - రూప - సందర్శన - యోగము

విశ్వమును విశ్వరూపునిగా దర్శించే ఉపాయమే విశ్వరూప సందర్శన యోగము. ఈ అధ్యాయం పేరులో నాలుగు పదాలున్నాయి. ఈ నాలుగు పదాలూ మనకు అర్థం కావలసి ఉంది.

ఇక్కడ ప్రధానంగా జరిగే 'సందర్శనము' అనే అనుభవము రూప దర్శనమా? లేక స్వరూప దర్శనమా? ఇక్కడ 'విశ్వరూపము'ను దర్శించడం అంటే, విశ్వము యొక్క రూపమును దర్శించడమా? లేక విశ్వములో విశ్వేశ్వరుని దర్శించడమా? లేక విశ్వేశ్వరునిలో విశ్వమును దర్శించడమా?

విశ్వము - విశ్వరూపము

వివిధ ప్రత్యయ గమ్యం విశ్వమ్ - అనేక విషయాలను కలిగి ఉన్నది, ఆ విషయాలకు సంబంధించిన పరిజ్ఞానంతో అర్థ మయ్యేదే విశ్వము. ప్రపంచ మంతా కలిస్తేనే విశ్వము. విశ్వమే అలా ఉండే టప్పుడు ఇక విశ్వం కన్నా వేరుగా వ్యక్తి లేడు, ఉండలేడు అని ప్రత్యేకించి చెప్ప నవసరం లేదు.

ఇంతవరకు, విశ్వాన్ని అర్థం చేసుకొనే ప్రయత్నంలో విశ్వాన్ని నిర్వచించి చెప్పుకున్నాం. ఇకపోతే, విశ్వం యొక్క అర్థం విశ్వం లోనే ఉందా? విశ్వము యొక్క పరమార్థం విశ్వమేనా? అనే సందేహం ఉదయించి నపుడు విశ్వం యొక్క అర్థం విశ్వంలో లేదేమో అనిపిస్తుంది.

ఐతదాత్మ్యం ఇదం సర్వం - నాయనా! శ్వేతకేతూ! ఈ సమస్త ప్రపంచము యొక్క అర్థము, లేక సత్యరూపము సద్వస్తువు లోనే, అంటే పరమాత్మ లోనే ఉంది అంటూ, అద్భుతమైన విషయాన్ని ఆవిష్కరించాడు ఛాందోగ్యోపనిషత్తులో ఉద్దాలక మహర్షి *(ఛాం : 6 - 9 - 4)*. మట్టిపాత్రలు ఎన్నున్నా, వాటి యొక్క అర్థం మట్టి లోనే ఉన్నట్లు, వివిధ ప్రత్యయ గమ్యమైన విశ్వం యొక్క అర్థం విశ్వరూపుని లోనే ఉంది. విరాడ్రూపుని లోనే ఉంది. విరాట్పురుషుని లోనే ఉంది.

వివిధం రాజతే ఇతి విరాట్ - వివిధ రూపాలలో గోచరించే వాడు కావడం చేత ఆయన విరాట్పురుషుడు. ఆయన విశ్వమంతా వ్యాపించి ఉన్నాడు ***(విశ్వతః వృత్వా వ్యాప్య).*** రూపాన్ని, కాలాన్ని, దేశాన్ని, దేనినీ వదలకుండా వ్యాపించి ఉన్నాడు అని అర్థము. మట్టి పాత్రలలో ఉన్నదంతా మట్టే అయినా, అవి వివిధములైన నామరూపాలతో తెలుస్తున్నాయే గాని, అద్వయమైన మట్టిగా అర్థం కావడం లేదు. భిన్నత్వం లోని ఏకత్వం అనుభవానికి అందడం లేదు. భిన్నత్వాన్ని చూడటం దర్శన మైతే, భిన్నత్వంలో ఏకత్వాన్ని వీక్షించడం సందర్శనము ***(సందర్శనం, సమ్యక్ దర్శనం).*** అనేక రూపాలతో గోచరించే ఈ విశ్వమును ఏకరూపుడైన విశ్వమూర్తిలో దర్శించాలనే ఆశ అర్జునునిలో కలిగింది. ఆ ఆశే అద్భుతమైన ఒక అధ్యాయానికి శ్రీకారం చుట్టింది.

ఆశ అయితే బాగానే ఉంది. కానీ వివిధ ప్రత్యయ గమ్యమైన విశ్వము అర్జునునికి కనిపిస్తూనే ఉంది కదా! ఒక వైపు విశ్వం కళ్ళెదుట కదులుతూ ఉండినా, ప్రత్యేకంగా విశ్వరూపాన్ని చూడా లంటాడు ఎందుకని?

తెలిసిన దాని కన్నా తెలుసుకోవలసిందే అధికంగా ఉండే టప్పుడు, వినడం లేదా తెలుసుకోవడం వల్ల ప్రయోజన మేమిటి? అనేది ***కిం*** పదం సంధించే ప్రశ్న.

విభూతు లన్నీ జగత్తు లోనే ఉన్నాయి. జగత్తు తనలో ఒక అంశమే నట. ***పాదోఽస్య విశ్వా భూతాని త్రిపాదస్యామృతం దివి*** అని కదా వేదం లోని పురుష సూక్తము! ఎంత తెలిసినా సశేషమే మిగిలే టప్పుడు తెలుసుకొని ప్రయోజన మేమిటి? ***(కిమ్?).*** సశేషం కనుక తెలుసుకో నవసరం లేదు అనేదే గనుక భగవంతుని అభిమత మైతే, విభూతి యోగాన్ని ఎందుకు చెబుతాడు? ***(కిమ్?).*** ఎంత తెలిసినా సశేషమే కనుక, నిశ్శేషంగా తెలుసుకొనే మార్గం చెబుతాను అంటున్నాడు. ఏమిటది? ఈ జగత్తు నా ఒక్క అంశమే. కనుక ఇవన్నీ దేని విభూతులో, దేనిలో జగత్తు కేవలం ఒక భాగమో, దాని నొక్క దానిని తెలుసుకోవడమే నిశ్శేషంగా తెలుసు కోవడము అవుతుంది అంటున్నాడు.

అనంతమైన ఆ పరమాత్మ స్వరూపము తెలిసి నపుడు, ఏకాంశమైన ఈ విభూతులను తెలుసుకొని ప్రయోజన మేముంది? ***(కిమ్?).*** అనంత పరబ్రహ్మము తెలియ నపుడు ఇవన్నీ తెలుసుకొని మాత్రం ప్రయోజన మేమిటి? ***(కిమ్?).*** కనుక, తెలియ వలసింది, తెలియదగింది ఒక్క నిర్విశేష పరబ్రహ్మమే అనేది విభూతియోగ సారము.

బ్రహ్మాత్మ జ్ఞానము బుద్ధి యందు స్థిరపడాలి. మనస్సు బాహ్యంలో చరించ వలసి వచ్చినా, చలించకుండా ఉండేందుకు, కేవలం పరమాత్మ జ్ఞానమే, పరమాత్మ దృష్టియే ముముక్షువులో నిలిచి ఉండేందుకు, ప్రత్యేకించి ఈ విభూతి యోగము చెప్పబడింది.

శ్లో॥ ఇంద్రియ ద్వారత శ్చిత్తే బహిర్ధావతి సత్యపి ।
ఈశ దృష్టి విధానాయ విభూతీ ర్దశమేఽబ్రవీత్ ॥

చంచలమైన చిత్తము ఇంద్రియాల ద్వారా బహిర్ముఖమైనా, ఆయా బాహ్య విషయాల యందు కూడా ఈశ్వర భావననే స్థిరపరచు కొనేందుకు ఈ విభూతి యోగము అనే పదవ అధ్యాయము చెప్పడం జరిగింది అని శ్రీధరీయం.

ఓం నమో భగవతే వాసుదేవాయ

ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం
యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే విభూతి యోగో నామ దశమోఽధ్యాయః

ఈ విధంగా ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రము, శ్రీకృష్ణార్జున సంవాదము అయిన భగవద్గీత యందు విభూతి యోగ మనే పదవ అధ్యాయము.

చైతన్య భగవద్గీత

అథ ఏకాదశోఽధ్యాయః - పదకొండవ అధ్యాయము

విశ్వరూప సందర్శన యోగః - విశ్వరూప సందర్శన యోగము

విశ్వ - రూప - సందర్శన - యోగము

విశ్వమును విశ్వరూపునిగా దర్శించే ఉపాయమే విశ్వరూప సందర్శన యోగము. ఈ అధ్యాయం పేరులో నాలుగు పదాలున్నాయి. ఈ నాలుగు పదాలూ మనకు అర్థం కావలసి ఉంది.

ఇక్కడ ప్రధానంగా జరిగే 'సందర్శనము' అనే అనుభవము రూప దర్శనమా? లేక స్వరూప దర్శనమా? ఇక్కడ 'విశ్వరూపము'ను దర్శించడం అంటే, విశ్వము యొక్క రూపమును దర్శించడమా? లేక విశ్వములో విశ్వేశ్వరుని దర్శించడమా? లేక విశ్వేశ్వరునిలో విశ్వమును దర్శించడమా?

విశ్వము - విశ్వరూపము

వివిధ ప్రత్యయ గమ్యం విశ్వమ్ - అనేక విషయాలను కలిగి ఉన్నది, ఆ విషయాలకు సంబంధించిన పరిజ్ఞానంతో అర్థ మయ్యేదే విశ్వము. ప్రపంచ మంతా కలిస్తేనే విశ్వము. విశ్వమే అలా ఉండే టప్పుడు ఇక విశ్వం కన్నా వేరుగా వ్యక్తి లేడు, ఉండలేడు అని ప్రత్యేకించి చెప్ప నవసరం లేదు.

ఇంతవరకు, విశ్వాన్ని అర్థం చేసుకొనే ప్రయత్నంలో విశ్వాన్ని నిర్వచించి చెప్పుకున్నాం. ఇకపోతే, విశ్వం యొక్క అర్థం విశ్వం లోనే ఉందా? విశ్వము యొక్క పరమార్థం విశ్వమేనా? అనే సందేహం ఉదయించి నపుడు విశ్వం యొక్క అర్థం విశ్వంలో లేదేమో అనిపిస్తుంది.

ఐతదాత్మ్యం ఇదం సర్వం - నాయనా! శ్వేతకేతూ! ఈ సమస్త ప్రపంచము యొక్క అర్థము, లేక సత్యరూపము సద్వస్తువు లోనే, అంటే పరమాత్మ లోనే ఉంది అంటూ, అద్భుతమైన విషయాన్ని ఆవిష్కరించాడు ఛాందోగ్యోపనిషత్తులో ఉద్దాలక మహర్షి *(ఛాం : 6 - 9 - 4).* మట్టిపాత్రలు ఎన్నున్నా, వాటి యొక్క అర్థం మట్టి లోనే ఉన్నట్లు, వివిధ ప్రత్యయ గమ్యమైన విశ్వం యొక్క అర్థం విశ్వరూపుని లోనే ఉంది. విరాడ్రూపుని లోనే ఉంది. విరాట్పురుషుని లోనే ఉంది.

వివిధం రాజతే ఇతి విరాట్ - వివిధ రూపాలలో గోచరించే వాడు కావడం చేత ఆయన విరాట్పురుషుడు. ఆయన విశ్వమంతా వ్యాపించి ఉన్నాడు ***(విశ్వతః వృత్వా వ్యాప్య).*** రూపాన్ని, కాలాన్ని, దేశాన్ని, దేనినీ వదలకుండా వ్యాపించి ఉన్నాడు అని అర్థము. మట్టి పాత్రలలో ఉన్నదంతా మట్టే అయినా, అవి వివిధములైన నామరూపాలతో తెలుస్తున్నాయే గాని, అద్వయమైన మట్టిగా అర్థం కావడం లేదు. భిన్నత్వం లోని ఏకత్వం అనుభవానికి అందడం లేదు. భిన్నత్వాన్ని చూడటం దర్శన మైతే, భిన్నత్వంలో ఏకత్వాన్ని వీక్షించడం సందర్శనము ***(సందర్శనం, సమ్యక్ దర్శనం).*** అనేక రూపాలతో గోచరించే ఈ విశ్వమును ఏకరూపుడైన విశ్వమూర్తిలో దర్శించాలనే ఆశ అర్జునునిలో కలిగింది. ఆ ఆశే అద్భుతమైన ఒక అధ్యాయానికి శ్రీకారం చుట్టింది.

ఆశ అయితే బాగానే ఉంది. కానీ వివిధ ప్రత్యయ గమ్యమైన విశ్వము అర్జునునికి కనిపిస్తూనే ఉంది కదా! ఒక వైపు విశ్వం కళ్ళెదుట కదుల్తూ ఉండినా, ప్రత్యేకంగా విశ్వరూపాన్ని చూడా లంటాడు ఎందుకని?

విశ్వం కనిపిస్తూ ఉండినా, విశ్వంలో విశ్వరూపుని దర్శించా లనేది అర్జునుని అభిలాష అనుకుందామా? మరి, ఎదురుగా నిలబడి ప్రత్యక్షంగా గీతను బోధిస్తున్న వాడు ఎవడు? విశ్వనాథుడు కాడా? జగన్నాథుడు కళ్ళ ముందే ఉన్నాడు. జగత్తు కళ్ళెదుటే కనిపిస్తూ ఉంది. జగత్తు లోనే జగదీశ్వరుడు గోచరిస్తున్నాడు. ఇంకేమి దర్శించాలని అర్జునుడు ఆరాట పడుతున్నాడు? నిజమే. విశ్వము కనిపిస్తూనే ఉంది. విశ్వంలో వాసుదేవుడు ప్రత్యక్షం గానే ఉన్నాడు. కానీ, కాల భేదం, దేశ భేదం ఏమైనా అతనిని కలత పెడుతున్నా యేమో, అంటారా?

వివిధ రూపాలలో విశ్వం గోచరిస్తూ ఉంది కనుక, అన్ని రూపాలను ఒకే కాలంలో దర్శించడం కుదరదు. కనుక, ఒక వస్తువు తరువాత మరొక వస్తువును చూస్తాం. అలా చూడటంలో దేశాంతరం ఉంది. కాలాంతరం ఉంది. ఒక రూపాన్ని చూచినపుడు మరొక రూపాన్ని చూడలేము. ఒకే ప్రదేశంలో అన్నిటినీ చూడలేము. ఒకే కాలంలో సమస్తాన్ని చూడలేము. విశ్వమును చూస్తున్నా విశ్వ మంతటిని మన కళ్ళతో ఏక కాలంలో చూడలేము.

పోనీ, అభిముఖంగా నిలబడి బోధిస్తున్న గీతాచార్యుని అయినా పూర్ణంగా ఏక కాలంలో దర్శించడం జరుగుతూ ఉందా? అదీ లేదు. దేవాలయంలో దేవతామూర్తిని దర్శించినట్లే, జగదాలయంలో జగదీశ్వరుని చూడటం జరుగుతూ ఉంది.

ఆలయం లోని మూర్తి యొక్క ముఖారవిందాన్ని దర్శిస్తే, చరణ కమలాలు కనిపించవు. పాదాలను దర్శిస్తే నేత్రాలు కనిపించవు. నేత్రాలను అవలోకిస్తే శ్రోత్రాలు కనిపించవు.

ఒక ప్రదేశంలో, ఒక కాలంలో మన ఎదుట నిలబడి ఉన్న వ్యక్తినే సంపూర్ణంగా దర్శించ లేనపుడు, అన్ని కాలాలలో ఉండే వాటిని, అన్ని ప్రదేశాలలో ఉండే వాటిని, ఒకే కాలంలో, ఒకే చోట, ఒక్కటి గానే దర్శించడము సాధ్యమా? సాధ్యము కాదు. అసాధ్యము. ఆ అసాధ్యాన్ని సాధ్యం చేసుకొనే ప్రయత్నమే అర్జునుని ఆరాటం లోని అంతరార్థం. ఇంద్రియ గోచరం కాని దానిని, మనోగోచరం కాని దానిని దర్శించాలనే కుతూహలమే కుంతీ తనయునిలో ప్రస్తుతం ప్రగాఢంగా ఉంది. అన్ని రూపాలు ఒకే చోట, ఒకే కాలంలో, ఒకే రూపంలో గోచరించడమే విశ్వరూపం.

ప్రేరణ - ప్రయత్నము

అసలు విశ్వరూపమును సందర్శించాలి అనే ఆలోచన అర్జునునికి ఎందుకు కలిగింది? పరమేశ్వరుడు పదవ అధ్యాయంలో దివ్యమైన ఆత్మ విభూతుల్ని వైభవోపేతంగా వర్ణించి *(భగవతః విభూతయః ఉక్తాః)*. చివరి శ్లోకంలో ఈ సమస్తమైన విశ్వము తనలో ఏకాంశమే అనే సత్యాన్ని ప్రవచించాడు. దానిని ఆలకించిన తరువాత *(శ్రుత్వా)*. ఏ ప్రపంచము ఆత్మ రూపమై ఉందో, ఆద్యుడైన ఈశ్వరునికి సంబంధించి ఉందో, అట్టి ఈశ్వరాంశ అయిన విశ్వాన్ని ప్రత్యక్షంగా వీక్షించాలని అర్జునుడు ఆశ పడ్డాడు *(యత్ జగత్ ఆత్మరూపం ఆద్యమ్ ఐశ్వర్యం తత్ సాక్షాత్కార్తు మిచ్ఛన్)*.

పూర్వ స్మృతులు

అర్జునుని చిత్తము స్మృతి పుటలను తెరిచింది. గతాలు గుర్తు కొస్తున్నాయి. బాల్యం నుండి వింటూ వస్తున్న శ్రీకృష్ణుని లీలలు వీనులలో సవ్వడి చేస్తున్నాయి.

'కన్నా! నువ్వు మన్ను తింటున్నా వని గోపబాలురు, మీ అన్నయ్య కూడా చెబుతున్నారు. నువ్వు తినడానికి ఇంట్లో తినుబండారాలే లేవా? మన్ను తిన వలసిన కర్మ నీ కేమిటి?' అని యశోద ప్రశ్నించి నపుడు,

'అమ్మా! నేను మన్నెందుకు తింటాను? నన్ను నీ చేత కొట్టించాలని వాళ్ళు అలా చెబుతున్నారు. వాళ్ళ

మాటలు వినకు. నా మాట మీద నీకు నమ్మకం లేకపోతే, **మదీయాస్య గంధ మాఘ్రాణము సేసి నా వచనముల్ దప్పిన దండింపవే!** అంటూ వాసన చూడమని కృష్ణయ్య నోరు తెరిచాడు. అంతే.

కన్నయ్య నోటిలో సాగర పర్వతాలు, భూగోళ సూర్యగోళాలు, చంద్రతారకలు, దిక్పాలకులు, ఈ యావద్విశ్వం వెలుగులు చిమ్ముతూ గోచరించింది.

ఇ॥ **బాల మాత్రుడగు సలీలుని ముఖమందు విశ్వ మెల్ల నెట్లు వెలసి యుండు**
బాలు భంగి నితడు భాసిల్లు గాని సర్వాత్ముడాది విష్ణు డగుట నిజము ॥

ఎంత చిన్న పిల్లవాడు! విశ్వమంతా ఈ చిన్ని నోటిలో ఎలా ఇమిడి ఉంది? బాలుడిలా కనిపిస్తూ ఉన్నా, ఇతడు సర్వాత్ముడైన విష్ణుదేవుడే అని భావించింది యశోద.

పరమేశ్వరుడు పదవ అధ్యాయములో తన విభూతి వైభవమును వర్ణించిన తరువాత, అర్జునుని మనస్సులో ఏకాంశమైన జగత్తును భగవంతునిలో దర్శించాలనే కుతూహలం ఒక వైపు పెరుగుతూ ఉంటే, మరో వైపు అతని చిత్తము బాలకృష్ణుని లీలా ప్రదర్శనములో చిక్కుకొని బయట పడలేక ఉక్కిరిబిక్కిరి అవుతూ ఉంది. యశోదకు కలిగిన భాగ్యము తనకూ ప్రాప్తిస్తే బాగుండు నని ఉవ్విళ్ళూరుతోంది.

మన్ను తింటివని నోరు చూప మనగా
తెరచి చూపితి వట నోట త్రిభువనములు
మా కళ్ళకు ఆ భాగ్య మెపుడు కలుగు?
నీ అడుగుల కడ పడి ఉందు చిన్నికృష్ణా!

అని చిన్నికృష్ణ శతకంలో ఒక వెన్నముద్ద.

యశోదను అనుగ్రహించి విశ్వరూపాన్ని దర్శింప చేసిన జగన్నాథుడు, మహాభారతము - ఉద్యోగ పర్వంలో ధృతరాష్ట్రునికి దివ్య దృష్టిని ప్రసాదించి తన విశ్వరూపాన్ని దర్శించే భాగ్యాన్ని కల్పించాడు. ఎన్నో దుష్ట కార్యాలకు పరోక్షంగా శ్రీకారం చుట్టిన ధృతరాష్ట్రుని కూడా కరుణించి దివ్య దర్శనాన్ని అనుగ్రహించాడు. ఎంత అద్భుత దర్శనమో! కాకపోతే, నిన్ను దర్శించిన నేత్రాలతో మరొకరిని చూడలేను. నా దృష్టిని ఉపసంహరించు! అని ధృతరాష్ట్రుడు ప్రార్థిస్తాడా?

నిను గంటి గృతార్థుడ నైతి నింకనొల్ల నొరుల
జూడ, లోచనములం బురుషోత్తమ సంహరింప వే, అని ధృతరాష్ట్రుడు ప్రార్థించి నపుడు, పరమేశ్వరుడు అతని దృష్టిని అంతర్ముఖం చేశాడు.

వారిలో ఏమి చూశాడో! ఏ విద్యాగంధము లేని యశోదకు నోరు తెరిచి విశ్వరూప దర్శనాన్ని అనుగ్రహించాడు. ధృతరాష్ట్రుని కళ్ళు తెరిపించి, విశ్వరూపాన్ని దర్శించే భాగ్యాన్ని ప్రసాదించాడు. వారిలో అర్హత లేమిటో తనకు తెలియదు. తనకూ అర్హత ఉంటే, ఆ భాగ్యాన్ని పరమాత్మ తనకు కూడా అనుగ్రహిస్తాడు కదా! అడగనిదే అనుగ్రహం ఎలా ప్రాప్తిస్తుంది? కనుక, అర్థించడమే తన వంతు. ప్రార్థించడమే తన కర్తవ్యం అని ఒక నిర్ణయానికి వచ్చిన అర్జునుడు, 'కృష్ణా! ఆ దివ్య రూపాన్ని చూడటానికి నేను తగుదు నని నువ్వు భావిస్తే **(మన్యసే యది తచ్ఛక్యం మయా ద్రష్టు మితి ప్రభో)**. ఆ దివ్య దర్శనాన్ని నాకు అనుగ్రహించు! అని ప్రార్థించాడు. శ్రీకృష్ణుడు అనుగ్రహించాడు. అర్జునునికి అచ్యుతుడు అనుగ్రహించిన దివ్యానుభవమే విశ్వరూప సందర్శనము. యశోదకు నోరు తెరిచి చూపాడు. ధృతరాష్ట్రునికి కళ్ళు తెరిపించి చూపించాడు. అర్జునునికి హృదయ కవాటాలు తెరుచుకొనేలా దివ్య దృష్టిని ప్రసాదించి చూపుతున్నాడు.

అద్భుత దర్శనం

విశ్వరూప దర్శనము అనేది అద్భుతమైన దివ్య సందర్శనము. అద్భుత మైనది భగవంతుడి రూపమే అయినా, వాస్తవానికి 'రూపం భగవంతుడే, కాని భగవంతుడు రూపం కాదు' అనే సత్యావగాహనే అద్భుతం. దృక్చైతన్య మైన భగవంతుడు భక్తుడైన అర్జునుని కొరకు దృశ్యంగా అగుపించిన దర్శనమే పరమాద్భుతం. సర్వాత్మకము, సర్వ కారణము, సర్వైశ్వర్య సంపన్నమైన స్వరూపము ఉపాస్యంగా కళ్ళ ముందు నిలబడటం మహాద్భుతం. ఈ మహాద్భుత దర్శనము వీక్షణార్థమా? ఉపాసనార్థమా? అనే విషయాన్ని అధ్యాయం ముగిసే సరికి మీరే నిర్ణయిస్తారు. సర్వ మంగళ స్వరూపమైన ఈ దివ్య దర్శనం ఉపాసనార్థం కాకపోతే - **నిమిత్త మాత్రం భవ!** - 'ఓ సవ్యసాచీ! అర్జునా! విశ్వమంతా నా అధీనం లోనే ఉంది. నువ్వు నిమిత్తమాత్రంగా ఉండు' అని భగవంతుడు ఎందుకు చెబుతాడు?

ఇది విశ్వరూప సందర్శన యోగము. గీతలో ఏకాదశాధ్యాయము. నా అదృష్ట మేమో! ఈ రోజు కూడా ఏకాదశే. ఏకాదశి నాడు ఏకాదశాధ్యాయాన్ని ప్రారంభిస్తున్నా!

అద్భుతమైన, అలౌకిక మైన రూపాన్ని దర్శింప చేసే ఈ అధ్యాయము అన్నిటికి విలక్షణంగా శోభిస్తుంది. ఈ అధ్యాయంలో యాభై ఐదు శ్లోకా లున్నాయి. సంజయుని ప్రవేశం కూడా ఉంది. ఈ అధ్యాయం స్తోత్ర ప్రధానంగా నడుస్తుంది. ఉపాసనా యుక్తంగా ఉంటుంది. ఆరాధనా యుతంగా సాగుతుంది. వర్ణనా విశేషము ఒక వైపు మనస్సును ప్రభావితం చేస్తూ ఉంటే, ప్రార్థనా వైభవము మరో వైపు హృదయాన్ని పరవశింప చేస్తూ ఉంటుంది. ఇప్పటి వరకు మనం చూచినట్లు, తాత్త్విక విషయ చర్చ ఇందులో పెద్దగా లేకపోయినా, తత్త్వాల లాగా పాడుకోవలసిన విషయం, భగవంతుని దివ్య క్రీడను ఆనందంగా వీక్షించ వలసిన విషయం ఎంతైనా ఉంది. తత్త్వ ప్రధానమైన భగవద్గీతా గ్రంథంలో వ్యాసుని కలం, ముఖ్యంగా ఈ అధ్యాయంలో, మహిత కవితా విభూతిని ఆవిష్కరించింది. లలిత శబ్దాలంకార సౌందర్యంతో, శ్రవణ మనోహర లయాత్మక పద సొబగులతో, ఆనంద పారవశ్యాన్ని రసరమ్యంగా మధుర భక్తిలో రంగరించి, హృదయాలను తన్మయత్వంలో ఓల లాడిస్తుంది. ఇక నే నంటారా! నిమిత్తమాత్రంగా నివేదిస్తూ ముందుకు సాగుతుంటాను. ప్రస్తుతానికి కాస్త ఆగుతాను. అర్జునుడు ప్రవేశిస్తున్నాడు.

అర్జున ఉవాచ :

మదనుగ్రహాయ పరమం గుహ్య మధ్యాత్మ సంజ్ఞితమ్ ।
యత్త్వయోక్తం వచ స్తేన మోహోఽ యం విగతో మమ ॥ 1

మదనుగ్రహాయ-పరమం-గుహ్యం-అధ్యాత్మసంజ్ఞితం
యత్-త్వయా-ఉక్తం-వచః-తేన-మోహః-అయం-విగతః-మమ

మదనుగ్రహాయ	=	నన్ను అనుగ్రహించుటకు	ఉక్తం	=	చెప్పబడిందో
త్వయా	=	నీ చేత	తేన	=	దాని చేత
పరమం	=	ఉత్కృష్టమైన	మమ	=	నా యొక్క
గుహ్యం	=	రహస్యమైన	అయం	=	ఈ
అధ్యాత్మసంజ్ఞితం	=	అధ్యాత్మ మైన	మోహః	=	మోహము
యత్	=	ఏ	విగతః	=	పోయింది
వచః	=	వాక్యము			

పార్థుడు ప్రార్థిస్తున్నాడు :

భగవంతా! నన్ను అనుగ్రహించడానికి ఉత్కృష్టమైన, రహస్యమైన అధ్యాత్మ జ్ఞానాన్ని నాకు బోధించావు. నీ ఉపదేశంతో నా మోహము నశించింది.

వ్యాఖ్య

కురుక్షేత్ర సంగ్రామంలో మోహ జాడ్యంలో కూరుకుపోయి, విషాదంతో కుమిలిపోతూ, కర్తవ్య విముఖుడై, యుద్ధం చేయలేని స్థితిలో కూలబడి, తనకు ఏది శ్రేయస్సో బోధించి కర్తవ్యమును నిర్దేశించ మని శ్రీకృష్ణ దేవుని గురువుగా ఎన్నుకొని, ఆయన ముందు చేతులు జోడించాడు శిష్యుడుగా అర్జునుడు. అర్జునుడు గీతాబోధను ఆలకించ డానికి అర్హుడని భావించిన తరువాత, శిక్షణ యోగ్యుడైన పార్థునికి గీతాబోధను వినిపిస్తూ పది అధ్యాయాలను సమాప్తం చేశాడు అచ్యుతుడు. ఇంతవరకు సాగిన గీతా ప్రవచన ప్రభావము ఏపాటిది? శ్రీకృష్ణార్జునుల మధ్య జరిగిన ఈ సంవాదములో శ్రీకృష్ణుడు గురువుగా చేసిం దేమిటి? అర్జునుడు శిష్యుడుగా చూచిం దేమిటి? అదేమిటో, అర్జునుని మాటల్లోనే విందాం.

వక్త చేసిం దేమిటి?

వక్తగా కురుక్షేత్రంలో వాసుదేవుడు చేసింది ఉత్తమము, రహస్యము, ఆత్మవిద్యా విషయమైన జ్ఞానమును బోధించడమే ***(పరమం, గుహ్యం, అధ్యాత్మ సంజ్ఞితం యత్ ఉక్తం వచః).*** ఈ విధమైన జ్ఞానాన్ని భగవంతుడు ఎందుకు బోధించాడు? అర్జునుని అనుగ్రహించేందుకే నని అర్జునుడే చెబుతున్నాడు ***(మదనుగ్రహాయ మమ అనుగ్రహార్థం).*** అర్జునుని అనుగ్రహించ వలసిన అవసర మేమిటి? మోహం వలన ఏర్పడిన శోకమును నివారించి, ఉపకారము చేయాలి అనే భావనే భగవంతుడి అనుగ్రహానికి హేతువు.

నేను చంపేవాణ్ణి, భీష్మద్రోణాదులు చచ్చేవారు అనే మోహం అర్జునుని కృంగ దీసింది. ఆత్మానాత్మ వివేకం లోపించడం చేత కర్తృత్వ భోక్తృత్వాలు ఆత్మకు ఆపాదించ బడ్డాయి. ఈ విధమైన మోహాన్ని తొలగించే ప్రయత్నంలో శ్రీకృష్ణుడు బోధను ప్రసాదించి అర్జునునిపై అనుగ్రహాన్ని కురిపించాడు.

తనపై అనుగ్రహాన్ని చిందిస్తూ శ్రీకృష్ణుడు అందించిన బోధను మూడు విశేషణాలతో అర్జునుడు వర్ణిస్తున్నాడు. (1) పరమం (2) గుహ్యం (3) అధ్యాత్మ సంజ్ఞితం - ఈ విధమైన విశిష్ట జ్ఞానబోధను శ్రీకృష్ణుడు అర్జునునికి అనుగ్రహించాడు.

పరమం అంటే ఉత్తమ మైనది, చాలా గొప్పది, నిరతిశయ మైనది అని అర్థం ***(పరమం నిరతిశయం).*** భగవంతుడు బోధించిన పరమ వాక్యం ప్రమాణ సహితం. అది విశ్వాసానికి సంబంధించింది కాదు. జ్ఞానమును ప్రసాదించేది. రెండవ అధ్యాయంలో ***అశోచ్యా నన్వ శోచస్త్వం*** అనే శ్లోకము నుండి ఆరవ అధ్యాయం సమాప్తం వరకు గీతాచార్యుడు బోధించిన వచనము ***(ఉక్తం వచః).*** 'త్వం' పద వ్యాఖ్యానము, అర్జునుని లోని అవివేకాన్ని నిర్మూలించి ***(అవివేక బుద్ధిః అపగతా).*** వివేకాన్ని ప్రసాదించింది.

గీతాచార్యుడు బోధించిన ఈ పరమ వచనానికి ***గుహ్యం*** అనే రెండవ విశేషణాన్ని జోడించాడు పార్థుడు. 'గుహ్యము' అంటే రహస్య మైనది అని అర్థం ***(గుహ్యం గోప్యం).*** రహస్యము అంటే అందుబాటులో లేనిది, దాచబడినది అని అర్థం కాదు. బహిరంగంగా ప్రవచించినా అర్థం కానిది, శిక్షణ యోగ్యులైన అధికారులకు మాత్రమే అర్థ మయ్యేది అని భావం.

పరమము, గుహ్యము అయిన శ్రీకృష్ణ వచనానికి ***అధ్యాత్మ సంజ్ఞితం*** అనేది అర్జునుడు జోడించిన మూడవ విశేషణము. 'అధ్యాత్మ సంజ్ఞితము' అంటే ఆత్మజ్ఞాన విషయము. ఆత్మానాత్మ వివేకానికి సంబంధించిన

విషయ మని అర్థము *(అధ్యాత్మ సంజ్ఞితమ్ ఆత్మానాత్మ వివేక విషయం).* ఈ విధమైన ఆత్మవిద్యా విషయాన్ని బోధించి శ్రోతయైన అర్జునుని అనుగ్రహించాడు వక్త యైన వాసుదేవుడు. ఇంతవరకు సాగిన గీతాబోధ ఫల మేమిటి?

శ్రోత చూసిం దేమిటి?

శ్రీకృష్ణుని బోధ వల్ల అర్జునునికి ఒరిగిం దేమిటి? భగవద్వచన ప్రభావం చేత ***(యత్ త్వయా ఉక్తం వచః వాక్యం తేన వచసా)*** నా మోహం నశించింది అంటున్నాడు అర్జునుడు ***(మోహః అయం విగతః మమ అవివేక బుద్ధిః అపగతా ఇత్యర్థః).*** ఇది అర్జునుడు చూచిన ఫలితం. అందుకున్న ఫలం. ఆత్మానాత్మ వివేక జ్ఞానం స్థిర పడటం చేత, అనాత్మ సంబంధంతో ఏర్పడిన మోహం తొలగి పోయింది.

నేను కర్తను, నేను భోక్తను, నేను సుఖిని, నేను దుఃఖిని అనే మోహం నశించింది. ఈ ప్రపంచం సత్యము, స్వతంత్ర మనుగడ కలది అనే అవివేకము అంతరించింది. ఈ ప్రపంచములో ఉన్న వన్నీ పరమేశ్వరుని కన్నా అన్యంగా ఉన్నాయి అనే మోహాంధకారం పటాపంచ లైంది. ఇదే మోహ నాశము. శ్రోతకు లభించిన ప్రమాణ ఫలం.

మోహం సమూలంగా నశించినట్లేనా?

మోహం పోయింది ***(విగతః)*** అంటున్నాడు అర్జునుడు. ఇంతకీ అర్జునుని మోహము సమూలంగా నశించినట్లేనా? మోహం నశిస్తే, గీత ఇక్కడ సమాప్తం కావాలి కదా? మోహ క్షయమే కదా మోక్షము!

మోహం పోయింది అని అర్జునుడు చెబుతున్న మాటల్లో సత్యము లేక పోలేదు. అలాగని పూర్ణ సత్యం ఆవిష్కరింప బడిందని నేను భావించడం లేదు. మోహం కొంత వరకు తొలగిన మాట వాస్తవమే. అంత మాత్రాన పూర్ణజ్ఞానం కలిగిందని భావించ లేము. పూర్ణ జ్ఞానికి విశ్వరూపాన్ని దర్శించాలనే కోరిక పుడుతుందా? విశ్వరూపాన్ని సందర్శించే సమయంలో భయం కలుగుతుందా? ఈ కోరిక, భయం - వీటిని ఎలా అర్థం చేసుకోవాలి?

భగవద్గీత పూర్వార్థం సమాప్తమైన ఈ సందర్భంలో మోహం తొలగింది అంటున్నాడు. బాగుంది. కాని, గీత సంపూర్ణ మైనపుడు కూడా ఇదే మాట అన్నాడు అర్జునుడు *(18 వ అ - 73 వ శ్లో).*

ఇంతకీ మోహం ఇక్కడ పోయిందా? లేక, అక్కడ పోయిందా? ఇక్కడే పోయి ఉంటే, గీత అక్కడి దాకా ఎందుకు కొనసాగుతుంది? పైగా ఇక్కడ అర్జునుడు 'మోహం తొలగింది' అని మాత్రమే అన్నాడు. అక్కడేమో, 'మోహం నశించింది' ***(నష్టో మోహః),*** 'స్మృతి కలిగింది' ***(స్మృతి లబ్ధా),*** 'సందేహాలు తొలగి పోయాయి' ***(గత సందేహః)*** అని అన్నాడు. ముఖ్యంగా, 'నీ మాటను ఆచరిస్తాను' ***(కరిష్యే వచనం తవ)*** అని కూడా అన్నాడు.

దీనిని బట్టి చూస్తే, పదకొండవ అధ్యాయం లోని ప్రస్తుత శ్లోకంలో మోహం పోయినట్లు అర్జునుడు చెబుతున్నా, సంపూర్ణంగా పోయినట్లు కాదని అర్థమౌతూ ఉంది. దీనికి ఇంతగా వ్యాఖ్యానం అవసరం లేదు. మోహం పూర్ణంగా నశించి ఉంటే, గీతాచార్యుడే సమాప్తంలో ప్రశ్నించినట్లు ఇక్కడ కూడా ప్రశ్నించి ఉండేవాడు.
అర్జునా! గీతను చక్కగా విన్నావు కదా! అజ్ఞానం చేత ఏర్పడిన నీ మోహం నశించిందా? అని గీతను సమాప్తం చేస్తూ అక్కడ స్పష్టంగా అడిగాడు ***(కచ్చి దజ్ఞాన సమ్మోహః ప్రణష్టస్తే ధనంజయ!).*** కానీ ఇక్కడ శ్రీకృష్ణుడు అలా ప్రశ్నించ లేదు అంటే, ఆయనకు తెలుసు, అర్జునునిలో మోహం ఇంకా సమూలంగా నశించ లేదని.

వ్యాధిగ్రస్తుడైన వ్యక్తికి వైద్యుడు సరియైన చికిత్సను చేస్తూ ఉంటే, రోజు రోజుకీ రోగిలో అనారోగ్య చిహ్నాలు తగ్గుతూ ఆరోగ్య లక్షణాలు వృద్ధి చెందుతూ ఉంటాయి. అంతమాత్రాన, రోగి సంపూర్ణ ఆరోగ్యవంతుడని చెప్పలేము. చికిత్స పూర్తి అయిన తరువాతే రోగి సంపూర్ణ ఆరోగ్యవంతు డవుతాడు.

అరుణోదయానికి ముందు నుండే కొద్ది కొద్దిగా వెలుగులు తొంగి చూస్తూ ఉంటాయి. సూర్యోదయం కాబోతోంది అనే సందేశ కిరణాలు కదుల్తాయి. అంతమాత్రం చేత దానినే సూర్యోదయం అని భావించ లేము. అరుణోదయంలో చీకట్లు పలచ బడుతూ ఉంటాయి కనుక, కొంత స్పష్టత ఏర్పడుతుంది. అలాగని అస్పష్టత పూర్తిగా లేకుండా పోదు. ఎక్కడ అస్పష్టత అనేదే ఉండదో, దివ్య వెలుగులతో స్పష్టత గోచరిస్తూ ఉంటుందో, అదే సంపూర్ణ సూర్యోదయము. మోహ నాశము అనేది అర్జునునిలో ప్రస్తుతం పాక్షికంగా జరిగినా, మున్ముందు సంపూర్ణ జ్ఞానోదయం కలుగుతుంది అనడానికి ఇది సుస్పష్టమైన సంకేతము.

భవాప్యయౌ హి భూతానాం శ్రుతౌ విస్తరశో మయా ।
త్వత్తః కమలపత్రాక్ష మాహాత్మ్యమపి చావ్యయమ్ ॥ 2

భవాప్యయౌ-హి-భూతానాం-శ్రుతౌ-విస్తరశః-మయా
త్వత్తః-కమలపత్రాక్ష-మాహాత్మ్యం-అపి-చ-అవ్యయం

కమలపత్రాక్ష	=	శ్రీకృష్ణా!	అవ్యయం	=	నాశరహితమైన
త్వత్తః	=	నీ వలన	మాహాత్మ్యం అపి చ	=	మాహాత్మ్యము గూడ
భూతానాం	=	భూతముల	విస్తరశః	=	విస్తారముగా
భవాప్యయౌ	=	ఉత్పత్తి నాశములు	మయా	=	నా చేత
తే	=	నీ యొక్క	శ్రుతౌహి	=	ఆలకించ బడింది కదా!

కమలదళ లోచనా! కృష్ణా! భూతముల ఉత్పత్తి ప్రళయాలు సవిస్తరంగా నీ నుండి విన్నాను. అక్షయమైన నీ మాహాత్మ్యాన్ని కూడా ఆలకించాను.

వ్యాఖ్య

'త్వం' పదాన్ని నిర్ణయిస్తూ ఆరవ అధ్యాయం చివరి వరకు భగవానుడు ప్రవచించిన గుహ్యామైన, పరమోత్తమ మైన వాక్యాన్ని ఆలకించి, మోహాన్ని పోగొట్టుకున్నట్లు ఈ అధ్యాయం మొదటి శ్లోకంలో చెప్పిన పార్థుడు, ఏడవ అధ్యాయం నుండి పదవ అధ్యాయం వరకు 'తత్' పదాన్ని నిర్దేశిస్తూ, జీవుల ఉత్పత్తి స్థితి లయాలు, మరియు అక్షయమైన భగవ దైశ్వర్యమును గూర్చి పరమేశ్వరుడు విస్తరించి ప్రవచించిన విషయమును కూడా ఆలకించినట్లు ప్రస్తుత శ్లోకంలో చెబుతున్నాడు. అంతేకాదు, తాను సవిస్తరంగా విన్నట్లు చెప్పిన విషయా న్నంతా సంక్షేపంగా ఈ రెండు శ్లోకాల లోనే చెప్పేశాడు కూడా.

అవ్యక్తాన్ని గూర్చి, వ్యక్తాన్ని గూర్చి తాను సంగ్రహంగా శ్రవణం చేసినట్లు చెబుతున్నాడు. పరమాత్మ యొక్క పరిమితమైన రూపం వ్యక్తమైన విశ్వమైతే, విశ్వము యొక్క అవ్యయమైన తత్త్వమే అవ్యక్త పరబ్రహ్మము.
ఉత్పత్తి ప్రళయాలు జరుగుతున్నా, పరమాత్మ యందు ఏ విధమైన వికారము లేదు. సర్వ కర్మలు పరమేశ్వరుని కారణం గానే జరుగుతూ వున్నా, తాను వాటికి అంటకుండా అసంగుడై శోభిస్తున్నాడు. కర్మఫల ప్రదాత తానే అయినా, రాగద్వేషాలకు అతీతంగా భాసిస్తూ, అందరి విషయంలో సముడై ఉన్నాడు. ఇదంతా ఆయన మాహాత్మ్యము. అక్షయ వైభవము. ఈ వైభవ విషయాన్ని కూడా సంగ్రహంగా పరమేశ్వరుని నుండి

ఆలకించినట్లు అర్జునుడు చెబుతున్నాడు. పరమేశ్వరుడు ప్రబోధించిన అసమాన అద్భుత జ్ఞానవైభవాన్ని తలచుకొని పులకాంకితుడై, పరమేశ్వరుని **కమల పత్రాక్ష!** అని భావ స్పందనతో, జ్ఞాన స్పృహతో సంబోధిస్తున్నాడు.

కమలపత్రము అంటే కమలము యొక్క రేకు ***(కమలస్య పత్రం కమల పత్రం).*** అటువంటి నేత్రాలు కల వాడు కమల పత్రాక్షుడు. కమలదళ లోచనుడు. పుండరీకాక్షుడు. పరమేశ్వరుడు.

కమలదళాలు విశాలంగా ఉంటాయి. అతిశయించిన సౌందర్యముతో శోభిస్తూ ఉంటాయి. కనుక, పరమేశ్వరుడు బోధించిన విషయం కూడా నిరతిశయ మైన జ్ఞానంతో విస్తారంగా ఉంది అనే ధ్వని కూడా ఇక్కడ వినపడుతోంది. **కమల పత్రాక్ష** అనే సంబోధనలో ప్రస్తుత కమల పత్రము విరజిమ్మే విలక్షణమైన సంస్కృత పరిమళాన్ని శ్రీశంకరానందీయ తాత్పర్యబోధిని ఉటంకించింది. ఆ పరిమళాలను కూడా ఆఘ్రాణిద్దాం.

కం బ్రహ్మ సుఖం స్వరూపానంద స్తం అలతి ప్రకాశయతీతి కమలం ఆత్మజ్ఞానం, త దేవ పతనాత్త్రాయత ఇతి పత్రం, కమలం చ త త్పత్రం చ కమల పత్రం తేన అక్ష్యతే ప్రాప్యత ఇతి కమల పత్రాక్షః !

కం అంటే బ్రహ్మ సుఖము. స్వరూపానందము. దానిని ***అలతి,*** అంటే ప్రకాశింప చేసేది కమలము, అంటే ఆత్మజ్ఞానము లేదా బ్రహ్మజ్ఞానము.

పత్రం అంటే పతనం కాకుండా రక్షించేది అని అర్థం ***(పతనాత్ త్రాయతే).*** అంటే, సంసారములో పడకుండా రక్షించేది. అదే ఆత్మజ్ఞానము. ఆత్మజ్ఞాన మనే కమలము యొక్క పత్రము జీవుణ్ణి సంసారంలో పడకుండా కాపాడుతుంది. అట్టి కమల పత్రము, అంటే ఆత్మజ్ఞానము చేత పొందబడే వాడు ***(తేన అక్ష్యతే)*** కనుక భగవంతుడు కమల పత్రాక్షుడు. ఆత్మజ్ఞానము చేతనే పొందబడే వాడు. అట్టి జ్ఞానాన్ని 'త్వం' పద 'తత్' పద నిర్ణయ వాక్యాల ద్వారా శ్రీకృష్ణుడు సవిస్తరంగా ప్రవచిస్తే, తాను శ్రవణం చేసినట్లు ఆనందాన్ని వ్యక్తం చేశాడు అర్జునుడు.

ఒక వైపు తన మోహం తొలగింది అని చెబుతూనే, మరో వైపు తనలో ఏదో కోరిక కదులుతూ ఉన్నట్లు కూడా విన్నవించుకుంటున్నాడు. అదేమిటో విందాం!

ఏవ మేత ద్యథాత్థ త్వ మాత్మానం పరమేశ్వర ।
ద్రష్టు మిచ్ఛామి తే రూప మైశ్వరం పురుషోత్తమ ॥ 3

ఏవం-ఏతత్-యథా-ఆత్థ-త్వం-ఆత్మానం-పరమేశ్వర
ద్రష్టుం-ఇచ్ఛామి-తే-రూపం-ఐశ్వరం-పురుషోత్తమ

పరమేశ్వర	=	కృష్ణా!	పురుషోత్తమ	=	కృష్ణా!
ఆత్మానం	=	నిన్ను గురించి	తే	=	నీ యొక్క
యథా	=	ఏ ప్రకారముగ	ఐశ్వరం	=	ఈశ్వర సంబంధమైన
త్వం	=	నీవు	రూపం	=	రూపమును
ఆత్థ	=	చెప్పితివో	ద్రష్టుం	=	చూచుటకు
ఏవం ఏతత్	=	ఇదంతా	ఇచ్ఛామి	=	కోరుకుంటున్నా

పరమేశ్వరా! పురుషోత్తమా! నిన్ను గూర్చి నువ్వు చెప్పిన దంతా విన్నాను. నీ స్వరూపాన్ని అలాగే చూడాలని కోరుకుంటున్నాను.

వ్యాఖ్య

ఈ సమస్త జగత్తు యొక్క ఉత్పత్తి స్థితులకు పరమేశ్వరుడే కారణ మని *(10 వ అ - 8 వ శ్లో)*, ఈ విశ్వమంతా పరమేశ్వరుని ఒక అంశము చేతనే నిలిచి ఉందని *(10 వ అ - 42 వ శ్లో)*, ఏ జ్ఞానము నైతే గీతాచార్యుని నుండి శ్రవణం చేశాడో, దానిని చూడాలని అర్జునుడు ప్రస్తుతం ఉత్సాహ పడుతున్నాడు.

చూడాలి అని అర్జునుడు ఎందుకు అనుకుంటున్నాడు? శ్రీకృష్ణుడు చెప్పిన విషయంపై నమ్మకం లేక చూచి నిర్ధారణ చేసుకోవాలి అనుకుంటున్నాడా? అలా కాదని తానే చెబుతున్నాడు.

'పరమేశ్వరా! నిన్ను గూర్చి ఏదైతే నువ్వు ప్రవచించావో, అది అలాగే ఉంటుంది గాని, మరొక విధంగా ఉండదు ***(ఏవమ్ ఏతత్, న అన్యథా).*** ఈశ్వరుడు, ఈశ్వరజ్ఞానం వేరు కావు. స్వరూపము, స్వరూపజ్ఞానము భిన్నం కావు. నిన్ను గూర్చి అద్భుతంగా ఆలకించాను. ఇప్పుడు ఆ అద్భుత రూపాన్ని చూడాలని ఆశ పడుతున్నా. అంతేగాని, నీ మాటపై శ్రద్ధ లేక కాదు'.

మనం కూడా ఏదైనా ఒక విషయాన్ని గూర్చి గొప్పగా విన్నప్పుడు, దానిని చూడాలి అనుకుంటాం. ప్రదేశాన్ని గూర్చి వింటాం. ఆ తరువాత ఆ ప్రదేశానికి వెళ్ళి చూస్తాం. రుచిని గూర్చి వింటాం. ఆ తరువాత రుచి చూస్తాం. బదరీనాథ్‌ను గూర్చి వింటాం. తరువాత ఆసక్తితో వెళ్ళి చూస్తాం. ఇదీ అంతే.

ఏకాంశేన స్థితో జగత్ అని దేని నైతే పరమేశ్వరుడు బోధించాడో, దానిని అలాగే, ఉన్న దున్నట్లుగా పరమేశ్వరునిలో దర్శించాలి అనేది అర్జునుని ఆకాంక్ష ***(ద్రష్టుం ఇచ్ఛామి).*** అంతేగాని, భగవంతుని మాటపై విశ్వాసం లేక కాదు.

ఎవరు దేనిని అర్థం చేసుకున్నా, తమ అనుభవం నుండే అర్థం చేసుకుంటారు. నా దగ్గర అది ఉంది, ఇది ఉంది, లేదా నా జేబులో ఇంత డబ్బు ఉంది అని మిత్రుడు చెప్పి నపుడు, ఏదీ చూపించు! అని మనం నమ్మకం లేక అడుగుతూ ఉంటాం.

ప్రేమ గల కుటుంబాలలో ఇప్పటికీ, భార్య భర్తకు భోజనం వడ్డిస్తూ, చివరగా రుచికర మైన తీపి పదార్థాన్ని మరి కొంచెము ఆరగించమని ఒత్తిడి చేస్తుంది. అప్పుడు భర్త 'అంతా నాకే పెట్టేస్తే, మరి నీకో?' అంటాడు. 'నాకూ ఉంది లెండి!' అంటుంది భార్య. 'ఏదీ, తెచ్చి చూపించు!' అంటాడు భర్త ఆప్యాయతతో.

ఇలాంటి సన్నివేశాలలో, అది ప్రేమ కావచ్చు, లేక చనువు కావచ్చు, ఏదో కొంత నమ్మలేని తనము చోటు చేసుకొని ఉంటుంది. అలాగే, భగవంతుడు బోధించిన తత్త్వాన్ని చూడాలని భావించడం వెనుక అర్జునునిలో కూడా ఏదో ఓ మూల కొంత అపనమ్మకం ఒదిగి ఉందేమో అని మన అనుభవాలు శంకిస్తాయి. అంతేగాని, అర్జునునికి మాత్రం ఏ విధమైన సందేహమూ లేదు.

'పురుషోత్తమా! నీ మాట సత్యము. ఆ విషయంలో నాకు అశ్రద్ధ లేదు. నీ మాటను పరీక్షించే సామర్థ్యం నాకు ఉంటుందా? నేను నీ భక్తుణ్ణి. ఈ సృష్టికి ఉత్పత్తి స్థానం నీవే నని, ఈ సమస్త జగత్తు నీ వల్లనే నడుస్తూ ఉందని, ఈ విధంగా తెలుసుకున్న భక్తులు నిన్నే భజిస్తూ ఉంటారని చెప్పావు కదా *(10 వ అ - 8 వ శ్లో)*! నేనూ అలాగే భక్తి చేయాలి అనుకుంటున్నా! కనుకనే, నీ దివ్య రూపాన్ని దర్శించాలని ఆశ పడుతున్నా! నా అదృష్టానికి పొంగిపోతూ, నా బ్రతుకును కడతేర్చుకోవా లని అడుగుతున్నా! నీ లాంటి దైవం దొరికి నందుకు పరవశిస్తూ ప్రార్థిస్తున్నా!' అంటున్నాడు. నిజమే. ఇదే అర్జునుని ఆంతర్యం.

అవ్యక్తమైన పరమేశ్వర స్వరూపాన్ని అర్థం చేసుకోవడానికి వ్యక్తమైన రూపమే కదా ఆధారం! శ్రీకృష్ణుడు బోధించిన సత్యజ్ఞానానంద స్వరూపమైన పరతత్త్వాన్ని పార్థుడు ఆలకించాడు. అలాగే సృష్టి స్థితి లయాలలో

శోభిస్తున్న ఈశ్వర వైభవాన్ని కూడా అర్జునుడు శ్రవణం చేశాడు. శ్రవణం చేశాడు అంటే, అర్థం చేసుకున్నాడు అని భావం. అందుకే పరమేశ్వరుని మాట సత్యమని భావిస్తున్నాడు ***(ఏవమ్ ఏతత్).*** ఈ విషయంలో ఇక విశ్వాస అవిశ్వాసాలకు చోటెక్కడుంది? అర్థమైంది కనుకనే సత్యంగా అభివర్ణిస్తున్నాడు. అర్జునుడు అర్థం చేసుకున్నాడు. అచ్యుతుడు అర్జునునికి అర్థ మయ్యేలా బోధించాడు. ఇది కేవలం జ్ఞానానికి సంబంధించిన విషయం. కనుకనే, ప్రస్తుత శ్లోకంలో శ్రీకృష్ణుని ***పరమేశ్వరా! పురుషోత్తమా!*** అంటూ భావగర్భితమైన పలుకులతో సంబోధించాడు విజయుడు.

'హే పరమేశ్వరా! ఏ విధంగా ***(యథా)*** నీవు ***(త్వం)*** చెబుతున్నావో, ***(ఆత్థ)*** అది అలాగే ఉంటుంది ***(ఏవమ్ ఏతత్)'*** అంటూ జ్ఞానం విషయంలో తన కున్న స్పష్టతను విశదం చేశాడు. నిరుపాధికమైన బ్రహ్మ స్వరూపము, సోపాధిక మైన ఈశ్వర వైభవము అంటూ భగవంతుడు బోధించిన విషయమును సమగ్రంగా తాను అర్థం చేసు కున్నట్లు **పరమేశ్వర** సంబోధనము ద్వారా వ్యక్తం చేస్తున్నాడు.

పరమశ్చ అసౌ ఈశ్వరశ్చ పరమేశ్వరః. ఇక్కడ 'పరమః' అంటే స్వరూప వైభవము ***(సర్వాతిశయ మహత్వాత్ పరమః).*** 'ఈశ్వరః' అంటే సర్వజ్ఞత్వ సర్వ వ్యాపకత్వాదులు గల సోపాధిక ఈశ్వర తత్త్వము ***(సర్వ వ్యాపృతి హేతుత్వాత్ ఈశ్వరః).*** కనుక, ***పరమేశ్వర*** అని సంబోధిస్తూ 'నిరుపాధిక స్వరూప వైభవము, సోపాధిక ఈశ్వర వ్యాపకత్వము, రెండూ కలిగిన ఓ స్వామీ!' అంటూ తనకు అర్థమైన జ్ఞానాన్ని సంబోధనము లోనే వ్యక్తపరచాడు సవ్యసాచి. అలాగే **పురుషోత్తమ** సంబోధన కూడా.

పురుషశ్చ అసౌ ఉత్తమశ్చ పురుషోత్తమః. పురుషః అంటే, ఈ ప్రపంచ మంతా పూరించి యున్న సోపాధిక మైన ఈశ్వరుడు. ***ఉత్తమః*** అంటే, క్షరాక్షరములకు అతీతుడైన నిరుపాధిక పరబ్రహ్మము *(15 వ అ -18 వ శ్లో).* ఈ విధంగా సోపాధిక నిరుపాధిక స్వరూపాలను భగవంతుని ద్వారా ఆలకించి, అర్థం చేసుకున్న అర్జునుడు, పరమేశ్వరునిలో ఏకాంశమై నిలిచి యున్న విశ్వాన్ని వీక్షించాలని భక్తితో అర్థిస్తున్నాడు. ప్రార్థిస్తున్నాడు.

అడగడానికి అర్హత ఎందుకు? అనుగ్రహాన్ని

అర్థించడ మైతే చేశాడు. మరి అచ్యుతుడు అనుగ్రహిస్తాడా? అడగడానికి అర్హత ఎందుకు? అనుగ్రహాన్ని పొందడానికే అర్హత ఉండి తీరాలి. ఇంతకీ, తనకు అర్హత ఉందా? అచ్యుతుడు విశ్వరూప దర్శనాన్ని అనుగ్రహిస్తాడా? ఏమో! ఏదో ఓ మూల అర్జునుని హృదయంలో సందేహం ఉన్నట్లు అనిపిస్తోంది. అదే తరువాత శ్లోకం.

మన్యసే యది తచ్ఛక్యం మయా ద్రష్టు మితి ప్రభో । 4
యోగేశ్వర తతో మే త్వం దర్శయాత్మాన మవ్యయమ్ ॥

మన్యసే-యది-తత్-శక్యం-మయా-ద్రష్టుం-ఇతి-ప్రభో
యోగేశ్వర-తతః-మే-త్వం-దర్శయ-ఆత్మానం-అవ్యయం

ప్రభో	= ప్రభూ!	తతః	= ఆ కారణంగా
మయా	= నా చేత	త్వం	= నీవు
తత్	= ఆ స్వరూపము	మే	= నా కొరకు
ద్రష్టుం	= గాంచుటకు	అవ్యయం	= నిత్యమైన
శక్యం ఇతి	= సాధ్యమని	ఆత్మానం	= ఆత్మస్వరూపమును
మన్యసే యది	= నీకు అనిపిస్తే	దర్శయ	= చూపించు
యోగేశ్వర	= యోగేశ్వరా!		

ప్రభూ! నీ స్వరూపాన్ని చూడటం నాకు సాధ్యమని నీ కనిపిస్తే, యోగేశ్వరా, అక్షయమైన నీ రూపాన్ని నాకు చూపించు.

వ్యాఖ్య

విశ్వంలో అనేక విషయా లున్నాయి. అనేకానేక రూపా లున్నాయి. సమస్త విషయాలతో, రూపాలతో కూడిన విశ్వము ఒకే రూపంలో ఎలా ఒదిగి ఉందో గీతాచార్యుడు బోధించగా అర్జునుడు శ్రద్ధతో శ్రవణం చేశాడు. తాను శ్రవణం చేసిన విషయం సత్యమని నిర్ధారణ చేసుకున్నాడు. ఏదయితే విని తృప్తి చెందాడో, దానిని చూచి సంతృప్తి చెందా లనుకున్నాడు. శ్రవణం కన్నా దృశ్యం యొక్క ప్రభావము గొప్పది కదా! ఆడియో కన్నా వీడియో ప్రాధాన్యతే ఎక్కువ కదా! అందుకనే, సమస్త విశ్వాన్ని ఈశ్వరునిలో దర్శించాలని అభిలషించి అచ్యుతుని అర్థించాడు.

ఆశలు - అర్హతలు

ఆశలు అందరికీ ఉంటాయి. కాని, అర్హతలే అందల మెక్కిస్తాయి. ఎవరైనా దేనినైనా ఆశించవచ్చు. అలాగని ఆశించిన వారందరు అందుకోగల రని చెప్పలేము. కాని, అర్హత ఉన్న వారికి ఆశించినది అందకుండా ఎవ్వరూ దూరం చెయ్యలేరు.

కృష్ణా! నీ విశ్వరూపాన్ని నాకు చూపించు! అని అర్జునుడు అర్థించాడు. ఇది ఆశ. తప్పు లేదు. కాని, దానిని చూడటానికి తాను అర్హుడేనా? ఈ సందేహం అర్జునునికే కలిగింది.

స్వామీ! నీ కృప అపారము. నీ దయ అనంతము. నువ్వు నీ నిర్హేతుక కటాక్షంతో నన్ను అనుగ్రహించ వచ్చు. అలాగని దానిని అందుకొని నిలబెట్టుకొనే సామర్థ్యం నాకు ఉండాలి కదా! విశేష కృపను చూపి సముద్ర జలాలు వచ్చి చెరువులో పడినా, చెరువు సాగర జలాలను నిలుపుకోగలదా!

భగవాన్! దివ్యమైన నీ రూప వైభవాన్ని నువ్వు చూపించ వచ్చు. అలాగని చూచే సామర్థ్యం నాకు ఉండాలి కదా! అంత శక్తి నా కుందా? నీ రూపాన్ని దర్శించే అర్హత నా కుందా? అర్జునుడు ఏదో అవుతున్నాడు.

నిజమే. అర్జునుడికి ఆ శక్తి లేదు. చూచే సామర్థ్యం లేదు. తన అర్హత ఏపాటిదో అర్జునునికి తెలియనిది కాదు. తనలో ఉన్న వాటినే తాను చూడలేడు. ఇక భగవంతునిలో ఉన్న సమస్తాన్ని ఎలా చూడగలడు?

తన గుండెను తాను చూడలేడు. తన కాలేయం ఎలా ఉందో తనకు తెలియదు. తన మనస్సులో ఏం జరుగుతూ ఉందో తనకే అర్థం కాదు. అలాంటి వాడు పరమేశ్వరునిలో ఉన్న సమస్తాన్ని ఎలా వీక్షించగలడు? తన కళ్ళు ఎంత దూరం చూడగలవు? తన చెవులు ఎంత శబ్దాన్ని వినగలవు? తన మనస్సు యొక్క ఊహాశక్తి ఏపాటిది? తమ పరిమితాలు తమకు తెలియని వారెవరు? ఈ విషయంలో అర్జునుడు విలక్షణు డెలా అవుతాడు? అందుకే, తలెత్తి నడవలేని చోట, తల వంచి ముందుకు సాగడం యుక్త మని భావించాడు అర్జునుడు. వినయం తోనే విజయం సాధ్యం అనే సత్యాన్ని గుర్తించిన విజయుడు, వాసుదేవుని వినమ్రుడై ప్రార్థిస్తున్నాడు.

ప్రభో! ***తత్ మయా ద్రష్టుం శక్య మితి మన్యసే యది -*** నీ స్వరూపమును దర్శించే సామర్థ్యం నాకు ఉందని నీ కనిపిస్తే హే, యోగేశ్వరా! **తే ఐశ్వరం రూపం ద్రష్టు మిచ్ఛామి -** ఈశ్వర సంబంధమైన నీ దివ్య రూపాన్ని దర్శించాలని నేను అభిలషిస్తున్నాను అన్నాడు అర్జునుడు.

అర్జునుడు అభ్యర్థించి నంత మాత్రాన శ్రీకృష్ణుడు చూపాలని ఎక్కడుంది? విషయాన్ని మార్చి, ప్రవచనాన్ని

విస్తరించుకుంటూ పోవచ్చు కదా! తనకు ఇష్ట మైనదే అయినా, అది కృష్ణుడికి ఇష్ట మైనపుడే తనకు సిద్ధిస్తుం దనేది అర్జునునికి తెలుసు.

ఇక్కడ మరొక ఆసక్తికర మైన విషయ ముంది. అర్జునుడికి అర్హత ఉందనే అనుకుందాం. అంత మాత్రాన శ్రీకృష్ణుడు విశ్వరూపాన్ని ప్రదర్శించాలనే నియమ మెక్కడుంది? తన స్వరూపాన్ని చూపించడం లేదా చూపించక పోవడం అనేది శ్రీకృష్ణుని ఇష్టంపై ఆధారపడి ఉంది.

శ్రీకృష్ణుడు చూపించ కూడదు అనుకుంటే, అర్జునుని అర్హత అడవి కాసిన వెన్నెలే అవుతుంది. ఒకవేళ అర్జునుని అనుగ్రహించి, అతని చేత దర్శింప చేయించాలని శ్రీకృష్ణుడు భావిస్తే, ఆ తరువాత దానిని నివారించే శక్తి ఎవ్వరికీ లేదు. ఆ స్థితిలో శోభించేది శ్రీకృష్ణుని అనుగ్రహమే గాని అర్జునుని అర్హత కాదు. అర్హత లేకపోయినా, అర్జునుణ్ణి అదృష్టం వరించ వచ్చు. కనుకనే, ఈ రహస్య మెరిగిన విజయుడు వినమ్రుడై తల వంచాడు. ప్రభూ! అంటూ శరణాగతు డయ్యాడు. యోగేశ్వరా! అంటూ భారాన్నంతా భగవంతుని భుజాలపై మోపాడు.

కృష్ణా! నువ్వు ప్రభువు. నేను సేవకుణ్ణి. నువ్వు నా స్వామివి. నేను నీ దాసుణ్ణి. దాసుణ్ణి ప్రభువు కరుణించక పోతే మరెవరు కరుణిస్తారు? నేను నీ వాణ్ణి. నన్ను కరుణించి నీ దివ్య రూపాన్ని దర్శింప చెయ్యి. అర్హతలను మరచిపో!

పల్లవి: **గానలోల! కరుణాలవాల!**
గాచి బ్రోవు నిరుపమ గుణశీల ॥ గాన ॥

చరణము: **ఉపచారములు నేర్వని వారము**
అపచారములే ఎరిగిన వారము
అర్హత లేవియు పొందని వారము
సారము లేని మేము నీ వారము ॥ గాన ॥

అని అర్జునుని ఆంతర్యానికి అద్దం పట్టింది చైతన్య గీతిక.

కృష్ణా! ఒకవేళ, అదేం కుదరదు, అర్హత లేని వారికి సాధ్యం కాదు అంటావేమో! చూచే శక్తి నాకు లేకపోతే పోనీ. చూడగల సమర్థుణ్ణి కాకపోతే పోనీ. నన్ను సమర్థుణ్ణి చేసి చూపించ గల సామర్థ్యం నీకు ఉంది కదా! అది చాలు. నేను సామాన్యుణ్ణే కావచ్చు. ప్రభూ! నువ్వు సర్వ శక్తిమంతుడివి. అసమాన తేజోవంతుడివి. యోగేశ్వరుడివి ***(యోగానాం ఈశ్వరః యోగేశ్వరః).*** నిన్ను దర్శించడానికి యోగులే అర్హులని నువ్వు భావిస్తే, అలాగే కానీ, ఏమైంది? నీ దాసుణ్ణైన నన్ను నీ యోగబలం చేత యోగిగా మార్చి నీ దివ్య రూపాన్ని దర్శించే బలాన్ని, భాగ్యాన్ని నాకు ప్రసాదించు!

ఏమో! చెప్పవలసిందంతా పార్థుడు బుద్ధిగా చెప్పేశాడు. ఇక పార్థసారథి ఏం చెబుతాడో చూడాలి.

శ్రీ భగవానువాచ :

పశ్య మే పార్థ రూపాణి శతశోऽథ సహస్రశః । 5
నానావిధాని దివ్యాని నానావర్ణాకృతీని చ ॥

పశ్య-మే-పార్థ-రూపాణి-శతశః-అథ-సహస్రశః
నానావిధాని-దివ్యాని-నానావర్ణాకృతీని-చ

పార్థ = అర్జునా!
మే = నా యొక్క
నానావిధాని = అనేక విధములైన
నానావర్ణాకృతీని = అనేకములైన రంగులు, రూపములు గల
దివ్యాని చ = దివ్యములైన
శతశః = వందల కొలది
అథ = ఇంకను
సహస్రశః = వేలకొలది
రూపాణి = రూపాలను
పశ్య = చూడు!

శ్రీ భగవానుడు చెబుతున్నాడు :

పార్థా! చూడు! శతవిధాల, సహస్ర విధాల శోభించే నా రూపాలు చూడు! ఆ రూపాలు అనేక విధాలు. దివ్యమైన రూపాలు. అనేక రంగులతో ఉంటాయి. అనేక ఆకారాలలో ఉంటాయి. అవన్నీ చూడు!

వ్యాఖ్య

భగవంతుని విశ్వరూపాన్ని దర్శించే అదృష్టం తనకు ఉందో లేదో అనే సంశయాన్ని హృదయంలో దాచుకొని, ఈశ్వర సంబంధమైన దివ్యరూప దర్శనాన్ని అనుగ్రహించి తనను కృతార్థుణ్ణి చేయవలసిందిగా వినమ్రుడై గీతాచార్యుని ప్రార్థించాడు పార్థుడు.

అర్జునుడి సంశయాన్ని సమూలంగా తుడిచి పెట్టేస్తూ, హృదయానందంతో అర్జునుడు ఉప్పొంగి పోయేటట్లు, 'పార్థా! చూడు!' అంటూ భగవంతుడు తన దివ్యవాణిని వినిపించాడు.

పశ్య అనే పదంతో శ్లోకం ఆరంభమైంది. ***పశ్య*** అంటే 'చూడు' అని అర్థం. అర్జునుడు విశ్వరూపాన్ని దర్శించడానికి అర్హుడే నని అచ్యుతుడు ఈ మాటలో చెప్పకనే చెప్పేశాడు.

ప్రస్తుతం 'చూడు' అంటూ ఉన్నాడే గాని ఇంకా చూపడం లేదు. 'చూడు' అంటే, ఇక చూడబోతావు అని అర్థం. అర్జునుడు ఏవేవి చూడబోతాడో చెబుతూ, అర్జునుని ఉత్సాహాన్ని వృద్ధి చేస్తున్నాడు.

శతశః సహస్రశః మే రూపాణి పశ్య! - 'అర్జునా! వందల కొలది, వేల కొలదిగా ఉన్న నా రూపాలను చూడు!' అంటున్నాడు. విశ్వరూపంలో అర్జునుడు అసంఖ్యాకము లైన రూపాలను చూడబోతాడు అని ముందే తెలిసి పోయింది. అవి కూడా ఒక విధంగా ఉండేవి కావు. అనేక విధాలుగా ఉంటాయట ***(నానా విధాని).*** కేవలం ఈ లోకంలో కనిపించే ప్రాకృతములే కావు. ఇతర లోకాలలో ఉండే అప్రాకృతాలను ***(దివ్యాని)*** కూడా చూడబోతాడట అర్జునుడు. వివిధ వర్ణాలలో శోభిస్తూ ఉండేవాటిని వీక్షిస్తాడట ***(నానా వర్ణా కృతీని).*** వివిధ ఆకృతులు, వివిధ రంగులలో గోచరించడము అంటే, ఆశ్చర్యకర మైన రంగులలో గోచరించే రూపాలను చూడబోతాడని అర్థం. అవి ఈ లోకంలో ఉండేవి కావచ్చు. ఇతర లోకాలలో ఉండేవి కూడా కావచ్చు.

ప శ్యాది త్యా న్వసూ న్రుద్రా నశ్వినౌ మరుత స్తథా । 6
బహూ న్యదృష్ట పూర్వాణి ప శ్యాశ్చర్యాణి భారత ॥

పశ్య-ఆదిత్యాన్-వసూన్-రుద్రాన్-అశ్వినౌ-మరుతః-తథా
బహూని-అదృష్టపూర్వాణి-పశ్య-ఆశ్చర్యాణి-భారత

భారత = అర్జునా!
ఆదిత్యాన్ = ఆదిత్యులను
వసూన్ = వసువులను
రుద్రాన్ = రుద్రులను
అశ్వినౌ = అశ్వినీదేవతలను
మరుతః = మరుత్తులను
పశ్య = చూడు
తథా = అలాగే

అదృష్టపూర్వాణి	= ఇంతవరకు చూడనివి	ఆశ్చర్యాణి	= వింతలను
బహూని	= అనేకములైన	పశ్య	= చూడు!

భారతా! అర్జునా! అవలోకించు. ఆదిత్యుల్ని, వసువుల్ని, రుద్రులను, అశ్వినీ దేవతలను, మరుత్తులను చూడు! పూర్వం నువ్వు చూడని వన్నీ చూడు! ఆశ్చర్యాలను దర్శించు.

వ్యాఖ్య

అర్జునుడు వీక్షించబోయే విశ్వయంత్రాంగా న్నంతా ముందే పరిచయం చేస్తున్నాడు భగవంతుడు. పన్నెండు మంది ఆదిత్యులను, ఎనిమిది మంది వసువులను, పదకొండు మంది రుద్రులను, ఇద్దరు అశ్వినీ దేవతలను, అలాగే నలభై తొమ్మిది మంది మరుత్తులను చూడ మంటున్నాడు. ఈ పేర్లను అర్జునుడు ఇదివరకే శాస్త్రంలో విని ఉండవచ్చు. కానీ, సూక్ష్మరూపంతో ఉండి ఈ లోక వ్యవహారాన్నంతా నడుపుతున్న ఈ దేవగణాన్ని ఇప్పుడు కళ్ళారా చూడబోతాడు. అందుకనే గతంలో మానవ లోకంలో చూడనివి ***(అదృష్ట పూర్వాణి మనుష్యలోకే)***, ఆశ్చర్యకర మైనవి ***(ఆశ్చర్యాణి అద్భుతాని)*** అంటున్నాడు భగవానుడు. అంటే, అలౌకికమైన అద్భుతాలన్నీ తెర మీదికి రాబోతున్నాయి అని అర్థము. వాటన్నిటినీ చూడటం ఒక అద్భుత మైతే, ఆ అద్భుతాల నన్నిటినీ ఒకే రూపంలో దర్శించడం పరమాద్భుతం.

ఇ హైకస్థం జగ త్కృత్స్నం పశ్యా ద్య సచరాచరమ్ ।
మమ దేహే గుడాకేశ యచ్చాన్యద్ద్రష్టు మిచ్ఛసి ॥ 7

ఇహ-ఏకస్థం-జగత్-కృత్స్నం-పశ్య-అద్య-సచరాచరం
మమ-దేహే-గుడాకేశ-యత్-చ-అన్యత్-ద్రష్టుం ఇచ్ఛసి

గుడాకేశ	= అర్జునా!	జగత్	= విశ్వమును
యత్	= ఏ	అద్య	= ఇప్పుడు
అన్యత్	= ఇతరమైన దానిని	మమ	= నా యొక్క
ద్రష్టుం	= చూచుటకు	ఇహ	= ఈ
ఇచ్ఛసి చ	= ఇష్టపడు తున్నావో	దేహే	= దేహము నందు
సచరాచరం	= ఆ చరాచర స్వరూపమైన	ఏకస్థం	= ఒకే చోట ఉన్న దానిని
కృత్స్నం	= సమస్తమైన	పశ్య	= చూడు

గుడాకేశా! అర్జునా! ఇక్కడే, ఒకే చోట, నా దేహంలో ఉన్న చరాచర ప్రపంచాన్నంతా ఇప్పుడే చూడు! మరే దైనా చూడాలి అనుకుంటే, అది కూడా చూసేయ్!

వ్యాఖ్య

ఈ శ్లోకం లోనే ఒక అద్భుతమైన రహస్యాన్ని బుద్ధికి పట్టిస్తున్నాడు భగవంతుడు. సమస్తాన్ని తన దేహంలో ఇక్కడే, ఇప్పుడే చూడ మంటున్నాడు. ఇది జాగ్రత్తగా అర్థం చేసుకోవలసిన విషయం.

అన్నిటినీ ఇక్కడే, ఇప్పుడే చూడ మంటున్నాడు. అన్నీ అంటే ఉన్న వన్నీ. ఉన్న వన్నీ అంటే, ఇప్పుడున్నవే కావు. గతంలో ఉన్నవి, భవిష్యత్తులో ఉండబోయేవి కూడా అని అర్థము. భూత భవిష్య ద్వర్తమానాలలో ఉన్నవాటి నన్నిటినీ ఒకే చోట చూచే దెలా? ఒకే కాలంలో వీక్షించే దెలా? అలా వీక్షించాలంటే అన్ని కాలాలు ఒక కాలం లోకి రావాలి. అన్ని కాలాలు ఒక కాలమైతే, ఆ కాలాన్ని ఏమని పిలవాలి? భవిష్యత్తు వర్తమాన మెలా అవుతుంది? వర్తమానం గత మెలా అవుతుంది? గతం భవిష్యత్తు అయ్యే దెలా? కనుక, భగవంతుడు ప్రదర్శించబోయే

విశ్వరూపం కాలానికి, దేశానికి అతీతమైంది. దానిని దర్శించడం కూడా, సాధారణంగా మనం ప్రపంచంలో ఒక దాని తరువాత మరొక దానిని దేశకాలాదులలో కదుల్తూ దర్శించినట్లు దర్శించడము కాదని స్పష్టమైంది. అన్నిటినీ ఒకే చోట, ఒకే కాలంలో, ఒకే రూపంలో దర్శించడము అంటే, చూడటానికి అన్నీ సిద్ధమై, కాలం గాని కాలంలో, దేశం గాని దేశంలో కళకళ లాడుతున్నాయి అని అర్థం. కనుకనే, తాను స్వేచ్ఛగా ప్రదర్శించడమే గాక, తనకు అవసరమైంది దర్శించే స్వేచ్ఛను అర్జునునికి కూడా అనుగ్రహించాడు భగవంతుడు ***(యచ్చ అన్యత్ ద్రష్టుం ఇచ్ఛసి తదపి పశ్య)***. అంటే, తాను చూపేవే కాకుండా, అర్జునుడు చూడాలి అనుకున్నవి కూడా చూడవచ్చు అని అర్థము. ఇంతకన్నా అద్భుత మేముంటుంది?

మరి, సమస్తము విశ్వరూపం లోనే దర్శనీయమై నపుడు, వాటి కన్నా అన్యమైనవి ఏమున్నాయని అర్జునుడు దర్శించాలని అభిలషిస్తాడు? కానీ, అలా అభిలషించే అవకాశమే లేకపోతే, అన్యములను చూడా లనుకుంటే చూడవచ్చు అని భగవంతుడు మాత్రం ఎందుకు చెబుతాడు? కనుక, ఉంది. దర్శించాల్సింది ఉంది. దర్శించాలనే కోరిక అర్జునునిలో అందుకే ఉంది. కాకపోతే, అది అర్జునుని మనస్సులో సంశయ రూపంలో ఉంది. ఏమిటా సంశయం? కురుక్షేత్ర సంగ్రామంలో విజయానికి సంబంధించిన సంశయం. ఈ విషయాన్ని రెండవ అధ్యాయం లోనే అర్జునుడు అచ్యుతునికి విన్నవించు కున్నాడు.

యద్వాజయేమ యది వా నో జయేయుః న విద్మః - కృష్ణా! మనం కౌరవులను జయిస్తామో, లేక కౌరవులే మనల్ని జయిస్తారో తెలియదు అని సమరానికి సంబంధించిన విజయ విషయాన్ని ముందుగానే ప్రస్తావించాడు పార్థుడు (2 వ అ - 6 వ శ్లో). విశ్వరూప దర్శనంలో ఒకవేళ అర్జునుడు అభిలషిస్తే, ఆ సంశయాన్ని కూడా తీర్చుకోవచ్చు. అదెలా సాధ్యం? యుద్ధం ఇంకా ఆరంభం కానేలేదు కదా! అదే విచిత్రం. అదే అద్భుతం. అద్భుత దర్శనం లోని పరమాద్భుతం. సమరము - సమర విజయము భవిష్యత్తుకు సంబంధించినవి అని మనకు అనిపించ వచ్చు. కానీ, కాలాతీత స్థితిలో ఏ కాలమూ లేదు కాబట్టి, అన్ని కాలాలూ అందులో ఒదిగి ఉంటాయి. కనుక, అక్కడ దేనిని చూడట మైనా సాధ్యమే. కురుక్షేత్ర సంగ్రామం ముగిసిన తరువాత, మరణించిన వారి నందరినీ గంగాతీరంలో వ్యాస భగవానుడు దర్శింప చేసింది కూడా అది ఇలా సాధ్యం కాబట్టే. ఇవన్నీ సూక్ష్మంగా అర్థం చేసుకోవలసిన విషయాలు. ఉన్న స్థాయి నుండి కాకుండా, ఉన్నత స్థాయిలో మేల్కొని దర్శించ వలసిన సత్యాలు. అందుకనే, అర్జునుని **గుడాకేశా!** అని సంబోధించాడు భగవంతుడు.

న తు మాం శక్యసే ద్రష్టు మనేనైవ స్వచక్షుషా ।
దివ్యం దదామి తే చక్షుః పశ్య మే యోగ మైశ్వరమ్ ॥ 8

న-తు-మాం-శక్యసే-ద్రష్టుం-అనేన-ఏవ-స్వచక్షుషా
దివ్యం-దదామి-తే-చక్షుః-పశ్య-మే-యోగం-ఐశ్వరం

మాం	= నన్ను	చక్షుః	= నేత్రమును
అనేన	= ఈ	దదామి	= ఇస్తున్నాను
స్వచక్షుషా ఏవ	= నీ కళ్ళతో	మే	= నా యొక్క
ద్రష్టుం	= చూడటం	ఐశ్వరం	= దివ్యమైన
న శక్యసే తు	= సాధ్యపడదు	యోగం	= యోగమును
తే	= నీ కొరకు	పశ్య	= చూడు!
దివ్యం	= దివ్యమైన		

అర్జునా! నీ నేత్రాలతో నన్ను దర్శించడము సాధ్యపడదు. నీకు దివ్య చక్షువులను ప్రసాదిస్తున్నా! ఈశ్వర సంబంధమైన నా యోగ వైభవాన్ని దర్శించు!

వ్యాఖ్య

చూడటానికి అర్జునుడు సిద్ధంగా ఉన్నాడు. చూపించడానికి శ్రీకృష్ణుడు సిద్ధపడే ఉన్నాడు. అయినా, దర్శనానికి ఏదో అవరోధం ఏర్పడుతోంది. ప్రతిబంధకము అడ్డు నిలుస్తోంది. ఆ ప్రతిబంధకం ఏదో కాదు. అర్జునుని నేత్ర ద్వయం. చూచే వాని చక్షువులు. మహిమను దర్శించే శక్తి లేని మాంస చక్షువులు. అందుకనే, నీ కళ్ళతో నా వైభవాన్ని చూడలేవు అర్జునా! అంటున్నాడు భగవంతుడు.

దేశకాలాదులలో కదిలే వాటిని పరిమిత స్థాయి నుండి వీక్షించే మానవుని మాంస చక్షువులు, కాలాతీత మైన దివ్య కళాత్మక దర్శనాన్ని ఎలా వీక్షించ గలవు? భగవదైశ్వర్యాన్ని దర్శించడము అనేది భగవంతుడి నేత్రాలతో దర్శించి నపుడే సాధ్య పడుతుంది. అందుకనే, ఈశ్వర వైభవాన్ని దర్శించ డానికి దివ్య చక్షువులను ఇస్తున్నాడు భగవంతుడు ***(దదామి తే దివ్యం చక్షుః).*** రాయబార సమయంలో కూడా కౌరవ సభ లోని వారికి దివ్య దృష్టిని ప్రసాదించిన తరువాతే తన విశ్వరూపాన్ని దర్శింప చేశాడు.

మరొక అద్భుతం. ఇంతవరకు, కురుక్షేత్రంలో కృష్ణార్జునుల రథం ప్రక్కన నిలబడి మనం భగవద్గీతను వింటూ వచ్చాం. రెప్పపాటులో మనల్ని అక్కడి నుండి ఎక్కడికో పట్టుకు పోయాడు వ్యాస భగవానుడు. ఎక్కడ మనకు గీత మొదలైందో అక్కడికి మనల్ని చేర్చేశాడు. ఇప్పుడు మనం కురుక్షేత్రంలో లేము. ధృతరాష్ట్రుని శయన మందిరంలో ఉన్నాం. ఇప్పుడు మన ముందు కృష్ణార్జునులు లేరు. సంజయ ధృతరాష్ట్రులు ఉన్నారు. చదవండి.

సంజయ ఉవాచ :

ఏవ ముక్త్వా తతో రాజ న్మహా యోగేశ్వరో హరిః । 9
దర్శయామాస పార్థాయ పరమం రూప మైశ్వరమ్ ॥

ఏవం-ఉక్త్వా-తతః-రాజన్-మహాయోగేశ్వరః-హరిః
దర్శయామాస-పార్థాయ-పరమం-రూపం-ఐశ్వరం

రాజన్	=	రాజా!	పరమం	=	ఉత్తమమైన
ఏవం	=	ఈ విధంగా	ఐశ్వరం	=	ఈశ్వర సంబంధమైన
ఉక్త్వా	=	పలికి	రూపం	=	విశ్వరూపమును
తతః	=	ఆ తరువాత	పార్థాయ	=	పార్థుని కొరకు
మహాయోగేశ్వరః	=	గొప్ప యోగేశ్వరుడైన	దర్శయామాస	=	చూపించాడు
హరిః	=	శ్రీహరి			

సంజయుడు అంటున్నాడు :

రాజా! ధృతరాష్ట్రా! శ్రీకృష్ణుడు అలా భాషించాడు. అంతే. ఈశ్వర సంబంధమైన తన దివ్య రూపాన్ని ప్రదర్శించి అర్జునుని అనుగ్రహించాడు మహా యేగేశ్వరుడైన శ్రీహరి.

వ్యాఖ్య

అర్జునుడు తన దివ్య రూపాన్ని దర్శించడానికి దివ్య చక్షువులను అనుగ్రహిస్తానని శ్రీకృష్ణుడు అనడం

మనం విన్నాం. ఈ లోగా మనం అక్కడ లేకుండా, ధృతరాష్ట్రుని మందిరానికి చేర్చబడ్డాం. కురుక్షేత్రంలో ఏం జరుగుతూ ఉందో! శ్రీకృష్ణుడు విశ్వరూపాన్ని చూపిం చేస్తున్నా డేమో! అనే ఉత్సుకత మనందరిలో ఉంది. ఫరవాలేదు. ఇక్కడ కూడా మన ముందు సంజయు డున్నాడు. మనం చూడలేని దానివి ఆయన చూడ గలడు. వ్యాస ప్రసాదంగా ఆయనకు ప్రాప్తించిన దివ్య దృష్టితో కురుక్షేత్రంలో జరిగే దంతా చూడ గలడు. చూచిన దంతా ప్రత్యక్ష వ్యాఖ్యానంగా ధృతరాష్ట్రునికి వినిపిస్తూ ఉంటాడు. మనం కూడా శ్రవణానందంగా ఆలకించ వచ్చు. కాకపోతే, ధృతరాష్ట్రునికి కళ్ళు లేక పోయినా, మనకు ఉన్నా, ప్రస్తుతం అందరమూ చూడ లేని వాళ్ళమే. కానీ, వీను లున్న పుణ్యానికి, బధిరత్వము లేని భాగ్యానికి సంజయుని అమృత భాషణాన్ని వినగలుగుతాము.

ఈ సందర్భంలో అర్థం చేసుకోవలసిన అద్భుతం మరొకటి ఉంది. ఒకవేళ మనం ఇక్కడ ఉండలేక తొందరపడి కురుక్షేత్రానికి పరుగులు తీసినా, అక్కడ కూడా విన గలమే గాని చూడ లేము. ఇక్కడ ఉంటే సంజయుని ద్వారా వినాలి. అక్కడి కెళ్తే అర్జునుని ద్వారా వినాలి. ఎందుకని? భగవంతుని విశ్వరూపాన్ని వాళ్ళిద్దరే చూస్తున్నారు. వారిద్దరికే దివ్యదృష్టి ప్రసాదింప బడింది. విశ్వరూపాన్ని దర్శించ డానికి మనకు దివ్యదృష్టి ఎక్కడుంది? తగుదునమ్మా అని కళ్ళజోడు పెట్టుకొని చూసినా విశ్వరూప దర్శనం జరుగుతుందా? కళ్ళున్నా ఆ రూపం మనకు కనిపించదు. చెవులున్నా ఆ నాదం మనకు వినిపించదు. ఈ విషయాన్ని ఉపనిషత్తు అద్భుతంగా వినిపించింది.

శృణ్వతోఽపి న శృణ్వన్తి జాననోఽపి న జానతే।
పశ్యన్తోఽపి న పశ్యన్తి పశ్యన్తి జ్ఞాన చక్షుషః॥

దానిని వింటూ వినలేరు. తెలుసుకుంటూ తెలుసుకో లేరు. కంటూ కన లేరు. జ్ఞాననేత్రము తోనే దర్శించ గలరు.

ఇక వెలి తెందుకు? సంజయుడు చెబుతూ ఉంటాడు. మనం బుద్ధిలో దర్శిస్తూ ధన్యుల మవుదాం. శ్రీకృష్ణుడు అర్జునునికి విశ్వరూపాన్ని దర్శింప చేశాడని సంజయుడు చెబుతున్నాడు **(పరం రూపం పార్థాయ దర్శయామాస).**

ఈ సందర్భంలో గీతాచార్యుని **మహాయోగేశ్వరః** అని, **హరిః** అని రెండు నామాలతో సంజయుడు వర్ణించాడు. అక్కడ జరుగుతున్నది విశ్వరూప ప్రదర్శనం కనుక, యోగమాయను తన అధీనంలో ఉంచుకొని తన దివ్య రూపమును సందర్శింప చేస్తున్న వాసుదేవ మూర్తిని 'మహాయోగేశ్వరుడు' అంటున్నాడు. ఆ మహాయోగేశ్వ రేశ్వరునే 'హరి'గా కూడా అభివర్ణిస్తున్నాడు.

హరిః సహేతుక సంసారం హరతి ఇతి హరిః - హరించే వాడు హరి. దేనిని హరిస్తాడు? సంసారాన్ని, సంసార హేతువైన అవిద్యను హరించే వాడు కనుక ఆయన హరి భగవానుడు. విశ్వరూప ప్రదర్శన ప్రభావం చేత కార్యరూప ప్రపంచ వ్యామోహాన్ని, కారణరూప అజ్ఞానాన్ని సమూలంగా హరిస్తున్నాడు అనే భావంతో భగవానుని 'హరి' అని వర్ణించాడు.

విశ్వరూప ప్రదర్శనాన్ని చూస్తూ ఇలా చెబుతున్నాడు సంజయుడు.

అనేక వక్త్రనయన మనే కాద్భుత దర్శనమ్ । 10
అనేక దివ్యాభరణం దివ్యా నేకోద్యతాయుధమ్ ॥

అనేక వక్త్రనయనం-అనేకాద్భుత దర్శనం
అనేక దివ్యాభరణం-దివ్యా నేకోద్యతాయుధం

అనేక వక్త్రనయనం	=	అనేకమైన ముఖములు కన్నులు గలది
అనేకాద్భుత దర్శనం	=	అనేకములైన అద్భుతదర్శనములు గలది
అనేక దివ్యాభరణం	=	అనేకములైన దివ్య ఆభరణములు గలది
దివ్యా నేకోద్యతాయుధం	=	దివ్యములు, అనేకములు నైన ఎత్తబడిన ఆయుధములు గలది

అదిగో! విశ్వరూపం అదిగో! అనేక ముఖాలు, అనేక నేత్రాలతో ఉంది. అద్భుత దృశ్యాలతో అలరారుతోంది. దివ్యాభరణాలతో శోభిస్తోంది. అనేక దివ్యమైన ఆయుధాలను ఎత్తి పట్టుకొని ఉంది.

దివ్య మాల్యామ్బరధరం దివ్యగన్ధానులేపనమ్ ।
సర్వాశ్చర్యమయం దేవ మనన్తం విశ్వతోముఖమ్ ॥ 11

దివ్య మాల్యాంబరధరం-దివ్య గంధానులేపనం
సర్వాశ్చర్యమయం-దేవం-అనంతం-విశ్వతోముఖం

దివ్యమాల్యాంబరధరం	=	దివ్యములైన హారములు, వస్త్రములు గలది
దివ్యగంధానులేపనం	=	దివ్యమైన గంధపు లేపనము గలది
సర్వాశ్చర్య మయం	=	అన్ని వింతలతో కూడినది
అనంతం	=	అనంతమైనది
విశ్వతోముఖం	=	అంతటను ముఖములు గలది
దేవం	=	ప్రకాశవంత మైనది

ఆ విశ్వరూపము దివ్యమైన మాలలను, వస్త్రాలను ధరించి ఉంది. దివ్యమైన గంధమును పూసికొని ఉంది. సమస్త ఆశ్చర్యాలతో ప్రకాశిస్తోంది. అన్ని వైపుల ముఖాలు కలిగి అనంతంగా గోచరిస్తోంది.

వ్యాఖ్య

ఏకము, అఖండము అయిన పరమేశ్వరుని రూపంలో దృశ్యాలన్నీ అనేకంగా గోచరిస్తున్నాయి. అనేకంగా
నోళ్ళు, అనేకంగా నేత్రాలు ఉన్నాయి. ఆ నోళ్ళన్నీ పరమేశ్వరునివే. ఆ నేత్రాలన్నీ ఆయనవే. అంటే నోళ్ళు
ఆరగిస్తున్నాయి. నేత్రాలు అవలోకిస్తున్నాయి. అన్నిటినీ ఆరగించడం, అన్నిటినీ అవలోకించడం జరుగుతూ
ఉంది. ఆ రూపము వీక్షించని రూపము లేదు, దృశ్యము లేదు. అది మ్రింగని చరాచరములు ఉండవు. సర్వ
తోऽక్షి శిరోముఖమ్ - అతని కళ్ళు, శిరస్సు, ముఖము సర్వత్ర వ్యాపించి ఉన్నాయి అని పదమూడవ
అధ్యాయంలో కూడా చూడబోతాము.

పరమేశ్వరుని విశ్వరూపమే ఒక అద్భుతం ***(అద్భుతవత్ అద్భుతః).*** అద్భుతమైన ఆ మహారూపంలో ఇంకా
అనేక అద్భుతాలు గోచరిస్తున్నాయి. అంతా ఆశ్చర్యమే. అన్నీ ఆశ్చర్యాలే. ఆ దివ్య రూపంలో ప్రకాశవంతమైన
ఆభరణాలు అసంఖ్యాకంగా అలంకరింపబడి ఉన్నాయి. అలాంటి అద్భుతమైన ఆభరణాలు గతంలో ఎవ్వరూ
చూచి ఉండరు. అవి ఈ లోకంలో కనిపించేవి కావు. దివ్యము లైనవి. పరలోకాలలో ప్రకాశవంతంగా శోభించేవి.

ఆ విశ్వమూర్తిలో శక్తివంతము లైన ఆయుధాలు ఎన్నో ఉన్నాయి. పైగా అవి ఎత్తబడి ఉన్నాయి ***(దివ్యాని***
అనేకాని ఉద్యతాని ఆయుధాని). ఆయుధాలను ధరించడం వేరు. ఆయుధాలను పైకి ఎత్తడము వేరు. ఖడ్గము
పైకి లేచింది అంటే, ఏదో ఖండింప బడుతూ ఉందని అర్థము. ఒక వైపు ప్రభవ స్థానాలు కనిపిస్తూ ఉంటే, ఆ
రూపం లోనే మరో వైపు లయం కూడా సాగిపోతూ ఉందని అర్థము.

దివ్యగంధ లేపనంతో, దివ్య వస్త్ర మాలలతో అలంకరింప బడి దివ్యసౌరభాలను విరజిమ్ముతూ, పరిమళ భరితంగా ఉన్న ఆ విశ్వరూపము పరమాశ్చర్యంగా ఉంది. సర్వాశ్చర్యంగా ఉంది. అనంతంగా ప్రకాశిస్తూ విశ్వతోముఖంగా విరాజిల్లుతోంది. సర్వతోముఖంగా వర్ధిల్లుతోంది ***(విశ్వతః ముఖాని అస్యేతి విశ్వతోముఖః).*** విశ్వం లోని ముఖాలన్నీ ఆయన లోనే ఉన్నాయి కనుక ఆయన విశ్వతోముఖుడు. విశ్వమూర్తి, విశ్వరూప మూర్తి, కాని, విశ్వం లోని రూపాలన్నీ ఏకరూపు డైన తన యందే భాసించడం చేత ఆయన మహామూర్తి ***(అస్య మహతీ మూర్తిః ఇతి).***

విశ్వరూపమూర్తి అయిన పరమేశ్వరుని ప్రకాశానికి ఉపమానాన్ని ఉదహరిస్తున్నాడు.

దివి సూర్య సహస్రస్య భవే ద్యుగప దుత్థితా ।
యది భాః సదృశీ సా స్యా ద్భాస స్తస్య మహాత్మనః ॥ 12

దివి-సూర్యసహస్రస్య-భవేత్-యుగపత్-ఉత్థితా
యది-భాః-సదృశీ-సా-స్యాత్-భాసః-తస్య-మహాత్మనః

దివి	=	ఆకాశము నందు	తస్య	=	ఆ
సూర్య సహస్రస్య	=	వేయి మంది సూర్యుల	మహాత్మనః	=	మహాత్ముని యొక్క
యుగపదుత్థితా	=	ఏకకాలమందు కదిలిన	భాసః	=	కాంతికి
భాః	=	కాంతి	సదృశీ	=	సమాన మైనది
భవేత్ యది	=	సంభవించెనేని	స్యాత్	=	అవుతుంది
సా	=	ఆ కాంతి			

వేయి మంది సూర్యులు ఆకాశంలో ఒకేసారి ఉదయిస్తే ఆ కాంతి ఎలా ఉంటుందో, విశ్వరూపుని ప్రకాశం అలా ఉందనుకో!

వ్యాఖ్య

విశ్వరూప చైతన్య జ్యోతి వైభవాన్ని వర్ణిస్తున్నాడు. విషయ సౌలభ్యం కోసం మ్రింగుడు పడని ఉపమానాన్ని అలంకారంగా జోడిస్తున్నాడు.

సాధారణంగా పోలిక అనేది రెండు తెలిసిన విషయాల మధ్యే సాధ్య పడుతుంది. కనుక, ఇక్కడ ఉపమను అలంకరించడం క్లిష్టంగా మారింది.

ఆకాశంలో సూర్య ప్రకాశాన్ని మనం చూచి ఉన్నాము. విశ్వరూపుడు అలాంటి ప్రకాశము కలవాడు
అంటే అర్థం చేసుకోవచ్చు. కాని, వెయ్యి మంది సూర్యులు **(సూర్యాణాం సహస్రం సూర్య సహస్రం)** ఒకే
కాలంలో ఒకే చోట ప్రకాశించడం అనేది మనం ఎప్పుడూ చూడ లేదు. చూడని దానిని చూస్తున్న దానితో
ఉపమించి అలంకరించడం ఏమిటో! అందుకే మ్రింగుడు పడని ఉపమానం అంటున్నాను. అలాగని, అసలే
చూడని, అసలే తెలియని విషయం అని చెప్పడానికి వీలు లేదు. సూర్యుణ్ణి మనం చూచి ఉన్నాం. సూర్యప్రకాశం
మన అనుభవంలో ఉంది. కాకపోతే, తలెత్తి చూడలేని ఒక సూర్య ప్రకాశాన్ని సహస్రంతో ఎచ్చు వేసి చూడా
లంటేనే ఆ వెచ్చదనం దుర్భర మవుతూ ఉంది. పైగా సహస్రం అంటే పది వందలు మాత్రమే కాదు కదా!
సహస్ర మనేది అనంతానికి ఉపలక్షణం అనేది మనకు తెలుసు.
ఉపమను చక్కగా ఆవిష్కరించాలి అంటే, వేయి మంది సూర్యులు ఒకేసారి ఆకాశంలో ప్రకాశిస్తూ

ఉండటాన్ని గతంలో మనం ఎప్పుడూ చూడక పోయినా, ఒక్క సూర్యుని చూచిన అనుభవం ఉంది కనుక, దానిని ఆధారం చేసుకొని అందని అలంకారాన్ని అందుకునే ప్రయత్నం మనం చెయ్యాలి. దీనినే 'అభూత ఉపమాలంకారము' అంటారు. అంటే, గతంలో అనుభవములో లేనిది అని అర్థము. అనుభవంలో లేని దానిని భావించడమే ప్రధానం కావడం చేత దీనిని 'సంభావిత ఉపమాలంకారము' అని కూడా అంటారు.

త త్రైకస్థం జగ త్కృత్స్నం ప్రవిభక్త మనేకధా ।
అపశ్య ద్దేవదేవస్య శరీరే పాణ్డవ స్తదా ॥ 13

తత్ర-ఏకస్థం-జగత్-కృత్స్నం-ప్రవిభక్తం-అనేకధా
అపశ్యత్-దేవదేవస్య-శరీరే-పాండవః-తదా

తదా	=	అప్పుడు	దేవదేవస్య	=	దేవదేవుని యొక్క
పాండవః	=	అర్జునుడు	తత్ర	=	ఆ
అనేకధా	=	అనేక విధాలుగా	శరీరే	=	దేహము నందు
ప్రవిభక్తం	=	విభజింప బడిన	ఏకస్థం	=	ఒక్కచోటనే
జగత్	=	జగత్తును	అపశ్యత్	=	దర్శించాడు
కృత్స్నం	=	సమస్తాన్ని			

అప్పుడు అర్జునుడు దేవదేవుని శరీరంలో సమస్త ప్రపంచాన్ని వీక్షించాడు. ఆ ప్రపంచం ఒకే చోట అనేక విధాలుగా, వేరువేరుగా కనిపించింది.

తతః స విస్మయావిష్టో హృష్టరోమా ధనఞ్జయః ।
ప్రణమ్య శిరసా దేవం కృతాఞ్జలి రభాషత ॥ 14

తతః-సః-విస్మయావిష్టః-హృష్టరోమా-ధనంజయః
ప్రణమ్య-శిరసా-దేవం-కృతాంజలిః-అభాషత

తతః	=	తరువాత	దేవం	=	దేవుని
సః	=	ఆ	శిరసా	=	శిరస్సుతో
ధనంజయః	=	అర్జునుడు	ప్రణమ్య	=	నమస్కరించి
విస్మయావిష్టః	=	ఆశ్చర్యచకితుడై	కృతాంజలిః	=	చేతులు జోడించి
హృష్టరోమా	=	పులకాంకితుడై	అభాషత	=	భాషించాడు

ఆ తరువాత, అర్జునుడు ఆశ్చర్యచకితు డయ్యాడు. గగుర్పాటు చెందాడు. శిరస్సు వంచి ఆ దివ్య పురుషునికి నమస్కరించాడు. దోసి లొగ్గి పలికాడు.

వ్యాఖ్య

విశ్వరూప మూర్తి దివ్య దేహంలో సమస్త జగత్తును వీక్షించాడు అర్జునుడు. ఆ రూపాలు అనేక విధాలుగా ఉన్నాయి. దేవ, పితృ, మనుష్యాది భేదాలతో అనేక విధాలుగా కనిపిస్తున్నాయి. ఒక్క చోటే ఉన్నా, జాతి భేదాలను బట్టి వేరు వేరుగా తెలుస్తున్నాయి. దేవతలు దేవ జాతి. రాక్షసులు రాక్షస జాతి. గంధర్వులు గంధర్వ జాతి. కిన్నరులు కిన్నర జాతి. మానవులు మానవ జాతి. అలాగే జంతు, పక్షి, కీటకాదులు కూడా. అన్నీ ఉన్నాయి. ఒకేచోట ఉన్నాయి. అయినా, అనేక విధాలుగా, వేరువేరుగా తెలుస్తూ ఉన్నాయి.

విజయుడు విస్మయం చెందాడు. ఏదీ అర్థం గాని అలౌకి కానుభూతిలో నిమగ్న మయ్యాడు. విస్మయాలను చూచి విస్తుపోదామా అంటే, వికృతాలు తీవ్రంగా భయపెడు తున్నాయి. ఒక వైపు బీభత్సాలు గుండెను పరుగు లెత్తిస్తూ ఉంటే, మరో వైపు సౌమ్య రూపాలు మనస్సును శాంతింప చేస్తూ ఉన్నాయి. ఏ రసాన్ని మ్రింగాలో, ఏ రసాన్ని త్రేపాలో అర్థం కావడం లేదు. అలాగని అన్ని రసాలను రంగరిస్తే, అది ఏ రసమో అసలే అర్థం కావడం లేదు. రసాలన్నీ లోపల నిండుతూ ఉంటే, రోమాలు పైకి నిక్కబొడుచుకుంటూ ఉన్నాయి **(హృష్ట రోమాః).** శిరస్సు అప్రయత్నంగా భక్తి భారంతో వంగి పోతోంది. చేతులు పరస్పరం కలుసుకొని ఏక మయ్యాయి. అర్జునుడు నోరు తెరిచాడు. ఏం పలుకుతాడో విందాం.

మనల్ని తిరిగి కురుక్షేత్రానికి చేర్చే ప్రయత్నంలో వ్యాసు డున్నాడు. మనమూ ఆరాధనా హృదయంతో అర్జునుని లాగా కొన్ని క్షణాలు ఐదు పది చేసి కళ్ళు మూద్దాం.

అర్జున ఉవాచ :

పశ్యామి దేవాం స్తవ దేవ దేహే సర్వాం స్తథా భూత విశేష సంఘాన్ ।
బ్రహ్మాణ మీశం కమలాసనస్థ మృషీంశ్చ సర్వా నురగాంశ్చ దివ్యాన్ ॥ 15

పశ్యామి-దేవాన్-తవ-దేవ-దేహే-సర్వాన్-తథా-భూత విశేష సంఘాన్
బ్రహ్మాణం-ఈశం-కమలాసనస్థం-ఋషీన్-చ-సర్వాన్-ఉరగాన్-చ-దివ్యాన్

దేవ	=	దేవా!	కమలాసనస్థం	=	పద్మాసనము నందున్న
తవ	=	నీ యొక్క	బ్రహ్మాణం	=	బ్రహ్మను
దేహే	=	దేహము నందు	సర్వాన్	=	సమస్తములైన
సర్వాన్	=	సమస్తమైన	ఋషీన్ చ	=	ఋషులను
దేవాన్	=	దేవతలను	దివ్యాన్	=	దివ్యములైన
తథా	=	అలాగే	ఉరగాన్ చ	=	సర్పాలను
భూతవిశేష సంఘాన్	=	చరాచర భూతసమూహములను	పశ్యామి	=	చూస్తున్నాను
ఈశం	=	ఈశ్వరుడు			

విజయుడు విన్నవించుకుంటున్నాడు :

దేవా! నీ దేహంలో సర్వ దేవతలను, సమస్త భూత సమూహాలను చూస్తున్నాను. కమలాసనంపై ఉన్న ప్రభువు బ్రహ్మదేవుని, సమస్త ఋషివర్యులను, దివ్యములైన సర్పాలను కూడా చూస్తున్నాను.

వ్యాఖ్య

పరమేశ్వరుడు అనుగ్రహించిన మహాద్భుతమైన విశ్వరూపాన్ని దర్శిస్తూ, **తదహం పశ్యామి** - ఆ రూపాన్ని నేను చూస్తున్నాను అంటూ అర్జునుడు తన అనుభవాన్ని ఆవిష్కరిస్తున్నాడు **(స్వానుభవమ్ ఆవిష్కుర్వన్).**

అనూహ్యమైన పరమేశ్వరుని దివ్యమయ దేహంలో ఇంద్రాది సమస్త దేవతలు, భృగ్వాది ఋషి పుంగవులు, చతుర్ముఖ బ్రహ్మ, మరియు వాసుకి, ఆదిశేషుడు మొదలైన దివ్యసర్పాలు, స్థావర జంగమాత్మకము లైన సమస్త భూత సముదాయము అర్జునునికి కనిపిస్తున్నాయి.

సమస్త దేవతలు అన్నప్పుడు బ్రహ్మదేవుడు కూడా దేవతల కోవ లోకే వస్తాడు. కనుక, ఆయనను ప్రత్యేకించి కమలాసనంపై ఉన్న ప్రభువైన బ్రహ్మదేవుడు అని చెప్పే అవసరం లేదు. కాని, అలా ప్రత్యేకించి

ప్రస్తావించడానికి బ్రహ్మ ఈ సృష్టికి ప్రధాన కారకుడు, ప్రజలను నియమించే ప్రభువు కావడమే కారణము ***(ఈశితారం ప్రజానాం).***

కమలాసనస్థుడు, ప్రభువు అయిన బ్రహ్మదేవుని అర్జునుడు చూస్తున్నాడు అంటే, పరమేశ్వరుని విశ్వరూపంలో బ్రహ్మలోకము కూడా కనిపిస్తూ ఉంది అని అర్థము. అలాగే దేవతా సమూహాన్ని ఉటంకించడం చేత, ఒక్క బ్రహ్మ లోకమే కాక, ఇంద్ర, వరుణ, పితృ దేవతాది లోకాలన్నీ గోచరిస్తున్నాయి అని అర్థము. ఇవన్నీ అర్జునుడు గతంలో చూచి ఉండనివి. అతని పూర్వానుభవంలో లేనివి.

అర్జునుని పూర్వానుభవంలో అవి లేనివి కావచ్చు. కాని, సృష్టిలో ఉన్నవే. సృష్టి అనేది కేవలం మానవ లోకానికే సంబంధించింది కాదు. సమస్త లోకాలు సృష్టి లోకే వస్తాయి. సృష్టికి ముందు ఏ లోకమూ లేదు. సర్వ లోకాలూ సృష్టి లోనివే అయి నపుడు, మనం నివసిస్తున్న ఈ విశ్వం ఎంతో, ఏ పాటిదో ఊహించుకోవడం కష్టసాధ్య మేమీ కాదు. విశ్వమే లేశ మాత్రమై నపుడు, ఆ విశ్వంలో వ్యక్తి స్థాన మెంత? ఈ విధంగా విశ్వరూప వైభవాన్ని అర్థం చేసుకోగలిగితే వ్యక్తి లోని అహంకారం మంచు లాగా కరిగి పోతుంది.

మహత్తు కలిగినవి, మహాద్భుత మైనవి అయిన అనేక రూపాలను విశ్వరూపంలో ఒకేసారి అర్జునుడు చూస్తున్నాడు. ఆ రూపాలన్నీ విశ్వంలో ఎలా నిండి ఉన్నాయో స్పష్టంగా దర్శిస్తున్నాడు.

స్థావర జంగమాత్మక మైన సమస్త భూత సముదాయాన్ని కూడా విశ్వరూపంలో వీక్షిస్తున్నాడు. కదలకుండా ఉండే పర్వత వృక్షాదులు స్థావరాలు. మానవులతో సహా, చరించే జంతుజాల మంతా కలిసి జంగమాలు. ఇవి స్థావర జంగమాలు. చరాచరాలు. ఇలా వివిధములైన జాతులు, వాటి రూపాలు, వాటి చలనాలు - జరాయుజాలు, అండజాలు, స్వేదజాలు, ఉద్భిజాలు, భూచరాలు, ఖేచరాలు, జలచరాలు - అన్నిటినీ దర్శిస్తున్నాడు ధనంజయుడు.

వాటితో పాటు దివ్యములైన ఉరగాలను కూడా, అంటే వాసుకి మొదలైన ఉత్తమ సర్పాలను కూడా చూస్తున్నాడు ***(సర్వాన్ ఉరగాన్ చ వాసుకీ ప్రభృతీన్ దివ్యాన్ దివి భవాన్).*** సర్పాలను ఉరగములు అంటారు. 'ఉరము' అంటే ఛాతి. ఛాతితో గమించేది, అంటే నడిచేది కనుక పాముకు 'ఉరగము' అని పేరు ***(ఉరసా గచ్ఛతి ఇతి ఉరగః).***

అనేక బాహూదర వక్త్రనేత్రం పశ్యామి త్వాం సర్వతోఽనన్తరూపమ్ ।
నాన్తం న మధ్యం న పున స్తవాదిం పశ్యామి విశ్వేశ్వర విశ్వరూప ॥ 16

అనేక బాహూదర వక్త్రనేత్రం-పశ్యామి-త్వాం-సర్వతః-అనంతరూపం
న-అంతం-న-మధ్యం-న-పునః-తవ-ఆదిం-పశ్యామి-విశ్వేశ్వర-విశ్వరూప

విశ్వేశ్వర	= విశ్వేశ్వరుడా!
విశ్వరూప	= విశ్వరూపుడా!
అనేక బాహూదర వక్త్రనేత్రం	= అనేకములైన బాహువులు, పొట్టలు, ముఖములు, నేత్రములు కలిగి
సర్వతః	= అన్నిచోట్ల
అనంతరూపం	= అనంత రూపములతో
త్వాం	= నిన్ను
పశ్యామి	= చూస్తున్నాను
పునః	= మరియు
తవ	= నీ యొక్క
ఆదిం	= ఆరంభమును
న పశ్యామి	= చూడలేక పోతున్నాను
అంతం	= అంతమును
న	= చూడలేక పోతున్నాను
మధ్యం	= నడుమను
న	= చూడలేక పోతున్నాను

విశ్వేశ్వరా! విశ్వరూపా! అనేక బాహువులు, ఉదరాలు, ముఖాలు, నేత్రాలు, అంతము లేని రూపాలతో శోభిస్తున్న నిన్ను అన్ని వైపుల చూస్తున్నాను. నీకు ఆది ఎక్కడో, అంత మెక్కడో నాకు కనిపించడం లేదు.

వ్యాఖ్య

మన దేహంలో అగుపించే వన్నీ మనకు సంబంధించినవే అయినట్లు, విశ్వరూపునిలో గోచరించే వన్నీ విశ్వమూర్తికి సంబంధించినవే. ఆయనలో అనేక బాహువులు కనిపిస్తున్నాయి. అంటే, అందరి బాహువులూ ఆ దివ్యాత్మునివే అని అర్థం. అలాగే అందరి కడుపులు ఆయనివే **(అనేక బాహవః ఉదరాణి).**

అందరి బాహువులు, అందరి పొట్టలు ఆయనివే అయినపుడు, ఎవరి పొట్ట కొట్టినా అది విశ్వమూర్తికే తగులుతుంది. ఎవరి పొట్టకు పెట్టినా అది విశ్వరూపునే తృప్తి పరుస్తుంది. శ్రీకృష్ణునికి ద్రౌపది ఒక శాకమును అందిస్తే, దాని ఫలితంగా దుర్వాస మహర్షి పరివార మంతా, వేల సంఖ్యలో భోంచేసి, ఆకలి తీర్చుకోవడం జరిగింది అని మనం భారతములో చూచే ఉన్నాము కదా! విశ్వరూప దర్శనానుభూతి కేవలం వినోదం కాదు. అది అర్థమైతే, బ్రతుకులు జ్ఞానపూరిత మౌతాయి. జీవితాలు తాత్త్విక అవగాహనతో శోభిస్తాయి.

అన్ని బాహువులు పరమేశ్వరునివే. అన్ని ఉదరాలు పరమేశ్వరునివే. అలాగే అన్ని ముఖాలు, అన్ని నేత్రాలు భగవంతునివే. ఇది అర్థమైతే, పూర్వం కన్నా అధికంగా, అందంగా అన్యులను అర్థం చేసుకోగలం. అందరినీ ప్రసన్నంగా వీక్షించగలం.

ఇక్కడ అనేకములు అని పదే పదే చెప్పడంలో ఆ రూపాలు అసంఖ్యాకంగా గోచరిస్తున్నాయి అని అర్థం. పైగా వాటికి అంత మెక్కడో తెలియడం లేదట **(న అన్తం అన్తః అవసానం).** మధ్య మెక్కడో అర్థం కావడం లేదట. రెండు అంచులు తెలిస్తే కదా, మధ్య మెక్కడో అర్థ మయ్యేది! అంతం తెలియడం లేదు కనుక మధ్య మెక్కడో తెలిసి రావడం లేదు. మధ్యం తెలియడం లేదు కనుక ఆది అగమ్య గోచరమైంది ***(న ఆదిం పశ్యామి).*** ఆదిమధ్యాంతాలు అర్థం కాకుండా విశ్వరూపుడు ప్రకాశిస్తున్నాడు అంటే ఆయన అనంతంగా అలరారు తున్నాడు అని అర్థం.

కిరీటినం గదినం చక్రిణం చ తేజోరాశిం సర్వతో దీప్తిమన్తమ్ ।
పశ్యామి త్వాం దుర్నిరీక్ష్యం సమన్తా ద్దీప్తాన లార్క ద్యుతి మప్రమేయమ్ ॥ 17

కిరీటినం-గదినం-చక్రిణం-చ-తేజోరాశిం-సర్వతః-దీప్తిమంతం
పశ్యామి-త్వాం-దుర్నిరీక్ష్యం-సమంతాత్-దీప్తాన లార్క ద్యుతిం-అప్రమేయం

కిరీటినం	= కిరీటము గల వానిని
గదినం	= గదాధరుని
చక్రిణం చ	= చక్రధరుని
సర్వతః	= అంతటా
దీప్తిమంతం	= ప్రకాశించుచున్న వానిని
తేజోరాశిం	= తేజోరాశిగా
దుర్నిరీక్ష్యం	= చూడశక్యము గాని వానినిగా
దీప్తానలార్క ద్యుతిం	= ప్రజ్వలించెడి అగ్ని సూర్యుల కాంతి గల వానినిగా
అప్రమేయం	= అప్రమేయునిగా
సమంతాత్	= అంతటను
త్వాం	= నిన్ను
పశ్యామి	= చూస్తున్నాను

స్వామీ! కిరీటము పెట్టుకొని, గదను పట్టుకొని, చక్రమును ధరించి తేజోరాశిగా సర్వత్ర ప్రకాశిస్తున్నావు. చూడ శక్యం గాని ప్రజ్వలిత అగ్ని సూర్య తేజము వంటి కాంతితో అప్రమేయంగా శోభిస్తున్న నిన్ను దర్శిస్తున్నాను.

వ్యాఖ్య

ధ్యానమయ జీవితాన్ని కొనసాగించ డానికి, ఉపాసనా సౌలభ్యం కొరకు అసమానమైన, అలౌకికమైన అద్భుత దర్శనాన్ని ఈ శ్లోకం మన కళ్ళ ముందు ఆవిష్కరించి, హృదయంలో సుప్రతిష్ఠం చేస్తుంది.

సగుణారాధన - సాకారోపాసన

కిరీటధారియై, చక్రగదాహస్తుడై కనిపిస్తున్నాడు అంటే విశ్వమూర్తిలో విష్ణుమూర్తి సాకారంగా దర్శన మిస్తున్నాడు అని అర్థం. ఇది ధ్యానావేశాన్ని కలిగించే జ్ఞాన విషయము. దీనిని జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. ఈ కిరీటధారి, చక్రగదాహస్తుడు విశ్వమూర్తి కాడు. అంతెందుకు? విశ్వమూర్తి తానే అయిన శ్రీకృష్ణ పరమాత్మ కూడా ఆ విశ్వరూపంలో దృశ్యంగా శోభిస్తున్నాడు. ఇదొక అద్భుతమైన విషయం. తనలో తాను తానుగా మన కోసం దర్శనాన్ని అనుగ్రహించడ మనేది పరమేశ్వరుని దయా విభూతి.

దివ్యమైన మకుటంతో ధ్యేయరూపుడై ధ్యానావేశమును కల్పిస్తున్న జగన్నాథుడు భక్తవత్సలుడు. ఒక చేతిలో చక్రమును, మరొక చేతిలో గదను పట్టుకొని దివ్యంగా ప్రకాశిస్తున్నాడు. అంటే చతుర్భుజుడైన శ్రీకృష్ణుని దర్శనం జరుగుతూ ఉంది. ధ్యానమూర్తి కళ్ళ ముందే కళకళ లాడుతున్నాడు. ఆ వైభవమూర్తిని మెల్లగా హృదయం లోకి దించుకోవాలి. ఇది ఉపాసనా విశేషంతో, ధ్యాన వైభవంతో శోభిస్తున్న శ్లోకం.

కిరీటాన్ని ధరించి కళకళ లాడుతున్న శ్రీకృష్ణమూర్తి, చక్రగదాధరుడై దర్శన మిస్తున్నాడు. లోక రక్షణార్థం, భక్త సంరక్షణార్థం పరమేశ్వరుడు చక్రగదాధరుడై అలరారు తున్నాడు ***(లోక రక్షణార్థం ధారయతీతి చక్ర గదాధరః).*** ఇది చతుర్భుజుడైన శోభనమూర్తి దివ్యదర్శనం. ధ్యానార్థం, ఉపాసనార్థం ప్రదర్శింప బడిన అలౌకిక రూపము. చతుర్భుజ మూర్తి దివ్యదర్శనం.

ఈ శ్లోకంలో గదాచక్రహస్తు డైన ద్విబాహుమూర్తిని అర్జునుడు వర్ణిస్తూ ఉంటే, మీరు చతుర్భుజు డని వ్యాఖ్యానిస్తా రేమిటి? అనే సందేహం మీకు రావచ్చు. గదాచక్రాలను ప్రస్తావిస్తున్నాడు అంటేనే చతుర్బాహుని దర్శిస్తున్నాడని అర్థం. చతుర్భుజాలతో శోభించే మూర్తి లోనే గదాచక్రాలు ప్రకాశిస్తూ ఉంటాయి.

చత్వారః భుజాః అస్యేతి చతుర్భుజః - నాలుగు భుజాలు కలిగిన వాడు చతుర్భుజుడు. కురుక్షేత్రంలో శ్రీకృష్ణమూర్తి అలాగే దర్శన మిచ్చాడు. ఇది కేవలం ఉపాసనార్థం శోభించే రూపము. ఈ రూపంతో భక్తులు పరమేశ్వరుని ఉపాసిస్తే, లేదా ధ్యానిస్తే, పరమేశ్వరుడు భక్తుల్ని అనుగ్రహించి రక్షిస్తాడు. అదే చతుర్భుజుని భక్త సంరక్షణము.

ఉపాసనా స్ఫూర్తి

పవిత్ర పూజా వేళ భగవంతుని ధ్యానించడానికి ఆయన చతుర్భుజ రూపము భక్తులకు గొప్ప స్ఫూర్తి నిస్తుంది. ధ్యానావేశాన్ని, ధ్యానాసక్తిని ప్రసాదిస్తుంది. భగవంతుడు నాలుగు భుజాలతో శోభిస్తూ ఉంటాడు. పై నున్న రెండు భుజాలలో ఒక చేతిలో శంఖము, మరొక చేతిలో చక్రము ఉంటాయి. క్రింది వైపు ఉన్న రెండు భుజాలలో ఒక చేతిలో గద ఉంటే, మరో చేయి అభయ ముద్రను అభినయిస్తూ ఉంటుంది.

శంఖము శబ్ద హేతువు. శాస్త్ర హేతువు. శంఖారావ మనేది శాస్త్రం యొక్క ఘోష. ప్రమాణము యొక్క పిలుపు. ప్రమ అంటే జ్ఞానము. జ్ఞానమును ప్రసాదించేది కనుక శాస్త్రము ప్రమాణము ***(ప్రమాకరణం ప్రమాణం).*** శాస్త్రాన్ని ప్రమాణంగా స్వీకరించే వారు భ్రమ నుండి, భ్రాంతి నుండి విముక్తిని పొందుతారు. అజ్ఞానమును అంతం చేసుకొని జ్ఞానంతో శోభిస్తారు. భగవంతుని శంఖము పేరు పాంచజన్యము.

భగవంతుడు ధరించిన శంఖమును 'పాంచజన్యం' అంటారు. సముద్రములో చీకటి రూపంతో సంచరించే రాక్షసుడు పంచజనుడు. అతని ఎముక నుండి పుట్టింది కనుక అది పాంచజన్యము ***(పంచజనాఖ్యస్య అసురస్య అస్థిజత్వాత్ పాంచజన్యః).*** పంచజనుడనే చీకటి రాక్షసుని సముద్రంలో హత మార్చినట్లు, పంచభూతాలతో నిర్మితమైన దేహంపై మమకారం పెట్టుకొని అజ్ఞానాంధకారంలో అలమటిస్తూ, సంసార సముద్రంలో నిమగ్నమై ఉన్న మానవుల అజ్ఞానాన్ని భగవంతుడు అంతం చేస్తాడు. ఇదే పాంచజన్యము యొక్క సందేశము.

శాస్త్రం నిర్దేశించిన మార్గంలో పయనించే భక్తులకు అవాంతరాలు, ప్రతిబంధకాలు ఎదురై నపుడు, సాధన ముందుకు సాగదు. ఆ ప్రతిబంధకాలు కూడా పరమేశ్వరుని కృపతో నివారింప బడతాయి. ప్రతిబంధకా లనేవి బాహ్యంలో ఉంటాయనుకుంటే పొరపాటు. మన మనస్సులలో కాపుర మున్న కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాదులే ప్రతిబంధకాలు. వాటిని నివారించి, భక్తుల్ని రక్షించేందుకు చతుర్భుజమూర్తి రెండవ చేతిలో చక్రమును ధరించి ఉంటాడు.

భగవంతుని చేతి లోని చక్రము రాక్షసులను ఖండించింది అని పురాణాలు చెబుతాయి. కామక్రోధాది రాక్షసుల్ని కూడా హతమార్చి భక్తుల్ని కాపాడటానికే భగవంతుని చేతిలో చక్రముంది. పైగా అది 'సుదర్శన' చక్రము. భక్తులను కృప జూచి రక్షించే మంగళాయుధము. భక్తుల్ని భగవంతుడు చల్లగా చూడటమే సుదర్శనము. అంతేకాదు. సుదర్శన చక్రమును ధరించిన చతుర్భుజుడు సుదర్శనుడు. భక్తులకు సుదర్శనుడు. అంటే, భక్తుల చేత సుఖంగా, సులభంగా దర్శింప బడేవాడు **(సుఖేన దృశ్యతే భక్తైః ఇతి సుదర్శనః).**

ఇక, క్రింది వైపుకు ఉన్న రెండు భుజాలలో, ఒక చేతిలో గద ఉంటుంది. దాని పేరు 'కౌమోదకీ'. పరమేశ్వరుని చేతి లోని ఈ గద ఆనంద ప్రదాయిని.

పాంచజన్యము ప్రమాణాన్ని ప్రసాదిస్తే, సుదర్శనము శత్రు సంహారం గావించి, పరమేశ్వరుని దర్శింప చేస్తుంది. పరమాత్మ దర్శనంలో పరితోషమే గాని, పరితాప మెక్క డుంటుంది? ఆ పరితోషమే, పరమానందమే కౌమోదకీ అనే గద.

కౌమోదకీ - కుం భూమిం, మోదయతి హర్షయతి ఇతి కౌమోదకో విష్ణుః 'కుం' అంటే భూమి. 'మోదయతి' అంటే సంతోషాన్ని కలిగించేది. అదే 'కౌమోదకీ' అనే జగన్నాథుని గదాయుధం. పరమేశ్వరుని ఉపాసించే భక్తులకు ఆనందాన్ని, పరమానందాన్ని ప్రసాదించేది.

భక్తులు భగవంతుని పాదాలను ఆశ్రయించి అర్చిస్తూ ఉంటారు. చతుర్భుజమూర్తి ధరించిన శంఖచక్రాలు పైన ఉంటాయి. కాని, ఈ కౌమోదకీ అనే గద మాత్రం క్రింద వైపున భగవంతుని చరణాలకు దగ్గరగా ఉంటుంది. ఎవరు భగవంతుని పద సరోజాలను ఆరాధిస్తారో, ఉపాసిస్తారో, వారికి పరమానందాన్ని ప్రసాదించడానికి నేను ప్రక్కనే ఉంటాను అని చెప్పకనే చెబుతుంది కౌమోదకీ గద.

శంఖచక్ర గదా హస్తుని ఈ విధంగా ఆశ్రయించిన భక్తులకు భగవంతుడు అభయాన్ని అనుగ్రహిస్తున్నాడు అనే దానికి సంకేతంగా తన నాల్గవ చేతితో అభయ ముద్రను ప్రదర్శిస్తాడు.

జ్యోతిర్మయం

దివ్యమైన చతుర్భుజ రూపంతో శోభిస్తున్న పరమేశ్వరుడు సర్వత్ర దీప్తిమంతుడై ఉన్నాడు **(సర్వతో దీప్తిమంతమ్).** చూడశక్యం కానివాడై ప్రకాశిస్తున్నాడు **(దుర్నిరీక్ష్యం).** దీప్తిమూర్తిగా శోభిస్తున్నాడు. ప్రకాశవంత మైన మూర్తి దీప్తిమూర్తి. అంటే జ్ఞానమయ స్వరూపము **(దీప్తా జ్ఞానమయీ మూర్తిః యస్య ఇతి).** మహా తేజోమయ స్వరూపము. 'వేయి మంది సూర్యులు ఒకేసారి ఆకాశంలో విరజిమ్మే ప్రకాశముతో సమానుడు, లేక

దానిని గూడా అతిశయించి ఉండేవాడు' అని సంజయుడు అభిప్రాయ పడటానికి ఆ దివ్య తేజస్సే కారణము. అలాంటిది జ్ఞానమయ ప్రకాశమే కనుక దీప్తిమూర్తిని **అప్రమేయమ్**గా అభివర్ణించాడు అర్జునుడు ***(అప్రమేయమ్ న ప్రమేయమ్ ఇతి).***

అప్రమేయం

జ్యోతిర్మయుడైన పరమేశ్వరుడు ఏ ప్రమాణాలకు అందని వాడు ***(ప్రమాణ అవిషయః)*** కావడం చేత ఆయన అప్రమేయుడు. ప్రత్యక్షాది ప్రమాణాలకు అంతుపట్టని వాడు. అగమ్య గోచరుడు. జ్యోతిర్మయుడు. ఆయన స్వప్రకాశ స్వరూపుడు కనుక తనను ప్రకాశింప చేయడానికి మరొక ప్రకాశం అవసరం లేని వాడు. మరొక ప్రకాశం చేత ప్రకాశింప బడితే, తాను స్వప్రకాశు డెలా అవుతాడు? పర ప్రకాశం చేత ప్రకాశింపబడే వాడు స్వప్రకాశం కానివాడై జడ మవుతాడు. కానీ, ప్రమాణ - ప్రమేయ - ప్రమాతలను ఒకేసారి ప్రకాశింప చేసే సాక్షీ ప్రకాశమే జ్ఞానమయ దీప్తిమూర్తి.

ఇక్కడ సందర్భము కాకపోయినా, ఈ విశ్లేషణలో అనివార్యంగా ఒక సందేహము తలెత్తుతుంది. ఏ ప్రమాణము కూడా అప్రమేయుని విషయంలో ఫలించ నపుడు శాస్త్రము మాత్రం ప్రమాణ మెలా అవుతుంది? ఆత్మ, లేదా పరమాత్మ విషయంలో శాస్త్ర ప్రమాణము కూడా నిష్ఫలమే కదా! అని పూర్వపక్షము తప్పక ఎదు రవుతుంది.

శాస్త్రము అప్రమాణం కానే కాదు. శాస్త్రము ప్రమాణమే. కాకపోతే, ప్రత్యక్షాది ప్రమాణాల వలె కాకుండా, శాస్త్ర ప్రమాణంగా, విలక్షణ లక్షణంగా ప్రమాణ మవుతుంది. దీప్తిమంతు డైన పరమేశ్వరుని ప్రకాశింప చేసే ప్రమాణంగా కాకుండా, అజ్ఞానం వల్ల ఆరోపించ బడిన వాటిని తొలగించడం అనే కార్యం వల్ల శాస్త్రం ప్రమాణ మవుతుంది ***(అధ్యస్త అతద్రూప నివర్తకత్వేన).*** ఆరోపాలు తొలగితే అప్రమేయ జ్యోతిర్మయ స్వరూపము స్వప్రకాశమై భాసిస్తుంది. కనుక, దీప్తిమూర్తి జ్ఞానమూర్తియే. ఈ జ్ఞానమూర్తియే ఉపాసనా వేళలో ధ్యానమూర్తి.

కళ్ళు తెరచినపు డెల్ల కాంతులు కానరావు
కళ్ళు మూసిన క్షణాన తిమిరాలు లేకపోవు
కళ్ళు మూసి కొందును సదా ఉన్న దాని కొరకు
నీ అడుగుల కడ పడి ఉందు చిన్నికృష్ణా!

అని చిన్నికృష్ణ శతకంలో ఒక వెన్నముద్ద.

విశ్వరూపము సప్రపంచంగా, సాకారంగా, సోపాధికంగా ఈశ్వర వైభవాన్ని ప్రదర్శించడం చూచి, నిరుపాధిక మైన అక్షర పరబ్రహ్మ స్వరూపాన్ని అర్జునుడు ఊహిస్తున్నాడు.

త్వ మక్షరం పరమం వేదితవ్యం త్వ మస్య విశ్వస్య పరం నిధానమ్ ।
త్వ మవ్యయః శాశ్వత ధర్మగోప్తా సనాతన స్త్వం పురుషో మతో మే ॥ 18

త్వం-అక్షరం-పరమం-వేదితవ్యం-త్వం-అస్య-విశ్వస్య-పరం-నిధానం
త్వం-అవ్యయః-శాశ్వత ధర్మగోప్తా-సనాతనః-త్వం-పురుషః-మతః-మే

త్వం	=	నీవు	వేదితవ్యం	=	తెలియదగిన వాడవు
అక్షరం	=	అవినాశివి	త్వం	=	నీవు
పరమం	=	పరమాత్మవు	అస్య	=	ఈ

విశ్వస్య	=	విశ్వమునకు	త్వం	=	నీవు
పరం	=	పరమైన	సనాతనః	=	సనాతనుడవైన
నిధానం	=	ఆశ్రయుడవు	పురుషః	=	పురుషుడవు
త్వం	=	నీవు	మే	=	నా యొక్క
శాశ్వత ధర్మగోప్తా	=	సనాతన ధర్మమును రక్షించెడి	మతః	=	అభిప్రాయము
అవ్యయః	=	నిత్యుడవు			

భగవాన్! నువ్వు అక్షరమైన పరబ్రహ్మవు. తెలియదగిన వాడివి నీవే. ఈ విశ్వానికి మూల కారణం నీవే. నీకు వినాశము లేదు. నీవు శాశ్వత ధర్మరక్షకుడివి. సనాతనుడైన పురుషుడు నీవే అని నా భావము.

వ్యాఖ్య

వర్తనము - పరివర్తనము

బాహ్యంలో ఏది కనిపిస్తూ ఉందో, అది ఆంతర్యంలో కనువిప్పును కలిగిస్తూ ఉంది. బాహ్యంలో ప్రత్యక్షంగా ఉన్న రూపము ఆంతర్యం లోని స్వరూప వైభవాన్ని ఊహించేలా చేస్తూ ఉంది. కృష్ణా! నీ యోగైశ్వర్యమును వీక్షించి నేను ఊహిస్తున్నాను ***(తే యోగశక్తి దర్శనాత్ అనుమినోమి)*** అంటున్నాడు అర్జునుడు.

కళ్ళెదుట దీప్తిమంత మైన విశ్వరూపము కమనీయంగా కదుల్తూ ఉంది. అక్షరంగా ఉంది. అక్షములు అంటే ఇంద్రియాలు అని కూడా అర్థం. అవే నేత్రాలు. నేత్రాలకు రమణీయంగా గోచరం కావడం చేత విశ్వరూపుని సాకార రూపము అక్షరంగా ఉంది. ఈ భావము ఆంతర్యంలో అంతరేక్షణను ప్రేరేపించి, అక్షర రూపుడైన ఏ పరబ్రహ్మమును గూర్చి శాస్త్రం ద్వారా అర్జునుడు శ్రవణం చేశాడో, అట్టి నిరుపాధిక సాక్షీ చైతన్యం వైపుకు అతని బుద్ధిని మరలిస్తూ ఉంది. వర్తనమును ఆధారం చేసుకొని పరివర్తనం జరుగుతూ ఉంది.

ఏతేన సగుణ రూపస్య నిర్గుణ జ్ఞాపకత్వం ఉక్తమ్

'సాకారము నిరాకారమును జ్ఞాపకం చేస్తూ ఉంది అని చెప్పబడింది' అని నీలకంఠ వ్యాఖ్య.

సాకారము ఏదో కాదు, నిరాకారము యొక్క రూపమే. మట్టి ద్రవ్యమైతే, కుండ దాని రూపము. స్వర్ణము ద్రవ్యమైతే, ఆభరణము దాని రూపము. అలాగే విశ్వరూపంలో గోచరిస్తున్న సమస్త రూపాలు ఏవో కావు. అక్షరమైన అవ్యక్త పరబ్రహ్మము యొక్క వ్యక్తరూపాలు. అవి విశ్వవ్యాప్తంగా గోచరించడం చేత అది విశ్వరూప మైంది. హే భగవాన్! ఈ వ్యక్తమైన విశ్వరూపానికి ***(అస్య విశ్వస్య)*** పరమాశ్రయము ***(పరమం నిధానమ్),*** అక్షర రూపుడవైన నీవే ***(త్వమక్షరం).*** కనుక, వ్యక్తమయ్యే ఈ విశ్వరూపం ద్వారా కూడా తెలియ దగిన వాడివి నీవే ***(వేదితవ్యం జ్ఞాతవ్యం ముముక్షుభిః)*** అంటున్నాడు అర్జునుడు.

ఇంతకీ, అర్జునుడు దర్శిస్తున్న విశ్వరూపంలో ఏది విశ్వము? విశ్వము ఎక్కడ? బ్రహ్మము కన్నా విలక్షణంగా, అన్యంగా ఏది ఉందని దానిని విశ్వమని పిలవాలి? ఉన్నది అద్వయ సత్తా స్వరూపమైన పరబ్రహ్మమే. ఆ పరబ్రహ్మము యొక్క వ్యక్త రూపమునే విశ్వం అంటున్నాం. అది రూపం కనుక విశ్వరూపం.

మట్టికుండలో కుండ ఎక్కడుంది? ఉన్నదంతా మట్టే. కుండ రూపంలో ఉన్నది మట్టే. మట్టే ఉంది, మట్టే ఉంటుంది. మట్టి యొక్క రూపమే కుండ. మట్టికి విలక్షణంగా, మట్టి కన్నా అన్యంగా కుండ లేనే లేదు. కుండ కనిపించినా అది మట్టినే కుండ క్షరం. మట్టి అక్షరం. కనుక, తెలియదగింది మట్టే కాని కుండ కాదు.

జ్ఞాపకం చెయ్యాలి. విశ్వం కనిపించినా అది విశ్వనాథునే దర్శింప చేయాలి. అదే జరిగింది అర్జునునికి ప్రస్తుత శ్లోకంలో. ఉన్న దొక్కటే. దానికి అన్యంగా ఏదీ లేదు అని భగవానువాచ ***(మత్తః పరతరం నాన్యత్ కించిదస్తి** - 7 వ అ - 7 వ శ్లో).*

విశ్వము గోచరించినా, అది శాశ్వతము లైన వేద ధర్మముల చేతనే సాగుతూ ఉంది. వేదము ఏదో కాదు. జ్ఞానమే. బ్రహ్మ జ్ఞానమే. బ్రహ్మము, జ్ఞానము వేరు కావు కనుక బ్రహ్మము శాశ్వతము. వేద ధర్మము శాశ్వతము. అందుచేత బ్రహ్మము శాశ్వతమైన ధర్మ రక్షకుడు ***(శాశ్వత ధర్మ గోప్తా. శశ్వత్ భవః శాశ్వతః నిత్యః ధర్మః తస్య గోప్తా శాశ్వత ధర్మగోప్తా).*** కనుక, 'హే కృష్ణా! నువ్వే సనాతన పురుషుడవు అని నా అభిప్రాయము' అంటున్నాడు అర్జునుడు ***(చిరంతనః త్వం పురుషః మతః అభిప్రేతః మే మమ).***

అనాదిమధ్యాన్త మనన్తవీర్య మనన్తబాహుం శశిసూర్య నేత్రమ్ ।
పశ్యామి త్వాం దీప్తహుతాశ వక్త్రం స్వతేజసా విశ్వమిదం తపన్తమ్ ॥ 19

అనాదిమధ్యాంతం-అనంతవీర్యం-అనంతబాహుం-శశిసూర్యనేత్రం
పశ్యామి-త్వాం-దీప్తహుతాశవక్త్రం-స్వతేజసా-విశ్వం-ఇదం-తపంతం

త్వాం	= నిన్ను
అనాదిమధ్యాంతం	= ఆదిమధ్యాంత రహితుడుగా
అనంతవీర్యం	= అంతములేని తేజోవంతుడుగా
అనంతబాహుం	= అనంతమైన బాహువులు గల వానినిగా
శశిసూర్యనేత్రం	= చంద్రసూర్యులు కన్నులుగా గల వానినిగా
దీప్తహుతాశ వక్త్రం	= ప్రజ్వలించుచున్న అగ్ని ముఖముల యందు గల వానినిగా
స్వతేజసా	= స్వీయమైన తేజస్సు చేత
ఇదం	= ఈ
విశ్వం	= విశ్వమును
తపంతం	= తపింపజేయు వానినిగా
పశ్యామి	= చూస్తున్నాను

ప్రభూ! నీకు ఆది మధ్యాంతాలు లేవు. నీ పరాక్రమానికి అంతం లేదు. నీ బాహువులు అనంతములు. చంద్రాదిత్యులు నీ నేత్రాలు. ప్రజ్వలిస్తున్న అగ్ని నీ ముఖం. నీ ప్రకాశం చేత ఈ ప్రపంచాన్నంతా తపింప చేస్తున్న నిన్ను నేను దర్శిస్తున్నాను.

వ్యాఖ్య

పరిచ్ఛేద శూన్యమైన రూపం కావడం చేత ఆయన ఆదిమధ్యాంత రహితుడు. అనంతుడు. కాని, ఇది విశ్వరూపము. అందుచేత అపరిచ్ఛిన్నుడే అయినా, అన్ని రూపాలు తానే కావడం చేత, అన్ని రూపాలు తన లోనే ఉండటం చేత, ఆ దివ్యరూపంలో ఎక్కడ చూచినా విశ్వమే గోచరిస్తూ ఉన్నందున, ఏది మొదలో, ఏది మధ్యమో, ఏది చివరో అర్థం కాదు. అందుచేత, ఆయన అనాది మధ్యాంతుడు ***(ఆదిశ్చ మధ్యం చ అన్తశ్చ న విద్యతే యస్య).***

వీర్యం అంటే శక్తి, లేదా పరాక్రమము. ఆయన పరాక్రమము అంతము లేనిది కనుక ఆయన అనంతవీర్యుడు. అపరిమిత మైన శక్తివంతుడు. విశ్వంలో ఎక్కడ ఏ విధమైన శక్తి గోచరించినా అది భగవంతుని శక్తియే. అందుచేత ఆయనిది అనంతమైన శక్తి. సృష్టి కార్యానికి ఆధారమైన శక్తి.

అందరి బాహువులు తనవే కావడం చేత ఆయన అనంత బాహువులు కలవాడు. అందరి లోని బాహు బలము భగవంతునిదే. అందుచేతనే బలవంతులలో బలము తానే నని విభూతిగా అభివర్ణించుకున్నాడు.

చంద్రసూర్యులు ఆయన నేత్రాలు. అంతరిక్షము ఆ దివ్యాత్ముని దేహము కాగా, చంద్రసూర్యులు నేత్రాలుగా, నేత్రాలపై ఉన్న ఫాల భాగము స్వర్గ లోకంగా, పృథివి పాదముగా మనస్సుకు అందుతూ ఉంటుంది. దీనినే అవలోకించి ఓ వెన్నముద్దను అర్పించుకుంది చిన్నికృష్ణ శతకం.

ఉరమును శ్రీదేవి ఆశ్రయించె
శశిసూర్యులు కళ్ళలో కదలుచుండె
నాభి కమలమున బ్రహ్మ చేరిపోయె
నీ అడుగుల కడ పడి ఉందు చిన్నికృష్ణ ॥

అని శశిసూర్యనేత్రుని భావించి పులకరించింది చైతన్య హృదయం.

భగవంతుడు ప్రజ్వలిస్తున్న అగ్నియే ముఖంగా కలవాడు ***(దీప్త హుతాశ వక్త్రమ్).*** 'హుతము' అంటే సమర్పించడము అని అర్థము. యజ్ఞయాగాదులలో మనం ఇంద్రాది దేవతలకు ఏది సమర్పించినా, దానిని అగ్ని ద్వారానే సమర్పిస్తాము. మనం అర్పించే హుతమును ఆరగించి, ఆ తరువాత ఆయా దేవతలకు అందించే వాడు కావడం చేత అగ్నిదేవుడు హుతాశనుడు. అర్పించిందంతా ఆరగించే వాడు ***(హుతం అశ్నాతి).*** అట్టి అగ్నిని ముఖంగా కలిగి ఉన్నందున విశ్వరూపుడు హుతాశవక్త్రుడు. తేజోమయుడై యావద్విశ్వమును దీప్తిమంతం చేస్తున్నాడు.

ద్యావా పృథివ్యో రిద మన్తరం హి వ్యాప్తం త్వ యైకేన దిశశ్చ సర్వాః ।
దృష్ట్వాద్భుతం రూప ముగ్రం త వేదం లోకత్రయం ప్రవ్యథితం మహాత్మన్ ॥ 20

ద్యావాపృథివ్యోః-ఇదం-అంతరం-హి-వ్యాప్తం-త్వయా-ఏకేన-దిశః-చ-సర్వాః
దృష్ట్వా-అద్భుతం-రూపం-ఉగ్రం-తవ-ఇదం-లోకత్రయం-ప్రవ్యథితం-మహాత్మన్

మహాత్మన్	= మహాత్మా!
ద్యావాపృథివ్యోః	= భూమ్యాకాశాల యొక్క
ఇదం	= ఈ
అంతరం	= మధ్యప్రదేశము
సర్వాః	= సమస్తమైన
దిశః చ	= దిక్కులు
ఏకేన	= ఒక్కడవైన
త్వయా	= నీ చేత
వ్యాప్తం హి	= వ్యాపింపబడి యున్నవి కదా!
తవ	= నీ యొక్క
అద్భుతం	= అద్భుతమైన
ఉగ్రం	= భయంకరమైన
ఇదం	= ఈ
రూపం	= రూపమును
దృష్ట్వా	= చూచి
లోకత్రయం	= మూడు లోకములు
ప్రవ్యథితం	= భయపడు తున్నాయి

మహాత్మా! భూమ్యాకాశాలు, అంతరిక్షము, సమస్తము నీ చేత వ్యాపించబడి ఉన్నాయి. అన్ని దిక్కులలో నువ్వే ప్రకాశిస్తున్నావు. భయంకరమైన నీ అద్భుత రూపాన్ని చూచి ముల్లోకాలు భీతి చెందు తున్నాయి.

వ్యాఖ్య

అంతటా పరమేశ్వరుడే వ్యాపించి ఉన్నాడు. తూర్పు పశ్చిమ, ఆగ్నేయ వాయవ్యాది దిక్కు లన్నీ తానే వ్యాపించి ఉన్నాడు. అన్ని దిక్కులు ఆయన ఒక్కని చేతనే, ఆ విశ్వరూపుని చేతనే వ్యాపించబడి ఉన్నాయి ***(త్వయా ఏకేన విశ్వరూప ధరేణ వ్యాప్తం).*** విశ్వమంతా విశ్వరూపుని చేత వ్యాపించబడి ఉన్నపుడు, విశ్వరూపుని కన్నా అన్యమైనది విశ్వంలో ఏముంటుంది? ఇక్కడ కాస్త జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి.

యేన యద్వ్యాప్తం తత్తన్మాత్ర మేవ - 'ఏది దేని చేత వ్యాపించబడి ఉందో అది అది మాత్రమే' అనేది న్యాయం. అంటే, మట్టికుండ మట్టి చేత వ్యాప్తమై ఉంది అంటే, మట్టికుండ అనేది మట్టి మాత్రమే అని అర్థం. ఇదే వ్యాప్య వ్యాపక ధర్మము.

ఇంతవరకు బాగుంది. ఏ బాధ లేదు. ఆ తరువాతే భయం పట్టుకుంది. అంతటా పరమేశ్వరుడే వ్యాపించి ఉన్నాడని అర్జునుడు విన్నవించడంలో వింత ఉంటే ఉండవచ్చు. విడ్డూరము ఎలా ఉంటుంది? మహాత్మా! నీ రూపాన్ని చూచి ముల్లోకాలు ***(లోకత్రయం)*** బాధ పడుతున్నాయి. భయ పడుతున్నాయి ***(ప్రవ్యథితమ్ భీతం, ప్రచలితం)*** అనేదే కాస్త మ్రింగుడు పడని విషయంగా కనిపిస్తూ ఉంది.

నువ్వు ఒకరిని భయపెట్ట వచ్చు. నిన్ను చూచి నువ్వు భయపడతావా? విశ్వంలో వ్యాప్తమై ఉండేది విశ్వరూపు డొక్కడే అయి నపుడు, విశ్వరూపాన్ని చూచి భయపడే దెవరు? భయానికి హేతువు ఉండాలి కదా! విశ్వరూప దర్శనంలో భయహేతు వెవరు? భయ మెవరికి? దీనిని జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. అర్జునుని మాట ప్రకారం భయ హేతువు విశ్వరూపుడు. భయపడేది లోకత్రయము. ఇది మరీ విడ్డూరంగా ఉంది.

విశ్వరూపాన్ని చూచి ముల్లోకాలు భీతి చెంది చలిస్తున్నాయి అంటున్నాడు అర్జునుడు. విశ్వరూపాన్ని ముల్లోకాలు ఎక్కడ చూస్తున్నాయి, భీతి చెందడానికి? ఏ దివ్య నేత్ర ముందని ముల్లోకాలు విశ్వరూపాన్ని దర్శిస్తాయి? ప్రస్తుతం విశ్వరూపాన్ని చూస్తున్నది ఇద్దరే. కురుక్షేత్రంలో అర్జునుడు, హస్తినలో సంజయుడు. ఇంతకీ వీళ్ళిద్దరిలో భయపడే దెవరు? సంజయుడు మాత్రం కానే కాదు. ఎందుకని? ఒకవేళ సంజయుడు భయపడినా, అలా సంజయుడు భయపడుతున్నాడు అని చెప్పడానికి సంజయుడు అర్జునుడి దృష్టికి అందుబాటులో లేడు.

ముల్లోకాలు విశ్వరూపాన్ని దర్శించడం లేదు కనుక, ముల్లోకాలు భీతి చెందటం లేదు. దివ్యదృష్టితో చూస్తున్నా, సంజయుడు భీతి చెందడం లేదు. మరి, ఇక్కడ అర్జునుడు ప్రస్తావించే భయం ఎవరికి సంబంధించింది? వాస్తవానికి భయ మెవరిది? భయపడే దెవరు? ఇంకెవరు! అర్జునుడే. ఆయన ఒక్కడి భయం ముల్లోకాలను చలింప చేసింది.

వాస్తవానికి అర్జునుడు భయపడు తున్నాడా? అనేది ప్రశ్న. వాస్తవానికి భయపడటం కాదు; భయపడటమే వాస్తవం అనేది సమాధానం. ఎందుకని? తాను చూచేవాడు కావడం చేత. ఇది కాస్త విశ్లేషించి తెలుసుకోవలసిన తాత్త్విక విషయం. ఆ అవకాశము ముందు శ్లోకాలలో ఉంది. కనుక అక్కడ చర్చిస్తాను. అర్జునునికి భయ హేతువు ఏమిటో అక్కడ తెలుసుకుందాం.

ప్రస్తుతం, ఈ విషయాన్ని ఈ సందర్భంలో మరో విధంగా చెప్పుకుందాం. భగవంతుడు అభయరూపుడే గాని భయరూపుడు కాడు. భయ హేతువూ కాడు. పైగా భయ నాశకుడు. అభయరూపుడు. కాని, అభయ మూర్తి ఇక్కడ భయ స్ఫూర్తిగా తెలుస్తున్నాడు.

అసలు భయ మనేది ఎందుకు కలుగుతుంది? ఎవరికి కలుగుతుంది? భయపెట్టే దెవరు? భయం అనేది అధర్మపరులకు కలుగుతుంది. వారిని భయపెట్టేది ధర్మము. ధర్మ రూపంలో ఉన్నది దైవమే కనుక, దైవమే అలాంటి వారి విషయంలో భయ హేతువు అని చెప్పుకున్నా దోషం లేదు.

అసన్మార్గ వర్తినాం భయం కరోతి ఇతి - అధర్మంగా చరించే వారు కర్మఫలాలను ఊహించుకొని భీతి చెందుతారు. అలాంటి వారికి అభయరూపు డైన పరమేశ్వరుడు భయ హేతువుగా తెలుస్తాడు. భక్తులైన వారికి అభయ హేతువుగా, ప్రియరూపుడుగా దర్శన మిస్తాడు.

నరసింహ భగవానుడు హిరణ్యకశిపునికి ఉగ్రరూపంతో అగుపించి భయహేతు వయ్యాడు. ప్రహ్లాద భక్తునికి శాంతరూపంతో అగుపించి అభయరూపు డయ్యాడు. భగవంతుని రూపాన్ని సాధువులు దర్శించి తృప్తి చెందుతారు. దుష్టులు దర్శించి భీతి చెందుతారు **(ప్రయన్తి కేచిత్ తస్య రూపస్య దృష్ట్వా బిభేతి కశ్చిత్).**

అమీ హి త్వాం సురసంఘా విశన్తి కేచిద్భీతాః ప్రాఞ్జలయో గృణన్తి।
స్వస్తీ త్యుక్త్వా మహర్షి సిద్ధ సంఘాః స్తువన్తి త్వాం స్తుతిభిః పుష్కలాభిః ॥ 21

అమీ-హి-త్వాం-సురసంఘాః-విశంతి కేచిత్-భీతాః-ప్రాంజలయః-గృణంతి
స్వస్తి-ఇతి-ఉక్త్వా-మహర్షి సిద్ధ సంఘాః-స్తువంతి-త్వాం-స్తుతిభిః-పుష్కలాభిః

అమీ	= ఈ	మహర్షి సిద్ధసంఘాః	= మహర్షుల, సిద్ధపురుషుల సమూహము
సురసంఘాః	= దేవతాసమూహములు	స్వస్తి ఇతి	= స్వస్తి అని
త్వాం	= నిన్ను	ఉక్త్వా	= పలుకుతూ
విశంతి	= ప్రవేశిస్తున్నాయి	పుష్కలాభిః	= అనేకములైన
కేచిత్	= కొందరు	స్తుతిభిః	= స్తోత్రముల చేత
భీతాః	= భయపడి	త్వాం	= నిన్ను
ప్రాఞ్జలయః	= చేతులు జోడించి	స్తువంతి హి	= స్తుతిస్తున్నారు
గృణన్తి	= స్తుతిస్తున్నారు		

భగవంతా! దేవతా సమూహాలు నీలో ప్రవేశిస్తున్నాయి. కొందరు భయంతో నమస్కరిస్తూ నిన్ను స్తుతిస్తున్నారు. మహర్షులు, సిద్ధ పురుషులు స్వస్తి పలుకుతున్నారు. స్తోత్రాలతో నిన్ను ప్రార్థిస్తున్నారు.

వ్యాఖ్య

దైవ స్పృహ కలిగిన వారు దేవతలు. దైవ గుణాలతో శోభించే వారు. మహాత్ములైన వారు. అలాంటి వారు కూడా ధర్మం కొరకు యుద్ధరంగంలో ప్రవేశించి ఉన్నారు. వారందరూ ధర్మరూపంలో ఉన్న దైవాన్ని ఆశ్రయించుకున్న వారు. అలాంటి వారి హృదయాలలో దైవమే ప్రకాశిస్తూ ఉన్నందున, వారు కోవెలలో ప్రవేశించినట్లే కురుక్షేత్రంలో ప్రవేశిస్తున్నారు.

అంతటి జ్ఞానం లేనివారు, ధర్మస్పృహ మాత్రమే గల భక్తులు యుద్ధ భీతితో భగవంతునికి కైమోడ్పులు సమర్పించు కుంటున్నారు ***(తత్ర కేచిత్ భీతాః ప్రాఞ్జలయః సన్తః).***

యుద్ధ మనేది సంతతానంద సంధాయకం కాదు. ఎందరినో కన్నీటి కడలిలో ముంచేస్తుంది. లోకం కల్లోల మవుతుంది. ఆనాడైనా, ఈనాడైనా, ఏనాడైనా, సమర శకునాలు యుద్ధారంభానికి ముందే కనిపిస్తూ ఉంటాయి. ఈ విధమైన ఉత్పాతాలను, వినాశాలను ఊహించి తపోధనులైన నారదాది మహర్షులు, శక్తి సంపన్నులైన కపిలాది సిద్ధ పురుషులు జగత్తుకు శుభం కలగాలని **(స్వస్త్యస్తు జగతః ఇత్యుక్త్వాః) జయజయ** అంటూ స్వస్తి వచనాలను, **రక్షరక్ష** అంటూ స్తోత్ర పాఠాలను వినిపిస్తున్నారు. అందరి హృదయాలు దగ్గర గానో, దూరం గానో పరమాత్మ చుట్టే తిరుగు తున్నాయి.

ప్రారబ్ధము పనుల లోకి దించుతుంది. కనుక పురుషార్థంతో శనిని తొలగించుకొని మునులయ్యే ప్రయత్నములో మనం చరించాలి. భగవంతునికి దూరులైన వారు చేసిన యజ్ఞాలు యుద్ధాలుగా మారాయి. పరమాత్మను స్మరిస్తూ సాగించిన సమరాలు యజ్ఞా లయ్యాయి. ఆదిదేవుని ఆశ్రయించిన వారి బ్రతుకులే ఆనంద నిలయా లవుతాయి.

కక్ష కట్టినందుకు దక్షయజ్ఞము ధ్వంసమాయె
అసుర పురములు మూడును భస్మమాయె
నిన్ను పూజించు వారికే పరమ పదము
నీ అడుగుల కడ పడి ఉందు నీలకంఠా!

అని నీలకంఠ శతకంలో ఒక విబూది పండు.

రుద్రాదిత్యా వసవో యే చ సాధ్యా విశ్వేఽశ్వినౌ మరుత శ్చోష్మపాశ్చ ।
గన్ధర్వ యక్షాసుర సిద్ధసంఘాః వీక్షన్తే త్వాం విస్మితా శ్చైవ సర్వే ॥ 22

రుద్రాదిత్యాః-వసవః-యే-చ-సాధ్యాః-విశ్వే-అశ్వినౌ-మరుతః-చ-ఊష్మపాః-చ
గంధర్వయక్షాసురసిద్ధ సంఘాః-వీక్షంతే-త్వాం-విస్మితాః-చ-ఏవ-సర్వే

రుద్రాదిత్యాః	= రుద్రులు,ఆదిత్యులు	ఊష్మపాః చ	= పితృదేవతలు
వసవః	= వసువులు	గంధర్వ యక్షాసుర సిద్ధసంఘాః	= గంధర్వులు, యక్షులు, అసురులు, సిద్ధులు మొదలగు వారి సమూహములు
యే	= ఎవరు		
సాధ్యాః చ	= సాధ్యులు	సర్వే	= అందరును
విశ్వే	= విశ్వ దేవతలు	విస్మితాః చ ఏవ	= విస్మయమును పొందిన వారై
అశ్వినౌ	= అశ్వినీదేవతలు	త్వాం	= నిన్ను
మరుతః చ	= వాయుదేవతలు	వీక్షంతే	= చూస్తున్నారు

స్వామీ! రుద్రులు, ఆదిత్యులు, వసువులు, సాధ్యులు, విశ్వదేవతలు, అశ్వినీ కుమారులు, మరుత్తులు, పితృ దేవతలు, గంధర్వ, యక్ష అసుర సిద్ధ సమూహాలు - అందరూ ఆశ్చర్యంతో నిన్నే వీక్షిస్తున్నారు.

వ్యాఖ్య

భగవద్రూపము, విశ్వరూప వైభవము ఎంతటి వారికైనా ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది అంటున్నాడు అర్జునుడు. ఎంతటి వారు అంటే ఎలాంటి వారో చెబుతున్నాడు.

ఏకాదశ రుద్రులు, ద్వాదశాదిత్యులు, అష్ట వసువులు, సాధ్యులు అనే రుద్రగణాలు, విశ్వ దేవతలు, అశ్వినీ కుమారు లిద్దరు, సప్త మరుద్గణాలు, ఊష్మపులు (పితృ దేవతలు), హాహా హూహూ అనే గంధర్వులు, కుబేరాది యక్షులు, విరోచనుడు మొదలైన అసురులు, కపిలాది సిద్ధులు - వీరందరూ విశ్వరూపాన్ని విస్మయంతో వీక్షిస్తున్నారు *(వీక్షంతే పశ్యన్తి, త్వా త్వాం, విస్మితాః విస్మయం ఆపన్నాః సన్తః త ఏవ సర్వే).*

ఊష్మపాః అంటే పితృదేవతలు అని అర్థము. ***ఊష్మపాః*** అంటే ఊష్మమును పానం చేసే వారు, లేదా ఊష్మ పదార్థాలను వేడి వేడిగా సేవించే వారు అని వేదార్థము *(ఊష్మభాగా హి పితరః).* పితృ శ్రాద్ధాది కర్మలను నిర్వహించే సమయంలో, భోక్తల యందు పితరులను ఆహ్వానించి తృప్తిపరచే కార్యంలో అనుసరించ వలసిన విధిని స్మృతులు ప్రవచించి ఉన్నాయి. ఆ సందర్భంలో పితృదేవతలు ఊష్మపాలుగా, ఊష్మ భాగులుగా తెలుస్తారు.

యావ దుష్ణం భవే దన్నం యావ దశ్నన్తి వాగ్యతాః ।
పితర స్తావ దశ్నన్తి యావన్నోక్తా హవిర్గుణాః ॥

ఎంతవరకు అన్నం వేడిగా ఉంటుందో, అంతవరకే పితరులు గ్రహిస్తారు. అన్న గుణాలను ప్రస్తావిస్తూ మాట్లాడుతూ కాకుండా, అన్నాన్ని మౌనంగా ఆరగించినంత వరకే పితృదేవతలు స్వీకరిస్తారు అని స్మృతి వాక్యము.

అంటే, శ్రాద్ధాది కర్మలలో భోక్తల యందు పితృదేవతలను ఆహ్వానించి భోజనం పెట్టి నపుడు, ఆ ఆహారము వేడిగా ఉన్నంత వరకే పితరులు స్వీకరిస్తారు. అందుకనే వారు ఊష్మపులు. ఒకవేళ చల్లబడిన ఆహారాన్ని వడ్డిస్తే, ఆరగించే వారు ఆహూతు లైన భోక్తలే గాని ఆహ్వానింపబడిన పితృదేవతలు కారు.

అలాగే శ్రాద్ధ సమయంలో పితరులకు సమర్పించే ఆహారాన్ని ఆరగించే భోక్తలు మాట్లాడకుండా తినాలి. పదార్థ గుణాలను ప్రస్తావిస్తూ సంభాషించ కూడదు. ఆరగించే వారు పితరులు కనుక భోక్తలు తటస్థులై మౌనం వహించాలి. ఇదంతా కర్మకాండకు సంబంధించిన విషయము.

రూపం మహత్తే బహువక్త్రనేత్రం మహాబాహో బహు బాహూరు పాదమ్ ।
బహూదరం బహుదంష్ట్రాకరాలం దృష్ట్వా లోకాఃప్రవ్యథితా స్తథాహమ్ ॥ 23

రూపం-మహత్-తే-బహువక్త్రనేత్రం-మహాబాహో-బహుబాహూరుపాదం
బహూదరం-బహుదంష్ట్రాకరాలం-దృష్ట్వా-లోకాః-ప్రవ్యథితాః-తథా-అహం

మహాబాహో	= కృష్ణా!	తే	= నీ యొక్క
బహువక్త్రనేత్రం	= అనేకములైన ముఖములు, కన్నులు గలది	రూపం	= రూపమును
బహుబాహూరుపాదం	= అనేకములైన బాహువులు, ఊరువులు, పాదములు గలది	దృష్ట్వా	= చూచి
		లోకాః	= లోకములు
బహూదరం	= అనేక పొట్టలు గలది	తథా	= అలాగే
బహుదంష్ట్రాకరాలం	= అనేకములైన కోఱల చేత భయంకరమైనది	అహం	= నేను
మహత్	= గొప్పది	ప్రవ్యథితాః	= భయపడ్డాయి

కృష్ణా! మహాబాహో! నీ రూపంలో ఎన్నో లెక్కలేనన్ని ముఖాలు కనిపిస్తున్నాయి. మరెన్నో నేత్రాలు, బాహువులు, ఊరువులు, పాదాలు, ఉదరాలు, కోరలు కనిపిస్తున్నాయి. భయంకరమైన నీ రూపాన్ని చూచి లోకాలన్నీ చలించి పోతున్నాయి. భయపడుతున్నాయి. నేను కూడా.

వ్యాఖ్య

విశ్వరూపుని సౌమ్యమైన విస్మయాకారాన్ని పూర్వ శ్లోకంలో చూశాం. అనేక ముఖాలు, అనేక నేత్రాలు, అనేక బాహువులు, అనేక పొట్టలు, భయంకరమైన కోరలు కలిగిన రూపాన్ని ఈ శ్లోకంలో చూస్తున్నాం. ఇలాంటి రూపాన్ని గతంలో ఎవరైనా చూశారా? చూసి ఉంటారా? అసలు ఇలాంటి రూపం గల వ్యక్తి ఉన్నాడా? ఉన్నాడు. లేకపోతే, ఎలా కనిపిస్తాడు? ఎవరతను? అతడే పరబ్రహ్మము. వాస్తవానికి ఏ రూపమూ లేని శుద్ధ చైతన్యము. నిరవయవుడు. ఏ అవయవమూ లేని వాడు. అతడు అవసర మనుకుంటే, తన మాయా శక్తి చేత ఏ రూపాన్నైనా ధరించ గలడు. స్థితి రూపంలో సౌమ్యంగా కనిపించిన వాడే, ప్రస్తుతం సంహార రూపంలో భయంకరంగా గోచరిస్తున్నాడు.

భయ హేతువులు

తెలిసినవి హానికర మైనవి అయితే, వాటిని చూడగానే భయం వేస్తుంది. తెలియనివి వికృత రూపంతో గోచరిస్తే, అవి స్వభావతః సౌమ్య మైనవే అయినా, తెలియని కారణంగా భయాన్ని కలిగిస్తాయి.

ప్రస్తుతం మహా భయంకరంగా గోచరిస్తున్న విశ్వరూపం ముల్లోకాలను ప్రవ్యథితం చేస్తూ ఉంది.

భయపెడుతూ ఉంది అంటున్నాడు అర్జునుడు. అవే కాదు, తాను కూడా భయపడుతున్నట్లు చెబుతున్నాడు. ఈ చివరి మాటే వాస్తవం.

లోకాలు బాధ పడుతున్నాయి అనడానికి అర్జునుని వద్ద బుజువులు లేవు. కాని, తాను భయ పడుతున్నాడు అనే దానికి ఏ సాక్ష్యాలూ అవసరం లేదు. ఇంతకీ, అర్జునుని భయానికి హేతువు లేమిటి? తెలిసినవా, తెలియనివా? లేక రెండూనా? రెండూనూ.

కోరలు చూస్తే ఎవరి కైనా భయమే. కోర లున్నాయి కనుకనే పాముల్ని చూచి మనం భయ పడతాము. కోరపళ్ళు గల పులుల్ని చూచినా భయ పడతాము. చూడక పోయినా, కోరలు గల రాక్షసుల్ని గురించి విని ఉన్నాము కనుక, రాక్షసులన్నా భయమే. మరేదైనా సముద్ర ప్రాణి కోరలు కలిగి వికృతంగా కనిపిస్తే, అది సాధు జంతువే అయినా, దానిని చూచిన క్షణంలో మనకు ముచ్చెమటలు పోయక మానవు. ఈ విధంగా భయ హేతువులు కానివి కూడా సరియైన జ్ఞానము లేని కారణంగా భయాన్ని కలిగిస్తాయి. ఇలాంటి భయాలు కేవలం వ్యక్తిగత మైనవి. వ్యక్తి మీదే కేంద్రీకరింపబడి ఉంటాయి.

అర్జునుడు దర్శిస్తున్నది విశ్వరూపం. విశ్వనాథుని యొక్క వ్యక్త రూపం. అమూర్త స్వరూప మైన భగవంతుని మూర్త రూపం. అమూర్తం అఖండము, ఏకము. మూర్తం అనేకము, భిన్నము. ఏకమైన భగవంతుని అనేకమైన వ్యక్త రూపాలలో సౌమ్యాలు ఉన్నాయి. దారుణాలూ ఉన్నాయి. కాని అవన్నీ పరమేశ్వరుని రూపాలే.

పరమేశ్వరుడంటే మనకు భక్తి ఉంది. భయ మెందుకుంటుంది? మరి వ్యక్తమయ్యే రూపాలు అవ్యక్త స్వరూపమైన పరమాత్మవే అయి నపుడు భయం ఎందుకు పుడుతుంది? భేద దృష్టే భయ కారణము. అభేద స్వరూపంలో భేదమును చూడటమే భయ కారణమైంది. భయం తనదే అయినా, తన భయాన్నే లోకా లన్నిటికీ అర్జునుడు ఆరోపిస్తున్నాడు.

నభః స్పృశం దీప్త మనేకవర్ణం వ్యాత్తాననం దీప్త విశాలనేత్రమ్ ।
దృష్ట్వా హి త్వాం ప్రవ్యథి తాన్తరాత్మా ధృతిం న విన్దామి శమం చ విష్ణో ॥ 24

నభః స్పృశం-దీప్తం-అనేకవర్ణం-వ్యాత్తాననం-దీప్త విశాలనేత్రం
దృష్ట్వా-హి-త్వాం-ప్రవ్యథితాంతరాత్మా-ధృతిం-న-విందామి-శమం-చ-విష్ణో

విష్ణో	= కృష్ణా!	త్వాం	= నిన్ను
నభః స్పృశం	= ఆకాశమును తాకెడివాడవు	దృష్ట్వా	= చూచి
దీప్తం	= ప్రకాశమానుడవు	ప్రవ్యథితాంతరాత్మా	= భయపడిన అంతరాత్మ గలవాడనై
అనేక వర్ణం	= ఎన్నో రంగులు గలవాడవు	ధృతిం	= ధైర్యమును
వ్యాత్తాననం	= తెరచిన నోళ్ళు గలవాడవు	శమం చ	= శాంతిని
దీప్తవిశాల నేత్రం	= ప్రజ్వలించు విశాల నేత్రములు గలవాడవు	న విందామి హి	= పొందలేక పోతున్నాను గదా

హే విష్ణుదేవా! నువ్వు ఆకాశాన్ని తాకుతున్నావు. అనేక రంగులతో శోభిస్తున్నావు. జ్వలిస్తున్న విశాల నేత్రాలతో, తెరచుకొని ఉన్న నోళ్ళతో కనిపిస్తున్నావు. నిన్ను చూచి భయపడి పోతున్నాను. ధైర్యాన్ని కోల్పోతున్నాను. శాంతి లేకుండా ఉన్నాను.

వ్యాఖ్య

భగవంతుని రూపం ఆకాశాన్ని తన్నేసింది **(నభః స్పృశం)**. ఆ గోడను ఇతడు తాకాడు. ఈ చెట్టును అతడు స్పృశించాడు అంటే అర్థం చేసుకోగలం. మరి, విశ్వరూపుడు ఆకాశాన్ని స్పృశించాడు అనే దానిని ఎలా అర్థం చేసుకోవాలి? ఆకాశాన్ని స్పృశించడానికి దానికి హద్దు ఎక్కడుంది? ఒకవేళ ఆకాశాన్నే గనుక స్పృశించాలి అని అనుకుంటే, విశ్వరూపుడు ద్యులోకంలో విస్తరించ వలసిన అవసర మేముంది? అర్జునుడు ఉన్నచోట కూడా ఆకాశమే కదా ఉంది! కనుక, ఆకాశాన్ని విశ్వరూపం స్పృశిస్తూ ఉంది అంటే, దానికి అంత మెక్కడో తెలియకుండా ఉంది అని అర్థము. అనంతంగా ఉంది అని భావము. అది పరమేశ్వరుని సర్వ వ్యాపకత్వాన్ని సూచిస్తూ ఉంది. ఈ కారణం గానే ప్రత్యేకించి ఈ సందర్భములో భగవంతుని 'విష్ణో' అని సంబోధించాడు అర్జునుడు. అంతటా వ్యాపించిన వాడు కావడం చేతనే భగవంతుడు 'విష్ణువు' అని వ్యాస భగవానుడు మహాభారతంలో నిర్వచించాడు **(విష్ణుః 'విష్ణుః విక్రమణాత్' ఇతి వ్యాసేన ఉక్తేః)**.

అంతటా వ్యాపించి యున్న విశ్వరూపుని నోళ్ళు అన్ని వైపుల తెరువబడి ఉన్నాయి **(వ్యాత్తాననం, వ్యాత్తాని వివృతాని ఆననాని ముఖాని)**. సాధారణంగా నోరు తెరవడము అనేది ఏదైనా మ్రింగడానికి సూచితము. నోరు తెరవకుండా ఎలా తింటాము? ఎలా త్రాగుతాము? భయంకరంగా నోళ్ళు తెరచుకొని, ప్రజ్వలిస్తున్న నేత్రాలతో భీకరముగా గోచరిస్తున్న విశ్వమూర్తి రూపాన్ని సంహార స్వరూపంగా ఊహించుకొని అర్జునుడు భీతి చెందుతున్నాడు.

అన్నీ ఊహలే. అర్జునుని ఊహలే. అందుచేత ఈ విధమైన ఊహలకు నిలయమైన తన మనస్సు ధైర్యాన్ని కోల్పోయింది **(ధృతిం న విందామి)**. అధైర్యపరుడిలో ఆనంద మేముంటుంది? అందుకనే, తన మనస్సుకు సంతోషం లేకుండా పోయింది అంటున్నాడు **(శమం చ ఉపశమం మనః తుష్టిం న లభే)**.

దంష్ట్రా కరాలాని చ తే ముఖాని దృష్ట్వైవ కాలానల సన్నిభాని ।
దిశో న జానే న లభే చ శర్మ ప్రసీద దేవేశ జగన్నివాస ॥ 25

దంష్ట్రాకరాలాని-చ-తే-ముఖాని-దృష్ట్వా-ఏవ-కాలానల సన్నిభాని
దిశః-న-జానే-న-లభే-చ-శర్మ-ప్రసీద-దేవేశ-జగన్నివాస

దంష్ట్రాకరాలాని	= కోఱలచే భయంకరమైన	న జానే	= తెలిసికొనలేక పోతున్నాను
కాలానల సన్నిభాని	= ప్రళయాగ్నిని బోలిన	శర్మ	= సుఖమును
తే	= నీ యొక్క	న లభే చ	= పొందలేక పోతున్నాను
ముఖాని	= ముఖములను	దేవేశ	= దేవదేవా!
దృష్ట్వా ఏవ	= చూచియే	జగన్నివాస	= జగదాశ్రయా!
దిశః	= దిక్కులను	ప్రసీద	= ప్రసన్నుడవు కా!

దేవదేవా! జగన్నివాసా! భయంకరమైన కోరలతో, కాలాగ్ని వలె కాగుతున్న నీ ముఖాలను చూచి దిగ్భ్రాంతి చెందుతున్నా! సుఖపడలేక పోతున్నా! ప్రసన్నుడవు కా!

వ్యాఖ్య

ప్రళయము భయంకర మైనది. ప్రళయాన్ని తట్టుకొని ఎవ్వరూ నిలువలేరు. ప్రళయ కాలంలో లోకాలను ప్రచండంగా దహించే అగ్నిని కాలానలం అంటారు. అదే కాలాగ్ని **(ప్రళయకాలే లోకానాం దాహకః అగ్నిః కాలా**

నల: కాలాగ్నిః). అందుచేతనే లయ కారకుడైన పరమేశ్వరుని రుద్రాధ్యాయంలో **కాలాగ్ని రుద్రాయ** అని ప్రార్థిస్తాము. అంటే కాలాగ్ని రూపంలో ఉండే రుద్రుడు అని అర్థము ***(కాలానల రూపేణ రుద్రః).***

ప్రళయ కాలాగ్ని రూపంలో మండుతున్న మంటలు గల విశ్వరూపుని ముఖాలను చూడగానే దిక్కులు తెలియడం లేదట. అర్జునుడు దిగ్భ్రాంతి చెందుతున్నట్లు చెబుతున్నాడు.

దిక్కులు తెలియడం లేదు అంటే, పూర్వాపర వివేకం నశించింది అని అర్థము. ఇది తూర్పు - అది పడమర అని తెలియడం లేదట ***(దిశః పూర్వాపర వివేకేన న జానే).*** దిక్కు తెలియని వాడయ్యాడట ***(దిఙ్మూఢః).*** సూర్యునకు ఉదయాస్తమయాలు ఉంటేనే దిక్కులు అర్థమౌతాయి.

సూర్యుడు ఉదయించిన దిక్కు తూర్పు అని, అస్తమించిన దిక్కు పశ్చిమ మని గుర్తిస్తాము కనుక, వాటిని ఆధారం చేసుకొని ఉత్తర దక్షిణాలను, నైరుతీ ఈశాన్యాలను గుర్తిస్తాము. విశ్వరూపంలో సూర్యోదయము లేదు. సూర్యాస్తమయమూ లేదు. ద్వాదశాదిత్యులు ఒకే రూపంలో ప్రకాశిస్తూ ఉండే టప్పుడు, ఉదయాస్తమయాలు ఎలా తెలుస్తాయి? పగలు ఏదో, రాత్రి ఏదో, ఏది ఉదయమో, ఏది సాయంత్రమో ఎలా తెలుస్తుంది? అందుచేత, ప్రళయాగ్ని రూపంతో భయంకరంగా గోచరిస్తున్న విశ్వరూపుని చూచి భీతి చెందిన అర్జునుడు, తాను 'కాందిశీకుడు' అయినట్లు అంగీకరిస్తున్నాడు. తాను ఏ దిక్కున పోతున్నాడో తెలియకుండా ప్రయాణం చేసే వాడిని కాందిశీకుడు అంటారు.

దిక్కు లేని వారికి దేవుడే దిక్కు అంటారు. కాని, ఇక్కడ విచిత్ర మేమిటంటే, దేవుడి వల్లనే దిక్కులు అర్థం కాకుండా పోయాయి. దిక్కులు తెలియడం లేదు అంటే, దిక్కుల విషయంలో వివేకం లేదు అని అర్థము. దిక్కులకు సంబంధించిన జ్ఞానం లేదు. అందుకనే, అర్జునుడు ప్రస్తుత శ్లోకంలో భగవంతుని **దేవేశ** అని సంబోధించాడు. దేవేశుడు అంటే దేవతలకు ప్రభువు ***(దేవానాం ఈశః దేవేశః).*** 'దేవ' శబ్దము ద్యోతనార్థకము కనుక, ఇంద్రియ మనస్సులు అని కూడా అర్థము. విషయాలను ప్రకాశింప చేసేవి కావడం చేత, జ్ఞానేంద్రియ అంతఃకరణాలను దేవతలుగా ముందే తెలుసుకొని ఉన్నాం. అట్టి ఇంద్రియ మనస్సు లనే దేవతలకు ఆత్మ చైతన్యంగా ప్రకాశాన్ని ప్రసాదించే వాడు తానే కనుక భగవంతుడు దేవేశుడు.

'దేవేశా! నాకు దారి చూపు! దిగ్భ్రాంతి కారణంగా నా మనస్సుకు సుఖం లేకుండా పోయింది' అంటున్నాడు పార్థుడు ***(అతః న లభే చ నోపలభే చ శర్మ సుఖమ్).*** 'శర్మ' అంటే సుఖము, లేదా శుభము అని అర్థము. అట్టి సుఖము, లేదా శుభము కలగడానికి, హే దేవేశా! ప్రసన్నుడవు కా! అని ప్రార్థిస్తున్నాడు.

ఇక్కడ చాలా ఆసక్తికరమైన, సూక్ష్మమైన అంశ మొకటి ఉంది. దిక్కు లేని వారికి దేవుడే దిక్కు. కాని, ఇక్కడ దేవుడి వల్లనే దిక్కులు తెలియకుండా పోయాయి అని చెప్పుకున్నాం. ఎవరి వల్ల దిశలు తెలియకుండా పోయాయో, అట్టి దేవేశునే ప్రార్థిస్తే దిక్కులు ఎలా తెలుస్తాయి? తెలుస్తాయి. ఎలా? దిశగా తాను లభ్యం కాకపోయినా, దిశా నిర్దేశం చేసే వివేక రూపంగా తాను సిద్ధమే. ఇలా చూచి నపుడు, దిక్కు లేని వారికి దేవుడే దిక్కు అనే వాక్యం పూర్ణజ్ఞానంతో సిద్ధిస్తుంది.

భగవంతుడికి 'దిక్కు' అనే పేరు కూడా ఉంది ***(దిశః).*** ఏది తప్పో, ఏది ఒప్పో, ఏది సక్రమమో, ఏది అక్రమమో తెలుసుకొనే వివేకాన్ని వేదజ్ఞానం ద్వారా అందించే వాడు తానే కనుక దేవేశుడు ***దిశ*** నామధేయుడు ***(సమస్తానాం ఫలాని దిశన్ వేదాత్మనా దిశః).*** వేదజ్ఞానం ద్వారా సర్వోపదేశమును సర్వహితంగా బోధించే వాడు కావడం చేత అతడు ***దిశః*** అంటే, 'దిక్కు' అనే పేరు కలిగిన వాడు.

వివేకం లోపిస్తే చిత్త స్వాస్థ్యము లేకుండా పోతుంది. చిత్త స్వాస్థ్యము లభిస్తేనే మనస్సు సుఖ పడుతుంది.

అదే 'శర్మ' శబ్దంలో చెప్పబడిన సుఖము. అశుభమును తుడిచి పెట్టే సుఖమును 'శర్మ' అంటారు ***(శృణాతి అశుభ మితి శర్మ).*** వివేకమే చిత్తానికి స్వాస్థ్యాన్ని ప్రసాదిస్తుంది.

వికృతమైన కోరలతో, కాలానలం వంటి ముఖాలతో భయభ్రాంతులను కలిగిస్తున్న విశ్వరూపాన్ని దర్శించి దిక్కులు తెలియక చిక్కులు పడుతున్న తనను కరుణించి, అనుగ్రహించ మని అర్జునుడు అచ్యుతుని ప్రార్థిస్తున్నాడు.

చరణము: **దిక్కులు తిరుగుచు చిక్కులు పడితి**
చిక్కెద వని నీవు
పరితపించుచు ప్రక్కన చేరితి
పరిహసించకయ్యా! ॥ వినిపించలేదా ॥
పల్లవి: **వినిపించలేదా కోనేటి దేవా!**
కన్నీటి నా గాథ!
అనుపల్లవి: **అడుగు అడుగుకు కొండల స్వామి**
దండము గైకొనవా! ॥ వినిపించలేదా ॥

అని పరితపిస్తూ భక్తితో ప్రార్థిస్తున్న అర్జునుని పవిత్ర హృదయానికి అద్దం పట్టింది చైతన్య గీతిక.

యుద్ధభూమిలో గెలుపు మనదో, లేక కౌరవులదో అని శంకించాడు కదా! మరి, విశ్వరూప దర్శన ప్రభావంతో ఇప్పుడే మంటాడు పార్థుడు? ఆ శంక కూడా పోయిం దంటున్నాడు. చదవండి.

అమీ చ త్వాం ధృతరాష్ట్రస్య పుత్రాః సర్వే సహైవావనిపాల సంఘైః ।
భీష్మో ద్రోణః సూతపుత్ర స్తథాసౌ స హాస్మదీయై రపి యోధముఖ్యైః ॥ 26
వక్త్రాణి తే త్వరమాణా విశన్తి దంష్ట్రా కరాలాని భయానకాని ।
కేచి ద్విలగ్నా దశనాన్తరేషు సందృశ్యన్తే చూర్ణితై రుత్తమాఙ్గైః ॥ 27

అమీ-చ-త్వాం-ధృతరాష్ట్రస్య-పుత్రాః-సర్వే-సహ-ఏవ-అవనిపాలసంఘైః
భీష్మః-ద్రోణః-సూతపుత్రః-తథా-అసౌ-సహ-అస్మదీయైః-అపి-యోధముఖ్యైః
వక్త్రాణి-తే-త్వరమాణాః-విశంతి-దంష్ట్రాకరాలాని-భయానకాని
కేచిత్-విలగ్నాః-దశనాంతరేషు-సంధృశ్యంతే-చూర్ణితైః-ఉత్తమాంగైః

అమీ	= ఈ	అస్మదీయైః	=మనవారైన
ధృతరాష్ట్రస్య	= ధృతరాష్ట్రుని యొక్క	యోధ ముఖ్యైః సహ అపి	=యుద్ధప్రముఖులతో కూడా
పుత్రాః	= కుమారులును	సర్వే చ	=అందరును
అవనిపాల సంఘైః సహ ఏవ	= రాజసమూహముతో గూడి	త్వరమాణాః	=తొందరపడుతున్న వారై
తథా	= అటులే	త్వాం	=నీలో
భీష్మః	= భీష్ముడు	దంష్ట్రాకరాలాని	=కోఱలతో వికారమైన
ద్రోణః	= ద్రోణుడు	భయానకాని	=భయంకరమైన
అసౌ	= ఈ	తే	=నీ యొక్క
సూతపుత్రః	= సూతపుత్రుడు	వక్త్రాణి	=ముఖములను

విశంతి	= ప్రవేశిస్తున్నారు	చూర్ణితైః	= పొడి పొడి అయిన
కేచిత్	= కొందరు	ఉత్తమాంగైః	= శిరములతో
దశనాంతరేషు	= దంతముల మధ్య	సందృశ్యంతే	= కనబడు తున్నారు
విలగ్నాః	= చిక్కినవారై		

భగవంతా! ధృతరాష్ట్రుని పుత్రులు, భూపతుల సమూహము, మా పక్షము లోని ముఖ్యులైన వీరులు, భీష్ముడు, ద్రోణుడు, అలాగే సూతపుత్రుడైన కర్ణుడు,

అందరూ వికారమైన కోరలతో ఉన్న, భయంకరమైన నీ ముఖాల లోకి తొందర పడుతూ ప్రవేశిస్తున్నారు. కొందరి తలలు నీ ముఖాల లోని పండ్ల సందులలో చిక్కి చూర్ణమై కనిపిస్తున్నాయి.

వ్యాఖ్య

యద్వా జయేమ యది వానో జయేయుః - 'మధుసూదనా! మనమే జయిస్తామో, లేక మనల్ని వాళ్ళే జయిస్తారో తెలియదు' అని ప్రారంభం లోనే రెండవ అధ్యాయంలో అర్జునుడు శ్రీకృష్ణునికి విన్నవించు కున్నాడు *(2 వ అ - 6 వ శ్లో).*

యచ్చాన్య ద్రష్టు మిచ్ఛసి - అర్జునా! ఈ రూపాలే గాక, వీటికి అన్యమైనవి నువ్వు ఏవేవి చూడా లనుకుంటున్నావో, అవన్నీ నా రూపంలో చూసేయ్! అంటూ గెలుపు ఓటముల ప్రస్తావన చేయకుండానే, సూచన ప్రాయంగా ఎవరిది జయమో, ఎవరిది పరాజయమో కూడా తేల్చుకోమని భగవంతుడు అర్జునునికి ప్రస్తుత అధ్యాయం ప్రారంభం లోనే చెప్పేశాడు *(11 వ అ - 7 వ శ్లో).*

ఎవరి వల్ల తనకు అపజయం కలుగుతుందని అర్జునుడు శంకించాడో, ఆ సందేహం కూడా తీరి పోయింది ***(యేభ్యః పరాజయ శఙ్కా ఆసీత్ సా చ అపగతా).*** ఎలా తీరిపోయింది అంటే ***(యతః)***, చెబుతున్నాడు. ప్రత్యక్షంగా చూశాడు కనుక సంశయ విచ్ఛేదము జరిగి పోయింది.

ఏం చూశాడు?

ధృతరాష్ట్రుని కుమారులైన దుర్యోధనాదులు, భీష్ముడు, ద్రోణుడు, సూత పుత్రుడైన కర్ణుడు, సహ యోధులైన భూపతులు, తమ పక్షం వారైన ధృష్టద్యుమ్న, సాత్యకీలు కూడా పరమేశ్వరుని కాలానల ముఖాలలో ప్రవేశించి చూర్ణ మౌతున్న దృశ్యాలను అర్జునుడు చూశాడు.

ఎక్కడ చూశాడు?

కోరలతో వికృతమై, భయంకరంగా ఉన్న విశ్వరూపుని ముఖాల లోకి ప్రవేశించడం చూశాడు. అంతే కాదు, శిరస్సు మొదలైన ఉత్తమాంగాలు పండ్ల సందులలో పడి నలిగి చూర్ణం కావడం కళ్ళారా చూశాడు. వాస్తవానికి భవిష్యత్తులో కురుక్షేత్రంలో కనిపించబోయే భయంకర దృశ్యము ఎలా ఉంటుందో, దానిని యథాతథంగా అచ్యుతుడు అర్జునునికి దర్శింప చేశాడు.

కాలం ఒక కల

యుద్ధం ఇంకా ప్రారంభమే కాలేదు కదా! యుద్ధం ప్రారంభమైన తరువాత కదా, ఎవరు ఉంటారు, ఎవరు పోతారు అనేది తెలిసేది! మరి, యుద్ధానికి ముందే మరణించబోయే వారిని ఎలా చూపించాడు? అక్కడ జరగ బోయేది, అప్పుడు జరగ బోయేది ఇప్పుడే ఇక్కడే జరిగినట్లు చూపించడ మేమిటి? అనే సందేహము రావచ్చు. సందేహం రావడం కూడా సహజమే. సమంజసమే.

అప్పుడు అక్కడ కనిపించ వలసినవి, ఇప్పుడు ఇక్కడే కనిపిస్తున్నాయి అంటే, అక్కడ ఇక్కడ అనే దేశము కాని, అప్పుడు ఇప్పుడు అనే కాలము గాని సాపేక్షికాలే గాని పారమార్థికాలు కావు అని తేలిపోయింది.

దృశ్యమాన ప్రపంచము దేశకాలాదుల లోనే కనిపిస్తూ ఉంది. ప్రపంచం యొక్క అర్థం ప్రపంచంలో లేదు. ప్రపంచం కాలంలో ఉంది. కాని, కాలం పరమాత్మలో లేదు. ప్రపంచం ప్రదేశంలో ఉంది. కాని ప్రదేశం పరమాత్మలో లేదు.

దేశకాలాదులలో తెలిసే ప్రపంచం సత్యం కాదు. దానికి స్వతంత్ర మనుగడ లేదు. అది ఆత్మ చైతన్యముపై ఆధారపడి ఉంది. ఆత్మ పారమార్థిక సత్తా కలది. దేశకాలాదులు, దేశకాలాదులలో తెలిసే ప్రపంచము వ్యావహారిక సత్తా మాత్రమే కలవి.

దేశకాలాదులు మనోకల్పితాలు. స్వప్నము లాంటివి. 'రేపు' అనే దానిని ఎవ్వరూ చూడరు. చూడలేరు. ఒకవేళ చూచినా, 'నేడు' గానే చూస్తారు. 'నేడు' లేదా 'ఇప్పుడు' అని వర్తమానాన్ని గురించి పలికే లోగా అది గతం అవుతూ ఉంటుంది. ఏమిటి ఈ కాలం? ఎక్కడికి ఈ ప్రవాహం?

క్షణాన్ని యుగంగా, యుగాన్ని క్షణంగా మనస్సు మార్చుతుంది. కలలో కూడా ఇది తెలుస్తుంది. ఈ కాలం ఆ కాలం కాదు. ఆ కాలం ఈ కాలం కాదు. మనస్సు సృష్టించే కాలం కనుక, అది కలలో నైనా, మెలకువలో నైనా అసత్యమే. మనసే సత్యం కానపుడు, మనస్సు సృష్టించే కాలం సత్యం అవుతుందా?

సూర్యుడి వల్లే మనకు కాలం తెలుస్తోంది. సూర్యుడు లేకపోతే కాలం అర్థం కాదు. కాని, సూర్యునిలో కాల ముందా? ఉదయ సాయంత్రాలు ఉన్నాయా? నిన్న నేడు లున్నాయా? నేడు రేపు లున్నాయా? ఏవీ లేవు. అయినా కాల ముంది అంటారా?

సూర్యునిలో కాలం ఎలా అసంభవమో, పారమార్థిక స్వరూపంలో కూడా కాలం అనూహ్యం. అంతా వర్తమానమే. అనంత వర్తమానమే. ఈ అవగాహనే పరమేశ్వరుడు అర్జునునికి కలిగిస్తున్నాడు. భవిష్యత్తును వర్తమానంలో చూపుతూ, వర్తమానమే సత్యమని, వర్తమానంపై ఆధారపడి ఉండే భవిష్యత్తు మిథ్య అనే అవగాహనను మెల్లగా అర్జునుని బుద్ధిలో దించుతున్నాడు. ఇదే జ్ఞానదృష్టి

నిదురించగా నేను మేలుకొంటుంది రాత్రి
నిదుర లేవగానే పలకరిస్తుంది పగలు
తోడుగా ఉంటివి మాకు పగలు రాత్రి
నీ అడుగుల కడ పడి ఉందు నీలకంఠా!

అని నీలకంఠ శతకంలో ఒక విబూది పండు.

యథా నదీనాం బహవో౽మ్బువేగాః సముద్రమేవాభిముఖా ద్రవన్తి। 28
తథా తవామీ నరలోకవీరాః విశన్తి వక్త్రాణ్యభివిజ్వలన్తి ॥

యథా-నదీనాం-బహవః-అంబువేగాః-సముద్రం-ఏవ-అభిముఖాః-ద్రవంతి
తథా-తవ-అమీ-నరలోక వీరాః-విశంతి-వక్త్రాణి-అభివిజ్వలంతి

నదీనాం	= నదుల యొక్క	యథా	= ఏ విధంగా
బహవః	= బహు విధములైన	సముద్రం ఏవ	= సముద్రమునే
అంబువేగాః	= నీటి ప్రవాహములు	అభిముఖాః	= ఎదురుగా చేసుకొని

ద్రవంతి	=	ప్రవహిస్తూ ఉన్నవో	తవ	=	నీ యొక్క
తథా	=	అలాగే	అభివిజ్వలంతి	=	ప్రజ్వలించుచున్న
అమీ	=	ఈ	వక్త్రాణి	=	ముఖములను
నరలోకవీరాః	=	రాజశ్రేష్ఠులు	విశంతి	=	ప్రవేశిస్తున్నారు

భగవంతా! నదీ జలాలు నానా విధాలుగా ప్రవహించి, సముద్రానికి అభిముఖంగా పయనించి అందులోకి ఎలా ప్రవేశిస్తున్నాయో, అలాగే మానవలోకం లోని వీరు లందరూ నీ లోకి ప్రవేశిస్తున్నారు.

వ్యాఖ్య

కురుక్షేత్రంలో సమర యోధులైన ఉభయ పక్షాల లోని వీరులు ప్రజ్వలించుచున్న విశ్వరూపుని ముఖాల లోకి ప్రవేశిస్తున్నారని పూర్వ శ్లోకంలో తెలిపిన అర్జునుడు, వారు ఏ విధంగా ప్రవేశిస్తున్నారో ప్రస్తుత శ్లోకంలో చెబుతున్నాడు ***(కథం ప్రవిశన్తి ముఖాని ఇత్యాహ).***

నదీ జలాలు ఏ విధంగా అయితే ప్రవహించి సాగరంలో కలిసి పోతున్నాయో, అలాగే మానవ లోకం లోని వీరులు విశ్వరూపుని లోకి ప్రవేశిస్తున్నారు అంటున్నాడు.

నదుల పుట్టుక స్థానాలు వేరు వేరైనా, నదీ జలాలు అనేక మార్గాల గుండా పయనించినా, అవన్నీ సముద్రాన్నే ఏక లక్ష్యంగా కలిగి, సముద్రం లోకే ప్రవేశిస్తాయి ***(సముద్ర మేవ అభిముఖాః ద్రవన్తి ప్రవిశన్తి).***

నదీ జలాలు విరామం తెలియకుండా వేగంతో పయనిస్తాయి. అప్రయత్నంగా ప్రవహిస్తాయి. గ్రుడ్డిగా వెళ్ళి రూపు లేకుండా పోతాయి. ఇది అనివార్యమైన పయనము. తనను తాను పోగొట్టుకొనే పయనము. దూరాలను దూసుకుంటూ, భారాలను తోసుకుంటూ, అవరోధాలను నెట్టుకుంటూ వచ్చి, తనను మరచి, సాగరునిలో ప్రవేశించే ప్రస్థానము.

నదీ జలాలు అప్రయత్నంగా, అనివార్యంగా సహజ వేగంతో పయనించి, సముద్ర ముఖద్వారం వద్ద పట్టు దప్పి సాగరంలో పడి పోయినట్లు, మానవ లోకంలో భీష్మాది వీరులు కూడా త్వరత్వరగా వెళ్ళి విశ్వరూపుని కాలానల ముఖాలలో ప్రవేశిస్తున్నారు.

ఏనుగులే నిలదొక్కుకోలే నపుడు, జంబుకాలు జంభం ప్రదర్శించి ఏమి సాధిస్తాయి? మహావీరులే నిస్సహాయులై పోతున్నారు. మృత్యు ముఖంలో పడి పోతున్నారు. సామాన్యులం మనం. ఎదురీది సాధించ గలమా?

అంతా విధాత నిర్ణయమే. విధి నియమమే. జరిగే వన్నీ జరిగి పోతాయి. పతనం సమీపించి నపుడు ఉత్థాన ప్రయత్నాలన్నీ వృథా శ్రమలే అవుతాయి. వట్టి భ్రమలుగా మిగిలి పోతాయి.

ప్రవాహ వేగంలో, పయనించే మార్గాలలో, నదుల మధ్య అంతరాలు ఉండవచ్చు నేమో గాని, సముద్ర ముఖద్వారం వద్ద నదులన్నీ భేదాలు మరచి ఏకం కావలసిందే.

భేదాలన్నీ బ్రతుకు లోనే. చావులో ఏ భేదాలు లేవు. గుడిసెలు, మేడలు బ్రతికి నంత వరకే. మృత్యువు ఆసన్న మైతే, అందరికీ శ్మశానమే నివాసము. శంకరాలయంలో భేదాలు ఉండవు. ఈ సత్యం అవగత మైతే, పోయేటప్పుడు ఉండనివి ఉన్నప్పుడు కూడా లేనివే అవుతాయి.

నీవు నే నను భేదాలు
ఉర్వి లోన ఉత్సవాలు

ఊపిరి ఆగి ఊరేగిన నాడు
ఉండవు కాటిలో తేడాలు
పోయిన నాడు ఉండనివి
పోనపుడు ఎందుకు ఉన్నవి?
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్

అని రామజోగి చిట్కా.

నదులు జడాలు. అందుచేత అప్రయత్నంగా, అబుద్ధి పూర్వకంగా పరుగులెత్తి సముద్రంలో పడతాయి. మరి చేతనాలు ఎందుకు పతన మౌతున్నాయి? అనేది శంక. పతన సమయంలో పతన మవటమే గాని జడ చేతన భేదా లుండవు. మేడ మెట్లపై నుండి జారిన మనిషి క్రింద పడతాడు. చెట్టును వీడిన పండు నేల రాలుతుంది. అంతే. చదవండి అదీ తెలుస్తుంది.

యథా ప్రదీప్తం జ్వలనం పతఙ్గాః విశన్తి నాశాయ సమృద్ధవేగాః ।
తథైవ నాశాయ విశన్తి లోకా స్తవాపి వక్త్రాణి సమృద్ధవేగాః ॥ 29

యథా-ప్రదీప్తం-జ్వలనం-పతంగాః-విశంతి-నాశాయ-సమృద్ధవేగాః
తథా-ఏవ-నాశాయ-విశంతి-లోకాః-తవ-అపి-వక్త్రాణి-సమృద్ధవేగాః

పతంగాః	=	మిడుతలు	తథా ఏవ	=	ఆ విధం గానే
ప్రదీప్తం	=	మండుచున్న	లోకాః అపి	=	జన సమూహములు కూడా
జ్వలనం	=	అగ్నిని	సమృద్ధవేగాః	=	అతివేగము గలవై
సమృద్ధవేగాః	=	అతి వేగముతో	తవ	=	నీ యొక్క
యథా	=	ఏ విధంగా	వక్త్రాణి	=	ముఖములను
నాశాయ	=	నాశము కొరకు	నాశాయ	=	నాశము కొరకు
విశంతి	=	ప్రవేశిస్తున్నవో	విశంతి	=	ప్రవేశిస్తున్నాయి

మండుతున్న అగ్నిని మిడుతలు అతి వేగంతో సమీపించి నశించి పోతాయి. లోకంలో జీవు లందరూ పరుగు లెత్తుతూ వచ్చి నీ ముఖాలలో ప్రవేశించి నశించి పోతారు.

వ్యాఖ్య

పరుగులు ప్రాణులకు కొత్తవి కావు. ప్రయాణాలు తెలియనివి కావు. బండి చిక్కదేమో అని కొందరు పరుగులు తీస్తూ ఉంటే, తిండి దక్కదేమో అని మరి కొందరు పరుగు లెత్తుతూ ఉంటారు. ఎందుకు ముందు ఉండాలని కొందరు పరుగులు తీస్తే, పరుగే పనిగా పెట్టుకొని పరుగు పందెంలో విజయం సాధించాలని కొందరు పరుగు లెడుతూ ఉంటారు. ఇలాంటి పరుగుల్ని అర్థం చేసుకోవచ్చు. కాని, ఒరిగి పోయేందుకు, తరిగి పోయేందుకు, కాలంలో కరిగి పోయేందుకు పరుగులు తీయడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ఏమి సాధించాలని ఈ పరుగు?

చివరి పరుగులో సాధించేది ఏమీ ఉండదు. ఒకవేళ సాధించాలి అనేది ఏదైనా ఉంటే, అది చివరి పరుగులో పాల్గొనే ముందే ఉండాలి.

అవిగో, మిడుతలు పరుగులు పెడుతున్నాయి. ఎక్కడికి? మండుతున్న అగ్ని సమీపానికి **ప్రదీప్తం అగ్నిం**

పతంగాః పక్షిణః విశన్తి సమృద్ధ వేగాః). దేని కోసం పరుగు? నశించి పోవడానికి ***(వినాశాయ).*** అలాగే వినాశ కాలంలో విపరీత బుద్ధి పూర్వకంగా లోకంలో అందరూ పరుగు పరుగున వెళ్ళి పరమేశ్వరుని కాలాగ్నిలో ప్రవేశిస్తారు. ఇవన్నీ అనివార్యాలు. అర్థం గాని కర్మఫలాలు. మృత్యు ముఖ ప్రవేశ హేతువులు. శలభాల వలె కాలాగ్నిలో కాలి పోవడమే ప్రవేశ ప్రయోజనము.

అవశులై నదులు ప్రవహించి సాగరంలో పడుతున్నాయి. బుద్ధి పూర్వకంగా పరుగులెత్తి మిడుతలు అగ్నిలో దూకుతున్నాయి. మృత్యుకాలంలో నిగ్రహాలు అనూహ్యాలు.

అలా అందరూ అవశులై విశ్వరూపుని కాలానల ముఖాలలో ప్రవేశిస్తూ ఉంటే, విశ్వమూర్తి ఏం చేస్తున్నాడు?

నదుల విషయంలో సాగరుడు ఏమి చేశాడో, శలభాల విషయంలో అగ్నిదేవుడు ఏం చేశాడో, జీవుల విషయంలో ఈశ్వరుడు అదే చేస్తాడు. అదే తరువాత ప్రసంగ విషయం.

లేలిహ్యసే గ్రసమానః సమన్తా ల్లోకాన్సమగ్రా న్వదనైర్జ్వలద్భిః ।
తేజోభి రాపూర్య జగత్సమగ్రం భాసస్తవోగ్రాః ప్రతపన్తి విష్ణో ॥ 30

లేలిహ్యసే-గ్రసమానః-సమంతాత్-లోకాన్-సమగ్రాన్-వదనైః-జ్వలద్భిః
తేజోభిః-ఆపూర్య-జగత్-సమగ్రం-భాసః-తవ-ఉగ్రాః-ప్రతపంతి-విష్ణో

విష్ణో	=	విష్ణుమూర్తీ!	తవ	=	నీ యొక్క
జ్వలద్భిః	=	మండుచున్న	ఉగ్రాః	=	ప్రచండమైన
వదనైః	=	నోళ్ళ చేత	భాసః	=	కాంతులు
సమంతాత్	=	అన్ని వైపుల నుండి	సమగ్రం	=	సమస్తమైన
సమగ్రాన్	=	సమస్త మైన	జగత్	=	జగత్తును
లోకాన్	=	లోకములను	తేజోభిః	=	కాంతుల చేత
గ్రసమానః	=	మ్రింగుచు	ఆపూర్య	=	నింపి
లేలిహ్యసే	=	ఆస్వాదిస్తున్నావు	ప్రతపంతి	=	తపింప చేస్తున్నాయి

హే విష్ణుదేవా! మండుతున్న నీ నోళ్ళలో ప్రవేశిస్తున్న లోకులను నాకుతూ, చప్పరిస్తూ అమాంతం మ్రింగుతున్నావు. భయంకరమైన నీ తేజస్సు ఈ ప్రపంచాన్నంతా ప్రచండంగా ఉడికిస్తూ ఉంది.

వ్యాఖ్య

సమర క్షేత్రంలో కయ్యానికి కాలు మోపిన రాజులు, విశ్వరూపుని కాలానల ముఖాలలో ప్రవేశించు విధానమును వివరించి, ప్రవేశ ప్రయోజనాన్ని కూడా పూర్వ శ్లోకంలో తెలియ జేసిన అర్జునుడు, ప్రస్తుత శ్లోకంలో ఆ సమయంలో పరమేశ్వరుడు నిర్వహించే కార్యాన్ని వివరిస్తున్నాడు.

యావ త్ప్రపంచాన్ని తేజస్సులలో ముంచి, జ్వలిస్తున్న నోళ్ళతో చప్పరిస్తూ, నాకుతూ ప్రాణుల్ని మ్రింగుతున్నాడు. సంహార కర్తగా దయా దాక్షిణ్యాలు లేకుండా ధర్మ నిర్వహణలో జాజ్వల్యమాన మవుతున్నాడు.

ఈ విధమైన సంహార కార్యాన్ని ఆచరించడంలో విశ్వమూర్తి తృప్తి చెందుతున్నాడు. బాహ్యానికి చాచిన తన కాలాగ్ని నాలుకలతో నాకుతూ, ప్రాణులను మ్రింగిన తరువాత ***(గ్రసమానః).*** అప్పటికీ తృప్తి చెందక నాలుకలతో దౌడలను మాటిమాటికీ నాకుతూ ***(లేలిహ్యసే)*** కనిపిస్తున్నాడు. తృప్తిగా భుజించిన తరువాత, ఆహారాన్ని మ్రింగి, ఆ తరువాత, దౌడలను మనం ఎలా నాకుతామో, ఆ విధంగా నాకుతూ గోచరిస్తున్నాడు

అంటే, సంహార కార్యాన్ని విశ్వమూర్తి సంతృప్తితో నిర్వహిస్తున్నాడని తెలుస్తూ ఉంది.

మండు వేసవిలో సూర్యుడు ప్రపంచాన్ని ఎలా తపింప చేస్తాడో, సంహార సమయంలో తన తేజస్సుతో విశ్వరూపుడు యావ త్ప్రపంచాన్ని అలా తపింప చేస్తున్నాడు. మృత్యు విషయంలో జీవులు అనుభవించే దుఃఖమే, పరితాపమే, సంతాపమే ఇక్కడ తాపము. ఇది మామూలు తాపము కాదు. ప్రచండమైన తాపము అంటున్నాడు అర్జునుడు.

ప్రతపన్తి అంటే అధికంగా తపింప చేయడము అని అర్థము. భయంకరమైన విశ్వమూర్తి యొక్క కాంతులతో ప్రపంచము యావత్తూ ఉడికి పోతూ ఉంది అంటున్నాడు **(తవ ఉగ్రాః క్రూరాః ప్రతపన్తి ప్రతాపం కుర్వన్తి).**

ఇంతవరకు ప్రసన్నుడైన కేశవుని చూచిన అర్జునుడు, ప్రచండ ప్రతాప తేజముతో సంహారమూర్తిగా శివమెత్తి విలయ రూపమును ప్రదర్శించు విశ్వరూపుని అర్థం చేసుకోలేక అనుగ్రహించమని అర్థిస్తున్నాడు.

ఆఖ్యాహి మే కో భవా నుగ్రరూపో నమోఽస్తు తే దేవవర ప్రసీద ।
విజ్ఞాతు మిచ్ఛామి భవన్త మాద్యం న హి ప్రజానామి తవ ప్రవృత్తిమ్ ॥ 31

ఆఖ్యాహి-మే-కః-భవాన్-ఉగ్రరూపః-నమః-అస్తు-తే-దేవవర-ప్రసీద
విజ్ఞాతుం-ఇచ్ఛామి-భవంతం-ఆద్యం-న-హి-ప్రజానామి-తవ-ప్రవృత్తిం

దేవవర	=	దేవదేవా!	ప్రసీద	=	ప్రసన్నుడవు కా!
ఉగ్రరూపః	=	భయంకర ఆకారమైన	ఆద్యం	=	ఆద్యుడ వైన
భవాన్	=	నీవు	భవంతం	=	నిన్ను
కః	=	ఎవరో	విజ్ఞాతుం	=	తెలిసి కొనుటకు
మే	=	నాకు	ఇచ్ఛామి	=	కోరుతున్నాను
ఆఖ్యాహి	=	చెప్పు!	తవ	=	నీ యొక్క
తే	=	నీకు	ప్రవృత్తిం	=	ప్రవర్తనమును
నమః అస్తు	=	వందనము!	న ప్రజానామి హి	=	తెలుసుకోలేక పోతున్నాను

దేవదేవా! నీకు నమస్కారము. నన్ను అనుగ్రహించు. భయంకరమైన రూపం కలిగిన నువ్వెవరు? నాకు చెప్పు. నీ చేష్టలు నాకు అర్థం కావడం లేదు. ఆదిదేవుడైన నిన్ను గూర్చి విశేషంగా తెలుసుకోవాలి అనుకుంటున్నాను.

వ్యాఖ్య

భయంకరమైన రూపముతో ప్రళయ కాలాంతకుని లాగా మహాయోధులతో సహ సర్వులను మ్రింగుతున్న భగవానుని మహా కార్యాన్ని వీక్షించిన అర్జునుడు భీతి చెంది, ఓ దేవవరా! నన్ను అనుగ్రహించు. నీకు దండం పెడతా! నువ్వెవరో చెప్పు. నీ చేష్టలు నాకు ఏ మాత్రం అర్థం కావడం లేదు అంటున్నాడు **(న హి ప్రజానామి తవ ప్రవృత్తిమ్).**

దేవా! నువ్వెవరు? మహా మృత్యు రూపుడవా? ప్రళయ కాల రుద్రుడవా? కాలాన్తకుడవా? ప్రళయాగ్ని హోత్రుడవా? శివుడవా? కేశవుడవా? కేశవుడవై రక్షించేవాడి వని భావించాను. శివుడవై ఇలా భయంకరంగా శిక్షించే వాడవని నాకు తెలియదు.

ఆద్యుడ వైన నిన్ను తెలుసుకోవాలి అనుకుంటున్నాను **(ఆద్యం భవన్తమ్ విజ్ఞాతుమ్ ఇచ్ఛామి)** అని

ప్రార్థిస్తున్నాడు పార్థుడు. భగవంతుడు ఆద్యుడు అని అర్జునుడే చెబుతున్నాడు కదా! తెలియబట్టే కదా చెబుతున్నాడు. ***ఆదౌ భవమ్ ఆద్యం*** - ఆది యందు ఉన్నవాడు కనుక భగవంతుడు ***ఆద్యం*** అయ్యాడు. ఇది అర్జునునకు తెలియబట్టే కదా చెబుతున్నాడు. ఒక వైపు ఆద్యుడు అంటూ, మరో వైపు ఆద్యుడవైన నిన్ను తెలుసు కోవాలని ఉంది అని అంటా డేమిటి?

ఇక్కడొక అందమైన మెలిక ఉంది. సుందరమైన లంకె ఉంది. ఆదిలో ఎవడు ఉంటాడో, అతడు ఆద్యుడు ***(ఆదౌ భవ ఆద్యః).*** ఈ విధంగా భగవంతుణ్ణి గూర్చి అర్జునునికి తెలుసు. కాని, ఆద్యుడు అంటే మరొక అర్థం కూడా ఉంది. సమస్తాన్ని ఆరగించుటకు ప్రవృత్తుడు ఆద్యుడు ***(ఆసమంతా దత్తుం ప్రవృత్తః ఆద్యః).*** ఆదిదేవుడై ఆపదలలో ఆదుకొనే వాడిగా అర్జునుడికి ఆద్యుడు తెలుసు. కాని, అందరినీ అమాంతంగా, ఆనందంగా ఆరగించే ఆద్యుడుగా ఇప్పుడే చూస్తున్నాడు. ఏది ఆద్యమో, ఏది ఖాద్యమో అర్థం గాక, ఆవేదనతో, ఆరాధనా హృదయుడై అడుగు తున్నాడు అర్జునుడు.

అంతే కాదు. లయ రూపుడైన పరమేశ్వరుని ఉగ్రరూపమును చూచి తట్టుకోలేక, 'నీకు దండం పెడతా! నన్ను ప్రసన్నంగా అనుగ్రహించు ***(నమోఽ స్తుతే దేవ వర ప్రసీద)!'*** అని కూడా ప్రార్థిస్తున్నాడు. నిగూఢమైన జ్ఞానాన్ని ప్రశ్నించి తెలుసుకొనే వాడే కదా శిక్షణ యోగ్యుడైన శిష్యుడు!

ఎవరు నీవు ఎవ్వరూ ఎరుగలేరు
ఎరిగిన వారు తిరిగి ఎరుక పరచలేరు
ఎదను చేరి సొదలన్నీ విందువయ్యా!
నీ అడుగుల కడ పడి ఉందు చిన్నికృష్ణా!

అని చిన్నికృష్ణ శతకంలో ఒక వెన్నముద్ద.

పార్థుని ప్రార్థన నాలకించిన పార్థసారథి, తన ప్రవృత్తి దేని నిమిత్తమో వరుసగా మూడు శ్లోకాలలో చెబుతున్నాడు.

శ్రీ భగవానువాచ :

కాలోఽ స్మి లోకక్షయకృ త్ప్రవృద్ధో లోకా న్సమాహర్తు మిహ ప్రవృత్తః ।
ఋతేఽ పి త్వాం న భవిష్యన్తి సర్వే యేఽ వస్థితాః ప్రత్యనీకేషు యోధాః ॥ 32

కాలః-అస్మి-లోకక్షయకృత్-ప్రవృద్ధః-లోకాన్-సమాహర్తుం-ఇహ-ప్రవృత్తః
ఋతే-అపి-త్వాం-న-భవిష్యంతి-సర్వే-యే-అవస్థితాః-ప్రత్యనీకేషు-యోధాః

లోకక్షయకృత్	= లోకసంహారకుడనై	యే	= ఏ
ప్రవృద్ధః	= వృద్ధి చెందిన	యోధాః	= యోధులు
కాలః	= కాలుణ్ణి	ప్రత్యనీకేషు	= ప్రతిపక్ష సైన్యము లందు
అస్మి	= అయి ఉన్నాను	అవస్థితాః	= ఉన్నారో
ఇహ	= ఇప్పుడు	సర్వే	= వారందరు
లోకాన్	= లోకములను	త్వాం ఋతే అపి	= నీవు లేక పోయినా
సమాహర్తుం	= సంహరించుటకు	న భవిష్యంతి	= భవిష్యత్తులో ఉండరు
ప్రవృత్తః	= ప్రవర్తిస్తున్నాను		

శ్రీభగవానుడు చెబుతున్నాడు :

అర్జునా! నేను లోకాలను సంహరించడానికి విజృంభించిన కాలుణ్ణి. ప్రాణులను సంహరించడానికి ఈ ప్రపంచంలో ప్రవర్తిస్తూ ఉంటాను. ప్రతిపక్ష సైన్యము లోని యోధులు నువ్వు యుద్ధం చేయక పోయినా జీవించి ఉండరు.

వ్యాఖ్య

కృష్ణా! నిన్ను గూర్చి **(భవంతం).** నీ ప్రవృత్తిని గూర్చి **(తవ ప్రవృత్తిమ్)** నేను తెలుసుకోలేక పోతున్నాను ***(న హి ప్రజానామి).*** నీ వెవరో, నీ కార్య మేమిటో నీ నుండే తెలుసుకోవాలి అనుకుంటున్నాను **(విజ్ఞాతుమ్ ఇచ్ఛామి)** అని ప్రార్థించిన పార్థునికి, సమాధానం చెబుతున్నాడు భగవంతుడు.

నేను కాలము - నా పని సంహారము

అర్జునా! నేను కాలం. నా కార్యము సంహారం **(కాలః అస్మి లోకక్షయ కృత్).** ప్రాణుల సంహారము అనే కార్యము ద్వారా భూభారాన్ని హరించే కాలరూపుణ్ణి నేను అంటున్నాడు భగవంతుడు.

సర్వ ప్రాణి సంహార హేతువు కాల రూపంలో శోభిస్తున్న పరమేశ్వరుడే. కాలం ఆయన స్వరూపము. కాలం భగవంతుని అధీనంలో ఉంది. కాలం లేకపోయినా భగవంతుడు ఉంటాడు. కాలానికి ఆధారమైన తాను స్వరూపతః కాలాతీత చైతన్యంగా భాసిస్తున్నాడు. **ప్రభవః ప్రలయః స్థానం** - సృష్టి లయ స్థితులు తానే నని రాజవిద్యా రాజగుహ్య యోగంలో తెలిపాడు (*9 వ అ - 18 వ శ్లో*). సృష్టిస్థితులు తన వల్లనే ఎలా సాగుతున్నాయో పూర్వాధ్యాయాలలో విస్తారంగా ప్రస్తావించిన పరమేశ్వరుడు, ప్రస్తుతం తనను ప్రళయరూపునిగా దర్శింప చేస్తున్నాడు. ప్రస్తుతం అంటే ఇప్పుడు, ఈ సమయంలో, కురుక్షేత్రంలో అని అర్థము **(ఇహ అస్మిన్ కాలే).** ఇంతవరకు సృష్టికర్తగా, స్థితికర్తగా గోచరించిన భగవానుడు, ఇప్పుడు, ఇక్కడ సంహారకర్తగా కవిపిస్తున్నాడు. సంహారము అనేది కాలం లోనే జరగాలి. కనుక భగవంతుడు కాలరూపుడు. కాలస్వరూపుడు **(కాలః అస్మి).**

కబళించే వాటిలో తాను కాలము అంటూ ఇప్పటికే భగవంతుడు తన విభూతిగా కాలాన్ని అభివర్ణించాడు (*10 వ అ - 30 వ శ్లో*). ఈ ప్రపంచం కాలంలో తెలుస్తూ ఉంది. కాలంలో కదులుతూ ఉంది. కాలంలో కనుమరు గవుతూ ఉంది. అన్నీ కాలంలో కనుమరు గవుతూ ఉంటే, కాలము కాలరూపుడైన పరమేశ్వరునిలో కరిగిపోతూ ఉంది. అందుచేతనే ఆయన కూడా 'కాలం'గా తెలుస్తున్నాడు **(కాలా లీయతే అస్మిన్ ఇతి కాలః).**

సర్వం కాలగతం

కాలం అనిత్యం. కాల స్వరూపుడైన పరమాత్మ నిత్యము. కాలం లోనే అన్నీ ఆవిర్భవిస్తున్నాయి. కాలం లోనే అన్నీ అంతరిస్తున్నాయి. కాలమే నిత్యం కాదు కనుక, కాలంలో ఉన్నవి ఏవీ నిత్యం కావు.

ఏవైనా, ఎవరైనా కాలంలో కొంత కాలమే ఉంటారు. అందరమూ ఒకే కాలంలో పుట్టక పోయినా, కాలం లోనే అందరమూ పుడుతాము. ఎవరు ఏయే కాలాలలో పుట్టాలో నిర్ణయించేది ధర్మరూప నియతి. ధర్మరూపంలో ఉన్నది దైవమే కనుక, నియతిగా తెలుస్తున్నది నియంతే కాబట్టి, సర్వుల పుట్టుకకు కారణం భగవంతుడే.

పుట్టిన వారు ఎవరైనా ఈ ప్రపంచంలో చచ్చేందుకే ఉన్నారు. పుట్టి చావని వాళ్ళు ఉండట మనేది ఊహ కందదు. అది సత్య దూరమైన విషయం. కాని, ఎవరు ఎప్పుడు చనిపోతారు అనేది కాలగతమైన విషయం. అది కాలానికి కూడా అర్థం కాదు. కాలంలో కర్మఫలాల్ని అందించే కాలస్వరూపుడైన పరమేశ్వరునికే అవగతం.

మృత్యువు అనేది కార్యము. అది ఏ కాలంలో ప్రాప్తించాలో నిర్ణయించే కారణాలు ముందే ఉన్నాయి. ఏ

కార్యాని కైనా రూపాన్నిచ్చేవి కారణాలే. కారణాలు మెల్లమెల్లగా కదులుతూ ఒక కాలంలో కార్య రూపాన్ని ధరిస్తాయి. అలాగే కర్మఫలాలు మృత్యు కారణాల రూపంలో కదులుతూ, ఒక దశలో కార్య రూపాన్ని పొందుతాయి. అదే మృత్యువు. కార్యరూప వినాశము.

కారణాలు ఉండి, అవి ధర్మబద్ధంగా కార్య రూపాన్ని దాల్చేటప్పుడు, ఆ కార్యాన్ని జరగకుండా నివారించే శక్తి ఎవరి కుంటుంది? అందుకే మృత్యువు అనివార్యంగా తెలుస్తూ ఉంది. మృత్యువును ఎవ్వరూ ఆపలేరు. మృత్యువును నిలువరించే శక్తి, నివారించే యుక్తి ఎవ్వరికీ ఉండదు. కాల గతాలన్నీ కాలరూప పరమేశ్వరునికి తల వంచి తరలి పోవలసిందే. తరలి పోయే వారందరికీ కారణం ఈశ్వరుడే.

మృత్యువు దైవాధీనం - మానవులు నిమిత్తం

అర్జునా! ఈ కురుక్షేత్ర సమరభూమిలో కాలు మోపిన యోధు లందరు మరణించడానికే ఉన్నారు. ఎవరైతే మరణిస్తారని నువ్వు కలత చెందావో, ఆ భీష్మద్రోణాదులు ***(భీష్మద్రోణ ప్రభృతయః)*** నువ్వు యుద్ధం చేయక పోయినా ***(త్వా ఋతేఽ పి)*** మిగలరు. నశించి తీరుతారు అంటూ దుర్భర సత్యాన్ని, శతఘ్నిని పేల్చినట్లు పేల్చాడు భగవంతుడు. ఆ మాట విని అర్జునుని చిత్తము కకావికలై ఉంటుంది. వాస్తవాలు అలాగే ఉంటాయి. అందుకే నిజం నిప్పు లాంటిది అన్నారు పెద్దలు.

ఇంత వరకు తాను చంప వలసి వస్తుందేమో అని కలత పడ్డాడు కౌంతేయుడు (*2 వ అ - 4 వ శ్లో*). నువ్వు లేకున్నా వారు పోతారు అని గీతాచార్యుడు చెప్పగానే అర్జునుడు దిగ్భ్రాంతి చెందాడు.

అర్జునా! పోయే వారందరికీ కారణం నేనే గాని, నీవు కావు. నువ్వు పొమ్మంటే పోవడానికి వారు నువ్వు రమ్మంటే వచ్చారా? కాలంలో వచ్చిన వారు కాలం తీరితే ఎందుకుంటారు?

చెట్టులో పక్వమైన పండును తోటమాలి కోయవచ్చు. అతడు కోయక పోయినా, పక్వమైన ఫలం దానంతటదే రాలి పోతుంది.

చెట్టులో కాసిన కాయను పండు కాకుండా ఎలా ఆపలేమో, అలాగే పక్వమైన పండును చెట్టు నుండి పతనం కాకుండా నిలుపలేము. ఇక్కడ తోటమాలి నిమిత్తము. కాలమే ప్రధానము.

పక్వమైన ఫలాలు తరువుల నుండి పతన మైనట్లు, కర్మఫలాలు కూడా కాలంలో అందుతాయి. మృత్యుకాలం ఆసన్న మైనపుడు, తరువుల నుండి ఫలాలు రాలినట్లు ప్రపంచంలో మానవులు రాలి పోతారు. ఇదంతా కర్మఫల ప్రస్థానం. చాలా కాలంగా, కదలి వస్తున్న కారణాల ఫలితమే మృత్యువు.

అర్జునా! ద్రౌపది వస్త్రాపహరణ సన్నివేశం ఈ నాటిదా? అలాగని ఒకనాడు జరగనిదా? ఏళ్ళు గడిచి పోయి ఉండవచ్చు. కాని ఫలితం నేడు అందబోతోంది. నువ్వు ఉన్నా, లేకున్నా ఫలితం అందడంలో పెద్ద తేడా ఉండదు. నీవు లేకున్నా ***(ఋతేఽ పి త్వా)***, భీష్మద్రోణాదులు మాత్రం ఉండరు ***(న భవిష్యన్తి)***. వాళ్ళను చంపేది నువ్వు కాదు. నువ్వు లేకున్నా వాళ్ళు మరణిస్తారు. నువ్వు ఉండి వాళ్ళ మరణాన్ని ఆపలేవు కూడా. అదంతా నా కార్యము. కాలరూపుడ నైన నా కార్య వైభవము. అర్జునా! ఇప్పుడు అర్థమైందా! నే నెవరో, నా కార్య మేమిటో!

తానేమిటో, తన కార్య మేమిటో వివరించిన భగవానుడు, అర్జును డేమిటో, ఆయన కార్య మెలా ఉండాలో కూడా చెబుతున్నాడు.

తస్మా త్త్వ ముత్తిష్ఠ యశో లభస్వ జిత్వా శత్రూ న్భుంక్ష్వ రాజ్యం సమృద్ధమ్ । 33
మయై వైతే నిహతాః పూర్వమేవ నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్ ॥

తస్మాత్-త్వం-ఉత్తిష్ఠ-యశః-లభస్వ-జిత్వా-శత్రూన్-భుంక్ష్వ-రాజ్యం-సమృద్ధం
మయా-ఏవ-ఏతే-నిహతాః-పూర్వం-ఏవ-నిమిత్తమాత్రం-భవ-సవ్యసాచిన్

తస్మాత్	=	అందువలన	భుంక్ష్వ	=	అనుభవించు
త్వం	=	నీవు	ఏతే	=	ఈ
ఉత్తిష్ఠ	=	లే!	మయా ఏవ	=	నా చేతనే
శత్రూన్	=	శత్రువులను	పూర్వమేవ	=	పూర్వమే
జిత్వా	=	జయించి	నిహతాః	=	చంపబడిరి
యశః	=	కీర్తిని	సవ్యసాచిన్	=	అర్జునా!
లభస్వ	=	పొందు!	నిమిత్తమాత్రం	=	నిమిత్తమాత్రుడవు
సమృద్ధం	=	సంపూర్ణమైన	భవ	=	కా!
రాజ్యం	=	రాజ్యమును			

సవ్యసాచీ! అర్జునా! లేచి నిలబడు. శత్రువుల్ని జయించి రాజ్యాన్ని అనుభవించు! కీర్తిని పొందు. నా చేతిలో వీళ్ళందరూ గతించారు. నువ్వు కేవలం నిమిత్తంగా ఉండు.

వ్యాఖ్య

చంపేది తానే నని, కర్తృత్వాన్ని భుజాని కెత్తుకొని కర్తగా ఊగిపోతూ, గోవిందా! నేను యుద్ధము చేయను అని ***(న యోత్స్యే ఇతి)*** అర్జునుడు రెండవ అధ్యాయంలో కూర్చుండి పోయాడు.

ప్రస్తుతం చావు ఏమిటో, చంపే దెవరో, చచ్చే దెవరో, అన్ని విషయాలు అర్జునునికి పూర్తిగా అర్థ మయ్యాయి. కోడి కూయడానికి, తెల్లవారడానికి సంబంధం లేదని తేలి పోయింది. తెల్లవారబోయే సమయంలో కోడి కూయవచ్చు. కోడి కూయకుండా ఆదమరచి కునుకు తీసినా, సూర్యోదయం జరిగే తీరుతుంది. ప్రపంచంలో వెలుగులు విరబూస్తాయి. ఈ సత్యం అర్థం గాక విషాదంతో కూలబడిన కుంతీ తనయుణ్ణి భగవంతుడు వెన్నుదట్టి, అర్జునా! లే, లేచి నిలబడు! ***(తస్మాత్ ఉత్తిష్ఠ)*** అంటూ కార్యోన్ముఖుణ్ణి చేస్తున్నాడు.

ధర్మ జీవనం

'అర్జునా! లేచి నిలబడు. శత్రువుల్ని జయించు. రాజ్యాన్ని వరించు. కీర్తిని పొందు' అని ప్రముఖంగా ఈ సందర్భములో భగవంతుడు అర్జునునికి చేసిన బోధను సాధారణ దృష్టితో గ్రహించడానికి వీలు లేదు. అలా గ్రహించే వారే శ్రీకృష్ణుడు యుద్ధాన్ని ప్రేరేపించాడని, శాంతి కాముకుడు కాడని గర్హిస్తూ, అభియోగాలను మోపుతూ ఉంటారు.

ధర్మం అడుగంటి, అధర్మం విలయ తాండవం చేసే టప్పుడు, క్షత్రియుడైన పార్థుడు ధర్మమును పునః సుప్రతిష్ఠం చేయడానికి యుద్ధానికి నడుం బిగించాలి. ఎప్పుడు కూడా కర్మ అప్రధానం. భావనే ప్రధానం. అర్జునుడు తన ధర్మాన్ని తాను నిర్వహించడంలో ఎవరైనా మరణించ వచ్చు. కాని, స్వధర్మాచరణము ద్వారా భగవంతుని అర్చిస్తే, హృదయం నిర్మల మవుతుందని కర్మయోగంలో ఇది వరకే చూశాం.

ధర్మాచరణంలో దోషం లేదు. జ్ఞాని కాని వాడు అహంకారంతో ధర్మజీవనాన్ని విస్మరిస్తే పాడై పోతాడు. ధర్మము పవిత్రమైంది కనుక, ధర్మాచరణంలో కష్టాలు ఎదురైనా, కన్నీళ్ళు యెదను నింపినా, ఈశ్వరానుగ్రహం చేత ధర్మాత్ముడు కష్టాలను దాటి పోతాడు. ధర్మబోధను పట్టించుకోకుండా అహంకారంతో విర్రవీగే వాడు నశించి పోతాడు (*18 వ అ - 58 వ శ్లో*). అందుకనే, యుద్ధం చేసి శత్రువు లైన దుర్యోధనాదుల్ని వధించ

మంటున్నాడు వాసుదేవుడు ***(జిత్వా శత్రూన్ దుర్యోధన ప్రభృతీన్).*** శత్రు సంహారం చేసి సమృద్ధము, అకంటకమైన రాజ్యాన్ని అనుభవించ మని ఆశీర్వదిస్తున్నాడు ***(భుంక్ష్వ రాజ్యమ్ సమృద్ధమ్, అసపత్నమ్ అకంటకమ్).***

శ్రీకృష్ణుడు ఇదంతా బోధించింది వాస్తవమే. కానీ, ఇందులో సారభూతమైన విషయం యుద్ధం చేయడం కాదు, రాజ్యం పొందడం కాదు, కీర్తితో శోభించడమూ కాదు. ధర్మాచరణమే ప్రధానమైన, సారభూతమైన విషయం.

ఒకవేళ, దుర్యోధనుడు మనస్సు మార్చుకొని, పశ్చాత్తాపం చెంది, పాండవులకు ఇవ్వవలసిన రాజ్య భాగాన్ని వారి కిచ్చేసి, యుద్ధాన్ని విరమిస్తే, దానిని మీరు అధర్మం అని అంటారా? యుద్ధం క్షత్రియ ధర్మం కనుక, దుర్యోధనుడు యుద్ధాన్ని విరమించడం అధర్మం అని చెబుతారా? ఏది ధర్మం, ఏది అధర్మం? అర్జున దుర్యోధనులు ఇరువురూ క్షత్రియులే అనే విషయాన్ని మరచి పోకండి.

ఇక్కడ, అర్జునుడు యుద్ధం చేయడం ధర్మం. దుర్యోధనుడు చేయడం అధర్మం. దుర్యోధనుడు యుద్ధం విరమించడం ధర్మం. అర్జునుడు విరమించడం అధర్మం. యుద్ధం చేయడం ధర్మం కాదు. అవసరమైతే ధర్మం కోసం క్షత్రియుడు యుద్ధం చేయాలి. ధర్మాచరణమే ముఖ్య ప్రయోజనం.

అర్థకామాలు అవాంతరాలు

క్షత్రియుడు ధర్మయుతంగా యుద్ధం చేస్తాడు. అంతే. జయాపజయాలు దైవాధీనాలు. కర్మఫలాలు. విజయం వరిస్తే రాజ్యం ప్రాప్తిస్తుంది. ధర్మ కార్యాన్ని నిర్వహించాడు కనుక కీర్తి లభిస్తుంది ***(యశో లభస్వ).*** రాజ్యసుఖాలు, కీర్తిప్రతిష్ఠలు అవాంతర ఫలాలు. ధర్మమే, ధర్మాచరణమే ముఖ్యఫలం. అర్జునా! అర్థం చేసుకో! కర్మ చేయడం లోనే నీకు అధికారం ఉంది. దానిని విస్మరించకు. ఫలితాలు నీ అధీనంలో లేవు. దానిని మరచిపోకు! కర్మఫలాలను నేను అనుగ్రహిస్తాను. నువ్వు కారణం అనుకోకు. అలాగని, కర్మల్ని త్యజించి అప్రతిష్ఠపాలు కాకు *(2 వ అ - 47 వ శ్లో).* నీ కర్తవ్యాన్ని నీవు ఆచరించు. నే నిచ్చే ఫలాలను ప్రసాదాలుగా స్వీకరించు. ఇక లే! ***(ఉత్తిష్ఠ)*** నిలబడు! కేవలం నిలబడు చాలు. నీలుగు వద్దు. నిమిత్తమే హద్దు.

నిమిత్త మాత్రం భవ

అర్జునా! అత్త కొడుకువి. చెప్పిన దంతా బుద్ధిగా హృదయానికి హత్తుకో. నిమిత్తంగా నిలబడు. చాలు. నువ్వు చేసేది ఏమీ లేదు. అంతా నా నిర్వాకమే. నీకు అబ్బిన విద్యే కనుక, గాండీవం ఉండనే ఉంది కనుక, నదీ తీరంలో కూర్చుని, జలాలలో విలాసంగా రాళ్ళు విసిరినట్లు, సమరనదిలో బాణాలు వేస్తూ ఉండు.

నదీ తీరంలో కూర్చున్న వాడు ఏమి సాధించాలని నది లోకి రాళ్ళు విసురుతాడు? సాధించా లనుకుంటే ఎడమ చేత్తో ఎందుకు విసురుతాడు? ఫలితాలు ఆశించని కార్యం కనుక, ఏ చేత్తో నైనా విసురుతాడు.

నువ్వూ అంతే. అనాయాసంగా ఎడమ చేత్తో శరాలు విడుస్తూ, 'సవ్యసాచి' అనే బిరుదును కూడా పొందావు. ఆ పేరును సార్థకం చేసుకో! ***నిమిత్త మాత్రం భవ సవ్యసాచిన్*** - సవ్యసాచీ! అర్జునా! నిమిత్తంగా నిలబడి యుద్ధం చెయ్యి. అంతే.

ఎడమ చేతితో కూడా ***(సవ్యేన)*** బాణాలను ప్రయోగించే ***(సంచితుమ్)*** సామర్థ్యం కలవాడు కనుక, అర్జునుడు సవ్యసాచి. కుడిచేతితో వీరు లెవరైనా శర ప్రయోగం చేయగలరు. కాని, ఎడమ చేతితో కూడా సమాన వేగంతో బాణాలను ప్రయోగించడంలో అర్జునుడిది అందె వేసిన చేయి ***(సవ్యేన వామేనాపి హస్తేన శరాణాం క్షేపాత్ సవ్యసాచీతి ఉచ్యతే అర్జునః).***

జలాశయాలలో గులకరాళ్ళు విసిరినట్లు, కురుక్షేత్రంలో బాణాలు విడుస్తూ ఉంటే, రణరంగ వీరులైన భీష్మద్రోణ కర్ణాదులు మరణిస్తారా? అనే సందేహం కలగవచ్చు. ఆ సందేహాన్ని పరిహరిస్తూ, అదేమీ పెద్ద కార్యము కాదు అంటున్నాడు. ఎందుకని? వాళ్ళు ముందే హతులై ఉన్నారు కనుక.

అర్జునా! ఈ వీరు లందరూ ముందే నా చేత చంపబడి ఉన్నారు ***(మయైవ ఏతే నిహతాః నిశ్చయేన హతాః).*** ఇక నువ్వు చంపే దేముంది? వాళ్ళు చచ్చే దేముంది? వాళ్ళ ప్రాణాలు ఎప్పుడో పోయాయి ***(ప్రాణైః వియోజితాః).*** ఇష్టం లేకపోతే, నువ్వు యుద్ధాన్ని విరమించ గలవు. అంతేగాని పోయిన వాళ్ళ ప్రాణాల్ని తిరిగి పోయగలవా? కాలరూపుడ నైన నా చేతిలో వాళ్ళందరూ ఇప్పటికే గతించారు.

అర్జునా! మరొక ముఖ్యమైన విషయం కూడా నీకు చెబుతున్నా. శ్రద్ధగా విను. వాళ్ళు గతించడానికి, మన ఉభయుల బాంధవ్యానికి సంబంధం లేనే లేదు. నువ్వు నాకు అత్తకొడుకు వని నేను వాళ్ళను వధించలేదు. నీ సుఖానికి వాళ్ళను నేను బలి చేయను. నీకు కీర్తిప్రతిష్ఠలు ఆర్జించి పెట్టాలని నేను వాళ్ళను సంహరించ లేదు.

నువ్వు నాకు ఇష్టుడవు కావచ్చు. సఖుడవు కావచ్చు. భక్తుడివి కావచ్చు. శిష్యుడివి కావచ్చు. నువ్వు అర్హుడివి కనుక, నీపై నాకు ప్రేమ ఉండవచ్చు. నీ మీద నాకున్న ప్రేమ కారణంగా నువ్వు ఆశిస్తే, నీకు విశ్వరూపాన్ని దర్శింప చేస్తాను. అలాగని నీ కొరకు అన్యాయంగా, అధర్మంగా అన్యుల ప్రాణాలను హరించడానికి నే నెప్పుడూ సాహసించను.

వాళ్ళ ఆయుర్దాయం ముగిసింది. వాళ్ళ ప్రాణాలు కాలం యొక్క కబంధ హస్తాలలో చిక్కుకున్నాయి. వాళ్ళు మృత్యువు నుండి తప్పించుకో లేరు. వాళ్ళు కురుక్షేత్రం లోనే ఉండ నవసరం లేదు. కుమ్మరి పాళెంలో ఉన్నా వాళ్ళ కళ్ళు మూతపడి పోతాయి. ఎలాగూ పోయేవాళ్ళు యుద్ధంలో పోతున్నారు. అంతే. యుద్ధం యాదృచ్ఛికమే అని అర్థం చేసుకో! కాలరూప ధర్మంగా నా కర్తవ్యం నీ యుద్ధంతో ప్రారంభమైంది కాదు. నీ యుద్ధంతో ముగిసేదీ కాదు. నా కార్యం ప్రవాహ రూపంలో సాగిపోతూనే ఉంటుంది. అనంత కాల ప్రవాహంలో ఒక సమయంలో, ఒక ప్రదేశంలో సాగే యుద్ధాన్ని ఆధారం చేసుకొని నా అనంత వైభవాన్ని అంచనా వేయడం అజ్ఞానమే అవుతుంది.

అర్జునా! అర్థమైందా? భీష్మద్రోణాదులు గతించే కాలం సమీపించింది. అది వాళ్ళ కర్మఫలం. యుద్ధంతో సంబంధమే లేదు. నిన్ను తృప్తి పరచేందుకు నేను వాళ్ళను రథాల నుండి క్రింద పడదోయ లేను. ఇదంతా సృష్టి లోని ధర్మ నియతి. అంతే.

వాళ్ళ మృత్యువును చూశాను కనుక, ఆయుర్దాయం తీరిన ఆ యోధులు గతించారు అన్నాను. ఒకవేళ, మీకే ఆయుర్దాయం తీరి ఉంటే, మీరే గతించారు అని చెప్పి ఉండేవాణ్ణి. ఇప్పుడు అర్థమైంది అనుకుంటాను. మరో పది నిముషాల్లో మరణించే రోగి మాట్లాడుతూనే ఉంటాడు. అందరూ అతడు బ్రతికి పోయా డనుకుంటారు. కానీ, చావు తెలివి ఒక వైపు ప్రదర్శింప బడుతున్నా, అతడు చచ్చిన వాడే నని వైద్యుడికి క్షుణ్ణంగా తెలుసు. అర్జునా! నన్ను మించిన వైద్యు లెవరు? వైద్యు లందరూ నారాయణులే అని అనుకుంటారు. ఎందుకో తెలుసా! నారాయణు డొక్కడే వైద్యుడని తెలియదు కనుక **(సర్వ విద్యానాం వేదితృత్వాత్ వైద్యః).**

ఇక లే! అర్జునా! అర్థమైంది కదూ? లేచి నిలబడు. యుద్ధం చేసేయ్!

ఇక నే నెందుకు?

కృష్ణా! వాళ్ళు గతించి పోయారు అని నువ్వే చెబుతున్నావు కదా! ఇక, నేను యుద్ధం చేసేది ఏముంది? ఇది అర్జునుని శంక.

అర్జునా! ఏమీ లేదు కనుకనే, నిమిత్తంగా నిలబడు అన్నాను ***(నిమిత్త మాత్రం భవ)***. 'నింద లేక బొంది పోదు' అనే సామెత తెలుసు కదా నీకు సవ్యసాచీ! బొంది పోవడానికి ఏదో ఒక ప్రత్యక్ష కారణం ఉండాలి కదా! అది నువ్వుగా ఉండు. అంతే. అందుకనే, నీలుగు మాని నిమిత్తంగా ఉండ మన్నాను.

ఇది పదకొండవ అధ్యాయము. త్రిసంధ్యలలో త్రికరణ శుద్ధితో జ్ఞాపకం చేసుకోదగిన పదకొండు అక్షరాల మంత్రము లాంటి వాక్యము కనుక, మూడు మూడు అంటూ ముప్పై మూడవ శ్లోకంలో, ***నిమిత్త మాత్రం భవ సవ్యసాచిన్*** అనే ఏకాదశాక్షరీ మంత్రాన్ని ఈ ఏకాదశాధ్యాయంలో అర్జునుని నిమిత్తంగా చేసికొని భక్తవత్సలు డైన వాసుదేవ భగవానుడు మనందరికి ప్రసాదంగా అనుగ్రహించాడు. ప్రశాంత చిత్తముతో అర్థం చేసుకొని మూడు అవస్థల లోను ప్రసన్న హృదయులమై భగవద్భక్తిలో రమించి తరించెదము గాక!

ద్రోణం చ భీష్మం చ జయద్రథం చ కర్ణం తథాన్యానపి యోధవీరాన్ ।
మయా హతాంస్త్వం జహి మా వ్యథిష్ఠా యుధ్యస్వ జేతాసి రణే సపత్నాన్ ॥ 34

ద్రోణం-చ-భీష్మం-చ-జయద్రథం-చ-కర్ణం-తథా-అన్యాన్-అపి-యోధవీరాన్
మయా-హతాన్-త్వం-జహి-మా-వ్యథిష్ఠాః-యుధ్యస్వ-జేతాసి-రణే-సపత్నాన్

మయా	=	నా చేత	యోధ వీరాన్ అపి	=	యోధవీరులను కూడా
హతాన్	=	చంపబడిన	త్వం	=	నీవు
ద్రోణం చ	=	ద్రోణుని	జహి	=	చంపు!
భీష్మం చ	=	భీష్ముని	మావ్యథిష్ఠాః	=	విచార పడకు!
జయద్రథం చ	=	జయద్రథుని	యుధ్యస్వ	=	యుద్ధము చెయ్యి!
కర్ణం	=	కర్ణుని	రణే	=	యుద్ధము నందు
తథా	=	అలాగే	సపత్నాన్	=	శత్రువులను
అన్యాన్	=	ఇతరులైన	జేతాసి	=	జయించగలవు

అర్జునా! ఇప్పటికే మరణించిన ద్రోణుడు, భీష్ముడు, సైంధవుడు, కర్ణుడు, అలాగే నా చేత హతులైన యుద్ధవీరులను కూడా నువ్వు వధించు. కలత చెందకు. యుద్ధము చెయ్యి. శత్రువుల్ని జయిస్తావు.

వ్యాఖ్య

కోఱలు తీసిన పాములు

భీష్మద్రోణాది ప్రభృతులు అతిరథులు. అజేయులు. దేవతలనే ఓడించ గల శక్తిమంతులు. అలాంటి వారిని ఎలా జయించగలం? అనే శంక అర్జుననకు అవసరం లేదంటున్నాడు భగవంతుడు. ఒక వైపు వారి అసమాన పరాక్రమాన్ని సూచిస్తూ పేరు పేరున చెబుతున్నాడు. మరో వైపు యుద్ధము చెయ్యి, విజయం నీదే అంటున్నాడు. అలా చెప్పడం వెనుక కారణ మేమిటో శ్రీకృష్ణ పరమాత్మకు స్పష్టంగా తెలుసు.

ద్రోణాచార్యుడు ధనుర్వేదాచార్యుడు. దివ్యాస్త్ర సంపన్నుడు. ముఖ్యంగా అర్జునుడికి పూజ్యుడైన గురువు ***(అత్మనశ్చ విశేషతః గురుః గరిష్ఠః)***.

భీష్ముడు స్వచ్ఛంద మరణము కలవాడు. అంటే, తన ఇష్టానుసారం మరణించ గలవాడు. దివ్యములైన శస్త్రాస్త్రములు కలవాడు. పరశురాము డంతటి వాడితో ద్వంద్వ యుద్ధం చేసి, అపజయాన్ని పొందని వాడు ***(పరశురామేణ ద్వంద్వ యుద్ధమ్ అగమత్ న చ పరాజితః)***.

ఇక జయద్రథుడు. అతడే సైంధవుడు. అతని తండ్రి ప్రస్తుతం భయంకరమైన తపస్సును సాగిస్తున్నాడు. తన కుమారుడైన జయద్రుథుని శిరస్సును ఎవడు క్రింద పడేస్తాడో, వాడి తల కూడా క్రింద పడుతుంది అనే సంకల్పంతో ఘోర తపస్సు నాచరిస్తున్నాడు **(మమ పుత్రస్య శిరః భూమౌ పాతయిష్యతి యః తస్యాపి శిరః పతిష్యతి ఇతి)**.

ఇక వీరుడైన కర్ణుడు. సహజ కవచ కుండలాలతో జన్మించిన వాడు. స్వయంగా ఇంద్రుడు ప్రసాదించిన 'శక్తి' అనే అమోఘమైన ఆయుధం కలవాడు. సూర్యుని పుత్రుడు. కన్యగా ఉండిన కుంతీదేవికి పుట్టిన వాడు కనుక కానీనుడు **(కానీనః)**.

కలత ఎందుకు?

ఈ కారణాల చేత వీరందరూ యోధులు. యుద్ధవీరులు. అలా ఎందరో ఉన్నారు. వీళ్ళను నేనెలా జయించగలను? అని అర్జునుడు కలత చెంద నవసరం లేదు. అర్జునా! వీళ్ళందరూ ఇప్పటికే నా చేతిలో చచ్చి పోయారు. అన్నీ కాగితపు పులులే. కోఱలు తీసిన పాములే. ప్రాణాలు లేని బొమ్మలే. ప్రాణాలు పోగా దేహాలు నిలబడి ఉన్నాయి. పండుటాకుల్ని గాలి రాల్చేసినట్లు, ప్రాణాలు పోగొట్టుకొని నిలబడి యున్న ఈ వీరుల దేహాలను నీ బాణాలతో క్రింద పడేయ్! కలవర పడకు **(మా వ్యథిష్ఠాః)**. కష్టమే లేని కార్యానికి కలవర పడట మెందుకు? అర్జునా! యుద్ధం చెయ్యి **(యుధ్యస్వ)**. జయం నీదే **(జేతాసి)**. రాజ్యలక్ష్మిని చేపట్టు అన్నాడు గీతాచార్యుడు.

మోక్షార్థమే

ఆత్మబంధువులారా! భగవద్గీత మోక్ష శాస్త్రము అని పదే పదే నేను జ్ఞాపకం చేయ నవసరం లేదని భావిస్తున్నాను. ఈ సందర్భంలో దానినే దృష్టిలో ఉంచుకొని అర్థం చేసుకోవాలి.

'యుద్ధం చెయ్యి. రాజ్యాన్ని పొందు' అని శ్రీకృష్ణుడు చెబుతున్న దానిని కేవలం వాక్యార్థంగా స్వీకరిస్తే లాభం లేదు. వాసుదేవ హృదయాన్ని అర్థం చేసుకోవాలి. యుద్ధం చేయమంటే, రాజ్యాన్ని చేపట్ట మంటే, కురుక్షేత్రంలో యుద్ధం చేయమని, కురు సామ్రాజ్య పీఠాన్ని అధిరోహించ మని కాదు. జీవన సమరంలో విజయం సాధించి, మోక్ష సామ్రాజ్యాన్ని అధిష్ఠించ మని అర్థం.

మోక్షాన్ని సాధించాలి అంటే జ్ఞానాన్ని పొందాలి. జ్ఞానాన్ని పొందాలి అంటే అంతఃకరణ శుద్ధి కావాలి. అంతఃకరణ శుద్ధి అనేది రాగద్వేషాలు లేకుండా స్వధర్మాన్ని ఆచరించడం వల్లనే సాధ్య పడుతుంది. అర్జునుడు క్షత్రియుడు. ధర్మయుద్ధం చేయడం స్వధర్మము. స్వధర్మానుష్ఠానాన్ని చిత్తశుద్ధి కొరకు ఆచరించమని చెబుతున్నాడు భగవంతుడు.

సంజయ ఉవాచ :

ఏత చ్ఛ్రుత్వా వచనం కేశవస్య కృతాఞ్జలి ర్వేపమానః కిరీటీ ।
నమస్కృత్వా భూయ ఏవాహ కృష్ణం సగద్గదం భీతభీతః ప్రణమ్య ॥ 35

ఏతత్-శ్రుత్వా-వచనం-కేశవస్య-కృతాంజలిః-వేపమానః-కిరీటి
నమస్కృత్వా-భూయః-ఏవ-ఆహ-కృష్ణం-సగద్గదం-భీతభీతః-ప్రణమ్య

కిరీటీ	=	అర్జునుడు	కృష్ణం	=	కృష్ణునికి
కేశవస్య	=	శ్రీకృష్ణుని యొక్క	నమస్కృత్వా	=	నమస్కరించి
ఏతత్	=	ఈ	ప్రణమ్య	=	వినమ్రుడై
వచనం	=	వాక్యమును	భీతభీతః	=	మిక్కిలి భయపడుతూ
శ్రుత్వా	=	విని	సగద్గదం	=	గద్గద స్వరముతో
కృతాంజలిః	=	చేతులు జోడించిన వాడు	భూయః ఏవ	=	మరల
వేపమానః	=	వణకుచున్న వాడై	ఆహ	=	పలికెను

సంజయుని సందేశము :

ధృతరాష్ట్ర మహారాజా! కేశవుడు చెప్పిన మాటలు విని విజయుడు వణకి పోయాడు. భయకంపితు డయ్యాడు. చేతులు జోడించి, వంగి నమస్కరించాడు. గద్గద స్వరంతో మళ్ళీ పలుకు తున్నాడు.

వ్యాఖ్య

కురుక్షేత్రంలో జరిగిన, జరుగుతున్న విషయాల్ని ధృతరాష్ట్రునికి విన్నవించడంతో పాటు, తన సందేశాన్ని
కూడా ఈ సందర్భంలో నిగూఢంగా వినిపిస్తూ, చివరగా సంధి ప్రయత్నం చేస్తున్నాడు సంజయుడు.

శ్రీకృష్ణుని విశ్వరూపం చూచి, భీష్మద్రోణాదుల మరణ విషయాన్ని అచ్యుతుని ద్వారా ఆలకించి, దు:ఖంతో చలించి పోయిన అర్జునుడు భయకంపితు డయ్యాడు ***(భయా విప్లస్య దుఃఖాభిఘాతాత్).*** శ్రీకృష్ణుని స్నేహానురాగానికి పులకాంకితుడై హర్షాతిశయంతో కదలి పోయిన అర్జునుని నేత్రాలు ఆనంద బాష్పాలతో నిండి పోయాయి. అశ్రుపూర్ణ నయనుడైన కుంతీనందనుని కంఠం శ్లేష్మ మావరించి గద్గద మైంది ***(అశ్రుపూర్ణ నేత్రత్వే సతి శ్లేష్మణా కంఠావరోధః, సః గద్గదః).*** అర్జునుని రెండు చేతులు ఒక్క టయ్యాయి. ఫలభారంతో పండ్ల చెట్టు వంగినట్లు, భక్తి భావంతో ఫల్గునుడు వంగి పోయాడు. ఇదంతా సంజయుడు వర్ణించడం సాభిప్రాయ మైంది. అంటే, ఇంతవరకు కేవలం కురుక్షేత్రంలో కృష్ణార్జునుల మధ్య జరుగుతున్న సంవాదమును మాత్రమే ధృతరాష్ట్రునకు వినిపిస్తూ వచ్చిన సంజయుడు, ప్రస్తుతం తన అభిప్రాయాన్ని కూడా అంతర్లీనంగా జోడించి చెబుతున్నాడు. అదే సాభిప్రాయం ***(అత్ర అవసరే సంజయ వచనం సాభిప్రాయం)*** అంటే.

ఎలా సాభిప్రాయం అయింది? ***(సాభిప్రాయం కథం?).*** రాయబారం సమయంలో శ్రీకృష్ణుని విశ్వరూపాన్ని పరమాత్మ ప్రసాదంగా ధృతరాష్ట్రుడు సందర్శించాడు. ప్రస్తుతం అత్యద్భుతమైన దివ్య దర్శనాన్ని సంజయుని ద్వారా ఆలకించాడు. భీష్మ, ద్రోణ, జయద్రథ, కర్ణాదుల మరణం అనివార్య మని తేలి పోయింది. వాళ్ళు నలుగురు మరణిస్తే, ఆ తరువాత దుర్యోధనుని ప్రాణాలను ఎవ్వరూ కాపాడలేరు.

ఇక జయంపై ఆశ లేదని తెలిసి పోయింది కనుక, నిరాశా నిస్పృహలు అలుముకున్న ఈ దుర్దశలో నైనా ధృతరాష్ట్రుడు తలచుకుంటే ఉభయుల మధ్య సంధి కుదురుతుంది. అలా అందరికీ శాంతి లభిస్తుంది అని భావించి, సంజయుడు ధృతరాష్ట్రునికి సాభిప్రాయంగా తన సంధి పిలుపును అందించాడు ***(ధృతరాష్ట్రః జయం ప్రతి నిరాశః సన్ సంధిం కరిష్యతి. తతః శాన్తిం ఉభయేషాం భవిష్యతి ఇతి).*** జరగ వలసింది మరొక విధంగా ఉండటం చేత, ధృతరాష్ట్రునిలో పరివర్తన రాలేదు ***(యదపి న అశ్రౌషీత్ ధృతరాష్ట్రః భవితవ్య వశాత్).*** విధి బలీయంగా ఉంది. జరగ బోయేది బలవత్తర మైనపుడు కానున్నది కాకపోదు ***(భవితవ్యతా బలవతీ).*** ఇక్కడే వ్యక్తి బలహీను డౌతాడు. విధి బలీయ మౌతుంది.

పార్థుని ప్రార్థనాంజలి

అర్జునుడు పుణ్యాత్ముడు. మహాత్ముడు. మహాభక్తుడు. పరమాత్మ మంజుల మనోహర రూపాన్ని దర్శిస్తూ, ఆయన అడుగు జాడలను అనుసరిస్తూ బ్రతుకును భవ్యంగా తీర్చి దిద్దుకున్న ధర్మాత్ముడు ధనంజయుడు. ఆపద హరణాలు, ఆనంద నిలయాలు అయిన శ్రీకృష్ణ దేవుని చరణ కమలాలను నమ్ముకొని జన్మను సార్థకం చేసుకున్న అదృష్టవంతుడు.

ధర్మము, ధర్మరూపంలో ఉన్న దైవము తప్ప అవనిలో అన్యమైనవి ఆయన బుద్ధిని ఆకర్షించలేక పోయాయి. అచ్యుతుని ఆలోచనల తోనే ఆయన బ్రతుకు నావ సాగి పోయింది. ఆయన ఊహలు, ఊపిరి అన్నీ భగవంతుడే. సదా భగవంతుని యందు భక్తే గాని, భగవంతునికి దూరమై జీవించే శక్తి లేనివాడు. లేకపోతే, ప్రేమావతారమూర్తి, అనంత జ్ఞానజ్యోతి, యదుకుల చక్రవర్తి శ్రీకృష్ణ భగవానుని సహచరుడుగా, సఖుడుగా, బంధువుగా, భక్తుడుగా జీవించే భాగ్యం కలుగుతుందా? భగవంతుని అపార కరుణామృత వృష్టిలో ముద్దముద్దగా తడిసిన పాండునందనుడు కడతేరే సమయం ఆసన్నమయ్యే సరికి తరింప చేసేవాడు ఆయన తేరు లోనే తిష్ఠ వేశాడు. తరించే తీరును తెలిపే మహత్కార్యాన్ని భుజాని కెత్తుకున్నాడు. గుక్క తిప్పుకోకుండా గుట్టు నంతా విప్పి చెప్పాడు. కళ్ళారా నిన్ను చూస్తాను అని ప్రార్థిస్తే, కమనీయమైన విశ్వరూపాన్ని మహాద్భుతంగా ప్రదర్శించి ధనంజయుణ్ణి ధన్యుణ్ణి చేశాడు.

కస్మైచిత్ అస్మై మహసే తుభ్యం నమః - 'వర్ణింప శక్యము గాని నీ దివ్య రూపానికి నమస్కారము' అంటూ ఊహలలో ఒదిగి ఉన్న పరమేశ్వరుని తేజోమయ రూపమును ప్రార్థనలలో నింపాలని భక్తులు ప్రయత్నిస్తుంటారు. కాని, విశ్వమూర్తి యొక్క మహాద్భుత రూపాన్ని, పరమాత్మ ప్రసాదంగా లభించిన దివ్య చక్షువులతో దర్శిస్తూ, నోరారా కీర్తించే భాగ్యానికి నోచుకున్నాడు మహాభక్తుడైన అర్జునుడు.

భగవద్గీత మధ్యలో, విశ్వరూప సందర్శన యోగంలో, తన భాగ్యానికి మురిసి పోతూ, పరవశిస్తూ, మేను మరచి, మనసు తెరచి మంగళకరంగా పరమేశ్వరుని స్తుతించే మహత్కార్యానికి సిద్ధ పడ్డాడు కుంతీదేవి ముద్దుల తనయుడు. పదకొండవ అధ్యాయంలో, పదకొండు శ్లోకాలలో పదే పదే ప్రణామాలు అర్పిస్తూ పార్థుడు ఆర్తితో, భక్తితో సమర్పించిన, కీర్తించిన ఈ ప్రార్థనాంజలి భక్తు లందరికీ నిత్యస్మరణీయము. ప్రాతః పఠనీయము.

అర్జున ఉవాచ :

స్థానే హృషీకేశ తవ ప్రకీర్త్యా జగత్ప్రహృష్య త్యనురజ్యతే చ । 36
రక్షాంసి భీతాని దిశో ద్రవన్తి సర్వే నమస్యన్తి చ సిద్ధసంఘాః ॥

స్థానే-హృషీకేశ-తవ-ప్రకీర్త్యా-జగత్-ప్రహృష్యతి-అనురజ్యతే-చ
రక్షాంసి-భీతాని-దిశః-ద్రవంతి-సర్వే-నమస్యంతి-చ-సిద్ధసంఘాః

హృషీకేశ	=	కృష్ణా!	అనురజ్యతే చ	=	అనురాగమును పొందుతున్నది
తవ	=	నీ యొక్క	రక్షాంసి	=	రాక్షసులు
ప్రకీర్త్యా	=	మాహాత్మ్యము చేత	భీతాని	=	భయపడిన వారై
జగత్	=	జగత్తు	దిశః	=	దిక్కులను గూర్చి
ప్రహృష్యతి	=	సంతసిస్తోంది	ద్రవంతి	=	పరుగిడుతున్నారు

సర్వే	= సమస్తమైన	నమస్యంతి చ	= నమస్కా రము చేస్తున్నాయి
సిద్ధసంఘాః	= సిద్ధసంఘములు	స్థానే	= ఇదంతా యుక్తమే

అర్జునుడు ప్రార్థిస్తున్నాడు :

హృషీకేశా! కృష్ణా! నీ వైభవాన్ని చూచి జగతి మురిసి పోతోంది. అనురాగంతో చలిస్తోంది. రాక్షసులు భీతి చెంది దిక్కుల వెంట పరుగులు తీస్తున్నారు. సిద్ధ పురుషులు నమస్కరిస్తున్నారు.

వ్యాఖ్య

పరమేశ్వరుని వైభవాన్ని ఎందరో మహాత్ములు నోరారా మహిలో వర్ణించారు. స్తుతించారు. కీర్తించారు. సుమ సౌరభముతో పుష్పవనము గుబాళించినట్లు, గోవిందుని మాహాత్మ్యాన్ని ఆలకించడం చేత పుడమి భక్తితో పులకరించింది. పరిమళించింది ***(తవ ప్రకీర్త్యా త్వన్మహాత్మ్య కీర్తనేన శ్రుతేన, హే హృషీకేశ! యత్ జగత్ ప్రహృష్యతి).*** స్తుతించి కొందరు తృప్తి చెందితే, ఆలకించి కొందరు సంతృప్తి చెందారు. ఆదిదేవుని ఆనంద స్తోత్రాలతో జగత్తు అనురాగమయ మైంది ***(అనురజ్యతే అనురాగం ఉపైతి).***

ప్రస్తుతం విశ్వమూర్తి విశ్వమోహన స్వరూపాన్ని తిలకించి, వైభవాన్ని దర్శించి జగత్తు పరవశిస్తూ ఉంది. సిద్ధ పురుషులు తమ భాగ్యానికి మురిసి పోతున్నారు. భక్తితో నమస్కరిస్తున్నారు. రాక్షసులు ఆ వైభవాన్ని జీర్ణించుకోలేక పిచ్చి పరుగులు తీస్తున్నారు. సుజనులకు ఆనందాన్ని, అభయాన్ని అనుగ్రహించే పరమేశ్వరుని వైభవము కుజనులకు దుర్భరంగా ఉంది.

అందుకే నిరంతరం భగవంతుని ధ్యానాన్ని భక్తితో కొనసాగించాలి. ధ్యాన హృదయంలో పరమాత్మ దర్శనం సదా ఉంటుంది కనుక, రాక్షస గుణాలు, కామ క్రోధాదులు, వెలుగుల ముందు చీకట్లు నిలువ లేనట్లు పలాయన మవుతాయి.

కస్మా చ్చ తే న నమేర న్మహాత్మన్ గరీయసే బ్రహ్మణోఽ ప్యాదికర్త్రే ।
అనన్త దేవేశ జగన్నివాస త్వమక్షరం సదస త్తత్పరం యత్ ॥ 37

కస్మాత్-చ-తే-న-నమేరన్-మహాత్మన్-గరీయసే-బ్రహ్మణః-అపి-ఆదికర్త్రే
అనంత-దేవేశ-జగన్నివాస-త్వం-అక్షరం-సత్-అసత్-తత్పరం-యత్

మహాత్మన్	= మహాత్మా!	త్వం	= నీవు
అనంత	= అనంతుడా!	అసి	= అయి ఉన్నావు
దేవేశ	= దేవదేవ!	బ్రహ్మణః అపి	= బ్రహ్మకును
జగన్నివాస	= జగదంతర్యామీ!	ఆదికర్త్రే	= మూలకర్తవు
సత్	= సత్తు	గరీయసే	= గొప్పవాడవు
అసత్ చ	= అసత్తును	తే	= నీ కొరకు
యత్	= ఏదో	కస్మాత్	= ఏల
తత్పరం	= దానికి పరమైన	న నమేరన్	= నమస్కరింప కుందురు
అక్షరం	= అక్షర బ్రహ్మము		

మహాత్మా! నువ్వెంతో గొప్ప వాడివి. బ్రహ్మదేవుని కంటే ముందు నువ్వే ఆదికర్తవు. అనంతా! దేవేశా! జగన్నివాసా! నువ్వు సదసత్తులకు అతీతుడవు. అక్షర స్వరూపుడవు. ఎవరైనా నీకు నమస్కరించకుండా ఎలా ఉంటారు?

వ్యాఖ్య

మొదటి శ్లోకంలో నమస్కార కర్తవ్యాన్ని భక్తులకు తెలిపి, రెండవ శ్లోకంలో భగవంతుని నమస్కార యోగ్యతను చెబుతున్నాడు. మొదటి శ్లోకం లోని **స్థానే** అనే పదానికి ఇది వ్యాఖ్యాన మని భావించ వచ్చు. **స్థానే** అంటే **యుక్తం** అని అర్థం. భగవద్విషయం ఆనందదాయక మనేది యుక్తమే కదా! జగత్తు మురిసి పోవడం సముచితమే కదా! అని అర్థం **(స్థానే యుక్తం, యుక్తః హర్షాది విషయః భగవాన్).**

అనంతుడైన భగవానుడు ఆదికారణంగా కీర్తింప బడుతున్నాడు. ఆయనే ఆదికర్త. బ్రహ్మదేవుడు సృష్టికర్త. దేవుడైన బ్రహ్మకు కూడా ఆయనే దేవుడు. అందుకే ఆయన దేవేశుడు **(హిరణ్యగర్భ స్యాపి).**

ఉపనిషత్తులలో పరమైన అక్షరంగా కీర్తింప బడింది తానే **(త్వం అక్షరం పరం వేదాంతేషు శ్రూయతే).** ఉన్నది సత్. లేదు అనేది అసత్. ఈ సదసత్తులు దేని కైతే ఉపాధులో, అదే అక్షరమైన భగవంతుని స్వరూపము.

ఆది లేని అనంత రూపుడైనా, అక్షరుడై అగమ్య గోచరుడైనా, యుక్తికి దొరకని అచ్యుతుడు భక్తికి వశుడౌతాడు. అందుకే అందరూ ఆయనను ఆశ్రయిస్తారు. సర్వులూ శిరమోడ్చి నమస్కరించి హృదయంలో దాచుకుంటారు.

నీవు పుట్టిన దెక్కడో తెలియదయ్య
పెరుగుతున్నావు నా లోన పుణ్యపురుషా!
పట్టలేక నిన్ను నా గుండెలో పెట్టుకొంటి
నీ అడుగుల కడ పడి ఉందు చిన్నికృష్ణా!

అని చిన్నికృష్ణ శతకంలో ఒక వెన్నముద్ద.

త్వ మాదిదేవః పురుషః పురాణ స్త్వమస్య విశ్వస్య పరం నిధానమ్ ।
వేత్తాసి వేద్యం చ పరం చ ధామ త్వయా తతం విశ్వ మనన్తరూప ॥ 38

త్వం-ఆదిదేవః-పురుషః-పురాణః-త్వం-అస్య-విశ్వస్య-పరం-నిధానం
వేత్తా-అసి-వేద్యం-చ-పరం-చ-ధామ-త్వయా-తతం-విశ్వం-అనంతరూప

అనంతరూప	= అనంతరూపుడా!	నిధానం	= ఆశ్రయానివి
త్వం	= నీవు	వేత్తా	= సర్వజ్ఞుడవు
ఆదిదేవః	= ఆదిదేవుడవు!	వేద్యం చ	= తెలియదగిన విషయమును
పురాణః	= సనాతను డవైన	పరం చ	= పొందదగిన
పురుషః	= పురుషుడవు	ధామ	= ధామము
త్వం	= నీవు	అసి	= అయి ఉన్నావు
అస్య	= ఈ	విశ్వం	= విశ్వము
విశ్వస్య	= విశ్వమునకు	త్వయా	= నీ చేత
పరం	= ఉత్తమమైన	తతం	= వ్యాప్తమై ఉన్నది

ఓ అనంతరూపా! నువ్వు ఆది దేవుడవు. పురాణ పురుషుడవు. ఈ సమస్త జగత్తుకు ఉత్తమమైన మూల ధనానివి. తెలుసుకొనే వాడివి నీవే. తెలియబడేది కూడా నీవే. నీవే పరంధామము. ఈ సమస్త జగత్తు నీ తోనే నిండి ఉంది.

వ్యాఖ్య

అనంతత్వము కూడా నమస్కార యోగ్యత్వమే. దేవతలకు ముందు వాడు కావడం చేత భగవానుడు ఆదిదేవుడు **(త్వమ్ ఆదిదేవః)**. ఆదిదేవుడు కనుక పురాతనుడు. చిరంతనుడు. సనాతనుడు **(పురాతనః చిరంతనః పురాణః)**. పురాతనుడైన పురాణుడు ఎక్కడో లేడు. మన దేహం లోనే ఉన్నాడు. పురుష రూపంలో ఉన్నాడు. పురము అంటే శరీరము. పురమున శయనించే వాడు పురుషుడు **(పురుషః పురిశయనాత్)**. ఆదిదేవుడుగా పురాణుడైన వాడే శరీరాలలో పురుషుడుగా ఉన్నందున, ఆయన పురాణ పురుషుడు. ఆయనే జ్ఞాననిధి. సర్వ జగత్తుకు ఆయనే నిధానము. జ్ఞాతృ జ్ఞాన జ్ఞేయములు తానే కనుక, తానే వేత్త, తానే వేద్యం. అట్టి అనంత భగవానుడు లేనిది అణువైనా ఈ ప్రపంచంలో లేదు. జగత్తంతా ఆ దివ్య చైతన్యము తోనే పరివ్యాప్తమై ఉంది.

వాయు ర్యమోఽగ్ని ర్వరుణః శశాఙ్కః ప్రజాపతి స్త్వం ప్రపితామహశ్చ ।
నమో నమస్తేఽస్తు సహస్రకృత్వః పునశ్చ భూయోఽపి నమో నమస్తే ॥ 39

వాయుః-యమః-అగ్నిః-వరుణః-శశాంకః-ప్రజాపతిః-త్వం-ప్రపితామహః-చ
నమః-నమః-తే-అస్తు-సహస్రకృత్వః-పునః-చ-భూయః-అపి-నమః-నమః-తే

త్వం	=	నీవు	తే	=	నీ కొరకు
వాయుః	=	వాయువు	సహస్రకృత్వః	=	వేయిసార్లు
యమః	=	యముడవు	నమో నమః	=	నమస్కారములు
అగ్నిః	=	అగ్నివి	అస్తు	=	అగు గాక!
వరుణః	=	వరుణుడవు	పునః చ	=	మరల
శశాంకః	=	చంద్రుడవు	భూయః అపి	=	మరల కూడా
ప్రజాపతిః	=	ప్రజాపతివి	తే	=	నీ కొరకు
ప్రపితామహః చ	=	ముత్తాతవు	నమో నమః	=	నమస్కారములు

భగవంతా! నువ్వే వాయువు. యముడవు నీవే. అగ్నివి నీవే. నువ్వే వరుణుడివి. చంద్రుడివి నీవే. నువ్వే బ్రహ్మదేవుడివి. వాడి అబ్బవు కూడా నువ్వే. నీకు వేలకు వేల నమస్కారాలు. మళ్ళీ నమస్కారాలు. మళ్ళీ మళ్ళీ నమస్కారాలు.

వ్యాఖ్య

అంతా భగవంతుడే అని పూర్వ శ్లోకంలో కీర్తించిన పార్థుడు, అందరూ భగవంతుడే అని ప్రస్తుత శ్లోకంలో ప్రస్తుతిస్తున్నాడు. ఈ శ్లోకంలో జాగ్రత్తగా పరిశీలిస్తే ఒక గమ్మత్తు ఉంది.

అక్షరరూపుడు, నిరాకారుడైన పరబ్రహ్మమును పూర్వ శ్లోకంలో కీర్తించిన అర్జునుడు, సృష్టికర్తగా, సర్వ వ్యాపిగా, సర్వజ్ఞునిగా పరమాత్మను స్తుతించాలని భావించి, **ప్రభవః ప్రళయః స్థానం** అని తొమ్మిదవ అధ్యాయంలో పరమేశ్వరుని ద్వారా ఏ సత్యా న్నైతే శ్రవణం చేశాడో, ఆ సత్యరూపుని ప్రస్తుత శ్లోకంలో కీర్తిస్తున్నాడు.

బ్రహ్మదేవుడవు నీవే అంటూ భగవంతుని సృష్టికర్తగా స్తుతించాడు **(ప్రభవః)**. సృష్టి లోని ప్రాణులకు ఆధారము నీవే. వాళ్ళను భరించేది, ధరించేది, పోషించేది కూడా నీవే అని చెబుతూ, అలాంటి కార్యాన్ని

నిర్వహించడానికి అవసరమైన వాటిలో తానే ఉన్నాడంటూ, వాయువు, అగ్ని, వరుణుడు, చంద్రుడు నీవే అని స్తుతిస్తున్నాడు. ఇవన్నీ ఉంటేనే స్థితి **(స్థానం)**.

సృష్టి స్థితులలో పరమేశ్వరుని ప్రస్తుతించి, లయ కారకుడు కూడా భగవంతుడే అని చెప్పడానికి, యముడివి నీవే అని కీర్తించాడు **(ప్రలయః)**. ఈ విధంగా సృష్టి స్థితి లయాలలో ఉన్నది నీవే అని భావగర్భితంగా స్తుతించాడు.

అది సరే బావుంది. ఆ చెప్పే దేదో సూటిగా చెప్పేస్తే పోతుంది కదా! శాస్త్రంలో ఈ భావగర్భితాలు, భాషా గహనాలు ఎందుకు?

అదే అలంకారము. మనకు ఎంత అర్థమైందో గ్రహించడానికి కొలమానము. అంతే కాదు. భగవంతుడు అందరి వాడు కదా! కర్తలే అంతా దోచేసుకుంటే వ్యాఖ్యాత లెలా బ్రతకాలి? కనుక వ్యాఖ్యాతలపై దృష్టి ఉంచి అలా కొంత దాచిపెడతా రేమో! లేక, అంతా చెప్పేస్తే, దేవదేవునికి దిష్టి తగులుతుందని భావిస్తారేమో! భగవంతుని విషయంలో భక్తులకు పట్టని పిచ్చి అంటూ ఉంటుందా? దిష్టి కార్యం అలాగే వచ్చిందేమో!

మధుర మంజుల మోహన రూపవంతా!
కీర్తించినది నీ అందము చరాచర లోకమంతా!
సృష్టి కుండను తిప్పెదను దిష్టి తగలకుండా
నీ అడుగుల కడ పడి ఉందు చిన్నికృష్ణా!

అని ముద్దుగా వెన్నముద్దతో దిష్టి తీసింది చిన్నికృష్ణ శతకము.

నమః పురస్తా దథ పృష్ఠ తస్తే నమోఽస్తుతే సర్వత ఏవ సర్వ ।
అనన్త వీర్యామిత విక్రమ స్త్వం సర్వం సమాప్నోషి తతోఽసి సర్వః ॥ 40

నమః-పురస్తాత్-అథ-పృష్ఠతః-తే-నమః-అస్తు-తే-సర్వతః-ఏవ-సర్వ
అనంత వీర్య-అమితవిక్రమః-త్వం-సర్వం-సమాప్నోషి-తతః-అసి-సర్వః

సర్వ	=	సర్వస్వరూపుడా!	అస్తు	=	అగు గాక!
పురస్తాత్	=	ముందు	త్వం	=	నీవు
పృష్ఠతః	=	వెనుక	అనంత	=	అపరిమితమైన
తే	=	నీకు	వీర్యామిత విక్రమః	=	శక్తి సామర్థ్యములు గల వాడవు
నమః	=	నమస్కారము	సర్వం	=	సర్వమును
అథ	=	అటుపిమ్మట	సమాప్నోషి	=	వ్యాపించి ఉన్నావు
సర్వతః ఏవ	=	అన్ని వైపులను	తతః	=	అందువలన
తే	=	నీ కొరకు	సర్వః	=	సర్వ స్వరూపుడవు
నమః	=	నమస్కారము	అసి	=	అయి ఉన్నావు

సర్వ స్వరూపా! భగవంతా! ముందున్న నీకు నమస్కారము. వెనక ఉన్న నీకు నమస్కారము. అంతటా ఉన్న నీకు నమస్కారము. అనంత శక్తి సామర్థ్యాలు గల నీవు సమస్తములో వ్యాపించి ఉన్నావు. అందుకే నీవు సర్వ స్వరూపుడవు.

వ్యాఖ్య

భగవంతుడు ముందు ఉన్నాడు. ఉన్నది ఏదైనా సూర్యుని వెలుగు లోనే తెలుస్తుంది. అందుచేత, 'ముందు' అనేది వెలుగు లోనే ఉంది. కనుక ముందు అంటే తూర్పు. ముందు తూర్పు ఉంటే, పశ్చిమము వెనుక ఉంటుంది. మనకు కుడి వైపున దక్షిణము, ఎడమ వైపున ఉత్తరము ఉంటాయి. అన్ని దిక్కులలో ఉన్న సర్వేశ్వరుడే, ఆగ్నేయ, నైరుతి, వాయవ్య, ఈశాన్యాలలో కూడా ఉన్నాడు. అంతరాలలో కూడా అతడే. అన్ని దిక్కులలో, అంతటా తానే ఉండేటప్పుడు, ఒక్క దిక్కుకు నమస్కరిస్తే అన్ని దిక్కులలో వ్యాపించి యున్న సర్వేశ్వరునికి నమస్కరించినట్లే కదా! ఎదురుగా నడచి వచ్చే వాడు, వెనుక ఎగిరే పక్షి, ప్రక్కనే ఈదుతున్న చేప, ఆ ప్రక్కనే గంతు లేసే లేడి - అన్నీ తానే. అన్నిటిలో తానే. సర్వమూ తానే. అందుకే ఆయన సర్వేశ్వరుడు. ఇది అర్థమైతే, అంతటా చిద్విలాసమే. చిదానందమే.

పల్లవి: **గాలితో కలసి గువ్వ లాగా గంతు లేయాలని**
నీటిలో చేరి చేప పిల్లనై ఈదు లాడాలని
అనుపల్లవి: **వెన్నెలతో కూడి తారనై తిరగాలని**
అంతటా నిన్ను అలా చూస్తూ మూయాలని కనులు ॥ గాలితో ॥

అని సర్వేశ్వరునికి నమస్కరిస్తూ అంతటా, అన్ని వైపులా తిరుగుతూ పాడింది చైతన్య గీతిక.

సఖేతి మత్వా ప్రసభం యదుక్తం హే కృష్ణ హే యాదవ హే సఖేతి ।
అజానతా మహిమానం త వేదం మయా ప్రమాదా త్ప్రణయేన వాపి ॥ 41

సఖా-ఇతి-మత్వా-ప్రసభం-యత్-ఉక్తం-హే-కృష్ణ-హే-యాదవ-హే-సఖా-ఇతి
అజానతా-మహిమానం-తవ-ఇదం-మయా-ప్రమాదాత్-ప్రణయేన-వా-అపి

య చ్చావహాసార్థ మసత్కృతోఽసి విహార శయ్యాసన భోజనేషు ।
ఏ కోఽథ వాప్యచ్యుత తత్సమక్షం తత్క్షామయే త్వా మహ మప్రమేయమ్ ॥ 42

యత్-చ-అవహాసార్థం-అసత్కృతః-అసి-విహారశయ్యాసన భోజనేషు
ఏకః-అథవా-అపి-అచ్యుత-తత్సమక్షం-తత్-క్షామయే-త్వాం-అహం-అప్రమేయం

తవ	= నీ యొక్క
ఇదం	= ఈ
మహిమానం	= మాహాత్మ్యమును
అజానతా	= తెలియక
మయా	= నా చేత
ప్రమాదాత్	= ఆకస్మికంగా గాని
ప్రణయేన వా అపి	= ప్రేమ చేత గాని
సఖా ఇతి మత్వా	= స్నేహితుడవని భావించి
ప్రసభం	= నిర్లక్ష్యముగా
హే కృష్ణ	= హే కృష్ణా!
హే యాదవ	= హే యాదవుడా!
హే సఖా	= హే మిత్రుడా!
ఇతి	= అని
యత్	= ఏది
ఉక్తం	= చెప్ప బడిందో
అచ్యుత	= అచ్యుతుడా!
విహారశయ్యాసన భోజనేషు	= విహారముల యందు, పడక యందు, కూర్చొనుట యందు, భోజనము లందు
అవహాసార్థం	= పరిహాసమునకై
ఏకః	= ఒంటరిగా ఉన్నప్పుడు
అథవా అపి	= వెనుకను

తత్సమక్షం	= పరుల ముందు గాని
అసత్కృతః అసి	= అవమానింప బడితివి
యత్ చ	= ఏదో
తత్	= దాని నంతయును
అప్రమేయం	= అప్రమేయుడవైన
త్వాం	= నిన్ను
అహం	= నేను
క్షామయే	= క్షమము కోరుతున్నాను

అనంతా! నీ మహిమ తెలియక పొరపాటున చనువుతో నిన్ను మిత్రమా! కృష్ణా! యాదవా! సఖా! అంటూ పూర్వం పిలిచే వాణ్ణి. ఆహార విహారాలలో, ఆసన శయనాలలో పరిహాసానికి అపహాస్యం చేశానేమో! అప్రమేయా! నన్ను క్షమించ మని వేడుకుంటున్నాను.

వ్యాఖ్య

ఆరాధనలు, అర్చనలు ప్రయత్నంతో సాగే చోట, అప్రయత్నంగా, అసంకల్పితంగా కొన్ని అపరాధాలు దొర్లుతాయి. అందుకనే, పూజాదికాలు పూర్తి అయిన తరువాత, అపరాధం ఉంటే క్షమించి, తప్పును అప్పుగా ఉంచి, ముప్పును తప్పించి, ఒప్పుగా స్వీకరించి, పెద్ద మనస్సుతో తృప్తి చెందమని భగవంతుణ్ణి ప్రార్థిస్తుంటాము.

మంత్రహీనం క్రియాహీనం భక్తిహీనం మహేశ్వర!
యత్పూజితం మయాదేవ పరిపూర్ణం తదస్తు తే ॥

'భగవాన్! నేను చేసిన పూజలో మంత్రోచ్చారణా దోషాలు ఉండొచ్చు. చేసిన పద్ధతులలో క్రమం తప్పి ఉండొచ్చు. కొన్ని సమయాలలో చిత్త చాంచల్యం చేత, భక్తి శూన్యంగా, యాంత్రికంగా పూజ కొనసాగి ఉండొచ్చు. అయినా, నా పూజనంతా నువ్వు పూర్ణంగా భావించి స్వీకరించు. నన్ను కృతార్థుణ్ణి చెయ్యి' అని ప్రార్థిస్తాము.

ఇదొక సద్భావన. మనస్సు మెత్త పడటానికి అందమైన భావన. పశ్చాత్తాపంతో కూడిన పవిత్ర భావన. ఈ భావసుమం భక్తి పరిమళాన్ని వెదజల్లి పరమేశ్వరుని తృప్తి పరుస్తుంది.

అర్జునుడు అదే చేస్తున్నాడు. ప్రస్తుతం విశ్వరూప దర్శనం ద్వారా భగవ ద్వైభవాన్ని అర్థం చేసుకున్నాడు. ఈ మహానుభావుని వైభవము పూర్వము తెలియని కారణంగా, తెలిసో, తెలియకో, సమయాల ఒడిలో, సందర్భాల సుడిలో చిక్కుకొని, అజ్ఞానంతో వాసుదేవ భగవానుని అపహాస్యం చేశానేమో నని వ్యథ చెందు తున్నాడు. అలాంటిది జరిగే ఉంటే, అజ్ఞాని ప్రలాపంగా భావించి క్షమించ మని దయామయుడైన భగవంతుని దీనుడై ప్రార్థిస్తున్నాడు.

భగవంతా! నేను జ్ఞానం లేని వాణ్ణి. ఇంత కాలం నీ కూడా ఉన్నానే గాని నీ మహాత్మ్యాన్ని తెలియని వాణ్ణి. తెలిసే ఉంటే, ఓయ్ మిత్రమా! ఓ యాదవా! హే కృష్ణా! అని నిన్ను ఏక వచనంతో సంబోధించి ఉండేవాడినా?

నీతో కలిసి నడచే టప్పుడు **(విహారః, విహరణం పాదవ్యాయామః)**, నీ కన్నా ముందుగా అడుగు లేస్తూ నడిచే వాడినా? నీ మంచము మీద, నీ ప్రక్కనే పలవరిస్తూ పడుకునే వాడినా **(శయనం శయ్యా)**? నీతో సమానంగా కూర్చుని భోం చేసే వాడినా **(ఆసనం ఆస్థాయికా)**? నువ్వు తినక ముందే ఆత్రగాడిలా ఆరగించే వాడినా **(భోజనమ్ అదనమ్)**?

ఇంకా ఏమేమి చేశానో! ఏదేది పలవరించానో! ఏకాంతంలో ఏమి మాట్లాడానో! **(ఏకః)**. పది మంది ముందు ఏమి తప్పుగా పలికానో! **(తత్ సమక్షం)**. మహానుభావా! మహాపచారం చేశా నని లోలోన మగ్గి పోతున్నా! సిగ్గుతో నీ ముందు తల ఎత్తలేక పోతున్నా! శ్రీయుతుడ వైన నిన్ను 'శ్రీ' లోపంతో కృష్ణా! అని పిలిచాను. నీ శ్రీచరణాలకు మ్రొక్కి మన్నించ మంటున్నా!

భగవంతా! పెద్దలు ప్రేమతో చనువిస్తారు. పిల్లలు అజ్ఞానంతో దానిని పాడు చేసుకుంటారు. నా మాతృదేవి పుణ్యఫలంగా నువ్వు నాకు బావ వయ్యావు. అది ఏనాటి పుణ్యమో! అది తెలియక, బావా! బావా! అంటూ పన్నీరు చిలికి వెకిలి చేష్టలు చేశానేమో! జ్ఞాపకం చేసుకుంటున్నా. ఇప్పుడు కన్నీటితో పాదాలు కడుగుతున్నా.

మహానుభావా! నీ వైభవం అర్థం గాక నిన్ను బావా! బావా! అని పిలిచిన మందభాగ్యుణ్ణి. అభాగ్యుణ్ణి. నా అపరాధాన్ని క్షమించు! నా అజ్ఞానాన్ని మన్నించు! నీతో నా సంబంధం బావమరిది సంబంధం కాదని, భక్తుని సంబంధ మని తెలిసి పోయింది. స్నేహ సంబంధం కాదని, శిష్య సంబంధ మని తేలి పోయింది. అనిత్య సంబంధం కాదని, నిత్య సంబంధ మని అర్థమై పోయింది.

నవ్వి నవ్వించితివి నాడు నీ మాయ తెలిపి
నవ్వు పారేసుకున్నాను నేడు నీ మహిమ తెలిసి
నవ్వులాటలు ఇక నేను ఆడలేను
నీ అడుగుల కడ పడి ఉందు చిన్నికృష్ణా! అని చిన్నికృష్ణ శతకంలో మరొక వెన్నముద్ద.

పరమేశ్వరుని సారథిగా పొందగలిగిన పార్థుడు సామాన్యుడా? పశుపతితో పోరాడి పాశుపతాన్ని సాధించుకున్న ధీరుడు. ఊర్వశిని తృణీకరించి ఆమె శాపానికి కూడా జంకని పావనాత్ముడు. అట్టి మహాత్ముడే భగవంతుని విషయంలో పశ్చాత్తాపంతో కుమిలి పోతున్నాడు. ఏ తప్పూ చేయని వాడు, చేశానేమో అనే శంకతో పరితపిస్తున్నాడు.

అర్జునుణ్ణి కాసేపు ప్రక్కన పెట్టి, మన విషయాన్ని మననం చేసుకుంటే, తెలుస్తుంది మన చరిత్ర ఏమిటో! తప్పు చేయని అర్జునుడు, ఒక వైపు తపించి పోతున్నాడు. తప్పుల్నే ప్రధానంగా చేసుకొని జీవించే మనం, పరితాపానికి పూనుకోము, క్షమించ మని వేడుకోము. తెలియక కాలు బురదలో పడవచ్చు. అలాగని శుద్ధి చేసుకోక పోవడం బుద్ధిహీనతే అవుతుంది.

పితాఽసి లోకస్య చరాచరస్య త్వమస్య పూజ్యశ్చ గురు ర్గరీయాన్ ।
న త్వ త్సమోఽస్త్యభ్యధికః కుతోఽన్యో లోకత్రయేఽప్యప్రతిమప్రభావ ॥ 43

పితా-అసి-లోకస్య-చరాచరస్య-త్వం-అస్య-పూజ్యః-చ-గురుః-గరీయాన్
న-త్వత్సమః-అస్తి-అభ్యధికః-కుతః-అన్యః-లోకత్రయే-అపి-అప్రతిమ ప్రభావ

అప్రతిమప్రభావ	=	అతిశయ ప్రభావము గల ఓ కృష్ణా!	గరీయాన్ చ	=	గొప్పవాడవు
త్వం	=	నీవు	అసి	=	అయి ఉన్నావు
అస్య	=	ఈ	లోకత్రయే అపి	=	ముల్లోకముల యందు
చరాచరస్య	=	చరాచర స్వరూపమైన	త్వత్సమః	=	నీకు సమానుడు
లోకస్య	=	లోకమునకు	న అస్తి	=	లేదు
పితా అసి	=	తండ్రివి	అభ్యధికః	=	అధికుడైన
పూజ్యః	=	పూజ్యుడవు	అన్యః	=	ఇతరుడు
గురుః	=	గురువు	కుతః	=	ఎక్కడున్నాడు?

అసమాన మహనీయా! పరమేశ్వరా! ఈ చరాచర ప్రపంచానికి నీవు తండ్రివి. పూజ్యుడివి. గొప్ప గురుదేవుడవు. ముల్లోకాలలో నీకు సాటి అయిన వాడే లేడు. ఇక, నిన్ను మించిన వాడు ఎక్కడుంటాడు?

వ్యాఖ్య

పరమేశ్వరుని ప్రభావము తెలియని కారణంగా పూర్వం ఆయన పట్ల అపరాధాలు, అపచారాలు చేసి ఉంటానేమో అని శంకించి, పశ్చాత్తాపంతో క్షమాపణలు కోరుతూ కుమిలి పోయిన అర్జునుడు, ప్రస్తుతం గీతా ప్రబోధము యొక్క శ్రవణ ఫలంగా, తనకు అర్థమైన పరమేశ్వరుని అసమాన వైభవాన్ని వర్ణిస్తున్నాడు. జన్మ నిచ్చిన తండ్రి, జన్మను కడతేర్చే గురువు, ఉభయులూ పూజనీయుడైన భగవంతుడే అని అభిభాషిస్తున్నాడు.

పరమారాధ్యుడు

జన్మ నిచ్చేవాడు తండ్రి. పుట్టించే వాడు **(పితా జనయితా)**. ఎవరు ఎవరికి జన్మ నిస్తారో వారికే వారు తండ్రి. కాని, సర్వ లోకాలు ఆవిర్భవించడానికి కారణమైన వాడు కనుక భగవంతుడు లోకపిత **(లోకస్య ప్రాణి జాతస్య పితా)**. జన్మ నిచ్చిన తండ్రిని దైవంగా భావించి గౌరవిస్తాము. పూజిస్తాము **(పితృ దేవోభవ)**. కాని, దేవుడే తండ్రి అని, అన్ని జన్మలలో తండ్రిగా ఆయనే పూజ లందుకున్నా డని, అందరికీ, అన్ని లోకాల లోని చరాచరాత్మక మైన ప్రాణిజాతానికి తండ్రి తానే అని అర్థమైన వాడు, ఆయన పూజా స్థానము అసమానంగా శోభిస్తుంది. ఆ గురు స్థానము సాధారణ మైంది కాదు. మహాశ్రేష్ఠమైన గురు స్థానము **(గురుః గరీయాన్)**.

అసమాన తేజోవంతుడు

భగవంతునితో సమానమైన వైభవము కలవాడు మరొకడు లేడు కనుక, ఆయనిది శ్రేష్ఠమైన గురు స్థానము. ఆదిగురువు తానే కావడం విశేషము. ఆదిగురువు ఆదిదేవుడే. ప్రపంచానికి ఇద్దరు భగవానులు ఉండలేరు. అలాగే ఇద్దరు గురుదేవులూ ఉండలేరు. రెండవ వస్తువు తెలియని అద్వయ స్థాన మది **(ఏక మేవ అద్వితీయం)**. అలాంటి అద్వయ చైతన్యము రెండవది ఉండే అవకాశం లేనందున, భగవంతునితో సమానమైన తేజోవంతుడు మరొకడు ఉండలేడు. ఆయనది అసమాన తేజము. భగవాన్! నీకు సమానులు లేరు **(త్వత్సమః న అస్తి)**. సమానుడే లేనపుడు నీ కంటే అధిక ప్రభావము కలవాడు ఎలా ఉంటాడు? **(కుతః ఏవ అన్యః అభ్యధికః స్యాత్)**. ఏమో! ఆయనతో సరియైన వాడు, సమమైన వాడు మానవ లోకంలో లేక పోవచ్చు. కాని ఇతర లోకాలలో ఉండవచ్చు కదా! అనే సంశయం కలగ వచ్చు. దానిని కూడా పరిహరిస్తూ, ముల్లోకాలలో భగవంతునిదే అసమాన వైభవము అని కీర్తిస్తున్నాడు **(లోకత్రయేఽపి అప్రతిమ ప్రభావః)**.

తస్మా త్ప్రణమ్య ప్రణిధాయ కాయం ప్రసాదయే త్వా మహ మీశ మీడ్యమ్ ।
పితేవ పుత్రస్య సఖేవ సఖ్యుః ప్రియః ప్రియాయార్హసి దేవ సోఢుమ్ ॥ 44

తస్మాత్-ప్రణమ్య-ప్రణిధాయ-కాయం-ప్రసాదయే-త్వాం-అహం-ఈశం-ఈడ్యం
పితా-ఇవ-పుత్రస్య-సఖా-ఇవ-సఖ్యుః-ప్రియః-ప్రియాయాః-అర్హసి-దేవ-సోఢుం

తస్మాత్	=	అందువలన	ప్రణమ్య	=	ప్రణమిల్లి
ఈశం	=	ఈశుడవు	ప్రసాదయే	=	అనుగ్రహింప వేడుకొంటున్నాను
ఈడ్యం	=	ప్రస్తుతింప దగిన వాడవు	దేవ	=	కృష్ణా!
త్వాం	=	నిన్ను గూర్చి	పుత్రస్య	=	పుత్రుని తప్పును
అహం	=	నేను	పితా ఇవ	=	తండ్రి వలె
కాయం	=	శరీరమును	సఖ్యుః	=	సఖుని తప్పును
ప్రణిధాయ	=	వంచి	సఖా ఇవ	=	సఖుని వలె

ప్రియాయాః	= ప్రియురాలి తప్పును	సోఢుం	= సహించుటకు
ప్రియః ఇవ	= ప్రియుని వలె	అర్హసి	= తగి ఉన్నావు

భగవంతా! అందుచేత, ప్రభువు, పూజ్యుడవు అయిన నీకు శరీరాన్ని వంచి నమస్కరిస్తూ, నీ అనుగ్రహాన్ని అర్థిస్తున్నాను. బిడ్డ తప్పును తండ్రి మన్నించినట్లు, స్నేహితుని అపరాధాన్ని స్నేహితుడు క్షమించినట్లు, ప్రియురాలి తప్పిదాన్ని ప్రియుడు విస్మరించినట్లు, దేవా! నా అపరాధాన్ని క్షమించు.

వ్యాఖ్య

లోక బాంధవ్యాలన్నీ అనిత్యాలు. లోక బాంధవుడైన భగవంతునితో ఉన్న సంబంధమే నిత్యము. ఈ బంధము తెగనిది. తరగనిది. భక్తునికి భగవంతునితో గల నిత్య సంబంధాన్ని కీర్తిస్తున్నాడు అర్జునుడు. తెలియని దానిని చెప్పడానికి ఉపకరించేవి, సహకరించేవి తెలిసినవే కనుక, భగవంతునితో భక్తునికి గల నిత్య సంబంధాన్ని వివరించడానికి, ప్రపంచం లోని సంబంధాలలో మూడు బాంధవ్యాలను ఎన్నుకొని, వాటి ద్వారా వివరిస్తున్నాడు. భగవంతుని విషయంలో అర్జునునికి గల అవగాహనకు ఈ పోలికలు అద్దం పడుతున్నాయి.

తన అపరాధాలను మన్నించ మని పూర్వ శ్లోకాలలో ప్రార్థించాడు పార్థుడు. ఎలా క్షమించాలో ఇక్కడ చెబుతున్నాడు. (1) కుమారుని తప్పును తండ్రి ఎలా క్షమిస్తాడో ***(పుత్రస్య అపరాధే పితా యథా క్షమతే)***, (2)మిత్రుని అపరాధాన్ని మిత్రుడు ఎలా క్షమిస్తాడో ***(సఖేవ చ సఖ్యుః అపరాధం)***, (3) ప్రియురాలి తప్పిదాన్ని ప్రియుడు ఎలా క్షమిస్తాడో ***(యథా వా ప్రియః ప్రియాయాః అపరాధం క్షమతే ఏవమ్ అర్హసి)***, ఆ విధంగా పరమేశ్వరుడు తనను క్షమించాలి అని విజయుడు వేడుకొంటున్నాడు.

పుట్టుకకు తండ్రి ఎలా కారణమో, తన జన్మకు కారణమైన సర్వ కారణ స్వరూపమైన పరమేశ్వరునితో తనకు గల సంబంధాన్ని గుర్తించాడు.

స్నేహితులు ఎప్పుడూ కలిసి ఉంటారు. ఎన్నడూ విడిపోరు. స్నేహితుల మధ్య రహస్యాలు ఉండవు. స్నేహితుడు తన స్నేహితుని నుండి ఏదీ దాచలేడు. పరమాత్మ చైతన్య స్వరూపంగా, బుద్ధి సాక్షిగా సదా తన తోనే ఉన్నాడు. తన లోనే ఉన్నాడు. పరమాత్మ తనకు దూరంగా లేడు. కనుక, తన విషయాలన్నీ భగవంతునికి తెలుసు అనే సత్యాన్ని గ్రహించాడని స్నేహితుని ఉపమించడం వల్ల స్పష్టమవుతోంది.

ఇక ప్రియుడు - ప్రియురాలి సంబంధాన్ని ప్రస్తావించి, పరమేశ్వరుని పొందడంలో ప్రాప్తించే పరమ ప్రేమను, పరమానందాన్ని వ్యక్తం చేస్తున్నాడు.

అంతేకాదు, తండ్రి కన్నా, స్నేహితుడు ఆంతరంగికంగా సన్నిహితుడై ఉంటాడు. స్నేహితుని కన్నా భార్య, లేక ప్రియురాలు మరీ సన్నిహితంగా ఉంటుంది. పరమేశ్వరునితో తన సంబంధము తరతమంగా ఎలా గోప్యమో, గుహ్యమో తెలుపుతూ, అలాంటి భగవంతుని అనుగ్రహాన్ని అర్థిస్తూ సాష్టాంగ ప్రణామం చేస్తున్నాడు. వంగి మరీ ప్రణామం అంటున్నాడు. అంటే, వినమ్రుడై, అహంకార రహితుడై నమస్కరిస్తున్నాడు ***ప్రణమ్య నమస్కృత్య*** అని భావం.

అదృష్టపూర్వం హృషితోఽస్మి దృష్ట్వా భయేన చ ప్రవ్యథితం మనో మే । 45
తదేవ మే దర్శయ దేవరూపం ప్రసీద దేవేశ జగన్నివాస ॥

అదృష్టపూర్వం-హృషితః-అస్మి-దృష్ట్వా-భయేన-చ-ప్రవ్యథితం-మనః-మే
తత్-ఏవ-మే-దర్శయ-దేవరూపం-ప్రసీద-దేవేశ-జగన్నివాస

అదృష్టపూర్వం	= పూర్వమెన్నడూ దర్శించని రూపమును	దేవేశ	= దేవదేవా!
దృష్ట్వా	= చూచి	జగన్నివాస	= జగదాశ్రయా!
హృషితః	= సంతసించినవాడను	మే	= నాకు
అస్మి	= అవుతున్నాను	తత్	= ఆ పూర్వపు
మే	= నా యొక్క	దేవరూపం ఏవ	= దివ్యరూపమునే
మనః	= మనస్సు	దర్శయ	= చూపు
భయేన	= భయము చేత	ప్రసీద	= కరుణించు!
ప్రవ్యథితం చ	= బాధింప బడుతున్నది		

జగన్నివాసా! జగన్నాథా! ఎన్నడూ చూడని నీ విశ్వరూపాన్ని చూచి పరవశించి పోయాను. నా మనస్సు భయంతో చలించి పోయింది. దేవా! దేవదేవా! వెనుకటి నీ మామూలు రూపం తోనే నాకు దర్శన మిచ్చి నన్ను అనుగ్రహించు!

వ్యాఖ్య

అచ్యుతుని అనుగ్రహమును మాత్రమే అర్థిస్తూ ప్రస్తుతం అర్జునుడు ప్రార్థిస్తున్నాడు ***(ప్రసీద)***. ఎవరి అనుగ్రహాన్ని అర్థిస్తున్నాడో, అతడు దేవదేవుడే అనే స్థిరమైన జ్ఞానంతో ప్రార్థిస్తున్నాడు ***(దేవేశ)***. సృష్టి స్థాయి నుండి దేవేశుడుగా, జగన్నివాసుడుగా తెలుస్తున్న భగవానుడు, అనంత స్వరూపుడు అనే అద్వైత జ్ఞానం కూడా కలిగే ఉన్నాడు. కనుకనే ***ప్రసీద దేవేశ! జగన్నివాస!*** అనే వాక్యాలను ఇరవై అయిదవ శ్లోకం లోనే వినిపించాడు. ఆ తరువాత మళ్ళీ ముప్పై ఏడవ శ్లోకం లోను ప్రయోగించాడు. ఇప్పుడు ప్రస్తుత శ్లోకంలో కూడా, దేవేశుడైన జగన్నాథుని అనుగ్రహాన్నే అర్థిస్తున్నాడు.

ఏ దివ్యమైన విశ్వరూపము ప్రస్తుతము తన కళ్ళ ముందు ప్రదర్శింపబడి ఉందో, దానిని ***అదృష్ట పూర్వంగా*** అభివర్ణిస్తున్నాడు. 'అదృష్ట పూర్వం' అంటే, ఇంతవరకు ఎవరి చేత కూడా చూడబడనిది అని అర్థం. తానే కాకుండా, ఇతరులు ఎవ్వరు కూడా చూడని రూపం అంటున్నాడు. అందుచేత, ఆ దర్శనం తనకు ఎనలేని తృప్తిని ప్రసాదించింది అంటున్నాడు ***(ఇదం విశ్వరూపం మయా అన్యైర్వా దృష్టపూర్వం న, తదహం దృష్ట్వా హృషితః అస్మి)***. అదృష్ట పూర్వము, అనితర సాధ్యము అయిన అసమాన విశ్వరూప మూర్తిని చూడటం చేత తాను ఎంతగానో సంతోషిస్తున్నాడు.

ఒక వైపు సంతోషంగా ఉన్నా, భయంకరంగా గోచరిస్తున్న ఆ ఉగ్ర రూపాన్ని దర్శించడానికి భయపడి, తన పూర్వ రూపాన్నే ప్రదర్శింప మని ప్రార్థిస్తున్నాడు.

కిరీటినం గదినం చక్రహస్త మిచ్ఛామి త్వాం ద్రష్టు మహం తథైవ । 46
తేనైవ రూపేణ చతుర్భుజేన సహస్రబాహో భవ విశ్వమూర్తే ॥

కిరీటినం-గదినం-చక్రహస్తం-ఇచ్ఛామి-త్వాం-ద్రష్టుం-అహం-తథా-ఏవ
తేన-ఏవ-రూపేణ-చతుర్భుజేన-సహస్రబాహో-భవ-విశ్వమూర్తే

విశ్వమూర్తే	= విశ్వరూపా!	చక్రహస్తం	= చక్రహస్తుడవు అగు
అహం	= నేను	త్వాం	= నిన్ను
కిరీటినం	= కిరీటము గల వాడవు	ద్రష్టుం	= గాంచుటకు
గదినం	= గద గల వాడవు	ఇచ్ఛామి	= కోరుకుంటున్నాను

తథా ఏవ	= అటులనే	తేన	= ఆ
సహస్రబాహో	= సహస్ర బాహువులు గల వాడా!	రూపేణ ఏవ	= రూపము తోనే
చతుర్భుజేన	= నాలుగు భుజములు గల	భవ	= ఉండు!

విశ్వరూపా! పరమాత్మా! గదా కిరీటాలతో చక్రధారిగా శోభించే రూపం తోనే నిన్ను చూడా లనుకుంటున్నా. సహస్రబాహో! చతుర్భుజ రూపం తోనే నాకు అగుపించు!

వ్యాఖ్య

సౌజన్య సౌకుమార్యాది సుమనోహర దివ్య మంగళ రూపంతో దర్శన మివ్వమని ప్రార్థిస్తున్నాడు. ఒక శిరస్సు, ఒక కిరీటం, శంఖచక్ర గదా ద్యాయుధాలు కలిగిన సుందరమైన చతుర్భుజ రూపమును దర్శించాలనే తన అభీష్టాన్ని వ్యక్తం చేస్తూ ప్రార్థిస్తున్నాడు.

ప్రస్తుతం కనిపిస్తున్న భయంకర రూపమును ఉపసంహరించి, పూర్వం ప్రకాశించిన ప్రశాంతమైన వాసుదేవ రూపంతో కనిపించ మని ప్రార్థిస్తున్నాడు ***(తేనైవ రూపేణ వసుదేవ పుత్ర రూపేణ).*** ఆ రూపము చతుర్భుజ రూపమని తానే చెబుతున్నాడు ***(చతుర్భుజేన).*** చతుర్భుజ రూపము అనేది విష్ణుమూర్తి రూపము. పూర్వ రూపము చతుర్భుజ రూపము అన్న అర్జునుని భావన అనేక వ్యాఖ్యానాలకు అవకాశ మిచ్చింది.

పూర్వము అర్జునునికి శ్రీకృష్ణుడు చతుర్భుజుడు గానే కనిపించే వాడు, అందుకనే ఆ రూపాన్ని చూడాలని అభిలషించాడు అని కొందరు అభిప్రాయ పడ్డారు. అదే వాస్తవ మైతే, ***కిరీటినం గదినం చక్రిణం చ*** అనే పదిహేడవ శ్లోకంలో తాను ప్రథమంగా ఆ రూపమును చూస్తున్నట్లు అర్జునుడు ఆశ్చర్యాన్ని ఎందుకు వ్యక్తం చేస్తాడు?

ఇలా, ఈ వ్యాఖ్యానముతో విభేదించిన మరి కొందరు, విశ్వరూప ప్రదర్శనములో భగవంతుడు మొదట చతుర్భుజుడుగా దర్శనం అనుగ్రహించి నపుడు, ఆ రూపము అర్జునునికి సౌమ్యంగా, మంజులం గానే గోచరించింది. ఆ తరువాత ఉగ్ర రూపంగా పరిణామం చెందింది. కనుక, ఆ భయంకర రూపాన్ని ఉపసంహరించి, ప్రారంభంలో ఉన్న చతుర్భుజ రూపము తోనే అగుపించమని అర్జునుడు అర్థించాడని మరి కొందరు అభిప్రాయ పడ్డారు.

శ్రీ శంకరులు మాత్రం భాష్యంలో ఇవేవీ ప్రస్తావించ లేదు. 'వసుదేవుని పుత్రుడ వైన చతుర్భుజుడుగా ***(వసుదేవ పుత్ర రూపేణ చతుర్భుజేన)***' అని మాత్రమే వ్యాఖ్యానించారు. కారాగృహంలో శ్రీకృష్ణుడు జన్మించి నపుడు, మొదట చతుర్భుజుడుగా దేవకీ వసుదేవులకు దర్శన మిచ్చాడు. ఆ తరువాత, దేవకీదేవి ప్రార్థించగా, ఆ రూపాన్ని ఉపసంహరించి, రెండు బాహువులతో మానవ బాలుడుగా గోచరించాడు అనేది గమనించ దగిన విషయము.

ఏది ఎలా ఉన్నా, చతుర్భుజ రూప మనేది ఉపాసనకు, ధ్యానానికి ప్రత్యేకంగా చెప్పబడిన రూపము. కనుక, ఉగ్రమైన ఈ భయంకర రూపమును త్యజించి, మంగళకరమైన ధ్యానరూపంతో, దైవదీప్తి కలిగిన మానవ రూపంతో గోచరించ మని అర్జునుడు ప్రార్థించి ఉండవచ్చు. అర్జునుని ప్రార్థనను మన్నించి, భగవంతుడు ఏ రూపంగా కనిపిస్తాడో, అదే అర్జునుని అభీష్టమని మనం నిర్ణయించుకోవచ్చు. ఆ విషయాన్ని మున్ముందు చూస్తాం.

ఈశ్వర విభూతుల్ని ఆలకించిన తరువాత, విభూతి వాసుదేవుని విశ్వమయ రూపాన్ని దర్శించాలని అర్జునుడు అభిలషించ వచ్చు. కాని, ప్రస్తుతం ఆ మహా రూపంతో పాటు, భగవంతుని స్వరూపాన్ని కూడా

అర్థం చేసుకోవడం చేత, కనిపించే రూపాలన్నీ ఈశ్వర మాయే నని, వాంఛింప దగినది ఈశ్వర మహిమయే నని విజయుడు భావించే అవకాశము లేక పోలేదు. కనుక పరమేశ్వరుని ఉపాసించి, ధ్యానించి, జ్ఞానం ద్వారా, నది సముద్రాన్ని చేరి శాంతించినట్లు, అర్జునుడు వాసుదేవ చైతన్య సాగరమును చేరాలని ఉబలాట పడుతూ, ధ్యానయోగ్యమైన శాంతరూపమును వీక్షించాలని అభిప్రాయపడి ఉండవచ్చు.

పల్లవి: **నిను మరచి నేను మనజాలరా! తాళ జాలరా!**
మాయలు చాలురా! మహిమను చూపరా ॥ నిను ॥
చరణము: **నేనే యమునై కదలి రానా!**
చరణ కడలికి చేరిపోనా - నీ
చరణ కడలికి చేరిపోనా! ॥ నిను ॥

అని చైతన్య గీతిక.

అర్జునుని ప్రార్థనను శ్రీకృష్ణుడు విన్నాడు. విన్నపాన్ని మన్నించాడు. విశ్వరూపాన్ని ఉపసంహరించాడు. అర్జునునితో ప్రియంగా భాషించాడు.

శ్రీ భగవానువాచ :

మయా ప్రసన్నేన త వార్జు నేదం రూపం పరం దర్శిత మాత్మయోగాత్ ।
తేజోమయం విశ్వ మనన్త మాద్యం యన్మే త్వదన్యేన న దృష్టపూర్వమ్ ॥ 47

మయా-ప్రసన్నేన-తవ-అర్జున-ఇదం-రూపం-పరం-దర్శితం-ఆత్మయోగాత్
తేజోమయం-విశ్వం-అనంతం-ఆద్యం-యత్-మే-త్వదన్యేన-న-దృష్టపూర్వం

అర్జున	= అర్జునా!	న దృష్టపూర్వం	= ఇంతవరకు చూడబడనిది
మే	= నా యొక్క	పరం	= పరమైనది
యత్	= ఏ	ఇదం	= ఈ
తేజోమయం	= తేజోమయము	రూపం	= రూపమును
విశ్వం	= విశ్వము	తవ	= నీకు
అనంతం	= అనంత మైనది	ప్రసన్నేన	= ప్రసన్నుడ వైన
ఆద్యం	= ఆది యైనది	మయా	= నా చేత
త్వత్	= నీ కంటెను	ఆత్మయోగాత్	= ఆత్మయోగము వలన
అన్యేన	= ఇతరుల చేత	దర్శితం	= చూపబడినది

శ్రీ భగవానుడు చెబుతున్నాడు :

అర్జునా! నా విశ్వరూపము తేజోమయం, సర్వాత్మకం, అనంతం, ఆద్యం. గతంలో ఎవ్వరూ చూడని ఉత్కృష్టమైన ఈ రూపాన్ని నువ్వు చూశావు. నిన్ను అనుగ్రహించాలని నా యోగ శక్తి చేత నీకు ప్రసన్నుణ్ణి అయ్యాను.

వ్యాఖ్య

తన విశ్వరూపాన్ని దర్శించి భీతి చెందిన అర్జునుని, అనునయ వాక్యాలతో భగవంతుడు ఊరడిస్తున్నాడు. భగవంతుని విశ్వరూపము తేజోమయం. దివ్య తేజోమయం **(తేజః ప్రాయం).** పరమేశ్వరుని

దివ్యానుగ్రహమే ఆ తేజోమయ రూపము. సూర్య భగవానుడు తన తేజమును కిరణాల ద్వారా ప్రసరింప చేసినట్లు, పరమేశ్వరుడు తన అనుగ్రహాన్ని ఆ తేజోమయ రూపం ద్వారా ప్రదర్శిస్తున్నాడు.

అది సామాన్య తేజము కాదు. అస్తమయ మెరుగని ప్రకాశము. అనంతమైన తేజము ***(అనన్తమ్ అంత రహితమ్).*** అన్ని రూపాలు పరమాత్మవే అయినా విశ్వరూపము ప్రథమము, ప్రధానము. అంటే మొదట పుట్టిన రూపము. అందుకే అది ఆద్యము ***(ఆదౌ భవమ్ ఆద్యమ్).*** ముందు విశ్వము ఆవిర్భవిస్తే, ఆ తరువాత విశ్వంలో అనేక రూపాలు ఆవిర్భవించాయి. అన్ని రూపాలు విశ్వం లోనే ఉండటం చేత, అది సమస్త రూపము ***(విశ్వం సమస్తమ్).***

ఇటువంటి అద్భుత రూపము అర్జునుడు తప్ప మరెవ్వరూ గతంలో చూడలేదు అంటున్నాడు. కాని, శ్రీకృష్ణుడు తన విశ్వరూపాన్ని అర్జునుని కన్నా ముందుగా చాలా మందికి చూపించినట్లు భారత, భాగవత గ్రంథాలు చెబుతాయి.

పుట్టగానే తల్లిదండ్రులైన దేవకీ వసుదేవులకు చతుర్భుజుడుగా దర్శన మిచ్చాడు. గోకులంలో మన్ను తిన్నాడని విని, యశోద నోరు తెరువమని అడిగి నపుడు, తన నోటిలో విశ్వాన్నంతా చూపాడు. కురుసభలో ధృతరాష్ట్ర, భీష్మాదులకు విశ్వరూపాన్ని ప్రదర్శించి చూపాడు. యమునా జలాలలో అక్రూరునికి కూడా చతుర్భుజునిగా దివ్య దర్శన మిచ్చాడు. కాని, ప్రస్తుతం అర్జునుడు తప్ప గతంలో ఈ రూపాన్ని ఎవ్వరూ చూడలేదు అంటున్నాడు.

అవును. అవన్నీ వాస్తవాలే. కాకపోతే, అవన్నీ అవాంతర రూపాలు. అర్జునుడు దర్శించిన శ్రేష్ఠమైన రూపం వంటివి మాత్రం కావు అని గీతా తాత్పర్య బోధినీ సంస్కృత వ్యాఖ్యానములో ఉంది. ఈ విధమైన, అరుదైన విశ్వరూప సందర్శనము భగవ దనుగ్రహం చేత భక్తుడైన అర్జునునికి ప్రాప్తించింది. అట్టి దివ్య రూపాన్ని చూచి భయపడ నవసరం లేదని భగవంతుడు అర్జునుని ఊరడిస్తున్నాడు.

న వేదయజ్ఞాధ్యయనై ర్న దానై ర్న చ క్రియాభి ర్న తపోభిరుగ్రైః ।
ఏవం రూపః శక్య అహం నృలోకే ద్రష్టుం త్వదన్యేన కురుప్రవీర ॥ 48

న-వేదయజ్ఞాధ్యయనైః-న-దానైః-న-చ-క్రియాభిః-న-తపోభిః-ఉగ్రైః
ఏవం-రూపః-శక్య-అహం-నృలోకే-ద్రష్టుం-త్వదన్యేన-కురుప్రవీర

కురుప్రవీర	= అర్జునా!	న	= కాను
ఏవం రూపః	= ఇటువంటి రూపము	క్రియాభిః చ	= కర్మల చేత
అహం	= నేను	న	= కాను
నృలోకే	= మనుష్య లోకము నందు	ఉగ్రైః	= తీవ్రమైన
త్వదన్యేన	= నీవు గాక ఇతరుని చేత	తపోభిః	= తపస్సుల చేత
వేదయజ్ఞాధ్యయనైః	= వేదాధ్యయనము చేతను, యజ్ఞముల చేత	ద్రష్టుం	= చూచుటకు
దానైః	= దానముల చేత	న శక్యః	= సాధ్యమైన వాడను గాను

కురువీరా! అర్జునా! మానవ లోకంలో వేదాలను, యజ్ఞ విద్యలను అధ్యయనం చేసిన వారు గాని, దానాలు ఆచరించిన వారు గాని, క్రియా తపస్సులు అనుష్ఠించిన వారు గాని ఈ విశ్వరూపాన్ని దర్శించ లేరు. అలాంటి దివ్య రూపాన్ని నువ్వు దర్శించావు.

వ్యాఖ్య

అన్య లెవ్వరూ దర్శించని, దర్శించలేని తన దివ్య రూపాన్ని కేవలం భగవంతుని అనుగ్రహం చేత దర్శించిన అర్జునుడు కృతార్థు డయ్యాడని భగవానుని అభిప్రాయము ***(ఆత్మనః మమ రూప దర్శనేన కృతార్థః ఏవ త్వం).*** అందుచేత అన్యులకు దర్శింప సాధ్యం కానిది, కేవలం తన ఆత్మయోగ, అనుగ్రహాల చేతనే దర్శింప దగినది అయిన ఆ అలౌకిక అద్భుత రూపాన్ని భగవానుడు స్తుతిస్తున్నాడు ***(తత్ స్తౌతి).***

వేదాధ్యయనాల చేత విశ్వరూపం దర్శింప బడదు ***(న వేదాధ్యయనైః).*** వేదాధ్యయనం వల్ల అధ్యయనం జరుగుతుందే గాని అర్థ బోధకత్వం జరగదు. అలాగే యజ్ఞాధ్యయనాలు కూడా ***(యజ్ఞాధ్యయనైః).*** యజ్ఞకర్మల నాచరించే అధ్యయనాలను చేసి ఉపయోగం లేదు. మీమాంస, కల్ప, సూత్రాదులను కూడా అధ్యయనం చేసి విచారించాలి.

అలాగే గోదాన, భూదాన, కన్యాదాన, తులా పురుషాది దానాల చేత కూడా విశ్వరూప సందర్శనము జరగదు. అగ్నిహోత్రాది శ్రౌత క్రియలు, చంద్రయానాది తపస్సులను ఆచరించే వారి చేత కూడా పొందబడదు ***(న శక్యః).***

అలాగని, ఈ సాధన లన్నీ నిరుపయోగ మని భావించ కూడదు. ఇవన్నీ అవశ్యం ఆచరింప దగినవే. కాకపోతే, ఈ సాధనలు అంతఃకరణ శుద్ధిని మాత్రమే ప్రసాదిస్తాయి. విశ్వరూప దర్శనం కేవలం భగవ దనుగ్రహం తోనే ప్రాప్తిస్తుంది. భగవ దనుగ్రహం అశుద్ధ చిత్తులకు అందుతుందా? అందుచేత, ఈ సాధన లన్నీ ఆచరించాలి. కాని, భగవ దనుగ్రహానికి ముఖ్య కారణమైన భక్తి చేతనే సందర్శనము సంప్రాప్త మౌతుంది అనేది మరువ కూడదు. అట్టి అనుగ్రహాన్ని పొందడం చేత, గతంలో ఎవ్వరూ దర్శించని రూపాన్ని అర్జునుడు దర్శించి కృతార్థు డయ్యాడు.

మా తే వ్యథా మా చ విమూఢభావో దృష్ట్వా రూపం ఘోర మీదృ జ్మమేదమ్ ।
వ్యపేతభీః ప్రీతమనాః పునస్త్వం తదేవ మే రూప మిదం ప్రపశ్య ॥ 49

మా-తే-వ్యథా-మా-చ-విమూఢభావః-దృష్ట్వా-రూపం-ఘోరం-ఈదృక్-మమ-ఇదం
వ్యపేతభీః-ప్రీతమనాః-పునః-త్వం-తత్-ఏవ-మే-రూపం-ఇదం-ప్రపశ్య

ఈదృక్	= ఇట్టి	మా	= వలదు
ఘోరం	= భయంకరమైన	త్వం	= నీవు
మమ	= నా యొక్క	వ్యపేతభీః	= భయము పోయిన వాడవు
ఇదం	= ఈ	ప్రీత మనాః	= తృప్తి చెందిన వాడవై
రూపం	= రూపమును	మే	= నా యొక్క
దృష్ట్వా	= చూచి	తదేవ	= ఆ పూర్వపు
తే	= నీకు	ఇదం	= ఈ
వ్యథా	= భయము	రూపం	= రూపమును
మా	= వలదు	పునః	= మరల
విమూఢభావః చ	= చిత్త సంక్షోభమూ	ప్రపశ్య	= దర్శించు

అర్జునా! భీకరమైన నా విశ్వరూపాన్ని చూచి భయపడ నవసరం లేదు. కలత చెంద నవసరం లేదు. నిర్భయంగా ఉండు. ప్రసన్నంగా ఉండు. నువ్వు కోరినట్లు నా పూర్వ రూపాన్నే దర్శించు.

వ్యాఖ్య

అర్జునా! భయపడకు. మానవ లోకములో ఇంతవరకు ఎవ్వరూ దర్శించని రూపాన్ని చూచే శక్తిని నీకు అనుగ్రహించాను అంటే, నీ మీద నా కెంత ప్రేమో నేను ప్రత్యేకించి చెప్పాల్సిన అవసర ముందా? అలాంటి నన్ను చూచి నువ్వు భయపడట మేమిటి? భయాన్ని విడిచేయ్ ***(మా తే వ్యథా, మా భూత్ తే భయమ్)***! సంతోషంగా ఉండు ***(ప్రీత మనాః)***. నిర్భయంగా ఉండు ***(వ్యపేత భీః విగత భయః)***. అర్జునా! నీకు ఇష్టమైన రూపాన్ని చూడు అన్నాడు భగవంతుడు.

ఇంతకీ అర్జునునికి ఏది ఇష్టమైన రూపము? చతుర్భుజ రూపము. పార్థా! శంఖచక్ర గదాధర రూపంతో శోభించే నీ ఇష్ట రూపాన్ని దర్శించు ***(చతుర్భుజం శంఖచక్ర గదాధరం తవ ఇష్టం రూపం ఇదం ప్రపశ్య)***. శంఖచక్ర గదాది ఆయుధాలతో ప్రకాశించే పరమాత్మ రూపం అర్జునునికి ఇష్టరూపం. అంటే, ఇష్టదేవతా రూపం. చతుర్భుజుడైన నారాయణమూర్తి అర్జునునికి ఇష్టదేవత. చతుర్భుజ రూపం ఆయన ఇష్టదేవతా రూపం. శ్రీకృష్ణుని విశ్వరూపమును దర్శించిన తరువాత ఆయన సాక్షాత్తు తన నారాయణమూర్తియే అనే జ్ఞానం అర్జునునిలో ధృవ పడింది. స్థిర పడింది. కనుక, తన ధ్యానమూర్తి చతుర్భుజుడైన శ్రీమహావిష్ణువు యొక్క రూపమును దర్శించాలనే అభీష్టంతో అర్జునుడు చతుర్భుజ రూపమును అనుగ్రహించ మని నలభై ఆరవ శ్లోకంలో ప్రార్థించడము లోని అంతర్భావ మేమిటో ప్రస్తుత శ్లోకంలో సుస్పష్ట మైంది. అక్కడ మనం లేవనెత్తిన సంశయం ఇక్కడ నివృత్తి అయింది.

సంజయ ఉవాచ :

ఇ త్యర్జునం వాసుదేవ స్తథోక్త్వా స్వకం రూపం దర్శయామాస భూయః ।
ఆశ్వాసయామాస చ భీత మేనం భూత్వా పునః సౌమ్యవపు ర్మహాత్మా ॥ 50

ఇతి-అర్జునం-వాసుదేవః-తథా-ఉక్త్వా-స్వకం-రూపం-దర్శయామాస-భూయః
ఆశ్వాసయామాస-చ-భీతం-ఏనం-భూత్వా-పునః-సౌమ్యవపుః-మహాత్మా

మహాత్మా	=	మహాత్ముడైన	భూయః	=	మరల
వాసుదేవః	=	శ్రీకృష్ణుడు	దర్శయామాస	=	దర్శింప చేశాడు
ఇతి	=	ఈ విధంగా	పునః	=	మరల
అర్జునం	=	అర్జునుని గురించి	సౌమ్యవపుః	=	సౌమ్య స్వరూపుడు
ఉక్త్వా	=	పలికి	భూత్వా	=	అయి
తథా	=	అలాగే	భీతం	=	భయ పడిన
స్వకం	=	తనదైన	ఏనం	=	అర్జునుని
రూపం	=	రూపమును	ఆశ్వాసయామాస చ	=	ఓదార్చాడు

సంజయుడు వినిపిస్తున్నాడు :

ధృతరాష్ట్ర మహారాజా! ఈ విధంగా వాసుదేవుడు అర్జునునితో పలికి, అర్జునుడు కోరినట్లు తన పూర్వ రూపాన్ని దర్శింప చేశాడు. మహాత్ముడైన శ్రీకృష్ణుడు మళ్ళీ తన సౌమ్య రూపమును చూపి, భయభ్రాంతులకు గురైన అర్జునుని ఓదార్చాడు.

వ్యాఖ్య

ఆద్యరూపం - సుదర్శనం

భయంకరమైన విశ్వరూపాన్ని పరమేశ్వరుడు ఉపసంహరించాడు. దివ్యమైన పూర్వ మంగళ రూపంతో సాక్షాత్కరించాడు. దానిని **స్వకం రూపం** అని వర్ణించాడు సంజయుడు. **స్వకం రూపం** అంటే తనదైన రూపం. తన సంబంధమైన రూపం అని అర్థము. అదే పూర్వ రూపం. పూర్వం, అంటే శ్రీకృష్ణావతారంలో ప్రథమంగా అగుపించిన రూపం. అంటే, వసుదేవుని గృహంలో (కారాగారంలో) జన్మించి నపుడు గోచరించిన రూపం ***(స్వకం వాసుదేవ గృహే జాతం రూపం)***.

దేవకీ వసుదేవులకు శ్రీకృష్ణుడు అవతరించ గానే, చతుర్భుజుడుగా అగుపించాడని మీకు ముందే నేను తెలియ చేశాను. ఆ చతుర్భుజ మూర్తినే దర్శించాలని అర్జునుడు అభిలషించాడు. ఆ మూర్తినే దర్శింప చేస్తూ శ్రీకృష్ణ పరమాత్మ తన విశ్వరూపాన్ని ఉపసంహరించాడు. ఈ సందర్భంలో శ్రీకృష్ణుని వాసుదేవుడుగా సంజయుడు అభివర్ణించడం విశేషము.

శంఖచక్ర గదాది ఆయుధాలతో, మకర కుండలాలతో ప్రకాశిస్తూ, శ్రీవత్స, కౌస్తుభ వనమాలా పీతాంబరాలతో శోభిస్తూ పరమ దయామయుడైన శ్రీకృష్ణదేవుడు, తిరిగి సౌమ్య రూపమును ధరించాడు.

ఇది శ్రీకృష్ణదేవుడు భక్తుడైన అర్జునుని కరుణించి అనుగ్రహించిన ఇష్టదేవతా రూప దర్శనము. చతుర్భుజుడైన నారాయణమూర్తి దర్శనము. ఆ తరువాత ఆ రూపాన్ని కూడా తిరోహితం చేసి, కమలదళ లోచనుడై, నీలమేఘశ్యాముడుగా అగుపించి, విశ్వరూప దర్శనంలో దిక్కులు తెలియక భయభ్రాంతులకు లోనైన అర్జునుని ఊరడించాడు. అర్జునుని హృదయం ఆనంద సాగర మైంది. మరల **(భూయః)** తిరిగి **(పునః)** అంటూ, మళ్ళీ మళ్ళీ అని రెండుసార్లు పలకడంలో విశ్వరూప ఉపసంహారం క్రమంగా జరిగిం దనేది స్పష్టంగా ధ్వనిస్తోంది.

అర్జున ఉవాచ :

దృ ష్ట్వేదం మానుషం రూపం తవ సౌమ్యం జనార్దన ।
ఇదానీ మస్మి సంవృత్తః సచేతాః ప్రకృతిం గతః ॥ 51

దృష్ట్వా-ఇదం-మానుషం-రూపం-తవ-సౌమ్యం-జనార్దన
ఇదానీం-అస్మి-సంవృత్తః-సచేతాః-ప్రకృతిం-గతః

జనార్దన	=	కృష్ణా!	దృష్ట్వా	=	దర్శించి
తవ	=	నీ యొక్క	ఇదానీం	=	ఇప్పుడు
ఇదం	=	ఈ	సచేతాః	=	ప్రసన్న చిత్తము గలవాడను
మానుషం	=	మనుజ సహజమైన	ప్రకృతిం	=	స్వభావమును
సౌమ్యం	=	ప్రసన్నమైన	గతః	=	పొందిన వాడను
రూపం	=	రూపమును	సంవృత్తః అస్మి	=	అయితిని

అర్జునుని విన్నపము :

జనార్దనా! కృష్ణా! మానవాకారంలో ఉన్న సౌమ్యమైన నీ రూపాన్ని చూచి, ఇప్పుడు నేను శాంతిని పొందాను. స్థిమిత పడ్డాను. నా చిత్తం ప్రసన్నంగా ఉంది.

వ్యాఖ్య

విశ్వరూప సందర్శనము ప్రారంభమైన క్షణం నుండి ఏదో అసాధారణ పరిస్థితిలో, అనూహ్యమైన వాతావరణంలో ఉండిన వన్నీ ఒక్కసారిగా ఉపశమించి, సామాన్య స్థితికి చేరుకున్నాయి. ఏమిటవి? ఒక్కటైతే కదా! వాటిని మూడు కోణాల్లో దర్శించాలి.

మొదటిది శ్రీకృష్ణుడు. అంతవరకు సౌజన్యం ఉట్టి పడుతూ సౌమ్యమూర్తిగా మనోహర రూపంతో బోధిస్తున్న వాడు, అంత మెక్కడో తెలియని ఉగ్ర రూపాన్ని ధరించి భయంకరుడై కలవర పెట్టాడు. ప్రస్తుతం ఆ రూపాన్ని ఉపసంహరించి, తిరిగి సౌమ్యంగా, సామాన్యంగా దర్శన మిస్తూ స్వస్థతను కలిగించాడు.

రెండవది అర్జునుడు. భీకరమైన శ్రీకృష్ణదేవుని ఉగ్రరూపాన్ని చూచి భయకంపితు డైన అర్జునుడు, తిరిగి పరమేశ్వరుని మానవ రూపునిగా, మంజుల మూర్తిగా దర్శించి, వాసుదేవుని అనునయ వాక్యాల చేత ఊరడించబడి, తిరిగి స్వస్థతను పొంది సామాన్య స్థితికి చేరుకున్నాడు.

మూడవది గీతా శాస్త్రము. ప్రారంభం నుండి అనుష్టుప్ ఛందస్సులో అలవోకగా, అవలీలగా సాగుతూ వచ్చిన శ్లోకాలు, విశ్వరూపం ఆరంభం కాగానే, అనుష్టుప్ ఛందస్సును ఆవల ఉంచి, త్రిష్టుప్ ఛందస్సులో మింగుడు పడని పదాలతో కదం త్రొక్కి, ఇప్పుడు *(ఇదానీం)* విశ్వరూపమును ఉపసంహరించ గానే, తాను కూడా తిరిగి సజావుగా అనుష్టుప్ ఛందస్సును అందుకొని మామూలు స్థితికి చేరింది.

అంతటా స్వస్థత నెలకొనింది. శాంతి పరిఢవిల్లింది. విశ్వరూప దర్శన ప్రాప్తిని గూర్చి భగవంతుడే స్వయంగా చెబుతున్నాడు.

శ్రీ భగవానువాచ :

సుదుర్దర్శ మిదం రూపం దృష్ట వానసి యన్మమ । 52
దేవా అప్యస్య రూపస్య నిత్యం దర్శన కాంక్షిణః ॥

సుదుర్దర్శం-ఇదం-రూపం-దృష్టవాన్-అసి-యత్-మమ
దేవాః-అపి-అస్య-రూపస్య-నిత్యం-దర్శన కాంక్షిణః

మమ	=	నా యొక్క	అసి	=	అయితివో
యత్	=	ఏదయితే	దేవా అపి	=	దేవతలును
ఇదం	=	ఈ	నిత్యం	=	ఎల్లప్పుడు
సుదుర్దర్శం	=	చూడ దుర్లభమైన	అస్య	=	ఈ
రూపం	=	రూపమును	రూపస్య	=	రూపము యొక్క
దృష్టవాన్	=	చూచిన వాడవు	దర్శనకాంక్షిణః	=	దర్శనమును కోరు వారు

శ్రీ భగవానుడు చెబుతున్నాడు :

అర్జునా! సులభసాధ్యం గాని నా దివ్య రూపాన్ని నువ్వు దర్శించావు. ఈ దర్శనం కోసం దేవతలు కూడా నిత్యము పరితపిస్తూ ఉంటారు.

వ్యాఖ్య

చిత్త స్వాస్థ్యమును పొంది, ప్రసన్న హృదయుడైన అర్జునుని తృప్తి పరచే వాక్యాలను నాలుగు శ్లోకాలలో వివరించి అధ్యాయాన్ని సమాప్తం చేస్తున్నాడు భగవంతుడు.

అర్జునా! చూడశక్యం గాని నా రూపాన్ని నువ్వు దర్శించావు. సుదుర్దశము, సుదుర్లభమైన అద్భుత రూపాన్ని నీవు అవలోకించావు. సులభసాధ్యం కాని కార్యాన్ని సాధించడం నీకే సాధ్యమైంది. ఇదంతా నీ పుణ్యం. నీ భాగ్యం. నీ అదృష్టం. నీ సుకృతం అని భగవంతుడు అర్జునుని ఆశీర్వదిస్తున్నాడు.

దుర్దర్శ మంటే కష్టం మీద చూడ శక్యము అని అర్థము. సుదుర్దర్శము అంటే అతి కష్టం మీద చూడ శక్యము అని అర్థము **(సుష్ఠు దుఃఖేన దర్శనమ్ ఇతి సుదుర్దర్శమ్).** అట్టి రూపాన్ని అర్జునుడు దర్శించాడు **(దృష్టవాన్ అసి).** దేవతలు అందుకోలేని భాగ్యాన్ని అందుకున్నాడు.

ఎత్తైన లోకాలలో, అతిలోక శక్తులతో తేజరిల్లే దేవతలు ఆశించి కూడా అందుకోలేని అదృష్టాన్ని భగవ దనుగ్రహంతో, మానవ లోకం నుండే నరుడు ఏకబిగిన ఎగిరి అందుకున్నాడు. సుర జన్మ కన్నా నరజన్మే శ్రేష్ఠ మని నిరూపించాడు. సుదుర్లభమైన దానిని సులభతరం చేసేది భక్తి ఒక్కటే నని ఋజువు చేశాడు.

మొగ్గ పువ్వైనట్లు, వత్తి జ్యోతి రూపమై వెల్గొందినట్లు, రాయి విగ్రహ మైనట్లు, జలం తీర్థంగా మారినట్లు, భగవ దనుగ్రహంతో భక్తి దివ్యమై అలరారుతుంది. భక్తుడు భవ్యమై శోభిస్తాడు.

పల్లవి: **రాధను - నీ రాధను !**
ఆరాధన చేసే రాధను !
నీ రాధను - నిరపరాధను !

చరణము:**(1) నీ పద కమలాల అలరారుటకు**
ఎదురు చూచిన మొగ్గను - నేడు
యెద విరబూసిన పువ్వును **॥ రాధను ॥**
(2) నీ గుడి ముంగిట వెలుగు చిమ్ముటకు
వేచి యుండిన వత్తిని - నేడు
కాంతి నింపే జ్యోతిని **॥ రాధను ॥**

అని భక్తి ఫలాలను ప్రసాదంగా ఆరగిస్తూ, సంతృప్తిని త్రేపుతూ పలికింది చైతన్య గీతిక.

నాహం వేదై ర్న తపసా న దానేన న చేజ్యయా । 53
శక్య ఏవం విధో ద్రష్టుం దృష్టవా నసి మాం యథా ॥

న-అహం-వేదైః-న-తపసా-న-దానేన-న-చ-ఇజ్యయా
శక్యః-ఏవం విధః-ద్రష్టుం-దృష్టవాన్-అసి-మాం-యథా

మాం	=	నన్ను	తపసా	=	తపస్సు చేత
యథా	=	ఏ విధముగా	ద్రష్టుం	=	దర్శించుటకు
దృష్టవాన్	=	చూచిన వాడవు	న శక్యః	=	శక్యుడను గాను
అసి	=	అయితివో	దానేన	=	దానము చేత
ఏవం విధః	=	ఇట్టి స్వరూపము గల	ఇజ్యయా చ	=	యజ్ఞము చేత
అహం	=	నేను	న	=	కాను
వేదైః	=	వేదముల చేత			

అర్జునా! నువ్వు దర్శించిన నా రూపాన్ని, అదే విధంగా దర్శించడం వేదాల చేత గాని, తపస్సు చేత గాని, దానము చేత గాని, యజ్ఞము చేత గాని సాధ్య పడదు.

వ్యాఖ్య

అభ్యసించే విద్యలలో వేదాధ్యయనం శ్రేష్ఠ మైనది. శ్రమ పడే కార్యాలలో తపస్సు శ్రేష్ఠ మైనది. త్యాగం విషయంలో దానం శ్రేష్ఠ మైనది. కర్మలలో యజ్ఞము పవిత్ర మైనది. అయినా, భగవ దనుగ్రహంతో అర్జునుడు దర్శించిన దివ్యరూపము, వేదాధ్యయనాది కార్యాల వల్ల ప్రాప్తించేది కాదు అని భగవంతుడే స్వయంగా చెబుతున్నాడు.

ఈ శ్లోకం పునరుక్తి శ్లోకము. ఈ అధ్యాయం లోనే నలభై ఎనిమిదవ శ్లోకంలో చెప్పబడిన విషయము, తిరిగి అదే విషయాన్ని ఇక్కడ మళ్ళీ చెప్పడం జరుగుతూ ఉంది. దీనిని పునరుక్తి దోషంగా పరిగణించ కూడదు. కేవలం ఐదు శ్లోకాల వ్యవధిలో పునరుక్తి జరిగింది అంటే, దాని విశేష మెలాంటిదో జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి.

ఈ అధ్యాయాంతంలో మిగిలి యున్న రెండు శ్లోకాలు తదుపరి దర్శన మిచ్చే ధర్మామృత మైన భక్తి సాధానికి, భక్తి యోగ హర్మ్యానికి దివ్యమైన పునాదులు. పునాదిని పటిష్ఠం చేసే కార్యక్రమంలో భాగం గానే ప్రస్తుతం పునరుక్తి పావనోక్తిగా గోచరిస్తూ ఉంది.

ఎవరి ప్రభావమును *అచింత్యం - అనిర్దేశ్యం* అని వేదాలు ప్రవచించాయో, అట్టి వేద స్వరూపుని ఏ అధ్యయనాలతో అందుకోగలం? సృష్టిని తపోకార్యంగా నిర్వహించి విశ్వాన్ని సృష్టించిన విశ్వమూర్తిని ఏ తపస్సుతో పొందగలం? ప్రాణదాతను ఏ దానంతో లోబరచుకో గలం? సృష్ట్యాది లోనే సర్వ యజ్ఞాలను ఆవిష్కరించిన యజ్ఞ పురుషుని ఏ యజ్ఞం ద్వారా వశపరచుకో గలం? వేద తపో దాన యజ్ఞాల చేత లభ్యం కానివాడు భక్తికి లభ్య మవుతాడు. ఇదే శ్లోక సారాంశం. ముమ్ముందు దివ్యంగా సాగే అంశం.

మ॥ *ఉపవాస వ్రత శౌచ శీల మఖ సంధ్యోపాస నాగ్ని క్రియా*
జప ధ్యానాధ్యయనాది కర్మముల మోక్షప్రాప్తి సేకూర, ద
చ్చపు భక్తిన్ హరిం బుండరీక నయనున్ సర్వాతి శాయిన్ రమా
ధిపుఁ బాపఘ్నుఁ బరేశు నచ్యుతుని నర్థిం గొల్వ లేకుండినన్ ॥

'ఉపవాసాలు, వ్రతాలు, శౌచాలు, శీలాలు, యజ్ఞాలు (మఖ), సంధ్యా వందనాలు, అగ్ని కార్యాలు, జపాలు, ధ్యానాలు, వేదాధ్యయనాలు మొదలైనవి ఎన్ని ఆచరించినా, పుండరీకాక్షుడు, సర్వాతిశయుడు, రమానాథుడు, పాపహరుడు, పరమేశ్వరుడు, అచ్యుతుడు అయిన శ్రీహరిని నిర్మలమైన భక్తితో కొలవని వారికి ముక్తి లభించదు' అని సాక్షాత్తు బ్రహ్మదేవుడు తన మానస పుత్రుడైన నారద మహర్షికి శ్రీమదాంధ్ర మహాభాగవతము - ద్వితీయ స్కంధములో బోధిస్తాడు.

మరి, వేదాధ్యయన తపో దాన యజ్ఞాల చేత భగవంతుడు లభ్యం కానపుడు, ఎలా శక్య మవుతాడు? **(కథం పునః శక్యః ఇతి?).** *అదే చెబుతున్నాడు* **(ఉచ్యతే).**

భక్త్యా త్వనన్యయా శక్య అహ మేవం విధోఽర్జున । 54
జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన ప్రవేష్టుం చ పరంతప ॥

భక్త్యా-తు-అనన్యయా-శక్యః-అహం-ఏవం విధః-అర్జున
జ్ఞాతుం-ద్రష్టుం-చ-తత్త్వేన-ప్రవేష్టుం-చ-పరంతప

పరంతప	=	అర్జునా!	అనన్యయా	=	అనన్యమైన
ఏవం విధః	=	ఇట్టి విశ్వరూపుడ నైన	భక్త్యా తు	=	భక్తి చేతనే
అహం	=	నేను	తత్త్వేన	=	యథార్థముగా

జ్ఞాతుం	=	తెలిసి కొనుటకు	శక్యః	=	శక్యుడను
ద్రష్టుం చ	=	చూచుటకు	అర్జున	=	అర్జునా!
ప్రవేష్టుం చ	=	ప్రవేశించుటకు			

అర్జునా! విశ్వరూపుడ నైన నన్ను యథాతథంగా తెలుసుకోవాలన్నా, దర్శించాలన్నా, లేదా నాలో ప్రవేశించాలన్నా, అనన్య భక్తి చేతనే అది సాధ్యం.

వ్యాఖ్య

వేదాధ్యయన, యజ్ఞ దాన తపస్సుల చేత లభ్యం కాని విశ్వమూర్తి కేవలం భక్తి చేత పొంద బడతాడు. వస్తువు ప్రత్యక్షంగా ఉన్నా, దానిని చూడటం అంధునికి ఎలా సాధ్యపడదో, అలాగే భక్తి లేని వానికి పరమాత్మ దర్శనము శక్యం కాదు. భక్తి పరమాత్మను పొందే విధంగా సాధకుని సిద్ధం చేస్తుంది.

అర్జునా! సమస్త భూతములు ఎవరిలో ఉన్నవో, సమస్తమైన జగత్తు ఎవరి చేత పరివ్యాప్తమై ఉందో, అట్టి పురుషోత్తముడైన పరమేశ్వరుడు అనన్యమైన భక్తి చేతనే లభ్య మవుతాడు అని భగవంతుడు అక్షర పరబ్రహ్మ యోగములో చెప్పి ఉన్నాడు (**భక్త్యా లభ్యస్తు అనన్యయా**, 8 వ అ - 22 వ శ్లో).

అనన్య భక్తి

అన్యము కానిది అనన్యము. మరొకటి లేనిది, వేరొకటి కానిది, అన్యమైనది తెలియనిది అనన్యము **(అనన్యయా అపృథగ్భూతయా)**. భగవంతుని కంటే అన్యమైన దాని యందు, భిన్నమైన దాని యందు ఉండని, ఉండలేని భక్తి ఏదో అదే అనన్య భక్తి **(భగవతః అన్యత్ర పృథక్ న కదాచిదపి యా భవతి సా తు అనన్యాభక్తిః)**.

భక్తునికి భగవంతుని మీద భక్తి లేకుండా ఎలా ఉంటుంది? భగవంతుని యందు భక్తి కల వాడే కదా భక్తుడు! నిజమే. భక్తుడిలో భగవద్భక్తి ఉండొచ్చు. కాని, ఆ భక్తి దేని కొరకు? అనే ప్రశ్న పడినపుడు, ఆ ప్రశ్నకు వచ్చే సమాధానాన్ని బట్టి అది సాధారణమైన భక్తో లేక అనన్యభక్తో నిర్ధారింప బడుతుంది.

భగవద్భక్తి ఉండినా, అది అర్థకామాల కొరకు అయినపుడు, పుణ్యలోక ప్రాప్తి కొరకై నపుడు, అట్టి భక్తి అన్యభక్తి అవుతుందే గాని, అనన్య భక్తి కాలేదు. కేవలం భగవంతుని కొరకే సాగే భక్తి అనన్యభక్తి. పరమేశ్వరుడు తప్ప అన్య విషయముల యందు స్పృహ లేని భక్తి అనన్య భక్తి. అట్టి అనన్య భక్తి లేకుండా భగవంతుని పొందడము సాధ్యపడదు. అందుచేతనే **భక్త్యా తు అనన్యయా శక్యః** - అనన్య భక్తి చేతనే భగవంతుడు లభ్య మవుతాడు అంటున్నాడు. ఇక్కడ **తు** శబ్దము అనన్య భక్తి వినా మరో సాధనము చేత పొందబడడు అని చెప్పడానికి ప్రయోక్త మైంది.

శ్రీ శంకరాచార్యస్వామి భాష్యంలో ఈ విషయాన్ని మరీ సుస్పష్టం చేశారు. అనన్య భక్తిని అసమానంగా, అద్భుతంగా, అందంగా ఆవిష్కరించారు. వాసుదేవుని కంటే వేరైనది ఏదీ సర్వేంద్రియాల చేత తెలియబడదో అదే అనన్య భక్తి అని అనితర సాధ్యంగా వ్యాఖ్యానించారు **(సర్వైః అపి కరణైః వాసుదేవాత్ అన్యత్ న ఉపలభ్యతే యయా సా అనన్య భక్తిః)**. అట్టి భక్తి చేతనే భగవంతుడు లభ్య మౌతాడు **(తయా భక్త్యా శక్యః)**.

మనకున్న ఇంద్రియాలు ఆయా ఇంద్రియ విషయాల యందు అభిరుచిని, ఆసక్తిని, అనురక్తిని కలిగి ఉంటాయి. చెవులకు కొన్ని శబ్దాలు ప్రియం. నాలుకకు కొన్ని పదార్థాలే మధురం. నేత్రాలకు కొన్ని రూపాలు ఇష్టం. ఇలా ఇంద్రియాలు ఇంద్రియ విషయాలలో తృప్తి చెందుతూ ఉంటాయి.

అనన్య భక్తి కలిగింది అంటే, ఈ విధమైన ప్రత్యేకతలు, ప్రాధాన్యతలు సమూలంగా అంతరిస్తాయి. అన్ని ఇంద్రియాలు ఒకే వస్తువులో, ఒకే విషయంతో తృప్తి చెందుతాయి. అట్టి తృప్తిని ప్రసాదించేదే అనన్య

భక్తి. ఏ ఇంద్రియము కూడా భగవంతుని కన్నా భిన్నమైన విషయాల యందు తృప్తి చెందని పరిస్థితి ప్రాప్తించింది అంటే, అనన్య భక్తి సిద్ధించిందని నిర్ధారణ చేసుకోవచ్చు. అనన్య భక్తి సిద్ధించింది అంటే, భగవంతుడు ప్రాప్తించాడు అని అర్థము.

శా॥ *నీ పద్యావళు లాలకించు చెవులున్ నిన్నాడు వాక్యంబులున్*
నీ పేరం బనిసేయు హస్త యుగముల్ నీ మూర్తిపైఁ జూపులున్
నీ పాదంబుల పొంత మ్రొక్కు శిరముల్ నీ సేవపై జిత్తముల్
నీపై బుద్ధులు మాకు నిమ్ము కరుణన్ నీరజ పత్రేక్షణా !

'కమలదళ లోచనా! కృష్ణా! నిరంతరము నీకు సంబంధించిన విషయాలనే శ్రవణం చేసే చెవులు, నిన్ను గురించే భాషించు వాక్కులు, ఏది చేసినా నీ కార్యాన్నే కొనసాగించు చేతులు, నిన్నే వీక్షించు దృష్టి, నీ చరణములపై వాలే శిరస్సు, సదా నీ సేవా భాగ్యానికే నోచుకునే చిత్తము, నీ మీదే ఉండే మనస్సు - వీటినే దయతో మాకు ప్రసాదించు' అని బాలకృష్ణుని చరణ కమల స్పర్శతో శాపవిముక్తు లైన నలకూబర మణిగ్రీవు లనే కుబేరుని ఇరువురు కుమారులు భాగవతము - దశమ స్కంధములో ప్రార్థించారు. ఆ సందర్భమున బాలకృష్ణుడు భాషించిన భవ్యమైన వాక్కులు ప్రాతః స్మరణీయాలు.

క॥ *తమ తమ ధర్మము దప్పక, సములైనను నమ్మి తిరుగు సభ్యులకును బం*
ధము నన్నుఁ జూడ విరియును, గమలాప్తుడు వొడమ విరియు ఘనతమము క్రియన్ ॥

'ఎవరైతే (ధర్మరూపంలో ఉన్న దైవాన్ని స్మరిస్తూ) తమ తమ ధర్మాలను నిష్ఠతో ఆచరిస్తూ, సర్వత్ర సమభావంతో చరిస్తూ, నన్నే పరమగతిగా భావించి సంచరిస్తుంటారో అట్టి సద్భక్తులకు, సూర్యోదయంతో దట్టమైన చీకట్లు చెదరినట్లు, బంధాలు విడి పోతాయి. నా దర్శనంతో మోక్షం ప్రాప్తిస్తుంది' అన్నాడు మోక్షప్రదాత బాలముకుందుడు.

అర్జునా! ఈ విధమైన అనన్య భక్తి చేత నా తత్త్వాన్ని యథాతథంగా భక్తులు తెలుసుకుంటారు (*జ్ఞాతుం తత్త్వేన*). కేవలం తెలుసుకోవడమే కాదు. ప్రత్యక్షంగా సాక్షాత్కారాన్ని పొందుతారు (*ద్రష్టుం చ సాక్షాత్కర్తుం తత్త్వతః*). ఆ తరువాత నా లోనే ప్రవేశించి మోక్షరూపు లవుతారు (*తత్త్వేన ప్రవేష్టుం చ మోక్షం చ గన్తుం*).

విశ్వమూర్తి అయిన పరమేశ్వరుడు సర్వవ్యాపి. సర్వగతుడు. అలాంటి వానిని పొందడము అంటే, శాస్త్రం ద్వారా, ప్రమాణం ద్వారా అర్థం చేసుకోవడమే (*జ్ఞాతుం శాస్త్రతః*). సర్వగతుడు, అనంతుడైన భగవంతుని కన్నా తాను అన్యంగా ఎలా ఉండ గలడు? ఏ కెరటము కడలికి దూర మవుతుంది? ఈ సత్యాన్ని దర్శించడమే సాక్షాత్కారము. కేవలం శాస్త్రము చేత పరోక్షంగా తెలుసుకోవడమే గాక, ప్రత్యక్షంగా అనుభూతిని పొందడము దర్శనము (*న కేవలం జ్ఞాతుం శాస్త్రతః ద్రష్టుం చ సాక్షాత్కర్తుం తత్త్వతః*). ఆ స్థితిలో అభేదమే, అద్వైతమే అనుభూతి ప్రకాశ మైనందున ప్రవేశము; ముక్తి సౌధం లోకి ప్రవేశము. అదే మోక్షప్రాప్తి. అభేద జ్ఞానప్రాప్తి. అద్వైత దర్శనానుభూతి. అపరోక్షానుభూతి (*తత్త్వేన ప్రవేష్టుం చ మోక్షం చ గన్తుం*).

ఇక్కడ ప్రవేశించడము అంటే, ఎలుక కన్నము లోకి, సింహము గుహ లోకి, పక్షి గూటి లోకి, మనిషి ఇంటి లోకి ప్రవేశించినట్లు కాదు. అల సముద్రంలో ప్రవేశించినట్లు, సర్పము రజ్జువులో విలీన మైనట్లు, నగ బంగారును చేరినట్లు అని అర్థము. ఇదే అద్వయ స్వరూపమైన మోక్షము. సర్వోపద్రవ రహిత స్థితి. అభయ స్థితి.

ఇప్పుడు ఆలోచించండి. అర్జునుడు దర్శించిన విశ్వరూప సందర్శనము మోక్షమేనా? మోక్షమే అయితే

భయం ఎలా ఏర్పడింది? మనస్సు ఎందుకు విచలిత మైంది? సౌమ్య రూపాన్ని చూపమని అర్థించడం దేనికి?

విశ్వరూప సందర్శనమే మోక్ష మయ్యేట ట్లయితే, గీత ఇక్కడే సమాప్తం కావాలి. మరో ఏడు అధ్యాయాలు కొనసాగ వలసిన అవసరం లేదు. ఈ సందర్భములో తాత్త్వికంగా సుదీర్ఘమైన చర్చను కొనసాగించే అవకాశం లేనందున, ముక్తసరిగా విన్నవించు కుంటున్నాను.

కర్మ అయినా, ఉపాసన అయినా మోక్షాన్ని ప్రసాదించ లేవు. కర్మాచరణంలో ఉన్న మనస్సే ఉపాసనలో కూడా ఉంది. రెండు చోట్ల **అహం** భావన చెదరకుండా ఉంది. 'అహం' భావన 'అహం' స్వరూపంగా అర్థమైతేనే మోక్షము. 'అహం' భావన ఉన్నంత వరకు భేదం ఉన్నట్లే. ద్వైతం ఉన్నట్లే. సంసార మున్నట్లే. కనుకనే, ఉపాసనా సంబంధిత కర్మ ఫలాలన్నీ సంసారం క్రిందికే వస్తాయి అన్నారు బ్రహ్మసూత్ర భాష్యంలో శ్రీ శంకరాచార్య స్వామి (***సర్వమపి ఏతత్ ఉపాసనా కర్మఫలం సంసార ఏవ!*** *- 1 - 4 - 1*).

విశ్వరూప సందర్శనంలో అర్జునుని భయానికి కారణం ద్వైత దర్శనమే. సర్వమూ సర్వేశ్వరుడే, విశ్వమంతా విశ్వమూర్తే అనే భావనతో వీక్షించ గలిగాడు గాని, విశ్వరూపమును దర్శించే తాను, విశ్వరూపము కన్నా వేరుగా ఉన్నాను అనే భావన మాత్రం పోలేదు. అంతా అనంతుడైన పరమేశ్వరుడే అయినప్పుడు, అర్జునుడు ఆ అనంత స్వరూపంలో ప్రత్యేకంగా ఎలా ఉంటాడు? ఉన్నాను అనే భావన ఉండటమే భయ కారణము. ఎప్పుడైనా, ఎక్కడైనా ద్వైతమే భయ కారణము. అద్వైతమే అభయ స్వరూపము.

అనన్య భక్తి ద్వారానే అద్వయ రూపుడైన భగవంతుడు అర్థ మవుతాడు (**జ్ఞాతుం**). సాక్షాత్కరింప బడుతాడు (**ద్రష్టుం**). మోక్షైక స్వరూపుడై శోభిస్తాడు. అక్కడ ద్వైతం అనూహ్యం కనుక, (***అత్ర ద్వైతం న విద్యతే***). మోక్షం ప్రాప్తిస్తుంది. ప్రాప్తించి ఉన్నదే ప్రాప్తిస్తుంది.

అనన్య భక్తి ప్రాప్తించనంత వరకు ద్వైతమే రాజ్య మేలుతుంది. అంతా అయోమయమే. గందరగోళమే. ఒకవేళ ఈశ్వరుడు సాక్షాత్కరించినా కూడా ఈసడింపులే ఉంటాయి. ఈతి బాధలే మిగుల్తాయి.

నా మటుకు నాకు ఈశ్వరానుగ్రహం వల్ల భస్మభూషితాంగుడు అర్థ మవుతాడు కాని, ఎంత తల బాదుకున్నా, భస్మాసురుడు మాత్రం అర్థం కాడు. అతడు శివ దర్శనానికి తపస్సు చేయడ మేమిటి? అతడు కోరిన వర మేమిటి? తీరా వరాన్ని అనుగ్రహించిన తరువాత, ప్రయోగించడానికి శివుడే దొరికాడా? లోకంలో ఎన్ని తలలు లేవు! శివుని తల మీదకే శివ మెత్తాలా?

ద్వైతంలో ఏదైనా జరగవచ్చు. ఆశ్చర్యమే లేదు. శివుణ్ణి భయపెడుతూ భస్మాసురుడు వెంట బడ్డాడు. తానే భయపడి అర్జునుడు కూలడ్డాడు. అంతే తేడా. అంతా ద్వైత నాటకమే.

గీత మోక్షశాస్త్రము. అద్వైతమే తాత్పర్యము. అద్వైత జ్ఞానమే గీతా సర్వస్వము. ఈ విషయాన్నే ధృవ పరుస్తూ, అనన్య భక్తి అద్వైతానుభూతికి ఎలా మార్గమో తెలియ పరచి ఏకాదశాధ్యాయాన్ని అద్భుతంగా సమాప్తి చేస్తున్నాడు గీతాచార్యుడు.

అధ్యాయ సారాన్ని సుస్పష్టం చేయడమే గాక, ఇంతవరకు బోధించిన గీతా ప్రబోధాన్ని సారభూతంగా సంక్షిప్తంగా అందిస్తూ, సమస్త గీతా శాస్త్ర సారమైన మోక్షమే ప్రయోజనంగా శోభిస్తున్న విషయాన్ని కూడా సమన్వయం చేస్తూ, మత్కర్మకృత్ అనే శ్లోకంతో అధ్యాయాన్ని సమాప్తం చేస్తున్నాడు భగవంతుడు.

మత్కర్మకృ న్మత్పరమో మద్భక్తః సఙ్గవర్జితః ।
నిర్వైరః సర్వభూతేషు యః స మామేతి పాణ్డవ ॥ 55

మత్కర్మకృత్-మత్పరమః-మద్భక్తః-సంగవర్జితః
నిర్వైరః-సర్వభూతేషు-యః-సః-మాం-ఏతి-పాండవ

పాండవ	=	అర్జునా!	నిర్వైరః	=	వైరము లేని వాడు
మత్కర్మకృత్	=	నా కొరకు కర్మలు చేయు వాడు	యః	=	ఎవడో
మత్పరమః	=	నా యందే ఆసక్తి గల వాడు	సః	=	వాడు
మద్భక్తః	=	నా యందే భక్తి గల వాడు	మాం	=	నన్ను
సంగవర్జితః	=	సంగమును విడిచిన వాడు	ఏతి	=	పొందుతున్నాడు
సర్వభూతేషు	=	సమస్త భూతము లందును			

పాండుతనయా! అర్జునా! నా కొరకే కర్మ లాచరించే వాడు, నన్నే పరమగతిగా భావించి జీవించే వాడు, నా భక్తుడుగా బ్రతికేవాడు, విషయ సంగత్వం లేనివాడు, సర్వ ప్రాణుల యందు శత్రుత్వము లేనివాడు నన్నే పొందుతాడు.

వ్యాఖ్య

సర్వ శాస్త్ర మయీ గీతా - భగవద్గీత సర్వ శాస్త్ర స్వరూపిణి అని సమస్త శాస్త్రార్థముల నెరిగిన వ్యాస భగవానుడు నిర్ణయించి చెప్పాడు.

ప్రస్తుతం మనం అధ్యయనం చేస్తున్న ఏకాదశాధ్యాయము లోని ఈ చరమ శ్లోకము - ***సర్వస్య గీతా శాస్త్రస్య సారభూతః అర్థః*** - సర్వ గీతా శాస్త్రానికి సారభూతమైన విషయము అని భాష్యకారులైన శ్రీ శంకర భగవత్పాదులు అభిప్రాయ పడ్డారు. కేవలం మోక్షమే ప్రయోజనంగా గలది ***(నిశ్శ్రేయసార్థః)*** అని కూడా అభిభాషించారు. కనుక, **మత్కర్మకృత్** అనే ఈ శ్లోకము సర్వ వేదాంత సిద్ధాంత సార సంగ్రహ కాంతి పుంజము.

సర్వ శాస్త్రముల సారము భగవద్గీత అయితే, భగవద్గీతా సారము ఈ **మత్కర్మకృత్** శ్లోకము. ఇంతవరకు మనం అధ్యయనం చేసిన పదకొండు అధ్యాయాల లోని విషయాన్నంతా సింహావలోకన న్యాయంగా ఈ శ్లోకము సంక్షిప్తం చేసి చూపెడుతుంది ***(సముచ్చిత్య ఉచ్యతే)***. అలాగే ఇక మనం అధ్యయనం చేయబోయే ఏడు అధ్యాయాలకు కూడా ఆముఖాన్ని ఆవిష్కరిస్తూ అద్దం పడుతుంది. గీతోపదేశ సారమైన ఈ శ్లోకము సర్వోత్కృష్ట మైనది.

భగవంతుడు మోక్ష స్వరూపుడు. భగవంతుని పొందడమే జీవు లందరి పరమ లక్ష్యము. మరి, భగవంతుని ఎవరు పొందుతారు? ఈ శ్లోకములో తెలిపిన ఐదు సాధనలను ఎవరైతే ఆచరిస్తారో, ఆచరిస్తూ భగవంతుని ఎవరైతే భజిస్తారో, వారు అంతఃకరణ శుద్ధిని, జ్ఞానమును, ఆ తరువాత మోక్షమును కూడా పొంది తరిస్తారు ***(యః సః మామ్ ఏతి)***. ఆ అయిదు సాధన లేమిటో విశ్లేషించుకుందాం.

(1) మత్కర్మకృత్

ఏ వ్యక్తి కూడా ఈ ప్రపంచానికి ఒంటరిగా రాలేదు. ప్రారబ్ధాన్ని వెంటబెట్టుకొనే వచ్చాడు. ప్రారబ్ధానికి వశుడై ప్రపంచంలో ప్రవర్తించే వ్యక్తి ప్రారబ్ధము యొక్క ప్రేరణతో కొన్ని కర్మలను అవశ్యం చేస్తూ ఉంటాడు. వాటితో పాటు అవసర నిమిత్తం నిత్యము పురుషార్థంతో మరి కొన్ని కర్మలు చేస్తూ ఉంటాడు. ఇలా కర్మ చేసేవాడు ***కర్మకృత్.*** కర్మకృత్ భగవంతుని కొరకు కర్మ నాచరిస్తే **మత్కర్మకృత్** అవుతాడు. నా కొరకు, అంటే భగవంతుడి కొరకు చేసే కర్మ మత్కర్మ. మత్కర్మ చేసేవాడు **మత్కర్మకృత్** ***(మదర్థం కర్మ మత్కర్మ, తత్ కరోతి ఇతి మత్కర్మకృత్).***

మనిషి తన కొరకు, తన వాళ్ళ కొరకు చేసే కర్మలు చాలా ఉన్నాయి. పిల్లలకు సంబంధించిన కర్మలు, భార్యకు సంబంధించిన కర్మలు, మిత్రుడికి సంబంధించిన కర్మలు, యజమానికి సంబంధించిన కర్మలు, అలాగే వ్యక్తిగతంగా తనకు సంబంధించిన కర్మలు - ఇలా చాలా ఉన్నాయి. వాటిని చేసుకుంటూ, బ్రతుకు యాత్రను సాగిస్తూ ఉంటాడు. కాని, ఇక్కడ భగవంతుని కొరకు చేసేదే **మత్కర్మ** అంటున్నాం. ఏది భగవంతునికి సంబంధించిన కర్మ? నేను చేసే కర్మతో భగవంతుని ఇష్టము, లేక అవసరము ముడిపడి ఉందా? ఏ కర్మ భగవంతునికి ప్రియం? ఏ కర్మ భగవంతునికి అవసరము?

ప్రియాలు, అవసరాలు ఉండేవాడు భగవంతుడు కాలేడు. మన కర్మతో గాని, మన కర్మఫలంతో గాని భగవంతునికి సంబంధం లేదు. కాని, భగవంతుని పొందడానికి, అనగా మోక్షార్థం మనం చేసే కర్మే 'మత్కర్మ'.

పూజ, జప, ధ్యాన, సంకీర్తనాదులు లౌకిక కర్మలు కావు. లౌకిక ఫలాలను ఆశించి ఆచరించేవీ కావు. అవి అలౌకిక కర్మలు. చిత్తశుద్ధి నిమిత్తం ఆచరింప బడేవి. అవన్నీ భగవత్సంబంధ మైనవే. ఉపాసన లన్నీ త్రివర్గములను సాధించుటకు కాకుండా, అంతఃకరణ శుద్ధి కొరకు ఆచరిస్తే అవి భగవ త్సంబంధమైన కర్మ లవుతాయి.

మత్కర్మకృత్ ఆచరించే కర్మలలో స్వార్థం ఉండదు. రాగద్వేషాలు ఉండవు. రాగద్వేషాల స్థానంలో ధర్మాధర్మాలు చేరిపోతాయి. ధర్మ రూపంలో ఉన్నది దైవమే అని భావించి, అర్థకామాల యందు స్పృహ లేకుండా ధర్మాచరణమును సాగించే వాడు **మత్కర్మకృత్.** ఈ ధర్మాచరణము కూడా పుణ్యఫల దృష్టి లేకుండా, పరలోక భోగాల యందు ఇచ్ఛ లేకుండా దైవారాధన గానే కొనసాగిస్తాడు.

ప్రపంచంలో దేనికి సంబంధించిన కర్మను ఆచరిస్తే దానికి సంబంధించిన ఫలమునే పొందుతాము అనేది అందరి అనుభవంలో ఉన్నదే. అలాగే 'మదర్థం' కర్మను ఆచరించే కర్మయోగి **(మత్కర్మకృత్)** భగవంతుణ్ణే పొందుతాడు. కర్మల ద్వారా అంతఃకరణ శుద్ధిని, అంతఃకరణ శుద్ధి ద్వారా జ్ఞానమును, జ్ఞానము ద్వారా మోక్షాన్ని, మోక్ష రూపుడైన పరమేశ్వరుని పొందుతాడు **(యః ఈదృశః మత్కర్మకృత్ సః మామ్ ఏతి).**

(2) మత్పరమః

నా కొరకే ***(మదర్థం)*** కర్మ లాచరించే **మత్కర్మకృత్** నన్నే పరమగతిగా సంభావించి ఆశ్రయిస్తాడు. అందుచేత అతడు మత్పరముడు. అంటే నన్నే పరమగతిగా పొందిన వాడు ***(మత్కర్మకృత్ మామేవ పరమాం గతిం ప్రతిపద్యతే ఇతి మత్పరమః).***

భృత్యుడు స్వామి యొక్క కర్మలు చేస్తాడు **(కరోతి భృత్యః స్వామి కర్మ).** అలాగే కర్మయోగి ఈశ్వరుని భృత్యుని వలె ***(ఈశ్వర భృత్యవత్)*** కర్మలను ఆచరిస్తాడు. భృత్యుడు యజమాని కర్మలను సంపాదన నిమిత్తం ఆచరిస్తాడే గాని, యజమానిని ఆశించి చేయడు. యజమానిని పొందాలని చేయడు. కాని, ఈశ్వర భృత్యుడైన కర్మయోగి దేనినీ ఆశించడు ఈశ్వరుణ్ణి తప్ప. అతడు ఈశ్వరుణ్ణే ఆశిస్తాడు. ఈశ్వరుని పొందాలనే భావిస్తాడు. అందుచేత కర్మఫలాల యందు స్వామి భృత్యుడు చలిస్తాడే గాని ఈశ్వర భృత్యుడు చలించడు. తనకు పరమేశ్వరుడే ఉత్కృష్టమైన, పరమమైన ఫలము.

మత్పరముడు పరమేశ్వరునే ఆశ్రయంగా పొందిన వాడు. ఆశ్రయ స్థానము, ఆసక్తి స్థానము రెండూ అతనికి భగవంతుడే. ఆధార స్థానము, ఆరాధనీయము కూడా భగవంతుడే. అనుగ్రహించే వాడు, ఆదుకొనే వాడు, అండ నిలిచే వాడు, బ్రతుకును పండించే వాడు భగవంతుడే. అతడే మత్పరముడు.

అందరి గమ్యము ఒకటే అయినా
మార్గము లన్నీ ఒకటౌనా?
చూపు లందరివి ఒకటైనా
చూచే తీరు వేరు కదా!
జ్ఞానము కలిగి చరించే వారికి
సర్వము ఈశ్వర మయము కదా!
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్

అని రామజోగి చిట్కా.

ఈ విధంగా మత్పరముడు నన్నే పొందుతాడు అంటున్నాడు భగవంతుడు ***(యః ఈదృశీ మత్పరమః సః మామేతి).***

(3) మద్భక్తః

భగవంతునితో తనకు గల నిత్య సంబంధమును గుర్తించి జీవించు వాడు భక్తుడు. అన్ని విధాల ***(సర్వ ప్రకారైః),*** పూర్ణ హృదయంతో ***(సర్వాత్మనా),*** ఉత్సాహపూరిత మైన నిండు మనస్సుతో ***(సర్వోత్సాహేన)*** భగవంతుని సేవించే వాడు మద్భక్తుడు. మత్కర్మకృత్తు, మత్పరుడు అయిన వాడు తప్పక మద్భక్తుడు కావలసిందే. భక్తుడు ఎవడో కాడు. కర్మయోగియే భక్తుడు. భక్తుడే కర్మయోగి. అలాంటప్పుడు భక్తుడు అని ప్రత్యేకించి చెప్పడ మెందుకు? అనే సందేహము రావచ్చు.

భక్తి అనేది ప్రేమ స్వరూపము. ప్రేమలో ఉత్సాహం ఉంటుంది. అనురాగం ఉంటుంది. నిరంతరాపేక్ష ఉంటుంది. ఇదంతా ప్రవాహ రూపంలో ఉంటుంది. ఇలాంటి భక్తి హృదయం ఉన్నప్పుడే కర్మయోగ మైనా, జ్ఞానయోగ మైనా శోభిస్తుంది. భక్తి లేకుండా ఏ యోగమూ సిద్ధించదు. మోక్షము ప్రాప్తించదు ***(భక్తిః వినా మోక్షో న సిద్ధ్యతి).***

భక్తి అనేది ప్రేమ స్వరూపమే కనుక ***(ప్రేమ రూపా),*** భక్తులు అనేక విధాలుగా ఉంటారు. కొందరు ధన భక్తులు. అంటే, ధనంపై ప్రేమ ఉండేవారు. కొందరు పదవీ భక్తులు. కొందరు భార్యా భక్తులు. కొందరు కీర్తి భక్తులు. ఈ విధమైన భక్తి రూపాలు ఏవీ తమను ఉద్ధరించవు అని తెలిసి, పరమేశ్వరుని యందే పరిపూర్ణమైన భక్తిని ఉంచిన వారు మద్భక్తులు ***(సా తు అస్మిన్ పరమ ప్రేమరూపా).*** మనలో భక్తి ఉంటే చాలు. మనం మద్భక్తులం కాగలిగితే చాలు. ఆ తరువాత అర్జునుని వెంట అచ్యుతు డున్నట్లు, మన వెంటే ఉంటాడు మాధవుడు.

ఏ పువ్వులో తేనె ఉన్నదో
తెలియనిదా మధుపము!
ఎవరి కుండలో వెన్న ఉన్నదో
తెలియని వాడా కృష్ణయ్య!
మనసు వెన్నగా మారిన నాడు
మన వెంటే మాధవుడు
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్ అని రామజోగి చిట్కా.

భక్తునికి కూడా సంసారం ఉంటుంది కదా! దారాసుతులు, బంధుమిత్రాదులు ఉంటారు కదా! వారిని కూడా ప్రేమించాలి కదా! అలాంటప్పుడు మద్భక్తుడు సర్వాత్మనా భగవంతుణ్ణే ఎలా ప్రేమించ గలడు? ఎలా భక్తి చేయగలడు? చేయగలడు. ఎలా? అతడు సంగవర్జితుడు కనుక.

(4) సంగవర్జితః

సంగము అంటే స్నేహము, లేదా ప్రీతి. సంగవర్జితుడు అంటే ప్రీతి లేని వాడు ***(సంగః ప్రీతిః తద్వర్జితః సంగవర్జితః).*** మత్కర్మకృత్తు, మత్పరముడు, మద్భక్తుడు సంగవర్జితుడు. అంటే ప్రీతి లేనివాడు. ఏ విషయము నందు ప్రీతి లేని వాడు? భగవంతుని కన్నా అన్యమైన సంబంధాల యందు ప్రీతి లేనివాడు. ధనము, బిడ్డలు, మిత్రులు, భార్య, బంధువర్గముల యందు ప్రీతి లేనివాడు. ఆసక్తి లేనివాడు. అతడే సంగవర్జితుడు ***(ధన పుత్ర మిత్ర కలత్ర బంధువర్గేషు సంగవర్జితః).***

పుత్ర మిత్ర కళత్రాదులు రాగహేతువులే అయినా, ఆ సంబంధాలన్నీ అనిత్యాలే అనే 'అసద్బుద్ధి' ఉండటం చేత, అవి రాగాన్ని భక్తునిలో దించలేక పోతాయి. స్వప్నము లోని సంసారం లాగా, తన బుద్ధిలో సంసారము నిస్సారమై పోతుంది. అందుచేత, పరమేశ్వరుని యందే ఆసక్తిని కలిగి, పరమోత్సాహంతో ప్రేమ స్వరూపమైన భక్తిని మద్భక్తుడు కొనసాగిస్తాడు.

బృందావన గోపాలునికి గోవు లంటే ప్రాణం. చేతిలో వేణువు ఉండాలి. వెంట ధేనువు నిలవాలి. అందుకే ఆయన గోపాలకృష్ణుడు. ప్రియమైన ఆ గోవులిచ్చే క్షీరాన్ని ప్రేమతో పానం చేసేవాడు. దధిని దండిగా జుర్రేవాడు. నవనీతాన్ని దొంగిలించి మరీ ఆరగించే వాడు. ఆయన క్షీరసాగర శయనుడే! ఆయనకు క్షీరము అవసరమా? అవసరం లేకపోవచ్చు. కాని, ధేనువు లిచ్చే క్షీరానికి, క్షీరసాగరం లోని క్షీరానికి పోలికే లేదు. గోకులంలో గోవులు ఇచ్చింది పాలు కాదు. ప్రేమామృతం. భక్త్యామృతం. అందుకనే, అచ్యుతుడు కోరి మరీ పానం చేసేవాడు.

గోకుల ధేనువుల పొదుగులలో పుష్కలంగా పాలు నిండి ఉండేవి. అలాగే ఉంటే వాటిని గోకులవాసులు పిండు కుంటారని, గోవత్సములు త్రాగేస్తా యని, తొందర తొందరగా పాలు పిదుకక ముందే ***(అదుగ్ధాః).*** అవి చెంగుచెంగున గంతులు వేస్తూ బాలకృష్ణుని వద్దకు వెళ్ళి పొదుగులను నోటికి అందించేవి. గోపాలుడు ప్రియంగా వాటిని పానం చేసేవాడు.

భక్త ధేనువులు సంగవర్జితులు కావడం చేత, తమ బిడ్డలైన గోవత్సముల యందు రాగబుద్ధి నశించి, బిడ్డల కివ్వవలసిన క్షీరాన్ని బాలకృష్ణునికి ఇవ్వాలని పరుగులు తీసేవి. అలాంటి అనన్య భక్తిని మనమూ అలవరచుకోవాలి. అట్టి పరమ ప్రేమని ప్రసాదించ మని పరమేశ్వరుని నిండు మనస్సుతో ప్రార్థించాలి.

అభి త్వా శూర నోనుమో౽ దుగ్ధా ఇవ ధేనవః।
ఈశాన మస్య జగతః స్వర్దృశ మీశాన మిన్ద్ర తస్థుషః॥

ఇంద్రా=ఓ ప్రభూ! పరమేశ్వరా!, శూర=ఓ శూరుడా! కృష్ణా!, త్వా=నిన్ను, అభి=అంతట, నోనుమః=నమస్కరిస్తున్నాము, స్వర్దృశమ్ అస్య జగతః=ఈ జగత్తుకు (జంగమమునకు), తస్థుషః=స్థావరమునకు, ఈశానం= నియామకుని, స్వర్దృశమ్ =ప్రపంచాన్ని ప్రకాశింప చేయు వానిని, అదుగ్ధాః=పాలు పిదుకని, ధేనవ ఇవ=గోవుల వలె (నమస్కరిస్తున్నాము).

'భగవాన్! శ్రీకృష్ణా! స్థావర జంగమాత్మక మైన ఈ ప్రపంచానికి సత్తా స్ఫూర్తి ప్రదాతవైన నిన్ను, పాలు పిదుకని గోవులు ఎలా సేవించాయో, అలాగే మేమూ నిన్ను అంతటా నమస్కరిస్తున్నాము.'

విషయ సంగత్వమును వీడి భగవత్సన్నిధికి భక్తితో ధేనువులు చేరాయి కనుక, ఆయన వాటి క్షీరాన్ని

పానం చేసి మోక్షాన్ని ప్రసాదించాడు. మనం కూడా రాగరహితులమై మన హృదయాల లోని ప్రేమ క్షీరాన్ని పరమాత్మకే సమర్పిస్తే, మన బ్రతుకులు కూడా ఒడ్డుకు చేరుతాయి.

చరణము: **క్షీరసాగర శయనా! క్షీరమె నీకు కావలెనా?**
వేదము కదిలిన నోటికి వెన్నలు మన్నులు కావలెనా?
పాల కడలిలో వెన్నకుండలలో ఉన్నది ప్రేమే చల్లన
తేనెల కన్నా తియ్యన!
పల్లవి: **పావన యమునా జలములు చల్లన!**
మోహన కృష్ణుడు నల్లన - మన
మోహన కృష్ణుడు నల్లన ! **॥ పావన ॥**

అని గోకుల క్షీర వైభవాన్ని కీర్తించింది చైతన్య గీతిక.

(5) సర్వుల యందు నిర్వైరుడు

పరమేశ్వరుని పొందగోరు వాడు హృదయంలో శత్రు భావము లేనివాడై ఉండాలి. అదే నిర్వైరము. నిర్వైరము అంటే నిర్గత వైరము ***(నిర్వైరః నిర్గత వైరః).*** ఎవరి విషయంలో వైరము లేనివాడు? ఎవరి విషయం లోనూ శత్రు భావన లేనివాడు ***(సర్వభూతేషు శత్రు భావ రహితః).*** బంధుమిత్రాదుల యందు, ప్రియమైన వారి యందు, ఉపకారము చేసిన వారి యందు శత్రు భావన లేకుండా ఉండటం సహజం. కాని, తనకు అపకారం చేసిన అయిష్టుల యందు కూడా శత్రు భావన లేకుండా ఉంటాడా? ఉంటాడు. తనకు ఎంతగానో అపకారం చేయడానికి ప్రయత్నించిన వారి యందు, అలా ప్రవర్తించిన వారి యందు కూడా కించిత్తు వైర భావము లేనివాడు ***నిర్వైరః (ఆత్మనః అత్యన్త అపకార ప్రవృత్తే ష్వపి).*** అంతటా పరమేశ్వర భావన కలిగిన వాడు ఎవరిని ద్వేషించ గలడు? ఎలా ద్వేషించ గలడు? ఉపకారులలో, అపకారులలో ఉన్న ఒకే పరమేశ్వరుని దర్శించే మత్పరముడు మద్భక్తుడు కావడం చేత ఎవ్వరినీ గర్హించలేడు. వైరాన్ని ఊహించలేడు. రాగం ఉంటేనే ద్వేషం ఉంటుంది. ద్వేషం ఉంటేనే వైరము ఉంటుంది. రాగద్వేష రహితుడైన భక్తుడు శత్రుభావ రహితుడయ్యే ఉంటాడని ప్రత్యేకంగా చెప్ప నవసరం లేదు.

పరమేశ్వరుని పొందే వాని లక్షణాలను ప్రస్తుతం మనం అధ్యయనం చేస్తున్నాం. పరమాత్మను పొందాలి అంటే, పరమాత్మ లక్షణాలు అతనిలో కూడా నిండి ఉండాలి కదా!

సమోఽహం సర్వభూతేషు న మే ద్వేష్యోఽస్తి న ప్రియః

'నేను సర్వుల యందు సమంగా ఉంటాను. నాకు ద్వేషింప దగిన శత్రువు లేడు. ప్రేమించ దగిన ఇష్టుడు లేడు' అని తొమ్మిదవ అధ్యాయంలో భగవంతుడు ప్రవచించాడు కదా! ద్వేషమే తెలియని భగవంతుని పొందాలి అంటే, మనం కూడా ద్వేష భావం లేని వారమై ఉండాలి.

కట్టినారు కొందరు కొట్టినారు
పట్టినారు కొందరు పెట్టినారు
అందరిని సమముగా చూచినావు
నీ అడుగుల కడ పడి ఉందు చిన్నికృష్ణా!

అని చిన్నికృష్ణ శతకంలో ఒక వెన్నముద్ద.

భగవత్ప్రాప్తి

అర్జునా! నా కొరకే కర్మలు చేయువాడు, నన్నే పరమగతిగా కలవాడు, నా యందే భక్తి కలవాడు, విషయ సంగత్వము పూర్తిగా లేనివాడు, సర్వ భూతముల యందు శత్రుభావము లేనివాడు నన్నే పొందుతాడు అంటూ ఏకాదశాధ్యాయాన్ని సమాప్తం చేస్తున్నాడు భగవంతుడు.

పరమేశ్వరుడు తనకు అత్యంత ప్రియమైన ఉపదేశాన్ని, తనకు అత్యంత ప్రియుడు, భక్తుడు అయిన అర్జునునికి ఉపదేశించాడు. 'పార్థా! నువ్వు తెలుసుకోదగిందే నేను ఉపదేశించాను. నేను ఉపదేశించిందే నువ్వు తెలుసు కున్నావు. నువ్వు అడిగిందే నేను అందించాను. ఇంతకు మించిన వేరే విషయమే లేదు' అంటూ భగవంతుడు విశ్వరూప సందర్శన యోగాన్ని సమాప్తి చేస్తున్నాడు ***(అయం తవ ఉపదేశః ఇష్టః మయా ఉపదిష్టః హే పాండవ! ఇతి).***

భక్తియే ముక్తి

గమ్యాన్ని విడిచి మార్గం ఉండదు. ముక్తి సాధానికి భక్తియే సూటియైన మార్గం. భక్తి లేని ముక్తిని ఊహించడం సాధ్య పడదు. ఎన్ని శాస్త్రాలు అధ్యయనం చేసినా, మరెన్ని కఠోర సాధనలు అనుష్ఠించినా, భక్తి లేని వాడు ముక్తిని పొందలేడు.

చిత్రకారుడు తన చిత్రకళా నైపుణ్యము చేత అందమైన కమలాన్ని చిత్రించ గలడేమో గాని, దాని నుండి పరిమళాన్ని ఆఘ్రాణించ గలడా?

సప్తాశ్వముల నమర్చిన రథముపై సూర్య భగవానుడు ప్రకాశిస్తున్నట్లు, సుందరమైన చిత్రాన్ని చిత్రకారుడు గీయగల డేమో గాని, దాని నుండి కాంతిని ప్రసరింప చేయగలడా? ఇదీ అంతే.

భక్తి లేకుండా కేవలం పాండిత్యముతో శాస్త్రాలను హృదయస్థం చేసుకొనే వాడు, శాస్త్ర విషయాన్ని మనోఫలకంపై చిత్రించుకోగల డేమో గాని, బ్రహ్మానందానుభూతిని పొంద గలడా? పొందలేడు. అది అనన్య భక్తి చేతనే సిద్ధిస్తుంది. ఇదే ఏకాదశాధ్యాయం లోని సారభూతమైన విషయము.

దేవై రపి సుదుర్దర్శం తపోయజ్ఞాది కోటిభిః ।
భక్తాయ భగవానేవం విశ్వరూపం అదర్శయత్ ॥

దేవతలకు కూడా చూడ శక్యము కానిది, తపస్సు, యజ్ఞము మొదలైన కోటి సాధనల ఫలితంగా కూడా చూడ నశక్యమైన విశ్వరూపాన్ని భక్తుడు కావడం చేత అర్జునునికి భగవంతుడు చూపించాడు.

ఇక మనం చెయ్యవలసింది, చూడవలసింది మాత్రమే మిగిలి ఉంది. అదే భక్తి. తరువాత ప్రసంగ విషయం అదే.

ఓం.. ఓం.. ఓం..

ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం
యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే విశ్వరూప సందర్శన యోగో నామ ఏకాదశోఽధ్యాయః

ఈ విధంగా ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రము, శ్రీకృష్ణార్జున సంవాదము అయిన భగవద్గీత యందు విశ్వరూప సందర్శన యోగ మనే పదకొండవ అధ్యాయము.



చైతన్య భగవద్గీత

అథ ద్వాదశో౽ధ్యాయః - పన్నెండవ అధ్యాయము

భక్తియోగః - భక్తియోగము

సందర్భము - సందేహము

పూర్వాధ్యాయం విశ్వరూప సందర్శన యోగము లోని **మత్కర్మకృత్** అనే చరమ శ్లోకం పన్నెండవ అధ్యాయమైన భక్తి యోగానికి బీజ శ్లోక మైంది. ఈ శ్లోకం లోని మచ్ఛబ్దార్థము సూచించేది సగుణ బ్రహ్మమునా లేక నిర్గుణ బ్రహ్మమునా? అనేది సందేహము. అసలు ఈ సందేహము ఎందు కొచ్చింది? ఎక్కడ నుండి పుట్టింది?

తేషాం జ్ఞానీ నిత్యయుక్తః ఏకభక్తి ర్విశిష్యతే - నాలుగు రకాలైన భక్తులలో జ్ఞాని శ్రేష్ఠుడు అని ఏడవ అధ్యాయంలో ప్రవచించాడు భగవంతుడు *(7 - 17)*.

శ్రద్ధావాన్ భజతే యో మాం స మే యుక్తతమో మతః - శ్రద్ధావంతుడై నన్నే సేవించు యోగి మిక్కిలి శ్రేష్ఠుడు అని నా అభిప్రాయము అని ఆరవ అధ్యాయంలో చెప్పడం జరిగింది *(6 - 47)*. మరి, ఈ ఇరువురిలో ఎవరు శ్రేష్ఠుడు? జ్ఞాని శ్రేష్ఠుడా? లేక యోగి శ్రేష్ఠుడా? అనేది సంశయము.

ఉదారా స్సర్వ ఏవైతే జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్ - అందరూ శ్రేష్ఠులే అయినా జ్ఞాని మాత్రము నేనే అని నా అభిమతం అని ఏడవ అధ్యాయం లోను *(7 - 18)*, **పురుష స్స పరః పార్థ భక్త్యా లభ్య స్త్వనన్యయా** - అనన్యమైన భక్తి చేతనే పురుషోత్తము డైన భగవంతుడు లభ్య మవుతాడు అని ఎనిమిదవ అధ్యాయం లోను *(8 - 22)* ప్రవచించడము చేత, భక్తుడైన కర్మయోగి శ్రేష్ఠుడా? లేక ఆత్మజ్ఞాని శ్రేష్ఠుడా? అనే సందేహం సవ్యసాచిని ఆవరించింది.

అదలా ఉండగా,

విశ్వరూప సందర్శన యోగాన్ని సమాప్తం చేస్తూ, చరమ శ్లోకంలో మచ్ఛబ్దాన్ని పదే పదే ప్రయోగించి, తొమ్మిదవ అధ్యాయాన్ని మచ్ఛబ్ద ప్రయోగంతో సమాప్తం చేసినట్లే, పదకొండవ అధ్యాయాన్ని కూడా సమాప్తం చేయడం జరిగింది. ఇంతకీ ఈ మచ్ఛబ్దం సాకారాన్ని ప్రతిపాదిస్తూ ఉందా? నిరాకారాన్ని సూచిస్తూ ఉందా? అనేది పార్థుని సంశయము. అందుచేత, వ్యక్తావ్యక్తాలను ఉపాసించే వారిలో **తేషాం కే యోగవిత్తమాః** - ఎవరు యోగవిత్తములు? అని అర్జునుడు ప్రశ్నించడంతో పన్నెండవ అధ్యాయము ప్రారంభ మవుతూ ఉంది. ఈ ప్రశ్న క్రొత్తగా అనిపించినా, సందేహము మాత్రం క్రొత్తది కాదు.

వెంటే ఉంది

యుద్ధకర్మలో ప్రవేశించడమా? యుద్ధాన్ని విరమించి సన్యసించడమా? అనే సందేహం కురుక్షేత్రంలో కాలు మోపిన క్షణం నుండి కౌంతేయుణ్ణి పట్టి పీడిస్తూనే ఉంది. ఈ సంశయాన్ని రెండవ అధ్యాయం లోనే భగవంతుడు నివారించడం జరిగింది. అయినా అర్జునుని మనస్సు కుదుట పడలేదు.

జ్ఞానము కర్మ కంటే శ్రేష్ఠ మైనపుడు, భయంకరమైన ఈ యుద్ధకర్మలో నన్నెందుకు నియోగిస్తున్నావు? అని మూడవ అధ్యాయారంభం లోనే అర్జునుడు ప్రశ్నించాడు. పైగా, విషయాన్ని కలగాపులగం చేసి, తనను

శ్రీకృష్ణుడే కలత పెడుతున్నట్లు అభియోగం కూడా మోపాడు. దీని ఫలితమే మూడవ అధ్యాయమైన కర్మ యోగము. అక్కడ కర్మయోగ, సన్యాసములు రెండూ జ్ఞానానికి ఎలా ఉపకరిస్తాయో స్పష్టం చేయడం జరిగింది. ఈ క్రమంలో యోగ, సన్యాసాల వైశిష్ట్యాన్ని మూడు, నాలుగు అధ్యాయాలలో భగవానుడు వివరించడం కూడా జరిగింది. ఇంత చెప్పినా, అయిదవ అధ్యాయంలో మళ్ళీ అదే సందేహాన్ని మరో రూపంలో అర్జునుడు వ్యక్తం చేయడం జరిగింది.

'కృష్ణా! కర్మయోగాన్ని, కర్మసన్యాసాన్ని నువ్వు పదే పదే చెబుతున్నావు. ఈ రెండిటిలో ఏది శ్రేయస్కరమో దానిని నిశ్చయంగా చెప్పు' అని ఐదవ అధ్యాయం ప్రథమ శ్లోకం లోనే మళ్ళీ ప్రశ్నించాడు అర్జునుడు.

యోగము, సాంఖ్యము వేరు కాదని, రెండిటి గమ్యము ఒక్కటే నని, ఈ రెండిటిని అభిన్నంగా దర్శించే వాడే సత్యద్రష్ట అని ఐదవ అధ్యాయంలో చెప్పడం జరిగింది.

మళ్ళీ మొదటి కొచ్చింది

అనుష్ఠాన పద్ధతులైన కర్మయోగ, జ్ఞానయోగాలను నిష్ఠాద్వయంగా పరమేశ్వరుడు ప్రతిపాదించిన తరువాత, ఈ రెండిటిలో ఏది శ్రేయస్కరము? అని అర్జునుడు ఏ సందేహాన్నైతే విడిచి పెట్టకుండా భగవంతునికి వినిపిస్తూ ఉన్నాడో, దానినే పన్నెండవ అధ్యాయంలో కూడా మరో కోణం నుండి వినిపిస్తున్నాడు.

పూర్వం అనుష్ఠాన పద్ధతులైన కర్మయోగ, సన్యాసాల మధ్య తరతమ భేదాన్ని చూచిన వాడు, ప్రస్తుతం అదే తరతమ భేదాన్ని అంతరంగ సాధనల మధ్య కూడా చూస్తూ ప్రశ్నిస్తున్నాడు. ఉపాసనకు సగుణము శ్రేష్ఠమా, నిర్గుణము శ్రేష్ఠమా? అని ప్రశ్నిస్తున్నాడు.

యోగము - జ్ఞానము

కర్మయోగి కర్మానుష్ఠానంలో ఉంటూ, పరమేశ్వరుడే గమ్య మని భావిస్తూ, ఈశ్వరార్పణ బుద్ధితో కర్మలను నైవేద్యాలుగా సమర్పిస్తూ, కర్మఫలాలను ప్రసాదాలుగా స్వీకరిస్తూ, స్వామి భృత్య న్యాయానుసారం, సాకారమూర్తిని సేవిస్తూ జీవితాన్ని కొనసాగిస్తాడు. అనన్య శరణ్యుడై జీవిస్తాడు. ఇది సగుణోపాసన. అంటే, సగుణ ధ్యానము. సగుణ బ్రహ్మ విషయ మానస వ్యాపారము.

అలా కాకుండా, సర్వ కర్మలను విడిచిపెట్టి - ఉపాధి శూన్యము, అక్షరము, అవ్యక్తము అయిన పరబ్రహ్మ స్వరూపాన్ని ఉపాసించే జ్ఞానయోగులు ఆచరించేది నిరాకారోపాసన లేదా నిర్గుణోపాసన.

రూప దర్శనం చేస్తూ ఉపాసించే కర్మయోగులు సాకారోపాసకులు లేదా సగుణారాధకులు. రూపాన్ని దాటి స్వరూపాన్ని ఉపాసించే జ్ఞానయోగులు నిరాకారోపాసకులు లేదా నిర్గుణోపాసకులు.

వ్యక్తాన్ని దర్శించి భక్తి చేసే వారు కర్మయోగులు. అవ్యక్తాన్ని అవగాహన ద్వారా, అంటే శ్రవణ మనన నిదిధ్యాసనల ద్వారా అర్థం చేసుకొని అనుభూతిని పొందే వారు జ్ఞానయోగులు. కర్మయోగులది విశ్వరూపోపాసన. జ్ఞానయోగులది అక్షరోపాసన.

పూర్వం వీరిరువురి జీవన విధానాలలో ***(నిష్ఠాద్వయం)*** ఏది శ్రేయస్కరం? అని ప్రశ్నించిన పార్థుడు, ప్రస్తుతము వీరిరువురి ఉపాసనలలో లేదా ధ్యానాలలో ఏది శ్రేయస్కరము? అని అడుగు తున్నాడు. సతత యుక్తులై, పరమేశ్వరుని ఉపాసించే కర్మయోగులు యోగశ్రేష్ఠులా? ***(సతత యుక్తాః యే భక్తాః త్వాం పర్యుపాసతే).*** లేక, అక్షరము అవ్యక్తము అయిన పరబ్రహ్మమును ఉపాసించే జ్ఞానయోగులు యోగశ్రేష్ఠులా? ***(యే తు అక్షరం అవ్యక్తం పర్యుపాసతే).*** వీరిరువురిలో యోగవిత్తములు ఎవరు? ***(తేషాం కే యోగవిత్తమాః, ఉభయేషాం మధ్యే, కే***

అతిశయనే యోగవిదః ఇత్యర్థః). కనుక మూడవ అధ్యాయం నుండి ఏ సంశయాన్ని ప్రస్తావిస్తూ పార్థుడు ప్రశ్నిస్తున్నాడో, దానినే ఇక్కడ ఉపాసనా పరంగా ప్రశ్నిస్తున్నాడు. అంతే తేడా. ఆహార్యాలు వేరే అయినా అభినయం మాత్రం ఒక్కటే.

రెండవ అధ్యాయంలో **అశోచ్యా నన్వ శోచస్త్వం** అనే శ్లోకం నుండి పదవ అధ్యాయం విభూతి యోగం వరకు నిరుపాధిక మైన జ్ఞేయబ్రహ్మ విషయమే ప్రధానంగా ప్రస్తావించ బడింది. ప్రతిపాదించ బడింది. అక్కడక్కడ సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు, సృష్టి స్థితి లయ కారకుడు అయిన ఈశ్వరుని వైభవము, ఉపాసన కూడా చెప్పబడ్డాయి. ఇక పదకొండవ అధ్యాయమైన విశ్వరూప సందర్శన యోగములో ప్రదర్శింప బడిన విశ్వరూపము కూడా ఆద్యము ఉపాసనార్థమే చెప్పబడింది. విశ్వరూప దర్శనాన్ని ఉపసంహరించిన తరువాత, అధ్యాయాంతంలో **మత్కర్మకృత్** అంటూ చెప్పడం జరిగింది. కనుక ఈ ఉభయ వర్గాలలో ఏది శ్రేయస్కరమో, ఈ రెండు పక్షాలలో ఎవరు శ్రేష్ఠులో తెలుసుకోవాలనే ఆకాంక్ష అర్జునునిలో ఏర్పడింది. ఈ విధంగా పన్నెండవ అధ్యాయంలో ప్రశ్న రూపంగా మొదలైన ప్రథమ శ్లోకానికి పూర్వాధ్యాయం లోని చరమ శ్లోకం బీజ శ్లోకమైంది.

రూపం - స్వరూపం

రూపం అంటే విశ్వరూపం. లేదా, విశ్వం లోని రూపం. రూపోపాసన అంటే, విశ్వరూపోపాసన. లేదా, విశ్వం లోని రూపోపాసన. రూపం ఎవరిది? రూపం ఎవరిదో అతడు రూపి. రూపము ఏదైనా అది రూపిదే.

రూపం రూపిదే కనుక, రూపం ద్వారా రూపి తెలియ బడతాడు. కాని, రూపి యొక్క స్వరూపానికి రూపం లేదు. రూపం వ్యక్తం; స్వరూపం అవ్యక్తం. రూపం క్షరం; స్వరూపం అక్షరం. రూపం అనేకం; స్వరూపం ఏకం.

రూపం వ్యక్తం కనుక, దానిని ఉపాసించ వచ్చు. కాని, స్వరూపం అవ్యక్తం. అవ్యక్తాన్ని ఉపాసించేది ఎలా? కనుక, ఇక్కడ వాస్తవానికి స్వరూపాన్ని అర్థం చేసుకోవడమే గాని ఉపాసించడ మనేది ఉండదు. ఉపాసించే వాని స్వరూపమే అవ్యక్తం కనుక, అక్కడ ఉన్నది జ్ఞానమే గాని ఉపాసన కాదు. సగుణ బ్రహ్మోపాసన చేసే వారు కర్మయోగులు. నిర్గుణ బ్రహ్మ విచారము చేసే వారు జ్ఞానయోగులు. అలాంటప్పుడు, ఉభయులలో యోగవిత్తము లెవరు? అనే ప్రశ్న ఎలా పుడుతుంది?

కర్మయోగ, ఉపాసనల ద్వారా శుద్ధిపడిన అంతఃకరణము జ్ఞానమును, తద్వారా మోక్షమును పొందుతుంది. కనుక, ఇక్కడ సోపానక్రమంగా ప్రస్థానము సాగే టప్పుడు తరతమ భేద ప్రసక్తి ఎలా తలెత్తు తుంది? రెండూ అవశ్యం మోక్ష సాధనాలే కనుక ఏది శ్రేష్ఠము అనే ప్రశ్నే ఉత్పన్నం కాదు. తాను దేనికి సరిపోతాడు, లేదా తన కేది సరిపోతుంది? అనేది అర్థం చేసుకొని, అక్కడ సరిపడి ఉండేవాడు శ్రేష్ఠమైన మార్గంలో ఉన్నాడని అర్థము.

మనం మార్గాన్ని అనుసరించేది గమ్యం చేరడానికి. చేరవలసింది గమ్యమునే అయినా, మార్గాన పడి పోతే గాని గమ్యం చిక్కదు. శ్రేష్ఠ మైనది గమ్యమే అయినా, మార్గం లేకుండా గమ్యం ప్రాప్తించదు. శ్రేష్ఠమైన గమ్యాన్ని చేర్చే మార్గము కూడా శ్రేష్ఠమే కదా!

పొంద దగినది జ్ఞానమే అయినా, చిత్తశుద్ధి లేకుండా జ్ఞానం సిద్ధించదు. చిత్తశుద్ధి కర్మయోగం ద్వారానే లభిస్తుంది. ప్రశస్తమైన జ్ఞానాన్ని పొందడం పవిత్ర మైతే, అట్టి జ్ఞానాన్ని పొందడానికి ఉపకరించే చిత్తశుద్ధిని ప్రసాదించే కర్మయోగము పవిత్రం కాకుండా ఎలా ఉంటుంది? మరి ఈ రెండిటిలో ఏది శ్రేష్ఠము అంటే ఏం చెప్పగలం? జ్ఞాననిష్ఠుల చేత ఏ స్థానం పొంద బడుతుందో, కర్మయోగుల చేత అదే పొంద బడుతుంది

(5-5) అని పూర్వం మనం గ్రహించినట్లే, అవ్యక్తోపాసకు లైన జ్ఞానభక్తులు దేనిని పొందుతారో, విశ్వరూపోపాసకు లైన సగుణ భక్తులు కూడా దానినే పొందుతారు అని ఇక్కడ గ్రహించ వలసి ఉంటుంది. ఉపాసనా ప్రధానమైన ఈ ప్రశస్తమైన విషయాన్ని ప్రముఖంగా ఈ భక్తియోగము అనే పన్నెండవ అధ్యాయంలో చర్చించడము జరుగుతుంది.

భక్తి యోగము

సా తు అస్మిన్ పరమ ప్రేమ రూపా - భగవంతుని యందు ఉత్కృష్టమైన ప్రేమను కలిగి ఉండటమే భక్తి అని నారదమహర్షి నిర్వచించాడు.

సా పరానురక్తిః ఈశ్వరీ - పరమేశ్వరుని యందు అత్యంత అనురాగమును కలిగి ఉండటమే భక్తి అని శాండిల్య మహర్షి నిర్వచించాడు. కనుక, భక్తి సూత్రకారు లైన ఈ ఇరువురు మహర్షులు ప్రవచించిన విషయమును బట్టి భక్తులకు భగవంతునిపై గల ప్రేమానురాగాది జ్ఞానాతిశయమే భక్తి అని అర్థమవుతూ ఉంది. భవ్య మైనది, భద్ర మైనది భక్తియే అనేది నిర్వివాదాంశము. అందుచేత, **సర్వాత్ము హరిన్ నమ్మి సజ్జనుడై *యుండుట భద్రమంచు! తలతు*** అని ఆంధ్ర మహాభాగవతము - సప్తమ స్కంధము.

స్వస్వరూపాను సంధానం భక్తి రిత్యభిధీయతే - మోక్ష సాధనములలో శ్రేష్ఠ మైనది భక్తి ఒక్కటే అని చెబుతూ, పరమాత్మ స్వరూపమును అనుసంధానం చేస్తూ స్వస్వరూప స్థితిలో ఉండటమే భక్తి అని శ్రీ శంకరాచార్య స్వామి నిర్వచించారు.

ఇదంతా చూస్తే భక్తి సగుణము, నిర్గుణము కూడా అని అర్థ మవుతూ ఉంది. సాకార భక్తులు విశ్వరూప ధ్యానాన్ని సాగిస్తే, నిరాకారమును ఉపాసించే నిర్గుణ భక్తులు ఆత్మధ్యానాన్ని కొనసాగిస్తారు. రెండిటి యొక్క ఫలము బ్రహ్మాత్మజ్ఞానమే కనుక, సగుణ నిర్గుణాల మధ్య భేదము గాని, తరతమ భావ భేదాలు గాని ఉండేందుకు వీలు లేదు. కనుక పూర్వాధ్యాయ చరమ శ్లోకంలో ప్రముఖంగా ప్రస్తావించబడిన మచ్ఛబ్దము యొక్క అర్థము సగుణానికి వర్తిస్తుంది. నిర్గుణము లోనూ ప్రవర్తిస్తుంది. సప్తమాధ్యాయము నుండి ప్రతిపాదింప బడుతూ వస్తున్న తత్పద వాచ్యార్థము ప్రస్తుతము తత్పదార్థ శోధన రూపమైన ఉపాసనా కాండమును పూర్తి చేయడంతో స్పష్ట మవుతూ ఉంది. ఇంతటితో ద్వితీయ షట్కము సమాప్త మవుతుంది.

ద్వాదశాధ్యాయము

ఇది ద్వాదశాధ్యాయము. పన్నెండవ అధ్యాయము. భక్తియోగము. భక్తి భగవత్స్వరూపము. అమృత స్వరూపము. స్వయంప్రమాణము. స్వయం ఫలరూపము. అనుభవరూపము.

భగవ త్స్వరూపమైన భాగవతము ద్వాదశ స్కంధాలతో ప్రకాశిస్తూ ఉంది. భగవానుడైన శ్రీకృష్ణదేవుని దివ్య మంత్రము ***ఓం నమో భగవతే వాసుదేవాయ*** ద్వాదశాక్షరీ మహామంత్రమై, ద్వాదశాదిత్య తేజంతో ప్రకాశిస్తూ ఉంది.

ఈ అధ్యాయంలో భగవంతుని రూప స్వరూపాలు వర్ణింపబడ్డాయి. భక్తి సాధనలతో పాటు, భక్తుని లక్షణాలు కూడా దివ్యంగా ప్రవచింప బడ్డాయి. భగవంతుని స్వరూపాన్ని తెలుసుకోవడానికి ***(జ్ఞాతుం శాస్త్రతః)***, తెలుసుకోవడమే గాక యథార్థంగా దర్శించడానికి ***(ద్రష్టుం తత్త్వతః)***, దర్శించి భగవంతునిలో ప్రవేశించడానికి ***(తత్త్వేన ప్రవేష్టుం)*** ఈ అధ్యాయం దారిదీపమై శోభిస్తుంది. దివ్యదీపమై భాసిస్తుంది. ఈ దీపానికి కావలసిన వస్తువు లన్నీ పూర్వాధ్యాయ చరమ శ్లోకంలో సూక్ష్మ రూపంలో అందించ బడ్డాయి. దీపం ప్రకాశించడానికి (1)ప్రమిద (2) వత్తి (3) తైలము (4) జ్వాల (5) గాలి ఎలా అవసరమో, జీవనజ్యోతి శోభించడానికి మత్కర్మకృత్

అనే ప్రమిద, మత్పరమ మనే వత్తి, మద్భక్తి అనే తైలము, సంగరాహిత్య మనే జ్వాల, సర్వభూతముల యందు నిర్వైర మనే గాలి అవసరమై ఉన్నాయి. అన్నీ సమకూర్చుకో బడ్డాయి. ఇక, దీపాన్ని వెలిగించి దర్శించినట్లు ఈ అధ్యాయంలో భక్తి స్వరూపాన్ని దర్శించడమే మిగిలి ఉంది. అర్జుని ప్రశ్నతో దర్శనానికి తెర తొలగింది.

అర్జున ఉవాచ :

ఏవం సతతయుక్తా యే భక్తా స్త్వాం పర్యుపాసతే ।
యే చా ప్యక్షర మవ్యక్తం తేషాం కే యోగవిత్తమాః ॥ 1

ఏవం-సతతయుక్తాః-యే-భక్తాః-త్వాం-పర్యుపాసతే
యే-చ-అపి-అక్షరం-అవ్యక్తం-తేషాం-కే-యోగవిత్తమాః

ఏవం	=	ఈ విధముగా	అవ్యక్తం	=	వ్యక్తము గాని
సతతయుక్తాః	=	సదా నీ యందే చిత్తమును ఉంచి	అక్షరం అపి	=	అక్షర బ్రహ్మమును
యే	=	ఎవ్వరయితే	పర్యుపాసతే	=	ఉపాసిస్తున్నారో
భక్తాః	=	భక్తులు	తేషాం	=	వారలలో
త్వాం	=	నిన్ను	కే	=	ఎవరు
పర్యుపాసతే	=	ఉపాసిస్తున్నారో	యోగవిత్తమాః	=	యోగము నెరిగిన వారు
యే చ	=	ఎవరైతే			

అర్జునుడు అడుగుతున్నాడు :
భగవంతా! శ్రీకృష్ణా! నిరంతరము నీ యందే చిత్తము నుంచి కొందరు భక్తులు నిన్నే ఉపాసిస్తూ ఉంటారు. మరి కొందరు అక్షరము, అవ్యక్తము అయిన పరబ్రహ్మమును ధ్యానిస్తూ ఉంటారు. ఈ ఇద్దరిలో ఉత్తమ యోగు లెవరు?

వ్యాఖ్య

సవ్యసాచి సంశయము

ఉపాసనా ప్రధానమైన విషయాన్ని ప్రశ్న రూపంలో ప్రస్తావిస్తూ **ఏవం** అంటూ శ్లోకాన్ని ప్రారంభించాడు అర్జునుడు. **ఏవం** అంటే 'ఈ విధంగా, ఈ ప్రకారం' అని అర్థము. అంటే, ఈ విషయానికి ముందు సమీపంగా ఏది ఉందో అదే **ఏవం** శబ్దం చేత పరామర్శింప బడుతూ ఉంది. అదే పూర్వాధ్యాయం లోని చివరి శ్లోక విషయాలైన **మత్కర్మకృత్** మొదలైన సాధనలు.

మత్కర్మకృత్వము మొదలైన సాధనల చేత సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు, సర్వవ్యాపి, సృష్టి స్థితి లయాది హేతువు అయిన పరమేశ్వరుని అర్జునుడు దర్శించినట్లు విశ్వరూపిగా కాని, లేదా విశ్వము లోని రూపాలలో ఏదో ఒక రూపంగా గాని, లేదా అవతార మూర్తుల రూపాలలో గాని ఉపాసించడం సోపాధిక ధ్యానము. ఉపాధి సహిత సవిశేష ధ్యానము. ఇదే సగుణోపాసనము లేదా సాకారోపాసనము. ఈ విధమైన **(ఏవం)** సాకార ధ్యానమును నిరంతరము కొనసాగిస్తూ **(సతతయుక్తాః)**, కేవలం పరమేశ్వరునే ఆశ్రయించుకొని జీవించే భక్తులు **(భక్తాః)** సోపాధిక బ్రహ్మమును ఉపాసిస్తున్నారు.

అలా కాకుండా, మరి కొందరు సర్వ కర్మలను సన్యసించి, ఉపాధి రహితము, అవ్యక్తము అయిన అక్షర పరబ్రహ్మమును నిర్విశేషంగా ఉపాసిస్తున్నారు. మొదటి వారు భక్తులు, లేదా కర్మయోగులు. రెండవ తెగ వారు జ్ఞానులు, లేదా సన్యాసులు.

భక్తులకు సోపాధిక బ్రహ్మము ధ్యేయ వస్తువు కాగా, జ్ఞానులకు నిరుపాధిక బ్రహ్మము జ్ఞేయ వస్తువు. వీరిరువురిలో ఉత్తమ యోగులు ఎవరు? అనేది అర్జునుని ప్రశ్న. విశ్లేషించి అర్థం చేసుకుంటే, వారిరువురిలో ఎవరు గొప్ప యోగులు అనేది అర్జునుని ఉద్దేశం కాదు. ఈ రెండు ఉపాసనలలో ఏది సుకరము, మోక్షానికి సన్నిహితము అనేది అర్జునుని భావము. పరమేశ్వరుడు ఈ ఉభయ సాధనలను ఉపదేశించి ఉండటమే ఈ భావానికి ఆధారము.

ఇంతవరకు మనం చేసిన అధ్యయనాన్ని బట్టి చూస్తే, గీతలో ఆద్యమూ, సమస్తమూ అక్షర పరబ్రహ్మమే ప్రధాన విషయంగా చర్చింప బడింది. పది, పదకొండవ అధ్యాయాలు సోపాధికమైన పరమేశ్వర స్వరూపాన్ని ప్రధానంగా ప్రస్తావించాయి. వాటితో పాటు అక్కడక్కడ ఇతర అధ్యాయాలలో కూడా ఈశ్వరోపాసన చెప్పడం జరిగింది ***(తత్ర తత్ర ఈశ్వరస్య ఉపాసనం ఉక్తమ్).*** ఈ రెండు రకాలైన ఉపాసనలను అనుష్ఠించే వారిలో ఎవరు శ్రేష్ఠులు? అంటే, ఏ ఉపాసన శ్రేష్ఠము అని అర్థము. ఏది శ్రేష్ఠమో దానిని ఆచరిద్దా మని బహుశ అర్జునుడు భావిస్తున్నాడేమో! ఏది ఎలా భావించినా, ఏదో ఒకటి చేయాలి అనే నిర్ణయానికి మాత్రం అర్జునుడు వచ్చేశాడు అని ఖచ్చితంగా చెప్ప వచ్చు.

ఇప్పుడే దర్శించిన విశ్వరూప మూర్తిని అనన్య శరణుడై, మత్కర్మకృత్త్వాది సాధనల చేత ఉపాసించడం అనే సగుణోపాసనను **ఏవం** అనే శబ్దం చేత ప్రస్తావించిన పార్థుడు, మళ్ళీ అవ్యక్తమైన అక్షర పరబ్రహ్మమును ప్రత్యేకంగా ప్రస్తావించ నవసరం లేదు. తాను దర్శించిన విశ్వరూపునిపై సవిశేష ధ్యానాన్ని కొనసాగించి ఉండ వచ్చు. కాని, అలా కాకుండా, నిర్విశేష నిరుపాధిక బ్రహ్మమును ప్రస్తావించాడు అంటే, విశ్వరూప సందర్శనము జరిగినా, ప్రారంభం నుండి అర్జునుని ఏ సందేహం పట్టుకొని ఉందో, అది ఇంకా పూర్తిగా పరిహరించబడ లేదని తెలుస్తూ ఉంది. కర్మయోగమా? కర్మసన్యాసమా? ఏది శ్రేష్ఠము అంటూ మూడు, ఐదు అధ్యాయాలలో ఏ సందేహా న్నైతే వెలిబుచ్చాడో, అదే సందేహాన్ని కర్మయోగి ఆచరించే సగుణోపాసన శ్రేష్ఠమా, సన్యాసి అనుష్ఠించే నిర్గుణోపాసన శ్రేష్ఠమా? అనే ప్రశ్నలో వ్యక్తం చేస్తున్నాడు. విశ్వరూపాన్ని దర్శించిన విజయుడు విశ్వరూపం కన్నా తనను వేరుగా నిలుపుకోవడమే దర్శన సమయంలో భయానికి, దర్శనానంతరము సందేహానికి కారణమైంది. ఈ కారణంగా భక్తియోగము ఆరంభమైంది. సగుణ నిర్గుణాలలో ఏ ఉపాసన శ్రేష్ఠము? అనే విషయం తెర మీదికి వచ్చింది.

ఉపాసనా విషయము

ఇంతకీ ఉపాసన అంటే ఏమిటి? ఉపాసించ దగిన వస్తువును ***(ఉపాస్యం)*** శాస్త్రోక్తంగా తెలుసుకొని, దానిని సమీపించి, దానితో భావైక్యం చెంది, అదే భావ ప్రవాహంలో దీర్ఘకాలం కొనసాగడం ఉపాసన అన్నారు ఆచార్యులు ***(యథా శాస్త్రమ్ ఉపాస్యస్య అర్థస్య విషయీకరణేన, సామీప్యం ఉపగమ్య సమాన ప్రత్యయ ప్రవాహేణ దీర్ఘకాలం యత్ ఆసనం తత్ ఉపాసనమ్ ఆచక్షతే).*** ఈ భావ ప్రవాహం కూడా అవిచ్ఛిన్నంగా తైలధార లాగా, జలప్రవాహం లాగా సాగుతూ ఉండాలి.

భక్తులు సోపాధిక బ్రహ్మమును ఉపాసిస్తారు కనుక, ఈశ్వరుడు వారికి ఉపాస్యము. అంటే ఉపాసనా విషయము. ఈ విధంగా సగుణారాధనలో ఉపాస్య ఉపాసక భేద ముంది. కనుక, ఉపాస్యాన్ని సమీపించి దీర్ఘకాలం ఉపాసనలో కొనసాగే అవకాశం ఉంది.

ఉపాస్య ఉపాసక భేదం

మరి, అక్షర బ్రహ్మోపాసన అనే నిర్గుణారాధనలో ఉపాసన సాగాలి అంటే, అక్కడ కూడా ఉపాస్య

ఉపాసక భేదం ఉండాలి కదా? కాని ఏది? ఉపాసకునికి వేరుగా ఉపాస్యం ఎక్కడుంది? ఉపాసకుడి స్వరూపమే కదా ఉపాస్యము? అలాంటప్పుడు ఉపాసనకు అవకాశం ఎక్కడుంది? ఉపాసనకే అవకాశం లేనపుడు, ఈ ఉభయులలో శ్రేష్ఠు లెవరు అని అర్జునుడు అడిగిన ప్రశ్నను ఎలా అర్థం చేసుకోవాలి? కర్మయోగము శ్రేష్ఠమా? కర్మసన్యాసము శ్రేష్ఠమా? అని ప్రశ్నించి నపుడు, ఎలా అర్థం చేసుకున్నామో అలాగే అర్థం చేసుకోవాలి.

ఉపాసనకు అవకాశం ఉండే సాకారోపాసనను, ఉపాసనకు అవకాశమే లేని నిర్గుణారాధనతో పోల్చి ఏది శ్రేష్ఠతమము? అని ప్రశ్నించడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? అమ్మాయికి పెళ్ళి చేయాలి. వరాన్వేషణం జరుగుతూ ఉంది. ఆ సందర్భంలో పెళ్ళి కాని ఇద్దరు యువకుల్ని చూపి, వీరిద్దరిలో అమ్మాయికి శ్రేష్ఠు డెవరు? అంటే, సమాధానం చెప్పగలం గాని, ఒక వివాహితుణ్ణి, ఒక అవివాహితుణ్ణి చూపి, వీరిరువురిలో ఎవరు శ్రేష్ఠుడు? అంటే ఏమి చెప్పగలం? ఇక్కడ కూడా అంతే.

కర్మలలో ఉండే యోగిని కర్మలు సన్యసించిన జ్ఞానితో పోల్చి చర్చించడము, ఉపాస్య ఉపాసక భేద భావనలో ఉన్న భగవ దుపాసకుని, ఉపాస్య ఉపాసక భేదం లేని ఆత్మ స్వరూపాన్ని ధ్యానించే జ్ఞానితో పోల్చి విశ్లేషించడము ఎలా చూచినా సముచితం కాదు. కర్మయోగికి సాధన సోపాధిక ధ్యానం. జ్ఞానయోగికి సాధన నిరుపాధిక జ్ఞానం. కర్మయోగికి సవిశేష బ్రహ్మము ధ్యేయం. జ్ఞానయోగికి నిర్విశేష బ్రహ్మము జ్ఞేయం. ఈ అంతరాన్ని స్పష్టంగా అర్థం చేసుకుంటే సగుణ నిర్గుణాల మధ్య భేదం గోచరించదు. కనుక, ఏది శ్రేష్ఠము అనే ప్రశ్న ఉత్పన్నమే కాదు.

జ్ఞానము పవిత్రము, ప్రశస్తము అయినా, కర్మయోగికి కర్మయే శ్రేష్ఠము. కర్మయోగము ద్వారా చిత్తశుద్ధిని పొందిన యోగి కర్మసన్యాసానికి అర్హు డవుతాడు. అలాగే ఉపాసన ద్వారా చిత్త నైశ్చల్యమును పొంది నిర్గుణారాధనకు చేరు వవుతాడు. ఇది సుకరము. మోక్షైక సాధనము.

తీగ లోని మొగ్గ పువ్వు కావడంలో కష్టం లేదు. బాధ లేదు. సందేహం లేదు. కాని, మొగ్గ పువ్వుగా మారాలని మొగ్గను నలిపితే మాత్రం, ఈ అసహజమైన ప్రయత్నం వల్ల మొగ్గ పాడవుతుందే గాని పువ్వుగా మారదు. కర్మయోగ కర్మసన్యాసాల విషయంలో గాని, సాకార నిరాకార ధ్యాన విషయంలో గాని ఈ సత్యమే దర్శనీయము.

రూప ధ్యానం - స్వరూప జ్ఞానం

భక్తులు సతతయుక్తులు. భగవత్సేవల యందు నిరంతరము సమాహితులై ఉండేవారు. అనన్య శరణులు ***(భక్తాః అనన్య శరణాః).*** అంటే, భగవంతుడు తప్ప మరొక ఆశ్రయము తెలియని వారు. వీరు సాకారమూర్తి అయిన పరమేశ్వరునే ఆరాధిస్తూ ఉంటారు. ధర్మబద్ధంగా జీవనయాత్రను కొనసాగిస్తూ, నిరంతరం సగుణ బ్రహ్మారాధనలో ఉంటారు. వీరే భక్తులు. కర్మయోగులు. వీరిది రూప ధ్యానం. సోపాధిక ధ్యానం.

జ్ఞానులు సర్వకర్మలను సన్యసించిన వారు. శమదమాదులను కలిగి, నిరంతరం అవ్యక్తమైన అక్షర పరబ్రహ్మను ధ్యానిస్తూ ఉంటారు. వాస్తవానికి ఇక్కడ ఉన్నది జ్ఞానమే గాని ఉపాసన కాదు. ఇది రూప ధ్యానం కాదు, స్వరూప జ్ఞానం.

బ్రహ్మము అవ్యక్తము. ఏది ఇంద్రియ మనస్సులకు అందుతుందో అది వ్యక్తము ***(యత్ కరణ గోచరం తత్ వ్యక్తమ్).*** ఏది ఇంద్రియ బుద్ధులకు అందదో అది అవ్యక్తము ***(యత్ అకరణ గోచరమ్ తత్ అవ్యక్తం).*** ఏదయితే ఇంద్రియ బుద్ధులకు అందదో అది అవ్యక్తము. అదియే పరబ్రహ్మము. ఇది జ్ఞేయ విషయమే గాని ధ్యాన విషయం కాదు; ఉపాసనా విషయం కానే కాదు. అకరణ గోచర మైనది ఎలా నశిస్తుంది? నశించదు కనుక అవ్యక్తము కనుక బ్రహ్మము అక్షరము.

అవ్యక్త పరబ్రహ్మము అక్షరము ***(నక్షరతి ఇతి అక్షరమ్).*** ఇట్టి అక్షర రూపాన్ని అర్థం చేసుకొనే వారు సన్యాసులు.

కాబట్టి, కర్ములకు, కర్మయోగులకు మధ్య అంతరాన్ని, శ్రేష్ఠత్వాన్ని దర్శించవచ్చు నేమో గాని, కర్మయోగులకు, జ్ఞానులకు మధ్య శ్రేష్ఠత్వాన్ని అర్థం చేసుకోవడం సాధ్య పడదు.

ఎవరు శ్రేష్ఠులు? అనే అర్జునుని ప్రశ్నకు సమాధానం కర్మయోగులే అనేది నిర్వివాదాంశం. జ్ఞానులు ఉపాసకులు కారు కనుక.

యోగాన్ని సాధించాలి అనే ఆరురుక్షువు అనే కర్మయోగికి కర్మ సాధనము కాగా, యోగాన్ని సాధించిన యోగారూఢు డనే జ్ఞానికి కర్మనివృత్తి సాధన మవుతూ ఉందని ఆరవ అధ్యాయం లోనే చూశాము కదా! *(6-3).*

ఉపాసన కర్మే కనుక, ధ్యానమైనా మానస కర్మే కనుక, ఉపాసనలో సాగే కర్మయోగికి, జ్ఞానంలో రమించే సన్యాసికి పోలికే లేదు. ఇక శ్రేష్ఠత్వం అనే ప్రశ్న ఎక్కడుంది? ఒకవేళ ఉన్నా, ఆ శ్రేష్ఠత్వము యోగికి సంబంధించిందే గాని జ్ఞానికి సంబంధించింది కాదు.

భగవానుడు అదే చెబుతున్నాడు.

శ్రీ భగవానువాచ :

మయ్యావేశ్య మనో యే మాం నిత్యయుక్తా ఉపాసతే ।
శ్రద్ధయా పరయోపేతా స్తే మే యుక్తతమా మతాః ॥ 2

మయి-ఆవేశ్య-మనః-యే-మాం-నిత్యయుక్తాః-ఉపాసతే
శ్రద్ధయా-పరయా-ఉపేతాః-తే-మే-యుక్తతమాః-మతాః

మయి	=	నా యందు	యే	=	ఎవరు
మనః	=	మనస్సును	మాం	=	నన్ను
ఆవేశ్య	=	నిలిపి	ఉపాసతే	=	ఉపాసిస్తున్నారో
నిత్యయుక్తాః	=	నిత్యయుక్తులై	తే	=	వారు
పరయా	=	ఉత్తమమైన	మే	=	నాకు
శ్రద్ధయా	=	శ్రద్ధతో	యుక్తతమాః	=	ఉత్తమ యోగులని
ఉపేతాః	=	కూడినవారై	మతాః	=	అభిప్రాయము

శ్రీ భగవానుడు చెబుతున్నాడు : **అర్జునా! మనస్సును నా యందే నిలిపి, నిరంతరము దైవ చింతనాపరులై, మిక్కిలి శ్రద్ధతో నన్ను ఉపాసించే వారు ఉత్తమ యోగులని నా అభిప్రాయము.**

వ్యాఖ్య

సగుణమే సుగుణము

రూపాన్ని ఆలంబనం చేసుకొని పరమేశ్వరుని ధ్యానించేది సగుణారాధన. నామరూపాలకు విలక్షణమైన తత్త్వాన్ని తదేక చింతనతో దర్శించేది నిర్గుణారాధన. సగుణారాధన చేసే భక్తులు కర్మయోగులు. నిర్గుణారాధనను కొనసాగించే సన్యాసులు జ్ఞానయోగులు. వీరిరువురిలో ఉత్తమయోగు లెవరు? అని అర్జునుడు ప్రశ్నించడంతో ఈ ద్వాదశాధ్యాయం ప్రారంభమైంది.

విశ్వరూపోపాసన చేసే సగుణ భక్తులకు, అవ్యక్తోపాసనలో నిమగ్నులైన నిర్గుణ భక్తులకు సామ్యమే లేదని గ్రహించాము కదా! అందుచేత, అర్జునుని ప్రశ్నకు సూటిగా సమాధాన మివ్వకుండా అర్జునుని సందేహాన్ని పరిహరించాడు పార్థసారథి.

సగుణ నిర్గుణాలలో ఏది ఉత్తమము? అని ప్రశ్నిస్తే, దానికి సమాధానంగా, ఎవరికి? అనే ప్రశ్న ఎదు రవుతుంది. సాంఖ్యులకు, లేదా సన్యాసుల కైతే నిర్గుణము అనుసరణీయము. కర్మయోగులకు అంతఃకరణ శుద్ధ్యర్థం సగుణమే ఆచరణీయము. కనుక, సగుణ నిర్గుణాల మధ్య పోలికే లేనందున, అర్జునుని వంటి కర్మయోగులకు సాకారోపాసనే శ్రేష్ఠ మని భగవంతుడు నిర్ణయించాడు.

భగవ దుపాసకులకు కావలసింది భగవంతుడా, లేక ఉపాసనా? భక్తుల గమ్యము భగవంతుడే గాని ఉపాసన కాదు. కాని ఉపాసన చేస్తే గాని భగవంతుని పొందడం సాధ్య పడదు.

గమ్యం చేరాలని భావించే వాడే మార్గంలో చరిస్తూ ఉంటాడు. మార్గంలో ఉన్నవాడు గమ్యం చేరా లనుకుంటాడే గాని మార్గం లోనే ఉండి పోవా లనుకోడు. చేర వలసింది గమ్యాన్నే అయినా, మార్గాన్ని ఆశ్రయించకుండా గమ్యాన్ని చేరే ప్రసక్తే లేదని ఇప్పటికే అర్థం చేసుకున్నాం కనుక, గమ్యము శ్రేష్ఠమా, మార్గము శ్రేష్ఠమా? అని ప్రశ్నిస్తే, ప్రయాణంలో ఉండే వాడికి మార్గమే శ్రేష్ఠము అని చెప్పాలి.

భగవంతుడు గమ్యము. జ్ఞాని తన స్వరూపమే అని భగవంతుడు ప్రవచించాడు. భగవంతునికి జ్ఞానికి తేడా లేదు. సాధకుడైన కర్మయోగిని, సాధ్యరూపుడైన జ్ఞానితో పోల్చి శ్రేష్ఠత్వాన్ని ఎలా నిర్ణయిస్తారు? అందుచేత ఉత్తమయోగు లెవరు? అనే అర్జునుని ప్రశ్నకు కర్మయోగియే ఉత్తమయోగి అని నిర్ధారించాలి. భగవంతుడు అదే చేశాడు. కర్మయోగంలో కొనసాగుతూ సగుణారాధనలో బ్రతుకును భగవన్మయం చేసుకోమని బోధిస్తున్నాడు.

భక్తి నావ

సాకారోపాసకులకు ఈ అధ్యాయం మధురమైన అధ్యాయము. మంగళకరమైన అధ్యాయము. భక్తవశుడు, భక్తవత్సలుడు అయిన భగవంతుని వశ పరచుకొని బ్రతుకును భవ్యంగా తీర్చి దిద్దుకోవడానికి కావలసిం దంతా ఈ అధ్యాయంలో లభిస్తుంది. **యోగి హృత్ ధ్యాన గమ్యం** అని కీర్తనీయుడైన శ్రీకృష్ణ దేవుడు దయామయుడై, దయారూపుడై హృదయంలో ఎలా ఒదిగి ఉన్నాడో ఈ అధ్యాయంలో స్పష్టంగా చూడవచ్చు. దాచిన మనస్సును దోచి పెడితే, దోచిన వాడు గుట్టుగా మనస్సులో దాగి ఉండే రహస్యాన్ని ఇక్కడ దర్శించ వచ్చు.

ఏమి లేని నాకు ఉన్న దొకటి
ఎవరి కివ్వక నీ కొరకె దాచి పెడితి
హృదయమే అది - మధ్యలో 'దయ'వు నీవు
నీ అడుగుల కడ పడి ఉందు చిన్నికృష్ణా!

అని చిన్నికృష్ణ శతకంలో ఒక వెన్నముద్ద.

ఆత్మజ్ఞానము పరమోత్కృష్టము. జీవుల గమ్యము. ఆ విషయంలో మరో ఆలోచనకు అవకాశం లేదు. కానీ, అందరికీ సులభసాధ్య మయ్యేది భక్తి. కర్మయోగిని జ్ఞానానికి సిద్ధ పరచేది భక్తి. స్నిగ్ధ సుకుమార సుందరతర చారుమూర్తి మురళీకృష్ణ భగవానుని మంజుల మనోహర రూపాన్ని దర్శిస్తూ, మనస్సును మాధవ చైతన్యంతో నింపుకొని అలౌకిక ఆనందానుభూతిని పొందే దివ్య స్థితిని భక్తి ప్రసాదిస్తుంది.

అర్జునా! ఉత్తమయోగు లెవరు? అని అడిగావు కదూ! అయితే విను. ఎవరు నా యందే మనస్సును ఉంచి **(యే మయి మనః ఆవేశ్య),** సదా దైవ చింతనాపరులై **(నిత్యయుక్తాః),** మహా శ్రద్ధ కలవారై **(పరయా శ్రద్ధయా ఉపేతాః),** నా రూపమును ధ్యానిస్తూ, నన్నే ఉపాసిస్తారో **(మాం ఉపాసతే),** వారే ఉత్తమ యోగులని **(తే యుక్తతమాః)** నా అభిప్రాయము **(మే మతాః)** అన్నాడు భగవంతుడు.

సాకార నౌక నెక్కి, దివ్యానుభూతులనే శీతల పవనాలు హృదయాన్ని చలింప చేస్తూ ఉంటే, అలౌకిక సౌందర్యాలను భావ జగత్తులో అవలోకిస్తూ, అవలీలగా ప్రేమ జలాలలో కదలి పోతూ, అలవోకగా గమ్యం వైపు సాగిపోతూ, రసానంద పారవశ్యంలో అభయ రూపమైన జ్ఞానహస్తాన్ని అందుకొని, సుధామయ స్వరూపంతో సమరస మయ్యే దెలాగో బోధించేందుకు సిద్ధమైన గీతాచార్యుడు, భక్తి వైభవాన్ని వివరించేందుకు ఉద్యమించాడు.

చిత్త సమర్పణము

అర్జునా! నీ మనస్సును నా యందే నిలుపు అని సాధకుని ప్రథమ కర్తవ్యాన్ని సూచించాడు భగవంతుడు **(మయి విశ్వరూపే పరమేశ్వరే, ఆవేశ్య సమాధాయ మనః).**

ఏది ఎక్కడ ఉంచాలో తెలియక పోతే, ఆ ఉన్నదేదో ఉపయోగం లేకుండా పోతుంది. కలిపిన అన్నపు ముద్దను నోటిలో ఉంచాలని, పడుకొనే సమయంలో తలను దిండుపై ఉంచాలని, ధనాన్ని బ్యాంకులో ఉంచాలని, ఆభరణాలను లాకర్‌లో ఉంచాలని మనిషికి తెలుసు. కాని, మనస్సును ఎక్కడ ఉంచాలన్న దొక్కటే మనిషికి తెలియదు. అందుచేత, తన మనస్సు ఎప్పుడు ఎక్కడ ఉంటుందో, ఎందుకుంటుందో, ఎలా ఉంటుందో మనిషికే అర్థం కాకుండా ఉంటుంది.

తిరిగితే దేహం అలసి పోతుంది. కాని, మనస్సు అలసట తెలియకుండా ఎంత కాలమైనా తిరుగుతుంది. ఎన్ని చోట్లకైనా పోతుంది. కాని ఒకచోట ఉండదు. ఉండలేదు. అది ఎక్కడైనా తిరుగుతుంది కనుక, ఎక్కడుందో అర్థం కాదు. మనస్సు మనిషికి సంబంధించిందే అయినా, మనిషిలో ఉండేదే అయినా, మనిషి ఉన్నచోట మనస్సు ఉండదు. అందుకనే, 'నా మనస్సు మనస్సులో లేదు' అనే విచిత్రమైన వాక్యాన్ని చాలా మంది అంటూ ఉండటము మనము వింటూ ఉంటాము.

మనం చెప్పే విషయం వినేవాడి మనస్సుకు ఎక్కలేదని మనకు అర్థమై నపుడు, 'ఎక్కడున్నావు? నేను చెప్పింది తల కెక్కిందా?' అంటూ ఉంటాము. ఎందుకని? ఎదురుగా ఉండి వింటున్న మనిషిలో వినే మనస్సు లేదని మనకు అర్థమవుతూ ఉంది కనుక.

మనస్సు పాదరసం లాంటిది. నిలవకుండా జారిపోతూ ఉంటుంది. ఎవరి మనస్సును ఎవరు ఎక్కడ ఉంచుతారో చెప్పలేము. కొందరు సంసారంలో, కొందరు రాజకీయాలలో, కొందరు భోగ భాగ్యాలలో, కొందరు చలనచిత్రాలలో, కొందరు కళలలో - ఇలా ఎవరి కిష్టమైన చోట వారు ఉంచుతారు. కాని, భక్తుడు మాత్రం తన మనస్సును భగవంతుని యందే ఉంచుతాడు. మనస్సును ఉంచ దగిన పవిత్ర స్థానము పరమేశ్వరుని పద పంకజాలే నని భక్తునికి తెలుసు. మనస్సు లోని కలతలు, నలతలు కనుమరుగై, మనస్సు రమ్యంగా, రమణీయంగా మారేది భగవంతుని చరణ సన్నిధి లోనే అనే సత్యం భక్తునికి అనుభవ సిద్ధం.

మనస్సు ఎందుకని సదా చలిస్తూ, సర్వత్ర చరిస్తూ ఉంటుంది? దానికి ఏదో కావాలి. ఆ కావలసిన ప్రియ వస్తువు ఎక్కడ ఉందో, ఎక్కడ ప్రాప్తిస్తుందో తెలియని కారణంగా అది ఎక్కడెక్కడో తిరుగుతూ ఉంటుంది. మనస్సు దేనిని ఆశిస్తూ ఉందో, అది లభ్య మయ్యేది మహిలో కాదని, మహేశ్వరుని సన్నిధి లోనే అని అర్థమైన క్షణాన మనస్సును బాహ్యానికి పొమ్మన్నా పోదు. పోయినా, అక్కడ ఉండ లేదు. తిరిగి భగవంతుని సన్నిధికే

చేరుతుంది. ఇనుము అయస్కాంతము వైపునకు ఆకర్షింప బడినట్లు, మనస్సు మాధవుని వైపుకు ఆకర్షింప బడుతుంది. ఇనుము అయస్కాంతమును అంటి పెట్టుకున్నట్లు, మనస్సు పరమేశ్వరుని చరణ కమలాలను హత్తుకొని ఉంటుంది. భగవంతుని యందు మనస్సును ఉంచడము అంటే ఇదే.

మనస్సు ఎక్కడుంది? అనేది ముఖ్యం కాదు. మనస్సులో ఏముంది? అనేదే ప్రధానము. మనస్సులో ప్రపంచం ఉంటే, మనస్సు ప్రపంచం లోనే తిరుగుతుంది. మనస్సులో పరమాత్మ ఉంటే, మనస్సు పరమాత్మ సన్నిధి లోనే ఉంటుంది. ఈ విధంగా భగవంతుని యందు మనస్సు నుంచిన వాడే యోగి. ఉత్తమమైన యోగి.

భక్తియోగి విశ్వరూపోపాసనలో ఉంటాడు కనుక, అతనికి విశ్వమంతా విశ్వేశ్వరుడే. కనింది, వినింది, తలచింది, తాకింది ఏదైనా, అది దృశ్యమైనా, శబ్దమైనా, భావన అయినా, స్పర్శ అయినా అంతా భగవంతుడే. అన్నీ భగవంతుడే అని భావించడం చేత అన్నిటిలో భగవద్భావనే భక్తునికి ప్రధానంగా ఉంటుంది. భక్తుని మనస్సు పరమేశ్వరుని యందే ఉన్నందున, పరమేశ్వరుని కన్నా అన్యమైన విషయం భక్తుని బుద్ధిని తాకలేదు.

శ్లో॥ విక్రేతు కామాకిల గోపకన్యా మురారి పాదార్పిత చిత్తవృత్తిః
దధ్యాదికమ్ మోహవశా దవోచత్ గోవింద! దామోదర! మాధవేతి ॥

ఒక గోపిక పెరుగు, పాలు అమ్మడానికి మధురకు పోయింది. ఆమె మనస్సు మాత్రం శ్రీకృష్ణుని పాదపద్మముల యందే లగ్నమై ఉంది. బుద్ధి భగవంతుని యందే ఉండటం చేత, పాలో పాలు, పెరుగో పెరుగు అని అనడానికి బదులుగా, 'గోవిందా! గోవిందా!, మాధవా! మాధవా!' అని కేక లేస్తూ నగర వీధులలో తిరిగిందట.

గోపిక తల మీద పాలకుండ ఉన్నా, ఆమె తలలో, తలపులలో పాలకడలిలో పవ్వళించి యున్న పరమాత్మే ఉన్నాడు. అందుకే పాలు అనడానికి బదులుగా పరమేశ్వరుని పిలిచింది.

ఇనుమును అయస్కాంతము ఆకర్షించినట్లు, గోపిక మనస్సును గోపాలుడు అమాంతం ఆకర్షించాడు. అదే భక్తి వైశిష్ట్యము. సదా భగవంతుని యందే మనస్సు నుంచి, తదేక నిష్ఠులై, భక్తులు భగవంతున్నే స్మరిస్తూ ఉంటారు కనుక, భగవంతుడు వాళ్ళ మనస్సును ప్రపంచం వైపు వెళ్ళకుండా ఆకర్షిస్తూ ఉంటాడు. అందుకే ఆయన కృష్ణుడు. చిత్తచోరుడు.

కర్షతి చిత్తమితి కృష్ణః - చిత్తమును అమాంతం ఆకర్షిస్తాడు కనుక శ్రీకృష్ణుడు చిత్తచోరుడు. భక్తి హృదయాన్ని పరమాత్మ వెన్న లాగా దోచుకుంటాడు. భక్తి పూర్ణ రూపాన్ని ధరిస్తే, దాగుడు మూతలు మానేసి దొర లాగా కళ్ళ ముందే దర్శన మిస్తాడు. ఇదే విశ్వరూపోపాసన లోని వైభవము.

పల్లవి: **మల్లె కన్నా తెల్లనైన మనసు నా కుందిరా!**
మనసు లేని స్వామి నా మనసు నేలరా!

చరణము: **దోరవయసు దోచుకున్న దొంగ నీవు కావా!**
దొంగ మనసు దాచిపెట్టి దొర లాగ రావా! **॥ మల్లె కన్నా ॥**

అని చిత్తాన్ని చిత్తచోరునికి సమర్పించింది చైతన్య గీతిక.

తదేక నిష్ఠత్వం

పరమేశ్వరుని యందే మనస్సు నుంచిన భక్తులు తదేక నిష్ఠులై ఉంటారు. దైవ చింతనాపరులై ఉంటారు **(సతత యుక్తాః).** పూర్వాధ్యాయం లోని చరమ శ్లోకంలో తెలిపిన మత్కర్మకృత్త్వాది సాధనల యందు సతతము

నియతులై ఉంటారు ***(సతత యుక్తాః, నిత్యయుక్తాః)***. అహోరాత్రాలు భగవత్సేవ యందే రమిస్తూ ఉంటారు.

ఈశ్వరార్పణ బుద్ధితో కర్మల నాచరిస్తూ, ఫలాలను ప్రసాదాలుగా స్వీకరిస్తూ ***(మత్కర్మకృత్)***, ఒక జీవనది సముద్రమునే లక్ష్యంగా చేసుకొని ప్రవహించునట్లు, పరమేశ్వరునే లక్ష్యంగా భావిస్తూ ***(మత్పరమః)***, నిరంతరము స్వామి సేవలో తరించే భృత్యుని లాగా ఆరాధనా భావంతో చరిస్తూ ***(మద్భక్తః)***, విషయ ప్రపంచాన్ని మనస్సు లోకి రానివ్వకుండా ప్రవర్తిస్తూ ***(సంగవర్జితః)***, సర్వ ప్రాణులను, ఉపకారు లైనా, అపకారు లైనా వైరబుద్ధి లేకుండా వీక్షిస్తూ ***(నిర్వైర స్సర్వభూతేషు)***. శేష కాలాన్ని విశేషించి విశ్వరూపోపాసనలో గడిపే వారు సతత యుక్తులైన భక్తులు. కాలాన్నంతా పూర్ణంగా భగవత్సేవ లోనే వినియోగించే వారు సతతయుక్తు లైన భక్తులు. కర్మయోగులు.

కర్మయోగులైన ఈ సగుణ భక్తులు గృహస్థులు. గృహస్థ ధర్మాలను పాటించే వారు. వీరికి సంసార బరువులు, బాధ్యతలూ ఉంటాయి. వాటిని విస్మరించరు. ధర్మబద్ధంగా జీవిస్తూ, బాధ్యతలను నిర్వర్తిస్తూ ఉంటారు. అనురాగాలు, అభిస్నేహాలు లేకుండా ధర్మాచరణము వరకే పరిమితమై, మిగిలిన కాలాన్నంతా దైవ సేవ యందే వినియోగిస్తారు.

సంసారంలో ఉన్నా, వారిలో సంసారము లేకుండా జీవిస్తూ ఉంటారు. విభక్తము కాని, విభాగము లేని భక్తిని సాగిస్తూ ఉంటారు. సంసారంలో ఉండటం దోషం కాదు. సంసారము మనస్సులో ఉంటేనే దోషం. దోమలున్న చోట దోమతెర ఉండవచ్చు. కాని, దోమతెర లోకి దోమలు ప్రవేశించ కూడదు.

భక్తుడు సంసారంలో ఉంటాడు. భార్యాబిడ్డల మధ్యే ఉంటాడు. కానీ అతని మనస్సులో సంసారం ఉండదు. భార్యాబిడ్డలు, బంధుమిత్రాదులు ఉండరు. భగవంతు డొక్కడే ఉంటాడు. అదే తదేక నిష్ఠత్వం. సతత యుక్తత్వం. అట్టి దైవ చింతనా పరత్వంతో పరీక్షిన్మహారాజు శ్రద్ధతో భాగవతాన్ని శుకబ్రహ్మ వద్ద శ్రవణం చేయడం చేత, గృహస్థుడే అయినా భగవంతునిపై తదేకంగా మనస్సును లగ్నం చేయ గలిగాడు.

సుతుల హితుల విడిచి, చుట్టాల విడిచి, యిల్లాలి విడిచి, బహుబలాళి విడిచి
రాజు హృదయ మిడియె రాజీవ నయనుపై, ధనము విడిచి, జడ్డు(దనము విడిచి !

పరీక్షిన్మహారాజు బిడ్డల్ని త్యజించాడు. హితులను విడిచాడు. చుట్టాలను విస్మరించాడు. భార్యను పరిత్యజించాడు. బలగాన్నంతా వదిలేశాడు. ధనాన్ని, దానితో పాటు జడత్వాన్ని కూడా త్యజించి కమల నయనుడైన శ్రీకృష్ణునిపై మనస్సును నిలిపి తరించి పోయాడు అన్నది భాగవతము - ద్వితీయ స్కంధము.

శ్రద్ధా పరాయణత్వం

పరమేశ్వరుని యందే మనస్సు నుంచి, నిరంతరము దైవ చింతనా పరులైన భక్తులు, శ్రద్ధాపరాయణులై భగవంతుని సేవిస్తూ ఉంటారు ***(శ్రద్ధయా పరయా ప్రకృష్టయా ఉపేతాః)***. ఇది సాధారణమైన శ్రద్ధ కాదు, పరాశ్రద్ధ. అంటే గొప్ప శ్రద్ధ అంటున్నాడు.

పరాశ్రద్ధ అంటే చెదరని శ్రద్ధ. చలించని శ్రద్ధ. శ్రద్ధ లేని విషయంలో బుద్ధి నిలవదు. శుద్ధి ఏర్పడదు. సిద్ధి లభించదు. అందుకనే ***శ్రద్ధావాన్ లభతే జ్ఞానం*** - శ్రద్ధ గలవాడే జ్ఞానమును పొందుతాడు అని గీతాచార్యుడు నాల్గవ అధ్యాయం లోనే తెలియ చేశాడు.

సగుణ ధ్యానమును భక్తితో అనుష్ఠించే సాధకుడు, ఉత్తమమైన శ్రద్ధ కలిగి ఉండాలి. శ్రద్ధతో కూడిన భక్తి ధ్యానాలు మోక్ష హేతువులని వేదవాణి వినిపిస్తూ ఉంది అన్నారు వివేక చూడామణిలో శ్రీ శంకరాచార్య స్వామి.

శ్రద్ధా భక్తి ధ్యానయోగాత్ ముముక్షోః ముక్తేః హేతూన్ వక్తి సాక్షాత్ శ్రుతేర్గీః ।

మోక్షమును కాంక్షించే వారికి శ్రద్ధా భక్తి ధ్యానాలే ప్రధాన హేతువులుగా వేదమాత చెబుతూ ఉంది అన్నారు.

శ్రద్ధా భక్తి ధ్యాన యోగా దవైహి - శ్రద్ధా భక్తి ధ్యాన యోగాల ద్వారా పరాత్పరుని పొంది తరించ మని బ్రహ్మదేవుడు అశ్వలాయన మహర్షికి కైవల్యోపనిషత్తులో బోధించాడు. ప్రస్తుత శ్లోకంలో ఈ మూడే ప్రధాన విషయాలుగా చర్చింప బడ్డాయి. కనుక శ్రద్ధా భక్తి ధ్యాన యోగ తత్పరుడైన సాకారోపాసకుడు భగవంతుని తప్పక పొందుతాడు అని ప్రామాణికంగా ప్రబోధించడం జరిగింది.

ఇక్కడ శ్రద్ధ అంటే ప్రమాణ విషయంలో అకుంఠిత మైన విశ్వాసము అని అర్థము. శస్త్ర చికిత్స విషయంలో వైద్యునిపై ఎలాంటి విశ్వాసాన్ని ఉంచి రోగి దేహాన్ని అప్పగిస్తాడో, అలాగే ప్రమాణ విషయంలో శాస్త్ర విషయంపై, గురు వచనంపై అచంచలమైన శ్రద్ధ నుంచి యోగి తవ మనస్సును సమర్పించాలి. అప్పుడే ప్రమాణం ఫలిస్తుంది.

ఈ విధంగా మనస్సును భగవంతుని యందు ఉంచి, తదేక నిష్ఠాపరులై, శ్రద్ధా పరాయణులై విశ్వరూపోపాసన సాగించే సగుణారాధకులు ఉత్తమ యోగులని పరమేశ్వరుడు నిర్ధారణ చేయడం జరిగింది ***(తే యుక్తతమాః మే మతాః అభిప్రేతాః)***.

దివారాత్రములు దైవము నందే మనస్సును లగ్నం చేసి జీవిస్తూ ఉంటారు కనుక వారు యుక్తతములు ***(నైరంతర్యేణ మచ్చిత్త తయా అహోరాత్రమ్ అతివాహయన్తి అతః యుక్తతమాః ఇతి వక్తుమ్)***.

మరి, వీరు ఉత్తమ యోగులైతే, నిర్గుణారాధకుల మాటేమిటి? వారిని గూర్చి సంక్షిప్తంగా రెండు శ్లోకాలలో చెబుతున్నాడు.

యే త్వక్షర మనిర్దేశ్య మవ్యక్తం పర్యుపాసతే । 3
సర్వత్రగ మచిన్త్యం చ కూటస్థ మచలం ధ్రువమ్ ॥
సంనియ మ్యేన్ద్రియగ్రామం సర్వత్ర సమబుద్ధయః । 4
తే ప్రాప్నువన్తి మామేవ సర్వభూతహితే రతాః ॥

యే-తు-అక్షరం-అనిర్దేశ్యం-అవ్యక్తం-పర్యుపాసతే
సర్వత్రగం-అచింత్యం-చ-కూటస్థం-అచలం-ధ్రువం
సంనియమ్య-ఇంద్రియగ్రామం-సర్వత్ర-సమబుద్ధయః
తే-ప్రాప్నువంతి-మాం-ఏవ-సర్వభూతహితేః-రతాః

యే తు	= ఎవరయితే	రతాః	= రమించువారై
ఇంద్రియగ్రామం	= సర్వేంద్రియములను	అనిర్దేశ్యం	= నిర్వచించుటకు వీలు లేనిది
సంనియమ్య	= నియమించి	అవ్యక్తం	= వ్యక్తము గాని
సర్వత్ర	= అంతటను	సర్వత్రగం	= అంతటా వ్యాపించినది
సమబుద్ధయః	= సమబుద్ధి గలవారై	అచింత్యం	= చింతించుటకు వీలు కానిది
సర్వభూతహితే	= సర్వభూతముల క్షేమము నందు	అచలం	= స్థిరమైనది

ధ్రువం	= నిత్యమైనది	తే	= వారు
కూటస్థం చ	= కూటస్థము నైన	మాం ఏవ	= నన్నే
అక్షరం	= క్షరము గాని బ్రహ్మమును	ప్రాప్నువంతి	= పొందుతారు
పర్యుపాసతే	= ఉపాసిస్తున్నారో		

అక్షరోపాసకులు అనిర్దేశ్యము, అవ్యక్తము, సర్వగతము, అచింత్యము, కూటస్థము, అచలము, ధ్రువము అయిన పరమాత్మను సేవిస్తారు.

ఇంద్రియ సమూహాన్ని చక్కగా నిగ్రహించి, అంతట సమబుద్ధి కలవారై, సర్వభూత హితము నందు ఆసక్తులైన అక్షరోపాసకులు నన్నే పొందుతారు.

వ్యాఖ్య

వ్యక్తావ్యక్తములు

ప్రపంచము దృశ్యము. పరమాత్మ అదృశ్యము. దృశ్యమైన ప్రపంచము రూపము, అనిత్యము, క్షరము. అదృశ్యమైన పరమాత్మ స్వరూపము నిత్యము, అక్షరము. వ్యక్తమయ్యే ప్రపంచ రూపానికి అవ్యక్తమైన పరమాత్మ స్వరూపమే ఆధారము. అవ్యక్తమైన పరమాత్మ యొక్క రూపమే వ్యక్తమైన ఈ ప్రపంచము. స్వరూపము ఉంటేనే రూపం ఉంటుంది. రూపం లేకపోయినా స్వరూపం ఉంటుంది.

రూపము సాకారము, సగుణము. స్వరూపము నిరాకారము, నిర్గుణము. సాకారము, నిరాకారము రెండూ పరమాత్మ రూప స్వరూపాలే కనుక, రెండూ ఉపాసనా యోగ్యములే. సాకారమును ఉపాసించే వారు సగుణోపాసకులు, లేదా సవిశేష బ్రహ్మోపాసకులు. నిరాకారమును సేవించే వారు అవ్యక్తోపాసకులు, లేదా నిర్విశేష బ్రహ్మోపాసకులు.

విశ్వరూపుని ధ్యేయంగా పెట్టుకొని సతతయుక్తులై ఉపాసించే సగుణారాధకులు ఉత్తమ యోగులని రెండవ శ్లోకంలో భగవంతుడు ప్రకటించాడు ***(యుక్త తమాః).*** అలాంటప్పుడు ఇతరులు, అనగా రెండవ వారైన అక్షరోపాసకులు యుక్తతములు కారా? ***(కిమ్ ఇతరే యుక్తతమాః న భవన్తి?).*** అలా కాదు ***(న).*** వాళ్ళను గూర్చి ఏమి చెప్పాలో, ఎలా చెప్పాలో భగవంతుడు వరుసగా ఈ రెండు శ్లోకాలలో వినిపిస్తున్నాడు ***(కింతు తాన్ ప్రతి యద్వక్తవ్యం తత్ శృణు).***

మూడవ శ్లోకంలో అక్షరోపాసకులు సేవించే నిర్విశేష బ్రహ్మము యొక్క ఏడు విశేషణాలను వినిపించి, నాల్గవ శ్లోకంలో జ్ఞానుల, లేదా సన్యాసుల యొక్క జీవన శైలిని, జ్ఞాన నిష్ఠా వైభవమును వివరించి, వారు పొందే ఫలాన్ని కూడా తెలియ జేస్తున్నాడు. రెండు శ్లోకాలకు ఏకాన్వయం ఉంది.

యే తు అని శ్లోకారంభం లోనే సగుణారాధకులైన భక్తులను నిర్గుణోపాసకులైన జ్ఞానులను వేరు చేస్తూ, భక్తి జ్ఞానాలకు, సగుణ నిర్గుణాలకు వైలక్షణ్యమును సూచించుటకు **తు** శబ్దమును ప్రయోగించడం జరిగింది. ధ్యేయ విషయము, అంటే ఉపాస్య విషయం లోను, ధ్యాన విషయము, అంటే సాధన విషయం లోను, అలాగే సాధన యొక్క ఫల విశేషము లోను విలక్షణత్వము ఉండటమే ఈ **తు** శబ్ద ప్రయోగ హేతువు.

పరమాత్మ నశించే వాడు కానందున ఆయన అక్షరము ***(న క్షరతీతి అక్షరః).*** అక్షరము అంటే మార్పు లేని వాడు లేక కూటస్థుడు అని కూడా అర్థము ***(కూటస్థః అక్షరమ్).*** కార్యరూపంలో గోచరిస్తున్న ప్రపంచము పరిణామ శీలము కనుక క్షరము. కార్యమైన ప్రపంచానికి కారణమైన పరమాత్మ పరిపూర్ణము కనుక అక్షరము. అట్టి అక్షర రూపుడైన పరమాత్మను ఉపాసించడానికి అక్షర బ్రహ్మము యొక్క ఏడు విశేషణాలను సాధనలుగా

భగవంతుడు అందిస్తున్నాడు **(అక్షరస్య విశేషణం ఆహ).** ఆ ఏడు విశేషణాలను సంక్షిప్తంగా చెప్పుకుందాం.

అనిర్దేశ్యం

ప్రపంచం వ్యక్తం కనుక దానికి రూపం ఉంది. విశ్వరూపాన్ని, లేదా విశ్వం లోని రూపాలను ఇది - అది అని చెప్పవచ్చు. రూప నామాలతో నిర్దేశించ వచ్చు. కనుక విశ్వము నిర్దేశ్యము.

పరమాత్మ అవ్యక్తము కనుక ఆయనది అరూపం. స్వరూపం. వ్యక్తం కాని అరూపాన్ని ఎలా నిర్వచించాలి? ఇది - అది అని నిర్దేశించుటకు శక్యం కాదు కనుక పరమాత్మ యొక్క అవ్యక్త స్వరూపము అనిర్దేశ్యము ***(ఇదం - తత్ ఇతి నిర్దేష్టుం య న్న శక్యతే తత్ అనిర్దేశ్యం).***

అవ్యక్తం

ఏది వ్యక్త మవుతుందో అది ప్రత్యక్షాది ప్రమాణాలకు అందుతుంది. రూపాలు కళ్ళకు అందితే, శబ్దాలు చెవులకు అందుతాయి. అక్షర పరబ్రహ్మము వ్యక్తమయ్యేది కానందున అది ఏ ప్రమాణాలకు అందదు. అందుచేత అవ్యక్తమైంది ***(న కేనాపి ప్రమాణేన వ్యజ్యతే ఇతి అవ్యక్తమ్).***

ఒకడు మన ముందు ఉన్నాడు అంటే, వ్యక్త మయ్యాడు అని అర్థం. కనుక అతడు వ్యక్తి. వ్యక్తి కనిపిస్తూ ఉన్నాడు అంటే, అతడు వ్యక్తమై ఉన్నాడు కాబట్టి, **అయం ఈదృశ ఏవ** - 'ఇతడు ఇలా ఉన్నాడు' అని చెప్పగలం. వ్యక్తం కాని అవ్యక్తాన్ని ఎలా నిర్వచించగలం? వ్యక్తం కావడం లేదు అంటే, ఇంద్రియ మనోబుద్ధులకు వ్యక్తం కావడం లేదు అని అర్థం. ప్రత్యక్షాది ప్రమాణాలకు అందుబాటులో లేదు అని భావము. అందుకే అవ్యక్త మైన అక్షర పరబ్రహ్మము అనిర్దేశ్య మైంది.

సర్వత్రగం

సర్వత్ర వ్యాపించి ఉన్న దానిని సర్వత్రగం అంటారు. అంటే, అంతటా ఉండేది ***(సర్వత్ర గచ్ఛతి ఇతి).*** ఎలా? ఆకాశం లాగా అంతటా వ్యాపించి ఉండేది ***(వ్యోమవత్ వ్యాపి, గగన సదృశమ్).*** సమస్తానికి అవకాశా న్నిచ్చేది ఆకాశము. ఆకాశము అంతటా ఉంది కనుక, ఉన్న వన్నీ ఆకాశం లోనే ఉన్నాయి.

మట్టికుండకు మట్టి కారణము. కార్యమైన మట్టికుండలో మట్టి ఎక్కడుంది అంటే ఏం చెప్పగలం? మట్టికుండలో మట్టి లేని దెక్కడ? అంతటా ఉంది. కారణమైన మట్టి కార్యమైన మట్టికుండలో అంతటా ఉంది. సర్వత్ర ఉంది.

వ్యక్తమైన విశ్వానికి విశ్వనాథుడే అభిన్న నిమిత్త ఉపాదాన కారణం అయి ఉన్నందున, విశ్వమంతా విశ్వనాథుడే వ్యాపించి ఉన్నాడు. అవ్యక్త స్వరూపమే కారణత్వం వల్ల కార్యమంతా వ్యాపించి సర్వత్రగంగా శోభిస్తూ ఉంది ***(కారణత్వేన వ్యాప్తత్వాత్ సర్వత్ర).***

అచింత్యం

చింతించడానికి వీలు కానిది అచింత్యము. ఏది ఇంద్రియాలకు అందుతుందో దానినే మనస్సుతో ఆలోచించగలం ***(యత్ కరణ గోచరం తత్ మనసాఽ పి చింత్యం).*** అక్షర పరబ్రహ్మము ఇంద్రియాలకు గోచరం కాదు అని ఇప్పటికే తెలుసుకొని ఉన్నాము. ఇంద్రియాలకు అగోచరం కనుక దానిని మనస్సు చేత చింతించ డానికి వీలు పడదు ***(అచింత్యం సర్వ ప్రమాణ అగోచరత్వాత్).*** చింతించే వాని స్వరూపమే అక్షరుడు కనుక, చింతించడానికి సాధ్య పడదు.

కూటస్థం

కూటస్థం అనే విశేషణమును రెండు విధాలుగా అర్థం చేసుకోవచ్చు. **కూటః** అంటే మోసము, వంచన లేదా మిథ్య అనే అర్థా లున్నాయి. ఇది మొదటి దృక్కోణం. బాహ్యాభ్యంతరాలలో ఏకంగా ఉండనిది, ఉండలేనిది మోసము లేదా వంచన. అంటే బాహ్యానికి గుణముగా తెలుస్తూ, ఆంతర్యంలో దోషమై ఉండేది కూటం ***(దృశ్యమాన గుణమ్ అన్తర్దోషం వస్తు కూటం, కూట రూపం, కూట సాక్ష్యం ఇత్యాదౌ కూట శబ్దః ప్రసిద్ధః లోకే).*** కనుకనే మోసాన్ని కూటరూపం అంటారు. తప్పుడు సాక్ష్యాన్ని కూట సాక్ష్యం అని ప్రముఖంగా చెప్పుకుంటారు.

కూటము అంటే మాయ అని అర్థం. మాయ వంచిస్తుంది. మోసం చేస్తుంది. అందుకే అది కూట రూపం. కూటరూపంలో ఉంటుంది ***(కూట రూపేణ తిష్ఠతి ఇతి).*** అవ్యక్త రూపంగా ఉన్నప్పుడు మాయ అక్షర పరబ్రహ్మమునకు కారణోపాధిగా, అక్షరోపాధిగా ఉంటుంది. వ్యక్త మైనపుడు బ్రహ్మమునకు కార్యోపాధిగా, క్షరోపాధిగా ఉంటుంది. ఉపాధి ఏదైనా బ్రహ్మానికి వేరుగా ఉండ లేదు. కనుక మాయ బ్రహ్మమునే ఆశ్రయించుకొని ఉంటుంది. కూటమైన మాయకు అధ్యక్షుడై, ఆధారుడై ఉన్నందున, అక్షర పరబ్రహ్మము కూటస్థ మని చెప్ప బడింది. కూటస్థుడైన పరబ్రహ్మమును ఆశ్రయించిన వారు కూట రూపమైన మాయను దాటుతారు *(7 - 14).*

ఇక రెండవ అర్థం, కూట మంటే దాగలి. ఇనుప పనిముట్లు, బంగారు ఆభరణాలు తయారు చేసే వారి వద్ద, అగ్నిలో కాల్చిన లోహ ఖండాలను కొట్టి సాగదీసేందుకు అనువుగా ఒక ఇనుప ముద్ద ఉంటుంది. దానినే దాగలి అంటారు. అదే కూట మంటే. ఈ దాగలిని ఆధారం చేసుకొని లోహాలను అనేక రూపాలుగా తీర్చి దిద్దుతూ ఉంటారు. అలా మారే రూపాలకు కారణమైన దాగలి తాను మారకుండా స్థిరంగా ఉంటుంది. అలాగే, నానా రూపనామాలతో వ్యక్తమై, పరిణామం చెందే ఈ విశ్వానికి తాను ఆధారమే అయినా, తనలో ఏ విధమైన మార్పు లేకుండా భాసిస్తున్నందున అక్షర పరబ్రహ్మము కూటస్థ మని చెప్ప బడింది. అందుకే అది అచలము.

అచలమ్

అచలము అంటే చలనము లేనిది ***(న చలతి ఇతి అచలః).*** అక్షరము స్వరూప చలనము లేనిది ***(స్వరూపాత్ చలనం న విద్యతే).*** తన సామర్థ్యము నుండి చలించదు ***(సామర్థ్యాత్ న చలతి).*** జ్ఞానపరంగా చూచినా చలన మెరుగదు కనుక అది అచలము. సర్వత్రగమును ముందే అర్థం చేసుకున్నాం కనుక, అంతటా ఉండేది ఎలా చలిస్తుంది? ఎందులో చలిస్తుంది? చలించి ఎక్కడికి చేరుతుంది? ఆదిలాబాద్ ఆకాశము కదిలి వెళ్ళి అహమ్మదాబాద్‌కు చేరినట్లే ఉంటుంది. ఈ విధంగా అచలం కనుకనే అక్షర పరబ్రహ్మము స్థిరమై ఉంది. నిత్యమై ఉంది. ధ్రువమై ఉంది.

ధ్రువమ్

ధ్రువము అంటే స్థిరము, నిత్యము అని అర్థము. ఏది అచలమో అది స్థిరమే కదా! ధ్రువమే కదా! ***(యస్మాత్ అచలం తస్మాత్ ధ్రువమ్ ఇత్యర్థః).*** తనలో ఏ మార్పు లేనందున పరబ్రహ్మము ధ్రువము. అక్షరము అంటే నశించనిది అని అర్థం చేసుకున్నాము కదా! ఆ నశించనిదే, నాశ మెరుగనిదే ధ్రువము ***(అవినాశిత్వాత్ ధ్రువః).*** నిర్వికార చైతన్యము.

ఈ విధంగా అక్షర రూపుడైన పరమాత్మకు సంబంధించిన ఏడు లక్షణాలను నిదిధ్యాసనం చేస్తూ ఆత్మ స్వరూపాన్ని అనుసంధానం చేయడమే అవ్యక్తోపాసన. భక్తులు ధ్యానించే విశ్వరూపోపాసన కన్నా విలక్షణ మైనది. అక్షరోపాసన అనే నిరాకారోపాసనను, లేదా నిర్గుణోపాసనను ఏడు విశేషణాలతో చెప్పుకున్నాం. ఇవన్నీ

వాస్తవానికి అర్థం చేసుకోవలసినవే గాని ఉపాసనలు కావు. నిర్గుణ భక్తుడైన జ్ఞాని విషయంలో ఉపాసన అనేది కేవలం ఔపచారికమే.

ఇక అక్షరోపాసకుని జీవన శైలి ఎలా ఉంటుంది? శీల సంపద ఎలా ఉండాలి? జ్ఞాన నిష్ఠా వైభవము ప్రవర్తనములో ఎలా ప్రతిఫలిస్తుంది అనే విషయాన్ని నాల్గవ శ్లోకంలో మూడు విషయాలలో వివరిస్తున్నాడు. అవి (1) ఇంద్రియ సమూహాన్ని చక్కగా అదుపులో ఉంచుకోవడము (2) అంతటా సమబుద్ధి కలిగి ఉండటము (3) సర్వ భూతములకు హితము చేయుట యందు ఆసక్తి కలిగి ఉండటము.

ఈ మూడు లక్షణాలను సంపూర్ణంగా పొంది, ఇప్పటి వరకు మనం చెప్పుకున్న అక్షర స్వరూపము యొక్క ఏడు విశేషణాలను అనుసంధానం చేసుకుంటూ జీవనయాత్రను సాగించే అవ్యక్తోపాసకులు, పరమేశ్వరుణ్ణే పొంది తరిస్తారు. ఇదే అవ్యక్తోపాసనకు ప్రాప్తించే అమృతఫలం. ఇక ఇప్పుడు, అక్షరోపాసకునికి అర్హతలుగా, లక్షణాలుగా శోభిస్తున్న మూడు విషయాలను ముచ్చటగా, సంక్షేపంగా చెప్పుకుందాం.

ఇంద్రియ నిగ్రహము

ఇంద్రియ గ్రామమ్ అంటే ఇంద్రియ సముదాయము. జ్ఞానేంద్రియ కర్మేంద్రియ సమూహము. ఇంద్రియా లన్నిటినీ అవ్యక్తోపాసకుడు అదుపులో ఉంచుకొని ఉంటాడు. ఇక్కడ **నియమ్య** అనకుండా, **సంనియమ్య** అనడం జరిగింది. అంటే ఇంద్రియాలను చక్కగా నియమించి ఉంటాడు అని అర్థము ***(సంనియమ్య సమ్యక్ నియమ్య, ఇంద్రియ గ్రామమ్ ఇంద్రియ సముదాయం).***

అక్షరోపాసనలో ఇంద్రియ నిగ్రహము అనేది ప్రముఖమైన సాధన. ఇంద్రియాలు చలిస్తే మనస్సు చలిస్తుంది. నిదిధ్యాసనం భంగ మవుతుంది. అవరోధాలతో అడ్డగింపబడి సాధన సాగకుండా ఆగుతుంది.

ఇంద్రియాలను గుఱ్ఱాలుగా, ఇంద్రియ విషయాలను మార్గముగా వర్ణించింది ఉపనిషత్తు ***(ఇంద్రియాణి హయానాహుః విషయాం స్తేషు గోచరాన్).*** గుఱ్ఱాలను రథానికి పూన్చితే అవి రథాన్ని లాగుతాయి. రథానికి స్వతహాగా చలన శక్తి లేదు. గుఱ్ఱాలు లాగితేనే రథం కదులుతుంది.

శరీరం కూడా రథం లాంటిది ***(శరీరం రథం).*** రథాన్ని గుఱ్ఱాలు లాగినట్లు, శరీరాన్ని ఇంద్రియాలు ఈడుస్తాయి. విషయ ప్రపంచమనే రహదారి లోకి లాగుతాయి. పట్టు తప్పిన గుఱ్ఱాలు రథాన్ని పెడదారి పట్టించినట్లు, నిగ్రహింప బడని ఇంద్రియాలు జీవన రథాన్ని దారి తప్పిస్తాయి. దగా చేస్తాయి.

గుఱ్ఱాలను అదుపు చేయకుండా గమ్యాన్ని చేరడం ఎలా దుస్సాధ్యమో, ఇంద్రియాలను నిగ్రహించకుండా జీవుడు గమ్యాన్ని చేరడము కూడా అలాగే దుస్సాధ్యము. దుర్లభము.

ఇంద్రియ నిగ్రహం ఋతే న కశ్చిత్ తరతి అనృతమ్ - ఇంద్రియ నిగ్రహం లేకుండా, ఎవరు కూడా మిథ్యా రూపమైన సంసార సాగరాన్ని దాటలేరు అన్నారు ప్రబోధ సుధాకరంలో శ్రీ శంకరాచార్యస్వామి.

ఆఖ్యాయిక

పూర్వం ఒక రాజు గారు తన కొలువు లోని పండితుల బుద్ధిని పరీక్షించాలని సంకల్పించి వారికి ఒక పరీక్ష పెట్టాడు. ఆ పరీక్షలో నెగ్గిన వారికి విలువైన ప్రశస్త మణిహారమును బహూకరించడం జరుగుతుందని కూడా ప్రకటించాడు.

పరీక్ష యొక్క పూర్వాపరాలను మంత్రిగారు సభ లోని పండితులకు ఈ విధంగా వివరించి చెప్పాడు. కొలువు కూటములో ఒక మేకను ప్రవేశ పెడతారు. దానిని తృప్తిగా మేపాలి. మేతను సంస్థానమే సమకూర్చుతుంది.

మేత పెట్టి, మేకను తృప్తి పరచి, ఏలే వారిని మెప్పించడమే పోటీలో పాల్గొనే వారు చేయవలసిన పని. ఎవరు మేకను తృప్తి పరిస్తే వారికి అమూల్యమైన రత్నహారము లభిస్తుంది.

మరునాడు పోటీ ప్రదర్శనము ఆరంభమైంది. మేకను పూలమాలతో అలంకరించి కొలువులో ప్రవేశ పెట్టారు. ప్రథమంగా ఒక పండిత శ్రేష్ఠుడు ముందు కొచ్చి, పచ్చి గ్రాసమును, మేతను మేక ముందు వేశాడు. అది శుభ్రంగా మేసింది. ఉదయం నుండి సాయంత్రం వరకు అతడు మేత వేస్తూనే ఉన్నాడు. అది మేస్తూనే ఉంది. పొట్ట పెద్ద బానలా బిఱ్ఱుగా తయారైంది. అయినా, పచ్చగడ్డి వేయగానే మేక మూతి పెడుతూనే ఉంది. చీకటి పడింది. పండితుడు ఓడిపోయాడు. ప్రదర్శనము మరునాటికి వాయిదా పడింది.

రెండవ రోజు మరొక పండితుడు, మూడవ రోజు, నాల్గవ రోజు - ఇలా తొమ్మిది రోజులు గడిచాయి. తొమ్మిది మంది పండితులు విఫల ప్రయత్నాలు చేశారు.

పదకొండవ రోజు పోటీలో పాల్గొనిన వ్యక్తి, పూర్వం పోటీలో పాల్గొనిన పండితుల లాగా మేతను ఎక్కువగా మోసుకు రాలేదు. కొద్ది గ్రాసమును మాత్రమే చేతిలో పట్టుకొని కొలువు లోకి ప్రవేశించాడు. ఆ గ్రాసమును మేక ముందు పడేశాడు. మేక యథా ప్రకారం తల వంచి తినడానికి మూతి ముందుకు చాచింది. అంతే. ఆ వ్యక్తి తన నడుముకు కట్టుకొని ఉన్న కొరడాను తీసి మేకపై ఛడేలు మనిపించాడు. తినడానికి ముందు కెళ్ళిన మేక ఉలిక్కి పడి వెనక్కి తగ్గింది.

కొన్ని నిముషాలు ఆగి, మళ్ళీ తినడానికి ముందు కొచ్చింది. మేత దగ్గరకు మూతి వచ్చినప్పుడల్లా మేక వీపు ఛడేలు మంటోంది. సాయంత్రం వరకు ఇదే వడ్డింపు. సాయంత్రం రాజు గారు వచ్చారు.

మహారాజా! ఈ మేకను నేను తృప్తిగా మేపినాను. నాకు బహుమానం ఇప్పించండి అన్నాడా వ్యక్తి. ఇంతవరకు జరిగిన ప్రదర్శనలలో చివరిగా రాజు గారు రావడము, తన చేతితో కొంత పచ్చి గ్రాసమును మేక ముందు వేయడము, అది ఆరగించడము, పోటీదారుడు ఓడిపోయినట్లు ప్రకటించడము జరుగుతూ వచ్చింది.

అలాగే, ఈ రోజు కూడా రాజు గారు మేక ముందు కొంత మేతను పడేయడం జరిగింది. మేక మెల్లగా ఆ మేతను సమీపించి, తినడానికి మూతిని ముందుకు చాచింది. తీరా తినేస్తుందని రాజు గారు భావిస్తూ ఉండగా, అది తినకుండా వెనక్కి తిరిగి వచ్చేసింది. రాజు గారు ఆశ్చర్య పోయాడు. మేకను ఇతడే తృప్తిగా మేప గలిగాడు అని నిర్ణయించి, అతనికి అమూల్య రత్నహారాన్ని బహూకరించాడు.

పెట్టినంత వరకు, ఎంత పెట్టినా తృప్తి లేకుండా మేక తింటూనే ఉండింది. కొట్టడం మొదలెట్ట గానే తినడం కట్టి పెట్టింది. ఇంద్రియాలు కూడా అంతే. పైగా, ఇవి మేకలు కావు, గుఱ్ఱాలు. శక్తివంత మైనవి. మేకల లాగా తల వంచుకొని పడి ఉండేవి కావు. అవసరమైతే తిరగబడి విజృంభిస్తాయి కూడా.

నివేదిస్తూ ఉంటే ఇంద్రియాలు నీల్గుతూనే ఉంటాయి. నిగ్రహించి నపుడే బుద్ధిగా దారి లోకి వస్తాయి. ఇంద్రియాలు ప్రమథన శీలాలు. ఆదమరిస్తే చాలు. అమాంతం హరిస్తాయి. సంక్షోభాన్ని సృష్టిస్తాయి. మనస్సు ఉపాసనలో ఉన్నా, దానిని ఇంద్రియాలు చలింప చేసి, బలవంతంగా బాహ్య ప్రపంచం లోకి ఈడుస్తాయి. విషయాల మధ్య పడేస్తాయి.

ఇంద్రియాణి ప్రమాథీని హరన్తి ప్రసభం మనః - అర్జునా! క్షోభింప చేసే ఇంద్రియాలు మనస్సును బలవంతంగా బాహ్యానికి ఈడ్చుకొని పోతాయి అని భగవంతుడు రెండవ అధ్యాయంలో చెప్పే ఉన్నాడు. కనుక, ఉపాసకుడు ఇంద్రియాలకు వశ పడకుండా, వాటిని వశం చేసుకొని తన అదుపులో ఉంచుకోవాలి.

సర్వత్ర సమదర్శనం

సమమైన బుద్ధి కలిగి ఉండటమే సమదర్శనము. అవ్యక్తోపాసకుడు అంతట సమబుద్ధి కలిగి ఉంటాడు. సర్వత్ర సమత్వమే అతనికి దర్శనీయంగా ఉంటుంది. అన్ని కాలాలలో, అన్ని సమయాలలో ఉపాసకుని బుద్ధి సమం గానే వ్యవహరిస్తూ ఉంటుంది **(సర్వత్ర సర్వస్మిన్ కాలే సమబుద్ధయః)**.

ఇక్కడ **సర్వత్ర** అంటే అన్ని కాలాలలో అనే గాక, అన్ని పరిస్థితులలో కూడా అని అర్థం చేసుకోవాలి. అనుకూల పరిస్థితులలో బుద్ధి సమంగా ఉండొచ్చు. కాని, విషమ పరిస్థితులలో కూడా స్థిరత్వం కోల్పోకుండా సమంగా ఉండాలి.

ఇష్ట మైనవి ప్రాప్తించి నపుడు బుద్ధి అస్థిరతకు లోను కాదు. కాని, అనిష్టాలు, అరిష్టాలు సంభవించి నపుడు కూడా సంతాపం లేకుండా సమస్థితిలో ఉండాలి **(ఇష్టా నిష్టా దౌ తే సమబుద్ధయః)**.

ఇది సాధ్యమేనా? అని మనకు అనిపించవచ్చు. అలా అనిపించడంలో ఆశ్చర్య మేమీ లేదు. రాగద్వేషాల మధ్య ఊగిస లాడే వారికి సమవర్తనము సాధ్య పడదు. రాగద్వేషాలను తటస్థ పరచిన పుణ్యాత్ములకు సమబుద్ధి సహజం గానే ఉంటుంది.

అవ్యక్తోపాసకులు సన్యాసులు, లేదా జ్ఞానయోగులు. వీరు కర్మయోగంలో శుద్ధిపడిన వారు. రాగద్వేషా లనే మల దోషమును కర్మయోగ సాధనలో కడిగేసుకున్న వారు. కనుకనే, జ్ఞాననిష్ఠలో సమబుద్ధితో శోభిస్తారు.

విషం పాము కోరల్లోనే ఉంటుంది. కోరలు తీసేస్తే పాము నిరపాయ మవుతుంది. విషమత్వ మనేది కూడా విశ్వంలో లేదు. దృశ్యాలలో లేదు. విషయాలలో లేదు. కేవలం మన రాగద్వేషాల లోనే ఉంది. కోరలు తీసిన పాము ఎలా కాటు వేయలేదో, వేసినా విషాన్ని ఎలా చిమ్మలేదో, అలాగే రాగద్వేషాలు లేని బుద్ధిలో విషమత్వం ఉండదు. అంతా సమత్వమే ఉంటుంది. సమబుద్ధికి సర్వత్ర సమదర్శనమే జరుగుతుంది.

సర్వభూత హితం

ఇంద్రియాలను చక్కగా నిగ్రహించి, సర్వత్ర సమబుద్ధి కలిగిన అవ్యక్తోపాసకుడు సర్వభూత హితము నందు ఆసక్తి కలిగి ఉంటాడు. సర్వభూత సంక్షేమము నందు రమిస్తూ ఉంటాడు.

ఇక్కడ **భూతహితం** అనకుండా **సర్వభూత హితం** అనడంలో ఔచిత్యాన్ని అవశ్యం గుర్తించాలి. కొందరికి కొందరు మనుషు లంటే ఇష్టం కావచ్చు. అలాగే కొన్ని ప్రాణులను కొందరు ఇష్ట పడవచ్చు. కోడళ్ళ మీద ద్వేషంతో దూరంగా వెళ్ళి, రాగంతో అక్కడ కోళ్ళను పెంచవచ్చు. రాగద్వేషాలు రాజ్యమేలే హృదయంలో ఎవరో కొందరిపై ప్రేమ ఉండే అవకాశం లేక పోలేదు.

కొన్నిటిని, లేదా కొందరిని ప్రేమించడానికి రాగద్వేషాలు సరిపోతాయి. అందరినీ ప్రేమించాలి, అన్నిటినీ ప్రేమించాలి, సర్వహితాన్ని కాంక్షించాలి అంటే మాత్రం, అది రాగద్వేషాల పరిధిలో సాధ్యపడే పని కాదు. జ్ఞానం కలిగి నపుడే సర్వభూత ప్రేమ ఆవిర్భవిస్తుంది. సర్వము అనేది భిన్నత్వం కాకుండా, ఏకత్వంగా అర్థ మవుతుంది కనుక సర్వ ప్రేమ ఆవిష్కృత మౌతుంది. విశ్వప్రేమ విరజిమ్మ బడుతుంది.

సర్వమును ఏకంగా దర్శిస్తేనే సర్వ ప్రేమ సాధ్య మవుతుంది. సర్వాత్మ భావనలో తన స్వరూపమే సాక్షాత్కృత మవుతుంది. **సర్వాత్మకోఽహం** అనే ఆత్మదర్శనంలో సర్వభూత హితాసక్తి సహజం గానే పరిమళిస్తుంది.

ప్రస్తుతం మనం అర్థం చేసుకుంటున్నది అవ్యక్తోపాసనలో అలరిస్తున్న జ్ఞానయోగిని గూర్చి అనే విషయాన్ని విస్మరించ కూడదు. జ్ఞానయోగి ఎవరో కాదు సన్యాసియే అని మనకు తెలుసు.

సమస్తమును త్యాగం చేసి, సర్వ కర్మలను పరిత్యజించి, సన్యాసమును స్వీకరించే పవిత్ర కాలం లోనే, ***అభయం సర్వ భూతేభ్య మత్తః స్వాహా*** అనే మహత్తరమైన వాక్యాన్ని సర్వసంగ పరిత్యాగి యైన సన్యాసి పలుకుతాడు అన్నది శ్రుతిమాత. ***అభయం సర్వభూతేభ్యో దత్వా సన్న్యాస మాచరేత్*** - సర్వభూతములకు తన వలన ఏ ప్రమాదము జరగదని భూత ప్రపంచానికి అభయ మనే దక్షిణను సమర్పించిన త్యాగపురుషుడు సన్యాసమును స్వీకరిస్తాడు అన్నది స్మృతి.

కనుక, సర్వత్ర తన ఆత్మనే దర్శిస్తాడు కనుక సన్యాసి సర్వ ప్రాణులకు నిర్హేతుకంగా మేలు తల పెడతాడు. ఎవరినీ బాధించ లేడు. హింసించ లేడు. ఆత్మదృష్టి అలవడిన మహాత్మునిలో హింసకు కారణ మైన ద్వేషము ఉండే అవకాశమే లేనందున సర్వత్ర సమబుద్ధి గల జితేంద్రియుడు సర్వభూత హితేరతుడై శోభిస్తాడు.

సేవా ఫలం

మరి, అక్షర స్వరూపమును ఉపాసించే అవ్యక్తోపాసకులకు ప్రాప్తించే ఫలం ఏమిటి? అది కూడా చెబుతున్నాడు. అర్జునా! 'వారు నన్నే పొందుతారు' ***(తే మామేవ ప్రాప్నువన్తి).*** అవ్యక్తోపాసన యొక్క ఫలం పరమాత్మయే. మోక్షమే. అద్వైతానుభూతియే. అందుకనే, 'జ్ఞాని నా స్వరూపుడే *(7 - 18)*. జ్ఞానికి నాకు భేదమే లేదు' అన్నాడు భగవంతుడు.

జ్ఞానులు తననే పొందుతారు అంటే, ఇంతవరకు పొందకుండా, ఇప్పుడే పొందుతున్నారు అని అర్థం కాదు. ఇంతవరకు లేని దానిని గనుక క్రొత్తగా పొందడము జరిగితే, అది క్రొత్తగా వచ్చింది అవుతుందే గాని ఉన్నదిగా భాసించదు. పూర్వము కూడా, అంటే జ్ఞానాత్పూర్వం కూడా జీవుడు బ్రహ్మమే. అజ్ఞానం వల్ల తాను బ్రహ్మ మని తెలుసుకోలేక పోయాడు. ఇప్పుడు అజ్ఞానం నివృత్తి అయింది కనుక, మేఘం తొలగిన తరువాత ప్రకాశిస్తున్న సూర్యుడే ప్రకాశించినట్లు, బ్రహ్మమైన జీవుడే బ్రహ్మముగా శోభిస్తున్నాడు ***(బ్రహ్మైవ సన్ బ్రహ్మాప్యేతి).*** పూర్వం కూడా తెలియకుండా బ్రహ్మము గానే ఉండిన వాడు అవిద్యా నివృత్తి జరిగిన తరువాత బ్రహ్మముగా భాసిస్తున్నాడు.

మరి, అవ్యక్తోపాసకుడు మోక్షరూపు డవుతు న్నప్పుడు, విశ్వరూపోపాసకుడు ఉత్తమ యోగి ***(యుక్త తమః)*** అని చెప్పడ మేమిటి? అనే సంశయం కలగవచ్చు. సగుణారాధకుడు కర్మయోగి. కనుక అతడే ఉత్తముడు. అతడు ఉత్తముడే గాని పరమేశ్వరుని పొంద లేడు. కర్మయోగం ద్వారా చిత్తశుద్ధిని పొంది, జ్ఞానప్రాప్తి ద్వారా మోక్షాన్ని పొందుతాడు. కాని, అవ్యక్తోపాసకుడు పరమాత్మనే పొందుతున్నాడు. అదే తేడా. జ్ఞాని సాక్షాత్తు భగవత్స్వరూపమే కనుక, అతనిని ఎవరి తోను పోల్చడానికి అవకాశము లేదు. పోల్చినపుడే యుక్తతము డనాలి. కనుక యుక్తతముడు కర్మయోగియే గాని జ్ఞాని కాదు. జ్ఞాని సాక్షాత్తు పరబ్రహ్మమే.

అలాంటప్పుడు సగుణం కాకుండా నిర్గుణాన్నే ఆశ్రయిస్తే సరిపోతుంది కదా అనే సందేహం రావచ్చు. నిర్గుణోపాసన, లేదా అవ్యక్తోపాసన సులభసాధ్యం కాదు; పైగా కష్టతరం కూడా అని చెబుతున్నాడు.

క్లేశోఽధికతర స్తేషా మవ్యక్తాసక్త చేతసామ్ । 5
అవ్యక్తా హి గతి ర్దుఃఖం దేహవద్భి రవాప్యతే ॥

క్లేశః-అధికతరః-తేషాం-అవ్యక్తాసక్త చేతసాం
అవ్యక్తా-హి-గతిః-దుఃఖం-దేహవద్భిః-అవాప్యతే

అవ్యక్తాసక్తచేతసాం	= అవ్యక్తము నందు ఆసక్తి గల చిత్తము గల్గిన	అవ్యక్తా	= అవ్యక్త విషయమైన
తేషాం	= వారికి	గతిః	= గతి
క్లేశః	= కష్టము	దుఃఖం	= బాధ గాను
అధికతరః	= అధికము	దేహవద్భిః	= దేహాభిమానము గల వారలచే
		అవాప్యతే హి	= పొందబడుతున్నది గదా

అర్జునా! అవ్యక్తమును ఉపాసించాలనే ఆసక్తి కల వారికి కష్టం ఎక్కువగా ఉంటుంది. దేహాభిమానం కల వారికి అక్షరోపాసన కష్ట సాధ్యము.

వ్యాఖ్య

అవ్యక్తోపాసనను గూర్చి మూడు, నాలుగు శ్లోకాలలో భగవంతుడు అందంగా, అద్భుతంగా ఆకర్షణీయంగా వర్ణించడం జరిగింది. అది విన్న తరువాత అక్షరోపాసననే అనుష్ఠించాలి అనే ఆలోచన సహజంగా కలుగుతుంది. అనుభవం కలగాలి, అనుభూతి ఏర్పడాలి అంటే, ఆలోచన ఒక్కటే సరిపోదు. అర్హత కూడా ఉండాలి.

తల ఎంత ఎత్తులో నైనా ఉండవచ్చు. పాదాలు మాత్రం భూమి మీదనే ఉండాలి. నేల విడిచి సాము చేయడం ఎవ్వరికీ మంచిది కాదు. అవ్యక్తోపాసనకు మించిన అనుష్ఠానము మరొకటి ఉండదు. అక్షరోపాసనకు అనంతమే ఫలం. ఫలం ఎలా అనంతమో, సాధనలో కష్టం కూడా అలా అనంతమే. అవ్యక్తోపాసన అందరూ వాంఛించ దగినదే అయినా అందరూ ఆచరించ దగింది కాదు. సర్వులూ ఆచరించడానికి సర్వులకూ సాధ్య పడేది కాదు.

దుర్లభము - దుర్భరము

రూపధ్యానము ఉపాసనకు సంబంధించింది. స్వరూపధ్యానము అవగాహనకు సంబంధించింది. అందుకే అది స్వరూపానుసంధానము, లేదా నిదిధ్యాసనము అని చెప్పుకున్నాం. అంటే అర్థం చేసుకోవలసిన విషయం. అక్షర స్వరూపాన్ని బుద్ధికి పట్టించడం అందరికీ సాధ్యపడే విషయం కాదు.

రూపం ఆధారంగా ఉన్న సాకార ధ్యానమే మనకు సజావుగా సాగడం లేదు. ధ్యానయోగు లందరికీ ఇది అనుభవంలో ఉంటుంది. దృష్టిని పరమేశ్వరుని రూపంపై సారించినా, మనస్సు ప్రపంచాన్ని ఊహించుకుంటూ విషయాలలో ఊరేగుతూ ఉంటుంది.

అవసరం లేనివి, అవధానాన్ని పాడు చేసే వన్నీ ధ్యాన సమయం లోనే జ్ఞాపక మొస్తాయి. మనం కళ్ళు మూసి ధ్యానానికి కూర్చున్నా, మనసులో చలించే వాసనలు, విషయాలు రేకుల్ని విప్పినట్లు రెప్పల్ని విప్పుతూ ఉంటాయి. దుప్పట్లు కప్పినట్లు మాయను కప్పుతూ ఉంటాయి.

రూపం ఆలంబనంగా ఉండి, మనస్సును లగ్నం చేయ వలసిన స్థానం ఒక వైపు తెలుస్తూ ఉంటేనే, మనస్సు నిలవకుండా విషయాలను పట్టుకొని అటు ఇటు ప్రాకి పోతూ ఉంటే, ఏ ఆలంబనం లేకుండా, మనస్సును ఎక్కడ ఉంచాలో అర్థమే గాని అవ్యక్తంపై చిత్తమును నిలిపేది ఎలా? అందుకే, అవ్యక్తోపాసన యందు ఆసక్తి కల వారికి **(అవ్యక్తాసక్త చేతసామ్)** క్లేశము లేదా కష్టము అధికతరము **(క్లేశః అధికతరః)** అంటున్నాడు భగవంతుడు.

క్లేశము అధికము ***(క్లేశః అధికః)*** అనకుండా, అధికతర మంటూ, ***తర*** అనే అంత్య ప్రత్యయాన్ని ప్రయోగించడం చేత అధికము కూడా ఉందని సూచించడం జరిగింది. అవ్యక్తోపాసనలో క్లేశము అధికతరము అంటే, విశ్వరూపోపాసన అనే సాకారోపాసనలో కూడా క్లేశము అధికం గానే ఉందని అర్థము. శ్రమించనిదే ఏదీ ఫలించదు. ఏ శ్రమ లేకుండా ఫలితాన్ని పొందాలంటే, ఏ ఫలమూ రాదు, చావు తప్ప. కష్ట పడకుండా ఆధ్యాత్మిక సాధనలు ఫలితా న్నివ్వవు. పురిటి నొప్పులు పడకుండా బిడ్డను కనడం ఏ తల్లికీ సాధ్యం కాదు ***(అసహజాలు చర్చకు అర్థవంతాలు కావు).*** సగుణారాధన కూడా కష్టమే అయినా, నిర్గుణోపాసన కష్టతర మనడానికి కారణం అవరోధం దుర్భరంగా ఉండటమే. ఆ అవరోధం ఏదో కాదు, దేహాభిమానమే. అదే అవ్యక్తోపాసనలో అడ్డు నిలిచే ప్రతిబంధకము.

దేహాభిమానం

దేహాత్మ బుద్ధి, అంటే దేహమే ఆత్మ అనే బుద్ధి కల వారికి ***(దేహవద్భిః దేహాభిమాన వద్భిః)*** అవ్యక్తోపాసన సులభంగా ప్రాప్తించదు.

రూపం లేని పరమేశ్వరునికి ప్రపంచం రూపంగా ఉంది. విశ్వము ఆయనకు ఉపాధి. ఉపాధి యైన విశ్వము విశ్వేశ్వరుని కన్నా అన్యంగా లేదు. విశ్వం కూడా విశ్వాత్మయే. కాని, విశ్వాత్మ విశ్వం కాదు.

జీవుడు రూపం లేని ఆత్మ. దేహము జీవునికి రూపోపాధి. జీవుణ్ణి వదలి దేహం మనుగడను సాగించ లేదు. కనుక దేహం కూడా ఆత్మయే కాని ఆత్మ దేహం కాదు. ఆత్మ లేకుండా దేహం ఉండలేదు. కానీ, దేహం లేకపోయినా ఆత్మ నిత్యమై ఉంటుంది.

దేహమే ఆత్మ అనే దేహాత్మ బుద్ధి గల సాధకుడు ఆత్మధ్యానాన్ని కొనసాగించ లేడు. ఒకవేళ కొనసాగించినా, సాధన కష్టతరంగా సాగుతుంది. తనకు దేహం ఉంది అని భావించినంత కాలం, దేవుడికి కూడా దేహం ఉంది అనే భావన సాగుతూ ఉంటుంది. రూపాసక్తి ఉండేవారు అరూప ధ్యానాన్ని ఎలా చేయగలరు? చేసినా క్లేశము అధికతరం గానే ఉంటుంది. కనుక అవ్యక్తోపాసన అనే దైవధ్యానము దేహాత్మబుద్ధిని త్యజించిన వారికే సాధ్య పడుతుంది. అంతవరకు కష్టము అధికమే అయినా, అధికతర కష్టము కాని సాకారోపాసనే శ్రేష్ఠము అనేది అంతర్భావము. సాకారోపాసనలో శుద్ధి పడిన బుద్ధి నిరాకారోపాసనను సరళంగా కొనసాగించ గలుగుతుంది. సగుణోపాసన ద్వారా అర్హుడైన సాధకుడే నిర్గుణోపాసనలో నిరాటంకంగా పయనించ గలడు.

రైలుబండిలో ప్రయాణం చేయాలి అంటే, టిక్కెట్టును కలిగి ఉండటమే అర్హత. టిక్కెట్టు లేకుండా బండి ఎక్కితే, ఎక్కడ దిగి పోవలసి వస్తుందో ఎక్కిన వాడికి కూడా అర్థం కాదు. సాకారంలో శుద్ధి పడకుండా నిరాకారాన్ని ఆశ్రయిస్తే, సాధన ఎక్కడ దుర్భర మౌతుందో సాధకునికి కూడా అర్థం కాదు.

పునాది లేని మేడ ఎంత కాలం నిలుస్తుంది? భూమిని దున్ని మెత్త బరచకుండా విత్తనాలు చల్లి ఏ ఫలితాన్ని పొందాలి? సగుణోపాసన లేకుండా నిర్గుణాన్ని ఆశ్రయించడం కూడా అలాగే ఉంటుంది. అసాధ్యాలను సాధ్యాలుగా మార్చాలంటే కష్టం అధికతరం గానే ఉంటుంది. అసాధ్యము అంటే, దానిని విడిచి పెట్టమని కాదు. ఆచరించడానికి అర్హతను సంపాదించి అసాధ్యాన్ని సుసాధ్యం చేసుకోమని అర్థము. అసాధ్యాన్ని సాధించే స్థాయికి ఎదగమని, పరిపక్వతను ముందుగా సాధించమని అర్థము. పరిపూర్ణం వైపు సాగడానికి కావలసిన పరిపక్వత సాకారోపాసన లోనే సిద్ధిస్తుంది.

సాకారమే సుకరము

ఆత్మానాత్మ వివేకము పూర్ణంగా సిద్ధించి, అనాత్మ యైన దేహము తాను కాదని, నిత్యమైన ఆత్మయే

తాననే దృఢ భావన ఏర్పడే వరకు అవ్యక్తోపాసన కన్నా, మత్కర్మకృత్యాది సాధన పంచకముతో కూడిన విశ్వరూపోపాసనే సుకరము అనే పరమేశ్వరుని అభిప్రాయము ఈ శ్లోకంలో సుస్పష్ట మైంది.

దేహాభిమానం ప్రారంభంలో దృఢం గానే ఉండినా, సాకారోపాసన నిర్మలంగా సాగే కొద్దీ దేహాత్మ బుద్ధి పలుచబడుతూ ఉంటుంది.

నాకు దేహం ఉంది. కాని నేను దేహం కాదు. దేహం నాది కాదు. దేహం నాదే అయితే, నాకు చెప్పకుండా ఎందుకు అదృశ్య మవుతుంది? మాటైనా చెప్పకుండా ఎందుకు తరలి పోతుంది? దేహం నాదే అయితే, నేను ఉండమన్నట్లు ఎందుకు ఉండలేక పోతోంది?

ఈ దేహం పరమాత్మది. ఆయన అనుగ్రహిస్తే నాకు అందింది. ఆయన ఇచ్చిన దేహాన్ని పవిత్రంగా ఉంచుకోవడం నా బాధ్యత. ఆయన ప్రసాదించిన దేహాన్ని ఆయన సేవకే వినియోగించడం నా అదృష్టం.

సాకారమూర్తిని అభిషేకించడానికి ఉపకరించే ఈ దేహాన్ని ముందుగా శుద్ధ జలాలతో స్నానం చేయిస్తున్నా. అది కూడా దేహంలో ఉండే దైవానికి అభిషేకంగా ఆచరిస్తున్నా. ఈశ్వరోపాసనలో ఉపాసనా మూర్తిని అలంకరించినట్లే, ఈ దేహాన్ని కూడా పట్టు వస్త్రాలతో, చందన తిలకాదులతో అలంకరిస్తున్నా. పరమేశ్వరునికి సమర్పించిన నైవేద్యాన్ని దేహానికి ప్రసాదంగా పెడుతున్నా.

నేత్రాలు భగవంతుని దివ్యమూర్తిని పవిత్రంగా దర్శిస్తున్నాయి. దేవతార్చనలో హస్తాలు పావన మవుతున్నాయి. మంత్రోచ్చారణతో మాట శుద్ధి పడుతుంటే, తదేక చింతనముతో చిత్తము ప్రసన్న మవుతూ ఉంది. దైవారాధనలో దేహాభిమానం పలుచ బడుతోంది. ఈ విధంగా సాకారోపాసనలో దేహభావన క్షయించి, పవిత్రమైన దైవ భావన తేజోమయ మవుతూ ఉంది.

అవ్యక్తోపాసన శ్రేష్ఠ మైనదే అయినా, పరిణతి చెందని వారికి శ్రేయస్కరము కాదు. అక్షరోపాసన గంభీర మైన సాగరాన్ని ఈదినట్లే ఉంటుంది. కాని, సాకారోపాసన సుకరమే గాక, పవిత్ర గంగాజలాలలో స్నానం చేసినట్లు సులభంగా, శ్రేయస్కరంగా ఉంటుంది.

ప్రచండ తేజంతో భానుడు ప్రకాశించ వచ్చు. అలాగని సూర్యుణ్ణి ప్రత్యక్షంగా ఎంత సేపని చూడగలం? కాని, వెలిగే దీపాన్ని ఎంత సేపైనా ప్రశాంతంగా చూడగలం. ఉపాసనా విషయంలో, ధ్యాన మార్గంలో సగుణ నిర్గుణాలు ఇలాగే ఉంటాయి.

అర్జునా! కర్మయోగి కాని వాడు కర్మసన్యాసి కాలేడు. కర్మయోగం లేకుండా సన్యాసాన్ని పొందడం కష్టం. కర్మయోగి అయిన మననశీలుడు బ్రహ్మమును శీఘ్రంగా పొందుతాడు *(5 - 6)* అని గీతాచార్యుడు ముందే స్పష్టం చేసి ఉన్నాడు.

దేహాభిమానాన్ని పోగొట్టుకోకుండా, తాత్కాలిక ఆవేశంతో నిర్గుణారాధనను ప్రారంభించి నిరాశ చెందడం కన్నా, సుకరము, సులభము, శ్రేయస్కరమైన సగుణారాధనలో సఫల మయ్యే ప్రయత్నాన్ని సాగించడమే ముముక్షువులకు ఆదర్శమైన సాధనా మార్గము.

మహాత్ము లందరూ ఈ విధంగా ఆచరించిన వారే. ఈ విధమైన ఆచరణలో పరిణతి చెంది అభివృద్ధిని సాధించిన వారే. పుట్టే వారందరూ బిడ్డలు గానే పుడతారు. నెమ్మదిగా, ఓ పద్ధతిగా పెరిగి పెద్ద లవుతారు. మనం కూడా అలాగే మెల్లగా పెద్దవారి కోవ లోకి చేరి పోవాలి.

శ్రీ ఆదిశంకరాచార్య స్వామి తరువాత, అలాంటి వారిని పేర్కొనాలి అంటే ఏ కొందరో వేళ్ళ మీద లెక్కెట్టేటట్లు కనిపిస్తారు. శ్రీ సురేశ్వరాచార్యులు, శ్రీ విద్యారణ్యులు, శ్రీ మధుసూదన సరస్వతి, భగవాన్

శ్రీరమణులు - ఇలా కొందరినే చెప్పగలం. కాని, వీరందరూ గీతాచార్యుడు బోధించిన ఈ మార్గంలో చరించిన వారే. తరించిన వారే.

అద్వైత సిద్ధి అనే అద్భుతమైన గ్రంథాన్ని రచించిన శ్రీ మధుసూదన సరస్వతి గొప్ప అద్వైతి. అద్వైత సంప్రదాయంలో అసమానమైన ఆచార్యులలో ఒకరు. కానీ, వారి సాధన భక్త సులభుడైన బాలకృష్ణుని తోనే ముడిపడి ఉండింది. భవ్యమైన బాలకృష్ణుని దివ్యారాధనలో వారు ఊహ కందని అద్వైత శిఖరాలను అవలీలగా అందుకున్నారు.

శ్లో ॥ ధ్యానావస్థిత తద్గతేన మనసా తన్నిర్గుణమ్ నిష్క్రియమ్
జ్యోతిః కించన యోగినో యది పునః పశ్యన్తి పశ్యన్తుతే
అస్మాకం తు తదేవ లోచన చమత్కారాయ భూయాచ్చిరమ్
కాలిందీ పులినేషు యత్కిమపి తన్నీలం తమోధావతి ॥

అక్షరోపాసనలో ధ్యానమగ్న మైన చిత్తముతో నిర్గుణము, నిష్క్రియము, ప్రకాశైక స్వరూపము అయిన అవ్యక్తమును యోగులు దర్శిస్తే దర్శించనీ. నా మటుకు నాకు, యమునా సైకత శ్రేణులలో అలరిస్తూ అల్లరి చేసే నల్లని పిల్లవాడే కళ్ళ ముందు వింతగా కదులుతూ ఉండు గాక!

ఎంత మనోజ్ఞమో! ఎంత మనోహరమో! ఆ మధుర మంజుల మనోజ్ఞ మోహనమూర్తి మనోహర రూపంలో మధుసూదన సరస్వతి మనస్సు మంచు లాగా కరిగి పోయేది! వెన్న లాగా చల్లబడేది. అదంతా సాకారోపాసన వైభవమే.

ఇంతవరకు వరుసగా మూడు శ్లోకాలలో నిర్గుణారాధనను ముచ్చటగా చర్చించిన గీతాచార్యుడు, సర్వులకు ఆచరణ యోగ్యమైన సగుణాన్ని కొనసాగిస్తున్నాడు. ఇక ఈ అధ్యాయ మంతా భక్తిమయం గానే సాగుతుంది. నిర్గుణ వైభవాన్ని తరువాత అధ్యాయం క్షేత్రక్షేత్రజ్ఞ విభాగ యోగంలో చర్చిస్తాడు.

యే తు సర్వాణి కర్మాణి మయి సంన్యస్య మత్పరాః ।
అనన్యే నైవ యోగేన మాం ధ్యాయన్త ఉపాసతే ॥ 6
తేషా మహం సముద్ధర్తా మృత్యుసంసార సాగరాత్ ।
భవామి నచిరా త్పార్థ మయ్యావేశిత చేతసామ్ ॥ 7

యే-తు-సర్వాణి-కర్మాణి-మయి-సంన్యస్య-మత్పరాః
అనన్యేన-ఏవ-యోగేన-మాం-ధ్యాయంత-ఉపాసతే
తేషాం-అహం-సముద్ధర్తా-మృత్యుసంసార సాగరాత్
భవామి-నచిరాత్-పార్థ-మయి-ఆవేశిత చేతసాం

పార్థ	= అర్జునా!	సంన్యస్య	= సమర్పించి
మత్పరాః	= నేనే పరమగతి అనే వారు	అనన్యేన	= ఏకాంతమైన
యే తు	= ఎవరైతే	యోగేన ఏవ	= యోగముచే
సర్వాణి	= సర్వములైన	మాం	= నన్ను
కర్మాణి	= కర్మలను	ధ్యాయంత	= ధ్యానము చేస్తూ
మయి	= నా యందు	ఉపాసతే	= ఉపాసిస్తూ ఉంటారో

మయి	= నా యందు	నచిరాత్	= త్వరలోనే
ఆవేశిత చేతసాం	= ఉంచబడిన మనస్సు గల	మృత్యుసంసార సాగరాత్	= జననమరణ సంసార సాగరము నుండి
తేషాం	= వారలను	సముద్ధర్తా	= ఉద్ధరించే వాణ్ణి
అహం	= నేను	భవామి	= అవుతాను

అర్జునా! అనన్య భక్తితో నన్నే ధ్యానిస్తూ ఉపాసించే వారు సర్వ కర్మలను నాకే సమర్పిస్తారు. నన్నే పరమగతిగా భావిస్తారు. చిత్తమును నా పైనే ఉంచిన అలాంటి భక్తుల్ని మృత్యు రూపమైన సంసార సాగరం నుండి శీఘ్రంగా నేను ఉద్ధరిస్తాను.

వ్యాఖ్య

భక్తోద్ధారణము

యే తు - ఎవ్వరైతే అనే శ్లోకారంభం లోని పదంలో **తు** శబ్దం శంక నివృత్త్యర్థము మరియు విషయ పృథక్త్వర్థమును సూచించడం కోసం ప్రయోగింప బడింది. అవ్యక్తోపాసకులు నన్నే పొందుతారు **(మామేవ ప్రాప్నువన్తి)** అని పూర్వ శ్లోక ద్వయంలో పరమేశ్వరుడు చెప్పడం చేత, సాకారోపాసకులు పరమేశ్వరుని పొందరా? అనే శంక ఉత్పన్నం కావచ్చు. దానిని నివారించే ప్రయత్నంగా **తు** శబ్ద ప్రయోగం జరిగింది.

గడచిన మూడు శ్లోకాలలో అక్షర పరబ్రహ్మోపాసనను గూర్చి చర్చించడము జరిగింది. విషయాన్ని వేరు చేస్తూ, ప్రస్తుత శ్లోకములో సగుణారాధకులను గూర్చి చెప్పడం తిరిగి ఆరంభ మవుతూ ఉందని తెలుపడానికి **తు** శబ్దము ప్రయోగింప బడింది.

అక్షర పరబ్రహ్మోపాసకులు నన్నే పొందుతారు **(మామేవ ప్రాప్నువన్తి)** అని చెప్పిన భగవానుడు, సాకారోపాసకుల్ని తానే ఉద్ధరిస్తానని ప్రస్తుత శ్లోకంలో చెబుతున్నాడు **(తేషాం అహం సముద్ధర్తా)**. దేని నుండి ఉద్ధరిస్తాడు? మృత్యురూప సంసార సాగరం నుండి ఉద్ధరిస్తాడు **(మృత్యు సంసార సాగరాత్)**. ఎవరిని ఉద్ధరిస్తాడు? చిత్తమును తన యందే నిలిపిన భక్తుల్ని ఉద్ధరిస్తాడు **(మయ్యా వేశిత చేతసామ్)**. ఆ భక్తులు ఎలాంటి వారు? ఎవరు?

సర్వ కర్మలను పరమాత్మ యందే సమర్పించిన వారు **(సర్వాణి కర్మాణి మయి సన్న్యస్య)**. భగవంతుడే పరమగతి యని భావించే వారు **(మత్పరాః)**. అనన్య యోగంతో భగవంతుణ్ణే ధ్యానిస్తూ ఉపాసించే వారు **(అనన్యేనైవ యోగేన మాం ధ్యాయన్త ఉపాసతే)**. వీరే ప్రస్తుతం పరమేశ్వరుని చేత ఉద్ధరింపబడే భక్తులు. ప్రస్తుతం మనం అధ్యయనం చేస్తున్న శ్లోకద్వయంలో మొదటి శ్లోకంలో భక్తుడు ఆచరించ వలసిన సాధన, రెండవ శ్లోకంలో తద్వారా ప్రాప్తించే ఫలమును తెలుపుతున్నాడు భగవంతుడు.

సర్వకర్మ సమర్పణము

ఎవరికి మనం ఏది సమర్పించినా, ఆ సమర్పించ బడేది సమర్పించిన తరువాత వారిది అవుతుంది. అంటే, సమర్పించక ముందు అది మనదిగా ఉంటుంది అనేది స్పష్టం.

ప్రస్తుతం కర్మలను సమర్పించడం జరుగుతూ ఉంది. మన కర్మలను ఈశ్వరునికి సమర్పిస్తున్నాం **(కర్మాణి ఈశ్వరే సంన్యస్య)**. అంటే, అంతకు పూర్వం ఆ కర్మలు మనవిగా ఉన్నాయి అని అర్థం. అవి ఏ కర్మలు? మన ద్వారా ఆచరింపబడే సమస్త కర్మలు **(సర్వాణి కర్మాణి)**. అవి వేదోక్తమైన యజ్ఞయాగాదులు కావచ్చు. స్మృతి ప్రతిపాదితమైన పూజాదికాలు కావచ్చు. నిత్య నైమిత్తికాలు కావచ్చు. లేదా లౌకిక కర్మలు

కావచ్చు. ఇవన్నీ ఇంతవరకు మనవి గానే ఉన్నాయి. కర్మయోగులైన భక్తులు ఆ కర్మల నన్నిటినీ పరమాత్మ యందే సమర్పిస్తారు. ఈ క్షణం వరకు, అంటే సమర్పించే క్షణం వరకు అవి మన కర్మలు అనే బుద్ధి ఉండింది. వాటినే ఈశ్వరునికి అర్పించడం చేత, 'మమ' బుద్ధి తొలగి, ఈశ్వరార్పణ బుద్ధి కలుగుతూ ఉంది. కర్మాచరణము నందు గాని, కర్మ ఫలానుభవము నందు గాని 'నేను - నాది' అనే బుద్ధి దూరమై ఈశ్వర భావమే ప్రకాశిత మవుతూ ఉంది.

కర్మాచరణంలో సర్వకర్త అయిన పరమేశ్వరుని వైభవాన్ని గుర్తించడం చేత **అహం కర్తా** అనే భావన అదృశ్యమై, **హరిః కర్తా** అనే దివ్యభావన ప్రకాశిస్తుంది. కర్మాచరణము నందు కర్మాసక్తి లేనందున, ఫలానుభవంలో ఫలాసక్తి అదృశ్యమై, ప్రసాద భావన ప్రసన్న మవుతుంది. కర్మల విషయంలో భక్తుడు నిమిత్తంగా శోభిస్తాడు. సూత్రధారి యైన పరమేశ్వరుని చేతిలో పాత్రధారిగా మారుతాడు. చూచేందుకు ఉపకరించే కన్ను లాగా, వ్రాసేందుకు ఉపయోగపడే పెన్ను లాగా మారుతాడు.

ప్రస్తుతం నా చేతి లోని కలం నా ముందున్న కాగితముపై కదులుతూ ఉంది. గీతా వ్యాఖ్యానము వ్రాస్తూ ఉంది. ఇక్కడ వ్రాసేది కలమా, నేనా? నేనే. కలాన్ని చేత పట్టుకొని నేనే వ్రాస్తున్నాను. కలం నా చేతిలో పనిముట్టుగా కదుల్తూ ఉంది. ఏమి వ్రాయాలో, ఎలా వ్రాయాలో తెలిసేది నాకే గాని కలానికి కాదు. అలాంటప్పుడు రచనా వ్యాపకం కలాని కెందుకు? వ్రాసేది, వ్రాయించేది నేనే అయినపుడు, కలానికి కంగా రెందుకు? పనిముట్టు పనిముట్టుగా ఉండ గలిగితే చాలు. పని గట్టుకొని కులక నవసరం లేదు. ఈ పని చేయగలిగితే, పనిముట్టు పని నుండి విడిపడి పోతుంది. పని, పనితనము రెండిటి లోను తనకు కర్తృత్వము ఉండదు. కర్తృత్వమే లేనపుడు కర్తృత్వాభిమానము ఉండదు. కర్తృత్వము, కర్తృత్వాభిమానము లేనపుడు, భోక్తృత్వము, భోక్తృత్వాభిమానము కూడా ఉండవు. పనులన్నీ ఉన్నట్లే ఉంటూ లేనివిగా మారి పోతాయి. ఇది కర్మసన్యాసము కాదు. కర్మలలో సన్యాసము. అదే కర్మయోగ వైభవము. భక్తుని జీవనకళా ప్రాభవము.

తనది కాని దానిని ఇంతవరకు అభిమానంతో తనదిగా భావించిన వాడు, అభిమానాన్ని త్యజించి తన కర్మలను ఈశ్వర కర్మలుగా గుర్తించి సమర్పించడం జరిగింది. వాస్తవానికి సమర్పించక పూర్వము కూడా అవి తన కర్మలు కావు. తెలియక తన కర్మలని ఇంతవరకు భ్రమించిన వాడు, అవి తనవి కావనే సత్యాన్ని గుర్తించ గానే తనవి కానివి, కానివి గానే దూర మౌతున్నాయి. ఇంతకీ దూర మయ్యేవి కర్మలా, కర్మల యందలి అభిమానమా? కర్మలు దూరం కావు, కాలేవు. అభిమానమే దూర మవుతూ ఉంది. కనుక కర్మల యందు అభిమానమును వదలడమే గాక, అలా అభిమానాన్ని వదులుతున్నాను అనే భావనను కూడా వదిలేయాలి. 'నేను వదిలేశాను' అనే భావనను కూడా వదిలి పెట్టడమే సర్వకర్మ సమర్పణము. మాధవుని చేతిలో మురళి అలాగే జీవించింది. ఏమీ లేనిదిగా మిగిలి, అన్నీ తానైన మాధవుని చేతిలో అందంగా కులికింది. అమృత నాదాలను పలికింది. మాధవుని వైభవాన్ని ప్రదర్శించే పనిముట్టు అయింది. అందుకే తన అధరామృతాన్ని పంచి వేణువుకు విందు చేశాడు వేణుగోపాలుడు.

చరణము: **వనమున పెరిగిన వెదురు కూనను ముద్దుల మురళిగ మార్చాడు**
మోహన వంశిని పలికించి జగతిని మురిపించాడు
బృందావనిలో మురళీనాదం - భక్తుల పాలిటి అమృతగానం

పల్లవి: **నల్లని వాడు అల్లరి వాడు**
చైతన్యుని యెదలో మాధవుడు ॥ నల్లని ॥

అని వేణునాద వైభవాన్ని వర్ణించింది చైతన్య గీతిక.

ఈ విధమైన సర్వకర్మ సమర్పణము జరిగి, కర్మలలో కర్తృత్వ భోక్తృత్వ అభిమానం సంపూర్ణంగా త్యజింప బడాలి అంటే, లక్ష్య సిద్ధి ఉండాలి. తాను ఆచరించే కర్మలు ఏ వైపుకు పయనిస్తాయో తెలిసి ఉండాలి. అదే గమ్యస్థాన మంటే. అభిమానమును త్యజించి, నిమిత్తమాత్రంగా కర్మలను ఆచరించే భక్తునికి పరమ గమ్యము భగవంతుడే **(మత్పరాః)**.

మత్పరత్వము

భక్తులకు పరమ పురుషార్థము భగవంతుడు. నదికి సముద్రము గమ్య మైనట్లు, భక్తులకు భగవంతుడే పరమ గమ్యము. అదే మత్పరత్వము. అంటే పరమేశ్వరునే ఉత్తమ గమ్యముగా, ఏకైక గమ్యముగా కలిగి ఉండటము ***(మత్పరాః అహం పరః యేషాం తే మత్పరాః సన్తః)***.

పరమేశ్వరుని పరమ గమ్యంగా భావించి, పరమేశ్వరుని చేతిలో పనిముట్టుగా నిమిత్తమాత్రంగా భక్తుడు కర్మాచరణంలో ఉంటాడు. కర్మసంగం లేకుండా కేవలం చిత్తశుద్ధి కొరకు కర్మలను అభిమాన రహితంగా ఆచరిస్తూ ఉంటాడు.

యోగినః కర్మ కుర్వన్తి సంగం త్యక్త్వా ఆత్మశుద్ధయే - సంగత్వాన్ని విడిచి, కేవలం చిత్తశుద్ధి కొరకే యోగులు కర్మల నాచరిస్తారు అని ఐదవ అధ్యాయంలో భగవంతుడు చెప్పినట్లు *(5 -11)* జీవించే వారే మత్పరులు.

కర్మయోగులైన భక్తులు మోక్షమునే పరమావధిగా భావిస్తారు కనుక, మోక్షార్థం చిత్తశుద్ధిని వాంఛించి కర్మఫలాసక్తి లేకుండా కర్మల నాచరిస్తారు. వివిధములైన కర్మలు వారి ద్వారా జరుగుతూ ఉంటాయి. వారు ఆచరించే కర్మలకు అనుగుణంగా మనోవృత్తులు మారుతూ ఉంటాయి. వృత్తి మార్పు జరుగుతున్నా, వృత్తి లోని భావన మాత్రం అచ్యుతుడే అయి ఉంటాడు. ఇదే మత్పరత్వము. కాస్త జాగ్రత్తగా అర్థం చేసుకోవలసిన విషయము. సోదాహరణంగా చెప్పుకుందాం.

పరిచర్య ప్రవృత్తి

ఒక పరిచారిక యజమాని గృహంలో ఊడిగం చేస్తూ బ్రతుకుతూ ఉంటుంది. ఆమె పూరిగుడిసెలో తన బిడ్డతో కలిసి జీవిస్తూ ఉంటుంది. రెక్కాడితే గాని డొక్కాడదు. బిడ్డ ఒక్కడినే గుడిసెలో ఉంచి ఆమె ఊడిగం చేయడానికి వెళ్తుంది.

యజమాని బిడ్డ కూడా తన బిడ్డ వయస్సు వాడే. యజమాని ఇంట్లో యజమాని బిడ్డకు పరిచారిక స్నానం చేయిస్తుంది. బట్టలు తొడుగుతుంది. బువ్వ పెడుతుంది. బొమ్మలతో ఆడిస్తుంది. చేసే పనులన్నీ యజమాని బిడ్డ కొరకే. కానీ, ఆమె బుద్ధిలో మాత్రం గుడిసెలో ఒంటరిగా ఉన్న తన బిడ్డే మెదుల్తూ ఉంటాడు. కదుల్తూ ఉంటాడు. చేతులలో యజమాని బిడ్డ ఉన్నా, చిత్తంలో తన బిడ్డే ఉంటాడు. తన బిడ్డకు సంబంధించిన ఆలోచనే ఉంటుంది.

పనులు మారుతున్నా, ఆమె ప్రవృత్తి ఒకే విధంగా ఉంటుంది. వ్యవహారము భిన్నంగా ఉన్నా, మనో వైఖరిలో మార్పు ఉండదు. ఇక్కడ శ్రద్ధ పెట్టి అర్థం చేసుకోండి.

యజమాని బిడ్డకు చేసే పరిచర్యలు వేరు వేరుగా ఉన్నాయి. స్నానం చేయించడం వేరు. బట్టలు తొడగటం వేరు. అన్నం పెట్టడం వేరు. ఆట లాడించడం వేరు. ఏయే పనులు చేస్తూ ఉంటే, ఆయా పనులకు సంబంధించిన ఆలోచనలే, భావాలే, వృత్తులే మనస్సులో కదులుతూ ఉంటాయి.

స్నానానంతరం బట్టలు తొడిగే టప్పుడు బుద్ధిలో బట్టలకు సంబంధించిన వృత్తులు కదుల్తాయే గాని, బొమ్మలకు సంబంధించిన వృత్తులు కదలవు. భోజనానంతరం బిడ్డను ఆట లాడించే సమయంలో బొమ్మలకు సంబంధించిన ఆలోచనలు లేదా వృత్తులు ఆమె మనస్సులో ఉంటాయే గాని స్నానాలగది లోని వస్తువులకు సంబంధించిన వృత్తులు కదలవు.

చేసే పనులు మారుతూ ఉంటే, వాటికి సంబంధించిన వృత్తులు కూడా మనస్సులో మారుతూ ఉంటాయి. ఏ పని చేస్తూ ఉంటే, దానికి సంబంధించిన ఆలోచనలే కదుల్తూ ఉంటాయి.

కానీ, పనులు మారుతున్నా, ఆయా పనులకు సంబంధించిన వృత్తులు బుద్ధిలో మారవచ్చు నేమో గాని, వృత్తుల లోని విషయం మాత్రం గుడిసెలో ఒంటరిగా ఉన్న తన బిడ్డే గాని యజమాని పుత్రుడు కాడు. అతనికి సంబంధించిన కార్యాలు కావు. వృత్తి ఏదైనా కావచ్చు. వృత్తి విశేషం మాత్రం గుడిసెలో ఏకాకిగా ఉన్న తన పుత్రుడే.

భక్తుడైన కర్మయోగి జీవితంలో ఎన్ని కర్మ లాచరించినా, ఆయా కర్మలకు సంబంధించిన వృత్తులు బుద్ధిలో కదులుతూ ఉండినా, సర్వ కర్మలను పరమేశ్వరుని యందు సమర్పించి, భగవంతుడే పరమగతిగా భావించి జీవించే అతనికి, బుద్ధి లోని వృత్తి విశేషము మాత్రం ఒక్క భగవంతుడే అయి ఉంటాడు. ఇదే మత్పరత్వ మంటే.

పరిచారిక వివిధ కార్యాలు ఆచరిస్తున్నా, వాటికి సంబంధించిన ఆలోచనలు ఆమె మనస్సులో కదులుతూ ఉండినా, ఆమె మనస్సు లోని ఆలోచన లన్నిటిలో గుడిసెలో ఒంటరిగా ఉన్న తన బిడ్డే ఉన్నట్లు,

భక్తుడు ఏ పనులు చేస్తున్నా, వాటికి సంబంధించిన ఆలోచనలే అతని మనస్సులో కదులుతూ ఉండినా, అతని మనస్సు లోని ఆలోచన లన్నిటిలో తన గుండె గుడిలో శోభిస్తున్న ఏకాంత రామయ్యే నిండి ఉంటాడు. ఇదే మత్పరత్వము. కర్తృత్వాలు, అభిమానాలు అంతరించిన పుణ్య కాలంలో కర్పూర కాంతి లాగా శోభిస్తున్న భక్తి తత్త్వము.

చరణము: **కలిసొచ్చిన విధి పోయిందని**
కదిలొచ్చిన గతి తోడుందని
వెన్నుడు మదిలో ఒదిగిపోగా
కన్నులలో కాంతి వెలిగిందని
హృదిలో శాంతి నిలిచిందని

పల్లవి: **సత్యమైన నీ కథ విని**
వినిపించింది మనసు మనవిని

అనుపల్లవి: **పోయిన పున్నమి వచ్చిందని**
చేసిన పున్నెము తెచ్చిందని **॥ సత్యమైన ॥**

అని మత్పరత్వంలో మైమరచింది చైతన్య గీతిక.

తదేక నిష్ఠ

సర్వ కర్మలను భగవంతునికి సమర్పించి, భగవంతుడే పరమగతిగా భావించి జీవించే భక్తులు అనన్య యోగంతో పరమాత్మనే ధ్యానిస్తూ, ఉపాసిస్తూ ఉంటారు. అనన్య యోగము అంటే ఏమిటో కూడా స్పష్టంగా అర్థం చేసుకోవాలి.

అనన్యేన అంటే మరొకటి వేరుగా లేనిది అని అర్థము. **యోగేన** అంటే యోగంతో అని అర్థము. మరొక ఆధారము లేదా ఆశ్రయము తెలియని యోగము అనన్య యోగము. అంటే, పరమేశ్వరుడు తప్ప మరొక ఆశ్రయము తెలియని యోగముతో భక్తులు భగవంతుని ఆరాధిస్తూ ధ్యానిస్తారు. ధ్యానిస్తూ ఉపాసిస్తారు ***(అనన్యేన ఏవ అవిద్యమానమ్ అన్యత్ ఆలంబనం విశ్వరూపం దేవం ధ్యాయన్తః చిన్తయన్తః ఉపాసతే).*** ఇదే అనన్య యోగంతో కూడిన భక్తిరూప ధ్యానము; లేదా ధ్యానరూప భక్తి. సగుణ బ్రహ్మ విషయ మానస వ్యాపారము.

నీవే తప్ప నితః పరం బెరుగ - నువ్వు తప్ప నాకు వేరే దిక్కు లేదు అని గజేంద్రుడు అన్యాశ్రయాలను వదలి శ్రీహరిని ఆశ్రయించడమే అనన్య యోగము. అందుకనే, ***అన్యాశ్రయాణాం త్యాగః అనన్యతా -*** అన్యములైన ఆశ్రయాలను విడిచి పెట్టి ఈశ్వరు నొక్కడినే ఆశ్రయించడం అనన్య భక్తి అని నారద మహర్షి భక్తి సూత్రాలలో ప్రవచించాడు.

కొందరు కుహనా భక్తులు చేసే దంతా రాగద్వేషాల పంచన నిలబడి చేసేస్తూ, నాదేముంది? అంతా పై వాడే నడిపిస్తున్నాడు. నేను నిమిత్తమాత్రుణ్ణి అని దంత వేదాంతాన్ని దంచేస్తుంటారు.

ఇలాంటి సమయాల్లోనే పై వాడు క్రిందికి చూస్తాడు. అంతే. సర్వం తలక్రిందు లౌతుంది. అప్పుడు మరో దంత వాక్యం వినిపిస్తారు. ఏం చేద్దాం! నా కర్మ అలా కాలింది, పై వాడు మాత్రం ఏం చేస్తాడు? అంటారు. ఈ బుద్ధి ముందే ఉండి ఉంటే, 'నా కర్మ' అనేదే ఉండేది కాదు కదా! నీ కర్మ కానిది 'అతని కర్మ' కదా! అతని కర్మను చక్కదిద్దుకో వలసిన అవసరం అతనిదే కదా! ఇక నీకు దిగు లెందుకు? భగవంతుడు కూడా అదే చెబుతున్నాడు.

ఉద్ధారకుని ఉదంతము

పార్థా! నా మీదనే మనస్సు పెట్టిన వారిని నేను ఉద్ధరించకుంటే మరెవరు ఉద్ధరిస్తారు? అనన్య శరణులు, మత్పరులైన భక్తులను **(తేషాం)** నేను ఉద్ధరిస్తాను **(అహం సముద్ధర్తా).** దేని నుండి ఉద్ధరిస్తా నంటావా! మృత్యుసంసార సముద్రం నుండి ఉద్ధరిస్తాను **(మృత్యు సంసార సాగరాత్).**

జననమరణ రూప సంసారము తీరము లేని సముద్రము. ఎంత ఈదినా మునగడమే గాని తేలడము ఉండదు. పైకి లేవడము ఉండదు. ఇది మృత్యువుతో కూడిన సంసారము. అందుచేత మృత్యు సంసారము. మృత్యువు ఉంది అంటే జన్మము కూడా ఉండాలి కదా! అదే సంసార శబ్దార్థము.

సంసారము ఉంది అంటే సంసర్గము ఉంది అని అర్థము. సంసృష్టి ఉందనే భావము. పుట్టుక లేకుండా సంసారము ఎలా ఉంటుంది? పుట్టిన వారికే సంసారం ఉంటుంది కనుక, మృత్యు సంసార సాగరము అంటే జననమరణ రూప సముద్రము అని అర్థము.

మృత్యు సంసార సాగరాత్ అనే సమాసానికి శ్రీ శంకరులు **మృత్యు యుక్తః సంసారః, స ఏవ సాగరః దుస్తరత్వాత్, తస్మాత్ మృత్యు సంసార సాగరాత్ -** మృత్యువుతో కూడిన సాగరము మృత్యు సాగరము, దాట శక్యము కానిది. అందుచేత అది మృత్యు సంసార సాగరము అని నిర్వచించారు. దాని నుండి భగవంతుడు మనల్ని ఉద్ధరిస్తాడు. కనుక మృత్యు యుక్త సంసార సాగరము అని ఆచార్యుల వారు అర్థం చెప్పిన సమాసంలో, **యుక్తః** అనే పదము మూలంలో లోపించి ఉంది. దీనినే **మధ్యమ పద లోప సమాసం** అంటారు. **యుక్తః** అనే పదము మధ్యలో లోపించిన సమాసము. పైన నేను తెలిపినట్లు, 'సంసార' శబ్దాన్ని జననముగా స్వీకరించ వచ్చు. దోషం లేదు.

ఈ విధమైన జనన మరణ రూప సంసార సాగరంలో పడి జీవులు పరిభ్రమిస్తూ ఉంటారు. ఇది దుస్తరమైన భవ సాగరము. ఇదొక సంసార సుడిగుండం. సాలెవాడు వస్త్రాన్ని నేసే టప్పుడు మగ్గము నాడె ఒక వైపు నుండి మరొక వైపుకు వేగంగా ఎలా పరుగు తీస్తుందో, జీవులు కూడా జననమరణాల మధ్య పరుగులు పెడుతూ ఉంటారు. వేదాంత పంచదశిలో శ్రీ విద్యారణ్య స్వామి జీవుల జననమరణాలను నదిలో సుడిగుండాల మధ్య వేగంగా దొర్లిపోతున్న కీటకాన్ని ఉదహరిస్తూ ప్రబోధించారు.

నద్యాం కీటా ఇవ ఆవర్తాత్ ఆవర్తాన్తర మాశు తే,
వ్రజన్తో జన్మనో జన్మ లభన్తే నైవ నిర్వృత్తిమ్ ॥

నదిలో ***(నద్యాం)*** ఒక సుడి నుండి మరొక సుడి లోకి ***(ఆవర్తాత్ ఆవర్తాన్తరమ్)*** పురుగు ***(కీటా)*** వేగంగా దొర్లినట్లు ***(ఆశు వ్రజన్తః),*** జీవులు ***(తే)*** ఒక జన్మ నుండి మరొక జన్మకు ***(జన్మనః జన్మ)*** పోతూ ఉంటారు. దాని నుండి విముక్తిని పొందరు ***(నిర్వృత్తిమ్ న ఏవ లభన్తే).***

ఈ విధమైన జనన మరణ రూప సంసార సాగరం నుండి అనన్య భక్తులను భగవంతుడు ఉద్ధరిస్తాడు. ఈ సందర్భంలో **ఉద్ధర్తా** అని గాక, **సముద్ధర్తా** అని ఉపసర్గను చేర్చి మరీ ఉద్బోధించాడు. **సముద్ధర్తా** అంటే చక్కగా ఉద్ధరిస్తాను, లేదా తప్పక ఉద్ధరిస్తాను అని అర్థము.

ఉద్ధర్తా శబ్దానికి మరొక అర్థాన్ని కూడా గ్రహించ వచ్చు. **ఉత్** అంటే పైన, లేదా ఊర్ధ్వంగా అని అర్థము. ***ధర్త*** అంటే నిలిపే వాడు అని అర్థము. అనన్య చిత్తులైన నా భక్తులను సర్వ ఉపద్రవాలకు పైన **(ఉత్)** నేను నిలుపుతాను ***(ధారయితను)*** అని వాగ్దానం చేస్తున్నాడు వాసుదేవుడు. బ్రహ్మము నందు నిలుపుతాను అని హామీ ఇస్తున్నాడు. ఈ విధంగా బ్రహ్మాదులకు సైతం లభ్యం కాని భగవంతుడు, భక్తుల విషయంలో ప్రసన్నుడై, వారిని భవసాగరం నుండి బయట పడేస్తున్నాడు. ఇదే అనన్య భక్తి ఫలం.

చిలిపి చిలిపి పనుల చక్కనయ్య
బ్రహ్మారుద్రాదుల కైన నీవు చిక్కవయ్య
తలచి వలచిన వారికే దక్కినావు
నీ అడుగుల కడ పడి ఉందు చిన్నికృష్ణా!

అని చిన్నికృష్ణ శతకంలో ఒక వెన్నముద్ద.

ఇక భక్తులు చేయవలసింది ఏమిటో చెబుతున్నాడు.

మయ్యేవ మన ఆధత్స్వ మయి బుద్ధిం నివేశయ । 8
నివసిష్యసి మయ్యేవ అత ఊర్ధ్వం న సంశయః ॥

మయి-ఏవ-మనః-ఆధత్స్వ-మయి-బుద్ధిం-నివేశయ
నివసిష్యసి-మయి-ఏవ-అతః-ఊర్ధ్వం-న-సంశయః

మయి ఏవ	=	నా యందే	నివేశయ	=	ప్రవేశ పెట్టుము
మనః	=	మనస్సును	అతః ఊర్ధ్వం	=	అటు పిమ్మట
ఆధత్స్వ	=	ఉంచుము	మయి ఏవ	=	నా యందే
మయి	=	నా యందే	నివసిష్యసి	=	నివసింతువు
బుద్ధిం	=	బుద్ధిని	న సంశయః	=	సందేహము లేదు

అర్జునా! నీ మనస్సును నాపై పెట్టు. బుద్ధిని కూడా నా పైనే ఉంచు. ఆ తరువాత నువ్వు నా లోనే ఉంటావు. సందేహించకు.

వ్యాఖ్య

సతతయుక్తులై పరమేశ్వరునే ప్రీతితో సేవించే వారికి బుద్ధి యోగాన్ని ప్రసాదిస్తాను అని విభూతి యోగంలో తెలిపిన భగవంతుడు *(10 - 11)*, అనన్య యోగముతో భగవంతుడే పరమగతి అని భావించి సదా ధ్యానిస్తూ ఉపాసించే భక్తులను తానే ఉద్ధరిస్తాడని, అది కూడా శీఘ్రంగా ఉద్ధరిస్తాడని పూర్వ శ్లోకంలో చెప్పడం జరిగింది. ఇక, మనం చెయ్య వలసిందే మిగిలి ఉంది. ఈ శ్లోకం నుండి అన్నీ సాధనకు సంబంధించిన విషయాలే. శ్రద్ధగా చెప్పుకుందాం.

మాధవుని యందే మనస్సు

అర్జునా! నీ మనస్సును నా యందే ఉంచు **(మయ్యేవ).** మరొకచోట ఉంచకు అని దాని అర్థము. అదే ఏవ శబ్దము. భగవంతుడు కాని దాని యందు మనస్సును ఉంచకు అని అర్థము. అనన్య యోగాన్ని గూర్చి పూర్వ శ్లోకం లోనే చెప్పి ఉన్నాడు కనుక, అన్య విషయాలపై మనస్సు పెట్టవద్దు అంటున్నాడు. నా యందే ఉంచు అంటున్నాడు.

ఇక్కడ మనస్సును తన మీదే పెట్టమని భగవంతుడు చెప్పడంలో విశ్వరూప పరమేశ్వరుడైన సగుణ బ్రహ్మము నందే పెట్టమని అర్థము **(విశ్వరూపే పరమేశ్వరే మనః ఆధత్స్వ స్థాపయ).**

ఒక కార్యాన్ని ఆరంభించ మని ఎవరు చెప్పినా, ఆ కార్యము ఇంకా ఆరంభం కాలేదని అర్థము. ఒకవేళ ఆరంభమైనా సరిగా లేదు అని భావము. మనస్సును నా యందు ఉంచు అని పరమేశ్వరుడు ఆజ్ఞాపించాడు అంటే, ఇంకా మన మనస్సు భగవంతునిపై పెట్టడం జరగ లేదని అర్థము. ఒకవేళ పెట్టినా, సరిగా ఉంచడం లేదని భావము. అందుకనే ఫలితాలు అందక, నా మనస్సు నిలవడం లేదండి, కూర్చోవడం లేదండి, పడుకోవడం లేదండి అని ఊకదంపుడు కబుర్లు వినిపిస్తూ ఉంటాము.

మనస్సును భగవంతునిపై పెట్టడం అంత సులభ సాధ్యమైన విషయం కాదు. దానికి ఎంతో సంస్కారం ఉండాలి. వివేక వైరాగ్యాలు కనీసం అవసర మైనంతైనా ఉండి తీరాలి. భావస్పందన కూడా కావాలి. ఇవన్నీ ప్రయత్నశీలురకే ప్రాప్తిస్తాయి.

మనస్సు నీళ్ళ లాంటిది. ఒకచోట నిలవదు. నీళ్ళు ఎలా పారుతూ ఉంటాయో, మనస్సు అలా పారిపోతూ ఉంటుంది. అది కూడా పైకి పోదు. నీళ్ళు ఎలా పల్లానికి ప్రవహిస్తాయో, మనస్సు కూడా ఊర్ధ్వంగా భగవంతుని వైపు నడవకుండా, అధోముఖంగా ప్రపంచం వైపు పరుగులు పెడుతూ ఉంటుంది.

నీళ్ళల్లో ఉండే మరొక విశేష మేమిటంటే, అది ఏ పాత్రలో పోస్తే ఆ రూపం ధరిస్తుంది. దేనిలో పోస్తే దాని రూపాన్నే, లేదా ఆకారాన్నే పొందుతుంది. చెంబులో నీళ్ళు పోస్తే, నీళ్ళు కూడా గుండ్రంగా ఉన్నట్లు కనిపిస్తాయి. కూజాలో పోస్తే కూజా ఆకారాన్ని ధరిస్తాయి. చదరంగా ఉండే పాత్రలో పోస్తే, చదరంగా కనిపిస్తాయి. దీర్ఘ చతురస్రంగా ఉండే పాత్రలో పోస్తే దీర్ఘచతురస్రంగా గోచరిస్తాయి. తన కంటూ ప్రత్యేక ఆకృతి లేని జలం, దేనిలో పోస్తే దాని ఆకృతిని ధరిస్తూ ఉంటుంది. రూప మెలాగో, రంగు అయినా, రుచి అయినా అంతే.

మనస్సు కూడా ఏ విషయం పైకి మరలితే, దాని ఆకారాన్ని పొందుతూ ఉంటుంది. అందుకే మనస్సులో విషయాకార వృత్తులు తిష్ఠ వేసి ఉంటాయి. మనస్సుకు తెలిసినవే మనస్సులో ఉంటాయి. తెలియనివి ఉండ లేవు. తనకు లేని అనుభవాలను మనస్సు తనలో ఉంచుకో లేదు. ప్రపంచం తన అనుభవంలో ఉంది కనుక,

దాని వైపుకే మనస్సు పరుగులు పెడుతుంది. భగవ ద్విషయం మనస్సు యొక్క అనుభవంలో లేదు. అందుచేత, మనస్సు భగవంతునిపై నిలవదు. గీతాచార్యుడేమో నీ మనస్సును నా యందు ఉంచు అంటున్నాడు **(మయ్యేవ మన ఆధత్స్వ).**

అనుభవాలే అవరోధాలు

తెలియనివి సందేహాలను కదిలించి కలత పెడతాయి. తెలిసినవి స్వానుభవాన్ని స్మృతికి తెచ్చి వేధిస్తాయి. భగవంతునిపై మనస్సును పెట్టా లనుకున్నా పెట్టలేక పోవడానికి ఈ రెండు అవరోధాలే కట్టని గోడలై అడ్డు నిలుస్తున్నాయి.

భగవంతుడు ఉన్నాడు అని నమ్మి, ఏదో తమకు తోచిన, లేదా ఇతరులు తమపై మోపిన భావాలను మోసుకొని భారంగా భక్తి చేయడమే గాని, భగవంతుడు అంటే ఏమిటో, ఆయన స్వరూప స్వభావాలు ఏమిటో యథార్థంగా తెలిసిన వారు చాలా అరుదుగా అగుపిస్తారు. ఎక్కువ శాతం భగవంతునికి సంబంధించిన అవగాహన పూర్ణంగా లేని వారే ఉంటారు. కాని, ఉన్నట్లు అగుపిస్తారు.

భగవంతుడు అంటే ఏమిటో అర్థం కాని వారు భగవంతునిపై మనస్సు నెలా ఉంచుతారు? కనుక తెలియనితనము, అంటే జ్ఞానము లేకపోవడము భగవంతునిపై మనస్సు నిలుపలేక పోవడానికి ఒక ముఖ్య కారణము.

మొదటి కారణము తెలియనితన మైతే, రెండవ కారణము తెలిసిన తనము. భగవంతునిపై మనస్సు నిలవక పోవడానికి భగవంతునికి సంబంధించిన జ్ఞానము లేక పోవడము ఒక కారణ మైతే, ప్రపంచానికి సంబంధించిన విషయానుభవ జ్ఞానము పుష్కలంగా ఉండటము మరొక కారణము. ఇది స్వానుభవం. తనకే తెలిసిన విషయం. తన అనుభవ సారంగా మనస్సులో తిష్ఠ వేసి యున్న జ్ఞానము. ఏమిటా జ్ఞానము? ఏమిటా అనుభవం?

అదే విషయానుభవము. ప్రాపంచిక విషయానుభవ జ్ఞానము. పూర్వానుభవ సారము. గతంలో మనస్సును మనం ఎన్నో చోట్ల ఉంచాము. ఎందరి పైనో పెట్టు కున్నాము. అలా ఎందుకు పెట్టుకున్నామో, ఏమి సాధించాలని పెట్టుకున్నామో, అది మనకే తెలుసు. అంతేకాదు. ఆశించింది సాధించలేక పోయామని కూడా తెలుసు. మనస్సును ఎక్కడుంచినా, ఎవరి కిచ్చినా అది చితికి పోయిందే గాని బ్రతికి బట్ట కట్ట లేదు. మోదాన్ని ఊహించి మోసాన్ని రుచి చూసింది. ప్రమోదాన్ని కాంక్షించి ప్రమాదాలలో నలిగి పోయింది. ప్రతి చోటికి పూల దోసిళ్ళతో పరుగులు తీస్తూ వెళ్ళడం, రాళ్ళ దెబ్బలతో రాటుదేలి తిరిగి రావడం - జన్మజన్మలలో ఇలాగే అలసి పోయింది. అన్యాయమై పోయింది. విచలితమై పోయింది. విశ్వాసాన్ని ఎక్కడో పారేసుకుంది. నమ్మక మేదైనా వమ్ము చేసేదే. విశ్వసిస్తే విఘాతాలే మిగుల్తా యని, విషాదాలే ఎదురవుతా యని భీతి చెందుతోంది. చేసిన స్నేహాలు, చూసిన సంబంధాలు అన్నీ సంతాపాలనే అందించడం చేత, నేడు భగవంతునితో సంబంధాన్ని పెట్టుకోవాలన్నా, హృదయంలో ఏదో ఓ మూల సందేహం పట్టి పీడిస్తూనే ఉంది. తరిస్తానో, అంతరిస్తానో అని మనస్సు ఆవేదన చెందుతూనే ఉంది.

విసిగి పోయాను విని విని జగతి గోడు
నిన్ను చేరాలని నా మనసు జగడ మాడు
అడుగుతున్నాను అడుగైన వేయలేక
నీ అడుగుల కడ పడి ఉందు నీలకంఠా! అని నీలకంఠ శతకంలో ఒక విబూది పండు.

దేహంలో మనస్సు, మనస్సులో సందేహము - అవి అలా ఉండాల్సిందే. అలాగే ఉంటాయి కూడా. పరమాత్మ జ్ఞానం కలిగే వరకు ఈ జంటలు విడి పోకుండా ఉంటాయి. సందేహ మనేది మనస్సులో ఉండక పోతే మట్టిలో ఉంటుందా? ఎందుకు ఉంది అంటే ఏమి చెప్పగలం? మనస్సు అంటే ఏమిటో తెలియక పోవడమే ఈ ప్రశ్న వేయడానికి కారణము.

సందేహాల పుట్టనే మనస్సు అంటారు. నిశ్చయ జ్ఞానము లేనపుడే సందేహం పుట్టు కొస్తుంది. ఏ విషయాన్నైనా పిచ్చి పట్టినట్లు చిందులేస్తూ ఆలోచించడమే గాని, ఏ ఒక్క విషయానికి సంబంధించిన నిశ్చయ జ్ఞానము కూడా మనస్సులో ఉండదు. అందుకే సందేహాలు, సంతాపాలూను.

మనః సంకల్ప వికల్పాత్మకమ్ - సంకల్ప వికల్పాలతో కూడిన దానిని మనస్సు అంటారు. రెండు చేతు లున్నందుకు, ఎప్పుడూ రెండు విషయాలను చేత పట్టుకొని, ఈ రెండిటిలో ఏది సమంజసము - ఏది అసమంజసము, ఏది మేలు - ఏది కీడు అంటూ నిశ్చయం లేకుండా సంశయంలో పడి కొట్టుమిట్టాడే దానినే మనస్సు అంటారు.

మనిషితో దిన మంతా మనస్సే కలిసి ఉంటుంది. మనిషి నిద్రించినా, మనస్సు మేలుకొని కలలు కంటూ ఉంటుంది. అన్నిచోట్ల చూపులే. మనస్సు పొరపాటున కూడా చేతలలో చేయి దూర్చదు. రోజంతా తోడు ఉంటుంది. క్షణం కూడా సందేహంపై మోజు విడిచి పెట్టదు. రోజు ప్రారంభమే సందేహం మోజులో ఆరంభ మౌతుంది. నిద్ర లేవడమే సందేహంతో మనస్సు నిద్ర లేస్తుంది.

మనిషి రాత్రి ఎన్ని గంటలు నిద్రించినా, నిద్ర లేచే సమయంలో ఇప్పుడే లేద్దామా, మరి కొంత సేపు పడుకుందామా? అనే సందేహంలో పడతాడు. అంటే, మనిషి లేవక ముందే మనస్సు ముస్తాబై సందేహాల మూటను నెత్తి నెట్టుకొని సిద్ధంగా ఉందన్న మాట. ఇక, మనిషి నిద్ర లేచి మాత్రం సాధించే దేముంటుంది? నిద్ర పోని మనస్సుతో కాపురమే కదా! మనస్సు మేలుకొని ఉన్నంత కాలం దాని సంతర్పణే సరిపోయె! ఇక మనిషికి సద్భక్తి కలిగే దెప్పుడు?

భగవంతుని మీదే బుద్ధి

అందుకనే, అర్జునా! నీ మనస్సును నా యందు ఉంచు అని చెప్పిన గోవిందుడు, వెంటనే గ్రుక్క త్రిప్పుకోకుండా, నీ బుద్ధిని నా యందు ఉంచు అనేశాడు **(మయి బుద్ధిం నివేశయ!).** మనస్సైనా, బుద్ధి అయినా అంతఃకరణమే కదా! అలాంటప్పుడు నీ మనస్సును నా యందు ఉంచు అని చెప్పిన భగవంతుడు, నీ బుద్ధిని నా యందు ఉంచు అని వెంటనే ఎందుకన్నాడో అర్థం చేసుకోవాలి.

సంకల్ప వికల్పాత్మకం మనస్సు అయితే, బుద్ధి నిశ్చయాత్మకం. రెండు విషయాలను పట్టుకొని సందేహాల మధ్య సతమత మయ్యేది మనస్సైతే, ఆ రెండిటిలో ఒక దానిని నిశ్చయించే జ్ఞానమే బుద్ధి. కనుక, సందేహించే మనస్సునే గాక, నిశ్చయించే బుద్ధిని కూడా నా యందు ఉంచు అంటున్నాడు **(మయ్యేవ అధ్యవసాయం కుర్వతీం బుద్ధిమ్).** అధ్యవసాయము అంటే నిశ్చయము. దానినే వ్యవసాయాత్మక బుద్ధి అని రెండవ అధ్యాయంలో చెప్పుకున్నాం. అంటే, నిశ్చయాన్ని చేసే బుద్ధి అని అర్థము.

భగవంతుని మీద మనస్సు నిలవక పోవడానికి భగవంతునికి సంబంధించిన నిశ్చయ జ్ఞానము లేక పోవడమే కారణం కనుక, బుద్ధిని సమర్పించడము అంటే, నిశ్చయ జ్ఞానాన్ని పొంది అనన్య యోగముతో జీవించడ మని అర్థము.

మరి, అలాంటప్పుడు నిశ్చయించేది బుద్ధి కనుక, బుద్ధిని నా యందు ఉంచు అని చెబితే సరిపోతుంది

కదా! సందేహాస్పదమైన మనస్సు యొక్క ప్రస్తావన ఎందుకు? అనే సంశయము కలుగుతూ ఉంది కదూ? అదే మనస్సు కార్యము.

మనస్సు సంకల్పాలు చేస్తేనే బుద్ధి నిశ్చయిస్తుంది. బుద్ధి నిశ్చయించేదే కాని, సంకల్పాలు చేసేది కాదు. కనుక సంకల్ప వికల్పాత్మక మైన మనస్సును, విషయ నిర్ధారణ చేసి నిశ్చయించే బుద్ధిని, రెండిటిని తన యందే ఉంచమని భగవంతుడు చెప్పడంలో విశేష మిదే.

బుద్ధి వృత్తులన్నీ తద్వృత్తులుగా, అంటే భగవ త్సంకల్పాలుగా మారడమే బుద్ధిని పరమేశ్వరునిపై ఉంచడము. అంతటా బుద్ధి వృత్తికి భగవంతుణ్ణి విషయంగా మార్చడమే ప్రధానమైన విషయము.

ఇదే జరిగితే, ఆ తరువాత భక్తుడు భగవంతుని యందే ఉంటాడు ***(నివసిష్యసి మయ్యేవ. మయి నివాసం కరిష్యసి ఏవ).***

ముముక్షువునకు కావలసింది మోక్షము. మోక్షము జ్ఞానరూపంలో ఉంది. జ్ఞానమునకు అంతఃకరణ శుద్ధి అవసరం. అంతఃకరణ శుద్ధి కర్మయోగం వల్ల ప్రాప్తం. ఈ విధంగా నిశ్చయ జ్ఞానము గల బుద్ధి భగవంతుని లోనే ఉంటుంది. ఆ తరువాత సంశయాలకు తావుండదు. నిశ్చయాత్మకమైన బుద్ధి భగవంతుని యందు ఉంది అంటే బ్రతుకు ధన్యమైంది అని అర్థము. ఈ దశలో సందేహాలు ఉండే అవకాశం లేదు. అందుకనే ***న సంశయః*** - సందేహమును విడిచి పెట్ట మంటున్నాడు భగవంతుడు.

మనోబుద్ధులను పరమాత్మకు సమర్పించి జీవించే భక్తులు ధన్యజీవులు. ఇదే ఉత్తమమైన సాధన. ఉత్తమోత్తమ మైన ఈ సాధనను సర్వులూ ఆచరించ గలరా? ఒకవేళ ఆచరించలేని వారి పరిస్థితి ఏమిటి?

భగవంతుడు మరో మెట్టు దిగి ప్రసంగిస్తున్నాడు.

అథ చిత్తం సమాధాతుం న శక్నోషి మయి స్థిరమ్ ।
అభ్యాసయోగేన తతో మా మి చ్ఛాప్తుం ధనఞ్జయ ॥ 9

అథ-చిత్తం-సమాధాతుం-న-శక్నోషి-మయి-స్థిరం
అభ్యాసయోగేన-తతః-మాం-ఇచ్ఛ-ఆప్తుం-ధనంజయ

ధనంజయ	=	అర్జునా!	న శక్నోషి	=	అశక్తుడవైతే
అథ	=	ఇంకను	తతః	=	అటుపైన
మయి	=	నా యందు	అభ్యాసయోగేన	=	అభ్యాసయోగము చేత
స్థిరం	=	నిలకడగ	మాం	=	నన్ను
చిత్తం	=	మనస్సును	ఆప్తుం	=	పొందుటకు
సమాధాతుం	=	నిలుపుటకు	ఇచ్ఛ	=	ప్రయత్నించు

ధనంజయా! అర్జునా! మనస్సును నా యందు స్థిరంగా ఉంచే సామర్థ్యం లేకపోతే, అభ్యాస యోగంతో నన్ను పొందేందుకు ప్రయత్నించు.

వ్యాఖ్య

విశ్వరూపంలో ఉన్న విశ్వమూర్తిని ఉపాసించే స్థిర చిత్తము లేని వారికి సులభోపాయంగా ప్రత్యామ్నాయ సాధనలు చెబుతున్నాడు. ప్రథమంగా అభ్యాస యోగము.

అర్జునా! విశ్వరూప పరమేశ్వరుడైన నా యందే మనస్సును, బుద్ధిని ఉంచ మన్నాను. ఒకవేళ ఆ విధంగా

(అథ ఏవం) నా యందు మనస్సును ఏకాగ్రం చేసే సామర్థ్యం లేకపోతే ***(మయి చిత్తం స్థాపయితుం స్థిరమ్ న శక్నోషి చేత్),*** అభ్యాస యోగం చేత ***(అభ్యాస యోగేన)*** నన్ను పొందేందుకు ప్రయత్నించు ***(మామ్ ఆప్తుం ఇచ్ఛ)*** అంటున్నాడు భగవంతుడు.

సాధనాంతరము

మనోబుద్ధులను పరమేశ్వరుని యందు లగ్నం చేయడ మనేది మహోన్నతమైన సాధన. అలాంటి సాధన సాధ్యపడని వారికి కాస్త తక్కువ స్థాయి సాధన అయిన అభ్యాస యోగాన్ని ఉపాయాంతరంగా సూచిస్తున్నాడు. అందుకే నేమో 'అభ్యాసము కూసు విద్య' అనే సామెతను పెద్దలు ఉదహరిస్తూ ఉంటారు.

అభ్యాసము లేని విషయాలలో అభివృద్ధి అగుపించదు. కొందరు పట్టుమని పది నిముషాలు ఒకచోట కూర్చోలేరు. కానీ, ఎన్ని గంటలు తిరగమన్నా తిరుగుతూ ఉంటారు. అభ్యాసం గల వక్త గంటల తరబడి వేదికపై కూర్చొని కాలు కదపకుండా ప్రసంగిస్తూ ఉంటే, అభ్యాసం లేని కారణంగా శ్రోతలు అటు ఇటు కదుల్తూ, కాళ్ళు మార్చుకుంటూ ఉండటము ప్రవచనాలు జరిగే చోట స్పష్టంగా చూడ గలం.

ఉపాసన, ధ్యానాది సాధన లందు మనస్సు క్షణం నిలవకుండా పరుగులు తీస్తూ ఉంటుంది. ఆసక్తి లేకపోవడం ఒక కారణమైతే, అభ్యాసం లేకపోవడం రెండవ కారణము.

తిరిగే కాలు, తిట్టే నోరు ఊరుకోవు అంటూ ఉంటారు పెద్దలు. అవైనా ఊరుకుంటాయేమో గాని, తిరిగే మనస్సు మాత్రం ఒక చోట ఉండట మనేది బ్రహ్మ ప్రళయమే. అలా నిలవని చిత్తాన్ని స్థిరంగా నిలపడానికి చేసే ప్రయత్నమే అభ్యాస యోగము.

అభ్యాస యోగము

చంచలమైన చిత్తాన్ని స్థిరంగా ఒకచోట నిలిపే ప్రత్యామ్నాయ సాధన అభ్యాస యోగము. అంటే, ధ్యాన సమయంలో మనస్సును బాహ్యానికి పరుగులు పెట్టకుండా ఆంతర్యంలో నిలపడమే అభ్యాస యోగము.

మనస్సు బహిర్ముఖమైతే, ఎటైనా పోవచ్చు. అనేక విషయాలలో సంచరించ వచ్చు. కానీ, ఆంతర్యంలో ధ్యేయ విషయంపై నిలిస్తే మాత్రం ఏక రూపమై ఉంటుంది. కనుక, అలా బహిర్ముఖమై అనేక విషయాలలో చరించే చిత్తమును అన్నిటి నుండి వెనుకకు మరలించి ***(సర్వతః సమాహృత్య)*** ఒకే ఆలంబనంలో ***(ఏకస్మిన్ ఆలంబనే)*** మళ్ళీ మళ్ళీ ***(పునః పునః)*** నిలపడము అభ్యాసము ***(స్థాపనమ్ అభ్యాసః).*** అట్టి అభ్యాసముతో కూడిన యోగము అభ్యాస యోగము ***(తత్పూర్వక యోగః అభ్యాసయోగః).***

అభ్యాస యోగము అనే దానిలో రెండు పదాలు ఉన్నాయి. ఒకటి అభ్యాసము. రెండవది యోగము. అనేక విషయాల మీదికి పరుగులు పెట్టే మనస్సును సమస్తము నుండి సమాహరించి ఒకే ఆలంబనము నందు నిలపడము అభ్యాసము. ఈ అభ్యాసాన్ని పదే పదే చేస్తూ ఉండాలి. మళ్ళీ మళ్ళీ ఆచరిస్తూ ఉండాలి. ఎందుకని? మనస్సును మనం ఉపసంహరించినా, అది మళ్ళీ మళ్ళీ ఉద్యమిస్తూ ఉరకలేస్తూ ఉంటుంది కనుక.

విపరీత ప్రత్యయాలను నిరోధించి, అనుకూల ప్రత్యయముపై మనస్సును నిలపడానికి పదే పదే చేసే ప్రయత్నమే అభ్యాస యోగము. అంటే, విజాతీయ రహిత సజాతీయ వృత్తి ప్రవాహము నిరంతరము కొనసాగేలా చూడటానికి ఉపయోగించే సాధనే అభ్యాసము. మనస్సును నిగ్రహించడానికి ఉత్తమమైన సాధనము.

చంచలమై, నిలకడ లేకుండా ఎక్కడెక్కడో సంచరించే మనస్సును ఆయా ప్రదేశాల నుండి, విషయాల నుండి మరలించి, ఆత్మ యందు నిలిచే లాగా ప్రయత్నించాలి అని ఆరవ అధ్యాయంలో భగవంతుడు

ఉపదేశించి ఉన్నాడు *(6 - 26)*. ఇది ఆత్మధ్యానానికి సంబంధించిన విషయము. ఆత్మను ఆలంబనం చేసుకొని మనస్సును నియమించడం సులభ సాధ్యం కాదు. అరూపమైన నిర్గుణము నందు మనస్సును స్థిరంగా ఉంచ లేము. కానీ, ప్రస్తుతము, ఇక్కడ మనం అర్థం చేసుకుంటున్న అభ్యాస యోగము నిర్గుణానికి సంబంధించింది కాదు. ఇది సగుణ బ్రహ్మ విషయము. ఇక్కడ ధ్యేయమూర్తి సాకారము. ఆలంబనముగా ప్రతిమాది రూపాలు ఉంటాయి.

మనస్సు బాహ్య విషయాల మీదికి వెళ్ళేటప్పుడు, దానిని వెనుకకు మరల్చి, ఒక విగ్రహము నందు గాని, మూర్తి యందు గాని, ఏదో ఒక రూపము నందు గాని, బ్రహ్మ భావన కలిగి, దాని యందు మనస్సును ఏకాగ్రం చేయడమే అభ్యాసము. ఆత్మధ్యానం కన్నా ప్రతిమా ద్యాలంబనము నందు మనస్సును నిలిపి ధ్యానమును కొనసాగించుట అభ్యాస యోగము. అంటే, విపరీత ప్రత్యయ రహిత, అనుకూల ప్రత్యయ వృత్తి ప్రవాహము. ఇంకా స్పష్టంగా చెప్పాలి అంటే, విజాతీయ వృత్తి రహిత సజాతీయ వృత్తి ప్రవాహ సగుణ బ్రహ్మ విషయ మానస వ్యాపారము. ఇదే ధ్యానము. దీనికి సాధనాంతరము అభ్యాస యోగము.

మన ప్రయత్నాలు సాగుతూ ఉన్నా, మనస్సు చలిస్తూనే ఉంటుంది కనుక, చేజారి క్రింద పడిన వస్తువును తిరిగి తీసుకొని జేబులో పెట్టుకున్నట్లు, నిలవకుండా పరుగులు తీసే మనస్సును అంతర్ముఖం చేసి ఏకమై ఆలంబనమైన ధ్యేయమూర్తిపై నిలుపుతూ ఉండాలి. అది పోతూనే ఉంటుంది. మనం తెచ్చి పెడుతూనే ఉండాలి. దుర్నిగ్రహమైన మనస్సు అభ్యాస వైరాగ్యాల ద్వారానే నిగ్రహింప బడుతుంది అని భగవంతుడు ఆత్మసంయమ యోగంలో చెప్పే ఉన్నాడు కదా! *(6 - 35)*.

యోగాభ్యాసము

అభ్యాస యోగాన్ని ఉపాయాంతరంగా గ్రహించి ధ్యానయోగమును అభ్యసించాలి. అదే యోగాభ్యాసము. అభ్యాసయోగం ద్వారా యోగాభ్యాసము స్థిర పడుతుంది. ఇలా స్థిర పడిన యోగాభ్యాసము విశ్వరూపోపాసనను సుగమం చేసి, సుకరంగా తీర్చి దిద్దుతుంది.

ప్రాపంచిక విషయాలలో పడి మనస్సు పాడై పోయింది. పచ్చి అరటి బోదెను ఎంత తగల బెట్టినా, పచ్చి కట్టెల్ని ఎంత కాల్చినా, పొగ వస్తుందే గాని మంట రాదు. అలాగే ప్రాపంచిక విషయ జలాలలో బాగా తడిసి పోయిన మనస్సును ధ్యానంలో నిలిపే ప్రయత్నం చేసినా, ఆంతర్యంలో సెగలు, పొగలు రగులుతాయే గాని జ్ఞాన జ్యోతి వెలగదు.

వత్తిని సూర్యరశ్మిలో ఎండబెట్టి, ఆ తరువాత నేతిలో ముంచి వెలిగిస్తేనే దీపం దివ్యంగా అఖండంగా ప్రకాశిస్తుంది. విషయ వాసనా జలాలలో పడి తడిసి పోయిన పచ్చి అరటి బోదె లాంటి చిత్తమును వైరాగ్య మనే సూర్యకాంతిలో ఎండబెట్టి, భక్తి అనే ఘృతంలో తడిపి, అభ్యాస మనే జ్వాలను తోడు చేస్తే, ఆ తరువాత ధ్యానదీపం దివ్యంగా ప్రకాశిస్తుంది. ప్రతి ఒక్కరు ధ్యానజ్యోతి వెలుగులో జ్ఞానసిరిని ప్రోగు చేసుకోవాలి. ఈ సత్యాన్ని ఎరుక పరుస్తూ, ఈ సందర్భంలో అర్జునుని ***ధనంజయ!*** అని పిలుస్తున్నాడు గీతాచార్యుడు.

ధనంజయా! రాజసూయ యాగ సమయంలో ఎందరో చక్రవర్తుల్ని జయించి, ధనాన్ని ప్రోగు చేసిన వాడివి. కానీ, నీ మనస్సును నీవు జయించ గలిగితే నీకు జ్ఞాన ధనం సిద్ధిస్తుంది. అక్షయ సిరి ప్రాప్తిస్తుంది. మోక్షలక్ష్మి నిన్ను వరిస్తుంది. అభ్యసించి యోగాన్ని ఆచరించు. చిత్తాన్ని నిరోధించు. విషయాలను ధ్యానించే చిత్తాన్ని నిగ్రహించి, పరమేశ్వరుని చరణ కమలాల వద్ద స్థిరంగా ఉంచేయ్! నిలవకుండా పరుగులు తీసినా, పదే పదే అభ్యాసం ద్వారా దారి మళ్ళించి, చిత్తాన్ని యోగంలో నిలుపు, అని పరమాత్మ ఆదేశం. ఇదే అభ్యాస యోగము. ఒక ఉదాహరణం వినండి.

శ్లో॥ చేతో మత్త మదం గజం మదభర భ్రాన్తం భ్రమన్తం దిశో
దుస్సంకల్ప వికల్ప దన్త దలిత ప్రోద్దామ ధైర్య ద్రుమమ్।
ఉద్యద్గాఢతర ప్రబోధ నిగడం భూయః సమాక్రామితుం
ధాత్రా యోజిత మద్భుతం నరహరే రాలాన మఙ్ఘ్రి ద్వయమ్॥

చిత్తము మదపు టేనుగు వంటిది. వివేక మనే దృఢమైన గొలుసుతో ఎంతగా కట్టినా, మాటి మాటికీ బలవంతంగా త్రెంచుకొని నానా దిక్కులలో పడి పరుగులు తీస్తూనే ఉంటుంది. దుర్భరమైన సంకల్ప వికల్పాలనే దంతాలతో ధైర్యమనే మహా వృక్షాన్ని సైతం కూల్చేస్తుంది. అలాంటి చిత్త మనే మద మత్తేభాన్ని శ్రీహరి పద పంకజాలనే స్తంభానికి మళ్ళీ మళ్ళీ తీసుకొని వచ్చి కట్టేస్తూ ఉండాలి. ఇది అభ్యాసం. ఇదే యోగం. ఇదే అభ్యాసయోగం. యోగాభ్యాసం.

ఒకవేళ, అభ్యాస యోగంలో కూడా అశక్తులైతే, తరువాత ఏమి చేయాలి? వినండి.

అభ్యాసేఽప్యసమర్థోఽసి మత్కర్మ పరమో భవ।
మదర్థ మపి కర్మాణి కుర్వన్ సిద్ధి మవాప్స్యసి॥ 10

అభ్యాసే-అపి-అసమర్థః-అసి-మత్కర్మపరమః-భవ
మదర్థం-అపి-కర్మాణి-కుర్వన్-సిద్ధిం-అవాప్స్యసి

అభ్యాసే అపి	= అభ్యాసయోగము నందు కూడా	కర్మాణి	= కర్మలను
అసమర్థః	= అసమర్థుడవు	మదర్థం	= నా కొరకుగా
అసి	= అయితే	కుర్వన్ అపి	= చేయుచున్నను
మత్కర్మపరమః	= నా నిమిత్తమైన కర్మ యందు పరాయణుడవు	సిద్ధిం	= సిద్ధిని
భవ	= కమ్ము!	అవాప్స్యసి	= పొందగలవు

అర్జునా! అభ్యాసంలో కూడా అశక్తుడ వైతే, నా కొరకు కర్మలు చేస్తూ పో! నా కొరకు కర్మలు ఆచరించినా సిద్ధిని పొందుతావు.

వ్యాఖ్య

మోక్షం జ్ఞానరూపంలో ఉన్నందున జ్ఞానం ద్వారానే మోక్షం ప్రాప్తిస్తుంది. మరో మార్గం లేదు. కానీ, చిత్తశుద్ధి లోపించిన వారికి జ్ఞానము అలవడే అవకాశము లేదు. కనుక జ్ఞానప్రాప్తి కొరకు ఉపకరించే చిత్తశుద్ధి కోసం ఉపాసనలు, కర్మలు చెప్ప బడ్డాయి. ఇవే అంతరంగ బహిరంగ సాధనలు.

ఒక ప్రదేశము నందు కూర్చొని అనుష్ఠించే సగుణ ధ్యానము అంతరంగ సాధన అవుతుంది. అది కష్ట సాధ్యమైన వారికి సాధనాంతరంగా అభ్యాసయోగాన్ని సూచించాడు భగవంతుడు. ఒకవేళ అభ్యాస యోగాన్ని ఆచరించడానికి కూడా అశక్తులైన వారు అంతరంగ సాధన అయిన ధ్యానాన్ని ప్రక్కన బెట్టి బహిరంగ సాధన మైన కర్మయోగము వైపు దృష్టిని సారించ మని ప్రస్తుత శ్లోకంలో చెబుతున్నాడు.

అర్జునా! అభ్యాసము నందు కూడా అసమర్థుడవు అయితే **(అభ్యాసే అపి అసమర్థః అశక్తః అసి తర్హి)**, నా కొరకు కర్మలు ఆచరించే వాడివి కా! **(మత్కర్మ పరమః భవ!)**. నా కొరకే కర్మలను ఆచరించినా సిద్ధిని పొందుతావు అంటున్నాడు భగవంతుడు. ఇక్కడ 'సిద్ధి' అంటే మోక్షము కాదు, చిత్తశుద్ధి అని అర్థము. ముందు చిత్తశుద్ధి కలిగితే, ఆ తరువాత జ్ఞానప్రాప్తి ద్వారా మోక్షము సిద్ధిస్తుంది అని భావము.

ఈశ్వర కార్యము

లోకంలో కర్మ లున్నాయే గాని, ఈశ్వర కర్మలు, జీవకర్మలు అని రెండు లేవు. కర్మలు ఈశ్వర భావనతో చేస్తే ఈశ్వరకర్మ లవుతాయి. జీవభావనతో చేస్తే జీవకర్మ లవుతాయి.

ఏ కర్మ చేసినా, నేను చేస్తున్నాను అనే భావన మనిషిలో ఉంటుంది. కర్మ ముగిసిన తరువాత ఈ కర్మ నా వల్లే జరిగింది అనే భావన దృఢంగా ఉంటుంది. ఇదే జీవ భావన. అభిమానముతో కూడిన కర్తృత్వము. కర్తృత్వాభిమానము.

ఈ విధమైన కర్తృత్వాభిమానంతో సాగిన కర్మ జీవకర్మ. కర్తృత్వాభిమానంతో సాగే జీవకర్మలు బంధహేతువు లవుతాయి. అభిమానంతో కర్మాచరణం సాగించే జీవుడు బద్ధు డవుతాడు. అలా కాకుండా, ఈశ్వర భావన కలిగి యుండి, తాను నిమిత్త మనే బుద్ధితో కర్మలు ఆచరిస్తే, అవి ఈశ్వర కర్మ లవుతాయి. ఈశ్వర కర్మ లాచరించే వారు బద్ధులు కారు. బుధు లవుతారు. బుద్ధి శుద్ధి పడిన వారవుతారు. శుద్ధ బుద్ధు లవుతారు.

మత్కర్మ అంటే **మదర్థం కర్మ** అని అర్థము. భగవంతుని కొరకు చేసే కర్మలు మదర్థ కర్మలు. అంటే, ఈశ్వర ప్రీత్యర్థం ఆచరించే కర్మలు. ఈశ్వరార్పణ బుద్ధితో అనుష్ఠించే కర్మలు.

కర్మలు చేసేది మనమే అయినపుడు ఈశ్వరార్పణ భావంతో ఎందుకు చెయ్యాలి? అనే సంశయం కలగవచ్చు. కర్మల విషయంలో అవగాహన ఏర్పడనంత కాలము మనమే కర్మలు చేస్తున్నా మనే అహంకారము ఉంటుంది. కర్మల స్వభావ స్వరూపాలు అర్థమైన నాడు ఈశ్వరుని ప్రమేయం లేకుండా స్వల్పమైన కర్మను కూడా ఆచరించడం సాధ్యం కాదని బోధ పడుతుంది. అందుకనే మన పెద్దలు శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు అంటూ ఉంటారు.

ఈశ్వరాజ్ఞ చేత కర్మలు జరిగే టప్పుడు, ఈశ్వరాజ్ఞ వల్లే ఫలితాలు అందేటప్పుడు ***(కర్తుః ఆజ్ఞయా ప్రాప్యతే ఫలం)*** అవి ఈశ్వర కర్మ లవుతాయే గాని, మన కర్మ లెలా అవుతాయి?

దండ కట్టినా, పిండి కొట్టినా, బండి లాగినా, బండ నెత్తినా చేతులలో శక్తి ఉండాలి. చేతులు మనవి కావచ్చు. చేతుల లోని శక్తి మనదో కాదో ఒకసారి ఆలోచించాలి.

మాట పలకాలన్నా, పాట పాడాలన్నా, వడ్డించింది తృప్తిగా తినాలన్నా, నిందలు వడ్డిస్తూ ఇతరులను తిట్టాలన్నా, నోటికి శక్తి ఉండాలి. నోరు మనదే కావచ్చు. నోటి లోని శక్తి మనదో కాదో కొద్దిగా విచారించాలి.

నడిచేందుకు మనకు కాళ్ళున్నాయి. చూచేందుకు కళ్ళున్నాయి. వినేందుకు చెవు లున్నాయి. ఆలోచించేందుకు మనస్సుంది. వీటన్నిటిలో శక్తి ఉంది. ఆ శక్తి ఏమిటో ఆలోచిస్తే అది ఈశ్వర శక్తి, పరమేశ్వర శక్తి అని అర్థ మవుతుంది. పెట్రోలు లేని వాహనం ఎలా కదల లేదో, ఈశ్వర శక్తి లేకపోతే మనం ఏదీ చెయ్యలేము. అంతా ఈశ్వర శక్తే అయినపుడు, అన్నీ ఈశ్వర శక్తి చేత నడిచే కర్మ లైనపుడు, ఇక ప్రత్యేకంగా మన కర్మ లెక్కడున్నాయి? ఉన్నాయి అనుకుంటే, అక్కడే అహంకారము తలెత్తుతుంది. ఆ తరువాత అనర్థాలను మోయలేక తల దించుకోవలసి వస్తుంది.

కర్మలు మన వల్లే జరిగే టట్లైతే, అపజయాలు ఎందుకుంటాయి? కర్మ లాచరించే శక్తి మనదే అయితే, అశక్తత లెందు కుంటాయి? విద్యుద్దీపాలు దివ్యంగా ప్రకాశించ వచ్చు. ఆ ప్రకాశము ఎవరిది? ఎవరికి సంబంధించింది? దీపాలు ప్రకాశించినా, అలా ప్రకాశించే శక్తి విద్యుత్తుదే కాని దీపానిది కాదు. అందుకే అది విద్యుచ్ఛక్తి.

మన దేహేంద్రియ మనస్సుల ద్వారా సాగే కర్మల లోని శక్తి కూడా మనది కాదు. అది భగవంతుని శక్తి. భగవచ్ఛక్తి. ఈశ్వర శక్తి. ఈ సత్యాన్ని గ్రహించిన మరుక్షణం మన కర్మలన్నీ ఈశ్వరకర్మ లవుతాయి. మనం నిమిత్తంగా మారి పోతాము. అహంకారం బుద్ధి నుండి పారి పోతుంది.

ఈశ్వరార్పణం

కర్మ లన్నీ ఈశ్వరానుగ్రహం చేత సాగుతున్నాయి కనుక, ఈశ్వరునికి అర్పించకుండా వాటిని మనం అనుభవించ లేము. అన్ని కర్మల వెనుక ఈశ్వర చైతన్యమే ఉంది. కనుక, అన్ని కర్మలకు ముందు వెనుక ఈశ్వర భావనే ఉంటుంది.

దీపానికి నమస్కరించి దీపం వెలిగిస్తాము. వెలిగించిన తరువాత దీపదర్శనం చేస్తూ, **దీప జ్యోతిర్నమోస్తుతే** అంటూ చేతులు జోడించి నమస్కరిస్తాము.

దీపం వెలిగించాలని సంకల్పించినా, వెలిగించే లోగా పక్షవాతం వచ్చి చేతులు పడిపోతే, చేసే దేమీ ఉండదు, దురదృష్టాన్ని చూసి దుఃఖించడం తప్ప. ఇలా ఎన్ని సంఘటనలు లోకంలో మనం చూడటం లేదు! అలా జరగకుండా జ్యోతి ప్రజ్వలనం చేయాలంటే, చేతులు పడిపోకుండా చేతులను శక్తివంతంగా నిలిపే ఈశ్వర శక్తి మనకు తోడుగా ఉండాలి. అందుకే దీప ప్రజ్వలనానికి ముందే నమస్కరించి, భగవాన్! చేయించే వాడివి నీవే. నేను నిమిత్తమాత్రుణ్ణి అని దణ్ణం పెడుతున్నాం.

అలాగే దీపాన్ని వెలిగించిన తరువాత, కనులారా కాంతిని దర్శించి, కరములు జోడించక ముందే కళ్ళు శాశ్వతంగా మూత పడితే, ఏం చెయ్యగలం? భగవత్కృప వల్ల కళ్ళు ఎంత కాలమైనా చూడవచ్చు. కృప తప్పిన వేళ, మూత పడటానికి రెప్పపాటు చాలు. అలా మూత పడకుండా దీప దర్శనం చేస్తూ వందనం అర్పించడానికి, మన కళ్ళ లోని వత్తులను వెలిగించే శక్తి వాసుదేవునిదే గాని, మన దవుతుందా? భగవాన్! నీ వల్లనే జ్యోతి ప్రజ్వలనం చేశాను. నీ కృపతో వెలిగించిన జ్యోతిని, నీ కృపతో వెలిగే నా కన్నుల కాంతితో దర్శిస్తున్నాను. అంతా నీవే చేయించావు. అంతా నీ ప్రసాదమే. నేను నిమిత్త మాత్రుణ్ణి. ఇదే ఈశ్వరార్పణ బుద్ధి. మత్కర్మ భావన. ఈ భావన బుద్ధిని శుద్ధి చేస్తుంది. జ్ఞానానికి సిద్ధం చేస్తుంది.

ఈశ్వరశక్తి వైభవము ఎలాంటిదో, అది తన జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తూ ఉందో అర్థమైతే, ఆ తరువాత ఈశ్వరుని యందు ఆసక్తి పెరుగుతుంది. అనురక్తి వృద్ధి చెందుతుంది. పరానురక్తిలో బుద్ధి పరవశిస్తుంది. ఈశ్వర ప్రేమ హృదయంలో నిండి ఉంది కనుక, కర్మలన్నీ ఈశ్వర కర్మ లవుతాయి. దైవం ధర్మరూపంలో ఉన్నందున కర్మలలో ధర్మాచరణం ఉంటుందే గాని రాగద్వేషాలు తలెత్తవు. బ్రతుకు ధర్మ సౌరభంతో పరిమళిస్తుంది.

ధర్మజీవన ఫలంగా ప్రాప్తించే శాంతిలో హృదయం ప్రసన్నంగా ఉంటుంది. సంసారంలో కొనసాగుతున్నా, లోకంలో ఉన్నా, భగవద్గుణ సారరూపుడైన పరమేశ్వరుడే హృదయంలో సంభావింప బడుతూ ఉంటాడు. భగవద్గుణ శ్రవణ కీర్తనాదుల ద్వారా మనస్సు లోకేశ్వరుని యందే ఓలలాడుతూ ఉంటుంది **(లోకే౽పి భగవద్గుణ శ్రవణ కీర్తనాత్).** ఈ విధంగా **మత్కర్మ** వల్ల లేదా **మదర్థ** కర్మ వల్ల బుద్ధి అనుక్షణమూ శుద్ధి పడుతూ, జ్ఞానానికి సిద్ధపడుతూ ఉంటుంది. అలా శుద్ధిపడిన బుద్ధి జ్ఞానప్రాప్తి ద్వారా మోక్షాన్ని పొందుతుంది.

అభ్యాస యోగంలో అశక్తు డైనట్లే, ఈ మత్కర్మ పరత్వంలో కూడా అసమర్థు డైతే, ఆ తరువాత పరిస్థితి ఏమిటి? చెబుతున్నాడు.

అథైత ద ప్యశక్తోఽ సి కర్తుం మద్యోగ మాశ్రితః ।
సర్వకర్మ ఫలత్యాగం తతః కురు యతాత్మవాన్ ॥ 11

అథ-ఏతత్-అపి-అశక్తః-అసి-కర్తుం-మద్యోగం-ఆశ్రితః
సర్వకర్మఫలత్యాగం-తతః-కురు-యతాత్మవాన్

అథ	=	ఇంకను	మద్యోగం	=	నా యోగమును
ఏతత్ అపి	=	ఇది కూడా	ఆశ్రితః	=	ఆశ్రయించిన వాడవై
కర్తుం	=	ఆచరించుటకు	యతాత్మవాన్	=	నిగ్రహవంతుడవై
అశక్తః	=	అశక్తుడవు	సర్వకర్మఫలత్యాగం	=	సర్వకర్మల యొక్క ఫల త్యాగమును
అసి	=	అయినచో			
తతః	=	ఆ తరువాత	కురు	=	చెయ్యి

అర్జునా! అది కూడా చేయలేకపోతే, నా యోగాన్ని ఆశ్రయించు. మనస్సును నియమించు. ఆ తరువాత, కర్మఫలాలన్నిటినీ విడిచి పెట్టేయ్!

వ్యాఖ్య

మనోబుద్ధులను పరమేశ్వరుని యందు సమర్పించుట అనే ఉత్కృష్టమైన సాధనను ఆచరించే శక్తి లేని వారికి సాధనాంతరంగా అభ్యాస యోగాన్ని సూచించడం జరిగింది. అభ్యాస యోగంలో కూడా అశక్తులైన వారికి భగవత్కర్మలను ఆచరించడము ఉపాయాంతరంగా చెప్పడం జరిగింది. అది కూడా చేయలేని వారికి చివరి సాధనోపాయాన్ని ప్రస్తుత శ్లోకంలో చెబుతున్నాడు.

అర్జునా! మత్కర్మ పరత్వం కూడా నీకు అసాధ్య మైతే, నా యోగాన్ని ఆశ్రయించి *(మద్యోగం ఆశ్రితః)*, సమస్తమైన కర్మఫలాలను త్యజించి, నిగ్రహవంతుడవై కర్మలను ఆచరిస్తూ పో! అంటున్నాడు.

కర్మత్యాగము

కర్మ జరిగింది అంటే కర్త ఉంటాడు. కర్త లేకుండా కర్మ జరగడం సాధ్యపడదు. కర్మల విషయంలో ఈశ్వర వైభవాన్ని అర్థం చేసుకున్న వాడు, 'నేను కర్తను కాను - భగవంతుడే కర్త *(నాహం కర్తా హరిః కర్తా)*, పరమేశ్వరుని అధ్యక్షత లోనే సమస్తమూ నడుస్తూ ఉంది, నేను నిమిత్తమాత్రుణ్ణి, పనిముట్టును మాత్రమే, పనితన మంతా పరమేశ్వరునిదే' అనే భావన కలిగి ఉంటాడు.

కర్మ నేను చేయడం లేదు అనే భావన ఎప్పుడైతే కలిగిందో, కర్మ చేయని వాడికి ఫలం ప్రాప్తించే అవకాశం లేనందున, కర్మాసక్తితో పాటు ఫలాసక్తి కూడా లేకుండా పోతుంది. కర్తృత్వాభిమానంతో పాటు భోక్తృత్వాభిమానం కూడా లేకుండా పోతుంది.

ఒక్క విషయాన్ని ఈ సందర్భములో జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. 'నేను కర్తను కాను' అని ఈ అధ్యాయంలో భక్తుడు భావించే దానిని అకర్మగా అర్థం చేసుకోకూడదు. 'నేను కర్మ చేయడం లేదు' అంటున్నాడే గాని, నాల్గవ అధ్యాయంలో మనం చూసిన 'అకర్త' తానని భావించడం లేదు. అది ఆత్మవిదుని విషయం. ఇక్కడ విషయం కర్మయోగి ప్రస్తావన. అది మరచి పోకూడదు.

ఆత్మ యందు కర్మ లేదు కనుక తనను 'అకర్త'గా చూస్తున్నాడు ఆత్మవిదుడు. కాని, కర్మయోగి స్థాయి అది కాదు. కర్మయోగి తాను చేయడం లేదు అంటున్నాడే గాని, తన కర్మలలో కర్తను నిరాకరించడం లేదు.

ఈశ్వరుని సర్వకర్తగా చూస్తున్నాడు కనుక తాను కర్తృత్వాభిమానం లేకుండా ఉన్నాడు. అంతే.

పదవ శ్లోకంలో చెప్పిన ఈ విధమైన సాధన, అంటే కర్తృత్వ భావనను త్యజించి మత్కర్మ పరత్వంగా జీవించడం అసాధ్య మైతే, ఈశ్వర ప్రీత్యర్థం కర్మాచరణంలో ఉంటూ **(మద్యోగం ఆశ్రితః)** ఫలాసక్తి లేకుండా జీవించ మని ఈ శ్లోకంలో చెబుతున్నాడు. అంటే, కర్తృత్వాభిమానాన్ని త్యజించ లేకపోతే, భోక్తృత్వాభిమానాన్నైనా త్యజించ మని చివరి ఉపాయాంతరాన్ని బోధిస్తున్నాడు.

కర్మత్యాగము సాధన అయితే, 'అకర్త' భావన సాధ్య మవుతుంది. కర్మఫలత్యాగము సాధన అయితే, కర్మ త్యాగము సాధన అవుతుంది. ఈ సోపానక్రమాన్ని అవధానంతో అర్థం చేసుకోండి.

ఉత్తమ కోవకు చెందిన ఆత్మవిదుడు **అహం అకర్తా** అనే భావనలో సదా ఉంటాడు. రెండవ కోవకు చెందిన మత్కర్మపరుడు **నాహం కర్తా - హరిః కర్తా** అనే భావనను కలిగి కర్మాచరణంలో ఉంటాడు. ఇతడు కర్మత్యాగి. కానీ, మూడవ కోవకు చెందిన ఫలత్యాగి **అహం కర్తా, ఈశ్వర భృత్యవత్ అహం కరోమి, అహం కర్తా - ఈశ్వరః ఫల ప్రదాతా** - 'నేను కర్తను. ఈశ్వరుని దాసుని వలె కర్మలను ఆచరిస్తాను. నేను కర్మ చేస్తాను. పరమేశ్వరుడు ఫలితాన్ని ప్రసాదిస్తాడు' అనే భావనలో ఉంటాడు. ఈ ముగ్గురిలో తేడాను గమనిస్తే, మొదటి కోవకు చెందిన 'అకర్త' అయిన ఆత్మవిదుడు ప్రస్తుతం మన ప్రసంగ విషయం కాదు. కనుక, అతనిని ప్రక్కన పెట్టవచ్చు. మిగిలిన ఇద్దరు భక్తులలో మొదటివాడు కర్మత్యాగి. పూర్వ శ్లోకంలో అతనిని గూర్చి తెలుసుకున్నాం. రెండవ వాడు ఫలత్యాగి. ప్రస్తుతం అతడి విషయాన్నే మనం చర్చిస్తున్నాం.

ఫలత్యాగము

కర్మ నా అధీనంలో ఉంది. ఫలం నా అధీనంలో లేదు. కర్మ నైతే నేను ఆచరించ గలను కాని, కర్మను ఫలంగా మలచే శక్తి నాకు లేదు. కర్మఫల మనేది అనేక కారణాలపై ఆధారపడి ఉంటుంది. వాటిపై నాకు నియంత్రణ లేదు.

ఫలం ఏదైనా, దానిని అనుగ్రహించే వాడు సర్వజ్ఞుడైన పరమేశ్వరుడు. నా కర్మలకు రావలసిన ఫలితాలు వస్తాయే గాని, నా ఆశలకు ఫలితాలు రావు. నేను భక్తుణ్ణి. కర్మయోగిని. నాకు మోక్షం కావాలి. అదే నా లక్ష్యం. కర్మలకు ఈశ్వరుడు ఫలితా లిస్తాడు. అవి కర్మఫలాలు. వాటి యందు నాకు ఆసక్తి లేదు. ఫలాసక్తి నాలో లేదు. కానీ, ఆ ఫలాలు ఈశ్వరుడు అనుగ్రహించేవి కనుక, వాటిని ప్రసాదంగా స్వీకరిస్తాను. ప్రసన్నంగా ఉంటాను. ఏది వచ్చినా ప్రసాదమే. ఈశ్వర ప్రసాదము ఏదైనా నా మంచికే. ఇక్కడే ప్రసాదము వస్తువుగా కాకుండా భావనగా మారిపోతోంది.

కర్మల యందు ఆసక్తి ఉండేటప్పుడు ఫలాసక్తి ఉంటుంది. కర్మత్యాగము జరిగితే, ఫలత్యాగము సహజంగా జరిగి పోతుంది. ఈ విధంగా కర్మత్యాగము అసాధ్య మని భావించే వారు కర్మలను ఈశ్వర ప్రీత్యర్థం ఆచరిస్తూ, ఫలాసక్తి లేకుండా జీవిస్తే సరిపోతుంది. కర్మత్యాగము కన్నా ఫలత్యాగము సులభతరం కదా! అందుకనే, కర్తృత్వాన్ని వీడలేని వారు 'మద్యోగులై' ఫలాసక్తిని త్యజించి భోక్తృత్వము నుండి విడిపడ వచ్చు. అందుకే ఫలత్యాగము చివరి ఉపాయాంతరంగా చెబుతున్నాడు భగవంతుడు.

ఇక్కడ మరొక గమ్మత్తు ఉంది. ఫలాసక్తి లేని వానికి కర్మాసక్తి ఉండే అవకాశం ఉంటుందా? కాస్త ఆలోచించండి. ఫలము నందు ఆసక్తి ఎప్పుడైతే లేకుండా పోతుందో, కర్మల యందు కూడా ఆసక్తి దానంతటదే క్షీణిస్తుంది. ఫలం యొక్క అవసరం నాకు లేనపుడు, కర్మ యొక్క అవసరం ఎందు కుంటుంది?

'నేను కర్తను కాను' అని భావించే వానికి ఫలాసక్తి ఉండదు. 'నేను కర్తను' అని భావించినంత వరకు ఫలాసక్తి పోదు. కర్త అనే భావం ఉండినా, ఫలాసక్తి లేనపుడు, కర్మాసక్తి కూడా ఉండే అవకాశం లేనందున, కర్మత్యాగము చేయుటకు అశక్తుడైన వాడు **(మత్కర్మ పరత్వం కర్తుమ్ అశక్తః అసి)** సర్వకర్మ ఫలత్యాగం చేయడం చేత **(సర్వేషాం కర్మణాం ఫల సంన్యాసం)** క్రమేపీ కర్మాచరణము నందు ఆసక్తిని త్యజించి కర్మత్యాగిగా మారుతాడు. కనుకనే, కర్మత్యాగము, అంటే కర్తృత్వాభిమానము త్యాగం చేయలేని వారు, ఫలత్యాగము, అంటే భోక్తృత్వాభిమానమును ప్రసాద భావన చేత త్యజించ గలరు. ఫలత్యాగము కర్మ త్యాగానికి దారి తీస్తుంది.

ఫలత్యాగి రాగద్వేషాల నుండి విముక్తుడు. ఏది వచ్చినా అతనికి ప్రసాదమే. ప్రసాదము ఎవరిని కష్ట పెడుతుంది? ప్రసాద భావన ప్రసన్నతనే కలిగిస్తుంది. ప్రసన్నచిత్తుడు ఏది జరిగినా అది తన మంచికే అనే భావన లోనే ఉంటాడు.

ఆఖ్యాయిక

ఒక రాజు గారి ఆస్థానములో ఫలత్యాగి అయిన భక్తుడు మంత్రిగా ఉండేవాడు. అతడు అతని జీవితంలో గాని, రాజ్యంలో గాని, ఏది జరిగినా, 'అంతా మన మంచికే' అని అంటూ ఉండేవాడు. ఏదైనా మన మంచికే అనేది అతని ప్రగాఢ విశ్వాసము.

రాజు గారికి మంత్రి మాట వేదం. అతని సలహా లేనిదే ఏ కార్యమూ ఆచరించే వాడు కాదు. వేటకు వెళ్ళినా మంత్రి గారు ప్రక్కన ఉండ వలసిందే. మంత్రి గారు లేకుండా రాజుగారి పర్యటన సాగదు.

మంత్రిగారు దేశాంతరము వెళ్ళిన సమయంలో రాజుగారు అరణ్యానికి వేటాడటానికి మంత్రిగారు లేకుండా వెళ్ళవలసి వచ్చింది. అక్కడ వేటాడుతున్న సమయంలో వెనుకనే పొదలో ఉన్న క్రూరమృగ మొకటి రాజుగారిపై విరుచుక పడింది. ఎలాగో పోరాడి రాజుగారు దానిని చంపేశారు. కాకపోతే, ఆ పోరాటంలో రాజుగారి ఎడమచేతి బొటన వ్రేలు తెగి పోయింది.

రాజుగారు తిరిగి వచ్చి, చికిత్స చేయించుకొని అంతఃపురములో విశ్రాంతి తీసుకుంటూ ఉన్నారు. ఈ లోగా దేశాంతరం వెళ్ళిన మంత్రిగారు తిరిగి వచ్చారు. విషయం తెలుసుకొని, రాజుగారి సన్నిధికి వచ్చారు.

అరణ్యంలో జరిగిన సంఘటనను రాజు గారు మంత్రిగారితో చెప్పారు. విషయమంతా ఆలకించిన మంత్రిగారు, 'అలా జరగడం కూడా మన మంచికే' అన్నారు. మంత్రిగారి మాట రాజుగారికి మ్రింగుడు పడలేదు. తన బొటనవ్రేలు తెగిపోవడం మంచికే నంటాడా మంత్రి! మంత్రికి తాను గొప్ప భక్తుడనే అహంకారము. అందుకే ఇలా మాట్లాడుతున్నాడు అని భావించి, కోపోద్రిక్తు డైన రాజు గారు మంత్రిగారికి కారాగార శిక్ష విధించారు. మంత్రిగారు కారాగృహంలో హాయిగా సంకీర్తన చేసుకుంటూ తృప్తిగా ఉన్నారు.

కొంత కాలమైంది. ఒకనాడు రాజు గారు గ్రామాంతరం వెళ్ళి వస్తూ ఉంటే, మార్గమధ్యంలో కొందరు దోపిడి దొంగలు అపహరించుకొని పోయారు. అరణ్యంలో ఒక నిర్జన ప్రదేశానికి తీసుకొని పోయారు. అక్కడ క్షుద్ర దేవతారాధన జరుగుతూ ఉంది. ఆ రోజు పూర్ణాహుతి. ఎవరైనా ఒక విశిష్టమైన వ్యక్తిని శిరచ్ఛేదం చేసి బలి సమర్పిస్తే వారి కార్యం సఫల మవుతుందని వారి విశ్వాసము.

రాజుగారికి స్నానం చేయించారు. ఎర్రటి బట్టలు కట్టారు. నుదుటన ఎర్రటి కుంకుమను దిద్ది, మెడలో ఎర్రటి పూలమాలను వేసి దేవతామూర్తి ముందుకు తీసికొని వచ్చి వధ్య శిల వద్ద నిలబెట్టారు. మరి కొన్ని నిముషాలలో రాజుగారిని వధిస్తారు.

వారి ఆచారం ప్రకారం బలి ఇవ్వబోయే వ్యక్తిని ముందుగా వారి పురోహితుడు పరిశీలించాలి. పరీక్షించాలి. వధార్హుడే అని అతడు చెబితేనే వధిస్తారు. పురోహితుడు వచ్చాడు. రాజు గారిని పరీక్షించాడు. రాజు గారికి ఎడమ చేతి బొటన వ్రేలు లేదు. అంగలోప మున్నందున వధకు పనికిరాడు అని నిర్ణయించాడు. అంతే. అడవి దొంగలు రాజు గారిని విడిచి పెట్టేశారు.

రాజుగారు అంతఃపురం చేరారు. ఆయన మనస్సులో మంత్రిగారే మెదులుతున్నారు. నిజమే. మంత్రిగారు చెప్పింది సత్యం. బొటనవ్రేలు పోవడం తన మంచికే జరిగింది. భక్తుడైన మంత్రిగారిని అపార్థం చేసుకున్నందుకు చింతిస్తూ, రాజుగారు తామే స్వయంగా కారాగృహానికి వెళ్ళి మంత్రిగారిని విడిపించి క్షమించ మని ప్రార్థించారు. మీ లాంటి భక్తాగ్రగణ్యుణ్ణి కారాగృహంలో ఉంచి నందుకు క్షమించండి అని మంత్రిగారి చేతులు పట్టుకున్నారు రాజు గారు.

అయ్యో! అయ్యో! ప్రభువులు! మీరు అలా అనడ మేమిటి? కారాగృహంలో నన్ను ఉంచడం కూడా మన మంచికే జరిగింది అన్నారు మంత్రిగారు.

అదేమిటి? 'అంతా మన మంచికే' అంటూ ఉండటం ఇతనికి ఊతపదమా? అని సందేహించిన రాజు గారు, అమాత్యవర్యా! అదేమిటి! కారాగృహంలో బంధించడం కూడా మన మంచికేనా? అని ప్రశ్నించారు.

మహారాజా! కాస్త ఆలోచించండి. నన్ను ఇలా బంధించడం జరగక పోయి ఉన్నట్లైతే, నేను లేకుండా మీరు ఎక్కడికీ వెళ్ళరు కనుక, మీతో అరణ్యంలో నేను కూడా ఉండేవాణ్ణి. మీరు వధకు అర్హులు కారు అని తెలిసిన వెంటనే, మిగిలేది నేనే కనుక, నన్ను వధించి ఉండేవారు. మీరు నన్ను కారాగృహంలో బంధించడం చేత నాకు ప్రాణహాని తప్పింది. అంతా మన మంచికే! అన్నారు.

రాజుగారు ఎంతగానో సంతసించారు. 'అంతా మన మంచికే' అనేది మంత్రి గారికి ఊతపదము అనుకున్నాను. వాస్తవానికి ఆ వాక్యమే ఆయన ఉజ్జ్వలమైన జీవితానికి ఊత మిచ్చింది అని గ్రహించలేక పోయాను అని రాజుగారు పశ్చాత్తాప పడ్డారు.

అనుకూలమైనా, ప్రతికూలమైనా ప్రసాద భావనతో జీవించే భక్తుడు ఎట్టి పరిస్థితుల లోను చెదరడు. చలించడు. అతని ప్రశాంతతను ఎవ్వరూ భగ్నం చెయ్యలేరు.

కర్మ త్యాగమైనా, ఫల త్యాగమైనా త్యాగమే ప్రధాన మని గ్రహించాలి. మూడు, నాలుగు, ఐదు అధ్యాయాలలో ఈ విషయాన్ని ఎంతగానో చెప్పుకున్నాం. ప్రస్తుతం మళ్ళీ ఇక్కడ చర్చించుకున్నాం. ఇదే విషయాన్ని పద్దెనిమిదవ అధ్యాయంలో భగవంతుడు మళ్ళీ ప్రస్తావిస్తాడు. అక్కడ మీకు మళ్ళీ జ్ఞాపకం చేస్తాను.

కర్మఫల త్యాగము అంతటి విశిష్ట విషయం కావడం చేత భగవానుడు ఇప్పుడు దానిని స్తుతిస్తున్నాడు **(ఇదానీం సర్వకర్మ ఫలత్యాగం స్తౌతి).**

శ్రేయో హి జ్ఞాన మభ్యాసా జ్జ్ఞానా ద్ధ్యానం విశిష్యతే ।
ధ్యానా త్కర్మఫలత్యాగ స్త్యాగా చ్ఛాన్తి రనన్తరమ్ ॥ 12

శ్రేయః-హి-జ్ఞానం-అభ్యాసాత్-జ్ఞానాత్-ధ్యానం-విశిష్యతే
ధ్యానాత్-కర్మఫలత్యాగః-త్యాగాత్-శాంతిః-అనంతరం

అభ్యాసాత్	=	అభ్యాసము కంటే	శ్రేయః	=	శ్రేష్ఠము
జ్ఞానం	=	జ్ఞానము	జ్ఞానాత్	=	జ్ఞానము కంటే

ధ్యానం	=	ధ్యానము
విశిష్యతే హి	=	విశిష్ట మైనది
ధ్యానాత్	=	ధ్యానము కంటే
కర్మఫలత్యాగః	=	కర్మఫలత్యాగము
త్యాగాత్	=	త్యాగము వలన
అనంతరం	=	ఆ తరువాత
శాంతిః	=	శాంతి

అర్జునా! అభ్యాసము కంటే జ్ఞానము శ్రేయస్కరము. జ్ఞానము కంటే ధ్యానము విశిష్టము. ధ్యానము కంటే కర్మఫల త్యాగము శ్రేష్ఠము. త్యాగము వల్ల శాంతి కలుగుతుంది.

వ్యాఖ్య

విషయ సమన్వయము

అభ్యాసము, జ్ఞానము, ధ్యానము, కర్మఫల త్యాగము, శాంతి అనేవి ఈ శ్లోకంలో ఉత్తరోత్తర విశిష్టత్వంతో చెప్పబడ్డాయి. అంటే, వెనుకటి దాని కంటే తరువాతది విశిష్టము అనే క్రమంలో చెప్పబడ్డాయి. ఈ క్రమాన్ని అనుసరించి ప్రస్తుత శ్లోకాన్ని ఎనిమిదవ శ్లోకం నుండి మనం చెప్పుకున్న సాధనలతో సమన్వయ పరచుకొని అర్థం చేసుకోవడం సాధ్య పడదు.

ఎనిమిదవ శ్లోకంలో మనోబుద్ధులను పరమేశ్వరుని యందు ఉంచడ మనే సాధనను పరమోత్కృష్ట మైన దానినిగా అభివర్ణించడం జరిగింది. ఉన్నతమైన ఈ సాధనను ఆచరించలేని వారికి, అంటే విశిష్టమైన విశ్వరూపోపాసన అసాధ్యమైన వారికి, స్థూలమైన ప్రతిమాదుల యందు అభ్యాస యోగమును సూచించడము జరిగింది. అంటే, అభ్యాసయోగము విశ్వరూ పోపాసన కన్నా తక్కువ దని స్పష్ట మవుతూనే ఉంది కదా!

అభ్యాసయోగమును కూడా ఆచరించ డానికి అశక్తు లైన వారికి మత్కర్మ పరత్వమును, అది కూడా ఆచరించడానికి అసమర్థులైన వారికి సర్వకర్మ ఫల త్యాగమును సూచించడం జరిగింది. దీనిని బట్టి అభ్యాసము కంటే మత్కర్మ పరత్వము, దాని కంటే సర్వకర్మ ఫలత్యాగము ఒక దాని కంటే మరొకటి తక్కువదిగా చెప్పబడ్డాయి. అలాంటప్పుడు అన్నిటి కన్నా తక్కువ స్థాయి లోని దైన కర్మఫల త్యాగమును శ్రేష్ఠ మైనదిగా ఈ శ్లోకంలో అభివర్ణించడ మేమిటి?

అంతేకాదు. ఈ క్రమంలో అర్థం చేసుకుంటే ధ్యానం కన్నా కర్మఫల త్యాగము శ్రేష్ఠమని చెప్పినట్లు అవుతూ ఉంది. కానీ, ధ్యానం చేయడానికి అశక్తులైన వారికి కర్మ ప్రసంగ మని పది మరియు పదకొండవ శ్లోకాలలో అర్థం చేసుకున్నాం. అలాంటప్పుడు కర్మఫల త్యాగము ధ్యానం కన్నా ఎలా శ్రేష్ఠము?

అంతేగాక, కర్మఫల త్యాగం వల్ల శాంతి లభిస్తుంది అని కూడా ఈ శ్లోకంలో చెప్పడం జరిగింది. శాంతి అనేది స్వరూపానికి సంబంధించిన విషయం. స్వరూప జ్ఞానం వల్లనే స్వరూప శాంతి అనుభూత మవుతుంది అని గీత పూర్వార్థ మంతా చూశాం. ఇప్పుడేమో కర్మఫల త్యాగము వల్ల శాంతి కలుగుతుంది అని వింటున్నాము. ఇది పరస్పర విరుద్ధం కాదా?

కనుక ప్రస్తుత శ్లోకంలో చెప్పబడుతున్న అభ్యాస జ్ఞానాదులను కేవలం ఎనిమిదవ శ్లోకం నుండి పదకొండవ శ్లోకం వరకు మనం చెప్పుకున్న విషయంతో అనుసంధానం చేస్తూ అర్థం చేసుకొనే అవకాశము లేదు. ఈ పన్నెండవ శ్లోకము తనదైన ఒక ప్రత్యేక విషయాన్ని ప్రస్తావిస్తూ ఉందని అర్థ మవుతూ ఉంది. అలాంటప్పుడు అభ్యాస, జ్ఞాన, ధ్యాన, ఫలత్యాగ శాంతులకు స్పష్టమైన అర్థా లేమిటో గ్రహించవలసి ఉంటుంది. అదే మన ప్రస్తుత కర్తవ్యము.

అభ్యాసము - జ్ఞానము

అభ్యాసము కంటే **(అభ్యాసాత్)** జ్ఞానము ప్రశస్తము **(జ్ఞానమ్ శ్రేయః ప్రశస్యతరం).** ఇక్కడ అభ్యాసము కంటే జ్ఞానము శ్రేష్ఠము అంటే వివేక శూన్యమైన అభ్యాసం కంటే జ్ఞానము శ్రేష్ఠము అని అర్థము **(అవివేక పూర్వక అభ్యాసాత్ జ్ఞానమ్ శ్రేయః).**

యోగానికి సంబంధించిన యమ నియమ ఆసన ప్రాణాయామాది అభ్యాసంలో గాని, లేదా జ్ఞానానికి సంబంధించి మనన నిదిధ్యాసనల విషయంలో గాని, వివేకాదులు లేకుండా కేవలం శ్రవణాభ్యాసము చేయడం కంటే, వివేకముతో, పురుషార్థ నిశ్చయం కలిగిన జ్ఞానసాధన శ్రేష్ఠము అని అర్థము. యోగాభ్యాసంలో జ్ఞానం ఉత్పన్నమయ్యే అవకాశం లేదు కనుక, వివేక శూన్యమైన అభ్యాసము కంటే వివేకయుతమైన జ్ఞానము ప్రశస్తము.

జ్ఞానము - ధ్యానము

జ్ఞానము కంటే **(జ్ఞానాత్)** ధ్యానము శ్రేష్ఠము, విశిష్టము **(ధ్యానం విశిష్యతే).** ధ్యానము అంటే జ్ఞానపూరిత ధ్యానము అని అర్థము. కనుక జ్ఞానం కంటే జ్ఞానపూరిత ధ్యానం శ్రేష్ఠ మైనది **(జ్ఞానాత్ జ్ఞాన పూర్వకం ధ్యానం విశిష్యతే).** జ్ఞానం లేని ధ్యానము అవరోధాలతో కూడి ఉంటుంది. ప్రతిబంధకాలతో నిండి ఉంటుంది. ధ్యానం జ్ఞానయుత మైనపుడు, ప్రతిబంధకాలు తొలగడమే గాక, విపరీత ప్రత్యయ నివృత్తి జరుగుతుంది. విజాతీయ వృత్తి రహిత, సజాతీయ వృత్తి ప్రవాహ సగుణ బ్రహ్మ విషయ మానస వ్యాపారము నైరంతర్యంగా సాగుతుంది. అందుచేత కేవలం జ్ఞానం కంటే, జ్ఞానపూరిత ధ్యానం విశిష్ట మైనది.

ధ్యానము - కర్మఫల త్యాగము

ధ్యానము కంటే **(జ్ఞానవతః ధ్యానాదపి)** కర్మఫల త్యాగము విశిష్ట మైనది **(కర్మఫల త్యాగః విశిష్యతే).** కర్మఫల త్యాగము వలన సర్వకర్మలు ఈశ్వరార్పితం చేయబడు తున్నాయి కనుక, కర్మల యందు గాని, వాటి ఫలితముల యందు గాని సంకల్ప కామాదులు ఉదయించవు. అదియే అంతఃకరణ శుద్ధి. అంతఃకరణ శుద్ధి ప్రాప్తిస్తే, జ్ఞానప్రాప్తి, తద్వారా మోక్షసిద్ధి లభించడం, కారణమైన అజ్ఞానముతో సహా సంసారము నశించడము వెంటనే జరిగి పోతుంది. కాలం కొరకు నిరీక్షించ నవసరం ఉండదు. ఈ విధంగా శాంతి ప్రాప్తిస్తుంది **(కర్మఫల త్యాగాత్ శాంతిః ఉపశమః సహేతుకస్య సంసారస్య అనన్తర మేవ స్యాత్, న తు కాలాన్తరమ్ అపేక్షతే).**

యోగయుక్తుడు కర్మఫలాలను త్యజించి ఆత్మ సంబంధమైన శాంతిని పొందుతున్నాడు అని ఐదవ అధ్యాయంలో భగవంతుడు బోధించిన విషయాన్ని ఈ సందర్భంలో మననం చేసుకోవడం యుక్తం (**యుక్తః కర్మఫలం త్యక్త్వా శాన్తి మాప్నోతి నైష్ఠికీమ్.** *5 - 12*). ఈ విధంగా కర్మయోగులు ఫలత్యాగం ద్వారా శ్రేయస్సును పొందుతారు.

వివిధ సాధనలను ఇంతవరకు వివరించిన భగవంతుడు, ఇక వరుసగా ఏడు శ్లోకాలలో ఉత్తమ భక్తుని లక్షణాలను వివరిస్తున్నాడు.

అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ ।
నిర్మమో నిరహంకారః సమదుఃఖసుఖః క్షమీ ॥ 13

సంతుష్టః సతతం యోగీ యతాత్మా దృఢనిశ్చయః ।
మయ్యర్పిత మనోబుద్ధి ర్యో మద్భక్తః స మే ప్రియః ॥ 14

అద్వేష్టా-సర్వభూతానాం-మైత్రః-కరుణః-ఏవ-చ
నిర్మమః-నిరహంకారః-సమదుఃఖసుఖః-క్షమీ
సంతుష్టః-సతతం-యోగీ-యతాత్మా-దృఢనిశ్చయః
మయి-అర్పితమనోబుద్ధిః-యః-మద్భక్తః-సః-మే-ప్రియః

సర్వభూతానాం	= సకల భూతము లందు	యోగీ	= యోగయుక్తుడు
అద్వేష్టా	= ద్వేషము లేనివాడు	యతాత్మా	= ఆత్మనిగ్రహము కల వాడు
మైత్రః	= మైత్రి కలవాడు	దృఢనిశ్చయః	= దృఢసంకల్పము గల వాడు
కరుణః ఏవ చ	= దయ గల వాడు	మయి	= నా యందు
నిర్మమః	= మమకారము లేని వాడు	అర్పిత మనోబుద్ధిః	= నిలిపిన మనోబుద్ధులు గల వాడు
నిరహంకారః	= అహంకారము లేని వాడు	మద్భక్తః	= నా భక్తుడు
సమదుఃఖసుఖః	= సుఖదుఃఖముల యందు సమముగ ఉండే వాడు	యః	= ఎవరో
		సః	= వాడు
క్షమీ	= సహనశీలుడు	మే	= నాకు
సతతం	= సదా	ప్రియః	= ప్రియుడు
సంతుష్టః	= సంతృప్తి చెందిన వాడు		

సర్వ ప్రాణులను ద్వేషించని వాడు, మైత్రి, దయ కలవాడు, మమకార అహంకారాలు లేనివాడు, సుఖదుఃఖాలలో సమభావంతో ఉండేవాడు, ఓర్పు కలవాడు,
నిత్య సంతుష్టుడు, యోగయుక్తుడు, మనో నిగ్రహం కలవాడు, దృఢమైన నిర్ణయము కలవాడు, మనోబుద్ధులను నా యందే సమర్పించిన వాడు అయిన నా భక్తుడు నాకు ఇష్టుడు.

వ్యాఖ్య

విశ్వరూపోపాసన, అక్షరోపాసనలను ఆచరించే వారిలో యోగవిత్తము లెవరు? అని అర్జునుడు ప్రశ్నించడంతో పన్నెండవ అధ్యాయమైన భక్తి యోగము ప్రారంభమైంది. అర్జునుని ప్రశ్నకు సమాధానంగా సాకార నిరాకార ధ్యానాలను వివరించి చెప్పిన భగవానుడు, దేహాభిమానులకు సాకారమే శ్రేష్ఠ మని నిశ్చయించి, తత్సంబంధ మైన జీవన విధానాన్ని, వివిధ సాధనలను తెలిపి, ప్రస్తుతం ఉత్తమ భక్తుని లక్షణాలను వివరించే చివరి ఘట్టానికి చేరుకున్నాడు.

ఉత్తమ భక్తుడు ఎవడో కాడు జ్ఞానియే. ప్రస్తుతం పరమేశ్వరుడు చెప్పే లక్షణాలన్నీ జ్ఞాని లక్షణాలే. జ్ఞాని లక్షణాలు జ్ఞాని కన్నా వేరు కావు. జ్ఞానికి, జ్ఞానానికి భేదము లేదు. **జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్** - జ్ఞాని నేనే అన్నాడు విజ్ఞాన యోగంలో భగవంతుడు. కనుక, జ్ఞానికి సంబంధించిన ఈ లక్షణాలలో భగవ ద్వైభవమే దర్శనీయంగా ఉంటుంది. జ్ఞానికి ఇవి సహజ లక్షణాలే. జ్ఞానిలో ఏవైతే సహజంగా అలంకరణాలై శోభిస్తున్నాయో, వాటిని భక్తుడైన కర్మయోగి సాధనలుగా స్వీకరించి ఆచరించ వలసి ఉంటుంది. ఇక్కడ నుండి పందొమ్మిదవ శ్లోకంలో **స్థిరమతిః** అనే లక్షణం వరకు ముప్పై ఐదు లక్షణాలు వర్ణింప బడ్డాయి. సాధకులకు అత్యంత ఉపయుక్త మైన ఈ సాధనలను వరుసగా చెప్పుకుందాం. ప్రథమంగా పదమూడు, పద్నాలుగు శ్లోకాలలో మొత్తము పన్నెండు లక్షణాలు ఉన్నాయి. ఈ రెండు శ్లోకాలు ఏకాన్వయాలు. అంటే కలిపి అర్థం చేసుకోవలసినవి.

భగవంతునికి ప్రియుడైన భక్తుడు సర్వ ప్రాణుల యందు ద్వేషము లేనివాడు (**అద్వేష్టా సర్వభూతానామ్**). ఇది ప్రథమ లక్షణము.

ద్వేషభావ రహితుడు

భక్తుడు అద్వేష్టుడు. సర్వప్రాణుల యందు ద్వేష భావము లేనివాడు (**అద్వేష్టా సర్వభూతానామ్**). కేవలం మానవుల యందే గాక సర్వ ప్రాణుల యందు ద్వేష భావము లేనివాడు భక్తుడు. రాగ ముంటేనే ద్వేషం కలుగుతుంది. ప్రియం ఉంటేనే, దానికి అవరోధాన్ని కల్పించిన వారి యందు ద్వేషం ఉత్పన్న మవుతుంది. ఆత్మవిదుడైన జ్ఞాన భక్తునికి దేనిపై రాగ ముంటుంది? **ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి** (6 - 32). సర్వ ప్రాణులను తన ఆత్మ లాగే దర్శించే వాడు జ్ఞాని. అలాంటి వానికి ప్రత్యేకంగా ఎవరిపై రాగం ఉంటుంది? రాగమే లేనపుడు ద్వేష మెలా ఉంటుంది? అందుచేత భక్తుడు అద్వేష్టుడు.

జ్ఞాని అద్వేష్టుడు కనుక ఎవరినీ ద్వేషించడు. మరి ఇతరులు తనను ద్వేషిస్తే, లేదా మోసం చేస్తే, లేక బాధిస్తే, వారి మీద కూడా ద్వేషం రాదా? రాదు. అందుకే అతడు అద్వేష్టుడు. తనకు దుఃఖాన్ని కల్పించిన వారిని కూడా ద్వేషించడు (**ఆత్మనః దుఃఖ హేతు మపి న కించిత్ ద్వేష్టి**). కారణం, అందరినీ అతడు తన లాగే దర్శిస్తాడు కనుక (**సర్వాణి భూతాని ఆత్మత్వేన హి పశ్యతి**). తనను తాను ద్వేషించుకో లేడు కనుక, తన స్వరూప మైన సర్వులను కూడా ద్వేషించ లేడు.

రుచికరమైన పదార్థాలను తొందర తొందరగా తినేటపుడు ఒక్కొక్కసారి నాలుక పళ్ళ మధ్య పడి నలుగుతుంది. ఆ సమయంలో చాలా బాధ కలుగుతుంది. అలాగని నాలుకను కొరికిన పళ్ళను ద్వేషిస్తామా? ఇదీ అంతే. నాలుకే కాదు, నాలుకను కొరికిన పళ్ళు కూడా మనవే కనుక వాటిని ద్వేషించము. అలాగే తన నెవరైనా దుఃఖ పెట్టినా, సర్వులను తన ఆత్మ స్వరూపంగా దర్శించే జ్ఞాని యైన భక్తుడు వారిని ద్వేషించడు. కనుక, సమమైన ఆత్మదర్శనములో రాగద్వేషాలకు స్థానం లేదు. అర్జునా! నేను సర్వ భూతాలలో సమంగా ఉన్నాను. నాకు ప్రియుడు లేడు. ద్వేషింప దగిన వాడూ లేడు (9 - 29) అన్నాడు గీతాచార్యుడు. జ్ఞాని స్థితి అదే. జ్ఞానికి, భగవంతుడికీ తేడా లేదు.

ఆత్మౌపమ్య బుద్ధి కారణంగా జ్ఞాని ఎవరినీ ద్వేషించడు. కర్మయోగి యైన భక్తుడు సర్వమూ వాసుదేవుడే అనే భావంతో ఉంటాడు కనుక (**వాసుదేవ స్సర్వ మితి** - 7 - 19) అతడు కూడా ఎవరినీ ద్వేషించడు.

ద్వేషాలు లేని సమాజము విలసిల్లా లంటే, ద్వేష కారణంగా హింసలు విజృంభించని శాంతి సమాజంలో నెలకొనాలంటే, జ్ఞానులు కాకపోయినా, కర్మయోగులైన భక్తులతో అయినా ఆ సమాజం నిండి ఉండాలి.

ద్వేషించకుండా ఉంటే సరిపోతుందా? ప్రేమించ నవసరం లేదా? దుఃఖం లేకుండా ఉంటే సరిపోతుందా? ఆనందం అవసరం లేదా? ద్వేషము లేకుండా ఉండటం నిషేధ పద్ధతి. అదొక్కటే సరిపోదు. గేదె ఎవరిని ద్వేషిస్తుంది? చెట్టుకు ఎవరిపై ద్వేషం ఉంటుంది? జ్ఞానం కల మానవులు గేదెల లాగా, గోడల లాగా ఉండ కూడదు. ద్వేషం లేకుండా ఉండటము మంచిదే. కానీ, ప్రేమను కలిగి ఉండటము వాంఛనీయము. ప్రేమే మైత్రీ కరుణలను విరజిమ్ముతుంది. రెండు, మూడు లక్షణాలు మైత్రీ కరుణలే.

మిత్రుడు

మిత్రత్వము మైత్రి (**మిత్ర భావః మైత్రీ**). మిత్రత్వముతో మసలుకొనే వాడు మిత్రుడు (**మిత్రతయా వర్తతే ఇతి మైత్రః**). అద్వేష్టుడుగా ఉండట మంటేనే మిత్రుడుగా మెలగ మని భావము. ద్వేషాన్ని నిషేధించడంలో ప్రేమను ప్రతిపాదించడమే ప్రధానము అనేది శ్రుతి హృదయము.

న హి నిందా నిన్దితుం ప్రవర్తతేఽపి తు విధేయం స్తోతుమ్

కేవలం నిందించడమే నింద యొక్క ఉద్దేశం కాదు. స్తుతింప దగిన వాటిని స్తుతించుటకే నిందా ప్రయోగము అన్నది వేదం.

మైత్రీ భావము అద్భుత మైనది. ఆత్మకు ఆత్మయే మిత్రుడు. మన ఎడమ చేతిని దోమ కుడితే, వెంటనే కుడి చేయి అక్కడికి అప్రయత్నంగా వెళ్ళి మృదువుగా మర్దనం చేస్తుంది. అదే మైత్రి. ఆత్మౌపమ్య బుద్ధి ప్రభావము. జ్ఞాని వైభవము.

భక్తుడు కూడా సర్వత్ర సర్వేశ్వరుని దర్శించడం చేత నిమ్నోన్నతాలు చూడకుండా అంతట మైత్రీ భావంతో ప్రవర్తిస్తూ ఉంటాడు.

సూ॥ మైత్రీ కరుణా ముదిత ఉపేక్షాణాం భావనాత శ్చిత్త ప్రసాదనమ్ ॥

మైత్రి, కరుణ, ముదిత ఉపేక్షల యొక్క భావం వల్ల చిత్త ప్రసాదము ఏర్పడుతుంది అని పతంజలి మహర్షి యోగ దర్శనం - సమాధి పాదంలో వ్రాశారు.

సాధారణంగా మనకు నాలుగు రకాలైన వ్యక్తులు జీవితంలో తారస పడుతూ ఉంటారు. మొదటి రకం వారు మనతో సమానులు. వారి విషయంలో మనం స్నేహంగా మెలగాలి. అదే మైత్రి ***(మైత్రీ)***. అలా ప్రవర్తించడం చేత మనస్సులో ఈర్ష్యలు తొలగి పోతాయి.

రెండవ వారు మన కన్నా తక్కువ స్థాయిలో ఉండేవారు. బాధలలో ఉండేవారు. వారి విషయంలో మనం కరుణను చూపాలి ***(కరుణ)***. కరుణా ప్రభావం చేత మన మనస్సు లోని కాఠిన్యాలు కరిగి పోతాయి.

ఇక మూడవ వారు సుఖశాంతులతో, కీర్తి ప్రతిష్ఠలతో తులతూగే వారు. అలాంటి వారిని చూచి నపుడు ముదిత హృదయులము కావాలి. ఆహ్లాద పడాలి ***(ముదిత)***. ముదితా భావం వల్ల మన మనస్సు లోని అసూయ అనే కాలుష్యము కనుమరు గవుతుంది.

ఇక నాల్గవ వారు దుష్టులు. నీచులు. దుర్మార్గులు. ఇలాంటి వారు ఎదురు పడి నపుడు తటస్థంగా, అంటే ఉదాసీనంగా ఉండగలగాలి. వారి పట్ల ఉపేక్షా భావంతో మెలగాలి ***(ఉపేక్ష)***. అప్పుడు మన మనస్సులో క్రోధము ఏర్పడదు. మనలో ఉద్వేగము కలగదు.

మొదటి లక్షణములో మనం చెప్పుకొనిన రాగద్వేషాలు చిత్త మాలిన్యానికి హేతువు లైతే, మైత్రీ కరుణాదులు చిత్త ప్రసాదానికి హేతువు లవుతాయి.

కారుణ్య మూర్తి

భక్తుడు కరుణామయుడు. కరుణా హృదయుడు. దయాగుణం కలవాడు ***(కరుణః కరుణా కృపా దుఃఖి తేషు దయా)***. జ్ఞాని సర్వకర్మ సన్యాసి. సర్వత్ర ఆత్మౌపమ్య బుద్ధి కలవాడు. సన్యాస స్వీకార సమయం లోనే సర్వ ప్రాణులకు అభయ ప్రదానం చేసిన వాడు ***(సర్వ భూతానాం అభయ ప్రదః సన్న్యాసీ)***. ఇదే కరుణ. ఈ ప్రశాంత మనస్కుడైన కరుణ ఉండటం చేతనే సాధు మహాత్ముడు ఆచార్యుడై శిష్యులకు ప్రేమతో బోధ చేస్తాడు. గురువు బ్రహ్మనిష్ఠుడే కాడు, దయామయుడు కూడా అని పరబ్రహ్మాష్టకంలో ప్రవచించారు శ్రీశంకరాచార్యస్వామి ***(దయాలుం గురుం బ్రహ్మనిష్ఠం ప్రశాన్తం)***.

కర్మయోగి యైన భక్తుడు సర్వత్ర వాసుదేవ చైతన్యమునే దర్శించడం చేత అందరి విషయం లోను, సర్వ ప్రాణుల యందును దయ కలిగి ఉంటాడు.

తాను పళ్ళెంలో వడ్డించుకున్న రొట్టెను కుక్క అపహరించి పరుగు తీస్తే, 'పాండురంగా! ఆగు, పరుగెట్టకు!

ఆ రొట్టె గట్టిగా ఉంది. దానిని నువ్వు కొరకలేవు. ఈ నేతిలో ముంచుకొని తిను' అంటూ నేతి గిన్నెను పట్టుకొని నామదేవుడు కుక్క వెంట పరుగు దీయడంలో ఉన్నదంతా కరుణే కదా!

నిర్మముడు

'నాది' అనేది లేనివాడు నిర్మముడు **(నిర్మమః మమ ప్రత్యయ వర్జితః)**. 'నాది' అనే బుద్ధి మమకారము. ఇది చాలా ప్రమాద భరితమైంది. 'ఇది నాది' అంటే నాది కానిది మరొకటి ఉంది అని అర్థము. మమకారం ఉన్నంత వరకు ద్వైత భావన దూరం కాదు. సమస్తాన్ని త్యజించిన సర్వసంగ పరిత్యాగులు కూడా, ఇది నా ఆశ్రమము - ఇది నా కమండలము అంటూ ఉంటారు. అన్నిటినీ పరిత్యజించినా, **మమ కౌపీనః** - నా గోచి అని మమకారాన్ని దాచి పెట్టుకుంటారు.

ద్వేషాన్ని దాటి, మైత్రీ కరుణలను వెంట పెట్టుకొని ప్రయాణం సాగించినా, మమకారం అనే గుంటలో అందరూ పడిపోతారు.

బిడ్డపై తల్లిదండ్రులకు ద్వేషం ఉంటుందా? మైత్రీకరుణలు లేకుండా పోతాయా? కానీ, నాల్గవ లక్షణ మైన ఈ మమకారం వద్దే వాళ్ళు బందీ లవుతారు. దుర్యోధనుని విషయంలో ధృతరాష్ట్రునికి ఉన్న మమకారమే హస్తినలో మారణహోమాన్ని సృష్టించింది.

జ్ఞానికి సర్వం ఆత్మే కనుక, అతనిలో మమకారం ఉండే అవకాశం లేదు. కాని, భక్తుడు ప్రయత్నంతో, అవగాహనతో మమకారాన్ని దూరం చేసుకోవాలి. మమకారాన్ని అనుకున్నంత తేలికగా దూరం చేసుకోలేము. అహంకారము దూరమైతేనే మమకారం అదృశ్య మవుతుంది. అదే తరువాత లక్షణం.

నిరహంకారుడు

'నేను' అనే జ్ఞానం లేనివాడు నిరహంకారుడు **(నిరహంకారః నిర్గత అహం ప్రత్యయః)**. అహంకార రహితుడు. దేహమే నేను అనే భావన లేనివాడు అహంకార శూన్యుడు. అనాత్మ యందు ఆత్మబుద్ధి లేనివాడు. 'నేను' అనే అహంకారం ఉంటేనే 'నాది' అనే మమకారం ఉంటుంది. మమకారానికి అహంకారమే పునాది. అహంకారానికి అజ్ఞానమే కారణము. తాను ఆత్మ అనే జ్ఞానం లేకపోవడం చేత, అనాత్మ అయిన దేహమే తానని భ్రమించడం జరుగుతోంది. దేహము తాను అనే అహంకారం కారణంగా, దేహానికి సంబంధించిన పుత్ర కళత్రాదులు, గృహ వాహనాదులు తనవి అనే మమకారం ఏర్పడుతూ ఉంది. 'నేను ఆత్మ' అనే ఆత్మౌపమ్య బుద్ధి వలన 'నేను దేహము' అనే అహంకారము నశిస్తూ ఉంది. అహంభావన ఎప్పుడైతే నశిస్తూ ఉందో, మమ భావన దానంతటదే నశించి పోతూ ఉంది. ఈ విధంగా నిరహంకారుడైన భక్తుడు నిర్మముడు అవుతున్నాడు. నిర్మముడు, నిరహంకారుడు అయిన వానిని సుఖదుఃఖాలు ఎలా బాధిస్తాయి?

సుఖదుఃఖ సముడు

సుఖమును, దుఃఖమును సమంగా చూచేవాడు సుఖదుఃఖ సముడు. మమత్వము ఉండే చోట ప్రియత్వము ఉంటుంది. అదే రాగము. సుఖానికి హేతువు. అలాంటి సుఖానికి అవరోధము కలిగి నపుడు ద్వేషము పుడుతుంది. అది దుఃఖానికి హేతువు.

సుఖదుఃఖ హేతువులు రాగద్వేషాలను కదిలిస్తాయి. రాగద్వేషాలు ద్వంద్వాల వెంట పరుగులు తీయిస్తాయి. నిర్మముడు మమవృత్తి లేనివాడు. కనుక ప్రియాప్రియాలకు అతీతుడు. నిరహంకారుడు సుఖదుఃఖాలు లేని వాడు. ఈ విధంగా భక్తుడు సుఖదుఃఖాలను దాటి పోతున్నాడు. కనుక, అతడు సహనాన్ని కోల్పోడు. వార్పులు, తీర్పులు తెలియకుండా ఓర్పుతో శోభిస్తాడు.

క్షమావంతుడు

క్షమావంతుడు అంటే ఓర్పు గలవాడు. తిట్టినా, కొట్టినా చలించని గుణం కలవాడు క్షమావంతుడు ***(క్షమావాన్ ఆకృష్టః అభిహతః వా అవిక్రియః ఏవ ఆస్తే).*** క్షమ అంటే, అనివార్యంగా ఆవేదన చెందుతూ బాధలు అనుభవించడం కాదు. సంతాప విలాప రహితంగా సహించడమే క్షమ యొక్క లక్షణము. తన నీడను కొడితే ఎలా స్పందించడో, అలా సాక్షిగా బాధలను భరించడము. ఆత్మయైన తనను తిట్టే వారెవరు? కొట్టే వారెవరు? ఇదే జ్ఞాని క్షమానుభూతి. భక్తుని ప్రేమానుభూతి.

వృక్ష ఇవ తిష్ఠాసేత్ ఛిద్యమానో న కుప్యేత న కంప్యేత !

వృక్షాన్ని ఖండిస్తూ ఉన్నా, కోపం లేకుండా, చలించకుండా ఎలా ఉంటుందో, అలా ఉండటమే క్షమా సామ్య మని వేదం ప్రవచించింది.

ఇక్కడికి పదమూడవ శ్లోకాన్ని పూర్తి చేస్తూ ఏడు లక్షణాలను చెప్పుకున్నాం. ఇక భక్తుడు సదా ఎలా ప్రవర్తిస్తూ ఉంటాడో పద్నాల్గవ శ్లోకంలో చెప్పుకుంటాం.

పద్నాల్గవ శ్లోకంలో ఐదు లక్షణాలు ఉన్నాయి. వీటి మధ్యలో ***సతతం*** అనే పదం గడప మీద దీపం లాగా వెలుగుతూ ఉంది. ఈ ***సతతం*** అనే పదం ఐదు విశేషణాల తోను సంబంధాన్ని కలిగి ఉంటుంది.

సదా సంతుష్టుడు

లాభాలాభాలలో సదా తృప్తిగా ఉండేవాడు సంతత సంతుష్టుడు. సదా 'చాలు' అనే బుద్ధితో తృప్తి చెంది ఉండేవాడు ***(నిత్యం లాభే అలాభే చ ఉత్పన్న అలం ప్రత్యయః).*** ***అలం*** అంటే చాలు అని అర్థం. ఏది వచ్చినా సరిపడి తృప్తిగా ఉండే బుద్ధి. కొరత లేని, వెలితి తెలియని బుద్ధి ***అలం*** ప్రత్యయ పూర్ణము. నిత్యాత్మ భావనే ఈ ***అలం*** ప్రత్యయ హేతువు. ఆత్మ యందు ఆత్మ చేత ఆత్మానందాన్ని అనుభవించే జ్ఞాని బుద్ధి ***అలం*** భావనతో స్థిమితంగా, సంతుష్టమై ఉంటుంది *(2 - 55).*

భక్తుడు ఏది వచ్చినా ప్రసాద బుద్ధితో స్వీకరిస్తాడు కనుక, లాభాలాభాలలో, మానావమానాలలో, జయాపజయాలలో, ప్రాప్తాప్రాప్తాలలో స్థిమితాన్ని కోల్పోక, సదా సంతుష్టుడై ఉంటాడు.

మనము కూడా అప్పుడప్పుడూ సంతుష్టులు గానే ఉంటాము. కానీ, భక్తుడు ఎప్పుడూ సంతుష్టుడై ఉంటాడు. మన సంతోషము చాలా వాటిపై ఆధారపడి ఉంటుంది కనుక, అవి ప్రాప్తిస్తే సంతోషంగా ఉంటాము. అవి దూరమైతే సంతోషాన్ని పారేసుకుంటాము.

భక్తుని యొక్క సంతోషము మరొక దానిపై ఆధారపడి ఉండేది కాదు. అది కేవలం తనకు, తన జ్ఞానానికి సంబంధించిన విషయం. కనుక అది ఎన్నడూ తనకు దూరం కాదు. అదే నిత్య సంతోషము. సంతతానందము. అది కలవాడే సతత సంతుష్టుడు.

నిత్యయోగి

భక్తుడు నిత్యము యోగియై ఉంటాడు. అందుచేత, అతడు నిత్యయోగి. సతతం యోగి ***(సతతం సమాహిత చిత్తః సతతం యోగీ).*** సదా సమాహిత చిత్తుడు. సమరూపుడైన బ్రహ్మము నందే చిత్తమును నిశ్చలముగా ఉంచువాడు యోగి. అలా బ్రహ్మము నందే సదా అతడి చిత్తము ఉంటుంది కనుక అతడు సదాయోగి. యోగము నందు అప్రమత్తంగా ఉండేవాడు. జ్ఞానీ భక్తుడు సహజం గానే యోగిగా శోభిస్తూ ఉంటే,

కర్మయోగి అయిన భక్తుడు ప్రయత్నంతో అప్రమత్తుడై ఉంటాడు. దిక్సూచి సదా ఉత్తర దిక్కు వైపే ఉన్నట్లు, భక్తుడు సదా యోగము నందే స్థిరపడి ఉంటాడు.

మనమూ యోగము నందు ఉంటాము. కానీ సతతం యోగులుగా ఉండ లేము. మన యోగం ఏదో కాలానికి పరిమితమై ఉంటుంది. భక్తుడు సర్వ కాలాలలో యోగిగా ఉంటాడు. అందుకే భక్తుడు సతతయోగి.

మనకు యోగ మొక్కటే కాదు. యోగంతో పాటు మన మనస్సుకు ఎన్నో కావాలి. ఏవేవో రుచులు, అభిరుచులు మన మనస్సులలో తిష్ఠ వేసి ఉంటాయి. అందుచేత మన మనస్సు సదా యోగంలో ఉండలేక చలిస్తూ ఉంటుంది. అన్య విషయాలలో చరిస్తూ ఉంటుంది.

భక్తునికి భగవంతుడు తప్ప మరొక దాని యందు మనస్సు లగ్నం కాదు. మరొక విషయము నందు భక్తుని మనస్సుకు ఆసక్తి ఉండదు, అనురక్తి కుదరదు, అభిరుచి కలగదు. అందుచేత అతడు సదా యోగి.

సదా యతాత్ముడు

యత స్వభావము కలవాడు యతాత్ముడు. సదా యతాత్ముడు కనుక సంయతాత్ముడు ***(సంయత స్వభావః యతాత్మా).*** ***యతః*** అంటే నియమింప బడిన 'స్వభావం', చిత్తము లేదా సంస్కారము కలవాడు. అంటే, దేహేంద్రియ మనోబుద్ధులను చక్కగా, నిరంతరము తన అధీనంలో ఉంచుకొని ఉండేవాడు. జ్ఞాని ఆత్మౌపమ్య బుద్ధి కలవాడు కనుక అతనికి సహజం గానే నిగ్రహింపబడి ఉంటాయి. కాని, భక్తుడు ప్రయత్నంతో నిగ్రహిస్తాడు.

తాను నివారించిన చోటికి కాళ్ళు నడచి పోవు. తాను నిషేధించిన పదార్థాలను నాలుక రుచి చూడదు. తాను వద్దనిన మాటలను నోరు మాట్లాడదు. ఏ పనులు చేయాలో, ఏ పనులు చేయకూడదో నిర్ణయించేది తానే గాని తన మనస్సు కాదు. చెయ్యమనిన పనులనే చేతులు చేస్తాయి. వద్దని వారిస్తే వాటిని ముట్టుకోవు. పొరపాటున కూడా పట్టుకోవు. ఇదే సంయతాత్ముని సదా స్వభావ సంగతము.

సదా దృఢ నిశ్చయుడు

దృఢము అంటే స్థిర మైనది. దృఢ నిశ్చయము అంటే స్థిరమైన నిశ్చయము. అట్టి దృఢ నిశ్చయము కలవాడు దృఢ నిశ్చయుడు. దేని విషయంలో దృఢ నిశ్చయం కలవాడు? ఆత్మ విషయంలో దృఢ నిశ్చయం కలవాడు. ఎట్టి పరిస్థితుల లోను తన దృఢ నిశ్చయం నుండి జారి పోనివాడు కనుక జ్ఞాని సదా దృఢనిశ్చయుడు. సంతత దృఢ నిశ్చయుడు ***(దృఢః స్థిరః నిశ్చయః అధ్యవసాయః యస్య ఆత్మతత్త్వ విషయే సః దృఢ నిశ్చయః).*** సతత యోగిగా, సతత యతాత్ముడుగా జ్ఞాని శోభించ దానికి సదా దృఢ నిశ్చయుడై ఉండటమే కారణము.

ఇక భక్తుడైన కర్మయోగి విషయానికి వస్తే అతనికి పురుషార్థ నిశ్చయము దృఢంగా ఉన్నందున, అతడు కూడా భక్తి సాధనలో సదా దృఢ నిశ్చయంతో ఉంటాడు.

సదార్పిత మనోబుద్ధియుతుడు

'ఇదం' వృత్తి రూపమైన సంకల్పాత్మక మనస్సును, 'అహం' వృత్తి రూపమైన నిశ్చయాత్మక బుద్ధిని సదా పరమాత్మ యందే సమర్పించిన మహాత్ముడు జ్ఞాని. మనోబుద్ధులను సదా పరమాత్మ యందే లగ్నం చేసిన వాడు. పూర్వ లక్షణమైన దృఢ నిశ్చయము కూడా ఇందుకు కారణం కావచ్చు.

సర్వ మిదం అహం చ బ్రహ్మైవ - 'ఈ సమస్త ప్రపంచము, అహం స్వరూపమైన నేను బ్రహ్మమే అయి ఉన్నాము. బ్రహ్మము కన్నా భిన్నంగా లేము' అనే దృఢ నిశ్చయ జ్ఞానం యొక్క ప్రభావము చేత, మనోబుద్ధులు

మరొక విషయం మీదికి పోయే అవకాశమే లేదు. ఈ విధంగా, సదా తన మనోబుద్ధులను పరమాత్మ యందే జ్ఞాని సుస్థిరంగా ఉంచుతాడు.

భక్తునికి సర్వమూ వాసుదేవుడే కనుక *(వాసుదేవ స్సర్వ మితి).* అతని మనోబుద్ధులు కూడా మరొక చోట రమించ లేవు. భక్తుల హృదయాలు పరమేశ్వరుని పాదాల యందే తన్మయమై ఉంటాయి. అందుకే భక్తులు భగవన్మయులు. తన్మయులు *(తన్మయాః).*

క ॥ సరసి రుహోదరు మంగళ చరితామృత మాత్మ గ్రోలు జను డితర కథా
గరళము గ్రోలునె? హరి సంస్మరణము జీవులకు నఖిల సౌఖ్యద మనఘా!

'హే పుణ్యాత్మా! పద్మనాభుని పవిత్రమైన, మంగళకరమైన కథామృతమును పానం చేసే వారికి అన్య విషయాలు, చరిత్రలు విషతుల్యాలు. హరి సంస్మరణమే జీవులకు సర్వ సౌఖ్య ప్రదాయకం' అని విమల చరితుడైన విదురుడు మహాత్ముడైన మైత్రేయునితో భాగవతం - తృతీయ స్కంధంలో విన్నవించు కుంటాడు.

ఇంతవరకు పన్నెండు లక్షణాలను చెప్పుకున్నాం. ఈ పన్నెండు లక్షణాలు కలిగిన జ్ఞాని, లేదా ఈ లక్షణాలను తనవి చేసుకోవాలని నిరంతరం ప్రయత్నించే భక్తుడు తనకు ఇష్టుడు లేదా ప్రియుడు అంటున్నాడు భగవంతుడు *(యః ఈదృశః మద్భక్తః సః మే ప్రియః).* మరి కొన్ని భక్తుని లక్షణాలను చెప్పుకుందాం.

యస్మా న్నోద్విజతే లోకో లోకా న్నోద్విజతే చ యః ।
హర్షామర్ష భయోద్వేగై ర్ముక్తో యః స చ మే ప్రియః ॥ 15

యస్మాత్-న-ఉద్విజతే-లోకః-లోకాత్-న-ఉద్విజతే-చ-యః
హర్షామర్షభయోద్వేగైః-ముక్తః-యః-సః-చ-మే-ప్రియః

యస్మాత్	= ఎవని వలన	హర్షామర్షభయోద్వేగైః	= సంతోషము, క్రోధము, భయము, ఉద్వేగముల నుండి
లోకః	= లోకము	ముక్తః	= ముక్తుడు
న ఉద్విజతే	= భయపడదో	యః	= ఎవడో
లోకాత్ చ	= లోకము వలన	సః చ	= వాడు
యః	= ఎవడు	మే	= నాకు
న ఉద్విజతే	= భయపడడో	ప్రియః	= ప్రియుడు

అర్జునా! భక్తుని వల్ల లోకానికి బాధ ఉండదు. లోకం వల్ల భక్తునికి బాధ లేదు. అతడు భక్తుడంటే! ఆనంద ఆక్రోశాలు, భయావేశాలు అతనిని చేరలేవు. అట్టి భక్తుడే నాకు ప్రియుడు.

వ్యాఖ్య

బాధ అనేది భరించ దగింది కాదు. హింస అనేది సహించ దగిందీ కాదు. అలాంటి వాటిని భరించాలన్నా, భరించే పరిస్థితిని ఊహించాలన్నా, మనిషి ఉద్వేగానికి లోనవుతాడు. ఇవన్నీ భయాలు. భయాలు ఎవరికీ ఆరోగ్యప్రదం కావు. వాటికి ఎవరూ గురి కాకూడదు. అలాంటి భయరహిత సమాజాన్ని మానవలోక మంతా ఆశిస్తోంది. కానీ, లోకం అభయ స్థానంగా మారాలి అంటే, లోకం గీతా భక్తులతో నిండి పోవాలి. గీతను అర్థం చేసుకున్న వారు జీవించే లోకమే అభయ ప్రదేశంగా మారుతుంది. గీతాజ్ఞానమే లోకానికి అభయ ప్రదానం చేయ గలుగుతుంది. ప్రస్తుత శ్లోకం ఈ సత్యాన్ని స్పష్టం చేస్తుంది. భగవద్గీతలో నాకు అత్యంత ప్రియమైన శ్లోకాలలో ఇదొకటి.

పెట్టేది లేదు - పడేది లేదు

భక్తుడు ఎవరినీ బాధ పెట్టడు. అందుచేత, భక్తుని వల్ల లోకానికి భయం లేదు, సంతాపము లేదు, సంక్షోభమూ లేదు. ఎంత అద్భుతమైన లక్షణమో! ఎవరినీ బాధలకు గురి చేయకుండా జీవించడము ఎందరికి సాధ్యం? భక్తులకే సాధ్యం. జ్ఞానం కల వారికే సాధ్యం. అందుకే, జ్ఞానులు ఎవరికీ భయ కారణం కారు.

చీకటిలో అందరూ భయ పడతారు, చీకటి పురుగులు తప్ప. ఏదీ తెలియని స్థితియే చీకటిలో భయ పడటానికి కారణము. తిమిరము భయ హేతువు. కానీ తేజము తిమిరాన్ని హరించినట్లు, జ్ఞానము అజ్ఞానాన్ని హరిస్తుంది. అజ్ఞాన జనిత భయాన్ని, బాధను పోగొడుతుంది.

జ్ఞాని సదా ఆత్మనే దర్శిస్తూ, ఆత్మౌపమ్య బుద్ధితో శోభిస్తూ ఉంటాడు. పరమ కారుణికత్వంతో ప్రవర్తిస్తూ ఉంటాడు. దానికి తోడు క్షమావంతుడై ఉంటాడు. కనుక, అట్టి జ్ఞాని వల్ల, లేదా భక్తుని వల్ల లోకం సంతాపం చెందదు **(యస్మాత్ జ్ఞానినః సన్న్యాసినః లోకం న ఉద్విజతే న సంక్షుభ్యతే).**

తాను లోకాన్ని ఉద్వేగానికి, భయానికి, బాధకు గురి చేయకుండా అభయ రూపుడుగా ఉండటమే గాకుండా, తాను కూడా లోకం వల్ల సంతాపం చెందకుండా ఉంటాడు. ఇది చాలా ముఖ్యమైన విషయం. నే నెవరినీ కష్ట పెట్టనండీ - అయినా ఎందుకో నన్ను అందరూ కష్ట పెడుతూనే ఉంటారు. బాల్యం నుండి నా బ్రతుకింతే అంటూ విచిత్ర మైన విషయాన్ని చాలా మంది వినిపిస్తూ ఉంటారు.

ఈ ప్రపంచంలో ఒకరిని మరొకరు బాధ పెట్టలేరు. అలాగే ఒకరి నొకరు సుఖపెట్టనూ లేరు. సుఖ దుఃఖా లనేవి అన్యులపై ఆధారపడి లేవు. మన ఆలోచనా విధానమే సుఖదుఃఖాలకు కారణం.

సుఖ పడే మనసున్న వారిని ఎవ్వరూ కష్టపెట్ట లేరు. దారి తప్పిన ఊహలతో చరించే మనస్సును ఎవ్వరూ సుఖపెట్ట లేరు. నిష్కారణంగా లేనిపోనివి ఊహించుకొని బాధ పడే వారిని బాధ పెట్టడానికి మరొకరు అవసరమా? అసలు ఈ ప్రపంచంలో భయ కారణాలు లేవు, బాధా కారణాలు లేవు అని తెలియక పోవడమే భయాలకు, బాధలకు ప్రధాన కారణము. బాధలకు ప్రపంచం కారణం కాదు. ప్రపంచం కారణం కాదని తెలియక పోవడమే బాధలకు కారణం. అవగాహనా రాహిత్యమే బ్రతుకును ఆవేదనా నిలయంగా మార్చేస్తుంది.

ఈశ్వర జ్ఞానంతో జీవించే జ్ఞాని, లేదా భక్తుడు సర్వం ఈశ్వరమయంగా ప్రేమపూరిత నేత్రాలతో వీక్షించడం చేత, జ్ఞానపూరిత చక్షువులతో దర్శించడం చేత అతడు లోకాన్ని భయపెట్టడు. అలాగే లోకం వల్ల భయపడడు. తాము నీళ్ళను భయపెట్టకుండా, నీళ్ళ వల్ల తాము భయపడకుండా చేపలు నదిలో చరించి నట్లు, భక్తుడు సమాజంలో సంచరిస్తుంటాడు. అలాంటి భక్తులను కలిగిన సమాజం శాంతినిలయ మవుతుంది. అంతేగాని, భయ పెట్టే క్రోధనులతో, భయపడే పిరికి వాళ్ళతో నిండిన సమాజం శాంతి నిలయము కాకపోగా, అశాంతి స్థావరంగా మారి పోతుంది.

అత్యుగ్రైః జల జన్తుభిః జలనిధిః న ఏవాధిమేతి క్షణం నో యాదాంసి భజన్తి భీతి ముదధేః అత్యూర్జితాత్ సర్వతః - భయంకరమైన జల జంతువులు తనలో చరిస్తూ ఉన్నా, సముద్రము క్షణం కూడా భయానికి లోను కాదు. అలాగే సముద్రములో జీవించే జల జంతువులు కూడా అగాధమైన సాగరము వల్ల భీతి చెందవు. జ్ఞానికి, లేదా భక్తునికి ఈ లోకంతో సంబంధం అలాగే ఉంటుంది. ఇది సామ్యము. అవగాహనా సౌలభ్యం కొరకే ఈ దృష్టాంతము. దృష్టాంతము ఎప్పుడైనా, ఎక్కడైనా ఏకదేశీయమే నని మనం చెప్పుకొనే ఉన్నాము.

దూరం కాలేదు - దూర మయ్యాయి

భయపెట్టని, భయపడని మహోన్నత శీలవంతుడైన జ్ఞాని ప్రియ మైనది ప్రాప్తించి నపుడు కలిగే హర్షమునకు

లోను కాడు. ప్రియవస్తు ప్రాప్తిలో ఉత్పన్నమయ్యే గగుర్పాటు, అశ్రుస్రావము మొదలైన ఆనంద అభివ్యక్త చిహ్నాలతో కూడిన ఉత్కర్ష నుండి, లేదా చిత్త విక్షేపము నుండి విడిపడి ఉంటాడు.

అమర్ష మంటే అసహనము ***(అమర్షః అసహిష్ణుతా).*** ఇతరుల యొక్క ఔన్నత్యాన్ని చూచి సహించలేక పోవడం అమర్ష. సర్వత్ర సమదర్శనం చేసే జ్ఞానిలో, లేదా ఆ ప్రయత్నంలో కొనసాగుతున్న భక్తునిలో ఇలాంటి అసహనము అనూహ్యము.

హర్షామర్షాలు లేనట్టే, భయ ఉద్వేగాలు కూడా ఉండవు. అద్వయ దర్శనం చేత భయము, చిత్త సంతాపము లేని కారణంగా ఉద్వేగము భక్తునిలో గోచరించవు. హర్షామర్ష భయోద్వేగాల నుండి అతడు ముక్తుడు ***(హర్షామర్ష భయోద్వేగైః ముక్తః).*** అలాంటి భక్తుడు భగవంతునికి ప్రియుడట ***(యః సః మే ప్రియః).***

ఇక్కడ ప్రధానంగా ఒక్క విషయాన్ని అర్థం చేసుకోవాలి. ఖైదీ సంకెళ్ళను విడగొట్టుకొని పారి పోయినట్లు, హర్షామర్ష భయోద్వేగాలను భక్తుడు బలవంతంగా విడిపించుకో లేదు. శిక్షాకాలం ముగిసిన ఖైదీకి విడుదల సమయంలో సంకెళ్ళు వాటంతట అవే విడి పోయినట్లు, హర్షాదులు జ్ఞాని నుండి వాటంతట అవే జారి పోయాయి. మేల్కొనిన వాని నుండి స్వప్న దృశ్యాలు దూరమైనట్లు దూరమయ్యాయి. సూర్యోదయంతో తిమిరాలు అదృశ్య మైనట్లు అదృశ్య మయ్యాయి. అంతే.

మరి కొన్ని అమృత విశేషణాలను చెప్పుకుందాం.

అనపేక్షః శుచి ర్దక్ష ఉదాసీనో గతవ్యథః ।
సర్వారమ్భ పరిత్యాగీ యో మద్భక్తః స మే ప్రియః ॥ 16

అనపేక్షః-శుచిః-దక్షః-ఉదాసీనః-గతవ్యథః
సర్వారంభ పరిత్యాగీ-యః-మద్భక్తః-సః-మే-ప్రియః

అనపేక్షః	= కోరిక లేని వాడు	మద్భక్తః	= నా భక్తుడు
శుచిః	= పరిశుద్ధుడు	యః	= ఎవడో
దక్షః	= సమర్థుడు	సః	= వాడు
ఉదాసీనః	= నిర్లిప్తుడు	మే	= నాకు
గతవ్యథః	= అంతరించిన విచారము గల వాడు	ప్రియః	= ప్రియుడు
సర్వారంభపరిత్యాగీ	= సర్వకర్మల లోని కర్తృత్వము విడిచిన వాడు		

అర్జునా! భక్తుడు అపేక్ష లేని వాడు. శుచిర్భూతుడు. సమర్థుడు. పక్షపాతం లేనివాడు. భయం లేనివాడు. సర్వారంభ పరిత్యాగి. కనుకనే, భక్తుడు నాకు ప్రియుడు.

వ్యాఖ్య

అనపేక్షుడు

భక్తుడు ఏ విధమైన అపేక్ష లేనివాడు. ఏ కోరిక లేనివాడు. కోరదగిన విషయాల యందు స్పృహ లేని వాడు ***(అపేక్షా విషయేషు అనపేక్షః నిస్పృహః).*** సర్వకామ వినిర్ముక్తుడు. తన మనుగడకు, సుఖానికి మరొక దానిపై ఆధారపడని వాడు.

దేహానికి, ఇంద్రియాలకు, మనస్సుకు సంబంధించిన బాహ్య విషయాల యందు అపేక్ష లేనివాడు అనపేక్షుడు. కోరేవాడు ఎవడైనా కోరబడే వాటికి వశుడే. భక్తుడే. ప్రాపంచిక విషయాలను ఆశించే వాడు

ప్రపంచానికి వశుడై ఉంటాడు. ప్రపంచానికి భక్తుడై ఉంటాడు. ప్రపంచానికి భక్తుడైన వాడు పరమేశ్వరునికి భక్తుడు కాలేడు. పరమేశ్వరునికి భక్తుడైన వాడు ప్రపంచం విషయంలో విభక్తుడై ఉంటాడు. నిత్య వస్తువుతో సంబంధం కలిగి ఉండటం చేత అనిత్య విషయ సంబంధాలలో అనాసక్తుడై ఉంటాడు. అతడే అనపేక్షుడు.

శుచిర్భూతుడు

భక్తుడు పరిశుద్ధుడు. నిర్మలమైన వాడు. అందుచేత శుచిర్భూతుడు ***(శుచిః).*** శౌచము అనేది రెండు విధాలు. ఒకటి బాహ్య శౌచము, రెండవది అంతఃశౌచము. బాహ్య శౌచమే గాక, అంతఃకరణ శౌచము కూడా కలిగిన వాడు భక్తుడు. అందుకే అతడు శుచిర్భూతుడు ***(శుచిః బాహ్యేన అభ్యన్తరేణ చ శౌచేన సంపన్నః).***

దేహ శుభ్రత, వస్త్ర శుభ్రత, పరిసరాల శుభ్రత, పరికరాల శుభ్రతను పాటించడం బాహ్య శుభ్రత. అదే బాహ్య శౌచము. అలాగే పరిశుద్ధమైన సంకల్పాలు, నిర్మలమైన భావాలు మనస్సులో కలిగి ఉండటము, దానితో పాటు ఈర్ష్య, అసూయ, క్రోధ, భయ, ద్వేషాదులు అనే మాలిన్యాలు చిత్తములో లేకుండా చూసుకోవడము అంతఃశౌచము. భక్తుడు ఈ రెండు శౌచములను కలిగి ఉంటాడు కనుక శుచిర్భూతుడు.

స్వరూప జ్ఞానం చేత జ్ఞాని, ఈశ్వర ప్రణిధానము చేత భక్తుడు అనపేక్షులని ముందు లక్షణము లోనే చూశాము కదా! ఫలాపేక్ష లేదు అంటే, ఫలసంగం లేదు. ఫలసంగం లేని వానికి కర్మసంగం మాత్రం ఎందు కుంటుంది? కర్మసంగం లేకపోవడమే శౌచము ***(కర్మసు అసంగమః శౌచమ్).*** కర్మల యందు అనాసక్తియే శౌచము. అశౌచానికి అవకాశము ఇవ్వని శౌచము జ్ఞానికి అకర్తృత్వం వల్ల ప్రాప్తిస్తే, భక్తునికి నిమిత్తమాత్రంగా జీవించడం వల్ల లభిస్తుంది.

దక్షుడు

దక్షత అంటే సమర్థత. దక్షత కలవాడు దక్షుడు. తెలుసుకొన వలసినవి ఉన్నప్పుడు వాటిని స్పష్టంగా తెలుసుకొనే వాడు భక్తుడు. అతడే దక్షుడు. చేయదగినవి ఉన్నప్పుడు వాటిలో ఏ విధమైన అస్పష్టత చోటు చేసుకోకుండా చక్కని ఆచరణము కలవాడు దక్షుడు ***(ప్రత్యుత్పన్నేషు కార్యేషు సద్యః యథావత్ ప్రతిపత్తుం సమర్థః దక్షః).*** జ్ఞాతవ్య కర్తవ్యముల యందు సమర్థుడైన వాడు దక్షుడు. దక్షునిలో సమయస్ఫూర్తి ప్రధాన మైనది. అందుచేత గ్రహించ వలసిన దానిని వెంటనే గ్రహించే సమర్థత, చేయవలసిన దానిని వెంటనే ***(సద్యః)*** చేయ గలిగే దక్షత భక్తుడైన దక్షునికి ఉంటుంది. ఈ విధమైన సమర్థత జ్ఞానికి సమ్యక్ జ్ఞానము వలన, కర్మయోగికి చిత్త ప్రసాదము వలన సాధ్య మవుతుంది.

ఉదాసీనుడు

పక్షపాతము లేనివాడు ఉదాసీనుడు. తన కంటూ ఒక పక్షము లేనివాడు. తాను మరొక పక్షమును ఆశ్రయించని వాడు ఉదాసీనుడు ***(న కస్యచిత్ మిత్రాదేః పక్షం భజతే యః స ఉదాసీనః).*** తటస్థ వైఖరి కలవాడు. అతడే యతిపురుషుడు. నిర్మముడు, నిరహంకారుడు అని పూర్వ లక్షణాలలో మనము చర్చించుకున్న భక్తుని వైభవమే ఈ ఉదాసీనతకు హేతువు.

ఉదాసీనుడు అంటే దేనినీ పట్టించుకోని వాడు అనేది అర్థం కానే కాదు. దేనిని పట్టించుకున్నా దానికి పట్టుబడని వాడు ఉదాసీనుడు. ముట్టీ ముట్టని వాడు. అంటీ అంటని వాడు. ఉన్నట్లే ఉన్నా లేనివాడు. అద్దం లాంటి వాడు. అద్దం లాగా అర్థం చెప్పేవాడు.

ఇంటిలో ఉంటే, బయట ఉండేది కనిపించదు. బయట ఉంటే, లోన ఉండేవారు కనిపించరు. గడప మీద ఉంటే, బాహ్యాభ్యంతరాలలో ఉన్నదంతా గోచర మవుతుంది. ఒక పక్షం వహించే వారికి రెండవ పక్షము

అర్థం కాదు. ఏ పక్షము లేకుండా మధ్యస్థులైన వారికి ఉభయ పక్షాలూ అర్థ మవుతాయి. అదే ఉదాసీనత లోని వైభవము.

గతవ్యథుడు

వ్యథ అంటే బాధ. భయంతో కూడిన ఆవేదన. దేని చేత జనులు భీతి చెందుతారో, కలత పడి చలిస్తారో, దానిని వ్యథ అన్నాడు అమరసింహుడు ***(వ్యథ భయ చలన యోః).*** అలాంటి భయం ఎవరి హృదయంలో అదృశ్యమైందో అతడు గతవ్యథుడు. భయం లేని వాడు. భయం పోయిన వాడు ***(గతవ్యథః గత భయః).***

గతము అంటే పోయింది అని అర్థము. ఏదైనా పోయింది అంటే, ఉన్నది పోతుందే గాని లేనిది పోదు. వ్యథ పోయింది అంటే, అలా పోక ముందు అది ఉంది అని అర్థము. ఎక్కడ ఉంది? ఎక్కడ నుండి పోయిందో అక్కడ ఉంది. చిత్తము లోనే ఉంది. చిత్తము నుండే నిర్గత మైంది.

చేయ వలసినవి చేయక పోవడము, చేయ కూడనివి చేయడము, అలాగే ప్రాప్తించ వలసినవి ప్రాప్తించక పోవడము, ప్రాప్తించ కూడనివి ప్రాప్తించడము వ్యథకు కారణాలు. ఇవే తాపాన్ని కలిగిస్తాయి.

జ్ఞాని తాను అకర్త, అభోక్త అనే జ్ఞానంతో సంపన్నుడై ఉండటం చేత, కృత్యాకృత్యములు అతనిని బాధించ లేవు. ***న ఏనం కృతాకృతే తపతః -*** చేసినవి, చేయనివి రెండూ జ్ఞానిని తపింప చేయవు అన్నది వేదం. అందుచేత జ్ఞాని గతవ్యథుడు.

ఇక భక్తుడు పరమేశ్వరుని ఆశ్రయంలో ఉండటం చేత, బాధలు, భయాల నుండి విడిపడి గతవ్యథుడై ప్రసన్నుడై ఉంటాడు.

సర్వారంభ పరిత్యాగి

కర్మలన్నీ ఆరంభాలు. మొదలయ్యేవి ఆరంభాలు. ఇహపర సంబంధమైన కర్మలన్నీ ఆరంభాలే. అట్టి కర్మల నన్నిటినీ విడిచి పెట్టిన వాడు సర్వారంభ పరిత్యాగి ***(కర్మాణి సర్వారంభాః, తాన్ పరిత్యక్తుం శీలం అస్యేతి సర్వారంభ పరిత్యాగీ).*** ఆత్మకు కర్మలు లేవు. ఆత్మ యందు కర్మలు ఆరంభాలు కావు. ఆత్మ తానే అనే ఎరుక గల జ్ఞాని కర్మలు చేసినా చేయని వాడే. కనుక అతడు సర్వారంభ పరిత్యాగి. కర్తృత్వాభిమానం లేకుండా కర్త భగవంతుడే గాని తాను కాదు అని భావించడం చేత భక్తుడు కూడా సర్వారంభ పరిత్యాగియే.

యో న హృష్యతి న ద్వేష్టి న శోచతి న కాంక్షతి ।
శుభాశుభ పరిత్యాగీ భక్తిమా న్యః స మే ప్రియః ॥ 17

యః-న-హృష్యతి-న-ద్వేష్టి-న-శోచతి-న-కాంక్షతి
శుభాశుభ పరిత్యాగీ-భక్తిమాన్-యః-సః-మే-ప్రియః

యః	=	ఎవడు	భక్తిమాన్	=	భక్తుడు
న హృష్యతి	=	సంతసించడో	యః	=	ఎవడో
న ద్వేష్టి	=	ద్వేషించడో	సః	=	వాడు
న శోచతి	=	శోకించడో	మే	=	నాకు
న కాంక్షతి	=	అభిలషించడో	ప్రియః	=	ఇష్టుడు
శుభాశుభపరిత్యాగీ	=	శుభాశుభ కర్మములను విడిచిన వాడో			

అర్జునా! నా భక్తుడు సంతోషించడు. ద్వేషించడు. దుఃఖించడు. ఏదీ కాంక్షించడు. మంచిచెడులను దాటిన వాడు. అందుకే అతడు నాకు ప్రియుడు.

వ్యాఖ్య

అందరి మనస్సులలో ఇష్టాలు ఉంటాయి. అభీష్టాలూ ఉంటాయి. అవి తీరితే మనషులు సంతోషిస్తారు. ఇష్టాలు లేని వాడికి, అభీష్టాలు అర్థం గాని వాడికి తీరే దేముంటుంది? తీరేందుకు జ్ఞాని మనస్సులో ఏమీ లేనందున, అందరూ ఇష్టమని భావించేవి ప్రాప్తించినా జ్ఞానిలో సంతోషము కనిపించదు ***(న హృష్యతి ఇష్ట ప్రాప్తౌ).***

మనస్సులలో ఇష్టాలే కాదు, అయిష్టాలూ ఉంటాయి. ఇష్టాలు ప్రాప్తిస్తే మనుషులు ఎలా సంతోషిస్తారో, అలాగే అయిష్టాలను, అయిష్టాలు ప్రాప్తించడానికి గల కారణాలను ద్వేషిస్తారు. అయిష్టమే ద్వేషానికి కారణము. కానీ, ఇతరులు అనిష్టాలుగా భావించేవి సంభవించినా జ్ఞాని ద్వేషించడు. జ్ఞానికి ఇష్టాలే లేవు కనుక, అనిష్టాలు కూడా ఉండే అవకాశం లేదు. అనిష్టాలు లేవు కనుక ద్వేషమూ ఉండదు ***(న ద్వేష్టి అనిష్టప్రాప్తౌ).*** ఇష్టం రాగ మైతే, అనిష్టము ద్వేష మవుతుంది. జ్ఞాని రాగద్వేషాలకు అతీతుడు.

ఎవరికి ఏది ప్రియమో అది వారికి దూరం కాకూడదని వారు భావిస్తూ ఉంటారు. కొందరికి ధనం ప్రియం. కొందరికి భార్య ప్రియం. కొందరికి అందం ప్రియం. అందరికీ ప్రాణం ప్రియం. ప్రియమైనవి దూరమైతే దుఃఖిస్తూ ఉంటారు. కానీ, జ్ఞానికి దుఃఖం తెలిసే అవకాశమే లేదు. కనుక, అతడు ఎప్పుడూ దుఃఖించడు. ప్రియ మైనది దూరం అయితేనే దుఃఖం కలుగుతుంది. కాని, జ్ఞానికి ప్రియమైనది దూర మయ్యేది కాదు. అదే ఆత్మ. జ్ఞానికి ఆత్మ ఒక్కటే ప్రియము. ఆత్మ కారణం గానే సర్వమూ అతనికి ప్రియము ***(ఆత్మనస్తు కామాయ సర్వం ప్రియం భవతి!).*** ఆత్మ దూర మయ్యేది కాదు. అది తన స్వరూపమే. ప్రియ మైనది దూరమై నపుడు దుఃఖం కలుగుతుంది. ప్రియమైన ఆత్మ విషయంలో వియోగం లేనందున జ్ఞానికి శోకం లేదు; దుఃఖం రాదు ***(న శోచతి ప్రియ వియోగేన).***

మనిషి లోని కొరత మనస్సులో కోరికను కదిలిస్తుంది. లేని దానిని పొంది తృప్తి చెందాలని మనస్సు పరుగులు తీస్తుంది. అసంతృప్తి ఉన్నంత వరకు సముద్రంలో అలలు కదిలినట్లు, మనస్సులో ఆశలు కదులుతూ ఉంటాయి. ఆత్మవిదుడైన జ్ఞాని అసంతృప్తి తెలియని వాడు. వెలితి లేనివాడు. కోరికలు కదలని వాడు. లభించనిది ఉంటే, దానిని కోరడం జరుగుతుంది. సర్వము తానైన ఆత్మరూపుడు పొంద దగిన దంటూ లేనందున, అతడు దేనినీ కోరడు ***(న చ అప్రాప్తం కాంక్షతి).***

శుభములు అంటే పుణ్యములు. అశుభములు అంటే పాపములు. స్వరూప అజ్ఞానం చేత మనిషి పుణ్య పాప కర్మల్ని ఆచరించి, వాటికి సంబంధించిన స్వర్గ నరక ఫలాలను అనుభవిస్తూ ఉంటాడు. కర్మ యందు అకర్మమును దర్శించే జ్ఞాని తాను అకర్త యనే భావన లోనే ఉంటాడు కనుక శుభాశుభములను అంటకుండా ఉంటాడు. అతడే శుభాశుభ పరిత్యాగి ***(శుభాశుభే కర్మణీ పరిత్యక్తుం శీలమ్ అస్యేతి శుభాశుభ పరిత్యాగీ).*** అట్టి భక్తుడు భగవంతునికి ప్రియుడు. సంతసించకుండా, ద్వేషించకుండా, శోకించకుండా, కాంక్షించకుండా, శుభాశుభాలకు అతీతుడై సంచరించే జ్ఞాని ఒక కదిలే దేవాలయం. నడిచే దైవం. భవ్యమైన భక్తుని జీవన వైభవాన్ని వర్ణించడానికి మాటలు చాలవు. అదొక దివ్యమైన అలౌకికానుభూతి. పవిత్రమైన లీలా విభూతి.

ఆఖ్యాయిక

పూర్వం అదొక రాజ్యం. రాజు గారికి లేక లేక ఒక పుత్రుడు వంశాంకురంగా జన్మిస్తాడు. ఆ బిడ్డకు

అలంకరించి ఉన్న అమూల్యమైన రత్నహారాల కొరకు గజదొంగలు ఆ బిడ్డను అపహరిస్తారు. ఆభరణాలను దోచుకొని, ఆ పిల్లవాణ్ణి దూర ప్రదేశాలకు తీసుకువెళ్ళి వదిలేస్తారు.

పిల్లవాడు పెరుగుతూ పెరుగుతూ బిచ్చగాడు అవుతాడు. ఏకాకిగా జీవిస్తూ ఉంటాడు. ఒక గోచి పెట్టుకొని, అక్షయ పాత్రగా ఒక డబ్బాను చేత పట్టుకొని, భుజానికి జోలెను తగిలించుకొని, చిరిగిన బట్టను తలకు చుట్టుకొని, ఆకలేస్తే బిచ్చ మెత్తుకుంటూ, నిద్ర వస్తే చెట్టు క్రింద పడుకొని నిద్రిస్తూ ఉంటాడు.

ఐదు దశాబ్దాలు దొర్లి పోయాయి. రాజ్యంలో రాజు గారు మరణించారు. రాజు సంతతి వారే సింహాసనాన్ని అధిష్ఠించాలి అనేది ఆ రాజ్యంలో అనాదిగా వస్తున్న ఆచారము. రాజు గారికి కలిగిన ఒకానొక వంశాంకురం బాల్యం లోనే అపహరింప బడ్డాడు. పుట్టుమచ్చలతో సహా, బిడ్డ గురుతు లన్నీ చెప్పి, గూఢచారులను పంపి దేశ మంతా గాలించినా బిడ్డ లభ్యం కాలేదు.

ఇప్పుడేమో రాజు గారు మరణించారు. మంత్రిగారు నైష్ఠికుడు. వేదాధ్యయన తత్పరుడు. ఎంత ఆలోచించినా కర్తవ్యం బోధ పడలేదు. అన్యులను రాజ సింహాసనంపై కూర్చో పెడితే, రాజ్యానికి కీడు వాటిల్లుతుం దేమో నని మంత్రి గారి అనుమానం.

ఈ లోగా ఒక సాధు మహాత్ముడు ఆ రాజ్యానికి వచ్చాడు. మంత్రి వెళ్ళి ఆయన పాదాలపై పడి ప్రార్థించాడు. సాధు మహాత్ముని హృదయం ద్రవించింది. రాజకుమారుని జాడను దివ్య దృష్టితో తెలుసు కొనిన ఆ సాధు పురుషుడు, రాజకుమారుడు బిచ్చగాడై, ఉజ్జయినీ ఆలయ ప్రాంగణంలో తిరుగుతూ ఉన్నాడని చెప్పాడు.

ముఖ్యులను వెంట బెట్టుకొని మంత్రిగారు స్వయంగా ఉజ్జయిని చేరాడు. రాజకుమారుని గుర్తించాడు. ఆనవాళ్ళను బట్టి అతడే రాజకుమారుడని ఋజువైంది. మంత్రిగారు ఆనందంతో అతనిని రాజ్యానికి తీసుకొని వచ్చి, చదువుసంధ్యలు చెప్పించారు. సంస్కరింప బడిన ఆ వ్యక్తిని ప్రజామోదంతో రాజును చేశారు. మంత్రిగారి సంరక్షణలో దినదిన ప్రవర్ధమానంగా ఎదిగి, రాజుగా అతడు గొప్ప కీర్తిప్రతిష్ఠలను ఆర్జించాడు. ఇలా కొన్ని సంవత్సరాలు గడిచి పోయాయి.

ఒకనాడు రాజు గారికి ఒక వింత ఆలోచన కలిగింది. ఉజ్జయినీ నగర వీధులలో సుమారు యాభై సంవత్సరాలు జీవించిన జీవన విధానాన్ని మరొక్కసారి, ఈ దశలో అనుభవించా లన్న కోరిక కలిగింది.

ఒక మాసం రోజులు తీర్థయాత్రా నెపంతో, రాజ్యాన్ని మంత్రి గారికి అప్పగించి, తాను కొందరు సన్నిహితులతో కలిసి బయలుదేరి ఉజ్జయిని చేరాడు. ఒక సత్రాన్ని అద్దెకు తీసుకున్నాడు. సహచరులను చుట్టు ప్రక్కల ఉన్న తీర్థక్షేత్రాలను దర్శించి రమ్మని పంపించి వేశాడు.

ఒకనాడు ఉదయాన్నే పూర్వపు వేషాన్ని ధరించాడు. గోచి పెట్టుకున్నాడు. జోలెను, డబ్బా నొక దానిని తగిలించు కున్నాడు. తలకు చిరిగిన పాత బట్టను చుట్టు కున్నాడు. నగర వీధుల లోకి బిచ్చగాడి లాగా ప్రవేశించాడు.

ఒక పూల కొట్టు ముందు నిలబడ్డాడు. పూల వర్తకుడు అతణ్ణి చూడగానే, 'ఇంతకాలం ఏమయ్యావు? రారా. ఇదిగో తీసుకో!' అంటూ కొన్ని నాణెములను ఇచ్చాడు. బిచ్చగాని రూపంలో ఉన్న రాజు ఆ డబ్బును అందుకొని దణ్ణం పెట్టి అక్కడ నుండి కదిలాడు. పూర్వం అన్ని నాణెములు లభిస్తే ఎంత సంతసించే వాడో! కానీ ఇప్పుడు మనస్సులో అలాంటి సంతోషమే లేదు.

మరొక అపరాల కొట్టు వద్దకు వెళ్ళగానే, ఇతడిని చూచిన వర్తకుడు బుసలు కొడుతూ, 'మళ్ళీ

దాపురించావు! ఉదయాన్నే నీ ముఖం చూశాను. ఇక ఈ రోజు బేరం పూజ్యమే' అంటూ దూషించాడు. అతని దూషణలను ఆలకించి మెల్లగా ముందుకు సాగి పోతాడు రాజు. అంతేగాని, మనస్సులో తిట్టిన వానిపై ద్వేషమే కలగదు.

మరొక వడ్డీ వ్యాపారి కొట్టు ముందు నిలబడ్డాడు రాజు. ఆ వడ్డీ వ్యాపారి అప్పుడే ఎవరితోనో కలహించి కలత చెంది ఉన్నాడు. బిచ్చగాణ్ణి చూడగానే, 'నికృష్టుడా! ఎక్కడ చచ్చావు ఇంతకాలం? మళ్ళీ నీ శనిగొట్టు ముఖాన్ని చూపడానికి వచ్చావా?' అని రెచ్చిపోతూ, కోపాన్ని ఆపుకోలేక బలంగా కొడతాడు. ఆ దెబ్బకు బిచ్చగాని రూపంలో ఉన్న రాజు తూలి క్రిందపడి, మెల్లగా లేచి, తన దారిన తాను పోతాడు. అంతే గాని, ఏ మాత్రం దుఃఖించడు. విచారించడు.

ఆ ప్రక్కనే ఒక నిత్యాన్నదాన సత్రం ఉంది. క్రొత్తగా ఉదారులు దానిని నెలకొల్పి ఉన్నారు. వారు గతంలో ఈ బిచ్చగాణ్ణి చూచి ఎరుగరు. వడ్డీ వ్యాపారి దుష్ప్రవర్తన వంతా చూచి బాధపడిన ఆ సత్రం యజమానులు అతనిని లోనికి తీసుకొని వెళ్ళి, ఓదార్పు మాటలు పలికి, భోజనం పెట్టిస్తారు. బట్టలు ఇస్తారు. కొంత డబ్బు కూడా ఇస్తారు. 'నాయనా! నిన్ను ఆ దుష్టుడు దుర్మార్గంగా బాధించాడు. అది మనస్సులో పెట్టుకోకు. వాడు అంతే. నువ్వు ఇక వెళ్ళు. నీకు ఇంకేమైనా డబ్బు అవసరమా? నిస్సంకోచంగా అడుగు, ఇస్తాము' అంటారు. కానీ, రాజు వద్దని తల ఊపి, తన దారిన తాను వెళ్ళి, అద్దెకు తీసుకున్న సత్రానికి చేరి, దుస్తులు మార్చుకొని, ప్రశాంతంగా కూర్చుంటాడు. ఏదో అనిర్వచనీయమైన దివ్యానందంలో ఓలలాడుతూ ఉంటాడు. జరిగిన ఈ సన్నివేశాలలో శుభాశుభాలు అతనిని అంటవు. అతడు శుభాశుభాలకు అతీతుడు.

తాను బిచ్చగాడుగా తిరిగినా, అన్ని నాణెముల బిచ్చం లభించినా అతడు సంతసించలేదు. కోట్లకు అధిపతి యైన రాజు ఆ నాణెములకు సంతసిస్తాడా? **(న హృష్యతి)**. వర్తకుడు నిష్కారణంగా నిందించినా ద్వేషం లేదు. తాను రాజు అని తెలిస్తే అతడు దూషిస్తాడా? అందుకని ద్వేషం లేదు **(న ద్వేష్టి)**. తాను స్వతహాగా రాజై ఉన్నందున, కొట్టినా దుఃఖించ లేదు **(న శోచతి)**. అన్నసత్రం వాళ్ళు ఆదరించి, ఇంకేమన్నా కావాల్సి ఉంటే అడుగు అంటే, పూర్వమైతే ఆశించే వాడేమో గాని, ప్రస్తుతం తాను మకాం ఉన్న సత్రంలో తన దగ్గరే విశేషంగా ధనం ఉండే టప్పుడు ఏమి కోరుతాడు? **(న కాంక్షతి)**. తానేమిటో తనకు తెలిసి, కేవలం లీలా మాత్రంగా బిచ్చ మెత్తుకున్న రాజుగారు శుభాశుభాలకు ఎలా అతీతుడో, తన స్వరూప జ్ఞానమును కలిగి ఉన్న ఆత్మవిదుడు ఈ ప్రపంచంలో క్రీడా విలాసంగా చరిస్తూ ఉన్నా, అలౌకిక ఆనందానుభూతిలో ఓలలాడుతూ ఉంటాడు. ప్రపంచము, ప్రపంచం లోని సన్నివేశాలు జ్ఞానిని కదిలించ లేవు. అవి అతనికి స్వప్నతుల్యాలు. ప్రపంచమే విస్మృతప్రాయము. ఎవరి జ్ఞానము స్థిర మైనదో **(యస్య స్థితా భవేత్ప్రజ్ఞా)**. ఎవరి ఆనందము నిత్య ప్రవాహమో ***(యస్య ఆనందః నిరంతరః)***. అట్టి జ్ఞానికి ఈ ప్రపంచము విస్మృతప్రాయము **(సః ప్రపంచః విస్మృత ప్రాయః** - వివేక చూడామణి).

సమః శత్రౌ చ మిత్రే చ తథా మానాపమానయోః ।
శీతోష్ణ సుఖదుఃఖేషు సమః సఙ్గవివర్జితః ॥ 18
తుల్యనిన్దాస్తుతి ర్మౌనీ సంతుష్టో యేన కేనచిత్ ।
అనికేతః స్థిరమతి ర్భక్తిమాన్ మే ప్రియో నరః ॥ 19

సమః-శత్రౌ-చ-మిత్రే-చ-తథా-మానాపమానయోః
శీతోష్ణ సుఖదుఃఖేషు-సమః-సంగవివర్జితః

తుల్యనిందాస్తుతిః-మౌనీ-సంతుష్టః-యేన-కేనచిత్
అనికేతః-స్థిరమతిః-భక్తిమాన్-మే-ప్రియః-నరః

శత్రౌ చ	= శత్రువు నందు	మౌనీ	= మననశీలుడు
మిత్రే చ	= మిత్రుని యందు	యేన కేనచిత్	= దేని చేత నైనను
తథా	= అటులే	సంతుష్టః	= తృప్తి నొందు వాడు
మానాప మానయోః	= మానావమానముల యందు	అనికేతః	= ఇల్లు లేని వాడు
సమః	= సముడు	స్థిరమతిః	= స్థిరబుద్ధి గల వాడు
శీతోష్ణసుఖదుఃఖేషు సమః	= శీతోష్ణముల యందు	భక్తిమాన్	= భక్తుడైన
	సుఖదుఃఖముల యందు సముడు	నరః	= మానవుడు
సంగవివర్జితః	= సంగత్వము లేనివాడు	మే	= నాకు
తుల్య నిందాస్తుతిః	= నిందాస్తుతులలో సమముగా ఉండువాడు	ప్రియః	= ఇష్టుడు

అర్జునా! నా భక్తునికి శత్రువైనా, మిత్రుడైనా ఒక్కటే. మానావమానాల్ని, శీతోష్ణాలను, సుఖదుఃఖాలను అతడు సమానంగా భావిస్తాడు. అతడు అసంగుడు.

నిందాస్తుతులు అతనికి సమానము. అతడు మౌని. లభించిన దానితో తృప్తి చెందేవాడు. తనకంటూ స్థావరము లేనివాడు. నిశ్చల హృదయుడు. అట్టి భక్తుడు నాకు ప్రియుడు.

వ్యాఖ్య

ఈ రెండూ ఏకాన్వయం గల కూట శ్లోకాలు. అందుచేత రెండిటిని కలిపి వ్యాఖ్యానిస్తున్నాను. భక్తుని దశ లక్షణాలను వివరించే ఈ శ్లోకద్వయం ద్వంద్వ పంచకముతో నిండి ఉంది. అవే శత్రుమిత్రులు, మానావమానాలు, శీతోష్ణాలు, సుఃఖదుఃఖాలు, నిందాస్తుతులు. పూర్వాధ్యాయాలలో వీటిని గూర్చి చర్చించుకొని ఉన్నప్పటికీ, సందర్భోచితంగా ఇక్కడ కూడా సంక్షిప్తంగా చెప్పుకుందాం.

శత్రుమిత్రులు

ప్రియమైన వాడు, ఉపకారం చేసేవాడు మిత్రుడు. అప్రియమైన వాడు, అపకారం చేసేవాడు శత్రువు. కనుక, సాధారణంగా మిత్రుడు చేరువై నపుడు మనస్సులో ప్రియవృత్తి కదిలి సంతోషము, శత్రువు సమీపించి నపుడు మనస్సులో అప్రియ వృత్తి కదిలి సంతాపము కలుగుతూ ఉంటాయి. వికార హేతువులు ఇలా మనలో వికారాలను కలిగిస్తూ ఉంటాయి. ఇది వ్యావహారికంగా సర్వులకు ఉండే సాధారణ అనుభవము.

భక్తుడు ఇందుకు విలక్షణంగా ప్రవర్తిస్తాడు. అతనిది వ్యావహారిక దృష్టి కాదు. పారమార్థిక దృష్టి. ఆత్మదృష్టి జ్ఞాన స్వరూపమైన భక్తిలో అందాలే గాని, ద్వంద్వాలు తలెత్తవు. ఉపకార అపకారాలు బుద్ధిలో నిలవవు.

జ్ఞానికి ఉపకారం చేసే శక్తి ఎవరి కుంది? అలాగని, అపకారం చేసే సామర్థ్యం ఎవరి కుంది? జ్ఞానికి పెడితే అది జ్ఞానికి ఉపకారమా? జ్ఞానిని కొడితే అది జ్ఞానికి అపకారమా? జ్ఞాని తినేవాడు కాడు. అలాగే దెబ్బలు తినేవాడూ కాడు. పెడితే తినే దైనా, కొడితే తినే దైనా దేహమే. ఉపకారమైనా, అపకారమైనా దేహానికే. జ్ఞాని దేహానికి సాక్షిమాత్రమే. కనుక అపకార ఉపకారాలకు, వాటిని ప్రారబ్ధాధీనమైన తన దేహానికి కలిగించిన శత్రుమిత్రులకు జ్ఞాని సాక్షిమాత్రుడే గాని, జ్ఞానికి శత్రుమిత్రాదులు లేరు. కనుక, శత్రుమిత్రుల యందు జ్ఞాని సమంగా వర్తిస్తాడు ***(సమః శత్రౌచ మిత్రేచ).***

ఇక్కడ, మరొక విషయాన్ని కూడా స్పష్టంగా అర్థం చేసుకోవాలి. జ్ఞానిని చాలా మంది శత్రువుగా

భావించవచ్చు. అంతమాత్రాన, జ్ఞానికి శత్రువులు ఉన్నారని భావించడానికి వీలు లేదు. శత్రుత్వ మనేది జ్ఞానిని శత్రువుగా భావించే దౌర్భాగ్యుల దుష్ట చిత్తాలలో ఉందే గాని, సౌజన్యమూర్తి అయిన జ్ఞాని సమ చిత్తంలో లేదు. తనను శత్రువుగా భావించే దుష్టులను, తనతో సఖ్యము చేసే మైత్రీ భావం గల సజ్జనులను జ్ఞాని సమదృష్టితో వీక్షిస్తాడు.

మానావమానాలు

ప్రస్తుత శ్లోకం లోని ద్వంద్వ పంచకములో మానావమానాలు రెండవ జంట. సమ్మానమైనా, అవమాన మైనా, రెండిటిని జ్ఞాని సమంగా వీక్షిస్తాడు **(మానాపమానయోః సమః).**

గౌరవాలలో జనులు పొంగి పోవడము, అగౌరవాలలో క్రుంగి పోవడము సాధారణంగా లోకంలో మనం చూస్తూ ఉంటాము. కానీ, జ్ఞాని ఇందుకు భిన్నంగా ఉంటాడు. తోష విషాద హేతువులు వికారములను కలిగించడానికి సిద్ధంగా ఉన్నా, తనలో ఏ వికారం లేకుండా సమంగా ఉండేవాడు జ్ఞానీ భక్తుడు. సన్మానాలు, అవమానాలు మనస్సుకు సంబంధించినవే గాని, జ్ఞానికి సంబంధించినవి కావు. మనస్సు లోని జ్ఞానాజ్ఞానములను ప్రకాశింప చేసే సాక్షి చైతన్యము తానై ఉన్నందున, మనస్సుకు సంబంధించిన మానావమానములు జ్ఞానికి సమానములు. పరస్పర విరుద్ధమైన గౌరవాగౌరవాలలో అతడు సముడు **(సమః పూజా పరిభావయోః).**

శీతోష్ణాలు

శీతోష్ణాలు మూడవ జంట. ఈ విషయంలో కూడా జ్ఞాని సముడు. శీతము అంటే చలి. ఉష్ణము అంటే వేడి. శీతోష్ణాలు తమ ప్రభావాన్ని దేహంపై చూపుతాయి. దేహమే తామని భావించే దేహాభిమానులను శీతోష్ణాలు వేధిస్తూ ఉంటాయి. అందుకనే ఉష్ణ ప్రదేశాలలో జీవించే వారు వేసవి కాలంలో వేడిని భరించలేక శీతల ప్రదేశాలకు విహారార్థం వెళ్తూ ఉంటారు. అలాగే చలికాలంలో దేహానికి సంబంధించిన వస్త్రధారణ యందు కూడా ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తూ ఉంటారు. జ్ఞాని దేహం కాదు. దేహం ఉండటానికి ఆధారమైన ఆత్మచైతన్యమే జ్ఞాని. కనుక శీతమైనా, ఉష్ణమైనా దేహాన్ని చలింప చేయ గలవే గాని జ్ఞానిని కదిలించ లేవు. దేహానికి సంబంధించిన శీతోష్ణాలు, ఆహార పానీయాలు జ్ఞానికి అవసరాలు కావు. తన అస్తిత్వానికి ఆహార పానీయాదులు, వస్త్ర గృహాదులు అవసరాలు కావు. అవన్నీ ప్రారబ్ధాధీన మైన దేహానికే గాని, కర్మాతీతుడైన తనకు కాదు. కనుక జ్ఞాని ఎలాగైనా ఉండ గలడు. ఎక్కడైనా ఉండ గలడు. ఏది ఉన్నా లేకపోయినా ఉండ గలడు. అతడు బ్రహ్మ స్వరూపుడు. కనుక, అంతట సమరూపుడై ఉంటాడు.

సుఖదుఃఖాలు

సుఖదుఃఖాలు అనేవి మనో వికారాలు. ఇది నాల్గవ జంట. ఏది సుఖం? ఏది దుఃఖం? అని ప్రశ్న వేయనంత వరకే సుఖదుఃఖాలు ఉంటాయి. సుఖదుఃఖా లనేవి రాగద్వేషాలపై ఆధారపడి ఉంటాయి. రాగద్వేషాలకు ఎలా స్థిరత్వము లేదో, రాగద్వేషాల వల్ల కలిగే సుఖదుఃఖాలకు కూడా స్థిరత్వము లేదు. అవి రాకపోకలు కలిగి ఉంటాయి. కనుక సుఖదుఃఖాలు అనిత్యాలు. నిత్యమైన, ఆత్మస్వరూప మైన ఆత్మవిదునిలో మనోవికారా లైన సుఖదుఃఖాలు ఉండ లేవు. మనస్సులో కదిలే సుఖదుఃఖాలకు జ్ఞాని సాక్షీమాత్రుడై ప్రకాశిస్తూ ఉన్నందున, సుఖదుఃఖాలలో జ్ఞాని సమంగా ఉంటాడు **(సమః సుఖదుఃఖేషు).**

అసంగత్వం

అద్వయమైన ఆత్మస్వరూపు డైనందున, మరొక దానితో సంగత్వము ఉండే అవకాశము లేనందున,

జ్ఞాని అసంగుడు. సంగత్వము లేనివాడు *(సంగవర్జితః)*. ఆశ్రయం ఉంటేనే సంగత్వం ఉంటుంది. దానిపై ఆధార పడితేనే సంగత్వం ఉంటుంది. ఇదంతా దేహాత్మ భావము పైనే ఆధారపడి ఉంటుంది. మరొక్కటి యైన జ్ఞానికి దేహం తోనే సంబంధం లేదు, సంగత్వం లేదు. ఇక దేహానికి సంబంధించిన గృహ, వస్త్ర, క్షేత్ర కళత్రాదులతో సంబంధం ఉంటుందా? అందుకే అతడు అసంగుడు.

యమునా తీరంలో ఒక చిన్న కుటీరాన్ని ఏర్పరచుకొని ఒక సాధు మహాత్ముడు జీవిస్తూ ఉండేవాడు. ఒకనాడు యమున కెళ్ళి స్నానం చేసి వచ్చే సరికి ఆయన కుటీరం అగ్ని ప్రమాదానికి గురై కాలిపోతూ ఉంది. ఆ దృశ్యాన్ని చూస్తూ ఆ సాధువు చిరునవ్వును చిందిస్తూ చిద్విలాసంతో వెలిగి పోతున్నాడు.

అది చూచిన ఒక వ్యక్తి, మహాత్మా! మీ కుటీరం కాలిపోతూ ఉంటే అలా చిరునవ్వుతో చూస్తా రేమిటి? అని ప్రశ్నించాడు.

'పండు తినబోయే పావకుడు ముందుగా తొక్కను ఎంత ప్రకాశవంతంగా తొలగిస్తున్నాడో చూసి సంబర పడుతున్నాను' అన్నాడు ఆ సాధువు.

ఎంతటి అసంగత్వం! దేహాన్ని ఆరగించబోయే అగ్నిదేవుడు, దానికి కవచం లాగా ఉన్న కుటీరాన్ని తొలగిస్తున్నాడు అనే భావన ఎంత అద్భుతము! ఆత్మ అంత అద్భుతము! అలాంటి ఆత్మజ్ఞానిని ఎవరు స్తుతించ గలరు? ఎవరు నిందించ గలరు? అతడు నిందాస్తుతులనే జంటకవుల కవిత్వానికి చిక్కేవాడు కాడు.

నిందాస్తుతులు

దూషించడం నింద. పొగడటం స్తుతి. ఇవే నిందాస్తుతులు. ద్వంద్వ పంచకంలో ఇది చివరి జంట. నిందాస్తుతులు మనుషుల మనస్సులను పొంగిస్తూ, క్రుంగదీస్తూ ఉంటాయి. నిందలు అమాంతం మనస్సును కాల్చేస్తూ ఉంటే, స్తుతులు బుద్ధికి ఊరట నిస్తూ ఉంటాయి. ఉత్సాహాన్ని కలిగిస్తూ ఉంటాయి. జ్ఞానికి నిందాస్తుతులు విషాద తోషాలను కలిగించ లేవు కనుక జ్ఞాని వాటి విషయంలో సమానంగా ఉంటాడు.

తనపై తనకు గౌరవం లేని వారికే పరుల స్తుతులు సుఖా న్నిస్తాయి. అలాగే నిందలు దుఃఖాన్ని కలిగిస్తాయి. అన్యుల దూషణ భూషణాలు, తిరస్కార పురస్కారాలు ఆత్మజ్ఞానిని స్పృశించ లేవు.

ఏముంది నిందాస్తుతులలో! నిందలు నిందలూ కావు; స్తుతులు స్తుతులూ కావు. అన్నీ పదలయలే. అక్షర విన్యాసాలే. వాచారంభాలే. శబ్ద తరంగాలే.

నిందలలో తత్త్వం లేదు కనుక, నిందించే వాడు తడబడుతూ తిడుతూ ఉంటాడు. స్తుతులు వాస్తవాలు కావు కనుక, ఒక వైపు స్తుతించే వారు స్వరం పెంచి స్తుతిస్తూ ఉన్నా, అందుకొనే వాడు వేదిక మీద తల దించుకొని తంటాలు పడుతూ ఉంటాడు. ఇలాంటి నిందాస్తుతులు ఆత్మజ్ఞానిని స్పృశిస్తాయా? స్పృశించ లేవు కనుకనే అతడు నిందాస్తుతులలో సమంగా శోభిస్తాడు. గుణదోషాలకు అతీతుడైన ఆత్మవిదుని దోష కథన రూపమైన నిందలు, గుణ కథన రూపమైన స్తుతులు చేరలేక వెను దిరుగుతాయి.

మౌని

మౌనము అంటే వాఙ్నియమము. మౌనము కలవాడు మౌనవంతుడు. అంటే వాక్కును నియమించుకున్న వాడు ***(మౌనీ మౌనవాన్ సంయత వాక్)***. వాక్కును నియమించడము అంటే, మాట్లాడటం మానేయడం కాదు. లేని మూగతనాన్ని కొని తెచ్చుకోవడమూ కాదు. అవసరమైన విషయాన్ని మాట్లాడటము, అది కూడా ఎంత అవసరమో అంత విషయాన్నే భావగర్భితంగా మాట్లాడటము. ఇదే వాఙ్నియమము. అంతేగాని, మాటల్ని మూట కట్టేసి మనస్సులో మథన పడటం కాదు. మౌనము అనేది మనన శీలత్వం కొరకే. అంతేగాని, మౌనం

అలంకారమూ కాదు, ఆభరణమూ కాదు. జ్ఞానికి మౌన మనేది సహజంగా ఉంటుంది. సాధకుడు అతి వాగుడు తగ్గించుకోవ డానికి, అనర్థాన్ని నివారించుకోవ డానికి మౌనాన్ని అభ్యసించ వలసి ఉంటుంది.

సంతుష్ట చిత్తుడు

ఆశించింది చేతి కందితే జనులు తృప్తి చెందుతూ ఉంటారు. వారి తృప్తి కొన్నిటి మీద ఆధారపడి ఉంటుంది. అలా గాక, దేనితో నైనా **(యేన కేనచిత్)** సంతృప్తి చెందే వాడు జ్ఞాని, లేదా భక్తుడు **(సంతుష్టః)**. దేనితో నైనా సంతృప్తి చెందే వాడు అంటే, ఏది వచ్చినా అసంతృప్తి చెందని వాడు అని అర్థము. అంటే, ఏది రాకపోయినా సంతోషంగా ఉండేవాడు అని భావము. తన సంతృప్తికి ఏదీ అవసరము లేని వాడు. సదా తావే సంతృప్తిలో ఉండే వాడు. నిత్య సంతోషి. నిత్యపూర్ణుడు. సముద్రం లాగా తన పూర్ణత్వము, లేదా సంతోషము దేని పైనా ఆధారపడి లేదు. అలాంటి **(యేన కేన చిత్ సంతుష్టః)**. సంతుష్ట చిత్తుణ్ణి మహాభారతము బ్రాహ్మణుడు అన్నది. అంటే, బ్రహ్మజ్ఞానముతో నిత్య సంతుష్టుడై ఉండే వాడే బ్రాహ్మణుడు.

యేన కేనచి దాచ్ఛన్నో యేనకేనచి దాశితః।
యత్ర క్వచన శాయీ స్యాత్ తం దేవా బ్రాహ్మణం విదుః॥

లభించిన దానితో దేహాన్ని కప్పుకొని, ప్రాప్తించిన దానిని ఆరగించి, ఎక్కడో ఒక చోట శయనించి, కాలాన్ని వెళ్ళబుచ్చే మహాత్ముడు బ్రాహ్మణుడు అని మహాభారతము - శాంతిపర్వము.

అనికేతుడు

నికేతము అంటే ఇల్లు, లేదా నివాస స్థానము అని అర్థము. ఇల్లు, లేదా ఆశ్రయము కలవాడు నికేతుడు. అలా ఆశ్రయము, లేదా ఇల్లు లేని వాడు అనికేతుడు **(నికేతః ఆశ్రయః నివాసః న విద్యతే యస్య సః అనికేతః)**.

భక్తుడు ఇల్లు లేని వాడు అంటే, భక్తుడైన వానికి ఇల్లంటూ ఉండ కూడదని, అవసర మనకుంటే, అద్దె కొంపలో నివసించాలని వ్యాఖ్యానించిన ప్రబుద్ధుల ప్రవచనాలు కూడా బాల్యంలో నేను విన్నాను.

ఇల్లు లేని వాడు అంటే, తన కంటూ ఇల్లు లేని వాడు అని కాదు. తన దంటూ ఇల్లు లేని వాడు అని అర్థము. మమకారం లేని వాడు. మమ బుద్ధి లేని వాడు.

ఏ ఇంటి యజమాని నైనా 'ఎవరి దండీ ఈ ఇల్లు' అంటే ఏమి చెబుతాడు? 'నా దండీ' అంటాడు. అదే మమ బుద్ధి. నికేతుని బుద్ధి. అది లేని వాడు అనికేతుడు. ఇల్లు లేని వాడు కాదు. 'నా ఇల్లు' అనేది లేని వాడు.

కార్యాలయంలో పని చేస్తాం. అది మన దవుతుందా? కొంతసేపు హోటల్‌లో కూర్చుంటాం. ఆ హోటల్ మనదా? మన దైతే బిల్లు చెల్లిస్తామా? స్నేహితుల ఇళ్ళల్లో, బంధువుల ఇళ్ళల్లో కొంత కొంత కాలం గడుపుతాము. కొన్ని గంటలు సినిమా థియేటర్‌లో కూర్చుంటాం. అలాగే రోజుకు కొన్ని గంటలు ఇంటిలో ఉంటాము. ఏది మనది? ఈ ప్రపంచంలో మనది ఎక్కడుంది? మనదే అయితే, మనం పోయేనాడు అది కూడా మనతో రాదెందుకని? రాకపోతే పోయె! ప్రాణం పోయిన క్షణాన, మనది - మనది అని అల్లాడిన ఇల్లు మనల్నే లోపల ఉంచుకోవ డానికి ఇష్ట పడదు. వెంటనే గుమ్మం దాటించ మంటుంది. ఇది గ్రహించిన భక్తుడు మమ బుద్ధి లేకుండా జీవిస్తాడు.

భూ ప్రపంచం లోనే నీకు ఇల్లు లేదని వేదాంతం చెబుతూ ఉంటే, వెన్నెల పురుగులు అమాంతం అవనిని విడిచి, ఆకాశంలో ఆశ్రయాలు నిర్మించుకోవాలని తహతహ లాడుతున్నాయి. 'ఆలు లేదు - చూలు లేదు, కొడుకు పేరు ఆదిలింగం' - ఇదీ వరుస. చూలు అంటే గర్భము, లేదా బిడ్డ అని అర్థము.

చందమామలో నీళ్ళున్నాయో లేదో నని శాస్త్రజ్ఞులు ఒక వైపు పరిశోధనలు చేస్తూ ఉంటే, మమకార రాయుళ్ళు మరొక వైపు చంద్రునిలో స్థల సేకరణకు యత్నిస్తూ ఉన్నారు. ఇదే అదను అనుకొని కొందరు విక్రయించే ప్రయత్నంలో విరామం లేకుండా అలసి పోతున్నారట! ఏం చేద్దాం! మమ బుద్ధికి రెక్కలొచ్చాయి. ప్రస్తుతం అంతరిక్షంలో ఉంది. ఊపిరి ఆడకుండా ప్రాణం అల్లాడుతోంది. అల్లాడే ప్రాణాన్ని చూస్తూ మనస్సు అస్థిరంగా ఉంది. మమత్వ బుద్ధి ఉన్నంత వరకు స్థిరత్వం ఉండదు. మమత తొలగితేనే స్థిరత.

స్థిరమతి

అస్థిరమైన మతి గల వాడు మందమతి. స్థిరమైన మతి గల వాడు స్థిరమతి. అదే స్థిర బుద్ధి. స్థిర మైనది ఏదో దాని యందు నిలిచే బుద్ధి. స్థిర మైనది పరబ్రహ్మ మొక్కటే. అట్టి పరబ్రహ్మము నందు స్థిరంగా నిలిచే బుద్ధి స్థిరబుద్ధి ***(స్థిరమతిః - స్థిరా పరమార్థ వస్తు విషయా మతిః యస్య సః స్థిరమతిః).*** స్థిరమైన జ్ఞానము కలిగిన బుద్ధి. స్థిరమైన ప్రజ్ఞ. స్థితప్రజ్ఞ. అట్టి స్థితప్రజ్ఞుడు భక్తుడే. భక్తుడు తప్పక స్థితప్రజ్ఞు డవుతాడు. అందుచేత భక్తుడు భగవంతునికి ప్రియుడు ***(భక్తిమాన్ మే ప్రియః నరః).*** భక్తి మోక్ష సాధనము అనే విషయంలో సందేహం అవసరం లేదు. ***అద్వేష్టాది*** శ్లోకాలలో చెప్పబడిన ముప్పై ఐదు లక్షణాలు జ్ఞానిలో స్వరూపతః శోభిస్తూ ఉంటాయి. భక్తులైన కర్మయోగులను అవి సాధ్యరూపంలో అలరిస్తూ ఉంటాయి.

ఈ అధ్యాయ సారము నంతా సింహావలోకనంగా చివరి శ్లోకంలో చెబుతున్నాడు.

యే తు ధర్మ్యామృత మిదం యథోక్తం పర్యుపాసతే ।
శ్రద్ధధానా మత్పరమాః భక్తాస్తే౽తీవ మే ప్రియాః ॥ 20

యే-తు-ధర్మ్యామృతం-ఇదం-యథా-ఉక్తం-పర్యుపాసతే
శ్రద్ధధానాః-మత్పరమాః-భక్తాః-తే-అతీవ-మే-ప్రియాః

యే తు	=	ఎవరయితే	పర్యుపాసతే	=	సేవిస్తున్నారో
శ్రద్ధధానాః	=	శ్రద్ధ గలవారై	తే	=	ఆ
మత్పరమాః	=	నా యందాసక్తి గలవారై	భక్తాః	=	భక్తులు
యథా ఉక్తం	=	పైన తెలిపిన విధముగా	మే	=	నాకు
ఇదం	=	ఈ	అతీవప్రియాః	=	మిగుల ఇష్టులు
ధర్మ్యామృతం	=	ధర్మరూపమైన అమృతమును			

అర్జునా! ఈ ధర్మము అమృత స్వరూపము. నా భక్తులు శ్రద్ధావంతులై, నన్నే పరమగతిగా భావించి, నేను చెప్పిన ఈ ధర్మాన్ని ఆచరిస్తారు. అందుకే వాళ్ళు నాకు అత్యంత ప్రీతి పాత్రులు.

వ్యాఖ్య

ధర్మ్యామృతం

ఇది ధర్మ్యామృతం. ఈ అధ్యాయంలో బోధించ బడింది ***(ఇదం యథోక్తం)*** ధర్మ్యామృతము ***(ధర్మ్యామృతం).*** అంటే, ధర్మ్యరూపము మరియు అమృత స్వరూపము అని అర్థము.

ధర్మము నుండి తొలగనిది, వేరు కానిది కనుక ధర్మ్యం ***(ధర్మాత్ అనపేతం ధర్మ్యం).*** ఇది అమృతత్వానికి కారణం కావడం చేత అమృత స్వరూపము ***(అమృత హేతుత్వాత్).*** జనన మరణాల నుండి ఉద్ధరిస్తుంది కనుక

ఇది అమృత స్వరూపము. కనుకనే భక్తి అమృత స్వరూపము అన్నాడు భక్తి సూత్రాలలో నారద మహర్షి ***(అమృత స్వరూపా చ).*** భక్తి అమృత స్వరూపము. భగవంతుడు అమృత స్వరూపుడు. భక్తుడు కూడా అమృత రూపుడే. కనుకనే ఈ భక్తియోగం అనే అధ్యాయంలో అమృత వర్షం కురిసింది. అమృత స్వరూపమైన భక్తిని అనుష్ఠించిన వారు అమృత స్వరూపు లవుతారు.

భగవంతుని పరమగతిగా భావించి **(మత్పరమాః).** శ్రద్ధావంతులై **(శ్రద్ధధానాః)** భక్తి చేసే వారు భగవంతునికి అత్యంత ప్రీతిపాత్రులు **(అతీవ ప్రియాః).**

ఎవరైతే పరమేశ్వరుని మరొక దాని కొరకు కాకుండా, కేవలం పరమేశ్వరుని కొరకే సేవిస్తారో వారినే 'మత్పరములు' అంటున్నాడు భగవంతుడు. కనుక, మరొక అవసర నిమిత్తం కాకుండా మోక్షార్థమే భగవంతుని ఆశ్రయించే పరమ భక్తులు ఉత్తమ శ్రద్ధావంతులై ఉండాలి.

భగవంతుని యందు, భగవంతుని స్వరూపాన్ని ప్రామాణికంగా అందించే శాస్త్రము నందు, ప్రమాణాన్ని సుస్పష్టం చేసే సద్గురువు నందు అచంచల మైన విశ్వాసాన్ని కలిగి ఉండటమే శ్రద్ధ. శ్రద్ధ గల వారు ధర్మ్యామృతాన్ని పానం చేస్తారు. శ్రద్ధావంతులకే జ్ఞానామృతం ప్రాప్తిస్తుంది **(శ్రద్ధావాన్ లభతే జ్ఞానం).**

కర్మయోగులు సాధనా రూపమైన భక్తిని ఆచరిస్తారు. జ్ఞానయోగులు సాధ్యరూప భక్తిలో అలరారుతారు. కర్మయోగులు ధర్మాచరణంలో శుద్ధిని పొందుతారు. జ్ఞానయోగులు అమృత సిద్ధిని పొంది శోభిస్తారు. యోగులు ఆచరించే ధర్మము అమృత స్వరూపమైన జ్ఞానానికి హేతువుగా ఉంది.

కనుక కర్మయోగుల ధర్మమును, జ్ఞానయోగుల అమృతమును రెండిటిని కలిపి ఈ అధ్యాయము **ధర్మ్యామృతము**గా అందించింది. ధర్మ సంబంధమైన ఈ అమృతమే మోక్ష హేతువుగా ఉంది.

ధర్మరూపంగా శోభిస్తూ, అమృతత్వానికి సాధనం కావడం చేత అమృతమైంది. అమృతము వలె ఆస్వాదింప బడుట చేత కూడా అమృతమైంది. అక్షర రూపులైన అవ్యక్తోపాసకులు ఆస్వాదించేదీ అమృతమే. అమృత జ్ఞానం చేత ఏ అద్వేష్టృత్వాది లక్షణాలు శోభిస్తున్నాయో అవి జ్ఞానికి సహజ లక్షణాలే గాని సాధన రూపాలు కావు అని వార్తికాకారుని అభిప్రాయం కూడా.

శ్లో ॥ ఉత్పన్న ఆత్మావబోధస్య హి అద్వేష్టృత్వాదయో గుణాః ।
అయత్నతో భవన్త్యేవ న తు సాధన రూపిణః ॥

ఆత్మజ్ఞానము కలిగిన మహాత్మునిలో అద్వేష్టృత్వాది లక్షణాలు ప్రయత్నము లేకుండానే శోభిస్తూ ఉన్నాయి. అవి సాధన రూపాలు కావు అన్నది వార్తికము.

అక్షర రూపమైన అవ్యక్తోపాసనను సాగించే జ్ఞానులు భగవంతునికి మిక్కిలి ప్రీతి పాత్రులు. అర్జునా! ఆత్మవిదుడైన భక్తునికి నేను మిక్కిలి ప్రియమైన వాణ్ణి. అతడు కూడా నాకు అత్యంత ప్రియుడు ***(ప్రియోహి జ్ఞానినో౽ త్యర్థ మహం స చ మమ ప్రియః - 7 - 17).***

అలాగే సగుణారాధకులైన విశ్వరూపోపాసకులు, జ్ఞానశుద్ధి ద్వారా పరమేశ్వరునే పొందుతూ ఉన్నారు కనుక, అట్టి అనన్య భక్తులు కూడా భగవంతునికి మిక్కిలి ప్రియులు ***(మద్భక్తః మే ప్రియః : అ. 12 - శ్లో. 14, 15, 16, 17, 19).***

అనన్య భక్తుడికి, జ్ఞానీ భక్తుడికి - ఇద్దరికీ పరమేశ్వరుడే పరమగతి కనుక ఇద్దరూ భగవంతునికి అత్యంత ప్రీతిపాత్రులే ***(భక్తాః తే అతీవ మే ప్రియాః).***

ధర్మామృతం దివ్యంగా కురిసింది. బుద్ధి పాత్రలలో నింపుకున్నాం. ఇక జుర్రడమే మిగిలి ఉంది. ధర్మామృతాన్ని పానం చేసేవాడు భగవంతునికి ఇష్టు డవుతాడు. భగవంతునికి ఇష్టుడైన వానికి మోక్షం ప్రాప్తిస్తుంది. పరమేశ్వరునికి అత్యంత ప్రీతిపాత్రుడైన వానికే మోక్షం లభించకుంటే ఇంకెవరికి లభిస్తుంది?

తస్మాత్ ఇదం ధర్మామృతం ముముక్షుణా యత్నతః అనుష్ఠేయం విష్ణోః ప్రియం పరంధామ జిగమిషుణా ఇతి వాక్యార్థః - కనుక, ప్రియాతి ప్రియమైన విష్ణుపదమును పొందాలని అభిలషించే ముముక్షువు, ధర్మామృత మైన పరమ భక్తిని అవశ్యము ప్రయత్న పూర్వకంగా అనుష్ఠించాలి అని వాక్యార్థం. ఆచార్యుల వారి ఈ భాష్య వాక్య సందేశముతో భక్తిని విషయముగా కలిగిన భక్తి యోగమును సమాప్తం చేస్తూ ఉన్నాను. ఇంతటితో **తత్** పదార్థ స్వరూపమైన మధ్యమ షట్కము సమాప్త మైంది.

ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం
యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే భక్తియోగో నామ ద్వాదశోఽధ్యాయః

ఈ విధంగా ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రము, శ్రీకృష్ణార్జున సంవాదము అయిన భగవద్గీత యందు భక్తియోగ మనే పన్నెండవ అధ్యాయము.



చైతన్య భగవద్గీత

అథ త్రయోదశోఽధ్యాయః - పదమూడవ అధ్యాయము

క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగః - క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగము

జ్ఞానోదయం

అవిద్యాఽస్తమయో మోక్షః - అవిద్య అంతరించడమే మోక్షము. అవిద్య అంటే అజ్ఞానము. అజ్ఞానము అంతరించాలంటే జ్ఞానం కావాలి; జ్ఞానం రావాలి. వెలుగు వస్తేనే చీకటి పోతుంది. జ్ఞానం వస్తేనే అజ్ఞానం పోతుంది.

ఇంతకీ ఏమిటి ఈ అజ్ఞానము? అజ్ఞానం అనర్థదాయక మైన సంసారానికి మూలం. దుఃఖమయమైన సంసారానికి అజ్ఞానమే కారణము. కనుక అజ్ఞానమే బంధము. అజ్ఞాన నాశమే మోక్షము.

బాగుంది. అజ్ఞానము అంటే ఏమిటి? అనేది ప్రశ్న. అంతేగాని, అజ్ఞాన ప్రభావ ఫలితా లేమిటి? అనేది కాదు. దుఃఖ కారణమైన సంసారానికి హేతుభూత మైన అజ్ఞానము ఏమిటి? అనేది ఇక్కడ సూటి ప్రశ్న. దీనికి సమాధానం ఉందా, లేదా?

నా దగ్గరైతే లేదు. లేనపుడు శాస్త్రాన్ని, అందులోను సర్వశాస్త్ర సారము, మోక్ష ప్రయోజనం గల గీతా శాస్త్రాన్ని వ్యాఖ్యానించడ మెందుకు? అని మీరు ప్రశ్నించ వచ్చు. గీతా శాస్త్రాన్ని వ్యాఖ్యానించడానికి గీతకు సంబంధించిన జ్ఞానము ఉండాలి గాని, అజ్ఞానానికి సంబంధించిన జ్ఞానం కాదు. గీత చెప్పే విషయాన్ని విపులీకరించి, విస్పష్టం చేయడానికే వ్యాఖ్యానము. అంతే గాని, గీత చెప్పని దానిని చెప్పేందుకు కాదు.

గీతకు అజ్ఞానం తెలియదు. గీతలో అజ్ఞానం లేదు. గీతలో లేనిది గీతా వ్యాఖ్యానంలో ఎలా ఉంటుంది? అందుకే అంటున్నాను అజ్ఞానం అంటే ఏమిటి అనే ప్రశ్నకు నా వద్ద సమాధానం లేదని.

మరి, అజ్ఞానము లేనిదే అయితే, అజ్ఞాన నాశమే మోక్షము అనే వాక్యానికి అర్థ మేమిటి? లేనిది ఎలా నశిస్తుంది? అని మీరు తిరిగి ప్రశ్నించ వచ్చు. అజ్ఞానము లేదని ఎవ రన్నారు? అజ్ఞానము నా దగ్గర లేదు అన్నాను. గీతలో లేదు అంటున్నాను. అంతేగాని, అజ్ఞానము అనేది అసలు లేనే లేదని నేను చెప్పలేదే? మరి, అజ్ఞానము అంటే తెలిసే దెలా అంటారా? ఏమో! అది ఎవరి దగ్గరుందో వాళ్ళనే ప్రశ్నించాలి. సమాధానం వారి నుండే రాబట్టాలి.

సా అవిద్యా కస్య ఇతి? ఈ అజ్ఞానం ఎవరికి సంబంధించింది? ఎవరి వద్ద ఉంది? అనే ప్రశ్నను శ్రీశంకరాచార్య స్వామి తమ భాష్యంలో ప్రస్తుత అధ్యాయం లోనే లేవ నెత్తి, ***యస్య దృశ్యతే తస్యైవ -*** ఎవడైతే అజ్ఞానాన్ని చూస్తున్నాడో, అజ్ఞానం అంటే ఏమిటి అని ఎవడైతే ప్రశ్నిస్తున్నాడో, వాడి దగ్గరే ఉంది అని సమాధానం కూడా అందించారు.

అజ్ఞానం అనేది ప్రమాణ విషయం కాదు. అజ్ఞానాన్ని ఎవరూ చూడ లేదు. ప్రత్యక్షాది ప్రమాణాలకు అది అందే విషయం కాదు. అందుచేత, అజ్ఞానానికి శాస్త్ర తాత్పర్యం లేదు. తెలియని దానిని తెలిపేందుకే శాస్త్రము ఉంది. అలా శాస్త్రము తెలిపే విషయం ప్రయోజనాన్ని చేకూర్చేది కూడా అయి ఉండాలి. ఇక్కడే, ఈ కారణం చేతనే శాస్త్రము ప్రమాణ మైంది.

ధర్మ్యామృతం దివ్యంగా కురిసింది. బుద్ధి పాత్రలలో నింపుకున్నాం. ఇక జుర్రడమే మిగిలి ఉంది. ధర్మ్యామృతాన్ని పానం చేసేవాడు భగవంతునికి ఇష్టు డవుతాడు. భగవంతునికి ఇష్టుడైన వానికి మోక్షం ప్రాప్తిస్తుంది. పరమేశ్వరునికి అత్యంత ప్రీతిపాత్రుడైన వానికే మోక్షం లభించకుంటే ఇంకెవరికి లభిస్తుంది?

తస్మాత్ ఇదం ధర్మ్యామృతం ముముక్షుణా యత్నతః అనుష్ఠేయం విష్ణోః ప్రియం పరంధామ జిగమిషుణా ఇతి

వాక్యార్థః - కనుక, ప్రియాతి ప్రియమైన విష్ణుపదమును పొందాలని అభిలషించే ముముక్షువు, ధర్మ్యామృత మైన పరమ భక్తిని అవశ్యము ప్రయత్న పూర్వకంగా అనుష్ఠించాలి అని వాక్యార్థం. ఆచార్యుల వారి ఈ భాష్య వాక్య సందేశముతో భక్తిని విషయముగా కలిగిన భక్తి యోగమును సమాప్తం చేస్తూ ఉన్నాను. ఇంతటితో **తత్** పదార్థ స్వరూపమైన మధ్యమ షట్కము సమాప్త మైంది.

ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం
యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే భక్తియోగో నామ ద్వాదశోఽధ్యాయః

ఈ విధంగా ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రము, శ్రీకృష్ణార్జున సంవాదము అయిన భగవద్గీత యందు భక్తియోగ మనే పన్నెండవ అధ్యాయము.



చైతన్య భగవద్గీత

అథ త్రయోదశోఽధ్యాయః - పదమూడవ అధ్యాయము

క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగః - క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగము

జ్ఞానోదయం

అవిద్యాఽస్తమయో మోక్షః - అవిద్య అంతరించడమే మోక్షము. అవిద్య అంటే అజ్ఞానము. అజ్ఞానము అంతరించాలంటే జ్ఞానం కావాలి; జ్ఞానం రావాలి. వెలుగు వస్తేనే చీకటి పోతుంది. జ్ఞానం వస్తేనే అజ్ఞానం పోతుంది.

ఇంతకీ ఏమిటి ఈ అజ్ఞానము? అజ్ఞానం అనర్థదాయక మైన సంసారానికి మూలం. దుఃఖమయమైన సంసారానికి అజ్ఞానమే కారణము. కనుక అజ్ఞానమే బంధము. అజ్ఞాన నాశమే మోక్షము.

బాగుంది. అజ్ఞానము అంటే ఏమిటి? అనేది ప్రశ్న. అంతేగాని, అజ్ఞాన ప్రభావ ఫలితా లేమిటి? అనేది కాదు. దుఃఖ కారణమైన సంసారానికి హేతుభూత మైన అజ్ఞానము ఏమిటి? అనేది ఇక్కడ సూటి ప్రశ్న. దీనికి సమాధానం ఉందా, లేదా?

నా దగ్గరైతే లేదు. లేనపుడు శాస్త్రాన్ని, అందులోను సర్వశాస్త్ర సారము, మోక్ష ప్రయోజనం గల గీతా శాస్త్రాన్ని వ్యాఖ్యానించడ మెందుకు? అని మీరు ప్రశ్నించ వచ్చు. గీతా శాస్త్రాన్ని వ్యాఖ్యానించడానికి గీతకు సంబంధించిన జ్ఞానము ఉండాలి గాని, అజ్ఞానానికి సంబంధించిన జ్ఞానం కాదు. గీత చెప్పే విషయాన్ని విపులీకరించి, విస్పష్టం చేయడానికే వ్యాఖ్యానము. అంతే గాని, గీత చెప్పని దానిని చెప్పేందుకు కాదు.

గీతకు అజ్ఞానం తెలియదు. గీతలో అజ్ఞానం లేదు. గీతలో లేనిది గీతా వ్యాఖ్యానంలో ఎలా ఉంటుంది? అందుకే అంటున్నాను అజ్ఞానం అంటే ఏమిటి అనే ప్రశ్నకు నా వద్ద సమాధానం లేదని.

మరి, అజ్ఞానము లేనిదే అయితే, అజ్ఞాన నాశమే మోక్షము అనే వాక్యానికి అర్థ మేమిటి? లేనిది ఎలా నశిస్తుంది? అని మీరు తిరిగి ప్రశ్నించ వచ్చు. అజ్ఞానము లేదని ఎవ రన్నారు? అజ్ఞానము నా దగ్గర లేదు అన్నాను. గీతలో లేదు అంటున్నాను. అంతేగాని, అజ్ఞానము అనేది అసలు లేనే లేదని నేను చెప్పలేదే? మరి, అజ్ఞానము అంటే తెలిసే దెలా అంటారా? ఏమో! అది ఎవరి దగ్గరుందో వాళ్ళనే ప్రశ్నించాలి. సమాధానం వారి నుండే రాబట్టాలి.

సా అవిద్యా కస్య ఇతి? ఈ అజ్ఞానం ఎవరికి సంబంధించింది? ఎవరి వద్ద ఉంది? అనే ప్రశ్నను శ్రీశంకరాచార్య స్వామి తమ భాష్యంలో ప్రస్తుత అధ్యాయం లోనే లేవ నెత్తి, ***యస్య దృశ్యతే తస్యైవ -*** ఎవడైతే అజ్ఞానాన్ని చూస్తున్నాడో, అజ్ఞానం అంటే ఏమిటి అని ఎవడైతే ప్రశ్నిస్తున్నాడో, వాడి దగ్గరే ఉంది అని సమాధానం కూడా అందించారు.

అజ్ఞానం అనేది ప్రమాణ విషయం కాదు. అజ్ఞానాన్ని ఎవరూ చూడ లేదు. ప్రత్యక్షాది ప్రమాణాలకు అది అందే విషయం కాదు. అందుచేత, అజ్ఞానానికి శాస్త్ర తాత్పర్యం లేదు. తెలియని దానిని తెలిపేందుకే శాస్త్రము ఉంది. అలా శాస్త్రము తెలిపే విషయం ప్రయోజనాన్ని చేకూర్చేది కూడా అయి ఉండాలి. ఇక్కడే, ఈ కారణం చేతనే శాస్త్రము ప్రమాణ మైంది.

ప్రమాణస్య అనధిగత అబాధిత అర్థ బోధకత్వం - ప్రమాణము అనేది తెలియని దానిని తెలుపుతుంది ***(అనధిగతం).*** ఆ తెలిసినది ఏదో మళ్ళీ నిషేధింప బడనిదై ఉంటుంది ***(అబాధితం).*** పైగా విషయ ప్రయోజనం ఉంటుంది ***(ఫలవత్).***

అజ్ఞానము అనధిగతం కాదు. అజ్ఞానాన్ని గూర్చి మాట్లాడే వ్యక్తిలో అజ్ఞానం అనుభవ రూపంలో ఉన్నదే గాని, తెలియనిది కాదు. అజ్ఞాన విషయం వల్ల ఫలసిద్ధి, అంటే ప్రయోజనం లేదు. కనుక, జ్ఞానమే శాస్త్ర విషయం గాని, అజ్ఞానం కాదు.

సరే, అజ్ఞానాన్ని ప్రక్కన ఉంచి, జ్ఞానాన్ని గూర్చి చర్చిద్దాం. జ్ఞాన మేమిటి? దాని అర్థ మేమిటి? 'జ్ఞానము' యొక్క తాత్పర్య మేమిటి? ***యత్ పరః శబ్దః స తదర్థః -*** శబ్దానికి ఏది తాత్పర్యమో అదే శబ్దార్థము. జ్ఞానం అంటే తెలుసుకోవడము. లేదా అర్థం చేసుకోవడము. దేనిని తెలుసుకోవడము? దేనిని అర్థం చేసుకోవడము? ఏదయితే, ఉండి కూడా తెలియకుండా ఉందో, దానిని అర్థం చేసుకోవడమే జ్ఞానము ***(జ్ఞాయతే అనేన ఇతి జ్ఞానమ్).*** మానవాళికి హితమును చేకూర్చేది మోక్ష సంబంధమైన జ్ఞానమే కనుక అదే జ్ఞానానికి శాస్త్ర తాత్పర్యము.

యేన అశ్రుతం శ్రుతం భవతి అమతం మతం అవిజ్ఞాతం విజ్ఞాతం ఇతి - ఏ జ్ఞానమును పొందడం వలన విననిది వినింది అగుచున్నదో, ఆలోచించనిది ఆలోచించినది అగుచున్నదో, తెలియనిది తెలిసినది అగుచున్నదో అదే శాస్త్రోపదేశ తాత్పర్య మని ఛాందోగ్యోపనిషత్తులో ఉద్దాలక మహర్షి తన కుమారుడు, శిష్యుడు అయిన శ్వేతకేతునికి బోధించాడు. ఇదే జ్ఞానము. సత్యజ్ఞానము. పరమార్థ తత్త్వ జ్ఞానము. తెలియదగిన జ్ఞానము ***(ఏతత్ జ్ఞేయం).*** ఇది నశించేది కాదు. అబాధితం కనుక నిత్యము ***(నిత్య మేవ).*** అలాంటిది ఎక్కడో లేదు. నీ లోనే ఉంది ***(ఆత్మసంస్థం).*** దీని కన్నా అన్యంగా తెలియ దగింది మరొకటి లేదు ***(అతః పరం వేదితవ్యం కించిత్ న హి)*** అని నిర్ణయించింది శ్వేతాశ్వతరోపనిషత్.

ఛాందోగ్య, శ్వేతాశ్వతర ఉపనిషత్తులు నిర్ధారణ చేసిన ఈ ఉభయ వాక్యాలు మనకు ఒక పరమార్థ సత్యాన్ని ఆవిష్కరిస్తున్నాయి.

పరమార్థ వస్తువు ఒకటుంది. అది సత్యం. అబాధితం. ఆ ఒక్క దాని జ్ఞానం చేత సర్వజ్ఞానము సిద్ధిస్తుంది. ఒక్క దానిని తెలుసుకోవడం చేత, సమస్తాన్ని తెలుసుకోవడం జరుగుతూ ఉంది అంటే, సమస్తంగా ఉన్నది ఆ ఒక్కటే అని నిస్సందేహంగా తేలి పోయింది. కనుక దానిని తెలుసుకున్న వాడు మరొక దానిని తెలుసుకో నవసరం లేదు. అదే ఆత్మ. తెలుసుకొనే వాడి స్వరూపము. దీనినే భగవద్గీత లోని ప్రథమ షట్కము అనే మొదటి ఆరు అధ్యాయాలలో మనం 'త్వం' పదార్థ శోధనం ద్వారా తెలుసుకున్నాం.

తత్పదార్థ శోధనము

ఏడవ అధ్యాయం నుండి పన్నెండవ అధ్యాయం వరకు గల ద్వితీయ షట్కములో పరమేశ్వరుని తత్త్వమును గూర్చి ముచ్చటించు కున్నాం. సృష్టి జ్ఞానమయంగా ఉంది అని అర్థం చేసుకున్నాం. నియతి రూపంలో ఉన్నది నియంతే నని తెలుసుకున్నాం. సృష్టి స్థితి లయా లన్నీ సృష్టికర్త అధీనం లోనే ఉన్నాయని, సృష్టిలో జ్ఞాన రూపంలో పరమేశ్వరుడే ఉన్నాడని, సృష్టిలో ఉన్నదంతా తానే నని, తాను లేకుండా సృష్టి ఉండలే దని, కాని సృష్టి లేక పోయినా తాను ఉంటాడని - అద్భుతమైన అద్వైత జ్ఞానాన్ని ఏడు, ఎనిమిది, తొమ్మిది అధ్యాయాలలో వంట బట్టించుకున్నాం.

మట్టి పాత్రలలో మట్టే ఉంది, మరొకటి లేదు. మట్టి యొక్క వ్యక్త రూపాలే మట్టిపాత్రలు. మట్టి

లేకుండా మట్టిపాత్రలు ఉండ లేవు. కాని, మట్టిపాత్రలు లేకున్నా మట్టి ఉంటుంది. సృష్టి లేకపోయినా ఈశ్వరుడు ఉంటాడు. ఈశ్వరుని వ్యక్త రూపమే సృష్టి. సృష్టి యొక్క అవ్యక్త స్వరూపము పరమేశ్వరుడే. కనుక సృష్టి యొక్క అర్థం సృష్టిలో లేదు, సృష్టికర్తలో ఉంది అనే తాత్త్విక రహస్యాన్ని కూడా రాజగుహ్యంగా అర్థం చేసుకున్నాం.

ఈశ్వర జ్ఞానమే సృష్టిలో నియతిగా గోచరిస్తూ ఉంది. నియతి విశ్వంలో కనిపించినా, వ్యక్తిలో అగుపించినా, అదంతా ఈశ్వర జ్ఞానమే. విశ్వము విశ్వేశ్వరుని కన్నా వేరుగా లేదని తొమ్మిది, పది, పదకొండవ అధ్యాయాలలో సుస్పష్ట మైంది.

భూతాని విష్ణుః : భువనాని విష్ణుః - లోకు లందరూ విష్ణువే ; లోకాలన్నీ విష్ణువే. అంతా విష్ణుమయమే ***(సర్వం విష్ణుమయం జగత్).*** సర్వమూ వాసుదేవుడే ***(వాసుదేవః సర్వమితి... గీ. 7 - 19).*** ఇదంతా భగవద్గీత - ద్వితీయ షట్కములో 'తత్' పదార్థ శోధనము ద్వారా స్పష్ట మైంది. బాహ్యాభ్యంతరాలలో జ్ఞానరూపంలో పరమేశ్వరుడే శోభిస్తున్నాడు. అందువల్ల విశ్వానికి విశ్వేశ్వరునికి అభేదమే దర్శనీయ మైంది. విశ్వము విశ్వేశ్వరుని కన్నా వేరు కాదని 'తత్' పద నిర్దేశము నిర్ణయించి నపుడు, విశ్వంలో ఉన్న వ్యక్తి విశ్వేశ్వరుని కన్నా వేరుగా ఉండ గలడా? ఈశ్వర జగత్తుల మధ్య భేదం లేనపుడు, జీవేశ్వరుల మధ్య భేదం ఉండ గలదా? ఉండ లేదు. ఇది అర్థమైతే, జీవేశ్వరుల మధ్య అభేదమే దర్శనీయ మవుతుంది. అద్వైతమే అనుభూత మవుతుంది. ఈ విధమైన అద్వైత జ్ఞానోదయానికి ఇప్పుడు 'తత్త్వమసి' మహావాక్యం లోని 'అసి' పద నిర్దేశం జరగ వలసి ఉంది. ఆ కార్యం లోనే మూడవ షట్కము లోని ప్రథమాధ్యాయము, భగవద్గీత లోని పదమూడవ అధ్యాయము అయిన క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగము కళకళ లాడుతూ కళ్ళ ముందు ప్రత్యక్ష మవుతూ ఉంది.

అసి పదార్థ శోధనము

తత్త్వమసి' మహావాక్యానికి విపుల వ్యాఖ్యానమే భగవద్గీత అని మనం ముందే చెప్పుకున్నాం. ***తత్ - త్వం - అసి*** అనే ఈ మూడు పవిత్ర పదాలను గీత లోని మూడు షట్కాలు విపులంగా నిర్దేశిస్తూ, నిర్ణయించాయి. మొదటి ఆరు అధ్యాయాలు గల ప్రథమ షట్కంలో ***త్వం*** పద నిర్దేశం జరిగింది. రెండవ ఆరు అధ్యాయాలు గల ద్వితీయ షట్కంలో ***తత్*** పద నిర్దేశం జరిగింది. ఇక ***తత్ - త్వం*** ఒక్కటే అనేది నిర్దేశింప బడాలి. అది జరిగితే, ***తత్త్వమేవ*** అనే అఖండార్థ వాక్యం అనుభూత మవుతుంది. అది జరగాలి అంటే, ***అసి*** పద నిర్దేశమే తక్షణ కర్తవ్యం. ఆ కార్యమే చివరి ఆరు అధ్యాయాలు గల మూడవ షట్కంలో జరుగుతూ ఉంది. ***అసి*** పదార్థ శోధనమే చివరి షట్కము యొక్క కేంద్ర విషయము. ఈ మహాకార్యంలో పదమూడవ అధ్యాయం, క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగము తెర తొలగించి మనచే ద్వార దర్శనం చేయిస్తూ ఉంది. ***సర్వ మిద మహం చ బ్రహ్మైవ -*** ఈ సమస్త విశ్వము మరియు నేను, బ్రహ్మము కన్నా అన్యంగా లేము, బ్రహ్మము అయ్యే ఉన్నాము అనే అఖండ రూప బ్రహ్మాత్మజ్ఞానాన్ని ప్రసాదించడానికి దర్శన మిస్తూ ఉంది.

దృశ్యా భావే విముచ్యతే - దృశ్యము లేక పోవడమే విముక్తి కనుక, క్షేత్ర క్షేత్రజ్ఞుల వివేచనము ద్వారా క్షేత్రజ్ఞుడైన ఆత్మకు బ్రహ్మ సంబంధమును అద్వయంగా నిర్ధారణ చేయ వలసి ఉంది. అది ఈ చరమ షట్కము లోని ప్రథమాధ్యాయము, గీత లోని త్రయోదశాధ్యాయ మైన క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగంలో నిర్ణయింప బడుతుంది.

వేదము మూడు కాండలతో శోభిస్తూ ఉంది ***(కాండ త్రయాత్మకం వేదం).*** సర్వవేద, వేదాంత సారభూత మైన భగవద్గీత కూడా షట్కత్రయంతో కాండ త్రయాత్మకంగా శోభిస్తోంది. త్రివేణీ మోక్ష తీర్థంలా భాసిస్తోంది.

వాక్యార్థ నిశ్చయంతో వ్యక్తులను వాసుదేవ స్వరూపంగా తీర్చి దిద్దుతూ ఉంది. ముముక్షువులను మోక్షరూపులుగా ముక్తి సింహాసనం పై కూర్చోబెట్టి, **త్వం బ్రహ్మాసి -** నీవు బ్రహ్మమే అయి ఉన్నావు (మహానారాయణోపనిషత్); **విముక్తశ్చ విముక్తయే -** ముక్తుడవే ముక్తుడ వయ్యావు (ముండకోపనిషత్) అంటూ మంగళాశాసనం వినిపిస్తూ ఉంది.

పదమూడవ అధ్యాయము

ఈ అధ్యాయాన్ని క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగము అంటారు. ఏడవ అధ్యాయంలో ఈశ్వరుని ప్రకృతులు రెండుగా సూచింప బడ్డాయి. ఒకటి అపరా ప్రకృతి. రెండవది పరా ప్రకృతి.

భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము, మనస్సు, బుద్ధి, అహంకారము - ఇవే ఎనిమిది విధాలుగా విభజింప బడిన ఈశ్వరుని అపరా ప్రకృతి. దీనినే స్వభావ ప్రకృతి అని కూడా అంటారు.

అపరా ప్రకృతి త్రిగుణాత్మక మైంది. మాయామయ మైంది. అష్టవిధ ప్రకృతిగా తెలుస్తున్న ఈ అపరా ప్రకృతి సంసార హేతుభూతము.

రెండవది అయిన పరా ప్రకృతి జీవభూత మైనది. కనుక, అది ఈశ్వరాత్మకము. ఈ అపరాపరా ప్రకృతుల వలననే సర్వభూతాలు, సృష్టి ఏర్పడింది (7 వ అ - 7 వ శ్లో). ఈ ప్రకృతి ద్వయమే క్షేత్ర క్షేత్రజ్ఞ స్వరూపము.

ఈ ఉభయ ప్రకృతులతో ఈశ్వరుడు జగత్తు యొక్క సృష్టి స్థితి లయాలకు కారణ మవుతున్నాడు. కనుక, క్షేత్ర క్షేత్రజ్ఞ లక్షణమైన ఈ ప్రకృతి ద్వయాన్ని నిరూపించడం ద్వారా ఈశ్వర తత్త్వాన్ని నిర్ధారణ చేయవచ్చు. అందుకొరకే ఈ క్షేత్రాధ్యాయం ప్రారంభ మవుతూ ఉంది ***(క్షేత్ర క్షేత్రజ్ఞ లక్షణ ప్రకృతి ద్వయ నిరూపణ ద్వారేణ తద్వతః ఈశ్వరస్య తత్త్వ నిర్ధారణార్థం క్షేత్రాధ్యాయః ఆరభ్యతే !).***

పంచ మహాభూతాల నుండి మన దేహేంద్రియ మనోబుద్ధుల వరకు ఏదైతే మన జ్ఞానానికి అందుతూ ఉందో, అట్టి జడరూపమైన అపరా ప్రకృతి క్షేత్రము. దీనిని గ్రహించే చైతన్య రూపుడే క్షేత్రజ్ఞుడు.

ఈ క్షేత్ర క్షేత్రజ్ఞుల స్వభావ స్వరూపాలను వివరించి, వివేచనం చేసి, అఖండాత్మ తత్త్వంలో ఈ రెండూ వేరు కావని, ఒకే తత్త్వమని నిరూపించడం చేత, **అసి** పద నిర్దేశం జరిగి ఈశ్వర తత్త్వజ్ఞానం సిద్ధిస్తుంది. క్షేత్ర క్షేత్రజ్ఞులను వేరు వేరుగా చూడటం కాకుండా, ఒకే అఖండాత్మ స్వరూపంగా దర్శించడం జరుగుతుంది.

ఇక్కడ కీలకమైన అంశం ఒకటుంది. దానిని కూడా అర్థం చేసుకొని అధ్యాయం లోకి ప్రవేశిద్దాం. క్షేత్ర క్షేత్రజ్ఞులను అఖండాత్మ స్వరూపంలో ఒకే తత్త్వంగా దర్శించడం అంటే, క్షేత్రాన్ని క్షేత్రజ్ఞుడుగా దర్శించాలా? లేక, క్షేత్రజ్ఞుణ్ణి క్షేత్రంగా దర్శించాలా? ఇది చాలా సూక్ష్మమైన ప్రధానాంశము.

క్షేత్రమును క్షేత్రజ్ఞునిగా దర్శించాలి. అంతేగాని, క్షేత్రజ్ఞుణ్ణి క్షేత్రంగా దర్శించ కూడదు. క్షేత్రమును క్షేత్రజ్ఞునిగా దర్శించడము అఖండాత్మ దర్శనానికి దారి తీసి మోక్ష హేతువు అవుతుంది. క్షేత్రజ్ఞుని క్షేత్రంగా దర్శిస్తే అది బంధ హేతువు అవుతుంది. అనాత్మ అయిన క్షేత్రము నందు 'నేను' అనే ఆత్మబుద్ధి బంధానికి కారణ మవుతుంది. ఇదే అజ్ఞానము ***(అనాత్మని అహ మితి మతిః బంధః అజ్ఞానేన ప్రాప్తః).***

అసలు ఇప్పుడు మనం చేస్తున్నది అదే కదా! 'నేను దేహము' అంటున్నామా లేదా? ఈ మాట పలికించ డానికి శాస్త్ర మెందుకు? కనుక క్షేత్రము క్షేత్రజ్ఞుడే; కాని, క్షేత్రజ్ఞుడు క్షేత్రము కాదు అని చెప్పడానికే శాస్త్రము. సర్పము రజ్జువే; కాని, రజ్జువు సర్పము కాదు అని నిర్ణయించేదే జ్ఞానము. ఈ జ్ఞానము ప్రస్తుతం మనకు లేదు.

మరి, ఏముంది? జ్ఞానము లేదు అనేది ఉంది. ఇదే అజ్ఞానము. శాస్త్రంలో లేనిది. వ్యక్తిలో ఉన్నది. జ్ఞానము ద్వారా అజ్ఞానం నశిస్తుంది. బంధహేతువైన అజ్ఞానం నశిస్తే మోక్షము సిద్ధిస్తుంది. ఈ విధంగా జ్ఞానం మోక్ష హేతువై ఉంది ***(జ్ఞానాత్ మోక్షా ఇతి).*** ఈ జ్ఞానాన్నే ప్రస్తుత అధ్యాయం వితరణ చేస్తుంది.

ఇది జ్ఞాన ప్రధానమైన అధ్యాయము. సులువైనది కాదు గాని, చాలా విలువైన అధ్యాయము. విశిష్టమైన అధ్యాయము. అద్వైతాచార్యులను అమితంగా ఆకర్షించిన అద్భుతమైన అధ్యాయము. ఇక చదవండి.

అర్జున ఉవాచ :

ప్రకృతిం పురుషం చైవ క్షేత్రం క్షేత్రజ్ఞ మేవ చ।
ఏత ద్వేదితు మిచ్ఛామి జ్ఞానం జ్ఞేయం చ కేశవ ॥

ప్రకృతిం-పురుషం-చ-ఏవ-క్షేత్రం-క్షేత్రజ్ఞం-ఏవ-చ
ఏతత్-వేదితుం-ఇచ్ఛామి-జ్ఞానం-జ్ఞేయం-చ-కేశవ

కేశవ	=	కృష్ణా!	జ్ఞానం	=	జ్ఞానమును
ప్రకృతిం	=	ప్రకృతిని	జ్ఞేయం చ	=	జ్ఞేయమును
పురుషం చ ఏవ	=	పురుషుని	ఏతత్	=	దీనిని
క్షేత్రం	=	క్షేత్రమును	వేదితుం	=	తెలిసికొనుటకు
క్షేత్రజ్ఞం ఏవ చ	=	క్షేత్రజ్ఞుని	ఇచ్ఛామి	=	అభిలషిస్తున్నాను

అర్జునుడు అడుగుతున్నాడు :

కేశవా! ప్రకృతి, పురుషులు అంటే ఏమిటి? క్షేత్రము, క్షేత్రజ్ఞుడు అంటే ఏమిటి? జ్ఞానము, జ్ఞేయము అంటే ఏమిటి? కృష్ణా! వీటిని తెలుసుకోవాలని ఉంది.

వ్యాఖ్య

క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగము లోని ఈ ఆరంభ శ్లోకము గీతలో ఉందా? లేక ప్రక్షిప్తమా? అనే మీమాంస ఉంది. అందుచేత ఈ శ్లోకము కొన్ని ప్రతులలో కనిపిస్తుంది. కొన్ని ప్రతులలో అగుపించదు. ఈ శ్లోకాన్ని కలుపుకుంటే గీత శ్లోక సంఖ్య ఏడు వందల ఒకటి అవుతుంది. కాని, వ్యాస వచనానుసారం ఏడువందల శ్లోకాల గ్రంథం గానే భగవద్గీత సంప్రదాయ సమ్మతంగా ఉంది. శ్రీ శంకరాచార్య స్వామి వారి గీతా భాష్యంలో ఈ శ్లోకం అగుపించదు. కనుక, శ్లోక సంఖ్య లేకుండా ఈ శ్లోకాన్ని వ్యాఖ్యానిస్తున్నాను.

మరి, ఈ శ్లోక రచయిత ఆనందగిరియా? లేక మధుసూదన సరస్వతియా? అనే మీమాంసను ప్రక్కన పెట్టి, శ్లోకం ప్రక్షిప్తమే అయినా, గహన మైన అధ్యాయ విషయాన్ని విభజించి సులభతరం చేసి చూపిస్తూ ఉంది కనుక, జిజ్ఞాసువులకు చక్కగా ఉపకరిస్తుందని భావించి వ్యాఖ్యానిస్తున్నాను.

ప్రధానంగా మూడు విషయాలను తెలుసుకోవాలని ఆశించి అర్జునుడు ఈ శ్లోకంలో ప్రశ్నించడం జరిగింది. ప్రశ్నలో మూడు విషయాలుగా తెలుస్తున్నా, అవి ఆరు అంశాలుగా కనిపిస్తున్నాయి.

(1) ప్రకృతి పురుషులు (2) క్షేత్ర క్షేత్రజ్ఞులు (3) జ్ఞాన జ్ఞేయాలు. ఇలా ఆరు అంశాలతో కూడిన మూడు జంట విషయాలను ప్రవేశ పెట్టి అర్జునుడు ప్రశ్నిస్తున్నాడు. ఈ మూడు జంట విషయాలకు సమాధానమే పదమూడవ అధ్యాయము.

కాకపోతే, అర్జునుని ప్రశ్న పరంపరా క్రమము, భగవానుని సమాధాన పరంపరా క్రమము ముందు వెనుకలుగా ఉంటాయి. ఇలా ఉండటము వెనుక ప్రవచన ప్రాధాన్యతా క్రమమే స్పష్టంగా కనిపిస్తూ ఉంది.

అర్జునుని ప్రశ్నలో ప్రకృతి పురుషులు, క్షేత్ర క్షేత్రజ్ఞులు, జ్ఞాన జ్ఞేయములు అనేది క్రమము. భగవంతుని సమాధానంలో మొదట క్షేత్ర క్షేత్రజ్ఞులు (*1 నుండి 6 వ శ్లో వరకు*), తరువాత జ్ఞాన జ్ఞేయములు *(7 నుండి 18వ శ్లోకం వరకు)* చివరగా ప్రకృతి పురుషులు *(19 వ శ్లోకం నుండి చివరిదైన 34 వ శ్లోకం వరకు)* క్రమంగా చెప్పబడ్డారు.

మూడు విషయాలలో ఆరు అంశాలను ప్రస్తావించి పార్థుడు ప్రశ్నించినట్లు బాహ్యానికి కనిపిస్తున్నా, విషయ ప్రధానంగా చూస్తే రెండే ఉన్నట్లు అగుపిస్తున్నాయి. ఒక విధంగా చెప్పాలంటే, అధ్యాయ నామాన్ని ధృవీకరిస్తూ కేవలం క్షేత్ర క్షేత్రజ్ఞులే ప్రస్తావించ బడ్డారు అనిపిస్తుంది.

ప్రకృతి అన్నా, క్షేత్ర మన్నా ఒక్కటే. పురుషుడన్నా, క్షేత్రజ్ఞుడన్నా, జ్ఞేయమన్నా ఒక్కటే. అంటే మొదటి రెండు క్షేత్రము. తరువాత మూడు క్షేత్రజ్ఞుడు. ఇక జ్ఞానం అనేది ఒక్కటే మిగిలి ఉంది.

జ్ఞేయము అనేది జ్ఞానం వల్లనే తెలియ బడుతుంది. కనుక జ్ఞానము, జ్ఞేయము, జ్ఞాన గమ్యము ఆత్మ స్వరూపమే **(జ్ఞానం జ్ఞేయం జ్ఞానగమ్యం హృది సర్వస్య విష్ఠితమ్** *- 13 వ అ - 17 వ శ్లో*). కనుక అమానిత్వాది జ్ఞాన విషయం కూడా క్షేత్రజ్ఞుని స్వరూపం గానే తెలుస్తుంది. ఈ విధంగా మూడు విషయాలుగా అర్జునుడు ప్రస్తావించిన ఆరు అంశాలలో రెండే ప్రధానంగా తెలుస్తున్నాయి. అవి, ఒకటి క్షేత్రము. రెండవది క్షేత్రజ్ఞుడు.

భగవంతుడు చెబుతున్నాడు.

శ్రీ భగవానువాచ :

ఇదం శరీరం కౌన్తేయ క్షేత్ర మి త్యభిధీయతే ।
ఏత ద్యో వేత్తి తం ప్రాహుః క్షేత్రజ్ఞ ఇతి తద్విదః ॥ 1

ఇదం-శరీరం-కౌంతేయ-క్షేత్రం-ఇతి-అభిధీయతే
ఏతత్-యః-వేత్తి-తం-ప్రాహుః-క్షేత్రజ్ఞః-ఇతి-తద్విదః

కౌంతేయ	=	అర్జునా!	వేత్తి	=	తెలుసుకుంటాడో
ఇదం	=	ఈ	తం	=	వానిని
శరీరం	=	శరీరము	క్షేత్రజ్ఞః	=	క్షేత్రజ్ఞుడు
క్షేత్రం ఇతి	=	క్షేత్రమని	ఇతి	=	అని
అభిధీయతే	=	చెప్పబడుతుంది	తత్ విదః	=	అది తెలిసిన వారు
ఏతత్	=	క్షేత్రమును	ప్రాహుః	=	చెబుతారు
యః	=	ఎవ్వడు			

శ్రీ భగవానుడు చెబుతున్నాడు :

కౌంతేయా! ఈ శరీరము క్షేత్రము. దీనిని తెలుసుకొనే వాడు క్షేత్రజ్ఞుడు అని క్షేత్ర క్షేత్రజ్ఞులను గూర్చి తెలిసిన వారు చెబుతున్నారు.

వ్యాఖ్య

ఈ శరీరము క్షేత్రము ***(ఇదం శరీరం క్షేత్రమ్).*** ఇదం (ఇది) అనే సర్వనామము చేత శరీరము క్షేత్రముగా

చెప్పబడింది. 'ఇది' అంటే దృశ్యము, లేదా విషయము. అంటే తెలియబడేది. తెలియబడే సమస్త దృశ్యజాతము 'ఇదం' శబ్ద ప్రత్యయార్థంగా తెలుస్తూ ఉంది.

దేశకాలాలలో దూరంగా ఉండే దానిని 'అది' అంటాము ***(తత్).*** దేశకాలాలలో దూరంగా లేనిది, మన కన్నా అన్యమైనది, అత్యంత సమీపంగా ఉన్న దానిని 'ఇది' ***(ఇదం)*** అంటాము. ప్రస్తుతం 'ఇది' అని చెప్పబడు తున్నది శరీరము ***(ఇదం శరీరం).*** శరీరానికి ***క్షేత్రం*** అని భగవంతుడు నూతన నామకరణం చేశాడు.

క్షేత్రము

క్షత త్రాణాత్, క్షయాత్, క్షరణాత్, క్షేత్రవద్వా అస్మిన్ కర్మఫల నిర్వృత్తేః క్షేత్రమ్ ఇతి - ఆపద నుండి రక్షించేది, నశించే స్వభావం కలది, జీర్ణమయ్యే లక్షణం కలది, బీజ ప్రరోహ స్థానమైన పొలము లాగా కర్మఫలమును పండించే కర్మబీజ ప్రరోహమునకు భూమిక వంటిది క్షేత్రము. అదే మన శరీరము అని శ్రీశంకరులు.

జీవుణ్ణి కవచం లాగా కాపాడుతూ ఉంది కనుక శరీరాన్ని క్షేత్రము అంటారు ***(క్షత త్రాణాత్ క్షేత్రం).*** వృద్ధి క్షయాలన్నీ ఇందు లోనే జరుగుతాయి. వికారయుత మైన శరీరము క్షయ ధర్మం కలది. క్షీణ స్వభావం కలిగి నశిస్తుంది ***(క్షయాత్ క్షరణాత్).*** శ్మశానంలో ఒకనాడు కట్టెలలో కట్టెగా కలిసి దగ్ధమై పోతుంది. అందుకే దహన యోగ్యమైన శరీరాన్ని దేహం అన్నారు.

శరీరము క్షీణించే స్వభావం కలది కనుక ***(శీర్యమాణ స్వభావం శరీరమ్)*** ఎప్పుడూ ఒక విధంగా ఉండక, ఉండ లేక మార్పు చెందుతూ ఉంటుంది ***(అనియత స్వభావః).*** పరిణామశీల మైన క్షేత్ర మనే శరీరము కాలంలో వృద్ధాప్యమును, ఆ తరువాత మరణాన్ని పొంది దహన యోగ్య మవుతుంది.

వెలిగే దీప శిఖ తనంతట తాను స్వయంగా కాంతిహీనమై ఆరి పోతుంది. చలించే దేహము కూడా తనకు తానుగా కాలంలో కరిగి కాష్ఠంలో కాలి పోతుంది.

చరణము: **వెలిగే దీపము ఈ క్షణము**
ఆరి పోవును మరు క్షణము
ఆడే ప్రాణము క్షణక్షణము
ఆగి పోతే తుది క్షణము
నిగ నిగ లాడే శరీరము
మట్టికి మణిహారము
పల్లవి: **మనసా! తెలుసా!**
సాగ సుందదు కలకాలము
అనుపల్లవి: **గాలి ఒక చోట నిలుచునా?**
వయసైనా అంతేలే **॥ మనసా ॥**

అని క్షేత్ర క్షయాన్ని కళ్ళ ముందు పరచింది చైతన్య గీతిక.

క్షీణించే, నశించే స్వభావము కలిగినదే అయినా, దేహము వినియోగము, ఉపయోగము లేనిది కాదు. పొలము ఎలాగైతే బీజ ప్రరోహ స్థానమో, శరీర క్షేత్రము కూడా అలాగే కర్మ బీజ ప్రరోహ స్థానంగా ఉంది. ధర్మబీజ ప్రరోహ భూమికగా ఉంది. జ్ఞానబీజ ప్రరోహ క్షేత్రంగా ఉంది ***(క్షేత్రవద్వా అస్మిన్ కర్మఫల నిర్వృత్తేః క్షేత్రమ్).***

క్షేత్రము అంటే పొలము అని కూడా అర్థం. పొలంలో విత్తనాలు చల్లి పంటలు ఎలా పండించు కుంటామో, అలాగే ఈ శరీర క్షేత్రంలో కర్మఫలాలు పండించుకో వచ్చు. పుణ్యబీజాలు నాటి పుణ్యఫలాలు అందుకోవచ్చు. పాపబీజాలు నాటి పాపఫలాలు పొందవచ్చు. జ్ఞానబీజాలు చల్లి జ్ఞానపంట పండించుకొని మోక్షఫలాన్ని అనుభవించ వచ్చు.

పొలము ఎలా జడమో, దేహము కూడా అలాగే జడము. పొలము ఎలాగైతే దృశ్యంగా కనిపిస్తూ ఉందో, దేహం కూడా అలాగే దృశ్య రూపంగా గోచరిస్తూ ఉంది. దృశ్యమైన జడరూప పొలంలో పంటలు పండినట్లు, దృశ్యమైన జడరూప శరీర క్షేత్రంలో కర్మ పంటలు, ధర్మ పంటలు, జ్ఞాన పంటలు పండుతాయి. అందుచేతనే, దహన యోగ్యమైన దైనా, దేహం ధర్మక్షేత్రంగా శోభిస్తూ ఉంది. భగవద్గీత ఆరంభ శ్లోకం లోనే ధర్మక్షేత్రము, కురుక్షేత్రము అంటూ క్షేత్ర మనే పదాన్ని మనకు పరిచయం చేసింది.

పొలంలో మనం పంటలు పండించుకో వచ్చు. పొలాన్ని మనం తయారు చేయలేదు. అది మనకు ప్రసాదించ బడింది ***(దత్తం).*** దేహ మనే ఈ క్షేత్రం కూడా మనకు ప్రసాదించ బడింది. ఇల్లు మనం కట్టుకొని నివసించినట్లు, దేహాన్ని పరమేశ్వరుడు నిర్మించుకొని, అందులో క్షేత్రజ్ఞ రూపంలో కొలువై ఉన్నాడు. పరమేశ్వరుడు కొలువై ఉన్నాడు కనుక, కాయము కోవెల అయింది. దేహము దేవాలయ మైంది. జీవుడు ఆ దేవాలయంలో దేవుడుగా కొలువై ఉన్నాడు ***(దేహో దేవాలయః ప్రోక్తః జీవో దేవః సనాతనః).***

మనం నిర్మించే దేవాలయం చలన రహితంగా ఉంటుంది. పరమేశ్వరుడు తన కొరకు తాను నిర్మించుకున్న ఈ దేహ మనే ఆలయం చలన శీలమైంది. అది కదిలే దేవాలయం. కదలని వానిని లోన ఉంచుకొని, కళాత్మకంగా కదిలే మందిరమే మానవ దేహము.

పుణ్య ప్రదేశాలను పుణ్య క్షేత్రాలు అంటాము. పుణ్య నదులను తీర్థ క్షేత్రాలు అంటాము. ఏ పవిత్రాత్ముని కారణంగా కాశీ, రామేశ్వరం, బదరీ, శ్రీశైలం పుణ్యక్షేత్రా లయ్యాయో, ఏ దివ్యాత్ముని స్మరణములో గంగా యమునలు, కృష్ణా గోదావరీ చంద్రభాగాలు తీర్థ క్షేత్రాలుగా శోభిస్తున్నాయో, ఆ పరమేశ్వరుని సన్నిధి మాత్రేణ మానవ దేహం ధర్మక్షేత్రంగా శోభిస్తూ ఉంది. ధర్మ బీజానికి ప్రరోహ స్థానమై, ధర్మఫలాలను అందించడానికి సిద్ధంగా ఉంది. జ్ఞాన బీజ ప్రరోహ భూమికయై మోక్ష ఫలాన్ని ప్రసాదించడానికి దివ్యంగా అలరారుతోంది.

క్షేత్రజ్ఞుడు

నశించే శరీరము క్షేత్రము ***(క్షీయతే ఇతి క్షేత్రమ్ శరీరమ్).*** దానిని తెలుసుకొనే వాడు క్షేత్రజ్ఞుడు ***(తజ్జానాతీతి క్షేత్రజ్ఞః).***

వేదాంత శాస్త్రము నందు రెండు పదాలు ప్రధాన మైనవి. ఒకటి 'ఇది' ***(ఇదం)*** కాగా, రెండవది 'నేను' ***(అహం).*** తెలియబడేది, తెలుసుకొనే శక్తి లేనిది 'ఇది'గా పిలువబడే జ్ఞేయము. ఏది జ్ఞేయమో అది జడము ***(యత్ జ్ఞేయం తత్ జడం).*** అదే దృశ్యము. శరీరము కూడా దృశ్యమే, జడమే, జ్ఞేయమే. జడమైన, జ్ఞేయమైన ఈ శరీరాన్ని ఆపాదమస్తకము దృశ్యముగా ఎవడు తెలుసు కుంటున్నాడో, అతడు క్షేత్రజ్ఞుడు. బాహ్యాభ్యంతరాలలో దృశ్య జాతంగా తెలిసే 'ఇదం' శబ్ద దృశ్య విషయమును 'అహం' ప్రత్యయార్థ స్వరూపుడై తెలుసుకొనే వాడు. అనాత్మ మైన క్షేత్రాన్ని తెలుసుకొనే ఆత్మ స్వరూపుడే క్షేత్రజ్ఞుడు. సర్వ దృశ్య విలక్షణ స్వరూపుడు.

అయం ఘటః - ఇది కుండ. **అయం పటః -** ఇది వస్త్రము - అని దృశ్య జాతాన్ని తన కన్నా వేరుగా ఉన్నట్లు ఎలా తెలుసుకుంటున్నాడో అలాగే శరీరమును, వేరు వేరుగా శరీరాంగములను తెలుసుకొనే వాడు క్షేత్రజ్ఞుడు.

నేత్రము రూపాన్ని చూడవచ్చు. రూపము దృశ్యముగా ఉన్నందున, దానిని చూచే నేత్రము ద్రష్ట కనుక, నేత్రము క్షేత్రజ్ఞుడు అని భావించ వచ్చు. కాని, నేత్ర దృష్టి లోపించి ఉంది అని నేత్రాన్ని తెలుసుకుంటున్న జ్ఞాత ***(చక్షుషో ద్రష్టా)*** మాత్రం నేత్రం కాదు. అలాగే వాక్కునకు ద్రష్ట, మనస్సునకు ద్రష్ట, అజ్ఞానమునకు ద్రష్ట, సర్వమునకు ద్రష్ట ***(సర్వస్య ద్రష్టా)*** ఎవడో అతడే జ్ఞాత లేక క్షేత్రజ్ఞుడు.

నా కాలు నొప్పిగా ఉంది ***(పాదే మే వేదనా),*** నా మనస్సు హాయిగా, సుఖంగా ఉంది ***(మనసి మే సుఖమ్)*** అని దేహేంద్రియ మనస్సుల లోని సుఖదుఃఖాలను తెలుసుకొనే జ్ఞాత అలా తెలియబడే దృశ్య జాతము కన్నా అన్యంగా ఉన్నాడు కదా! అతడే క్షేత్రజ్ఞుడు. ప్రపంచము ఉన్నా, సూర్యుడు లేని క్షణాన జగత్తు ఎలా అంధకార బంధుర మవుతూ ఉందో, క్షేత్రజ్ఞుడు లేనపుడు క్షేత్రము యొక్క పరిస్థితి కూడా అలాగే ఉంటుంది. జగదాంధ్యంలో వెలుపలి దృశ్య విషయాలు తెలియనట్లు, క్షేత్రజ్ఞుడు లేకపోతే బాహ్య విషయాలే గాక, శరీరాంగముల చేష్టలు, మనస్సు లోని సుఖదుఃఖాది వృత్తులు కూడా తెలిసే అవకాశము లేదు.

జాగ్రదవస్థలో దృశ్య జాతమును గ్రహించే జ్ఞాతగా తెలుస్తున్న క్షేత్రజ్ఞుడు, స్వప్నద్రష్టగా, నిద్రకు సాక్షిగా కూడా ఉన్నాడు. అవస్థాత్రయాన్ని కూడా తెలుసుకుంటున్న తాను వాటికి సాక్షియై ఉన్నాడు ***(తేభ్యో విలక్షణః సాక్షీ).*** అతడే క్షేత్రజ్ఞుడు.

తద్విదులు

ఈ విధంగా క్షేత్ర క్షేత్రజ్ఞులను ఎవడు తెలుసుకుంటాడో ***(వేత్తి),*** అతడే సత్యాన్ని తెలుసుకున్న వాడు అని క్షేత్ర క్షేత్రజ్ఞుల యదార్థ జ్ఞానాన్ని కలిగిన వారు ***(తద్విదః)*** చెబుతారు.

క్షేత్రజ్ఞ స్వరూపాన్ని తెలుసుకోవడం సులభ సాధ్యమైన కార్యం కాదు. ఈ విషయాన్ని మున్ముందు మనమెంత గానో చెప్పుకోబోతాం. కేవలం దేహాన్ని తెలుసు కుంటున్నంత మాత్రాన, క్షేత్రాన్ని తెలుసు కుంటున్నాడు కనుక క్షేత్రజ్ఞుడు అని చెప్పడానికి అవకాశం లేదు.

కుక్క పిల్లి శరీరాన్ని చూస్తూ ఉంది. కుక్కకు క్షేత్రజ్ఞత్వం సంభవిస్తుందా? అదలా ఉంచండి. మనోబుద్ధులు లేవు కనుక వాటి విషయాన్ని ప్రక్కన పెడదాం. సాధారణ మనిషి విషయానికి వస్తే, మరొక మనిషి శరీరాన్ని చూడటమే గాక, తన శరీరాన్ని, తన శరీరాంగాలను విడివిడిగా ***(విభాగశః)*** తెలుసుకుంటున్నాడు కనుక అతనికి క్షేత్రజ్ఞత్వం ప్రాప్తిస్తూ ఉందా? లేదు. తాను దేహమును తెలుసుకుంటున్నా, మనస్సును తెలుసుకుంటున్నా, తనను దేహేంద్రియ మనోబుద్ధుల సంఘాతంగా ఊహించుకుంటున్నాడే గాని, దృశ్య జాతమును విషయీకరించుకొని, తాను వాటికి విలక్షణంగా ఉన్న 'విషయి' ***(జ్ఞాత)*** అని గ్రహించలేక పోతున్నాడు. అలా గ్రహించాలి అంటే అది ఔపదేశికం గానే సాధ్య పడాలి. ఉపదేశం వల్ల ప్రాప్తించేదే ఔపదేశికము. శాస్త్ర, సద్గురోపదేశం ద్వారా ప్రాప్తించే జ్ఞానము ఔపదేశిక జ్ఞానము. అట్టి సాంప్రదాయక బోధ అంది నపుడే క్షేత్ర క్షేత్రజ్ఞులకు సంబంధించిన జ్ఞానము సుస్పష్టమై, సుదృఢ మవుతుంది.

ఆ ప్రయత్నమే ఆరంభ మవుతూ ఉంది.

క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి సర్వక్షేత్రేషు భారత ।
క్షేత్ర క్షేత్రజ్ఞయో ర్జ్ఞానం యత్త జ్జ్ఞానం మతం మమ ॥ 2

క్షేత్రజ్ఞం-చ-అపి-మాం-విద్ధి-సర్వక్షేత్రేషు-భారత
క్షేత్ర క్షేత్రజ్ఞయోః-జ్ఞానం-యత్-తత్-జ్ఞానం-మతం-మమ

భారత = అర్జునా!
సర్వక్షేత్రేషు = సర్వక్షేత్రాలలో
మాం చ = నన్నే
క్షేత్రజ్ఞం అపి = క్షేత్రజ్ఞునిగ
విద్ధి = తెలుసుకో
క్షేత్ర క్షేత్రజ్ఞయోః = క్షేత్ర క్షేత్రజ్ఞుల యొక్క

జ్ఞానం = జ్ఞానము
యత్ = ఏదో
తత్ = అది
జ్ఞానం = జ్ఞానము
మమ = నా యొక్క
మతం = అభిప్రాయము

భారతా! పార్థా! క్షేత్రా లన్నిటిలో క్షేత్రజ్ఞుడుగా ఉన్నది నేనే అని తెలుసుకో! జ్ఞానము అంటేనే, క్షేత్ర క్షేత్రజ్ఞులకు సంబంధించిన జ్ఞానము అని నా అభిప్రాయము.

వ్యాఖ్య

అఖండాత్మ స్వరూపం

క్షేత్ర మంటే ఏమిటో, క్షేత్రజ్ఞ డెవరో పూర్వ శ్లోకంలో తెలుసుకున్నాం. ఈ మాత్రం తెలుసుకుంటే సరి పోతుందా? సరిపోదు. పూర్వోక్త లక్షణాలు గల క్షేత్రజ్ఞుడు, క్షేత్రముగా తెలియ బడుతున్న ఈ అఖిల ప్రపంచము కూడా పరమాత్మ స్వరూపంగా, అఖండంగా అర్థం కావాలి. అదే వాక్యార్థ నిశ్చయము. అప్పుడే 'అపి' పదార్థ నిర్ణయం జరిగినట్లు అవుతుంది. పూర్ణ జ్ఞానము కలుగుతుంది. అట్టి సమ్యక్ జ్ఞానము క్షేత్ర క్షేత్రజ్ఞులకు సంబంధించిన జ్ఞానము వల్లనే ప్రాప్తిస్తుంది.

ఇంటి లోని దీపం ఇంటిని ప్రకాశింప చేసినట్లు, జ్ఞానరూపుడైన క్షేత్రజ్ఞుడు క్షేత్రమును ప్రకాశింప చేస్తున్నాడు. క్షేత్రమును, క్షేత్ర ధర్మమును, క్షేత్రము నందలి సమస్త కర్మమును, క్షేత్ర అవస్థలను తెలుసుకొనే క్షేత్రజ్ఞుడు, ఆయా క్షేత్రధర్మ, కర్మావస్థల నుండి వేరు పడిన వాడుగా తెలుస్తున్నాడు. దేహము లేని తాను అన్ని దేహాలలో దేహిగా అసంగుడై శోభిస్తున్నాడు ***(అశరీరం శరీరేషు).*** అతడే క్షేత్రజ్ఞుడు. ఆ క్షేత్రజ్ఞుణ్ణి తన స్వరూపం గానే భగవంతుడు తెలుసుకో మంటున్నాడు ***(క్షేత్రజ్ఞం మాం విద్ధి).*** అలా తెలుసుకున్న తరువాత, క్షేత్రజ్ఞుడు బ్రహ్మమునకు అభిన్నంగా తెలుస్తాడు. ఆత్మరూపుడైన క్షేత్రజ్ఞుడు బ్రహ్మమే అని తెలియడం చేత, క్షేత్రజ్ఞ బ్రహ్మముల మధ్య ద్వైత హేతువు లేనందున, ఇరువురికి అద్వితీయత్వము, అఖండత్వము సిద్ధిస్తుంది. **అయమాత్మా బ్రహ్మ** - ఈ ఆత్మయే బ్రహ్మము అనే మహావాక్యము అనుభూత మౌతుంది. ఈ విధమైన అఖండ బ్రహ్మాత్మ జ్ఞానములో అన్యమైనది మరొకటి ఉండే అవకాశం లేనందున, క్షేత్రము అనేదే గనుక ప్రత్యేకంగా ఒకటి ఉంటే, దాని వల్ల బ్రహ్మ అభిన్నత్వ విజ్ఞానానికి భంగం వాటిల్లుతుంది. కనుక, క్షేత్రము కూడా పరమాత్మ స్వరూపం గానే తెలియ వలసి ఉంది.

క్షేత్రానికి స్వయం సత్తా లేదు. స్వతః స్ఫురణ లేదు. సత్తా స్ఫూర్తులు లేని క్షేత్రము అవిద్యా కార్యము. ఆరోపిత విషయము. రజ్జువు నందు సర్పము వలె బ్రహ్మము నందు క్షేత్రము అవిద్య చేత కల్పించ బడిందే గాని, స్వయం సత్తా స్వరూపము కాదు. ఆరోపిత వస్తువు అధిష్ఠానం కన్నా వేరుగా ఉండలేదు ***(అధిష్ఠానాత్ భిన్నతా ఆరోపితస్య న భవతి).*** ఒకవేళ అలా ఉండ గలిగితే, బ్రహ్మమునకు అద్వితీయత్వము సిద్ధించదు. కనుక బ్రహ్మమునకు భిన్నంగా క్షేత్రజ్ఞుడు ఎలాగైతే లేడో, అలాగే క్షేత్రము కూడా బ్రహ్మాభిన్నం గానే ఉంది. క్షేత్ర క్షేత్రజ్ఞ లిరువురూ బ్రహ్మ స్వరూపము గానే ఉన్నారు. కనుకనే, ***క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి*** - నన్ను క్షేత్రజ్ఞునిగా కూడా **(అపి)** తెలుసుకో అంటూ శ్లోకాన్ని ప్రారంభించాడు భగవంతుడు.

నేను క్షేత్రజ్ఞుణ్ణి అవకుండా, నేను క్షేత్రజ్ఞుణ్ణి కూడా **(అపి)** అని అనడంలో గల ప్రత్యేకతను ప్రశస్తంగా

గుర్తించ వలసి ఉంది. నలుగురు కలిసి ముచ్చటించుకొనే చోటికి ఒక వ్యక్తి వచ్చి నేను కూడా గాయకుణ్ణే అన్నా డనుకోండి. దాని భావ మేమిటి? మీరే కాదు, నేను కూడా గాయకుణ్ణే అని అర్థం. అంటే, మీరూ గాయకులే. నేనూ గాయకుణ్ణే అని భావము.

అలాగే నన్ను క్షేత్రజ్ఞునిగా కూడా తెలుసుకోండి అంటే, నేను క్షేత్రమును, క్షేత్రజ్ఞుణ్ణి కూడా అని అర్థము. ఇది అఖండార్థ బోధక వాక్యంగా తెలుస్తూ ఉంది.

ఒక గుడ్డ సంచి చేత పట్టుకొని దారిన పోతున్న వ్యక్తిని, ఆ సంచిలో ఏముంది అని ప్రశ్నించా మనుకోండి. సంచిలో ఉన్నది కూడా నూలు బట్టే అన్నాడనుకోండి. దాని అర్థ మేమిటి? సంచి మాత్రమే నూలు బట్ట కాదు, సంచిలో ఉన్న బట్ట కూడా నూలుదే అని అర్థం.

ఇంకా కాస్త లోతుగా విశ్లేషించుకుంటే, సంచి రూపంలో ఉన్నది, సంచిలో ఉన్న బట్ట రూపంలో ఉన్నది, రెండూ నూలు మాత్రమే. నూలు కన్నా అన్య మైనది మరొకటి లేనే లేదు. నూలు ఏదో కాదు, దూదే. ఇప్పు డర్థమైందా? ఉన్నదంతా దూదే. ఒకటి బట్టగా సంచిలో ఉంది. మరొకటి తొడుగుగా సంచి రూపంలో ఉంది. సంచిని క్షేత్ర మనుకుంటే, గుడ్డను క్షేత్రజ్ఞ స్వరూపంగా భావిస్తే, ఈ రెండు దూది యైన బ్రహ్మము కన్నా అన్యం కాదు అని చెప్పుకుంటే, ఎలా ఉంటుంది? చాలా బాగుంటుంది. అయితే చాలు. అక్కడే ఆగుదాం. ఓగు వైపు ప్రయాణం వద్దు. సులభ గ్రాహ్యంగా ఉంటుందని దృష్టాంతాన్ని అందించాను. అంతే. దృష్టాంతం ఏకదేశీయమే కదూ? కనుక బాగు దగ్గరే ఆగుదాం.

ఈ విధంగా క్షేత్ర క్షేత్రజ్ఞులను అర్థం చేసుకోవడం వల్ల అఖండ బ్రహ్మజ్ఞానము ప్రాప్తిస్తుంది. క్షేత్ర క్షేత్రజ్ఞులను తనకు విషయంగా చేసుకొని ఏ జ్ఞానమైతే ఉందో, ఆ జ్ఞానమే సమ్యక్ జ్ఞానమని పరమేశ్వరుడు తన అభిప్రాయాన్ని తెలియ చేస్తున్నాడు ***(క్షేత్ర క్షేత్రజ్ఞయోః జ్ఞేయభూతయోః జ్ఞానం, క్షేత్ర క్షేత్రజ్ఞౌ యేన జ్ఞానేన విషయీ క్రియతే తత్ జ్ఞానం, సమ్యక్ జ్ఞానం ఇతి మతం అభిప్రాయః మమ ఈశ్వరస్య విష్ణోః).*** జటిలమైన, గహన మైన ప్రస్తుత శ్లోకం లోని విషయాన్ని సారభూతంగా చెప్పుకున్నాం. ఇది చాలా గుహ్యమైన, గంభీరమైన శ్లోకము. దీనినే కాస్త సులభతరంగా, సుస్పష్టంగా ముచ్చటించుకుందాం.

క్షేత్రము - క్షేత్రజ్ఞుడు

అర్జునా! సమస్త దేహాలలో ***(సర్వ క్షేత్రేషు)*** ఉన్న క్షేత్రజ్ఞుణ్ణి కూడా ***(క్షేత్రజ్ఞం చాపి)*** నన్ను గానే తెలుసుకో ***(మాం విద్ధి)!*** అన్నాడు భగవంతుడు.

విద్యుద్దీపము వెలుగుతూ ఉంది అంటే, ఆ దీపంలో విద్యుత్తు ప్రసరిస్తూ ఉంది అని అర్థం. వెలిగే అన్ని దీపాల లోనూ విద్యుచ్ఛక్తి ప్రసరిస్తూనే ఉంది.

దేహాలు చరిస్తున్నాయి అంటే, ఆ చరించే దేహాలలో చైతన్యాత్మ క్షేత్రజ్ఞుడుగా శోభిస్తున్నాడు.

దీపము వేరు; దీపాన్ని ప్రకాశింప చేసే విద్యుత్తు వేరు. అలాగే క్షేత్రము వేరు. క్షేత్రాన్ని తెలుసుకొనే క్షేత్రజ్ఞుడు వేరు. ఇది మనకు రెండవ శ్లోకం లోనే అర్థమైంది.

ఇక్కడ ఒక శంక తలెత్తుతుంది. క్షేత్రాలు అనేకంగా ఉన్నాయి కదా! అలాగే క్షేత్రజ్ఞులు కూడా అనేకులా? ఒక్కొక్క శరీరంలో ఒక్కొక్క క్షేత్రజ్ఞుడు ఉన్నాడా? అదే వాస్తవ మైతే, క్షేత్రా లెన్ని ఉన్నవో, క్షేత్రజ్ఞులు కూడా అందరు ఉండాలి కదా! మరి ఆత్మలు అనేకంగా ఉండే టప్పుడు ఇక అఖండాత్మ ఎక్కడుంది? ఈ విషయం అర్థం గాక, ఆత్మలు అనేక మని భావించిన వారే అద్వైతానికి భిన్నమైన మతాలను సృష్టించారు. కాని, వాటిని పోషించ లేక యాతన పడుతున్నారు.

ఆత్మ ఒక్కటే గాని, అనేకము కాదు. క్షేత్రజ్ఞుడు ఆత్మయే కనుక, క్షేత్రజ్ఞుడు కూడా ఒక్కడే. అందుచేత, సర్వ క్షేత్రాలలో ఉండే క్షేత్రజ్ఞుణ్ణి తాను గానే తెలుసుకోమంటున్నాడు భగవంతుడు. క్షేత్రాలకు బహువచనమును ఉపయోగించి, క్షేత్రజ్ఞునికి ఏకవచనం ప్రయోగించడం లోని వైశిష్ట్యం అదే.

దీపాలు అనేక మైనా విద్యుత్తు ఒక్కటే. కుండలు అనేక మైనా, కుండల లోని ఆకాశం ఒక్కటే. అలాగే క్షేత్రాలు అనేకంగా ఉన్నా, ఆ క్షేత్రాలలో ప్రకాశించే క్షేత్రజ్ఞ స్వరూపము ఏకమే. అద్వయమే.

ఒక దేహం మరొక దేహం కాదు. కాని, దేహాలలో దేహిగా తెలుస్తున్న క్షేత్రజ్ఞుడు మాత్రం ఏ దేహానికీ పరిమితుడు కాడు. ఒకరి దేహం మరొకరి దేహం కాక పోవచ్చు. ఎవరి క్షేత్రం వారిదే. కాని, ఒక క్షేత్రంలో ఏ క్షేత్రజ్ఞ స్వరూప మైతే భాసిస్తూ ఉందో, అదే అన్ని క్షేత్రాలలో అద్వితీయంగా ప్రకాశిస్తూ ఉంది.

అందుచేతనే, రెండవ అధ్యాయంలో, అర్జునా! నేను ఒకప్పుడు లేను అనేది లేనే లేదు ***(న త్వే వాహం జాతు నాసం).*** నీవు, ఈ రాజు లందరు కూడా లేరు అనే కాలమే లేదు ***(న త్వం నేమే జనాధిపాః).*** అలాగే భవిష్యత్తులో కూడా మన మందరము లేకుండా పోవడ మనేది లేనే లేదు ***(న చైవ న భవిష్యామః సర్వే వయ మతః పరమ్)*** అన్నాడు భగవంతుడు. క్షేత్రాలు ఎలాగూ నశించి పోతున్నాయి కనుక, అవినాశి యైన నిత్యాత్మ స్వరూపాన్నే ప్రస్తావిస్తూ భగవంతుడు ప్రవచించాడు. ఆత్మ నిత్యము కనుకనే అది అద్వితీయము. అదే క్షేత్రజ్ఞ స్వరూపము.

వేదాంత సారము

క్షేత్ర క్షేత్రజ్ఞు లిరువురూ పరబ్రహ్మము కన్నా అన్యము కారనే అఖండైక జ్ఞానమే వేదాంత సిద్ధాంతము. అదే సర్వ శాస్త్ర సారము. క్షేత్రజ్ఞుడు తానే నని భగవంతుడు అభిభాషించాడు ***(క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి).*** క్షేత్రాభిమానంతో జీవుడు తాను దేహమని భావిస్తున్నాడు. తాను దేహం అని భావించడం చేతనే, అన్య క్షేత్రాల నుండి, అలాగే ఈ సమస్త దృశ్య ప్రపంచం నుండి తాను వేరైనట్లు భావిస్తున్నాడు.

ఈశ్వరాభిమాని యైన జీవుడు తానే ఈశ్వరుడు అనే జ్ఞానాన్ని పొందుతున్నాడు. ఉపాధి వినిర్ముక్త మైన పరమాత్మ చైతన్యంలో క్షేత్రము ప్రత్యేకంగా లేనందున, క్షేత్ర క్షేత్రజ్ఞు లిరువురూ పరబ్రహ్మము గానే తెలుస్తున్నారు. అఖండ పరబ్రహ్మ స్థితిలో భేదము అనూహ్యము. అదే అభేదరూప స్థితి. అఖండరూప స్థితి. అద్వైతరూప స్థితి. జీవజగత్తులు రెండూ బ్రహ్మమే ***(బ్రహ్మైవ జీవః సకలం జగచ్చ).*** క్షేత్ర క్షేత్రజ్ఞు లిరువురూ పరమాత్మ స్వరూపమే. అదే అఖండరూప మోక్ష స్థితి. అదే సమ్యక్ జ్ఞానము అని తన స్వాభిప్రాయాన్ని సప్రమాణంగా అందించాడు గీతాచార్యుడు.

జ్ఞాన స్నానము

ఈ శ్లోకంలో అర్జునుణ్ణి భారతా! అని సంబోధించాడు పార్థసారథి. 'భా' అంటే ప్రకాశము. రతుడు అంటే రమించే వాడు అని అర్థము. సదా జ్ఞాన ప్రకాశంలో రమించే వాడు, లేదా అలా రమించాలనే ఆసక్తి గల వాడు కనుక, అర్జునుణ్ణి 'భారతా' అని పిలిచాడు భగవంతుడు. ***భా యా మఖండ వృత్త్యావేవ సదా రమత ఇతి భారతః -*** అఖండ బ్రహ్మాకార వృత్తి యందు సదా రమించే వాడు భారతుడు; లేక భరతుడు. అంటే క్షేత్ర క్షేత్రజ్ఞ పరబ్రహ్మ స్వరూపము అద్వితీయ మనే అఖండాకార వృత్తిలో ఓలలాడే వాడు అని అర్థము.

ఇంతవరకు క్షేత్ర క్షేత్రజ్ఞులను ప్రస్తావిస్తూ ప్రవచించిన భగవంతుడు, ఇక వాటిని గూర్చి విస్పష్టంగా వివరించ బోతున్నాడు.

తత్ క్షేత్రం యచ్చ యాదృక్చ యద్వికారి యతశ్చ యత్ ।
స చ యో య త్ప్రభావశ్చ త త్సమాసేన మే శృణు ॥ 3

తత్-క్షేత్రం-యత్-చ-యాదృక్-చ-యద్వికారి-యతః-చ-యత్
సః-చ-యః-యత్ప్రభావః-చ-తత్-సమాసేన-మే-శృణు

తత్	= ఆ	యః	= ఎవడో
క్షేత్రం	= క్షేత్రము	యత్ ప్రభావః చ	= ఎట్టి మహిమ గలవాడో
యత్ చ	= ఏదియో	తత్	= ఆ వివరమును
యాదృక్ చ	= ఏ విధమైనదో	సమాసేన	= సంక్షేపముగా
యత్ వికారి	= ఎటువంటి వికారము గలదో	మే	= నా వలన
యతః చ యత్	= ఎచ్చటి నుండి వచ్చిందో, ఏదో	శృణు	= విను
సః చ	= ఆ క్షేత్రజ్ఞుడు		

అర్జునా! ఏది క్షేత్రమో, అదెలాంటిదో, ఎలా మారుతుందో, ఎక్కడ నుండి వచ్చిందో చెబుతాను. అలాగే, క్షేత్రజ్ఞు డెవరో, అతడి ప్రభావ మేమిటో అన్నీ సంక్షిప్తంగా చెబుతాను. విను.

వ్యాఖ్య

మొదటి రెండు శ్లోకాలలో సూత్రప్రాయంగా క్షేత్ర క్షేత్రజ్ఞులను గూర్చి చెప్పిన భగవంతుడు, వారి స్వభావ స్వరూపాలను గూర్చి సంక్షేపంగా చెప్పడానికి ఉపక్రమిస్తున్నాడు. ఇలా బోధించే విధానమును శాస్త్రంలో 'సమాస వ్యాస పద్ధతి' అంటారు.

ఇదం శరీరం అని ఏ విషయా న్నైతే మొదటి శ్లోకంలో ప్రస్తావించాడో, దానినే 'తత్' శబ్దం చేత పరామర్శిస్తూ, ***తత్ క్షేత్రం*** అంటూ ఈ శ్లోకాన్ని ప్రారంభిస్తున్నాడు. క్షేత్ర క్షేత్రజ్ఞుల స్వరూప స్వభావాలను సూత్రప్రాయంగా వివరించి, వాటినే సంగ్రహంగా చెబుతున్నందున, పదే పదే 'చ' కార ప్రయోగం చేశాడు. ***యచ్చ, యాదృక్చ, యతశ్చ*** అంటూ ఐదు సార్లు ఉపయోగించిన 'చ' శబ్దమును సముచ్చయార్థంగా గ్రహించాలి. వాక్య విషయంలో 'అది కూడా' అనే అర్థాన్ని స్ఫురింప చేయడాన్ని సముచ్చయం అంటారు.

క్షేత్ర స్వభావము

తత్ క్షేత్రం - ఆ క్షేత్రము అంటూ శ్లోక ప్రారంభంలో ప్రస్తావించిన 'ఈ శరీరాన్ని' గూర్చి, దాని స్వభావాన్ని గూర్చి చెబుతున్నాడు. ఏది క్షేత్రము ***(యచ్చ)?*** దేని నైతే క్షేత్రము అంటున్నామో అది ఏయే ధర్మాలను కలిగి ఉండటం చేత క్షేత్రము అనబడింది? అనేదే యచ్ఛబ్దార్థము. పూర్వం లేకుండా ఇప్పుడు వచ్చింది, మున్ముందు లేకుండా పోయేది శరీరము. ఈ జన్మాదు లనే ధర్మం ***యచ్చ*** శబ్దము చేత చెప్పబడుతూ ఉంది.

జననమరణాలు ధర్మముగా గల శరీర మనే క్షేత్రము ఎటు వంటిది ***(యాదృక్)?*** జడరూప మైనది. దృశ్యమాత్ర మైనది. పరిచ్ఛిన్న మైనది. కనుక, నశ్వర మైనది.

జడ దృశ్య పరిచ్ఛిన్న స్వభావం గల శరీరము ఎలా మారుతూ ఉంది? దేహంలో ఎలాంటి వికారాలు చోటు చేసుకున్నాయి ***(యద్వికారి)?*** పుట్టింది మొదలు గిట్టే వరకు క్షణక్షణము మార్పు చెందుతూ ఉంది. స్థిర మైనది కాదు. నియత స్వభావము లేనిది ***(అనియత స్వభావః).*** ప్రతి శ్వాస లోను వికారమే. ఇంద్రియాలూ

వికార యుతాలే. క్షేత్రం ఎప్పుడు ఎలా ఉంటుందో నిర్దిష్టంగా ఎవ్వరూ చెప్పలేరు. రెప్పపాట్లు కూడా నియమంగా లేవు. అందుకే అది వికారి. అందుచేత జ్ఞాత అయిన క్షేత్రజ్ఞునిచే తెలియ బడుతున్న జ్ఞేయమైన క్షేత్రము హేయము. హేయమైన దానిని తెలుసుకోవడ మెందుకు? అనే సంశయం మీకు ఏర్పడవచ్చు. హేయమని తెలిసి నపుడే అది త్యాజ్య మవుతుంది.

ఈ శరీర మనే క్షేత్రం విషయంలో కార్యకారణ సంబంధం ఎలా ఉంది? దేని కారణంగా అది పుడుతూ ఉంది **(యతశ్చ)**? ఇది కూడా తెలియాలి. జీవునికి సంసార మూలకంగా ఉంది కనుక క్షేత్రాన్ని గూర్చి ఈ విషయాలన్నీ మనకు తెలియాలి.

క్షేత్రజ్ఞ స్వరూపము

క్షేత్రమైన శరీర స్వభావ స్వరూపాలను ఎలా తెలుసుకున్నామో, అలాగే క్షేత్రజ్ఞుని స్వరూప స్వభావాలను కూడా తెలుసుకోవాలి **(స చ - సః చ. యః క్షేత్రజ్ఞః నిర్దిష్టః సః)**. క్షేత్రం విషయంలో స్వభావాన్ని మాత్రమే తెలుసుకుంటాం. కాని, క్షేత్రజ్ఞుని విషయంలో ప్రభావాన్ని తెలుసుకోబోతాం. క్షేత్రానికి స్వభావమే గాని ప్రభావము లేదు. క్షేత్రజ్ఞుడు ప్రభావమే స్వభావంగా కలిగిన వాడు **(యత్ప్రభావః)**. క్షేత్రము వికారయుత మైంది కనుక ప్రభావము లేనిది. క్షేత్రజ్ఞుడు నిర్వికారి, ముక్త స్వభావుడు కనుక ప్రభావయుతుడు.

అయినా ఈ రెండిటిని **(తత్ క్షేత్ర క్షేత్రజ్ఞయోః యథాత్మ్యం)**. అంటే, ఈ క్షేత్ర క్షేత్రజ్ఞుల వాస్తవ స్వరూపాన్ని తెలుసుకోవాలి. రెండిటిని ఎందుకు తెలుసుకోవాలి? క్షేత్ర స్వభావమును తెలుసుకోవడం వల్ల అది నశ్వర మని అర్థ మౌతుంది కనుక, దానితో తాదాత్మ్యం చెంది సంసారాన్ని తయారు చేసుకొనే దుస్థితి నుండి విడిపడ వచ్చు. అలాగే క్షేత్రజ్ఞుని వైభవాన్ని తెలుసుకోవడం వల్ల పరమాత్మ జ్ఞానము ఏర్పడి, తాను సదా ముక్తుడే నని గ్రహించి జీవన్ముక్త స్థితిని పొందవచ్చు. అందుచేత, క్షేత్ర క్షేత్రజ్ఞులకు సంబంధించిన విశేష జ్ఞానాన్ని **(తత్)** వినిపిస్తున్నాడు గీతాచార్యుడు.

అర్జునా! క్షేత్ర క్షేత్రజ్ఞులకు సంబంధించిన విశేషాలను, ఆ విశేషాలతో కూడిన యథార్థ స్వరూపాన్ని **(తత్)** చెబుతున్నాను. విను **(శృణు)**. విని నిర్ధారణ చేసుకో **(శృత్వా అవధారయ ఇత్యర్థః)** అంటున్నాడు పరమాత్మ. ఇది శ్రవణ ఫలం.

శృణు - విను అనే మాటను ఇక్కడ జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. శ్రీకృష్ణుడు ఇంతవరకు చెబుతూనే ఉన్నాడు. చెప్పే విషయాన్నంతా అర్జునుడు ఆలకిస్తూనే ఉన్నాడు. మళ్ళీ ప్రత్యేకించి 'విను' అని చెప్ప నవసరం లేదు. కాని, పరమాత్మ అలా చెబుతున్నాడు అంటే అవసర మేదో ఉందనే గ్రహించాలి. అవధానంతో ఆలకించ వలసిన విషయము అని అర్థం చేసుకోవాలి. కేవలం ఆలకిస్తే చాలదు. నిశ్చితంగా, ఖచ్చితంగా విషయాన్ని నిర్ధారించు కోవాలి అని భావము. అలా చేసినపుడే గహన మైన, గుహ్యమైన విషయాలను ఆలకించిన ఫలం సిద్ధిస్తుంది. తన్నిష్ఠుడై అర్థం చేసుకున్న వాడికే శ్రవణ ఫలం దక్కుతుంది. అవధారణ అవశ్యం అని ఇక్కడ ప్రత్యేకించి సూచించడం జరిగింది అంటే, ఉపేక్ష విస్మరణాదులు యుక్తం కావు అని హెచ్చరించడమే అంతరంగ మని గ్రహించాలి.

శ్రోతలో ఆసక్తిని పెంచి, అవధానాన్ని స్థిరం చేసి, విషయాన్ని అందించేందుకు విషయ వైభవాన్ని కీర్తిస్తున్నాడు. అంతేగాక, తాను బోధించే విషయం సంప్రదాయ సిద్ధ మని కూడా ప్రస్తుతిస్తూ, ఒక్క శ్లోకాన్ని వినిపిస్తున్నాడు.

ఋషిభి ర్బహుధా గీతం ఛన్దోభి ర్వివిధైః పృథక్ ।
బ్రహ్మసూత్ర పదైశ్చైవ హేతుమద్భి ర్వినిశ్చితైః ॥ 4

ఋషిభిః-బహుధా-గీతం-ఛందోభిః-వివిధైః-పృథక్
బ్రహ్మసూత్రపదైః-చ-ఏవ-హేతుమద్భిః-వినిశ్చితైః

ఋషిభిః	= ఋషుల చేత	హేతుమద్భిః	= సహేతుకములైనవియు
బహుధా	= అనేక విధములుగా	వినిశ్చితైః	= నిశ్చయ మైనవియునగు
పృథక్	= వేరుగా	బ్రహ్మసూత్రపదైః చ ఏవ	= బ్రహ్మసూత్రపదముల చేత
వివిధైః	= అనేకములైన	గీతం	= చెప్పబడినది
ఛందోభిః	= వేదముల చేత		

అర్జునా! ఈ విషయాన్ని ఋషులు అనేక విధాలుగా కీర్తించారు. వేదాలు వివిధ రీతుల్లో చెప్పాయి. హేతుబద్ధంగా, శాస్త్రోక్తంగా బ్రహ్మసూత్రాలు బహువిధాల నిశ్చయించాయి.

వ్యాఖ్య

అర్జునా! క్షేత్రము యొక్క స్వభావాన్ని, క్షేత్రజ్ఞుని ప్రభావాన్ని సంక్షేపంగా చెబుతాను, విను అన్నాడు పూర్వ శ్లోకంలో భగవంతుడు. ఒక విషయం సంక్షిప్తంగా చెప్పబడుతూ ఉంది అంటే, అది అంతకు ముందు విస్తారంగా చెప్పబడింది అని అర్థం. ఎవరి చేత విస్తారంగా చెప్పబడిన దానికి ప్రస్తుత విషయము సంక్షేపము అనే అంశాన్ని ఒక వైపు స్పష్టం చేస్తూ, మరో వైపు శ్రోత యొక్క బుద్ధిని ఆకర్షించ డానికి, సంతోష పెట్టడానికి విషయాన్ని స్తుతిస్తున్నాడు ***(స్తౌతి శ్రోతృ బుద్ధి ప్రరోచనార్థం)***.

ఋషి గీతమ్

క్షేత్ర క్షేత్రజ్ఞ వివేకము ఋషుల చేత ***(ఋషిభిః)*** అనేక విధాలుగా ***(బహుధా)*** గానం చేయబడింది ***(గీతమ్)***. అంటే చెప్పబడింది ***(కథితమ్)*** అని అర్థము. ఇక్కడ ఋషులు అన్న చోట వసిష్ఠాది ఋషులు ***(వసిష్ఠాదిభిః)*** అని వ్యాఖ్యానించారు శ్రీ శంకరులు. ప్రత్యేకించి వసిష్ఠుని నామాన్ని ఉటంకించడం వల్ల యోగ వాసిష్ఠాన్ని ఉదహరించి నట్లైంది. ముప్పై రెండు వేల శ్లోకాలతో అద్భుతంగా అలరారుతున్న యోగవాసిష్ఠ గ్రంథములో కూడా ఈ విషయమే ప్రధానంగా చెప్పబడి ఉంది అని అర్థము.

ఋషి ప్రోక్తమైన విషయము ఏదైనా ఆప్తవాక్యమే. అనుభవం నుండి జనించినదే. ఋషుల చేత చెప్పబడింది అనకుండా గానం చేయబడింది అని చెప్పడం జరిగింది. ***గీయత ఇతి గీతం, గానం చ -*** పాడ బడేది గీతం అని అమరసింహుడు అర్థం చెప్పాడు. ఋషుల చేత చెప్పబడింది అనడానికి బదులుగా, గానం చేయబడింది అని చెప్పడం కూడా శాస్త్ర విధానమే. అనుభవ సిద్ధము అని చెప్పే సందర్భాలలో ఇలాంటి పద ప్రయోగాలు జరుగుతాయి.

తస్యాః సాధనాని గాయన్తి ఆచార్యాః - భగవద్భక్తికి సాధనలను ఆచార్యులు గానం చేశారు అని సూత్రీకరించారు భక్తి సూత్రాలలో నారదమహర్షి *(నా.భ.సూ - 34)*. ఆనంద సమయాలలో అప్రయత్నంగా, అనాయాసంగా వ్యక్త మయ్యేదే గానం. గానం వెనుక తృప్తి ఉంటుంది. ఉత్సాహం ఉంటుంది. పరుల హితము నందు అభినివేశం ఉంటుంది. జ్ఞానులైన మహర్షులు తమ జ్ఞానాన్ని అలాగే వితరణ చేశారు.

వేదసారం

ఆప్తులైన మహర్షుల వాక్యాల చేత బహు విధాలుగా ప్రవచింప బడిన క్షేత్ర క్షేత్రజ్ఞ వివేకము ఋక్కులు మొదలైన వేద మంత్రాల చేత **(ఛన్దోభిః)** అనేక విధాలుగా **(వివిధైః నానా భావైః)** వేరు వేరుగా విస్పష్టం చేయ బడింది **(పృథక్ వివేకతః).**

ఆప్తవాక్యంగా తెలిసిన ఈ విషయము ప్రమాణవాక్యంగా కూడా అలరారుతోంది. ఏది జ్ఞానమును ప్రసాదిస్తుందో అదే ప్రమాణము **(ప్రమాకరణం ప్రమాణం).** ప్రమాణాంతర విషయాన్ని ఆర్షసంస్కృతి అంగీకరించదు. ఆర్య మతి సమ్మతించదు. చెప్పే వ్యక్తి ఎంత గొప్ప వాడైనా కావచ్చు. చెప్పబడే విషయం ఎంత ప్రశస్తమైన దైనా కావచ్చు. ప్రమాణ యోగ్యత లేనపుడు, దానిని నిరర్థకం గానే చూస్తారు. బౌద్ధ జైన చార్వాకాది మతాలు అలాగే నిరసింప బడ్డాయి.

ప్రస్తుతం గీతాచార్యుడు బోధిస్తున్న ఈ క్షేత్ర క్షేత్రజ్ఞ వివేకము ప్రమాణ విషయమే అనే సత్యాన్ని కూడా స్పష్టం చేస్తూ, సంప్రదాయాన్ని సముజ్జ్వలంగా కీర్తించడం జరిగింది.

సూత్ర ప్రతిపాదితం

ఋషుల ఆప్తవాక్యాల చేత, ఋగాది ఛందస్సుల చేత చెప్పబడిన ఈ విషయము, అర్థ సాధకము లైన యుక్తులు గల **(హేతు మద్భిః)** బ్రహ్మసూత్ర పదాల చేత కూడా **(బ్రహ్మసూత్ర పదైః)** సుస్పష్టంగా, నిశ్చితార్థంతో **(వినిశ్చితైః)** చెప్పబడింది.

బ్రహ్మసూత్రాలు అంటే, ప్రస్థానత్రయంలో న్యాయప్రస్థానంగా చెప్పబడిన వ్యాస విరచిత శారీరక సూత్రాలు అని శ్రీ శంకరుల శిష్యులైన ఆనందగిరి అభిప్రాయ పడ్డారు. కానీ, వ్యాసమహర్షి గీతను రచించిన తరువాత బ్రహ్మసూత్రాలను రచించాడా? లేక, గీతా రచనకు ముందే బ్రహ్మసూత్రాలు ఉన్నవా? అనేది చర్చనీయాంశము. నా మటుకు నాకు, ప్రస్తుతం శ్రీకృష్ణ పరమాత్మ చెబుతున్న బ్రహ్మసూత్రాలు వ్యాస విరచితమైన ***అథాతో బ్రహ్మ జిజ్ఞాసాది*** సూత్రాలు కావనేది దృఢ నిశ్చయము. ఇది నా వ్యక్తిగతాభిప్రాయము.

బ్రహ్మమును సూచించే వాక్యాలను బ్రహ్మసూత్రాలు అంటారు అని భాష్య వచనం ***(బ్రహ్మణః సూచకాని వాక్యాని బ్రహ్మ సూత్రాణి).*** ఏ వాక్యాల చేత బ్రహ్మము తెలియ బడతాడో, వాటిని బ్రహ్మపదాలు అంటారు. అవే బ్రహ్మవాక్యాలు, లేదా బ్రహ్మసూత్రాలు. మహావాక్యాలన్నీ బ్రహ్మవాక్యాలే. బ్రహ్మమును సూచించే పదాలే.

పద్యతే గమ్యతే జ్ఞాయతే బ్రహ్మ సాక్షాత్ ప్రతిపాద్యత ఏభిరితి పదాని - ఏ పదాల చేత బ్రహ్మము సాక్షాత్తు ప్రతిపాదింప బడుతూ ఉందో, అట్టి ఉపనిష ద్వాక్యాలే పదాలు. 'సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ' మొదలైన స్వరూప లక్షణ సంబంధమైన వాక్యాలు. ఇవి బ్రహ్మకు సంబంధించిన నిశ్చితార్థాన్ని అందిస్తాయి. సంశయ రహితంగా ప్రబోధిస్తాయి. అందుచేత, **నిశ్చితైః** అనకుండా **సునిశ్చితైః** అన్నాడు భగవంతుడు.

...స్తుతిని ముగించి, విషయాన్ని ఆరంభిస్తున్నాడు.

మహాభూతా వ్యహంకారో బుద్ధి రవ్యక్త మేవ చ ।
ఇన్ద్రియాణి దశైకం చ పఞ్చ చేన్ద్రియగోచరాః ॥ 5

ఇచ్ఛా ద్వేషః సుఖం దుఃఖం సంఘాత శ్చేతనా ధృతిః ।
ఏతత్ క్షేత్రం సమాసేన సవికార ముదాహృతమ్ ॥ 6

మహాభూతాని-అహంకారః-బుద్ధిః-అవ్యక్తం-ఏవ-చ
ఇంద్రియాణి-దశ-ఏకం-చ-పంచ-చ-ఇంద్రియగోచరాః
ఇచ్ఛా-ద్వేషః-సుఖం-దుఃఖం-సంఘాతః-చేతనా-ధృతిః
ఏతత్-క్షేత్రం-సమాసేన-సవికారం-ఉదాహృతం

మహాభూతాని	=	పంచభూతములు	సుఖం	=	సుఖము
అహంకారః	=	అహంకారము	దుఃఖం	=	దుఃఖము
బుద్ధిః	=	బుద్ధి	సంఘాతః	=	సమూహము
అవ్యక్తం ఏవ చ	=	అవ్యక్తమును	చేతనా	=	చేతనత్వము
దశ ఇంద్రియాణి	=	పది ఇంద్రియములు	ధృతిః	=	ధైర్యము
ఏకం చ	=	మనస్సుకు	ఏతత్	=	ఇది
ఇంద్రియగోచరాః	=	ఇంద్రియ విషయములు	క్షేత్రం	=	క్షేత్రము
పంచ చ	=	అయిదును	సమాసేన	=	సంక్షేపముగా
ఇచ్ఛా	=	కోరిక	సవికారం	=	వికార సహితముగా
ద్వేషః	=	ద్వేషము	ఉదాహృతం	=	చెప్పబడింది

అర్జునా! పంచమహాభూతాలు, అహంకారము, బుద్ధి, అవ్యక్తము, దశేంద్రియాలు, పంచేంద్రియ విషయాలు, మనస్సు,
వాటితో పాటు, కోరిక, ద్వేషము, సుఖము, దుఃఖము, దేహము, చేతనము, ధృతి - వికార యుతమైన ఈ సమస్తము క్షేత్ర మని సంక్షేపంగా చెప్పబడింది.

వ్యాఖ్య

శ్రోతృ బుద్ధి ప్రరోచనార్థము విషయ వైభవాన్ని స్తుతించిన గీతాచార్యుడు, వికారయుత మైన క్షేత్రమును గూర్చి వివరిస్తున్నాడు. క్షేత్ర ప్రసంగాన్ని సర్వ శాస్త్రముల నుండి సారభూతంగా గ్రహించి, ఈ రెండు శ్లోకాలలో ప్రశస్తంగా ప్రతిపాదించాడు. ముఖ్యంగా కపిల మహర్షి సాంఖ్య శాస్త్రంలో ప్రసిద్ధంగా ప్రతిపాదించిన చతుర్వింశతి తత్త్వములను, క్షేత్ర విషయంలో సాంఖ్య శాస్త్ర సారము నంతటిని మొదటి శ్లోకం లోనే స్పష్టం చేసేశాడు.

చతుర్వింశతి తత్త్వములు - సాంఖ్యము

మహాభూతాలు ఐదు, అహంకారము, బుద్ధి, అవ్యక్తము కలసి మూడు, దశేంద్రియాలు మనస్సు కలసి పదకొండు, ఇంద్రియ గోచరములైన శబ్దాది విషయాలు ఐదు - వెరసి ఇరవై నాలుగు తత్త్వములను మొదటి శ్లోకంలో భగవంతుడు వివరించాడు. ఇవే కాపిల సాంఖ్యము ప్రతిపాదించే చతుర్వింశతి తత్త్వములు (ఇరవై నాలుగు తత్త్వములు).

షడ్దర్శనములలో కపిలుని సాంఖ్యము ఒకటి. కపిలమహర్షి ప్రతిపాదించినది కనుక దీనిని కాపిల సాంఖ్యము అంటారు. సృష్టి క్రమమును వివరించడంలో ఇరవై నాలుగు తత్త్వములను లెక్కిస్తారు (సంఖ్య పెడతారు) కనుక వీరికి సాంఖ్యులు అనే నామ మేర్పడింది. కపిలుని సాంఖ్యశాస్త్రము ఆరు అధ్యాయాలలో, ఐదు వందల ఇరవై ఆరు శ్లోకాలతో ఉంది. ఈ సాంఖ్య మతానికి బీజాలు శ్వేతాశ్వతరోపనిషత్తు లోను, పంచమ వేదమైన మహాభారతం లోను ఉన్నాయి. షడ్దర్శనాలలో వేదాంత దర్శనము (ఉత్తర మీమాంస) తరువాత

సాంఖ్యమునే ప్రసిద్ధంగా చెబుతారు. అందుకే నేమో, సిద్దులలో నేను కపిలమహర్షిని అన్నాడు గీతాచార్యుడు *(10 వ అ - 26 వ శ్లో).*

క్షేత్ర క్షేత్రజ్ఞుల విషయంలో సాంఖ్యము ప్రతిపాదించిన ఇరవై నాలుగు తత్త్వములతో కూడినది క్షేత్రము కాగా, ఇరవై ఐదవ తత్త్వము పురుషుడు (క్షేత్రజ్ఞుడు). ఈ రెండు తత్త్వములు కలిసి ఇరవై ఐదు (పంచ వింశతి) తత్త్వములు. ఈ రెండు జగత్తు యొక్క ఆవిర్భావానికి హేతువులు అనేది సాంఖ్య మతము. ఈ రెండూ స్వతంత్ర మైనవే. గుణ రహితుడు, నిరాకారుడు అయిన పురుషుడు ఇరవై నాలుగు తత్త్వాలతో కూడిన ప్రకృతితో మిళితమై గుణయుతుడు కావడమే బంధము. ఈ చతుర్వింశతి తత్త్వములు అనే ప్రకృతి నుండి పురుషుడు విడి పడటమే ముక్తి. ఈ విషయంలో సాంఖ్యానికి, వేదాంతానికి భేదా లున్నాయి. వేదాంతము ప్రకృతిని స్వతంత్ర మైనదిగా అంగీకరించదు. అది బ్రహ్మము నాశ్రయించుకొని ఉంటుంది. అలాగే సాంఖ్యంలో పురుషులు అనేకులు. వేదాంతంలో పురుషుడు అద్వయుడు. ఇలాంటి భేదాలు అనేకము లున్నాయి. ప్రస్తుతం ఆ వివరాల లోకి వెళ్ళి లోతుగా చర్చించడానికి సందర్భము సహకరించడం లేదు. ఏది ఏమైనా, ప్రస్తుతం గీతాచార్యుడు స్పృశిస్తున్న క్షేత్ర విషయమును వివరించడంలో సాంఖ్యాన్ని స్థాలీపులాకంగా చర్చించాను. అంతే.

ప్రకృతి స్వరూపము

గీతాచార్యుడు ప్రస్తుత శ్లోకంలో విస్పష్టం చేస్తున్న ప్రకృతి విషయంలో మొదటిది **మహాభూతాని.** అంటే గొప్పవి యైన భూతాలు. అవే పంచభూతాలు. అంటే స్థూల పంచభూతాలు కావు. వికారయుతమైన స్థూల పంచభూతాలలో వ్యాపకమై ఉన్న సూక్ష్మ పంచభూతాలు. అందుచేత అవి మహాభూతాలు.

ఈ పంచ మహాభూతాలకు కారణమైంది అహంకారము. 'నేను' అనే జ్ఞానం గల అహంకారము ***(మహాభూత కారణమ్ అహం ప్రత్యయ లక్షణః అహంకారః).*** అహంకారానికి నిశ్చయాత్మకమైన బుద్ధి కారణము ***(అహంకార కారణం బుద్ధిః).*** బుద్ధికి కారణము అవ్యక్తము ***(తత్కారణం అవ్యక్త మేవ).*** ఇక్కడికి ఎనిమిది తత్త్వాలు. ఈ ప్రకారంగా ఎనిమిది విధాలుగా భిన్నమైన ప్రకృతినే అష్టధా ప్రకృతి అంటారు *(7 వ అ - 4 వ శ్లో).* ప్రకృతి అంటే ఇదే, ఇంతే నని నిర్ధారణ చేయడానికి శ్లోకంలో **ఏవ** శబ్దము ప్రయోగించ బడింది ***(ఏవ శబ్దః ప్రకృత్యవ ధారణార్థః).***

సృష్టికి ముందు వ్యక్తం కాకుండా, వ్యాకృతం కాకుండా ఉన్న ఈశ్వర శక్తియే అవ్యక్తం. అదే ప్రకృతి లేదా మాయ. దీని నుండే చతుర్వింశతి తత్త్వాలు ఉత్పన్న మయ్యాయి. విషయాన్ని సులభ సాధ్యం చేయడానికి కారణ మనే ***(అవ్యక్తం)*** అనులోమ క్రమం నుండి కాకుండా, కార్యమనే ***(జగత్తు)*** విలోమ క్రమం నుండి వివరిస్తాను.

ప్రపంచము కార్యము. కార్యమైన ప్రపంచము పంచభూతాలతో కూడి ఉంది. స్థూల పంచభూతాలకు తన్మాత్రలు, అంటే సూక్ష్మభూతాలు ***(మహాభూతాని)*** ఆధారము లేదా కారణము. ఈ పంచ తన్మాత్రలకు అహంకారము కారణము ***(అహంకారాత్ పంచతన్మాత్రాణి).*** నేను అనేకంగా వ్యక్త మవుతాను అనే సృష్టికి సంబంధించిన సంకల్పమే ఇక్కడ అహంకారము ***(బహుస్యాం ప్రజాయేమ).*** ఈ అహంకారానికి కారణమైన మహత్తత్త్వమే బుద్ధి ***(మహతోఽ హం కారః -*** వేదం). ***తదైక్షత్*** అనే శ్రుతి సిద్ధమైన ఈక్షణమే బుద్ధి. సృష్టి విషయము నందు తత్సంబంధమైన ఈక్షణమే బుద్ధి (ఈక్షణానంతరమే ***అహం బహుస్యాం ప్రజాయేమ*** అనే సంకల్పము, లేదా అహంకారము).

మహత్తత్త్వము అనే బుద్ధికి కారణ మైనది అవ్యక్తము ***(న వ్యజ్యతే).*** అదే అవ్యాకృతము. ప్రపంచ

బీజము. దీనినే ప్రకృతి, లేదా మాయ అన్నారు. సమస్త ప్రపంచమునకు ఇదే కారణం కనుక సాంఖ్యులు దీనిని మూలప్రకృతి, లేదా ప్రధానం అన్నారు. ఇదే అపరా ప్రకృతి *(7 వ అ - 5 వ శ్లో).* **జగత్తుకు బీజము.** త్రిగుణాత్మక మైన పరమేశ్వర శక్తి. మాయా శక్తి.

శ్లోకం లోని ***ఏవ*** కారము అష్టధా ప్రకృతి నిర్ణయం కాగా, శ్లోకం లోని **చ** శబ్దము భేద సముచ్చయార్థము ప్రయోగింప బడింది ***(చ శబ్దః భేద సముచ్చయార్థః).*** సూక్ష్మ పంచభూతాలు (తన్మాత్రలు లేదా మహాభూతాలు) స్థూల భూతాలుగా పంచీకరణం చెంది నపుడు ఏకాదశ ఇంద్రియాలు, ఇంద్రియ గోచరమైన విషయాలు ఏర్పడ్డాయి.

జ్ఞానేంద్రియాలు ఐదు, కర్మేంద్రియాలు ఐదు, అంతరేంద్రియ మైన మనస్సు ఒకటి - వెరసి పదకొండు ఇంద్రియాలు ***(ఇంద్రియాణి దశ ఏకం చ).*** పంచ జ్ఞానేంద్రియాలకు తెలియబడే పంచ శబ్దాది విషయాలు. ఇక్కడికి పదహారు. సూక్ష్మ పంచభూతాలు, అహంకారము, బుద్ధి, అవ్యక్తము వెరసి ఎనిమిది. ఇక్కడికి మొత్తం ఇరవై నాలుగు తత్త్వాలు (సాంఖ్యులు ప్రతిపాదించినవి). ఇవన్నీ క్షేత్రము క్రిందికే వస్తాయి. ఇదంతా ప్రకృతి రూపమే. వికార యుతమే.

తత్ క్షేత్రం యచ్చ యాదృక్చ అనే శ్లోకంలో పరమేశ్వరుడు ***యచ్చ*** - క్షేత్రము ఏదో చెబుతాను అన్న దానికి వ్యాఖ్యానమే ఇంతవరకు మనం చూచిన ఇరవై నాలుగు తత్త్వములతో కూడిన ప్రకృతి స్వరూపము. ఇక ***యాదృక్చ, యద్వికారి*** - అది ఎలాంటిది, ఏయే వికారాలు కలది? అనే విషయాన్ని విస్పష్టం చేసేందుకు ప్రస్తుతం మనం అధ్యయనం చేస్తున్న శ్లోక ద్వయంలో రెండవది యైన ***ఇచ్ఛా ద్వేష సుఖం దుఃఖం*** అనే శ్లోకం.

వికార ధర్మములు - వైశేషికము

షడ్దర్శనములలో సాంఖ్యము ప్రతిపాదించిన చతుర్వింశతి తత్త్వములతో కూడిన ప్రకృతి స్వరూపాన్ని గూర్చి చర్చించుకున్నాం. ఆ ప్రకృతి లోని అహంకారం నుండి ఉత్పన్న మయ్యే గుణసహిత ఇచ్ఛాది వికారాలను ప్రస్తుత శ్లోకంలో చెప్పుకో బోతున్నాం. ఈ సందర్భములో షడ్దర్శనాలలో సాంఖ్యం లాగే మరొక దర్శన మైన వైశేషికాన్ని ప్రవేశ పెట్టక తప్పడం లేదు.

వైశేషిక దర్శనానికి కర్త కణాదమహర్షి. వైశేషికాన్ని ప్రతిపాదించే గ్రంథము పది అధ్యాయాలు కలిగి, ప్రతి అధ్యాయము రెండు ఆహ్నికాలుగా విభజింపబడి, మూడు వందల డెబ్బై రెండు శ్లోకాలతో శోభిస్తూ ఉంది. ఇది కపిలుని సాంఖ్య మంతటి ప్రసిద్ధిని పొందక పోయినా, షడ్దర్శనాలలో ఒకటైన గౌతముని న్యాయ దర్శనము కంటే ప్రశస్త మైనదని భావిస్తారు. ఈ వైశేషిక దర్శనానికి రావణాసురుని భాష్యం ఉందని చెబుతారు. నేను చూడ లేదు.

న్యాయ, వైశేషిక దర్శనాలు ఆత్మలు అనేకము అంటాయి. ఆత్మ ఏకమైతే, అందరి ఆత్మ ఒక్కటే కనుక, ఒకరికి సుఖదుఃఖాలు ప్రాప్తిస్తే, అందరికీ అవి అలాగే ప్రాప్తించాలి అనేది వారి వాదన. ఆత్మ అద్వితీయము, ఏకము అనే వేదాంత సిద్ధాంతాన్ని వైశేషికులు ***వ్యవస్థాతో నానా, శాస్త్ర సామర్థ్యాచ్చ*** అనే రెండు సూత్రాలలో అంగీకరించ లేదు. కనుక, ఆత్మలు అనేకము అనే వైశేషిక దర్శనములో ప్రతిపాదించ బడిన ఇచ్ఛ, ద్వేష, సుఖదుఃఖాది గుణాలు ఆత్మ ధర్మములుగా నిర్దేశింప బడ్డాయి *(వై.సూ; 1 - 1 - 6).* ఈ విషయమును వేదాంతము అంగీకరించదు.

ఆత్మ ఏకము, అద్వయము, నిర్గుణము, నిరాకారము. సుఖదుఃఖ, ఇచ్ఛాద్వేషాదులు మనోధర్మాలే గాని ఆత్మధర్మాలు కావు. సూక్ష్మ శరీరాభిమాని యైన జీవుడు సుఖదుఃఖాలను మనస్సు ద్వారా అనుభవిస్తాడు. కనుక

ఇచ్ఛా ద్వేష, సుఖదుఃఖాది వికారాలు మనస్సుకు సంబంధించినవే గాని ఆత్మకు సంబంధించినవి కావు. ఇలా
జ్ఞేయములైన వికారాలు క్షేత్ర సంబంధ మైనవి. వాటినే ప్రస్తుత శ్లోకంలో భగవంతుడు ఉదహరిస్తున్నాడు.

ఇచ్ఛ :

ఇచ్ఛ అంటే కోరిక. అదే రాగము. విషయాల యందు ప్రియత్వము. ***భోగ్యాని ఇచ్ఛతి అనయేతి ఇచ్ఛా -***
ఈ ప్రీతి వల్లనే భోగ్య విషయాలను ఆశించడం జరుగుతుంది కనుక, ఇది ఇచ్ఛ. ***ఇదం మే భూయాత్ - ఇదం***
మే స్యాత్ - ఇది నాకు ప్రాప్తించు గాక అనే కోరికే ఇచ్ఛ. కామ మన్నా రాగ మన్నా ఇదే. ఇది అంతఃకరణ
ధర్మము.

ద్వేషము :

దుఃఖము, దుఃఖ హేతువు ప్రాప్తమై నపుడు, ఇది నాకు ప్రాప్తించకుండు గాక! అనే చిత్తవృత్తి ద్వేషము
(ఇదం మే మాభూత్). ఈ చిత్త వృత్తే క్రోధంగా, ఈర్ష్యగా వ్యక్త మవుతూ ఉంటుంది. అనుకూలమై
ప్రసన్నతను కలిగించేది ఇచ్ఛ అయితే, ప్రతికూలమై విషమత్వాన్ని నింపేది ద్వేషము. ఇవే రాగద్వేషాలు.
మలదోషాలు. ఈ రెండు అంతఃకరణ ధర్మాలే గాని ఆత్మధర్మాలు కావు. ***అయం రాగః అయం ద్వేషః -*** ఇది
రాగము, ఇది ద్వేషము; అలాగే ***ఇదం సుఖం, ఇదం దుఃఖం -*** ఇది సుఖము, ఇది దుఃఖము అని తెలియబడు
తున్నాయి కనుక ఇవి జ్ఞేయములు. తెలియ బడేవి ఏవైనా క్షేత్రమే. ఘటాదులు ఎలా తెలుస్తున్నవో, సుఖదుఃఖ
ఇచ్ఛాద్వేషాలు కూడా అలాగే తెలుస్తున్నాయి కనుక ఇవి క్షేత్ర ధర్మాలే గాని, ఆత్మధర్మాలు కావు.

సంఘాతము :

దేహేంద్రియాల సమూహమే, సంహతియే సంఘాతము ***(సంఘాతః దేహేన్ద్రియాణాం సంహతిః).***
ఇంద్రియాలతో కూడిన పరిణామ శీలమైన దేహము సంఘాతము.

చేతనము :

ఈ దేహేంద్రియ సంఘాతము నందు అభివ్యక్త మయ్యే అంతఃకరణ వృత్తినే **చేతనా** అంటారు.
బాగా కాలిన ఇనుపగుండు నందు ఎఱ్ఱదనము అభివ్యక్త మైనట్లు, దేహేంద్రియ సంఘాతంలో బుద్ధి వృత్తి
అభివ్యక్త మవుతుంది. అదే చేతనము. శీత స్వభావం గల ఇనుపగుండులో వ్యక్తమైన అగ్ని ఇనుప ముద్దను
అగ్ని గోళంగా భ్రమింప చేసినట్లు, సర్వగత మైన ఆత్మ చైతన్యం బుద్ధిలో ప్రకాశించి నపుడు ***(బుద్ధౌ భానం)***
బుద్ధి వృత్తియే ఆత్మ యని భ్రమింప చేస్తుంది. వాస్తవానికి ఇది ఆత్మ చైతన్యము కాదు. చైతన్యాభాస మాత్రమే.
దీనినే ఇక్కడ చేతన మంటున్నాడు. బుద్ధి వృత్తి కూడా జ్ఞేయమే కనుక, దృశ్యమే కనుక చేతన కూడా క్షేత్రమే.

ధృతి :

ధృతి అంటే ధైర్యము. ధైర్య రూపమైన బుద్ధి విశేషము. దుర్బలమై, సడలి పోతున్న దేహేంద్రియాదులను
ఏది నిలబెడుతుందో అదే ధృతి, లేదా ధైర్యము ***(ధృతిః యయా అవసాద ప్రాప్తాని దేహేంద్రియాణి ధ్రియన్తే).***
ఇది కూడా జ్ఞేయమే కనుక క్షేత్రమే.

ఏవేవి మహదాదులతో, శబ్దాదులతో కూడి వికారయుతమై, ఆత్మకు జ్ఞేయములుగా ఉన్నవో అవన్నీ
క్షేత్రములే. సవికారములే ***(సవికారం ఉదాహృతమ్).*** ఇదంతా క్షేత్రంగా చెప్పబడింది అని క్షేత్ర స్వభావాన్ని
వివరించి ఉపసంహరిస్తున్నాడు ***(యత్ ఉక్తం తత్ ఉపసంహరతి).***

ఇక క్షేత్రజ్ఞుని ప్రభావాన్ని గూర్చి చెప్పాలి. క్షేత్రజ్ఞుని వైభవాన్ని గ్రహించడానికి శ్రోత అర్హుడై ఉండాలి.

అదే జ్ఞానార్హత. క్షేత్రజ్ఞుని వైభవాన్ని వివరించే ముందు శ్రోతృ యోగ్యతను వివరిస్తున్నాడు.

అమానిత్వ మదంభిత్వ మహింసా క్షాన్తి రార్జవమ్ । 7
ఆచార్యోపాసనం శౌచం స్థైర్య మాత్మవినిగ్రహః ॥

అమానిత్వం-అదంభిత్వం-అహింసా-క్షాంతిః-ఆర్జవం
ఆచార్యోపాసనం-శౌచం-స్థైర్యం-ఆత్మవినిగ్రహః

అమానిత్వం	= అభిమానము లేకుండుట	ఆచార్యోపాసనం	= ఆచార్య సేవ
అదంభిత్వం	= దంభము లేకుండుట	శౌచం	= శుభ్రత
అహింసా	= అహింస	స్థైర్యం	= స్థిరత్వము
క్షాంతిః	= సహనము	ఆత్మవినిగ్రహః	= ఆత్మనిగ్రహము
ఆర్జవం	= ఋజుత్వము		

అర్జునా! అమానిత్వము, అదంభిత్వము, అహింస, క్షాంతి, ఆర్జవము, ఆచార్యోపాసనము, శౌచము, స్థైర్యము, ఆత్మ వినిగ్రహము - ఇదంతా జ్ఞానమే.

వ్యాఖ్య

ప్రకృతి పురుషులు, క్షేత్ర క్షేత్రజ్ఞులు, జ్ఞాన జ్ఞేయములు అనే విషయాలు ఈ అధ్యాయంలో చర్చనీయాంశా
లని మనం అధ్యాయం ప్రారంభం లోనే చెప్పుకున్నాం. వాటిలో ముందుగా క్షేత్ర క్షేత్రజ్ఞుల విషయాన్ని ఆరంభించి,
క్షేత్రాన్ని గూర్చి ఇంతవరకు చెప్పుకున్నాం. ఇక క్షేత్రజ్ఞుణ్ణి గూర్చిన ప్రసంగం ప్రారంభం కావాలి. కానీ, అలా
కాకుండా, మూడవ అంశమైన జ్ఞాన జ్ఞేయాలలో జ్ఞానం అనే విషయాన్ని ప్రస్తుతం వినబోతున్నాం.

క్షేత్ర విషయాన్ని ముగించి, క్షేత్రజ్ఞుని విషయాన్ని ప్రారంభించడానికి ముందుగా, అంటే ఈ మధ్యలో
భగవంతుడు 'జ్ఞానం' అనే విషయాన్ని ప్రవచిస్తున్నాడు.

క్షేత్రజ్ఞుని ప్రభావము సాధారణ మైంది కాదు. క్షేత్రజ్ఞునికి సంబంధించిన జ్ఞానము కలిగితే మోక్షము
సిద్ధిస్తుంది ***(క్షేత్రజ్ఞస్య పరిజ్ఞానాత్ అమృతత్వం భవతి).*** క్షేత్రజ్ఞుడు, జ్ఞేయము, పురుషుడు అన్నీ పర్యాయ
పదాలుగా ముందే చెప్పుకున్నాం. జ్ఞేయ రూపుడైన క్షేత్రజ్ఞుని తెలుసుకుంటే జ్ఞానోత్పత్తి జరుగుతుంది. కానీ,
జ్ఞానార్హత లేకుండా జ్ఞానం కలగదు. అలాగే జ్ఞానోత్పత్తి హేతువు లైన సాధనలు లేకుండా జ్ఞానార్హత సిద్ధించదు.
అందుచేత, ప్రథమంగా అధికారిత్వాన్ని సిద్ధింప చేసి, ఆ తరువాత క్షేత్రజ్ఞ వైభవాన్ని వివరించాలి. ఆ ప్రయత్నం
లోనే ముందుగా జ్ఞానోత్పత్తి సాధనలైన జ్ఞాన లక్షణాలను వివరిస్తున్నాడు. అవే వరుసగా ఐదు శ్లోకాలలో
ప్రవచింప బడుతున్న అమానిత్వాది ఇరవై జ్ఞాన సాధనలు. జ్ఞానార్థి ప్రయత్న పూర్వకంగా సాధించ వలసిన ఈ
జ్ఞాన సాధనలు ఆత్మజ్ఞానిలో సహజంగా అలరారుతూ ఉంటాయి. ఇక ఈ ఇరవై జ్ఞాన సాధనలను సంక్షిప్తంగా
చెప్పుకుందాం.

(1) అమానిత్వం

తనను తాను పొగుడుకొనే లక్షణాన్ని మానిత్వం అంటారు. అదే ఆత్మస్తుతి ***(ఆత్మనః శ్లాఘనమ్).*** ఆ
గుణము లేకపోవడం అమానిత్వం ***(తదభావః అమానిత్వం).***
ఆత్మ ప్రశంసే ప్రధానంగా కలవాడు మాని. అది లేనివాడు అమాని. అమాని యొక్క లక్షణం అమానిత్వం.

ఇది దైవ గుణము. దైవ లక్షణము. అందుకే విష్ణుసహస్రనామం భగవంతుని **అమానీ** అని కీర్తించింది (747వ నామం).

ఆత్మస్తుతి అనేది తనలో ఉన్న వైభవాన్ని గూర్చి కావచ్చు. లేదా, లేని దానిని గూర్చి కావచ్చు. ఎలా చూచినా, రెండూ అవాంఛనీయమే. లేనిది ఉన్నట్లు భావించి ఆత్మస్తుతి చేసుకోవడం అజ్ఞాని లక్షణము. అలాంటి వాడు ఆత్మజ్ఞానాన్ని ఎలా పొందుతాడు? ఒకవేళ ఉన్న సుగుణాలనే ప్రశంసించుకున్నా డనుకుందాం. అది మాత్ర మెందుకు?

తనకు ఏ గుణా లున్నాయో తనకు తెలుసు కదా! మరి స్తుతి ఎవరి కొరకు? ఇతరుల గుర్తింపు కొరకు. అది దేనికి? తన సుఖం ఇతరులు తనను గుర్తించడంపై ఆధారపడి ఉందని భావించిన వాడే అలా పరితపిస్తాడు. వాస్తవానికి ఇతరుల నుండి గుర్తింపులను, గౌరవాలను ఆశించే వాడు ఇహంలో సుఖపడ లేడు సరి గదా సత్యదర్శనం చేయడానికి అసలే సరిపోడు.

మానాపమానే దుఃఖీస్యాత్ నైవ సాధారణో జనః।
అతో దుఃఖ నిదానత్వాత్ మానం యోగీ పరిత్యజేత్ ॥

మానావమానాలు రెండిటి లోను మానవుడు దుఃఖాన్నే అనుభవిస్తాడు. జనులు సామాన్యులు కారు అన్నది శాస్త్రం. అవమానంలో ఎలాగూ దుఃఖం తప్పదు. కానీ, మానంలో కూడా దుఃఖమే ఉంటుంది. అందుచేత ఈ మానిత్వాన్ని, ఆత్మస్తుతిని మోక్షార్థి త్యజించాలి.

శ్లాఘనీయమైన గుణమే మనలో ఉందనుకుందాం. దానిని ఇతరులు ఎందుకు గుర్తించాలి? ఎందుకు గౌరవించాలి? ఆ సుగుణము వారికి శ్లాఘనీయం కాకపోవచ్చు. పోనీ శ్లాఘనీయమే అనుకుందాం. దాని అవసరం వారి కేమిటి? ఒకవేళ దాని వల్ల వారికి ప్రయోజనం ఉంటే, గుర్తించి గౌరవిస్తారు. అది లేనపుడు, గర్హిస్తారు. పదవులు కోల్పోయిన వారిని మనం చూడటం లేదా?

అంతే కాదు. ఇతరులపై మనకు నియంత్రణ ఉందా? పరిస్థితులు సదా మన అధీనంలో ఉంటాయా? పైగా, అనిత్యమైన ప్రపంచం నుండి అర్థ రహితమైన గౌరవాన్ని ఆశించి ప్రాకులాడటం, అది లభ్యం కానపుడు చింతించడం చిత్తదోషం కాదా? జ్ఞానోత్పత్తి హేతువైన అంతఃకరణ శుద్ధికి చిత్త మాలిన్యము ప్రతిబంధకము కాదా? అందుచేత, సాధకుడు మానిత్వాన్ని త్యజించి, అమానిత్వంతో శోభించాలి.

(౨) అదంభిత్వం

తనను తాను స్తుతించుకోవడం మానిత్వం అయితే, తాను ఆచరించిన కార్యాలను గూర్చి గొప్పలు చెప్పుకోవడం దంభిత్వం ***(స్వధర్మ ప్రకటీకరణం దంభిత్వం).*** ఆ గుణము లేకపోవడం అదంభిత్వం ***(తదభావః అదంభిత్వమ్).***

ఈ విధమైన ఆడంబరాల వెనుక, ఉత్తర కుమార ప్రగల్భాల వెనుక లాభాసక్తి, కీర్తికాంక్ష చోటు చేసుకొని ఉంటాయి. ఈ ఆడంబర ప్రదర్శనంలో భాగంగా వేష భాషలు, హావభావాలు, క్రియా కౌశల్యాలు, ప్రకర్ష ప్రకటనలు - ఓహ్ ఎన్నని? అన్నీ ఆడంబరాలే. డాంబికత్వాలే. స్వప్న తుల్యమైన జగత్తులో పూజార్హులు కావాలనే తపనలే. ఎండమావులలో దప్పిక తీర్చుకొనే ప్రయత్నాలే. దంభమైనా, అదంభమైనా కర్మ యుతాలే. కాకపోతే, దంభము దుఃఖ కారణము. చిత్త విక్షేప కారణము. అదంభము సుఖ హేతువు; పైగా చిత్తశుద్ధి కారణము.

కృతం దమ్భాత్ అదంభాద్వా కర్మతుల్య శ్రమం భవేత్!
శ్రమైక ఫల మాద్యం స్యాత్ ద్వితీయం సుఖ సాధనమ్ ॥

దంభముతో ఆచరించినా, అదంభముతో ఆచరించినా కర్మ కర్మే. శ్రమ రెండిటిలో సమానమే. దంభముతో చేసే శ్రమకు శ్రమే ఫలము. రెండవది యైన అదంభముతో ఆచరించే కర్మ సుఖ సాధనము అన్నది శాస్త్రం. లేనిది ఊహించుకొని ప్రకటించుకొనే మనస్సు, ప్రకటించు కున్నది ప్రయోజనాన్ని ప్రాప్తింప చేయాలని ప్రాకులాడే మనస్సు సదా చంచలమై, అస్థిరమై ఉంటుంది. అలాంటి మనస్సుకు జ్ఞానార్హత ప్రాప్తించదు. కనుక అదంభిత్వమే అనుసరణీయము. ఆచరణీయము.

(3) అహింస

ప్రాణులను హింసించక పోవడం, పీడించక పోవడం అహింస ***(అహింసనమ్ ప్రాణినాం అపీడనమ్ అహింసా!).*** ఇది ధార్మిక లక్షణము. ఎవరైనా మనల్ని హింసిస్తే మనం బాధ పడతాము కదా! మరి ఇతరులు మన నుండి ఏమి ఆశిస్తారు? మన చేత హింసింప బడాలి అని అనుకోరు కదా! కనుకనే ***హింసాం న కుర్యాత్*** - ఎవరినీ హింసించకు అనే విధి వాక్యాన్ని వేదం ఘోషించింది. మనోవాక్కాయముల చేత ఎవరినీ బాధించకుండా ఉండటమే అహింసనము. భూతదయ, బ్రహ్మచర్యాదులకు అహింస ఉపలక్షణం అని గ్రహించాలి.

మనచే హింసింపబడి ఇతరులు దుఃఖాన్ని అనుభవించుటను చూచి మనం సుఖ పడగలమా? కనుక, నేను సుఖపడాలి అని భావించే వాడు పరులను హింసించుటను త్యజించాలి ***(సుఖీ స్యామితి విజ్ఞాయ పరపీడాం వివర్జయేత్).*** హింసా ప్రవృత్తిలో కుమిలే చిత్తం కలుషితమై ఉంటుంది. అందువల్ల జ్ఞానార్హతను కోల్పోతుంది.

(4) క్షాంతి

పరులను మనం పీడించకుండా ఉండే ఉత్తమ గుణము అహింస అయితే, పరులు మనల్ని బాధించి నపుడు, పరుల అపరాధము మనకు అనర్థాన్ని కలిగించి నపుడు మనస్సులో ఏ విధమైన వికారము లేకుండా, ప్రశాంతముగా ఉండటము క్షాంతి ***(పరాపరాధప్రాప్తౌ అవిక్రియా).*** చిత్త వికారాన్ని కలిగించే పరుల ప్రవర్తనమును నిర్వికార చిత్తముతో గ్రహించడము క్షాంతి. అంతేగాని, ఎదుర్కొనే శక్తి లేక మౌనంగా దుఃఖాన్ని భరించడం క్షాంతి కాదు. అది చిత్త విక్షేపము. ఇతరుల ప్రవర్తనము మన లోని శాంతికి విఘాతం కలిగించకుండా ఉండాలి. క్షాంతి గల వారికే అది సాధ్య పడుతుంది. అలాంటి వారే ప్రశాంత చిత్తులై జ్ఞానాన్ని సాధించ గలుగుతారు.

(5) ఆర్జవము

వ్యవహారంలో ఋజు వర్తనము కలిగి ఉండటమే ఆర్జవము ***(ఆర్జవమ్ ఋజు భావః).*** వక్రత్వం లేకుండా ప్రవర్తించడమే ఋజు స్వభావము. త్రికరణ శుద్ధితో జీవించడము. కుటిలత్వం లేని ప్రవర్తనము, మోస మెరుగని శీలము ఆర్జవము యొక్క లక్షణాలు. ద్వంద్వ వైఖరికి అవకాశం లేని జీవనము. నిష్కాపట్యము గల జీవనము. ధర్మజీవనము. మాయ లెరుగని, మర్మ మెరుగని స్వచ్ఛమైన స్ఫటికం లాంటి సరళ జీవనము ఆర్జవ ప్రసాదము.

(6) ఆచార్యోపాసనము

మోక్ష మార్గాన్ని ఉపదేశించే గురుదేవునికి శుశ్రూషాదులు చేస్తూ, నిరంతర సేవనంలో తృప్తి చెందడము ఆచార్యోపాసనము ***(మోక్ష సాధనోపదేష్టుః ఆచార్యస్య శుశ్రూషాది ప్రయోగేణ సేవనమ్ ఆచార్యోపాసనమ్).*** వాస్తవానికి ఇది గురుసేవ. ఆచార్యసేవ. కాని, ఆచార్య సేవ అనకుండా ఆచార్య ఉపాసనము అని ఆదిదేవుడే అంటున్నాడంటే, దాని ప్రాశస్త్య ప్రభావా లెలాంటివో ముముక్షువులు గుర్తించాలి. గురుశుశ్రూష అనేది దైవాన్ని ఉపాసించినట్లు ఉండాలే గాని, దీనులను సేవించినట్లు ఉండ కూడదు.

యద్యపి ఉద్దామ బుద్ధిః పఠిన పరిణమ ద్వేద శాస్త్రాక్షరార్థో
న హి ఆచార్యం వినాఽ సౌ తదపి పరిచినో త్యే తదుక్తం రహస్యమ్ ॥

'మేధావంతులైన వారు వేద శాస్త్రాలను అధ్యయనం చేసి, వాటి అర్థాలను గ్రహించ వచ్చు. కాని, ఆచార్యుడు లేకుండా వాటి రహస్యార్థాలను గ్రహించ లేరు' అన్నారు శతశ్లోకీ గ్రంథంలో శ్రీ శంకరాచార్యస్వామి. అట్టి గురు ఋణాన్ని గురువును ఎలా సేవించి తీర్చుకోవాలో ముముక్షువులే ఆలోచించుకోవాలి. ఆచార్యబోధ లేకుండా జ్ఞానప్రాప్తికి అవకాశం లేనందున ఆచార్య సేవనము కూడా జ్ఞానోత్పత్తి సాధనమే.

(7) శౌచము

శౌచము అంటే శుద్ధి. దేహ మాలిన్యాన్ని, మట్టి, నీళ్ళు మొదలైన వాటితో ఎలా శుభ్రం చేసుకుంటామో, అలాగే మనస్సు లోని రాగద్వేషాది మాలిన్యాన్ని ప్రతిపక్ష భావన చేత నిర్మూలించుకోవడాన్ని శౌచమని జ్ఞానసాధనలలో చెబుతారు **(కాయ మలానాం మృజ్జలాభ్యాం ప్రక్షాలనమ్. అన్తశ్చ మనసః ప్రతిపక్ష భావనయా రాగాది మలాప నయనం శౌచమ్).**

శరీర మాలిన్యాన్ని జలాదుల చేత శుద్ధి చేసుకోవడాన్ని బాహ్య శౌచము అంటారు. మనో మాలిన్యమైన రాగాదులను ప్రతిపక్ష భావన చేత తొలగించు కోవడాన్ని అభ్యంతర శౌచము అంటారు. ప్రస్తుతం మోక్ష సాధన రూపమైన శౌచము నందు ఈ రెండూ అనుసరణీయాలే. ఆచరణీయాలే. మృజ్జలాదులతో బాహ్య శుద్ధి చేసుకోవడం వలన, రాగాదుల యందు దోష దర్శనము వలన, అలాగే రాగాదులకు ప్రతికూల గుణాలను అవలోకించి అవలంబించడం వలన మనస్సులో భావశుద్ధి ఏర్పడి, మనస్సు జ్ఞానాన్ని పొందడానికి అర్హతను సాధిస్తుంది.

(8) స్థైర్యము

స్థిరముగా ఉండటము స్థైర్యము. మోక్ష మార్గము నందు స్థిరంగా ఉండటము స్థైర్యము. మోక్ష మార్గములో ఎన్ని అవరోధాలు ఎదురైనా, ప్రతిబంధకాలు అడ్డు నిలిచినా, విఘ్నములు సంభవించినా, మోక్ష సాధనలైన శ్రవణ మనన నిదిధ్యాసలను విడిచి పెట్టకుండా, ప్రయత్నంతో, శ్రద్ధతో సాధనలను కొనసాగించే స్థిరత్వమే స్థైర్యము **(స్థైర్యమ్ స్థిర భావః మోక్షమార్గ ఏవ కృతాధ్యవసాయత్వమ్).**

(9) ఆత్మ వినిగ్రహము

దేహేంద్రియా లనే కార్యకరణ సంఘాతము మోక్ష మార్గమునకు వ్యతిరేకంగా ప్రవర్తించడము సహజము. అలా మార్గము తప్పినపుడు, దానిని నిగ్రహించి సన్మార్గంలో కట్టుదిట్టం చేయడం ఆత్మ వినిగ్రహము. నిరోధ స్వభావము గల ఈ నిగ్రహము చిత్త విక్షేపాన్ని అరికట్టి, మనస్సును మోక్ష మార్గము నందే సమాహితం చేస్తుంది **(ఆత్మ వినిగ్రహః ఆత్మనః అపకారకస్య ఆత్మశబ్ద వాచ్యస్య కార్యకరణ సంఘాతస్య, వినిగ్రహః స్వభావేన సర్వతః ప్రవృత్తస్య సన్మార్గే ఏవ నిరోధః ఆత్మవినిగ్రహః).** ఇది దేహేంద్రియ సంయమము. జ్ఞాన విషయాన్ని ప్రవచించే ఐదు శ్లోకాలలో తొమ్మిది జ్ఞానసాధనలను తెలియ చేసిన మొదటి శ్లోకం సమాప్త మైంది.

మరి కొన్ని జ్ఞాన సాధనలను తరువాత శ్లోకంలో చెప్పుకుందాం.

ఇన్ద్రియార్థేషు వైరాగ్య మనహంకార ఏవ చ ।
జన్మమృత్యు జరావ్యాధి దుఃఖ దోషానుదర్శనమ్ ॥ 8

ఇంద్రియార్థేషు-వైరాగ్యం-అనహంకారః-ఏవ-చ
జన్మమృత్యుజరావ్యాధి దుఃఖదోషాను దర్శనం

ఇంద్రియా ర్థేషు = ఇంద్రియ విషయముల యందు వైరాగ్యం = విరక్తి అనహంకారః ఏవ చ = అహంకారము లేకపోవడము	జన్మమృత్యుజరావ్యాధి దుఃఖ దోషానుదర్శనం = జననము, మరణము, ముసలి తనము, వ్యాధుల వలన కలిగెడి దుఃఖ దోషములను గ్రహించుట

అర్జునా! ఇంద్రియ విషయాల యందు వైరాగ్యము, అహంకారము లేకపోవడం, జన్మ, మృత్యువు, ముసలితనము, వ్యాధుల లోని దుఃఖాన్ని దర్శించడము - ఇవి కూడా జ్ఞానసాధనలే.

వ్యాఖ్య

(10) ఇంద్రియ విషయాలలో వైరాగ్యము

ఇంద్రియాలను క్షోభ పెట్టే శబ్దాది విషయాల యందు ఆసక్తి, అనురక్తి లేకపోవడమే ఇంద్రియార్థము లందు వైరాగ్యము ***(శబ్దాదిషు భోగేషు విరాగ భావః వైరాగ్యమ్).*** శ్రీ శంకరాచార్య స్వామి భాష్యంలో దృష్టా దృష్ట ఇంద్రియ విషయ భోగాల యందు అనురాగము లేకపోవడము వైరాగ్యము అన్నారు ***(దృష్టా దృష్టేషు భోగేషు).*** దృష్టములు అంటే కనిపించేవి. అదృష్టములు అంటే, కనిపించకుండా వినిపించేవి. కనిపించేవి ఇహలోక భోగాలు, కనిపించకుండా కేవలం వినిపించేవి పరలోక భోగాలు. ఇహపరాల లోని ఇంద్రియ భోగాల యందు విరక్తి కలిగి ఉండటము వైరాగ్యము. పూర్వ శ్లోకంలో మనం చూచిన స్థైర్య ఆత్మవినిగ్రహాలకు వైరాగ్యము ఊతగా నిలుస్తుంది.

ఇంద్రియ విషయ భోగాల యందు విరక్తి చెందడము అంటే, విషయాలకు దూరంగా పరుగు తీయడ మని కాదు. ఇంద్రియ విషయాల నుండి మనిషి దూరం కావచ్చు. అంత మాత్రాన మనస్సు వాటి నుండి దూరం కాదు. చదువుకోవడం మాని బొమ్మలతో ఆడుకుంటున్న పిల్లవాడి చేతి నుండి బొమ్మను లాక్కొని, అతడి చేతికి పుస్తకాన్ని ఇచ్చి కూర్చో బెట్టగలం. అంతమాత్రం చేత పిల్లవాడ్ని చదివించ లేము. బొమ్మను దూరం చేయ గలమేమో గాని, బొమ్మపై వాడి కుండే ఆసక్తిని దూరం చేయలేము. పిల్లవాడు పెరుగుతూ ఉంటే, అతనిలో జ్ఞానం వృద్ధి చెందుతూ ఉంటే, బొమ్మలు వాటంతట అవే దూర మవుతాయి. పుస్తకాలు చేతిలో కనిపిస్తాయి. మనిషికి ఇంద్రియ విషయాల లోని దోషాలు తెలిసి రావడంతో పాటు జ్ఞానాసక్తి పెరిగితే, మనస్సులో విషయాల పట్ల పూర్ణ వైరాగ్యం ఏర్పడుతుంది. వైరాగ్యం ఉన్నప్పుడే జ్ఞానం సిద్ధిస్తుంది.

(11) అనహంకారము

అహంకారము లేకపోవడమే అనహంకారము ***(అహంకార అభావః అనహంకారః).*** నేను శ్రేష్ఠుడను, ఉత్కృష్టుడను అనే గర్వమే అహంకారము. అది లేకపోవడమే అనహంకారము. కొందరిలో జాత్యహంకారము ఉంటుంది. నేను గొప్ప జాతిలో జన్మించాను. అగ్రకులంలో జన్మించాను. నేను విద్యావంతుణ్ణి, నేను రూప వంతుణ్ణి, నేను గొప్ప కళాకారుణ్ణి, గొప్ప వక్తను, గొప్ప గాయకుణ్ణి - ఇలాంటి అభిమానమే అహంకారము. ఇది జ్ఞానప్రాప్తికి ప్రతిబంధకము. ఎత్తైన కొండలపై పడిన వర్షపు జలం అక్కడ నిలవకుండా ఎలా పతన మవుతుందో, అహంకారి మస్తిష్కంలో కూడా జ్ఞానగంగ నిలవకుండా జారి పోతుంది.

మనలో ఏ గొప్పతనాన్ని చూసుకొని మనం గర్వ పడుతున్నామో, ఆ విషయాన్ని అంతరేక్షణ చేసుకుంటే,

మన లోని శ్రేష్ఠత్వానికి దోహద పడిన అనేక అంశాలు కళ్ళ ముందు కదుల్తాయి. అనేక మంది వ్యక్తులు మనస్సులో మెదుల్తారు. ఈ ప్రపంచానికి మనం రిక్త హస్తాలతో వచ్చాం. నేడు మన చేతిలో ఏది ఉన్నా అది ఇక్కడ ఏరుకున్నదే. అంతేకాదు. ఉన్న దేదైనా ఒకనాడు విడిచిపెట్టి పోవలసిందే. ఈ సత్యం అర్థమైతే, అహంకారము ఆవిరై పోతుంది. అనహంకారము ఆభరణంలా నిలిచి శోభిస్తుంది.

(12) దోష దర్శనం

పుట్టుక నందు, మరణము నందు, వృద్ధాప్యము నందు, వ్యాధులు ప్రాప్తించి నపుడు కలిగే దుఃఖాన్ని, దుఃఖ దోషాన్ని చూడటం కూడా జ్ఞాన లక్షణమే. ఇది పురుషార్థ నిశ్చయాన్ని దృఢం చేస్తుంది. వైరాగ్యాన్ని వృద్ధి చేస్తుంది. ప్రపంచంపై విరక్తిని కలిగించి పరమాత్మపై ఆసక్తిని పెంచుతుంది.

జన్మ, మృత్యు, జరా వ్యాధుల యందలి దుఃఖాన్ని గుర్తించడం, గుర్తించిన దానిని తదేకంగా ఆలోచించడమే అనుదర్శనము **(అనుదర్శనమ్ ఆలోచనమ్)**. చూడటం దర్శన మైతే, మళ్ళీ మళ్ళీ చూడటం అనుదర్శనము. దర్శించడము అంటే అర్థం చేసుకోవడం అని భావము. జననమరణాది దుఃఖ హేతువులతో జీవితం నిండి ఉంది అనే సత్యాన్ని అర్థం చేసుకోవడమే అనుదర్శనము.

జీవితం క్షణ భంగురము. అంతా క్షణాల్లోనే జరిగి పోతుంది. ఒక క్షణంలో మనిషి పుడతాడు. క్షణంలో పుట్టిన మనిషి ఇంకొక క్షణంలో కన్ను మూస్తాడు. రెప్పపాటు జీవితంలో జననమరణాల మధ్య, వ్యాధులు, వృద్ధాప్యము పీడిస్తాయి. దేహ బాధలు, మనో వ్యథలు, సంబంధాలలో సంక్లిష్టాలు, అన్నీ దుఃఖాన్ని పెంచి పోషించేవే.

జీవితంలో ఎవరు తోడు ఉంటారో తెలియదు. ఎవరున్నా, లేకపోయినా దుఃఖం మాత్రం జీవితాంతం మనతో కలిసే ఉంటుంది. పుట్టుకతో కలిసి వచ్చిందని కాబోలు చావులో కూడా కలిసే ఉంటుంది. వేదనా భరిత మైన జీవితం లోని దుఃఖాన్ని దూరం చేసుకోవాలి అంటే, దుఃఖ దోషాన్ని దర్శించడమే గాక, పరివర్తన చెంది బ్రతుకును భగవదారాధనలో నివేదనగా మార్చుకోవాలి.

మనస్సు చంచలము. వయస్సు బుద్బుదము. ఆకారాలన్నీ వికారం చెందేవే. కాయము ఎవరి దైనా, ఎంతటి వారి దైనా కాష్ఠంలో కాలి పోయేదే. ఏదీ స్థిరం కాని ఈ ప్రపంచంలో మనలను ఉద్ధరించేది జ్ఞాన మొక్కటే.

చరణము: **మనసు కోడె నాగు - వయసు కొండ వాగు**
సొగసు కారు మబ్బు - తెలుసు వాటి రూపు
మంటల మయము కాటిలో కాయము
ఏ జీవి కైనా ఇదే చివరి న్యాయము

పల్లవి: **సాధన సాగనీ స్వామీ**
వేదన లన్నీ ఆగిపోనీ ॥ సాధన ॥

అవి కర్తవ్యాన్ని వెన్ను దట్టి ఎరుక పరచింది చైతన్య గీతిక.

మరి కొన్ని జ్ఞాన సాధనలను ప్రసాదిస్తున్నాడు.

అసక్తి రనభిష్వఙ్గః పుత్రదార గృహాదిషు ।
నిత్యం చ సమచిత్తత్వ మిష్టాని ష్టోపపత్తిషు ॥ 9

అసక్తిః-అనభిష్వంగః-పుత్రదార గృహాదిషు
నిత్యం-చ-సమచిత్తత్వం-ఇష్టానిష్టోపపత్తిషు

పుత్రదారగృహాదిషు	= పుత్రుడు, సతి, గృహాదుల యందు	ఇష్టానిష్టోపపత్తిషు	= ఇష్టానిష్టముల యందు
అసక్తిః	= ఆసక్తి లేకుండుట	నిత్యం	= ఎల్లప్పుడు
అనభిష్వంగః	= ప్రీతి లేకుండుట	సమచిత్తత్వం చ	= సమ బుద్ధి

అర్జునా! అసక్తి, పుత్ర కళత్ర గృహాదుల యందు అత్యాసక్తి లేకపోవడం, ఇష్టమైనది లభించినా, అనిష్ట మైనది ప్రాప్తించినా , సదా సమచిత్తంతో మెలగటం - ఇదంతా జ్ఞానమే.

వ్యాఖ్య

(13) అసక్తి

ఆకర్షించే విషయాల యందు ప్రీతిని 'సక్తి' అంటారు. అది లేకపోవడము అసక్తి ***(సంగ నిమిత్తేషు విషయేషు ప్రీతి మాత్రం సక్తిః : తదభావః అసక్తిః).***

'నాది' అనే మమత్వ భావనయే ప్రీతి. అదే సక్తి. భార్యాపుత్రాదుల యందు గాని, క్షేత్ర గృహ వాహనాదుల యందు గాని మమకారమును కలిగి ఉండటమే ప్రీతి. అదే సక్తి. సక్తి లేకుండా ఉండటమే అసక్తి. మనది కాని దాని యందు, మనకు ప్రాప్తించని దాని యందు, మనల్ని ఆకర్షించని దాని యందు మనకు ఎలాగైతే ప్రీతి ఉండదో, అలాగే మనకు ప్రాప్తించినవి, మనవిగా ముద్రపడిన విషయాల యందు కూడా అలాగే ప్రీతి లేకుండా ఉండటము అసక్తి. జన్మమృత్యు జరావ్యాధి దుఃఖాల యందు దోష దర్శనము చేయడ మనే కార్యము యొక్క ఫలమే ఈ అసక్తి భావము.

మనకు ఏవైనా ఉండవచ్చు. మనకు ఉన్నవి మనల్ని బాధించవు. మనవిగా ఉన్నవే బాధిస్తాయి. బంధిస్తాయి. ప్రపంచంలో ఉన్న వన్నీ పరమేశ్వరునికి సంబంధించినవే గాని మనవి కావు. వస్తువు భగవంతునిది. వినియోగము మనది. ఈ సత్యాన్ని బుద్ధికి పట్టించి విషయాల యందు, వ్యక్తుల యందు ప్రీతి లేకుండా ఉండటము అసక్తి.

(14) అనభిష్వంగము

పుత్ర కళత్ర గృహాది విషయాలలో అభిష్వంగము లేకుండా ఉండటము అనభిష్వంగము. అభిష్వంగము అంటే అతి ప్రీతి, అత్యాసక్తి, అతి స్నేహం. అది లేకుండా ఉండటము అనభిష్వంగము.

ఏవీ మనవి కావు, ఎవరూ మన వాళ్ళు కారు. అందరూ అన్ని కాలాలలో మనతో కలిసి ఉండలేరు. ఎవరూ మనతో కలిసి రాలేదు. పోయేనాడు ఎవరూ తోడు రారు. మనవి కాని వాటిని మనవిగా భావించడమే దుఃఖ కారణము. ఈ వాస్తవాన్ని గ్రహించిన తరువాత విషయాల యందు అసక్తి ఏర్పడుతుంది. అసక్తి కారణంగా అభిష్వంగము క్షీణించి అనభిష్వంగము సిద్ధిస్తుంది.

ఇంతకీ ఎవరితో అభిష్వంగము, ఎవరితో అతిస్నేహము అంటే, పుత్ర దార గృహాదుల యందు అతిప్రీతి అంటున్నాడు. కారణం, అన్యులైన వారు తామే అనే భావనను ఈ అతి స్నేహం కలిగిస్తుంది ***(అన్యాత్మ భావనా లక్షణః).*** వాళ్ళు సుఖంగా ఉంటేనే నేను సుఖంగా ఉంటాను; వాళ్ళు దుఃఖపడుతూ ఉంటే నేను కూడా వాళ్ళతో పాటు దుఃఖ పడతాను ***(యథా అన్యస్మిన్ సుఖిని దుఃఖిని వా అహమేవ సుఖీ దుఃఖీ చ).*** వాళ్ళు బ్రతికి ఉంటేనే నేను బ్రతికి ఉంటాను; వాళ్ళు మరణిస్తే నేనూ మరణిస్తాను ***(జీవతి మృతేవా అహమేవ జీవామి***

మరిష్యామి చ ఇతి). ఇదంతా అభిష్వంగము. ఈ విధమైన అభిష్వంగము లేకపోవడము అనభిష్వంగము. పుత్రదార గృహాదిషు - ఆదిషు - 'మొదలైన వాటి యందు' అనడంలో, బంధువర్గము నందు, మిత్రుల యందు, దాస వర్గము నందు కూడా ఆసక్తి, అభిష్వంగము లేకుండా జీవించే వైఖరి జ్ఞానానికి సహకారి అవుతుంది అని అర్థం.

(15) సమచిత్తత్వము

ఎల్లప్పుడు సమమైన చిత్తముతో ఉండటము సమచిత్తత్వము ***(నిత్యం చ సమచిత్తత్వం తుల్య చిత్తతా).*** ఎక్కడ, ఏ విషయములో సమచిత్తత్వము అంటే, ఇష్టానిష్టోపపత్తుల యందు సమ చిత్తముతో ఉండటము అంటున్నాడు. ఇష్ట మైనవి ప్రాప్తించడం ఇష్టోపపత్తి. అనిష్టాలు ప్రాప్తించడం అనిష్టోపపత్తి. ఈ రెండిటిలో కూడా ఒకే విధమైన బుద్ధితో ఉండటము సమచిత్తత్వము. అంటే, ఇష్ట మైనవి ప్రాప్తించి నపుడు సంతోషించడు ***(ఇష్టోప పత్తిషు న హృష్యతి).*** అనిష్ట మైనవి సంప్రాప్త మైనపుడు క్రుద్ధుడు కాడు ***(న కుప్యతి చ అనిష్టోప పత్తేషు).*** నిరంతరము ఈ విధమైన సమబుద్ధితో ఉండటము జ్ఞానము. హర్ష విషాదాలకు లోను గాకుండా జీవించే వ్యక్తి ఆత్మజ్ఞానాన్ని పొందడానికి అర్హు డవుతాడు.

మనం అనుకున్న వన్నీ జరగాలని, జరిగితే బాగుండు నని ఆశించడం తప్పు కాదు. కానీ, అలా జరగ నపుడు చింతించడం భావ్యం కాదు. కారణాలు లేకుండా కార్యాలు ఉండవు. జరిగేవి జరిగి తీరుతాయి. జరిగే వాటిని మనం ఆప లేము. జరగని వాటిని మనం జరిపించ లేము.

ఈ సృష్టిలో ధర్మా లున్నాయి. నియతి ఉంది. అందే వన్నీ కర్మఫలాలే. మనకు అందేవే కనిపిస్తాయి. మనం ఆచరించిన కర్మలు కనిపించవు. మనకు ఏది అందినా, అది ఇష్టమైనా, అయిష్టమైనా అంద దగిందే అందుతుంది. మన కర్మఫలం మనకు అందక పోతే మరెవరికి అందుతుంది? అందించే వాడు పరమేశ్వరుడు. కనుక, అందేది ఏదయినా పరమేశ్వర ప్రసాదమే. ఈ విధమైన అవగాహన కర్మయోగంలో సిద్ధిస్తే, ఇష్టానిష్టాలు ప్రాప్తించి నపుడు పొంగ కుండా, క్రుంగ కుండా మనిషి సమంగా, ప్రశాంతంగా ఉండ గలడు. ఈ విధమైన సమచిత్తము నిరంతరము ఉండ గలిగితే ఆత్మజ్ఞానము సులభ సాధ్య మవుతుంది. ఈ విధమైన సమబుద్ధియే జ్ఞానము ***(తచ్చ ఏతత్ సమచిత్తత్వం జ్ఞానమ్).***

తరువాత శ్లోకంలో మరి కొన్ని జ్ఞాన సాధనలు చెబుతున్నాడు.

మయి చా వన్యయోగేన భక్తి రవ్యభిచారిణీ ।
వివిక్తదేశ సేవిత్వ మరతి ర్జనసంసది ॥ 10

మయి-చ-అనన్య యోగేన-భక్తిః-అవ్యభిచారిణీ
వివిక్తదేశ సేవిత్వం-అరతిః-జనసంసది

మయి	= నా యందు	వివిక్తదేశ సేవిత్వం	= ఏకాంత ప్రదేశము నందుండుట
అనన్యయోగేన	= అనన్య యోగము చేత	జనసంసది	= ప్రజా సమూహాము నందు
అవ్యభి చారిణీ	= మార్పు లేని	అరతిః	= ఇష్టము లేని
భక్తిః చ	= భక్తియు		

అర్థము: అన్య భావన లేని భక్తి, ఏకాంత జీవనము, జన సంగము లేకపోవడము - ఇది కూడా జ్ఞానమే.

వ్యాఖ్య

(16) అనన్య భక్తి

అనన్య యోగంతో భగవంతుని యందు అకుంఠితమైన భక్తిని కలిగి ఉండటము కూడా జ్ఞానమే. వాసుదేవుడే భగవంతుడు. వాసుదేవునికి మించిన దైవము లేదు ***(న అన్యః భగవతః వాసుదేవాత్ పరః అస్తి).*** అట్టి వాసుదేవుడే నాకు గతి ***(స ఏవ నో గతిః)*** అనే నిశ్చయమైన బుద్ధియే అనన్య యోగము ***(ఇత్యేవం నిశ్చితా బుద్ధిః అనన్య యోగః).*** అట్టి యోగంతో ఈశ్వరుడైన వాసుదేవుని యందు అచంచలమైన భక్తిని కలిగి ఉండటము కూడా జ్ఞానమే ***(తేన భజనం భక్తిః ! సా చ జ్ఞానమ్).*** భగవద్భక్తి వలన భగవదనుగ్రహము ప్రాప్తిస్తుంది. ఈశ్వరానుగ్రహము వలన జ్ఞానము కలుగుతుంది.

భక్తి అనేది పరమ ప్రేమ స్వరూపము. ప్రేమ ఎక్కడ ఉంటుందో మనస్సు అక్కడే ఉంటుంది. ప్రియమైన వస్తువు నుండి మనస్సు దూరం కాలేదు. భక్తి ద్వారా పరమేశ్వరుడే ప్రియాతిప్రియంగా మారి నపుడు, పరమేశ్వరునికి దూరంగా మనస్సు మనుగడను సాగించ లేదు. అదే అనన్య భక్తి. అట్టి భక్తియోగము చేత పరమేశ్వరునే ఏకైక ధ్యేయంగా భావించి సేవించడం జరుగుతుంది. వాసుదేవుడే నాకు గతి, వాసుదేవునికి మించిన దైవము లేదు అనే అనన్యభక్తి ఏర్పడి నపుడు మోక్షమే పరమావధిగా ఆ భక్తి సాగుతూ ఉందని భావము.

ఉత్కృష్టమైన వాడు వాసుదేవుడే అనే భక్తి కారణంగా అమానిత్వం సిద్ధిస్తుంది. అట్టి భక్తిలో భక్తుడు వినమ్రుడు అవుతాడు కనుక అదంభిత్వం ప్రాప్తిస్తుంది. అందరిలో వసించే వాసుదేవుని ఆరాధించుట చేత ఎవరినీ భక్తుడు హింసించ లేడు. అహింసా జీవనాన్ని గడుపుతాడు. వాసుదేవుని అనుగ్రహం చేతనే సర్వమూ సమకూరుతూ ఉంది అనే దృఢ నిశ్చయము ఏర్పడి ఉన్నందున, పరిస్థితులను, ప్రతికూలాలను సైతం అవగాహనతో సంతోషంగా సహిస్తాడు. అట్టి వాసుదేవ భక్తుడు కుటిలత తెలియని వాడు కనుక ఋజు మార్గంలో వర్తిస్తాడు. భగవంతుని జ్ఞానమును పొందే ప్రయత్నంలో ఆచార్యుని అర్చిస్తాడు. బాహ్యాభ్యంతరాలలో శుచిర్భూతుడై ఉంటాడు. దేనికీ చలించక, భగవంతుని అండతో సదా నిగ్రహవంతుడై ఉంటాడు. భగవంతుని యందే ఆసక్తి కనుక విషయాలలో విరక్తుడై ఉంటాడు. సర్వకర్త సర్వేశ్వరుడే అనే భావనా ప్రభావం చేత అహంకార రహితుడై ఉంటాడు. భగవంతుని కన్నా అన్యమైనది అనిత్య మని భావించి నిర్లిప్తుడై జీవనాన్ని సాగిస్తాడు. తన దంటూ లేక, తన వారంటూ ఎవరినీ భావించక, అతి స్నేహం లేకుండా, ప్రాప్తించే సమస్తమును ప్రసాదంగా స్వీకరిస్తూ, ప్రశాంత చిత్తముతో సమచిత్తుడై ఉంటాడు. ఇదే భక్తి వైభవము. ఇలా అనన్య యోగము చేత కొనసాగే వాసుదేవ భక్తిలో అన్ని జ్ఞాన సాధనలు ఒదిగి ఉంటాయి. కనుకనే, భక్తి లేకుండా ముక్తిని సాధించడం దుస్సాధ్యము. వాసుదేవుని యందు అచంచల భక్తి గల వారు శీఘ్రంగా జ్ఞానులై తరిస్తారు. అది లేని వారు తరించ లేరు అని వాసుదేవుడే తన దివ్య వాణిని వినిపించాడు.

ప్రీతి ర్న యావ న్మయి వాసుదేవే న ముచ్యతే దేహ యోగేన తావత్ !

'వాసుదేవుడ నైన నా యందు ఎంత వరకు ప్రీతి కలగదో, అంతవరకు దేహ సంబంధము గల జన్మల నుండి విముక్తి లభించదు'.

(17) వివిక్త దేశ సేవిత్వము

ఏకాంత ప్రదేశము నందు జీవించే అలవాటును, ఆసక్తిని కలిగి ఉండటము వివిక్త దేశ సేవిత్వము.

సాధకుడు తన సాధనను నిర్విఘ్నంగా కొనసాగించడానికి ప్రదేశం కూడా అనుకూలంగా ఉండాలి. ఏకాంత ప్రదేశము ఆధ్యాత్మిక సాధనలకు అనుకూలము.

ఏకాంతము అనే పదములో ఏకమే ప్రధాన మైనప్పటికి అది రెండు విధాలుగా ఉంటుంది. మొదటిది బాహ్య ఏకాంతము. రెండవది అభ్యంతర ఏకాంతము. బాహ్యంలో జన సంసర్గము లేకుండా, ప్రశాంతమైన, విఘ్న రహితమైన ప్రదేశము బాహ్య ఏకాంతము. అలాంటి ప్రదేశము అరణ్య, నదీ తీర, గుహాదు లనే సహజ ప్రదేశాలు కావచ్చు. లేదా, ప్రయత్నము ద్వారా, శుద్ధి కార్యం ద్వారా సంస్కరించు కొనిన ప్రదేశాలు, దేవాలయాలూ కావచ్చు **(వివిక్తః స్వభావతః సంస్కారేణ వా అశుచ్యాదిభిః రహితః).** అట్టి ప్రదేశాలలో భగవంతుని సేవించాలి. ఇది బాహ్య ఏకాంతము.

ఇక రెండవది అభ్యంతర ఏకాంతము. మనస్సులో విషయ చింతనము లేకుండా, నిరంతరము పరమేశ్వరుని స్మరణము నందే ఉండుట అభ్యంతర ఏకాంతము. ***ఏకః అంతః నిశ్చయో యత్ర తత్ ఏకాన్తమ్*** - అంతర్యంలో ఒక్క పరమేశ్వరునికి సంబంధించిన నిశ్చయ భక్తితో ఉండటము అసలైన ఏకాంతము. అదే అభ్యంతర ఏకాంతము. ఇది కూడా జ్ఞాన సాధనమే.

(18) అసంగ జీవనము

జనసంగము నందు ఆసక్తి లేకపోవడము అరతిర్జన సంసది అనే పద్దెనిమిదవ లక్షణము. ఇక్కడ జనసంగము అంటే పామర జన సంగము అని అర్థము. పామరులు ***(ప్రాకృతానాం)***. సంస్కారహీనులు ***(సంస్కార శూన్యానామ్)***, అవినీతిపరులు ***(అవినీతానాం)*** అయిన పామరజనుల సమూహాన్నే ఇక్కడ జన సమూహము ***(జన సంసత్)*** అనడం జరిగింది. అంతేగాని ఉత్తమ సంస్కారులు, వినయ సంపన్నులు, భక్తులు అయిన జనుల విషయం కాదు. ఎందుకంటే అట్టి సత్పురుషుల సాంగత్యము జ్ఞానానికి ఉపకారకంగా ఉంటుంది ***(తస్యాః జ్ఞానోపకారకత్వాత్).***

సత్పురుషుల సాంగత్యము జ్ఞానానికి ఎలా ఉపకరిస్తుందో, అలాగే దుష్టుల సహవాసము జ్ఞానానికి ప్రతిబంధకము అవుతుంది. జ్ఞాన ప్రతిబంధకాలను తొలగించుకోవడము కూడా జ్ఞాన సోపానమే కావడం చేత, దుష్టుల సంగత్యము నందు ఆసక్తి లేకపోవడం కూడా జ్ఞాన సాధనంగా చెప్పబడింది ***(ప్రాకృత జన సంసది అరతిః జ్ఞానార్థత్వాత్ జ్ఞానమ్).***

తరువాత శ్లోకంలో చివరి రెండు జ్ఞాన విషయాలను చెప్పి, జ్ఞానమనే అంశాన్ని ముగిస్తున్నాడు.

అధ్యాత్మజ్ఞాన నిత్యత్వం తత్త్వజ్ఞానార్థ దర్శనమ్ ।
ఏత జ్ఞాన మితి ప్రోక్త మజ్ఞానం యదతోఽ న్యథా ॥ 11

అధ్యాత్మజ్ఞాన నిత్యత్వం-తత్త్వజ్ఞానార్థ దర్శనం
ఏతత్-జ్ఞానం-ఇతి-ప్రోక్తం-అజ్ఞానం-యత్-అతః-అన్యథా

అధ్యాత్మజ్ఞాన నిత్యత్వం	= ఆత్మజ్ఞాన నిత్యత్వము	అతః	=	దీని కంటెను
తత్త్వజ్ఞానార్థదర్శనం ఏవ చ	= తత్త్వజ్ఞాన స్వరూపానుభవము	అన్యథా	=	వేరుగా
ఏతత్	= ఇదియంతయు	యత్	=	ఏదియో
జ్ఞానం	= జ్ఞానము	తత్	=	అది
ఇతి	= అని	అజ్ఞానం	=	అజ్ఞానము
ప్రోక్తం	= చెప్పబడినది			

అర్జునా! అధ్యాత్మ జ్ఞాన నిత్యత్వము, తత్త్వ జ్ఞానార్థ దర్శనము - దీనినే జ్ఞానం అన్నారు. దీనికి అన్యంగా ఏది ఉన్నా అదంతా అజ్ఞానమే.

వ్యాఖ్య

(19) అధ్యాత్మ జ్ఞాన నిత్యత్వము

ఆత్మానాత్మ వివేక జ్ఞానము అధ్యాత్మ జ్ఞానము. అట్టి జ్ఞానము నందు నిరంతరము ఉండటము అధ్యాత్మ జ్ఞాన నిత్యత్వము ***(ఆత్మాది విషయ జ్ఞానమ్ అధ్యాత్మ జ్ఞానమ్; తస్మిన్ నిత్య భావః నిత్యత్వమ్).*** అట్టి వివేక జ్ఞానము సాధన చతుష్టయ సంపదను సముపార్జించుకొని, జ్ఞాన యోగ్యతను పొంది 'తత్త్వమసీతి' వాక్యార్థ జ్ఞానానికి కారణ మవుతుంది. అనిత్యమును త్యజించి, నిత్యవస్తువును వెంబడించే అవకాశమును కల్పిస్తుంది.

కాలగత మైనది ఏదైనా కాలంలో నశించి పోతుంది. అది అనిత్యము. దీనిని యుక్తి ద్వారా కూడా తెలుసుకోవచ్చు. శాస్త్ర పఠనము ద్వారా నైతే మరింత స్పష్టత కలుగుతుంది. ఎలాగైనా, అనిత్య మనేది ఏమిటో అర్థమైతే, ఇంతవరకు జీవితంలో మనం ఆశించింది, పొందింది, పోగొట్టుకున్నది అంతా అనిత్యమే అనే వివేకం ఏర్పడుతుంది.

ఇహ పరలోకాలలో ఏది పొందినా కాలం లోనే పొందడం జరుగుతుంది కనుక కాలం లోనే పోగొట్టు కోవడం కూడా జరుగుతుంది. అంతా అనిత్యం గానే అర్థ మవుతు న్నప్పుడు మరి నిత్య మేమిటి? అనే ప్రశ్న పుడుతుంది. ఇహ పరాలు కాకుండా ఏది మిగిలి ఉందో అదే నిత్యం కావాలి. నిత్య వస్తువు కావాలి. అదేదో కాదు. అన్వేషించే వాడి స్వరూపమే. ఆలోచించే వాడి స్వరూపమే. విచారించే వాడి స్వరూపమే. అదే ఆత్మ. అదే నిత్యవస్తువు. కనుక, ఇక చేయవలసింది ఒక్కటే. ఆత్మను దర్శించడము. అదే నిత్యదర్శనము ***(ఆత్మా వా అరే ద్రష్టవ్యః).*** ఆత్మ జ్ఞాత యొక్క స్వరూపమే కనుక ఆత్మ జ్ఞానరూపంలో ఉంది. కనుక ఆత్మను దర్శించడము అంటే వేదాంత శాస్త్రాన్ని శ్రవణం చేయడం అని అర్థము ***(శ్రోతవ్యః).*** అలా నిరంతరము శ్రవణ మనన నిదిధ్యాసలలో ఉండటమే అధ్యాత్మ జ్ఞాన నిత్యత్వము.

(20) తత్త్వ జ్ఞానార్థ దర్శనము

సంసార వినాశ రూపమైన మోక్షమే తత్త్వజ్ఞానము ***(తత్త్వ జ్ఞానం, తస్య అర్థః మోక్షః సంసారోపరమః).*** దానిని గూర్చి ఆలోచించడమే తత్త్వజ్ఞానార్థ దర్శనము ***(తస్య ఆలోచనం తత్త్వ జ్ఞానార్థ దర్శనమ్).*** తత్త్వజ్ఞానము యొక్క ఫలితాన్ని గూర్చి ఆలోచించడం చేత దానికి అవసరమైన అమానిత్వాది సాధనలను అనుష్ఠించడంలో ప్రవృత్తి ఏర్పడుతుంది. జ్ఞానసాధనలు సమకూరితే ***సాధనమున పనులు సమకూరు ధరలోన*** అన్నట్లు జ్ఞానం సిద్ధిస్తుంది. జ్ఞానం కలిగితే మోక్షం ప్రాప్తిస్తుంది. దుఃఖ హేతువైన సంసారము సమూలంగా నశిస్తుంది.

కనుక, మోక్షైక కాముకులైన సాధకు లందరు జ్ఞాన సాధనములైన అమానిత్వాది జ్ఞాన విషయాలను అభ్యసించాలి. అమానిత్వ అదంభిత్వాదులు మొదలుకొని తత్త్వజ్ఞానార్థ దర్శనము వరకు ఇరవై సాధన లేవైతే చెప్పబడ్డాయో అదంతా జ్ఞానమే. ఆత్మజ్ఞానానికి ఉపకరించడము చేత ఈ సాధనలు కూడా జ్ఞానం అని చెప్పబడ్డాయి ***(ఏతత్ జ్ఞానం ఇతి ప్రోక్తం జ్ఞానార్థత్వాత్).*** ఈ జ్ఞానానికి భిన్నంగా, విపరీతంగా ఉండే మానిత్వం, దంభిత్వం, హింస ఇత్యాదులన్నీ అజ్ఞానం అనబడతాయి.

ఈ విధమైన జ్ఞాన సాధనల ద్వారా తెలియబడే జ్ఞేయ మేమిటి? జ్ఞేయ మేమిటి? చెబుతున్నాడు.

జ్ఞేయం యత్త త్ప్రవక్ష్యామి యజ్ఞా త్వాఽ మృతమశ్నుతే ।
అనాదిమ త్పరం బ్రహ్మ న స త్త న్నాస దుచ్యతే ॥ 12

జ్ఞేయం-యత్-తత్-ప్రవక్ష్యామి-యత్-జ్ఞాత్వా-అమృతం-అశ్నుతే
అనాదిమత్-పరం-బ్రహ్మ-న-సత్-తత్-న-అసత్-ఉచ్యతే

జ్ఞేయం	=	తెలియదగినది	తత్	=	అది
యత్	=	ఏదో	అనాదిమత్	=	ఆది లేనిది
యత్	=	దేనిని	పరంబ్రహ్మ	=	పరబ్రహ్మ
జ్ఞాత్వా	=	తెలిసికొని	సత్	=	సత్తు
అమృతం	=	మోక్షమును	న ఉచ్యతే	=	చెప్ప బడదు
అశ్నుతే	=	పొందుతారో	అసత్	=	అసత్తని
తత్	=	దానిని	న ఉచ్యతే	=	చెప్ప బడదు
ప్రవక్ష్యామి	=	చెబుతున్నాను			

అర్జునా! జ్ఞేయాన్ని గూర్చి చెబుతున్నాను. విను. దానిని తెలుసుకుంటే మోక్షం లభిస్తుంది. అది అనాది. పరబ్రహ్మ స్వరూపము. అది సత్తు కాదని, అలాగని అసత్తు కూడా కాదని చెబుతారు.

వ్యాఖ్య

అమానిత్వాది ఇరవై సాధనలను 'జ్ఞానం' అంటూ వరుసగా పై ఐదు శ్లోకాలలో చెప్పుకున్నాము. అవి దేనిని పొందటానికి సాధనలో ఇప్పుడు చెబుతున్నాడు. పొంద దగినది ఏదో అది ప్రస్తుతము 'జ్ఞేయం' అనే పదంతో తెలుస్తూ ఉంది. ఇక్కడ పొందడము అంటే తెలియడము అని అర్థము. ***యత్ జ్ఞాతవ్యం తత్ జ్ఞేయం*** - ఏది తెలియ దగినదో అది జ్ఞేయం. ఇక్కడ జ్ఞేయం అని చెప్పబడు తున్నది క్షేత్రజ్ఞుడే. క్షేత్రజ్ఞుడే జ్ఞేయవస్తువు; జ్ఞేయరూపుడు.

అమృతఫలం

యత్ జ్ఞేయం తత్ ప్రవక్ష్యామి - ఏది జ్ఞేయమో దానిని చెబుతాను అంటూ క్షేత్రజ్ఞ స్వరూపాన్ని చెప్పడానికి ఉపక్రమించాడు భగవంతుడు. ఇక్కడ **వక్ష్యామి** అనకుండా **ప్రవక్ష్యామి** అంటున్నాడు. 'ప్ర' అనే ఉపసర్గను చేర్చడం చేత **ప్రకర్షేణ వక్ష్యామి** అంటే, యథాతథంగా చెబుతాను; ఉన్న దున్నట్లు చెబుతాను అంటున్నాడు. అలా అనడం వెనుక ప్రయోజన ప్రాశస్త్యాన్ని ప్రధానంగా భావించడమే కారణంగా తెలుస్తూ ఉంది. ***కిం ఫలమ్?*** దాని ఫల మేమిటి అంటే, **యత్ జ్ఞేయం జ్ఞాత్వా అమృతమ్ అశ్నుతే** - జ్ఞేయము ఏదో, దానిని తెలుసుకునే వాడు అమృతత్వాన్ని పొందుతున్నాడు. మరణాన్ని దాటి పోతున్నాడు. అందుచేత, జ్ఞేయమైన క్షేత్రజ్ఞ స్వరూపాన్ని **(ప్రకర్షేణ యథావత్)** చెబుతున్నాడు. పరమేశ్వరుడు చెబుతున్న ఈ జ్ఞేయము, లేదా క్షేత్రజ్ఞ స్వరూపము అమృతత్వమును ఫలంగా కలిగి ఉంది ***(అమృతత్వ ఫలం జ్ఞేయం ఉచ్యతే).***

జ్ఞాతవ్యాలుగా తెలియ దగినవి ఈ ప్రపంచంలో ఎన్నో ఉన్నాయి. అలాగే జ్ఞేయాలూ ఉన్నాయి. అలాంటి వాటిని ఎన్నిటినో మనము తెలుసు కుంటున్నాము. పాఠశాలల్లో చాలా నేర్చుకున్నాము. కళాశాలల్లో మరెన్నో తెలుసు కున్నాము. సమాజంలో ఇంకా ఎన్నిటినో అవధానంతో అర్థం చేసుకుంటున్నాము. అవన్నీ జ్ఞేయాలే. కానీ, ప్రస్తుతం గీతాచార్యుని బోధలో మనం గ్రహిస్తున్నది కూడా జ్ఞేయమే. కానీ, జగత్తులో మనం తెలుసుకొనే జ్ఞేయాలకు, జగదీశ్వరుని బోధలో మనం అర్థం చేసుకుంటున్న జ్ఞేయానికి చాలా తేడా ఉంది.

ప్రపంచంలో తెలిసే వన్నీ పరిమిత మైనవి. ఏదైనా ఒకటి తెలిస్తే, దానికి సంబంధించిన జ్ఞానం కలుగుతుందే గాని, మరొక దానికి సంబంధించిన జ్ఞానము కలగదు. ఏ విషయానికి సంబంధించిన జ్ఞానం కలిగినా, దాని వలన అమృతత్వాన్ని పొందడము అనేది జరగదు. మరణాన్ని దాటించే శక్తి ప్రపంచ విద్యలకు లేదు. కానీ, భగవంతుడు బోధిస్తున్న క్షేత్రజ్ఞ స్వరూపమైన జ్ఞానమును పొందితే, అమృతత్వం ప్రాప్తిస్తూ ఉంది. ఇది సాధారణ మైన విషయం కాదు. కేవలం తెలుసుకుంటే చాలు. మోక్షం సిద్ధిస్తుంది ***(జ్ఞానాత్ మోక్షః).*** ఎందుకో తెలుసా? ఇక్కడ తెలుస్తున్నది సత్యవస్తువుకు సంబంధించిన జ్ఞానము. ప్రాపంచిక విద్యల లాగా అసత్య విషయాలకు సంబంధించిన జ్ఞానం కాదు.

వస్తువు సత్యం కానపుడు, దానికి సంబంధించిన జ్ఞానము కూడా సత్యం కాదు. అసత్య వస్తువు సత్య జ్ఞానాన్ని అందించ లేదు. సత్యవస్తువే సత్య జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. ఆ సత్యవస్తువే ప్రస్తుతం ఇక్కడ జ్ఞేయం గాను, క్షేత్రజ్ఞుడు గాను చెప్పబడుతూ ఉంది. పైగా దాని ప్రభావం, ఫలితం మహాద్భుతంగా, అనూహ్యంగా ఉంది.

అది తెలిస్తే అమృతత్వం లభిస్తుంది. అదేమిటో యథాతథంగా చెబుతాను అంటున్నాడు భగవంతుడు. అది ఏదో ఉన్నది ***(అస్తి).*** కనుకనే చెబుతాను అంటున్నాడు. లేని దానిని ఎలా చెబుతాడు?

మరైతే, ఆ ఉన్నది ఎక్కడ ఉంది? ఎలా ఉంది? ఏ ప్రదేశంలో ఉంది? ప్రపంచంలో మనం ఏది తెలుసుకున్నా ఇలాగే ప్రశ్నించి తెలుసుకుంటున్నాం. కానీ భగవంతుడు చెబుతున్న జ్ఞేయ వస్తువు ఇలా తెలిసేది కాదు. ఎందుకని? అది ప్రాపంచిక వస్తువుల లాగా ఒక ప్రదేశంలో ఉండేది కాదు. ఒక కాలంలో ఉండేది కాదు. ఇదే క్షేత్రజ్ఞ స్వరూపమైన జ్ఞేయ వస్తువు లోని ప్రత్యేకత.

అది ***(తత్)*** అంతటా ఉండే సత్యవస్తువు ***(జ్ఞేయం).*** అంతటా ఉండేది అంటే అనంతమైన వస్తువు అని అర్థం. అనంతమైన దానిని అంతం కలిగిన కర్మల ద్వారా పొంద లేము. కనుక అది కర్తవ్యం కాదు. అనంతమైన దానిని తెలుసుకోవాలి. కనుక అది జ్ఞాతవ్యం.

కావచ్చు. ఏది జ్ఞేయ స్వరూపంగా భగవంతుడు వర్ణిస్తున్నాడో దానిని తెలుసుకోవడం వల్ల, అది మరణ రహితం కనుక మనం కూడా మరణాన్ని దాటి పోతామా? అవును. అదెలా సాధ్యం? తెలుసుకునే వాడు తెలియబడే దాని కన్నా అన్యమైన వాడు కదా! కుండను తెలుసుకున్న వాడు కుండ అవుతాడా? బండను తెలుసుకున్న వాడు బండ అవుతాడా? మరి, అనంతమైన దానిని తెలుసుకున్న వాడు అనంతుడెలా అవుతాడు? అంతం లేని వాడు ఎలా అవుతాడు?

అదే ఇక్కడ పరమాద్భుతమైన జ్ఞేయ విషయ వైభవము! ఇక్కడ ప్రత్యేకంగా అయ్యేది ఏమీ లేదు. ఏదో తెలిస్తే అది మన మెలా అవుతాము? దేనిని తెలుసుకుంటే, దానికి సంబంధించిన జ్ఞానం కలుగుతుంది. అంతేగాని, అట్టి జ్ఞానానికి, అన్యమైన విషయానికి సంబంధం ఎక్కడుంది?

న హి అన్య విషయేణ జ్ఞానేన అన్యత్ ఉపలభ్యతే - ఒక వస్తువుకు సంబంధించిన జ్ఞానం చేత మరొక వస్తువు గ్రహింప బడదు కదా! కుండను తెలుసుకుంటే, నిప్పును తెలుసుకున్నట్లు అవుతుందా? కానే కాదు ***(న హి ఘట విషయేణ జ్ఞానేన అగ్నిః).***

అనంతమైన దానికి మరణం లేక పోవచ్చు. అంతమాత్రాన, దానిని తెలుసుకోవడం చేత, చావుపుట్టుకలు ధర్మంగా గల మనం మరణాన్ని ఎలా దాటగలం? దాటే ఉన్నాము కనుక దాటగలము. అనంత మైనది అమృత

స్వరూపము. దానిని తెలుసుకుంటే మనం అమృత రూపులము అవుతాము అంటే, ఆ అనంత స్వరూపము
మనం అయ్యే ఉన్నాము అని అర్థము. కనుక, ఇక్కడ మనం అది కావడము అంటే, అది మనం అయ్యే
ఉన్నామని తెలియడమే. ఇదే జ్ఞానం. జ్ఞేయానికి సంబంధించిన జ్ఞానము. జ్ఞేయము జ్ఞాతే అనే జ్ఞానము.
అనంతమైన అద్వయ జ్ఞానము. కనుకనే, ***యత్ జ్ఞాత్వా అమృతం అశ్నుతే తత్ జ్ఞానం అహం ప్రకర్షేణ వక్ష్యామి*** -
దేనిని తెలుసుకోవడం చేత నువ్వు అమృతత్వాన్ని పొందుతావో, అట్టి జ్ఞానాన్ని యథావత్ చెబుతున్నాను
అన్నాడు భగవంతుడు. ఇది సత్యం. అక్షర సత్యం. ఉపనిషత్తులు ప్రతిపాదించిన అద్భుత సత్యం. బ్రహ్మమును
తెలుసుకొనే వాడు బ్రహ్మమే అవుతున్నాడు ***(బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి)*** అనే నిత్యసత్యం. ఇంతకీ ఆ బ్రహ్మము
లక్షణ మేమిటి? శ్లోకం యొక్క ద్వితీయ పాదంలో చెబుతున్నాడు.

పరమేశ్వరుడు బోధిస్తున్న జ్ఞేయ రూపము పరబ్రహ్మ స్వరూపము. పరబ్రహ్మ స్వరూపము కనుక ఆది
లేనిది. ఇది, అది అని చెప్పడానికి సాధ్యం కానిది. ఇక దానిని వివరించి విస్పష్టం చేసే విషయాన్ని ప్రస్తుత శ్లోకం
యొక్క ఉత్తరార్థం నుండి వరుసగా ఐదు శ్లోకాలలో చెబుతున్నాడు.

అనాదిమత్

దేని కైతే ఆది ఉందో, ఆరంభం ఉందో అది ఆదిమత్ ***(ఆదిః అస్య అస్తీతి ఆదిమత్).*** దేని కైతే ఆది లేదో,
ఏది ఆరంభము నెరుగదో అది అనాదిమత్ ***(న ఆదిమత్ ఇతి).*** ఆది అంటే కారణము. సర్వమునకు కారణ
మైన తనకు మరొక కారణము లేదు కనుక పరబ్రహ్మము అనాది. ఆది లేని దానికి అంతము ఉండే అవకాశము
లేనందున పరబ్రహ్మము అనంతము. అనంత మైనది నశించదు కనుక అది అమృతము.

బ్రహ్మము ఆది లేని వాడు కనుక అనాది. పుట్టుక లేనివాడు కనుక అజుడు. కారణం లేని వాడు కనుక
కార్యరూపుడు కాడు. అసమాన రూపుడు. అందుకే బ్రహ్మము అనకుండా పరంబ్రహ్మ అన్నాడు.

బ్రహ్మ శబ్దానికి నానా అర్థా లున్నాయి. చతుర్ముఖ బ్రహ్మను బ్రహ్మ అంటాము. ప్రకృతికి బ్రహ్మ
శబ్దాన్ని వాడుతాము. వేదాన్ని బ్రహ్మం అంటాము. ఓంకారాన్ని బ్రహ్మ అంటాము. అలా కాకుండా, అన్నిటికీ
విలక్షణంగా బ్రహ్మమును నిర్దేశించే ప్రయత్నంలో భగవంతుడు **పరంబ్రహ్మ** అని ప్రవచించాడు ***(కార్యకారణ
విలక్షణః నిత్యశుద్ధ బుద్ధ ముక్త స్వభావః).***

సత్తు కాదు - అసత్తు కాలేదు

పరబ్రహ్మము విలక్షణ మైనందున, అది కార్యకారణములకు అతీత మైన నిషేధావధీ సాక్షీ స్వరూపం
కనుక అది సత్త, లేక అసత్త, లేక సదసత్త?

పరబ్రహ్మము సత్తు కాదు అంటున్నాడు ***(న సత్).*** మరి, సత్ కాదు అంటే అసత్ అని అర్థమా? అసత్
అంటే లేనిది అని అర్థము. లేనిది ఉన్న దెలా అవుతుంది? బ్రహ్మము అసత్ అంటే, ***అభావోஉస్తి*** అన్న
ట్లవుతుంది. అంటే, 'లేనిది ఉంది' అని చెప్పినట్లు అవుతుంది. బ్రహ్మము ఉన్నది కనుకనే జ్ఞేయమైంది.
అలాంటి జ్ఞేయ వస్తువు అసత్ అయ్యేందుకు వీలు లేదు. కనుక అది అసత్తు కూడా కాదు ***(న అసత్).*** ఇక
మూడవది అయిన సదసద్వాదము పరస్పర విరుద్ధము కనుక, ఆ రెండిటికి ఏక అధికరణత్వము అసంభవము.
కనుక బ్రహ్మము సత్తు కాదు, అసత్తు కాదు ***(న సత్ న అసత్ ఇతి).***

ఇదేమిటి? ఉంది అనేది ఉంది. అలాగే లేదు అనేది ఉంది. ప్రపంచంలో జ్ఞాన మనేది ఇలాగే ఉంటుంది
(అస్తి నాస్తి ఉభయ బుద్ధ్యనుగత ప్రత్యయ విషయత్వాత్). ఫలానా వస్తువు 'ఉంది' ***(అస్తి)*** అనే జ్ఞాన మైనా

ఉంటుంది. లేదా, ఫలానా వస్తువు 'లేదు' ***(నాస్తి)*** అనే జ్ఞాన మైనా ఉంటుంది. అంతేగాని, రెండూ లేకుండా
ఉండేది ఎలా అర్థ మవుతుంది? అస్తి నాస్తిత్వాలలో ఏదో ఒకటి తెలియని జ్ఞానం ఎలా ఉంటుంది? కనుక
జ్ఞేయమైన పరబ్రహ్మము ఉన్న దైనా కావాలి. లేదా, లేని దైనా కావాలి. అంతేగాని, ఉన్నది కాదు ***(న సత్).*** లేనిది
కాదు ***(న అసత్)*** అనేది సరియైన నిర్వచన మేనా? అనే శంక కలగవచ్చు. ఎందుకంటే, ఏది జ్ఞేయమో, దానిని
తెలుసుకుంటే అమృతత్వం ప్రాప్తిస్తుంది అని భగవంతుడు ఉపదేశించి నపుడు, అట్టి జ్ఞేయ వస్తువు ఉన్నట్లే
కదా! అది లేనిదే అయితే, లేని దానిని తెలుసుకొనే దేముంటుంది? పైగా తెలియనిది ప్రయోజనాన్ని ఎలా
కలిగిస్తుంది? అనేది మరొక శంక.

ఈ శంకలకు లంకె కుదరదు. ఎందుకంటే, ***అన్య దేవ తద్విదితాత్ అథ అవిదితాదధి*** అని ప్రమాణ
వాక్యము. అంటే, అది తెలిసిన దాని కన్నా వేరైనది, అలాగే తెలియని దాని కన్నా అన్యమైనది అని కేనోపనిషత్తు.
పరబ్రహ్మమును శ్రుతులు అలాగే నిర్వచించాయి. విదితావిదితాలకు అతీతం గానే ప్రవచించాయి.

అనిర్వచనీయం

దేనిని గూర్చి మనం చెప్పినా శబ్దం అనివార్యమై ఉంది. శబ్దము ఏదైనా అర్థాన్ని ప్రతిపాదించేందుకే
ఉంటుంది. వినే వారికి శబ్దార్థాలు అలాగే అనుభవానికి అందుతాయి. ఏ శబ్దమైనా జాతి, గుణ, క్రియ,
సంబంధముల తోనే అర్థాన్ని బోధిస్తుంది. అవి లేకుండా శబ్దం ద్వారా అర్థాన్ని అందించడం సాధ్యం కాదు.
దీనిని ఉదహరిస్తూ చెప్పు కుందాం.

గౌః అశ్వః - ఈ శబ్దాలు జాతి వాచకాలుగా అర్థవంతాలు. గోజాతి, అశ్వజాతి అని అర్థం. ***పచతి, పఠతి***
- వంట చేస్తున్నాడు, చదువుతున్నాడు అనే శబ్దాలు క్రియా వాచకాలుగా అర్థవంతాలు. ***శుక్లః కృష్ణః*** - తెలుపు,
నలుపు అనే శబ్దాలు గుణ వాచకాలుగా అర్థబోధకాలు. ***ధనీ గోమాన్*** - డబ్బు గల వాడు, గోవులు కలవాడు అనే
శబ్దాలు సంబంధ వాచకాలుగా అర్థవంతాలు.

పరబ్రహ్మకు జాతి లేదు. లేని దానిని సదాది శబ్దాలతో ఎలా చెప్పగలం? గుణ వాచకాలతో చెబుదా
మంటే బ్రహ్మము నిర్గుణము. క్రియా వాచకాలతో నిష్క్రియాన్ని ఎలా చెప్పాలి? అద్వితీయమైన పరబ్రహ్మమునకు
ఏ సంబంధమును ఆపాదించి నిర్వచించాలి? కనుక జ్ఞేయమైన పరబ్రహ్మము ఉన్నదే అయినా, గుణ క్రియ
జాతి సంబంధాలలో దేనికీ విషయం కాకపోవడం చేత, ఏ శబ్దము చేతను చెప్పబడదు అనడం సమంజసమే
కదా! అలా కాదు అని, శబ్దం చేసే వాక్కు, అర్థం కలిగిన మనస్సు ఏకమై చెట్టపట్టా లేసుకొని ముందు కురికి
మాత్రం సాధించే దేముంటుంది? ***యతో వాచో నివర్తన్తే అప్రాప్య మనసా సహ*** - దేనిని తెలుసుకోలేక మనస్సుతో
కలిసి వాక్కు కూడా వెను దిరుగుతూ ఉందో, అదే పరబ్రహ్మము అని తైత్తిరీయ శ్రుతి చెప్పే ఉంది కదా!
కనుకనే ఉన్న దానిని ఉన్నది అని చెప్పలేక, సత్తు కాదు అంటున్నాము. ఉన్న దానిని లేదు అని ఎలాగూ
చెప్పలేము కనుక అసత్తూ కాదు అంటున్నాము. అనేందు కేముంది? అంతా అనుభూతి ప్రకాశమే.

మరి తెలిసే దెలా? బ్రహ్మము ఎలా ఉన్నట్లు? చెబుతున్నాడు.

సర్వతః పాణిపాదం త త్సర్వతోஉక్షి శిరోముఖమ్ । 13
సర్వతః శ్రుతిమ ల్లోకే సర్వ మావృత్య తిష్ఠతి ॥

సర్వతః-పాణిపాదం-తత్-సర్వతః-అక్షిశిరోముఖం
సర్వతః-శ్రుతిమత్-లోకే-సర్వం-ఆవృత్య-తిష్ఠతి

తత్	=	అది	శ్రుతిమత్	=	చెవులు గలది
సర్వతః	=	అంతట	లోకే	=	లోకము నందు
పాణిపాదం	=	చేతులు కాళ్ళు కలది	సర్వం	=	సమస్తమును
సర్వతః	=	అంతట	ఆవృత్య	=	ఆవరించి
అక్షిశిరోముఖం	=	కళ్ళు, తలలు, నోళ్ళు కలది	తిష్ఠతి	=	ఉన్నది
సర్వతః	=	అంతట			

అర్జునా! ఆయన హస్తాలు, పాదాలు అంతటా ఉన్నాయి. నేత్రాలు, శిరస్సులు, ముఖాలు అన్నిచోట్ల ఉన్నాయి. అంతటా ఆయన చెవు లున్నాయి. సర్వత్ర తానే వ్యాపించి ఉన్నాడు.

వ్యాఖ్య

అనాదిమత్ మొదలైన లక్షణాలతో ప్రతిపాదిత మైన నిరుపాధిక బ్రహ్మ స్వరూపము ***సత్*** శబ్ద ప్రత్యయానికి ఎప్పుడైతే విషయం కాకుండా పోయిందో, బ్రహ్మము ***అసత్*** ఏమో అనే సందేహము అంకురించే అవకాశము లేక పోలేదు. దానిని నివారిస్తూ అది ***న అసత్*** అని సూత్రప్రాయంగా పూర్వ శ్లోకంలో చెప్పిన విషయాన్ని, ***సర్వతః పాణిపాదం తత్*** అనే ప్రస్తుత శ్లోకంలో విస్తరించి చెబుతున్నాడు.

క్షేత్రజ్ఞుని అస్తిత్వము

శరీరము జడము, అచేతనము. దేహాలు అచేతనములు అయినా, దేహాలు, దేహాలలో ఉండే ఇంద్రియాలు చలించడానికి, ఆయా విషయాలలో చరించడానికి ఏ చేతనము కారణమో, అదే క్షేత్రజ్ఞ స్వరూపము. అదే జ్ఞేయముగా చెప్ప బడింది. అలాంటిది లేనిది ఎలా అవుతుంది? కనుక, అది లేనిది కాదు ***(న అసత్)*** అనేది స్పష్టము.

అచేతనము లైన దేహాలకు సత్తా స్ఫూర్తి ప్రదాయక మైన నిర్విశేష పరబ్రహ్మము ఘటమఠాదులలో ఆకాశము లాగా విశ్వమంతా వ్యాపించి ఉంది. తాను చలించకనే అయస్కాంతము ఇనుప సూదిని ఎలా కదిలిస్తూ ఉందో, అలాగే దేహాల లోని హస్తపాదాలను, నేత్రశిరస్సులను, శ్రోత్రములను తన సన్నిధి మాత్రం చేతనే కదిలించి, అవి తమ తమ వ్యాపారాలలో ప్రవర్తించేటట్లు పరబ్రహ్మము తాను ప్రవర్తించకనే ప్రవర్తిస్తూ ఉంది. కనుక అది లేనిది కాదు ***(న అసత్)***. ఉన్నదే. ఉంది. సర్వత్ర ఉంది. సర్వంలో వ్యాపించి ఉంది ***(తిష్ఠతి)***. సర్వ ప్రాణులలో, ప్రాణుల వ్యాపారాలను సాగించే కార్యకరణాలలో అంతటా చలించకుండా ఉంది అనే విషయమును ***తిష్ఠతి*** అనే పదము నిర్ధారణ చేస్తూ ఉంది ***(లోకే ప్రాణాని కాయే సర్వమ్ ఆవృత్య సంవ్యాప్య తిష్ఠతి స్థితిం లభతే)***. అచేతనము లైన ఇంద్రియా లనే ఉపాధుల వ్యవహారాలు చేతనుడు లేకుండా జరిగే ప్రసక్తే లేనందువ, చలించే వృక్ష శాఖలను చూచి గాలి ఉన్నట్లు ఎలా ఊహిస్తామో, ఇంద్రియ చలనాలను బట్టి క్షేత్రజ్ఞుని అస్తిత్వమును నిర్ణయించ వచ్చు ***(సర్వ ప్రాణి కరణోపాధిభిః క్షేత్రజ్ఞ అస్తిత్వం విభావ్యతే)***. కాబట్టి క్షేత్రజ్ఞుడు లేనివాడు కాడు. క్షేత్రోపాధి కారణంగా క్షేత్రజ్ఞుడు అని చెప్ప బడుతున్నాడు. చేతన అస్తిత్వమే క్షేత్రజ్ఞుని అస్తిత్వము కనుక, క్షేత్రజ్ఞుడు లేనివాడు కాడని చెప్పబడినాడు ***(నా స దుచ్యతే)***.

సంప్రదాయ వైభవము

బ్రహ్మము నిర్విశేషము. అద్వయము. అవాఙ్మానస గోచరము. అట్టి బ్రహ్మమునే క్షేత్రోపాధి వలన క్షేత్రజ్ఞుడు అనడం జరిగింది. అంతవరకు స్పష్ట మైంది. కానీ, హస్తపాదాదులు దేహస్థములు కదా? కరణేంద్రియాలు కార్యస్థము లైనపుడు, హస్తపాదాదులు, నేత్రశిరస్సులు, శ్రోత్రములు దేహ ధర్మాలే గాని

ఆత్మధర్మాలు కావు కదా? మరి క్షేత్రజ్ఞ ధర్మాలుగా వాటిని పరిగణించడం, ***సర్వతః పాణి పాదం తత్*** అంటూ హస్తపాదాలను క్షేత్రజ్ఞునికి ఆపాదించడం ఉచిత మేనా? అనే పూర్వపక్షము తలెత్తే ప్రమాదము లేక పోలేదు. దీనిని పరిహరించే ప్రయత్నంలో సంప్రదాయవేత్తలు 'అధ్యారోప అపవాద' న్యాయాన్ని ప్రవేశ పెట్టారు ***(తథా హి సంప్రదాయ విదాం వచనమ్ - అధ్యారోప అపవాదాభ్యాం నిష్ప్రపంచం ప్రపంచ్యతే ఇతి!)***.

బ్రహ్మము నిర్విశేషము, అఖండము కనుక, గుణ, క్రియ, జాతి, సంబంధ రహిత మని పూర్వ శ్లోకంలో చూశాం. అలాంటి బ్రహ్మమునకు ప్రపంచముతో సంబంధం ఉండే అవకాశం లేదు. ప్రపంచము మిథ్యా రూపము. మిథ్య యైన ప్రపంచాన్ని బ్రహ్మము నందు ఉన్నట్లు చెప్పడం అధ్యారోపము. ఆ తరువాత లేని దానిని తొలగించి అద్వితీయ మైన బ్రహ్మమునే ప్రతిపాదించడం అపవాదము. ఈ విధమైన ప్రక్రియలో అద్వయబ్రహ్మము జ్ఞేయంగా నిరూపించ బడుతుంది.

దేహస్థ మైన హస్తపాదాదులు అధ్యారోపంగా క్షేత్రజ్ఞుని యందు కల్పించ బడతాయి. ఆ తరువాత అపవాద ప్రక్రియ ద్వారా తొలగించబడి, నిర్విశేష బ్రహ్మము ప్రతిపాదించ బడుతుంది. ఆరోపాలన్నీ స్వరూప నిర్ణయార్థమే అనే సత్యాన్ని మరచి పోకూడదు.

ఏది ఏమైనా, దూరంగా కారు కదలిపోతూ ఉంది అంటే, కారు నడిపే వాడు మనకు కనిపించక పోయినా, కారు పోతూ ఉంది కనుక కారు నడిపే వాడు కారులో ఉన్నట్లే. అంతమాత్రం చేత వాహనానికి, చోదకునికి సంబంధం లేదు. చోదకుని తెలుసుకో వలసిన పరిస్థితి వచ్చి నపుడు, వాహనానికి భిన్నంగా చోదకుని తెలుసుకోవాలే గాని, వాహన సంబంధముతో కాదు. సంబంధం ఆరోపము. అధ్యారోపము. సంబంధమును తొలగించి స్వరూపమును అర్థం చేసుకోవడం అపవాదము. ఇక ప్రస్తుత శ్లోకాన్ని అధ్యారోపంగా అర్థం చేసుకొని, క్షేత్రజ్ఞుడు లేని వాడు కాడు ***(న అసత్)*** అని నిర్ణయించుకుంటాం.

సర్వతః పాణిపాదమ్

జ్ఞేయము, క్షేత్రజ్ఞ స్వరూపము అయిన అది ***(తత్)*** అంతట హస్తపాదాలు కలది ***(సర్వతః పాణయః పాదాః చ అస్య ఇతి సర్వతః పాణిపాదం)***. హస్తపాదాల రూపంలో తెలుస్తున్నది క్షేత్రజ్ఞుడే. కనుక అన్ని హస్తాలూ తనవే. అన్ని పాదాలూ తనవే. చేతన రూపంలో తాను ఉండటం చేతనే హస్తపాదాలు చలిస్తున్నాయి. హస్తపాదాలు అంటే మానవుల వేనా? మకరమైనా, మర్కటమైనా, మశకమైనా, మత్తేభమైనా, ఎక్కడ హస్తపాదాలు చలించినా, అక్కడ చేతన అస్తిత్వం అనివార్యం కనుక, అంతట హస్తపాదాల రూపంలో జ్ఞేయమే ఉంది. బ్రహ్మమే ఉంది ***(సర్వతః పాణిపాదం తత్ జ్ఞేయం)***. అన్ని జీవరాసుల హస్తాలు జ్ఞేయానికి సంబంధించినవే. సర్వ ప్రాణుల పాదాలు క్షేత్రజ్ఞునివే. కనుకనే జ్ఞేయ రూపుడైన పరమాత్మను ***విశ్వతో బాహుః ఉత విశ్వతః పాత్*** అని అభివర్ణించింది శ్వేతాశ్వతరోపనిషత్తు *(శ్వే. ఉ; 3 - 3)*.

హస్తపాదాలు అనేవి కర్మేంద్రియాలు. కనుక వాటిని అనుక్త కర్మేంద్రియాలకు ఉపలక్షణంగా అర్థం చేసుకోవాలి.

సర్వతః అక్షి శిరోముఖమ్

అంతట నేత్రాలు, శిరస్సులు, ముఖాలు కలిగి ఉన్నందున అది సర్వతోక్షి శిరోముఖంగా ఉంది ***(సర్వతః అక్షీణి శిరాంసి ముఖాని చ యస్య తత్ జ్ఞేయమ్ సర్వతోక్షి శిరోముఖమ్)***. అన్ని కళ్ళ ద్వారా చూచేది తానే. తన స్వచేతనంతో తానే సర్వమును దర్శిస్తూ ఉంది అని అర్థము. చూపు ఏది అయినా వెనుక ఊపు తనదే. రూపు తనదే ***(సర్వతః సర్వం స్వచైతన్యేన పశ్యతి ఇతి)***. అందుచేత పరమాత్మ సర్వతః చక్షువు.

అక్షి పద ప్రయోగము అనుక్తమైన సర్వ జ్ఞానేంద్రియములకు ఉపలక్షణము. బాహ్యేంద్రియా లైన
శ్రోత్రాదులే కాకుండా, అంతరేంద్రియా లైన మనోబుద్ధులను కూడా గ్రహించాలి **(శ్రోత్రస్య శ్రోత్రం మనసో**
మనోయత్ వాచోహవాచం స ఉ ప్రాణస్య ప్రాణః - కేనోపనిషత్తు).

ఇక శిరముల ప్రస్తావన అనేకత్వ సూచితము. అన్ని శిరస్సులు అంటే అనేకములు కదా! చతుర్ముఖ
బ్రహ్మ మొదలు పిపీలికం వరకు ఉన్న శిరస్సు లన్నీ తనవే. నామరూపాలతో ఉపాధి భేదం గోచరిస్తూ నానాత్వం
తెలుస్తూ ఉన్నా, ఘట మఠాదులనే ఉపాధులలో ఆకాశము ఎలా ఏకమై భాసిస్తూ ఉందో, అలాగే జ్ఞేయము సర్వ
శిరస్సులలో, ముఖాలలో శోభిస్తూ ఉంది. అన్ని శ్రోత్రములు తనవి గానే భాసిస్తూ, సర్వత్ర తానే వ్యాపించి
ఉంది. అంటే, ఉపాదాన కారణమైన మాయను ఉపాధిగా గ్రహించి, కారణ రూపంలో జ్ఞేయమే విశ్వమంతా
వ్యాపించి ఉంది అని భావము **(కారణత్వేన సర్వత్ర వ్యాప్తత్వాత్).**

అధ్యారోప కారణంగా ఉపాధులైన ఇంద్రియ సముదాయాన్ని జ్ఞేయము నందు ఆరోపించడం జరిగిందే
గాని, జ్ఞేయము నందు హస్తపాదా లున్నాయని భావించ కూడదు. అదే తరువాత శ్లోకం.

సర్వేన్ద్రియ గుణాభాసం సర్వేన్ద్రియ వివర్జితమ్ । 14
అసక్తం సర్వభృ చ్చైవ నిర్గుణం గుణభోక్తృ చ ॥

సర్వేంద్రియ గుణాభాసం-సర్వేంద్రియ వివర్జితం
అసక్తం-సర్వభృత్-చ-ఏవ-నిర్గుణం-గుణభోక్తృ-చ

తత్	= అది	అసక్తం	= సంబంధము లేనిది
సర్వేంద్రియ గుణాభాసం	= సకల ఇంద్రియముల గుణములను ప్రకాశింప జేయునది	సర్వభృత్	= అన్నిటినీ భరించేది
సర్వేంద్రియ వివర్జితం	= సర్వేంద్రియ రహితము	నిర్గుణం ఏవ చ	= త్రిగుణరహితమై కూడ
		గుణభోక్తృ చ	= గుణముల ననుభవించు నది

అర్జునా! క్షేత్రజ్ఞుడు సర్వేంద్రియ గుణాభాసుడు. అంతేనా! సర్వేంద్రియ వివర్జితుడు కూడా. అసక్తుడు. సర్వ భర్త. నిర్గుణుడు. గుణభోక్త కూడా.

వ్యాఖ్య

జ్ఞేయము ఎలా అసత్తు కాదో పూర్వ శ్లోకంలో చూశాం. క్షేత్ర వ్యాపారాలను, వ్యవహారాలను ఆధారం
చేసుకొని క్షేత్రజ్ఞుడైన జ్ఞేయము లేనిది కాదు *(న అసత్)* అని అర్థం చేసుకున్నాం. అంటే క్షేత్ర ధర్మాలు
జ్ఞేయంలో ఉన్నట్లేనా? అనే శంక ఏర్పడుతుంది. ఆత్మ అట్టి ధర్మాలతో ఉన్నది కాదు అనేది అర్థం కావాలి *(న*
సత్). ఇంతకీ అది సత్త లేక అసత్త. రెండూనూ. అదెలా సాధ్యం? అధ్యారోప అపవాద న్యాయం ద్వారా
సాధ్యమే నని పూర్వ శ్లోకం లోనే అర్థమైంది. అంటే, పరమార్థతః తనలో ఏ వ్యాపారాలు లేకపోయినా, మాయోపాధి
చేత సర్వ వ్యవహారాలు తనవి గానే భావింప బడుతున్నాయి. ఆరోప దృష్టితో కల్పించ బడినవి స్వరూప
దృష్టిలో లేనివే అవుతున్నాయి. ఉపాధి దృష్టిలో కరణ సహితంగా, గుణ సహితంగా అర్థమౌతున్న జ్ఞేయ
రూపుడైన క్షేత్రజ్ఞుడు నిరుపాధికంగా చూచి నపుడు కరణ రహితుడుగా, గుణ వర్జితుడుగా తెలుస్తూ ఉన్నాడు.
కనుక క్షేత్రజ్ఞుడు ఆరోప దృష్టిలో గుణ సహితుడు. స్వరూప దృష్టిలో గుణ రహితుడు. గుణాతీతుడు. ఈ
సత్యాన్ని విరోధ భాసాలంకారముతో ప్రస్తుత శ్లోకంలో విస్పష్టం చేసి, ఆ తరువాత వరుసగా నాలుగు శ్లోకాలలో
క్షేత్రజ్ఞ స్వరూపాన్ని విస్తారంగా ఆవిష్కరిస్తున్నాడు.

గుణ సహితుడు

క్షేత్రోపాధి జడము. ప్రకాశ రహితము. అయినను చేతనము వలె వ్యవహారంలో చరిస్తూ ఉంది. అట్టి
చేతనత్వము క్షేత్రానిదా? క్షేత్రజ్ఞునిదా? కాలిన ఇనుప గుండును చూచి నపుడు *(తప్త అయః పిండః)* ఎర్రగా,
ప్రకాశవంతంగా గోచరించే ఆ ఇనుప గుండులో ఉన్న దాహకశక్తి, ప్రకాశత్వము ఇనుపగుండుకు
సంబంధించినవా? లేక అగ్నికి సంబంధించినవా? అనేది మీమాంస. అవి అగ్నికి సంబంధించినవే గాని,
సహజంగా చల్లని గుణము గలది, గుండ్రని ఆకారము కలది అయిన అయః పిండానికి సంబంధించినవి
కావు. అలా అన్నప్పుడే, అగ్ని అయఃపిండం కన్నా అన్యమైనది అని ధృవ పడింది. అగ్ని అయః పిండంలో
వ్యాప్తమై ఉందే గాని, అయః పిండంతో వ్యాపృతం కాదు; అంటే సంబంధించినది కాదు.

అగ్నికి అయఃపిండము ఉపాధి మాత్రమే. వాస్తవానికి అగ్ని నిరుపాధికము. ఉపాధి ధర్మాలను అగ్ని
యందు ఆరోపించి నపుడు అగ్ని గుండ్రముగా ఉంది అంటున్నాము. ఇదే అధ్యారోపము.

అగ్నికి అయః పిండము ఉపాధిగా ఉన్నందున, అయః పిండమును ఆధారం చేసుకొని అగ్ని యొక్క
అస్తిత్వాన్ని నిర్ణయిస్తున్నాము. ఇక్కడే ఉపాధి ధర్మాలను జ్ఞేయము నందు ఆరోపించడం జరుగుతుంది. ఇలా
అధ్యారోపంలో ఆరోపించ బడిన ధర్మాలను, స్వరూప దృష్టిలో అగ్నిని నిరూపాధికంగా అర్థం చేసుకోవడం
చేత, అపవాద న్యాయంతో తొలగిస్తున్నాము.

అలాగే జ్ఞేయ రూపుడైన క్షేత్రజ్ఞునికి సర్వేంద్రియాలు, మనోబుద్ధులు ఉపాధులుగా ఉన్నాయి. ***అహం***
పశ్యామి - నేను చూస్తున్నాను, ***అహం గచ్ఛామి*** - నేను పోతున్నాను అనే ఇంద్రియ వ్యాపారాలకు, ***అహం***
చింతయామి - నేను చింతిస్తున్నాను అనే మనో సంకల్పాలకు చేతనము ఆధారము. క్షేత్రజ్ఞుడు ఉపాధిలో
చేతనంగా వ్యాపించనిదే వ్యవహారాలు సాగవు. అలాగని ఉపాధులలో జరిగే వ్యవహారాలకు, చేతనానికి
సంబంధం లేదు. కారణం, ఉపాధులు లేకున్నా నిరుపాధికంగా చేతనము ఉండటమే. అయినా, ఉపాధి ధర్మాలను
జ్ఞేయ రూపుడైన క్షేత్రజ్ఞుని యందు ఆరోపించడం జరుగుతూ ఉంది. ఈ ఆరోప దృష్టిలో క్షేత్రజ్ఞుడు గుణ
సహితుడుగా తెలుస్తూ ఉన్నాడు. అంతేకాదు, ఉపాధి సహితంగా అర్థం కావడం చేత, అకర్త యైన జ్ఞేయ
రూపునిలో కర్తృత్వము కూడా ఆరోపించ బడుతూ ఉంది. కన్ను చూస్తూ ఉన్నా, కన్ను ద్వారా మనస్సు చూస్తూ
ఉన్నా, ***అహం పశ్యామి*** - 'నేను చూస్తున్నాను' అంటూ చూచే లక్షణాన్ని ఆత్మ యందు ఆరోపించడం
జరుగుతూ ఉంది. వాస్తవానికి ***నైవ కించిత్ కరోమీతి*** - 'నేను ఏమీ చేయడం లేదు' *(5 వ అ - 8 వ శ్లో)*
అనేదే జ్ఞేయ లక్షణము.

మరి, చేతనము వల్లనే కదా ఇంద్రియ వ్యాపారాలన్నీ సాగుతున్నాయి? అలాంటప్పుడు, క్షేత్ర వ్యాపారాలు
క్షేత్రజ్ఞునికి సంబంధించినవి కాకుండా ఎలా పోతాయి? అనేది శంక. అందుకు, అతడు సర్వ వ్యాపార రహితుడు,
సర్వేంద్రియ వివర్జితుడు అయిన నిరుపాధిక సత్తా స్వరూపము కనుక, అనేది సమాధానము. క్షేత్రజ్ఞుడు
సర్వేంద్రియ గుణాభాసుడే కాడు. సర్వేంద్రియ వివర్జితుడు కూడా.

గుణ రహితుడు

క్షేత్రోపాధిని ప్రకాశింప చేస్తున్నా, ఇంద్రియాలలో వ్యాప్తమై ఉన్నా, క్షేత్ర వ్యవహారంతో, ఇంద్రియ
వ్యాపారాలతో వ్యాపృతం కానందున (సంబంధము లేనందున), జ్ఞేయము సర్వేంద్రియ వివర్జితము. సర్వ
కరణ రహితము. జ్ఞానేంద్రియ, కర్మేంద్రియ, అంతఃకరణేంద్రియ వివర్జితము. అందుచేత జ్ఞేయము గుణ
రహితము ***(అతః న కరణ వ్యాపారైః వ్యాపృతం తత్ జ్ఞేయమ్).***

జ్ఞేయ సన్నిధి లోనే ఇంద్రియ వ్యాపారాలు సాగుతాయి. చేతనము లేకపోతే, క్షేత్ర వ్యవహారము నడవదు అనడానికి శవమే సాక్ష్యము. కానీ జ్ఞేయానికి ఉపాధి అవసరము లేదు. ఉపాధి లేకపోయినా చేతనము చలిస్తుంది. చరిస్తుంది.

అపాణి పాదో జవనో గ్రహీతా పశ్య త్యచక్షుః స శ్రుణో త్యకర్ణః

హస్తపాదాలు లేకపోయినా అది వేగంగా పయనిస్తుంది. కళ్ళు లేకుండా చూస్తుంది. చెవులు లేకుండా వింటుంది అన్నది శ్వేతాశ్వతరోపనిషత్తు. ఈ మంత్రాన్ని ఇంద్రియాలు లేకపోయినా చేతనము నడక సాగిస్తుంది అని అర్థం చేసుకోకూడదు. ఉపాధులను చలింప చేసే శక్తి కలది అని మాత్రమే అర్థం చేసుకోవాలి. స్వరూపతః చేతనము సర్వగత మైనది కనుక ఏ చలనమూ లేనిది అని అర్థం చేసుకోవాలి. ఇక్కడ మరొక సూక్ష్మ విషయం ఉంది.

ఇంద్రియాలు, మనోబుద్ధుల చలనానికి చేతనము కారణమై ఉంది కనుక, కార్యములో ఉన్నదంతా కారణమే కాబట్టి, కార్య లక్షణాలైన గుణాలు కారణమైన గుణిలో ఉండి తీరాలి అని భావించడానికి వీలు లేదు. ఇక్కడ సంబంధము కేవలం అధ్యస్త మనే విషయాన్ని విస్మరించ కూడదు.

గుణాలలో ఉన్నది చేతనమే కావచ్చు. అలాగని, చేతనములో గుణాలను ఆశించ కూడదు. కార్యాలైన ఆభరణాలలో ఉన్నది కారణమైన సువర్ణమే కావచ్చు. అంతమాత్రం చేత సువర్ణములో ఆభరణా లున్నాయని భావించడానికి వీలు లేదు.

అవస్థాత్రయంలో ఆత్మే ఉంది. జాగ్రత్స్వప్నాలలో సర్వ సంకల్పాలను, గుణాలను ప్రకాశింప చేసేది ఆత్మయే. కానీ సుషుప్తిలో, సమస్తమూ విలీనమైన దశలో గుణా లున్నాయా? సంకల్పా లున్నాయా? సుషుప్తిలో మనసే లేనపుడు గుణ సంకల్పాలు ఎలా ఉంటాయి? గుణాలు లేవు కనుక సుషుప్తిలో చైతన్యము కూడా లేదు అని అనగలమా? చైతన్యము ఉండబట్టే కదా నిద్ర లేస్తూ ఉన్నాము? మనస్సు లేకపోయినా చైతన్యము ఉంది అంటే, ఆ జ్ఞేయము సర్వేంద్రియ వివర్జితము కాదా? కనుక ఆరోప దృష్టిలో సర్వేంద్రియ గుణాభాసంగా తెలుస్తూ ఉన్న జ్ఞేయము స్వరూప దృష్టిలో సర్వేంద్రియ వివర్జితంగా భాసిస్తూ ఉంది ***(సర్వేంద్రియ వ్యాపృతం ఇవ తత్ జ్ఞేయమ్).***

అసక్తుడు

సర్వేంద్రియ శూన్యమైన జ్ఞేయ రూపునికి సంబంధాలు ఉంటాయా? ఉంటే ఎవరితో, దేనితో ఉంటాయి? తన కన్నా అన్యమైనది ఏముందని, ఏదుందని సంబంధాలు ఉంటాయి? ఈ కారణం చేత జ్ఞేయ చైతన్యము అసక్తము. అసక్త మంటే ఏ సంబంధాలు లేనిది అని అర్థము ***(అసక్తం సర్వ సంశ్లేష వర్జితమ్).*** మరి, ఏ విధమైన సంబంధాలు లేనపుడు క్షేత్రాన్ని, ఇంద్రియ సముదాయాన్ని భరించేది ఎవరు? ధరించేది ఎవరు? తానే. జ్ఞేయమే. ఏ సంబంధము లేకుండా భరించేది కనుకనే **అసక్తం సర్వ భృత్** అని చెప్పబడింది. సంబంధము లేనిదే అయినా జ్ఞేయము క్షేత్రాన్ని భరిస్తుంది. ఎలా?

సర్వభృత్

ఏదైతే ఉందో, ఆ సమస్తము ఉన్నట్లే కదా! కనుక, ప్రతిదీ సదాత్మకమే. సత్తా మాత్రమే ***(సదాస్పదం హి సర్వం).*** ప్రతి దానిలో ఉంది, ఉంది అనేది ఉంది. **ఘటః అస్తి సన్ ఘటః, పటః అస్తి సన్ పటః** - కుండ ఉంది, వస్త్రము ఉంది అన్నప్పుడు, ఆ 'ఉంది' అనే జ్ఞానము అంతటా ఉంది కదా! ***(సర్వత్ర సత్ బుద్ధి అనుగమాత్).***

అన్నిటిలో 'ఉంది' అనే ఏ జ్ఞానమైతే అనుగతమై ఉందో అదే సత్తు. కనుక సమస్తమూ సదాత్మకమే. ఏది ఉన్నా దానికి ఆధారంగా ఏదో 'ఉంది'. అది అంతటా ఉంది కనుక, అన్నిటినీ అదే భరిస్తూ **సర్వభృత్** అయింది.

నా అరచేతిలో పండు ఉంది. ఇక్కడ ఉన్న దేమిటి? పండు 'ఉంది'. ఉన్న పండుకు ఆధారంగా చేయి 'ఉంది'. చేయి ఉంది అని తెలియడానికి ఆధారంగా వెలుతురు 'ఉంది'. మరి వెలుతురుకు ఆధారం ఉందా, లేదా? అదేమిటో పద్దెనిమిదవ శ్లోకంలో చూస్తాం. ఇలా ఏదైతే అంతటా 'ఉంది' అనే దానిలో ఉందో, అదే ***సర్వభృత్.*** మరి, భరించే గుణం జ్ఞేయంలో ఉన్నట్లే కదా! జ్ఞేయం భరిస్తూ ఉంది గాని, దానిలో గుణం మాత్రం లేదు. కారణం, అది నిర్గుణం. నిర్గుణం కనుక నిష్క్రియం.

నిర్గుణుడు

నిర్గుణుడు అంటే గుణరహితుడు. సత్త్వ రజ స్తమో గుణాలే త్రిగుణములు. ఈ మూడు వరుసగా సుఖదుఃఖ మోహ హేతువులు. త్రిగుణాలు లేని వాడు క్షేత్రజ్ఞుడు కనుక జ్ఞేయము నిర్గుణము ***(సత్త్వ రజ స్తమాంసి గుణాః తైః వర్జితం తత్ జ్ఞేయం).*** గుణాలు జ్ఞేయానికి ఉపాధి యైన అంతఃకరణ ధర్మాలే గాని జ్ఞేయానికి సంబంధించినవి కావు. జ్ఞేయానికి ప్రకాశ లక్షణమే గాని ప్రవర్తక లక్షణం లేదు. ఇది అర్థం గాక నిర్గుణమైన జ్ఞేయానికి గుణాలను ఆపాదించి అవలోకిస్తారు.

కమలము విరబూస్తుంది. అలా వికసించడం కమల ధర్మమే గాని సూర్యుని ధర్మము కాదు. కమల ధర్మమును సూర్యుని యందు ఆరోపించడం చేత, సూర్యుడు కమలమును వికసింప చేస్తున్నాడు అని సూర్యుడికి కర్తవ్యాన్ని అంట గడుతున్నాం. ఆయనను కమలాప్తుడు, కమల బాంధవుడు అంటున్నాము. సూర్యుణ్ణి కమల బాంధవుడు అనడం ఔచిత్యమే గాని, కమలానికి సూర్యునితో సంబంధాన్ని అంట గట్టడాన్ని కమలం అర్థం చేసుకోలేదు; కమలాప్తుడైన సూర్యునికి అర్థమే కాదు. ఉభయులకూ అర్థం గాని ఈ ఉభయ సంబంధం వల్ల ఎవరికి ఉపయోగమో!

సూర్యోదయంలో పద్మము వికసించ వచ్చు. అది పద్మ ధర్మమే గాని సూర్యుని ధర్మము కాదు. వికసింప చేసే గుణము సూర్యునిలో ఉంటే, కమలమునే కాదు, కలువను కూడా సూర్యుడు వికసింప చేయగలగాలి. ఆరోపణలను ఎవ్వరూ ఆపలేరు. అలాగని, ఆరోపాలను స్వరూపాలుగా ఎవ్వరూ తీర్చి దిద్దలేరు. వికసింప చేసే గుణం సూర్యునిలో ఎలాగైతే లేదో, గుణ ప్రవర్తనము జ్ఞేయములో లేదు. అంటే, గుణాలలో జ్ఞేయం లేనట్లేనా? అలాగని ఎవరన్నారు? ఆత్మలో గుణాలు లేవు అంటున్నాడే గాని, గుణాలలో ఆత్మ లేదు అని అన్నాడా? కనుక జ్ఞేయము నిర్గుణమే కాదు; గుణభోక్త కూడా.

గుణభోక్త

ఆత్మలో గుణాలు లేకపోయినా, గుణాలలో ఆత్మ ఉంది. అందుచేతనే గుణాలు అర్థ మవుతున్నాయి. శబ్దాది విషయాల ద్వారా సుఖదుఃఖ మోహాలుగా మార్పు చెందిన సత్త్వరజ స్తమో గుణాలను గ్రహించడానికి ఆధారము చేతనమే కదా! చేతనము లేకుండా గుణ భోక్తృత్వం ఎలా ఉంటుంది?

రాత్రి పూట దీపం వెలిగించుకొని కార్యాలు నిర్వర్తిస్తూ ఉంటాము. దీపం లేకుండా కార్యాలు సాగుతాయా? అలాగని దీప సన్నిధిలో సాగే కార్యాల ఫలితాలు దీపానికి అందుతాయా? అలాగే నిర్గుణుడైన క్షేత్రజ్ఞుడు గుణభోక్తగా భాసిస్తాడు. గుణాలలో ఉన్నదంతా చైతన్యమే అని గ్రహించి ఆత్మను గుణభోక్తగా దర్శించడము అన్వయము. గుణాలలో ఆత్మ ఉన్నదే గాని, ఆత్మలో గుణాలు లేవు అని గ్రహించి గుణాలను నిరాకరించడము

వ్యతిరేకము. ఇదే శాస్త్రంలో అన్వయ వ్యతిరేక పద్ధతి. అసత్తు కాదు, సత్తూ కాదు అంటూ అద్వయ సత్తా స్వరూపాన్ని జ్ఞేయంగా దర్శించే విధానము.

ఇంకా చెబుతున్నాడు.

బహి రన్తశ్చ భూతానా మచరం చర మేవ చ । 15
సూక్ష్మత్వా త్త దవిజ్ఞేయం దూరస్థం చాన్తికే చ తత్ ॥

బహిః-అంతః-చ-భూతానాం-అచరం-చరం-ఏవ-చ
సూక్ష్మత్వాత్-తత్-అవిజ్ఞేయం-దూరస్థం-చ-అంతికే-చ-తత్

భూతానాం	= ప్రాణులకు	సూక్ష్మత్వాత్	= సూక్ష్మత్వము వలన
బహిః	= బాహ్యమును	అవిజ్ఞేయం	= తెలియ బడనిది
అంతః చ	= లోపలను	దూరస్థం చ	= దూరమున ఉన్నది
అచరం	= చరించనిది	అంతికే చ	= దగ్గర ఉన్నది
చరం ఏవ చ	= చరించునది	తత్	= అది

అర్జునా! అది ప్రాణుల వెలుపల ఉంది. లోపల ఉంది. అది కదలదు. కానీ, కదులుతుంది కూడా. సూక్ష్మం కనుక దానిని తెలుసుకోవడం శక్యం కాదు. అది దూరంగా ఉంటుంది. దగ్గర గానూ ఉంటుంది.

వ్యాఖ్య

జ్ఞేయ వస్తువు అసక్తము, అంటే ఏ విధమైన సంబంధము లేనిది అని పూర్వ శ్లోకంలో చూశాం. ఏ సంబంధము లేని దానిని పొందే దెలా? పొంద లేనపుడు అది జ్ఞేయం ఎలా అవుతుంది? అది జ్ఞేయమే అయితే, దానికి ఉపలబ్ధి స్థాన మేది? అది ఎలా ఉపలబ్ధ మవుతుంది? అనే సందేహాన్ని పరిహరిస్తున్నాడు.

బాహ్యములో ఉంది - ఆంతర్యంలో ఉంది

జ్ఞేయము బాహ్యాభ్యంతరాలలో ఉంది అంటున్నాడు. సాధారణంగా ఒకటి బయట ఉంది అంటే, అది లోపల లేదు అని అర్థము. లోపల ఉంది అంటే బయట లేదు అని అర్థము. బయట లోపల ఉంది అంటే, దేనికి బయట లోపల? అనే ప్రశ్న ఉదయిస్తుంది. దేహానికి బయట లోపల ఉంది అని అర్థము. మరి, బాహ్యంలో, ఆంతర్యంలో ఉంది అంటే, దాని అర్థం మధ్యలో లేదు అనే కదా! ***(బహిః అన్తః చ ఇత్యుక్తే మధ్యే అభావే ప్రాప్తే ఇదమ్).*** కాదు. మధ్యలో కూడా ఉంది. కుండ స్థాయి నుండి చూచి నపుడు ఆకాశం బయట ఉంది, లోపల ఉంది అంటాము. కానీ, ఆకాశం స్థాయి నుండి చూచి నపుడు ఏమనగలం? ఆకాశానికి లోపల బయట ఉందా? అన్నీ ఆకాశం లోనే ఉన్నాయని అర్థం.

దేహంలో క్షేత్రజ్ఞుడు ఉన్నా దేహానికి వేరుగా లేడు. సంచిలో కొబ్బరికాయ లాగా లేడు. కనుక కాయను సంచి నుండి వేరు చేసినట్లు జ్ఞేయాన్ని క్షేత్రం నుండి వేరు చేయలేము. కనుక బాహ్యాభ్యంతరాలలో ఉండట మనే దానిని ఆభరణములో అంతః బహిః బంగారమే ఉన్నట్లు, చరాచరాత్మకమైన క్షేత్ర జగత్తుకు లోపల, బయట జ్ఞేయమే ఉంది అని అర్థం చేసుకోవాలి. కనుక చరము, అచరము రెండు కూడా జ్ఞేయమే.

అచరము - చరము

అచరము అంటే కదలనిది. చరము అంటే కదిలేది. స్వరూపతః జ్ఞేయము స్థిరము, అంటే అచరము.

ఉపాధి దృష్ట్యా స్వభావతః అది చరము, అంటే కదిలేది. రజ్జువు అచరము. అది కదలదు. సర్పము కదుల్తూ ఉంది. అది చరము. చలించే సర్పము కూడా రజ్జువే. కదులు తున్నట్లు కనిపిస్తున్నా, కదిలే సర్పము కదలని రజ్జువు కన్నా అన్యము కానందున, చరము, అచరము రెండూ రజ్జువే. రజ్జువు నందు ఆరోపించ బడిన సర్పము రజ్జువే అయినట్లు, జ్ఞేయము నందు ఆరోపించ బడిన క్షేత్ర జగత్తూ జ్ఞేయమే. బ్రహ్మమే. ***స్వభావతః చరము; స్వరూపతః అచరము.*** మరి, చరాచర మంతా జ్ఞేయమే అయి నపుడు, 'ఇది జ్ఞేయము' అని ఎందుకు తెలియడం లేదు? సూక్ష్మము కావడం చేత తెలియడం లేదు ***(సూక్ష్మత్వాత్ అవిజ్ఞేయం).***

చరాచరము నందు సర్వవస్తు రూపంలో జ్ఞేయమే భాసిస్తూ ఉన్నా, అది ఆకాశం వలె సూక్ష్మం కావడం చేత గ్రహించడం సులభ సాధ్యం కాదు ***(వ్యోమవత్ సూక్ష్మం).*** సూక్ష్మ మైనప్పటికీ, స్వరూపమే కనుక ప్రమాణ జన్య జ్ఞానంతో తెలుసుకొనే అవకాశం ఉండినా, విద్వత్తు లేని వారికి దానిని గ్రహించడం శక్యం కాదు ***(అవిజ్ఞేయం అవిదుషాం).***

దూరస్థము - సమీపస్థము

అవిద్వాంసులకు తెలియ శక్యం కానిది కనుక, జ్ఞేయము వారికి చాలా దూరము ***(అవిజ్ఞాతతయా దూరస్థం).*** ఎప్పుడు కూడా దూరమును బట్టే కాలము. ఐదు కిలోమీటర్లు నడవడానికి మనిషికి గంట పడుతుంది. యాభై కిలోమీటర్లు నడవడానికి పది గంటలు పడుతుంది. కాని, జ్ఞానం లేని వారికి జ్ఞేయం ఎంత దూరము అంటే ఏమి చెప్పగలం? ఎప్పుడూ దూరమే. అలాంటి వారు కొన్ని వేల కోట్ల సంవత్సరాలకు సరిపడే జన్మ లెత్తినా గ్రహించ లేరు అన్నారు ఆచార్యులు ***(అవిజ్ఞాతతయా దూరస్థం వర్ష సహస్ర కోట్యాపి అవిదుషామ్ అప్రాప్యత్వాత్).*** కనుక, కాలమున ఏమి ఉపయోగం? అంధుడు ఎప్పుడు చూస్తాడు అంటే ఏమి చెప్పగలం? కనుక ఇక్కడ ఆశించ వలసింది కాలం కాదు. జ్ఞానం. జ్ఞానం ప్రాప్తిస్తే, జ్ఞేయము స్వరూపమే కనుక, క్రొత్తగా పొందేది కాదు కాబట్టి, ఆత్మయే కనుక, అది సమీపముననే ఉంటుంది. అవిద్వాంసులకు ఎంత దూరమో విద్వాంసులకు ఆత్మ, లేదా జ్ఞేయము అంత సమీపము ***(అన్తికే చ తత్, ఆత్మత్వాత్ విదుషామ్).***

ఇంకా వివరిస్తున్నాడు.

అవిభక్తం చ భూతేషు విభక్త మివ చ స్థితమ్ । 16
భూతభర్తృ చ త జ్జ్ఞేయం గ్రసిష్ణు ప్రభవిష్ణు చ ॥

అవిభక్తం-చ-భూతేషు-విభక్తం-ఇవ-చ-స్థితం
భూతభర్తృ-చ-తత్-జ్ఞేయం-గ్రసిష్ణు-ప్రభవిష్ణు-చ

భూతేషు	= భూతముల యందు	భూతభర్తృ చ	= భూతములను భరించునది
అవిభక్తం చ	= విభజింప బడనిది	గ్రసిష్ణు	= హరించునది
విభక్తం ఇవ చ	= వేరుచేయబడిన దాని వలె	ప్రభవిష్ణు చ	= కలిగించునది
స్థితం	= ఉన్నది	జ్ఞేయం	= తెలియ దగినది
తత్	= అది	తత్	= అది

అర్జునా! అది అవిభక్త మైనా విభక్తంలా ఉంది. ప్రాణులను భరించేది, హరించేది, తిరిగి పుట్టించేది అదే.

వ్యాఖ్య

జ్ఞేయము ప్రాణులకు బాహ్యాభ్యంతరాలలో ఉంది అని పూర్వ శ్లోకంలో చూశాం. అది చరాచరాలలో

ఉంది అని కూడా చెప్పుకున్నాం. సూక్ష్మమైన ఈ సత్యాలు బుద్ధికి పట్టి నపుడు, కొన్ని శంకలు అంకురిస్తాయి. మరి, జ్ఞేయము బాహ్యాభ్యంతరాలలో ఉండే టప్పుడు, నేను - నాది అనే స్ఫురణ జీవులలో తెలుస్తూ ఉందే గాని, బాహ్యంలో తెలియడం లేదు కదా! చరములలో గోచరిస్తూ ఉందే గాని అచరములలో తెలియడం లేదు కదా! కనుక, జ్ఞేయము ఆంతర్యం లోనే ఉంది. బాహ్యంలో కాదు. ఆంతర్యంలో ఉంది కనుక, ఒక్కొక్క దేహంలో ఒక్కొక్క క్షేత్రజ్ఞుడు ఉన్నాడు. ఈ విధంగా ఆత్మలు అనేకము అనే అర్థరహిత మైన నిర్ణయాల వలన అద్వైతం కన్నా భిన్నమైన మతాలు, సిద్ధాంతాలు పుట్టు కొచ్చాయి. ఈ దోషాన్ని పరిహరించి, జ్ఞేయము ప్రాణులలో భిన్నంగా ఉన్నట్లు అజ్ఞాన దశలో గోచరించినా, వాస్తవానికి జ్ఞేయమైన క్షేత్రజ్ఞుడు అభిన్నుడే, అవిభక్తుడే, అద్వయుడే అనే సత్యాన్ని ప్రస్తుత శ్లోకం ఆవిష్కరిస్తూ, బ్రహ్మాభిన్నత్వ విజ్ఞానాన్ని ప్రతిపాదిస్తూ ఉంది.

విభక్తం - అవిభక్తం

అహం, మమేదం - నేను, ఇది నాది అనే చేతనమైన విషయము ప్రాణుల లోనే కనిపిస్తూ ఉన్నందున, దేహాల లోనే తెలుస్తూ ఉన్నందున ***(దేహేష్వేవ విభావ్య మానత్వాత్)***, దేహాలు వేరు వేరుగా ఉన్నవి కనుక, దేహాలలో గోచరిస్తున్న చేతనత్వము కూడా వేరు వేరుగా భిన్నమై ఉందని, విభక్తంగా ఉందని భావిస్తారు. భ్రమిస్తారు. వాస్తవానికి చైతన్యము ఆకాశం లాగా ***(వ్యోమవత్)*** అవిభక్తమే గాని విభక్తం కాదు.

కుండలో ఆకాశ ముంది. దానిని ఘటాకాశము అంటాము. గదిలో ఆకాశ ముంది. దానిని మఠాకాశము అంటాము. ఘట మఠాది ఉపాధుల కారణంగా ఘటాకాశము, మఠాకాశము అని మనం పిలుచుకున్నా, ఆకాశం ఏకమే గాని భిన్నం కాదు; అవిభక్తమే గాని విభక్తం కాదు. అయినా విభక్తంగా ఉన్నట్లు అనిపిస్తుంది. అదే అజ్ఞానము. కుండకు పరిమితమై ఉన్నట్లు గోచరించినా, ఆకాశము ఎలా ఏకమై, అనంతంగా భాసిస్తూ ఉందో, అలాగే దేహాలలో పరిమితంగా తెలుస్తూ ఉండినా, చైతన్యము పరిచ్ఛిన్న దోషము లేనిదై ఆకాశము వలె సర్వగతమై, నిత్యమై ఉంది అని శ్రుతి ప్రబోధము ***(ఆకాశవత్ సర్వగతశ్చ నిత్యః)***.

శ్రుతి ప్రతిపాదించి ఉండవచ్చు. కాని, శ్రుతి ప్రతిపాదిత మైన విషయము అనుభవ వ్యతిరిక్తంగా ఉంది కదా! స్థావర మైన కుండ, బండ, దండ మొదలైన వాటి యందు చేతనత్వ మున్నట్లు ప్రత్యక్షంగా అనుభవానికి అందడం లేదు. అది జీవులలో వ్యక్త మైనట్లు వ్యక్తం కావడం లేదు. అందుచేత, జ్ఞేయమైన చేతనత్వము పరిచ్ఛిన్నమే అని తెలుస్తూ ఉంది కదా!

కాదు. కానే కాదు. జ్ఞేయము ప్రత్యక్ష ప్రమాణం కాదు. అలాగని, ప్రత్యక్ష మైన వన్నీ ప్రమాణాలని భావించడానికి వీలు లేదు. ఆకాశం నీలంగా ఉన్నట్లు ప్రత్యక్ష ప్రమాణానికి అందుతూ ఉంది ***(నీలం నభః)***. అది వాస్తవ మేనా? కలశ జలంలో ప్రతిఫలిస్తూ చంద్రుడు కుంభస్థంగా కనిపిస్తున్నాడు. చంద్రుడు కుండ లోని జలంలో ప్రత్యక్షంగా కనిపిస్తూ ఉన్నాడు కనుక, చంద్రుడు కుండ లోని ప్రదేశానికి పరిమితుడా? ***(ప్రాదేశ మాత్రః చంద్రః)***. మరొక కోణంలో చూస్తే, జలాలలో ప్రతిఫలిస్తున్నాడు కనుక, చంద్రుడు జలాల లోనే ఉన్నాడని, స్థాణువులలో ప్రతిఫలించడం లేదు కనుక అసలు చంద్రుడే లేడని; ఒకవేళ ఉన్నా, ఎన్ని ప్రతిబింబాలున్నవో, అందరు చంద్రులు ఉన్నారని నిర్ణయించడం ప్రమాణ మవుతుందా? సత్య నిర్దేశము అనేది వస్తు నిర్ధారణపై ఆధారపడి ఉంటుందా లేక, ఉపాధిగత ఆరోపిత వస్తు నిర్ణయంపై ఆధారపడి ఉంటుందా?

కనుక, జ్ఞేయము పరిచ్ఛిన్నము, విభక్తము అని చెప్పడం ప్రమాణం కాదు. పరిచ్ఛిన్నత్వానికి ప్రమాణం లేదు. ఏది పరిచ్ఛిన్నమో అది నశిస్తుంది ***(యదల్పం తన్మర్త్యమ్)***. క్షేత్రజ్ఞుడు పరిమితు డైతే నిత్యుడు కాలేడు.

ఒకవేళ పరిచ్ఛిన్నుడే అయితే, విభక్తుడే అయితే, పరిమితాలు నశించినట్లు క్షేత్రజ్ఞుడు కూడా నశిస్తాడు. నశించే వాడు మృతుడు. మృతుడు అమృతుడు కాలేడు. మరి జ్ఞేయమును తెలుసుకుంటే నీవు అమృతత్వాన్ని పొందుతావు *(13 వ అ - 12 వ శ్లో)* అనే భగవ ద్వచనానికి దీని వల్ల విరోధము సంభవించడం లేదా? కనుక క్షేత్రజ్ఞుడు అవిభక్తుడే గాని విభక్తుడు కాడు. కానీ, విభక్త మైనట్లు కనిపిస్తున్నాడు ***(విభక్త మివ)***. ***ఇవ*** అనే పదము చాలా ప్రధాన మైంది. ఇది అర్థమైతే చాలు. క్షేత్రజ్ఞుడు విభజింప బడిన వాని వలె ***(ఇవ)*** తెలుస్తున్నాడే గాని వాస్తవానికి అవిభాజ్యుడే. అవిభక్తుడే అనేది అర్థ మవుతుంది. ఇదే ఉపనిషత్తు నిర్ణయము.

ఏక ఏవతు భూతాత్మా భూతే భూతే వ్యవస్థితః।
ఏకధా బహుధా చైవ దృశ్యతే జల చంద్రవత్॥

అనేక జల పాత్రలలో ప్రతిబింబించిన చంద్రుని ప్రతిబింబాలు అనేకములుగా, విభక్తంగా తెలుస్తూ ఉన్నా, చంద్రుడు అవిభక్తుడే కదా! తన కన్నా అన్యమైన ప్రతిబింబాల కారణంగా చంద్రుడు విభక్తు డెలా అవుతాడు? అలాగే ప్రాణుల యందు ప్రతిఫలించే చేతనత్వము ఉపాధి భేదం వల్ల విభక్తంగా కనిపిస్తున్నా, వాస్తవానికి సర్వభూత స్థితుడైన బ్రహ్మము అవిభక్తమే. అఖండమే. అద్వైతమే. కనుక జ్ఞేయమైన క్షేత్రజ్ఞుడే బ్రహ్మము. ఈ సత్యాన్ని శ్లోకం లోని రెండవ పాదము నిశ్చయిస్తూ ఉంది.

భర్త - హర్త - కర్త

జ్ఞేయ రూపుడైన క్షేత్రజ్ఞుడు ఏకము, అవిభక్తమే కావచ్చు. కానీ, జగత్కారణ మైన బ్రహ్మము కన్నా వేరైన వాడు అని భ్రమించే ప్రమాదం లేక పోలేదు. లేకపోవడ మేమిటి? ఉంది. ఉండబట్టే ద్వైతం విహరిస్తోంది. ఈ భ్రమను తొలగించే ప్రయత్నంలో భాగంగా క్షేత్రజ్ఞుని భూతభర్తగా, భూతహర్తగా, భూతకర్తగా అభివర్ణిస్తున్నాడు.

స్థితి కాలంలో సర్వ భూతాలను భరించే వాడు భూతభర్త ***(భూతాని బిభర్తి స్థితి కాలే)***. సంహార సమయంలో భూతాలను మ్రింగే స్వభావము ***(ప్రలయ కాలే గ్రసిష్ణు గ్రసన శీలమ్)*** కలవాడు భూతహర్త. సృష్టి కాలంలో పుట్టించే స్వభావం కలవాడు భూతకర్త ***(ఉత్పత్తి కాలే ప్రభవిష్ణు చ ప్రభవన శీలం)***. ఇదే జగత్కారణ మైన బ్రహ్మ స్వభావము. కనుక, జగత్తు యొక్క స్థితి లయోత్పత్తికి కారణము క్షేత్రజ్ఞుడు అని చెప్పడం చేత క్షేత్రజ్ఞునికి, జగత్కారణం బ్రహ్మకు భేదము లేదని తెలుస్తూ ఉంది. ఇదే బ్రహ్మాత్మ జ్ఞానము. ఆత్మయే బ్రహ్మము అనే జ్ఞానము. అద్వయ జ్ఞానము.

అద్వయ స్వరూపము

బాగుంది. బ్రహ్మాత్మజ్ఞాన ఫలంగా అభేదమైన అద్వయ సత్తా స్వరూపమే ఉంది అని స్పష్టమైంది. ఇదే వాస్తవ మైతే, అద్వయ మైన బ్రహ్మము నుండి ఏమి పుడుతుంది? ఎలా పుడుతుంది? సృష్టి ఎలా జరుగుతుంది? సృష్టి జరిగే అవకాశం లేనపుడు పోషింప బడేది ఏది? లయించేది ఏది?

ప్రభవము, లేదా పుట్టుక అనే దానిని జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. పుట్టింది అంటే వాస్తవంగా పుట్టింది అని కాదు. పుట్టినట్లుగా ఉంది అని అర్థం. అదే **ఇవ** శబ్ద ప్రయోగము. ఏదీ ప్రభవించక పోయినా, అంతా ప్రభవించినట్లు గోచరించడమే ఇక్కడ ప్రత్యేకత.

రజ్జువు నందు అధ్యస్తము లైన సర్పము, దండము మొదలైనవి ఎక్కడ నుండి పుట్టాయి? రజ్జువు నుండే పుట్టాయి. వాస్తవానికి రజ్జువు నుండి సర్పాదులు ప్రభవించాయా? లేదు. అయినా పుట్టినట్లు కనిపిస్తున్నాయి.

ఇలా కల్పించి పుట్టించేది, పుట్టించినట్లు కల్పించేది రజ్జువే. మాయాకల్పిత సర్పాలకు రజ్జ్వాదు లెలాగో, మిథ్యా జగత్తుకు బ్రహ్మము కూడా అంతే **(యథా రజ్జ్వాదిః సర్పాదేః మిథ్యా కల్పితస్య).**

సర్పాదులు పుట్టినట్లు, ఉన్నట్లు తెలుస్తూ ఉండినా, రజ్జు జ్ఞానంలో అధ్యస్త మైన సమస్తము తిరోభావాన్ని పొందుతూ ఉంది. రజ్జువే అద్వయంగా భాసిస్తూ ఉంది. అలాగే జగదుత్పత్తి స్థితి లయాదులు మాయా మాత్రంగా బ్రహ్మము నందు ఆరోపించ బడుతున్నాయి. అధిష్ఠాన వస్తు దర్శనంలో ఆరోపాలన్నీ అదృశ్య మైనట్లు, అవిభక్త మైన క్షేత్రజ్ఞ స్వరూపం అనుభూతం కాగానే సర్వమూ ఆ స్వరూపంలో ఏకంగా, అవిభక్తంగా ఉంటుంది **(పరే అవ్యయే సర్వ ఏకీ భవన్తి!).**

బ్రహ్మము అవిభక్తంగా, అద్వయంగా శోభించే టప్పుడు కనిపించ దెందుకని? తెలిసిరా దెందుకని? బహుశ చీకటిలో ఉందా? కనిపించక పోవడానికి అదే కారణమా? సమాధానం వినండి.

జ్యోతిషా మపి త జ్జ్యోతి స్తమసః పర ముచ్యతే । 17
జ్ఞానం జ్ఞేయం జ్ఞానగమ్యం హృది సర్వస్య విష్ఠితమ్ ॥

జ్యోతిషాం-అపి-తత్-జ్యోతిః-తమసః-పరం-ఉచ్యతే
జ్ఞానం-జ్ఞేయం-జ్ఞానగమ్యం-హృది-సర్వస్య-విష్ఠితం

జ్యోతిషాం అపి	=	జ్యోతులకు కూడా	జ్ఞానగమ్యం	= జ్ఞానము చేత పొంద దగినది
జ్యోతిః	=	ప్రకాశము	సర్వస్య	= సమస్త భూతముల యొక్క
తమసః	=	చీకటికి	హృది	= హృదయము నందు
పరం	=	పరమైనది	విష్ఠితం	= ఉన్నదని
జ్ఞానం	=	జ్ఞానము	ఉచ్యతే	= చెప్పబడుతూ ఉంది
జ్ఞేయం	=	జ్ఞేయము		

అర్జునా! అది వెలుగులకు వెలుగు. అంధకారానికి అతీతము. అది జ్ఞానము; జ్ఞేయము; జ్ఞానగమ్యము కూడా. సర్వుల హృదయాలలో అది దివ్యంగా ప్రకాశిస్తూ ఉంది.

వ్యాఖ్య

జ్ఞేయ రూపమైన ఆత్మ అంతటా ఉన్నా గోచరం కావడం లేదు అంటే, అది జడవస్తు వేమో అనే సందేహాన్ని నివారిస్తూ, అది స్వప్రకాశ చైతన్యమే అయినా, రూపరహితం కనుక గోచరించడం లేదు అని చెబుతూ నిత్య ప్రకాశాత్మను నిర్ధారణము చేస్తున్నాడు.

జ్యోతిస్సులకు జ్యోతిస్సు

జ్ఞేయమైన క్షేత్రజ్ఞ స్వరూపము వెలుగులకు వెలుగై వెల్గొందుతోంది. అటు బాహ్యంలో వెలిగే సూర్య, చంద్ర, నక్షత్ర, అగ్నులకు, ఇటు ఆంతర్యములో ప్రకాశించే మనోబుద్ధులకు చైతన్య జ్యోతియే అవభాసకము. దాని వల్లనే జడ జ్యోతులకు అవభాసకత్వము.

జ్యోతిః అంటే ప్రకాశము. ప్రకాశము అంటే ప్రకాశింప చేసేది అని అర్థము. ప్రకాశింప చేసే జ్యోతులు రెండు విధాలు. ఒకటి, తన ప్రకాశానికై మరొక జ్యోతిపై ఆధారపడి ఉండేది. రెండు, స్వప్రకాశమై, తన ప్రకాశానికై మరొక దానిపై ఆధార పడకుండా, సమస్తాన్ని ప్రకాశింప చేసేది. మొదటిది జడ ప్రకాశము. రెండవది చైతన్య ప్రకాశము.

బాహ్య ప్రకాశము లైన ఆదిత్యాదుల నుండి, ఆంతర్యము లోని బుద్ధ్యాదుల వరకు వెలిగే కాంతులన్నీ జడ ప్రకాశాలే. అవన్నీ ఏ ప్రకాశంపై ఆధారపడి ప్రకాశిస్తున్నవో అదే చైతన్య ప్రకాశము. చైతన్యజ్యోతి. అదే క్షేత్రజ్ఞ స్వరూపము. జ్ఞేయ విషయము.

చంద్రుడు ప్రకాశిస్తున్నాడు. చంద్రుని ప్రకాశం స్వప్రకాశం కాదని మనకు తెలుసు. అది సూర్యుని నుండి గ్రహించిన ప్రకాశము. అందుచేత, చంద్రుని ప్రకాశము జడ ప్రకాశమే గాని స్వప్రకాశము కాదు. మరి కాస్త ముందుకు సాగితే, సూర్యుని ప్రకాశం కూడా స్వప్రకాశం కాదని, జడ ప్రకాశమే నని తెలుస్తుంది.

వేడి పాలు అని అంటాము. పాలు వేడిగా ఉండవు. చల్లగా ఉంటాయి. వేడిపాల లోని వేడి అగ్నిదే గాని పాలది కాదు. అలాగే సూర్యుని లోని ప్రకాశము సూర్యునిది కాదు. చైతన్య ప్రకాశము వల్లనే సూర్యునికి ప్రకాశకత్వము ప్రాప్తిస్తూ ఉంది. ఏ తేజస్సు ప్రాప్తించడము చేత సూర్యుడు ప్రకాశిస్తున్నాడో, ఆ తేజస్సు చైతన్య తేజస్సే నని తైత్తిరీయ బ్రాహ్మణము ***(యే సూర్యః తపతి తేజసేద్ధః).*** చైతన్య తేజమే స్వప్రకాశము. మిగిలిన ప్రకాశా లన్నీ జడప్రకాశాలే. మరొక దానిపై ఆధారపడి ప్రకాశించే ఈ జడ ప్రకాశాలన్నీ స్వప్రకాశమైన చైతన్యప్రకాశాన్ని అనుసరించే ప్రకాశిస్తున్నాయి. ***తస్య భాసా సర్వ మిదం విభాతి*** - దాని ప్రకాశం చేతనే ఇదంతా ప్రకాశిస్తూ ఉంది అని కఠ, ముండక, శ్వేతాశ్వతరోపనిషత్తులు మూడూ ప్రముఖంగా ముచ్చటించాయి.

అయం ఘటః - 'ఈ కుండ' అన్నప్పుడు, కుండ వెలుగులో ఉంది కనుక, దానిని చూచి 'ఇది కుండ' అంటున్నాము. కుండ తాను ఉన్నట్లు తనకు తానుగా ప్రకటించుకో గలదా? స్వయం ఉద్దీపనం కుండకు సాధ్యమా? సూర్యుని ప్రకాశంలో ఉద్దీప్త మైన ఘటమును నువ్వు నేత్రంతో చూస్తున్నావు. బాహ్యంలో ఘటము ఉన్నా, అది ప్రకాశంలో ఉన్నప్పుడే, అది ఉన్నట్లు మనకు తెలుస్తుంది.

ఇంకా కాస్త ముందుకు వెళితే, ఘటము సూర్యుని ప్రకాశం లోనే ఉంది. కానీ, చూచే వాడు అంధుడైతే ఎలా తెలుసుకుంటాడు? సూర్యుడు కుండను ప్రకాశింప చేయగలడే గాని, కుండను తెలుసుకోగలడా? తననే తాను తెలుసుకోలేని సూర్యుడు, కుండ నెలా తెలుసుకుంటాడు? సూర్యుడైనా, సూర్య ప్రకాశంలో భాసించే ఘటమైనా నేత్రానికే గోచరం కావాలి. కుండ, కుండను ప్రకాశింప చేసే సూర్యుడు, ఇద్దరూ నేత్రము చేత ప్రకాశింప బడుతున్న వారే.

నేత్రము వస్తువును ప్రకాశింప చేయగలదే గాని వస్తువును తెలుసుకో గలదా? నేత్రము కూడా జడమే. కనుక, నేత్రంలో ప్రతిఫలించే వస్తువును, నేత్రాన్ని ప్రకాశింప చేసే మనస్సు తెలుసుకుంటూ ఉంది. అయితే మనస్సు స్వప్రకాశమా? మనస్సు స్వప్రకాశ మైతే అది ఎప్పుడూ ఉండాలి కదా! సుషుప్తిలో మనస్సు ఉందా? లేదు. కనుక, మనస్సు తెలుసుకోవడ మనేది చైతన్య ప్రకాశం మీద ఆధారపడి ఉంది ***(చైతన్య జ్యోతిషా అవభాసితస్య మనసః మనన సామర్థ్యం*** - కేన భాష్యము). కనుక, బాహ్యం లోని సూర్యాదులు మొదలు ఆంతర్యం లోని బుద్ధ్యాదుల వరకు సమస్తమును ప్రకాశింప చేసేది స్వప్రకాశ చైతన్య మైన క్షేత్రజ్ఞ స్వరూపమే. చైతన్యాత్మక మైన ఈ క్షేత్రజ్ఞ జ్యోతి చేత ఉద్దీప్తము లైన ఆదిత్యాదులు, అగ్ని తప్తమైన లోహ గోళము వలె వాటి కంటే అన్యమైన విషయాలను ప్రకాశింప చేస్తున్నాయి.

సమస్తాన్ని ఈ విధంగా ప్రకాశింప చేసే క్షేత్రజ్ఞ ప్రకాశము తన ప్రకాశానికి మరొక దానిపై ఆధార పడనిది కావడం చేత, అది ఆదిత్య వర్ణమని, అజ్ఞాన మనే చీకటికి దూరస్థ మైనదని వేదం కీర్తించింది ***(ఆదిత్య వర్ణం తమసః పరస్తాత్).***

తిమిర తేజస్సులకు సాక్షి

తెలిసేది వెలుగు. తెలియనిది చీకటి. చీకటి వెలుగులు రెండిటిని ప్రకాశింప చేసే సాక్షీ ప్రదీపము చైతన్య జ్యోతి. జ్ఞానాన్ని, అజ్ఞానాన్ని రెండిటిని ప్రకాశింప చేసే సర్వ సాక్షి క్షేత్రజ్ఞుడే.

యో జాగర మన్వభూవం యః స్వప్న మద్రాక్షం య స్సుఖ మస్వాప్సం సోऽహమస్మి!

'జాగ్రదవస్థను అనుభవించినది, స్వప్న జగత్తును చూచినది, సుషుప్తిలో గాఢముగా, హాయిగా నిద్రించినది ఎవరో, అది నేనే'.

జాగ్రత్స్వప్నాలలో వ్యక్తమైన ప్రకాశాన్ని, సుషుప్త్యవస్థలో అవ్యక్త మైన ప్రకాశాన్ని, రెండిటిని ప్రకాశింప చేస్తూ, సాక్షిమాత్ర ప్రకాశంగా శోభించేది క్షేత్రజ్ఞ ప్రకాశమే. అందుకే అది చీకటికి దూరమైనది, అతీత మైనది **(తమసః పరమ్).** అంటే, అజ్ఞానానికి పరమై, అస్పర్శంగా భాసిస్తూ ఉంది ***(తమసః అజ్ఞానాత్, పరమ్ అసంస్పృష్టమ్, ఉచ్యతే)*** అని అర్థం.

జ్ఞానం - జ్ఞేయం - జ్ఞానగమ్యం

దేనిని తెలుసుకుంటే అమృతత్వము ప్రాప్తిస్తుందో, అట్టి జ్ఞేయమును చెబుతాను అంటూ పన్నెండవ శ్లోకంలో జ్ఞేయ రూపుడైన క్షేత్రజ్ఞుని స్వరూపాన్ని ***అనాదిమత్, న అసత్, న సత్*** అంటూ ప్రారంభించి వరుసగా ఐదు శ్లోకాలలో తటస్థ లక్షణము ద్వారా నిషేధ మార్గంలో దానిని వివరించి, చివరగా స్వరూప లక్షణం ద్వారా విధి మార్గంలో జ్ఞానం - జ్ఞేయం - జ్ఞానగమ్యం అని జ్ఞేయ రూపుడైన క్షేత్రజ్ఞ స్వరూపాన్ని బోధించి విషయాన్ని సమాప్తం చేస్తున్నాడు.

ప్రస్తుతము భగవంతుడు **జ్ఞానం** అని చెబుతున్నది పూర్వం చెప్పిన అమానిత్వాది సాధన పరమైన జ్ఞానము. ఈ విధమైన జ్ఞాన సాధన ఫలించిన తరువాత, ప్రమాణ జన్యమైన అహంవృత్తి యందు అభివ్యక్త మయ్యే జ్ఞానమే ఇక్కడ **జ్ఞేయము.** ఇలా తెలియ బడిన జ్ఞేయమే జ్ఞానఫలం కావున అది ***జ్ఞానగమ్యం (జ్ఞాన గమ్యమ్ - జ్ఞేయ మేవ జ్ఞాతం సత్ జ్ఞానఫలం ఇతి జ్ఞాన గమ్యమ్ ఉచ్యతే).*** కనుక, జ్ఞానము, జ్ఞేయము, జ్ఞానగమ్యము - ఈ మూడు కూడా జ్ఞేయమైన క్షేత్రజ్ఞుని స్వరూపమే. జ్ఞప్తిరూప బ్రహ్మమే. మరి, ఆ జ్ఞప్తిరూప బ్రహ్మానికి ఉపలబ్ది స్థాన మేది? బుద్ధియే. హృదయమే.

హృదయాలయం

జ్ఞేయ మేదో అది జ్ఞానం లోనే ఉంది. మోక్షం జ్ఞానరూపంలో ఉంది అని పదే పదే చెప్పడం లోని ఆంతర్య మిదే. ***జ్ఞానస్య అభ్యన్తరే జ్ఞేయం మాధుర్యం పయసో యథా*** - పాలలో తియ్యదనం లాగా జ్ఞానం లోనే జ్ఞేయం ఉంది అని శాస్త్ర వాక్యము. జ్ఞానము, జ్ఞేయము, జ్ఞాన గమ్యము - అంతా అఖండమే. అద్వయమే. అలాంటి దానిని ఎక్కడ పొందాలి? ఎప్పుడు పొందాలి? దాని ఉపలబ్ది స్థానం ఏది? అది గ్రామాంతరం లాగా దేశము చేత వ్యవహితమై ఉందా? వేరు చేయబడి ఉందా? లేక, బాల్యాది అవస్థల లాగా కాలం చేత వ్యవహితమై ఉందా? లేదు. అది ఎప్పుడూ ఉంది, కనుక ఇప్పుడే ఉంది. అది అంతటా ఉంది కనుక ఇక్కడే ఉంది. బుద్ధి యందే ఉంది. హృదయ మందే ఉంది ***(తత్ హృది బుద్ధౌ సర్వస్య ప్రాణి జాతస్య, విష్ఠితం విశేషేణ స్థితమ్).*** సర్వ ప్రాణుల హృదయ మందిరాలలో దర్శింప బడుతూ ఉంది.

ఇంతవరకు ప్రవచించిన విషయాన్ని ఉపసంహరించడం కొరకు తరువాత శ్లోకం ప్రస్తావింప బడుతూ ఉంది.

ఇతి క్షేత్రం తథా జ్ఞానం జ్ఞేయం చోక్తం సమాసతః ।
మద్భక్త ఏత ద్విజ్ఞాయ మద్భావా యోపపద్యతే ॥ **18**

ఇతి-క్షేత్రం-తథా-జ్ఞానం-జ్ఞేయం-చ-ఉక్తం-సమాసతః
మద్భక్తః-ఏతత్-విజ్ఞాయ-మద్భావాయ-ఉపపద్యతే

ఇతి	= ఈ విధముగా	ఉక్తం	= చెప్పబడింది
క్షేత్రం	= క్షేత్రము	మద్భక్తః	= నా భక్తుడు
తథా	= అటులే	ఏతత్	= దీనిని
జ్ఞానం	= జ్ఞానము	విజ్ఞాయ	= తెలిసికొని
జ్ఞేయం చ	= జ్ఞేయమును	మద్భావాయ	= నా భావమును పొందుటకు
సమాసతః	= సంగ్రహముగా	ఉపపద్యతే	= తగినవా డవుతున్నాడు

అర్జునా! క్షేత్రము, జ్ఞానము, జ్ఞేయము - వీటిని గూర్చి నీకు సంక్షేపంగా చెప్పాను. దీనిని చక్కగా గ్రహించిన నా భక్తుడు నన్నే పొందుతాడు.

వ్యాఖ్య

క్షేత్రము, జ్ఞానము, జ్ఞేయము - ఈ మూడు విషయాలను ఇంతవరకు ప్రవచించిన భగవానుడు, వాటిని ఈ శ్లోకంతో ఉపసంహరిస్తున్నాడు. ***మహాభూతాది ధృత్యన్తము*** క్షేత్రము అని ఐదు, ఆరు శ్లోకాలలో బోధించాడు. ఏడవ శ్లోకంలో అమానిత్వాదుల నుండి ఆరంభమై పదకొండవ శ్లోకంలో తత్త్వజ్ఞానార్థ దర్శనం వరకు జ్ఞానము అనే జ్ఞాన సాధనములను ఎరుక పరచాడు. అలాగే పన్నెండవ శ్లోకంలో అనాదిమత్ మొదలు పదిహేడవ శ్లోకంలో హృది సర్వస్య విష్ఠితమ్ వరకు జ్ఞేయ విషయమును ప్రసంగించి, క్షేత్ర - జ్ఞాన - జ్ఞేయ విషయమును సంక్షేపంగా వివరించి వేదార్థమును, గీతార్థమును కూడా ఉపసంహరిస్తున్నాడు ***(ఏతావాన్ హి సర్వః వేదార్థః గీతార్థశ్చ ఉపసంహృత్య ఉక్తః).*** అంటే, క్షేత్ర, - జ్ఞాన - జ్ఞేయ విషయంలో ఇదే వేదార్థము; గీతార్థము కూడా ఇదే అని అభిప్రాయము. వేదసారాన్ని, గీతాసారాన్ని కూడా ఈ అధ్యాయంలో ఇప్పటికే సారభూతంగా అందించాడని భావించ వచ్చు. వాస్తవానికి గీతలో ఉన్నదంతా ఇదే. గీతా శాస్త్రాన్ని ఎక్కడ బట్టి చూచినా ఈ మూడిటికి సంబంధించిన జ్ఞానమే ఉంటుంది. కాకపోతే, వాటిని ప్రత్యేకించి ప్రస్తుత అధ్యాయంలో ప్రవచించడం చేత శ్రోతలలో విషయం విస్పష్ట మైంది.

సింహావలోకన న్యాయంగా ఒక్కసారి వెను దిరిగి అర్జునుని ప్రశ్నను అవలోకిస్తే, అర్జునుని శ్లోకంలో కనిపించిన మూడు ప్రశ్నలకు సమాధానం లభించినట్లే అయింది. అందుచేతనే, ప్రస్తుత శ్లోకాన్ని ***ఇతి*** అంటూ ప్రారంభించి విషయం సమాప్త మైందని సూచిస్తున్నాడు. దీనికి తోడు ఫలశ్రుతిని, అధికారిని గూర్చి ప్రస్తావించడం చేత విషయం సమాప్త మైంది అని చెప్పడానికి గొప్ప ఊత మిచ్చినట్లైంది.

అధికార యోగ్యత్వం

సర్వ వేదార్థ సారము, సమస్త గీతా తాత్పర్య మైన ఈ సమ్యగ్దర్శనానికి అధికారి ఎవరో చెబుతున్నాడు. అధికార యోగ్యత్వం భక్తునికే ఉంది; భగవద్భక్తునికే ఉంది అని చెబుతున్నాడు. నా భక్తునికే అర్హత ఉంది అంటున్నాడు **(మద్భక్తః).** నా భక్తుడు అని భగవంతుడు చెబుతున్న ఆ భక్తు డెవరు? ఎలాంటి వాడు?

మద్భక్తుడు అంటే పరమేశ్వరుడు, పరమగురువు, వాసుదేవుడు అయిన భగవంతుని యందు సర్వమును

సమర్పించి, సర్వము సర్వేశ్వరుడే అని భావించే వాడు (**మద్భక్తః మయి సర్వేశ్వరే పరమ గురౌ వాసుదేవే సమర్పిత**
సర్వాత్మ భావః). అతడే భగవద్భక్తుడు. పూర్వాధ్యాయంలో **యేతు సర్వాణి కర్మాణి** అనే రెండు శ్లోకాలలో
చెప్పబడిన భక్తుడు; పదకొండవ అధ్యాయం చివర **మత్కర్మ కృత్** అనే శ్లోకంలో దీప్తిమంత మైన పూర్ణ భక్తుడు,
భగవత్ప్రియు డైన మద్భక్తుడు.

ఈ సందర్భములో పరమేశ్వరుడు, వాసుదేవుడు అని ఆగకుండా పరమగురు వైన తన యందు భక్తి
గల వాడు అని ప్రత్యేకించి ఆచార్యుల వారు గురువును ప్రస్తావించడంలో విశేషం లేక పోలేదు. ఆదిగురువుకు
అస్మద్గురువుకు భేదం లేదని భక్తుడు అవశ్యం గుర్తించాలి అనేదే ఇక్కడ అంతర్భావము. అట్టివాడే మోక్షాన్ని
పొందుతాడు అని ప్రమాణ శ్లోకము కూడా ఉంది.

యస్య దేవే పరాభక్తిః యథా దేవే తథా గురౌ।
తస్యైతే కథితా హ్యర్థాః ప్రకాశన్తే మహాత్మనః ॥

'భగవంతుని యందు ఎవరి కైతే ఉత్కృష్ట మైన భక్తి ఉందో, భగవంతుని యందు గల భక్తి గురుదేవుని
యందు కూడా సమంగా ఉందో, అట్టి మహాత్ముడైన భక్తునికే చెప్పబడిన ఈ విషయాలన్నీ బోధ పడతాయి'
అని శ్రుతి ప్రబోధము. గీత - పద్దెనిమిదవ అధ్యాయం - డెబ్బై నాల్గవ శ్లోకంలో సంజయుడు అర్జునుని
మహాత్ముడు **(పార్థస్య చ మహాత్మనః)** అని పలికిన విషయాన్ని మననం చేసుకోవడం ప్రస్తుతం సందర్భం
కాకపోయినా, సముచితమే నని నా అభిప్రాయము.

భగవంతుని పరమగతిగా విశ్వసించి, గురుదేవుని పరమాత్మ స్వరూపంగా హృదయంలో నిలుపుకొని,
నిర్మలమైన భక్తితో సమ్యగ్దర్శన జ్ఞానమును పొందు భక్తుడు భగవంతుని పొంది తరిస్తాడు. ఈ సత్యాన్ని
భాగవతం కూడా దివ్యంగా ప్రవచించింది.

క॥ **గురుభక్తిం జిత్తము మత్పరమై విలసిల్లు నంత పర్యంతము స**
త్పురుషుల కిహ లోకమునఁ జిరతర మోక్షోదయంబు సేకూరు చుండున్ !

'సాధు పురుషులు ఎంత వరకు నేనే పరమగతి అని భావించి, మనస్సును నా యందే నిలిపి, గురుభక్తితో
ఉంటారో, అంతవరకు వారికి ఈ లోకం లోనే, అంటే జీవించి ఉండగానే మోక్షము ప్రాప్తిస్తుంది' అని
భగవంతుడే స్వయంగా భాగవతంలో ప్రవచించాడు (పోతన భాగవతము - తృతీయ స్కంధము).

ఇక ప్రకృతి పురుషులను గూర్చిన ప్రసంగాన్ని ప్రారంభిస్తున్నాడు.

ప్రకృతిం పురుషం చైవ విద్ధ్యనాదీ ఉభావపి । 19
వికారాంశ్చ గుణాంశ్చైవ విద్ధి ప్రకృతి సమ్భవాన్ ॥

ప్రకృతిం-పురుషం-చ-ఏవ-విద్ధి-అనాదీ-ఉభౌ-అపి
వికారాన్-చ-గుణాన్-చ-ఏవ-విద్ధి-ప్రకృతి సంభవాన్

ప్రకృతిం	= ప్రకృతిని	వికారాన్ చ	= వికారములను
పురుషం చ ఏవ	= పురుషుని	గుణాన్ చ ఏవ	= గుణములను
ఉభౌ అపి	= ఇరువురిని	ప్రకృతి సంభవాన్	= ప్రకృతి వలన పుట్టిన వానినిగా
అనాదీ	= ఆది లేని వారుగా	విద్ధి	= తెలుసుకో
విద్ధి	= తెలుసుకో		

అర్జునా! ప్రకృతి పురుషు లిద్దరూ ఆది లేనివారు. ఇక గుణాలు, వికారాలు అంటావా? అవి ప్రకృతికి
సంబంధించినవి.

వ్యాఖ్య

సప్తమాధ్యాయము - విజ్ఞాన యోగము నందు ఈశ్వరుని రెండు ప్రకృతులను గూర్చి చెప్పడం జరిగింది.
ఒకటి అపరా ప్రకృతి, రెండవది పరాప్రకృతి. వీటిలో అపరా ప్రకృతి క్షేత్రరూపము. పరాప్రకృతి క్షేత్రజ్ఞ
స్వరూపము. ఈ ప్రకృతి ద్వయంతో పరమేశ్వరుడు ఈ జగత్తు యొక్క సృష్టి స్థితి లయాలకు కారణ
మవుతున్నాడు అని ఏడవ అధ్యాయం ప్రసంగిస్తే, క్షేత్ర క్షేత్రజ్ఞ లక్షణమైన ఈ ప్రకృతి ద్వయాన్ని నిరూపించడం
ద్వారా పరమేశ్వర తత్త్వాన్ని నిర్ధారణ చేయవచ్చు అంటూ ప్రస్తుత అధ్యాయం ప్రారంభమైంది.

సమస్త భూతజాలమునకు ఈ పర - అపర ప్రకృతులే కారణము. అపరా ప్రకృతియే మాయ.
త్రిగుణాత్మక మైన ఈ మాయ బ్రహ్మమును ఆశ్రయించుకొని ఉంది. కనుక ఈ మాయాశక్తి ఈశ్వర
సంబంధ మైనది. ఇదే క్షేత్ర స్వరూపము.

ఇక రెండవది అయిన పరాప్రకృతియే జీవుడు. అతడే పురుషుడు. క్షేత్రజ్ఞ స్వరూపుడు. ఈ ప్రకృతి
పురుషులు ఉభయులూ అనాదులు. ఆది లేని వారు. అర్జునా! ప్రకృతి పురుషు లిరువురినీ అనాదులుగా
తెలుసుకో! ***(ప్రకృతిం పురుషం చైవ విద్ధి అనాదీ ఉభావపి)*** అంటున్నాడు భగవంతుడు. ***అనాదీ*** అనే పదాన్ని ఈ
సందర్భములో జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి.

న విద్యతే ఆదిః యయోః తౌ అనాది - 'వేటికి ఆది లేదో అవి అనాదులు' అని బహువ్రీహి సమాసము.
ఈశ్వరుడు నిత్యుడు. ఈశ్వరుడు నిత్యు డైనపుడు ఉభయ ప్రకృతులు ఈశ్వర సంబంధ మైనవే కనుక, అవి
కూడా నిత్యములే అయి ఉండాలి. నిత్యము లైన ఈ ఉభయ ప్రకృతులను కలిగి ఉండటము చేతనే ఈశ్వరుడు
జగత్తు యొక్క సృష్టి స్థితి లయాలకు కారణ మవుతున్నాడు. కనుక ఈశ్వరుని ప్రకృతులు రెండూ అనాదులుగా
ఉంటూ సంసారానికి కారణ మవుతున్నాయి.

అనాదీ శబ్దాన్ని నిర్వచించడంలో సాంఖ్యులు మరో విధంగా అర్థం చెప్పారు. ***న ఆదీ అనాదీ -*** ఆదులు
కానివి అన్నారు. అంటే, ఆది నుండి లేనివి అని తత్పురుష సమాసంగా గ్రహించారు. ఇలా చెప్పడం చేత
ప్రకృతి పురుషులు ఆది లేనివారై నిత్యులైతే
ఈశ్వరునికి జగత్కారణత్వం సిద్ధిస్తుంది అనేది వారి వాదము. ఈ వాదము అయుక్తము,
జగత్తు వారి సృష్టి అవుతుందే గాని ఈశ్వర సృష్టి కాదు అనేది వారి విచిత్ర వాదము.
అసంగతము.

వీరి వాదన ప్రకారము ఆది నుండి లేనివి అనే అర్థాన్ని గ్రహిస్తే, ప్రకృతికి ఆది ఉన్నట్లే కదా! కారణ
మున్నట్లే కదా! అదే వాస్తవ మైతే, ప్రకృతి, లేదా మాయకు కారణ మేమిటి? అనే ప్రశ్న పుడుతుంది. మాయకు
కారణము లోయ అన్నా రనుకోండి. మళ్ళీ లోయకు కారణ మేమిటి? అనే ప్రశ్న అనివార్య మవుతుంది. ఇలా
చెప్పుకుపోతే అనవస్థా దోషం ఏర్పడుతుంది. అంతేగాని, మూల ప్రకృతి ఒకటి ఉందని వారు భావించినట్లు
సమాధానం రాదు. అలాంటప్పుడు సృష్టి కార్యమే అసంభవ మవుతుంది. కనుక ప్రకృతి కూడా అనాది అని
అంగీకరించక తప్పదు.

ప్రధాన క్షేత్రజ్ఞ పతి ర్గుణేశః - ప్రధాన క్షేత్రజ్ఞులకు, అంటే ప్రకృతి పురుషులకు ఈశ్వరుడే ప్రభువు అని
వేదం చెబుతూ ఉంది. అలాంటప్పుడు మరొక ప్రకృతి ప్రత్యేకంగా ఎలా ఉంటుంది? ఒకవేళ అలా వేరుగా
మూల ప్రకృతి అనేది ఒకటుంటే, సృష్టి కార్య నిర్మాణానికి ఈశ్వరుడు ఆ మూల ప్రకృతిపై ఆధారపడ వలసి

వస్తుంది. అదే జరిగితే, ఈశ్వరుని యొక్క సర్వ శక్తిమత్వానికి, సర్వజ్ఞత్వానికి భంగం వాటిల్లుతుంది.
ప్రకృతికి ఆది ఉందని చెప్పడం చేత, ఈశ్వరునికి జగత్కారణత్వం సిద్ధిస్తుందని వీరు ప్రతిపాదించే విషయము కూడా పస లేనిదే. ఈశ్వరుడే జగత్కారణం అని చెబితే, వెంటనే సృష్టిలో భేదాలు ఎలా సాధ్య మయ్యాయి? అనే ప్రశ్న పుడుతుంది. సృష్ట్యాదిలో పాపపుణ్యాల ప్రసక్తే లేదు కదా! అలాంటప్పుడు నిర్హేతుకంగా నిమ్నోన్నతాలను పరమేశ్వరుడు ఎందుకు సృష్టించాడు? అనే విమర్శకు సమాధానమే లభించదు. ఈశ్వరుని కూడా మన లాగే రాగద్వేషాల పల్లకీలో కూర్చోబెట్టి ఊరేగించ వలసి వస్తుంది.

ఈశ్వరుడు అంటే ఏమిటి? ***ఈశితుం శీల మస్య ఈశ్వరః*** - ఆధిపత్యము వహించే శక్తి కలవాడు. నియమన శక్తి కలవాడు. ఈ ఉభయ ప్రకృతులకు ఆది ఉందని చెబితే, ఈ ప్రకృతి ద్వయం పుట్టక ముందు ఈశ్వరుడు నియమించ వలసింది, ఆధిపత్యం వహించ వలసింది ఏదీ లేదని అర్థం. అలాంటప్పుడు ఈశ్వర శబ్దానికి అర్థ మేమిటి? ఈశ్వరునికి అనీశ్వరత్వం ప్రాప్తించినట్లే కదా! రాజ్యం ఉంటేనే కదా రాజు అనే పదానికి అర్థం! కనుక, ఈశ్వరునికి ఈశ్వరత్వం ఈ ప్రకృతి ద్వయం ఉంటేనే సాధ్యం ***(ప్రకృతి ద్వయవత్త్వ మేవ హి ఈశ్వరస్య ఈశ్వరత్వమ్).***

ఈశ్వరునికి ఈశ్వరత్వం లేనపుడు జగత్తు యొక్క అస్తిత్వ మేపాటిది? జగత్తు నిమిత్తం లేనిది అవుతుంది. సంసారానికి నిమిత్తము, లేదా కారణము లేకపోతే ముక్తి కూడా లేనిదే అవుతుంది. సంసార హేతువు ఒకటి ఉంది అని చెప్పి, దానిని తొలగించుకుంటే మోక్షము అని చెబితే అంగీకరించడానికి అభ్యంతరం ఉండదు. అలా కాకుండా, సంసార హేతువే లేదు అని చెబితే, దానిని నిర్మూలించుకునే అవకాశమే లేనందున, మోక్షప్రాప్తి అనేదే ఉండదు **(సంసారస్య నిర్నిమిత్తత్వే అనిర్మోక్ష ప్రసంగాత్).** బంధమోక్ష ప్రసక్తి ఉండే అవకాశమే లేదు. బంధమోక్ష ప్రసంగమే లేనపుడు శాస్త్రం యొక్క అవసర మేమిటి? శాస్త్రం నిరర్థక మవుతుంది ***(శాస్త్రానర్థక్య ప్రసంగాత్, బంధమోక్ష అభావ ప్రసంగాచ్చ).*** కనుక, ప్రకృతి ద్వయము ఆది లేనిదై, నిత్య మైనపుడే ఇదంతా సిద్ధిస్తుంది. అదెలాగో ఈ ప్రకృతి పురుష వివేక ప్రకరణంలో చూస్తాం.

ఉభయ ప్రకృతులు ఈశ్వర సంబంధ మైనవే. క్షేత్రము అపరా ప్రకృతి. మాయోపాధితో వర్తిస్తూ ఉంటుంది. క్షేత్రజ్ఞుడు, లేదా పురుషుడు పరాప్రకృతి. అవిద్యోపాధితో కూడి ఉంటాడు. ఈ రెండూ అనాదులే. సృష్టికి హేతువులే. ప్రకృతి వికారం చెందుతూ ఉంటుంది. పురుషుడు నిర్వికారి.

ప్రకృతి మాయాశక్తి. వికారాలకు హేతువు. వికారాలకు, గుణాలకు ప్రకృతియే కారణము. అందుచేత గుణ వికారాలు ప్రకృతి సంభవాలు. అంటే, ప్రకృతి యొక్క పరిణామాలు. అర్జునా! ప్రకృతి పురుషులు ఎలా అనాదులో అర్థమైంది కదూ? అయితే, వికారాలు, గుణాలు ప్రకృతి పరిణామాలే నని తెలుసుకో! ***(వికారాన్ గుణాన్ చ విద్ధి, ప్రకృతి సంభవాన్, ప్రకృతి పరిణామాన్).*** ఈ దృశ్యమాన ప్రపంచము ప్రకృతి యొక్క స్థూల విషయానికి సంబంధించినది కాగా, సుఖదుఃఖ మోహాత్మకాలైన గుణాలు ప్రకృతి యొక్క సూక్ష్మ విషయానికి సంబంధించినవిగా తెలుసుకో.

ప్రకృతి సంభవాలైన వికారాలు, గుణాలు అంటే ఏమిటి? చెబుతున్నాడు.

కార్యకరణ కర్తృత్వే హేతుః ప్రకృతి రుచ్యతే । 20
పురుషః సుఖదుఃఖానాం భోక్తృత్వే హేతు రుచ్యతే ॥

కార్యకరణ కర్తృత్వే-హేతుః-ప్రకృతిః-ఉచ్యతే
పురుషః-సుఖదుఃఖానాం-భోక్తృత్వే-హేతుః-ఉచ్యతే

ప్రకృతిః	=	ప్రకృతి	సుఖదుఃఖానాం	=	సుఖదుఃఖములను
కార్యకరణ కర్తృత్వే	=	కార్యకరణ కర్తృత్వములకు	భోక్తృత్వే	=	అనుభవించుట యందు
హేతుః	=	హేతువుగా	హేతుః	=	హేతువుగా
ఉచ్యతే	=	చెప్పబడుతున్నది	ఉచ్యతే	=	చెప్పబడుతున్నాడు
పురుషః	=	పురుషుడు			

అర్జునా! కార్యకరణాల పుట్టుకకు ప్రకృతి కారణము. సుఖదుఃఖాలను అనుభవించడానికి పురుషుడు హేతువు.

వ్యాఖ్య

కార్యము అంటే శరీరము. శరీరములో ఉన్న పదమూడు ఇంద్రియాలు కరణాలు. పంచ జ్ఞానేంద్రియాలు, పంచ కర్మేంద్రియాలు, మనస్సు, బుద్ధి, అహంకారము - ఈ పదమూడు ఇంద్రియాలు కరణాలు.

పాంచభౌతిక మైన శరీరము కార్యము కనుక శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాత్మక మైన ఇంద్రియ విషయాలు కూడా కార్యము క్రిందికే వస్తాయి. అలాగే ప్రకృతి నుండే పుట్టిన సుఖదుఃఖ మోహాత్మకా లైన గుణాలు పదమూడు ఇంద్రియాలైన కరణాలను ఆశ్రయించుకొని ఉన్నందున అవి 'కరణ' శబ్దం చేత గ్రహింప బడతాయి. ఈ కార్యకరణాలను పుట్టించడము 'కార్యకరణ కర్తృత్వం'. ఇక్కడ కర్తృత్వము అంటే ఉత్పాదకత్వము ***(తేషాం కార్య కరణానాం కర్తృత్వమ్ ఉత్పాదకత్వం యత్ తత్ కార్యకరణ కర్తృత్వమ్).***

హేతువు ప్రకృతి

ఈ కార్యకరణ కర్తృత్వానికి ప్రకృతే ఆరంభం కనుక, అదే హేతువుగా చెప్పబడుతూ ఉంది. కార్యానికి ఏది కారణంగా ఉంటుందో దానినే ఆరంభకం అంటాము. మట్టికుండకు మట్టి ఆరంభకం కనుక, ఆరంభక మైన మట్టి, కుండకు హేతువు అవుతుంది. అదే ఉపాదాన కారణము. ఈ విధంగా కార్యకరణ కర్తృత్వము నందు ప్రకృతి హేతువు కావడం చేత, సంసారానికి ప్రకృతియే కారణముగా తెలుస్తూ ఉంది.

ఈ శ్లోకమున ***కార్యకరణ కర్తృత్వే*** అనే చోట ***కార్యకారణ కర్తృత్వే*** అనే పాఠాంతరము ఉంది. ఈ విధమైన దీర్ఘ పాఠమును గ్రహిస్తే, ఏది దేని యొక్క విపరిణామమో అది దాని కార్యము అవుతుంది. వికారము లన్నీ కార్యములు. వికారము గలది వికారి. అంటే, వికార వికారి రూపాలైన కార్యకారణముల యొక్క కర్తృత్వము నందు ప్రకృతి హేతువుగా ఉందని అర్థము ***(వికార వికారిణోః కార్యకారణయోః కర్తృత్వ ఇతి).***

కారణం పురుషుడు

సంసారమునకు పురుషుడు ఎలా కారణమో చెబుతున్నాడు. పురుషుడు, జీవుడు, క్షేత్రజ్ఞుడు, భోక్తా - ఈ పదాలన్నీ సమానార్థక పదాలు, అంటే పర్యాయ పదాలు అన్నారు భాష్యంలో ఆచార్యులు ***(పురుషః జీవః క్షేత్రజ్ఞః భోక్తా ఇతి పర్యాయః).*** భోగ్యాలైన సుఖదుఃఖాలను అనుభవించడములో పురుషుడు కారణ మని చెప్పబడ్డాడు.

'కార్యకరణ కర్తృత్వము' చేత ప్రకృతి, 'సుఖదుఃఖ భోక్తృత్వము' వలన పురుషుడు - ఈ విధంగా ప్రకృతి పురుషు లిరువురు సంసార హేతువులుగా తెలుస్తున్నారు. ప్రకృతి అచేతనము కనుక, ప్రకృతికి కర్తృత్వము సంభవించదు. అలాగే పురుషుడు ప్రకృతి విలక్షణుడు కావడం చేత పురుషుడికి భోక్తృత్వము సంభవించదు. అలాంటప్పుడు సంసారము ఎలా సాధ్యము? సాధ్యమే. దేహేంద్రియాది విషయాకారముగా, సుఖదుఃఖాది ప్రత్యయాకారముగా పరిణమించిన ప్రకృతితో దానికి భిన్నమైన పురుషునికి అవిద్యా రూపమైన సంబంధం,

లేదా సంయోగం ఎప్పుడైతే ఏర్పడుతుందో అప్పుడే **అహం - మమ** - 'నేను - నాది' అనే సంసారము ఉత్పన్న మవుతుంది. ఇలా కార్యకరణ కర్తృత్వం ద్వారా, సుఖదుఃఖ భోక్తృత్వం ద్వారా ప్రకృతి పురుషుల సంసారానికి కారణత్వం చెప్ప బడుతూ ఉంది **(ప్రకృతి పురుషయోః కార్యకరణ కర్తృత్వేన సుఖదుఃఖ భోక్తృత్వేన చ సంసార కారణత్వమ్ ఉక్తమ్ తత్ యుక్తమ్).** కనుక సంసార మనేది ఏదో కాదు సుఖదుఃఖ భోగమే సంసారము **(సుఖ దుఃఖ సంభోగః సంసారః).** పురుషుడు సుఖదుఃఖాలను అనుభవించడమే సంసారిత్వము **(పురుషస్య సుఖ దుఃఖానాం సంభోక్తృత్వం సంసారిత్వమ్ ఇతి).**

సంసారిత్వ మేమిటో చెప్పబడింది. ఇంతకీ, దానికి నిమిత్త మేమిటి? చదవండి.

పురుషః ప్రకృతి స్థో హి భుఙ్క్తే ప్రకృతిజా న్గుణాన్ ।
కారణం గుణసఙ్గోఽస్య సదసద్యోని జన్మసు ॥ 21

పురుషః-ప్రకృతిస్థః-హి-భుంక్తే-ప్రకృతిజాన్-గుణాన్
కారణం-గుణసంగః-అస్య-సదసద్యోనిజన్మసు

ప్రకృతిస్థః	=	ప్రకృతి యందున్నవాడై	అస్య	=	ఇతనికి
పురుషః	=	పురుషుడు	సదసద్యోని జన్మసు	=	సుకృత దుష్కృతములయిన యోనులందు
ప్రకృతిజాన్	=	ప్రకృతిచే బుట్టిన			
గుణాన్	=	గుణములను	గుణసంగః	=	గుణసంగము
భుంక్తే హి	=	అనుభవించును గదా	కారణం	=	కారణము

అర్జునా! ప్రకృతి యందున్న పురుషుడు ప్రకృతి సంభవాలైన గుణాలను అనుభవిస్తున్నాడు. ఈ గుణ సంగము వల్లనే అతనికి నీచోన్నత జన్మలు కలుగు తున్నాయి.

వ్యాఖ్య

సుఖదుఃఖాలను అనుభవించడమే సంసారము అని గ్రహించాము. వాస్తవానికి సంసారిత్వమే బంధము. పురుషు డెవరు? పురుషుడు జీవుడు; క్షేత్రజ్ఞుడు. క్షేత్రజ్ఞుడు, లేదా పురుషుడు జ్ఞేయరూపుడైన పరమాత్మయే అని పూర్వ ప్రకరణం లోనే తెలుసుకున్నాం. పరమాత్మ అనంతరూపుడు. అనంతుడైన వానికి బంధము అసంభవము. అయినా, సంసారిత్వ మనే బంధము ఉంది అంటే, దానికి నిమిత్త మేమిటి? ***(తస్య కిం నిమిత్తం?).*** ప్రకృతి అవిద్య, లేదా అజ్ఞానము. అవిద్యా లక్షణం కలది, కార్యకరణ రూపంలో పరిణామం చెందినది అయిన ప్రకృతి యందు ఉన్నవాడై ప్రకృతియే తాను అని భావిస్తున్న వాడు, ప్రకృతి సంభవాలై సుఖదుఃఖ మోహాది రూపాలలో వ్యక్తమయ్యే గుణాలను అనుభవిస్తూ - **సుఖీ, దుఃఖీ, మూఢః, పండితః అహమ్** - నేను సుఖిని, దుఃఖిని, మూర్ఖుణ్ణి, పండితుణ్ణి అని భావించుకుంటూ ఆయా గుణాలను అనుభవిస్తున్నవాడు పురుషుడు. అతడే ప్రకృతిస్థుడు.

పురుషునకు ప్రకృతితో సంబంధము నిత్యము కాదు. నిరవయవు డైన పురుషునికి సావయవ మైన ప్రకృతితో సంబంధము అసంభవము. లేని సంబంధము ఉన్నట్లు గోచరిస్తే, దానిని ఆధ్యాసిక సంబంధము అని చెప్పుకోవాలి. ఈ సంబంధమే సంసారాన్ని తయారు చేసి పురుషుని సంతాపానికి గురి చేస్తుంది. ఏకమైన తనను, తాను గాని అనేకములు బాధించేలా చేస్తుంది.

అనాత్మ యైన ప్రకృతితో సంయోగము చేత, అనాత్మ యందు ఆత్మబుద్ధిని అధ్యసించి తాను కాని దానిని తానుగా, తనది కాని దానిని తనదిగా భావించడం జరుగుతూ ఉంది. ఇదే అవిద్య, లేదా అజ్ఞానము.

ఈ విధంగా ఆత్మ యైన పురుషుడు స్వరూపతః అసంగుడే అయినా, దేహేంద్రియ మనస్సులతో తాదాత్మ్యం చెందడం వల్ల అభోక్త యైన తాను భోక్త అవుతున్నాడు ***(ఆత్మేన్ద్రియ మనోయుక్తం భోక్తే త్యాహు ర్మనీషిణః).*** అనన్య స్వరూపుడైన తాను అన్య ధర్మములను తనవిగా భావించడమే సంసారము. ఈ విధమైన సంసారము అవిద్యా ప్రాప్తము. అవిద్య చేత శబ్దాది విషయాల యందు, సుఖదుఃఖ మోహాత్మకము లైన గుణాల యందు అభిలాష ఏర్పడుతుంది. అదే గుణసంగము, లేదా కామము. ఈ అవిద్యా కామాలే జన్మలకు కారణము.

స యథా కామో భవతి త త్క్రతు ర్భవతి!
యత్క్రతు ర్భవతి తత్కర్మ కురుతే!
యత్కర్మ కురుతే త దభి సంపద్యతే!

'ఎవడు దేనిని కామిస్తున్నాడో వాడు దానికి సంబంధించిన సంకల్పాలనే కలిగి ఉంటాడు. ఎట్టి సంకల్పాలు కలిగి ఉంటాడో అట్టి కర్మలే ఆచరిస్తాడు. ఏ కర్మలను ఆచరిస్తాడో తత్సంబంధమైన ఫలాలనే పొందుతాడు'.

పుణ్య సంకల్పాలు కలిగి పుణ్యకర్మలు ఆచరించే వారు ఉత్తమ జన్మ లెత్తుతారు. సుర, ముని జన్మలలో శోభిస్తారు. అవి సద్యోనులు. వారు సద్యోని జాతులు. పాపకర్మలు మాత్రమే చేసి పాపయోనుల యందు జన్మించు ప్రాణులు రాక్షస, పిశాచ, పశ్వాది యోనులలో పుడతారు. అవి అసద్యోనులు. వారు అసద్యోని జాతులు. పుణ్యాపాపాలను కలిపి ఆచరించే వారు మధ్యవర్తు లైన మానవులుగా జన్మిస్తారు. అవి సదసద్యోనులు. వారు సదసద్యోని జాతులు ***(కారణం గుణసంగోఽస్య సదసద్యోని జన్మసు).***

అధ్యాసయే సంసారానికి కారణము. అనుభవింపబడే సుఖదుఃఖ మోహాదుల యందు సంగత్వమే, ఆత్మ భావమే సంసారానికి, తద్వారా జన్మలకు కారణ మవుతూ ఉంది. ఇదే బంధము. బంధమే జనన మరణ రూప ప్రవాహానికి హేతువు అవుతూ ఉంది. అనాత్మ యందు ఆత్మభావమును కలిగి ఉండటం చేత నువ్వు కర్తవు అవుతున్నావు. కర్తగా కర్మలను ఆచరిస్తున్నావు కనుక, ఆ కర్మఫలాలను అనుభవించడానికి భోక్తవు అవుతున్నావు. కర్తగా పుణ్యాపాపాలను తయారు చేసుకుంటావు. ఆయా పుణ్యాపాప ఫలాలను అనుభవించడానికి జన్మ లెత్తుతావు. మళ్ళీ కర్మాచరణమే, ఆ తరువాత ఫలానుభవమే; తిరిగి జన్మ నెత్తడమే.

జననమరణ రూపమైన ఈ సంసార నివృత్తి జరగాలి అంటే, ఆధ్యాసిక సంబంధము తెగి పోవాలి. ఈ ఆధ్యాసిక సంబంధము, లేక అనిత్య సంబంధము తొలగాలి అంటే, స్వరూప జ్ఞానము కలగాలి. దానినే ప్రస్తుత అధ్యాయంలో జ్ఞేయముగా మనం చెప్పుకున్నాం. ఏది తెలుసుకుంటే అమృతత్వము ప్రాప్తిస్తుందో ***(యత్ జ్ఞాత్వా అమృత మశ్నుతే*** *- 12 వ శ్లో)* అదే జ్ఞేయము. క్షేత్రజ్ఞ స్వరూపము. అదే పురుష స్వరూపము.

అందుచేత పురుషుని స్వరూపము వర్ణింప బడుతూ ఉంది.

ఉపద్ర ష్టాఽనుమన్తా చ భర్తా భోక్తా మహేశ్వరః ।
పరమా త్మేతి చాప్యుక్తో దేహేఽస్మి న్పురుషః పరః ॥ 22

ఉపద్రష్టా-అనుమంతా-చ-భర్తా-భోక్తా-మహేశ్వరః
పరమాత్మా-ఇతి-చ-అపి-ఉక్తః-దేహే-అస్మిన్-పురుషః-పరః

అస్మిన్	=	ఈ	ఉపద్రష్టా	=	సాక్షియు
దేహే	=	దేహము నందు	అనుమంతా చ	=	అనుమతించు వాడు
పరః	=	పరుడైన	భర్తా	=	భరించు వాడు
పురుషః	=	పురుషుడు			

భోక్తా	=	అనుభవించువాడు	పరమాత్మా ఇతి చ అపి	=	పరమాత్మ అని కూడా
మహేశ్వరః	=	మహేశ్వరుడు	ఉక్తః	=	చెప్పబడు తున్నాడు

అర్జునా! ఈ దేహంలో ఉన్న పరమ పురుషుడే ఉపద్రష్ట; అనుమన్తుడు; భర్త, భోక్త, మహేశ్వరుడు, పరమాత్మ కూడా.

వ్యాఖ్య

ప్రకృతితో ఏర్పడిన మిథ్యా సంబంధం వలన పురుషునికి సంసారిత్వం ప్రాప్తించిందే గాని, స్వరూపత: పురుషునికి సంసారిత్వం లేదు. ఈ పరతత్త్వాన్ని స్పష్టం చేయడానికి పురుషుని యొక్క ప్రకృతి సంబంధ రాహిత్యాన్ని, ప్రకృతి సంబంధ కార్య శూన్యతను ప్రస్తుత శ్లోకంలో వివరిస్తున్నాడు. కార్యకరణాలలో ఉంటూ విలక్షణంగా ప్రకాశించే క్షేత్రజ్ఞ స్వరూపాన్ని వివరించే ఈ శ్లోకము అందమైనది; అద్భుత మైనది కూడా. **సచ యో యత్ప్రభావశ్చ** అనే మూడవ శ్లోకంలో క్షేత్రజ్ఞుని, క్షేత్రజ్ఞుని ప్రభావాన్ని చెబుతాను అన్నాడు భగవంతుడు. జ్ఞేయ రూపంగా క్షేత్రజ్ఞుని గూర్చి ఇంతవరకు వివరంగా తెలుసుకున్నాం. ఇక ఇప్పుడు, క్షేత్రజ్ఞుని ప్రభావాన్ని తెలుసుకుంటాము. దేహంలో ఉంటూ, దేహ ధర్మాలకు అంటకుండా, ఇంద్రియ మనోబుద్ధులను ప్రకాశింప చేస్తూ, వాటి చేత స్పృశింప బడకుండా విలక్షణంగా శోభించే పురుషుణ్ణి ఆరు విశేషణాలతో భగవంతుడు వర్ణిస్తున్నాడు.

ఉపద్రష్ట

ద్రష్ట అంటే చూచేవాడు. 'ఉప' అనే ఉపసర్గ సామీప్యార్థకము. కనుక సమీపమున ఉండి చూచేవాడు ఉపద్రష్ట. పరీక్షలు వ్రాసే గదిలో విద్యార్థులు పరీక్ష వ్రాస్తూ ఉంటే, పర్యవేక్షకుడు సమీపంలో ఉండి చూస్తూ ఉంటాడు. తాను ఏమీ చేయకుండా, చేసే వారిని చూస్తూ ఉండేవాడు ఉపద్రష్ట ***(సమీపస్థః సన్ ద్రష్టా స్వయం అవ్యాపృతః).*** అలాగే దేహేంద్రియాలకు దగ్గరలో ఉంటూ, వాటితో ఏ విధమైన సంబంధము లేకుండా చూచేవాడు కనుక పురుషుడు ఉపద్రష్ట ***(కార్యకరణానాం స వ్యాపారాణాం సామీప్యేన ద్రష్టా ఉపద్రష్టా).***

మరో విధంగా చెప్పుకుంటే దేహము, కన్ను, మనస్సు, బుద్ధి, ఆత్మ - ఇవన్నీ ద్రష్టలే ***(దేహ చక్షు ర్మనో బుద్ధ్యాత్మానః ద్రష్టారః).*** వీటిలో బాహ్యమును అవలోకించే దేహము బాహ్యద్రష్ట. అక్కడ నుండి వెనుదిరిగి కన్ను, మనస్సు, బుద్ధి మొదలైన ద్రష్టలను దాటుకుంటూ క్రమేపి అంతర్ముఖ మైతే, ప్రత్యక్షంగా, సమీపంలో ఉండే ద్రష్ట ఆత్మ. అందుకే అది ఉపద్రష్ట. సర్వసాక్షి అయిన ఈ ఉపద్రష్టను దర్శించే ద్రష్ట మరొకడు లేడు. అంటే, ఒక దశలో ద్రష్టలుగా తెలిసే దేహేంద్రియ మనోబుద్ధులు, మరొక దశలో దృశ్యా లవుతున్నాయి. ఉపద్రష్ట యైన ఆత్మ మాత్రం సదా ద్రష్టయే గాని, ఏ స్థితి లోనూ దృశ్యం కాదు. అది కూడా ఏ విధమైన సంబంధము, సంపర్కము లేని ద్రష్టగా ఉంటుంది. దృశ్య సంబంధం లేనిదై శోభిస్తుంది.

స యత్ర తత్ర కించి త్పశ్య త్యనన్వాగత స్తేన భవ త్యసఙ్గో హ్యయం పురుషః!

కార్యకరణాలకు సమీపముగా ఉన్న ఉపద్రష్ట వాటిలో ఏది చూచినా, దానితో చేరకుండా చూస్తూ ఉంటాడు. కనుక ఉపద్రష్ట యైన పురుషుడు అసంగుడు అన్నది వేదం.

అనుమన్త

అనుమన్త అంటే అనుమతించే వాడు, లేదా ఆమోదించే వాడు అని అర్థము ***(అనుమన్తా చ అనుమోదనమ్ అనుమననమ్).*** దేహేంద్రియ మనోబుద్ధులు వాటి వాటి పనులలో నిమగ్నమై ఉంటే, వాటిని ఔననక, కాదనక

సాక్షిగా వీక్షించే వాడు అనుమన్త. విలక్షణంగా అతడు వీక్షిస్తూ ఉంటే, ఆయా కార్యాలను సమ్మతించినాడా! ఆమోదించినాడా! అన్నట్లు ఉంటుంది. వాస్తవానికి అతడు అసంగుడు. విలక్షణుడు. కనుక సాక్షిగా వీక్షిస్తాడే గాని నివారించే ప్రయత్నం చేయడు ***(ప్రవృత్తాన్ స్వ వ్యాపారేషు తత్సాక్షి భూతః కదాచిదపి న నివారయతి ఇతి అనుమన్తా).***

భర్త

భరించే వాడు భర్త. భర్త భార్యను పోషించినట్లు కార్యకరణ సంఘాతాన్ని పోషించే వాడు కావడం చేత క్షేత్రజ్ఞుడు, లేదా పురుషుడు భర్త. తాను ఆధారంగా ఉండటం చేతనే క్షేత్రము ప్రకాశిస్తూ, ప్రవర్తిస్తూ ఉంది. అందుచేత, పురుషుడు భర్త.

క్షేత్రస్య అధిష్ఠానత్వేన భరణాత్ భర్తా - క్షేత్రానికి సత్తా స్ఫూర్తులను ప్రసాదించి, అధిష్ఠాన స్వరూపంగా క్షేత్రాన్ని పోషించే వాడు కావడం చేత తాను భర్త. భరణీయముల కంటే భర్త భిన్నమైన వాడు కాన, భర్త యైన పురుషుడు ప్రకృతి రూపమైన క్షేత్రానికి అన్యమైన వాడుగా తెలుస్తున్నాడు.

భోక్త

అగ్నికి ఉష్ణము ఎలా సహజమో, ఆత్మకు నిత్య చైతన్య స్వరూపము అలా సహజము. అగ్ని యొక్క ఉష్ణత్వం సమీపంలో ఉన్న వస్తువులకు సంక్రమించి, అవి కూడా వేడిగా మారినట్లు, అంటే అగ్ని వాటిని ఆశ్రయించినట్లు; ఆత్మ యొక్క నిత్య చైతన్య స్వరూపము సమీపములో ఉన్న అచేతన మైన బుద్ధిని ఆశ్రయించి, బుద్ధి లోని సుఖదుఃఖ మోహాత్మకము లైన వృత్తులను కూడా వ్యాపిస్తుంది. అందుచేత ఆత్మ భోక్త అని చెప్ప బడింది.

మహేశ్వరుడు

ఆత్మ సర్వాత్మకము. స్వతంత్రము ***(సర్వాత్మత్వాత్ స్వతంత్రత్వాచ్చ).*** ఇలా మహత్తైనది, నియంత అయినది కావడం చేత ఆత్మ మహేశ్వరుడని చెప్పబడింది ***(మహాన్ ఈశ్వరశ్చ ఇతి మహేశ్వరః).***

పరమాత్మ

అవిద్యా కల్పితమైన దేహాది బుద్ధ్యంత వికారాలకు ఉపద్రష్టగా ఉంటూ, ప్రత్యగాత్మగా శోభిస్తూ, ఉత్కృష్టమై ఉండటం చేత ఆత్మ పరమాత్మ అనబడింది. ఈ పరమాత్మ దేహము నందే ఉన్నాడు ***(సః అన్తః పరమాత్మా).*** ఆత్మయే బ్రహ్మము అని మహావాక్య నిర్ణయము కనుక ***(అయమాత్మా బ్రహ్మ).*** ఆత్మయే పరమాత్మ శబ్దం చేత చెప్పబడ్డాడు.

ఇక్కడ వాక్యార్థ విశేషం కూడా ఉంది. పిండస్థ మైన క్షేత్రజ్ఞుణ్ణి ***త్వం*** పద శోధన క్రమంలో 'ఉపద్రష్ట', 'అనుమన్త', 'భర్త', 'భోక్త' అనే మొదటి నాలుగు విశేషణాల ద్వారా చెప్పి, బ్రహ్మాండమైన చైతన్యమును ***తత్*** పద శోధన ప్రక్రియలో 'మహేశ్వరుడు', 'పరమాత్మ' అనే చివరి రెండు విశేషణాల ద్వారా ప్రవచించి, ***తత్త్వమసి*** వాక్య బోధను కూడా ఇక్కడ ఆవిష్కరించడం జరిగింది. ***క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి*** అని ప్రారంభించి ప్రసంగించిన విషయం ఇక్కడ సమాప్త మౌతూ ఉంది.

య ఏవం వేత్తి పురుషం ప్రకృతిం చ గుణైః సహ ।
సర్వథా వర్తమానోఽపి న స భూయోఽభిజాయతే ॥ 23

యః-ఏవం-వేత్తి-పురుషం-ప్రకృతిం-చ-గుణైః-సహ
సర్వథా-వర్తమానః-అపి-న-సః-భూయః-అభిజాయతే

యః	= ఎవడు	సః	= వాడు
ఏవం	= ఈ విధంగా	సర్వథా	= అన్ని విధాల
పురుషం	= పురుషుని	వర్తమానః అపి	= ప్రవర్తిస్తున్నా కూడా
గుణైః సహ	= గుణములతో గూడ	భూయః	= తిరిగి
ప్రకృతిం చ	= ప్రకృతిని	న అభిజాయతే	= పుట్టడు
వేత్తి	= తెలుసుకుంటున్నాడో		

అర్జునా! క్షేత్రజ్ఞుడైన పురుషుని, గుణాలతో కూడిన ప్రకృతిని తెలుసుకున్న వాడు వ్యవహారంలో ఎలా ప్రవర్తించినా తిరిగి పునర్జన్మను పొందదు.

వ్యాఖ్య

క్షేత్రజ్ఞుని స్వరూపమును, ప్రభావమును విస్తారముగా వివరించిన భగవంతుడు, అట్టి జ్ఞాన వైభవము యొక్క ఫలమును చివరగా ఈ శ్లోకంలో చెబుతున్నాడు.

జ్ఞేయ స్వరూపంగా తెలియబడిన క్షేత్రజ్ఞుని తన స్వరూపం గానే తెలుసుకొని, నేనే ఈ పురుషుణ్ణి **(అయమహ మస్మి)** అని సాక్షాత్కారమును పొందిన వాడు, అలాగే వికారయుత మైన క్షేత్రమును గూర్చి కూడా సమగ్రముగా తెలుసుకున్న వాడు, జ్ఞానోత్ప త్త్యనంతరము ఏ విధమైన జీవితమును కొనసాగించినా, ***(సర్వథా సర్వ ప్రకారేణ వర్తమానః అపి)*** తన విద్వద్దేహము పతనమైన తరువాత, తిరిగి జన్మించి మరొక శరీరమును ధరించడు ***(స భూయః పునః పతితే అస్మిన్ విద్వ చ్ఛరీరే దేహాంతరాయ నాభిజాయతే నోత్పద్యతే).*** క్షేత్ర క్షేత్రజ్ఞ స్వరూప జ్ఞానము సంపూర్ణంగా పొందిన వారు జన్మల నుండి విడిపడి తరించి పోతున్నారు అనేది ఫలశ్రుతి.

తేజము తిమిరాన్ని అదృశ్యం చేసినట్లు, విద్య అవిద్యను, అవిద్యా కార్యాలను కూడా అంతం చేస్తుంది. జన్మ అనేది కూడా అవిద్యా కార్యమే కనుక కారణమైన అజ్ఞాన నాశము జరిగిన తరువాత, కార్యాలైన జన్మాదులు సంభవించే అవకాశము లేదు.

జన్మ అనేది కర్మలతో ముడిపడి ఉంటుంది. కర్మ ఫలానుభవానికే జీవుడు జన్మలను పొందుతాడు. నేను క్షేత్రజ్ఞుణ్ణి, నేనే బ్రహ్మమును అనే జ్ఞానము ప్రాప్తించిన కారణంగా ***(బ్రహ్మ అహ మితి విజ్ఞానాత్),*** కలలో ఆచరించిన కర్మల యొక్క ఫలితాలు నిద్ర నుండి మేల్కొన్న వానిని అంటనట్లు ***(యథా స్వప్న కర్మవత్ ప్రబోధాత్),*** జ్ఞానిని కర్మలు, కర్మఫలాలు స్పృశించ లేవు. కర్మలు, కర్మఫలాలు ప్రకృతికి సంబంధించినవే గాని, పుట్టుక లేని ఆత్మకు సంబంధించినవి కావు కదా! ఇక జ్ఞాని వ్యవహార మంటారా? దేహము తాను కాదని తెలుసుకున్న ఆత్మవిదునికి ఉపాధియే లేనందున వ్యవహారము కూడా ఉండదు. చూచే వారి దృష్టిలో ఆత్మవిదుడు వ్యవహారంలో ఉన్నట్లు కనిపించినా, ఆత్మజ్ఞాని అకర్త గానే శోభిస్తాడు. చేసినా చేయని వాడే. స్వప్నద్రష్ట లాగా దేనినీ అంటని వాడే.

జ్ఞానప్రాప్తి జరిగిన తరువాత, వ్యవహారంలో కర్తృత్వము గోచరించినా, అది జ్ఞానికి సంబంధించినది కాదు. అది బాధిత కర్తృత్వము. అగ్నిలో కాలిన విత్తనము లాంటిది. కాలిన బీజాలు ఎలా తిరిగి మొలకెత్త లేవో, దగ్ధమైన అవిద్యా కామ్య కర్మ బీజాలు కూడా జన్మలకు, తద్వారా సంసారానికి కారణం కాలేవు.

బీజా న్యగ్న్యుప దగ్ధాని న రోహన్తి యథా పునః ।
జ్ఞాన దగ్ధై స్తథా క్లేశైః ఆత్మా సంపద్యతే పునః ॥

'అగ్నిలో కాలిన బీజాలు తిరిగి ఎలా మొలకెత్తవో, అలాగే అజ్ఞానము దగ్ధమై క్లేశము లన్నీ నశించిన తరువాత, ఆత్మ తిరిగి జన్మించదు' అని మహాభారతము - అరణ్యపర్వము.

అట్టి అద్భుత దర్శనార్థము సాధనోపాయాలను చెబుతున్నాడు.

ధ్యానే నాత్మని పశ్యన్తి కేచి దాత్మాన మాత్మనా ।
అన్యే సాంఖ్యేన యోగేన కర్మయోగేన చాపరే ॥ **24**

ధ్యానేన-ఆత్మని-పశ్యంతి-కేచిత్-ఆత్మానం-ఆత్మనా
అన్యే-సాంఖ్యేన-యోగేన-కర్మయోగేన-చ-అపరే

కేచిత్	= కొందరు	అన్యే	= మరి కొందరు
ధ్యానేన	= ధ్యానము చేత	సాంఖ్యేన	= జ్ఞాన సంబంధమైన
ఆత్మని	= ఆత్మ యందు	యోగేన	= యోగము చేత
ఆత్మనా	= ఆత్మ చేత	అపరే	= ఇతరులు
ఆత్మానం	= ఆత్మను	కర్మయోగేన చ	= కర్మయోగము చేతను
పశ్యంతి	= చూస్తున్నారు	పశ్యంతి	= చూస్తున్నారు

అర్జునా! కొందరు ధ్యానాన్ని అవలంబించి శుద్ధ బుద్ధి కలిగి, ఆత్మను హృదయంలో దర్శిస్తారు. కొందరు జ్ఞానయోగం చేత, మరి కొందరు కర్మయోగం చేత ఆత్మను దర్శిస్తారు.

వ్యాఖ్య

ధ్యాన జీవనము

కొందరు ధ్యాన మనే అంతరంగ సాధన చేత శుద్ధి పడిన బుద్ధిలో ఆత్మను దర్శిస్తారు. ***వివిక్త దేశే చ సుఖాసనస్థః*** అని గీత - ఆరవ అధ్యాయంలో చెప్పినట్లు, ***ఏకాంతే సుఖ మాస్యతాం పరతరే చేతః సమాధీయతాం -*** ఏకాంతములో సుఖంగా ఆసీనులై పరమాత్మ యందే చిత్తాన్ని నిలపాలి అని శ్రీ శంకరులు సాధన పంచకంలో చెప్పినట్లు, ధ్యానాసనంపై కూర్చుని, బహిర్ముఖమై శబ్దాది విషయాల వైపు పరుగులు తీసే శ్రోత్రాది ఇంద్రియాలను నిగ్రహించి, అంతర్యంలో ఏకాగ్రతతో చింతించడమే ధ్యానము. నిరభ్యంతరంగా సాగే సరళ చింతనము.

ధ్యానము అనేది కేవలం మానస వ్యాపారము. అన్య సంకల్పాలను అరికట్టి, కేవలం బ్రహ్మాకార వృత్తినే కొనసాగించే సరళ చింతనము. విజాతీయ రహిత సజాతీయ వృత్తి ప్రవాహ రూప బ్రహ్మవిషయ మానస వ్యాపారము. కనుక, ధ్యాన మనేది తైలధార లాగా ఉండాలి అన్నది శాస్త్రం.

ధ్యాయతీవ బకః, ధ్యాయ న్తీవ పర్వతాః - కొంగ ధ్యానం చేస్తున్నట్లు ఉంది. పర్వతాలు ధ్యానం చేస్తున్నట్లు ఉన్నాయి అనే ఉపమానాలు అలాగే ప్రాచుర్యాన్ని పొందాయి.

కొంగ గట్టుపై కూర్చుని, నీటిలో చలించే చేపనే తదేకంగా చూస్తూ ఉంటుంది. ఆ క్షణంలో తన లక్ష్య మైన మత్స్యము తప్ప మరొకటి కొంగకు కనిపించదు. అలాగే ధ్యానయోగి మనస్సును తన లక్ష్య మైన పరబ్రహ్మము నందే ఉంచుతాడు, అలా ఉంచాలి అనేది దృష్టాంతము.

ఇక పర్వతము అంటే, చలించదు అని అర్థము. దేహమును పర్వతం లాగా చలించకుండా నిలిపి, మనస్సును బకము వలె లక్ష్యము నందే స్థిరం చేసి ధ్యానయోగులు బుద్ధిలో ఆత్మను దర్శిస్తారు.

ధ్యానం వల్ల అంతఃకరణ నైశ్చల్యము ఏర్పడుతుంది. శ్రవణ సంస్కార జన్యమైన జ్ఞానము నిశ్చలమై, నిర్మలమైన బుద్ధి యందు ధ్యాన సమయంలో స్థిరపడి, సమస్త దృశ్యమాన క్షేత్రమును ప్రకాశింప చేస్తున్న నిర్విశేష పరిపూర్ణ పరబ్రహ్మమును దర్శింప చేస్తుంది. ఈ విధంగా ధ్యానయోగులు ఆత్మదర్శనం చేస్తారు.

జ్ఞానదృష్టి

ధ్యానయోగులు శుద్ధ బుద్ధి చేత హృదయంలో ఆత్మదర్శనం చేస్తే, మరి కొందరు సాంఖ్యయోగులై ఆత్మదర్శనం చేస్తారు **(అన్యే సాంఖ్యేన యోగేన).** గుణాలన్నీ క్షేత్ర సంబంధ మైనవి. అవన్నీ నాకు దృశ్యాలు. నేను ద్రష్టను. దృశ్యాలకు విలక్షణమైన వాణ్ణి. సాక్షిని అని ఆత్మానుచింతనము సాగించే జ్ఞానసాధనే సాంఖ్యము. నేను అకర్తను. అభోక్తను. అవస్థాత్రయ సాక్షిని అని సదా ఎరుక కలిగి ఉండటము సాంఖ్యము. ఈ విధమైన జ్ఞానము ఆత్మను సాక్షాత్కరింప చేసి, సంసారమును నశింప చేయడం చేత దీనిని సాంఖ్యము అన్నారు.

చిత్తశుద్ధి

కొందరు ధ్యానం చేత, కొందరు సాంఖ్య యోగము చేత ఆత్మదర్శనము చేస్తూ ఉంటే, మరి కొందరు కర్మయోగులై ఆత్మదర్శన మార్గంలో చరిస్తూ ఉంటారు. ఈశ్వరార్పణ బుద్ధితో కర్మలను ఆచరించడం చేత శుద్ధి పడిన బుద్ధి ఇటు ధ్యానయోగానికి ఉపకరిస్తుంది, అటు సాంఖ్య మార్గంలో జ్ఞానోత్పత్తికి కూడా సహకరిస్తుంది. ఈ విధంగా జ్ఞాన సహకారి అయిన కర్మయోగం ద్వారా కొందరు ఆత్మదర్శనం చేస్తారు.

ఏదైనా, అర్హతను బట్టే ఆచరణలు సాగాలి. సాధనలు కొనసాగాలి. ఎవరి అర్హతను వారు అవలోకించు కొని, వారికి అనుగుణమైన సాధనా మార్గంలో వారు చరించాలి. మార్గానుసరణము అనేది అధికారి భేదాన్ని బట్టే గాని, సాధనా వైశిష్ట్యాన్ని బట్టి కాదు.

ఈ మూడు సాధనలలో ఏ ఒక్క దానిని కూడా ఆచరించ లేని వారి విషయ మేమిటి? వినండి.

అన్యే త్వేవ మజానన్తః శ్రుత్వాన్యేభ్య ఉపాసతే ।
తేఽపి చాతి తరన్త్యేవ మృత్యుం శ్రుతిపరాయణాః ॥ 25

అన్యే-తు-ఏవం-అజానంతః-శ్రుత్వా-అన్యేభ్యః-ఉపాసతే
తే-అపి-చ-అతి-తరంతి-ఏవ-మృత్యుం-శ్రుతిపరాయణాః

అన్యే తు	= కొందరు	ఉపాసతే	= ఉపాసిస్తున్నారు
ఏవం	= ఈ విధంగా	శ్రుతిపరాయణాః	= శ్రవణాసక్తు లయిన
అజానంతః	= గ్రహించలేని వారై	తే అపి చ	= వారు కూడా
అన్యేభ్యః	= ఇతరుల వలన	మృత్యుం	= మృత్యువును
శ్రుత్వా	= ఆలకించి	అతితరంతి ఏవ	= దాటుతునే ఉన్నారు

అర్జునా! ఈ విధంగా గ్రహించలేని వారు ఇతరుల ద్వారా విని ఉపాసన కొనసాగిస్తారు. శ్రవణాసక్తులు కావడం చేత వీరు కూడా మృత్యువును దాటుతారు.

వ్యాఖ్య

పూర్వ శ్లోకంలో మనం తెలుసుకున్న మూడు సాధనలను చేయుటకు వివేకం లేని వారు ***(వివేక రహితాః)***, కేవలం పరుల ఉపదేశము నందే ప్రమాణ బుద్ధి గలవారై ***(కేవలం పరోపదిష్ట ప్రమాణకాః)***, వారు

ఎలా చెబితే అలా శ్రద్ధతో సాధన చేస్తారు. వీరిని శ్రుతి పరాయణులు అన్నారు. అంటే శ్రవణాసక్తి కలవారు అని అర్థము. పెద్దల ఆప్తవాక్యాలను శౌదల దాల్చి, భక్తి శ్రద్ధలతో ఆచరించే ఈ పుణ్యాత్ములు కూడా మృత్యువును దాటుతారు.

ఎవరు ఎలా ఉన్నారో, ఎక్కడ ఉన్నారో, అలా ఉండటం, అక్కడ ఉండటం వారికి ఇష్టం లేక పోవచ్చు. కానీ, ఎవరు ఉండవలసిన చోట వారు ఉన్నారు, ఎవరు ఉండవలసిన విధంగా వారు ఉన్నారు అనే సత్యాన్ని కష్టపడి అయినా అర్థం చేసుకోక తప్పదు.

ధ్యానయోగ్యత, జ్ఞానదృష్టి, కర్మయోగము మొదలైన సాధనలు తెలియని వివేక హీనులను గూర్చి ఈ శ్లోకం ముచ్చటిస్తూ ఉంది. యోగ్యత లేదని అయోగ్యులుగా పడి ఉండటం యుక్తమా? యోగ్యత లేకుండా ఎందు కున్నామో అర్థం చేసుకోదగిన విషయమే గాని విచారించ దగిన విషయం కాదు. యోగ్యత లేదు కదా అని అయోగ్యులుగా పడి ఉండటమే నిజానికి మ్రింగుడు పడని విషయం.

యోగ్యత లేకపోయినా యోగ్యులుగా జీవించాలని, జీవించి తరించాలని భావించే పుణ్యాత్ములనే ఈ శ్లోకంలో 'శ్రుతి పరాయణులు' అన్నారు. తమకు వివేకం లేకపోయినా, వివేకం గల వారు ఉపదేశించిన విషయాల్ని ప్రసాదంగా స్వీకరించి, శ్రద్ధాభక్తులతో ఆచరించే భక్తులు, ఒక దశలో భగవత్కృపకు పాత్రులై, భగవదనుగ్రహాన్ని పొంది తరిస్తారు.

భాగవతంలో ధృవుడు పరమేశ్వరుని దర్శనం పొందిన తరువాత కూడా, మహాత్ముల సాంగత్యాన్ని కోరుతూ, వారి ప్రబోధాలను ఆలకించాలనే శ్రవణాసక్తితో సజ్జన మైత్రిని వాంఛిస్తూ శ్రీహరిని ప్రార్థించాడు.

చ॥ *హరి భజనీయ మార్గ నియతాత్మకులై భవదీయ మూర్తిపై*
వఱలిన భక్తి యుక్తు లగు వారల సంగతి గల్గ జేయు స
త్పురుష సుసంగతిన్ వ్యసన దుస్తర సాగర మప్రయత్నతన్
సరస భవత్కథామృత రసంబున మత్తుడనై తరించెదన్!

'హే భగవంతా! శ్రీహరీ! పవిత్రాత్ములై నీ భక్తి మార్గమున అవిచ్ఛిన్న మైన ఆసక్తితో భక్తి చేయు మహాత్ములతో నాకు సాంగత్యాన్ని ప్రసాదించు. వారి సహచర్య ప్రభావం చేత నీ కథామృతాన్ని మనసారా పానం చేసి, పరవశించి, సంసార సాగరాన్ని దాటి తరిస్తాను' అన్నాడు భాగవతము - చతుర్థ స్కంధములో ధృవ కుమారుడు.

శ్రుతి పరాయణులై ధృవ ప్రహ్లాదాది భక్తులు తరించారు. శబరి, గజేంద్రుడు, గోపికలు మొదలైన వారెందరో శ్రుతి పరాయణులయ్యే తరించారు.

ఈ సందర్భములో శ్లోకం లోని **తేఽపి** అనే చోట కనిపిస్తున్న **అపి** - 'కూడా' అనే శబ్ద స్వారస్య మును అవలోకించాలి. వివేకం లేకపోయినా శ్రద్ధాసక్తులు కలిగి, శ్రుతి పరాయణులైన వారు కూడా ***(అపి)*** తరిస్తారు అన్నప్పుడు, ఇక వివేకవంతులై, ప్రమాణ విషయము నందు విచార సమర్థులైన వారు తరిస్తారని ప్రత్యేకంగా చెప్ప వలసిన అవసర ముందా? అనేది **అపి** శబ్దార్థము.

క్షేత్రజ్ఞ ఈశ్వర ఏకత్వమును గూర్చిన జ్ఞానం అమృతత్వాన్ని ప్రసాదిస్తుందని చెప్పుకున్నాం (13 వ అ - 12 వ శ్లో). దానికి హేతువు ఏమిటో చెబుతున్నాడు.

యావ త్సంజాయతే కించి త్సత్త్వం స్థావరజఙ్గమమ్ ।
క్షేత్ర క్షేత్రజ్ఞ సంయోగా త్తద్విద్ధి భరతర్షభ ॥ 26

యావత్-సంజాయతే-కించిత్-సత్త్వం-స్థావర జంగమం
క్షేత్ర క్షేత్రజ్ఞ సంయోగాత్-తత్-విద్ధి-భరతర్షభ

భరతర్షభ	= అర్జునా!	సంజాయతే	= పుడుతున్నదో
స్థావరజంగమం	= స్థావరజంగమ రూపమైన	తత్	= అది
సత్త్వం	= వస్తువు	క్షేత్రక్షేత్రజ్ఞ సంయోగాత్	= క్షేత్రక్షేత్రజ్ఞుల సంయోగము వలననే
యావత్ కించిత్	= ఏ కొంచెము	విద్ధి	= తెలుసుకో!

అర్జునా! స్థావర జంగమాత్మక మైన వస్తువు ఏది జనించినా, అది క్షేత్ర క్షేత్రజ్ఞుల కలయిక వల్లనే పుడుతున్న దని తెలుసుకో!

వ్యాఖ్య

ప్రకృతి పురుషుల సంబంధమే దుఃఖ హేతువైన సంసారానికి కారణము అని తెలుసుకున్నాం. కనుక ప్రకృతి పురుషుల స్వరూప వివేకమే సంసార నివృత్తికి కారణ మని తెలుస్తూ ఉంది. సంసారము అవిద్యా కల్పితము కనుక, మోక్షము విద్య తోనే ప్రాప్తము. ఈ విషయాన్ని నిశ్చయించి నిర్ధారణ చేయడానికి సంసార ప్రవృత్తి నివృత్తి రూపమైన జ్ఞానము నంతటిని ఇక ఈ అధ్యాయాంతం వరకు చర్చించడము జరుగుతుంది.

'అర్జునా! స్థావర జంగమాత్మక మైనది ఏది పుట్టినా, అది క్షేత్ర క్షేత్రజ్ఞుల సంయోగము వల్లనే జరుగుతూ ఉంది' అన్నాడు భగవంతుడు.

సంయోగము అంటే సంబంధము. మరి, క్షేత్ర క్షేత్రజ్ఞుల సంబంధము ఎలాంటి సంబంధము? అనేది ముందుగా అర్థం కావాలి.

క్షేత్ర క్షేత్రజ్ఞుల సంబంధము సంయోగ సంబంధమా? లేక సమవాయ సంబంధమా?

కుండకు త్రాడుకు ఉన్న సంబంధము సంయోగ రూప సంబంధము. అంటే, అవయవాల కలయిక వల్ల ఏర్పడే సంబంధము. అలాంటి సంయోగ రూప సంబంధము క్షేత్ర క్షేత్రజ్ఞుల మధ్య సంభవించే అవకాశం ఉందా? క్షేత్రజ్ఞుడు ఆకాశము వలె అవయవ రహితుడు. క్షేత్ర మేమో సావయవము. సావయవ నిరవయవములకు సంబంధము అసాధ్యము. కనుక, క్షేత్ర క్షేత్రజ్ఞులకు సంయోగ రూప సంబంధము కుదిరే ప్రసక్తి లేదు.

ఇక రెండవది సమవాయ సంబంధము. రెండిటి మధ్య కార్యకారణ భావము ఉన్నప్పుడు అది సమవాయ సంబంధము అనిపించు కుంటుంది. తంతు పటములకు కారణ కార్య సంబంధము ఉంది కనుక అది సమవాయ సంబంధము. దారానికి, వస్త్రానికి కారణ కార్య సంబంధ మున్నట్లు, క్షేత్ర క్షేత్రజ్ఞులలో కార్య కారణ సంబంధం ఉందా? ఉంటే, ఏది కార్యము? ఏది కారణము? కనుక, క్షేత్ర క్షేత్రజ్ఞుల మధ్య సమవాయ సంబంధము కూడా లేదు.

క్షేత్ర క్షేత్రజ్ఞుల మధ్య ఏ విధమైన సంబంధము ఉండటం చేత సంసారము ప్రాప్తించిందో, ఆ సంబంధ మేదో తెలిస్తే దానిని తొలగించుకొని సంసారాన్ని నివృత్తి చేసుకోవచ్చు.

సంయోగ, సమవాయ సంబంధాలు క్షేత్ర క్షేత్రజ్ఞుల మధ్య ఉండేందుకు అవకాశమే లేదని తెలుసుకున్నాం. మరి ఏ సంబంధం ఉంది? సంయోగ సమవాయ సంబంధాల కంటే వేరుగా సంబంధమే లేదు.

క్షేత్రము దృశ్యము; క్షేత్రజ్ఞుడు ద్రష్ట. క్షేత్రము జ్ఞేయము; క్షేత్రజ్ఞుడు జ్ఞాత. క్షేత్రము జడము, అప్రకాశము; క్షేత్రజ్ఞుడు చైతన్యము, ప్రకాశ స్వరూపము. క్షేత్రము వికారి; క్షేత్రజ్ఞుడు అవికారి. క్షేత్రము అనిత్యము; క్షేత్రజ్ఞుడు

నిత్యుడు. క్షేత్రము సావయవము; క్షేత్రజ్ఞుడు నిరవయవము. క్షేత్రము అనేకము; క్షేత్రజ్ఞుడు ఏకము. ఈ విధంగా పరస్పర విరుద్ధమైన స్వరూపాలతో పరస్పర విలక్షణంగా గోచరిస్తున్న క్షేత్ర క్షేత్రజ్ఞుల మధ్య సంబంధము ఎలా పొసగుతుంది? మరి, సంబంధము వల్లనే సంసారము ప్రాప్తించింది అన్నప్పుడు, అట్టి సంసార నివృత్తికి సంబంధము తొలగాలి కదా? మరి సంబంధమే అర్థం కానపుడు దానిని తొలగించుకొనేది ఎలా? ఒక విధంగా చెప్పాలంటే, క్షేత్ర క్షేత్రజ్ఞుల మధ్య అర్థం గాని సంబంధమే ఉంది. అంతుపట్టని సంబంధమే ఉంది. అదే మిథ్యా రూప సంబంధము. కల్పిత సంబంధము. అధ్యాస రూప సంబంధము.

అన్యోన్యాధ్యాస

అధ్యాసో నామ అతస్మిన్ తద్బుద్ధిః - 'అది కాని దాని యందు అది అనే బుద్ధి అధ్యాస' అని ఆచార్యుల వారి బ్రహ్మసూత్ర భాష్యము. త్రాడు ఉంది. పాము ఉంది. ఇవి పరస్పర విరుద్ధ మైన ధర్మాలతో ఉన్నాయి. రజ్జుసర్పాలకు ఏ విధమైన సంబంధమూ లేదు. అయినా, వాటిని వేరు వేరుగా గుర్తించక పోవడం చేత, త్రాడును పాము అని భావించి భ్రమిస్తున్నాము. అలాగే ముత్యపు చిప్ప ఉంది. వెండి ఉంది. ఆ రెండిటిని వేరు వేరుగా గుర్తించక పోవడం చేత ముత్యపు చిప్పను వెండి అని భ్రమిస్తున్నాము. వాటికి సంబంధించిన వివేక జ్ఞానము లోపించడం చేత ఈ విధమైన అధ్యాస, అంటే 'అది కాని దాని యందు అది అనే బుద్ధి' కలుగుతూ ఉంది. ఒక దాని లక్షణాలను మరొక దాని యందు ఆరోపించడం జరుగుతూ ఉంది ***(రజ్జు శుక్తికాదీనాం తద్వివేక జ్ఞాన అభావాత్ అధ్యారోపిత సర్పరజతాది సంయోగవత్).*** రజ్జు శుక్తికాలకు సంబంధించిన జ్ఞానం లోపించడం చేత సర్ప రజతాలను వాటి యందు ఆరోపించడం జరిగింది. ఇదే అధ్యాస. ఈ సంబంధమే అధ్యాస రూప సంబంధము; లేదా మిథ్యారూప సంబంధము; లేదా కల్పిత తాదాత్మ్య సంబంధము.

క్షేత్ర క్షేత్రజ్ఞులు కూడా భిన్న స్వభావాలతో ఉన్నారు. క్షేత్రము తెలియబడుతూ ఉంది కనుక అది విషయము. క్షేత్రజ్ఞుడు తెలుసుకొనే వాడు అయినందున అతడు విషయి. ఇరువురు పరస్పర విరుద్ధమైన ధర్మాలతో తెలుస్తూ ఉన్నారు ***(క్షేత్ర క్షేత్రజ్ఞయోః విషయ విషయిణోః భిన్న స్వభావయోః ఇతరేతర తద్ధర్మ అధ్యాస లక్షణః సంయోగః).*** క్షేత్ర క్షేత్రజ్ఞులను వేరు వేరుగా తెలుసుకోక పోవడం చేత, వాటి స్వరూపానికి సంబంధించిన జ్ఞానం లేకపోవడం చేత, క్షేత్ర ధర్మాలను క్షేత్రజ్ఞుని యందు, క్షేత్రజ్ఞుని ధర్మాలను క్షేత్రము నందు ఆరోపిస్తున్నాము. ఒక దాని లక్షణాలను మరొక దానిలో పరస్పరం ఆరోపించడం అన్యోన్యాధ్యాస. ఇదే సంసార హేతువు.

క్షేత్రజ్ఞుని ధర్మాలైన సత్తా స్ఫురణలను క్షేత్రము నందు ఆరోపించి 'నేను దేహము' అంటూ క్షేత్ర ధర్మాలైన దుఃఖ ద్వైతాలను క్షేత్రజ్ఞుని యందు ఆరోపించి, 'నేను పుట్టాను'; 'నేను చస్తాను' అని పలుకుతూ, ఈ విధమైన కల్పిత తాదాత్మ్య సంబంధము ద్వారా సంసారాన్ని తయారు చేసుకుంటున్నాము. అలా కాకుండా, ఉపాధి విశేషాలను దూరం చేసి, జ్ఞేయమైన క్షేత్రజ్ఞుని యథార్థ స్వరూపాన్ని తెలుసుకోవాలి. ఇది సత్యజ్ఞానము. సత్య జ్ఞానము మిథ్యా జ్ఞానానికి విరుద్ధ మైనది కావడం చేత, తేజము తిమిరాన్ని హరించినట్లు, సత్యజ్ఞానము మిథ్యా జ్ఞానమును, అది కల్పించిన సంసారాన్ని సమూలంగా నిర్మూలిస్తూ ఉంది.

అవిద్యను అంత మొందించే సమ్యగ్దర్శనాన్ని చెబుతున్నాడు.

సమం సర్వేషు భూతేషు తిష్ఠన్తం పరమేశ్వరమ్ । 27
వినశ్య త్స్వవినశ్యన్తం యః పశ్యతి స పశ్యతి ॥

సమం-సర్వేషు-భూతేషు-తిష్ఠంతం-పరమేశ్వరం
వినశ్యత్సు-అవినశ్యంతం-యః-పశ్యతి-సః-పశ్యతి

సర్వేషు	=	సమస్తములైన	అవినశ్యంతం	=	నశించని వానినిగా
భూతేషు	=	భూతముల యందు	యః	=	ఎవడు
సమం	=	సమముగా	పశ్యతి	=	చూస్తున్నాడో
తిష్ఠంతం	=	ఉన్న	సః	=	వాడు
పరమేశ్వరం	=	పరమేశ్వరుని	పశ్యతి	=	చూస్తున్నాడు
వినశ్యత్సు	=	నశిస్తున్న వాటిలో			

అర్జునా! సమస్త భూతాలలో సమంగా విలసిల్లుతూ, దేహాలు నశించి పోతున్నా పరమేశ్వరుడు నశించకుండా ఉన్నాడు. ఆ దివ్యాత్ముని ఎవడు చూస్తాడో వాడే నిజమైన చూపు కలవాడు.

వ్యాఖ్య

అవిద్య వలన ఏర్పడిన క్షేత్ర క్షేత్రజ్ఞుల కల్పిత మిథ్యా రూప సంబంధమే జన్మకు కారణ మని అర్థ మయింది. సమ్యగ్దర్శన కారణంగా అవిద్య అంతరించి సంసారము నశిస్తుంది అని కూడా స్పష్ట మయింది. సంసార బీజాలను దగ్ధం చేసి జన్మరాహిత్యానికి కారణమయ్యే సమ్యగ్దర్శనాన్ని ఇప్పుడు వివరిస్తున్నాడు.

అర్జునా! సర్వభూతాలలో సమంగా ఉంటూ, దేహాలు నశిస్తున్నా **(వినశ్యత్సు)** నశించని పరమేశ్వరుని ఎవడు చూస్తున్నాడో **(యః పశ్యతి)** వాడే నిజమైన చూపు గలవాడు అని సమ్యగ్దర్శన వైభవాన్ని వర్ణిస్తున్నాడు భగవంతుడు. అదే క్షేత్రజ్ఞ దర్శనం.

క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి సర్వ క్షేత్రేషు - సర్వ క్షేత్రాలలో ఉండే క్షేత్రజ్ఞుణ్ణి నన్నుగా తెలుసుకో అని రెండవ శ్లోకంలో ప్రసంగించాడు. ఆ విషయాన్నే ప్రస్తుత శ్లోకంలో ధృవపరుస్తూ క్షేత్రజ్ఞ ఈశ్వరుల ఏకత్వాన్ని నిరూపిస్తున్నాడు. అక్కడ **సర్వ క్షేత్రేషు** అన్నాడు. ఇక్కడ **పరమేశ్వరం** అంటున్నాడు. అలా అనడంలో క్షేత్రజ్ఞునికి, పరమేశ్వరునికి మధ్య అభేదాన్ని దర్శింప చేస్తూ, సమ్యగ్దర్శనాన్ని ఆవిష్కరిస్తున్నాడు.

పరమేశ్వర దర్శనం

క్షేత్రమును ఉపాధిగా కలవాడు క్షేత్రజ్ఞుడు. మాయను ఉపాధిగా కలవాడు ఈశ్వరుడు. క్షేత్రానికి ప్రభువు క్షేత్రజ్ఞుడు. మాయా జగత్తుకు ప్రభువు ఈశ్వరుడు. నియంత్రించి పాలించే శక్తి గల ప్రభువు ఈశ్వరుడు **(ఈశన శీలః)**. కానీ, సృష్టిలో పాలించే ప్రభువులు అనేక మంది కనిపిస్తారు. సృష్టికర్త యైన బ్రహ్మదేవుడు ప్రభువే. అలాగే లోకాలను పాలించే దేవతలూ ప్రభువులే. ఈ లోకంలో రాజ్యాలు పాలించే వారు కూడా ప్రభువులే. అందరికీ కొద్దోగొప్పో ఈశ్వరత్వం ఉంది. కానీ, ఈ విధమైన ప్రభువులకు, పరమాత్మకు తేడా ఉంది. ఈశన శీలత్వం అందరిలో అగుపిస్తున్నా, వారు పరిమిత శక్తిమంతులు. పరమాత్మ లాగా అనంతులు కారు. ఈ తేడాను సూచించడానికే ఈ శ్లోకంలో పరమేశ్వర దర్శనం చేయిస్తున్నాడు గీతాచార్యుడు.

పరమశ్చ అసౌ ఈశన శీలశ్చ ఇతి పరమేశ్వరః - పరమేశ్వరుడు అంటే, పాలించే సామర్థ్యము (ఈశన శీలత్వం) కలవాడు మాత్రమే కాదు. ఆయన పరముడు, అనగా అనంతుడు కూడా. అందుచేతనే ఆయన పరమేశ్వరు డయ్యాడు. అట్టి అనంతుడైన పరమేశ్వరుడు నశించే దేహాలలో ఉన్నా నశించే వాడు కాడు **(వినశ్యత్సు అవినశ్యన్తం)**.

సమత్వం - అవినాశిత్వం

సర్వ భూతాలలో నిర్విశేషంగా ఉండటం చేత పరమేశ్వరుడు 'సముడు' ***(సమం నిర్విశేషం)***. నశించే దేహాలలో ఉన్నా నశించే వాడు కానందున ఆయన 'అవినాశి'. కాలగతాలు నశిస్తాయి. అనంతుడైన పరమేశ్వరుడు కాల పరిచ్ఛేదము లోకి రాడు కనుక ఆయన నశించే వాడు కాడు. అవినాశి.

దేహాలన్నీ నశించే స్వభావం కలవి. అవి ప్రకృతి సంబంధ మైనవి కనుక వికారం చెందుతూ నశిస్తాయి. పరమేశ్వరుడు నశించే వాడు కాడు అంటే, దేహాల వలె వికారం చెందేవాడు కాడు అని అర్థము.

భావ వికారా లన్నిటికీ పుట్టుక మూలం. అలా పుట్టిన తరువాత నశించే వరకు అనేక వికారాలు చోటు చేసుకుంటాయి. చివరి భావ వికారము వినాశము. పరమేశ్వరునికి వినాశము లేదు అంటే చివరి వికారము లేదు అని అర్థము. చివరి వికారము లేదు అని చెప్పడం చేత, దానికి ముందున్న వికారాలు కూడా లేవని చెప్పి నట్లైంది ***(అన్త్య భావ వికార అభావ అనువాదేన పూర్వ భావినః సర్వే భావ వికారాః ప్రతిషిద్ధా భవన్తి!)***. అందుచేత వికార రహితుడైన పరమేశ్వరునికి నిర్విశేషత్వం చెప్పబడింది. అదే సమం.

పరమేశ్వరుడు సముడు. సర్వ వికారములు లేనివాడు కావడం చేత ఆయన సముడు. సదా, అంటే సర్వ కాలాలలో సముడు ***(సర్వ కాలేషు సర్వ వికార రహితత్వాత్ సమః)***. మార్పులు, లేదా వికారాలన్నీ ప్రకృతి సంభవాలు. క్షేత్ర ధర్మాలు. పరమేశ్వరుడు ప్రకృతికి విలక్షణుడు కావడం చేత ఆయన వికార రహితుడు. అవినాశి. సమరూపుడు. సమరూపుడైన పరమేశ్వరుడు సర్వభూతాలలో ఉన్నందున, పరమేశ్వరుడు ఎవరో కాదు, క్షేత్రజ్ఞుడే. సర్వ క్షేత్రాలలో సముడై ప్రకాశించే అట్టి పరమేశ్వరుని దర్శనమే సమ్యగ్దర్శనము.

సమదర్శనమే సత్య దర్శనము

క్షేత్రము నశించినా నశించని వాడు క్షేత్రజ్ఞుడు. ప్రకృతి నశించినా నశించని వాడు పురుషుడు. ప్రపంచము లేకపోయినా ఉండేవాడు పరమేశ్వరుడు. ప్రపంచానికి పరమాత్మ ఆధారము. ప్రపంచము, లేదా ప్రకృతి ఆరోపము. క్షేత్రజ్ఞునిలో క్షేత్ర ధర్మాలను ఆరోపించినట్లు, పరమాత్మ స్వరూపము నందు ప్రపంచాన్ని ఆరోపించడం జరిగింది.

రజ్జువు నందు సర్పము ఆరోపించ బడింది. ఇదే మిథ్య, లేదా మాయ. అధిష్ఠానమైన రజ్జు దర్శనంతో ఆరోపమైన సర్పము అదృశ్య మవుతుంది. అధిష్ఠానమైన రజ్జువును చూడటం సత్యదృష్టి. అధ్యస్త మైన సర్పమును చూడటము మిథ్యా దృష్టి. నామరూపాల దృష్టి.

మట్టిపాత్ర లన్నీ నామరూపాలే. వాటికి ఆధారమైన మృత్తికను దర్శించడమే సత్యదృష్టి. నామరూపాలతో గోచరించే మట్టిపాత్ర లన్నీ మిథ్యారూపాలే. నామరూపాలతో కనిపించే కుండలకు పుట్టుక ఉంది. కనుక నాశము కూడా ఉంది. నశించే కుండలలో నశించకుండా ఉండేది మట్టే. అదే సత్యం. అదే సమం **(మృత్తికేత్యేవ సత్యమ్)**.

మట్టికుండ ఉంది. కళ్ళున్న వారందరూ దానిని చూస్తారు. కళ్ళున్న వారు కుండను చూస్తారు. కానీ, జ్ఞాననేత్ర మున్నవారు మాత్రమే కుండగా ఉన్న మట్టిని దర్శిస్తారు. కుండను కుండగా చూచేవాడు చూపు గలవాడు. కుండను మట్టిగా చూచేవాడు నిజమైన చూపు గలవాడు. సత్యదృష్టి గలవాడు. సమదృష్టి గలవాడు. ఇదే జ్ఞానదృష్టి. ఇదే సమ్యగ్దర్శనము. ఏకత్వమును దర్శించడము సత్యదర్శనము; అద్వైత దర్శనము. అనేకత్వమును దర్శించడము మిథ్యా దర్శనము; ద్వైత దర్శనము. ఆత్మను మాత్రమే సర్వత్ర సమంగా దర్శించే వాడు నిజ దర్శనం చేసే వాడు ***(ఆత్మానం యః పశ్యతి స ఏవ పశ్యతి)***. అలా కాకుండా అన్యములను దర్శించే

వాడు చూచినా చూడని వాడే **(పశ్యన్తః అపి న పశ్యన్తి).** గగనంలో ఒకే చంద్రుని దర్శించే వాడే సత్యద్రష్ట. నేత్ర రోగము చేత విపరీతంగా అనేక చంద్రులను చూచేవాడు చూచినా చూడని వాడే **(పశ్యన్తః అపి న పశ్యన్తి విపరీత దర్శిత్వాత్ అనేక చంద్ర దర్శివత్ ఇత్యర్థః).** ఇదే ద్వైత చత్వారము.

సమ్యగ్దర్శనానికి ఫలమును ప్రవచించిన భగవానుడు దానిని స్తుతి చేస్తున్నాడు.

సమం పశ్యన్హి సర్వత్ర సమవస్థిత మీశ్వరమ్ ।
న హిన స్త్యాత్మనాత్మానం తతో యాతి పరాం గతిమ్ ॥ 28

సమం-పశ్యన్-హి-సర్వత్ర-సమవస్థితం-ఈశ్వరం
న-హినస్తి-ఆత్మనా-ఆత్మానం-తతః-యాతి-పరాం-గతిం

సర్వత్ర	=	అంతట	ఆత్మనా	=	ఆత్మ చేత
సమం	=	సమముగా	న హినస్తి	=	హింసింపడో
సమవస్థితం	=	ఉన్నటువంటి	తతః	=	తరువాత
ఈశ్వరం	=	ఈశ్వరుని	పరాం	=	ఉత్తమమైన
పశ్యన్ హి	=	చూచుచున్న వాడై	గతిం	=	స్థానమును
ఆత్మానం	=	తనను	యాతి	=	పొందుతున్నాడు

అర్జునా! సర్వత్ర సమంగా ఉన్న పరమేశ్వరుని దర్శించే వాడు తనను తాను హింసించుకోడు. అందుచేత ఉత్తమగతిని పొందుతాడు.

వ్యాఖ్య

సమస్త భూతాలలో సమంగా ఉంటూ, అవినాశిగా శోభిస్తున్న పరమేశ్వరుని దర్శించు వాడు నిజమైన చూపు గల వాడు, సత్యదృష్టి గల వాడు అని పూర్వ శ్లోకంలో సమదర్శిని మనం దర్శించాము. సర్వులలో సర్వేశ్వర దర్శనం చేయడము అంటే, తనలో కూడా తనను తాను సర్వేశ్వరునిగా దర్శిస్తున్నాడు అని అర్థము. అప్పుడే అతడు సమదర్శి అవుతాడు. అప్పుడే అతనిది సమదృష్టి అవుతుంది. అలా కాకుండా, తనను తాను వేరు చేసుకుని, తనకు అన్యమైన దంతా పరమేశ్వరుడు అని దర్శించే వాడు ద్వైత దర్శనం చేస్తున్నాడే గాని సమదర్శనం చేయడం లేదు. ఇది భేద దృష్టి, భేద దర్శన మౌతుందే గాని సమ్యగ్దర్శనం కానే కాదు. ఎంతటి పవిత్రుడైనా, మహాత్ముడైనా, ద్వైతి దారి తప్పేది ఇక్కడే. అంతా పరమేశ్వరుడే, అందరిలో పరమేశ్వరుడే, కానీ, నేను మాత్రం ప్రత్యేకంగా, ఈశ్వర భిన్నంగా ఉన్నాను అని భావించడమే ద్వైత భ్రాంతి. ఈ భ్రాంతి ఉన్నంత వరకు మనిషికి దుఃఖం తప్పదు, సుఖం సమీపించదు.

బాధను భరించడం, హింసను సహించడం ఎవరి కైనా కష్టమే. ఇతరులు బాధించినా, తనను తాను బాధించుకున్నా బాధ బాధే. హింస హింసే. ఇతరులు మనల్ని హింసిస్తే మనం బాధ పడతాము. అలాగని, మనల్ని మనం హింసించుకుంటే సుఖ పడతామా? ఆలోచించండి. కనుక, పూర్వ శ్లోకంలో మనం చూచిన సమదర్శనం జరగనంత వరకు ప్రతి ఒక్కరు తమను తాము హింసించుకొనే వారే. గమ్యాన్ని చేర లేక చతికిల బడే వారే.

సర్వులలో **(సర్వత్ర)** సమంగా **(సమం)** ఉన్న పరమేశ్వరుని **(సమవస్థితమ్ ఈశ్వరమ్)** ఎవడు దర్శిస్తాడో అతడు తనను **(ఆత్మానమ్)** తన చేత **(ఆత్మనా)** హింసించుకోడు ***(న హినస్తి).*** అందుచేత ***(తతః)*** ఉత్తమ గతిని పొందుతాడు **(పరాంగతిం యాతి).** ఇది శ్లోకార్థము.

ఆత్మ హింస

తనను తాను చంపుకోవడం ఆత్మహత్య అయితే, తనను తాను హింసించుకోవడం ఆత్మహింస అవుతుంది. ఎవరైనా తమను తాము హింసించు కుంటారా? పరులను హింసిస్తారు అంటే అర్థం చేసుకోవచ్చు. తమను తాము హింసించుకోవడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ఇది చాలా నిర్హేతుకంగా, అయుక్తంగా కనిపిస్తుంది. ఎవడు కూడా తనను తాను హింసించుకోడు ***(న ఏవ కశ్చిత్ ప్రాణీ స్వయం స్వమ్ ఆత్మానం హినస్తి).*** అలా అవకాశం లేని దానిని ప్రస్తావించడం, ప్రాప్తం కాని దానిని నిషేధించడం అయుక్తం. దోషం. దీనినే శాస్త్రంలో 'అప్రాప్త ప్రతిషేధము' అంటారు. అప్రసక్త మైన హింసను ప్రతిషేధించడము అప్రాప్త ప్రతిషేధము అనే దోషం క్రిందికే వస్తుంది కదా! అనేది శంక.

ఈ విధమైన పూర్వ పక్షానికి ఆధారము లేక పోలేదు. దేవతార్చన ముగిసిన తరువాత, పూజానంతరము నిర్మాల్యాన్ని భూమిపై పడేయ కూడదు అంటే అర్థం చేసుకోగలం. ఆకాశంలో, స్వర్గంలో కూడా పడేయ కూడదు అన్నా రనుకోండి. దానిని ఎలా అర్థం చేసుకోవాలి? అలా పడేసే అవకాశమే లేనపుడు, దానిని నిషేధించే ప్రసంగము అప్రస్తుతం కాదా? అయుక్తం కాదా? అనేది పూర్వ పక్షానికి ఆధారమైన తర్కము. అలాగే తనను తాను హింసించుకోవడం అనేది ఉండదు కనుక, అభావాన్ని ప్రసంగించడం అప్రాప్త ప్రతిషేధము అనే దోషం క్రిందికి రాదా? అనేది సందేహము.

రానే రాదు. ఈ విధమైన దోషం లేనే లేదు. ఎలా లేదో కూడా తెలుసుకుందాం. పూర్వ శ్లోకంలో మనం చూచిన పరమేశ్వరుని సమరూపము ఆత్మయే కదా! ఈ విధమైన జ్ఞానం లేని వారు, అంటే అజ్ఞానులు ఆత్మ దర్శనం చేయలేక పోతున్నారు కదా! అట్టి అజ్ఞానులు ఆత్మను తిరస్కరిస్తున్నారా లేదా? ***(అజ్ఞానామ్ ఆత్మ తిరస్కర ణోపపత్తేః!).*** ఇది ఆత్మహననం కాదా? తొందర పడకండి. ఇక్కడ మరి కొంత అర్థం కావలసి ఉంది. ఆత్మను గుర్తించి దర్శించ లేని అజ్ఞానులు ఆత్మదర్శనం అసలే చేయకుండా ఉన్నారా? చేస్తున్నారు. ఎలా? అనాత్మను ఆత్మగా దర్శిస్తున్నారు. అంటే, దేహాన్ని ఆత్మగా భావిస్తున్నారు. అవునా? కావచ్చు. అంత మాత్రాన అందులో తప్పే ముంది? ఆత్మ అనంతము కదా! దేహము కూడా ఆత్మే కదా! అలాంటప్పుడు దేహమును ఆత్మగా దర్శించడం దోష మెలా అవుతుంది? అవుతుంది. అదీ దోషమే అవుతుంది. ఎలాగో వినండి.

దేహము ఆత్మే అనడంలో ఏ మాత్రము విరోధము లేదు. కానీ అనంతాత్మ అంత మయ్యే దేహము కాదు అని తెలియక పోవడం దోషం. ఇప్పుడు అర్థమైంది అనుకుంటాను. ఇది అర్థం కాక, అనాత్మ యైన దేహమే ఆత్మ అని భావించే అజ్ఞానులు, ధర్మాధర్మాలను ఆచరించి, ఇటువంటి మిశ్రమ కర్మఫలంగా సాధించుకొనిన దేహాన్ని (ఆత్మను) పునర్జన్మలో సాధించుకొనిన దేహాన్ని (ఆత్మను) చంపుకొని, మరొక నూతన మైన దేహాన్ని (ఆత్మను) పునర్జన్మలో పొందుతున్నారు. మళ్ళీ దానిని చంపుకొని వేరొక దానిని పొందుతున్నారు. ఈ విధంగా మళ్ళీ మళ్ళీ దేహాన్ని పొందుతూ, మళ్ళీ మళ్ళీ చంపుకుంటూ పోవడం ఆత్మహింస కాదా? ఆత్మహత్య కాదా? ఆత్మహననము కాదా? కనుక ప్రతి అజ్ఞాని ఆత్మ హింస చేసుకుంటూనే ఉన్నాడు ***(ఇత్యేవమ్ ఉపాత్తమ్ ఉపాత్తమ్ ఆత్మానం హన్తీతి ఆత్మహా సర్వః అజ్ఞః).*** ఇలా చూచినపుడు సమ్యగ్దర్శనం అలవడని అవిద్వాంసు లందరూ ఆత్మ ఘాతకులే. దేహమును ఆత్మగా భావించి, దేహ హింసకు పాల్పడుతున్న వారే. అటు పారమార్థికంగా చూచినా, సత్యాత్మ దర్శనం చేయలేక ఆత్మను కూడా హింసించిన వారే అవుతున్నారు.

ఆత్మదర్శనం

ఆత్మహింస చేసే వారికి భిన్నంగా, ఎవడైతే సర్వత్ర సమరూపుడైన పరమాత్మను దర్శిస్తున్నాడో, అతడు

అందుచేత అతడు ఉత్తమగతిని పొందుతున్నాడు. అంటే, మోక్షరూప మైన ఫలాన్ని అందుకుంటున్నాడు (**తతః యాతి పరాంగతిమ్, యథోక్తం ఫలం తస్య భవతి ఇత్యర్థః**). రెండు విధాల ఆత్మను హింసించని వాడు అవుతున్నాడు. ఇటు అనిత్యమైన దేహాత్మను హింసించడం లేదు. అటు నిత్యమైన సత్యాత్మనూ హింసించడము లేదు (**ఆత్మదర్శీ ఉభయ థాఽ పి ఆత్మనా ఆత్మానం న హినస్తి**).

సమ్యగ్దర్శన ఫలంగా తనను తాను హింసించుకోడు అని చెప్పిన వాదము సమంజస మేనా? విభిన్నమైన గుణ కర్మలతో, పుణ్య పాప కర్మల నాచరించి, విభిన్న ఫలాల ననుభవిస్తూ అనేక దేహాలలో అనేకాత్మలు గోచరించే టప్పుడు సమ్యగ్దర్శనము ఎలా సాధ్యం?

ప్రకృత్యైవ చ కర్మాణి క్రియమాణాని సర్వశః । 29
యః పశ్యతి తథాఽఽత్మాన మకర్తారం స పశ్యతి ॥

ప్రకృత్యా-ఏవ-చ-కర్మాణి-క్రియమాణాని-సర్వశః
యః-పశ్యతి-తథా-ఆత్మానం-అకర్తారం-సః-పశ్యతి

సర్వశః	= సర్వ విధముల	అకర్తారం	= కర్త గాని వానినిగా
ప్రకృత్యా ఏవ చ	= ప్రకృతి చేతనే	యః	= ఎవడు
కర్మాణి	= కర్మలు	పశ్యతి	= చూస్తున్నాడో
క్రియమాణాని	= చేయబడు చున్నవిగా	సః	= వాడు
తథా	= అటులనే	పశ్యతి	= చూస్తున్నాడు
ఆత్మానం	= తనను		

అర్జునా! సమస్త కర్మలను ప్రకృతే చేస్తూ ఉంది. ఆత్మ కర్త కాదు. ఇలా చూచే వాడే సత్యాన్ని చూచే వాడు.

వ్యాఖ్య

కర్మలన్నీ ప్రకృతి సంభవాలు. ప్రకృతి వశాలు. కర్త లేకుండా కర్మ జరగదు. ***అహం కర్తా అహంకారః*** - నేను చేస్తున్నాను అనే అహంకారమే, అహంబుద్ధియే కర్త. జడ రూపాలైన దేహేంద్రియ మనోబుద్ధులు కర్మలను ఆచరించ లేవు. బుద్ధి జడము. ఆత్మస్ఫూర్తి లేకుండా బుద్ధి కర్త కాలేదు. కనుక ఆత్మ లేనిదే కర్త లేదు. అలాగని ఆత్మ కర్త కాదు. ఆత్మలో కర్తృత్వము కనిపించడం లేదు.

ఆత్మ కర్తే అయితే, కర్తృత్వము లేకుండా ఉండ లేదు. సుషుప్తిలో ఏ విధమైన కార్యాలు సాగడం లేదు. అక్కడ కర్తృత్వము దర్శనీయం కావడం లేదు. కానీ, సుషుప్తిలో ఆత్మ ఉందా, లేదా? ఆత్మ సుషుప్తిని కూడా ప్రకాశింప చేస్తూ ఉంది. ఆత్మ గనుక కర్త అయ్యేట ట్లైతే, సుషుప్తిలో ఆత్మ ఉంది కనుక, ఆత్మలో కర్తృత్వము కనిపించాలి. సుషుప్తిలో కూడా కర్మలు సాగుతూ ఉండాలి. కానీ, అలా జరగడం లేదు. ఎందుకో తెలుసా! సుషుప్తిలో కర్త యైన బుద్ధి లేకపోవడం వల్ల. అంతేగాని, ఆత్మ లేక పోవడం వల్ల కాదు. సుషుప్తిలో ఆత్మ ఉంది. కానీ అకర్తగా ఉంది. అందుకే ఆత్మను ఉపద్రష్ట అని చెప్పుకున్నాం (*13 వ అ - 22 వ శ్లో*).

మాయా కార్యాలు

అర్జునా! అంతట (**సర్వశః**) కర్మలు (**కర్మాణి**) ప్రకృతి చేతనే (**ప్రకృత్యైవ**) చేయబడు తున్నాయి (**క్రియ మాణాని**) అంటున్నాడు భగవంతుడు.

ప్రకృతి అంటే త్రిగుణాత్మకమైన మాయ (**మాయాం తు ప్రకృతిం విద్యాత్** - శ్వేతాశ్వతరోపనిషత్తు).

కార్య కారణాలన్నీ మాయాధీనాలే. ప్రకృతియే కార్య కారణ రూపంలో వ్యాపించి ఉంది కనుక, ప్రకృతే కర్మలను చేస్తూ ఉంది. కార్యకారణాలకు ప్రకృతియే హేతువుగా ఉందని ఈ అధ్యాయం లోనే చెప్పుకున్నాం (*20 వ శ్లో*). కనుక కర్మలన్నీ ప్రకృతికి సంబంధించినవే. విజ్ఞానాత్మ యైన బుద్ధియే కర్త. బుద్ధి కూడా ప్రకృతి లోనిదే. బుద్ధి కూడా క్షేత్ర సంబంధ మైనదే. పరమాత్మ సన్నిధిలో, ఆయన అధ్యక్షతలో ప్రకృతి కర్మ ప్రవాహంలో నిమగ్నమై ఉంది (*9 వ అ - 10 వ శ్లో*). కానీ చైతన్యాత్మ అకర్త గానే, అభోక్త గానే శోభిస్తూ ఉంది. ఈ సత్యాన్ని దర్శించిన వాడే సమదర్శి.

సాక్షీ చైతన్యం

ఆత్మను అకర్తగా, కర్మసాక్షిగా తెలుసుకున్న వాడు కర్మల చేత బంధింప బడడు. క్షేత్ర ధర్మాలైన కర్మలను సాక్షిగా వీక్షించే చైతన్య స్వరూపుడే క్షేత్రజ్ఞుడు. అకర్తగా భాసించే వాడు. సర్వోపాధి రహితుడు. ఇలా ఎవడు తెలుసుకుంటాడో అతడే పరమార్థమును దర్శించిన వాడు (***ఆత్మానమ్ క్షేత్రజ్ఞమ్, అకర్తారం సర్వోపాధి వివర్జితం పశ్యతి సః పరమార్థ దర్శీ***). ఆకాశంలో భేద దర్శనం ఎలా సాధ్యం కాదో, ఆకాశాని కన్నా సూక్ష్మతర మైన సాక్షీ చైతన్యంలో భేదమును దర్శించడము సాధ్యము కాదని, అభేదమే దర్శనీయ మని ఎరిగిన వాడు.

అభేద మైన అఖండాత్మ దర్శనాన్ని వివరిస్తున్నాడు.

యదా భూత పృథగ్భావ మేకస్థ మనుపశ్యతి । 30
తత ఏవ చ విస్తారం బ్రహ్మ సమ్పద్యతే తదా ॥

యదా-భూతపృథగ్భావం-ఏకస్థం-అనుపశ్యతి
తతః-ఏవ-చ-విస్తారం-బ్రహ్మ-సంపద్యతే-తదా

యదా	= ఎప్పుడు	అనుపశ్యతి	= చూస్తున్నాడో
భూతపృథగ్భావం	= ప్రాణుల వేర్వేరు భావమును	తదా	= అప్పుడు
ఏకస్థం	= ఏకస్థము గాను	బ్రహ్మ	= బ్రహ్మము
తతః ఏవ చ	= దాని వలననే	సంపద్యతే	= అవుతున్నాడు
విస్తారం	= విస్తారము గాను		

అర్జునా! వేరు వేరుగా కనిపిస్తున్న సమస్త భూతములు ఒకే ఆత్మ యందు ఉన్నాయి. ఆత్మ వల్లనే విస్తరిస్తున్నాయి. ఇలా దర్శించే వాడు బ్రహ్మమే అవుతున్నాడు.

వ్యాఖ్య

భూత ప్రాణులు అనేకంగా కనిపిస్తూ ఉన్నా ఆత్మ ఏకంగా, అద్వయంగా శోభిస్తూ ఉంది. అంటే, భేద రహితంగా ఉంది. ఏక మంటే అదే. పారమార్థిక దృష్టిలో సజాతీయ, విజాతీయ, స్వగత భేదాలు లేని స్వరూపమే ఆత్మ. అందుచేత ఆత్మ ఏకము (***పరమార్థతః సజాతీయ విజాతీయ స్వగత భేద వినిర్ముక్తత్వాత్ ఏకః***). కనుక, ఏకాత్మ అనంతాత్మగా ఉంది. అనంతాత్మలో భేదము దర్శనీయం కాదు. పృథక్త్వము (వేరు వేరుగా ఉండటము) ఊహ కందదు. పృథక్త్వం ఏకత్వానికి భిన్నం కనుక, భిన్నత్వ మనేది కల్పితమే గాని సత్యం కాదు. భిన్నత్వ మంతా మిథ్యా రూపమే. ఏకత్వమే సత్యం. ఆత్మ ఒక్కటే సత్యము. దానికి అన్యంగా కనిపించే దంతా మిథ్యా రూపమే (***ఆత్మా సత్యం తదన్యత్ సర్వం మిథ్యేతి***).

అద్వయాత్మ

కల్పితము అనేది ఏదైనా ఆరోపించ బడిందే. భూతముల పృథక్త్వము ఆత్మ యందు అలాగే కల్పితము. సముద్రంలో అలలు ఉన్నాయి. అల లన్నీ కల్పితాలు. సముద్రమే సత్యము. అల లన్నీ సముద్రంలో అభిన్నంగా ఉన్నట్లు, భూత ప్రాణు లన్నీ ఒకే ఆత్మలో ఉన్నాయి.

ఒక పొలానికి నాలుగు వైపుల గట్లను నిర్మించి, ఆ గట్ల మధ్య ఉన్న భూమి 'నాది' అంటారు. బాగుంది. మరి, పొలం గట్లు ఏమిటి? భూమి కాదా! గట్ల బయట విస్తరించి ఉన్నది భూమి కాదా? భూమి ఏకమే కదా! మరి అనేక పొలా లేమిటి? అదే కల్పితము, లేదా మిథ్య.

అల లన్నీ ఒకే సముద్రంలో ఏకమై ఉన్నట్లు, భూతాలన్నీ ఒక్క ఆత్మలో ఏకమై ఉన్నాయి. సముద్రం వల్లనే అలలు విస్తరించినట్లు, ఆత్మ వల్లనే భూతాలు విస్తరిస్తున్నాయి. వాస్తవానికి అదంతా సముద్రమే. అలాగే ఇదంతా ఆత్మే (**ఆత్మ ఏవ ఇదం సర్వమ్** - బృహదారణ్యకం). ఇలా దర్శించే వాడు ఆత్మనే దర్శిస్తున్నాడు. ఆత్మను దర్శించే ఆత్మవిదుడు ఆత్మయే. ఆత్మయే బ్రహ్మము. ఇదే బ్రహ్మాత్మజ్ఞానము (***అయమాత్మా బ్రహ్మ***). ఈ విధంగా బ్రహ్మమును దర్శించే వాడు బ్రహ్మమే అవుతాడు (***యః అనుపశ్యతి సః బ్రహ్మ సంపద్యతే బ్రహ్మైవ భవతి***). ఎప్పుడు అవుతాడు? అప్పుడే అవుతాడు. ఏకమైన ఆత్మను ఎప్పుడు దర్శిస్తాడో, ఆ క్షణం లోనే బ్రహ్మ అవుతాడు. దానికి కాల వ్యవధి లేదు. ఏ విధంగా అయితే సూర్యోదయము - తమోపగమము (వెలుగు వచ్చుట - చీకటి పోవుట) ఒకే కాలంలో జరుగుతాయో, అలాగే జ్ఞానోదయానికి - అవిద్యా చీకటి అంతరించడానికి మధ్య అంతరాల కాలము ఉండదు.

ఏకమైన ఆత్మ సమస్త దేహాలలో ఉన్నా అసంగము గానే ఉంటుంది.

అనాదిత్వా న్నిర్గుణత్వా త్పరమాత్మాఽయ మవ్యయః ।
శరీరస్థోఽపి కౌన్తేయ న కరోతి న లిప్యతే ॥ 31

అనాదిత్వాత్-నిర్గుణత్వాత్-పరమాత్మా-అయం-అవ్యయః
శరీరస్థః-అపి-కౌంతేయ-న-కరోతి-న-లిప్యతే

కౌంతేయ	= అర్జునా!	పరమాత్మా	= పరమాత్మ
అనాదిత్వాత్	= అనాది యైనందున	శరీరస్థః అపి	= దేహము నందున్నను
నిర్గుణత్వాత్	= నిర్గుణ మైనందున	న కరోతి	= చేయదు
అవ్యయః	= అవ్యయ మైనందున	న లిప్యతే	= అంటదు
అయం	= ఈ		

అర్జునా! ఆత్మకు ఆది లేదు. గుణము లేదు. ఆత్మ నాశ మెరుగదు. దేహాలలో ఉన్నా ఆత్మ కర్మ చేయదు. కర్మకు అంటుకోదు.

వ్యాఖ్య

ఉన్నవే మనకు తెలుస్తాయి. ప్రపంచం ఉంది. ప్రపంచంలో ఎన్నో ఉన్నాయి. వాటిని మనం తెలుసు కుంటున్నాము. అలాగే పరమాత్మ ఉన్నాడు. పరమాత్మను కూడా తెలుసు కుంటున్నాము.

ప్రపంచము, పరమాత్మ ఇరువురూ ఉన్నట్లే తెలుస్తున్నా, వాటి మధ్య అంతరము ఎంతో ఉంది. ప్రపంచం ఉంది. ఉన్న ప్రపంచం నశిస్తూ ఉంది. ఇక్కడ అంతము గలవి తెలుస్తున్నాయి అంటే, అవి

ఆది కలవిగా ఉంటాయి. వాటి ఆది ఎప్పుడో, ఎక్కడో మనకు తెలియక పోయినా, అంతమును పొందు తున్నాయి కనుక, ఆది కలవి గానే ఉంటాయి. ప్రపంచంలో అన్నీ ఇలాగే తెలుస్తున్నాయి. పరమాత్మ ఒక్కడే వీటికి విలక్షణంగా ఆద్యంతాలు లేని వాడుగా తెలుస్తున్నాడు. అట్టి పరమాత్మను వర్ణిస్తూ, ***అయం*** అనే పదాన్ని ప్రయోగించాడు పరమేశ్వరుడు.

నిత్యాత్మ

అయం అంటే ఇది. ఇది అనేది సామీప్యాన్ని సూచిస్తుంది. ఆత్మ కన్నా సమీప మైనది లేనందున (***అయమాత్మా బ్రహ్మ***) *అయం* అనేది ఆత్మను తెలియ చేస్తుంది. శ్లోకంలో పరమాత్మ శబ్దం ప్రయోగింప బడటం చేత ఆత్మే పరమాత్మ అని ద్యోతక మవుతూ ఉంది.

ప్రపంచం, ప్రపంచంలో మనకు తెలిసే వస్తువుల లాగా ఆత్మ నశించదు. అందుచేత అది అవ్యయము. మార్పు లేనిది, నశించనిది కావడం చేత ఆత్మ అవ్యయము (***అయం అవ్యయః న అస్య వ్యయః విద్యతే ఇత్యవ్యయః***). ఆత్మ అవ్యయ మైనది కనుక ఆది లేనిదై ఉండాలి.

ఆత్మకు ఆది లేదు. ఆది అంటే కారణము. దేని కైతే ఆది ఉంటుందో, అది కారణాన్ని కలిగి ఉంటుంది. కార్యంగా నిలిచి ఉంటుంది. కార్యము తన ధర్మం చేత మార్పు చెందుతూ ఉంటుంది. మార్పు చెందేది నశిస్తుంది. దేని కైతే కారణం లేదో అది అనాది. అది ఆత్మ ఒక్కటే. కనుక అనాదిత్వం గల ఆత్మ నశించదు (***అనాదిత్వాత్ ఆదిః కారణం తత్ యస్య నాస్తి తత్ అనాది***).

ఆత్మ ఎలా అవ్యయము, అనాదియో అలాగే నిర్గుణము. అంటే గుణాలు లేనిది. దేని కైతే గుణాలు ఉంటాయో, ఆ గుణాలు తొలగిపోయి నపుడు అది మార్పు చెందుతూ ఉంటుంది. ఆత్మ గుణాలు లేనిది కనుక అవ్యయము. అనాది, నిర్గుణము, అవ్యయము కావడం చేత ఆత్మ నిత్యము.

లేకుండా వచ్చినవి లేకుండా పోతాయి. ఆత్మకు పుట్టుక లేదు. ఆత్మ లేకుండా వచ్చింది కాదు కనుక పోకుండా ఉంటుంది. అదే ఆత్మ యొక్క నిత్యత్వము (***ఆత్మా నిత్యః అజత్వాత్***). అందుచేత ఆత్మకు అయ్య లేడు, అధికుడూ లేడు అన్నది శ్రుతిమాత (***న తస్య కశ్చి జ్జనితా న చాధిపః***).

అసంగాత్మ

అవ్యయాత్మ అనంతము కనుక అది శరీరములో ఉన్నా సర్వగతమై ఉంటుంది. అందుచేత అది శరీరంలో ఉన్నా కర్మాచరణం లేకుండా ఉంటుంది. అకర్తగా ఉంటుంది. కర్మ చేసిన వాడిని ఫలం వరిస్తుంది. కర్మ చేయని వాడికి ఫలసంగం ఎలా ఉంటుంది? (***అయం తు అకర్తా అతః న ఫలేన లిప్యతే***). కనుక, దేహంలో ఉన్నా ఆత్మ కర్మ చేయదు (***న కరోతి***). కర్మ నంటదు (***న లిప్యతే***).

ఇంతకీ దేహంలో కర్మ చేసే దెవరు? కర్మ ఫలితంతో అంటుకొనే దెవరు? జీవుడు అంటారా? జీవుడు అంటే క్షేత్రజ్ఞుడే కదా! జీవుడు కర్మఫలాసక్తి కలవాడైతే, జీవేశ్వరైక్యం అసంభవం కదా! మరి ఈశ్వరుని కన్నా వేరుగా దేహి లేనపుడు, కర్మ చేసే దెవరో, కర్మ ఫలానుభోక్త ఎవరో చెప్పవలసి ఉంటుంది. భగవంతుడు బోధిస్తున్న ఈ ఉపనిషత్ సిద్ధాంతము దుర్విజ్ఞేయంగా ఉంది. అందుచేతనే వేదాంతము ప్రతిపాదించే ఈ ఆత్మతత్త్వాన్ని అర్థం చేసుకోలేక సాంఖ్యులు, వైశేషికులు, జైన బౌద్ధులు వేదాంత సిద్ధాంతాన్ని త్యజించారని శ్రీ శంకరులు అభిప్రాయ పడ్డారు (***సర్వథా దుర్విజ్ఞేయం చేతి భగవత్రోక్తమ్ ఔపనిషదం దర్శనం పరిత్యక్తం వైశేషికైః సాంఖ్యార్హత బౌద్ధైశ్చ***). కర్మలు, కర్తృత్వము, ఫలసంగము అనే విషయాలలో సృష్టిని కల్పిస్తూ, ***స్వభావస్తు ప్రవర్తతే*** అని ఐదవ అధ్యాయం - పద్నాల్గవ శ్లోకంలో భగవంతుడు ఈ సమస్యను పరిహరించే ఉన్నాడు.

కనుక, కర్తృత్వ భోక్తృత్వాలు అవిద్య చేత వ్యవహారంలో గోచరిస్తున్నాయే గాని, ఏకమైన అద్వయాత్మలో వాస్తవానికి అవి లేనే లేవు.

ఆత్మ ఆచరించదు, అంటుకోదు. ఈ విషయానికి దృష్టాంతాన్ని చూపుతున్నాడు.

యథా సర్వగతం సౌక్ష్మ్యా దాకాశం నోపలిప్యతే ।
సర్వ త్రావస్థితో దేహే తథాఽఽత్మా నోపలిప్యతే ॥ 32

యథా-సర్వగతం-సౌక్ష్మ్యాత్-ఆకాశం-న-ఉపలిప్యతే
సర్వత్ర-అవస్థితః-దేహే-తథా-ఆత్మా-న-ఉపలిప్యతే

సర్వగతం	=	సర్వగతమైన	దేహే	=	దేహము నందు
ఆకాశం	=	ఆకాశము	సర్వత్ర	=	అంతటను
సౌక్ష్మ్యాత్	=	సూక్ష్మ మైనందున	అవస్థితః	=	ఉన్నటువంటి దైన
యథా	=	ఎటుల	ఆత్మా	=	ఆత్మ
న ఉపలిప్యతే	=	అంటబడదో	న ఉపలిప్యతే	=	అంట బడదు
తథా	=	అటుల			

అర్జునా! అంతటా వ్యాపించి ఉన్నప్పటికీ, సూక్ష్మ మైనది కావడం చేత ఆకాశము దేనినీ అంటదు. అలాగే ఆత్మ అన్ని దేహాలలో వ్యాపించి ఉన్నా దేనినీ అంటదు.

వ్యాఖ్య

ఆత్మ ఏదీ చేయదు, దేని చేతనూ అంట బడదు. అది అసంగము అని పూర్వ శ్లోకంలో చెప్పిన విషయాన్ని ఆకాశ దృష్టాంతము ద్వారా విశదీకరిస్తూ, దార్ష్టాంతిక మందు సమన్వయిస్తున్నాడు.

ఆకాశము ఏకము. సూక్ష్మము. జగత్తంతా అది వ్యాపించి ఉన్నా, దేని చేతనూ అంట బడక నిర్మలంగా ఉంటుంది. పరిమిత మైన ఘటాదులలో ఉండి ఘటాకాశ మని పిలిపించుకున్నా, అది ఘటాదులకు పరిమితంగా లేదు.

కుండలో కల్లు నింపితే, కుండలో కల్లు వాసన వస్తుంది. అలాగని కుండ లోని ఆకాశానికి సురాగంధము అంటదు **(నభః ఘటయోగేన, తద్గత సురాగంధేన న లిప్యతే).**

వాస్తవానికి కుండలో ఆకాశం లేదు. ఆకాశం లోనే కుండ ఉంది. ఒక్క కుండే కాదు. అన్నీ ఆకాశం లోనే ఉన్నాయి. విశాలమైన ఆకాశము ఘటాదులకు పరిమితం కాదు. అన్నీ ఆకాశం లోనే ఊగుతున్నాయి. ఊరేగుతున్నాయి.

శీతాకాలము ఆకాశాన్నంతా పొగమంచు కప్పేస్తుంది. కానీ, ఆ పొగమంచు నిర్మలమైన ఆకాశాన్ని తడప లేదు. ఆకాశంలో భయంకరమైన ఉరుములు, మెరుపులు వినిపిస్తాయి, కనిపిస్తాయి. అంతమాత్రాన ఆకాశంలో ఎటువంటి మార్పు చోటు చేసుకోదు. ఆకాశం ముక్కలు కాదు. వానలు ఆకాశాన్ని తడప లేవు. ఎండలు ఆకాశాన్ని ఎండించ లేవు. అది సూక్ష్మ మైనది కావడమే ఆ విధమైన అసంగత్వానికి కారణము.

ఆత్మ ఆకాశం కన్నా సూక్ష్మము. అన్నీ ఆకాశంలో ఉన్నాయి. ఆకాశం ఆత్మలో ఉంది.

ఘట సంవృత మాకాశం నీయమానే ఘటే యథా ।
ఘటో నీ యేత నాకాశః తద్వజ్జీవో నభో పమః ॥

కుండను ఒక చోట నుండి మరొక చోటికి మనం తీసుకొని పోవచ్చు. అలా చెయడంలో కుండ పయనిస్తుందే గాని, కుండ లోని ఆకాశం పయనించదు. అలాగే కుండ పగిలిపోతే, కుండ లోని ఆకాశము నశించదు.

సర్వగతమై, సూక్ష్మమై, ఏకమైన ఆకాశము కుండలో ఉన్నంత మాత్రాన ఆ కుండ లోని కల్లు వాసన చేత ఎలా లిప్తము కాదో (అంటబడదో), అలాగే సర్వగతమై, సూక్ష్మాతి సూక్ష్మమైన అద్వయాత్మ దేహాదులలో ఉన్నంత మాత్రాన, ఉపాధి ధర్మాల చేత అంట బడదు ***(ఆత్మ ఉపాధి యోగేన తత్ ధర్మైః న లిప్యతే!).*** దేహం లోని క్షుత్పిపాసలకు, మనస్సు లోని రాగద్వేషాదులకు, శోకమోహాదులకు అంటకుండా ఆత్మ దేహంలో అసంగంగా భాసిస్తుంది.

ఆకాశం వలె సర్వగతుడై పరమాత్మ ఎలా అసంగుడై ఉన్నాడో, అలాగే ఆదిత్యుని వలె ప్రకాశ రూపుడై క్షేత్రాన్ని ప్రకాశింప చేస్తున్నాడు.

యథా ప్రకాశయ త్యేకః కృత్స్నం లోక మిమం రవిః ।
క్షేత్రం క్షేత్రీ తథా కృత్స్నం ప్రకాశయతి భారత ॥ 33

యథా-ప్రకాశయతి-ఏకః-కృత్స్నం-లోకం-ఇమం-రవిః
క్షేత్రం-క్షేత్రీ-తథా-కృత్స్నం-ప్రకాశయతి-భారత

భారత	=	అర్జునా!	ప్రకాశయతి	=	ప్రకాశింప చేస్తున్నాడో
ఏకః	=	ఒక్కడైన	తథా	=	అటుల
రవిః	=	సూర్యుడు	క్షేత్రీ	=	క్షేత్రజ్ఞుడు
ఇమం	=	ఈ	కృత్స్నం	=	సమస్తమైన
కృత్స్నం	=	సమస్తమైన	క్షేత్రం	=	క్షేత్రమును
లోకం	=	లోకమును	ప్రకాశయతి	=	ప్రకాశింప చేస్తున్నాడు
యథా	=	ఏ విధంగా			

అర్జునా! ఈ సమస్త ప్రపంచాన్ని ఒకే సూర్యుడు ప్రకాశింప చేస్తున్నాడు. అలాగే ఈ సమస్త క్షేత్రాన్ని క్షేత్రజ్ఞుడొక్కడే ప్రకాశింప చేస్తున్నాడు.

వ్యాఖ్య

ఈ అఖిల జగత్తును సూర్యు డొక్కడే ఎలా ప్రకాశింప చేస్తున్నాడో, ***మహాభూతాది ధృత్యంతం*** - సమస్తాన్ని ఒకే జ్ఞేయ రూపుడైన పరమాత్మ ప్రకాశింప చేస్తున్నాడు.

పూర్వ శ్లోకంలో పరమాత్మ అస్తిత్వాన్ని, అంటే సద్రూపాన్ని వర్ణించి, ప్రస్తుత శ్లోకంలో పరమాత్మ యొక్క ప్రకాశత్వాన్ని, అంటే చిద్రూపాన్ని వర్ణిస్తున్నాడు.

ఆకాశవత్ ఆత్మా అస్తి, ఆదిత్యవత్ ఆత్మా భాతి - ఆకాశం లాగా ఆత్మ అనంతంగా ఉంది. సూర్యుని లాగా ఆత్మ దివ్యంగా ప్రకాశిస్తూ ఉంది. సూర్యు డెలా స్వప్రకాశమో, ఆత్మ కూడా అలా స్వయం ప్రకాశమై విరాజిల్లుతోంది. ఆత్మ సత్తా స్ఫురణాత్మకము అని ఈ రెండు శ్లోకాలు చెబుతున్నాయి.

ప్రపంచంలో ఉన్న వన్నీ ఆకాశం లోనే ఉన్నాయి. కనుక ఆకాశము అస్తిత్వానికి ప్రతీకము. అలాగే ప్రకాశాలన్నీ సూర్యుని అనుసరించి ప్రకాశిస్తున్నాయి. కనుక భానుడు ప్రకాశత్వానికి ప్రతీకము.

ఆత్మ తాను స్వతస్సిద్ధంగా ఉంది. ఆకాశం కూడా ఆత్మను ఆశ్రయించుకొని ఉంది. ఆత్మ తాను స్వప్రకాశంగా ఉంది **(స్వయం భాతి)**. సూర్యుడు కూడా ఆత్మ ప్రకాశాన్ని ఆశ్రయించుకొని ప్రకాశిస్తున్నాడు.

అధ్యాయాన్ని సమాప్తం చేస్తున్నాడు.

క్షేత్ర క్షేత్రజ్ఞయో రేవ మన్తరం జ్ఞానచక్షుషా । 34
భూతప్రకృతి మోక్షం చ యే విదు ర్యాన్తి తే పరమ్ ॥

క్షేత్ర క్షేత్రజ్ఞయోః-ఏవం-అంతరం-జ్ఞానచక్షుషా
భూతప్రకృతి మోక్షం-చ-యే-విదుః-యాంతి-తే-పరం

జ్ఞానచక్షుషా = జ్ఞానదృష్టిచే		యే = ఎవరు	
ఏవం = ఈ రీతి		విదుః = తెలుసుకుంటున్నారో	
క్షేత్రక్షేత్రజ్ఞయోః = క్షేత్రక్షేత్రజ్ఞుల యొక్క		తే = వారు	
అంతరం = భేదమును		పరం = మోక్షమును	
భూతప్రకృతి = భూతప్రకృతిని		యాంతి = పొందుతున్నారు	
మోక్షం చ = మోక్షమును			

అర్జునా! ఈ విధంగా క్షేత్ర క్షేత్రజ్ఞుల భేదాన్ని భూతప్రకృతుల మోక్షాన్ని జ్ఞాననేత్రం చేత ఎవరైతే తెలుసుకుంటారో, వారు పరమాత్మను పొందుతారు.

వ్యాఖ్య

పరిణామశీలము, ప్రకాశ రహితము, వినాశ రూపము అయిన క్షేత్ర రూపాన్ని; పరిపూర్ణ యుతము, ప్రకాశైక స్వరూపము, అవ్యయ రూపము అయిన క్షేత్రజ్ఞ స్వరూపాన్ని జ్ఞాననేత్రం ద్వారా దర్శించే వారు పరమాత్మను పొంది తరిస్తారు.

శాస్త్ర ప్రమాణము, ఆచార్యోపదేశము వలన ప్రాప్తించి, స్వానుభవంలో నిలిచిన జ్ఞానమే ఇక్కడ జ్ఞాన నేత్రము **(జ్ఞాన చక్షుషా, శాస్త్రాచార్యోపదేశ జనితమ్ ఆత్మప్రాత్యయికం జ్ఞాన చక్షుః, తేన జ్ఞాన చక్షుషా)**. అట్టి జ్ఞాన చక్షువు చేత ముముక్షువు క్షేత్ర బంధం నుండి విడిపడి, క్షేత్రజ్ఞ జ్ఞానయుతుడై, పరమాత్మను పొందుతాడు. శాస్త్రము నందు, గురువు నందు అకుంఠిత విశ్వాసము (*శ్రద్ధ*) గల వారే అట్టి జ్ఞాన నేత్రాన్ని పొందుతారు. శ్రద్ధ గల వారే ఆత్మజ్ఞానాన్ని పొందుతారు (*శ్రద్ధావాన్ లభతే జ్ఞానం*). ఈ విధంగా, మాయ నుండి విముక్తులై, మహిమలో తేజరిల్లే దివ్య స్థితిని ఈ క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగము ప్రసాదిస్తుంది.

ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం
యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగో నామ త్రయోదశోఽధ్యాయః

ఈ విధంగా ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రము, శ్రీకృష్ణార్జున సంవాదము అయిన భగవద్గీత యందు క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగ మనే పదమూడవ అధ్యాయము.



అకారాది శ్లోకానుక్రమణిక

అష్టమాధ్యాయము







అకారాది శ్లోకానుక్రమణిక

నవమాధ్యాయము





అకారాది శ్లోకానుక్రమణిక

దశమాధ్యాయము



అకారాది శ్లోకానుక్రమణిక

ఏకాదశాధ్యాయము



అకారాది శ్లోకానుక్రమణిక

ద్వాదశాధ్యాయము



అకారాది శ్లోకానుక్రమణిక

త్రయోదశాధ్యాయము